వాల్మీకి రామాయణము

బాల, అయోధ్య కాండలు

999 10

సహజ కవి మల్లెమాల
మనసుపడి మక్కువతో సేకరించిన
ఈ పుస్తకాన్ని సాహిత్యాభిమానుల కోసం
సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి
ఆనందంతో బహూకరిస్తున్నాం.

మల్లెమాల కుటుంబం



వచనానువాదం
శ్రీనివాస శిరోమణి

94435

వాల్మీకి రామాయణము

(బాల, అయోధ్యకాండలు)

ప్రథమ సంప్పుటము

అనువాదకుడు :

శ్రీ శ్రీనివాస శిరోమణి

ఎడిషన్ రైట్ :

M/s నవరత్న బుక్ హౌస్, విజయవాడ

త్రివేణి పబ్లిషింగ్ హౌస్

మచిలీపట్టణము

ప్రథమ ముద్రణము : 1956
పండ్రెండవ ముద్రణము : 2002

294.5922
శివ - పాల్కి

ప్రతులు : 2000

© Triveni Publishing House
Machilipatnam

ఎడిషన్ రైట్ : M/s నవరత్న బుక్ హౌస్, విజయవాడ
కాలపరిమితి : 3 సం॥లు (అక్టోబరు 2002 నుండి సెప్టెంబరు 2005 వరకు)

మూల్యము : రు. 200-00



C. 14979

ప్రతులకు :
M/s నవరత్న బుక్ హౌస్
28/22/20, రహమాన్ స్ట్రీట్
అరండల్ పేట
విజయవాడ - 2
Phone : 0866–432813

ముద్రణ :
త్రివేణి పబ్లిషింగ్ హౌస్
మచిలీపట్నం - 521 001

పరిచయము

శ్రీమద్రామాయణమును సంస్కృత భాషలో వాల్మీకి రచించాడు. భారతీయ సంస్కృతికి రామాయణము, భారతము ప్రధానమైన కావ్యములు, పురాణాలు, ఇతిహాసాలు. తపస్వియైన వాల్మీకి తన గురువైన నారద మహర్షి సన్నిధిలో ఒకమారు ఇలా ప్రశ్నించాడు: "ఈ లోకమున ఒక మహానుభావుడైన పురాణ పురుషుడు నాయకుడుగా ఒక కావ్యము వ్రాయదలచుకున్నాను. ఆ నాయకుడు ప్రస్తుతము జీవించియున్నవాడు కావాలి. గుణవంతుడు, వీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్కు నందు దృఢమైన వ్రతము కలవాడై ఉండాలి" అని మొదలుపెట్టి ఎన్నో సద్గుణాలను ప్రశ్నించాడు. ఈ సద్గుణాలన్నీ శాశ్వత కాలానికి సంబంధించినవి. అంటే మానవుడు ఎప్పటి కాలపువాడైనా సరే అభ్యసించడానికి ప్రయత్నం చేయవలసినవి. అంతావిన్న నారద మహర్షి ఇలా అన్నాడు. "చాలా దుర్లభములైన గుణాలను కీర్తించావు. అయినా అలాంటివాడు ఈ లోకములో, ప్రస్తుత కాలమున ఉన్నాడు. అతడు నీ పరిప్రశ్నం ద్వారా నీ వాక్కుల నుండి ఇప్పటికే రూపాన్ని పొందాడు. అంటే నీకు కావలసిన నాయకుణ్ణి నీలోని వేద ధర్మ సంస్కారాన్ని అనుసరించి నీవే అవతరింప చేసుకున్నావు. ఇక వానిని గూర్చే నీవు కావ్యము వ్రాయవచ్చు. అయినా అలాంటివాణ్ణి గురించి నన్ను కూడా అడిగినావు గనుక వినుము. ఇక్ష్వాకు వంశంలో పుట్టి 'రాముడు' అనే పేరుతో జనులచేత కీర్తింపబడుతూ ఒకడున్నాడు. అతడు నీ కావ్యసృష్టికి నాయకుడు." ఈ విధంగా రాముని గూర్చి నారదుడు వాల్మీకికి ఉపదేశం చేసి సంగ్రహంగా రాముని కథ చెప్పాడు. ఈ భాగాన్నే 'బాల రామాయణం' అంటారు. ఇది పెద్దలందరికీ కూడ ధ్యానం చేయదగిన రామాయణం. దీనిని వాల్మీకి తన రామాయణంలో మొదటి సర్గగా వ్రాశాడు.

రామాయణంలో ప్రతి వ్యక్తి ఏ పలుకులు ఎంతగా సంభాషించెనో, ఎంతగా నవ్వెనో, అది మొత్తము వాల్మీకికి దర్శనమిచ్చి కావ్యములో రూపం ధరించింది. వేదమునందు తెలుసుకొనదగిన వాడైన పురుషుడు సర్వజీవులలో అంతర్యామి. అతడే పరమ పురుషుడు. అతనినే పురుషసూక్తం మొదలగు మహా మంత్రాలు స్తోత్రం చేస్తున్నాయి. అతని తత్త్వము సవిస్తరంగా రామచరితంలో ప్రతిబింబించింది. అనగా అతని తత్త్వము సకల ధర్మస్వరూపము. అభివృద్ధి, శ్రేయస్సు కోరిన ఒక్కొక్క వ్యక్తికి, వ్యక్తుల సమూహానికి, సంఘానికి, సమాజానికి, జాతులకు, మానవ జాతికి అవశ్యము. ఆచరణీయమైన ధర్మము. అది తారుమారైనపుడల్లా మరల స్థాపించడానికే ఆ పరమపురుషుడు అనేక అవతారమూర్తుల రూపంలో దిగి వస్తుంటాడు. అలాంటి అవతారమే శ్రీ రామచంద్రమూర్తి. అతడు ధర్మము విగ్రహ స్వరూపముగా అయినవాడు. అతనిని గూర్చి రచింపబడిన రామాయణ కావ్యం కాంతా సమ్మితమైన వేద గ్రంథమై ధర్మ సంస్థాపకంగా వాల్మీకి వాక్కుల ద్వారమున వెలువడింది. నాటికి నేటికి ధర్మస్వరూప నిరూపణకు శ్రీమద్రామాయణము కరగత ముకురము.

అయోధ్య

భూమి సూర్యునిచుట్టూ పండ్రెండు మాసాలలో సంవత్సర రూపంగా సకల ఋతుధర్మాలలో తిరిగివస్తుంది. ప్రతి మాసం చంద్రుడు భూమిచుట్టూ పూర్ణిమ, అమావాస్యలతో కూడిన పదహారు కళల వైభవముతో తిరిగివస్తూ ఉంటాడు. ఈ మొత్తం నిర్మాణాన్ని హృదయములో ఉంచుకొని వేద ఋషులు పరమ పరుషుని శరీరమనే పురాన్ని నిర్మాణము చేసుకొనే వైఖరిగా వర్ణించడము జరిగింది. దాని ననుసరించి రామాయణములో అయోధ్యానగరము వర్ణనము చేయబడింది. దశరథుడు అనే సూర్యవంశపు రాజు అయోధ్యను రాజధానిగా చేసుకొని పరిపాలిస్తూ ఉన్నాడు. అతని రాజ్యం పేరు కోసల.

అయోధ్యానగరం చుట్టూ పన్నెండు విభాగాలుగా నిర్మాణము చేయబడింది. సంవత్సరానికి 12 మాసాలున్నట్లు ఈ పుర నిర్మాణం ఉన్నది. ఒక మాసానికి రెండు పర్వాలు. ఒక పౌర్ణమి, ఒక అమావాస్య. సంవత్సరం మొత్తానికి 24 పర్వాలు. దాని ననుసరించి వాల్మీకి రామాయణంలో 24 వేల శ్లోక విభాగం ఉన్నది. ప్రతి విభాగానికీ మొదటి శ్లోకం మొదటి అక్షరంతీసి వ్రాసుకుంటే 'గాయత్రీ మంత్రం' అవుతుంది.

జీవులకు శరీరం ఒక్కొక్క రాజ్యం వంటిది. హృదయం ముఖ్యపట్టణం వంటిది. అది ప్రాణహానిని కలిగించే రాక్షస శక్తులకు అధీనం కాకుండా అస్థిపంజరం మధ్య గుండెకాయలో ఉంచి రక్షింపబడుతూ ఉంది. కనుక దానికి 'అయోధ్య' అని పేరు. యోధులకు జయింప శక్యం కానిది అని ఈ పదానికి అర్థం. ఈ కేంద్రంలో ఉన్న జీవుడే రాజు. అతడు సూర్యవంశం వాడు. అనగా సూర్యకిరణంలోని అంశయే జీవుడుగా దిగివస్తుంది అని అర్థం. దాని ననుసరించే దశరథుని అయోధ్యా పట్టణ నిర్మాణం జరిగింది. దశరథుని కుమారుడు శ్రీరామచంద్రుడుగా పురాణపురుషుడు అవతరిస్తాడు. అనగా ప్రతి జీవుని ప్రజ్ఞలోనూ దేవుడు అవతరించి ఉంటాడని, కావలసిన సమయానికి ధర్మ సంస్థాపనం వ్యక్తిగతంగా చేస్తాడని ఒక సమన్వయం. ఆ యా యుగాలలో సామూహికంగా చేయడానికి అవతారమూర్తియై దిగివస్తాడని మరియొక సమన్వయం. ఈ రెండు సమన్వయాల వర్ణనమే పురాణ ఇతిహాస ఋషిప్రోక్త కావ్యాలు.

ఎక్కిరాల కృష్ణమాచార్య
విశాఖపట్నం

(శ్రీమాన్ కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యగారి
"రామాయణ ప్రసంగములు" అను గ్రంథము నుండి)

సాహిత్య యజ్ఞం

ఇప్పటికి 11 సార్లు ప్రచురించబడి, అశేష ఆంధ్ర ప్రజానీకం మన్ననలు పొందిన శ్రీ శ్రీనివాస శిరోమణిగారి రామాయణం ఇప్పుడు సర్వాంగసుందరంగా, ఆఫ్‌సెట్ ముద్రణలో 12వ ప్రచురణగా మీ ముందుకు వచ్చినది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ రామాయణం ప్రచురణలో లేకపోవడం వలన అనేకమంది మాకు ఉత్తరాలు వ్రాస్తూ, ఫోన్లు చేస్తూ వెంటనే ప్రచురణ పూర్తిచేయమని, నేటి పరిస్థితుల్లో రామాయణం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉందని పదే పదే చెప్తూ రావటంవల్ల, కొన్ని ఇబ్బందులున్నా శ్రీరామునిపై భారముంచి పూర్వము 9 సంపుటాలుగా వున్న రామాయణాన్ని 3 సంపుటాలుగా మీ ముందుకు తీసుకురావటం జరిగింది. అంటే ప్రతి కాండ ఒక సంపుటంగా కాకుండా, రెండు మూడు కాండలు కలిపి ఒక సంపుటంగా ప్రచురించటం జరిగింది.

మానవజన్మకు సార్థకతను చేకూర్చుకోవటానికి పెద్దలు అనేక మార్గాలు సూచించారు. భారతీయ ప్రాచీన శాస్త్రాలు ఈ విషయంలో మూడు ఋణాలు తీర్చుకొనవలసినవిగా పేర్కొన్నవి. అవి 1. దేవ ఋణం, 2. ఋషి ఋణం, 3. పితృ ఋణం. దేవతలనగానే సాధారణంగా మన మొక్కు లందుకొని, మన అభీష్టాలు తీర్చే మూర్తులుగా మనం భావిస్తూ ఉంటాము. కానీ నిజానికి దేవతలంటే, శరీరం లోపల, వెలుపల, సృష్టి సమస్తము వ్యాపించి ఉండి, నడిపించే ప్రజ్ఞలు (Intelligences). ఈ దేహము, ఈ సృష్టి సమస్తము కోట్లాది దేవ బృందములతో నిండి ఉంటుంది. ఈ దేవతలు పరోక్ష ప్రియులు. అంటే కంటికి కనిపించకుండా, అదృశ్యంగా, యజ్ఞార్థంగా పనిచేయటం వీరి ధర్మం. నిస్వార్థత, పరోపకారము, ధర్మపరిపాలన, లోక కళ్యాణం వీరి నిరంతర కార్యక్రమం. మానవజన్మ ఎత్తినందుకు మనము కూడా చేతనైనంత పరోపకారం చేసినప్పుడు మాత్రమే దేవఋణం తీరుతుంది.

ఇక ఋషులు అంటే కేవలం ముక్కు మూసుకుని ఎక్కడో మారుమూల పర్వతారణ్యాలలో తపస్సు చేసుకునే వారనుకునే భావన సరికాదు. మన ఋషులందరూ ద్రష్టలు, శాస్త్రజ్ఞులు. మానవ జీవితంలో ఇహ పరాలకు కావలసిన సమస్త పదార్థాలను, విజ్ఞానాన్ని కనిపెట్టి, భావితరాలకు ఆ విజ్ఞానాన్ని అందించినవారు మన ఋషులు. ఆ విజ్ఞానాన్ని సరియైన విధానంగా అవగాహన చేసుకుని, దాన్ని మన తరువాతి తరం వారికి అందించటం వల్లనే ఈ ఋషి ఋణం తీరుతుంది. అలాగే మనకు జన్మ నిచ్చిన తల్లిదండ్రులను గౌరవించి, మరల ప్రజలకు ఉపకరించే సంతానాన్ని కని దేశానికి అప్పచెప్పటం వల్ల పితృఋణం తీరుతుంది.

ఋషి ఋణం తీర్చుకొనే కార్యక్రమంలో త్రివేణి పబిషర్స్ సంస్థ ద్వారా- వాల్మీకి రామాయణం, మహాభారతం, భాగవతం, జ్ఞానేశ్వరీ భగవద్గీత వంటి గ్రంథాలను చక్కని

తెలుగు వచనంలో అందరికీ సులభంగా అర్థమయ్యే విధంగా ప్రచురించటం జరిగింది. అలాగే త్యాగరాజ కీర్తనలు, శ్యామశాస్త్రి కీర్తనలు, ముత్తుస్వామి కీర్తనలు మొదలైన సంగీత గ్రంథాలు కూడా ప్రచురించటం జరిగినది. ఇప్పుడు ఈ గ్రంథాలు త్రివేణి పబ్లిషింగ్ హౌస్ సంస్థ ద్వారా ప్రచురించటం జరుగుతున్నది.

ఈ సాహితీ సేవా కార్యక్రమం లాభాపేక్షతోనో, వ్యాపార దృష్టితోనో చేస్తున్నది కాదు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి అర్ధ శతాబ్దం గడిచినా, ఇప్పటికి కూడా మన పురాణ ఇతిహాసాలు, ప్రాచీన శాస్త్రాల పట్ల సరియైన అవగాహన కలిగించే ఏ విధమైన ప్రయత్నము, ప్రక్రియా జరగవలసినంతగా జరగడంలేదు. ఇంతేకాక ఉద్దేశపూర్వకంగా కొంతమంది, భారతీయ ఇతిహాస వాఙ్మయాన్ని, చరిత్రను, సనాతన ధర్మాన్ని, వైదిక సంస్కృతిని వక్రీకరించి వ్రాయటం, అపార్థాలకు దారి తీసే పెడర్థాలు తీయటం ఇన్ని సంవత్సరాలుగా జరుగుతూనే ఉన్నది. ఈ ప్రయత్నాలను అడ్డుకొని మన సంస్కృతిని కాపాడుకోవాలంటే, మన పవిత్ర ఇతిహాస, పురాణ, వేద వాఙ్మయాన్ని మనలో ప్రతి ఒక్కరూ చదువుకొని, అర్థం చేసికొని, తరువాతి తరాలకు అర్థమయ్యేలా చెప్పటం భారతీయులుగా మన కర్తవ్యం.

సంస్కృత భాషలో అర్థం చేసుకుని చదవటం కష్టము; కాబట్టి, చక్కని తెనుగు అనువాదాలు అవసరం. ఆ అవసరాన్ని గుర్తించి మన ప్రాచీన ఇతిహాస వాఙ్మయానికి యజ్ఞార్థమైన సేవగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. మీ సహాయం, మీ ఆదరణ, అండదండలు ఉంటే ఈ ప్రయత్నాన్ని మరికొంత ముందుకు తీసికొనివెళ్ళి, యువతరానికి ఉపయోగపడే విధంగా ఈ గ్రంథాల్ని ఆంగ్లంలో చిన్న చిన్న గ్రంథాలుగా తీసికొని రావటం, ఇంతేకాకుండా జనసామాన్యానికి అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరకు యీ ఇతిహాసాలను ప్రచురించటం అనే కార్యక్రమాలను చేపట్టగలము. ఈ విధంగా ప్రాచీనులైన మన పెద్దల, ఋషుల ఋణమును తీర్చుకున్న వారమవుతామని, ఈ సత్కార్యంతో జన్మకు సార్థకతా, సాఫల్యతా చేకూరుతాయని, ఈ మహా యజ్ఞంలో ఏ విధంగా నైనా సహాయపడిన వారికి శ్రీ సీతారాముల అనుగ్రహము లభించగలదని ఆకాంక్షిస్తున్నాము.

ప్రూఫ్ రీడింగ్ విషయంలో నాకు సహకరించిన శ్రీ కె. రామప్రసాద్, శ్రీమతి సరస్వతీదేవి, శ్రీమతి అర్చనలకు, ముద్రణ విషయంలో నాకు సహాయపడిన చిరంజీవులు టి.కె.జె. ఆచార్య, చి॥ మురళీలకు మాస్టర్ ఇ.కె. గారి ఆశీస్సులు లభించుగాక!

మచిలీపట్నం
27-8-2002

సిహెచ్.ఎస్.ఎన్. రాజు

విషయసూచిక

బాలకాండ 1

బ్రహ్మ సాక్షాత్కారము 3
రామాయణ మహాకావ్యం ప్రారంభము 4
కుశలవులు - రామకథాగానము 5
అయోధ్య 7
దశరథమహారాజు 11
అశ్వమేధయాగ సంకల్పము 12
ఋశ్యశృంగుడు 13
అశ్వమేధయాగ ప్రారంభము 20
పుత్రకామేష్టి యాగము 27
రావణ ప్రస్తావన 28
వానరవీరుల ఆవిర్భావము 31
శ్రీరామ జననం 33
విశ్వామిత్రుని ఆగమనము 36
విశ్వామిత్రుని విన్నపము 37
దశరథుని వేడికోలు 39
వశిష్ఠుని హితబోధ 40
విశ్వామిత్రునితో రామలక్ష్మణుల పయనము 42
అంగదేశము 44
సరయూ నది 46
తాటక వృత్తాంతము 48
తాటక వధ 49
అస్త్రోపదేశము 52
సిద్ధాశ్రమము 54
మారీచ సుబాహువుల వధ 57
విశ్వామిత్రుని జన్మకథ 60
గంగాదేవి వృత్తాంతము 65
కుమార సంభవం 68
సగర చక్రవర్తి 69

అశ్వమేధ యాగము	71
భగీరథుడు	76
గంగావతరణము	78
విశాలపట్టణ వృత్తాంతము	81
అహల్యా శాపవిమోచనము	88
మిథిలానగర ప్రవేశము	91
విశ్వామిత్ర చరిత్ర	93
వశిష్ఠాశ్రమము	94
శబల	95
విశ్వామిత్ర గర్వభంగము	97
విశ్వామిత్రుని తపోదీక్ష	102
త్రిశంకువు	102
త్రిశంకు స్వర్గము	104
అంబరీష చరిత్ర	108
శునశ్శేపుని విశ్వామిత్రుడు రక్షించుట	109
విశ్వామిత్రుని తపోభంగము	111
విశ్వామిత్రుని బ్రహ్మర్షి పదము	114
శివధనుస్సు వృత్తాంతము	116
శివధనుర్భంగము	118
సీతారామ కళ్యాణ నిర్ణయము	119
ఇక్ష్వాకు వంశక్రమము	122
జనకరాజ వంశక్రమము	124
శ్రీ సీతారామ కళ్యాణం	128
పరశురామ గర్వభంగము	130
అయోధ్యకాండ	**139**
శ్రీరాముని మూర్తిత్వము	139
పట్టాభిషేక నిర్ణయము	142
మంథర కపటోపాయము	155
కైకేయికి దశరథుని వరాలు	161

కైకేయీ మందిరం	166
కైకేయి కోరిక	168
దశరథుని దురవస్థ	170
కైకేయీ మందిరానికి సుమంత్రుని రాక	182
రాముడు దశరథ కైకేయీలను దర్శించబోవుట	188
కైకేయి రామునితో తన వరములను గూర్చి చెప్పుట	192
కైకేయి కోరికను రాముడు శిరసావహించుట	194
రాముడు కౌసల్య అంతఃపురమునకు పోవుట	197
సీత అరణ్యవాస నిర్ణయము	218
రాముడు సీతను వారించుట	222
సీత రాముని ఒప్పించుట	224
లక్ష్మణుని వనవాస నిశ్చయము	229
రాముడు బ్రాహ్మణోత్తములకు దానములిచ్చుట	231
సీతారామలక్ష్మణులు దశరథుని చూడబోవుట	235
కైకేయికి సుమంత్రుని హితోపదేశము	242
కైకేయి	245
రాముని నిస్సంగత్వము	247
వనవాస ప్రయాణము	254
దశరథుడు కౌసల్య మందిరమునకు పోవుట	259
కౌసల్య పుత్రవియోగముతో దుఃఖించుట	261
సుమిత్ర కౌసల్యను ఓదార్చుట	263
అయోధ్యా పౌరులు రాముని వెంబడించుట	265
తమసా నది	268
అయోధ్యావాసుల మనోభావాలు	272
కోసలదేశము	275
గుహుడు	279
రామునిపై సుమంత్రుని ప్రేమ	283
భరద్వాజుని ఆశ్రమ సందర్శనము	291
చిత్రకూట ప్రవేశము	295
సుమంత్రుడు అయోధ్యకు తిరిగివచ్చుట	299
రాముని విశేషములు తెలుపుట	301

సుమంత్రుడు కౌసల్యను ఓదార్చుట 305
దశరథుని శాప వృత్తాంతము 310
దశరథుని మరణము 318
భరతుని స్వప్నము 326
అయోధ్యకు భరతుని ప్రయాణము 328
భరతుని అయోధ్యానగర ప్రవేశము 332
కైకేయిని భరతుడు దూషించుట 337
భరతుడు కౌసల్య మందిరమున కేగుట 342
దశరథుని ఉత్తరక్రియలు 345
భరతుడు రాముని దర్శింప నిర్ణయించుకొనుట 350
భరతుడు అరణ్యమున కేగుట 357
గుహుడు భరతునితో సంభాషించుట 358
భరతాదులు గంగానదిని దాటుట 367
భరతుడు భరద్వాజుని దర్శించుట 369
భరద్వాజుని సృష్టి 372
భరద్వాజుని ఆశీస్సులు 378
భరతుడి చిత్రకూట ప్రయాణము 381
చిత్రకూట పర్వత విశేషాలు 383
భరతునిపై లక్ష్మణుని కోపము 388
రాముడు భరతుని ప్రశంసించుట 390
భరతుడు వశిష్ఠాదులతో రాముని చూడబోవుట 392
భరతాదులు రాముని దర్శించుట 395
రామలక్ష్మణులు దశరథునికి పిండప్రదానము చేయుట 398
కౌసల్యాదులు రాముని చూచుట 401
రామభరతుల సంభాషణ 403
జాబాలి నాస్తికవాదము 413
వశిష్ఠుడు రఘువంశక్రమమును చెప్పుట 417
భరతుడు రాముని పాదుకలు స్వీకరించుట 422
భరతుడు అయోధ్యకు బయలుదేరుట 424
సీతారామలక్ష్మణులు అత్రి అనసూయలను దర్శించుట 431

బాలకాండ

1

తపోధనుడు అయిన నారదుడు వాఙ్మయవేత్తలలో ముఖ్యుడు, మహర్షులలో శ్రేష్ఠుడు. ఎప్పుడూ వేదాధ్యయనము చేసుకొంటూనూ, తపస్సు చేసుకొంటూనూ ఉండేవాడు. ఆయన్ను వాల్మీకి మహర్షి చూచి ఈవిధముగా ప్రశ్న చేసినాడు :

"ఓ మహర్షీ! సకలసద్గుణసంపన్నుడూ, పరమపరాక్రమవంతుడూ, ధర్మజ్ఞుడూ, సత్యవ్రతుడూ, అచల సంకల్పుడూ, పరంపరాగత సదాచార సంపన్నుడూ; సర్వభూతహితుడూ, సర్వశాస్త్రజ్ఞుడూ, సర్వకార్యదురంధరుడూ, ఏకరూపప్రియ దర్శనుడూ, ధైర్యవంతుడూ, కాంతిమంతుడూ, కోపమురానివాడూ, అసూయలేనివాడూ, యుద్ధములో దేవతలను అయినా జయించగలవాడూ ఎవడయినా ఒక్కడు ఇప్పుడు ఈ లోకములో ఉన్నాడా? అటువంటివాడు ఎవడయినా ఉన్నట్లయితే, తాము తప్పకుండా వాణ్ణి ఎరిగి ఉంటారు, చెప్పవలెను. తెలుసుకోవలెను అని నాకు చాలా కుతూహలముగా ఉంది."

ముల్లోకాలూ సంచారముచేసే నారదుడు ఈ ప్రశ్నకు నవ్వి, "నాయనా! చెప్పుతాను విను. నీవు వివరించిన అన్నిగుణాలూ కలవాడు ఈ భూలోకములో ఉండడము దుర్లభము. అయినప్పటికిన్నీ, ఇప్పుడు ఒకడు ఉన్నాడు. అతడు ఇక్ష్వాకువంశములో పుట్టినవాడు. రాముడు అని ప్రసిద్ధికెక్కినాడు" అంటూ రామకథను అంతా సంగ్రహముగా చెప్పివేసినాడు.

2

నారదమహర్షి చెప్పిన రామకథను అంతా వాల్మీకిమహర్షి విన్నాడు. విస్మితుడు అయిపోయినాడు. అంతట ఆ ధర్మాత్ముడూ, ఆయన శిష్యులూ నారదమహర్షిని స్తోత్రము చేసినారు. యథావిధిగా పూజలు చేసినారు. అంతట నారదమహర్షి వాల్మీకి మహర్షిని కౌగలించుకొని, "పోయి వస్తాను" అని వీడ్కోలు చెప్పి ఆకాశమార్గాన దేవలోకము వెళ్ళిపోయినాడు.

అప్పుడు వాల్మీకిమహర్షి మధ్యాహ్న స్నానానికి బయలుదేరినాడు. జాహ్నవీ నదికి సమీపములో ఉన్న తమసానదీ తీరము దగ్గరకు పోయినాడు. బురద లేకుండా ఉన్న రేవును అక్కడ చూచినాడు. వెంటవున్న శిష్యుడితో, "భరద్వాజా! చూడు, సత్పురుషుడి మనస్సుకు మల్లే ఈ నదీ జలాలు నిర్మలముగా ఉన్నవి. ఈ రేవున్నూ చక్కగా ఉంది. నాయనా! కలశము కింద పెట్టు. నాకు వల్కలము ఇవ్వు. మనోహరము అయిన ఈ తమసానదిలోనే నేను స్నానము చేస్తాను" అన్నాడు.

భరద్వాజుడు అందించిన వల్కలాన్ని తీసుకొని వాల్మీకిమహర్షి ఆ వనరామణీయకాన్ని చూస్తూ అడుగులు వేయసాగినాడు. ఎప్పుడూ ఎడబాయకుండా తిరిగే క్రౌంచపక్షుల జంట ఒకటి కనిపించింది. ఆ రెండు పిట్టలూ మహామధురముగా పాడుతూ ఉన్నవి. ఎర్రటి గొద్దిజుట్టుతో ఉన్న పోతుపిట్ట పాడుతూ పాడుతూ రతి పారవశ్యముతో పెంటిపిట్టను తన సొగసు అయిన రెక్కలతో కప్పివేసింది.

నిష్కారణముగా పిట్టలను కొట్టే పాపాత్ముడు ఒక బోయవాడు అక్కడ వాల్మీకిమహర్షి ఉన్నాడు అని అయినా లెక్కచేయకుండా ఆ జంటలో పోతుపిట్టను కొట్టినాడు. అది నేల కూలింది. దాని ఒండ్లు అంతా నెత్తురుమయము అయింది. నేలమీద నెత్తురులో పొరలాడ సాగింది. ఆ పోతు పిట్టను చూస్తూ పెంటి పిట్ట జాలి పుట్టేట్టు ఏడువ సాగింది.

నేలకూలిన క్రౌంచపక్షిని వాల్మీకిమహర్షి చూచినాడు. ఆ ధర్మాత్ముడికి జాలివేసింది. ఏడుస్తూ ఉన్న పెంటి క్రౌంచము వంక చూచినాడు. ఆ మహాత్ముడి హృదయము ద్రవించింది. ఆ సమయములో రతిపారవశ్యముతో మైమరచిపోయిఉన్న ఆ సమయములో ఆ పోతుపిట్టను బోయవాడు కొట్టి చంపివేయడము అధర్మము అని వాల్మీకిమహర్షికి తోచింది. బోయవాణ్ణి చూస్తూ, *("మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః యత్క్రౌంచమిథునా దేక మవధీ: కామమోహితమ్")* "ఓ కిరాతుడా! మన్మధ పరవశలు అయి ఉన్న క్రౌంచపిట్టల జంటలో ఒకదాన్ని నీవు చంపివేసినావు. ఇక నీవు అట్టేకాలము బ్రతకకూడదు" అన్నాడు.

ఈ వాక్యము అప్రయత్నముగా ఛందోబద్ధముగా వాల్మీకిమహర్షి నోటివెంట వెలువడింది. అందుకు ఆయన ఆశ్చర్యపడి పోయినాడు. "క్రౌంచపిట్టను చూచి శోకార్తుణ్ణి అయి నేను ఏ విధముగా మాటలు అన్నాను?" అని ఆలోచించడము మొదలు పెట్టినాడు.

వాల్మీకిమహర్షి మతిమంతుడు. మహాప్రాజ్ఞుడు. వాక్యవిశారదుడు. మనసా నిశ్చయించుకొన్నాడు. శిష్యుణ్ణి చూచి, "నేను శోకార్తుణ్ణి అయి అన్న వాక్యము

సమాక్షరపాదబద్ధము అయిన పద్యముగానూ, తంత్రులమీద ఆలాపించి, లయతో పాడటానికి అనువు అయిన గీతముగానూ నా నోటి వెంట వచ్చింది. ఇటువంటి ఛందస్సు ఇదివరకు లేదు. దీనిని శ్లోకము అంటాను" అన్నాడు.

భరద్వాజుడు వినయసంపన్నుడు మాత్రమే కాడు. సమస్తశాస్త్రాలూ అభ్యసించినవాడు. వాల్మీకిమహర్షి నోటి వెంట వచ్చిన శ్లోకము తన నోటితో అని చూచినాడు. వాల్మీకిమహర్షి చెవులారా వాక్యము విన్నాడు. సంతోషించినాడు.

వాల్మీకిమహర్షి అంతట ఆ తమసానదిలో యథావిధిగా స్నానము చేసినాడు. అప్రయత్నముగా తన నోటివెంట వచ్చిన శ్లోకాన్ని గురించీ, శ్లోకార్థాన్ని గురించీ ఆలోచించుకొంటూ, ఆశ్రమపదానికి తిరుగు ముఖము అయినాడు. భరద్వాజుడున్నూ కలశమునిండా నీళ్ళు తీసుకొని ఆయన వెనుక నడువసాగినాడు. ఇద్దరూ ఆశ్రమపదము చేరినారు.

వాల్మీకిమహర్షి పర్ణశాలలో కూర్చుని మాధ్యాహ్నిక కృత్యాలను నెరవేరుస్తూ ఉన్నప్పటికిన్నీ బోయవాడు క్రౌంచపక్షిని చంపడమూ, తన నోటివెంట అప్రయత్నముగా ఛందోబద్ధము అయిన వాక్యము దొర్లడమూ మొదలు అయిన విషయాల మీదికే మనస్సు పోయింది.

బ్రహ్మ సాక్షాత్కారము

ఆ సమయాన బ్రహ్మదేవుడు అక్కడ ప్రత్యక్షము అయినాడు. వాల్మీకిమహర్షి ఆశ్చర్యచకితుడు అయినాడు. చటుక్కున లేచి నిలుచున్నాడు. నోట మాట పెగలలేదు. పరిశుద్ధహృదయముతో నమస్కారము చేసినాడు. బ్రహ్మదేవుణ్ణి ఎగాదిగా చూడసాగినాడు. క్షణలేశములో తెప్పరిల్లినాడు. అంతట బ్రహ్మదేవుడికి అర్ఘ్యమూ, పాద్యమూ ఇచ్చినాడు. కూర్చుండటానికి ఉత్తమాసనము చూపించినాడు. బ్రహ్మదేవుడు కూర్చున్న తరువాత ఆయన్ను స్తోత్రము చేసినాడు. ప్రదక్షిణముచేసి సాష్టాంగ పడినాడు. బ్రహ్మదేవుడు వాల్మీకిమహర్షిని కుశలము అడిగి కూర్చుండమన్నాడు.

వాల్మీకిమహర్షి బ్రహ్మదేవుడి ఎట్టఎదుట కూర్చున్నాడే కాని, ఆయన మనస్సు మళ్ళీ క్రౌంచపిట్టలమీదికే పోయింది. ఆ సమయములో, రతిపారవశ్యములో మైమరిచిపోయి మనోహరముగా క్రౌంచపిట్ట పాడుతూ ఉన్న సమయములో, ఆ పాపాత్ముడు బోయవాడు దాన్ని కొట్టి చంపివేసినాడు. ఎంత ఘోరము జరిగింది అనుకొంటూ, శోకపరాయణుడు అయిపోయినాడు. తాను అన్న శ్లోకము మళ్ళీ మనస్సులో అనుకోవడము మొదలు పెట్టినాడు.

బ్రహ్మదేవుడు వాల్మీకిమహర్షిని చూచి నవ్వుతూ, "ఓ మహర్షీ! నీవు చెప్పింది శ్లోకమే, ఆలోచించ నవసరములేదు. ఆ సరస్వతి నావల్లనే నీ నోటివెంట వెలువడింది.

నీవు రామకథను అంతా అటువంటి శ్లోకాలలో చెప్పవలెను. రాముడు అంతటివాడు ఈ భూలోకంలో ఎక్కడనూ లేడు. ఆ రామచరితము నీవు విన్నది విన్నట్టుగా విస్తరించి చెప్పవలెను. ఇంతవరకూ నిగూఢముగా ఉన్న అనేక విషయాలు నీకు ఒక్కడికే గోచరిస్తవి. నీవు చెప్పే కావ్యములో ఒకటిన్నీ అనృతము ఉండదు. నీవు చెప్పేది ఆదికావ్యము అవుతుంది. మహాకావ్యము అవుతుంది. పుణ్యకావ్యమున్నూ అవుతుంది.

"ఓ మహర్షీ! ఈ ప్రపంచంలో మహానదులూ, మహాపర్వతాలూ ఉండేటంత వరకూ నీవు చెప్పే రామాయణ కావ్యము ప్రచారములో ఉంటుంది. అటు ఊర్ధ్వలోకము లోనూ, ఇటు భూలోకములోనూ నీ కావ్యముతోపాటు నీవున్నూ శాశ్వతముగా జీవించి వుంటావు" అని చెప్పి, బ్రహ్మదేవుడు అంతర్ధానము అయిపోయినాడు.

వాల్మీకిమహర్షీ, ఆయన శిష్యులూ పరమానందభరితులు అయినారు. శిష్యులు "మానిషాద" శ్లోకము వల్లెవేయసాగారు. పదే పదే వల్లించడమువల్ల సమాక్షర పాదబద్ధము అయిన ఆ శ్లోకము నిజముగా శ్లోకము అయింది.

అంతట రామాయణ కావ్యము చెప్పవలెను అని వాల్మీకిమహర్షికి బుద్ధి పుట్టింది. గంభీరార్థాలతోనూ, మనోహర శబ్దాలతోనూ, సుసంగత వాక్యాలతోనూ, ఉత్తమోత్తమ శ్లోకాలతోనూ రామాయణ మహాకావ్యము వాల్మీకిమహర్షి చెప్ప సంకల్పించుకున్నాడు.

3

రామాయణ మహాకావ్యం ప్రారంభము

నారదమహర్షి చెప్పిపోయిన కథనే కాకుండా రామకథను గురించి మిగతా వివరాలను అన్నింటినీ వాల్మీకిమహర్షి ఆలోచించినాడు. కాళ్ళూ చేతులూ కడుగుకొని ఆచమించి ప్రాచీనాగ్ర దర్భాసనము మీద కూర్చున్నాడు. చేతులు జోడించి ధ్యానము చేయసాగినాడు. దశరథమహారాజూ, ఆయన భార్యలూ, సీతారాములూ వారి వారి మాటలూ, వారి వారి నడకలూ, వారి వారి ప్రవర్తనలూ, సీతారామలక్ష్మణుల అరణ్యవాసమూ, పౌలస్త్యవధమూ మొదలు అయినవి అన్నీ బ్రహ్మానుగ్రహమువల్ల ఆయన కన్నుల ఎదుట పొడకట్టినవి. ఆ యా వ్యక్తులను గురించిన నిగూఢవిషయాలు అన్నీ ఆయనకు కరతలామలకము అయినవి.

వాల్మీకిమహర్షి అంతట చెవులకు ఇంపుగా, మనస్సునకు ఉల్లాసముగా ఉండేట్లు ధర్మార్థకామాలను వివరిస్తూ, నారదమహర్షి సంగ్రహముగా చెప్పిపోయిన క్రమాన రామకథను విస్తరించి అమూల్యము అయిన రత్నాలు దొరికే మహాసముద్రము మాదిరిగా రామాయణ మహాకావ్యము చెప్పినాడు.

4

రాముడు తిరిగి కోసల దేశము వచ్చి రాజ్యపాలనము చేస్తూ ఉండగా వాల్మీకి మహర్షి రామాయణ మహాకావ్యము చెప్పినాడు. భవిష్యత్కథను ఉత్తరకాండగా ఆ తరువాత చెప్పినాడు. వేదార్థ ప్రతిపాదకముగా ఇరవైనాలుగువేల శ్లోకాలలో, అయిదువందల సర్గలలో, ఆరు కాండలుగా నవరసభరితము అయిన మహాకావ్యముగా రామకథను ఆ చరితవ్రతుడు చేసినాడు. అది పైకి చదివినా, పాటగా పాడినా, మనస్సులో చదువుకొన్నా మనోహరముగా ఉంటుంది.

ద్రుత మధ్య విలంబితాలు అనే మూడు ప్రమాణాలతోనూ, సప్తస్వరాల తోనూ, వీణా వేణు తాళ మృదంగాదులమీద ఆలాపించి అభినయిస్తూ గానము చేసినా మనోహరముగా ఉంటుంది.

కుశలవులు - రామకథాగానము

ఆ మహాకావ్యము ఎవరిచేత ఈ ప్రపంచములో ప్రచారము చేయించడమా అని వాల్మీకిమహర్షి ఆలోచించినాడు. పరమాత్మను ధ్యానము చేయసాగినాడు. అప్పుడు ఆయన పాదాలమీద ఎవరో వాలినట్లు తోచింది. కన్నులు తెరచి చూచినాడు.

వారు కుశలవులు. ఆయన ఆశ్రమములో మునిబాలకులుగా పెరుగుతూ ఉన్న అన్నతమ్ములు. రాముడి బింబానికి ప్రతిబింబాలవంటివారు. గురు శుశ్రూష చేసి సాంగముగా వేదాధ్యయనము చేసినారు. అనేకవిద్యలు అభ్యసించినారు. వారు మహామేధావులు. గానశాస్త్ర రహస్యాలను అన్నిటినీ తెలుసుకున్నారు. మూర్ఛనాస్థాన కోవిదులు. ఆటలో పాటలో గంధర్వులవంటివారు. మధుర భాషణులు.

వారు, ఆ కుశలవులు రామాయణ మహాకావ్యాన్ని ప్రచారము చేస్తాము అని వాల్మీకిమహర్షికి చెప్పుకొన్నారు. ఆయన సంతోషించినాడు. అంతట ఆయన వారిచేత చదివించినాడు. వారు ఆ మహాకావ్యాన్ని అంతా ముఖస్థము చేసుకొన్నారు. వాల్మీకిమహర్షికి చదివి వినిపించినారు. పాడుతూ ఆడి చూపించినారు. ఆ తరువాత ఆ మహానుభావుడి దగ్గరకు వచ్చిన మహర్షులూ మొదలు అయిన వారికి అందరికీ చదివి వినిపించినారు. పాడుతూ ఆడి చూపించినారు. అందరూ మెచ్చుకొన్నారు.

ఎందరెందరో మహర్షులూ, బ్రాహ్మణోత్తములూ, ఇంకా ఇతర సాధుపుంగవులూ సభ తీరి ఉండగా కుశలవులు పోయి రామాయణ మహాకావ్యగానము చేయసాగినారు. ఆ పాటకు ఆ సదస్యులు అందరూ విస్మితులు అయిపోయినారు. "భలే, భలే, బాగుంది బాగుంది" అంటూ కేకలు వేసినారు. అందరి కన్నుల వెంటనూ ఆనందబాష్పాలు రాలినవి.

'పాట మనోహరముగా ఉంది. శ్లోకాలు అంతకన్నా మనోహరముగా ఉన్నవి. ఎప్పుడో జరిగింది ఇప్పుడు కన్నుల ఎదుట జరుగుతూ ఉన్నట్టు తోచింది' అంటూ వారు కుశలవులను పొగడినారు.

అంతట వారు గొంతులు ఎత్తి ఏకకంఠులు అయి రాగయుక్తముగా, స్వర సంపన్నముగా కవి హృదయాన్నీ, భావాన్నీ ఏమాత్రమూ బీరుపోనీయకుండా మరింత మధురముగా పాడసాగినారు. అప్పుడు ఆ ధర్మవత్సలులలో ఒకాయన లేచి సంతోషాతిశయముతో ఒక జలకలశాన్ని కుశలవులకు బహుమానముగా ఇచ్చినాడు. ఒకాయన వల్కలము ఇచ్చినాడు. ఒకాయన కృష్ణాజినము ఇచ్చినాడు. ఒకాయన మౌంజిని ఇచ్చినాడు. ఒకాయన కమండలము ఇచ్చినాడు. ఒకాయన జందెము ఇచ్చినాడు. ఒకాయన అత్తి చెక్కతో చేసిన పీటను ఇచ్చినాడు. అందరూ 'దీర్ఘాయురస్తు' అంటూ, ఆ అన్నదమ్ములను దీవించినారు.

"ఓ కుశలవులారా! రామకథ ఆశ్చర్యము అయినది. భావికవులు అందరికీ మూలాధారముగానూ, పరమాధారముగానూ ఉండే మహాకావ్యముగా వాల్మీకిమహర్షి చెప్పినాడు. మీరు సమస్తగాన పద్ధతులూ తెలిసినవారు. ఆ మహాకావ్యాన్ని ఆపాతమధురముగా మీరు గానము చేసినారు. స్వరశ్రుతి మనోహరముగా ఉంది. ఇది పుష్టిని ఇస్తుంది. తుష్టిని ఇస్తుంది. ఆయువునూ ఇస్తుంది" అని మహర్షులు మొదలు అయినవారు అందరూ ప్రశంసించినారు.

ఇది అంతా రామునికి తెలిసింది. దేశాటనము చేస్తూ కుశలవులు అయోధ్యానగరము వచ్చినారు అనీ, రథ్యలలోనూ, రాజమార్గాలలోనూ వారు రామాయణ కావ్యగానము చేస్తూ ఉన్నారు అనీ తెలిసింది. ఆ మునిబాలకులను తన కొలువు కూటానికి పిలిపించినాడు. వారిని చక్కగా సత్కరించినాడు.

రాముడు తమ్ములతోనూ, మంత్రిపుంగవులతోనూ, మహాజనులతోనూ కొలువుతీరి కూర్చుని కుశలవులను కావ్యగానము చేయమని కోరినాడు. అంతట ఆ దేవవర్చస్కులు వీణా వేణు తాళ మృదంగాదులు మోగుతూ ఉండగా ఆలాపించి రామాయణ మహాకావ్యాన్ని దేశీపద్ధతిని పాడుతూ అభినయించ సాగినారు. ఆ గానానికి సదస్యులు అందరూ ఉప్పొంగిపోయినారు. తన్మయులు అయినారు.

అప్పుడు రాముడు ఆ కుశలవులను చూచి మార్గపద్ధతిని ఆ మహా కావ్యము గానము చేయమని చెప్పి సభాసదులను ఉద్దేశించి, "మహాజనులారా! ఈ కుశలవులు మునివేషాలలో ఉన్నప్పటికిన్నీ, రాజలక్షణలక్షితాంగులుగా కనబడుతున్నారు. గాయకులుగా ఉన్నప్పటికిన్నీ తాపసోత్తములుగా గోచరిస్తూ ఉన్నారు. నాకు మేలు

చేయటానికి మహాప్రభావము అయిన సీత చరిత్రను ఇక చెప్పబోతున్నారు, వినవలసింది' అన్నాడు.

అంతట కుశలవులు మరింత ఉత్సాహముతో పాటను అందుకున్నారు. గొంతులు ఎత్తినారు. ఏకకంఠులు అయి స్పష్టముగా కన్నులకు పొడకట్టేటట్టు పాడసాగినారు. అప్పుడు రాముడు సింహాసనముమీద కూర్చుండలేక పోయినాడు. చడీ చప్పుడు కాకుండా లేచివచ్చి సభాసదులలో కూర్చున్నాడు.

5

అయోధ్య

ఈ భూమిని జయించి రాజ్యము ఏలిన రాజులు అందరిలోనూ ఇక్ష్వాకు వంశీయులు చాలా గొప్పవారు. మనుప్రజాపతి మొదలుకొని ఆ వంశీయులు అందరూ అపూర్వముగా రాజ్యపాలనము చేసినారు. అరవైవేలమంది పుత్రులను ఈ భూమి మీదికి దండయాత్రకు పంపించి ఈ నేలను అంతా బ్రద్దలు కొట్టించిన సగర చక్రవర్తి ఆ వంశీయుడే. ఆయన త్రవ్వించడము చేతనే సముద్రానికి సాగరము అనే పేరు వచ్చింది. అటువంటి మహాత్ముల వంశములో రాముడు అనేవాడు పుట్టినాడు. ఆయన్ను గురించిన కథే రామాయణము. అది ధర్మార్థకామాలను తెలియచెప్పే మహాకావ్యము. ఆ మహాకావ్యము వాల్మీకిమహర్షి చెప్పబోతున్నాడు, శ్రద్ధతో వినవలసింది.

సరయూనదీ తీరాన సకలధనధాన్య సమృద్ధము అయిన కోసల దేశము ఉంది. జగత్ప్రసిద్ధమయిన అయోధ్యా నగరము ఆ దేశానికి రాజధాని. ఆ నగరాన్ని పూర్వము వైవస్వత మనువు కట్టించినాడు. దాని పొడుగు పన్నెండు యోజనాలు, వెడల్పు రెండు యోజనాలు. అది మిట్టపల్లాలులేని సమప్రదేశములో జూదముపీట మాదిరిగా అష్టాపదాకారముగా ఉంది. ఆ పట్టణము నట్టనడుమ రాజభవనమూ, ఆ రాజభవనానికి నాలుగు దిక్కులా నాలుగు వీధులూ, అయిమూలలుగా నాలుగు వీధులూ ఉన్నవి. ఏ భాగానికి ఆ భాగము చక్కగా విడమర్చేటందుకు ఆ వీధులను అట్లా వేసినారు. అవి అన్నీ చాలా విశాలము అయినవి. ప్రతిరోజూ నీళ్ళు చల్లి ఘుమఘుమలాడే పూలతో ఆ వీధులను అన్నిటినీ అలంకరిస్తూ ఉంటారు.

ఆ పురలక్ష్మికి మొలనూలు మాదిరిగా ఉన్నతము అయిన ప్రాకారము ఉంది. దానికి బందోబస్తు అయిన తలుపులూ, ద్వారబంధాలూ ఉన్నవి. ఆ ప్రాకారము వెలుపల అగాధము అయిన అగడ్త ఉంది. ఆ అగడ్తను దాటిపోవడము అశక్యము. కోట బురుజులు చాలా ఎత్తు అయినవి. వాటిమీద జయపతాకలు ఎగురుతూ ఉంటవి. ఆ బురుజులమీద శతఘ్నులున్నూ ఉన్నవి.

ఆ అయోధ్యా నగరములో రకరకాల ఆయుధాలూ, ఇంకా ఎన్నో రకాల యంత్రాలూ ఉంటూ ఉన్నవి. ఆ యా పనిపాటలుచేసే శిల్పులున్నూ, రథాలు తోలే సూతులున్నూ, రాజప్రబోధకులు అయిన మాగధులున్నూ అక్కడనే కాపురము ఉన్నారు.

అంగళ్ళవీధులు అన్నీ వేటికి అవిగా ఉన్నవి. ప్రపంచములో సామాన్యముగా దొరకని వస్తువులూ, రత్నాలూ మొదలు అయినవి ఆ పట్టణములో విరివిగా దొరుకుతవి. దేశదేశాలనుంచీ వ్యాపారార్థము వచ్చిన వర్తకులూ, కప్పాలు కట్టే సామంతరాజులూ అక్కడనే నివసిస్తూ ఉండేవారు.

ఆ నగరములో ఎటుచూచినా రత్నఖచిత ప్రాసాదాలూ, విమాన గృహాలూ, కూటాగారాలూ, క్రీడాపర్వతాలూ, ఎక్కడికి అక్కడ ఉద్యానవనాలూ, మామిడి తోపులూ, స్త్రీలు ఆడే నాటకశాలలూ ఉన్నవి. ఏ భాగములో చూచినా ఇండ్లు నత్తుగా ఉంటవి. ఏ ఇంట చూచినా వరిబియ్యము సమృద్ధముగా ఉంటవి. నూతులలో నీరు చెరుకు పానకము మాదిరిగా ఉంటుంది. ఆ పట్టణము అంతటా ప్రతినిత్యమూ దుందుభులూ, మృదంగాలూ, వీణలూ, పణవాలూ మ్రోగుతూ ఉంటవి. అంతా నిత్యకళ్యాణముగా ఉంటుంది.

ఆ నగర నిర్మాణములో ఇక్కడ ఈ దోషము ఉన్నది అని చెప్పడానికి వీలులేదు. అది దేవేంద్రుడి అమరావతి పట్టణము వంటిది. ఆ అయోధ్యా నగరాన్నీ, ఆ కోసల రాజ్యాన్నీ మహోచ్ఛదశలోనికి తీసుకొని వచ్చినవాడు దశరథమహారాజు. అమరావతీ పట్టణములో దేవేంద్రుడి మాదిరిగా ఆయన ఆ అయోధ్యా నగరములో ఉంటూ ఉండేవాడు.

6

దశరథమహారాజు మహాపరాక్రమవంతుడు. అమితబలవంతుడు. చతురంగ సేనాసమేతుడు. అతిరథుడు. శత్రువుల నందరినీ అణచివేసినాడు. ప్రపంచములో బలవంతులను అందరినీ స్నేహము చేసుకొన్నాడు. శూరులనూ, వీరులనూ, విద్వాంసులనూ రావించి, ఉచితరీతిని సత్కరించి వారు అందరూ తన రాజధానీ నగరములో ఉండిపోయేట్టు చేసినాడు.

బావులూ, చెరువులూ త్రవ్వించిన్నీ, ఇంకా అనేక ధర్మకార్యాలు చేసిన్నీ అటు జానపదులనూ, ఇటు పట్టణవాసులనూ ఒక్కమాదిరిగా మెప్పించినాడు. ప్రజలను అందరినీ తన వశము చేసుకొన్నాడు.

ఆయన వేదవిదుడు. యజ్వ. దీర్ఘదర్శి. హిరణ్యరత్నాంబరాభరణాదులతో దేవేంద్రుడి మాదిరిగానూ, నిధినిక్షేపాదులతో కుబేరుడి మాదిరిగానూ ఉంటూ

ఉండేవాడు. ఆయన జితేంద్రియుడు. ధర్మహానిలేకుండా అర్థ కామాలను అనుభవిస్తూ ఉండేవాడు. రాజరూప ఋషి. మహర్షితుల్యుడు. ముల్లోకాలలోను పేరు ప్రతిష్ఠలు సంపాదించినవాడు.

ఆయన రాజ్యపాలనములో అయోధ్యా నగరము చుట్టుప్రక్కల రెండు యోజనాలవరకు ఎవరికీ ఎదిరించ శక్యము కాకుండా సార్థకనామము అయిన పట్టణముగా ఉంటూ వచ్చింది.

ఆ పట్టణములో ప్రజలు అందరూ అత్యంత సంతోషముతో నివసిస్తూ ఉండేవారు. వారు అందరూ పరమధార్మికులు. బహుశ్రుతులు. సత్యవాదులు. లోభరహితులు. తమకు ఉన్నదానితో తృప్తిపడేవారు. అయితే, అందరూ కలవారే. లేనివాడు ఆ పట్టణములో లేనేలేడు. అందరూ ధర్మార్థకామాలను అనుభవిస్తూ ఉండేవారు.

ఏ ఇంట చూచినా పదిమంది ఉన్న కుటుంబము కనిపించేది. ధనమూ, ధాన్యమూ, పాడి ఆవులూ లేని ఇల్లు ఆ పట్టణములో ఒకటిన్నీ కనిపించేది కాదు. గుర్రాలు లేని గృహస్థున్నూ కనిపించేవాడు కాడు. తాను తినక ఇతరులకు పెట్టనివాడుకానీ, ఆలుబిడ్డలనూ, అన్నతమ్ములనూ పీడించేవాడు కానీ, కాముకుడు కానీ, క్రూరుడు కానీ, వంచకుడు కానీ, నాస్తికుడు కానీ, చదువుకోనివాడు కానీ ఆ అయోధ్యా పట్టణములో కనిపించేవాడు కాడు.

ఆక్కడి స్త్రీ పురుషులు అందరూ ధర్మపరాయణులు, సహజస్వభావులు, సదాచార సంపన్నులు. మహర్షుల మాదిరిగా నిర్మల మనస్కులు.

ఆ అయోధ్యానగరవాసులు అందరూ ప్రతినిత్యమూ అభ్యంగన స్నానము చేసేవారు. ఒంటినిండా మంచిగంధమూ, కస్తూరీ మొదలు అయిన పరిమళద్రవ్యాలు పూసుకొనేవారు. ఘుమఘుమలాడే పూలదండలు వేసుకొనేవారు. శిరోభూషణాలూ, కర్ణాభరణాలూ, బాహుపురులూ, వక్షఃస్థలాన బంగారుపతకాలూ, హస్తాభరణాలూ ధరించేవారు. అందరూ భోగాలు అనుభవించేవారే. అదేవిధముగా అందరూ ఇతరులకు పెట్టేవారే.

ఆ పట్టణములో నీచులూ, చోరులూ, వర్ణసంకరులూ ఉండేవారు కారు.

అక్కడి బ్రాహ్మణులు అందరూ స్వకర్మనిరతులు. జితేంద్రియులు. వేదాధ్యయన పరాయణులు. పరదారపరాఙ్ముఖులు. శిక్షావ్యాకరణ చ్ఛందో నిరుక్త జ్యోతిష కల్పాలు అనే షడంగాలనూ అభ్యసించనివారు కానీ, చాంద్రాయణాది

వ్రతాలు పట్టనివారు కానీ ఒక్కరున్నూ ఉండేవారు కారు. అందరూ ఆహితాగ్నులు కేవల ఋషులు, మహర్షి కల్పులు, మహాత్ములుగా ఉండేవారు.

అక్కడి క్షత్రియులు అందరూ మహారథులు. వారు అత్యంత సమర్థులు, సమస్తశస్త్రాస్త్రవిద్యలలో ఆరితేరినారు. ఓడిపోయి పలాయనము అయ్యేవాడిమీద కానీ, ఒంటరివాడిమీద కానీ బాణాలు వదిలేవారు కారు. శబ్దవేధి విద్యను అభ్యసించినప్పటికిన్నీ మాటుపెట్టుకొని, చప్పుడును బట్టి బాణాలు వేసేవారు కారు. మహారణ్యాలలో చుదించి గర్జిస్తూ సంచరించే క్రూరమృగాలను బాహుబలంతో కానీ, నిశితాస్త్రాలు వేసికానీ చంపివేసేవారు. వారు అందరూ నిప్పులవంటివారు. అందరూ సుశిక్షితులు. గుహలలో సింహాలమాదిరిగా ఎదిరించడానికి అలవికాకుండా ఆ అయోధ్యాపట్టణములో నివసిస్తూ ఉండేవారు.

ఆ అయోధ్యా నగరములో ఉన్న అన్ని కులాలవారూ అతిథిని ఆదరించకుండా ఏనాడూ భోజనము చేసేవారు కారు. మేలు మరచిపోయేవారు కారు. అడిగినవారికి లేదు అనేవారు కారు. ఆ మహా నగరములో దీనజనులూ, వ్యాకులచిత్తులూ, వ్యాధిపీడితులూ ఉండేవారు కారు. స్త్రీ పురుషులు అందరూ కాంతిమంతులు, రూపవంతులు. కురూపులు అక్కడ ఎక్కడనూ కనిపించేవారు కారు.

బ్రాహ్మణులను అనుసరించి క్షత్రియులూ, క్షత్రియులను అనుసరించి వైశ్యులూ, ఆ మూడు కులాలవారికీ అనుకూలముగా శూద్రులూ ప్రవర్తించేవారు.

ఆ అయోధ్యా నగరంలో కాంభోజ, బాహ్లిక, వనాయు, సింధు దేశాలలో పుట్టిన గుర్రాలు అనేకము ఉండేవి. ఏ గుర్రాన్ని చూచినా ఉచ్ఛైశ్రవము మాదిరిగా కనిపించేది.

వింధ్యపర్వతాలలో పుట్టిన మదపుటేనుగులూ, హిమవత్పర్వత ప్రాంతాలలో పుట్టి మదించి పెద్ద పెద్ద కొండల మాదిరిగా కనిపించే ఏనుగులూ, ఇంకా ఐరావత మహాపద్మ అంజన వామన జాతుల ఏనుగులు ఆ పట్టణములో తండోపతండాలుగా తిరుగుతూ ఉండేవి. ఏనుగులు భద్రములు అనీ, మృగములు అనీ, మంద్రములు అనీ మూడు జాతులు. వాటికీ, ఇంకా అనేక సంకీర్ణజాతుల ఏనుగులకున్నూ అయోధ్యా నగరము పుట్టినిల్లు.

గుర్రాలూ ఏనుగులే కాకుండా పెద్ద భారీ రకము ఎద్దులూ, ఒంటెలూ, కంచర గాడిదలూ మందలు మందలుగా ఆ పట్టణములో తిరుగుతూ ఉండేవి.

అటువంటి ఆ మహాపట్టణములో చుక్కలలో చంద్రుడు మాదిరిగా దశరథమహారాజు ఉండేవాడు.

7

దశరథమహారాజు

దశరథమహారాజుకు వశిష్ఠ వామదేవులు అనే ఇద్దరు మహర్షులూ ముఖ్య పురోహితులు.

ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు అనే ఎనిమిదిమంది ఆయనకు మంత్రులు. వారిలో సుమంత్రుడు .దశరథమహారాజుకు ఆంతరంగికుడు. ఆతనికి అంతఃపుర ప్రవేశాధికారమున్నూ ఉండేది.

ఆ మంత్రులు అందరూ విద్యా వినయ సంపన్నులు. నీతికుశలురు. నియతేంద్రియులు. శ్రీమంతులు. బుద్ధిమంతులు. శాస్త్రజ్ఞులు. అప్రతిహత పరాక్రమవంతులు. మంత్రనైపుణ్యములో పేరుప్రతిష్ఠలు సంపాదించినవారు. అకార్యాచరణకు వెరచేవారు. ఎప్పుడూ హెచ్చరికతో ఉండేవారు. ఓర్పుకూ, ప్రతాపానికీ ప్రణుతి కెక్కినారు. కొరకొరలాడకుండా ఎవరితోనైనా ఎప్పుడూ చిరునవ్వుతో మురిపెముగా మాట్లాడేవారు. కోపము వచ్చినా కామార్థ కారణాలవల్ల నయినా అనృతము ఆడేవారు కారు.

వారు స్వరాష్ట్రములోనూ, పరరాష్ట్రాలలోనూ పుట్టుపూర్వోత్తరాలు ఎప్పటికప్పుడు వేగులవాండ్లవల్ల తెలుసుకొంటూ ఉండేవారు. వారు సర్వ వ్యవహార సమర్థులు. వారికి మిత్రామిత్రభేదము ఉండేదికాదు. అపరాధము చేయకపోతే శత్రువునైనా హింసించేవారు కారు. వారు బొక్కసాన్ని పెంచడములోనూ, సైనికులను సమకూర్చుకొనడము లోనూ జాగరూకులుగా ఉండేవారు. బ్రాహ్మణ క్షత్రియులను అయినా అపరాధము చేస్తే శిక్షిస్తూ ఎప్పుడూ సజ్జనులను కాపాడుతూ ఉండేవారు. అపరాధము చేసినవారి తారతమ్యాలనుబట్టి ధనదండము విధించేవారు. వారందరూ ఏకాభిప్రాయముతో రాజ్యతంత్రాన్ని నడిపేవారు.

ఆ మంత్రిపుంగవుల నీతిజ్ఞతవల్ల అయోధ్యా నగరములోనూ, ఆ కోసలరాజ్యము అంతటనూ అబద్ధాలు ఆడేవారూ, మోసగాండ్లూ, పరదారరతులూ లేకుండా పోయినారు. ఆ మంత్రిసత్తములు దేశాంతరాలలో సయితము పేరు ప్రఖ్యాతులు సంపాదించినారు. ఎన్నడూ ఏమరుపాటు లేకుండా నిశ్చయ జ్ఞానముతో ప్రవర్తించేవారు. నీతిమార్గాన రాజ్యాన్ని కాపాడుతూ ఉండేవారు.

తేజోమయ కిరణాలతో ఉదయభాస్కరుడు మాదిరిగా ఆ మంత్రులతో దశరథమహారాజు అయోధ్యా నగరములో ఉండేవాడు.

8

అశ్వమేధయాగ సంకల్పము

దశరథమహారాజు అంతటి ప్రభావముతో ఉంటూ ఉన్నా ఆయనకు ఎంతకాలానికీ సంతానము కలగలేదు. వంశాభివృద్ధి చేయడానికి ఒక్క కొడుకు అయినా పుట్టలేదే అని దిగులుపడ్డాడు. అశ్వమేధము చేస్తే పుత్రులు పుట్టుతారేమో ననుకొన్నాడు. ఆలోచించినాడు. మంత్రులతో సంప్రదించినాడు. సుమంత్రుణ్ణి చూచి, "గురువులనూ, పురోహితులనూ, ఇంకా ఇతర బ్రాహ్మణోత్తములనూ నీవు శీఘ్రముగా పిలుచుకొని రావలెను" అని చెప్పినాడు.

సుమంత్రుడు పోయి అప్పటికప్పుడు గురువరేణ్యుడు అయిన వశిష్ఠమహర్షినీ, వేదపారంగతులు అయిన సుయజ్ఞుణ్ణీ, వామదేవుణ్ణీ, జాబాలినీ, కాశ్యపుణ్ణీ, ఇంకా తక్కిన బ్రాహ్మణోత్తములనూ వెంటపెట్టుకొని వచ్చినాడు.

వారినందరినీ దశరథమహారాజు ఉచితరీతిని సత్కరించి, "ఓ బ్రాహ్మణోత్తములారా! సంతానము లేదే అనే తాపత్రయమువల్ల నాకు సుఖము లేకుండా పోయింది. అందుకు అశ్వమేధము చేయవలెను అని నాకు బుద్ధి పుట్టింది. ఆ యజ్ఞము సశాస్త్రీయముగానూ, నిర్విఘ్నముగానూ నేను నెరవేర్చేటందుకు అవసరమయిన సదుపాయాలు అన్నీ మీరు చేసిపెట్టవలెను" అన్నాడు.

వశిష్ఠమహర్షీ, తక్కిన బ్రాహ్మణోత్తములూ దశరథమహారాజును మెచ్చుకొని, "ఓ రాజా! తమకు పరమధార్మికము అయిన బుద్ధి పుట్టింది. తప్పకుండా తమకు పుత్రులు పుట్టుతారు. ముందుగా యజ్ఞోపకరణాలను అన్నిటినీ సమకూర్చవలెను. ఆ తరువాత గుర్రాన్ని వదలవచ్చును" అని చెప్పినారు.

దశరథమహారాజు మహర్షుల మాటలకు ఎంతో సంతోషపడ్డాడు. ఆయన కన్నులవెంట ఆనందబాష్పాలు రాలినవి. అంతట ఆయన మంత్రులను ఉద్దేశించి, "ఓ మంత్రిపుంగవులారా! మీరు ఈ గురూద్వహులు చెప్పే సమస్త సంభారాలనూ వెంటనే సమకూర్చవలెను. ఋత్విజులతోనూ, సమర్థులు అయిన సైనికులతోనూ గుర్రాన్ని దేశముమీద విడిచిపెట్టవలెను.

"సరయూనదీ ఉత్తర తీరాన యజ్ఞవాటము ఏర్పాటు చేయవలెను. శాస్త్రీయముగా శాంతులను అన్నిటినీ చేయించవలెను. ఈ అశ్వమేధ యాగము ఏ రాజు పడితే ఆ రాజు చేసేది కాదు. ఈ యజ్ఞాన్ని నిర్విఘ్నముగా సమాప్తము చేయడము చాలా కష్టసాధ్యము అయిన పని. ఏమాత్రము అపచారము జరిగినా యజ్ఞకర్త అప్పటికప్పుడు నాశము అయిపోతాడు. సర్వమూ నాశము అయిపోతుంది. ఈ యజ్ఞములో ఎప్పుడు ఏ కొంచెము లోపము వస్తుందా అని బ్రహ్మరాక్షసులు

కనిపెట్టుకొని ఉంటారు. ఏ కొంచెము లోపము జరిగినా వాళ్ళు యజ్ఞాన్ని ధ్వంసము చేసివేస్తారు. మీరు సమస్తమూ తెలిసినవారు. ఈ క్రతువును నా చేత మీరు యథావిధిగా చేయించవలెను. ఈ భారము అంతా మీ మీద ఉంచుతున్నాను" అన్నాడు.

"రాజా! తాము ఆజ్ఞాపించినట్లుగా సమస్తమూ చక్కబెట్టుతాము" అని మంత్రులు అన్నారు.

"రాజా! మీచేత శాస్త్రీయముగానూ, నిర్విఘ్నముగానూ మేము అశ్వమేధము చేయిస్తాము" అని బ్రాహ్మణోత్తములు అందరూ అన్నారు. వారందరూ దశరథ మహారాజును ఆశీర్వదించినారు.

మహర్షులూ, బ్రాహ్మణులూ వెళ్ళిపోయిన తరువాత దశరథమహారాజు మంత్రులతో, "ఓ మంత్రిసత్తములారా! మీరు ఋత్విక్కులు చెప్పే యజ్ఞోపకరణాలను అన్నిటినీ శీఘ్రముగా సమకూర్చవలెను" అని చెప్పి, వారిని పంపించి వేసినాడు.

దశరథమహారాజు అంతట అభ్యంతర గృహములోకి పోయినాడు. హృదయప్రియులు అయిన కులకాంతలను చూచి, "మీరు పిల్లలు కనేటందుకు నేను ఇప్పుడు ఒక యజ్ఞము చేయపోతున్నాను. మీరు ఇక యజ్ఞదీక్ష వహించవలెను" అన్నాడు.

ఆ మనోహరవాక్యాలకు ఆ వర్చస్వినుల ముఖకమలాలు హేమంత కాలానంతర పద్మాలవలె వికసించినవి.

9

ఋశ్యశృంగుడు

సుమంత్రుడు దశరథమహారాజును ఏకాంతముగా కలుసుకొని, "రాజా! తమకు పుత్రులు ఎట్లా పుట్టేదిన్నీ పూర్వము ముని సభామధ్యములో భూత భవిష్య ద్వర్తమానాలు చెప్పే సనత్కుమారమహర్షి చెప్పుతూ ఉండగా నేను విన్నాను. ఆ మహర్షి అప్పుడు చెప్పింది అంతా తమకు నేను ఇప్పుడు మనవి చేస్తాను. తాము వినవలెను" అంటూ ఈ విధముగా చెప్పసాగినాడు :

"కాశ్యపమహర్షికి విభండకుడు అనే పుత్రుడు పుట్టుతాడు. ఆ విభండకుడికి ఋశ్యశృంగుడు అనేవాడు పుట్టుతాడు. వాడు అడవిలో పుట్టి ఆ అడవిలోనే తండ్రి దగ్గర పెరుగుతాడు. అందువల్ల, వయస్సు వచ్చినప్పటికిన్నీ ఈ ప్రపంచములో అడవితప్ప వాడు ఏ ఇతరమున్నూ ఎరగకుండా ఉంటాడు. వాడు రెండురకాల బ్రహ్మచర్యాన్ని అనుష్ఠిస్తాడు. అందుకు అతనిని ఈ లోకములో బ్రాహ్మణులు అందరూ మెచ్చుకుంటారు.

"ఆ ఋశ్యశృంగుడు తండ్రికి సేవ చేస్తూ, ఎప్పుడూ అగ్నిహోత్రాన్ని సేవిస్తూ బ్రహ్మచారిగా కాలము గడుపుతూ ఉండే రోజులలో అంగ దేశములో రోమపాద మహారాజు రాజ్యము ఏలుతూ ఉంటాడు.

"రోమపాదుడు అమితబలవంతుడుగానూ, మహాపరాక్రమవంతుడుగానూ రాజ్యపాలనము చేస్తూ ధర్మాన్ని వ్యతిక్రమిస్తాడు. అప్పుడు అంగదేశము అంతటా బహుకాలము వానలు కురవకుండా పోతవి. మహాక్షామము వస్తుంది. సర్వభూత భయావహము అయిన స్థితి ఏర్పడుతుంది. అప్పుడు రోమపాద మహారాజు చింతాక్రాంతుడు అయిపోయి వేదశాస్త్రపారంగతులు అయిన బ్రాహ్మణోత్తము లందరినీ ఆహ్వానించి, 'బ్రాహ్మణశ్రేష్ఠులారా! తాము సమస్తధర్మాలూ, లోకాచారాలూ తెలిసినవారు. ఈ అనావృష్టి దోషము తొలగిపోవడానికి ఏవిధము అయిన పాపపరిహారము నేను చేయవలెనో తాము సెలవు ఈయవలెను?' అని అడుగుతాడు.

" 'ఓ, రాజా! ఏవిధముగానైనా, ఏ ఉపాయమువల్ల నయినా విభండకమహర్షి పుత్రుణ్ణి ఋశ్యశృంగుణ్ణి తాము ఇక్కడికి రావించి, ఆయనను తాము చక్కగా సత్కరించి, తమ కూతురు శాంతాదేవిని ఆయనకు ఇచ్చి వివాహము చేసేట్లయితే అనావృష్టి దోషము అంతరించిపోతుంది. ఈదేశము అంతా సుభిక్ష మవుతుంది' అని బ్రాహ్మణవృద్ధులు చెప్పుతారు.

"ఋశ్యశృంగుణ్ణి అంగరాజ్యము రప్పించటము ఎట్లాగా అని అప్పుడు రోమపాదుడు ఆలోచిస్తాడు. ఆయనకు ఏ ఉపాయమూ తోచదు. అంతట మంత్రులను, పురోహితులను రావించి వారిని చక్కగా సత్కరించి, 'మీరే ఋశ్యశృంగుణ్ణి తీసుకొని రావలెను' అని రోమపాదమహారాజు ఆజ్ఞాపిస్తాడు. అందుకు మంత్రిపుంగవులూ, పురోహితులూ ఖిన్నులు అయిపోయి ముఖాలు వేళ్ళాడవేసుకొని, 'మహారాజా! విభండక మహర్షి అంటే మాకు అమిత భయము. అందువల్ల మేము అక్కడికి పోలేము. కాని, ఋశ్యశృంగుణ్ణి ఇక్కడికి రప్పించే ఉపాయము అయితే మేము చెప్పగలము. మేము చెప్పే ఉపాయమువల్ల ఏ ఇబ్బందీ రాదు' అని చెప్పుతారు.

"అంతట రోమపాదుడు ఆ మంత్రిపుంగవులు మొదలయినవారు చెప్పిన ఉపాయము చొప్పున ఋశ్యశృంగుడి దగ్గరకు వేశ్యాంగనలను పంపిస్తాడు. వారు ఆయనను అంగదేశము తీసుకొని వస్తారు. అప్పుడు అంగదేశములో వానలు కురుస్తవి. రోమపాదుడు తన కూతురు శాంతాదేవిని ఆయనకు ఇచ్చి పెండ్లి చేస్తాడు.

"ఆ ఋశ్యశృంగుడు దశరథమహారాజుచేత ఒక యజ్ఞము చేయిస్తాడు. అప్పుడు ఆయనకు పుత్రులు పుట్టుతారు అంటూ సనత్కుమారమహర్షి చెప్పినాడు. నేను విన్నాను."

ఈ విధముగా సుమంత్రుడు చెప్పింది అంతా దశరథమహారాజు విన్నాడు. ఎంతో సంతోషపడ్డాడు. "సుమంత్రుడా! అంగరాజు ఆ ఋశ్యశృంగుణ్ణి రోమపాద పట్టణానికి రావించిన విధము అంతా నాకు వివరముగా చెప్పవలెను" అన్నాడు దశరథమహారాజు.

10

సుమంత్రుడు అంతట దశరథమహారాజుతో మళ్ళీ ఈవిధముగా చెప్ప సాగినాడు :

"మంత్రులూ, పురోహితులూ సంప్రదించినారు. పురోహితుడు రోమపాద మహారాజుతో, 'ఓ రాజా! ఋశ్యశృంగుణ్ణి ఇక్కడికి రప్పించడానికి అపాయము లేని ఉపాయము మేము ఆలోచించినాము. ఆ బ్రహ్మచారి అడవిలో పుట్టినాడు. అడవిలోనే పెరిగినాడు. ఎప్పుడూ తపస్సు చేసుకొంటూనూ, వేదాధ్యయనము చేసుకొంటూనూ ఉంటాడు. అందువల్ల, ఆయన స్త్రీలనూ, విషయసుఖాలనూ ఏమాత్రమూ ఎరుగడు. శబ్ద స్పర్శ రూప రస గంధాదులు ఎటువంటివాడి చిత్తాన్ని అయినా ఇట్టే క్షోభ పెట్టుతవి. అవి దేహేంద్రియాలకు సమస్తసుఖాలనూ ఇస్తవి. అటువంటి దేహేంద్రియ సుఖము కోసము ఋశ్యశృంగుడు ఈ పట్టణము వచ్చేట్టుగా మనము చేయవచ్చును. రూపవతులు అయిన వేశ్యలు చక్కగా అలంకరించుకొని ఆయన దగ్గరకు పోవలెను. అతడు అమాయకుడు అయినందువల్ల, వారిని అందరినీ చక్కగా సత్కరిస్తాడు. వారు, ఆ వేశ్యలు వివిధోపాయాలతో ఆయనను వంచనము చేసి ఇక్కడికి తీసుకొని వస్తారు. ఇందుకు మీరు అంగీకరించవలెను' అన్నాడు.

"రోమపాదుడు అందుకు ఒప్పుకొన్నాడు. అంతట మంత్రులున్నూ, పురోహితులున్నూ ఋశ్యశృంగుణ్ణి రప్పించే ప్రయత్నానికి పూనుకొన్నారు.

"వేశ్యాంగనలు మహారణ్యానికి బయలుదేరినారు. ఋష్యశృంగుడి ఆశ్రమ ప్రాంతానికి పోయినారు. లోపలికి పోవడానికి వారికి భయము వేసింది. బయటనే ఉండి ఆయనను చూడటానికి ప్రయత్నము చేయసాగినారు.

"ఆ ఋశ్యశృంగుడు ఆ ఆశ్రమపదములో అగ్నిహోత్రాన్ని సేవిస్తూనూ, తండ్రికి శుశ్రూష చేస్తూనూ ఉండడము తప్ప మరి ఒకటి ఎరుగడు. ఆయనకు మరి ఏ యితర ధ్యాసా లేదు. తండ్రివెంట తప్ప ఆయన ఒంటరిగా ఆ ఆశ్రమపదములోనుంచి ఎప్పుడూ బయటికిపోయి ఎరుగడు. ఆతడు పుట్టింది మొదలూ అంతవరకూ ఒక స్త్రీని కానీ, తండ్రిని తప్ప మరి ఒక పురుషుణ్ణి గానీ చూచి ఎరుగడు. ఒక గ్రామముకానీ, ఒక పట్టణముకానీ ఆయన ఎన్నడూ పోయి ఎరుగడు. అటువంటివాడు

ఆనాడు తండ్రి లేనప్పుడు దైవవశమువల్ల ఒంటరిగా ఆ ఆశ్రమపదములోనుంచి బయటికి వచ్చినాడు. అప్పుడు రోమపాద పురమునుంచి వచ్చిన చక్కని చుక్కలు ఎట్టఎదుట కనిపించినారు.

"చిత్రవిచిత్ర వేషాలతో వచ్చిన భోగము పడుచులున్నూ ఋశ్యశృంగుణ్ణి చూచినారు. మనోహరముగా పాటలు పాడుతూ వారు ఆయనను సమీపించి, 'ఓ బ్రాహ్మణుడా! నీవు ఎవరవు? నీ నివాసము ఎక్కడ? జనసంచారములేని ఈ ఘోరారణ్యములో నీవు ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు చెప్పవలెను' అని ప్రశ్నించినారు.

"ఆ గణికలు అందరూ కామ్యమానరూపలు. అటువంటి రూపవతులను అదివరకు ఎన్నడూ ఆ అడవిలో చూచి వుండలేదు. వారిమీద ఆయనకు అకారణము అయిన అనురాగము కలిగింది. వారితో మాట్లాడవలెను అని ఆయనకు బుద్ధి పుట్టింది. వారిని అందరినీ చూస్తూ, 'మా తండ్రి విభండకమహర్షి. నేను ఆయన ఔరసపుత్రుణ్ణి. నన్ను ఋశ్యశృంగుడు అంటారు. ఈ ప్రపంచములో సమస్తవిధ కర్మలనూ నేను అవగతము చేసుకొన్నాను. ఓ చుక్కలారా! ఇక్కడికి దగ్గరలోనే మా ఆశ్రమపదము ఉంది. మిమ్ములను అందరినీ అక్కడను అయితే నేను శాస్త్రీయముగా సత్కరిస్తాను. మీరు అందరూ మా ఆశ్రమపదానికి రావలెను' అన్నాడు ఋశ్యశృంగుడు. ఋశ్యశృంగుడి ఆశ్రమానికి పోయి చూడవలెను అని ఆ కన్నెలకు బుద్ధి పుట్టింది. ఆయనవెంట వారు అందరూ బయలుదేరినారు. ఆశ్రమములోనికి పోయినారు.

"ఇదిగో అర్ఘ్యము. ఇదిగో పాద్యము. ఇవిగో కందమూలాలూ, పండ్లూ' అంటూ ఇచ్చి, ఆ పడుచులను అందరినీ ఋశ్యశృంగుడు చక్కగా సత్కరించినాడు. ఆ కన్నెలు అందరూ అమితోత్సాహముతో ఆయన సత్కారాలను అందుకొన్నారు. కాని, విభండక మహర్షి ఏ క్షణములో వస్తాడోనని భయపడిపోతూ త్వరగా అక్కడినుండి తరలిపోవలెను అనుకొన్నారు.

"ఓ బ్రాహ్మణుడా! ఇవిగో మేము తెచ్చిన ఫలాలు. వీటిని నీవు తీసికొనవలెను. నీకు శుభము అవుతుంది, తిను. ఆలస్యము చేయవద్దు' అంటూ ఆ కన్నెలు ఆయనను గట్టిగా కౌగలించుకొన్నారు. ఆయన ఆనందపరవశుడు అయిపోయినాడు. వారు పండ్లు అంటూ ఇచ్చిన తియ్యని పిండివంటలనూ, రకరకాల భక్ష్యాలనూ ఆ తేజోవంతుడు అప్పటికప్పుడు తిన్నాడు. ఆశ్చర్యపడిపోయినాడు. ఏమంటే, అటువంటి పండ్లను ఆ అడవిలో ఆయన అదివరకు ఎన్నడూ రుచి చూడలేదు.

"ఆయన తండ్రి ఎక్కడ వస్తాడోననే భయముతో ఆ కన్నెలు, 'మేము మా వ్రతానుష్ఠానానికి వెంటనే వెళ్ళిపోవలెను' అంటూ ఆయనకు సాకు చెప్పి వెళ్ళిపోయినారు.

"ఆ భోగము పడుచులు అందరూ వెళ్ళిపోగానే, ఆ బ్రహ్మచారికి హృదయస్వాస్థ్యము తప్పిపోయింది. వారు మళ్ళీ కనబడతారో కనబడరోననే దిగులు పుట్టింది. అంతట ఆయన అటు ఇటు తిరగటము మొదలుపెట్టినాడు.

"ఆయన నియతబ్రహ్మచారి అయినప్పటికిన్నీ, ఆ మనోహరాంగనలు కనిపించిన చోటికి మర్నాడు మళ్ళీ వెళ్ళినాడు.

"ఋశ్యశృంగుడు రావడము ఆ భోగము కన్యలు చూచినారు. మహదానందముతో ఎదురుగుండా పోయినారు. ఎదురుకోలు చెప్పినారు. 'ఓ బుద్ధిమంతుడా! ఈనాడు నిన్ను మా ఆశ్రమపదానికి తీసుకొని పోవడానికి మేము వచ్చినాము. నీవు తప్పకుండా మా వెంట రావలెను. మేము నిన్ను నిన్నటికన్నా అక్కడ ఎక్కువగా సన్మానిస్తాము' అన్నారు. వారి మనోహర వాక్కులకు ఋశ్యశృంగుడు ముగ్ధుడు అయిపోయినాడు. వారి వెంట బయలుదేరడానికి ఇష్టపడ్డాడు.

"ఆ వారాంగనలు ఆ ఋశ్యశృంగుణ్ణి వెంటబెట్టుకొని అంగదేశానికి ప్రయాణము అయినారు.

"అంగదేశములో ఋశ్యశృంగుడు అడుగు పెట్టినాడు. దేశము అంతటా మబ్బులు పట్టినవి. ప్రజలు అందరూ ఆనందపరవశులు అయినారు. వానలు వెంటపెట్టుకొని వస్తూ ఉన్న ఋష్యశృంగుడికి రోమపాద మహారాజు ఎదురుగుండా పోయి సాష్టాంగ నమస్కారము చేసినాడు. శాస్త్రీయముగా అర్ఘ్యపాద్యాదులు ఇచ్చినాడు.

"ఆయనను అట్లా తన దేశము రావించినందుకు క్షమించవలసింది అనీ, ఆయనే కాకుండా ఆయన తండ్రి విభండక మహర్షి కూడా తనను మన్నించేటట్టు చేయవలసింది అనీ రోమపాదుడు నిర్మలాంతఃకరణముతో ప్రార్థించినాడు.

"ఋశ్యశృంగుడు ఎప్పటికీ తన అంతఃపురము వదలిపెట్టిపోకుండా ఉండటానికి ఆతరువాత రోమపాద మహారాజు తన కూతురు శాంతాదేవిని ఆయనకు ఇచ్చి యథావిధిగా వివాహము చేసి ప్రశాంత చిత్తుడు అయినాడు.

"రాజా! ఇప్పుడు ఋష్యశృంగుడు శాంతాదేవితో సమస్తసుఖాలూ అనుభవిస్తూ రోమపాదుడి అంతఃపురములో ఉంటూ ఉన్నాడు."

11

"రాజా! సనత్కుమార మహర్షి ఇంకా కొంత చెప్పినాడు. అదిన్నీ చెప్పుతాను. తాము వినవలెను. తమకు మేలు అవుతుంది అంటూ, సుమంత్రుడు ఇంకా ఈ విధముగా చెప్పడము మొదలు పెట్టినాడు :

"ఇక్ష్వాకు వంశములో శ్రీమంతుడూ, సత్యసంధుడూ, పరమధార్మికుడూ అయిన ఒక రాజు పుట్టుతాడు. ఆయనను అందరూ దశరధమహారాజు అని పిలుస్తారు. అదేకాలములో అంగదేశములో రోమపాదుడు అనే మహారాజు పుట్టుతాడు. వారి ఇద్దరికీ చాలా స్నేహము అవుతుంది. దశరధమహారాజుకు ఎంతకాలానికీ పిల్లలు పుట్టరు. ఆయన రోమపాద మహారాజు దగ్గరకు పోయి, 'రాజా! సంతానము కోసమున్నూ, వంశాభివృద్ధి కోసమున్నూ నేను ఒక మహాయజ్ఞము చేయతలచినాను. ఆ యజ్ఞము నాచేత చేయించే సామర్థ్యము నీ అల్లుడు ఋష్యశృంగుడికి ఒక్కడికే ఉంది. నీవు చెప్పేట్లయితే నీ అల్లుడు వచ్చి నా చేత ఆ యజ్ఞము చేయిస్తాడు. నాకు పిల్లలు పుట్టుతారు. కాబట్టి, నీవు చెప్పి నీ అల్లుణ్ణీ, నీ కూతురినీ నాతో పంపించవలెను' అని అడుగుతాడు.

"ఆ రోమపాద మహారాజు మహాబుద్ధిమంతుడు. మనసా ఆలోచిస్తాడు. ఎంతోమంది బిడ్డలను కన్న కూతురినీ, అల్లుడు ఋష్యశృంగుణ్ణీ దశరధమహారాజు వెంట పంపిస్తాడు. అంతటితో దశరథమహారాజుకు సంతానములేదే అనే మనస్తాపము వదిలిపోతుంది. మహాసంతోషముతో యజ్ఞము తలపెట్టుతాడు. ఆ యజ్ఞము నిర్విఘ్నముగా కొనసాగించవలెను అని ఋష్యశృంగుడికి దశరధమహారాజు నమస్కారము చేస్తాడు. ఆయనను పూజిస్తాడు. అప్పుడు ఆ బ్రాహ్మణోత్తముడు దశరధమహారాజు చేత పుత్రుల కోసము మరియొక కామ్యయజ్ఞము చేయిస్తాడు. దశరధమహారాజుకు నలుగురు పుత్రులు పుట్టుతారు. వారు అమిత పరాక్రమ వంతులూ, వంశప్రతిష్ఠానకరులూ, సకలలోక ప్రసిద్ధులూ అవుతారు అని పూర్వము కృతయుగములో మహాత్ముడు సనత్కుమారుడు చెప్పుతూ ఉండగా నేను విన్నాను. రాజా! మీరు పుత్రార్థులు. కాబట్టి, మీరు ఇప్పుడు చతురంగబలాలతో బయలుదేరి రోమపాదపురము పోయి ఋష్యశృంగుణ్ణి సత్కరించి, ఆయనను ఇక్కడికి తీసుకొని వచ్చి యజ్ఞము ఆరంభించడము మంచిది" అని సుమంత్రుడు చెప్పినాడు.

దశరధమహారాజు ఈవిషయము వశిష్ఠమహర్షితో సంప్రదించినాడు. "ఋష్యశృంగుణ్ణి తీసుకొని రావలసిందేను" అని వశిష్ఠమహర్షి ప్రోత్సాహము చేసినాడు.

అంతట దశరథమహారాజు మంత్రిసత్తములతోనూ పరివారముతోనూ రోమపాదపురానికి ప్రయాణము అయినాడు. అడవులనూ, మహానదులనూ ఒక్కొక్కటే మెల్లమెల్లగా దాటుకొంటూ అంగదేశము చేరినాడు.

స్నేహితుడు తన ఇంటికి వచ్చినందుకు రోమపాదుడు చాలా సంతోష పడ్డాడు. యథావిధిగా సమ్మానించినాడు. హోమకుండములో జ్వలించే అగ్నిహోత్రుడి

మాదిరిగా ఆ అంతఃపురములో దివ్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న ఋష్యశృంగుణ్ణి దశరథమహారాజుకు పరిచయము చేసినాడు. తనకూ, దశరథమహారాజుకూ ఉన్న సఖ్యాన్ని గురించీ, సంబంధాన్ని గురించీ రోమపాదుడు ఋష్యశృంగుడికి తెలియచెప్పినాడు. ఆ బుద్ధిశాలి ఋష్యశృంగుడు దశరథమహారాజును స్వయముగా గౌరవించి సత్కరించినాడు.

దశరథమహారాజు రోమపాదుడి సపర్యలను అనుభవిస్తూ అక్కడ ఏడు ఎనిమిది దినాలు గడపినాడు. అంతట రోమపాదుడితో, "రాజా! నేను సంతానము కోసము ఒక మహాక్రతువు తలపెట్టినాను. అది నా చేత చేయించగలవాడు నీ అల్లుడు ఋష్యశృంగుడు ఒక్కడేను. కాబట్టి నీ అల్లుణ్ణీ, నీ కూతురినీ నావెంట పంపించవలెను" అన్నాడు దశరథమహారాజు. అంతట రోమపాదుడు ఆ విషయము ఋష్యశృంగుడితో ప్రస్తావించినాడు. అందుకు ఆయన 'సరే' నని అన్నాడు.

రోమపాదుడున్నూ, దశరథమహారాజున్నూ ఆనందవరవశులు అయి అన్యోన్యమూ రొమ్ములుఅంట గట్టిగా కౌగలించుకొన్నారు. అంతట రోమపాదుడికి వీడ్కోలు చెప్పి, శాంతా ఋశ్యశృంగులను వెంటపెట్టుకొని దశరథమహారాజు అయోధ్యా నగరానికి ప్రయాణము అయినాడు. ఆయన ముందుగా దూతలను అయోధ్యా నగరానికి పంపించినాడు. వారు తమ ఏలిక ఋష్యశృంగుణ్ణి వెంట పెట్టుకొని వస్తూ ఉన్నట్టు అయోధ్యానగరవాసులకు తెలియచెప్పినారు. నగరములో ఎక్కడనూ దుమ్ము రేగకుండా అన్ని వీధులలోనూ నీళ్ళు చల్లినారు. ఘుమఘుమలాడే ధూపాలు వేసినారు. జండాలు ఎత్తినారు. పట్టణము అంతా శోభాయమానముగా అలంకరించినారు.

శంఖ దుందుభుల మోతలతో దశరథమహారాజు అయోధ్యా నగరమున ప్రవేశించినాడు. పౌరులు అందరూ తమ మహారాజును సత్కరించి, వెంటపెట్టుకొని వస్తూ ఉన్న ఋష్యశృంగుణ్ణి, శాంతాదేవిని సందర్శించినారు. సంతోషపడ్డారు.

దశరథమహారాజు ఆ దంపతులను తన అంతఃపురములోనికి తీసుకొని పోయి శాస్త్రపద్ధతిన సమ్మానించినాడు. అంతఃపురస్త్రీలు అందరూ ఆ పెద్ద పెద్ద కన్నుల శాంతాదేవిని చూచి ఆనందభరితులు అయినారు. ఆమెనూ, ఆమె పెనిమిటినీ వారు ఎంతో ఆదరించినారు. గౌరవించినారు. పూజించినారు.

అందరికన్నా ఎక్కువగా ఆ దంపతులను దశరథమహారాజు సత్కరించినాడు. వారు వచ్చినందువల్ల తాను కృతకృత్యుడు అయినట్టే భావించుకొన్నాడు.

అంతఃపురమువారి సపర్యలను అనుభవిస్తూ శాంతా ఋష్యశృంగులు కాలము గడపసాగినారు.

12

అశ్వమేధయాగ ప్రారంభము

మనోహరము అయిన వసంతకాలము వచ్చింది. యజ్ఞకర్మను ఇకను ఆరంభించవలెను అని దశరథమహారాజుకు బుద్ధి పుట్టింది.

ఋష్యశృంగుడికి నమస్కారము చేసి, "మహాత్మా! రఘువంశము పుత్రపౌత్ర పారంపర్యము వర్ధిల్లేటందుకు నా చేత యజ్ఞకర్మను ఆరంభము చేయించవలెను. తాము ఋత్విజులుగా ఉండి సాంగ్రహణేష్ఠిని ఉపక్రమించవలెను'అని ప్రార్థించినాడు.

ఋష్యశృంగుడు, "అట్లాగేను. మీరు యజ్ఞోపకరణాలను అన్నిటినీ సమకూర్చుకొని ఉన్నట్లయితే గుర్రాన్ని వదలవచ్చును" అన్నాడు.

అంతట దశరథమహారాజు, "పురోహితుడగు వశిష్ఠమహర్షినీ, వేదపారంగతులు అయిన వామదేవుణ్ణీ, జాబాలినీ, కాశ్యపుణ్ణీ ఇంకా ఇతర బ్రాహ్మణోత్తములను అందరినీ ఆహ్వానించి తీసుకొని రావలసింది" అని సుమంత్రుడితో చెప్పినాడు.

సుమంత్రుడు అప్పటికప్పుడుపోయి ఆ యా బ్రాహ్మణులను అందరినీ తీసుకొని వచ్చినాడు.

దశరథమహారాజు వారిని అందరినీ సత్కరించి, "ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! సంతానము కోసము అశ్వమేధ యాగము చేయవలెను అనే బుద్ధిపుట్టింది అని మీకు ఇదివరకే విన్నవించుకొన్నాను. మీరు అందరూ అందుకు నన్ను మెచ్చుకొన్నారు. ఇప్పుడు ఇక్కడికి ఋష్యశృంగ దంపతులున్నూ వచ్చి ఉన్నారు. మీ అందరి ప్రభావము వల్ల నా కోరికలు అన్ని ఈడేరుతవి అనుకొంటున్నాను. ఇప్పుడు మీరు అందరూ యజ్ఞకార్యనిర్వహణానికి పూనుకోవలెను" అని చెప్పినాడు.

"బాగుంది, బాగుంది. సంతోషము" అని వశిష్ఠమహర్షీ, తక్కిన బ్రాహ్మణోత్తములూ అన్నారు. వారు అందరూ ఋష్యశృంగుడితో ఆలోచించి దశరథమహారాజుతో, "ఓ రాజా! సంతానము కోసము తమకు ఇటువంటి ధార్మికము అయిన బుద్ధి పుట్టింది. తమకు తప్పకుండా నలుగురు పుత్రులు పుట్టుతారు" అన్నారు. వారి మాటలకు దశరథమహారాజు ఉప్పొంగిపోయినాడు.

"ఓ మంత్రిసత్తములారా! ఈ గురూద్వహులూ, ఈ బ్రాహ్మణోత్తములూ చెప్పే యజ్ఞసంభారాలు అన్నిటినీ సమకూర్చవలెను. ఋత్విజులతోనూ, సమర్థులు అయిన సైనికులతోనూ గుర్రాన్ని వదలవలెను" అన్నాడు దశరథమహారాజు.

రాజాజ్ఞను అనుసరించి ఆ మంత్రిపుంగవులు ఆ యా పనులు నెరవేర్చటము మొదలు పెట్టినారు. బ్రాహ్మణులు అందరూ వారి వారి పనులను చక్కపెట్టసాగినారు.

చైత్రపౌర్ణమినాడు సాంగ్రహణేష్టికర్మను ఆరంభించినారు. మరునాడు బ్రహ్మోదనమూ, ఉత్తమాశ్వబంధప్రోక్షణ విమోచనమూ చేయించినారు.

13

ఒక సంవత్సరము అయిపోయింది. మళ్ళీ వసంతకాలం వచ్చింది. దశరథమహారాజు యజ్ఞవాటానికి బయలుదేరినాడు.

యజ్ఞవాట నిర్మాణానికి పూర్వము దశరథమహారాజు వశిష్ఠమహర్షికి నమస్కారము చేసి, "ఓ మహర్షీ! తాము పూజ్యులు. నా కులగురువులు. అంతేకాదు, తాము నాకు పరమాప్తులు. ఈ యజ్ఞము యథాశాస్త్రముగానూ, నిర్విఘ్నముగానూ కొనసాగించేటందుకు తాము ప్రత్యేకముగా పూనుకొనవలెను. ఈ కార్యనిర్వహణ భారము అంతా తామే వహించవలెను" అని ప్రార్థించినాడు.

"రాజా! నీవు కోరినట్టు సర్వమూ నిర్వహిస్తాను" అని వశిష్ఠమహర్షి దశరథమహారాజుతో చెప్పి, యజ్ఞకార్యనిర్వాహకులు అయిన బ్రాహ్మణవృద్ధులనూ, వృద్ధులూ పరమధార్మికులూ అయిన యజ్ఞద్రవ్యసమీకరణాధికారులనూ, ఆ యా కర్మకారులనూ, ఇటుకలూ మొదలు అయినవి చేసే శిల్పకారులనూ, యూపస్తంభాది యజ్ఞసాధనాలు చేసే వడ్రంగులనూ, శస్త్రవిదులూ బహుశ్రుతులూ అయిన రాజ పురుషులనూ, చిత్రకారులనూ, నృత్యముచేసేవారినీ సమావేశపరచి, "ఓ కార్మికులారా! దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు. యజ్ఞములో మీరు అందరూ మీ మీ పనులను చక్కగా నెరవేర్చవలెను. మున్ముందుగా లక్షలకొద్దీ ఇటులకను తీసుకొని వచ్చి ఆ యా దేశాధీశులు యజ్ఞ సమయములో నివసించడానికి మేడలవంటి అనువు అయిన సౌధములను నిర్మించవలెను. వాతవర్షాదులకు చెక్కుచెదరకుండా ఉండే బ్రాహ్మణ విడుదులను వందలకొద్దీ వేయవలెను. ఆ యా విడుదులలో వివిధభక్ష్యాన్నపానాది వసతులను అమర్చవలెను. నాగరులు నివసించడానికి విశాలము అయిన విడుదులను వేసి వాటిలో వివిధభక్ష్యాలనూ, ఇంకా అవసరము అయిన అన్నిరకాల తినుబండారాలనూ ఉంచవలెను. అదేవిధముగా జానపదులకున్నూ నివాసాలను ఏర్పాటు చేయవలెను. అందరికీ అత్యంత ఆదరముతో అతిరుచ్యము అయిన అన్నము పెట్టవలెను. అత్యంత శ్రేష్ఠము అయిన బియ్యమే ఉపయోగించవలెను. ఎవరినీ అనాదరముతో చూడకూడదు. అన్నికులాలవారినీ చక్కగా సత్కరించవలెను. వారి వారి యోగ్యతలనుబట్టి అందరినీ గౌరవించవలెను. కోపమువచ్చికానీ, కామాసక్తివల్లకానీ ఎవరినీ చులకన చేయకూడదు.

"ఈ యజ్ఞకార్యనిర్వాహకులు అయిన మీకు అందరికీ మృష్టాన్న భోజనము ఏర్పాటుచేయడము అయింది. ఇంకా మీకు ధనమున్నూ ఇవ్వడము అవుతుంది. మీ మీ యోగ్యతలను బట్టి మీకు రాజసన్మానమున్నూ జరుగుతుంది. కాబట్టి, మీరు యావన్మందీ ఏ ఒక్క చిన్న పనినీ వదలిపెట్టకుండా సమస్తమూ ప్రేమార్ద్రహృదయాలతో చేయవలెను" అని ఉపదేశించినాడు.

ఆ యా కర్మకారులు అందరూ వారి వారి పనులను శ్రద్ధాసక్తులతో చేయడము మొదలుపెట్టినారు.

అంతట వశిష్ఠమహర్షి సుమంత్రుణ్ణి పిలిచి, "మంత్రిసత్తమా! నీవు సమస్త దేశాధీశులనూ, ఆ యా దేశాల బ్రాహ్మణులనూ, క్షత్రియులనూ, వైశ్యులనూ, శూద్రులనూ, ఇంకా ఇతరులను అందరినీ ఈ యజ్ఞానికి ఆహ్వానించవలెను. అశేషజనమూ ఈ యజ్ఞము చూడడానికి వచ్చేట్లు నీవు ప్రోత్సహించవలెను.

"ఓ సుమంత్రుడా! మిథిలాధిపతి జనకమహారాజు మహాశూరుడు. సత్యసంధుడు. సర్వశాస్త్రవిదుడు. వేదాధ్యయన పరాయణుడు. ఆయన మన మహారాజుకు చిరకాల మిత్రుడు. ఆయనను నీవు స్వయముగా ఆహ్వానించవలెను. అదేవిధముగా, కాశీరాజును నీవు స్వయముగా పిలువవలెను. ఆయన మంచి మాటకారి. మన మహారాజుకు ముఖ్య స్నేహితుడు. కేకయమహారాజు మన మహారాజుకు పిల్లను ఇచ్చిన మామగారు. పరమధార్మికుడు. వృద్ధుడు. ఆయననూ, ఆయన కుమారుణ్ణీ నీవు స్వయముగా ఆహ్వానించవలెను. మన మహారాజుకు అంగదేశాధీశుడు రోమపాదుడు మరి ఒక ముఖ్య మిత్రుడు. పయిగా ఆయన ఋష్యశృంగుడి మామగారు. నీవు ఆయనను చక్కగా సత్కరించి, ఆహ్వానించి వెంటపెట్టుకొని రావలెను.

"ఈ చెప్పినవారినే కాకుండా తూర్పుతీరపు రాజులనూ, సింధు సౌవీర, సౌరాష్ట్రాధిపతులనూ, మిగతా రాజులనూ వారి వారి పరివార బంధు మిత్ర పుత్ర కళత్రయుతముగా ఆహ్వానించి, వారు అందరూ ఈ యజ్ఞానికి వచ్చేట్లు చేయవలెను" అని చెప్పినాడు.

అంతట సుమంత్రుడు వశిష్ఠమహర్షి అనుజ్ఞతో ఆ యా రాజులను అందరినీ ఆహ్వానించడానికి సుగుణసంపన్నులను పంపించి, స్వయముగా ఆహ్వానించవలసిన వారికోసం తాను ప్రయాణము అయిపోయినాడు.

అచిరకాలములో ఆ యా కర్మకారులు వారి వారి పనులను చక్కగా నెరవేర్చినారు. వారు అందరూ వశిష్ఠమహర్షి దగ్గరకుపోయి, "ఓ మహర్షీ! తాము

చెప్పిన పనులను అన్నిటినీ ఏ ఒక్క చిన్న లోపము లేకుండా పూర్తి చేసినాము. తాము వచ్చి పరిశీలించవలెను" అని విన్నవించినారు.

ఆ యా కర్మకారులు నిర్మించిన యజ్ఞవాటికను వశిష్ఠమహర్షి పరిశీలించినాడు. వారి కౌశల్యాన్ని మెచ్చుకొన్నాడు. రాజపురుషులను చూచి, "మీరు ఇక్కడికి వచ్చేవారిని అందరినీ చక్కగా సత్కరించవలెను. ఎవరు ఏది అడిగినా అత్యంతాదరముతోనూ, శ్రద్ధతోనూ అందజేయవలెను. అనాదరముతోనూ, అశ్రద్ధతోనూ చేసే దానము దాతకు అపకారము చేస్తుంది. కాబట్టి, మీరు మీ మీ పనులను శ్రద్ధాసక్తులతో చక్కపెట్టవలెను" అని చెప్పినాడు.

కొన్ని అహోరాత్రములు గడిచిపోయినవి. ఆ యా దేశాధీశులు అందరూ దశరథమహారాజుకు రత్నాలు మొదలు అయిన కానుకలు తీసుకొని అయోధ్యా నగరానికి వచ్చినారు.

వశిష్ఠమహర్షి దశరథమహారాజును చూచి పరమానందముతో, "రాజా! వివిధ దేశాధీశులూ యజ్ఞము చూడవచ్చినారు. ఆ యా రాజుల అర్హతలనుబట్టి వారి వారిని అందరినీ నేను సత్కరించినాను. యజ్ఞనిర్వాహకులు అయిన రాజపురుషులు మహోత్సాహముతో వారి వారి పనులను నిర్వర్తించినారు. యజ్ఞశాల మనోవేగముతో నిర్మాణము అయిపోయింది. అది దర్శనీయముగానూ, సర్వసమృద్ధముగానూ ఉంది. నీవు ఇక యజ్ఞశాలకు బయలుదేరవలెను" అన్నాడు.

ఋష్యశృంగుడూ, వశిష్ఠమహర్షీ నిర్ణయించిన శుభదినాన, శుభనక్షత్రాన దశరథమహారాజు యజ్ఞశాల ప్రవేశించినాడు.

వశిష్ఠమహర్షి మొదలు అయిన బ్రాహ్మణులు ఋష్యశృంగుడి ఆధ్వర్యాన యథాశాస్త్రముగా, యథాక్రమముగా యజ్ఞకర్మను ఆరంభించినారు.

14

ఒక సంవత్సరము అయిపోతూ ఉండగా, దేశముమీద విడిచి పెట్టిన గుర్రము తిరిగి వచ్చింది.

వేదవిదులు అయిన బ్రాహ్మణులు ఋష్యశృంగుణ్ణి పెద్దను చేసి, సరయూనది ఉత్తరతీరాన దశరథమహారాజు యజ్ఞవాటికలో అశ్వమేధానికి సంబంధించిన ఆ యా కర్మలు అన్నిటినీ చేయించ నారంభించినారు. వేదాలలో చెప్పినట్టుగానూ శాస్త్రీయముగానూ, కల్పసూత్రవిహితముగానూ, మీమాంసా న్యాయాన్ని వ్యతిక్రమించకుండానూ సమస్తకర్మలు చేయసాగినారు. ప్రవర్గ్యమూ, ఉపసదమూ

మొదలు అయిన కర్మలు అన్నీ ఏలోపమూ లేకుండా చేసివేసినారు. అంతట బ్రాహ్మణోత్తములు అందరూ సంతోషముతో ఆ యా కర్మాధిదేవతలను ఆరాధించి ప్రాతస్సవనమూ మొదలు అయిన కర్మలను అన్నిటినీ యధావిధిగా పూర్తిచేసినారు. ఇంద్రదేవతాకము అయిన హవిర్భాగాన్ని యథాశాస్త్రముగా ఇచ్చివేసినారు. పూజ్యము అయిన సోమలతను స్తోత్రము చేసినారు. యధాక్రమముగా మాధ్యందినసవనము జరిగిపోయింది. అదే విధంగా శాస్త్రీయముగా తృతీయ సవనమున్నూ సాగిపోయింది. హోమము చేయడములో చెయ్యిజారి తప్పిపోయిందికానీ, చేయవలసింది లోపించిపోయిందికానీ ఏదీ లేదు. సమస్తమూ సమంత్రకముగా సమాప్తము అయింది. అంతా సంతోషముగా, సుఖముగా జరిగిపోయింది.

అపండితుడు అయిన బ్రాహ్మణుడు ఒక్కడున్నూ ఆ యజ్ఞశాలలో ఎక్కడనూ కనిపించలేదు. అందరూ వేదాధ్యయనము చేసినవారే. శిక్షా వ్యాకరణ చ్ఛందో నిరుక్త జ్యోతిష కల్పాలు అనే వేదాంగాలను ఆరింటినీ అందరూ కరతలామలకము చేసుకొన్నవారే. అందరూ బ్రహ్మచర్యాదివ్రతానుష్ఠానపరులే. అందరూ వాదకుశలురే. వారు అందరూ ఆ యా కర్మకలాపాల మధ్య విరామ సమయాలలో పరస్పర విజిగీషతో అనేకవిషయాలను గురించి హేతువాదాలు చేస్తూ ఉండేవారు.

ఇటువంటి బ్రాహ్మణులే కాకుండా, కనీసము ఒక వందమంది పరివారము ఆయినా లేని రాజున్నూ ఆ యజ్ఞశాలలో కనిపించలేదు.

ఆ యజ్ఞము జరిగిన అన్నిరోజులలోనూ ఆకలిగొన్నవాడుకానీ, దప్పిక గొన్నవాడుకానీ ఒక్కడున్నూ కనిపించలేదు. ఆ యజ్ఞవాటికలో ప్రతిరోజూ బ్రాహ్మణులూ, క్షత్రియులూ, వైశ్యులూ, శూద్రులూ, తాపసులూ, శ్రమణులూ (దిగంబర సన్యాసులూ) భోజనము చేసినారు. అన్నికులాల స్త్రీలకూ, పిల్లలకూ, వృద్ధులకూ ప్రత్యేకముగా భోజనము పెట్టినారు. అదేవిధముగా జబ్బుపడిన వారికి పథ్యపానాదులు ఏర్పాటుచేసినారు.

పాకశాస్త్రనిపుణులు శాస్త్రీయముగా వంట చేసేవారు. ప్రతిరోజూ ఎప్పటికి అప్పుడు అక్కడ కొండలంతలేసి అన్నపురాసులూ, భక్ష్యపురాసులూ సిద్ధము అవుతూ ఉండేవి. చక్కగా అలంకారము చేసుకొన్నవారు అన్నము మొదలయిన పదార్థాలను వడ్డన చేసేవారు. ఆ వడ్డన చేసేవారికి మణికుండలాలు ధరించిన తేజోవంతులు ఆ యా పక్వ పదార్థాలను అందించేవారు. దేశదేశాలనుంచి వచ్చిన స్త్రీలూ, పురుషులూ అందరూ ఆ పాక రుచి అపూర్వముగా ఉంది అని మెచ్చుకొన్నారు. ఆ అన్నదానానికి అందరూ అబ్బురపడిపోయినారు.

ఆవిధముగా అంతమందికి, అంత చక్కగా అన్నదానము చేస్తూ ఉన్నప్పటికిన్నీ, ఎక్కడ ఎవరికి ఏ లోపము జరుగుతుందోనని దశరథమహారాజు ఎప్పుడూ ఏమరుపాటు లేకుండా వారివారిని హెచ్చరిస్తూ ఉండేవాడు. అందరికీ అన్నం పెట్టవలసింది. వారి వారి అర్హతలూ, యోగ్యతలనుబట్టి అందరికీ నూత్న వస్త్రాలు ఇవ్వవలసింది అనే కేకలు ఆ యజ్ఞశాలలో ఎప్పుడూ వినిపిస్తూ ఉండేవి. అందరినీ ఆదరించి, అన్నము పెట్టి నూత్న వస్త్రాలు కట్టబెట్టినారు. దేశదేశాల స్త్రీలూ, పురుషులూ తనివితీర ఆ యజ్ఞశాలలో భోజనము చేసినారు. అందరూ దశరథమహారాజును చూచి, "ఓ రాజా! పాకము మహారుచ్యముగా ఉంది. ఎంతో ఆదరముతో అన్నము పెట్టినారు. మేము తృప్తిగా భోజనము చేసినాము. రాజా! నీకు శుభము అవుతుంది" అని ప్రశంసించినారు.

యజ్ఞకోవిదులు పని తెలిసిన వడ్రంగులచేత శాస్త్రములో చెప్పినట్లుగా ఎనిమిది అంచులు తేలేటట్టు యూప స్తంభాలను చక్కగా నున్నగా చెక్కించినారు. వాటిలో ఆరింటిని మారేడు మానుతోనూ, ఇంకొక ఆరింటిని చండ్ర మానుతోనూ, మరి ఒక ఆరింటిని మోదుగ మానుతోనూ, ఒక దానిని విరిగిచేవ కర్రతోనూ, మిగతా రెంటినీ దేవదారు మానుతోనూ పిడివెలితి ఇరవైఒక్క మూరలు ఉండేటట్టుగా చేయించినారు. బారెడు బారెడు దూరాన వాటిని పాతిపెట్టించినారు. శోభాయమానముగా కనిపించడానికి బంగారు సొమ్ములతో వాటిని అలంకరించినారు. గుడ్డలు కట్టి మంచిగంధము పూసినారు. ఆకాశములో సప్తర్షుల మాదిరిగా, ఆ యజ్ఞశాలలో ఆ యూప స్తంభాలు మెరిసిపోయినవి.

శాస్త్రములో చెప్పిన కొలతల ప్రకారము బ్రాహ్మణులు ఇటుకరాళ్ళను తీయించినారు. నూలుతాడు పట్టి కట్టుబడిపనిచేసే బ్రాహ్మణులు ఆ ఇటుకరాళ్ళతో అగ్ని వేదిని గరుడపక్షి రూపాన నిర్మించినారు. ఆ యా దేవతలను ఉద్దేశించి శాస్త్రములో చెప్పినట్లుగా పశువులనూ, పాములనూ, పక్షులనూ, జలచరాలనూ, మొత్తము మున్నూరు జంతువులనూ, దశరథమహారాజు ఉత్తమాశ్వాన్నీ ఆ యూప స్తంభాలకు కట్టివేసినారు.

అప్పుడు దశరథమహారాజు పట్టపురాణి కౌసల్యాదేవీ, సుమిత్రా, కైకేయీలు వచ్చి ఆ గుర్రానికి ప్రదక్షిణము చేసినారు. వారు ముగ్గురున్నూ మూడు బంగారు కత్తులతో ఆ గుర్రానికి గాట్లు పెట్టినారు. అది పడిపోయింది. ఆ పడిపోయిన గుర్రము దగ్గిర కౌసల్యాదేవి మనోదార్ఢ్యముతో ధర్మసిద్ధి కోసము ఆ రాత్రి అంతా గడిపింది.

అంతట దశరథమహారాజు హోతకు పట్టమహిషినీ, ఆధ్వర్యవుకు పతివృత్తినీ, ఉద్గాతకు వావాతనూ, బ్రహ్మకు సాలాకలనీ దక్షిణగా ఇచ్చినాడు. ఆ నల్గురు ఋత్విజులున్నూ ఆ నలుగురు స్త్రీలకు ఏర్పాటుచేసిన ఓలిని ప్రతినిధి దానముగా పుచ్చుకొని, వారిని తిరిగి దశరథమహారాజుకు ఇచ్చివేసినారు.

ఆధ్వర్యవు ప్రయోగ చతురుడు. ఆయన ఏకాగ్రచిత్తముతో ఆ గుర్రము మెదడు తీసి శాస్త్రీయముగా పక్వము చేసినాడు. ఆ వపను హోమముచేసే సమయములో వచ్చిన ధూపాన్ని పాపపరిహారార్థము దశరథమహారాజు ఆఘ్రాణించి నాడు. మంత్రవేత్తలు అయిన పదహారుగురు ఋత్విజులున్నూ అప్పుడు ఆ గుర్రము అవయవాలను అన్నిటినీ యథాశాస్త్రముగా హోమము చేసినారు.

అన్ని యజ్ఞాలలోనూ హవిస్సును జువ్వికట్టెలతో పాకము చేస్తారు. అశ్వమేధములో అట్లా కాదు. ప్రబ్బలి తీగలతో హోమము చేస్తారు. అదేవిధముగా, దశరథమహారాజు చేస్తున్న అశ్వమేధములో చేసినారు. కల్పసూత్రాలలోనూ, బ్రాహ్మణాలలోనూ అశ్వమేధము మూడు దినాల యజ్ఞము అని చెప్పి ఉంది. మొదటి దినము చతుష్టోమము అనీ, రెండవ దినము ఉక్థ్యము అనీ, మూడవ దినము అతిరాత్రము అనీ అంటారు. ఆ మూడు రోజులలో చేయవలసిన క్రతువులే కాకుండా, శాస్త్రాంతరాలలో చెప్పిన క్రతువులను కూడా తలపెట్టి ఒక జ్యోతిష్టోమము, ఒక ఆయుర్యాగమూ, రెండు అతిరాత్రములూ, ఒక అభిజిద్యాగమూ, ఒక విశ్వజిద్యాగమూ, ఒక ఆప్తోర్యామమూ చేసినారు.

అశ్వమేధ కర్మలు అన్నీ అయిపోయినవి. అంతట దశరథమహారాజు క్రతుఫలము తనకు పూర్తిగా లభించేటందుకు, పూర్వము అశ్వమేధము చేసిన బ్రహ్మదేవుడు మాదిరిగా భూదానము చేయ సంకల్పించుకొన్నాడు. తన రాజ్యములో తూర్పు భాగాన్ని అంతా హోతకున్నూ, పడమటి భాగాన్ని అంతా ఆధ్వర్యవుకున్నూ, దక్షిణ భాగాన్ని అంతా బ్రహ్మకున్నూ, ఉత్తర భాగాన్ని అంతా ఉద్గాతకున్నూ దానము ఇచ్చినాడు. యథావిధిగా యజ్ఞము సమాప్తము చేసినాడు. అంతట ఋత్విజులు అందరూ నిష్కళంకుడుగా ఉన్న దశరథమహారాజును చూచి, "ఓ రాజా! ఈ రాజ్యాన్ని అంతా మీరే పరిపాలించవలెను. ఈ సామర్థ్యము మీకు ఒక్కరికే ఉంది. మాకు రాజ్యపాలనా సామర్థ్యము ఏమాత్రమూ లేదు. మేము ఎప్పుడూ వేదాధ్యయనము చేసుకొంటూ ఉంటాము. అందువల్ల, మాకు మీ రాజ్యముతో ప్రయోజనము ఏమీ లేదు. మీ రాజ్యానికి బదులు ఏ కొంచెము మూల్యము మాకు ఇచ్చినా మేము సంతోషిస్తాము. మణులుకానీ, బంగారముకానీ, కాకపోతే మీకు తోచేది ఏమి అయినా కానీ మాకు ఇవ్వవలసింది. మీ రాజ్యము మాకు అక్కరలేదు" అన్నారు.

దశరథమహారాజు అప్పుడు ఆ వేదపారంగతులకు పదిలక్షల ఆవులనూ, నూరుకోట్ల బంగారాన్నీ, దానికి నాల్గు అంతల వెండినీ దానము ఇచ్చినాడు. వారు ఆ ధనాన్ని అంతా ఋష్యశృంగుడికీ, వశిష్ఠమహర్షికీ ఒప్పచెప్పి తమ తమ అర్హతలకు తగినట్టు పంచిపెట్టవలసింది అని కోరినారు. వారు ఉభయులున్నూ ఆ ధనాన్ని వారికి న్యాయముగా పంచిపెట్టినారు.

ఋత్విజులకే కాకుండా ఆ యజ్ఞానికి వచ్చిన అతిథులూ, అభ్యాగతులూ మొదలయినవారికి అందరికిన్నీ దశరథమహారాజు జంబూ నదిలో పుట్టిన బంగారాన్ని ఒక కోటి దానము చేసినాడు. అందరికీ అన్నీ దానము చేసివేసిన తరువాత ఏమీ ముట్టని ఒక పేదబ్రాహ్మణుడు వచ్చి చెయ్యి చాచినాడు. అప్పుడు దశరథమహారాజు దగ్గర ఏమీ లేకపోయింది. తన ముంజేతి మురుగులు తీసి దానముగా ఇచ్చి వేసినాడు. ఆయన ద్విజవత్సలుడు. బ్రాహ్మణులను అందరినీ సంతృప్తి పరచినాడు. ఆనందపరవశుడు అయినాడు. ఆ బ్రాహ్మణోత్తములకు అందరికీ సాష్టాంగ నమస్కారము చేసినాడు. వారు అందరూ అమిత శ్రద్ధాసక్తులతో ఆయనను వేదోక్తముగా ఆశీర్వదించినారు.

ఏ రాజున్నూ సులభముగా చేయలేని అశ్వమేధయాగాన్ని దశరథమహారాజు ఏ లోపమూ లేకుండా యథావిధిగా సమాప్తము చేసినాడు. సంతుష్టుడు అయినాడు. ఆయన అంతట ఋష్యశృంగమహర్షిని చూచి, "ఓ సువ్రతా! తాము నాచేత పాపపరిహారార్థము నిర్విఘ్నముగా అశ్వమేధము చేయించినారు. ఇకను వంశాభివృద్ధి కోసము నాచేతను ఏది అయినా ఒక కర్మను చేయించ కోరుతున్నాను. అటువంటి కర్మను చేయించడానికి తాము ఒక్కరే సమర్థులు" అన్నాడు.

"ఓ రాజా! సంతానము కోసము ఇప్పుడే మీచేత మరి ఒక కర్మ చేయిస్తాను. మీకు నల్గురు పుత్రులు పుట్టుతారు. ఆ నల్గురున్నూ వంశోద్ధారకులు అవుతారు" అన్నాడు ఋశ్యశృంగుడు.

15

పుత్రకామేష్టి యాగము

ఋశ్యశృంగుడు మహామేధాసంపన్నుడు. పుత్రోత్పత్తికి ఏ యజ్ఞము చేయించడమా అని క్షణలేశము ఆలోచించినాడు. చప్పున స్ఫురించింది. దశరథమహారాజుని చూచి, "ఓ రాజా! మీకు పుత్రులు పుట్టడానికి అథర్వశిరస్సులో చెప్పి ఉన్న మంత్రాలలో ఒక ఇష్టిని చేయబోతున్నాను" అన్నాడు.

పుత్రకామేష్టి (యాగము) ఆరంభించి, వేదమంత్రాలతో హోమము చేయడము మొదలుపెట్టినాడు.

రావణ ప్రస్తావన

అప్పుడు అక్కడికి వారి వారి హవిర్భాగాలను తీసుకొని పోవడానికి దేవతలూ, మహర్షులూ, సిద్ధులూ వచ్చినారు. వారికన్నా ముందుగా అక్కడికి బ్రహ్మదేవుడు వచ్చి కూర్చున్నాడు. దేవతలు మొదలు అయినవారు అందరూ బ్రహ్మదేవుణ్ణి చూచి, "ఓ లోకకర్తా! ఈ భూలోకములో రావణుడు అనే రాక్షసుడు తమ అనుగ్రహమువల్ల అమితపరాక్రమవంతుడు అయిపోయినాడు. మమ్ములను మహాబాధలు పెట్టుతూ ఉన్నాడు. వాణ్ణి మేము శాసించలేకుండా ఉన్నాము. ప్రేమాతి శయముతో తాము వాడికి ఇదివరలో ఎన్నో వరాలు ఇచ్చినారు. అందువల్ల, వాడు పెట్టే బాధలు అన్నీ మేము భరించవలసి వచ్చింది. వాణ్ణి మేము గౌరవించవలసి వచ్చింది. ఆ దుర్మతి ముల్లోకాలనూ తల్లడిల్లచేస్తూ ఉన్నాడు. లోకపాలకులను అందరినీ తిరస్కరిస్తూ ఉన్నాడు. దేవేంద్రుణ్ణి పరాభవించ తలపెట్టినాడు. వాడు మదించిపోయినాడు. వాణ్ణి ఎదిరించడానికి మాకు శక్యము కాకుండా ఉంది. వాడు ఒళ్ళు తెలియక ఋషులనూ, గంధర్వులనూ, యక్షులనూ, బ్రాహ్మణులనూ అవమానిస్తూ ఉన్నాడు.

"ఆ రావణాసురుడికి సూర్యుడు భయపడిపోయి ఎండ కాయడము లేదు. గాలి వీచడము లేదు. వాణ్ణి చూచి సముద్రములో అలలు ఆగిపోతూ ఉన్నవి. వాడు మహాభయంకరుడు అయినాడు. వాణ్ణి సంహారముచేసే ఉపాయము ఏది అయినా మీరు మాకు చెప్పవలెను" అని మొరపెట్టుకొన్నారు.

బ్రహ్మదేవుడు వారి మొర ఆలకించి, "ఓ దేవతలారా! ఆ దురాత్ముణ్ణి సంహారము చేసే ఉపాయము నాకు ఇప్పుడు తోచింది. దేవ దానవ రాక్షసులచేతకానీ, యక్ష గరుడ గంధర్వులచేతకానీ తనకు చావు రాకూడదు అని వాడు నన్ను వరము అడిగినాడు. నేను అట్లాగేను అన్నాను. మానవులచేత తనకు చావు మూడకూడదు అనే వరము వాడు నన్ను అడగలేదు. బహుశః వాడు మానవులను లెక్కచేసి ఉండడు. అందువల్ల, మానవుడు ఎవడు అయినా వాణ్ణి చంపివేయవచ్చును. అంతకన్నా మరి ఒక విధముగా వాడికి చావు రాదు" అన్నాడు.

బ్రహ్మదేవుడు చెప్పిన ఈ రహస్యానికి దేవతలూ, మహర్షులూ సంతోషించినారు.

ఆ సమయములో పీతాంబరముతో ధగధగలాడుతూ శంఖమూ, చక్రమూ గదా పట్టుకొని మహావిష్ణువు అక్కడికి వచ్చినాడు. బ్రహ్మదేవుడి సరసను కూర్చున్నాడు. దేవతలు మొదలయినవారు అందరూ చేతులు జోడించి, "ఓ మహావిష్ణూ! లోకహితము కోసము తాము ఒక పని చేయవలెను. రావణుడు అనే రాక్షసుడు లోకభీకరుడు

అయిపోయినాడు. మేము ఎవరమూ వాణ్ణి ఎదిరించలేకుండా ఉన్నాము. బ్రహ్మదేవుడు ఇచ్చిన వరాలవల్ల వాడు పొగరెక్కి పోయినాడు. గర్వాంధుడు అయినాడు. మహాభయంకరుడున్నూ అయినాడు. దేవేంద్రుణ్ణి ద్వేషిస్తున్నాడు. తాపసోత్తములకు కంటకుడు అయినాడు. మునులనూ, ఋషులనూ నానాబాధలూ పెట్టుతూ ఉన్నాడు. నందనోద్యానవనములో గంధర్వులతో క్రీడించే అప్సరసలను హింసిస్తూ ఉన్నాడు. ఎక్కడెక్కడి స్త్రీలనూ ఎత్తుకొనిపోతూ ఉన్నాడు. ముల్లోకాలవారినీ ఏడిపిస్తూ ఉన్నాడు. అందరికీ భయావహుడు అయిపోయినాడు. ఆ రావణాసురుణ్ణీ, వాడి సైన్యాలనూ, వాడి బంధువులనూ తాము నాశనము చేసి, ఓ స్వామీ! మా బాధలను తీర్చవలెను. ఓ పరంతపా! మేము అందరమూ మీ శరణు జొచ్చినాము. మీకన్నా మాకు వేరే దిక్కు లేదు. మీరు మమ్ములను రక్షించవలెను" అని ప్రార్థించినారు.

మహావిష్ణువుకు సమస్తమూ తెలిసినప్పటికిన్నీ, రావణవధోపాయము చెప్పమని మధురవాక్కులతో దేవతలను ప్రశ్నించినాడు. అంతట దేవతలు అందరూ, "ఓ శత్రుసంహారకా! రావణ సంహారము చేయడానికి తాము మానవజన్మము ఎత్తవలెను. ఆ రావణాసురుడు పూర్వము చాలాకాలము తీవ్రము అయిన తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించినాడు. ఈ ప్రపంచములో నానావిధప్రాణులవల్లనూ తనకు చావు మూడకుండా ఉండేట్టు వరము అడిగినాడు. బ్రహ్మదేవుడు వాడికి ఆ వరము ఇచ్చినాడు. మానవులు అంటే వాడికి లెక్కలేకనో ఏమో, మానవుల నుంచి తనకు చావు రాకూడదు అనే వరము వాడు బ్రహ్మదేవుణ్ణి అడగనూ లేదు, బ్రహ్మదేవుడు వాడికి అటువంటి వరము ఇవ్వనూ లేదు. కాబట్టి, ఆ రావణాసురుణ్ణి సంహారము చేయడానికి మానవులకు తప్ప మరి ఒకరికి సాధ్యము కాదు" అన్నారు.

మహావిష్ణువు ఈలోకములో ఎవరి ఇంట జన్మము ఎత్తడమా అని ఆలోచించసాగినాడు. దేవతలు అందరూ ఆయన ఆలోచనను గమనించి, "ఇప్పుడు ఇక్కడ యజ్ఞము చేస్తూ ఉన్న ఆ అయోధ్యాధిపతి దశరథమహారాజు ధర్మజ్ఞుడు, వదాన్యుడు, మహర్షిసమ తేజోవంతుడు. ఈయనకు ముగ్గురు భార్యలు ఉన్నారు. వారు దక్షప్రజాపతి కూతుళ్ళు హ్రీ, శ్రీ, కీర్తి వంటివారు. తాము నాలుగు భాగాలుగా మారిపోయి ఆ ముగ్గురు ఇల్లాండ్ర కడుపులోను పుట్టకోరుతున్నాము" అన్నారు.

మహావిష్ణువు దేవతల కోరికను అంగీకరించినాడు. దశరథమహారాజును తండ్రిగా వరించినాడు.

"ఓ దేవతలారా! మీరు భయపడవద్దు. మీకు మేలు చేస్తాను. మీరు హాయిగా ఉండటానికి నేను మానవజన్మము ఎత్తి, ఆ రావణాసురుణ్ణి పుత్ర మిత్ర

జ్ఞాతి బాంధవ సహితముగా యుద్ధభూమిలో సంహారము చేసివేస్తాను. మానవుణ్ణిగా బహుకాలము ఈ భూమిని ఏలుతాను" అంటూ మహావిష్ణువు అంతర్ధానము అయినాడు.

అప్పుడు ఏకాదశరుద్రులూ, దేవతలూ, అప్సరసలూ మహావిష్ణువును స్తోత్రము చేసినారు.

16

దశరథమహారాజు చేస్తూ ఉన్న పుత్రకామేష్టి పూర్తి అవుతూ ఉన్నది. అప్పుడు హోమగుండములోనుంచి కన్నులు మిరుమిట్లు గొలిపే కాంతులతో ఒక భూతము బయలుదేరింది. అది పురుషాకారముగా తోచింది. ప్రియభార్యను కౌగలించు కొన్నట్టుగా ధగధగలాడుతూ ఉన్న బంగారు గుండిగను ఆ పురుషుడు తన రెండు చేతులా కౌగలించి పట్టుకొని ఆ అగ్నివేదికలోనుంచి బయటికి వచ్చినాడు. ఆ బంగారు గుండిగమీద వెండి పళ్ళెము మూతపెట్టి ఉంది.

ఆ పురుషుడు అమిత పరాక్రమవంతుడుగానూ, మహాబలశాలిగానూ గోచరించినాడు. ముఖము ఎర్రగా ఉంది. ఎరుపూ నలుపూ కలిసిన బట్ట కట్టుకొని ఉన్నాడు. ఒంటినిండా వెంట్రుకలూ, పెద్ద పెద్ద మీసాలూ, సింహముజూలు మాదిరిగా తలనిండా వెంట్రుకలూ నిగనిగలాడుతూ ఉన్నవి. దివ్యాభరణాలతో, సర్వశుభలక్షణ సంపన్నము అయిన రూపముతో ఆ వ్యక్తి కొండ అంత ఎత్తున పొడగట్టి మిట్టమధ్యాహ్న సూర్యుడిమాదిరిగానూ, భగభగమండే అగ్నిహోత్ర జ్వాలమాదిరిగానూ తేజరిల్లుతూ, పాగరెక్కిన పెద్దపులిమాదిరిగా అడుగులు వేస్తూ దశరథమహారాజు ఎట్ట ఎదుట నిలుచుని దుందుభి స్వరముతో, "నేను ప్రాజాపత్య పురుషుడను. నీకోసము ఇక్కడికి వచ్చినాను" అన్నాడు.

తత్క్షణమే మహారాజు లేచి ఆ పురుషుడికి నమస్కారము చేసి, "స్వామీ! తమకు స్వాగతము. ఇప్పుడు నేను ఏమిచేయవలెనో తామే సెలవు ఈయవలెను" అన్నాడు.

"ఓ రాజా! నీ యజ్ఞాలను దేవతలు మెచ్చుకొన్నారు. ఇదిగో, ఈ పాత్రలో పాయసము ఉంది. దీనిని దేవతలు పాకము చేసినారు. ఈ దివ్యపాయసము ప్రజాకరము, ధన్యమూ, ఆరోగ్యవర్ధనమున్నూ అయింది. ఈ పాయసపాత్రను నీవు తీసుకొని ఇందులో ఉన్న పాయసాన్ని నీ కులకాంతలకు ఇవ్వవలెను. వారికి పుత్రులు పుట్టుతారు" అన్నాడు ప్రాజాపత్య పురుషుడు.

దశరథమహారాజు తల ఒగ్గి ఆ పాయసపాత్రను ఆ దివ్యపురుషుడి దగ్గర నుంచి అందుకొన్నాడు. పెన్నిధి దొరికిన పేదవాడికిమల్లే సంతోషపడ్డాడు. ఆ మహాద్భుత పురుషుడికి ప్రదక్షిణముచేసి సాష్టాంగ నమస్కారము చేసినాడు. అప్పుడు ఆ ప్రాజాపత్య పురుషుడు అంతర్ధానము అయిపోయినాడు.

ఆ దివ్య పాయసపాత్రను తీసుకొని దశరథమహారాజు అంతఃపురాంగనలు ఉన్న ప్రదేశానికి పోయినాడు. ఆయన సంతోష కాంతులకు ఆ ప్రదేశము అంతా శరత్కాల పూర్ణిమనాటి రాత్రి మాదిరిగా శోభించింది.

దశరథమహారాజు కౌసల్యాదేవిని చూచి, "ఇదిగో దివ్య పాయసము. దేవతలు నన్ను మెచ్చుకొని దీనిని పంపించినారు. ఈ పాయసము నీవు పుచ్చుకోవలెను" అంటూ ఆ పాత్రలో ఉన్న పాయసములో సగభాగము ఆమెకు ఇచ్చినాడు. మిగతా సగము పాయసములో సగభాగము సుమిత్రాదేవికి ఇచ్చినాడు. ఇంకా మిగిలి ఉన్న పాయసములో సగభాగము కైకేయీదేవికి ఇచ్చినాడు. ఆ పాత్రలో ఇంకా మిగిలిఉన్న ఎనిమిదోవంతు పాయసాన్ని ఆలోచించి సుమిత్రాదేవికి ఇచ్చినాడు.

ఆ కులకాంతలు ముగ్గురున్నూ గర్భవతులు అయినారు. బాలసూర్యుడి వంటి కాంతులతోనూ, అగ్నిహోత్రుడివంటి తేజస్సులతోనూ వారు ముగ్గురూ మెరసిపోయినారు.

అంతట దశరథమహారాజు స్వస్థచిత్తుడు అయినాడు. దేవలోకములో దేవేంద్రుడి మాదిరిగా తేజరిల్లినాడు.

17

వానరవీరుల ఆవిర్భావము

మహావిష్ణువు అంతర్ధానము అయిపోగానే బ్రహ్మదేవుడు దేవతలను అందరిని చూచి, "ఓ దేవతలారా! మనకు అందరికీ మేలు చేయడానికి మహావిష్ణువు భూలోకములో పుట్టబోతున్నాడు. అందువల్ల, ఆయనకు యుద్ధములో సాయపడడానికి కామరూపులూ, బలవంతులూ అయినవారిని మనము ఇప్పుడు సృష్టించవలెను. అప్సరఃస్త్రీలూ, గంధర్వాంగనలూ వానరరూప పుత్రులను కనేట్టు చేయవలెను. ఆ పుట్టే వానరులు మాయావిదులూ, మహాశూరులూ, వాయువేగసమానులూ, నీతిమంతులూ, బుద్ధిమంతులూ, ఉపాయమంతులూ, సుగుణసంపన్నులూ, అజయ్యులూ, అమృతపానముచేసిన మాదిరిగా మృతిలేని వారూ కావలెను. సింహాలవంటి శరీరాలతోనూ, విష్ణుమూర్తితో సరిసమానము అయిన పరాక్రమముతోనూ ఆ వానరులు అందరూ భూలోకములో సంచరించవలెను.

"మీరు అందరూ అటువంటి వానరులను ఇప్పుడే సృష్టించవలెను. ఇంతకుముందే నేను జాంబవంతుడు అనే ఎలుగుబంటిని సృష్టించినాను. నేను సంకల్పించి ఆవలించినాను. నా నోటిలోనుంచి వాడు తటాలున పుట్టుకొని వచ్చినాడు. వాడు మహాబలవంతుడు" అన్నాడు.

బ్రహ్మదేవుడు చెప్పిన ఈ విషయాన్ని దేవతలు అందరూ శ్రద్ధతో ఆలకించినారు. దేవతలూ, మహర్షులూ, సిద్ధులూ, విద్యాధరులూ, ఉరగులూ, చారణులూ ఈ భూలోకములో వానరరూప పుత్రులను పుట్టించడానికి పూనుకొన్నారు.

దేవేంద్రుడికి వాలి అనే వానరుడు పుట్టినాడు. వాడు మహాబలాఢ్యుడు. మహేంద్రపర్వతముతో సరిసమానము అయినవాడు.

ఈ జగత్తునంతా తాపము ఎత్తించే సూర్యుడికి సుగ్రీవుడు పుట్టినాడు. బృహస్పతికి తారుడు అనే వానరుడు పుట్టినాడు. ఆ తారుడు మహాబుద్ధిమంతుడు. వాడి అంతటి ఉత్తముడు వానరులలో మరి ఒకడు లేడు. కుబేరుడికి నీలుడున్నూ, అశ్వనీదేవతలకు మైంద ద్వివిదులున్నూ, వరుణుడికి సుషేణుడున్నూ, పర్జన్యుడికి శరభుడున్నూ వానరపుత్రులుగా పుట్టినారు.

వాయుదేవుడికి హనుమంతుడు అనే వానరుడు పుట్టినాడు. వాడు అతి కాంతిమంతుడు. అమితవీర్యవంతుడు. వాడి దేహము వజ్రము మాదిరిగా అభేద్యము. వాడు గరుత్మంతుడు అంతటి వేగవంతుడు, బలవంతుడు.

వీరే కాకుండా ఇంకా అనేకవేలమంది వానరులు అప్పటికప్పుడు ఈ భూలోకములో పుట్టుకొని వచ్చినారు. దేవతలూ, ఋషులూ మొదలు అయినవారు అందరూ ఎలుగుబంట్ల రూపాలతో కొందరూ, కొండముచ్చు రూపాలతో కొందరూ, ఆవుతోకలంత తోకలతో కొందరూ అవతరించినారు.

వారు అందరూ అప్రమేయ బలులు, వీరులు, విక్రాంతులు, మేరు మందర పర్వత సమానులు, దృఢశరీరులు, కామరూపులు. ఏ ఏ దేవతలకు పుట్టినారో వారి వారి రూపాలతో, వారి వారి చిహ్నాలతో, వారి వారి పరాక్రమముతో రావణవధాసక్తులు అయి తిరుగసాగినారు.

ఆ వానరులు అందరూ అప్సరసలకూ, గంధర్వాంగనలకూ, నాగకన్యలకూ, విద్యాధరస్త్రీలకూ జన్మించినారు. వారు అందరూ మహాకాయులు, కామరూపులు, సర్వాస్త్రశస్త్రకోవిదులు. దర్పానికి వారు అందరూ సింహాలవంటివారు. బలానికి వారు అందరూ పెద్దపులుల వంటి వారు. పెద్ద పెద్ద రాళ్ళు రువ్వడములోనూ, చెట్ల కొమ్మలు పెద్ద పెద్ద వాటితో కొట్టడములోనూ వారందరూ ఆరితేరిన యోధులు.

తమ తమ గోళ్ళనూ, కోరలనూ ఆయుధాలుగా ఉపయోగించగలరు. తమ తమ పాదాలతో ఈ భూమిని బ్రద్దలుకొట్టగలరు. పెద్ద పెద్ద కొండలను కదిలించి అవతల పడవేయగలరు. మహోన్నత వృక్షాలను కూకటివ్రేళ్ళతో పెళ్ళగించి పారవేయగలరు. వేగముగా పరుగులెత్తే మహాసముద్రాన్ని క్షోభపెట్టగలరు. అంతరిక్షమునకు ఎగిరి అటు మేఘాలను పట్టుకోగలరు. ఇటు సముద్రాలను దాటిపోగలరు. మదము ఎక్కి మహారణ్య సానువులలో చెలరేగి పరుగులెత్తే ఏనుగులను సయితము అటకాయించ గలరు. కేకలువేసి పెద్ద పెద్ద పక్షులను బెదరకొట్టగలరు.

అటువంటి పరాక్రమముతో పుట్టిన ఆ వానరులు అందరూ గుంపులు గుంపులుగా బయలుదేరి ఋక్షవంతము మొదలయిన పర్వతాలమీదనూ, సాంద్రారణ్యాలలోనూ నివాసము పెట్టుకొన్నారు.

వాలి మొదలయిన వానరముఖ్యులకు వారి అంతటి పరాక్రమవంతులు అయిన పుత్రులున్నూ పుట్టినారు.

వానరులు అందరూ అన్నదమ్ములయిన వాలిసుగ్రీవులనూ, నలుణ్ణీ, నీలుణ్ణీ, హనుమంతుణ్ణీ సేనానాయకులుగా ఎన్నుకొన్నారు.

ఆ వానరులలో ప్రతివాడూ గరుత్మంతుడు అంతటి బలవంతుడు. అంతటి వేగవంతుడు. ప్రతివాడూ యుద్ధవిశారదుడు. వారు అందరూ ఆ యా ప్రాంతాలలో సింహ శార్దూల మహోరగాలను మర్దిస్తూ తిరుగ సాగినారు.

మహాబాహువూ, మహాపరాక్రమశాలీ అయిన వాలి వారికందరికీ రాజు అయినాడు.

ఆ వానరులు అందరూ వివిధాకారాలతో, వివిధజాతుల చిహ్నాలతో మేఘ సమూహాల మాదిరిగానూ, పర్వత శిఖరాల మాదిరిగానూ భయంకరముగా ఈ పృథ్వి అంతటా వ్యాపించినారు.

వారు అందరూ రాముడికి యుద్ధములో సాయము చేయడానికే పుట్టినారు.

18

శ్రీరామజననం

దశరథమహారాజు సాగించిన హయమేధమూ, పుత్రేష్టి పూర్తి అయిపోతూ ఉండగా, దేవతలు తమ హవిర్భాగాలను తీసికొని, వచ్చిన దారినే వెళ్ళిపోయినారు.

యజ్ఞదీక్షా నియమము అయిపోగానే దశరథమహారాజు భార్యలతోనూ, భృత్యులతోనూ, సైన్య వాహనాలతోనూ యజ్ఞవాటమునుంచి అయోధ్యా నగరము పోదలచి, యజ్ఞము చూడవచ్చిన రాజులను అందరినీ వారి వారి యోగ్యతలకు

తగినట్టుగా సమ్మానించి సంతోషపెట్టినాడు. వారు అందరు సంతుష్టాంతరంగులై వశిష్ఠమహర్షికి నమస్కారము జేసి, దశరథమహారాజుకు వీడ్కోలు చెప్పి తమ తమ దేశాలకు ప్రయాణము అయినారు.

ఆ యా దేశాధీశుల సైనికులకందరికీ దశరథమహారాజు తెల్లని వస్త్రాలు ఇచ్చి బహూకరించినాడు. వారు అందరూ ఆ ధౌత వస్త్రాలను సంతోషముతో ధరించి బారులుతీరి బయలుదేరినారు. అప్పుడు ఆ ప్రదేశము అంతా తెల్లని కాంతులతో తేజరిల్లింది.

బ్రాహ్మణోత్తములు ముందర నడుస్తూ ఉండగా దశరథమహారాజు సపరివారముగా అయోధ్యా నగరము ప్రవేశించినాడు. అక్కడ ఋష్యశృంగుణ్ణీ శాంతాదేవినీ ఎంతో గొప్పగా సమ్మానించినాడు. ఆ దంపతులు అంతట రోమపాదమహారాజు వెంట అంగదేశానికి ప్రయాణమైపోయినారు. ఆ తరువాత దశరథమహారాజు బ్రాహ్మణులను అందరినీ చక్కగా సమ్మానించి వారి వారి తావులకు పంపించివేసినాడు. తమ మనోరథము ఈడేరినట్టు సంతోషించినాడు. పుత్రోత్పత్తిని గురించి ఆలోచిస్తూ హాయిగా కాలము గడపసాగినాడు.

పుత్రేష్టి క్రతువు అయి సంవత్సరము కావచ్చింది. ఆరవ ఋతువు జరుగుతూ ఉంది. పన్నెండో మాసము వచ్చింది. అది చైత్రమాసము. ఆనాడు శుద్ధ నవమి. పునర్వసు నక్షత్రము. అయిదు గ్రహాలూ ఉచ్చలో సంచారముచేస్తూ ఉన్నవి. గురువూ, చంద్రుడూ ఉన్న కటకలగ్నము అటు తూర్పున ఉదయిస్తూ ఉంది. ఇటు కౌసల్యాదేవి ప్రసవించింది. మగశిశువు పుట్టినాడు. ఆ శిశువు అరచేతిలో వజ్రరేఖ ఉంది. వజ్రపాణిని కన్న అదితి మాదిరిగా కౌసల్యాదేవి సంతోషించింది. అప్పుడు గంధర్వులు మధురగానము చేసినారు. అప్సరసలు ఆడినారు. దేవదుందుభులు మ్రోగినవి. ఆకాశమునుంచి పూలవాన కురిసింది.

పుష్యమీ నక్షత్రాన కైకేయీదేవి మగశిశువును కన్నది. ఆశ్లేషా నక్షత్రాన మిట్టమధ్యాహ్నమప్పుడు సుమిత్రాదేవి ఇద్దరు మగపిల్లలను కన్నది.

ఆ నల్గురు శిశువులూ దశరథమహారాజు ప్రతిబింబాలుగా కనుపించినారు.

పూర్వాభాద్రా ఉత్తరాభాద్రా నక్షత్రాల మాదిరిగా, రెండు రెండు జంటలుగా ఆ నలుగురు బిడ్డలూ మెరసినారు.

దశరథమహారాజుకు నలుగురు పుత్రులు పుట్టడముతో అయోధ్యా నగరములో మహోత్సవము ఆరంభమయింది. రాజవీధులు అన్నీ జనాకీర్ణము అయిపోయినవి. ఒక పక్కను నట నర్తకులు రసభావాలను అభినయించసాగినారు. మరి ఒక పక్కను

గాయకులు శ్రావ్యముగా పాడసాగినారు. ఇంకొక పక్కను వాద్యగాండ్లు సంతోషాతిశయముతో జయవాద్యాలను మ్రోగించినారు. అప్పుడు అయోధ్యా నగరము అంతా సంతోష ధ్వనులతో మారుమ్రోగిపోయింది.

దశరథమహారాజు బ్రాహ్మణులకు ధనాన్నీ, గోధనాన్నీ అపారముగా దానము ఇచ్చినాడు. సూత వందిమాగధులు మొదలయిన వారిని అందరినీ సత్కరించినాడు.

పదకొండవ రోజున ఆ బిడ్డలకు దశరథమహారాజు నామకరణకర్మను ఏర్పాటు చేసినాడు. వశిష్ఠమహర్షి ఆ పిల్లలలో జ్యేష్ఠుడికి రాముడు అనీ, కైకేయీ పుత్రుడికి భరతుడు అనీ, సుమిత్రాదేవి పెద్ద పిల్లవాడికి లక్ష్మణుడు అనీ, రెండవవాడికి శత్రుఘ్నుడు అనీ నామకరణము చేసినాడు. ఆనాడు దశరథమహారాజు బ్రాహ్మణులకూ, పౌరులకూ మృష్టాన్నదానము చేసినాడు.

కాలక్రమేణా ఆ నలుగురు అన్నదమ్ములకు చౌలోపనయనాది కర్మలు అన్నీ యథావిధిగా జరిగిపోయినవి.

ఆ నల్గురిలో పెద్దవాడు రాముడు దేవతలలో బ్రహ్మదేవుడు మాదిరిగా అందరికీ ఇష్టుడు అయినాడు. సుమిత్రాపుత్రుడు లక్ష్మణుడు పుట్టింది మొదలు రాముడితో ఎక్కువగా చెలిమి చేయసాగినాడు. ఎప్పుడూ రామున్ని సంతోషపెట్టేవాడు. వాడు రాముడికి బహిఃప్రాణము అయిపోయినాడు. రాముడున్నూ లక్ష్మణున్ని తనకన్నా ఎక్కువగా చూసుకొనేవాడు. లక్ష్మణుడు దగ్గర లేకుండా రాముడు ఎన్నడూ నిద్ర అయినా పోయేవాడు కాడు. ఎంత రుచ్యము అయిన ఆహారము అయినా లక్ష్మణుడు సరసను లేకుండా రాముడు తినేవాడు కాడు. రాముడు గుర్రము ఎక్కి వేటకు బయలుదేరితే తత్క్షణమే లక్ష్మణుడు విల్లూ, అంబులూ తీసికొని వెంట తోడుగా పోయేవాడు.

ఆ లక్ష్మణుడు మాదిరిగానే వాడి తమ్ముడు శత్రుఘ్నుడున్నూ చిన్నప్పటినుంచీ భరతుడికి ప్రాణస్నేహితుడు అయినాడు. భరతుడున్నూ శత్రుఘ్నుడిని విడిచిపెట్టి ఉండేవాడు కాడు. భరతుడు ఎప్పుడూ ఆ తమ్ముడినే సంతోషపెట్టుతూ ఉండేవాడు.

ఆ నల్గురు అన్నదమ్ములూ వేదాధ్యయనము చేసినారు. శ్రుతిస్మృతేతిహాస పురాణాదులు చదివినారు. ధనుర్వేదము అభ్యసించినారు. లౌకికవ్యవహారజ్ఞానము సంపాదించినారు. నలుగురూ లోకహితాచరణ పరాయణులూ, సర్వజన మనోహరులూ అయినారు. వారు విలువిద్యలో ఆరితేరడమే కాకుండా గజాశ్వరథారోహణ చతురులున్నూ అయినారు. నలుగురూ తేజోవంతులు. బీరుపోని

పరాక్రమవంతులు. పెద్దపులులవంటివారు. తండ్రి తమను మెచ్చుకొన్నాడు అని వారు ఎన్నడూ విర్రవీగిపోలేదు. తమ విద్యానైపుణ్యముతోనూ, తమ సుగుణ సంపదతోనూ నల్గురూ తండ్రిని ఎప్పుడూ సంతోషపెట్టుతూ ఉండేవారు. నల్గురూ దిక్పాలకులవంటివారు. వారిలో పెద్దవాడు కళంకరహితుడు అయిన చంద్రుడి మాదిరిగా సర్వజనమనోహరుడూ, నిరంతరపితృసేవా పరాయణుడూ అయినాడు.

విశ్వామిత్రుని ఆగమనము

దశరథమహారాజు సమస్తధర్మాలూ తెలిసినవాడు. పుత్రులకు యుక్త వయస్సు సమీపిస్తూ ఉన్నందువల్ల పురోహితులనూ, బంధువులనూ రావించి వారితో పుత్రుల వివాహ విషయము ఆలోచన చేయసాగినాడు.

అదే సమయాన మహాతేజోవంతుడు అయిన విశ్వామిత్రమహర్షి అయోధ్యా నగరానికి వచ్చినాడు. దశరథమహారాజును చూడ తలచి ద్వారాధ్యక్షులతో, "ఓ ద్వారపాలకులారా! మీరు మహారాజువద్దకు పోయి గాధిపుత్రుడు విశ్వామిత్రుడు వచ్చినాడు అనీ, మిమ్ములను చూడవలెను అనుకొంటున్నాడు అనీ చెప్పవలెను" అన్నాడు. ఆయన ఎవరు అయిందీ తెలియగానే ఆ ద్వారపాలకులు విభ్రాంతులు అయిపోయినారు. వారు తత్క్షణమే రాజభవనములోనికి పోయి తమ ఏలికను చూచి, "మహారాజా! విశ్వామిత్రమహర్షి తమను చూడవలసి వచ్చి ఉన్నారు" అన్నారు.

బ్రహ్మదేవుడికి ఎదురుకోలు చెప్పడానికి పోయే దేవేంద్రుడి మాదిరిగా దశరథమహారాజు పురోహితులు మొదలయినవారితో విశ్వామిత్రమహర్షికి ఎదురుగుండా పోయినాడు. తపోదీప్తులతో తేజరిల్లుతూ తీక్షణ దీక్షలో ఉన్న విశ్వామిత్రమహర్షిని చూచినాడు. దశరథమహారాజు దేహము పులకలెత్తింది. నమస్కారము చేసినాడు. పురోహితుడిచేత అర్ఘ్యమూ, పాద్యమూ ఇప్పించినాడు. విశ్వామిత్రమహర్షి దశరథమహారాజు ఇప్పించిన అర్ఘ్యాదులను అందుకొని, "ఓ రాజా! నీవు క్షేమముగా ఉంటూ ఉన్నావా? నీ పట్టణానికీ, నీ బొక్కసానికీ, నీ దేశానికీ ఏ ఉపద్రవాలూ లేకుండా సుఖముగా ఉంటూ ఉన్నావా? నీ సామంతరాజులు అందరూ వినయవిధేయతలతో మెలగుతూ ఉన్నారా? నీ శత్రువులను అందరినీ నీవు జయించినావుకదా! సామదానభేదదండోపాయాలతో నీ రాజ్యపాలనము చక్కగా సాగుతూ ఉందా? ఏ అంతరాయాలూ లేకుండా నీ రాజ్యములో అతిథి సత్కారాలూ, దేవతార్చనలూ, యజ్ఞాది క్రతువులూ జరుగుతూ ఉన్నవా" అని ప్రశ్నించి, సమాధానము విని వశిష్ఠమహర్షినీ, తక్కినవారినీ యథాన్యాయముగా కుశలము అడిగి తెలుసుకొన్నాడు.

విశ్వామిత్రమహర్షి కుశలప్రశ్నలకు వారు అందరూ ఎంతో సంతోషించినారు.

దశరథమహారాజు వారిని అందరినీ తన కొలువుకూటములోకి తీసుకొనిపోయి కూర్చుండటానికి వారి వారి యోగ్యతలకు తగినట్టుగా సుఖాసనాలు చూపించి, వారు అందరూ కూర్చున్న తరువాత విశ్వామిత్రమహర్షిని చూస్తూ మహదానందముతో, "మహర్షీ! తమకు స్వాగతము. తమ రాకవల్ల నాకు అమృతకలశము దొరికినట్టుగా ఉంది. నిర్జల ప్రదేశములో హాన కురిసినట్టుగా ఉంది. సంతానములేనివాడి కులకాంత పుత్రుణ్ణి కన్నట్టుగా ఉంది. పేదవాడికి పెన్నిధి దొరికినట్టుగా ఉంది. ఇది ఏదో మహోత్సవ సమయముగా ఉంది. తమంతట తాము వచ్చినందుకు నా సంతోషాన్ని తమకు ఏవిధముగా తెలియచెప్పవలెనో తోచడము లేదు. ఓ బ్రహ్మర్షీ! తమ కోరిక ఏమిటి? తమ కోరిక నెరవేర్చడముకన్నా నేను చేయకలిగినది ఏమి ఉంది? నేను ఏమి చేయవలెనో తాము చెప్పవలెను."

"స్వామీ! తాము పూర్వము రాజర్షులు మాత్రమే. ఇప్పుడో, తపఃప్రభావముతో బ్రహ్మర్షులు అయినారు. అందువల్ల, నేను తమను ఎంత అయినా పూజించవలెను. ఓ బ్రహ్మర్షీ! తమ అంతట తాము ఇక్కడికి రావటము మహాద్భుతము . ఏదో నా భాగ్యవశమువల్ల తాము ఇక్కడకు వచ్చినారు. తమ సందర్శనమువల్ల నా పుట్టుక సఫలము అయింది. నా బ్రతుకు సార్థకము అయింది. నేను పరమపవిత్రుణ్ణి అయినాను. నా ఈ గృహము పుణ్యక్షేత్రము అయింది. తాము ఏ ప్రయోజనము కోసము వచ్చినారో సెలవీయవలెను. తమ అనుగ్రహముతోనే తమ పనిని నేను నెరవేరుస్తాను. తాము చెప్పే పని వీడు చేయగలడా చేయలేడా, చేస్తాడా, చేయడా అనే ఏ సంకోచమూ వద్దు. ఏ కొరతా లేకుండా తమ పనిని నేను చక్కబెట్టుతాను. తాము నాకు దేవుడువంటివారు. తాము రావడమే నాకు అభ్యుదయము" అని వినయ విధేయతలతో చెవులకు ఇంపుగానూ, మనస్సుకు నాటుకొనేటట్లుగానూ అన్నాడు.

దశరథమహారాజు ఈవిధముగా చెప్పినందుకు విశ్వామిత్రమహర్షి ఎంతో హర్షించినాడు.

19

విశ్వామిత్రుని విన్నపము

విశ్వామిత్రమహర్షి దశరథమహారాజును చూస్తూ, "రాజా! నీవు మహా గొప్పవంశములో పుట్టినావు, అందుకుతోడు నీకు వశిష్ఠమహర్షి ఉపదేష్ట అయినాడు. అందువల్ల, నీవు ఈవిధముగా అనగలిగినావు. ఇక నా మనస్సులో ఉన్న విషయము చెప్పుతాను విను. నా పని నెరవేరుస్తాను అని నీవే అన్నావు. నీవు ఆడి తప్పవు. కాబట్టి, నాపని నెరవేర్చి సత్యసంధుడవు అనే పేరు నీవు నిలుపుకోవలెను.

"నేను ఒక ఫలసిద్ధికోసము ఇప్పుడు ఒక యజ్ఞము చేస్తూ ఉన్నాను. ఇద్దరు రాక్షసులు వచ్చి నా యజ్ఞాన్ని-విఘ్నము చేస్తూ ఉన్నారు. వాండ్లు ఇద్దరూ కామరూపులు. వీర్యవంతులు. అస్త్రవిద్యలో ఆరితేరినవారు. వారిని మారీచ సుబాహువులు అంటారు. నేను యజ్ఞము సమాప్తము చేయబోయేటప్పుడు వాండ్లు నా యజ్ఞవేదికమీద మాంసము ముద్దలతో నెత్తురువాన కురిపిస్తూ ఉంటారు. అందువల్ల, నా యజ్ఞము పదే పదే విఘ్నము అయిపోతూ ఉంది. నా శ్రమ అంతా వృథా అయిపోతూ ఉంది. నేను యజ్ఞదీక్షలో ఉండబట్టి వాండ్లను శపించ కూడదు. నిరుత్సాహపడిపోయి యజ్ఞవాటిక వదలిపెట్టి ఇక్కడికి వచ్చినాను.

"ఓ రాజా! నిన్ను అడిగి నీ పెద్దకుమారుణ్ణి రాముణ్ణి నావెంట తీసుకొని పోవలెనని నేను ఇక్కడికి వచ్చినాను. రాముడు జుట్టూ జులపాలతో ఉన్న పిల్లవాడు అని అనుకోవద్దు. వాడు మహాశూరుడు. . నేనున్నూ నా తపోబలముతో వాణ్ణి కనిపెట్టి ఉంటాను. రాముడు వాడి దివ్యతేజస్సుతో ఆ ఇద్దరు రాక్షసులను చంపివేస్తాడు. నీవు నీ కుమారుడి శక్తిని గురించి ఎంతమాత్రమూ సంశయించవద్దు. నీ పిల్లవాడి ఎదుట ఆ మారీచ సుబాహువులు ఇద్దరూ నిలువలేరు. రఘువంశములో పుట్టిన నీ కుమారుడు రాముడు తప్ప మరి ఒకరు ఎవడూ వాండ్లను చంపివేయలేడు. ఆ ఇద్దరు రాక్షసులూ వీర్యవంతులము అనే గర్వముతో చెలరేగినారు. అయితే వాండ్లు పాపాత్ములు కాబట్టి కాలపాశవశంగతులుకాక మానరు. రాముడి పరాక్రమానికి వాండ్లు ఈషణ్మాత్రమూ చాలరు. నేను నీ పిల్లవాడికి అనేకవిద్యలు ఉపదేశిస్తాను. ముల్లోకాలలోనూ ప్రసిద్ధి కెక్కేటట్టు చేస్తాను.

"రాజా! నీకు ఏ సందేహమూ వద్దు. రాముణ్ణి గురించి నీవు పుత్రస్నేహముతో ఆలోచించవద్దు. నేను ప్రతిజ్ఞ చేసి చెప్పుతున్నాను. నీ కొడుకు రాముడు, ఆ ఇద్దరు రాక్షసులనూ సంహారము చేసివేస్తాడు. నా మాట నమ్ము. రాముడి సత్యపరాక్రమాన్నీ, మహాత్మ్యాన్నీ నేను ఎరుగుదును. ఈ వశిష్ఠమహర్షి ఎరుగును. ఇంకా ఈ తాపసులు అందరూ ఎరుగుదురు. ఓ రాజా! రాముణ్ణి నా వెంట పంపిస్తే, నీకు సమస్త ధర్మలాభాలూ సమకూరుతవి. నీ యశస్సు శాశ్వతముగా నిలిచిపోతుంది. నీకు ఏమి అయినా సంశయము ఉంటే ఈ వసిష్ఠమహర్షితోనూ, ఈ తాపసులతోనూ, ఈ మంత్రిసత్తములతోనూ సంప్రతించు. వీరు అందరూ ఒప్పుకొంటేనే రాముణ్ణి నాతో పంపించు. యజ్ఞము జరిగే పది రాత్రములే నీ పిల్లవాణ్ణి నా దగ్గర ఉంచుకొంటాను. ఆ తరువాత జాగుచేయకుండా నీ పిల్లవాణ్ణి నీ దగ్గరకు పంపించివేస్తాను. పసివాణ్ణి పంపించడమా అని మనస్సులో దిగులుపడవద్దు. నా యజ్ఞకాలము అతిక్రమించిపోతూ ఉంది. ఇప్పుడే నీ పిల్లవాణ్ణి నా వెంట పంపించవలెను.

నీకు శుభము అవుతుంది" అని ధర్మసహితముగానూ, అర్థయుక్తముగానూ చెప్పి ఊరుకున్నాడు.

విశ్వామిత్రమహర్షి ఇంతగా చెప్పినా దశరథమహారాజుకు భయము వేసింది. ఆయన దిగులుపడిపోయినాడు. ఆయన గుండె బ్రద్దలు అయిపోయింది. మనస్సు వికలము అయిపోయింది. సింహాసనముమీద కూర్చున్నవాడు కూర్చున్నట్టుగానే గజగజ వణికిపోయినాడు.

20

దశరథుని వేడికోలు

దశరథమహారాజు నిశ్చేష్టుడు అయిపోయినాడు. కొంచెముసేపటికి తెప్పరిల్లి విశ్వామిత్రమహర్షితో, "ఓ మహామునీ! రాముడికి ఇంకా పదహారుఏండ్లు అయినా నిండలేదు. రాక్షసులతో యుద్ధముచేసే సామర్థ్యము వాడికి ఎక్కడిది? నాకు ఒక అక్షౌహిణీ సైన్యము ఉంది. నా సైనికులు అందరూ శూరులు. మహాపరాక్రమవంతులు. సకలశస్త్రాస్త్రవిద్యావిశారదులు. నా అక్షౌహిణీ సైన్యమూ, నేనూ తమ వెంట వచ్చి ఆ నిశాచరులతో యుద్ధము చేస్తాము. నేను ధనుర్ధరుణ్ణి అయి తమ యజ్ఞానికి కావలి కాస్తాను. నా బొందిలో ప్రాణము ఉండేటంతవరకూ రాక్షసులతో పోరాడుతాను. తమ యజ్ఞము నిర్విఘ్నముగా కొనసాగిస్తాను.

"రాముడు పసివాడు. విలువిద్యను ఇంకా సాంగముగా నేర్చుకోలేదు. ఎదుటవారి బలాబలాలను ఇంకా సరిగా గుర్తించలేడు. అస్త్రబలసంపన్నుడున్నూ కాలేదు. యుద్ధకుశలుడున్నూ కాడు. రాక్షసులకు కొంచెము అయినా దీటు అయినవాడు కాడు. రాక్షసులు తప్పకుండా కూటయుద్ధము చేస్తారు. అందువల్ల, వాండ్లతో యుద్ధానికి రాముడు ఎంతమాత్రమూ పనికిరాడు. వాడివల్ల తమ కార్యము నెరవేరదు.

"మహర్షీ! నేను బాగా ముసలివాణ్ణి అయిపోయి, బిడ్డలు లేరే అని దుఃఖపడ్డ తరువాత నాకు పుత్రులు పుట్టినారు. నా నలుగురు పుత్రులలో నాకు రాముడిమీద మక్కువ ఎక్కువ. వాడు జ్యేష్ఠుడు. పరమధార్మికుడు. వాణ్ణి వదలిపెట్టి నేను ఒక్క ముహూర్తము అయినా ఉండలేను. కాబట్టి, రాముణ్ణి ఒక్కణ్ణీ తమ వెంట పంపించలేను. నేను నా చతురంగబలాలతో వచ్చి తమ యజ్ఞాన్ని కాపాడుతాను.

"మహర్షీ! ఆ రాక్షసులు మహాపరాక్రమముతో గర్వించి ఉన్నారు అని తాము సెలవు ఇచ్చినారు. ఇంతకూ ఆ రాక్షసులు ఎవండ్లు? వాండ్లు ఎవరి కొమాళ్ళు? వాండ్లకు రాజు ఎవడు? వాండ్లకు ఎటువంటి ఆకారాలు ఉన్నవి? వాండ్లు ఎటువంటి పరాక్రమవంతులు? నేనూ, నా సైన్యమూ వాండ్లకు ఏవిధము అయిన ప్రతీకారము

చేయవలెను. వాండ్లతో యుద్ధము చేయడానికి మేము ఎటువంటి వ్యూహము పన్నవలెను? అవి అన్నీ తామే చెప్పవలెను" అన్నాడు దశరథమహారాజు.

విశ్వామిత్రమహర్షి, "ఓ రాజా! పులస్త్యమహర్షి వంశములో రాక్షసుడు ఒకడు పుట్టినాడు. వాడి పేరు రావణుడు. వాడు మహాబలవంతుడు. అమితవీర్యవంతుడు. వాడు తీవ్రముగా తపస్సుచేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించినాడు. అనేక వరాలు సంపాదించినాడు. అనేకమంది రాక్షసులు వాడి చుట్టూ చేరినారు. వాడు ఆ రాక్షసులందరికీ రాజు అయినాడు. వాణ్ణి గురించి నీవూ విని ఉంటావు. వాడు ఎవడో కాదు, విశ్రవసుమహర్షి రెండో పుత్రుడు. కుబేరుడికి సాక్షాత్తూ తమ్ముడు. ఇప్పుడు వాడు ముల్లోకాలవారినీ నానాబాధలూ పెట్టుతూ ఉన్నాడు. అయితే, నా యజ్ఞవాటికకు వాడు స్వయముగా రావడములేదు. మారీచ, సుబాహువులను పురికొల్పి నామీదికి పంపిస్తూ ఉన్నాడు. వాండ్లు వచ్చి నా యజ్ఞాన్ని పాడుచేస్తూ ఉన్నారు" అని చెప్పినాడు.

దశరథమహారాజు, "ఓ మహర్షీ! ఆ రావణాసురుడితో యుద్ధముచేసే సామర్థ్యము నాకే లేదు. తాము ధర్మజ్ఞులు. నాకు గురువులు. దేవుడువంటివారు. మందభాగ్యుణ్ణి అయిన నన్నూ, నా కుమారుణ్ణీ తాము అనుగ్రహించవలెను. దేవ దానవ యక్ష గంధర్వ పన్నగ పతగులు ఎవరున్నూ, యుద్ధములో ఆ రావణాసురుణ్ణి ఎదుర్కొనలేక పోయినారు. యుద్ధములో వాడు మహావీర్యవంతుల వీర్యాన్ని ఆకర్షించి వేస్తాడు. నేనూ, నా చతురంగబలాలూ ఏకము అయినా వాడితోకానీ, వాడి సైన్యముతోకానీ పోరాడలేము. ఇక మారీచ సుబాహువులో, వాండ్లు సుందోపసుందుల కొమాళ్ళు. మహావీర్యవంతులు. సుశిక్షితులు. యుద్ధములో వాండ్లు యముడితో సరిసమానులు. నేనూ, నా సైన్యమూ వాండ్లలో ఒక్కడితో నయినా పోరాడకలమో లేమో! కాబట్టి, నా కుమారుణ్ణి ఒక్కణ్ణీ ఏమాత్రమూ పంపించలేను. వాడు పసివాడు. యుద్ధములో ఆరితేరలేదు. పైపెచ్చు వాడు నా ఇలవేల్పు. ఏమి అయినప్పటికిన్నీ రాముణ్ణి తమవెంట పంపించను" అన్నాడు.

ఈ మాటలకు విశ్వామిత్రమహర్షికి మహాచెడ్డకోపము వచ్చింది. మంటలు రగులుకొంటూ ఉన్న హోమకుండములో నెయ్యి పోసినప్పుడు భగ్గుమనే అగ్నిజ్వాల మాదిరిగా మండిపడిపోయినాడు.

21

వశిష్ఠుని హితబోధ

"ఓ దశరథుడా! నీ అంతట నీవే నా పని నెరవేరుస్తాను అన్నావు. ఆ అన్నమాట ఇప్పుడు తప్పుతున్నావు. ఈ విపర్యయము రఘువంశీయులకు తగింది

కాదు. ఆడి తప్పటము నీకు సమ్మతము ఏమో చెప్పు. నీకు సమ్మతమే అయినట్లయితే, నా దారిన నేను పోతాను. నీవు అబద్దాలు ఆడుతూ హాయిగా ఉండు" అంటూ విశ్వామిత్రమహర్షి కోపపరీతుడు అయి లేచినాడు.

ఈ జగత్తు అంతా కంపించడము మొదలు పెట్టింది. దేవతలు భయపడిపోయినారు.

పరమపూజ్యుడు అయిన వశిష్ఠమహర్షి స్థితిగతులను గమనించినాడు. అంతట ఆ సుప్రతుడు, ఆ ధీరుడు దశరధమహారాజుతో, "రాజా! నీవు ఇక్ష్వాకువంశములో పుట్టినావు. ధర్మము సాక్షాత్తూ నీ రూపాన మూర్తీభవించినట్టుగా ఇంతవరకూ నీవు ప్రవర్తించినావు. నీవు శ్రీమంతుడవు, ధైర్యవంతుడవు, సుప్రతుడవు, ధర్మాత్ముడవు అని ముల్లోకాలలోనూ ప్రసిద్ధికెక్కినావు. ఇప్పుడు నీవు ధర్మహాని చేయకూడదు. ఈ విశ్వామిత్రమహర్షితో, 'మీపని నెరవేరుస్తాను' అని మొదట నీవే అన్నావు. నీవు అన్నమాట నీవు దక్కించుకొనక పోయేటట్టయితే, నీవు చేసిన అశ్వమేధాది యజ్ఞాలూ, నీవు నిర్మించిన వాపీ కూప తటాకాది ధర్మకార్యాలూ నిష్ఫలాలు అయిపోతవి. కాబట్టి, నీవు రాముణ్ణి ఈ విశ్వామిత్రమహర్షి వెంట పంపించవలెను.

"రాజా! రాముడికి శస్త్రాస్త్రబలము ఉంటేనేమి, లేకపోతేనేమి? జ్వలితాగ్ని హోత్రచక్రము అమృతకలశాన్ని కాపాడినట్టు, ఈ విశ్వామిత్రమహర్షి రాముణ్ణి కాపాడుతూ ఉంటే రాక్షసులు ఏమి చేస్తారు? ఏమీ చేయలేరు. ఓ రాజా! ఈ లోకములో ధర్మము ఈ విశ్వామిత్రమహర్షి రూపాన అవతరించింది. ఈయన మహాపరాక్రమవంతులకు మేలుబంతి. ఈ జగత్తులో ఈయన అంతటి బుద్ధిమంతుడూ, శస్త్రాస్త్రబలసంపన్నుడూ మరి ఒకడు లేడు. చరాచరాత్మకము అయిన ముల్లోకాలలో ఉన్న సమస్త శస్త్రాస్త్రాలనూ ఈయన ఒక్కడే వశపరచుకొన్నాడు. ఇన్ని శస్త్రాస్త్రాలూ ఉన్నవి అని ఇంతవరకూ ఏ ఒక్కడూ తెలుసుకోలేదు. ఇకముందు ఎవడూ తెలుసుకోగలుగుతాడు అని తోచదు. ఈయన స్వాధీనము చేసుకొన్న అన్ని శస్త్రాస్త్రాలను దేవ దానవ యక్ష రాక్షస కిన్నర మహోరగులు ఎవరూ స్వాధీనము చేసుకోలేదు.

"ఈ లోకములో భృశాశ్వుడి పుత్రుల రూపాన అవతరించిన శస్త్రాస్త్రాలను అన్నిటినీ పూర్వము ఈ విశ్వామిత్రమహర్షి రాజ్యపాలనము చేస్తూ ఉన్న కాలములో శివదేవుడు ఈయనకు ఇచ్చి వేసినాడు.

"దక్షప్రజాపతి కూతుళ్ళు జయ, సుప్రభ అనే అక్కచెల్లెండ్రు భృశాశ్వుడి భార్యలు. వారు ఇద్దరూ నూరుమంది పుత్రులను కన్నారు. జయకు జయులు అనే

యాభైమంది పుత్రులూ, సుప్రభకు సంహారకులు అనే యాభైమంది పుత్రులూ పుట్టినారు. వారు కామరూపులు. మహాప్రభావులు. దుర్ధర్షులు. అప్రమేయ బలులు. అప్రతిహత తేజోవంతులు. రాక్షస సంహారము చేయడానికే వారు నూరుగురూ పుట్టినారు. ఆ అక్క చెల్లెండ్లకు పుట్టిన ఆ నూర్గురు పుత్రులూ పరమభాస్వరము అయిన నూరు శస్త్రాస్త్రాలుగా మారిపోయినారు. అవి అన్నీ ఈ విశ్వామిత్రమహర్షి వశము అయిపోయినవి. ఈయన శివదేవుడు అంతటివాడు. వశపరచుకొన్నవాటినే కాకుండా, కొత్త కొత్త శస్త్రాస్త్రాలను ఎన్నిటిని అయినా ఈయన సృష్టించి ప్రయోగించగలడు. అటువంటి ప్రభావము ఈయన ఒక్కడికే ఉంది. ఈయన అమేయపరాక్రమవంతుడు. మహాతేజోవంతుడు. పరమయశస్వి. ఈయన వెంట రాముణ్ణి పంపించడానికి ఏ సంశయమూ వద్దు.

"ఓ రాజా! జగత్తులో ఉన్న రాక్షసులను అందరినీ ఈయన ఒక్కడే సంహారము చేయగలడు. కాని, నీ పుత్రుడు రాముడికి మేలుచేయతలచి నీ దగ్గరకు వచ్చి నీ కుమారుణ్ణి రాముణ్ణి తనతో పంపించమని నిన్ను ఇప్పుడు యాచిస్తున్నాడు" అని చెప్పినాడు.

వశిష్ఠమహర్షి చెప్పిన ఈ మాటలకు దశరథమహారాజు సంతుష్టచిత్తుడు అయినాడు. ఆయన సర్వాంగాలూ శోభించినవి. బుద్ధిపూర్వకముగానూ, సంతోషముగానూ రాముణ్ణి విశ్వామిత్రమహర్షి వెంట పంపించటానికి ఒప్పుకున్నాడు.

22

విశ్వామిత్రునితో రామలక్ష్మణుల పయనము

దశరథమహారాజు రాముణ్ణి, లక్ష్మణుణ్ణి అక్కడికి పిలిపించినాడు. ప్రేమాతిశయముతో రాముడి శిరస్సును ఆఘ్రాణించినాడు. ఆయనా, ఆయన భార్యలూ రామలక్ష్మణులను ఆశీర్వదించినారు.

వశిష్ఠమహర్షి మంగళప్రదము అయిన మంత్రాలతో రామలక్ష్మణులను అభిమంత్రించినాడు. మహదానందముతో ఆ అన్నదమ్ములను దశరథమహారాజు విశ్వామిత్రమహర్షికి ఒప్పచెప్పినాడు. ఆ సమయాన దుమ్మూ ధూళీ రేగకుండా చల్లని గాలి వీచింది. దేవదుందుభులు మ్రోగినవి. పూలవాన కురిసింది. రాజభవనములో నుంచి శంఖాలు పూరించినారు. దిక్కులు పిక్కటిల్లిపోయేటట్టు భేరులు మ్రోగినవి.

విశ్వామిత్రమహర్షి ముందు నడచినాడు. ఆయన వెనుక ధనుర్ధరుడు అయి రాముడూ, అతని పక్కను చక్కని గిరజాలజుట్టుతో విల్లు పట్టుకొని లక్ష్మణుడూ నడచినారు.

ఆ సుందరాకారులు మణికట్లకూ, వ్రేళ్ళకూ ఉడుముతోలు కవచాలు తొడుగుకొని, చక్కగా అలంకరించుకొని భుజాలమీదనుంచి ధనుస్సులూ, నడుములలో కత్తులూ వ్రేలాడుతూ దివ్యకాంతులు విరజిమ్ముతూ విశ్వామిత్రమహర్షి వెనక నడుస్తూ ఉంటే, అగ్నిహోత్రోద్భవులు అయిన స్కంద విశాఖులు చింతించ నలవికాని శివదేవుడి వెంట సాగిపోయినట్లుగా తోచినారు.

ఆ కాంతిమంతులు అనల్పరూపాలతో విశ్వామిత్రమహర్షి వెంట నడుస్తూ ఉంటే, బ్రహ్మదేవుడివెంట దశదిశలూ శోభిస్తూ నడిచే అశ్వనీదేవతల మాదిరిగా తోచినారు.

ఆ అన్నతమ్ములు రెండేసి అంబుల పొదులతో నడుస్తూఉంటే మూడు తలల పాములు రెండు పడగలు విప్పి ఆడుతూపోతూ ఉన్నట్లుగా తోచినారు.

వారు ముగ్గురూ ఒకటిన్నర యోజనముల దూరము నడచినారు. సరయూనది దక్షిణ తీరము చేరినారు. విశ్వామిత్రమహర్షి మధుర స్వరముతో, "రామా! ఆలస్యము చేయవద్దు. నీవు ఇప్పుడు ఈ నదిలో ఆచమించవలెను. సమస్తమంత్రాలకున్నూ మూలాధారాలు అయిన 'బల-అతిబల' అనే రెండు మంత్రాలు ఇప్పుడు నీకు ఉపదేశము చేయతలచినాను. ఈ మంత్రాల ప్రభావమువల్ల నీకు ఇకను ఎన్నడూ అలసట అనేది ఉండదు. ఏవ్యాధీ నిన్ను అంటదు. నీవు నిద్రపోతూ ఉన్నా, ఏమరుపాటున ఉన్నా నిన్ను రాక్షసులు ఎదిరించలేరు.

"నాయనా! నీవు దారిన పోతూ ఈ మంత్రాలను జపము చేస్తే నీకు ఆకలి వేయదు. దాహము కాదు. ఈ మంత్రాల అనుష్ఠానమువల్ల బాహుబలములో నీ అంతటివాడు ఈ పృథ్విలో మరి ఒకడు ఉండడు. అంతేకాదు, సామర్థ్యములో, సౌందర్యములో, బుద్ధికుశలతలో, కార్యాకార్యనిశ్చయ జ్ఞానములో, వాదప్రతివాదాలలో, ఉత్తర ప్రత్యుత్తరాలలో నీతో సరిసమానము అయినవాడు ముల్లోకాలలోనూ మరి ఒకడు ఉండడు.

"ఓ రామా! 'బల-అతిబల' అనే ఈ రెండు విద్యలూ సమస్తమంత్రాలకే కాదు, సమస్తజ్ఞానానికిన్నీ తల్లులవంటివి. మహాతేజోవంతము అయిన ఈ రెండు మంత్రాలనూ బ్రహ్మదేవుడు సృష్టించినాడు. నేను నా తపోబలముతో సంపాదించినాను. ఈ రెండు విద్యలూ అభ్యసించడానికి నీవు తగినవాడవు. అందువల్ల, నీకు ఉపదేశము చేయ నిశ్చయించుకొన్నాను. నీవు ఈ రెండు మంత్రాలనూ చక్కగా జపము చేయవలెను. ఈ రెండూ నీకు అనేకవిధాల ఉపయోగపడుతవి. వీటివల్ల నీవు మహాయశస్వివి అవుతావు" అన్నాడు.

రాముడు సంతోషముతో సరయూనదిలో ఆచమించి శుచి అయినాడు. అప్పుడు విశ్వామిత్రమహర్షి ఆ రెండు మంత్రాలనూ రాముడికి ఉపదేశము చేసినాడు. మంత్రోపదేశము అయిన రాముడు సహస్రకిరణాలతో ధగధగలాడే శరత్కాల సూర్యుడి మాదిరిగా గోచరించినాడు.

ఆ సాయంకాలము గురువందనాదికాలు అయిపోయిన తరువాత, ఆ రాత్రి పడుకొనేటందుకు రామలక్ష్మణులు దగ్గర దగ్గరగా గడ్డితో పరుపులను అమర్చినారు.

విశ్వామిత్రమహర్షి సవిలాసముగా వారికి పుణ్యకథలు చెప్పసాగినాడు.

ఆ రాత్రి వారు ముగ్గురూ సరయూనది దక్షిణ తీరాన హాయిగా నిద్రపోయినారు.

23

అంగదేశము

తెల్లవారబోతూ ఉంది. ఆ గడ్డిపరుపులమీద పడుకొన్న రామలక్ష్మణులు ఇంకా నిద్ర లేవలేదు. విశ్వామిత్రమహర్షి వారిని చూచి, "రామా! తొలిసంధె అయింది. నిద్ర లేవవలెను. నిత్యకర్మానుష్ఠానానికి వేళ మించిపోయింది" అంటూ మేల్కొల్పినాడు.

రామలక్ష్మణులు నిద్రలేచి కాల్యాలు నిర్వర్తించుకొని స్నానము చేసి, ఆచమించి అర్ఘ్యము ఇచ్చి, గాయత్రీ జపముచేసి, ప్రాతఃకాలాహ్నికాలను అన్నిటిని ముగించుకొని, ప్రయాణానికి సంసిద్ధులు అయి విశ్వామిత్రమహర్షికి నమస్కారము చేసినారు.

విశ్వామిత్రమహర్షి వెంట రామలక్ష్మణులు నడిచినారు. సరయూనది గంగానదిలో సంగమించే చోటికి పోయినారు. పరమ పావనము అయిన గంగానదిని సందర్శించినారు. ఆ అన్నదమ్ములు ఆ ప్రాంతంలో ఒక పుణ్యాశ్రమపదము చూచినారు. అది అతిప్రాచీనము అయిన ఆశ్రమపదముగా వారికి తోచింది. రాముడు మహోత్సాహముతో "మహాత్మా! ఎవరిది ఈ పుణ్యాశ్రమము? ఇక్కడ ఏ మహానుభావుడు ఉంటూ ఉన్నాడు" అని కుతూహలముతో ప్రశ్న చేసినాడు.

విశ్వామిత్రమహర్షి మందహాసము చేస్తూ, "ఈ పుణ్యాశ్రమము ఎవరిదో చెప్పుతాను వినుము. శివుడు పార్వతిని పెండ్లి ఆడక పూర్వము ప్రమథగణాలతో ఇక్కడికి వచ్చినాడు. దృఢనియమముతో స్థాణురూపాన సమాధిలో ఉండి తపస్సు చేయసాగినాడు. అప్పుడు మన్మథుడు దుర్బుద్ధితో ఇక్కడికి వచ్చినాడు. ఆయన

తపస్సు చెడగొట్టబోయినాడు. అంతట శివుడికి కోపము వచ్చింది. హుంకరించి కన్ను తెరచినాడు. రౌద్రముతో చూచినాడు. మన్మథుడి శరీరము అంతా దగ్ధము అయిపోయింది. క్షణలేశములో వాడు భస్మము అయిపోయినాడు.

"ఆవిధముగా మన్మథుడి సర్వాంగాలూ భస్మము అయిపోయినందున అప్పటినుంచి వాడు అనంగుడు అయినాడు.

"ఈ చోట మన్మథుడు తన అంగాలను అన్నింటినీ కోలుపోయినాడు కనుక, ఈ ప్రాంతాన్ని అప్పటినుంచి అంగదేశము అంటున్నారు. ఇది చాలా శ్రీమంతము అయిన దేశము.

"ఈ ఆశ్రమపదము ఆ పరమశివుడిది. ఆయన శిష్యులు తరతరాల వారూ అప్పటినుంచి తపస్సు చేసుకొంటూ ఇక్కడనే ఉండిపోయినారు. వారు అందరూ పాపరహితులు. పరమధార్మికులు.

"ఓ రామా! ఇప్పుడు మనము ముందుగా స్నానము చేద్దాము. పరిశుద్ధులము అయి జపహోమాదులు ముగించుకొందాము. ఆతరువాత ఈ పుణ్యాశ్రమములో ఈ రాత్రి గడుపుదాము. రేపు ఉదయము గంగానదిని దాటిపోదాము" అన్నాడు.

విశ్వామిత్రమహర్షి ఇట్లా చెప్పుతూ ఉండగా, రామలక్ష్మణులు విశ్వామిత్రమహర్షి వెంట తమ ప్రాంతానికి వచ్చినట్లు ఆ స్థాణ్వాశ్రమ వాసులు దివ్యదృష్టితో చూచినారు. పులకాంకితులు అయినారు. పరమానందభరితులు అయినారు. వారు పోయి విశ్వామిత్రమహర్షినీ, రామలక్ష్మణులనూ దర్శనము చేసినారు. విశ్వామిత్రమహర్షికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి ఆతిధ్యము సమర్పించినారు. ఆ తరువాత రామలక్ష్మణులకు వారు అతిది సత్కారాలు చేసినారు.

రామ లక్ష్మణ విశ్వామిత్రులు వారిని ఎంతో కొనియాడినారు.

ఆ ఆశ్రమవాసులతో విశ్వామిత్రమహర్షి పుణ్యకథా ప్రసంగము చేస్తూ ఉండగా మలిసంధె అయింది. అంతట వారు సమాహితమనస్కులు అయి జపతపాదులు చేసినారు. ఆ సువ్రతులు ఆ తరువాత రామ లక్ష్మణ విశ్వామిత్రులను తమ స్థాణ్వాశ్రమపదానికి తీసుకొనిపోయినారు.

ఆ రాత్రి విశ్వామిత్రమహర్షి అతిమనోహరము అయిన పుణ్యకథలు చెప్పి రామలక్ష్మణులను రంజింపచేసినాడు.

ఆ రాత్రి ముగ్గురూ ఆ ఆశ్రమములో సుఖముగా గడిపినారు.

24

సరయూ నది

తెల్లగా తెల్లవారింది. రామలక్ష్మణులు ప్రాతరాహ్నికాలను ముగించుకొని విశ్వామిత్రమహర్షివెంట ప్రయాణము అయినారు. గంగాతీరము చేరినారు. స్థాణ్వాశ్రమవాసులు వారి కోసము ఒక చక్కని నావను ఏర్పాటు చేసినారు. వారు విశ్వామిత్రమహర్షితో, "స్వామీ! తాము సుఖముగా ఈ నావమీద, ఈ రాజకుమారులతో దాటిపోవలసింది. పొద్దు ఎక్కిపోతూ ఉంది. ఆలస్యము చేయవద్దు' అని చెప్పినారు. విశ్వామిత్రమహర్షి వారిని అందరినీ మెచ్చుకొన్నాడు. రామలక్ష్మణులున్నూ వారిని కొనియాడినారు. వారికి వీడ్కోలు చెప్పినారు. రామ లక్ష్మణ విశ్వామిత్రులు ఆ నావ ఎక్కినారు.

నావ నది మధ్యలోకి పోయింది. ఒక ప్రవాహము మరి ఒక ప్రవాహములో ఒరుసుకొనిపోయి పెద్ద పెద్ద అలలు లేచినవి. ఉరవడితో చెవులు బ్రద్దలు అయ్యే మహాధ్వని వినిపించినది. అప్పుడు రాముడు, "ఏమిటి ఈ ధ్వని" అని విశ్వామిత్ర మహర్షిని ప్రశ్న చేసినాడు.

"రామా! మహాప్రశాంతముగా ప్రవహించే గంగానదిలోకి సరయూనది ఉరవడితో వచ్చి పడుతూ ఉంది. అందువల్ల, ఇంత ధ్వని అవుతూ ఉంది" అంటూ విశ్వామిత్రమహర్షి ఈ విధముగా చెప్ప సాగినాడు :

"రామా! పూర్వము బ్రహ్మదేవుడు కైలాసపర్వతముమీద ఒక సరస్సు ఉండవలెను అని మనసా సంకల్పించినాడు. అక్కడ అప్పటికప్పుడు ఒక సరస్సు వెలిసింది. అందువల్ల, దేవతలు దానిని 'మానస సరోవరము' అన్నారు. ఆ సరస్సులో నుంచి పొంగి పొర్లిన ప్రవాహమే సరయూనది. ఆ సరయూనదే అయోధ్యా నగరాన్ని ఆవరించి ప్రవహించి ఇక్కడికి వచ్చి ఈ గంగానదిలో పడుతూ ఉంది.

"బ్రహ్మదేవుడి మానస సరోవరములో నుంచి వెలువడి ప్రవహించి నందువల్ల సరయూనది పుణ్యనది అయింది. ఈ రెండు పుణ్యనదులకున్నూ మీరు నమస్కారము చేయవలెను" అన్నాడు విశ్వామిత్రమహర్షి.

అంతట రామలక్ష్మణులు ఆ రెండు పుణ్యనదులకున్నూ భక్తి తాత్పర్యాలతో నమస్కారము చేసినారు.

వారు ముగ్గురూ ఆ నావలో గంగానది దాటి దక్షిణ తీరము చేరి, అక్కడ ఆగకుండ నడిచిపోయి భయంకరారణ్యము ప్రవేశించినారు. అప్పుడు రాముడు విశ్వామిత్రమహర్షిని చూచి, "మహాత్మా! ఈ అడవిలో మనుష్యులు ఎన్నడూ సంచారము

చేసిన చిన్నెలే కనపడటములేదు. చెవులు గింగిర్లు ఎత్తేట్టు పెద్ద పెద్ద పక్షులు కూస్తూ ఉన్నవి. సింహాలూ, పెద్దపులులూ ఘోరముగా గర్జిస్తూ ఉన్నవి. ఈలపురుగులు రొదపెట్టుతూ ఉన్నవి. ఎటుచూచినా చండ్ర-ఇనుమద్ది-ఏరుమద్ది-మారేడు-తుమ్మకి కలిగొట్టు చెట్లూ, రేగు పొదలూ మొదలయినవి క్రిక్కిరిసిపోయి ఉన్నవి. దారి కనపడటము లేదు. ఇది మహాఘోరారణ్యముగా ఉంది. స్వామీ! ఈ భయంకరారణ్యము ఎవరిది" అని అడిగినాడు.

"రామా! ఈ ఘోరారణ్యము ఎవరిదో చెప్పుతాను, వినవలెను. పూర్వము ధన ధాన్య సమృద్ధము అయిన 'మలద కరూశాలు' అనే రెండు దేశాలు ఇక్కడ ఉండేవి. అవి దేవతల దేశాల మాదిరిగా వర్థిల్లినవి. అసలు దేవతలే ఆ రెండు దేశాలనూ నిర్మించినారు.

"పూర్వము దేవేంద్రుడు వృత్రాసురుణ్ణి సంహారము చేసినప్పుడు, ఆయనకు బ్రహ్మహత్యాపాతకము పట్టుకొన్నది. ఆయన అశుచి అయినాడు. అంతేకాదు, ఆయన ఘోరము అయిన ఆకలితో బాధపడసాగినాడు. అప్పుడు ఆయనను దేవతలూ, మహర్షులూ ఇక్కడికి తీసుకొనివచ్చి, ఈ గంగానదిలో స్నానము చేయించినారు. కడవలు కడవలు గంగాజలాలను మంత్రపూతము చేసి ఆయన తలమీద కుమ్మరించినారు. అంతటితో ఆయన బ్రహ్మహత్యాపాతకము ఇక్కడ క్షాళనము అయిపోయింది. అశుచీ, వెర్రి ఆకలీ మాయము అయిపోయినవి. దేవేంద్రుడు సంతోషించినాడు.

"ఇక్కడ, ఈ ప్రదేశములో నా మలము పోయింది కనుక 'మలదము' అనీ, నా కారూశము పోయింది కనుక 'కరూశము' అనీ ఈ ప్రాంతము రెండు దేశాలుగా ప్రసిద్ధి కెక్కవలెను" అన్నాడు దేవేంద్రుడు. అందుకు దేవతలున్నూ, మహర్షులున్నూ సంతోషముతో అంగీకరించి, ఇక్కడ రెండు దేశాలను నిర్మించినారు. అంతటనుంచీ మలద, కరూశాలు అనే రెండు దేశాలున్నూ సకల ధనధాన్యసమృద్ధిగానూ, సర్వ సంపన్నముగానూ ఇక్కడ విలసిల్లుతూ ఉండేవి.

"అంతట కొంతకాలానికి ఈ దేశాలలో 'తాటక' అనే ఒక రాక్షసి విజృంభించింది. అది యక్షిణి. కామరూపిణి. పుట్టడమే అది వెయ్యి ఏనుగుల బలముతో పుట్టింది. 'సుందుడు' అనే వాణ్ణి పెండ్లి ఆడింది. 'మారీచుడు' అనేవాణ్ణి కన్నది. వాడు ఇంద్రుడు అంతటి పరాక్రమవంతుడు. విశాలము అయిన ముఖముతోనూ, గుండ్రము అయిన చేతులతోనూ, మహాదార్ఢ్యము అయిన శరీరముతోనూ తిరుగుతూ ఉండేవాడు. వాడున్నూ రాక్షసుడు అయిపోయినాడు. ప్రజలను బాధిస్తూ మహాభయంకరుడున్నూ అయిపోయినాడు.

"దుష్టచారిణి అయిపోయిన తాటక ఇక్కడికి ఒకటిన్నర యోజనాల దూరములో ఉంటూ ఉంది. అది దార్లుకొట్టి బ్రతుకుతున్నది. మలద, కరూశ దేశాలను రెంటినీ నాశనము చేసివేసింది.

"ఓ రామా! ఈ యక్షిణివల్ల ఈ రెండు దేశాలూ నిర్జనము అయిపోయినవి. మహారణ్యాలు అయిపోయినవి. ఆ తాటక ఈ ప్రాంతానికి వచ్చే ఏ ఒక్కణ్ణీ బ్రతకనీయకుండానూ, ఏ ఒక్కడికీ చిక్కకుండానూ తిరుగుతూ ఉంది. రామా! నేను ఆజ్ఞాపిస్తున్నాను. నీవు ఆ తాటకను చంపివేయవలయును. ఈ ప్రాంతానికి దాని పీడ విరగడయిపోవలెను. నిరుపద్రవము అయిన దేశముగా ఈ ప్రదేశాన్ని నీవు మార్చివేయవలెను" అన్నాడు విశ్వామిత్రమహర్షి.

25

తాటక వృత్తాంతము

విశ్వామిత్రమహర్షి అంతటివాడు స్త్రీవధము చేయవలెను అని ఆజ్ఞాపించినాడు. అందుకు రాముడు అణకువతో, "మునిపుంగవా! యక్షులు అల్పవీరులు అని చెప్పగా విన్నాను. అందులో తాటక ఆడది, అబల. ఆమెకు వెయ్యి ఏనుగుల బలము ఎట్లా వచ్చింది?" అని అడిగినాడు.

విశ్వామిత్రమహర్షి, "రామా! దానికి అంత బలము ఎట్లా వచ్చిందీ చెప్పుతాను, విను.

"పూర్వము 'సుకేతుడు' అనే యక్షుడు ఒకడు ఉండేవాడు. వాడు మహాపరాక్రమవంతుడు. సదాచారసంపన్నుడు. కాని, సంతానము లేకపోయింది. అందుకు వాడు గొప్ప తపస్సు చేసినాడు. బ్రహ్మదేవుడు వాడి తపస్సుకు మెచ్చుకొన్నాడు. వెయ్యి ఏనుగుల బలముతో ఒక కన్యారత్నము పుట్టేట్టు వరము ఇచ్చినాడు. కాని, పుత్ర సంతానానికి వరము ఇవ్వలేదు.

"ఆ యక్షుడికి తాటక పుట్టింది. అది పెరిగి పెద్దది అయ్యింది. అబల అయినప్పటికిన్నీ బ్రహ్మానుగ్రహమువల్ల వెయ్యి ఏనుగుల బలము కలది అయింది. మంచి రూపసి అయింది. అందానికి పేరుపడ్డది. ఆ యక్షుడు దానిని 'సుందుడు' అనే వాడికి ఇచ్చి పెండ్లి చేసినాడు. కొంతకాలానికి తాటక మారీచుణ్ణి కన్నది. వాడు ఎవరూ ఎదిరించలేనంతటి పరాక్రమవంతుడు అయినాడు.

"అగస్త్యమహర్షి శాపమువల్ల సుందుడు చచ్చిపోయినాడు. పెనిమిటిని చంపివేసినాడు అనే కోపముతో తాటక చెలరేగింది. మారీచుణ్ణి తీసుకొని అగస్త్యుడిమీదికి పోయింది. పెద్ద పెద్ద కేకలు పెడుతూ అతి ఉరవడిగా ఆయనమీదికి

పరుగులెత్తింది. ఆయనను మ్రింగివేయ నుంకించింది. తన పయిన పడబోతున్న తాటకనూ, మారీచుణ్ణీ అగస్త్యమహర్షి చూచినాడు. 'నీవు రాక్షసుడవు అయిపో' అంటూ ముందుగా మారీచుణ్ణి శపించినాడు.

"మారీచుణ్ణి శపించినప్పటికిన్నీ తాటక సంరంభము ఏమీ తగ్గలేదు. అగస్త్యమహర్షి అప్పుడు పరమక్రుద్ధుడు అయినాడు. 'ఓ తాటకా! రూపము మారిపోయి వికృతాననముతో, వికారాకారముతో నరమాంస భక్షణము చేస్తూ మహారాక్షసిగా తిరుగుతూ ఉండు' అని శాపము పెట్టినాడు. ఆ శాపానికి దానికి మరింత కోపము వచ్చింది. అయితే అగస్త్యమహర్షిని ఏమీ చేయలేక పోయింది. కాని, ఆయన సంచరించినాడు అనే కసితో సుభిక్షముగా ఉంటూ ఉన్న మలద, కరూశ దేశాలను రెంటినీ నాశము చేయసాగింది. ఆ విధముగా ఈ ప్రదేశము ఘోరారణ్యము అయిపోయింది.

"ఓ రామా! ఆ యక్షిణి దుర్వృత్త, మహాభయంకరురాలు. దౌష్ట్యానికి పరాక్రమవంతురాలు. నీవు గో బ్రాహ్మణ హితము కోసము ఆ మహాయక్షిణిని చంపివేయవలెను. ఆ శాపగ్రస్తను, ఆ రాక్షసిని చంపివేయడానికి నీవు తప్ప మరి ఎవడూ ధైర్యము చేసేవాడు ముల్లోకాలలోనూ లేడు. స్త్రీవధము అసహ్యము అయిన పని అని నీవు అనుకోవద్దు. నాల్గు కులాలవారికీ మేలుచేయడమే కార్యదురంధరుల కర్తవ్యము. ప్రజారక్షణమే రాజధర్మము. రాజ్యభార నియుక్తులు అయినవారు ప్రజారక్షణానికి అవసరము అయిన ఏ పనిని అయినా చేసి తీరవలెను. క్రూరము అనీ, పాతకము అనీ, దోషము అనీ సంశయించకూడదు. ఇది సనాతన రాజధర్మము.

"ఈ తాటక ధర్మమార్గము తప్పింది. అధర్మమార్గము పట్టింది. ఓ రామా! నీవు అధర్మాన్ని నాశనము చేసివేసి ధర్మాన్ని ప్రతిష్ఠ చేయవలెను. పూర్వము విరోచనుడి కూతురు 'మంధర' అనే ఆమె ఈ పృథివిని అంతా నాశముచేయ తలపెట్టింది. దేవేంద్రుడంతటివాడు అందుకు ఆమెను చంపివేసినాడు. భృగుమహర్షి ఇల్లాలు, శుక్రుడి అంతటివాడి తల్లి ఈ లోకములో ఇంద్రుణ్ణి లేకుండా చేయడానికి దృఢవ్రత అయింది. అప్పుడు మహావిష్ణువే ఆమెను సంహారము చేసివేసినాడు. వీరే కాదు, ఇంకా ఎందరో మహాత్ములు అధర్మపరాయణులు అయిన స్త్రీలను హతమార్చి వేసినారు" అన్నాడు.

26

తాటక వధ

ఈవిధముగా విశ్వామిత్రమహర్షి స్త్రీని వధించమని చెప్పింది అంతా రాముడు విన్నాడు. ఆలోచన చేయసాగినాడు. "విశ్వామిత్రమహర్షి చెప్పినట్టుగా చేయమని నా

తండ్రి నన్ను ఆజ్ఞాపించినాడు. కాబట్టి, విశ్వామిత్రమహర్షి చెప్పినట్లు అవిశంకముగా చేయటమే నా విధి" అని మనసా నిశ్చయించుకొన్నాడు.

విశ్వామిత్రమహర్షిని చూచి, "స్వామీ! అయోధ్యా నగరములో గురువుల ఎదుట నా తండ్రి దశరథమహారాజు తాము ఏమి చెప్పినా నేను చేయవలెను అని ఆజ్ఞాపించినాడు. ఆయన ఆజ్ఞను నేను అవజ్ఞ చేయను. పితృవాక్యపరిపాలనమే నా వ్రతము. తాము బ్రహ్మర్షులు. మహాప్రభావము కలవారు. తాటక వధము ఉత్తమము అని తాము శాసిస్తున్నారు. కాబట్టి గో బ్రాహ్మణ హితము కోసమూ, ఈ దేశ సౌఖ్యము కోసమూ ఏ సంశయము లేకుండా తాటకను వధిస్తాను. మహానుభావులు తాము ఆజ్ఞాపించిన ఈ కార్యాన్ని ఇప్పుడే నిర్వహిస్తాను" అంటూ, తన వింటి నడుము పిడికిడితో పట్టుకొని దశదిశలూ మారుమ్రోగి పోయేటట్టు టంకారము చేసినాడు.

ఆ మహాధ్వనికి ఆ మహారణ్యములో ఉన్న ప్రాణికోటులు అన్నీ ఉలిక్కిపడిపోయినవి. తాటక దిగ్భ్రమ చెందింది. క్షణలేశము ఆలోచించింది. క్రోధపరవశ అయింది. ఆ మహాధ్వని వినిపించిన దిక్కుకు పరుగు తీసింది. వికారాకారముతో, వికృతాననముతో పరుగులెత్తుకుంటూ వస్తూ ఉన్న తాటిచెట్టు అంతటి తాటకను రాముడు చూచినాడు. తమ్ముడితో, "లక్ష్మణా! తాటక భైరవాకారమూ, వికృతాకారమూ చూస్తున్నావా? దీనిని చూస్తే, అంతంతమాత్రపు ధైర్యవంతులు గుండెలు బ్రద్దలు అయి చచ్చిపోతారు. దీనిని ఎవరూ ఎదిరించలేరు. దీనికి మాయా బలము ఉంది. దీని ముక్కూ చెవులూ ఇప్పుడే తెగవేస్తాను, చూడు. ఇంతకూ ఇది ఆడది. దీనిని చంపివేయ బుద్ధి పుట్టడము లేదు. దీని చేతులూ, కాళ్ళూ విరగకొట్టితే చాలు ననుకొంటున్నాను" అని అంటూ ఉండగానే, తాటక చెలరేగి చేతులు ఎత్తి గర్జిస్తూ రాముడిమీద పడబోయింది.

అప్పుడు విశ్వామిత్రమహర్షి హుంకరించి దానిని అదలించినాడు. రామలక్ష్మణులు క్షేమముగా ఉండవలెను అనీ, వారికి జయము చేకూరవలెను అనీ ఆశీర్వదించినాడు.

తాటక ఘోరముగా దుమ్ము ఎగజిమ్ముతూ, ఆ ప్రదేశము అంతా అంధకారబంధురము అయ్యేట్టు చేసివేసింది. ఆ దుమారములో రామలక్ష్మణులు ఒక ముహూర్తముసేపు ఏమీ తెలియకుండా సొమ్మసిల్లి పోయినారు. అంతట అది కంటికి కనబడకుండా మాయము అయిపోయి, వారిమీద రాళ్ళవాన కురిపించడము మొదలు పెట్టింది. రాముడికి కోపము వచ్చినది. తాటకమీద బాణాలు వదలి అది

A C.No.94675

రాళ్ళవాన కురిపించకుండా చేసినాడు. అది కనబడ్డది. రాముడిమీదికి దూక నుంకించింది. తత్ క్షణమే రాముడు దాని రెండు బాహువులూ తెగ వేసినాడు. భుజాలు తెగిపోయి అది రొప్పుతూ, కేకలు పెట్టుతూ కింద పడిపోయింది. వెంటనే లక్ష్మణుడు దాని రెండు చెవులూ, ముక్కూ అంటకోసినాడు.

ఆ తాటక కామరూపిణి. అప్పటికి అప్పుడు అనేకరూపాలతో కనబడుతూ, మాయము అయిపోతూ మహాభయంకరముగా మళ్ళీ రాళ్ళవాన కురిపించసాగింది. రాళ్ళవానలో రామలక్ష్మణులు చిక్కుకొని పోయినారు. విశ్వామిత్రమహర్షి వారిని చూచి, "ఓ రామా! ఆడది అనే దాక్షిణ్యము నీవు ఇక చాలించవలెను. ఈ యక్షిణి దుష్టచారిణి, పరమ పాపి, యజ్ఞ హంత్రిణి. దీనిని నీవు వెంటనే తెగవేయవలెను. సంధ్యాకాలము సమీపిస్తూ ఉంది. ఇక దీని మాయలు పెచ్చుపెరిగిపోతవి. సూర్యాస్తమయము అయిన తరువాత దీనిని నీవు ఎదిరించలేవు. ఈ లోపలనే నీవు దీనిని సంహారము చేయవలెను" అన్నాడు.

అప్పుడు తాటక ఎక్కడ ఉన్నది శబ్దవేధిత్వజ్ఞానముతో రాముడు కనిపెట్టినాడు. దానిమీద బాణాలు వదలినాడు. దానికి ఎంతో మాయాబలము ఉన్నప్పటికిన్నీ అది ఆ బాణాలకు కట్టుబడిపోయింది. పెద్ద పెద్ద కేకలు పెట్టుతూ అది అమిత పరాక్రమముతో పిడుగుమాదిరిగా రామలక్ష్మణులమీద పడబోయింది. రాముడు దానిని చూచినాడు. దాని ఎదురురొమ్ములమీద ఒక బాణము వదలినాడు. అంతటితో అది కిందపడ్డది, చచ్చిపోయింది.

చచ్చిపోయిన ఆ భైరవాకారను దేవేంద్రుడు, దేవతలు చూడ వచ్చినారు. 'భలే భలే' అని రాముణ్ణి మెచ్చుకొన్నారు. అప్పుడు దేవేంద్రుడు విశ్వామిత్ర మహర్షిని చూచి, "ఓ బ్రహ్మర్షీ! నీవు ఈ తాటకను చంపినందుకు మేము అందరమూ సంతోషిస్తున్నాము. భృశాశ్వుడి సంతతి అయిన అస్త్రశస్త్రాలను అన్నిటినీ నీవు ఆర్జించినావు. నీ తపోబలమువల్ల ఆవి అన్నీ నీ దగ్గర వర్థిల్లుతూ ఉన్నవి. ఈ రాముడు అమిత ధైర్యముతో నిన్ను అనుసరించి ప్రవర్తిస్తున్నాడు. శస్త్రాస్త్ర విద్యలను అభ్యసించడానికి తగినవాడు. ఇతడు దేవతలకు ఒక మహత్కార్యము నేరవేర్చవలసి ఉంది. ఆ యా శస్త్రాస్త్రాలను అన్నిటిని నీవు ఈ రాముడికి ఉపదేశము చేయవలెను" అని చెప్పినాడు. అంతట మహర్షులూ, దేవతలూ, దేవేంద్రుడూ విశ్వామిత్రమహర్షిని కొనియాడి వారి దారిన వెళ్ళిపోయినారు.

సంధ్యాకాలము కాబోతూ ఉంది. విశ్వామిత్రమహర్షి సంతోషముతో రాముణ్ణి దగ్గరకు తీసుకొని శిరము ఆఘ్రాణించి, "రామా! మనము ఈ రాత్రి ఇక్కడనే

ఉందాము. వేకువనే లేచి మన ఆశ్రమానికి పోదాము" అన్నాడు. అంతటితో ఆ మహారణ్యములో ఉపద్రవము అంతా తొలగిపోయింది.

అది కుబేరుడికి చైత్రరథము వంటి ఉద్యానవనముగా మారిపోయింది.

27

అస్త్రోపదేశము

ఆ రాత్రి రామ లక్ష్మణ విశ్వామిత్రులు అక్కడ గడిపినారు. ప్రాతఃకాలాన వారి వారి విహితానుష్ఠానాలను ముగించుకొన్నారు. విశ్వామిత్రమహర్షి రాముణ్ణి చూచి మందహాసము చేస్తూ మాధుర్యము ఉట్టిపడే వాక్కులతో, "రామా! నీ పరాక్రమానికి నేను సంతుష్టుడను అయినాను. సర్వాస్త్రాలనూ సంతోషముగా నీకు ఇప్పుడు స్వాధీనముచేయ తలచినాను. ఆ అస్త్రాల బలమువల్ల దేవాసురగణాలు అన్నీ లోపడిపోతవి. వారినే కాకుండా, మరి ఏ ఇతర శత్రువులను అయినా నీవు జయించ కలుగుతావు.

"రామా! ఆ యా అస్త్రాలను అన్నిటినీ ఉపదేశము చేస్తాను. నీకు ముందుగా దండచక్రాన్ని ఇస్తాను. అది చాలా గొప్పది. ధర్మచక్రాన్నీ, కాలచక్రాన్నీ, అత్యుగ్రము అయిన విష్ణుచక్రాన్నీ, ఐంద్రాస్త్రాన్నీ, వజ్రాస్త్రాన్నీ, శివదేవతాకము అయిన శూలాన్నీ, బ్రహ్మశిరాస్త్రాన్నీ, ఐషికాస్త్రాన్నీ, బ్రహ్మాస్త్రాన్నీ ఇస్తాను. బ్రహ్మాస్త్రముకన్నా ఉత్తమము అయింది మరి ఒకటి లేదు.

"మోదకీ, శిఖరీ అనే రెండు గదలు ఉన్నవి. అవి రెండూ దీప్తిమంతాలు. వాటిని నీకు ఇస్తాను. ధర్మపాశాన్నీ, కాలపాశాన్నీ, వరుణపాశాన్నీ నీకు ఇస్తాను. వరుణపాశముకన్నా ఉత్తమము అయింది మరి ఒకటి లేదు. శుష్కాశని ఆర్ద్రాశని అనే పిడుగులనూ, పైనాకాస్త్రాన్నీ, నారాయణాస్త్రాన్నీ, అగ్నిదేవుడికి ప్రియము అయిన ఆగ్నేయాస్త్రాన్నీ, ప్రథనము అనే వాయవ్యాస్త్రాన్నీ, హయశిరాస్త్రాన్నీ, క్రౌంచాస్త్రాన్నీ, విష్ణుశక్తి రుద్రశక్తి అనే రెండు శక్తులనూ ఇస్తాను.

"రాక్షసులు ధరించే కంకాళ కపాలాలు అనే ముసలాలనూ, వైద్యాధరాస్త్రాన్నీ గంధర్వులు మెచ్చుకొనే మానవాస్త్రాన్నీ, నిద్ర కలుగజేసే స్వాపనాస్త్రాన్నీ, శాంతి కలుగజేసే ప్రశమనాస్త్రాన్నీ, సౌరాస్త్రాన్నీ, గర్వము కలుగజేసే దర్పణాస్త్రాన్నీ, శోషిల్లచేసే శోషణాస్త్రాన్నీ, తాపము ఎత్తించే సంతాపనాస్త్రాన్నీ, ఏడిపించే విలాపనాస్త్రాన్నీ, ఎవరూ ఎదిరించలేని మదనాస్త్రాన్నీ, పిశాచకదేవతాకము అయిన మోహనాస్త్రాన్నీ, తామసమూ సౌమనమూ సంవర్ధనమూ దుర్ధర్షమూ మౌనలమూ సత్యమూ మాయాధరమూ తేజఃప్రభమూ శిశిరమూ సుదామనమూ దారుణము అయిన భగాస్త్రమూ, మానవాస్త్రమూ ఇస్తాను.

"ఓ రామా! ఈ అస్త్రాలు అన్నీ ఇచ్ఛాధీనరూపాలు. మహాబలయుతాలు. ఈ ప్రపంచంలో మిగతా అన్ని అస్త్రాలకంటే ఇవి అతిశయము అయినవి. వీటిని అన్నింటినీ నీకు ఇప్పుడే ఉపదేశిస్తాను" అంటూ శుచి అయి, ప్రాఙ్ముఖుడు అయి నిలుచుని అస్త్రమంత్ర సమూహాన్ని రాముడికి ఉపదేశము చేసినాడు. ఆ మంత్రదేవతలను అందరినీ అప్పుడే రాముడి వశము చేయతలచి జపము చేయడము మొదలు పెట్టినాడు. అంతట మహాస్త్రాలు అయిన అస్త్రాలు అన్నీ రాముడికి స్వాధీనము అయినవి. ఆ యా అస్త్రాల దేవతలు అందరూ రాముడి ఎట్టఎదుట నిలుచున్నారు. నమస్కారము చేసి, " ఓ రామప్రభూ! మేమందరమూ మీ కింకరులము" అన్నారు.

అప్పుడు రాముడు ఆ దేవతలను అందరినీ తన చేతులతో తట్టి, "మీరు అందరూ నా చిత్తాన్ని అనుసరించి నడుచుకోవలెను. అవసరము వచ్చినప్పుడు మిమ్ములను పిలుస్తాను. ఇప్పుడు మీ ఇష్టము వచ్చిన చొప్పున ఉండవచ్చును" అన్నాడు.

అప్పుడు ఆ యా అస్త్రదేవతలు అందరూ అంతర్ధానము అయిపోయినారు. అంతట రాముడు విశ్వామిత్రమహర్షికి సాష్టాంగ నమస్కారము చేసినాడు.

28

ప్రయాణము కాబోతున్న విశ్వామిత్రమహర్షిని రాముడు చూచి, "స్వామీ! తాము సాక్షాత్తూ భగవంతుడువంటివారు. సమస్త అస్త్రాలను నాకు అనుగ్రహించినారు. ఇకను దేవతలు అయినా నన్ను ఎదుర్కొనలేరు. తాము ఆ యా అస్త్రాల ఉపసంహారాలను కూడా నాకు ఉపదేశము చేయవలెను" అన్నాడు.

విశ్వామిత్రమహర్షి ఆ యా ఉపసంహార మంత్రాలను అప్పుడే రాముడికి ఉపదేశముచేయ నిశ్చయించుకొన్నాడు. "రామా! సత్యవంతము, సత్యకీర్తి, ధృష్టము, రభసము, ప్రతిహారితము, పరాఙ్ముఖము, లక్షాక్షము, విషయము, దృఢలాభము, సునాభము, దశాక్షము, శతవక్త్రము, దశశీర్షము, శతోదరము, పద్మనాభము, మహానాభము, దుందునాభము, సునాభకము, జ్యోతిషము, కృశనము, వైరాశ్యము, విమలము, యోగంధనము, హరిద్రము, యోగంధరము, దైత్యము, ప్రశమనము, సార్చిర్మాలినీ, ధృతిమాలినీ, వృత్తి మంతము, రుతరము, పితృసౌమనము, విధూతము, సుకరము, కరవికరము, ధనము, ధాన్యము, కామరూపము, కామరుచీ, మోహము, ఆవరణము, జృంభకము, సర్వనాభము, సంతానము, వీరణము అనేవి అన్నీ భృశాశ్వుడి పుత్రులు. ఇవి అన్నీ ఇచ్ఛాధీన రూపాలు. వీటిని అన్నిటినీ దానము

చేస్తాను" అంటూ విశ్వామిత్రమహర్షి ఆ యా ఉపసంహార మంత్రాలను రాముడికి ఉపదేశము చేసినాడు.

రాముడు పరమసంతోషముతో ఆ ఉపసంహార మంత్రాలను అన్నిటినీ జపము చేయసాగినాడు. అప్పుడు ఆ మంత్రాధిష్ఠాన దేవతలు అందరూ దేదీప్యమాన దివ్యదేహాలతో రాముని ఎదుట నిలుచున్నారు. వారిలో కొందరు నిప్పుకణికలవలెనూ, మరికొందరు ధూమసమూహాలవలెనూ, ఇంకా కొందరు సూర్యచంద్రులు అంతటి కాంతిమంతులవలెనూ కనిపించినారు. అందరూ నమ్రభావముతో నమస్కరించినారు. "రామప్రభూ! మమ్ములను తాము స్మరించినారు. వచ్చినాము. ఏమి ఆజ్ఞ" అన్నారు.

"ఓ మంత్రాధిదేవతలారా! మిమ్ములను పిలిచినప్పుడు మీరు అందరూ వచ్చి నాకు సాయపడవలెను. ఇప్పుడు మీరు మీ చిత్తము వచ్చినచోట ఉండవచ్చును" అన్నాడు రాముడు. ఆ మంత్రాధిష్ఠాన దేవతలు అందరూ రాముడికి వీడుకోలు చెప్పి మాయమైపోయినారు.

ఆ తరువాత రామలక్ష్మణులు విశ్వామిత్రమహర్షివెంట ప్రయాణము అయినారు. కొంతదూరము నడిచిన తరువాత వారు ఒక పర్వత ప్రదేశానికి పోయినారు. ఆ సమీపములో రామలక్ష్మణులకు ఒక సుందరోద్యానవనము కనిపించింది. అప్పుడు రాముడు విశ్వామిత్రమహర్షితో, "స్వామీ! ఒళ్ళు జలదరించే మహారణ్యము దాటి వచ్చినాము. ఇది ఏదో ఉద్యానవనము, దర్శనీయముగా ఉంది. వృక్ష సమూహాలు మేఘాలమాదిరిగా కనిపిస్తూ ఉన్నవి. జింకలు అటూ ఇటూ పరుగు లెత్తుతున్నవి. రంగు రంగుల పిట్టలు మహాశ్రావ్యముగా పాటలు పాడుతూ ఉన్నవి. ఇది ఏదో పుణ్యాశ్రమము అయి ఉండవలెను. తెలుసుకోవలెను అని కుతూహలముగా ఉంది" అన్నాడు.

29

సిద్ధాశ్రమము

అంతట విశ్వామిత్రమహర్షి ఈ విధముగా చెప్పడము మొదలు పెట్టినాడు. "దేవదేవుడు మహావిష్ణువు తపస్సిద్ధికోసమున్నూ, అష్టాంగయోగసిద్ధికోసమున్నూ అనేక వేల సంవత్సరాలు, ఎన్నో యుగాలు ఈ ప్రదేశములో నివసించినాడు. ఆ మహావిష్ణువు వామనావతారము ఎత్తి దేవకార్యము చక్కబెట్టిన తరువాతన్నూ నివసించడానికి ఇక్కడికే వచ్చినాడు. కాశ్యపుడున్నూ ఇక్కడనే తపస్సిద్ధుడు అయినాడు. అందువల్ల, ఇది 'సిద్ధాశ్రమము' అని ప్రసిద్ధి కెక్కింది.

"మహావిష్ణువు ఇక్కడ తపస్సు చేస్తూ ఉన్న కాలములో దేవేంద్రుణ్ణి దేవగణాలతోనూ, మరుద్గణాలతోనూ బలిచక్రవర్తి జయించివేసి ముల్లోకాలు

రాజ్యపాలనము చేయసాగినాడు. ఆ బలిచక్రవర్తి ఒక మహాయజ్ఞము ఆరంభించినాడు. అంతట దేవతలు అందరూ అగ్నిహోత్రుడి వెనుక బయలుదేరి ఇక్కడికి వచ్చి మహావిష్ణువును సందర్శించి, "ఓ ప్రభూ! విరోచనుడి కొడుకు బలిచక్రవర్తి ఇప్పుడు ఉత్తమోత్తమము అయిన యజ్ఞము చేస్తూ ఉన్నాడు. దారినపోయే ఏ యాచకుడు వచ్చి ఏది అడిగినా లేదు అనకుండా దానము చేసివేస్తున్నాడు. ఆ యజ్ఞము పూర్తి అయ్యే లోపలనే తాము దేవకార్యము చక్కబెట్టవలెను. తాము తమ మాయాబలముతో వామనరూపము ఎత్తి పోయి ముల్లోకాలనూ దానము అడిగి పుచ్చుకొని తిరిగి దేవతలకు పట్టము కట్టవలెను" అని ప్రార్థించినారు.

విష్ణుమూర్తి వారి ప్రార్థనను అంగీకరించినాడు.

"రామా! ఆ కాలములోనే అగ్నిహోత్రుడువంటి కాంతిమంతుడు కాశ్యపుడు అదితితో కూడా మహావిష్ణువును గురించి తపస్సు చేయడము మొదలు పెట్టినాడు. గతకల్మషుడు అయినాడు. దివ్యతేజముతో తేజరిల్లుతూ ఉన్న ఆ కాశ్యపుడికి విష్ణుమూర్తి ప్రత్యక్షము అయినాడు.

"ఓ పురుషోత్తమా! నీవు తపోమయుడవు. తపోరాశివి. తపోమూర్తివి. తపస్సే నీ ఆత్మ. మేము తపస్సు చేసినందువలననే నిన్ను ఇపుడు చూడగలుగుతున్నాము. ప్రభూ! నీ శరీరములో ఈ జగత్తు అంతా మాకు కనపడుతూ ఉంది. నీవు ఆదిమధ్యాంతరహితుడవు. అనిర్దేశ్యుడవు. మేము నీ శరణు జొచ్చినాము. మమ్ములను నీవు కాపాడవలెను" అంటూ కాశ్యపుడు స్తోత్రము చేసినాడు. మహావిష్ణువు సంతోషించి, "ఓ కాశ్యపా! నీకు శుభము అవుతుంది. నేను వరము ఇవ్వడానికి నీవు తగినవాడవు. నీవు కావలసిన వరము అడుగు, ఇస్తాను" అన్నాడు.

"ఓ వరదా! నిన్ను దేవతలు అందరూ యాచించినారు. ఇప్పుడు ఈ అదితీ, నేనూ యాచిస్తున్నాము. దేవతలు అందరూ శోకార్తులు అయి ఉన్నారు. వారికి నీవు తోడ్పడవలెను. ఇందరమూ యాచిస్తున్న వరము నీవు సంతోషముగా ఇవ్వవలెను.

"ఓ స్వామీ! ఈ అదితికి నీవు పుత్రుడుగా పుట్టి, ఇంద్రుడికి తమ్ముడవు అయి రాక్షసులను నిర్మూలనము చేయవలెను. ఓ ప్రభూ! నీవు ఇక్కడనుంచి లేవవలెను" అని కాశ్యపుడు ప్రార్థించినాడు. అందుకు మహావిష్ణువు అంగీకరించినాడు. అంతట కాశ్యపుడు, "ఓ దేవా! నీ అనుగ్రహమువల్ల నా తపస్సు ఇక్కడ సిద్ధించింది. కాబట్టి, ఈ ప్రదేశము 'సిద్ధాశ్రమము' అని ప్రసిద్ధి కెక్కవలెను" అన్నాడు. అందుకున్నా మహావిష్ణువు 'సరేను' అన్నాడు.

"ఓ రామా! అటుతరువాత ఆ మహాతేజోవంతుడు విష్ణుమూర్తి అదితి కడుపున పుట్టినాడు. వామన రూపముతో వటువుగా బలిచక్రవర్తి దగ్గరకు పోయినాడు. సమస్తప్రాణులకున్నూ మేలు చేయదలచి నిరభిమానముతో మూడు అడుగుల మేరను భిక్షము అడిగి పుచ్చుకొన్నాడు. మూడు అడుగులూ వేసి ముల్లోకాలూ ఆక్రమించినాడు. తన తేజస్సుతో బలిచక్రవర్తిని బంధించి వేసినాడు. అంతట దేవేంద్రుడికి ఆ ముల్లోకాలనూ ఒప్పగించినాడు. వామన రూపములో ఉన్న మహావిష్ణువు ఈ ఆశ్రమ ప్రదేశము శ్రమనాశని అయినందువల్ల ఇక్కడికి వచ్చి నివసించినాడు.

"ఇప్పుడు నేనూ భక్తితాత్పర్యాలతో ఈ ఆశ్రమములో నివాసము పెట్టుకొన్నాను. ఓ రామా! ఈ ఆశ్రమపదానికే రాక్షసులు వచ్చి నా యజ్ఞాన్ని విఘ్నము చేస్తూ ఉన్నారు. ఈచోటనే వాండ్లను సంహారము చేయవలెను. ఇప్పుడే సిద్ధాశ్రమములోకి పోదాము. నాయనా రామా! ఈ ఆశ్రమపదము నాది అయినట్టే సీదిన్నీ" అంటూ విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులను వెంటపెట్టుకొని ఆ ఆశ్రమపదములో అడుగు పెట్టినాడు. మంచు విడిపోయిన తరువాత పునర్వసూ నక్షత్రాలలో సంచారము చేసే చంద్రుడికి మళ్లే విశ్వామిత్రమహర్షి అప్పుడు విరాజిల్లినాడు.

సిద్ధాశ్రమవాసులు అందరూ ఆయనను చూచినారు. చూచీ చూడటముతో పరుగులెత్తుకొంటూ ఆయనకు ఎదురుగుండా వచ్చి యథార్హముగా ఆయనకు అర్ఘ్యపాద్యాదులు ఇచ్చినారు. పూజ చేసినారు. రామలక్ష్మణులకు అతిథి సత్కారాలు చేసినారు.

రామలక్ష్మణులు అలసట తీర్చుకొనినారు. అప్పుడు అక్కడ పెద్దపులి మాదిరిగా ఉన్న విశ్వామిత్రమహర్షిని చూచినారు. నమస్కారము చేసి, "ఓ బ్రహ్మర్షీ! తాము ఇప్పుడే, ఈనాడే యజ్ఞదీక్ష వహించవలెను. ఇది సిద్ధాశ్రమము అని తాము సెలవు ఇచ్చినారు. ఇది సార్థకనామము అయి తీరుతుంది" అన్నారు.

అంతట ఆ మహాతేజోవంతుడు, ఆ జితేంద్రియుడు విశ్వామిత్రమహర్షి యజ్ఞదీక్షితుడు అయినాడు.

ఆ రాత్రి రామలక్ష్మణులు స్కంద విశాఖులవలె జాగరూకతతో గడిపినారు. వేకువనే లేచి స్నానము చేసి పరిశుద్ధులు అయి ప్రాతఃసంధ్యను ఉపాసించి గాయత్రీ జపము చేసి హుతాగ్నిహోత్రుడు అయి కూర్చొని ఉన్న విశ్వామిత్రమహర్షిని సందర్శించినారు. ఆయనకు నమస్కారాలు చేసినారు.

30

మారీచ సుబాహువుల వధ

రామలక్ష్మణులు కేవలము శత్రుసంహారకులే కారు, ఎక్కడ ఎప్పుడు ఎవరితో ఏమి మాట్లాడవలెనో తెలిసినవారు. విశ్వామిత్రమహర్షి యజ్ఞదీక్షలో ఉన్నారు. ఆయనను అప్పుడు పలకరించ కూడదు అనుకొన్నారు. అక్కడి మహర్షు లందరినీ చూచి, "మహాత్ములారా! రాక్షసులు ఎప్పుడు వస్తారు? మేము వాండ్ల కోసము ఎక్కడ కనిపెట్టుకొని ఉండవలెను" అని రాముడు ప్రశ్నించినాడు.

ఆ అన్నదమ్ములు అప్పటికప్పుడే పోరాటానికి సంసిద్ధులు అవుతూ ఉన్నందుకు ఆ మహామునులు అందరూ మెచ్చుకొన్నారు. "ఓ సోదరులారా! రాక్షసులు ఏ క్షణములోనైనా రావచ్చు. కాబట్టి, మీరు ఈ రోజు మొదలుకొని, ఆరు అహోరాత్రములు కనిపెట్టుకొని ఉండవలెను" అన్నారు.

అంతట రామలక్ష్మణులు ధనుర్ధరులు అయినారు. అయిదు అహోరాత్ర ములూ నిద్రపోకుండా వారు విశ్వామిత్రమహర్షినీ, ఆ తపోవనాన్నీ కావలి కాసినారు. ఆరవ పగలు వచ్చింది.

విశ్వామిత్రమహర్షి యజ్ఞము యథాప్రకారముగా సమంత్రకముగా సశాస్త్రీయముగా సాగుతూ ఉంది. ఋత్విజులు మొదలు అయినవారు అందరూ వారి వారి పనులను నెరవేరుస్తూ ఉన్నారు.

రాముడు లక్ష్మణుడితో, "తమ్ముడా! ఏకాగ్రచిత్తముతో నీవు సన్నద్ధుడవు అయి ఉండవలెను" అంటున్నాడు.

ఇంతలో ఆకాశము బ్రద్దలు అయిపోయేటంత భయంకరధ్వని అయింది. దర్భలూ, పానపాత్రలూ, హోమపాత్రలూ, సమిధలూ, పూలూ అన్నీ ఒక్కసారిగా అంటుకొన్నవి. భగభగ మంటలు లేచినవి.

వర్షాకాల మేఘాల మాదిరిగా ఆకాశాన్ని అంతా మాయమబ్బులతో మారీచ సుబాహువులు కమ్మివేసినారు. ఆ మాయమబ్బులు అమితవేగముతో పరుగలెత్త సాగినవి. అప్పుడు మారీచ, సుబాహువులు వెల్లువగా నెత్తురు కురిపించ సాగినారు. ఆ రక్తప్రవాహము వేదికమీద పడబోతున్నది. అప్పుడు మరింతగా మంటలు లేచినవి.

ఆకాశములో తిరుగుతూ ఉన్న రాక్షసులను రాముడు చూచినాడు. మారీచ సుబాహువులు ఆ అన్నదమ్ములమీద దూకపోతున్నారు. రాముడు పరమక్రుద్ధుడు అయిపోయినాడు. తత్క్షణము పరమభాస్వరము అయిన మానవాస్త్రాన్ని మారీచుడి

ఎదురురొమ్ములమీద వదలినాడు. ఉత్తరక్షణాన ఆగ్నేయాస్త్రాన్ని సుబాహువు రొమ్ములమీద వేసినాడు.

ఓరుగాలి మేఘాలను నెట్టుకొని పోయేట్టుగా, ఆ మానవాస్త్రము మారీచుణ్ణి నూరుయోజనాల దూరము ఎగరవేసుకొనిపోయి సముద్రములో పడవేసింది. వాడు చేష్టలు తప్పి గిరగిర తిరుగుతూ సముద్రములో పడ్డాడు. కాని చావలేదు. సుబాహువు ఆ ఆగ్నేయాస్త్రానికి నేలకూలి చచ్చిపోయినాడు.

అంతట మారీచ సుబాహువుల అనుచరులు అందరూ అటూ ఇటూ పరుగెత్తసాగినారు. వారిని చూచి రాముడు, "లక్ష్మణా! ఈ రాక్షసులు బహుక్రూరులు. దుష్టులు. పాపకర్ములు. రుధిరాశనులు. వీరిని అందరినీ సంహరించవలసిందేను" అంటూ, దివ్యము అయిన వాయవ్యాస్త్రము వేసి ఆ రాక్షసులను అందరినీ చంపివేసినాడు.

అక్కడి మహామునులు అందరూ ఆశ్చర్యచకితులు అయినారు. ఎంతో సంతోషించినారు. అసుర సంహారము చేపిన దేవేంద్రుణ్ణి దేవతలు పూజించినట్టుగా, అప్పుడు రాముణ్ణి ఆ మహర్షులు పూజించినారు. దశదిశలూ ప్రశాంతముగా తోచినవి. విశ్వామిత్రమహర్షి యజ్ఞము యథావిధిగా సమాప్తము అయింది.

విశ్వామిత్రమహర్షి రాముణ్ణి చూచి, "యశస్వీ! నీ తండ్రి నిన్ను పంపించినందుకు నా పని నెరవేర్చినావు. ఈ సిద్ధాశ్రమ నామము సార్థకము అయింది. నీవల్ల నేను కృతార్థుణ్ణి అయినాను" అని మెచ్చుకొన్నాడు.

31

కృతకృత్యులు అయిన రామలక్ష్మణులు ఆ రాత్రి మహదానందముతో గడిపినారు. సుఖముగా నిద్రపోయినారు. తెల్లవారుతూ ఉండగా నిద్రలేచి, పౌర్వాహ్ణిక కృత్యాలను ముగించుకొని విశ్వామిత్రమహర్షినీ, తక్కిన మహర్షులనూ సందర్శించ పోయినారు.

అగ్నిహోత్రుడి మాదిరిగా తేజరిల్లుతూ ఉన్న విశ్వామిత్రమహర్షికి సాష్టాంగ నమస్కారము చేసినారు. తక్కిన మహర్షులకున్నూ అభివాదాలు చేసినారు. అంతట రాముడు గంభీరముగా, "ఓ బ్రహ్మర్షీ! ఈ కింకరులు ఇంకా ఏమిచేయవలెనో యథేష్టముగా ఆజ్ఞాపించవలసింది. తమ ఆజ్ఞలను అన్నిటినీ నెరవేరుస్తాము" అన్నాడు.

ఈ మాటలకు అక్కడి మహర్షులు అందరూ సంతోషించినారు. విశ్వామిత్రమహర్షి అనుమతితో వారిలో ఒకరు, "రామా! మిథిలాధిపతి అయిన

జనకమహారాజు పరమధర్మిష్టము అయిన మహాయజ్ఞము ఒకటి తలపెట్టినాడు. మేము అందరమూ అక్కడికి పోతున్నాము. మీరు అన్నదమ్ములున్నూ మాతో రావలసింది. అక్కడ జనక మహారాజు దగ్గర ధనూరత్నము ఒకటి ఉంది. అది చాలా గొప్పది. దేదీప్యమానముగా తేజరిల్లుతూ ఉంటుంది. భయంకరముగా కనబడుతుంది. దానిని మీరు అన్నదమ్ములు చూచితీరవలెను.

"పూర్వము మిధిలాధిపతి దేవరాతుడు గొప్ప యజ్ఞము చేసినాడు. అందుకు దేవతలు అందరూ మెచ్చుకొని ఆ ధనుస్సును యజ్ఞఫలముగా ఆయనకు ఇచ్చినారు. అది శివదేవుడి ధనుస్సు. అప్పటినుంచీ అది మిధిలాధిపతుల ఇంట్లో ఉంటూ ఉంది. దానిని ప్రతినిత్యమూ గంధ పుష్ప ధూప దీపాదులతో పూజచేస్తూ ఉంటారు. ఆయుధపూజా సమయాలలో దానిని ప్రత్యేకముగా పూజ చేస్తారు. దేవ, దానవ, గరుడ, గంధర్వ, యక్ష , రాక్షసులు ఎవరూ దానిని ఎక్కుపెట్టలేకపోయినారు. ఇక మానవుల సంగతి చెప్పనే అక్కరలేదు. అయినప్పటికిన్నీ, అనేకమంది రాజపుత్రులు మహాబలవంతులు ఆ వింటిని ఆరోపించడానికి ప్రయత్నించి విఫలులు అయిపోయినారు. రామా! నీవు ఆ అత్యద్భుత ధనుస్సును చూడవలెను. మీరు జనకమహారాజు చేసే యజ్ఞమునూ చూడవచ్చును. కాబట్టి, మాతో రావలసింది" అని చెప్పినారు.

వారు అందరూ అక్కడనుండి మైథిల దేశానికి ప్రయాణము అయినారు.

విశ్వామిత్రమహర్షి ముందుగా వనదేవతలను అందరినీ ఆహ్వానించి, "ఓ వనదేవతలారా! మీరు అందరూ ఇక్కడ సుఖముగా ఉండవలెను. నాకు కార్యసిద్ధి అయింది. సంతోషము. నేను ఇప్పుడు ఈ సిద్ధాశ్రమమును వదలిపెట్టి పోతున్నాను. ఉత్తరత్రా నేను గంగానదికి ఉత్తరాన ఉన్న హిమాలయ పర్వత ప్రాంతాలకు వెళ్ళిపోతాను" అని వీడ్కోలు చెప్పి రామలక్ష్మణులతోనూ, మహామునులతోనూ ఆ సిద్ధాశ్రమానికి ప్రదక్షిణము చేసి ఉత్తరాభిముఖముగా నడిచినాడు. వారివెంట అగ్నిహోత్ర సంభారాలు వేసుకొని ఒక నూరు బండ్లు సాగినవి. అప్పుడు ఆ సిద్ధాశ్రమములో ఉంటూ ఉన్న జింకలు గుంపులు గుంపులుగా వారివెంట పడినవి. వాటిని చూచి అక్కడి రకరకాల పక్షులున్నూ ఎగురుకొంటూ ఆకాశాన బారులు తీరి వారివెంట బయలు దేరినవి. అంతట విశ్వామిత్రమహర్షి అక్కడ ఆగి ఆ పక్షులకూ, ఆ మృగాలకూ వీడ్కోలు చెప్పి అవి తమ వెంటపడకుండా వెనుకకు పంపించివేసినాడు.

వారు అందరూ చాలా దూరము నడిచినారు. సూర్యాస్తమయము అవుతూ వుండగా శోణాకూలము చేరినారు. ఆ రాత్రి వారు అందరూ అక్కడ

ఉండిపోదలచినారు. అంతట ఆ శోణానదములో స్నానముచేసి జపహోమాదులు ముగించినారు. సూర్యాస్తమయము అయిపోయిన తరువాత, వారు అందరూ విశ్వామిత్రమహర్షి చుట్టూ కూర్చున్నారు.

రామలక్ష్మణులున్నూ సంధ్యను ఉపాసించినారు. ఆ మహామునులకు అందరికి అభివాదము చేసి, విశ్వామిత్రమహర్షికి పాదాభివందనము చేసి ఆయనకు అభిముఖముగా కూర్చుని, "ఓ స్వామీ! ఈ ప్రాంతము అంతా శోభాయమానముగా ఉంది. ఇది ఎవరి దేశమో తెలుసుకోవలెను అని కుతూహలముగా ఉంది" అన్నాడు రాముడు.

అంతట విశ్వామిత్రమహర్షి ఆ దేశ వృత్తాంతము ఈవిధముగా చెప్పసాగినాడు

32

విశ్వామిత్రుని జన్మకథ

బ్రహ్మమానసపుత్రుడు కుశుడు అనే తాపసి పూర్వము బ్రహ్మలోకము నుంచి ఈ భూలోకములోకి వచ్చినాడు. అతడు దృఢవ్రతుడు, ధర్మజ్ఞుడు. శౌర్య సంపన్నుడు. మహాకులీన అయిన విదర్భరాజపుత్రిని పెండ్లి ఆడినాడు. ఈడూ జోడూ అయిన ఆ దంపతులకు కుశాంబుడూ, కుశనాభుడూ, అధూర్తజనుడూ, వసువూ అనే నల్గురు పుత్రులు పుట్టినారు. ఆ నల్గురూ తండ్రితో సరిసమానము అయిన సద్గుణసంపన్నులు. అమిత తేజోవంతులు. మహోత్సాహులు. పరమ ధార్మికులు. సత్యసంధులు.

వారు నల్గురూ క్షత్రియధర్మాన్ని అవలంబించవలెను అని కుశుడు నిశ్చయించినాడు. ఈ భూమిని నాల్గు భాగాలు చేసి వారికి ఇచ్చి, "ఓ పుత్రులారా! మీ మీ భూభాగాలను మీరు రాజ్యము ఏలవలెను. మీకు అందువల్ల పుణ్యము వస్తుంది" అని చెప్పినాడు. తండ్రి నిర్ణయించినందువల్ల వారు నలుగురూ రాజ్యపాలనాసక్తులు అయినారు. లోకసమ్మతముగా రాజ్యపాలనము చేయడానికి ముందుగా రాజధానీ నగరాలను కట్టించడము మొదలు పెట్టినారు. మహాతేజోవంతుడు అయిన కుశాంబుడు కౌశాంబీ నగరాన్ని కట్టించినాడు. ధర్మాత్ముడు కుశనాభుడు 'మహోదయము' అనే పట్టణాన్ని కట్టించినాడు. అధూర్తజనుడు 'ధర్మారణ్యము' అనే పట్టణాన్నీ, వసువు 'గిరివ్రజము' అనే పట్టణాన్ని కట్టించినారు.

"రామా! మనము ఇప్పుడు ఉన్న ఈ ప్రదేశము ఆ వసురాజు రాజ్యములోనిది. ఈ దేశము చుట్టూ అయిదు కొండలు ఉన్నవి. అందువల్లనే, రాజధానీ నగరమునకు 'గిరివ్రజము' అని పేరు పెట్టినారు. మంగళకరము అయిన ఈ శోణనదమే

'సుమాగధి' అని ప్రసిద్ధి కెక్కింది. ఈ నది నుంచే ఈ దేశాన్ని 'మగధదేశము' అని కూడా అన్నారు. ఈ మాగధీనది అయిదుకొండల మధ్యనూ పూలమాలకుమల్లే శోభాయమానముగా తూర్పునుంచి పడమటికి ప్రవహిస్తూ ఉంది. వసురాజు మహాత్మ్యమువల్ల ఈ నదీ జలాలు పారినంతమేరనూ భూమి సుక్షేత్రము అయింది. సస్యశాలిని అయింది. సుభిక్షము అయిన దేశమున్నూ అయింది.

"రామా! కుశుడి రెండవ కుమారుడు కుశనాభుడు రాజర్షి. ధర్మాత్ముడు. 'ఘృతాచి' అనే అప్సరాంగనను పెండ్లి ఆడినాడు. ఆ దంపతులకు నూరుగురు ఆడపిల్లలు పుట్టినారు. వారు అసమాన రూపవతులు. ఆ రూప యౌవన సంపన్నులు ఒకనాడు సొమ్ములు అన్నీ పెట్టుకొని, ఇంకా గంధ పుష్పాదులతో చక్కగా అలంకరించుకొని తొలకరి మెరుపులవలె మెరసిపోతూ ఉద్యానవనానికి పోయినారు. అక్కడ గుబురుగా ఉన్న చెట్ల మధ్యను వారు సంతోషాతిశయముతో వీణలు వాయిస్తూ, సంగీతాలు పాడుతూ, నృత్యము చేస్తూ, సర్వాంగాలూ శోభిస్తూ ఉంటే, కారుమబ్బులతో తళుక్కుమనే చుక్కలవలె కనిపించినారు.

వాయుదేవుడు చూచి వారి దగ్గరకు చేరి, "ఓ కన్నెలారా! మిమ్ములను నేను వలచినాను. మీరు అందరూ నన్ను పెండ్లి ఆడవలసింది. మీకు మానవత్వము వదలిపోతుంది. ఇక మీకు జరామరణాదులు ఉండవు. మీరు దేవకన్నెలు అవుతారు. మీ యౌవనము అక్షయము అవుతుంది" అన్నాడు.

ఆ కన్నెలు నవ్వుతూ, "ఓ వాయుదేవుడా! నీ ప్రభావము మేము ఎరుగుదుము. నీవు ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ ఉంటావు. నీకు ఏ అడ్డూ లేదు. ఎక్కువ తక్కువలూ లేవు. ఇప్పుడు మమ్ములను ఎందుకు అవమానించ తలచినావు? మేము కుశనాభుడి కూతుళ్ళము. నిన్నే కాదు, నీ ప్రభువు అయిన దేవేంద్రుణ్ణి కూడా పదభ్రష్టుణ్ణి చేయగలము. ఇంతమాత్రానికి మా శక్తి యుక్తులను వ్యర్థము చేయడము ఎందుకు అని ఊరుకుంటున్నాము. నీ దుర్బుద్ధి మా తండ్రికి తెలిస్తే నిన్ను హతమారుస్తాడు. జాగ్రత్త. మమ్ములను అవమానించవద్దు. మేము ధర్మము తప్పము. మా తండ్రే మా ప్రభువు. పరమదైవము. ఆయన మమ్ములను ఎవరికి ఇవ్వవలెను అనుకుంటే వారినే భర్తగా వరిస్తాము" అన్నారు.

వాయుదేవుడికి పట్టరాని కోపము వచ్చింది. వారిని వశపరచుకోవలెను అనుకొన్నాడు. వారి సర్వావయవాలలోనూ దూరినాడు. అంతట వారు అందరూ కురూపులూ, కుబ్జలూ అయిపోయినారు. అడుగులు తడబడుతూ తండ్రి దగ్గరకు పోయి ఏడుస్తూ నేలమీద కూలబడ్డారు.

కుశనాభుడు వారిని అందరినీ చూచినాడు. పరమశోభనలు అయిన వారు అట్లా కురూపలూ, కుబ్జలూ అయిపోయినందుకు ఆశ్చర్యచకితుడు అయి, "పిల్లలారా! ఇది ఏమిటి? చెప్పవలసింది. మీరు ఇట్లా కురూపలూ, కుబ్జలూ ఎందుకు అయిపోయినారు? ఎవడు అయినా ధర్మహాని చేసినాడా? పలుకరేమి? ఏడుస్తారు. మాట్లాడరు ఎందువల్ల" అంటూ నిట్టూర్పులు విడిచినాడు.

33

ఆ కన్నెలు తండ్రి పాదాలు పట్టుకొని, "ప్రభూ! ఈ ప్రపంచము అంతటా సంచారముచేసే వాయుదేవుడు మమ్ములను బలాత్కరించినాడు. ధర్మాన్ని పాటించలేదు. అక్రమముగా ప్రవర్తించినాడు. మేము ఆకులచాటు పిందెల మాదిరిగా తండ్రిచాటు బిడ్డలము అనీ, స్వచ్ఛందులము కాము అనీ, మా తండ్రిని పోయి అడగవలసింది అనీ, ఆయన అంగీకరిస్తేనే మేము పెండ్లి ఆడుతాము అనీ చెప్పినాము. ఆ పాపకర్ముడు మేము ఏమి చెప్పినా ఎన్ని చెప్పినా వినలేదు. మమ్ములను భంగపరచినాడు. ఈవిధముగా అయిపోయినాము" అంటూ ఏడ్చినారు.

కుశనాభుడు అసమానపరాక్రమవంతుడు అయినప్పటికిన్నీ పరమధార్మికుడు. ఆలోచనాపరుడు. కూతుళ్ళను చూచి, "ఓ కన్నెలారా! అపరాధులను క్షమించటమే క్షమావంతుల కర్తవ్యము. మీరు మహాగొప్పగా ప్రవర్తించినారు. అడిగితే లొంగిపోలేదు. అవమానపరచినా ఓర్చుకొన్నారు. పురుషులకు అయినా, స్త్రీలకు అయినా క్షమే గొప్ప అలంకారము. అపరాధులను క్షమించటము అశక్యము. అందులో దేవతలే అపరాధము చేసినప్పుడు క్షమించటము అంతకన్నా అశక్యము. ఆడుపిల్లలు మీరు అందరూ ఏకమై క్షమించటము అన్నిటికన్నా అశక్యము అయిన విషయము. మీరు నా పరువునూ, మన కులగౌరవాన్నీ నిలబెట్టినారు.

"ఓ పిల్లలారా! క్షమే దానము. క్షమే యజ్ఞము. క్షమే సత్యము. క్షమే యశస్సు. క్షమే సమస్త ధర్మాలకూ మూలము. ఈ సకలచరాచరాత్మకము అయిన జగత్తు అంతా క్షమమీదనే ఆధారపడి ఉంది" అని చెప్పి ఓదార్చి కూతుళ్ళను పంపించి వేసినాడు.

అంతట మంత్రిసత్తములను రావించి, ఆ కూతుళ్ళను ఎవరికి ఇచ్చి పెండ్లి చేయటము? ఎప్పుడు పెండ్లి చేయటము? ఎక్కడ పెండ్లి చేయటము? అని ఆలోచించినాడు.

ఆ కాలములో సదాచారసంపన్నుడూ, ఊర్ధ్వరేతస్కుడూ అయిన 'చూళి' అనే బ్రాహ్మణుడు వైదిక తపస్సు చేయటము మొదలు పెట్టినాడు. 'ఊర్మిళ' అనే

గంధర్వాంగన కూతురు 'సోమద' అనే ఆమె బ్రాహ్మణసేవాపరాయణత్వముతో ఆయనకు అప్పుడు సమస్తోపచారాలూ చేయసాగింది. చూళి తపస్సిద్ధుడు అయినాడు. ఆ గంధర్వాంగన పరిచర్యకు సంతుష్టుడు అయి, "ఓ సోమదా! నీ శుశ్రూషకు మెచ్చుకొన్నాను. నేను ఏమి ఇచ్చి సంతోషపెట్టవలెను చెప్పు" అన్నాడు. అందుకు ఆమె ఎంతో సంతోషపడ్డది. ఆమె మాట నేర్పరి. మధురస్వరముతో, "ధర్మాత్మా! తాము బ్రహ్మవర్చస్సులో బ్రాహ్మణులను అందరినీ అతిశయించినారు. సాక్షాత్తు బ్రహ్మదేవుడుగా ఉన్నారు. నాకు పెనిమిటి ఎవడూ లేడు. నేను ఎవరినీ పెండ్లి ఆడలేదు. ఇక ముందు ఎవరినీ పెండ్లి చేసుకోను. నేను నైష్ఠిక బ్రహ్మచారిణిని. బ్రాహ్మణ శక్తియుక్తుడు అయిన పుత్రుణ్ణి నాకు మీరు అనుగ్రహించవలెను" అన్నది సోమద.

చూళి ప్రసన్నుడు అయినాడు. మనసా సంకల్పించినాడు. ఆమెకు 'బ్రహ్మదత్తుడు' అనే పుత్రుడు పుట్టినాడు.

ఆ బ్రహ్మదత్తుడు కాంపిల్యా నగరానికి రాజు అయినాడు. దేవేంద్రుడి మాదిరిగా రాజ్యపాలనము చేయసాగినాడు. అతనికి కుశనాభుడు తన నూరుగురు కూతుళ్ళనూ ఇచ్చి వివాహము నిశ్చయించినాడు. ఆ బ్రహ్మదత్తుణ్ణి రావించి ఎంతో సంతోషముతో కన్యాదానము చేసినాడు. బ్రహ్మదత్తుడు వరుసగా ఆ కన్నెల పాణులు పట్టుకొన్నాడు. అంతట వారి కుబ్జత్వము వదలిపోయింది. వెనుకటి మాదిరిగా దివ్యసుందరవిగ్రహులు అయినారు. కుశనాభుడు వారిని అందరినీ పురోహితులతో కూడ బ్రహ్మదత్తుడివెంట కాంపిల్యా నగరానికి పంపించినాడు.

సోమద కోడళ్ళను అందరినీ చూచి సంతోషించింది. అత్యంత ఆదరముతో కౌగలించుకొన్నది. కుశనాభుణ్ణి ప్రశంసించింది.

34

"రామా! బ్రహ్మదత్తుడివెంట కూతుళ్ళు అందరూ వెళ్ళిపోయిన తరువాత, ఇంట్లో ఒక్కపిల్లవాడు అయినా లేడే అని కుశనాభుడు విచారపడిపోయి, పుత్రేష్టిని ఆరంభించినాడు. అప్పుడు ఆయన తండ్రి కుశుడు అక్కడికి వచ్చి కుమారుణ్ణి చూచి, 'నాయనా! నీకు నీఅంతటి పుత్రుడు పుట్టుతాడు. వాడు పరమధార్మికుడు అవుతాడు. 'గాధిరాజు' అని ప్రసిద్ధి కెక్కుతాడు. నీ కీర్తిని శాశ్వతము చేస్తాడు' అని చెప్పి ఆకాశమార్గాన బ్రహ్మలోకము పోయినాడు. కొంతకాలము అయిన తరువాత కుశనాభుడికి కొడుకు పుట్టినాడు.

"అతడే పరమధార్మికుడు అయిన మా తండ్రి గాధిరాజు. నేను కుశవంశములో పుట్టినాను కనుక నన్ను 'కౌశికుడు' అన్నారు. నాకన్న ముందు నా అక్క 'సత్యవతి' అనే ఆమె పుట్టింది. 'రుచీకుడు' అనే ఆయనకు ఆమెను ఇచ్చి పెండ్లి చేసినారు. నా అక్క సత్యవతి సువ్రత, సత్యశీలిని, ధర్మిష్ఠ, పరమపతివ్రత, మహాభాగ. ఎంతో పుణ్యము చేసింది. ఆమె భర్తానువర్తిని అయి బొందితో స్వర్గానికి పోయింది. అంతటితో తృప్తి చెందక ఈలోకములోవారికి అందరికీ ఐహికాముష్మిక ఫలాలను ఇవ్వ తలచి మహానదిరూపాన హిమవత్పర్వత ప్రాంతములో అవతరించింది. మహారమ్యము అయిన కౌశికీనదిగా ప్రవహిస్తూ ఉంది. అది పుణ్యనది. నా అక్కమీది గౌరవాతిశయమువల్ల నేను హిమాలయపర్వత పార్శ్వములో ఆ కౌశికీనదీతీరాన నివసిస్తూ ఉండేవాణ్ణి. యజ్ఞనియమములవల్ల ఆ ప్రదేశము వదిలిపెట్టి సిద్ధాశ్రమానికి వచ్చినాను. రామా! నీ పరాక్రమమువల్ల నా యజ్ఞము సఫలము అయింది. నేను తపస్సిద్ధుణ్ణి అయినాను" అన్నాడు విశ్వామిత్రమహర్షి.

'బాగుంది బాగుంది' అంటూ మహర్షులు అందరూ, "స్వామీ! తమ వంశము దొడ్డది. తమ వంశీయులు అందరూ ధర్మాత్ములు, మహాత్ములు, బ్రహ్మదేవుడితో సరిసమానులు. తమ భగిని వంశద్యోతకరి. అందరిలో తాము మహాయశులు" అని విశ్వామిత్రమహర్షిని ప్రశంసించ సాగినారు.

"ఓ రామా! నీవు అడిగినందువల్ల ఈ దేశాన్ని గురించి, ప్రసంగవశాత్తు నా వంశాన్ని గురించి చెప్పినాను. నేను ఈ కథలు చెప్పుతూ ఉండడములో సందె మెల్లగా జరిగిపోయింది. ఇప్పుడు రాత్రి చాలా పొద్దుపోయింది. ఇక మనము అందరమూ నిద్రపోవలెను. ఇంకా మేలుకొని ఉండేట్లయితే, రేపు ఉదయము మన ప్రయాణము సాగక పోవచ్చును. అన్నిదిక్కులా చీకట్లు కమ్ముకొన్నవి. జ్యోతిష్మంతాలు అయిన నేత్రాలు ఉన్నట్టుగా ఆకాశము అశ్విన్యాది నక్షత్రాలతోనూ, తక్కిన తారలతోనూ భాసిస్తూ ఉంది. చెట్లు కదలకుండా మెదలకుండా ఉన్నవి. మృగ పక్షి సమూహాలు అలికిడి లేకుండా నిద్రపోతూ ఉన్నవి. గుడ్లగూబలు మొదలు అయిన పక్షులూ, మాంసాశనులు అయిన రాక్షసులూ అటూ ఇటూ తిరుగుతూ ఉన్నట్టుగా ఉంది.

"రామా! చూడు. చీకటిని పారదోలుతూ చంద్రుడు చల్లని కిరణాలతో ఉదయిస్తున్నాడు. సమస్త ప్రాణులమా సంతోషపెట్టే చల్లని వెన్నెల కాస్తూ ఉన్నాడు. ఇక పరుండవలెను" అన్నాడు విశ్వామిత్రమహర్షి.

రామలక్ష్మణులు విశ్వామిత్రుడు చెప్పిన విషయాలకు విస్మితులు అయినారు. ఆయనను కొనియాడి నిద్రపోయినారు.

అస్తంగతుడు అయిన అంశుమంతుడి మాదిరిగా విశ్వామిత్రమహర్షి నిద్రపోయినాడు.

35

గంగాదేవి వృత్తాంతము

"ఓ రామా! తెల్లవారుతూ ఉంది. నీవు నిద్ర లేవవలెను. పూర్వసంధ్యాకాలము అయిపోతూ ఉంది. మనము ఇక ప్రయాణము కావలెను" అని విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులను నిద్రలేపినాడు.

రామలక్ష్మణులు ప్రాతరాహ్నికాలను ముగించినారు. అందరూ ప్రయాణము అయినారు. రాముడు, "ఓ స్వామీ! ఈ శోణనదములో నీళ్ళు లోతుగా లేవు. నిర్మలముగా కూడా ఉన్నవి. అక్కడక్కడ ఇసుకదిబ్బలున్నూ బయటపడ్డవి. ఈ నదాన్ని నావలో దాట నవసరములేదు. నడచిపోవచ్చును. కాని దారి ఎటో తెలియటము లేదు" అన్నాడు.

"మహామునులు అందరూ దాటిపోయే దారి నేను ఎరుగుదును. ఆ దారినే పోదాము" అని చెప్పి విశ్వామిత్రమహర్షి బయలుదేరినాడు. ఆయన వెంట రామలక్ష్మణులున్నూ, తక్కిన మహర్షులున్నూ శోణనదాన్ని దాటి ఆ యా అరణ్యాలు చూస్తూ నడిచినారు. చాలా దూరము పోయినారు. మిట్టమధ్యాహ్నము అయింది. మునిజనసేవితమూ, పరమపావనమూ అయిన జాహ్నవీనది కనిపించింది. హంస సారసాల కుహూనాదాలు వినిపించినవి. మనోహరము అయిన ఆ గంగానదిని చూచి వారు అందరూ ముదితులు అయినారు.

అంతట ఆ నదీ తీరాన వారు అందరూ ఆగిపోయినారు. ఆ పుణ్యనదిలో స్నానాలు చేసి యథాశాస్త్రముగా పితృతర్పణాదులు వదిలి, అగ్నిహోత్రాలు వేల్చి, హోమాలు చేసి అమృతమువంటి హవిస్సును భుజించినారు.

ఆ గంగానదీ తీరాన అంతట వారు అందరూ సంతోషముగా విశ్వామిత్ర మహర్షి చుట్టూ చేరినారు. రాముడు, "మహాత్మా! ఈ గంగానది మూడు పాయలుగా ముల్లోకాలలో ఎందుకు ప్రవహించిందీ, నదీ నదాలు అన్నిటికీ ప్రభువు అయిన సముద్రుణ్ణి ఎట్లా చేరిందీ చెప్పవలెను" అని అడిగినాడు. విశ్వామిత్రమహర్షి మందహాసముచేసి, ఈ విధముగా చెప్పడము మొదలు పెట్టినాడు.

"వెండీ, బంగారము మొదలు అయిన ధాతువులు అన్నిటికీ ఈ ప్రపంచములో గనిగా 'హిమవంతుడు' అనే పర్వతరాజు ఉన్నాడు. అతడు సన్నని నడుముతో, చక్కని చుక్కవంటి 'మనోరమ' అనే ఆమెను పెండ్లి ఆడినాడు. ఆమె

మేరురాజపుత్రి. ఆ దంపతులకు ఇద్దరు పుత్రికలు. అప్రతిమాన సుందరీమణులు పుట్టినారు. వారిలో పెద్దదాని పేరు గంగ, చిన్నది ఉమాదేవి. ఇద్దరూ జగత్ప్రసిద్ధులూ, సర్వలోకపూజ్యులూ అయినారు.

"దేవహితము కోసము గంగను తమకు ఇవ్వవలసింది అని దేవతలు హిమవంతుణ్ణి అడిగినారు. ఆయన ముల్లోకాలవారికీ మేలు చేయదలచి భువనపావని అయిన గంగాదేవిని దేవతలకు మిక్కిలి సంతోషముగా ఇచ్చి వేసినాడు.

"హిమవంతుడి రెండవ కూతురు ఉమ మహోగ్రతపస్సుచేయ నారంభించింది. ఆమెను అప్రతిమానరూపవంతుడు అయిన రుద్రుడికి ఇచ్చి హిమవంతుడు పెండ్లి చేసినాడు. ఆమె రుద్రుడి భార్య అయి ముల్లోకాలవారికి పూజ్యారాలు అయింది.

"త్రిలోకహితాచరణపరులు అయిన దేవతలు కృతార్థులు అయి స్వచ్ఛంద గామినిని గంగాదేవిని వెంటబెట్టుకొని దేవలోకము పోయినారు. ఆమె ఆ దేవలోకములో దివ్యవాహిని అయి ప్రవహించింది. అక్కడివారి అందరి పాపాలూ పోగొట్టి పవిత్రులను చేసింది. రామా! ఆ త్రిపథగామినే ఈ గంగానది."

36

అంతట రాముడు, "మహాత్మా! గంగాదేవి కథను సంక్షేపముగా చెప్పినారు. ఆ యా విషయాలను సవిస్తరముగా చెప్పగలవారు తాము ఒక్కరే. ఆ లోకపావని గంగాదేవి ఎందుకు మూడుపాయల నది అయి ప్రవహించింది? త్రిపథగామిని అయి ఏ ఏ పనులు చేసినందువల్ల ముల్లోకాలలోనూ ఉత్తమోత్తమము అయిన నది అని ప్రసిద్ధి కెక్కింది" అని అడిగినాడు.

అప్పుడు విశ్వామిత్రమహర్షి ఈ విధముగా చెప్ప నారంభించినాడు :

"ఓ రామా! నీలకంఠుడు మహోగ్రము అయిన తపస్సుచేసి ఉమాదేవిని పెండ్లి ఆడినాడు. ఆమెకూడా మహాతపస్సంపన్న, జగదేక సుందరి. ఉభయులూ మోహపరవశులు అయినారు. పుత్రేచ్ఛతో రతికేళిలో నిమగ్నులు అయినారు. ఎంతోకాలము గతించింది. శివతేజము చలించలేదు. ఉమ గర్భము ధరించలేదు. వారికి పుత్రేచ్ఛ తీరలేదు. ఇకను క్షణలేశములోనే ఆమెకు గర్భధారణము అయే స్థితి వచ్చింది.

"ఆ ఉమామహేశ్వరులకు ఎటువంటి అమేయబలాఢ్యుడు పుట్టుతాడోనని బ్రహ్మదేవుడు మొదలు అయిన దేవతలు అందరూ భయభ్రాంతులు అయిపోయినారు.

అంతట వారు అందరూ పరుగెత్తుకొని పోయి శితికంఠుడికి నమస్కారము చేసి, 'ఓ దేవదేవా! ఓ మహాదేవా! మేము దేవతలము అందరమూ నమస్కార పురస్సరముగా వేడుకొంటున్నాము. తాము లోకసంగ్రహకర్తలు. అనుగ్రహించవలెను. తమ తేజానికి పుట్టే పుత్రుణ్ణి ఈ లోకాలు భరించలేవు. తమ తేజస్సును తమ తేజోమయ దేహమునుంచి వదలిపెట్టవద్దు. తమలోనే ఉంచుకొని ముల్లోకాలకూ మేలు చేయవలసింది' అని ప్రార్థించినారు. 'మంచిది. దేవతలు అయిన మీకూ, ముల్లోకాలకూ మేలు అవుతుంది అని మీరు అంటున్నారు కనుక, ఇకముందు నా తేజాన్ని నాలోనే ఉంచుకుంటాను. అయితే, రేతఃస్థానమునుంచి ఇప్పుడు చలించిపోతున్న దానిని ధరించకలవారు ఎవ్వరు' అని వృషభధ్వజుడు ప్రశ్నించినాడు. 'క్షుభితము కాబోతూన్న తేజాన్ని భూమి ధరిస్తుంది' అన్నారు దేవతలు. అంతట మహాదేవుడు తన తేజస్సును భూమిమీద వదలిపెట్టినాడు.

"దేవతలు అందరూ ఉమామహేశ్వరులను స్తోత్రము చేయసాగినారు.

"శైలసుతకు పట్టరాని కోపము వచ్చింది. ఆమె కన్నులు నిప్పుకణికలు అయిపోయినవి. దేవతలను అందరినీ చూస్తూ, 'మా పుత్రోత్పత్తిని మీరు చెడకొట్టినారు. ఇక మీ భార్యలకు సంతానము కలుగ కూడదు. ఇది మొదలు మీ ఆడవాండ్లు గొడ్రాండ్లు అయిపోవలెను' అని శాపము పెట్టింది. కోపము అంతటితో ఆగలేదు. ఆమె భూదేవిని చూస్తూ, 'వసుంధరా! ఓ బుద్ధితక్కువదానా! నీవు విపర్యస్త ప్రకృతివి అయిపో. ఇకనుంచి నీవు అనేకమందికి భార్యవు అయిపో. ఊషరత్వాది నానావిధ రూపిణివి అయిపో. పుత్రసౌఖ్యము ఎన్నటికీ లేకుండా ఏడుస్తూ ఉండు' అని శపించింది.

"భూమిమీద పడ్డ శివుడి రేతస్సు ఆ ఈ ప్రదేశము అనకుండా భూతలము అంతటా ప్రవహిస్తూ ఉంటే, దేవతలు అందరూ భయపడిపోయి అగ్నిదేవుణ్ణి చూచి, 'ఓ దేవా! నీవు వాయుదేవుణ్ణి సహాయము చేసుకొని శివతేజాన్ని దహించివేయవలెను' అని ప్రార్థించినారు.

"అగ్నిహోత్రుడు దహించివేసిన ఆ తేజస్సు శ్వేతపర్వతముగా వెలసింది. కాలక్రమేణా అక్కడ రెల్లు పెరిగింది. అది సూర్యసమానతేజముతో ఒక వనము అయింది. అక్కడనే మహాతేజోవంతుడు అయిన కుమార కార్తికేయుడు జన్మించినాడు.

"ఆ జరిగిన దానికి దేవతలు అందరూ సిగ్గుపడి పోయినారు.

"ఉమామహేశ్వరులు అంతట అక్కడనుంచి బయలుదేరి పడమటి దిక్కుగా పోయి హిమవత్పర్వతోత్తర పార్శ్వము చేరినారు. అక్కడ వారు తపస్సు చేయడము మొదలు పెట్టినారు.

"రామా! ఇప్పుడు పార్వతీదేవిని గురించిన కథ అంతా చెప్పినాను. ఇక గంగాదేవి ప్రభావాన్ని గురించీ, కార్తికేయుడి పుట్టుకను గురించీ చెప్పుతాను, వినవలెను.

37

కుమార సంభవం

"ఉమామహేశ్వరులు తపస్సు చేసుకోడానికి వెళ్ళిపోయిన తరువాత, దేవతలకు సేనానాయకుడు ఒకడు కావలసి వచ్చినాడు. అగ్నిహోత్రుడు మొదలు అయిన దేవతలు అందరూ ఇంద్రుణ్ణి వెంటపెట్టుకొని బ్రహ్మదేవుడి దగ్గరకు పోయినారు. ఆయనకు నమస్కారము చేసి, 'ఓ దేవా! ఇదివరకు రుద్రుణ్ణి మాకు సేనాధిపతిగా నిర్ణయించినావు. ఆయన ఇప్పుడు ఉమాదేవితో తపోనిష్ఠలో ఉన్నాడు. స్వామీ! నీవు సమస్తోపాయాలు తెలిసినవాడవు. ఇప్పుడు మేము ఏమి చేయవలెనో నీవు చెప్పవలెను' అని అడిగినారు.

"బ్రహ్మదేవుడు తియ్యని మాటలతో దేవతలను ఓదారుస్తూ, 'ఓ దేవతలారా! ఇక మీ ఇల్లాండ్లకు బిడ్డలు పుట్టరు. ఉమాదేవిది అమోఘవాక్కు. ఇక ఈవిషయములో సందేహము ఏమీ లేదు. అదిగో, స్వర్గములో తిరుగుతూ ఉన్న గంగాదేవి. ఆమె మిమ్ములను అందరినీ పవిత్రులను చేసింది. ఆమె హిమవంతుడి పెద్దకూతురు. అగ్నిహోత్రుడు ఆమెను కలిస్తే అరిందముడు అయిన సేనాపతి పుట్టుతాడు. అందుకు గంగాదేవి ఒప్పుకొంటుంది. ఉమాదేవిన్నీ సంతోషిస్తుంది' అన్నాడు.

"కృతార్థులు అయినట్టు దేవతలు అందరూ భావించినారు. బ్రహ్మదేవుడికి నమస్కారము చేసి ఆయనను కొనియాడి అక్కడనుంచి కైలాసపర్వతానికి పోయినారు. అగ్నిహోత్రుడితో, 'ఓ హుతాశనా! ఓ మహాతేజా! ఇక దేవకార్యాన్ని నెరవేర్చు. నీలో ఉన్న శివతేజాన్ని గంగాగర్భములో వదిలిపెట్టు' అని చెప్పినారు. 'అట్లాగేను' అని అగ్నిహోత్రుడు గంగ దగ్గరకు పోయి, 'ఓ దేవీ! దేవతలు అందరూ సంతోషిస్తారు. నీవు గర్భము ధరించవలెను' అన్నాడు. గంగాదేవి అంగీకరించింది.

"అంతట ఆమె దివ్యాంగన రూపము ధరించింది. ఆమె సౌందర్యాతిశయానికి అగ్నిహోత్రుడు ముగ్ధుడు అయిపోయినాడు. ఆ గంగాదేవి సర్వావయవాలలోనూ అగ్నిహోత్రుడు వ్యాపించినాడు. ఆ శివతేజాన్ని ఆమెలో వదలినాడు.

"గంగాదేవి గర్భము ధరించింది. అంతటితో ఆమె దేహము దహించుకొని పోవడము మొదలు పెట్టింది. ఆ బాధను ఆమె భరించలేక పోయింది. అగ్నిహోత్రుడి దగ్గరకు పోయి, 'ఓ మహాతేజా! గర్భము వృద్ధి అయినకొద్దీ భరించలేకుండా ఉన్నాను' అంటూ మొరపెట్టుకొన్నది. 'అట్లా అయితే నీ గర్భాన్ని హిమవత్పర్వతపాదములో దించుకో' అని అగ్నిహోత్రుడు చెప్పినాడు.

"ఆ గర్భాన్ని గంగాదేవి అక్కడ దించుకొన్నది. ఆ గర్భస్రవములోనుంచి అప్పుడు అక్కడ బంగారము పుట్టుకొని వచ్చింది. నిర్మలము అయిన వెండిన్నీ పుట్టింది. ఆ శోణితతైక్ష్ణ్యానికి రాగిన్నీ, నల్లటి ఇనుమున్నూ, దాని మలములోనుంచి తగరమున్నూ, సీసమున్నూ పుట్టుకొని వచ్చినవి. ఆ ప్రదేశములో సమస్త ధాతువులున్నూ వర్థిల్లినవి. అక్కడ శరవణమున్నూ, తృణవృక్షలతాగుల్మాలున్నూ బంగారు మయము అయినవి.

"ఆ గర్భస్రవములోనుంచి పరమభాస్వరము అయిన ఒక శిశువు పుట్టింది. ఆ పుట్టిన శిశువుకు పాలు ఇవ్వడానికి ఇంద్రాది దేవతలు ఆరుగురు కృత్తికలను నియమించినారు. ఆ పిల్లవాణ్ణి తమ పిల్లవాడుగా గుర్తించవలెను అని, ఆ ఆరుగురు కృత్తికలూ దేవతలను అడిగినారు. అందుకు వారు ఒప్పుకొని, 'ముల్లోకాలలోనూ ఆ పిల్లవాడు 'కార్తికేయుడు' అని ప్రసిద్ధి కెక్కుతాడు, సందేహము లేదు' అన్నారు. అగ్నిహోత్రుడు మాదిరిగా దేదీప్యమానముగా వెలుగుతూ ఉన్న ఆ శిశువుకు గర్భస్రావము పోవడానికి అంతట ఆ ఆరుగురు కృత్తికలూ నీళ్ళు పోసినారు. ఆ ఆరుగురి స్తనాలలోనూ అప్పటికి అప్పుడు పాలు చేరినవి. ఆ శిశువు ఆరు ముఖాలతో ఆ ఆరుగురి స్తనాలలో పాలను ఒక్కసారిగా కుడిచివేసినాడు.

"ఆ పిల్లవాడు కుసుమ కోమల దేహుడు అయినప్పటికిన్నీ మహేశ్వరుడి పుత్రుడు అయినందువల్ల, పరాక్రమముతో రాక్షసులను అందరినీ జయించి వేసినాడు. ఆ అసమానద్యుతిమంతుణ్ణి అగ్నిహోత్రుడు దేవసేనాధిపతిగా అభిషేకము చేసినాడు. దేవతలు అందరూ సంతోషించినారు.

"కృత్తికలు పెంచినందువల్ల ఆ కుమారుడు 'కార్తికేయుడు' అయినాడు. ఆరు ముఖాలతో పాలు కుడిచినందువల్ల 'షడాననుడు' అయినాడు. గంగా గర్భస్కన్నుడు అయినందువల్ల 'స్కంధుడు' అయినాడు.

"ఓ రామా! దేవలోకములో గంగాదేవి వృత్తాంతాన్నీ అత్యద్భుతము అయిన కుమార సంభవాన్నీ చెప్పినాను."

38

సగర చక్రవర్తి

విశ్వామిత్రమహర్షి మళ్ళీ ఈవిధముగా చెప్పసాగినాడు :

"ఓ రామా! పూర్వము అయోధ్యానగరములో 'సగరుడు' అనే చక్రవర్తి రాజ్యపాలనము చేస్తూ ఉండేవాడు. ఆయన మహావరాక్రమవంతుడు, పరమధార్మికుడు. విదర్భరాజు కూతురు 'కేశిని' అనే ఆమె ఆయన పెద్దపెండ్లాము.

ఆమె ధర్మిష్ఠ, సత్యభాషిణి. అరిష్టనేమి కూతురూ, గరుత్మంతుడి చెల్లెలూ అయిన 'సుమతి' ఆయన చిన్న భార్య. ఈ భూలోకములో ఆ సుమతి అంతటి అందకత్తె మరి ఒకతె లేదు. భార్యలు ఇద్దరికీ సంతానము కలుగలేదు.

"సగరుడు సంతానము కోసము తపస్సు చేయవలెను అనుకొన్నాడు. భార్యలతో కూడా హిమవత్పర్వతములో భృగుమహర్షి నివసించే సెలయేటి దగ్గరకు పోయినాడు. అక్కడ ఆయన చాలాకాలము తపస్సు చేసినాడు. మహాసత్యవంతుడు అయిన భృగుమహర్షి ఆయనకు ప్రత్యక్షము అయినాడు.

"ఆయన సగరుడి తపస్సుకు మెచ్చుకొని, 'ఓ రాజా! నీకు చాలామంది బిడ్డలు పుట్టుతారు. నీవు ఈలోకములో అసమానకీర్తి సంపాదిస్తావు. నీ ఇద్దరు భార్యలలో ఒకరికి వంశవర్ధనుడు అయిన పుత్రుడు ఒకడున్నూ, రెండవ ఆమెకు అరవైవేల మంది పుత్రులున్నూ పుట్టుతారు' అన్నాడు.

"అందుకు ఆ రాజు, భార్యలు ఇద్దరూ పరమానందభరితులు అయి, వినయవిధేయతలతో ఆ మహాత్ముణ్ణి స్తోత్రము చేసినారు. నమస్కారము చేసి, 'ఓ బ్రాహ్మణోత్తమా! మాలో ఎవరికి ఒక పుత్రుడు పుట్టుతాడు? ఎవరికి అరవైవేలమంది పుత్రులు పుట్టుతారు? తామే చెప్పవలెను. తమ మాట తప్పిపోదు' అని అడిగినారు.

"మీకు మీ చిత్తము వచ్చినట్టుగా పిల్లలు పుట్టుతారు. వంశవర్ధనుడు అయ్యే కుమారుడు ఎవరికి కావలెనో; మహాబలవంతులూ, మహోత్సాహులూ, కీర్తిమంతులూ అయ్యే కుమారులు ఎవరికి కావలెనో మీరే కోరుకోవలసింది" అన్నాడు ఆ ధర్మాత్ముడు.

"కేశిని తనకు వంశవర్ధనుడు అయ్యే ఒక్క కొడుకు చాలును అన్నది. సుమతి కీర్తిమంతులు అయ్యే అరవైవేలమంది కొడుకులను కోరుకొన్నది. ఆ విధముగానే పిల్లలు పుట్టుతారు అని భృగుమహర్షి అన్నాడు.

"ఓ రామా! అంతట ఆ సగరచక్రవర్తి, ఆయన ఇద్దరు భార్యలూ భృగు మహర్షికి ప్రదక్షిణాలుచేసి సాష్టాంగ నమస్కారముచేసి తమ పట్టణానికి పోయినారు.

"కొంతకాలము అయిన తరువాత కేశినికి 'అశ్వమంజుడు' (అసమంజుడు) అనే ఒక్క పుత్రుడు పుట్టినాడు. సుమతికి సొరకాయవంటి గర్భపిండము ఒక్కటి పుట్టింది. దాన్ని చీల్చినారు. దానిలోనుంచి అరవైవేలమంది శిశువులు పుట్టుకొని వచ్చినారు. ఆ శిశువులను దాదులు నేతితో నింపిన కుండలలోపెట్టి పెంచినారు. కాలక్రమేణా ఆ అరవైవేలమందీ పెరిగి పెద్దవాండ్లు అయినారు. రూపయౌవన సంపన్నులు అయినారు.

"రామా! సగరుడి జ్యేష్ఠపుత్రుడు అశ్వమంజుడు దుర్మార్గుడు అయిపోయినాడు. వాడు అయోధ్యానగరములో చిన్నపిల్లలను అందరినీ ప్రతిరోజూ మాయచేసి తీసుకొని పోయి సరయూనదిలో పడత్రోసి, వాండ్లు మునిగిపోతూ ఉంటే చూచి సంతోషించేవాడు. సజ్జనులను అందరినీ నానాబాధలూ పెట్టుతూ ఉండేవాడు. అయోధ్యా పౌరులు అందరికీ వాడు అరిష్టుడు అయిపోయినాడు. ఆ పాపాచారుణ్ణి సగరచక్రవర్తి తన జ్యేష్ఠపుత్రుడు అని మన్నించకుండా అడవులకు వెళ్ళకొట్టినాడు.

"అశ్వమంజుడి పుత్రుడు అంశుమంతుడు, మహాపరాక్రమశాలీ, ప్రియంవదుడూ, సర్వలోకసమ్మతుడూ అయినాడు. ఓ రామా! సగరచక్రవర్తి అంతట కొంతకాలానికి అశ్వమేధయాగము చేయవలెను అనుకొన్నాడు. వేత్తలు అయిన ఋత్విజులను రావించినాడు. హయమేధము ఆరంభించినాడు."

39

అశ్వమేధయాగము

సగరుడు అశ్వమేధము ఆరంభించినాడు అని విశ్వామిత్రమహర్షి చెప్పగానే రాముడు ఉప్పొంగిపోయినాడు. అగ్నిహోత్రజ్వాల మాదిరిగా తేజరిల్లుతున్న విశ్వామిత్రమహర్షిని చూచి, " ఓ బ్రాహ్మణోత్తమా! మా పూర్వీకుడు సగరచక్రవర్తి అశ్వమేధయజ్ఞము ఏవిధముగా చేసిందీ తాము వివరముగా చెప్పవలెను" అన్నాడు.

విశ్వామిత్రమహర్షి నవ్వుతూ, ఈ విధముగా చెప్పడము మొదలు పెట్టినాడు.

"ఓ రామా! హిమవత్పర్వతానికి ఎదురుగుండా వింధ్యపర్వతము ఉంది. రెండు పర్వతాలూ పరస్పరమూ చూచుకొంటూ ఉన్నట్లు ఉంటవి. ఆ రెండు కొండలమధ్య ప్రదేశము యజ్ఞకర్మలకు మహాప్రశస్తము అయింది. ఆ ప్రదేశములోనే సగరచక్రవర్తి అశ్వమేధము తలపెట్టినాడు. యజ్ఞాశ్వమువెంట తన మనుమణ్ణి అంశుమంతుణ్ణి పంపించినాడు. ఆ మహారథుడు ధనుర్ధరుడు అయి యజ్ఞాశ్వము వెంటపోయి దిగ్విజయముగా గుర్రముతో తిరిగి వచ్చినాడు.

"యజ్ఞములో పర్వసమయము (ఉక్థ్యకాలము) ఆసన్నము అవుతూ ఉంది. అప్పుడు ఎవరికీ తెలియకుండా దేవేంద్రుడు రాక్షసవేషము వేసికొనివచ్చి ఆ యజ్ఞాశ్వాన్ని ఇట్టే దొంగిలించుకొని పోయినాడు. అది ఎవరూ గమనించలేదు. సమయానికి గుర్రము కనబడకుండా పోయినందువల్ల ఋత్విజులు సగరుణ్ణి చూచి, "ఓ రాజా, యజ్ఞాశ్వాన్ని ఎవరో ఎత్తుకొని పోయినారు. ఆ దొంగిలించుకొని పోయినవాణ్ణి చంపించి తత్క్షణమే ఆ గుర్రాన్ని తెప్పించవలెను. అట్లా నీవు చేయకపోతే యజ్ఞచ్ఛిద్రమువల్ల నీకూ మాకూ అమంగళము అవుతుంది. ఏ లోపమూ లేకుండా యజ్ఞము సమాప్తము అయ్యేట్లు నీవు చేయవలెను' అని చెప్పినారు.

"ఋత్విజులు చెప్పింది అంతా సగరుడు విన్నాడు. ఆ సదస్సులో ఉన్న తన అరవై వేల మంది పుత్రులనూ చూచి, 'ఓ వీరులారా! మహానుభావులు మంత్రపూతముగా క్రతువును నడిపిస్తూ ఉన్నారు. అందువల్ల, బ్రహ్మరాక్షసులు ఈ యజ్ఞాన్ని చెడకొట్టే అవకాశము లేదు. ఎవడో దుర్మార్గుడు గుర్రాన్ని ఎత్తుకొని పోయినాడు. పుత్రులారా! సముద్రవలయితము అయిన ఈ భూభాగాన్ని అంతా వెతికి మీరు గుర్రాన్ని పట్టుకొని రావలెను. మీరు ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనము మేర వెతకవలెను. ఈ భూమిమీద మీకు గుర్రము కనబడకపోయేటట్లయితే ఈ భూమిని బ్రద్దలుకొట్టి భూగర్భములోనికి పోయి గుర్రము కనబడేటంతవరకు మీరు వెతకవలెను. నేను యజ్ఞదీక్షలో ఉన్నాను. అందువల్ల, మీరు గుర్రాన్ని పట్టుకొనివచ్చేటంత వరకూ ఈ ఋత్విజులతోనూ, ఈ అంశుమంతుడితోనూ నేను ఇక్కడనే ఉంటాను. ఇక మీరు బయలుదేరవలెను. మీకు శుభము అవుతుంది' అంటూ ఆశీర్వదించి ఆజ్ఞాపించినాడు.

"పితాజ్ఞను శిరసావహించి అరవైవేలమంది సాగరులూ పరమోత్సాహముతో ఈ భూమిమీద ప్రతి ప్రదేశమూ వెదక సాగినారు. గుర్రము ఎక్కడనూ కనిపించలేదు. ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనము పొడుగూ, వెడల్పూ ఉన్న భూభాగాన్ని తవ్వటము మొదలు పెట్టినారు. వజ్రాయుధమువంటి శూలాలతోనూ, మహాభయంకరము అయిన హలాయుధాలతోనూ ఈభూమిని బ్రద్దలుకొట్ట నారంభించినారు.

"ఓ రామా! ఆ సగరపుత్రులు ఈభూమిని చితుకకొట్టుతూ ఉంటే విన శక్యముకాని ధ్వని బయలుదేరింది. వారు ఈ జంబూద్వీపములో ఉన్న పర్వతాలను అన్నింటినీ పగులకొట్టినారు. ఆ అరవైవేలమంది అరవైవేల యోజనాల భూమిని పాతాళలోకము వరకూ తవ్వుకొంటూ పోయినారు. ఆ సాగరుల దెబ్బకు భూగర్భములో ఉంటూ ఉన్న అసురులూ, నాగులూ, రాక్షసులూ హతము అయిపోతూ హాహాకారాలు చేయసాగినారు. వాండ్ల ఏడుపులకూ, పెడబొబ్బలకూ ఈ జగత్తు అంతా సంచలించి పోయింది.

"అప్పుడు దేవతలూ, గంధర్వులూ, అసురులూ, పన్నగులూ మొదలు అయిన వారు అందరూ భయభ్రాంతులు అయిపోయినారు. వారు అందరూ బ్రహ్మదేవుడి దగ్గరకుపోయి ఆయన పాదాలమీద పడి మ్రొక్కి, గజగజ వణుకుతూ విషణ్ణముఖాలతో "ఓ భగవంతుడా! సాగరులు ఈ భూమిని అంతా తవ్వి వేస్తున్నారు. భూగర్భములో నివసిస్తూ ఉన్న అనేకమంది మహాత్ములను హతమారుస్తూ ఉన్నారు. కంటికి అగుపించిన ప్రతివాణ్ణీ 'నీవే మా యజ్ఞాశ్వాన్ని ఎత్తుకొని పోయినావు' అంటూ

చంపివేస్తున్నారు. సర్వభూతాలనూ నాశనముచేసి వేస్తున్నారు' అంటూ మొర పెట్టుకొన్నారు.

40

"దేవతలూ మొదలు అయినవారు అందరూ చెప్పింది అంతా బ్రహ్మదేవుడు విన్నాడు.

"ఓ దేవతలారా! ఈ భూమి అంతా మహావిష్ణువుది. ఆయన ఎప్పుడూ ఈ భూమిని కాపాడుతూనే ఉన్నాడు. ఈ సాగరులు ఆయన కోపానలానికి దగ్గరలు అయిపోతారు. వీరు అందరూ ఈ భూమిని ఇట్లా బ్రద్దలు కొట్టుతారు అనీ, తవ్వుతారు అనీ, వీరు అందరూ అల్పాయుష్కులు అనీ ఇదివరకే నిర్ణయము అయిపోయింది" అన్నాడు బ్రహ్మదేవుడు.

"అంతట ముప్పయిముగ్గురు దేవతలూ, అష్టవసువులూ, ద్వాదశాదిత్యులూ, ఇద్దరు అశ్వినులూ, ఏకాదశరుద్రులూ, ఇంకా మిగతా దేవతలూ, గంధర్వులూ మొదలు అయినవారు అందరూ సంతోషపడి తమ తమ తావులకు వెళ్ళిపోయినారు.

"ఓ రామా! సాగరులు ఈ భూమిని ఆ విధముగా బ్రద్దలుకొట్టుతూ ఉండగా, వారికి చేటుకాలము ఆసన్నమయింది అని సూచించడానికి పిడుగు పడ్డంత ధ్వని అయింది.

"సాగరులు ఈ భూమిలో ప్రతి అంగుళమూ తిరిగి చూచినారు. తవ్వి చూచినారు. ప్రయోజనము లేకపోయింది. అంతట వారు అందరూ సగరచక్రవర్తి దగ్గరకు పోయి, 'ఓ తండ్రీ! ఈ భూభాగాన్ని అంతా వెతికి చూచినాము. త్రవ్వి చూచినాము. అడ్డము వచ్చిన దేవ, దానవ, యక్ష, రాక్షస, పిశాచోరగ, కిన్నరులను చంపివేసినాము. గుర్రము కానీ, గుర్రాన్ని దొంగిలించుకొని పోయినవాడు కానీ, మాకు ఎక్కడనూ కనిపించలేదు. ఇక మేము ఏమి చేయవలెనో మీరు ఆలోచించవలె" అన్నారు.

"సగరుడు మహోగ్రుడు అయి, 'ఓ పుత్రులారా! అప్రయోజకులుగా మీరు నా ఎదటికి ఎందుకు వచ్చినారు? మళ్ళీ పొండి. గుర్రాన్ని ఎత్తుకొని పోయినవాణ్ణి పట్టుకురండి, పొండి' అని ఆజ్ఞాపించినాడు.

"అరవైవేలమంది సాగరులూ అంతట ఈ భూమిమీద పరుగులు తీసినారు. గుర్రము ఎక్కడా కనపడలేదు. తిరిగి భూమిని తవ్వుకొంటూ భూగర్భములో

చొరపడ్డారు. అక్కడ వారికి కొండ అంత ఏనుగు కనిపించింది. అది 'విరూపాక్షము' అనే దిగ్గజము. ఓ రామా! ఎన్నెన్నో మహాపర్వతాలూ, ఎన్నెన్నో మహారణ్యాలూ, ఇంకా ఎన్నో మహా నదులూ ఉన్న ఈ భూమిని మోస్తూ ఉన్న దిగ్గజాలలో విరూపాక్షము ఒకటి. ఈ భూభారవహనానికి దానికి అలుపు వచ్చి అది ఒక్కసారి ఇట్టే తల కదిలిస్తే భూకంపము అవుతుంది.

"ఆ విరూపాక్షానికి సాగరులు ప్రదక్షిణముచేసి పూజ చేసినారు. అంతట వారు ఆ తూర్పు దిక్కు వదలిపెట్టి దక్షిణ దిక్కున తవ్వుకొంటూ పోయి, అక్కడ 'మహాపద్మము' అనే దిగ్గజాన్ని చూచినారు. అదిన్నీ ఒక మహాపర్వతము మాదిరిగా కనిపించింది. దానికిన్నీ ప్రదక్షిణము చేసినారు. అక్కడనున్నూ గుర్రముకానీ, గుర్రాన్ని ఎత్తుకొని పోయినవాడుకానీ కనిపించలేదు. అంతట వారు పడమటి దిక్కున తవ్వటము ఆరంభించినారు. మహాపర్వతము మాదిరిగా ఉన్న 'సౌమనసము' అనే దిగ్గజాన్ని చూచి ప్రదక్షిణముచేసి దాని క్షేమము అడిగి తెలుసుకొని, ఆ దిక్కు వదలిపెట్టి ఉత్తర దిక్కున హిమాలయపర్వత ప్రదేశాన తవ్వుకొంటూ పోయినారు. అక్కడ మంచుకొండ మాదిరిగా ఉన్న 'భద్రము' అనే దిగ్గజాన్ని చూచి దానికి ప్రదక్షిణము చేసినారు. దాన్ని తాకి చూచినారు. ఆ దిక్కున కూడా గుర్రము కానీ, గుర్రాన్ని ఎత్తుకొని పోయినవాడుకానీ కనిపించలేదు. ఆ అరవైవేలమంది సాగరులూ మహాబలవంతులు. చండవేగులు. మహారోషముతో ఈశాన్య దిక్కున తవ్వుకొంటూ భూగర్భములో సాగిపోయినారు. అప్పుడు వారు అక్కడ కపిల రూపముతో మహామునిగా ఉంటూ ఉన్న విష్ణుమూర్తినీ, ఆ సమీపములోనే గరిక మేస్తూ ఉన్న యజ్ఞాశ్వాన్నీ చూచినారు. సాగరులకు పట్టశక్యముకాని సంతోషము వచ్చింది.

"ఆ కపిలమహర్షే ఆ గుర్రాన్ని దొంగిలించుకొని వచ్చినాడు అని సాగరులు అనుకొన్నారు. క్రోధావేశపరవశులు అయిపోయినారు. కన్నులు ఎర్రచేసినారు. పలుగులూ, పారలూ, నాగళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ, చెట్లూ చేతులలోకి తీసుకొని, 'లే, నిలుచో' అని కేకలు పెట్టుకొంటూ కపిలుడిమీదికి పరుగెత్తి, 'ఓ దుర్బుద్ధీ! నీవు మా యజ్ఞాశ్వాన్ని అపహరించి తెచ్చినావు. మేము ఎవరము అనుకున్నావో, సాగరులము' అంటూ ఆయనమీద పడ్డారు.

"రామా! కపిలుడికి అప్పుడు మహా చెడ్డకోపము వచ్చింది. ఆ అప్రమేయుడు హుంకారము చేసినాడు. అరవైవేలమంది సాగరులూ బూడిదబుంగలు అయిపోయినారు.

41

"ఓ రామా! ఎంతకాలము అయిపోయినా సాగరులు తిరిగి రాక పోయినందువల్ల సగరచక్రవర్తి తన మనుమడు అంశుమంతుణ్ణి చూచి, 'నాయనా! నీవు శూరుడవు. అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరినవాడవు. మనపూర్వీకులతో సరిసమానము అయిన పరాక్రమవంతుడవు. నీ పినతండ్రులు ఏమి అయినారో, గుర్రాన్ని ఎవరు దొంగిలించుకొని పోయినారో నీవు పోయి వెదికి తెలుసుకొని గుర్రాన్ని తీసుకొని రావలెను. భూగర్భములో మహావీర్యవంతము లయిన ప్రాణికోట్లు ఎన్నో ఉన్నవి. అవి అన్నీ మహాబలయుతము లయినవి. వాటిని ఎదుర్కొనడానికి నీవు ఖడ్గమూ, కార్ముకమూ తీసికొని పోవలెను. దారిలో నమస్కారము చేయవలసినవారికి శిరము ఒగ్గుతూనూ, అడ్డు తగిలినవారిని హతమారుస్తూనూ నీవు కృతార్థుడవు అయి రావలెను. నీవు నాచేత ఈ యజ్ఞము సమాప్తము చేయించవలెను' అని ఆజ్ఞాపించినాడు.

"అంతట అంశుమంతుడు ఖడ్గమూ, కార్ముకమూ తీసుకొని ప్రయాణము అయి తన పినతండ్రులు తవ్వుకొని పోయిన దారిని పట్టి భూగర్భములోనికి పోయినాడు. పోగా పోగా దైత్య దానవ యక్ష రాక్షస పిశాచోరగులూ మొదలయినవారు అందరూ పూజించే దిగ్గజము కనిపించింది. ఆ ఏనుగుకు అంశుమంతుడు ప్రదక్షిణముచేసి దాని క్షేమము అడిగి తెలుసుకొని పినతండ్రులను గురించీ, తన తాతగారి యజ్ఞాశ్వాన్ని గురించీ విచారించినాడు. ఆ దిగ్గజము 'ఓ అంశుమంతుడా! యజ్ఞాశ్వము నీకు దొరుకుతుంది. నీవు కృతార్థుడవు అవుతావు. వేగిరముగానే తిరిగిపోతావు' అని చెప్పింది. అంతట అంశుమంతుడు మిగతా మూడు దిక్కులలో దిగ్గజాలను వరుసగా చూస్తూ, తన పినతండ్రులను గురించి ప్రశ్న చేస్తూ పోయినాడు.

"ఓ రామా! ఆ యా దిక్కులలో ఈ భూమిని మోస్తూ ఉన్న దిగ్గజాలు అన్నిటికీ అన్ని భాషలూ వచ్చును. అవి మానవులతో చక్కగా మాట్లాడ గలవు. ఆ ఏనుగులు చెప్పిన ప్రకారము అంశుమంతుడు ఈశాన్య దిక్కున దిగి, భూగర్భములోకి పోయినాడు. తన పినతండ్రులు అందరూ ఏమి అయిపోయినారో నని అంతవరకూ చింతిస్తూ ఉన్న అంశుమంతుడు, వారు అందరూ భస్మము అయిపోయి అక్కడ బూడిద రాసులుగా ఉన్నారు అని తెలుసుకొన్నాడు. ఏడవసాగినాడు. అక్కడనే అటూ ఇటూ తిరుగుతూ ఉన్న యజ్ఞాశ్వాన్ని చూచినాడు.

"అప్పుడు అంశుమంతుడు తన పినతండ్రులకు జలతర్పణము వదలవలెను అనుకొన్నాడు. ఎంత వెదకినా ఆ ప్రదేశములో జలాశయము ఎక్కడనూ కనిపించలేదు.

ఎక్కడను అయినా నీళ్ళు దొరుకుతవి ఏమోనని దృష్టి సారించి చూస్తూ ఉన్నాడు. వాయువేగముతో సంచారముచేసే గరుత్మంతుడు అక్కడ కనిపించినాడు. ఆయన సాగరుల మేనమామ ఖగరాజా, మహాబలవంతుడు.

"ఆ గరుత్మంతుడు అంశుమంతుణ్ణి, 'నాయనా! నీ పినతండ్రులు చనిపోయినారు అని నీవు దుఃఖపడవద్దు. లోకహితము కోసము కపిలుడు వారిని దగ్ధము చేసివేసినాడు. అందువల్ల, ఓ బుద్ధిమంతుడా! వారికి ఈలోకములో నీళ్ళతో తర్పణాలు వదిలితే ప్రయోజనము లేదు. నాయనా! హిమవంతుడి పెద్దకూతురు గంగాదేవి నదీరూపాన దేవలోకములో సంచారము చేస్తూ ఉంది. ఆ గంగ లోకపావని. ఆ గంగానదీ జలాలతో నీ పినతండ్రులకు జలతర్పణాలు వదలవలెను. అంతేకాదు, ఆ గంగాపవిత్రోదకాలు ఈ భస్మరాసులమీద ప్రవహించవలెను. నీవు ఇప్పుడు ముందుగా ఈ గుర్రాన్ని తీసుకొనిపోయి నీ తాతగారిచేత యజ్ఞము సమాప్తము చేయించవలసింది. ఆతరువాత నీ పినతండ్రులకు జలతర్పణాలు వదిలే విషయము ఆలోచించవచ్చును' అని చెప్పినాడు.

"గరుత్మంతుడు చెప్పింది అంతా సావధానముగా అంశుమంతుడు విన్నాడు. అంతట ఆ యశస్వీని ఆ గుర్రాన్ని తీసుకొని యజ్ఞదీక్షలో ఉన్న సగరుడి దగ్గరకు పోయి సాగరుల గతీ, గరుత్మంతుడి హితబోధా తెలియచెప్పినాడు.

"ఆ భయంకర వృత్తాంతము అంతా సగరచక్రవర్తి విన్నాడు. దుఃఖపడ్డాడు. ఆయన ధీమంతుడు. యథాశాస్త్రముగా, యథాక్రమముగా అశ్వమేధయాగము పూర్తి చేసినాడు.

"అంతట సగరుడు గంగా ప్రవాహాన్ని ఈ భూమిమీదికి తెప్పించే ఉపాయము ఆలోచించసాగినాడు. ఎంతకాలానికీ కృతకృత్యుడు కాలేకపోయినాడు. బహుకాలము రాజ్యము ఏలి దివంగతుడు అయిపోయినాడు.

42

భగీరథుడు

"రామా! సగరుడు కాలధర్మము చెందగానే మంత్రులు ప్రజానుమతితో అంశుమంతుడికి పట్టము కట్టినారు. ఆ మహాధార్మికుడు ఎంతో గొప్పగా రాజ్యపాలనము చేసినాడు.

"ఆయన పుత్రుడు దిలీపుడు జగత్ప్రసిద్ధుడు అయినాడు. అంశుమంతుడు ఆ దిలీపుడికి రాజ్యపాలనము ఒప్పచెప్పినాడు. అంతట ఆయన గంగానదిని ఈ భూమిమీదికి తీసుకొనుకొని రావలెను అనే సంకల్పముతో

హిమవత్పర్వత శిఖరానికి పోయి, అక్కడ బహుకాలము దారుణముగా తపస్సు చేసినాడు. కృతకృత్యుడు కాకుండానే స్వర్గతుడు అయిపోయినాడు.

"దిలీపమహారాజు అమితపరాక్రమవంతుడు. ఆయన తన ముత్తాతలు అందరూ భస్మము అయిపోయినందుకు దుఃఖోపహతుడు అయిపోయినాడు. గంగను భూమిమీదికి రప్పించడము ఎట్లాగు అనీ, సాగరులకు జలతర్పణాదులు వదలడము ఎట్లాగు అనీ అమితముగా ఆలోచించినాడు. ఓ రామా! ఆ దిలీపుడు విదితాత్ముడు. ఎప్పుడూ ధర్మచింత చేస్తూ ఉండేవాడు. ఎన్నో యజ్ఞాలు చేసినాడు. తన ముత్తాతలను ఉద్ధరించే ఉపాయము తోచక దిగులు పడిపోయినాడు. ఆ దిగులుతోనే వ్యాధిగ్రస్తుడు అయిపోయి తన పుత్రుడు భగీరథుడికి రాజ్యాభిషేకము చేసినాడు. ఆ దిగులుతోనే చివరకు చనిపోయినాడు. పుణ్యకర్మలవల్ల స్వర్గతుడు అయినాడు.

"రామా! భగీరథుడు మహాతేజోవంతుడు. పరమధార్మికుడు. ఆయనకు సంతానము కలగలేదు. సంతానము కోసమూ, గంగాజలాలను ఈ భూమిమీదికి రప్పించడము కోసమూ తపస్సు చేయ సంకల్పించుకున్నాడు. రాజ్యపాలనము మంత్రుల పరముచేసి గోకర్ణ క్షేత్రానికి పోయి మండు వేసంగిలో పంచాగ్నుల మధ్యను చేతులు పైకి ఎత్తి నిలుచుని, మాసానికి ఒక్కపూటే భోజనము చేస్తూ జితేంద్రియుడు అయి బహుకాలము తపస్సు చేసినాడు.

"ఆయన తపస్సుకు బ్రహ్మదేవుడు మెచ్చుకొని దేవతలతో కూడా బయలుదేరి వచ్చి భగీరథుణ్ణి చూచి, 'ఓ రాజా! నీ తపోవ్రతానికి నేను సంతుష్టుణ్ణి అయినాను. ఏది అయినా వరము అడుగు ఇస్తాను' అన్నాడు. ఆ మహాతేజోవంతుడు బ్రహ్మదేవుడికి నమస్కారము చేసి, 'ఓ భగవంతుడా! నా తపస్సుకు నీవు సంతుష్టుడవు అయినట్లయితే, నా తపస్సు నీవు ఫలప్రదము చేయతలచినట్లయితే గంగాజలాలతో నేను నా ముత్తాతలకు తర్పణాలు వదిలేట్లున్నూ, వారి భస్మరాసులమీద గంగాజలము ప్రవహించి వారు స్వర్గతులు అయ్యేట్టున్నూ చేయవలెను. ఓ స్వామీ! ఇక్ష్వాకువంశము నాతో కృశించి పోకూడదు. నాకు పుత్రసంతానము అనుగ్రహించవలెను' అన్నాడు.

"బ్రహ్మదేవుడు మంగళకరముగానూ, మనోహరముగానూ, 'ఓ మహారథా! నీ మొదటి కోరిక దుర్లభము అయింది. అయినప్పటికీ నెరవేరుతుంది. నీ వంశము వర్ధిల్లుతుంది. నీకు సుపుత్రుడు పుట్టుతాడు. నాయనా! గంగాదేవి హిమవంతుడి పెద్దకూతురు. ఆ నది ఈ భూమిమీద పడేట్లయితే దాని పాటుకు ఈభూమి తట్టుకొనలేదు. నీవు భూపతివి. ఈ భూదేవి మేలు నీవు గుర్తుంచుకొనవలెను. ఆ గంగపాటును భరించకలవాడు హరదేవుడు ఒక్కడే. ఆయనను నీవే ప్రార్థించవలెను' అని చెప్పి గంగాదేవిని చూచి, 'ఓ గంగా! ఈ భగీరథుడి కోరిక నీవు నెరవేర్చవలెను'

అని చెప్పినాడు. అంతట బ్రహ్మదేవుడు దేవతలతో కూడా దేవలోకము వెళ్ళిపోయినాడు.

43

గంగావతరణము

"భగీరథుడు కాలి బొటనవేలిమీద నిలుచుని శివుణ్ణి గురించి తపస్సు చేయ నారంభించినాడు. ఒక సంవత్సరం అయిపోయింది. సర్వలోక నమస్కృతుడు అయిన శివుడు సంతోషించి భగీరథుణ్ణి చూచి, 'ఓ పురుషపుంగవా! నేను నిన్ను మెచ్చుకొన్నాను. నీ కోరిక నెరవేరుస్తాను. గంగను నా శిరస్సున ధరిస్తాను' అన్నాడు. అంతట హిమవంతుని జ్యేష్ఠపుత్రి గంగాదేవి మహదాకారముతో, దుస్సహము అయిన వేగముతో ప్రయాణము అయి వచ్చి శుభకరము అయిన హరదేవుడి శిరస్సుమీదికి దూక నుంకించింది.

"ఓ రామా! గంగాదేవిని భరించగలవారు ఈ లోకములో ఎవరూ లేరు. ఆ గంగాదేవి శివుడి శిరస్సుమీదికి దూకి తన ప్రవాహ వేగముతో ఆ శివుణ్ణి తనతోపాటు పాతాళలోకములోకి లాగుకొని పోవలెను అనుకొన్నది. ఆమె అభిప్రాయము త్రినేత్రుడికి తెలిసింది. ఈ గంగకు ఇంత గర్వమా అని హరదేవుడికి కోపము వచ్చింది. ఆ గంగాదేవిని బంధించివేయ సంకల్పించినాడు.

"గంగాదేవి హరదేవుడి శిరముమీదికి దూకింది. ఆయన శిరస్సున ఉన్న జడలలో ప్రవేశించింది. అప్పుడు ఆ జటలు హిమాలయపర్వత గుహలు అంతవి అయిపోయినవి. ఆ జటాగహ్వరాలలో అటూ ఇటూ తిరుగుతూ గంగ చిక్కుపడిపోయింది. అక్కడనుంచి ఆ పుణ్యగంగ బయటపడలేకపోయింది. ఈ భూమిని చూడటము ఆమెకు అశక్యము అయిపోయింది. ఆ గంగాదేవి ఎవరి కంటికీ కనపడకుండా బహుకాలము శివజటాగహ్వరాలలో తిరుగుతూ ఉండవలసి వచ్చింది.

"గంగాదేవి కనపడకుండా పోయినందువల్ల భగీరథుడు మళ్ళీ మహోగ్రముగా తపస్సు నారంభించినాడు. అంతట శివుడు భగీరథునిమీది ఆదరముతో ఆ గంగను తన జటాజూటాలలోనుంచి బిందు సరోవరములో వదలిపెట్టినాడు. ఆ సరోవరములో నుంచి గంగ ఏడు పాయలుగా ఈ భూమిమీద ప్రవహించింది. హ్లాదినీ, నలినీ, పావనీ అనే మూడు పాయలు తూర్పుదిక్కుగా పోయినవి. ఆ మూడు పాయలలో జలము మంగళకరము అయింది. అదేవిధముగా నిర్మలోదకాలతో పడమటి దిక్కుకు సుచక్షూ, సీతా, సింధూ అనే పేర్లతో మూడు పాయలుగా ప్రవహించింది. ఏడవ పాయ భగీరథ రాజర్షి వెంట బయలుదేరింది.

"భగీరథ మహారాజు దివ్యము అయిన రథముమీద ప్రయాణము అయినాడు. ఆ రథము ఈ భూమిమీద ఎటుపోతే గంగ అటు ప్రవహించింది.

"గంగ ఆకాశమునుంచి శివుడి శిరస్సు మీదికిన్నీ, అక్కడ నుంచి భూమిమీదికిన్నీ దూకడములో పెద్ద హోరు పుట్టింది. ఆ మహాధ్వని ఈ జగత్తును అంతా ఆకర్ణించింది.

"మహాద్భుతము అయిన గంగావతరణాన్ని చూడటానికి దేవతలూ, గంధర్వులూ, యక్షులూ, సిద్ధులూ మొదలయినవారు అందరూ పెద్ద పెద్ద పట్టణాలు అంతటి విమానాలలోనూ, దిట్టము అయిన ఏనుగులమీదనూ, గుర్రాలమీదనూ అప్పుడు అక్కడికి వచ్చినారు. వారు అందరూ రావటములో మేఘాలు చెల్లాచెదరు అయిపోయినవి. అందువల్ల, ఆకాశము నిర్మలముగా కనిపించింది.

"ఆ దేవతల దేహకాంతులవల్లనూ, వారు ధరించిన దివ్యాభరణాల ధగధగల వల్లనూ నూరుగురు సూర్యులు ఉదయిస్తున్నట్టుగా అప్పుడు ఆకాశము కనిపించింది.

"గంగాప్రవాహముతో తాబేళ్ళూ, మొసళ్ళూ, పాములూ, చేపలూ, ఇంకా ఇతర జలచరాలూ ఈ భూమిమీద పడుతూ ఉంటే, మెరుపులు మెరసినట్టుగా ఆకాశము కనిపించింది.

"గంగాప్రవాహపాతము తెల్లటి నురుగులు ఎగచిమ్ముతూనూ, ధౌతకాంతులతో హంసలు ఎగురుతూనూ ఉంటే, శరత్కాలములోవలె తెల్లటి మేఘాలతో తళతళలాడుతూ ఆకాశము అగుపించింది.

"గంగానది ఒకచోట అతివేగముగానూ, ఒకచోట మందముగానూ, ఒకచోట వంకరటింకరగానూ, ఒకచోట విశాలముగానూ, ఒకచోట వంగినట్టుగాను, ఒకచోట పైకి లేచినట్టుగానూ, తరంగాలు తరంగాలుగా ఎగురుతూనూ, కిందకి దూకుతూనూ ఎంతో దర్శనీయముగా ప్రవహించింది. ఆ విధముగా ప్రవహించడములో జలము నిష్కల్మషము అయింది. శివదేవుడి జటా జూటాలలో తిరిగి బయట పడ్డందువల్ల అది పరమ పవిత్రము అయింది.

"అప్పుడు దేవతలూ, మానవులూ ఆ పావనోదకాలలో స్నానము చేసినారు. శాపగ్రస్తులు అయి అంతవరకూ భూమిమీద పడి ఉన్న వారు అందరూ అప్పుడు ఆ పుణ్యోదకాలలో స్నానము చేసి పాప విముక్తులూ, శాప విముక్తులూ అయి యథారూపాలతో తేజరిల్లుతూ ఆకాశమార్గాన తమ తమ తావులకు తరలిపోయినారు. దివ్యకాంతులతో ప్రవహిస్తూ ఉన్న గంగను చూచి ప్రజలు అందరూ మురిసిపోయి,

పదే పదే ఆ గంగాజలాలలో మునగడము మొదలుపెట్టినారు. స్నానము చేయగానే వారి వారి సమస్తశ్రమలూ సమసిపోయి సుఖము అనుభవించసాగినారు.

"ఓ రామా! భగీరథ రాజర్షి రథమువెంట గంగ ప్రవహించింది అని చెప్పినాను. ఆ గంగాప్రవాహాన్ని చూస్తూ దైత్య, దానవ, యక్ష, రాక్షస, గంధర్వ, మహోరగులూ, అప్సరసలూ, దేవతలూ మొదలయినవారు అందరూ వెంట నడిచినారు. భగీరథ రాజర్షి రథము జహ్నుమహర్షి యజ్ఞవాటిక దగ్గరకు పోయింది. హఠాత్తుగా రథము అక్కడ ఆగింది.

"మహావేగముతో భగీరథుడి రథమువెంట పరుగెత్తుకొని వస్తూ ఉన్న గంగ అట్లా హఠాత్తుగా ఆగలేకపోయింది. గంగాజలాలలో జహ్నుమహర్షి యజ్ఞవాటిక మునిగిపోయింది.

"జహ్నుమహర్షికి పట్టరాని కోపము వచ్చింది. ఆయన అనేక అద్భుతశక్తులు ఉన్నవాడు. ఆ గంగాజలాన్ని అంతా ఆయన ఇట్టే త్రాగివేసినాడు. అందరూ ఆశ్చర్యచకితులు అయినారు. భగీరథుడున్నూ, గంగవెంట వస్తూ ఉన్న వారు అందరున్నూ జహ్నుమహర్షిని పూజించి, 'ఓ మహాత్మా! గంగను తమ కుమార్తెగా భావించవలెను. లోకహితము కోసము తాము గంగను వదలిపెట్టవలెను అని ప్రార్థించినారు. అందుకు జహ్నువు ఒప్పుకొన్నాడు. మహాప్రభావముతో ఆయన తన చెవులలోనుంచి ఆ గంగాప్రవాహాన్ని వదలి పెట్టినాడు. అందువల్ల, గంగ జహ్నుసుత అయింది. కనుక గంగను జాహ్నవి అన్నారు.

"గంగ యథాప్రకారము భగీరథ రథమువెంట బయలుదేరింది. ఆయన సాగరములోకి పోయినాడు. ఆయనతోపాటు గంగ కూడా సముద్రములోకి పోయింది. ఆయన అక్కడనుంచి పాతాళలోకములోకి పోయినాడు. గంగా ఆయన వెంట పాతాళములోనికి పోయింది.

"అక్కడ భగీరథ రాజర్షి తన పితామహుల భస్మరాసులను గంగకు చూపించినాడు. ఆ మహామహుడి ప్రయత్నము సఫలము చేయడానికి గంగ ఆ భస్మరాసులమీద ప్రవహించింది. సాగరులు అందరూ అంతట నిష్పాపులుగా స్వర్గతులు అయినారు.

44

"గంగాప్రవాహము సాగరుల భస్మరాసులను ముంచివేయగానే, బ్రహ్మదేవుడు వచ్చి భగీరథుణ్ణి చూచి, 'ఓ రాజశార్దూలమా! అరవైవేలమంది సాగరులున్నూ తరించినారు. స్వర్గలోకము పోయినారు. సముద్రజలాలు ఇంకిపోకుండా ఉండేటంత

వరకున్నూ సాగరులు దేవలోకములో దేవతల మాదిరిగా సర్వసౌఖ్యాలూ అనుభవిస్తూ ఉంటారు. ఈ గంగకు నీవు తండ్రివి అని భూలోకములో అందరూ చెప్పుకొంటారు. అందువల్ల, ఈ గంగను భాగీరథి అంటారు. ఈగంగ స్వర్గమర్త్యపాతాళ లోకాలలో ప్రవహించింది కనుక త్రిపథగ అయింది. ఓ రాజా! ఇక నీవు ఈ గంగాజలాలతో నీ పితరులకు ధర్మోదకాలు వదలిపెట్టు. అంతటితో నీ అభీష్టము నెరవేరుతుంది.

"ఓ భగీరథమహారాజా! పరమధార్మికుడు అనీ, మహాపరాక్రమవంతుడు అనీ ప్రసిద్ధి కెక్కిన నీ ముత్తాత సగర చక్రవర్తి ఈ గంగను భూమిమీదికి రప్పించవలెను అని ఎంతో ఆలోచించి మనోరథము ఈడేరకుండానే స్వర్గతుడు అయినాడు. అప్రతిమానతేజోవంతుడు అయిన నీ తాత అంశుమంతుడు ఈ గంగను ఈ భూమిమీదికి తేవలెను అని పెద్ద ప్రయత్నముచేసి కాలధర్మము చెందినాడు. నీ తండ్రి దిలీపుడు రాజర్షి. మహాగుణవంతుడు. క్షత్రధర్మము తప్పనివాడు. ఈ గంగను భూమిమీదికి తెప్పించవలెను అనుకొని ఉపాయము తెలుసుకోకుండానే స్వర్గతుడు అయిపోయినాడు. నీ పెద్దలకు ఎవరికీ చేతకాని ప్రయత్నము నీవు చేసినావు. నీ ప్రయత్నము సఫలము అయింది. నీవు పరమ యశస్వివి అయినావు. నీనుంచి ఈ భూమిమీద గంగ అవతరించింది. నీకు ప్రతిష్ఠ లభ్యము అయింది.

"రాజోత్తమా! ఈ గంగాజలము సముద్రజలమువంటిది కాదు. సర్వకాల సర్వావస్థలలోనూ పాన యోగ్యముగానూ, స్నాన యోగ్యముగానూ ఉంటుంది. నీవున్నూ ఈ గంగానదిలో స్నానము చేయవలసింది. పరిశుద్ధుడవు అవుతావు. నీకు శుభము అవుతుంది. పుణ్యము వస్తుంది" అంటూ అంతర్ధానము అయిపోయినాడు.

"ఓ రామా! ఆ యశస్వి భగీరథ మహారాజు గంగా స్నానముచేసి పరిశుద్ధుడు అయి, సాగరులు అందరికి యథాశాస్త్రముగా ధర్మోదకాలు వదిలినాడు. అయోధ్యాపట్టణానికి పోయినాడు. రాజ్యపాలనము ఆరంభించినాడు. ఆయన పరిపాలనలో సకలార్థాలూ సమృద్ధముగా వర్థిల్లినవి. ప్రజలు ఏ దిగులూ, ఏ పీడా లేకుండా సుఖపడ్డారు.

"ఓ రామా! నీవు అడిగిన గంగా వృత్తాంతము అంతా చెప్పినాను. ఇదిగో, సంధ్యాకాలము అతిక్రమించిపోతూ ఉంది" అంటూ విశ్వామిత్రమహర్షి లేచినాడు.

45

విశాల పట్టణ వృత్తాంతము

రామలక్ష్మణులు ఎంతో విస్మితులు అయిపోయి, "ఓ బ్రహర్షీ! తాము చెప్పిన గంగావతరణమూ, గంగాసాగర ప్రవేశమూ అత్యద్భుతముగా ఉన్నవి.

పరమపావనము అయిన కథ చెప్పినారు" అని విశ్వామిత్రమహర్షిని స్తోత్రము చేసినారు.

వారు అందరూ ఆ రాత్రి అక్కడనే గడపినారు.

రామలక్ష్మణులు పడుకొన్నారేకాని, గంగావతరణాన్ని గురించి చాలాసేపు ఆలోచించి నిద్రపోయారు.

తెల్లగా తెల్లవారి పోయింది. విశ్వామిత్రమహర్షి సూర్యోదయము అయ్యేప్పటికి ప్రాతరాహ్నికాలు ముగించుకొని ప్రయాణోన్ముఖుడు అయినాడు. రామలక్ష్మణులున్నూ వారి ఆహ్నికాలను పూర్తిచేసుకొని విశ్వామిత్రమహర్షికి నమస్కారము చేసినారు.

అంతట రాముడు, "ఓ తాపసోత్తమా! గడచిన రాత్రి చాలా పవిత్రము అయింది. వినవలసిన కథ విన్నాము. ఆ కథను గురించి ఆలోచిస్తూ ఉండగానే రాత్రి ఇట్టే గడచి పోయింది. స్వామీ! తమ కోసము నావ సిద్ధముగా ఉంది. కూర్చుండటానికి అస్తరణాలు చక్కగా అమర్చి ఉన్నవి. ఈ పుణ్యనదిని ఇప్పుడే దాటిపోదాము" అన్నాడు.

అంతట విశ్వామిత్రమహర్షీ, రామలక్ష్మణులూ, తక్కిన మహర్షులూ ఆ నావ ఎక్కి గంగానదిని దాటి ఉత్తరపు గట్టుకు పోయినారు. అక్కడి రామణీయకము చూస్తూ కొంచెముసేపు ఆగి ఆ తరువాత అందరూ వేగముగా నడవసాగినారు.

వారికి విశాలపట్టణము కనిపించింది. అది చాలా అందము అయింది. రాముడు విశ్వామిత్రమహర్షిని చూచి, "స్వామీ! ఈ పట్టణము స్వర్గధామముగా కనిపిస్తూ ఉంది. ఇది ఏ రాజవంశీయులదో తెలుసుకోవలెను అని కుతూహలముగా ఉంది, తాము చెప్పవలెను" అన్నాడు.

"ఓ రామా! ఈ విశాలపట్టణ పూర్వవృత్తాంతము ముందుగా చెప్పుతాను, వినవలసింది. కృతయుగములో దితి పుత్రులు మహాబలవంతులుగానూ, అదితి పుత్రులు మహాధార్మికులుగానూ ఉంటూ ఉండేవారు.

"అనారోగ్యమూ, వార్ధక్యమూ, మృతీ లేకుండా ఉండటానికి ఉపాయము ఏమిటి అని వారు అందరూ ఏకము అయి ఆలోచించ సాగినారు. పాల కడలిని చిలికితే అమృతము పుట్టుతుంది అనీ, ఆ అమృతాన్ని త్రాగితే జరామరణాలూ, అనారోగ్యమూ లేకుండాపోతవి అనీ వారు నిశ్చయించినారు.

"దైత్యులూ, ఆదిత్యులూ మందరపర్వతాన్ని కవ్వముగానూ, వాసుకి అనే మహాసర్పాన్ని కవ్వము త్రాడుగానూ చేసి క్షీరసముద్రాన్ని చిలకడము మొదలు

పెట్టినారు. ఆ విధముగా వారు చాలాకాలము మధించినారు. అప్పుడు వాసుకి ముఖాలు అన్నీ విషము కక్కడము మొదలు పెట్టినవి. ఆ మహాసర్పము మందర పర్వతములో రాళ్ళను అన్నిటినీ కరవడము మొదలు పెట్టింది. అంతట మహా సముద్రములో 'హాలాహలము' అనే విషము మంటలు మండుతూ పైకి లేచింది. ఆ మంటలకు దేవ దానవ మానవ సహితము అయిన ఈ జగత్తు అంతా దగ్ధము అయ్యేట్టుగా కనిపించింది. సమస్తప్రాణికోటినీ కాపాడే రుద్రుణ్ణి దేవతలు శరణము వేడినారు. మహావిష్ణువున్నూ శంఖచక్రధారి అయి అక్కడికి వచ్చినాడు. ఆయన శూలభృత్తుని చూచి నవ్వుతూ, 'ఓ రుద్రుడా! నీవు ఆ దేవతలు అందరికి అగ్రజుడవు. కాబట్టి, ఈ క్షీరసముద్ర మధనములో మొట్టమొదట పుట్టినదానిని నీవు అగ్రనైవేద్యముగా స్వీకరించవలెను' అని చెప్పినాడు.

"శివుడు దేవతల భయాన్ని గమనించినాడు. మహావిష్ణువు చెప్పింది ఆలోచించినాడు. అంతట మహాభయంకరము అయిన హాలాహలాన్ని ఇట్టే త్రాగివేసినాడు.

"దేవదానవులు క్షీరసముద్రాన్ని తిరిగి మధించడము మొదలు పెట్టినారు. కవ్వముగా ఉన్న మందరగిరి పాతాళలోకమువరకూ దిగపడి పోవడము మొదలు పెట్టింది. అప్పుడు దేవతలు విష్ణుమూర్తిని చూచి, 'ఓ మహాబాహూ! నీవే మాకు దిక్కు. ఈ మంథరగిరిని నీవు తప్ప మరి ఎవరూ లేవనెత్తలేరు. కాబట్టి, నీవు దీనిని లేవనెత్తి మమ్ములను కాపాడవలెను' అంటూ ప్రార్థించినారు.

"విష్ణుమూర్తి తాబేలు రూపము ధరించినాడు. ఆ పాలసముద్రములోకి పోయి తన వీపున ఆ మంధరగిరి నిలబడి ఉండేట్టుగా పడుకొన్నాడు.

"ఆ మహావిష్ణువు పురుషోత్తముడు. అంతేకాదు, ఆ పర్వత శిఖరాన్ని పట్టుకొని దేవతలకు తోడుపడ్డాడు.

"అప్పుడు ఆ పాలకడలిలోనుంచి ఒక చేతిలో దండమూ, రెండవ చేతిలో కమండలువూ పట్టుకొని ధన్వంతరి పుట్టుకొని వచ్చినాడు.

"ఆ తరువాత ఆ సముద్రములోనుంచి ఒక రసము బయలుదేరింది. ఆ రసములోనుంచి మంచి వర్చస్వినులు అయిన ఆరవైకోట్లమంది కన్నెపడుచులు పుట్టుకొని వచ్చినారు. రసములోనుంచి పుట్టుకొని వచ్చినందువల్ల వాండ్లను అప్సరసలు అన్నారు. వాండ్లతోపాటు లెక్కపెట్ట నలవికాని అంతమంది వాండ్ల పనికత్తెలున్నూ పుట్టుకొని వచ్చినారు. ఆ అప్సరసలను పెండ్లిచేసుకోడానికి దైత్యులూ ఇష్టపడలేదు. ఆదిత్యులూ ఇష్టపడలేదు. అందువల్ల, వాండ్లు భోగముపడుచులు అయినారు.

"అంతట ఆ పాలసముద్రములోనుంచి వరుణదేవుడి కూతురు 'వారుణీ' అనే సురాధిదేవత బయటికి వచ్చింది. ఆ సురను పుచ్చుకోడానికి దైత్యులు ఇష్టపడలేదు. ఆదిత్యులు ఆ సురను స్వీకరించినారు. అందువల్ల, అప్పటినుంచి ఆదిత్యులు సురలు అయినారు. సురను పుచ్చుకోనందువల్ల అప్పటినుంచి దైత్యులు అసురలు అయినారు.

"ఆ సురాగ్రహణమువల్ల దేవతల దేహాలు పులకలెత్తినవి. మహదానందము అనుభవించినారు.

"ఆ తరువాత పాలసముద్రములోనుంచి గుర్రాలలో మేటి అయిన ఉచ్చైశ్రవమూ, మణులలో నాణ్యము అయిన కౌస్తుభమూ పుట్టుకొని వచ్చినవి.

"చివరకు ఆ పాలసముద్రములో అమృతము ఉద్భవించింది.

"ఆ అమృతము కోసము దేవదానవులు పోట్లాడుకోటము మొదలు పెట్టినారు. దితి పుత్రులను అనేకులను అదితి పుత్రులు చంపివేసినారు. కుల క్షయము అయ్యేటంత పోరాటము సాగింది. అప్పుడు దైత్యులు రాక్షసులతో ఏకము అయి దేవతలను ఎదుర్కొన్నారు. ఆ యుద్ధానికి ముల్లోకాలూ తల్లడిల్లి పోయినవి. సర్వమూ నాశనము అయిపోతూ ఉంది. అప్పుడు మహావిష్ణువు మోహినీ వేషముతో వచ్చి, అందరినీ మాయచేసి అమృతాన్ని అపహరించినాడు. ఆంతట అడ్డము వచ్చిన వారిని అందరినీ పిండి పిండి చేసివేసినాడు.

"ఆ ఘోర సంగ్రామములో దైత్యులను అందరినీ దేవతలు చంపివేసినారు.

"దితి పుత్రులు అందరూ హతము అయిపోయిన తరువాత దేవేంద్రుడు అమృతాన్నీ, త్రిలోక రాజ్యాన్నీ సంపాదించి సమస్తలోకాలనూ పరిపాలించసాగినాడు.

46

"ఓ రామా! కొడుకులు అందరూ చనిపోయినందుకు దితి మహాఘోరముగా ఏడ్చింది. భర్త అయిన కాశ్యపుణ్ణి చూచి, 'నాథా! మీ పుత్రులు ఆదిత్యులు అమిత బలవంతులు. వారు నా పుత్రులను అందరినీ చంపివేసినారు. ఇప్పుడు నేను పుత్రులులేని దానిని అయినాను. ఇంద్రుణ్ణి జయించేటంత శక్తిమంతుడు అయిన పుత్రుణ్ణి తాము నాకు అనుగ్రహించవలెను. నేను ఎటువంటి నియమాలతోనైనా తపస్సు చేస్తాను' అంటూ వేడుకొన్నది.

"కాశ్యపుడు పరమదుఃఖముతో ఉన్న దితితో, 'అట్లాగేను, మంచిది. నీకు మేలు అవుతుంది. అయితే నీవు పుత్రుణ్ణి కనేటంతవరకున్నూ వ్రతనిష్ఠతో శుచిగా

ఉండవలెను. నీవు చివరివరకూ శుచిగా ఉండకలిగేట్లయితే, దేవేంద్రుణ్ణి సంహారము చేసి ముల్లోకాలూ ఏలే పుత్రుడు నీకు పుట్టుతాడు' అని చెప్పి ఆమెను ఊరడించినాడు. ఆమె దేహాన్ని అంతా నిమురుతూ ఆమెకు స్వస్తి చెప్పి అంతట ఆయన తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయినాడు.

పరమసంతోషముతో దితి 'కుశప్లవము' అనే ప్రదేశానికి ప్రయాణము అయిపోయింది. దేవేంద్రుణ్ణి జయించే కొడుకును కనడానికి సుదారుణము అయిన తపస్సు చేయడము మొదలుపెట్టింది.

"ఓ రామా! దితి తపస్సు చేయడానికి పోవడము వెయ్యికన్నుల దేవేంద్రుడు కనిపెట్టినాడు. ఆయన మహామేధాసంపన్నుడు. నీతిజ్ఞుడు. ఆమెకు ఉపచారాలు చేయడానికి ఆమె వెనుకనే పోయినాడు. అగ్నినీ, కుశలనూ, సమిధలనూ, కందమూల ఫలాలనూ, ఇంకా ఆమెకు కావలసిన వాటిని అన్నిటినీ ఆమెకు అందించసాగినాడు. ఆమె డస్సిపోయినప్పుడు ఆమె ఒళ్ళు పట్టేవాడు. అదీ ఇదీ అనకుండా ఆమె శ్రమాపనయనానికి అవసరము అయిన ఏ పనిని అయినా చేయసాగినాడు. ఇంద్రుడు ఆవిధముగా ఉపచారాలు చేస్తూ ఉంటే ఆమె ఎంతో సంతోషపడ్డది. ఆయనను ఎంతో మెచ్చుకొన్నది.

"ఆమె ప్రసవించే సమయము ఆసన్న మయింది. ఆమె సంతోషాతిశయముతో 'ఓ సురేంద్రా! ఇక కొద్దిరోజులలో నీకు తమ్ముడు పుట్టుతాడు. నిన్ను జయించేవాడు నాకు పుట్టవలెను అని నీ తండ్రిని నేను యాచించినాను. ఆయన 'అట్లాగే' అని వరము ఇచ్చినాడు. అందువల్ల త్రిలోకవిజయుడు నాకు పుట్టపోతున్నాడు. అయితే, నీమీదికి యుద్ధానికి బయలుదేరకుండా నేను నా కుమారుణ్ణి సమాధాన పరచి నీతో స్నేహముగా ఉండేట్టు చేస్తాను. నీవు ఏ దిగులూ లేకుండా నా పుత్రుడి సహాయముతో ముల్లోకాలూ ఏలుతూ ఉండవచ్చు' అని చెప్పింది. మిట్టమధ్యాహ్నము అప్పుడు ఆమె కునికింది. నిద్రాపారవశ్యములో ఆమె తలాపిన కాళ్లూ, కాళ్లకట్టున తల పెట్టుకొని, తల విరపోసుకొని నిద్రపోయింది.

"దేవేంద్రుడు ఆమెను చూచినాడు. సందు దొరికింది అని సంతోష పడ్డాడు. యోగశక్తితో ఆమె గర్భములో చొరబడ్డాడు. గర్భములో ఉన్న శిశువును తన వజ్రాయుధముతో నరికివేయ సాగినాడు. ఆ గర్భస్థ శిశువు రోదనము చేస్తూ ఉంటే, దేవేంద్రుడు 'మారుదః (ఏడవకు), మారుదః (ఏడవకు)' అంటున్నాడు. అప్పుడు దితికి మేలకువ వచ్చి 'చంపవద్దు, చంపవద్దు' అని అరిచింది. కాని, దేవేంద్రుడు ఆ గర్భాన్ని అప్పటికే ఏడు ముక్కలుగా నరికివేసినాడు.

"మాతృ వచన గౌరవముతో దేవేంద్రుడు ఆమె గర్భములోనుంచి బయటికి వచ్చి, వజ్రాయుధము చేతిలోనే ఉంచుకొని నమస్కారము చేసి, 'అమ్మా! నీవు వ్రతనిష్ఠాభంగము అవుతుంది అని అనుకోకుండా తల విరపోసుకొని కాళ్ళకట్టున తలపెట్టుకొని నిద్రపోయినావు. నీవు అశుచివి అయిపోయినావు. నాకు సందు దొరికింది. దొరికినప్పుడు శత్రువును సంహరించడము ఎవరికి అయినా నిరుపమ ధర్మము. యుద్ధములో నన్ను చంపివేయ కలవాడు నీ కడుపులోఉన్నాడు. అందువల్ల, నీ గర్భాన్ని నేను ఏడు తునకలు చేసినాను. అమ్మా! నీవు నన్ను మన్నించవలెను" అన్నాడు.

47

"ఓ రామా! తన గర్భము ఏడు తునకలు అయినందుకు దితి ఎంతో దుఃఖించింది. ఎదిరించడానికి అలవికాక దేవేంద్రుణ్ణి చూచి సానునయముతో, 'నాయనా బలసూదనా! నా అపరాధమువల్లనే నా గర్భము ముక్కలు అయిపోయింది. నీ తప్పు ఏమీ లేదు. నా గర్భము ఎట్లాగూ పాడు అయిపోయింది. కనుక, నీవు ఇప్పుడు నాకు ఒక ఉపకారము చేయవలెను. ఏడు ముక్కలు అయిపోయిన నా గర్భము ఏడు లోకాలలో వాయు సమూహాలకు అధిపతులు అయ్యేట్టు నీవు చూడవలెను. ఒకడు బ్రహ్మలోకములోనూ, ఒకడు ఇంద్రలోకములోనూ, ఒకడు అంతరిక్షములోనూ, తక్కిన నలుగురూ నాలుగు దిక్కులనూ సంచారముచేయ నివ్వవలెను. వాండ్లను ఏడుగురినీ అందరూ 'మరుద్గణాలు' అనవలెను. ఈవిధముగా చేయడానికి నీవు ఒప్పుకోవలెను' అని చెప్పింది.

"దేవేంద్రుడు ఆమెకు నమస్కారము చేసి, 'అమ్మా! నీవు చెప్పినట్టు చేస్తాను. సందేహం వద్దు. నీ సంతానము దేవతలకుమల్లే సంచరించేట్టు చేస్తాను' అని అన్నాడు.

"ఆ తపోవనములో ఆ తల్లీ కొడుకూ ఈవిధముగా ఒప్పందము చేసుకొని స్వర్గలోకానికి వెళ్ళిపోయినారు.

"ఓ రామా! ఆ తపోవనమే ఇది. దితి తపస్సు చేసిందిన్నీ, దేవేంద్రుడు ఆమెకు ఉపచారాలు చేసిందిన్నీ ఈ ప్రదేశములోనే. ఇక్కడనే ఇక్ష్వాకునున్నూ, అలంబుసాదేవికిన్నీ 'విశాలుడు' అనేవాడు పుట్టినాడు. ఆ విశాలుడు అతిధార్మికుడు. అతడే ఈ విశాలాపట్టణాన్ని కట్టించినాడు.

"ఆ విశాలుడికి మహాబలవంతుడు అయిన హేమచంద్రుడు పుట్టినాడు. ఆ హేమచంద్రుడికి సుచంద్రుడున్నూ, ఆ సుచంద్రుడికి ధూమ్రాశ్వుడున్నూ, ఆ ధూమ్రాశ్వుడికి సృంజయుడున్నూ, ఆ సృంజయుడికి సహదేవుడున్నూ పుట్టినారు.

"సహదేవుడు శ్రీమంతుడు. మహా ప్రతాపవంతుడు. ఆయనకు సుధార్మికుడు అయిన కుశాశ్వుడు పుట్టినాడు. ఆ కుశాశ్వుడికి మహాతేజోవంతుడూ, అమిత పరాక్రమవంతుడూ అయిన సోమదత్తుడు పుట్టినాడు. ఆ సోమదత్తుడికి కాకుత్స్థుడు పుట్టినాడు. ఆ కాకుత్స్థుడి పుత్రుడు సుమతి.

"ఆ సుమతి ఇప్పుడు ఈ విశాలానగరములో రాజ్యపాలనము చేస్తూ ఉన్నాడు. ఇతడు దేవతలతో సరిసమానము అయినవాడు. దుర్జయుడు. ఈ వైశాలిక వంశీయులు అందరూ దీర్ఘాయుష్మంతులు. అందరూ మహాధార్మికులుగాను, వీర్యవంతులుగాను రాజ్యపాలనము చేస్తూ వచ్చినారు.

"రామా! మనము ఈ రాత్రి ఈ విశాలాపట్టణములో సుఖముగా గడుపుదాము. రేపు ఉదయము ప్రయాణము అయిపోయి జనకమహారాజును చూద్దాము" అన్నాడు విశ్వామిత్రమహర్షి.

విశ్వామిత్రమహర్షి తన పట్టణప్రాంతానికి వచ్చినట్టు సుమతికి తెలిసింది. అంతట ఆయన బంధువులనూ, ఉపాధ్యాయులనూ వెంటపెట్టుకొని విశ్వామిత్రమహర్షికి స్వాగతము చెప్పడానికి ఎదురుగుండా పోయి నమస్కారము చేసి, పూజించి, కుశలము అడిగి తెలుసుకొని, "ఓ మహామునీ! తమకు స్వాగతము. తమకు నామీద ఎంతో అనుగ్రహము ఉండటమునుంచి తాము ఇటు వచ్చినారు. తమ దర్శన భాగ్యము నాకు అయాచితముగా లభ్యము అయింది. నేను ఇప్పుడు ధన్యుడను అయినాను. నా కన్నా ధన్యుడు మరి ఒకడు ఉండడు" అంటూ ఉప్పొంగి పోయినాడు.

48

అంతట ఆ సుమతి విశ్వామిత్రమహర్షిని "బ్రహ్మర్షీ! ఈ చిన్నవాండ్లు ఎవరు? ఖడ్గధనుర్ధరులు అయి ఏనుగులవలె గంభీరముగానూ, సింహాలవలె అప్రతిహతముగానూ, పెద్దపులులవలె భయంకరముగానూ, ఆబోతులవలె సవిలాసముగానూ పాదచారులు అయి మీవెంట ఎందుకు వస్తున్నారో చెప్పవలెను" అన్నాడు.

అంతట విశ్వామిత్రమహర్షి సిద్ధాశ్రమములో యజ్ఞము ఆరంభించటమూ, రామలక్ష్మణులను పిలుచుకొని పోవటమూ, వారు రాక్షసులను సంహారము చేయటమూ మొదలు అయిన విషయాలు అన్నిటినీ సుమతికి తెలియ చెప్పినాడు.

అప్పుడు సుమతి పరమ సంతోషముతో రామలక్ష్మణులను యధార్హముగా సత్కరించి అతిథులను అందరినీ తన భవనానికి తీసుకొనిపోయినాడు.

ఆనాడు వారు అందరూ సుమతి సపర్యలను సంతోషముగా అనుభవించినారు. మరునాడు ఉదయము వారు అందరూ మిథిలా నగరానికి ప్రయాణము అయిపోయినారు.

మిథిలా నగరము కళ్ళపడగానే మునిజనులు అందరూ ఉప్పొంగిపోయి జనకమహారాజునూ, మిథిలా నగరాన్నీ ప్రశంసించసాగినారు.

అహల్యా శాపవిమోచనము

ఆ సమీపములో రాముడు ఒక నిర్జనవనాన్ని చూచినాడు. అది పాడుపడిపోయిన మున్యాశ్రమముగా తోచింది. విశ్వామిత్రమహర్షిని చూచి 'మహాత్మా! ఇది ఒకప్పుడు శ్రీమంతము అయిన పుణ్యాశ్రమము అయినట్టుగా తోస్తూవుంది. అట్లా అయినట్లయితే పూర్వము ఇది ఎవరి ఆశ్రమమో, ఆ మహర్షులు ఈప్రదేశము ఎందుకు వదలిపెట్టి పోయినారో చెప్పవలెను" అని అడిగినాడు.

"రామా! చక్కగా ఊహించినావు. సంతోషము. ఇదివరకు ఈ ఆశ్రమము ఏ మహాత్ముడిదో, ఆ మహాత్ముడికి ఎందుకు కోపమువచ్చి ఈ ఆశ్రమాన్ని పాడు పెట్టిపోయినాడో చెప్పుతాను, వినవలసింది.

"ఇది పూర్వము గౌతమమహర్షి ఆశ్రమము. అప్పుడు ఈ ఆశ్రమము దివ్యముగా ఉంటూ ఉండేది. దేవతలు సహితము ఈ ఆశ్రమపదాన్ని ఎంతో ప్రశంసిస్తూ ఉండేవారు. ఇక్కడనే గౌతమమహర్షి ఆయన భార్య అహల్యతో బహుకాలము తపస్సు చేసినాడు.

"గౌతమమహర్షి లేని సమయము కనిపెట్టి దేవేంద్రుడు గౌతమముని వేషము వేసుకొని ఈ ఆశ్రమపదములోనికి వచ్చినాడు. ఆ సహస్రాక్షుడు అహల్యను చూచి, 'ఓ ఒప్పులకుప్పా! కామార్థినులకు ఋతుకాలముతో నిమిత్తములేదు. ఓ వయ్యారీ! నేను ఇప్పుడు నీతో కలియవలెను అని వచ్చినాను' అన్నాడు.

"ఆ మునివేషధరుడు గౌతమమహర్షికాడు అనీ, దేవేంద్రుడు అనీ అహల్య గుర్తించింది. అయితే, అప్పుడు ఆమె బుద్ధి బుగ్గి అయిపోయింది. తనను కలియవలెను అని దేవరాజు అంతటివాడు వచ్చి అడిగినందుకు మురిసిపోయింది. కుతూహలము పుట్టింది. ఆమె దారి తప్పింది.

"అంతట అహల్య ఇంద్రుణ్ణి చూస్తూ, 'ప్రభూ! నేను కృతార్థురాల నయినాను. ఇప్పుడే నీవు ఎవరికంటనూ పడకుండా ఇక్కడ నుంచి వెళ్ళిపో. ఈ విషయము ఎవరికీ తెలియకుండా ఉంచు. నీ మర్యాదా, నా మర్యాదా కాపాడు. త్వరగా నీవు వెళ్ళిపోవలెను' అన్నది.

"దేవేంద్రుడు నవ్వుతూ, 'ఓ సుశ్రోణీ! నేను సంతుష్టుణ్ణి అయినాను. నా దారిన నేను పోతున్నాను' అంటూ బయలుదేరినాడు.

"నదీతీర్థములో స్నానము జేసి ఒక చేతిలో సమిధలూ, ఇంకో చేతిలో దర్భలూ పట్టుకొని, అగ్ని హోత్రుడి మాదిరిగా ప్రజ్వరిల్లుతూ గౌతమమహర్షి ఆశ్రమపదములోనికి వస్తూ ఉన్నాడు. ఎట్టఎదుట దేవేంద్రుడు కనిపించినాడు.

"ఆ తపోబలసంపన్నుణ్ణి, దేవదానవులు ఎవరూ ఎదిరించలేని ఆ శక్తిమంతుణ్ణి దేవేంద్రుడు చూచి భయచకితుడు అయినాడు. ముఖము వెలవెలా పోయింది.

"ఆ దేవేంద్రుణ్ణి గౌతమమహర్షి తేరిపార చూచినాడు. ఆ దుర్వృత్తము అంతా ఆ మహర్షికి గోచరించింది. పరమక్రుద్ధుడు అయిపోయి, 'ఓ దుర్మతీ! నా వేషములో వచ్చి నీవు చేయరానిపని చేసినావు. నీ అండాలు తెగిపోవలెను' అని శాపము పెట్టినాడు.

"గౌతముడి నోటివెంట వెలువడిన వాక్యాలు పూర్తికాక పూర్వమే దేవేంద్రుడి అండాలు తెగి పడిపోయినవి.

"అంతట గౌతమమహర్షి అహల్యను చూచి, 'ఈ ఆశ్రమపదము పాడుపడిపోవలెను. నీవు కూడా, నీళ్ళూ లేకుండా బూడిదలో పార్లాడుతూ, ఎవరి కంటనూ పడకుండా గాలి పీల్చి బ్రతుకుతూ, తపస్సు చేస్తూ ఇక్కడనే పడి వుండు' అని శపించినాడు.

"అహల్య రోదించింది. వేడుకొన్నది. గౌతముడు కొంత శాంతించి, 'ఓ అహల్యా! ఒకానొక కాలానికి దశరథరాముడు ఇక్కడకు వస్తాడు. అప్పటికి ఈ ప్రదేశము పాడుపడిపోయి భయంకరముగా ఉంటుంది. అతడు వచ్చి నిన్ను చూస్తాడు. అతని దర్శనమువల్ల నీవు పరిశుద్ధురాలవు అవుతావు. అప్పుడు నీవు ఆయనకు అతిథి సత్కారాలు చేయవలెను. అంతట నీవు భయమోహనివివర్జితవు అవుతావు. నీకు యథారూపము వస్తుంది. ఆ తరువాత నీవు నాతో సుఖముగా ఉండవచ్చును' అన్నాడు.

"అంతట గౌతమమహర్షి ఈ ఆశ్రమపదాన్ని వదిలిపెట్టి తపస్సు చేసుకోడానికి సిద్ధులూ, చారణులూ సంచరించే హిమవత్పర్వత శిఖరానికి వెళ్ళిపోయినాడు.

49

"దేవేంద్రుడు అండాలు తెగిపోయినందువల్ల దిగులుపడిపోయినాడు. దేవతలను అందరినీ పిలిపించి, 'ఓ దేవతలారా! గౌతమమహర్షి మనలను అందరినీ పదవీచ్యుతులను చేయడానికి తపస్సు తలపెట్టినాడు. నేను ఆయన తపస్సు

విఘ్నము చేయడానికి ఆయన ఆశ్రమపదానికి పోయినాను. ఆయనకు కోపము తెప్పించడముకన్నా నాకు మార్గాంతరము కనిపించలేదు. అందుకోసము ఆయన భార్య అహల్యతో నేను పోయినాను. నామీద ఆయనకు పట్టరాని కోపము వచ్చింది. నా వృషణాలు ఊడిపోవలెను అని శాపము పెట్టినాడు. అహల్యను కూడా శపించి, ఆయన తపోవ్రతము భంగము అయిపోయినందువల్ల ఆ ఆశ్రమపదము వదలిపెట్టి పోయినాడు. దేవకార్యము నేను ఈ విధముగా చక్కబెట్టినాను. కాబట్టి, మీరు అందరూ నాకు మళ్ళీ అండాలు వచ్చే ఉపాయము ఆలోచించవలెను. ఈ సాయము చేయవలెను' అని ప్రార్థించినాడు.

"అంతట దేవతలు అందరూ అగ్నిదేవుడివెంట బయలుదేరి పితృదేవతల దగ్గరకు పోయినారు. జరిగింది అంతా చెప్పినారు. ఆ పితృదేవతలు మేషాండాలు తీసి దేవేంద్రుడికి అంటించినారు. అప్పటినుంచి దేవేంద్రుడు మేషాండుడు అయినాడు.

"రామా! అప్పటినుంచీ ఈ ప్రదేశములో అహల్య అతికరిననియమాలతో తపస్సు చేస్తూ, నీ రాకకై ఎదురుచూస్తూ ఉంది. ఇప్పుడు ఆమె దేవతాస్వరూపిణి. నీవు ఆమెను చూడవలెను. నీ దర్శనమువల్ల ఆమె తరిస్తుంది" అన్నాడు విశ్వామిత్రమహర్షి. అంతట వారు ముగ్గురూ మహారణ్యముగా ఉన్న ఆ మున్యాశ్రమములోకి పోయినారు.

అంతవరకూ దేవ దానవ మానవులకు ఎవరికీ చూడ నలవికాకుండా తపోదీప్తులతో తేజరిల్లుతూ ఉన్న ఆ మహాభాగను, ఆ అహల్యాదేవిని అప్పుడు రాముడు చూచినాడు.

గౌతమవాక్యాన్ని శిరసావహించి కఠోరనియమాలతో తపస్సుచేయ నారంభించినందువల్ల, బ్రహ్మదేవుడు అతిప్రయత్నముతో సృష్టించిన ఆమె అతిమానుష రూపము ఛాయామాత్రము అయిపోయింది. వృక్ష లతా పుష్ప పటలాలు ఆవరించినందు వల్ల, ఆమె లావణ్యము పొగమంచులో మబ్బులమాటుకు పోయిన నిండుచందురుడి వెన్నెలవలె అయిపోయింది. ఆమె దేహకాంతులు ఉదకమధ్యములో ప్రతిఫలించిన ప్రదీప్తసూర్యకిరణాలవలె దుర్నిరీక్ష్యము అయిపోయినవి. ఆమె విగ్రహము ధూమచ్ఛన్నము అయిన అగ్నిహోత్రజ్వాలవలె అయిపోయింది.

అట్లా ఉన్న ఆ అహల్యాదేవి రాముణ్ణి చూసింది. రామ సందర్శనముతో ఆమె పాపవిముక్తా, శాపవిముక్తా అయింది.

అంతట ఆమె యథారూపముతో ముల్లోకాలవారికి కనిపించింది. ఆమెను అందరూ చూచినారు. ఆమె తపస్సు మెచ్చుకొన్నారు. గౌతమమహర్షి

చెప్పిపోయినట్లుగా ఆమె రామలక్ష్మణులకు సాష్టాంగ నమస్కారము జేసింది. అర్ఘ్యపాద్యాదులు ఇచ్చింది. అతిథి సత్కారము చేసింది.

అది తెలిసి గౌతమమహర్షి అప్పుడు అక్కడికి వచ్చినాడు. ఆ తపోబల విశుద్ధాంగిని చూచినాడు. అప్పుడు దేవదుందుభులు మ్రోగినవి. పూలవాన కురిసింది. గంధర్వులు పాడినారు. అప్సరసలు ఆడినారు.

ఆ మునిదంపతులు అత్యంతానందముతో రామలక్ష్మణులనూ, విశ్వామిత్ర మహర్షినీ, మిగతా మహర్షులనూ చక్కగా సమ్మానించినారు.

50

మిథిలానగర ప్రవేశము

విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులతోనూ, తక్కిన మహర్షులతోనూ అక్కడ నుంచి ఈశాన్యదిక్కుగా మిథిలా పట్టణానికి ప్రయాణమయిపోయినాడు. వారు అందరూ జనకమహారాజు యజ్ఞవాటిక చేరినారు. రాముడు అప్పుడు విశ్వామిత్రమహర్షిని చూచి, "స్వామీ! ఈ యజ్ఞవాటము చక్కగానూ, సర్వసమృద్ధముగానూ ఉంది. వేదాధ్యయనపరాయణులు అయిన బ్రాహ్మణులు అనేక దేశాలవారు ఎటుచూచినా కనపడుతున్నారు. ఋషివాటికలు వందలకొద్దీ బండ్లతో కిటకిట లాడుతూ ఉన్నవి. ఇప్పుడు మనము ఎక్కడ విడిది చేయవలెనో మీరు నిర్ణయించవలెను" అని చెప్పినాడు.

వారు అందరూ విడిది చేయడానికి జనసమ్మర్దములేకుండా వివిక్తముగా ఉన్న ఒక చెరువుగట్టును విశ్వామిత్రమహర్షి చూపించినాడు.

విశ్వామిత్రమహర్షి రాక జనకమహారాజుకు తెలిసింది. తత్క్షణమే పురోహితుడు శతానందుణ్ణి వెంటపెట్టుకొని వచ్చి వినయ విధేయతలు ఉట్టిపడుతూ విశ్వామిత్రమహర్షి దర్శనము చేసినాడు. అంతలో జనకమహారాజు ఋత్విజులూ మొదలు అయినవారు అక్కడికి వచ్చి ధర్మవిహితముగానూ, సమంత్రకముగానూ అర్ఘ్యమూ, పాద్యమూ, మధుపర్కమూ విశ్వామిత్రమహర్షికి సమర్పించినారు. ఆ సత్కారాలకు ఆయన ఎంతో సంతోషముతో, "రాజా! నీవు కుశలముగా ఉంటూ ఉన్నావా? నీ యజ్ఞము నిర్విఘ్నముగా సాగుతూ వుందా" అని అడిగి తెలుసుకొన్నాడు. శతానందుణ్ణీ, తక్కిన ఋత్విజులనూ కుశలప్రశ్న చేసినాడు. ఆయన ఆదరాతిశయానికి వారు అందరూ ఎంతో సంతోషించినారు. విశ్వామిత్రమహర్షి మొదలు అయినవారు కూర్చుండటానికి జనకమహారాజు ఉచితాసనాలు చూపించినాడు. వారు అందరూ యథార్హముగా కూర్చున్న తరువాత శతానందుడూ,

ఋత్విజులూ, మంత్రులూ కూర్చున్నారు. అప్పుడు జనకమహారాజును కూర్చుండమని విశ్వామిత్రమహర్షి చెప్పినాడు.

జనకమహారాజు విశ్వామిత్రమహర్షిని చూచి, "ఓ మహానుభావా! తమ దర్శనభాగ్యమువల్ల నా యజ్ఞము సఫలము అయినట్టుగా ఉంది. నేను ఇదివరకు చేసిన యజ్ఞాలు అన్నిటికీ దేవతలు ఇప్పుడు ప్రతిఫలము ఇచ్చినట్టుగా ఉంది. తమకు నా మీద ఎంతో అనుగ్రహము ఉండడమువల్ల ఇంతమంది మహర్షులతో తాము ఇక్కడికి వచ్చినారు. నేను ఇప్పుడు ధన్యుణ్ణి అయినాను. స్వామీ! ఈ యజ్ఞము సమాప్తము కావడానికి ఇంకా పన్నెండు రోజులు పట్టుతుంది అని పెద్దలు చెప్పుతున్నారు. తాము అంతవరకూ అవశ్యమూ ఇక్కడనే ఉండవలెను అని మనవి చేసుకొంటున్నాను అంటూ, ఓ మహామునీ! మీ వెంట వచ్చిన ఈ చిన్నవాండ్లు ఎవరు? తామరరేకులవంటి నేత్రాలతోనూ, దివ్యరూపాలతోనూ తేజరిల్లుతూ ఖడ్గ తూణీర ధనుర్ధరులు అయి మహావిష్ణువుతో సరిసమానము అయిన పరాక్రమ వంతులుగా కనిపిస్తున్నారు. అశ్వినీదేవతలు ఏమోను అనిపిస్తున్నారు. నవయౌవనములో ఉన్న ఇద్దరు దేవతలు వారి అంతట వారు ఈ భూలోకములోకి వచ్చినారా అన్నట్లు కనబడుతున్నారు. ఒడ్డూ పొడుగులోనూ, ముఖకవళికలోనూ, నడకలలోనూ, మాటలలోనూ, చూపులలోనూ ఒక్క మాదిరిగా కనిపిస్తున్నారు. చివరకు వీరి జుట్లూ, జులపాలూ కూడా ఒక్కమాదిరిగా ఉన్నవి. ఆకాశములో సూర్యచంద్రులు మాదిరిగా వీరు ఉభయులున్నూ ఇక్కడ తమ కాంతులు వెదజల్లుతున్నారు. వీరు ఎందుకు పాదచారులు అయి మీవెంట వచ్చినారు? వీరు ఎవరి పుత్రులు? వీరిని గురించి వివరముగా చెప్పవలెను" అన్నాడు.

"వీరు ఇద్దరూ దశరథమహారాజు పుత్రులు, రామలక్ష్మణులు అంటూ విశ్వామిత్రమహర్షి సిద్ధాశ్రమ వృత్తాంతమూ, మహారణ్య ప్రయాణమూ, విశాల నగరములో సుమతి రాజసందర్శనమూ, అహల్యా శాపవిమోచనమూ మొదలు అయిన విషయాలు అన్నీ చెప్పి, "ఓ రాజా! నీ ఇంట్లో ఉన్న శివధనుస్సును చూడవలెను అనే కుతూహలముతో ఈ రామలక్ష్మణులు ఇక్కడికి నావెంట వచ్చినారు" అని చెప్పి ఊరుకున్నాడు.

51

తపోదీధితులతో తేజరిల్లుతూ ఉన్న శతానందుడు విశ్వామిత్రమహర్షి చెప్పింది అంతా విన్నాడు. ఆయన గౌతమమహర్షి జ్యేష్ఠ పుత్రుడు. జనకమహారాజు పురోహితుడు. విస్మితుడు అయిపోయినాడు. ఆయన దేహము పులకరించింది. ఆ

మహాత్ముడు సుఖాసీనులు అయి ఉన్న రామలక్ష్మణులను చూస్తూ విశ్వామిత్రమహర్షితో, "ఓ బ్రహ్మర్షీ! బహుకాలమునుంచీ తపస్సుచేస్తూ ఉన్న మా అమ్మను ఈ రామచంద్రుడికి చూపించినావా? దైవదుర్విలాసమువల్ల పూర్వము ఆ తేజస్వినికి జరిగిన అపకారము అంతా ఈయనకు చెప్పినావా? ఆ యశస్విని ఈ పూజనీయుణ్ణి గౌరవించి అతిథిపూజ చేసిందా? మా తండ్రి మా అమ్మ దగ్గరకు వచ్చినాడా? ఆ మహాత్ముడు, ఆ మహాతేజోవంతుడు మా తండ్రి గౌతమమహర్షి ఈ రామచంద్రుణ్ణి చక్కగా సత్కరించినాడా? ఈ పవిత్రుడు, ఈ ప్రశాంతచిత్తుడు మా తండ్రికి అభివాదము చెప్పినాడా? స్వామీ! తమకు శుభము అవుతుంది. ఈవిషయము అంతా తాము చెప్పవలెను" అన్నాడు.

విశ్వామిత్ర చరిత్ర

శతానందుడితో విశ్వామిత్రమహర్షి, "నాయనా! చెప్పవలసింది అంతా చెప్పినాను. చేయవలసింది అంతా చేసినాను. రేణుకాదేవి జమదగ్నిని చేరినట్లుగా, నీ తల్లి అహల్యాదేవి నీ తండ్రి గౌతముణ్ణి చేరింది. ఇప్పుడు నీ తల్లిదండ్రులు సుఖముగా ఉన్నారు" అన్నాడు.

శతానందుడు రాముణ్ణి చూచి, "ఓ రామా! నీకు స్వాగతము. దైవయోగమువల్ల ఈ విశ్వామిత్రమహర్షి నిన్ను దగ్గరకు తీసినాడు. ఈయన అపరాజితుడు. ఎవరూ ఊహించలేని మహత్కార్యాలు సాధించిన మహామహుడు. తపఃప్రభావముతో బ్రహ్మర్షి అయినాడు. ఈ మహాతేజోవంతుడు నీకు ఏదో గొప్ప మేలు చేయతలచి నిన్ను వెంట పెట్టుకొని ఇక్కడికి వచ్చినాడు. నీకంటే ధన్యుడు ఇప్పుడు ఈ జగత్తులో మరి ఒకడు లేడు.

"ఈ విశ్వామిత్రమహర్షి చాలా చదువుకొన్నాడు. మహాపరాక్రమవంతుడు. పరమధార్మికముగానూ, ప్రజాహితముగానూ పూర్వము బహుకాలము రాజ్యపాలనము చేసినాడు. ఆతరువాత చతురంగబలయుతము అయిన ఒక అక్షౌహిణి సైన్యముతో దేశాటనము చేసినాడు. అనేకదేశాలూ, అనేకపట్టణాలూ, అనేకపుణ్యతీర్థాలూ తిరిగి చూచినాడు. మహాపర్వత ప్రదేశాలలోనూ, సాంద్రారణ్యాల లోనూ సంచారము చేసినాడు. అంతట మున్యాశ్రమాలు వరుసగా చూచుకొంటూ వశిష్ఠమహర్షి ఆశ్రమానికి పోయినాడు.

"ఈ భూభాగములో ఎక్కడ ఎక్కడనో కాని కనిపించని నానాజాతుల ఫల పుష్ప వృక్ష లతా గుల్మాదులు అన్నీ అక్కడ చక్కగా పెరుగుతూ ఉన్నవి. వివిధ వన్యమృగాలూ అన్యోన్య వైరము లేకుండా అక్కడ నిర్భయముగా సంచరిస్తూ ఉన్నవి. రకరకాల పక్షులు కుహూనాదాలు చేస్తూ ఉన్నవి. ఏవైపు చూచినా జింకలు

మొదలు అయిన మృగాలు నదురూ బెదురూ లేకుండా మనుష్యుల పక్కపక్కను తిరుగుతూ ఉన్నవి. సిద్ధులూ, చారణులూ, దేవతలూ, దానవులూ, గంధర్వులూ, కిన్నరులూ ఆ ఆశ్రమములో ఉంటూ ఉన్నారు. ఒకవైపున బ్రహ్మర్షులూ, మరి ఒక వైపున దేవర్షులూ, ఇంకొకవైపున అగ్నిహోత్రాల మాదిరిగా జ్వలించే తపస్సిద్ధులూ కనిపించినారు. పండ్లుమాత్రమే తిని బ్రతికేవారూ, ఆకులుమాత్రమే తిని బ్రతికేవారూ, ఒక్క నీరుమాత్రమే త్రాగి బ్రతికేవారూ, ఒక్క గాలే పీల్చి బ్రతికేవారూ కనిపించినారు. వారు అందరూ జితరోషులు, విజితేంద్రియులు. వారేకాకుండా జపహోమాలుచేసే వాలఖిల్యులూ, వైఖానసులూ అక్కడ ఉన్నారు.

"ఆ వశిష్ఠమున్యాశ్రమము అపరబ్రహ్మలోకములోవలె విశ్వామిత్రుడికి అగుపించింది.

52

వశిష్ఠాశ్రమము

"విశ్వామిత్రుడు వశిష్ఠమహర్షిని సందర్శించి వినయవిధేయతలతో నమస్కారము చేసినాడు. వశిష్ఠుడు, 'రాజా! నీకూ, నీ పరివారానికీ స్వాగతము' అంటూ విశ్వామిత్రుడు కూర్చుండటానికి ఆసనము ఇప్పించినాడు. యథాశాస్త్రముగా కందమూలఫలాదులను ఇచ్చి సత్కరించినాడు.

"విశ్వామిత్రుడు ఆ సత్కారాలకు సంతోషించి, 'మహర్షీ! తాము కుశలముగా ఉంటూ ఉన్నారా? తమ తపోగ్నిహోత్రాలు నిర్విఘ్నముగా సాగుతూ ఉన్నాయా? తమ శిష్యులందరూ క్షేమముగా ఉంటూ ఉన్నారా? తమ ఆశ్రమ తరులతాగుల్మాదులు అన్నీ ఆ యా ఋతువులలో ఫలప్రదముగా ఉంటూ ఉన్నవా' అని అడిగినాడు.

" 'సర్వత్రా కుశలమే' నని వశిష్ఠమహర్షి సమాధానము చెప్పినాడు.

"వశిష్ఠమహర్షి బ్రహ్మదేవుడి పుత్రుడు. మహామంత్రవేత్త. జపతపాదులలో ఆయనను మించినవాడు మరి ఒకడు లేడు. సుఖముగా కూర్చొని ఉన్న విశ్వామిత్రుణ్ణి చూస్తూ, 'రాజా! నీవు హాయిగా ఉంటూ ఉన్నావా? ధర్మమార్గాన ప్రజారంజకముగా రాజ్యపాలనము చేస్తూ ఉన్నావా? నీ భృత్యులను అందరినీ చక్కగా పోషిస్తున్నావా? నీ అనుచరులు అందరూ నీ ఆజ్ఞలను అనుసరించి పోతున్నారా? నీవు శత్రువులను అందరినీ జయించినావా? నీ దండూ, నీ బొక్కసమూ సమృద్ధముగా ఉన్నవా? నీ పుత్రులూ పౌత్రులూ నీ మిత్రులూ క్షేమముగా ఉంటూ ఉన్నారా' అని వశిష్ఠమహర్షి అడిగినాడు. 'అంతా క్షేమమేను' అని విశ్వామిత్రుడు జవాబు చెప్పినాడు.

"ఆ పరమధార్మికులు ఉభయులూ శుభావహము అయిన ఆ యా విషయాలను గురించి చర్చించి, పరస్పరమూ సంతుష్టాంతరంగులు అయినారు.

ఇష్టాగోష్ఠి అయిపోయిన తరువాత వశిష్ఠమహర్షి ప్రసన్న వదనముతో, 'రాజా! నీకూ, నీ సైన్యానికీ యథావిధిగా ఆతిథ్యము ఇవ్వ సంకల్పించుకొన్నాను. నీవు రాజువు. అందులో అంత ఇంత అని చెప్పనలవికాని దొడ్డవాడవు. కాబట్టి, నీవు అతిథిశ్రేష్ఠుడవు. నేను నిన్ను సత్కరించి తీరవలెను' అన్నాడు.

"విశ్వామిత్రుడు, 'మహర్షీ! తమ ప్రియవాక్యాలవల్లనే నాకు అతిథిసత్కారము అయిపోయింది. స్వామీ! తమ ఆశ్రమములో పండిన పండ్లూ మొదలు అయినవి నాకు ఇచ్చినారు. అర్ఘ్యమూ, పాద్యమూ, ఆచమన జలమూ ఇచ్చినారు. నాకు అంతే చాలును. తమ దర్శనమువల్లనే నాకు సమస్త సత్కారాలూ సమకూడినవి. నేను సెలవు తీసుకొంటాను. నన్ను తాము స్నేహముతో చూస్తూ ఉంటే చాలును, నమస్కారము' అంటూ పోబోయినాడు.

"వశిష్ఠమహర్షి ఒప్పుకొనలేదు. భోజనము చేసి పోవలసిందేను అని బలవంతము చేసినాడు. విశ్వామిత్రుడు ఆయన మాట త్రోసివేయలేక, 'ఓ మహామునీ! తమ చిత్తము వచ్చినట్టు చేయడమే నా పని' అన్నాడు.

"వశిష్ఠమహర్షి సంతోషముతో, 'శబలా! రా! వెంటనే రావలెను, నీతో పని వచ్చింది' అన్నాడు. అప్పుడు కామధేనువు వచ్చి ఆయన ఎదుట నిలుచున్నది. 'ఓ కామధేనూ! నేను ఈ విశ్వామిత్ర రాజర్షికీ, ఈయన సైన్యానికీ భోజనముపెట్టి సత్కరించ సంకల్పించుకొన్నాను. అన్నీ నీవు చేసిపెట్టవలెను. షడ్రసోపేతము అయిన భోజనము ఎవరికి ఏవిధముగా కావలెనో, వారి వారికి ఆ విధముగా చేసి పెట్టవలెను. వివిధరసాయనాలతోనూ, భక్ష్యాలతోనూ, పానీయాలతోనూ, లేహ్యాలతోనూ, చోష్యాలతోనూ, శాలి మొదలు అయిన వివిధాన్నాలూ శీఘ్రముగా సిద్ధము చేయవలెను' అన్నాడు వశిష్ఠమహర్షి.

53

శబల

"ఓ రామా! వశిష్ఠమహర్షి చెప్పే చెప్పటముతోనే శబల సమస్తమూ సిద్ధము చేసింది. చెరకుపానకమూ, తేనె, ఇప్పపూల ఆసవమూ, ఇంకా మంచి రుచ్యము అయిన పానకాలూ, పేలాలూ, రకరకాల భక్ష్యాలూ తయారుచేసింది. కొండలు అంత ఉడుకు ఉడుకు అన్నము రాసులూ, పాయసమూ మొదలు అయిన మృష్టాన్నాలూ, వండిన పప్పులూ, షడ్రసాలతో రుచ్యముగా చేసిన షాడబాలూ, భక్ష్యాలూ, బెల్లముతో చేసిన పిండివంటలూ సిద్ధము అయినవి. వాటిని అన్నిటినీ వారి వారికి కావలసినట్టు పాత్రలలో వడ్డన చేసింది. ఆ పెరుగు వేయటము చూస్తే

అక్కడ ఎక్కడను అయినా పెరుగు పారే ఏరు ఉందా అనిపించింది. విశ్వామిత్రుడూ, ఆయన అంతఃపుర స్త్రీలూ, పురోహితులూ, బ్రాహ్మణులూ, అమాత్యులూ, సైనికులూ, ఇంకా మిగతా అనుచరులూ ఆ విందు ఆరగించినారు. ఆ విందు వారికి తుష్టినీ ఇచ్చింది, పుష్టినీ ఇచ్చింది.

"అప్పుడు పరమసంతోషముతో విశ్వామిత్రుడు వశిష్ఠమహర్షిని చూచి, 'ఓ బ్రహ్మర్షీ! నేను తమను సత్కరించడానికి బదులు నన్ను తాము మహాచక్కగా సత్కరించినారు. ఒక్కమాట చెప్పుతాను, వినవలెను. తాము మాటలపొందు తెలిసినవారు. నా మాట తోసివేయవద్దు. ఏదో సాకు చెప్పవద్దు. ఈ కామధేనువుకు బదులు నేను ఒక లక్ష గోవులను తమకు ఇస్తాను. ఈ కామధేనువును నాకు ఇవ్వవలెను. ఇది మహారత్నము. మహారత్నాలు అన్నీ రాజు సొమ్ము కాబట్టి, కామధేనువును తాము నాకు ఇవ్వవలెను. ఇది లౌకిక ధర్మము' అన్నాడు.

"వశిష్ఠమహర్షి, 'ఓ రాజా! నీవు లక్ష ఆవులను కాదు, నూరుకోట్ల ఆవులను ఇచ్చినా, వెండిరాసులు కుమ్మరించినా ఈ శబలను నేను ఇవ్వను. ఇది నాదగ్గర ఉండేదే తప్ప నేను మరి ఒకరికి ఇచ్చేది కాదు. పౌరుషవంతుణ్ణి ఆశ్రయించుకొని ఉండే కీర్తి మాదిరిగా, ఈ కామధేనువు ఎప్పుడూ నన్నే అంటిపెట్టుకొని ఉంటుంది. దేవతలకు ఇచ్చే హవ్యాలూ, పితృదేవతలకు ఇచ్చే కవ్యాలూ, ప్రాణాగ్నిహోత్రమూ, సాయంప్రాతరగ్నిహోత్రాలూ, అమావాస్య పూర్ణిమలనాటి హోమాలూ నాకు ఈ కామధేనువు వల్లనే సాగుతూ ఉన్నవి. స్వాహావషట్కారాలూ, వివిధవిద్యలూ, అవీ ఇవీ ఏమిటి సమస్తమూ నాకు ఈ కామధేనువు వల్లనే సమకూరుతూ ఉన్నవి. ఉన్నమాట చెప్పుతున్నాను, ఈ కామధేనువే నా సర్వస్వము. నాకు తుష్టిని ఇచ్చేది ఇదే. ఈ కామధేనువును నేను ఒకరికి ఇవ్వడానికి వీలు లేదు' అన్నాడు.

"విశ్వామిత్రుడు మరింత గట్టిగానూ, అత్యర్థముగానూ, 'ఓ మహర్షీ! బంగారపు గొలుసులతోనూ, బంగారపు నడికట్టుతాళ్ళతోనూ, బంగారపు అంకుశాలతోనూ పధ్నాలుగువేల ఏనుగులను నేను మీకు యిస్తాను. బంగారపు గంటలూ, మువ్వలూ కట్టిన నాల్గు గుర్రాల బంగారు రధాలను ఎనిమిది వందలు ఇస్తాను. మహావేగముగా పరుగెత్తే గుర్రాలను మంచి వంగడములో పుట్టిన వాటిని ఒక పదకొండువేలు ఇస్తాను. వన్నె వన్నెల తరిపి ఆవులను ఒక కోటి ఇస్తాను. ఈ కామధేనువును మీరు నాకు ఇవ్వవలెను. ఈ చెప్పినవే కాదు, మీరు కోరుకొన్నంత బంగారము ఇస్తాను. తాము నాకు శబలను ఇప్పించవలెను' అన్నాడు.

"వశిష్ఠమహర్షి, 'ఓ రాజా! నీవు ఏమి ఇచ్చినా శబలను నేను ఇవ్వను. ఇదే, ఈ కామధేనువే నాకు ఉన్న మహారత్నము. ఇదే నా ధనము. ఇదే నా సర్వస్వము.

ఈ కామధేనువే నాకు దర్శపూర్ణిమలు. ఇదే నాకు దక్షిణలు ఇచ్చే యజ్ఞాలు. నేను చేసే సత్కర్మలు అన్నిటికీ ఇదే మూలాధారము. ఒట్టిమాటలు ఎందుకు - నా సమస్త కోర్కెలూ సఫలము చేసేది ఇదే. దీనిని నేను ఇవ్వను' అన్నాడు.

54

విశ్వామిత్ర గర్వభంగము

"ఓ రామా! కామధేనువును ఇవ్వను అని వశిష్ఠమహర్షి నిష్కర్షగా చెప్పగానే, విశ్వామిత్రుడు తన భటులను పిలిచి ఆ కామధేనువును లాగుకొని పొమ్మని ఆజ్ఞాపించినాడు.

"రాజభటులు బలవంతముగా కామధేనువును ఈడ్చుకొనిపోతూ ఉంటే, దానికి దుఃఖము వచ్చింది. భయము వేసింది. ఏడుస్తూ, 'వశిష్ఠమహర్షి నన్ను విడనాడినాడా? ఆ మహాత్ముడికి నేను ఏమి అపకారము చేసినాను? ఏమి అపరాధము చేసినాను? నేను ఆయనకు ఇష్టురాలనే! ఈ రాజభటులు నన్ను ఇట్లా లాగుకొని పోతూ ఉంటే, ఆయన ఎందుకు చూస్తూ ఊరకున్నాడు' అని ఆలోచిస్తూ నిట్టూర్పులు విడిచింది. తనను పట్టి, కట్టివేసి లాగుకొనిపోతూ ఉన్న రాజభటులను అందరినీ చటుక్కున విదిలించివేసి, అడ్డము వచ్చిన వారిని అందరినీ చటుక్కున పడతన్నుతూ వాయువేగముతో వశిష్ఠమహర్షి దగ్గరకు పరుగెత్తుకొనిపోయి దుందుభిస్వనముతో, 'బ్రాహ్మణోత్తమా! నన్ను వదలివేసినావా? నేను ఏమి అపరాధము చేసినాను? ఈ రాజభటులు నన్ను ఇట్లా ఎందుకు లాగుకొనిపోతూ ఉన్నారు' అని అడిగింది.

"వశిష్ఠమహర్షి తన ఎదుట ఏడుస్తూ నిలుచుని ఉన్న కామధేనువును చూచి, 'ఓ శబలా! నీవు నాకు చెల్లెలువంటి దానవు. నేను నిన్ను వదలిపెట్టను. నీవు నాకు ఏ అపకారమూ చేయలేదు. ఏ అపరాధమూ చేయలేదు. శోకముతో నీ హృదయము బ్రద్దలు అయిపోతూ ఉంది అని నాకు తెలుసును. జరుగుతున్నది అంతా చూస్తూ ఉన్నాను. ఈ విశ్వామిత్రుడు క్షత్రియుడు. మహాబలవంతుడు. పృథ్వీపతి. ఏనుగులతోనూ, గుర్రాలతోనూ, రథాలతోనూ సంపూర్ణముగా ఒక్క అక్షౌహిణి సైన్యము వెంట ఉంది. నేను బ్రాహ్మణుణ్ణి. నాకు సేనాబలము లేదు. తపోబలముతో నిగ్రహించ వలెను అనుకొంటే, ఈతడు రాజు అయిపోయినాడు. పైగా, ఈయనకు ఇప్పుడే ఆతిథ్యము ఇచ్చినాను. ఏమి చేయటము?' అన్నాడు.

"ఆ తేజోవంతుణ్ణి కామధేనువు చూస్తూ, 'ఓ బ్రహ్మర్షీ! బ్రహ్మ బలము ముందు క్షత్రియ బలము ఏపాటిది? బ్రహ్మబలముకన్నా దివ్యము అయింది మరి ఏదీ లేదు అని పెద్దలు చెప్పగా విన్నాను. మహాత్మా! ఇంతింత అని చెప్ప నలవికానిది

తమ తపోబలము. ఈ విశ్వామిత్రుడు ఎంతటి వీర్యవంతుడు అయినా, తమకన్నా బలవంతుడు కాడు. తమ ప్రభావాన్ని ఎదిరించకలవారు ఎవరున్నారు? తమ మంత్ర ప్రభావము వల్లనేకదా నేను పుట్టింది. తాము స్వయముగా కలుగజేసుకోవలసిన అవసరము లేదు. నాకు ఆనుజ్ఞ ఇవ్వవలెను. ఇప్పుడే ఈ దుర్మార్గుడి దర్పాన్ని అణచి వేస్తాను' అన్నది. అంతట వశిష్ఠమహర్షి 'శబలా! నీ శత్రువులను సంహారము చేసే సేనలను సృష్టించుకో' అని ఆజ్ఞాపించినాడు.

"కామధేనువు 'అంబా' అని రంకె వేసింది. అప్పటికి అప్పుడు వందలకొద్దీ 'పప్లవులు' అనే సైనికులు పుట్టుకొని వచ్చినారు. వాండ్లు అమాంతము విశ్వామిత్రుడి సేనలమీద పడ్డారు. విశ్వామిత్రుడి కళ్ళముందే ఆ పప్లవులు ఆయన సేనలను నాశనము చేయసాగినారు. విశ్వామిత్రుడు పరమకృద్ధుడు అయినాడు. రథము ఎక్కిపోయి జగత్తును అంతా తల్లక్రిందులు చేసే అస్త్రాలను ఆ పప్లవులమీద ప్రయోగించినాడు.

"కామధేనువు చూచింది. దానికి పట్టరాని కోపము వచ్చింది. అప్పుడు యవనులతో కూడిన శకసేనలను వందలకొద్దీ సృష్టించింది. ఆ యవనమిశ్రిత శకసైనికులు అమితపరాక్రమవంతులు. వారు సంపంగిరేకులవంటి కాంతిమంతులు. బంగారువన్నె వస్త్రాలు ధరించి ధగధగలాడుతూ పెద్ద పొడుగుపాటి కత్తులతోనూ, పట్టిసాలతోనూ చెలరేగి విశ్వామిత్రుడి సైన్యాన్ని అంతా దగ్ధము చేయసాగినారు.

"ఆ మంటలు చూచి విశ్వామిత్రుడు పరమకోపితుడు అయినాడు. అమోఘము అయిన అస్త్రాలు వేసి ఆ యవనులనూ, పప్లవులనూ కలవర పెట్టినాడు.

55

"విశ్వామిత్రుడి అస్త్రాలకు యవనాదులు చెల్లాచెదురు కావటము వశిష్ఠమహర్షి చూచినాడు. యోగ మహిమతో ఇంకా సేనలను సృష్టించ వలసింది అని కామధేనువుకు చెప్పినాడు.

"కామధేనువు 'అంబా' అని మరి ఒకసారి రంకె వేసింది. అప్పుడు ఆ కామధేనువు నోటిలో నుంచి కాంతిమంతులు అయిన కాంభోజులు పుట్టుకొని వచ్చినారు. దాని పొదుగులోనుంచి శస్త్రాస్త్రపాణులు అయిన పప్లవులూ, దాని యోని ప్రదేశములో నుంచి యవనులూ, దాని శకృత్ప్రదేశములో నుంచి శకులూ, రోమకూపాలలో నుంచి మ్లేచ్ఛులూ, కిరాతులూ పుట్టుకొని వచ్చినారు. వారు అందరూ క్షణలేశములో విశ్వామిత్రుడి రథ,గజ,తురగ,పదాతి సేనలను అన్నిటినీ నాశనము చేసివేసినారు.

"అప్పుడు విశ్వామిత్రుడి నూరుగురు పుత్రులు కుపితులు అయినారు. వారు వివిధాయుధాలతో వశిష్ఠమహర్షిమీదికి పోయినారు. తన పయిన పడవస్తూ ఉన్న వారినందరినీ వశిష్ఠమహర్షి చూచి, హుంకారము చేసినాడు. ఆ క్షణమే విశ్వామిత్రుడి నూరుగురు పుత్రులున్నూ వారి వారి చతురంగబలాలతో భస్మము అయిపోయినారు.

"విశ్వామిత్రుడు అది అంతా చూచినాడు. ఖిన్నుడు అయిపోయినాడు. ఆ మహాయశస్వికి సిగ్గువేసింది. అలలు ఆగిపోయిన సముద్రమువలె, యుద్ధ ప్రవృత్తి లేకుండా నిలుచునిపోయినాడు. కోరలు తీసిన పాము మాదిరిగా ఏమి చెయ్యడానికి అశక్తుడు అయిపోయినాడు. రెక్కలు విరిచిన పక్షివలె దీనుడు అయిపోయినాడు. గ్రహణము పట్టిన సూర్యునివలె తేజోహీనుడు అయిపోయినాడు. ఆయన నూరుగురు పుత్రులు హతము అయిపోయినారు. చతురంగ సేనలూ హతము అయిపోయినవి. ఆయన దర్పము హతము అయిపోయింది. ఆయన ఉత్సాహము హతము అయిపోయింది. పట్టరాని దుఃఖము ఆయనకు వచ్చింది.

"చావకుండా మిగిలి ఉన్న ఒక్క కొడుకుకూ విశ్వామిత్రుడు పట్టము కట్టినాడు. క్షత్రధర్మముతో రాజ్యపాలనము చేయవలసింది అని ఆ కుమారుడికి బోధించి, మహాదేవుణ్ణి గురించి తపస్సు చేయడానికి కిన్నరులూ, ఉరగులూ నివసించే హిమాలయపర్వతానికి పోయినాడు. అక్కడ మహోగ్రముగా తపస్సుచేయ నారంభించినాడు. కాలము గతించింది. వృషభధ్వజుడు ఆయనకు ప్రత్యక్షము అయి, 'ఓ రాజా! నీవు ఎందుకు తపస్సు చేస్తున్నావో చెప్పు' అన్నాడు. విశ్వామిత్రుడు నమస్కారము చేసి, 'మహాదేవా! నా తపస్సు మెచ్చుకొన్నట్లయితే సాంగోపాంగముగా ఉపదేశగమ్యాలు అయిన రహస్య మంత్రాలు అన్నిటితోనూ నాకు ధనుర్వేదాన్ని అనుగ్రహించవలెను. దేవ, దానవ, యక్ష, రాక్షస, గంధర్వులకూ; మహర్షులకూ సాధనాలుగా ఉంటూ ఉన్న అస్త్రాలు అన్నీ నాకు స్వాధీనము కావలెను. ఓ దేవా! నా ఈ మనోరథము తాము ఈడేర్చవలెను' అన్నాడు. 'తథాస్తు' అంటూ శివుడు అంతర్ధానము అయిపోయినాడు.

"మొదటినుంచీ విశ్వామిత్రుడు తాను మహాబలవంతుడను అనే గర్వము కలవాడు. ఆ యా అస్త్రాలను అన్నిటినీ సంపాదించటముతో ఆయన మరింత గర్వి అయినాడు. అప్పుడు ఆయన వశిష్ఠమహర్షి ఆశ్రమానికి హుటాహుటి పోయినాడు. పర్వదినాలలో సముద్రము మాదిరిగా విజృంభించినాడు. తేజోవంతము అయిన అస్త్రాలను అన్నిటినీ ఆ వశిష్ఠాశ్రమముమీద కురిపించసాగినాడు. అప్పుడు ఆ తపో

వనము అంటుకొన్నది. పొగలూ, మంటలూ ఆకాశము వరకూ లేచినవి. ఆ పొగలకూ, మంటలకూ పక్షిగణాలు అక్కడ నిలువలేక పోయినవి. అమితఘోరముగా కూస్తూ పైకి ఎగిరినవి. ఆ యా మృగాలు అన్నీ చెల్లాచెదరు అయినవి. వశిష్ఠమహర్షి శిష్యులూ, ఇంకా ఇతర మహర్షులూ ఆ మంటల వేడికి తట్టుకోలేక పోయినారు. అందరూ భయభ్రాంతులు అయి దశదిశలా పరుగెత్తసాగినారు. 'మంచును సూర్యుడివలె, ఈ విశ్వామిత్రుణ్ణి నేను రూపుమాపుతాను. భయపడవద్దు, పారిపోవద్దు' అంటూ వశిష్ఠమహర్షి ఎంత హెచ్చరించినా ఆ అగ్నిజ్వాలలకూ, ఆ ధూమశిఖలకూ అక్కడ ఎవరూ నిలువలేక పోయినారు. అందరూ పారిపోయినారు.

"ఆ తపోవనమంతా దగ్ధము అయిపోయింది. ఆ ప్రదేశము అంతా చడీ చప్పుడూ లేకుండా శూన్యము అయిపోయింది. ఒక పెద్ద ఎడారిగా అయిపోయింది.

"వశిష్ఠమహర్షి రోషకషాయతాక్షుడు అయి విశ్వామిత్రుణ్ణి చూచి, "ఓ మూఢుడా! ఎంతోకాలమునుంచీ పెంచిన ఈ తపోవనాన్నీ, ఈ మున్యాశ్రమాన్నీ నాశము చేసివేసినావు. దురాచారానికి ఒడికట్టినావు. ఇక నీవు ఉండకూడదు' అంటూ బ్రహ్మదండాన్ని చేతిలో పట్టుకొన్నాడు.

"అప్పుడు ఆ బ్రహ్మదండము దండధరుడి కాలదండమువలె పొగలూ, గిగలూ లేకుండా ధగధగ మండుతూ కనిపించింది.

56

"అంతట విశ్వామిత్రుడు ఆగ్నేయాస్త్రాన్ని తీసుకొని, 'నిలు నిలు, ఓ మహర్షీ' అన్నాడు.

"ధగధగ మండుతూ ఉన్న బ్రహ్మదండాన్ని చేతిలో పట్టుకొని ఉన్న వశిష్ఠమహర్షి, 'ఇదిగో, నిలుచున్నాను క్షత్రియుడా! నీ బలము అంతా చూపించవలెను. నీ శస్త్రాస్త్రాలను అన్నిటినీ ఉపయోగించు. నీ క్షత్రియబలము ఎటువంటిదో, నా బ్రహ్మబలము ఎటువంటిదో చూద్దాము' అంటూ ఉండగానే, విశ్వామిత్రుడు ఆగ్నేయాస్త్రాన్ని వదిలినాడు.

"ఆ ఆగ్నేయాస్త్రాన్ని వశిష్ఠమహర్షి తన బ్రహ్మదండముతో నిరోధించినాడు. అంతట ఆది నీళ్ళలో పడ్డ నిప్పు మాదిరిగా చల్లారి పోయింది. విశ్వామిత్రుడికి మరింత కోపము వచ్చింది. వారుణ, రౌద్ర, ఐంద్ర, పాశుపత, ఐషికాస్త్రాలను ఒక్కసారిగా వదలినాడు. అంతటితో కసితీరక మానమూ, మోహనమూ, గాంధర్వమూ, స్వాపనమూ, జృంభణమూ, మాదనమూ, సంతాపనమూ, విలాపనమూ,

శోషణమూ, దారణమూ, వజ్రమూ, బ్రహ్మపాశమూ, కాలపాశమూ, వారుణపాశమూ, పైనాకమూ, దైత్యమూ అనే అస్త్రాలనూ; శుష్కమూ, ఆర్ద్రమూ అనే రెండు పిడుగులనూ; దండమూ, పైశాచమూ, క్రౌంచమూ, ధర్మచక్రమూ, కాలచక్రమూ, విష్ణుచక్రమూ, వాయువ్యమూ, మంథనమూ, హయగ్రీవమూ అనే అస్త్రాలనూ; ఇంకా రెండు శక్తులనూ వశిష్ఠమహర్షి మీద ప్రయోగించినాడు. వాటినే కాకుండా కంకాళమూ, ముసలమూ, మహాస్త్రమూ, వైద్యాధరమూ, కాలమూ, దారుణమూ, త్రిశూలమూ, హోరమూ, కాపాలమూ అనే అస్త్రాలను వదలినాడు.

"ఆ యా అస్త్రాలను అన్నిటినీ ఆ మంత్రవేత్త వశిష్ఠమహర్షి ముల్లోకాలూ ఆశ్చర్యపడిపోయేటట్టుగా తన బ్రహ్మదండముతో రూపుమాపినాడు.

"ఆ యా అస్త్రాలు అన్నీ వ్యర్థము అయిపోయిన తరువాత, విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రాన్ని వశిష్ఠమహర్షిమీద వదలినాడు.

"అప్పుడు అగ్నిహోత్రుడూ మొదలు అయిన దేవతలూ, దేవర్షులూ, గంధర్వులూ, మహోరగులూ, సంభ్రాంతులు అయినారు.

"ముల్లోకాలూ తల్లడిల్లిపోయినవి.

"ఆ బ్రహ్మాస్త్రము బ్రహ్మదండాన్ని తప్పించుకొని వశిష్ఠమహర్షిమీదికి పోయింది. ఆ మహామంత్రవేత్త ఏమి చేస్తాడోనని లోకాలు అన్నీ నిరీక్షించసాగినవి.

"ఆయన తన బ్రహ్మవిద్యాబలముతో దాన్ని మ్రింగివేసినాడు. అంతట ఆయన రూపము మహాభయంకరముగా గోచరించింది. బ్రహ్మాస్త్రాన్ని మ్రింగినందువల్ల ఆ మహర్షి ప్రతిరోమకూపములోనుంచీ పొగలు లేచినవి. మంటలు మండినవి. నిప్పురవ్వలున్నూ రేగినవి. బ్రహ్మదండము ప్రళయాగ్ని మాదిరిగా ప్రజ్వరిల్లింది. ఆయన రూపానికి ముల్లోకాలవారూ నిశ్చేష్టులు అయినారు.

"మహామునులు అందరూ వచ్చి వశిష్ఠమహర్షిని చూచి, 'ఓ బ్రాహ్మణోత్తమా! తమ బలము అమోఘము. బ్రహ్మాస్త్ర తేజాన్ని తమలోనే ఉంచుకోవలెను. లేకపోతే ఈ లోకాలు అన్నీ నానావ్యధలపాలు అయిపోతవి. కాబట్టి, తాము ప్రసన్నులు కావలెను' అని ప్రార్థించినారు.

"ఆ తేజోవంతుడి కోపము ఉపశమించింది.

"పరాభవము అయిన విశ్వామిత్రుడు ఒక్క నిట్టూర్పు విడిచి, 'ఛీ ఛీ, ఎందుకు ఈ క్షత్రియ బలము? బ్రహ్మబలమే బలము. ఒక్క బ్రహ్మదండముతో వశిష్ఠమహర్షి అస్త్రాలను అన్నిటినీ హతమార్చినాడు' అనుకొంటూ, రెండు బలాల తారతమ్యాన్నీ ప్రశాంత చిత్తముతో ఆలోచించసాగినాడు.

57

విశ్వామిత్రుని తపోదీక్ష

"ఓ రామా! ఓడిపోయినందుకు విశ్వామిత్రుడికి మనస్సు పరితపించింది. ఆయన ఆత్మ నిగ్రహముతో ఆలోచిస్తూ నిట్టూర్పులు విడువసాగినాడు. వశిష్ఠమహర్షితో విరోధము వచ్చిందే అని విచార పడ్డాడు. తానూ బ్రహ్మర్షి కావలెను అనుకొన్నాడు.

"బ్రహ్మత్వసిద్ధికి తపస్సుచేయ సంకల్పించుకొని, భార్యతో కూడా దక్షిణదిక్కుకు పోయి, అక్కడ అతి కఠిన నియమాలతో తపస్సుచేయ నారంభించాడు.

ఆ కాలములో ఆయనకు హవిష్యందుడు, మధుష్యందుడు, దృఢనేత్రుడూ, మహారథుడూ అనే నలుగురు పుత్రులు పుట్టినారు. ఆ నల్గురూ సత్యధర్మ పరాయణులు.

"విశ్వామిత్రుడు బహుకాలము తపస్సు చేసినాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షము అయి, 'ఓ తపోధనా! నీవు రాజర్షులను అందరినీ జయించినావు. నీ తపస్సుకు మేమున్నూ ఇక నిన్ను రాజర్షిగా పరిగణిస్తాము' అంటూ బ్రహ్మలోకానికి వెళ్ళిపోయినాడు.

అంత తపస్సుకూ ఇదేనా ఫలము అని విశ్వామిత్రుడు నిరుత్సాహ పడిపోయినాడు. ఎంతో దుఃఖపడ్డాడు. తిరిగి తీవ్ర నియమములతో తపస్సుచేయ సంకల్పించుకొన్నాడు. పరమోత్కృష్టముగా తపస్సు సాగించినాడు.

త్రిశంకువు

"విశ్వామిత్రుడు తపస్సుచేస్తూ ఉన్న కాలములో, ఇక్ష్వాకు వంశములో 'త్రిశంకువు' అనే కులదీపకుడు రాజ్యపాలనము చేస్తూ ఉన్నాడు. ఆయన సత్యవంతుడు. జితేంద్రియుడు. జగత్ప్రసిద్ధుడు. బొందితో స్వర్గానికి పోవలెను అని ఆయనకు బుద్ధి పుట్టింది. అందుకు ఏది అయినా యజ్ఞము చేయవలెను అనుకొని వశిష్ఠమహర్షిని పిలిపించి తన అభిలాష తెలియ చెప్పినాడు. ఆ పురోహితుడు అది శక్యముకాదు అని చెప్పి మందలించినాడు.

"వశిష్ఠమహర్షి అశక్యము అని నిరాకరించినందువల్ల ఆయన పుత్రులను సందర్శించి వారిచేత యజ్ఞము చేయించుకోవలెను అనుకొని త్రిశంకువు బయలుదేరినాడు. దక్షిణ దిక్కుగా పోయి తపోదీప్తులతో తేజరిల్లుతూ ఉన్న వాసిష్ఠులను నూరుగురినీ చూచినాడు. తలవంచుకొని నమస్కారము చేసి, 'నేను శరణాగతుణ్ణి. శరణము ఇవ్వటానికి తామే సమర్థులు. నేను ఒక మహాయజ్ఞము

తలపెట్టినాను. వశిష్ఠులవారు అది అశక్యము అన్నారు. మీరు గురుపుత్రులు. నా యజ్ఞము మీరు చేయించవలెను. నన్ను అనుగ్రహించవలెను. నేను బొందితో స్వర్గానికి పోతలచినాను. అందుకు మీరు యజ్ఞము చేయించవలెను. అందుకోసము నేను మరి ఒకరి దగ్గరకు పోతలచుకోలేదు. రాజులను తరింపచేసేవారు వేత్తలు అయిన పురోహితులే. మా ఇక్ష్వాకువంశీయులకు అందరికీ పురోహితులు అయిన వశిష్ఠులవారు కాదు అన్నారు. ఇక వారి తరువాత మీరే తారకము' అన్నాడు త్రిశంకువు.

58

"ఓ రామా! త్రిశంకువు చెప్పింది అంతా వాశిష్ఠులు విన్నారు. వారికి కోపము వచ్చింది. 'ఓ రాజా! ఇక్ష్వాకులకు వశిష్ఠమహర్షే పురోహితుడు. మీకు ఆయనే పరమ గురువు. ఆయన సత్యవ్రతశ్రవుడు. ముల్లోకాలలోనూ యజ్ఞాలు చేయించడానికి ఆయన ఒక్కడే సమర్థుడు. ఆయన కాదు అన్న తరువాత, మరి ఒక్కరిని నీవు ఆశ్రయించడము ఏమిటి ? ఆయన మాటలను నీవే కాదు, మేమూ అతిక్రమించకూడదు. ఆయన అశక్యము అని చెప్పిన యజ్ఞము మేము ఎట్లా చేయించగలము అనుకొన్నావు? మేము ఆయనను అవమానిస్తామా? రాజా! నీకు మతిపోయింది. నీవు ఇంటికి వెళ్ళిపోవలసింది' అని వాశిష్ఠులు కోపపడినారు.

"వాశిష్ఠుల మందలింపులకు త్రిశంకువు, 'గురువులు నన్ను తిరస్కరించినారు. గురుపుత్రులు మీరున్నూ తిరస్కరిస్తున్నారు. ఇక మీ పెద్దరికానికి ఇంతటితో స్వస్తి. నేను ఇక మరి ఒక పురోహితుణ్ణి చూచుకొంటాను' అని ధిక్కరించినాడు.

"పరంపరాగతము అయిన పౌరోహిత్యాన్ని మార్చి వేస్తాను అనడము వాశిష్ఠులకు ఘోరముగా తోచింది. అందులో, వశిష్ఠమహర్షి అంతటివాణ్ణి వదలుకొంటాను అన్నందుకు వాశిష్ఠులు క్రుద్ధులు అయిపోయినారు. త్రిశంకువును చండాలుడవు అయిపొమ్మని శపించినారు.

"తెల్లవారేసరికి త్రిశంకువుకు చండాలుడి రూపము వచ్చింది. దేహము అంతా బిరుసెక్కి నల్లబడిపోయింది. దుస్తులు అన్నీ నీలిరంగు గుడ్డలుగా మారిపోయినవి. ఆభరణాలు అన్నీ ఇనుపసొమ్ములు అయిపోయినవి. తలవెండ్రుకలు కురుచబారినవి. ఒంటినిండా వల్లకాటిబూడిద అలముకొన్నది. శ్మశానసుమాలు మెడలో దండలు అయినవి.

"ఆయనవెంట ఉన్న మంత్రులు మొదలయినవారు అప్పుడు ఆయన చండాలరూపము చూచి తప్పుకొని దూర దూరముగా పోయినారు.

త్రిశంకు స్వర్గము

"త్రిశంకుమహారాజు విఫలమనోరథుడు అయిపోవడమే కాకుండా, చండాలుడున్నూ అయిపోయినాడు. అయితే ఆయన ధైర్యవంతుడు. ఆ ధైర్యమే ఆయనకు అప్పుడు తోడు అయింది. అహోరాత్రములూ అమితదుఃఖముతో బాధపడుతూ విశ్వామిత్రుడి దగ్గరకు పోయినాడు. ఆ ఘోరరూపము చూచి విశ్వామిత్రుడు జాలిపడి, 'ఓ రాజా! నీవు మహాబలవంతుడవు. శూరుడవు. రాజపుత్రుడవు. ఏదో శాపమువల్ల నీకు చండాలరూపము వచ్చినట్టు ఉంది. ఆ శాపానికి కారణము ఏమిటి? కారకులు ఎవరు? ఇప్పుడు నీవు ఇక్కడికి ఎందుకు వచ్చినావు' అని అడిగినాడు.

"త్రిశంకువు విశ్వామిత్రుడికి నమస్కారము చేసి, 'నా గురువూ, నా గురుపుత్రులూ నన్ను తిరస్కరించినారు. నా కోరిక నెరవేర్చకపోవడమే కాకుండా, వారు నాకు ఈ గతి పట్టించినారు. ఇదివరకు నేను ఎన్నడూ అబద్ధము ఆడి ఎరుగను. ఇక ముందుకూడా ఎటువంటి కష్టాలలో నయినా అబద్ధము ఆడనని తమ ఎదుట శపథము చేస్తున్నాను. నేను ధర్మమార్గాన రాజ్యపాలనము చేసినాను. గురువులను వినయవిధేయతలతోనూ, సదాచారముతోనూ సంతోషపెట్టినాను. నేను నూరు యజ్ఞాలు చేసినాను. ఇంకా అనేక సత్కార్యాలు చేసినాను. సశరీరంగా స్వర్గానికి పోవలెను అనుకొని, ఏది అయినా యజ్ఞము చేయించవలసింది అని గురువులను వేడుకొన్నాను. వారు కాదు అన్నారు. అప్పుడు గురుపుత్రులను ఆశ్రయించినాను. వారు కాదు అనడమే కాకుండా నాకు శాపము పెట్టినారు. నేను ఇట్లా అయిపోయినాను. నే చేసిన సత్కార్యాలు అన్నీ నిష్ఫలాలు కాబోలు! నా ప్రయత్నము అంతా నిరర్థకము అయిపోయింది. సర్వమూ దైవాధీనము ఏమో! దైవమే బలీయము ఏమో, నాకు తెలియటము లేదు. నేను దైవోపహతుడను. చాలా దుఃఖములో ఉన్నాను. తమ అనుగ్రహము కోసము వచ్చినాను. తాము నన్ను ఉద్ధరించవలెను. తాము తప్ప నాకు మరి ఒక దిక్కు లేదు. పురుష ప్రయత్నముతో దైవికాన్ని త్రిప్పివేయడానికి సమర్థులు తాము ఒక్కరే. అందుకోసము ఇక్కడికి వచ్చినాను' అన్నాడు.

59

"చండాలరూపములో ఉన్న త్రిశంకువు చెప్పింది అంతా విశ్వామిత్రుడు విన్నాడు. విని కృపావేశముతో, 'నాయనా త్రిశంకూ! నీకు స్వాగతము. నీవు పరమధార్మికుడవు అనీ, సత్యసంధుడవు అనీ నేను ఎరుగుదును. నిన్ను నేను కాపాడుతాను. నీవు భయపడవద్దు. యజ్ఞకర్మనిర్వాహకులు అయిన పుణ్యకర్ములనూ,

మహర్షులనూ రావిస్తాను. యజ్ఞము చేయిస్తాను. ఈ చండాలరూపముతో నీవు స్వర్గానికి పోయేట్లు చేస్తాను. శరణము ఇవ్వగల విశ్వామిత్రుడి దగ్గరకే నీవు చేరినావు. కాబట్టి, స్వర్గము నీచేత చిక్కింది అనే అనుకోవచ్చును' అని చెప్పి ఆ మహాతేజోవంతుడు, ఆ మహా ప్రాజ్ఞుడు పరమధార్మికులు అయిన తన పుత్రులను యజ్ఞసంభారాలు సమకూర్చడానికి నియోగించినాడు.

"ఆయన శిష్యులను అందరినీ పిలచి, 'నాయనలారా! మీరు వివిధదేశాలకూ పోయి బహుశ్రుతులూ, ఋత్విజులూ అయిన మహర్షులను శిష్య మిత్ర సమేతముగా నేను చెప్పినాను అని చెప్పి ఇక్కడికి పిలుచుకొని రావలెను. మీరు ఆహ్వానించినపుడు ఎవరు ఎవరు, ఏమి ఏమి అనేదీ మరచిపోవద్దు. మళ్ళీ వచ్చిన తరువాత అది అంతా నాకు చెప్పవలెను' అని ఆజ్ఞాపించాడు.

"వారు అప్పటికి అప్పుడు నాల్గు దిక్కులకూ పోయినారు.

"సమస్త దేశాలనుంచీ బ్రహ్మర్షులు అక్కడికి వచ్చినారు.

"విశ్వామిత్రుడి శిష్యులు తమ గురువును చూచి, 'స్వామీ! తమ మాట చొప్పున సమస్త దేశాల బ్రాహ్మణోత్తములూ వచ్చి ఉన్నారు. మహోదయుడున్నూ, తక్కిన వాశిష్ఠులున్నూ రాలేదు. మేము పిలవగానే వారు నూరుగురూ కోపముతో మండిపడి, 'యజ్ఞముచేసేవాడు చండాలుడు, చేయించేవాడు క్షత్రియుడు. ఆ యజ్ఞ హవిస్సును దేవతలు ఎట్లా భక్షిస్తారు? విశ్వామిత్రుడి మాట విని చండాలాన్నము భుజించే బ్రాహ్మణోత్తములు స్వర్గానికి ఎట్లా పోగలుగుతారు?' అన్నారు. మహోదయుడితో కూడా ఆ నూరుగురు వాశిష్ఠులూ కన్నులు ఎర్రచేసి నిష్ఠురోక్తులు ఆడినారు' అని చెప్పినారు.

"విశ్వామిత్రుడికి కోపము వచ్చింది. నేను మహోగ్రము అయిన తపస్సు జేసినవాణ్ణి. నాలో ఏ దోషమూ లేదు. నన్ను దూషించిన ఆ దురాత్ములు భస్మము అయిపోవలెను. వాశిష్ఠులు అందరూ ఇప్పుడే యమలోకముపాలు అయిపోవలెను. తిరిగి అనేకజన్మలు ఎత్తవలెను. 'ముష్టికులు' అనే హీనజాతిలో పుట్టి శవభక్షకులు అయిపోవలెను. వాండ్లు నిర్దయులు అయి రోత పుట్టించే రూపాలతోనూ, ఆచారాలతోనూ కుక్క మాంసము తింటూ తిరుగుతూ ఉండవలెను. దూషించ కూడని నన్ను దూషించిన మహోదయుడు లోకము అంతా దూషించే కిరాతుడుగా పుట్టవలెను. వాడు దయాదాక్షిణ్యాలు లేకుండా ప్రాణాలు తీయడమే పనిగా పెట్టుకొని బహుకాలము బ్రతుకవలెను' అంటూ శపించినాడు.

60

"ఈవిధముగా ఆ మహాతేజోవంతుడు విశ్వామిత్రుడు వాశిష్ఠులను శపించి, వారిని అందరినీ తన తపోబలముతో హతమార్చి వేసినాడు. అక్కడ అప్పుడు సమావేశము అయిన మహర్షులతో, 'మహర్షులారా! ఈయన ఇక్ష్వాకువంశీయుడు. త్రిశంకు మహారాజు. పరమ ధార్మికుడు, దాత. బొందితో స్వర్గానికి పోవలెను అనుకొని గురువులనూ, గురుపుత్రులనూ యజ్ఞము చేయించమన్నాడు. గురుపుత్రులు కోపించి ఈయనను శపించినారు. అందువల్ల, క్షత్రియ రూపము పోయి ఈ చండాల రూపము వచ్చింది. ఇంకా అదే కోరికతో నా శరణు జొచ్చినాడు, నేను యజ్ఞము చేయించ తలచినాను. మీరు అందరూ నాకు తోడుపడవలెను' అని చెప్పినాడు.

"ఆ ధర్మజ్ఞులు అందరూ ఏకమై సంప్రదించుకొన్నారు.

"ఈ కౌశికుడు కోపధారి. అగ్నిహోత్రమువంటివాడు. ఎంతో మహిమ కలవాడు. ఆగ్రహమువస్తే మనలను అందరినీ కూడా శపించి వేస్తాడు. కనుక, ఈయన చెప్పినట్టు చేయడమే ఉత్తమము. సంశయించ నక్కరలేదు. ఈ యజ్ఞము చేయించవలసిందే. ఈయన ప్రభావమువల్ల త్రిశంకువు ఎట్లాగూ స్వర్గానికి పోయి తీరుతాడు' అని నిశ్చయించినారు.

"యజ్ఞము ఆరంభమయింది. ఆ మహాయజ్ఞానికి విశ్వామిత్రుడు యాజకుడు. మంత్రకోవిదులు అయిన వారు అందరూ ఋత్విజులు. ఆ యా కర్మలను అన్నిటినీ వారు మంత్రహితముగానూ, శాస్త్రయుక్తముగానూ, కల్పసూత్రాను సారముగానూ పూర్తి చేసినారు. వారి వారి హవిర్భాగాలను తీసుకొని పోవడానికి దేవతలను అందరినీ చాలాసేపు విశ్వామిత్రుడు ఆహ్వానం చేసినాడు. దేవతలు ఒక్కరున్నూ రాలేదు. అంతట కోపావేశముతో విశ్వామిత్రుడు స్రువము (హోమము చేసే తెడ్డు) చేతిలో పట్టుకొని, 'ఓ త్రిశంకూ! ఈ యజ్ఞము నిష్ఫలము అయితే పోనీ, ఇక నా ప్రభావము చూపిస్తాను. బొందితో పోవడానికి ఎవరికీ వీలుకాని స్వర్గలోకానికి నిన్ను ఇప్పుడే పంపిస్తాను అంటూ నా స్వార్జిత తపస్సుకు ప్రభావమే ఉన్నట్లయితే ఈ త్రిశంకు మహారాజు ఇప్పుడే స్వర్గానికి వెళ్ళి పోవలెను' అని ప్రతిజ్ఞ చేసినాడు.

"అప్పుడు అక్కడివారు అందరూ చూస్తూ ఉండగానే త్రిశంకువు స్వర్గానికి వెళ్ళిపోయినాడు.

"త్రిశంకువు స్వర్గములో చేరినాడు. దేవేంద్రుడు దేవతలను అందరినీ ఆలోచించి, 'త్రిశంకూ! నీవు గురుశాపహతుడవు. నీవు ఈ దేవలోకములో ఉండటానికి వీలులేదు. మళ్ళీ భూమిమీద తలక్రిందులుగా పడిపో' అని ఆజ్ఞాపించినాడు.

"అంతట త్రిశంకువు తలక్రిందులుగా పడిపోతూ, 'మహామునీ! రక్షించు, రక్షించు' అంటూ కేకలు పెట్టినాడు. ఆ కేకలు విశ్వామిత్రుడు విన్నాడు.

"విశ్వామిత్రుడికి తీవ్రమయిన కోపము వచ్చింది. 'నిలు, అక్కడనే నిలు' అంటూ, తన తపోబలముతో ఆ త్రిశంకువును నేలమీదపడకుండా అంతరిక్షములో నిలిపివేసినాడు. మహర్షి మధ్యములో ఉన్న విశ్వామిత్రుడు అంతట రెండవ బ్రహ్మదేవుడికి మల్లే, అంతరిక్షములో త్రిశంకువు ఉన్న దిక్కున మరి ఒక దేవలోకము సృష్టించడానికి పూనుకొన్నాడు. అప్పడికప్పుడే దక్షిణ దిక్కున వేరే సప్తర్షులనూ, నక్షత్రాలనూ సృష్టి చేసినాడు. ఆయన కోపము అంతట ఆగలేదు. మరిఒక ఇంద్రుణ్ణి సృష్టించడమా లేక ఇంద్రుణ్ణే లేకుండా చేయడమా అని ఆలోచిస్తూ, తక్కిన దేవతలను సృష్టించడము మొదలు పెట్టినాడు.

"అందుకు దేవతలు అందరూ భయభ్రాంతులు అయిపోయినారు. వారు అందరూ విశ్వామిత్రుడి దగ్గరకు పరుగెత్తుకొని వచ్చినారు. ఆయన కోపము చల్లారుస్తూ, 'ఓ మహాభాగా! తమకు తెలియనిది ఏమీ లేదు. త్రిశంకుమహారాజు గురుశాపహతుడు. కాబట్టి, దేవలోకములోకి రా తగినవాడు కాడు' అని చెప్పినారు.

" 'ఓ దేవతలారా! నేను ఈ త్రిశంకువును దేహముతో స్వర్గానికి పంపిస్తాను అని ప్రతిజ్ఞ చేసినాను. నా ప్రతిజ్ఞ దబ్బర కాకూడదు. మీరు ఉంటూ ఉన్న స్వర్గములో ఈ త్రిశంకువు ఉండటానికి మీరు వీలులేదు అన్నారు. కనుక, ఇప్పుడు ఈయన ఉన్న ప్రదేశమే స్వర్గము కావలెను. నేను సృష్టించిన ఈ నక్షత్రాలూ మొదలు అయినవి అన్నీ సుస్థిరముగా ఉండిపోవలెను. ఇందుకు మీరు ఒప్పుకోవలెను' అన్నాడు.

"అందుకు దేవతలు అందరూ అంగీకరించి, 'మహామునీ! తాము సృష్టించిన నక్షత్రాలు అన్నీ జ్యోతిశ్చక్రానికి వెలుపల శాశ్వతముగా ప్రకాశిస్తూ ఉంటవి. త్రిశంకువు గురుశాపహతుడు కనుక, వాటి నడుమను తలక్రిందులుగా ఉంటాడు. అయినప్పటికీ దేవసమానుడుగా తేజరిల్లుతూ ఉంటాడు. ఈ ఇక్ష్వాకువు కృతార్థుడు అయి స్వర్లోకములో ఉన్నవాడివలె కీర్తితో ప్రకాశిస్తూ ఉంటే, ఈ జ్యోతులు అన్నీ ఆయన్ను అనుసరించుకొని ఉంటవి' అని చెప్పి విశ్వామిత్రుణ్ణి స్తోత్రము చేసినారు. అందుకు విశ్వామిత్రుడు ఒప్పుకొన్నాడు.

"ఆ యజ్ఞము సమాప్తము అయిపోయింది. దేవతలూ, మహర్షులూ ఎవరి దారిన వారు వెళ్ళిపోయినారు.

61

"ఆ యజ్ఞానికి వచ్చినవారు అందరూ వెళ్ళిపోయిన తరువాత విశ్వామిత్రుడు ఆ తపోవనములో ఉన్నవారు అందరితోనూ, తాను దక్షిణ దిశకు వచ్చిన తరువాత తన తపస్సుకు పెద్ద విఘ్నము అయింది అనీ, ఇంకొక దిక్కుకు పోయి తపస్సు చేసుకోవడము మంచిది అనీ, పడమటి దిక్కున విశాలము అయిన తపోవనాలు ఎన్నో ఉన్నవి అనీ, పుష్కరతీర్థ తీరాన సుఖముగా తపస్సు చేసుకోవచ్చును అనీ చెప్పి, అనుచరులు అందరితోనూ ప్రయాణము అయి పడమటి దిక్కుగా పోయినాడు.

"ఫలమూలాలను మాత్రమే ఆహారముగా చేసుకొని మహోగ్రముగానూ, అనివార్యముగానూ విశ్వామిత్రుడు తపస్సు చేయ నారంభించినాడు.

అంబరీష చరిత్ర

"ఆ కాలములో అయోధ్యానగరములో 'అంబరీషుడు' అనే రాజు రాజ్యపాలనము చేస్తూ ఉన్నాడు. ఆయన ఒక యజ్ఞము ఆరంభించినాడు. ఆ యజ్ఞము జరుగుతూ ఉండగా, దేవేంద్రుడు యజ్ఞపశువును దొంగిలించుకు పోయినాడు. ఆ పశువు కనపడకుండా పోయినందువల్ల పురోహితుడు, 'ఓ రాజా! నీవు పరాకుగా ఉన్నందువల్ల నీ యజ్ఞపశువును ఎవరో ఎత్తుకొని పోయినారు. ఈ దోషము నిన్ను నాశము చేసి వేస్తుంది. ఇందుకు ప్రాయశ్చిత్తము చాలా కష్టమయింది. కాబట్టి, యజ్ఞకర్మను ఆరంభముచేసే లోపల యజ్ఞపశువునుకానీ, ఆ పశువు దొరకక పోయేట్టయితే ఒక నరపశువును కానీ పట్టుకొని రావలెను. ఈ పని వెంటనే చేయవలెను' అన్నాడు.

"అంబరీషుడు తెలివితేటలు కలవాడు. వేలకొద్దీ ఆవులను వెంటతీసుకొని యజ్ఞపశువును వెతకడానికి బయలుదేరినాడు. దేశదేశాలూ, మహానగరాలూ, జనపదాలూ, పుణ్యాశ్రమాలూ ఎన్నో వెదకినాడు. కాని, ఎక్కడను ఆయనకు యజ్ఞపశువు దొరకలేదు. చివరకు 'భృగుతుంగము' అనే పర్వత ప్రదేశములో భార్యాపుత్రులతో ఉంటూ ఉన్న ఋచీకమహర్షిని చూచినాడు.

"అంబరీషుడు తపోదీప్తులతో తేజరిల్లుతూ ఉన్న ఆ ఋచీకమహర్షిని సత్కరించి సంతోషపెట్టినాడు. నమస్కారము చేసి కుశలము అడిగి తెలుసుకొని, 'మహర్షీ! నా యజ్ఞపశువు కనపడకుండా పోయింది. దేశదేశాలూ తిరిగినాను. ఎక్కడనూ దొరకలేదు. మీ ముగ్గురి కుమార్తలలో ఒకరిని నాకు యజ్ఞపశువుగా విక్రయించ ప్రార్థిస్తున్నాను. నేను కృతార్థుణ్ణి అవుతాను. ఇందుకు తమకు నేను లక్షగోవులను ఇస్తాను' అని అంబరీషుడు చెప్పినాడు.

"రాజా! నీవు ఏమి ఇచ్చినా నా పెద్దకుమారుణ్ణి ఇవ్వను" అన్నాడు ఋచీకుడు.

"ఆయన ఇల్లాలు మహాతపస్విని. ఆమె అది విని, 'ఓ రాజా! మహాభాగుడు నా పెనిమిటి పెద్దపిల్లవాణ్ణి అమ్మను అన్నాడు. కడగొట్టువాణ్ణి అమ్మడానికి నేను ఒప్పుకోను. ఏమంటే, తరచూ తండ్రికి పెద్దపిల్లవాడు అంటే ఇష్టము. తల్లికి కడపటివాడిమీద మోజు. అందువల్ల, పసివాణ్ణి నేను అట్టిపెట్టుకొంటాను' అన్నది.

"తల్లిదండ్రులు చెప్పుతూ ఉన్నది వింటూ ఉన్న నడిమివాడు శునశ్శేపుడు, 'రాజా! మా నాయన పెద్దవాణ్ణి అమ్మను అన్నాడు. మా అమ్మ చిన్నవాణ్ణి అమ్మటానికి వీలులేదు అన్నది. మధ్యవాణ్ణి నన్ను వారు అమ్మి వేసినట్టే ఎంచుకోవచ్చును. కాబట్టి, లక్ష గోవులూ మా తండ్రికి ఇచ్చివేసి తాము నన్ను తీసుకొని వెళ్ళవచ్చును' అన్నాడు.

"అందుకు అంబరీషుడు అమితసంతోషముగా ఋచీకుడికి లక్షగోవులూ ఇచ్చి శునశ్శేపుణ్ణి తన రథముమీద ఎక్కించుకొని తత్క్షణమే బయలుదేరినాడు.

62

శునశ్శేపుని విశ్వామిత్రుడు రక్షించుట

"ఓ రామా! అంబరీష మహారాజు శునశ్శేపుణ్ణి రథముమీద తీసుకొనిపోతూ ఉండగా మిట్టమధ్యాహ్నము అయింది. పుష్కరతీరము చేరినారు. అక్కడ ఆ మహారాజు విశ్రమించినాడు.

"ప్రాణము పోతుంది అనే దిగులుతో శునశ్శేపుడి ముఖాన కళాకాంతులు మాసిపోయినవి. ప్రయాణమువల్ల అలసిపోయినాడు. దాహము వేసింది. నీళ్ళదగ్గరకు పోయినాడు. అక్కడ ఋషులతో కూడా తపస్సు చేసుకొంటూ ఉన్న విశ్వామిత్రుణ్ణి చూచినాడు. పరుగెత్తుకుంటూ పోయి ఆయన పాదాలమీద పడ్డాడు.

"ఓ మహర్షీ! నా తల్లిదండ్రులు నన్ను యజ్ఞపశువుగా అంబరీష మహారాజుకు అమ్మివేసినారు. ఇక తల్లివీ, తండ్రివీ నీవే. జ్ఞాతివి అయినా, బంధువు అయినా, గురువు అయినా నీవు ఒక్కడివే నాకు ఉన్నావు. నీవు దయానిధివి. అడిగినవాణ్ణి కాదు అనకుండా కాపాడుతూ ఉన్నావు. దయామతితో నీవు నన్ను బ్రతికించవలెను. అయితే, లక్షగోవులు ఇచ్చి నన్ను కొనుక్కొన్న అంబరీష మహారాజు యజ్ఞము చెడిపోగూడదు. నాకు ఆయుర్దాయము అనుగ్రహించవలెను. నేను కామభోగార్థము ఆయుర్దాయము అనుగ్రహించవలెను అని ప్రార్థించడములేదు. తపస్సు చేయడానికే నేను ఆయువు అర్థిస్తున్నాను. నేను ఇప్పుడు దిక్కులేనివాణ్ణి. ఈ ఆపత్కాలములో తాము నన్ను తమ పుత్రుణ్ణివలె రక్షించవలెను' అంటూ శునశ్శేపుడు వేడుకొన్నాడు.

"విశ్వామిత్రుడు శునశ్శేపుణ్ణి ఓదార్చి, తన కుమార్లను చూచి, 'ఓ పుత్రులారా! మీరు పుత్రులుగా అక్కరకు వచ్చేది లేనిదీ తెలుసుకోవడానికి ఇప్పుడు సమయము

వచ్చింది. తండ్రి కోరికలను నఫలము చేయడమే కొడుకులకు పరమధర్మము. ఈ చిన్నవాడు మునిపుత్రుడు. ప్రాణము కోసము నా శరణము చొచ్చినాడు. వీడి ప్రాణము కాపాడి నన్ను మీరు సంతోషపెట్టవలెను. మీరు అందరూ పుణ్యకర్ములు. ధర్మపరాయణులు. మీలో ఒకరు అంబరీషుడికి యజ్ఞపశువుగా పోయి, ఈ శునశ్శేపుణ్ణి బ్రతికించవలెను. అట్లా చేసేట్లయితే అంబరీషుడి యజ్ఞమూ నెరవేరుతుంది, ఈ శునశ్శేపుడున్నూ బ్రతుకుతాడు. మీరు అందరూ నా మాట పాటించినవారున్నూ అవుతారు' అన్నాడు.

"విశ్వామిత్రుడి పుత్రులు మధుష్యందాదులు సాభిమానముగానూ, పరిహాసము గానూ, 'ప్రభూ! తమ స్వంత బిడ్డలను వదలిపెట్టి పరాయి పిల్లవాణ్ణి కాపాడ పోవటము, మధురాహారము వదలిపెట్టి శ్వమాంసాహారము కోసము తాపత్రయ పడటముగా ఉంది. ఇది మాకు అకార్యముగా తోస్తూ ఉంది' అన్నారు.

"కొడుకులు అన్నమాటకు విశ్వామిత్రుడికి కోపము వచ్చింది. కన్నులు ఎర్రచేసి, 'తండ్రికి ఎదురాడకూడదు అనే భయము లేకపోవడమే కాకుండా ధర్మరహితముగానూ, దారుణముగానూ మాట్లాడినారు. నా ఒండ్లు గగురు పుట్టించినారు. మీరున్నూ వాశిష్ఠులవలె ముష్కికులు అయిపోయి కుక్క మాంసము తింటూ ఈ భూమి మీద బహుకాలము బ్రతికి ఉండవలెను' అని శాపము పెట్టినాడు.

"దిగులుపడిపోయి ఉన్న శునశ్శేపుడికి ఏ బాధా లేకుండా పోవడానికి అంతట విశ్వామిత్రుడు విభూతి మంత్రించి రక్షపెట్టి, 'ఓ పిల్లవాడా! నీకు రెండు మంత్రాలు ఉపదేశము చేస్తాను. నిన్ను యూపస్తంభానికి కట్టివేయగానే నీవు ఆ రెండు మంత్రాలూ జపము చేయవలెను. అంతట ఇంద్రోపేంద్రులు నిన్ను రక్షిస్తారు. నీకు జీవితసిద్ధి కలుగుతుంది' అంటూ రెండు మంత్రాలు ఉపదేశించినాడు.

"శునశ్శేపుడి మనస్సు కుదుటపడ్డది. అతడు అంబరీష మహారాజు దగ్గరకు పరుగెత్తుకొని పోయి, 'రాజా! ఆలస్యము చేయవద్దు. ఇక్కడ నుంచి ఇప్పుడే వెళ్ళిపోదాము. తాము యజ్ఞకర్మను శీఘ్రముగా ముగించవచ్చును' అని చెప్పినాడు. ఆ మాటలకు అంబరీషుడు సంతోషపడ్డాడు. ఉత్సాహముతో బయలుదేరినాడు. ఏ మాత్రమూ జాగుచేయకుండా యజ్ఞశాల ప్రవేశించి పురోహితుడి అనుమతితో యజ్ఞకర్మను ఆరంభించినాడు.

"శునశ్శేపుడి ఒంటినిండా గంధము పూసినారు. రక్తమాల్యాంబరాలతో అలంకరించినారు. యజ్ఞపశువుగా అతనిని యూపస్తంభానికి కట్టివేసినారు.

అచలనిష్ఠతో శునశ్శేపుడు విశ్వామిత్రుడు ఉపదేశించిన రెండు మంత్రాలూ జపము చేయడము మొదలు పెట్టినాడు.

"ఇంద్రోపేంద్రులు సంతృప్తులు అయినారు. శునశ్శేపుడికి దీర్ఘాయువును ఇచ్చినారు. అంబరీషుడికి యజ్ఞఫలము బహుగుణముగా అనుగ్రహించినారు.

63

విశ్వామిత్రుని తపోభంగము

"ఆ పుష్కరతీర్థాన విశ్వామిత్రుడు బహుకాలము తపస్సు చేసినాడు. తపోవ్రతము అయిపోతూ వుండగా, బ్రహ్మదేవుడు దేవతలను అందరినీ వెంటపెట్టుకొని వచ్చి విశ్వామిత్రుణ్ణి చూచి, 'నీకు శుభము అవుతుంది. ఇంతవరకూ నీవు చేసిన శుభకర్మలకు నిన్ను ఒక ఋషిగా పరిగణిస్తున్నాను' అంటూ పరివారముతో అంతర్ధానము అయినాడు.

"విశ్వామిత్రుడు అసంతృప్తుడు అయినాడు. మళ్ళీ తపస్సు చేయడము మొదలు పెట్టినాడు. బహుకాలము అయిపోయింది. ఒకనాడు ఆ పుష్కరతీర్థములో 'మేనక' అనే అప్సరస జలకమాడడానికి వచ్చింది. మేఘాలలో మెరుపు మాదిరిగా ఆమె విశ్వామిత్రుడి కన్నులలో మెరిసింది. ముగ్ధుడు అయినాడు. ఆమె అప్రతిమాన సౌందర్యానికి మన్మథపరవశుడు అయిపోయినాడు. ఆమెను చూసి, 'ఓ అప్సరసా! స్వాగతము. నీవు నా ఆశ్రమములో ఉండవలెను. నీకు శుభము అవుతుంది. నిన్ను నేను మోహించినాను. నీవు నన్ను ఏలుకోవలసింది' అన్నాడు.

"ఓ రామా! ఆ మేనక అక్కడ విశ్వామిత్రుడితో కాపురము చేసింది. ఇట్టే పది సంవత్సరాలు అయిపోయినవి. అప్పుడు విశ్వామత్రుడికి సిగ్గువేసింది. శోకపరాయణుడు అయినాడు. ఆలోచించసాగినాడు. అది అంతా దేవతలు తన తపస్సు చెడగొట్టడానికి పన్నిన పన్నాగము అని తెలుసుకొన్నాడు. మోహానికి లొంగిపోయినందువల్ల, పది సంవత్సరాలూ ఒక అహోరాత్రముగా కడచిపోయినవే అని విచారపడ్డాడు. కామాతురత వల్ల అంతటి విఘ్నము అయిపోయిందే అని పశ్చాత్తాపపడ్డాడు. దుఃఖముతో కుమిలిపోతూ, నిట్టూర్పులు విడుస్తూ మేనకవంక చూచినాడు.

"మేనక భయపడిపోయింది. గజగజ వణికింది. చేతులు కట్టుకొని నిలుచున్నది.

"విశ్వామిత్రుడు ఆమెకు తియ్యని మాటలు చెప్పి, అక్కడ ఉండకుండా ఉత్తర దిక్కుగా బయలుదేరి పోయినాడు.

"ఆ విధముగా మేనకను వదిలించుకొన్న విశ్వామిత్రుడు హిమవత్పర్వత పార్శ్వములో కౌశికీనదీ తీరానికి పోయినాడు. ఇంద్రియాలను జయించవలెను అనే దృఢసంకల్పముతో దారుణము అయిన తపస్సు మొదలు పెట్టినాడు.

"చాలాకాలము అయిపోయింది. ఆయన మహోగ్రతపస్సుకు దేవతలు అందరూ భయపడిపోయినారు. వారు అందరూ బ్రహ్మదేవుడితో విశ్వామిత్రుడి దగ్గరకు పోయినారు. బ్రహ్మదేవుడు, 'ఓ విశ్వామిత్రుడా! నీ మహోగ్రతపస్సుకు మెచ్చుకొన్నాను. నీ ఋషి ముఖ్యత్వమూ, నీ మహాత్మ్యమూ గమనించినాను. ఇకను ఇప్పటినుంచీ నిన్ను మహర్షిగా భావిస్తాను' అన్నాడు.

"బ్రహ్మదేవుడి మాటలకు విశ్వామిత్రుడు సంతోషించనూ లేదు, కించపడనూ లేదు. నమస్కారము చేసి, 'స్వామీ! నేను మహర్షిని అయినాను అని తాము అంటున్నారు. అయితే, నేను జితేంద్రియుణ్ణి అయినట్టు తాము అంగీకరిస్తారా' అని బ్రహ్మదేవుణ్ణి ప్రశ్న వేసినాడు.

"నీవు జితేంద్రియుడవు కాలేదు. ఇంకా సాధన చేయవలెను' అంటూ బ్రహ్మదేవుడు దేవతలు అందరితోనూ అంతర్ధానము అయిపోయినాడు.

"విశ్వామిత్రుడు అంతట మళ్ళీ తపస్సు చేయటము ఆరంభించినాడు. ఈమాటు ఆయన రెండు చేతులూ పైకి ఎత్తి ఏ ఊతమూ లేకుండా నిలుచుని, వాయు భక్షణము చేస్తూ, వేసంగి ఎండలో నాల్గుదిక్కులా అగ్నిహోత్రాలు ఉంచుకొనిన్నీ, వానాకాలములో అనాచ్ఛాదిత ప్రదేశములో ఉండిన్నీ, చలికాలములో జలమధ్యములో ఉండిన్నీ మహాతీవ్రముగా తపస్సు చేయసాగినాడు. బహుకాలము గతించింది.

64

"విశ్వామిత్రుడి దారుణ తపస్సుకు దేవతలూ, దేవేంద్రుడూ కలవర పడిపోయినారు. వారు సభతీరి రంభను రావించినారు.

"దేవేంద్రుడు, 'ఓ రంభా! మహత్తరము అయిన దేవకార్యము ఒకటి నీవు సాధించవలెను. నీవు ఇప్పుడే ఇక్కడనుంచి పోయి విశ్వామిత్రుణ్ణి వ్యామోహ పెట్టవలెను. అతడు నీ తగులములో ఉండేట్టు చేయవలెను' అన్నాడు.

"అది తనవల్లను అయ్యే పనికాదు అని సిగ్గు పడిపోయి, రంభ దేవేంద్రుడికి నమస్కారము చేసి, 'ఓ సురేశ్వరా! ఆయన మహాముని. పరమభయంకరుడు. నేను ఏమి చేయపోయినా ఆయనకు కోపము వస్తుంది. ఘోరముగా శపిస్తాడు. సందేహము లేదు. దేవా! నాకు భయము వేస్తూ ఉంది. నన్ను అనుగ్రహించవలెను' అంటూ గజ గజ వణికిపోయింది.

" 'ఓ రంభా! భయపడవద్దు. నీకు శుభము అవుతుంది. నేను చెప్పినట్లు నీవు చేయవలెను. మనోహరము అయిన వసంతకాలములో నేనూ, మన్మథుడూ నీ వెంట వస్తాము. నేను కోకిల రూపముతో నీ సరసను ఉంటాను. నీతో మన్మథుడు నీ నీడ మాదిరిగా ఉంటాడు. నీవు చక్కగా సింగారించుకొని నీ శృంగార చేష్టలతో విశ్వామిత్రుడి తపస్సు చెడకొట్టవచ్చును. నీవు ఈ పనిని ఇట్టే చేయకలుగుతావు' అని రంభను సమాధాన పరచినాడు.

"రంభ విశ్వామిత్రుణ్ణి మరులుకొల్పడానికి జగన్మోహనముగా అలంకరించుకొని చిరునవ్వులతో బయలుదేరింది. అది వసంతకాలము. చెట్లు అన్నీ పూలు పూసినవి. కోకిల మనోహరముగా కూయ సాగింది. రంభ రాగము ఆలాపించింది. ఆ అప్రతిమాన నాదానికి విశ్వామిత్రుడి మనస్సు ఉర్రూత లూగింది. కన్నులు తెరచి చూచినాడు. ఎదుట రంభ కనుపించింది. వెంటనే సందేహము వచ్చింది. అది అంతా దేవేంద్రుడు చేస్తున్న తంత్రము అని స్ఫురించింది. క్రోధ పరవశుడు అయిపోయి, 'ఓ దౌర్భాగ్యురాలా! కామక్రోధాదులు జయించవలెను అనుకొంటున్న నన్ను మరులుకొల్పడానికి వచ్చినావా? నీవు శిలవు అయిపో. బహుకాలము అట్లా శిలవు అయి పడివుండు' అని శాపము పెట్టినాడు. పట్టరాని కోపమువచ్చి అట్లా శాపము పెట్టినందుకు విశ్వామిత్రుడు ఉత్తర క్షణములో పశ్చాత్తాపపడిపోయినాడు. అంతట రంభను చూస్తూ, 'ఓ రంభా! మహాతేజోవంతుడూ, తపోబలసమన్వితుడూ అయిన బ్రాహ్మణుడు ఒకడు నా శాపము నుంచి నిన్ను ఉద్ధరించ కలుగుతాడు' అన్నాడు.

"విశ్వామిత్రుడి శాపవాక్కులు చెవుల పడగానే దేవేంద్రుడూ, మన్మథుడూ అక్కడినుంచి పారిపోయినారు.

"రంభ అప్పటికి అప్పుడే రాయి అయిపోయింది.

"కోపాన్ని జయించలేక పోయినందుకు విశ్వామిత్రుడు విచారపడిపోయినాడు. ఆ కోపమువల్ల తన తపోబలము కొంత తగ్గిపోతూ ఉంది అని గమనించినాడు. అరిషడ్వర్గాన్ని జయించలేక పోయినందుకు వ్యధ పడ్డాడు.

"ఎవరు ఏమిచేసినా కోపపడ కూడదు అనీ, ఎవరు ఏమి మాట్లాడినా మెదలకుండా ఊరుకొనవలెను అనీ మనసా నిశ్చయించుకొన్నాడు. అంతేకాదు, జితేంద్రియుడు అయ్యేటంతవరకున్నూ దేహాన్ని ఎండకట్టవలెను అనీ, తపస్సుకు ప్రభావమే ఉంటే దేహము క్షయము అయిపోదు అనీ, బ్రహ్మర్షి అయ్యేటంత వరకున్నూ అన్నము తినకుండా, నీళ్ళు తాగకుండా, చివరకు ఊపిరి అయినా విడువకుండా తపస్సు చేయవలెను అనీ సంకల్పించుకొన్నాడు.

"ఓ రామా! ఈ విధముగా విశ్వామిత్రుడు అప్రతిమానముగా శపథము చేసినాడు.

65

విశ్వామిత్రుని బ్రహ్మర్షి పదము

"ఓ రామా! విశ్వామిత్రుడు హిమవత్పర్వతప్రాంతము వదలిపెట్టి తూర్పు దిక్కుగా పోయినాడు. అక్కడ నిరుపమానము అయిన మౌనవ్రతము అవలంబించి నాడు. అప్రతిమానమూ, పరమదుష్కరమూ, మహోగ్రమూ అయిన తపస్సు చేయటము మొదలు పెట్టినాడు. కోపాన్ని దరిచేరనీయకుండా, ఎన్ని విఘ్నాలు వచ్చినా ఏ మాత్రమూ చలించకుండా మౌను మాదిరిగా పాదుకొని పోయినాడు.

"ఆ విధముగా నియమబద్ధుడు అయి ఏ అంతరాయానికీ లొంగిపోకుండా బహుకాలము తపస్సు చేసినాడు. ఆయన తపోవ్రతము సమాప్తము అయింది. అప్పుడు ఆయన భోజనము చేయపోతున్నాడు. అంతలో దేవేంద్రుడు బ్రాహ్మణ వేషముతో వచ్చి అన్నము పెట్టుమని యాచించినాడు. కిక్కురుమనకుండా నిస్సంకోచముగా ఆ బ్రాహ్మణుడికి సిద్ధాన్నము పెట్టినాడు. ఆ బ్రాహ్మణుడు ఆ అన్నము ఏ కొంచెమూ మిగల్చకుండా అంతా తినివేసినాడు. విశ్వామిత్రుడు ఈషణ్మాత్రమూ చలించలేదు.

"విశ్వామిత్రుడు మళ్ళీ ఊపిరి బిగపట్టి మహోగ్రముగా తపస్సు చేయటము మొదలుపెట్టినాడు. చాలాకాలము గతించింది. ఆయన తపస్సు చాలించలేదు. అప్పుడు ఆయన తలలో నుంచి పొగలూ, మంటలూ బయలుదేరినవి. అవి ముల్లోకాలలో వ్యాపించినవి. జగత్తు అంతా దగ్ధము అయిపోయేట్టుగా తోచింది. ఆయన తపోగ్నికి దేవ, దానవ, యక్ష, రాక్షస, గరుడ, గంధర్వులు అందరూ నిశ్చేష్టులు అయిపోయినారు.

"దేవతలు అందరూ బ్రహ్మదేవుడితో, 'ఓ దేవా! మేము విశ్వామిత్రుణ్ణి అనేక విధాల ప్రలోభ పెట్టినాము. కోపము తెప్పించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినాము. ఇంకా ఏమేమో చేసినాము. ఏమి చేసినప్పటికిన్నీ ఆయన తపస్సు తరిగిపోలేదు. పయిగా వృద్ధి అయింది. ఇప్పుడు ఆయనలో ఏ దోషమూ కనిపించటము లేదు. అందువల్ల, ఆయన మనసారా కోరుతున్న కోరికను తాము చెల్లించి తీరవలెను. అట్లా చేయకపోయేట్లయితే, విశ్వామిత్రుడి తపోగ్నికి ముల్లోకాలూ భస్మము అయిపోతవి. ఇప్పటికే దిక్కులు అన్నీ కలవరపడిపోయినవి. సముద్రాలు అన్నీ అల్లకల్లోలము అయినవి. పర్వతాలు అన్నీ కదులుతూ ఉన్నవి. పృథివి అంతా వణికిపోతూ ఉంది.

గాలి ఎడా పెడా కొట్టుతూ ఉంది. సూర్యరశ్మి మందగించింది. జనులు కర్మశూన్యులు అయిపోయినారు. ఏమి చేయవలెనో ఎవరికీ తోచటము లేదు. అందరికీ మౌఢ్యము వచ్చినట్టుగా ఉంది. ఓ దేవా! విశ్వామిత్రుడు అమితతేజోవంతుడు. ఇప్పుడు అగ్నిహోత్రుడివలె ఉన్నాడు. ఈ లోకాలను అన్నిటిని నాశనము చేయవలెను అని ఆయనకు ఇంకా బుద్ధి పుట్టలేదు. తాము ఉపేక్షించినట్లయితే ఆయన ప్రళయకాలాగ్నివలె ముల్లోకాలనూ దహించివేస్తాడు. దేవరాజ్యము ఏలవలెను అనికూడా అనుకొంటాడు. అందువల్ల, తాము ఇప్పుడు ఆయన కోర్కెను చెల్లించటమే తరుణోపాయము' అన్నారు.

"అంతట బ్రహ్మదేవుడు దేవతలు అందరితోనూ విశ్వామిత్రుడి దగ్గరకు పోయి, ఓ బ్రహ్మర్షీ! అని మనోహరముగా సంబోధించి, 'నీకు స్వాగతము. నీ తపస్సుకు మేము అందరమూ సంతోషించినాము. నీవు బ్రాహ్మణుడవు అయినావు. ఓ బ్రహ్మర్షీ! నీకు నేనూ, మరుద్గణాలూ దీర్ఘాయుష్యము ఇస్తున్నాము. ఇక నీవు స్వస్థచిత్తుడవుకా. సుఖముగా ఉండు' అన్నాడు.

"విశ్వామిత్రుడు సంతోషముతో బ్రహ్మదేవుడికీ, మిగతా దేవతలకూ నమస్కారము చేసి, 'ఓ దేవా! నాకు బ్రాహ్మణత్వమూ, దీర్ఘాయుర్దాయమూ అనుగ్రహించినందుకు కృతజ్ఞుడను. అయితే ఓంకారమూ, వషట్కారమూ, వేదాలూ నా స్వాధీనము కావడమే కాకుండా, నేను వాటిని ఇతరులకు ఉపదేశము చేసే అధికారము తాము నాకు దయచేయవలెను.

"ఓ దేవా! ఇంతకన్నా ముఖ్యము అయిన కోరిక మరి ఒకటి ఉంది. వశిష్ఠ మహర్షి, క్షత్రవేదవిదులలోనూ, బ్రహ్మవేదవిదులలోనూ మహామహుడు. ఆయన నన్ను బ్రహ్మర్షి అనవలెను. ఇది నా ముఖ్యము అయిన కోరిక. తాము ఈ కోరికను నెరవేర్చకపోతే నేను తృప్తిపడను' అన్నాడు.

"అంతట దేవతలు అందరూ పోయి వశిష్ఠమహర్షిని తీసుకొని వచ్చినారు. ఆయన విశ్వామిత్రుడితో సఖ్యపడి, 'బ్రహ్మదేవుడూ, దేవతలూ చెప్పినట్టు నీవు బ్రహ్మర్షివి. బ్రహ్మర్షికి ఉండే అధికారాలు అన్నీ నీకూ ఉంటవి' అని చెప్పినాడు.

"బ్రహ్మదేవుడూ, దేవతలూ వెళ్ళిపోయినారు.

"విశ్వామిత్రుడు వశిష్ఠమహర్షిని పూజించి, సత్కరించి, వీడ్కోలుచెప్పి పంపించినాడు. అంతట ఆయన తాపసిగా ఈ భూలోకము అంతా తిరిగి చూచినాడు.

"ఈ విధముగా బ్రాహ్మణ్యము సంపాదించిన విశ్వామిత్రుడు మహర్షులు అందరిలోనూ అగ్రగణ్యుడు. ఈ లోకములో తపస్సు ఈయన రూపాన వెలసింది.

ఈయన పరమధార్మికుడు. మహాపరాక్రమవంతుడు" అంటూ ఆ బ్రాహ్మణోత్తముడు చెప్పి ఊరకున్నాడు.

జనకమహారాజు అంతట విశ్వామిత్రమహర్షికి సాష్టాంగ నమస్కారము చేసి, "బ్రహ్మర్షీ! తాము నా యజ్ఞానికి వచ్చినందువల్ల నేను ధన్యుణ్ణి అయినాను. మాన్యుణ్ణి అయినాను. పవిత్రుణ్ణి అయినాను. ఓ స్వామీ! తాము బ్రహ్మర్షులలో ఉత్తమోత్తములు. ఓ మహాభాగా! తమ సందర్శన భాగ్యమువల్ల ఇప్పుడు నాకు అనేక సద్విషయాలు తెలిసినవి. మహత్తరము అయిన తమ తపస్సును గురించిన వివరాలు అన్నీ నేనూ, ఈ రామలక్ష్మణులూ ఇప్పుడు వినకలిగినాము. మహానుభావా! తమ తపస్సు అప్రమేయము. తమ బలము అప్రమేయము. తమ పరాక్రమము అప్రమేయము. తమ సద్గుణాలు అప్రమేయాలు. ఓ అప్రమేయా! మహదాశ్చర్యము కలిగించే తమ కథ ఎంత విన్నా తనివి తీరలేదు.

"ఓ మహామునీ! ఇప్పుడు సూర్యుడు అస్తమించ పోతున్నాడు. సాయంకాలాహ్నికాలను నెరవేర్చడానికి నాకు సెలవు ఇప్పించవలెను. ఓ బ్రహ్మర్షీ! రేపు ఉదయము తాము తిరిగి నాకు దర్శనము ఇప్పించవలెను. ఓ మహాత్మా! తమకు ఎప్పుడూ స్వాగతమేను" అంటూ జనకమహారాజు ఉపాధ్యాయులతోనూ, బంధువులతోనూ విశ్వామిత్రమహర్షికి ప్రదక్షిణము చేసి సెలవు తీసుకొని వెళ్ళిపోయినాడు.

అప్పుడు విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో తన విడిదికి పోయినాడు.

66

శివధనుస్సు వృత్తాంతము

తెల్లగా తెల్లవారింది. జనకమహారాజు ప్రాతఃకాలకరణీయాలను ముగించుకొని విశ్వామిత్రుణ్ణీ, రామలక్ష్మణులనూ పిలిపించినాడు. శాస్త్రీయముగా విశ్వామిత్రమహర్షిని అర్చించినాడు. ఉచితరీతిని రామలక్ష్మణులను సన్మానించినాడు.

"ఓ మహామునీ! తమకు స్వాగతము. తమ అనుజ్ఞ ఏమిటి, చెప్పవలెను" అన్నాడు జనకమహారాజు.

"ఓ రాజా! ఈ రామలక్ష్మణులు దశరథమహారాజు పుత్రులు అని చెప్పినాను. ఈ వీరులు ఇద్దరూ నీ ఇంట్లో ఉన్న శివధనుస్సు చూడ తలచి నావెంట వచ్చినారు. ఆ ధనుస్సు వీరికి చూపించవలెను. నీకు శుభము అవుతుంది. కృతకాములు అయి వీరు యథేష్టముగా వీరి పట్టణానికి వెళ్ళిపోతారు" అన్నాడు విశ్వామిత్రమహర్షి.

జనకమహారాజు, "స్వామీ! ఆ ధనుస్సు మా ఇంట్లోకి ఎట్లా వచ్చిందీ ముందుగా మనవి చేస్తాను, వినవలెను. నా పూర్వీకుడు నిమి చక్రవర్తి తరువాత ఆరవ తరములో 'దేవరాతుడు' అనే ఆయన రాజ్యము చేస్తూ ఉండేవాడు. ఆయనకు దేవతలు శివధనుస్సును నిక్షేపముగా ఇచ్చినారు.

"పూర్వము శివుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసముచేసే సమయములో దేవతలమీద కోపము వచ్చి ఈ వింటిని ఎక్కుపెట్టి, 'ఓ దేవతలారా! ఈ యజ్ఞములో నేను అడిగినప్పటికిన్నీ మీరు హవిర్భాగాలలో నాకు పాలు పెట్టలేదు. అందువల్ల, ఇప్పుడు ఈ వింటితో మీ తలలు తెగవేస్తాను' అన్నాడు. అంతట దేవతలు అందరూ ఆయనను స్తోత్రము చేసినారు. ఆయన అంతట ప్రసన్నుడు అయినాడు. ఆ ధనుస్సును దేవతలకు ఇచ్చి వేసినాడు. ఆ దేవతలు ఆ శివధనుస్సును దేవరాతుడికి న్యాసముగా ఇచ్చినారు. అప్పటినుంచీ ఆ విల్లు మా ఇంట్లోనే ఉంది.

" నేను ఒకప్పుడు యజ్ఞము చేయతలపెట్టి భూమిని దున్నుతూ ఉండగా నాగటి చాలులోనుంచి ఒక స్త్రీ శిశువు లేచింది. ఆ శిశువు నాగటిచాలులో దొరికినందువల్ల నేను దానికి 'సీత' అని పేరు పెట్టి, నా స్వంతకూతురుగా పెంచుకొంటున్నాను. అది పెరిగి పెద్దది అయింది. అయోనిజ కాబట్టి దానిని వీర్యవంతుడికి ఇచ్చి పెండ్లి చేయవలెను అనుకొన్నాను. అనేకమంది రాజకుమారులు సీతను వరించినారు. ఆమె వీర్యశుల్క అని నేను వారికి చెప్పినాను. ఆ వీర్యశుల్కము ఏమిటో చెప్పమని వారు అందరూ నన్ను అడిగినారు. నేను శివధనుస్సును వారికి చూపించి, దానిని ఎక్కుపెట్టడము అన్నాను. వారు ఆ ధనుస్సును లేవనెత్తలేకపోయి నారు. దానిని అటూ ఇటూ కదిలించడము అయినా వారి చేతకాలేదు. అందువల్ల, వారి పరాక్రమము అల్పమేను అని నేను అనుకొని సీతను వారికి ఇవ్వడానికి ఒప్పుకోలేదు.

"నేను వారి పరాక్రమాన్ని సంశయించినాను అనీ, వారిని తిరస్కరించినాను అనీ వారికి అందరికీ నా మీద కోపము వచ్చింది. అంతట వారు అందరూ ఏకమై మిథిలానగరాన్ని ముట్టడించినారు. ఆ ముట్టడి ఒక సంవత్సరము సాగింది. నా సైన్యసామాగ్రి అంతా నాశనము అయిపోయింది. అప్పుడు నేను చాలా దిగులు పడిపోయినాను. తపస్సుచేసి దేవతలను సంతోషపెట్టినాను. దేవతలు సంతుష్టులు అయి నాకు చతురంగబలాలను అనుగ్రహించినారు. అంతట ఆ పాపకర్ములను, ఆ అల్పవీర్యులను చెదరకొట్టినాను. వారు అందరూ పలాయనము అయినారు.

"ఆ పరమభాస్వరము అయిన శివధనుస్సును ఇప్పుడు తెప్పించి ఈ రామ లక్ష్మణులకు చూపిస్తాను. ఓ మహామునీ! రాముడు ఆ ధనుస్సును ఎక్కుపెట్టేట్లయితే నా కూతురు సీతను ఇచ్చి పెండ్లి చేస్తాను" అన్నాడు జనకమహారాజు.

67

జనకమహారాజు చెప్పింది అంతా విని విశ్వామిత్రమహర్షి, "ఆ ధనుస్సును రాముడికి ఇప్పుడే చూపించవలెను" అన్నాడు.

ఆ ధనుస్సును ఆ యజ్ఞవాటికకు పట్టుకొని రావలసింది అని జనక మహారాజు మంత్రులను ఆజ్ఞాపించినాడు. వారు అంతట మిథిలానగరములోకి పోయి ఆ ధనుస్సును దాచి ఉంచిన ఎనిమిది చక్రాల ఇనుప భోషాణాన్ని బయటికి లాగించడానికి ప్రయత్నము చేసినారు. ఒడ్డూ పొడుగూ ఉన్న బలాఢ్యులను అనేకమందిని పిలిపించినారు. వారు అందరూ ఆ మందసాన్ని ఎట్లాగో బయటికిలాగి అతి కష్టముమీద అక్కడనుంచి జనకమహారాజు దగ్గరకు తీసికొనిపోయి, "రాజులు అందరూ పూజించే దివ్యధనుస్సును తీసుకొని వచ్చినాము" అని చెప్పినారు.

అప్పుడు జనకమహారాజు, "బ్రహ్మర్షీ! మా వంశీయులున్నూ, ఇంకా ఇతర రాజులున్నూ ఈ ధనుస్సును పూజిస్తూ వచ్చినారు. సురాసురులుకానీ, యక్ష రాక్షస గరుడ గంధర్వ కిన్నెర మహోరగులుకానీ దీనిని ఎక్కుపెట్టలేకపోయినారు. ఈ వింటిని వంచినవారుకానీ, దీనికి అల్లెత్రాడును ఎక్కించినవారుకానీ, దీనిలో బాణము కూర్చినవారుకానీ, కూర్చిన బాణాన్ని వదలడానికి అల్లెత్రాటిని లాగినవారుకానీ, దీని భారాన్ని పరీక్షించినవారు కానీ ఇంతవరకూ ఎవరూ లేరు. శివదేవుడి ధనుస్సు ఇప్పుడు తమ ఎదుట ఉంది. తామే దానిని రామలక్ష్మణులకు చూపించవలెను" అన్నాడు.

విశ్వామిత్రమహర్షి, "నాయనా రామా! ఆ విల్లు ఏమిటో చూడు" అన్నాడు.

ఆ బ్రహ్మర్షి ఆజ్ఞను శిరసావహించి రాముడు ఆ ఇనుపమందసము మూత తెరచినాడు. గంధమాల్యాదులతో అలంకరించి ఉన్న ఆ శివధనుస్సును చూచినాడు.

"బ్రహ్మర్షీ! ఆ వింటిని నా చేతితో లేవనెత్తుతాను. దీని భారాన్ని పరీక్ష చేసి ఎక్కుపెట్టవలెను అనుకొంటున్నాను" అని విశ్వామిత్రమహర్షితో రాముడు అన్నాడు.

"మంచిది, మంచిది" అని విశ్వామిత్రమహర్షి, జనకమహారాజు అన్నారు.

శివధనుర్భంగము

రాముడు ఆ వింటినడుమ చేతితో పట్టుకొని అవలీలగా లేవనెత్తినాడు. ఆ యజ్ఞానికి వచ్చిన మహర్షులూ, రాజరాజులూ, వేలకొద్దీ మహాజనులూ అది చూచి నివ్వెరపోయినారు. రాముడు ఆ వింటికి ఇట్టే అల్లెత్రాడు ఎక్కించినాడు. అప్రయత్నముగా బాణము కూర్చినాడు. ఆ బాణము వదలడానికి అల్లెత్రాటిని ఆకర్ణాంతము లాగినాడు.

ఆ ధనుస్సు అంతట పెళ్ళున విరిగిపోయింది.

పిడుగుపడ్డంత చప్పుడు అయింది. పర్వతాలు అన్నీ బ్రద్దలు అయిపోతున్నవా అనిపించింది. భూమి అంతా కంపిస్తూ ఉన్నట్టుగా తోచింది. అందరూ నేలమీద కూలినారు. ఆ మహాధ్వనికి విశ్వామిత్రమహర్షీ, జనకమహారాజూ, రామలక్ష్మణులూ తప్ప తక్కినవారు అందరూ మూర్ఛపోయినారు.

అప్పుడు జనకమహారాజు విశ్వామిత్రమహర్షిని చూచి, "మహానుభావా! ఈ జగత్తులో రాముడు ఒక్కడే వీర్యవంతుడు. ఈతడు ఈ విల్లును వంచకలడు అని నేను ఊహించలేదు. ఇంతటి శక్తిమంతుడు ఈ లోకములో ఉన్నాడు అని నేను అనుకోలేదు. అంతా అద్భుతంగా ఉంది. ఇక నా కూతురు సీతను రాముడికి ఇచ్చి పెండ్లి చేస్తాను. సీత నా వంశానికి కీర్తి తీసుకొని వస్తుంది.

"ఓ మహర్షీ! పరాక్రమమే సీతకు ఓలి అని నేను ప్రతిజ్ఞచేసినాను. ఇప్పుడు నా ప్రతిజ్ఞ నెరవేరింది. నాకు నా ప్రాణాలకన్నా ఎక్కువ అయిన సీతను రాముడికి ఇచ్చి పెండ్లి చేస్తాను.

"బ్రాహ్మణోత్తమా! దశరథమహారాజు అనుమతి కోసము నా మంత్రులను అయోధ్యా పట్టణానికి పంపిస్తాను. రామలక్ష్మణులు తమవెంట ఇక్కడికి రావడమూ, శివధనుస్సును రాముడు విరిచివేయడమూ, నేను సీతను రాముడికి ఇచ్చి వివాహము చేయ నిశ్చయించడమూ మొదలు అయిన వృత్తాంతము అంతా నా మంత్రులు దశరథమహారాజుకు విన్నవించి ఆయనను సంతోషపెట్టి సపరివారముగా ఆయనను ఇక్కడకు తోడ్కొని వచ్చేట్టు చేస్తాను. ఇందుకు తాము అనుమతించవలెను" అన్నాడు జనకమహారాజు.

"అట్లాగే చేయవలెను" అని విశ్వామిత్రమహర్షి అన్నాడు.

అంతట జనకమహారాజు మంత్రులు అయోధ్యా పట్టణానికి ప్రయాణము అయినారు.

68

సీతారామ కళ్యాణ నిర్ణయము

జనకమహారాజు మంత్రులు గుర్రాలు అలసిపోయేట్టుగా మూడు అహోరాత్రములు ప్రయాణముచేసి నాల్గవనాడు ఉదయము అయోధ్యా నగరము చేరినారు. రాజభవనము దగ్గరకు పోయి ద్వారపాలకులను చూచి తమ రాక దశరథ మహారాజుకు విన్నవించమన్నారు.

జనకమహారాజు మంత్రులు రాజానుమతితో రాజగృహములోకి పోయినారు. వృద్ధుడు అయినప్పటికిన్నీ దేవతుల్యుడుగా తేజరిల్లుతూ ఉన్న దశరథమహారాజును చూచినారు. ఆయన ప్రసన్న వదనము చూడగానే వారికి ఏ జంకూ లేకుండా పోయింది. పవిత్రహృదయాలతో నమస్కారముచేసి, "మహాతేజా! మేము మిథిలాధిపతి జనకమహారాజు దూతలము. మా మహారాజు స్నేహపూర్వకముగా తమ కుశలమూ, తమ ఉపాధ్యాయుల కుశలమూ అడిగి తెలుసుకోమన్నారు. ఇంకా తమ అగ్ని హోత్రాదులు నిరంతరాయముగా సాగుతూ ఉన్న విషయమూ తెలుసుకోమన్నారు" అని చెప్పినారు.

కుశలప్రశ్నలు అయిపోయిన తరువాత జనకమహారాజు మంత్రులు మళ్ళీ, "ఓ రాజా! తమకు మేము ఒక విషయము విన్నవించడానికి విశ్వామిత్రమహర్షి అనుమతితోనూ, శతానందోపాధ్యాయులవారి సమ్మతితోనూ మా మహారాజు మమ్ములను మీ వద్దకు పంపించినాడు.

"మా మహారాజు తన కూతురు సీతాదేవికి పరాక్రమమే ఓలి అని ప్రతిజ్ఞ చేయడమూ, అనేకమంది రాజకుమారులు వచ్చి నిర్వీర్యులు అయి విఫలులు అయిపోవటమూ తమకు తెలిసిన విషయమే అయి ఉండవచ్చును. తమ పుత్రులు రామలక్ష్మణులు విశ్వామిత్రమహర్షి వెంట దైవికముగా మా రాజధానీ నగరానికి మా మహారాజు చేస్తూ ఉన్న యజ్ఞము చూడవచ్చినారు. తమ పెద్దకుమారుడు రాముడు మహావీరుడు. సీతాదేవికి వీర్యశుల్కము ఇచ్చినాడు.

"ఓ రాజా! మహర్షులూ, రాజర్షులూ, రాజరాజులూ చూస్తూ ఉండగా మహా పరాక్రమవంతుడు రాముడు శివధనుస్సు మధ్యభాగము పట్టుకొని లేవనెత్తి ఎక్కుపెట్టినాడు. అది అంతట విరిగిపోయింది. సీతాదేవికి పరాక్రమమే ఓలి అయినందువల్ల, రాముడికి సీతాదేవిని ఇచ్చి పెండ్లిచేయడానికి మా మహారాజు నిశ్చయించినాడు. అందుకు తామున్నూ అనుమతించి తమ ఉపాధ్యాయులతోనూ, పురోహితులతోనూ, బంధుమిత్రులతోనూ, సపరివారముగా మిథిలా నగరానికి రావలెను. రాజా! తమ దర్శనముచేసి మా మహారాజు తన కూతురు సీతాదేవి వివాహము చేయతలచినాడు. తమకు ఈ విషయము మనవి చేయడానికి మమ్ములను మా జనక మహారాజు పంపించినాడు" అని చెప్పి ఊరకున్నారు.

దశరథమహారాజు చాలా సంతోషించి, ఆలోచించి మనసా నిశ్చయించు కొన్నాడు. అంతట వశిష్ఠమహర్షినీ, వామదేవుణ్ణీ చూచి, "ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ దూతలు చెప్పింది మీకు ఇష్టము అయితే మనము అందరమూ మిథిలా నగరానికి తరలి పోదాము, ఆలస్యము వద్దు" అన్నాడు.

మహర్షులూ, మంత్రులూ ఆలోచించి "బాగుంది" అని చెప్పినారు.

అంతట దశరథమహారాజు మరునాడే ప్రయాణము అన్నాడు. జనక మహారాజు మంత్రులను అందరినీ చక్కగా సత్కరించినాడు. వారు ఆ రాత్రి సంతోషముగా అక్కడ ఉండిపోయినారు.

69

తెల్లవారగానే దశరథమహారాజు ఋత్విజులూ, బంధువులూ, మంత్రులూ మొదలయిన వారిని అందరినీ పిలిపించినాడు. సుమంత్రుణ్ణి చూచి సంతోషముతో,

"మంత్రిసత్తమా! జనకమహారాజు దూతలు నన్ను తొందరపెట్టుతున్నారు. ప్రయాణ సన్నాహము అంతా నీవు చేయవలెను. ముందుగా ధనాధ్యక్షులు నానావిధ రత్నాలను, పుష్కలముగా ధనాన్నీ తీసుకొని సురక్షితముగా ప్రయాణము అయిపోవలెను. ఆతరువాత మనము అందరమూ తరలిపోయే ఏర్పాట్లు చేయవలెను" అని చెప్పినాడు.

వశిష్ఠమహర్షీ, వామదేవుడూ, జాబాలీ, దీర్ఘాయుష్మంతుడు అయిన మార్కండేయుడూ, కాత్యాయనుడూ, ఇంకా తక్కిన బ్రాహ్మణోత్తములూ ముందు బయలుదేరినారు. వారి వెనుక రథముమీద దశరథమహారాజూ, ఆ యా వాహనాలతో ఆయన పరివారమూ, చతురంగ సేనలూ నడిచినవి.

వారు అందరూ నాలుగు పగళ్ళు ప్రయాణముచేసి విదేహ రాజ్యము చేరినారు. దశరథమహారాజు వస్తూ ఉన్నాడు అని జనకమహారాజుకు వర్తమానము వచ్చింది. ఆయనను సత్కరించి తీసుకొని పోవడానికి ఎదురుగుండా జనకమహారాజు వచ్చి దశరథమహారాజును పరివారసహితముగా చూచి సంతోషించినాడు. వారిని వెంటపెట్టుకొని తన యజ్ఞవాటికకు పోయినాడు. వారిని అందరినీ యథోచితముగా సత్కరించినాడు.

దశరథమహారాజు కూర్చున్న తరువాత, "ఓ రాజా! స్వాగతము. నా భాగ్యవశమువల్ల తాము ఇక్కడికి వచ్చినారు. తమ పుత్రుని పరాక్రమ విజయానికి తాము మనసారా సంతోషించవలెను. వశిష్ఠమహర్షి ఇంతమంది బ్రాహ్మణులను వెంటపెట్టుకొని తమతో రావడము నా పూర్వ పుణ్యము.

"రాజా! మహాపరాక్రమవంతులు పుట్టిన రఘువంశమువారితో ఇప్పుడు వియ్యము అందబోతున్నాను. ఇప్పుడు నా వంశము మరింత పూజనీయము గాబోతున్నది. ఇది అంతా నా పుణ్యపరిపాకము అనుకొంటున్నాను.

"రాజా! రేపటితో నా యజ్ఞము సమాప్తము అయిపోతుంది. అంతట మహర్షుల సమ్మతితో సీతారాముల వివాహము చేయతలచినాను" అన్నాడు.

దశరథమహారాజు చిరునవ్వుతో, "రాజా! తాము దాతలు. దానము దాతవశము అని పెద్దలు చెప్పగా విన్నాను. అందువల్ల, తాము ఎప్పుడు ఏది ఇస్తాము అంటే, అప్పుడు అది పుచ్చుకోవటమే మా పని" అన్నాడు.

దశరథమహారాజు ఇంత చక్కగా అన్నందుకు జనకమహారాజు ఉప్పొంగి పోయినాడు.

పెండ్లికి వచ్చిన మహర్షులు అందరూ ఆ రాత్రి అక్కడ సుఖముగా గడిపినారు.

దశరథమహారాజు పుత్రులతో ముచ్చటలాడుతూ ఆ రాత్రి గడపినాడు. జనకమహారాజు వివాహ ప్రయత్నములో నిమగ్నుడు అయినాడు.

70

దశరథమహారాజు మిథిలానగరము చేరిన మరునాడు జనకమహారాజు మహర్షుల సాయముతో యజ్ఞకర్మను ముగించినాడు. అంతట శతానందుణ్ణి చూచి, "స్వామీ! నా తమ్ముడు కుశధ్వజుడు ఇప్పుడు ఇక్కడలేడు. ఈ యజ్ఞానికి సామగ్రులు పంపించి తోడుపడినాడు. ఈ జరగబోయే పెండ్లి వేడుకలో వాడూ పాల్గొనవలెను. వాడూ నాతోపాటు సంతోషించవలెను. కాబట్టి, తాము నా తమ్ముణ్ణి వెంటనే ఇక్కడికి పిలిపించవలెను" అని చెప్పినాడు.

ఉపేంద్రుడి కోసము దేవతలు పోయినట్టుగా కుశధ్వజుడి కోసము జనక మహారాజు దూతలు అమితవేగముతో పరుగెత్తే గుర్రాలు ఎక్కిపోయినారు. సాంకాస్య పట్టణము చేరినారు. కుశధ్వజమహారాజుకు మిథిలానగర వృత్తాంతము అంతా తెలియచెప్పినారు. ఆయన సపరివారముగా మిథిలానగరానికి బయలుదేరినాడు.

ధర్మవత్సలుడూ, మహాత్ముడూ, జ్యేష్ఠుడూ అయిన జనకమహారాజుకున్నూ, శతానందోపాధ్యాయులకున్నూ కుశధ్వజుడు నమస్కారము చేసినాడు. అన్నగారి సరసను కూర్చున్నాడు. అన్నదమ్ములు ఇద్దరూ ఆలోచన చేసినారు. అంతట మంత్రిశ్రేష్ఠుడు అయిన సుదామనుణ్ణి చూచి జనకమహారాజు, "మంత్రీపతీ! నీవు వెంటనే వెళ్ళి దశరథమహారాజును మంత్రులతోనూ, పురోహితులతోనూ, పుత్రమిత్ర బంధువులతోనూ, పరివారముతోనూ ఆహ్వానించి ఇక్కడికి తీసుకొని రావలెను" అన్నాడు.

సుదామనుడు విడిదికి వెళ్ళినాడు. దశరథమహారాజును చూచినాడు. జనక మహారాజు ఆహ్వానము తెలియజేసినాడు.

దశరథమహారాజు పుత్రులతోనూ, మహర్షులతోనూ, బంధుమిత్ర పరివారము తోనూ బయలుదేరినాడు. జనకమహారాజు సభకు పోయినాడు. అంతట, "ఓ రాజర్షీ! వశిష్ఠమహర్షి మా ఇక్ష్వాకు వంశీయుల ఇలవేల్పు. మా పరమగురువు. సమస్తవిషయాలకు ఆయనే మా వక్త. ఆ మహానుభావుడు ఇప్పుడు విశ్వామిత్రమహర్షి అనుమతితో మా వంశక్రమాన్ని గురించి చెప్పుతాడు" అన్నాడు దశరథమహారాజు.

ఇక్ష్వాకు వంశక్రమము

అప్పుడు ఆ మహాసభలో వశిష్ఠమహర్షి లేచి ఈవిధముగా చెప్పినాడు.

"బ్రహ్మ అవ్యక్తప్రభవుడు, శాశ్వతుడు, నిత్యుడు, అవ్యయుడు. ఆ బ్రహ్మదేవుడు మనసా సంకల్పించినాడు. అంతట ఈ భూలోకములో 'మరీచి'

అనేవాడు జన్మించినాడు. ఆ మరీచికి కాశ్యపుడున్నూ, కాశ్యపుడికి సూర్యుడున్నూ, సూర్యుడికి మనువున్నూ పుట్టినారు.

"ఆ మనువుకు వైవస్వతమనువు అనే ఆయన పుట్టినాడు. ఆయనే ప్రజాపాలనము చేసి ప్రజాపతి అయినాడు. ఆ వైవస్వతమనువుకు ఇక్ష్వాకువు పుట్టినాడు. ఆ ఇక్ష్వాకువే మొట్టమొదట అయోధ్యా రాజ్యపాలనము చేసినాడు.

"ఆ ఇక్ష్వాకువుకు కుక్షియున్నూ, కుక్షికి వికుక్షియున్నూ, వికుక్షికి అమిత తేజోవంతుడు, అమితపరాక్రమవంతుడూ అయిన బాణుడున్నూ, బాణుడికి అనరణ్యుడున్నూ, అనరణ్యుడికి పృధువున్నూ, పృధువుకు త్రిశంకువున్నూ, త్రిశంకువుకు దుంధుమారుడున్నూ, దుంధుమారుడికి యవనాశ్వుడున్నూ, యవనాశ్వుడికి మాంధాతయున్నూ, మాంధాతకు సునంధియున్నూ, సునంధికి ధ్రువసంధి, ప్రసేనజిత్ అనే ఇద్దరు పుత్రులున్నూ పుట్టినారు.

"ధ్రువసంధికి మహాయశస్వి అయిన భరతుడు పుట్టినాడు. భరతుడికి అసితుడు పుట్టినాడు. ఆ అసితుడిమీదకు హైహయులూ, తాలజంఘులూ, శశిబిందువులూ దండయాత్రకు వచ్చినారు. అసితుడు ఓడిపోయినాడు. ఇద్దరు భార్యలతోనూ హిమవత్పర్వతానికి పలాయనము అయినాడు. అక్కడ 'భృగుప్రస్రవణము' అనే మనోహర ప్రదేశములో నివాసము పెట్టుకొన్నాడు. కాని కొద్దిరోజులకే ఆ అసితుడు కాలధర్మము చెందినాడు.

"అసితుడు చనిపోయేనాటికి ఆయన ఇద్దరు ఇల్లాండ్లూ గర్భవతులు. పట్టపురాణి గర్భాన్ని అసితుడి చిన్నపెండ్లాము చెడకొట్టటానికి సంకల్పించుకొన్నది. సవతికి ఆమె ఒక భక్ష్యము ఇచ్చింది. పట్టపురాణి ఆ భక్ష్యము తిన్నది. తిన్నతరువాత ఆ భక్ష్యములో గరళము పెట్టింది అని తెలుసుకొన్నది. తన గర్భము ఏమి అయిపోతుందోనని దిగులు పడ్డది. ఆమెకు ఏమీ తోచలేదు. ఎట్లాగు అయినా తన గర్భము పోకూడదు అనుకొన్నది. ఆ ప్రాంతములో ఆ కాలములో నివసిస్తూ ఉన్న భృగువంశీయుడు చ్యవనమహర్షి దగ్గరకు పోయింది. ఆయన దర్శనముచేసి, స్తోత్రము చేసి నమస్కరించి మెప్పించింది. ఆ చ్యవనమహర్షి, 'ఓ పూజ్యురాలా! భయపడవద్దు. ఇప్పుడు నీ గర్భములో అమితబలవంతుడూ, మహాతేజోవంతుడూ, పరమపరాక్రమవంతుడూ, శ్రీమంతుడూ అయిన శిశువు ఉన్నాడు. వాడు దీర్ఘాయుష్మంతుడు అవుతాడు. నీవు విషము తిన్నాను అని భయపడవద్దు. దేహములో విషము జీర్ణము అయిపోయిన పుత్రుడే పుట్టుతాడు. నీకు త్వరలో సుఖప్రసవము అవుతుంది' అని చెప్పినాడు.

"ఆమె శ్రద్ధాభక్తులతో ఆ చ్యవనమహర్షికి మొక్కి వెళ్లిపోయింది. భర్త వియోగశోకాన్ని అంతట మరచిపోయింది. సుఖముగా ప్రసవించింది. పుత్రుడు పుట్టినాడు. ఆమె గరళము తిన్నప్పటికిన్నీ పుట్టినందువల్ల ఆ పిల్లవాడు సగరుడు అయినాడు. ఆ సగరుడే అయోధ్యారాజ్యానికి చక్రవర్తి అయినాడు.

"ఆ సగరచక్రవర్తికి అశ్వమంజుడున్నూ, అశ్వమంజుడికి అంశుమంతుడున్నూ, అంశుమంతుడికి దిలీపుడున్నూ, దిలీపుడికి భగీరథుడున్నూ, భగీరథుడికి ककుత్థ్సుడున్నూ, ककుత్థ్సుడికి రఘువున్నూ, రఘువుకు ప్రవృద్ధుడున్నూ పుట్టినారు.

"ఆ ప్రవృద్ధుడే పురుషాదుడూ, కల్మాషపాదుడూ అయినాడు. ఆయనకు సుదర్శనుడున్నూ, సుదర్శనుడికి అగ్నివర్ణుడున్నూ, అగ్నివర్ణుడికి శీఘ్రుగుడున్నూ, శీఘ్రుగుడికి మరువున్నూ, మరువుకి ప్రశుశ్రుకుడున్నూ, ప్రశుశ్రుకుడికి అంబరీషుడున్నూ, అంబరీషుడికి నహుషుడున్నూ, నహుషునికి యయాతియున్నూ, యయాతికి నాభాగుడున్నూ, నాభాగునికి అజుడున్నూ పుట్టినారు.

"అజమహారాజుకు ఈ దశరథమహారాజు పుట్టినాడు. ఈయనకు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు అనే నల్గురు పుత్రులు పుట్టినారు. శివధనుస్సు ఎత్తి విరిచిన రాముడు ఈయన జ్యేష్ఠపుత్రుడు.

"ఓ రాజా! వీరిది పరమపరిశుద్ధవంశము. ఈ వంశీయులు అందరూ పరమధార్మికులు, వీరాగ్రేసరులు. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నల్గురూ కులదీపకులు. ఓ జనకమహారాజా! నీ కూతుళ్ళు ఇద్దరూ ఈయన ఇద్దరు కొడుకులకూ ఈడూ జోడూగా ఉన్నారు. కనుక, రామలక్ష్మణులకు నీ కూతుళ్ళను ఇద్దరినీ ఇచ్చి పెండ్లిచేయవలసింది. నీవు వీరితో సంబంధము చేయటము ఎంతో మంచిది."

ఈవిధముగా వశిష్ఠ మహర్షి చెప్పి ఊరకున్నాడు.

71, 72

జనకరాజ వంశక్రమము

ఇక్ష్వాకువంశకర్తలను గురించి వశిష్ఠమహర్షి చెప్పిన తరువాత జనకమహారాజు ఈ విధముగా చెప్పసాగినాడు :

"ఓ బ్రహ్మర్షీ! కులీనుడు కన్యాదానముచేయ తలపెట్టినప్పుడు తన వంశాన్ని గురించి నిరవశేషముగా చెప్పుకోవలెనుకదా! కనుక, మా జనకరాజుల వంశాన్ని గురించి నేను చెప్పుతాను, వినవలెను.

"పూర్వము 'నిమి' అనే చక్రవర్తి పరమధార్మికుడు అనీ, మహాబలవంతుడు అనీ ప్రసిద్ధికెక్కినాడు. అనేకసత్కర్మలు చేసినాడు. ఆయనకు 'మిథి' అనే పుత్రుడు

పుట్టినాడు. ఆ మిధే ఈ మిథిలానగరాన్ని నిర్మించినాడు. ఆయనే ప్రథమ జనకమహారాజు అయినాడు. ఆ మిధికి ఉదావసువు పుట్టినాడు. ఉదావసువుకు నందివర్ధనుడు, నందివర్ధనుడికి సుకేతువూ, సుకేతువుకు దేవరాతుడూ పుట్టినారు. దేవరాతుడు మహాబలవంతుడు అనీ, ధర్మాత్ముడు అనీ, రాజర్షి అనీ ప్రసిద్ధి కెక్కినాడు. ఆ దేవరాతుడికి బృహద్రథుడూ, బృహద్రథుడికి మహావీరుడూ పుట్టినారు. మహావీరుడు నిజముగా మహావీరుడు. ఆ మహావీరుడికి సుధృతి, సుధృతికి ధైర్యవంతుడూ, బీరుపోని పరాక్రమవంతుడూ అయిన ధృష్టకేతువు పుట్టినారు. ధృష్టకేతువు సుధార్మికుడుగానూ, రాజర్షిగానూ ఘనత కెక్కినాడు. ధృష్టకేతువుకు హర్యశ్వుడూ, హర్యశ్వుడికి మరువూ, మరువుకు ప్రతింధకుడూ, ప్రతింధకుడికి కీర్తిరథుడూ, కీర్తిరథుడికి దేవమీఢుడూ, దేవమీఢుడికి విబుధుడూ, విబుధుడికి మహీధ్రకుడూ, మహీధ్రకుడికి కీర్తిరాతుడూ పుట్టినారు. కీర్తిరాతుడు మహాబలవంతుడు, రాజర్షి. ఆయనకు మహారోముడూ, మహారోముడికి స్వర్ణరోముడూ, స్వర్ణరోముడికి హ్రస్వరోముడూ పుట్టినారు.

"హ్రస్వరోముడు మహాత్ముడు, ధర్మాత్ముడు. ఆయన మా తండ్రి. నేను జ్యేష్ఠుణ్ణి. నాకు వయస్సురాగానే నా తమ్ముడు కుశధ్వజుణ్ణి పెంచి, పెద్దవాణ్ణి చేసే భారము నామీదవేసి మా తండ్రి నాకు పట్టముకట్టి తపోవనానికి వెళ్ళిపోయినాడు. వృద్ధాప్యమువల్ల అచిరకాలములోనే స్వర్గతుడు అయినాడు.

"నా తమ్ముడు కుశధ్వజుడు దేవసమానుడు. వాణ్ణి నేను స్నేహాతిశయముతో పెంచి పెద్దవాణ్ణి చేసినాను. ధర్మమార్గాన రాజ్యపాలము చేయసాగినాను. కాలము గతించింది. సాంకాస్య పట్టణమువలె సుధన్వుడు అనే రాజు ఈ మిథిలానగరాన్ని ముట్టడించినాడు. నా ఇంట్లో ఉన్న శివధనుస్సునూ, నాకూతురు సీతనూ తనకు ఇవ్వమని రాయబారము పంపించినాడు. అందుకు నేను నిరాకరించినాను. అప్పుడు మాకు యుద్ధము అయింది. ఆ యుద్ధములో నేను సుధన్వుణ్ణి హతమార్చినాను.

"సాంకాస్య పట్టణములో నా తమ్ముడికి రాజ్యాభిషేకముచేసి, ఆ రాజ్యము వాడికి అప్పగించినాను. ఆ సాంకాస్య పట్టణము ఇక్షుమతీనదీతీరాన ఉసిరికచెట్ల మధ్య శోభాయమానముగా స్వర్గధామమువలె ఉంది. అది దూరానికి పుష్పక విమానమువలె కనపడుతుంది.

"నా తమ్ముడు కుశధ్వజుడు పరమధార్మికుడు, తేజోవంతుడు. ఆ సాంకాస్య పట్టణములో ఇప్పుడు నివసిస్తున్నాడు. ఈ వేడుకలో నాతోపాటు పాల్గొనడానికి వాణ్ణి ఇప్పుడు ఇక్కడికి రావించినాను. ఇడుగో, ఈ చిన్నవాడే నా తమ్ముడు కుశధ్వజుడు.

"ఓ బ్రహ్మర్షీ! నా ఇద్దరు కూతుళ్ళనూ తాము దశరథమహారాజు ఇద్దరు కొమాళ్ళకు ఇవ్వవలెను అని చెప్పినారు. సంతోషముగా మేము అన్నదమ్ములము

ఇద్దరమూ ఒప్పుకొంటున్నాము. సీత దేవకన్య. అది వీర్యశుల్క. దానిని రాముడికి ఇచ్చి వివాహము చేయవలెను అనేది ఇదివరకే నిశ్చయము అయిపోయింది. నా రెండవ కూతురు ఊర్మిళను లక్ష్మణుడికి ఇచ్చి వివాహము చేయవలెను అని తాము సెలవు ఇచ్చినారు. అందుకు మేము అన్నదమ్ములము త్రికరణశుద్ధిగా ఒప్పుకొంటున్నాము.

"ఓ దశరథమహారాజా! తాము ఇప్పుడు రామలక్ష్మణులకు సమావర్తనము చేయించవలెను. వారి వివాహాలకు నాంది కార్యాదులను జరిపించవలెను. ఈనాడు మఘా నక్షత్రము. ఎల్లుండి ఉత్తరఫల్గుణీ నక్షత్రములో అన్నదమ్ములకు ఇద్దరికీ వివాహము చేయటము బాగుంటుంది అనుకొంటున్నాము. ఓ రాజా! సమస్త సత్ఫలాలూ ఇచ్చే గోదానము తాము ఇప్పుడు రాముడిచేత చేయించ కోరుతున్నాను.

విశ్వామిత్రమహర్షీ, వశిష్ఠమహర్షీ ఆలోచించినారు. వారు ఉభయులూ కూడపలుకుకొన్న తరువాత విశ్వామిత్రమహర్షి జనకమహారాజును చూచి ఈవిధముగా చెప్పినాడు :

"రాజా, ఇక్ష్వాకు విదేహ వంశాలు రెండూ ఎవరూ ఊహించ నలవికాని అంత దొడ్డవి. ఆ వంశాల గొప్పతనాన్ని ఎవరూ ఇంత అంత అని నిర్ణయించలేరు. మీ వంశాలతో సరిసమానము అయినవి మాకు ఈ జగత్తులో ఎక్కడనూ కనిపించలేదు. ఇప్పుడు మీ రెండు వంశాల వారికిన్నీ వివాహరూపము అయిన ధర్మసంబంధము ఏర్పడుతున్నది. ఇది ఎంతో సమంజసముగా ఉంది. వధూవరులు సరిసమానము అయిన రూపసులు. రాముడికి సీతా, లక్ష్మణుడికి ఊర్మిళా చక్కగా తగిపోయినారు.

"నేనూ, వశిష్ఠమహర్షులూ ఆలోచించిన విషయము చెప్పుతున్నాను, వినవలెను. మీరు అన్నదమ్ములు ఇద్దరూ మా మాటలు పాటించవలెను. ఓ జనకమహారాజా! మీ తమ్ముడు కుశధ్వజుడు ధర్మజ్ఞుడు. ఆయన కూడా దశరథ మహారాజుతో సంబంధము చేయుటము ఉచితము. మీ తమ్ముడి అసమానసుందర పుత్రికలను ఇద్దరినీ మేము భరత శత్రుఘ్నులకు నిర్ణయిస్తున్నాము. భరతుడు మహాబుద్ధిమంతుడు. శత్రుఘ్నుడు అమిత పరాక్రమవంతుడు. దశరథమహారాజు నల్గురు కొడుకులూ సరిసమానము అయిన రూప యౌవనవంతులు. సద్గుణసంపన్నులు. దిక్పాలకులవంటి వారు. దేవతుల్యపరాక్రములు. మీ ఉభయవంశాలవారూ పుణ్యకర్ములు. ఇప్పుడు మీ రెండు వంశాలవారూ వియ్యము అంది చుట్టరికముతో కట్టుబడిపోవలెను. ఇది మా కోరిక."

విశ్వామిత్రమహర్షి చెప్పిన ఈవిషయము జనకమహారాజూ, కుశధ్వజుడూ ఆలోచించినారు. జనకమహారాజు మహర్షులు ఇద్దరికీ నమస్కారముచేసి,

"మహర్షులారా! మేము ఎంతో పుణ్యము చేసుకొన్నాము. అందువల్లనే, మేము అన్నదమ్ములము ఇద్దరమూ ఇక్ష్వాకులతో సంబంధము చేయవలెను అని తమంతట తాము ఆజ్ఞాపిస్తున్నారు. తమ ఆజ్ఞను మేము శిరసావహిస్తున్నాము. భరత, శత్రుఘ్నులకు నా తమ్ముడి కూతుళ్ళను ఇద్దరినీ ఇచ్చి వివాహము చేస్తాము. నాలుగు పెండ్లిళ్ళూ ఒక్కనాడే, ఒక్క ముహూర్తములోనే జరుగవలెను. ఉత్తరఫల్గుణీ నక్షత్రానికి భగుడు అధిష్ఠానదేవత. ఆ నక్షత్రాన పగటివేళ వివాహము ప్రశస్తము అని పెద్దలు చెప్పినారు అంటూ, విశ్వామిత్ర వశిష్ఠులకు అభిముఖముగా నిలుచుని నమస్కారముచేసి మహర్షులారా! తాము ఉభయులూ కన్యాదానరూపాన పరమధర్మము మాకు ప్రాప్తము అయ్యేట్లు చేసినారు. ఇదివరకే దశరథమహారాజు తమకు ప్రియశిష్యుడు. ఇప్పుడు మేము అన్నదమ్ములము ఇద్దరమూ తమ శిష్యులము. ఇక మేము ముగ్గురమూ తమ అధీనులము. మాచేత చేయించవలసింది అంతా చేయించే భారము తమది" అన్నాడు.

జనకమహారాజు ఈవిధముగా చెప్పగా విశ్వామిత్ర వశిష్ఠులూ, దశరథ మహారాజూ ఎంతో సంతోషించినారు. అంతట దశరథమహారాజు "ఓ మిథిలాధిపతీ! మీ అన్నదమ్ముల సద్గుణాలు లెక్కవేయ నలవికాదు. మీ ఉభయుల గొప్పతనాన్ని వర్ణించడమూ నా చేత కాదు. ఇంతమంది మహర్షులనూ, ఇంతమంది రాజపుంగవులనూ, ఇంతమంది మహాజనులనూ మీరు కాబట్టి సత్కరించకలిగినారు. మీరు సుఖముగా ఉండవలెను. ఇప్పుడు నేను విడిదికి పోతున్నాను. నాందీ సమావర్తన కర్మలను యథావిధిగా పూర్తిచేయిస్తాను" అంటూ జనకమహారాజుకూ, కుశధ్వజుడికీ వీడ్కోలుచెప్పి, వశిష్ఠ విశ్వామిత్రులతో తన విడిదికి వెళ్ళిపోయినాడు.

దశరథమహారాజు నాందీ కార్యాదులను శాస్త్రవిహితముగా చేయించినాడు. ఆ మరునాడు ఉదయము దశరథమహారాజు నలుగురు కొమార్ల చేతనూ సమావర్తన కర్మ చేయించినాడు. నాలుగులక్షల తరిపి ఆవులను లేగదూడలతో కూడా తెప్పించినాడు. వాటి కొమ్ములకు బంగారు తొడుగులు వేయించినాడు. పాలు పిండుకొనడానికి చక్కని కంచు చెంబులను సమకూర్చినాడు. తన కొడుకుల కోసము ఆ నాల్గులక్షల ఆవులనూ అట్లా బ్రాహ్మణులకు దానము ఇచ్చినాడు.

అప్పుడు దశరథమహారాజు నల్గురు దిక్పాలకుల మధ్యనూ, ప్రసన్న రూపముతో తేజరిల్లే బ్రహ్మదేవుడికిమల్లే నల్గురు కొడుకుల మధ్యనూ విరాజిల్లినాడు.

73

దశరథమహారాజు గోదానము చేస్తూ ఉన్నాడు. అప్పుడు అక్కడికి యుధాజిత్ వచ్చినాడు. ఆ శూరుడు కేకయరాజు పుత్రుడు. భరతుడి మేనమామ.

అతడు దశరథమహారాజును చూచినాడు. అన్యోన్యకుశలప్రశ్నలు అయిన తరువాత, "రాజా! మా నాయనగారికి తన మనుమణ్ణి చూడవలెను అని బుద్ధి పుట్టింది. అందుకోసము, నన్ను అయోధ్యా నగరానికి పంపించినారు. మీరు మీ నల్గురు కొమారులతోనూ రాముడి వివాహానికి ఇక్కడికి వచ్చినట్టుగా నాకు అక్కడ చెప్పినారు. పెండ్లికొడుకును చూచినట్టూ అవుతుంది, మీ దర్శనము చేసినట్టూ అవుతుంది, నేను వచ్చిన పనీ నెరవేరుతుంది అని నేను ఎకాఎకి బయలుదేరి ఇక్కడికి వచ్చినాను" అని చెప్పినాడు.

ఆ ప్రియాతిథిని దశరథమహారాజు మెచ్చుకొని ఎంతో చక్కగా సమ్మానించినాడు.

ఆ రాత్రి దశరథమహారాజు కొడుకులతోనూ, బంధువులతోనూ పొద్దుపుచ్చినాడు. మరునాడు ప్రభాతకాలాన సమస్తకర్మలూ ముగించుకొని మహర్షులవెంట జనకమహారాజు యజ్ఞశాలకు బయలుదేరినాడు.

శ్రీ సీతారామ కళ్యాణం

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు మంగళస్నానాలు చేసినారు. ఆభరణాలు పెట్టుకొన్నారు. చక్కగా అలంకరించుకొన్నారు. చేతులకు తోరాలు కట్టుకొన్నారు. విజయము అనే ముహూర్తములో వశిష్ఠమహర్షి మొదలయిన వారి వెనుక నడచినారు. జనకమహారాజు యజ్ఞవాటికలో దశరథమహారాజు దగ్గరకుపోయి కూర్చున్నాడు.

అప్పుడు వశిష్ఠమహర్షి జనకమహారాజు దగ్గరకు పోయి, "ఓ రాజా! దశరథమహారాజు పెండ్లికొమాళ్ళతో వచ్చి కన్యాదాత కోసము ఎదురు చూస్తున్నాడు. ఇకను ఇప్పుడు నీ ధర్మము నీవు నెరవేర్చవలెను" అన్నాడు.

జనకమహారాజు మందహాసము చేసి, "దశరథమహారాజును నా ద్వారపాలకుడు ఎవడు అడ్డగించినాడు? ఆయన ఎవరి ఆజ్ఞకోసము ఎదురు చూస్తున్నాడు? స్వగృహములో ఈ లాంఛనాలు ఏమిటి? మహర్షీ, చూడండి, నా కుమార్తెలు నల్గురూ మంగళకార్యాలు అన్నీ ముగించి, వేదిక దగ్గర దీపకళికలు మాదిరిగా కూర్చున్నారు. నేనూ సిద్ధము అయి వచ్చి మిమ్ములను ఎదురుచూస్తూ ఉన్నాను. దశరథమహారాజు ఇంకా ఆలస్యము చేయడము ఎందుకు" అన్నాడు.

అప్పుడు దశరథమహారాజు కుమారులతో యజ్ఞశాలలోకి వచ్చినాడు. జనకుడు వశిష్ఠమహర్షిని చూచి, "ఓ మహర్షీ! తామే ఈ వివాహకర్మను అంతా చేయించవలెను" అన్నాడు.

అంతట వశిష్ఠమహర్షి విశ్వామిత్రమహర్షినీ, శతానందోపాధ్యాయులనూ తన ఎదుట ఉంచుకొని ఆ పందిరిలో నట్టనడుమ యథాశాస్త్రముగా అగ్నివేదిని

ఏర్పరిచినాడు. గంధపుష్పాదులతో ఉన్న సువర్ణపాలికలనూ, మొక్కలు ఉన్న అడుగులేని పాత్రలనూ, మొలకలు ఎత్తిన మూకుళ్ళనూ, ధూమపాత్రలనూ, శంఖాలవంటి పాత్రలనూ, హోమము చేసే స్రుక్స్రువాలనూ, అర్ఘ్యజలపాత్రలనూ, పేలాలు ఉన్న పాత్రలనూ, పచ్చటి అక్షతలు ఉన్న పాత్రలనూ ఆ వేదిక చుట్టూ చక్కగా అమర్చినాడు.

ఆ వేదికలో అగ్నిహోత్రాన్ని ఉంచినాడు. హెచ్చుతగ్గులు లేకుండా సరిసమానముగా ఉన్న దర్భలను యథాశాస్త్రముగా సమంత్రకముగా పరచినాడు. వధూవరుల అభ్యుదయము కోసము వైదిక మంత్రాలతో హోమము చేయసాగినాడు.

అప్పుడు జనకమహారాజు సర్వాభరణభూషిత అయిన సీతను వెంటపెట్టుకొని వచ్చి అగ్నిహోత్రము దగ్గర రాముడి ఎట్టఎదుట నిలుచుండ పెట్టినాడు.

"రామా! ఇదిగో సీత, నా కూతురు. ఇక నీకు సహధర్మచారిణి, సమ్మతించవలెను. నీకు శుభము అవుతుంది. నీ చేతితో ఈమె చేయిపట్టుకో, పతివ్రత అవుతుంది. మహాభాగ్యవంతురాలుగా ఉంటుంది. ఎప్పుడూ నీవెంట నీడవలె తిరుగుతుంది" అంటూ రాముడి చేతిలో సమంత్రకముగా నీళ్ళు వదిలినాడు.

జనకమహారాజు మంత్రోదకాలతో సీతను ఒప్పచెప్పి సంతోషముతో ఉప్పొంగిపోయి, "ఓ లక్ష్మణా! నీకు ఈ ఊర్మిళను ఇస్తున్నాను, అంగీకరించు. ముహూర్తము మించిపోతుంది. ఆలస్యము చేయవద్దు. ఈమె చేతిని నీ చేతితో పట్టుకో. ఓ భరతుడా! ఈ మాండవి చేతిని నీ చేతితో పట్టుకో. ఓ శత్రుఘ్నా! ఈ శ్రుతకీర్తి చేతిని నీ చేతితో పట్టుకో.

"ఓ సౌమ్యులారా! మా కూతుళ్ళు మీకు ఇల్లాండ్లు అవుతున్నారు. ముహూర్తానికి ఆలస్యము లేదు" అంటూ ఉండగా, వశిష్ఠమహర్షి అనుమతితో ఆ నల్గురు అన్నదమ్ములూ ఆ నల్గురు అక్కచెల్లెండ్ల చేతులూ పట్టుకొని అగ్నిహోత్రానికిన్నీ, జనకమహారాజుకున్నూ, మహర్షులకున్నూ ప్రదక్షిణము చేసినారు.

అప్పుడు అంతరిక్షమునుంచి మహాశోభాయమానముగా పూలవాన కురిసింది. దేవదుందుభులు మోగినవి. అప్సరసలు ఆడినారు. గంధర్వులు పాడినారు. నృత్యగీత వాద్యాదులు చెలరేగుతూ ఉండగా, ఆ నలుగురు వధూవరులు అగ్నిహోత్రాలకు ముమ్మారు ప్రదక్షిణముచేసి వివాహకలాపము పూర్తిచేసినారు.

ఆ నల్గురు తేజోవంతులూ వారి వారి భార్యలతో విడిదికి బయలుదేరినారు. దశరథమహారాజు వారి వైభవము చూస్తూ మహర్షులతోనూ, బంధుమిత్ర పరివారముతోనూ వారి వెంట నడిచినారు.

74

ఆ రాత్రి ఇట్టే గడిచిపోయింది. తెల్లవారింది. విశ్వామిత్రమహర్షి రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులనూ, వారి భార్యలనూ ఆశీర్వదించాడు. దశరథమహారాజుకు వీడ్కోలు చెప్పి, హిమవత్పర్వత ప్రాంతానికి ప్రయాణము అయిపోయినాడు.

విశ్వామిత్రమహర్షి వెళ్ళిపోగానే దశరథమహారాజుకూడా సపరివారముగా అయోధ్యానగరానికి బయలుదేరినాడు. అప్పుడు జనకమహారాజు తన నల్గురు కూతుళ్ళకూ ఎన్నెన్నో పట్టుచీరెలూ, మంచిమంచి శాలువలూ, అనేకలక్షల ఆవులూ, అలంకరించిన గుర్రాలూ, రథాలూ, ఏనుగులూ, వాటితోపాటు కాల్బలాన్నీ ఇచ్చినాడు. చక్కచక్కని దాసదాసీజనాన్నీ, వెండి బంగారు నాణాలనూ, ముత్యాలూ, పగడాలూ మొదలు అయిన వాటిని లక్షలకొద్దీ అరణము ఇచ్చినాడు.

దశరథమహారాజును సాగనంపడానికి ఆయన కొంతదూరము పోయినాడు. అందరికీ వీడుకోలు చెప్పి జనకమహారాజు తిరిగి మిథిలానగరానికి వచ్చినాడు.

పరశురామ గర్వభంగము

దశరథమహారాజు కొడుకులతోనూ, కోడండ్లతోనూ, మహర్షులతోనూ, చతురంగబలాలతోనూ సాగిపోతూ ఉన్నాడు. అప్పుడు ఆయన ఎట్టఎదుట దుర్నిమిత్తాలు తోచినవి. వశిష్ఠమహర్షిని చూచి, "ఓ మహానుభావా! మహాభయంకరము అయిన పక్షులు ఆకాశములో తిరుగుతూ ఘోరముగా కూస్తూ ఉన్నవి. భూమిమీద ఆ యా జంతువులు మనకు ప్రదక్షిణముగా వస్తూ ఉన్నవి. నా గుండెలు ఆవిసిపోతున్నవి. దిగులు వేస్తూ ఉంది. దీనికి కారణము ఏమిటి" అని ప్రశ్నించినాడు.

వశిష్ఠమహర్షి, "రాజా! ఇందుకు ఫలము చెప్పుతున్నాను, విను. ఆకాశములో సంచారముచేస్తూ ఉన్న పక్షుల కూతలనుంచి ఇప్పుడు మనకు ఏదో భయంకరావస్థ సంప్రాప్తము అవుతుంది. అయితే, భూమిమీద మనకు ప్రదక్షిణముగావస్తూ ఉన్న మృగాలనుంచి ఆ భయంకరావస్థ ఉపశమించిపోతుంది" అన్నాడు.

ఈ పృథ్విని అంతా కదిలించేట్లుగా గాలి వీచింది. అప్పటికి అప్పుడు మహోన్నత వృక్షాలు నేలకూలినవి. సూర్యుడు కనబడకుండా ఇట్టే చీకట్లు కమ్ముకొన్నవి. దిక్కులు తెలియకుండా పోయినవి. ఆ గాలికి రేగిన దుమారములో చతురంగ సేనలు కూరుకొనిపోయినవి. సైనికులు అందరూ సొమ్మసిల్లిపోయినారు.

వశిష్ఠుడు మొదలు అయిన మహర్షులున్నూ, దశరథమహారాజూ, ఆయన నలుగురు కొమాళ్ళూ తప్ప తక్కినవారు అందరూ విచేతనులు అయిపోయినారు. ఇంకా చీకట్లు అలుముకొన్నవి. ఈ జగత్తును అంతా నల్లటి మసి కప్పినట్లు అయిపోయింది.

ఆ చిమ్మచీకటిలో కళ్ళు మిరుమిట్లు కొలిపే కాంతులు బయలుదేరినవి. ప్రళయకాలాగ్నివలె దుస్సహము అయిన వేండ్రము వేసింది. దుర్ధర్షము అయిన కైలాసపర్వతమువలె ఒక భయంకరాకారుడు వారి కళ్ళకు పొడగట్టినాడు. ఆయన తలనిండా దట్టమయిన జడలు పెరిగి ఉన్నవి. భుజముమీదనుంచి గండ్రగొడ్డలి వ్రేలాడుతూ ఉంది. మెరుపుల మాదిరిగా మెరుస్తూ ఉన్న బాణాలూ, విల్లూ పట్టుకొని త్రిపురాసురసంహారానికి పోతూ ఉన్న ఫాలాక్షుడి మాదిరిగా వారి ఎట్టఎదుట నిలుచున్నాడు. ఆయన రాజరాజులను అందరినీ మర్దించిన పరశురాముడు.

అగ్నిహోత్రము మాదిరిగా జ్వలిస్తూ ఉన్న ఆ భార్గవరాముణ్ణి చూచి, జపహోమపరాయణులు అయిన వశిష్ఠాదిమహర్షులు అందరూ, "ఈ పరశురాముడు తన తండ్రిని ఒక క్షత్రియుడు చంపినాడు అనే కోపముతో పూర్వము క్షత్రియులను అందరినీ సంహారము చేసినాడు. క్షత్రియులమీద కోపతాపాలు ఈయనకు ఇదివరకే తీరిపోయినవి. ఇప్పుడు మళ్ళీ ఎందుకు బయలుదేరినాడో! క్షత్రసంహారానికి మాత్రము వచ్చి ఉండడు" అనుకొన్నారు.

అంతట మహర్షులు అందరూ అర్ఘ్యాదులు తీసుకొనిపోయి ఆ భయంకరాకారుణ్ణి చూచి, "రామా, ఓ భార్గవరామా!" అంటూ మనోహరముగా సంబోధించి అర్ఘ్యము ఇచ్చినారు.

ఆ ఘోరాకారుడు ఆ అర్ఘ్యాన్నీ, పూజాద్రవ్యాలనూ అందుకొని దశరథరాముడి వంక చూడసాగినాడు.

75

"ఓ దాశరథీ! నీ అద్భుతపరాక్రమాన్ని గురించి విన్నాను. శివధనుస్సును విరిచివేయడమూ విన్నాను. నీ కోసము ఇక్కడికి వచ్చినాను. నేను ఇప్పుడు మరిఒక చక్కని విల్లు తెచ్చినాను. ఇది నా తండ్రి జమదగ్నిది. దీనిలో నీవు బాణము ఎక్కించి నీ బలము ఇప్పుడు చూపించవలెను. నేను మెచ్చుకొంటాను. నీవు ఈ వింటిని ఎక్కుపెట్టకలిగేట్టు అయితే, నీ ఒక్కడితోటే యుద్ధము చేస్తాను" అన్నాడు పరశురాముడు.

ఈ మాటలకు దశరథమహారాజు ముఖము వెలావెలా పోయింది. దీనుడు అయిపోయి, "ఓ భార్గవరామా! నీకు క్షత్రియులమీద కోపము ఎప్పుడో తీరిపోయింది. ప్రశాంతచిత్తుడవు అయినావు. నీవు బ్రాహ్మణుడవు. మహాయశస్వివి. నా పుత్రులు పసివాండ్లు. నీవు వాండ్లను కాపాడవలెను. ఓ పరశురామా! ఎప్పుడూ వేదాధ్యయనము చేసుకొంటూ, చాంద్రాయణవ్రతాలు పట్టుతూ ఉండే భార్గవుల వంశములో పుట్టినావు. శస్త్రాస్త్రాలను వదలిపెట్టుతున్నాను అని దేవేంద్రుడి ఎదుట ప్రతిజ్ఞ చేసినావు. ధర్మపరాయణుడవు అయిపోయి ఈ వసుంధరను అంతా కాశ్యపుడికి దానము ఇచ్చి

వేసినావు. మహేంద్రపర్వతముమీద తపస్సు చేసుకుంటూ ఉన్న నీవు, ఇప్పుడు మా సర్వనాశనానికి వచ్చినట్టుగా ఉన్నావు. ఒక్క రాముడితోటే యుద్ధము చేస్తాను అంటున్నావు. వాడికి ఏ అపాయము వచ్చినా మేము ఎవరమూ బ్రతుకము" అన్నాడు దశరథమహారాజు.

ఈ మాటలు వినిపించుకోకుండా దశరథమహారాజును అలక్ష్యముచేసి రాముడితో పరశురాముడు ఇట్లా చెప్పినాడు :

"ఓ దాశరథీ! నీవు విరచిన విల్లూ, ఇప్పుడు నేను తెచ్చిన ఈ విల్లూ దేవలోకములోనివి. రెండూ గొప్పవి. శ్రేష్ఠమయినవి. ముఖ్యమయినవి. గట్టివి. సారము కలవి. వీటిని రెంటినీ విశ్వకర్మ ప్రత్యేకముగా నిర్మించినాడు. ఈ రెంటిలో ఒకదానిని త్రిపురాసుర సంహారము కోసము దేవతలు శివుడికి ఇచ్చినారు. రెండవ దానిని విష్ణుమూర్తికి ఇచ్చినారు. నీవు విరిచివేసింది శివధనుస్సు. ఇప్పుడు నేను తెచ్చిన ఈ పరమభాస్వరము అయిన ధనుస్సు విష్ణుమూర్తిది.

"త్రిపురాసుర సంహారము అయిపోయిన తరువాత శివకేశవుల బలాబలాలను దేవతలు తెలుసుకోవలెను అనుకొన్నారు. ఎవరు ఎక్కువ బలవంతులు అని బ్రహ్మదేవుణ్ణి ప్రశ్న చేసినారు. ఆయన సత్యసంధుడు. శివకేశవుల బలాబలాలను స్వయముగా చెప్పడానికి ఇష్టము లేకపోయింది. అందువల్ల, శివుడికీ, విష్ణువుకూ విరోధము పెట్టినాడు. వారికి విరోధము పెచ్చుపెరిగిపోయింది. పరస్పర విజిగీషులు అయినారు. యుద్ధముచేయ నారంభించినారు.

"ఆ యుద్ధము భయంకరముగా సాగింది. విష్ణుమూర్తి అంతట హుంకారము చేసినాడు. ఆ హుంకారానికి శివుడి ధనుస్సు కట్టిపారిపోయింది. త్రిలోచనుడు స్తబ్ధుడు అయి నిలుచున్నాడు.

"దేవతలూ, మహర్షులూ మొదలయినవారు అందరూ శివకేశవులు ఉభయులూ ప్రశాంతులు అయ్యేటందుకు ప్రార్థించినారు. శివుడు ఆ వింటిని బాణముతో కూడా దేవతలచేత విదేహరాజు అయిన దేవరాతుడికి ఇప్పించినాడు. ఆ శివధనుస్సును నీవు విరిచివేసినావు.

నా దగ్గర ఉన్న విల్లు విష్ణుమూర్తిది. దీనిని విష్ణుమూర్తి ఋచీకమహర్షికి నిక్షేపముగా ఇచ్చినాడు. ఆ తేజస్వి దీనిని ఆయన కుమారుడు జమదగ్నికి ఇచ్చినాడు. ఆ జమదగ్ని నా తండ్రి. మహాత్ముడు. తపోబల సమన్వితుడు. ప్రతీకారము ఎరగనివాడు. అస్త్రసన్యాసము చేసిన మా తండ్రి జమదగ్నిని కార్తవీర్యార్జునుడు తామస బుద్ధితో చంపివేసినాడు. ఆ విధముగా అంత దారుణముగా ఎప్పుడూ ఎవరూ ఎవరినీ చంపి వేయరు. మా తండ్రి చావు నాకు తెలిసింది. పట్టరాని కోపము వచ్చింది. అంతట నేను

క్షత్రియవంశాలను అన్నిటినీ నిర్మూలనము చేయడానికి బయలుదేరినాను. అనేకమంది క్షత్రియులను సంహారము చేసినాను. ఈ భూలోకాన్ని అంతా నా స్వాధీనము చేసుకొన్నాను.

"అప్పుడు నేను ఒక యజ్ఞము చేసినాను. ఆ యజ్ఞములో ఈ భూభాగాన్ని అంతా మహాత్ముడూ, పుణ్యకర్ముడూ అయిన కాశ్యపుడికి దక్షిణ ఇచ్చివేసినాను. అంతట నేను మహేంద్ర పర్వతానికి వెళ్ళిపోయినాను. అప్పటినుంచి అక్కడ తపస్సు చేసుకొంటూ ఉన్నాను.

"ఓ దాశరథీ! నీవు శివధనుస్సును విరగగొట్టడము విన్నాను. నీ వీర్యము తెలుసుకోవలెను అని ఈ ధనుస్సుతో వచ్చినాను. ఇది వైష్ణవధనుస్సు. పరమ పూజ్యము అయింది. శ్రేష్ఠము అయింది. నాకు పితృపైతామహముగా సంక్రమించింది. నీవు క్షత్రియుడవు అయినట్లయితే, ఈ వింటిని తీసుకొని ఎక్కుపెట్టవలెను. నీవు దీనిని ఎక్కుపెట్టకలిగేట్లయితే నాతో నిన్ను ద్వంద్వయుద్ధము చేయనిస్తాను" అన్నాడు పరశురాముడు.

76

పరశురాముడు చెప్పింది అంతా రాముడు విన్నాడు. పితృసాన్నిధ్యగౌరవము వల్ల నియమితముగా మాట్లాడతలచి, "ఓ భార్గవా! నిన్ను గురించి ఇదివరకే విన్నాను. నీవు పితృఋణము తీర్చినావు. ఆ విషయములో మేము అందరమూ నిన్ను అనుసరించవలసిందే. కాని, నేను వీర్యహీనుణ్ణి, అశక్తుణ్ణి అనుకొని నన్ను అవమానిస్తున్నావు. నా క్షాత్రము చూపించమంటున్నావు. ఇప్పుడే నా తేజమూ, నా పరాక్రమమూ చూపిస్తాను" అంటూ రాముడు కోపోద్రేకముతో పరశురాముడి చేతిలో ఉన్న వింటినీ, అంబునూ ఊడలాగుకున్నాడు. ఆ వింటిని ఇట్టే వంచి అల్లె తాటిని ఎక్కించినాడు. బాణము సంధించినాడు. క్రుద్ధుడు అయినాడు.

"ఓ పరశురామా! నీవు బ్రాహ్మణుడవు అయిపోయినావు. అందులో పూజ్యపాదులు అయిన విశ్వామిత్రమహర్షులకు బంధువు అయిపోయినావు. అందువల్ల ప్రాణాలు తీసివేసే ఈ బాణాన్ని నీమీద వదలలేకుండా ఉన్నాను. ఓ భార్గవా! ఈ ధనుస్సు దేవలోకములోనిది అనీ, శత్రుపురాలు అన్నిటినీ జయించింది అనీ, ఎవరి బలదర్పాలను అయినా నాశనము చేసివేస్తుంది అనీ నీవే చెప్పినావు. కాబట్టి, ఈ బాణము వ్యర్థముగా నేలపాలయి పోకూడదు. ఇప్పుడు ఈ బాణముతో నీ పాదగమన శక్తిని ఖండించవలెనో, నీవు తపోబలముతో సంపాదించిన పుణ్యలోక ప్రాపణశక్తిని హరించవలెనో, నీవే చెప్పు" అన్నాడు రాముడు.

వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టి దివ్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న రాముణ్ణి చూడటానికి అప్పుడు బ్రహ్మదేవుడూ, మహర్షులూ, దేవతలూ, యక్ష, గరుడ,

గంధర్వ, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్యచారణులూ గుంపులు గుంపులుగా అక్కడికి వచ్చినారు. అప్పుడు ఈ భూమి అంతా స్తంభించిపోయింది.

పరశురాముడు నిర్వీర్యుడు అయిపోయినాడు. రాముడి ఎదుట ఆయన తేజస్సు అంతా అంతరించిపోయింది. జడుడు అయిపోయి రామున్ణి చూస్తూ మందముగా, "ఓరామా! నేను ఈ భూమిని అంతా కాశ్యపుడికి దానము ఇచ్చినాను. నేను ఈ దేశములో ఉండకూడదు అని ఆయన శాసించినాడు. అప్పటినుంచీ రాత్రిపూట ఈ భూమిమీద ఉండడము లేదు. ఇప్పుడు చీకటి పడిపోతున్నది. ఇక నేను మనోవేగముతో మహేంద్రపర్వతానికి వెళ్ళిపోవలెను. కాబట్టి, నా పాదగతిని ఖండించవద్దు. నేను తపోబలముతో అప్రతిమాన పుణ్యలోకాలను జయించినాను. ఆ శక్తిని నీ బాణముతో ఇప్పుడు హరించివేయి.

"ఓ దాశరథీ! నీవు ఈ ధనువు ఆరోపించినప్పుడే నీవు అక్షయుడవు అనీ, మహావిష్ణువు అనీ అనుకొన్నాను. ఓ పరంతపా! నీకు మంగళము. నీవు అసదృశకర్ముడవు. అప్రతిద్వంద్వుడవు. నీవు సాక్షాత్తూ త్రైలోక్యనాథుడవు. ఇటువంటి నీవల్ల నాకు పరాభవము అయింది కాబట్టి నేను సిగ్గుపడ నవసరము లేదు. దేవతలు అందరూ నిన్ను చూడవచ్చినారు.

"ఓ సువ్రతా! నీ చేతిలో ఉన్న అసదృశ బాణాన్ని వదిలిపెట్టు. నేను మహేంద్రగిరికి వెళ్ళిపోతాను" అన్నాడు పరశురాముడు.

దశరథరాముడు ఆ బాణాన్ని వదిలినాడు.

పరశురాముడి స్వార్జిత పుణ్యలోక ప్రాపణశక్తి ఆ రామబాణముతో హతము అయిపోయింది.

పరశురాముడు దశరథరామున్ణి ప్రశంసించి, ప్రదక్షిణముచేసి మహేంద్ర పర్వతానికి వెళ్ళిపోయినాడు. అప్పుడు అన్ని దిక్కులా చీకట్లు విచ్చిపోయినవి.

దేవతలు ఆ ధనుర్ధరున్ణి దశరథరామున్ణి స్తోత్రము చేసినారు.

77

రాముడు ప్రశాంతుడు అయినాడు. ఆ వింటినీ, అంబునూ వరుణదేవుడికి ఇచ్చివేసినాడు.

అక్కడ ఉన్న వశిష్ఠుడు మొదలయిన మహర్షులు అందరికీ నమస్కారము చేసినాడు. భయవిహ్వలుడు అయిఉన్న దశరథమహారాజును చూచి, "తండ్రీ! పరశురామున్ణి వరుగెత్తించినాను. వానచినుకుల కోసము ఎదురుచూచే చాతకపక్షుల వలె, తమ చతురంగబలాలు అయోధ్యానగరము పోవడానికి తమ ఆజ్ఞ కోసము ఎదురుచూస్తున్నవి" అన్నాడు.

అంతట దశరథమహారాజు రామున్ని గట్టిగా కౌగలించుకొని శిరము ఆఘ్రాణించినాడు. సంతోషాతిశయముతో ఆయన దేహము అంతా పులకలెత్తింది. రాముడు పునర్జన్మ ఎత్తినట్టు భావించినాడు. అప్పుడు శీఘ్రముగా అయోధ్యానగరానికి వెళ్ళిపోవలెను అని దశరథమహారాజు సేనలను ఆజ్ఞాపించినాడు.

దశరథమహారాజు కొడుకులతోనూ, కోడండ్లతోనూ అయోధ్యానగరము వస్తూ ఉన్నాడు అని పౌరులకు వర్తమానము వచ్చింది. అయోధ్యానగరవాసులు గబగబా పెద్దపెద్దవి, చిన్నచిన్నవి జండాలు ఎత్తినారు. రాజవీధులు అన్నిటా కలాపి చల్లి ఘుమఘుమలాడే పూలతో అలంకరించినారు. పట్టణము అంతా సింగారించినారు. పౌరముఖ్యులూ, బ్రాహ్మణముఖ్యులూ మహారాజుకు స్వాగతము చెప్పడానికి ముందుగా కొంతదూరము ఎదురుగుండా వచ్చినారు.

శ్రీమంతులు అయిన కొమాళ్ళతోనూ, కోడండ్లతోనూ దశరథమహారాజు అయోధ్యానగరము చేరినాడు. మంగళవాద్యాలు మారుమోగిపోయినవి. పౌరులూ, జానపదులూ బారులుతీరి వీధులలో నిలుచుని చూచి సంతోషించినారు.

దశరథమహారాజు హిమవత్పర్వమువంటి తన రాజభవనములోనికి పోయినాడు. అంతఃపురవాసులు అందరూ అమితానందముతో ఎదురువచ్చి, గంధపుష్పాదులు ఇచ్చి గౌరవించి లోపలికి తీసుకొని పోయినారు.

అంతట కౌసల్యాదేవీ, సుమిత్రాదేవీ, కైకేయీదేవీ, ఇంకా ఇతర రాజాంగనలూ వచ్చి తమ కోడండ్లను సీతా ఊర్మిళా మాండవీ శ్రుతకీర్తులను చూచి సంతోషపడి, ఆదరించి లోపలికి తీసుకొనిపోయినారు. ఆ అత్తలు ఆ కోడండ్లను స్నానము చేయించినారు. వారికి చందనచర్చ చేయించినారు. పట్టుచీరెలు కట్టించినారు. సొమ్ములు అన్నీ పెట్టించినారు. అంతట వారిని ఆ రాజభవనములో ఉన్న దేవ మందిరాలకు తీసుకొనిపోయినారు. ఆ యా దేవతలను ఆ నలుగురు కోడండ్లూ పూజ చేసినారు. దైవసమక్షములో అత్తగార్లకూ, పెద్దలకూ నమస్కారము చేసి, అత్తగార్లతో బయలుదేరి కుబేరభవనమువలె ఉన్న ఆ రాజభవనములో తమ తమ మందిరాలకు పోయినారు. బ్రాహ్మణోత్తములను రావించి వారికి ధనమూ, గోధనమూ, ధాన్యమూ ఇచ్చి సంతోషపెట్టినారు. ఆ బ్రాహ్మణులు అందరూ వారిని ఆశీర్వదించి నారు. వారు అటు తరువాత వారి వారి భర్తలను ఏకాంతముగా కలుసుకొన్నారు.

కొన్నాళ్ళు అయిన తరువాత దశరథమహారాజు భరతున్ని చూచి, "నాయనా భరతా! నీ మేనమామ యుధాజిత్ నిన్ను తీసుకొనిపోవడానికి వచ్చి యున్నాడు. మిథిలానగరమునుంచే నిన్ను పంపించమని అడిగినాడు. నీవు ఆయనవెంట వెళ్ళి రావలెను. నీ తాతా సంతోషపడుతాడు" అన్నాడు.

భరతుడు ప్రయాణము అయినాడు. తల్లులకూ, తండ్రికీ, రాముడికీ నమస్కారము చేసినాడు. లక్ష్మణుణ్ణి కౌగలించుకొన్నాడు. పోయివస్తాను అని వీడ్కోలు, చెప్పి శత్రుఘ్నుణ్ణి వెంటపెట్టుకొని మేనమామతో గిరివ్రజపురానికి ప్రయాణము అయిపోయినాడు.

భరతశత్రుఘ్నులు వెళ్ళిపోయిన తరువాత వారు లేని లోటు లేకుండా రామలక్ష్మణులు ఇద్దరూ నలుగురు పుత్రులవలె తండ్రికి సేవచేయసాగినారు.

రాముడు పితృాజ్ఞను శిరసావహించి అయోధ్యాపౌరుల మంచి చెడ్డలను విచారిస్తూ, పౌరహిత కార్యాలలో నిరంతరమూ నిమగ్నుడు అయినాడు. అట్లా ఆ యా వ్యవహారాలు చక్కపెట్టుతూ ఉన్నాడు. తల్లులకూ, గురువులకూ, ఇంకా ఇతర పెద్దలకూ ఏ ఏ సమయాలలో ఏ ఏ పనులు చేయవలెనో, ఆ యా పనులు అన్నిటినీ ఆ యా సమయాలలో ఏ మాత్రమూ ఏమరపాటు లేకుండా నిర్వహిస్తూ ఉండేవాడు.

రాముడి రాజ్యకార్య నిర్వహణా చాతుర్యానికి అయోధ్యానగరవాసులే కాకుండా దేశాంతర వర్తకులూ మెచ్చుకుంటూ ఉండేవారు.

ఎన్నో రాజకార్యాలు ఎంతో నిపుణముగా నిర్వహిస్తూ ఉన్నా, రాముడి మనస్సు ఎప్పుడూ సీతమీదనే ఉండేది. ఆమెతో ఆ యా ఋతూచిత సమస్త సుఖాలు అనుభవిస్తూ ఉండేవాడు. రాముడికి సీతమీద అంత మక్కువకు కారణము, ఆమె తన సౌజన్య సౌందర్య సౌశీల్య సద్గుణాలతో సంతోషపెట్టుతూ ఉండడము వల్లనే కాదు, తన తండ్రి దశరథమహారాజు చూచి, ఆలోచించి, సమాధానపడి చేసిన భార్య అయినందువల్లనే.

రాముడికి సీతమీదకన్నా సీతకు రాముడిమీద అనురాగము ద్విగుణముగా ఉండేది. అయితే, ఆమె హృదయములో నిగూఢముగా ఉండే విషయాలనుకూడా రాముడు ఇట్టే కనిపెట్టేవాడు.

ఆమె మైథిలి. మైథిలీదేశవాసులకు పరేంగితజ్ఞానము అపారము. ఆమె జనకరాజపుత్రి. అందువల్ల, ఆమె యుక్తాయుక్త వివేచనాశక్తి అనంతము.

ఆమె దేవకన్నెలతో సరిసమానము అయిన రూపసి. మహాలక్ష్మీదేవి అంతటి ప్రగల్భ. అందువల్ల, రాముడి మనోగతము రాముడి కన్నా ఎక్కువగా ఆమెకు తెలుస్తూ ఉండేది.

ఆ ఉత్తమ రాజకన్యతో, ఆ మహాసౌందర్యవతితో, ఆ గాఢానురాగవతితో రాముడు మహాలక్ష్మీసమేతుడు అయిన మహావిష్ణువువలె విరాజిల్లినాడు.

బాలకాండ సమాప్తము

అయోధ్యకాండ

అయోధ్యకాండ

1

భరతుడు మేనమామ ఇంటికి ప్రయాణము అయిపోతూ శత్రుఘ్నుణ్ణి తోడు రమ్మన్నాడు. శత్రుఘ్నుడు జితేంద్రియుడు. బుద్ధిమంతుడు. ఆ అన్నగారిమీద అతనికి ఉన్న ప్రేమాతిశయమునుంచి గిరివ్రజపురానికి తోడుగా పోయినాడు.

అక్కడ భరతుడి మేనమామ యుధాజిత్ భరతుణ్ణి, శత్రుఘ్నుణ్ణి తాను కన్న బిడ్డలవలె ఆదరించినాడు. చక్కగా సత్కరించినాడు. వారు కోరుకొన్నవి అన్నీ ఇచ్చి సంతోషపెట్టినాడు. సుఖపెట్టినాడు. అక్కడ ఆ అన్నతమ్ములు ఆట్లా ఎంతో సంతోషముగానూ, సుఖముగానూ ఉంటూ ఉన్నా, వృద్ధుడు అయిన తమ తండ్రి దశరథమహారాజును గురించే ఆలోచించసాగినారు.

దశరథమహారాజున్నూ దేశాంతరములలో ఉన్న ఇంద్రవరుణులవంటి ఆ భరత శత్రుఘ్నులను గురించే ఆలోచించడము మొదలు పెట్టినాడు. ఆయనకు నలుగురు కొడుకులూ నాలుగు చేతులవంటివారు. నలుగురూ ఇష్టులే. అయితే మహావిష్ణువుకు దేవతలు అందరిలోనూ బ్రహ్మదేవుడు అంటే ఎక్కువ ఇష్టము. అదే విధముగా, దశరదథమహారాజుకు నలుగురు కొడుకులలోనూ రాముడు అంటే ఎక్కువ ఇష్టము.

శ్రీరాముని మూర్తిమత్వము

ఇంతకూ మహావిష్ణువే రాముడు. మదోన్మత్తుడు అయిన రావణుణ్ణి సంహారము చేయవలసింది అని దేవతలు ప్రార్థిస్తే మానవ జన్మము ఎత్తినాడు. అందువల్లనే, దేవలోకములో దేవేంద్రుణ్ణి కన్న అదితివలె, ఈ మానవలోకములో రాముణ్ణి కన్న కౌసల్యాదేవి శోభించింది. అటువంటి అనుపమానము అయిన పుత్రుడు ఈ భూలోకములో ఎవరికీ పుట్టలేదు అని దశరథమహారాజు సంతోషపడ్డాడు.

దశరథమహారాజుకు ఉన్న సద్గుణాలు అన్నిటితోటీ రాముడు పుట్టినాడు. అతడు సుందరాకారుడు. పరమపరాక్రమవంతుడు. అసూయలేనివాడు. ఎప్పుడూ ప్రశాంత చిత్తముతో ఉండేవాడు. ఎవరు ఎంత పరుషముగా మాట్లాడినా, మృదువుగా

జవాబు చెప్పేవాడు. ఎవరు ఎందుకు, ఏ కొంచెము ఉపకారము చేసినా సంతోషపడేవాడు. నూరు అపకారాలు చేసినా జ్ఞాపకము ఉంచుకొనేవాడుకాదు. ఎడతెగకుండా అస్త్రాభ్యాసముచేస్తూ, విరామ సమయాలలో శీలవృద్ధులతో సదాచారాలను గురించీ, వయోవృద్ధులతో పరంపరాగత సత్సాంప్రదాయాలను గురించీ, జ్ఞానవృద్ధులతో వేదాంత రహస్యాలను గురించీ చర్చించి తెలుసుకొంటూ ఉండేవాడు.

అతడు మహాబుద్ధిమంతుడు. మధురభాషి. ఎవరిని అయినా అతడే ముందుగా పలుకరించేవాడు. సంతోషపెట్టే సంగతులే మాట్లాడేవాడు. అమిత వీర్యవంతుడు. అయినప్పటికి, ఎన్నడూ విర్రవీగి ఎరుగడు. అబద్దాలు ఆడేవాడుకాదు. పెద్దలను ఎప్పుడూ గౌరవించేవాడు. ప్రజలను రంజింపచేసేవాడు. ప్రజలున్నూ అతణ్ణి అమితముగా ప్రేమించేవారు. అతడు విద్వాంసుడు. ధర్మజ్ఞుడు. దయాశాలి. కోపాన్ని జయించినవాడు. ఎప్పుడూ దృఢనియమముతో ఉండేవాడు. పరిశుద్ధుడు. బ్రాహ్మణులను పూజించేవాడు. దరిద్రులను దయతో చూచేవాడు. ఇక్ష్వాకు వంశోచితము అయిన దయాదాక్షిణ్యశరణాగతరక్షణాది ధర్మాలు అన్నీ అతనిలో మూర్తీభవించినవి. అతడు క్షత్రధర్మమే తనకు ముఖ్యము అయింది అనీ, ఆ క్షత్ర ధర్మానుష్ఠానమువల్లనే యశస్సూ, స్వర్గసౌఖ్యమూ తనకు సంప్రాప్తము అవుతవి అనీ నిశ్చయించుకొన్నాడు.

అతడు ఎన్నడూ చెడువిషయాలలోకి అంటే, జూదమూ మొదలయిన వ్యసనాలలోకి మనస్సు పోనిచ్చేవాడుకాడు. ధర్మవిరుద్ధమైన గ్రామ్యసంభాషణకు చోటు ఇచ్చేవాడుకాడు. ఏవిషయములో నయినా బృహస్పతివలె యుక్తికి పైయుక్తి చెప్పేవాడు. ఎప్పుడూ మంచిదేహదార్ఢ్యముతో ఉండేవాడు. అనారోగ్యము ఎన్నడూ ఎరుగడు. అతడు వాగ్మి. దేశకాలవిదుడు. చూచీచూడడముతో ఎదుటివారి మనస్సు కనిపెట్టేవాడు. ప్రజలు అందరికీ బహిఃప్రాణముగా ఉండేవాడు. సాంగముగా వేదాధ్యయనము చేసినాడు. విద్యావ్రతస్నాతుడున్నూ అయినాడు. ఈ లోకములో అతడు ఒక్కడే సత్పురుషుడు అనిపించుకొన్నాడు. భుజబలముకొద్దీ బాణాలు వదలడములోనూ, మంత్రసహితముగా అస్త్రాలను వదలడములోనూ, తండ్రికన్నా గొప్పవాడు అయినాడు. పితృమాతృవంశాలకు రెంటికిన్నీ కులదీపకుడున్నూ అయినాడు. ఏదోషమూ లేనివాడు. ఎటువంటి కష్టకాలములోనయినా దిగులుపడేవాడుకాడు. ఆడితప్పేవాడు కాడు. ఋజువర్తనుడు. ధర్మార్థదర్శకులు అయిన బ్రాహ్మణుల దగ్గర సుశిక్షితుడు అయినాడు. ధర్మార్థకామ తత్వజ్ఞుడు.

రాముడు మరపులేనివాడు. అతడి బుద్ధి ఎప్పటికి అప్పుడు వికసిస్తూ ఉండేది. లౌకిక మర్యాదలూ, శిష్టాచారాలూ తెలుసుకొన్న పండితుడు. వినయాన్వితుడు.

హావభావాదులవల్ల తన మనోనిశ్చయాన్ని ఇతరులకు తెలియనిచ్చేవాడు కాడు. అతని ఆలోచనలు ఫలపర్యంతమూ ఎవరికీ బోధపడేవికావు. అతని కోపముకానీ, అతని సంతోషముకానీ ఎన్నడూ వ్యర్థము అయిపోయేదికాదు.

అతనిది దృఢము అయిన గురుభక్తి. స్థిరము అయిన ప్రజ్ఞ. దుర్మార్గులను చేరనిచ్చేవాడుకాడు. ఒక్క దుష్టవాక్కు తన నోటివెంట రానిచ్చేవాడుకాడు ఆలస్యము అనేది అతడికి లేదు. ఏమరుపాటు ఎరుగడు. తన దోషము ఏదో ఇట్టే గుర్తించేవాడు. చూడగానే మనుష్యుల తారతమ్యాలను తెలుసుకొనేవాడు. కృతజ్ఞుడు. శాస్త్రజ్ఞుడు. ఎవరిని అయినా చేరతీయడములోనూ, ఆ చేరతీసినవారిని ఆదరించడము లోనూ అతిసమర్థుడు. పెద్దలతో స్నేహము చేయడములోనూ, స్నేహము చేసిన పెద్దలను నిలుపుకొనడములోనూ పండితుడు. దుష్టులను నిగ్రహించడములో నిపుణుడు. ధనార్జనోపాయాలు అన్నీ తెలిసినవాడు. శాస్త్రీయముగా వ్యయము చేయడమున్నూ తెలిసినవాడు.

అతడు న్యాయ వైశేషిక వేదాంత వ్యాకరణ మీమాంసాది శాస్త్రాలనూ, సంస్కృత ప్రాకృతాది షడ్భాషలలో కావ్యనాటకాదిగ్రంథాలనూ కరతలామలకము చేసికొన్నాడు. ధర్మలోపమూ, అర్థలోపమూ లేకుండా సుఖము అనుభవించేవాడు. అలసుడుకాడు. విహారప్రయోజనము, సంగీతము, చిత్రరచనము మొదలు అయిన వినోదాలు అన్నీ తెలిసినవాడు. అర్థవిభాగము - అంటే ధర్మముకోసమూ, యశస్సుకోసమూ, లౌకిక వ్యవహారముకోసమూ, తనకోసమూ తన బంధుమిత్రుల కోసమూ ధనాన్ని అయిదు భాగాలుచేసి వినియోగించడము ఎరిగినవాడు. ఏనుగులను, గుఱ్ఱాలను నడపడములోనూ, వాటిని శిక్షించడములోనూ సమర్థుడు. ధనుర్వేద నిదుఱలో శ్రేష్ఠుడు. అతిరథసమ్మతుడు. శత్రువులు ఎత్తివచ్చేవరకూ ఊరక ఉండేవాడుకాడు. ఆతడే వారికి ఎదురుగుండాపోయి పోరాడి గెలిచివచ్చేవాడు. సేనలను నడపడములో ఆరితేరినవాడు. సురాసురులు ఏకము అయి ఎత్తివచ్చినా అతణ్ణి ఎదిరించలేరు. ఆతడు ఇతరులను నెపము ఎన్నేవాడుకాడు. కోపపరవశుడు అయ్యేవాడుకాడు. గర్వపడేవాడుకాడు. ఎవరినీ నిందించేవాడుకాడు. కాలానికి కట్టుపడేవాడుకాడు. మత్సరము లేనివాడు. సూర్యుడు తన అనంతకిరణాలతో తేజరిల్లినట్టు, ఇటువంటి లోకోత్తరగుణాలతో రాముడు తేజరిల్లినాడు. సర్వప్రజాకాంతుడు అయినాడు. ముల్లోకాలవారికి పూజ్యుడు అయినాడు. ఆ అప్రధృష్యపరాక్రమవంతుణ్ణి, ఆ ఆశ్రిత రక్షణవ్రతసంపన్నుణ్ణి, లోకపాలకులతో సరిసమానము అయిన ఆ రాముణ్ణి భూదేవి తనకు ప్రభువుగా వరించింది అనుకొన్నాడు దశరథమహారాజు.

పట్టాభిషేక నిర్ణయము

ఆ మహానుభావుణ్ణి, రాముణ్ణి తాను జీవించి ఉండగా రాజును చేయడము ఎట్లాగా అని దశరథమహారాజు ఆలోచించడము మొదలుపెట్టినాడు. అట్లా ఆలోచిస్తూ "రాముడు లోకాభివృద్ధికాముడు. దయాసముద్రుడు. ప్రజల సంతాపాన్ని పోగొట్టడములో పర్జన్యుడివంటివాడు. పరాక్రమానికి యమశుక్రులవంటివాడు. బుద్ధికి బృహస్పతి వంటివాడు. ధైర్యానికి మేరుపర్వతమువంటివాడు. క్షమాగుణానికి భూమివంటివాడు. ప్రజలు అందరికీ నాకన్నా ఇష్టుడు. వాడు, రాముడు రాజ్యపాలనము చేస్తూవుంటే నేను చూచి సంతోషించి చనిపోవలెను" అని దశరథమహారాజు నిశ్చయించుకొన్నాడు.

ఈ విషయము దశరథమహారాజు మంత్రులు అందరితోనూ సంప్రదిస్తూ రాత్రిపూట నక్షత్రమండలములోనూ, పగటిపూట ఆకాశములోనూ, భూమిమీదనూ తనకు ఉత్పాతాలు భయంకరముగా కనబడుతున్నవి అనీ; తనకు బాగా వార్ధక్యము వచ్చింది అనీ; ప్రజాహితముకోసమూ, తన సంతోషముకోసమూ సర్వజన సంతాపహరుడూ, నిండుచంద్రునివలె సర్వలోకప్రియుడూ అయిన రాముణ్ణి యువరాజును చేయవలెను అనీ చెప్పినాడు. అందుకు మంత్రులు అందరూ అంగీకరించినారు.

రాముణ్ణి యువరాజును చేయవలసిన కాలము ఆసన్నము అయింది అని దశరథమహారాజూ, మంత్రులూ అంతట నిశ్చయించినారు. ఆ విషయము ఆలోచించి నిర్ణయించడానికి ఒక సభను సమావేశపరచవలెను అని దశరథమహారాజు అనుకొన్నాడు. నానానగరముఖ్యులనూ, జానపదముఖ్యులనూ, రాజముఖ్యులనూ ప్రత్యేకము ప్రత్యేకముగా ఆహ్వానించినాడు.

దూరదేశస్థులు అయినందువల్లనూ, వ్యవధిలేకపోయినందువల్లనూ, కేకయ మహారాజుకూ, జనకమహారాజుకూ ఆహ్వానాలు పంపించలేదు. వారు ఉభయులూ ఆ వృత్తాంతము ఆతరువాత విని, సంతోషిస్తారు అని దశరథమహారాజు అనుకొన్నాడు.

ఆహ్వానాలు అందుకొని వచ్చినవారి నందరినీ యథాయోగ్యముగా ఆభరణాదులు ఇచ్చి సన్మానించినారు. వారి వారి అర్హతలకు తగినట్లుగా విడుదులు చూపించినారు. దేవతలను బ్రహ్మదేవుడివలె, వారిని అందరినీ దశరథమహారాజు స్వయముగా చూచి గౌరవించినాడు. అంతట దశరథమహారాజు తన కొలువుకూటములో సభ చేసినాడు. ఆయనకు అభిముఖముగా రాజముఖ్యులూ, నానాపట్టణముఖ్యులూ, వివిధజనపదముఖ్యులూ వారివారికి నియమించిన ఆసనాలమీద కూర్చున్నారు. అంతమందీ చుట్టూ కూర్చొని ఉంటే, అప్పుడు దశరథమహారాజు సుధర్మామధ్యములో కూర్చున్న సహస్రాక్షుడివలె శోభిల్లినాడు.

2

దశరథమహారాజు తన కొలువుకూటములో సమావేశము అయిన సదస్యులను అందరినీ చూస్తూ మేఘగర్జనమువలెనూ, దుందుభిస్వనమువలెనూ సభాభవనము అంతా ప్రతిధ్వనిస్తూ గంభీరముగానూ, స్పష్టముగానూ, మనోహరముగానూ, ఆపాతమధురముగానూ, సంతోషజనకముగానూ, రాజలక్షణయుక్తముగానూ, లోకహితము కోసము ఈవిధముగా ప్రసంగించినాడు:

"మహాజనులారా! మా పూర్వీకులు అయిన రాజేంద్రులు అందరూ ప్రజలను తమ కన్నబిడ్డల మాదిరిగా కాపాడుతూ రాజ్యపాలనము చేసినారు. మా ఇక్ష్వాకు నరేంద్రులవల్లనే ఈ కోసలదేశము సుఖప్రదము అయిన రాజ్యము అయింది. ఉత్తమోత్తమము అయిన రాజ్యమున్నూ అయింది. ఇది మీకు అందరికీ తెలిసిన విషయమే.

"నేను మా పూర్వీకుల పంథాను అనుసరించి ఏమరుపాటులేకుండా, నా శక్తి కొద్దీ ఇంతవరకు మిమ్ములను కాపాడుతూ రాజ్యము ఏలినాను. లోకహితము కోసము ఈ శ్వేతచ్ఛత్రచ్ఛాయలలోనే నా వయస్సు అంతా చెల్లిపోయింది. నేను ఇప్పుడు వృద్ధుణ్ణి అయినాను. నా ఈ దేహము శిథిలము అయిపోయింది. ఇకను ఈ శిథిల దేహానికి విశ్రాంతి ఇవ్వవలెను.

"ధర్మసంస్థాపన రూపము అయిన రాజ్యభార నిర్వహణము సామాన్యము అయిన పనికాదు. రాజలక్షణాలతో పుట్టి జితేంద్రియుడు అయినవాడే, అనేక సాధనాలతో ధర్మసంస్థాపన రూపము అయిన రాజ్యభారము నిర్వహించ గలుగుతాడు. నేను ఈ రాజ్యభారాన్ని మోసి మోసి అలసిపోయినాను. ఈ వశిష్ఠాదిబ్రాహ్మణులనూ, మిమ్ములనూ ఒప్పించి ఈ రాజ్యభారము మరి ఒకరికి అప్పగించి, నేను విశ్రాంతి అనుభవించవలెను అనుకొంటున్నాను. నా జ్యేష్ఠపుత్రుడు రాముడు నా పోలికను పుట్టినాడు. నాకు ఉన్న గుణాలు అన్నీ వాడికి ఉన్నవి. వాడు పుష్యమి నక్షత్రములో పూర్ణచంద్రుడివలె విరాజిల్లుతున్నాడు. పరాక్రమానికి పురందరుడువంటివాడు. వాడు పరపురంజయుడు, పరమధార్మికుడు. ముల్లోకాలూ ఏలగల సమర్థుడు. వాడు మీకు తగిన ప్రభువు అవుతాడు. వాణ్ణి నేను ఇప్పుడు సంతోషముగా యువరాజును చేసి, ఈ రాజ్యభారము అంతా వాడిమీద ఉంచవలెను అనుకొన్నాను. నేను ఇక విశ్రాంతి అనుభవించ తలచినాను.

"నా ఈ ఆలోచన మీకు అందరికీ నచ్చేట్టయితే, నేను ఇట్లా చేయడము ఉచితము అని మీకు అందరికీ తోచేట్టయితే నేను ఈ పని చేస్తాను, లేకపోయేట్టయితే

ఈ పని చేయను. నన్ను సంతోషపెట్టడానికి మీరు ఇప్పుడు రామయువరాజ్యాభిషేకము ఒప్పుకో నవసరములేదు. మీరున్నూ ఆలోచించవలెను. మీకు ఇంకొకపద్ధతి ఏది అయినా తోస్తే నిరాక్షేపముగా చెప్పవచ్చును. ఒక్కడు ఆలోచించడముకన్నా పూర్వాపరపక్షవాదాలతో మధ్యస్థులు చేసే నిర్ణయము ఎప్పుడూ నిష్పాక్షికముగానూ, అధికార్థముగానూ ఉంటుంది. అందువల్ల, మీరు అందరూ ఆలోచించి మీ అభిప్రాయము చెప్పవలెను."

దశరథమహారాజు ఈ మాటలు పూర్తిచేసినాడో లేదో, వర్షించే మేఘాలను చూచి నెమళ్ళు చెలరేగి కేకలు వేసేట్టు సభాసదులు అందరూ బాగుంది, బాగుంది అంటూ, దిక్కులు పిక్కటిల్లిపోయేటట్టు కేకలు వేసినారు. వారి సంతోష ధ్వనులకు ఆ సభాభవనము అంతా కదిలిపోతున్నదా అనిపించింది.

వశిష్ఠాది బ్రాహ్మణముఖ్యులు రాజముఖ్యులతోనూ, పౌరముఖ్యులతోనూ, జనపదముఖ్యులతోనూ ఆలోచించినారు. అందరూ ఏకాభిప్రాయులు అయినారు. దశరథమహారాజును చూచి, "ఓ రాజా! రాముణ్ణి యువరాజును చేయవలసిందే! ఆ మహాబాహువు, ఆ రఘువీరుడు రాముడు శత్రుంజయ గజముమీద శ్వేతచ్ఛత్ర ముతో ఊరేగుతూ ఉంటే మేము చూడ ముచ్చటపడుతున్నాము" అన్నారు.

దశరథమహారాజు సంతోషించినాడు. అయితే, తన సంతోషము పైకి పొక్కనీయకుండా, "ఓ సభాసదులారా! నేను చెప్పే చెప్పటముతో మీరు రాముణ్ణి యువరాజును చేయమంటున్నారు. అందువల్ల నాకు సందేహముగా ఉంది. ఎందుకు మీరు అందరూ రామాభిషేకము చేయమంటున్నారో యధార్థము చెప్పవలెను. నేను ధర్మము తప్పకుండా రాజ్యపాలనము చేస్తున్నాను. మీరు ఏ కారణమువల్ల ఇట్లా చెప్పుతున్నారు? నేను ఏది అయినా తప్పు చేసినానా, మీరు చెప్పవలెను" అంటూ దశరథమహారాజు ప్రశ్నవేసినాడు.

"ఓ రాజా! రాముడు అనంతకళ్యాణగుణసంపన్నుడు. ఆ గుణగణాలను అన్నిటినీ వర్ణించటము మా తరము కాదు. ఎంత వర్ణించినా తనివి తీరదు. ఎన్నో మాటలు ఎందుకు, రాముడు కోసలరాజ్యమే కాదు ముల్లోకాలు ఏలగల సమర్థుడు. ఋరీచికి కాశ్యపుడివలె, మా భాగ్యవశమువల్ల మీకు రాముడు పుట్టినాడు.

"రాజా! మానవులము మేమే కాదు, దేవతలూ, గంధర్వులూ, ఉరగులూ, మొదలు అయినవారు అందరూ రాముణ్ణి ఒక్కమాదిరిగా గౌరవిస్తున్నారు. అతని ఆయురారోగ్యఐశ్వర్యాదుల కోసము ప్రార్థిస్తున్నారు. ఆ ఇందీవరశ్యాముడు ఎప్పుడు యువరాజు అవుతాడా అని అందరూ ఎదురు చూచుచున్నారు. తమకు వృద్ధాప్యము

వచ్చింది అనీ, రాజ్యపాలనమునుంచి విశ్రాంతి కావలెను అనీ తామే సెలవిచ్చినారు. రాముడికి యువరాజ్యాభిషేకము చేయవలెను అనే మాటలు తమ నోటనే వెలువడినవి. అందువల్ల, మేమూ సంతోషముగా తమ మాటలను శిరసావహిస్తున్నాము.

"రాజా! తాము దేవదేవుడు అయిన మహావిష్ణువువంటివారు. కోరిన కోరికలు ఇచ్చే మహానుభావులు. లోకహితమే తమ మహదాశయము. ఇప్పుడు లోకహితము కోసమూ, మమ్ములను సంతోషపెట్టడముకోసమూ తమ జ్యేష్ఠపుత్రుణ్ణి రాముణ్ణి యువరాజును చేయవలెను" అని ఎలుగెత్తి ఏకకంఠముగా సభాసదులు చెప్పినారు.

3

సభాసదులు తామరమొగ్గలవలె చేతులెత్తి నమస్కారము చేస్తూ చెప్పింది అంతా దశరథమహారాజు విన్నాడు. వారికి మేలుచేయడముకోసమున్నూ, వారిని సంతోషపెట్టడముకోసమున్నూ, "మహాజనులారా! ఆశ్చర్యము. మీరున్నూ నా జ్యేష్ఠ పుత్రుణ్ణి యువరాజును చేయమంటున్నారు. సంతోషము. ఏమి నా భాగ్యము! నావంటి అదృష్టవంతుడు మరి ఒకడు ఉండడు" అన్నాడు. వశిష్ఠ వామదేవులను చూస్తూ, "ఇది చైత్రమాసము. శ్రీమంతము అయింది. పరమపావనము అయింది. తరులతాదులు అన్నీ మనోహరముగా పుష్పించినవి. రాముడి యువరాజ్య పట్టాభిషేకానికి ఏర్పాట్లు అన్నీ ఇప్పుడే చేయించవలెను. ఆలస్యము వద్దు" అన్నాడు దశరథమహారాజు.

ఈ మాటలకు సభాసదులు, "బాగుంది, బాగుంది" అని గొంతెత్తి చెప్పినారు. సంతోషధ్వనులు చెలరేగినవి. ఆ జనఘోషము సద్దుమణిగిన తరువాత, "ఓ బ్రాహ్మణోత్తములారా! రామాభిషేకానికి ఏ ఏ కర్మలు చేయవలెనో, అందుకు ఏ ఏ ఉపకరణాలు సమకూర్చుకొనవలెనో తాము ఇప్పుడే సెలవు ఈయవలెను" అన్నాడు దశరథమహారాజు.

అంతట వశిష్ఠమహర్షి ఆ యా కార్యకర్తలను ఉద్దేశించి, "రేపు ఉదయము దశరథమహారాజు అగ్నిహోత్రగృహములో పూజాద్రవ్యాలనూ, తెల్లని పూలదండలనూ, ఓషధులనూ, నవరత్నాలనూ, బంగారము, వెండి మొదలు అయిన లోహాలనూ, నూతన వస్త్రాలనూ, అగ్నిహోత్రమువలె ధగధగలాడే నూరు కలశాలనూ, సమగ్రము అయిన పులితోలునూ, రెండు వింజామరలనూ సిద్ధముగా ఉంచవలెను. వేరే వేరే గిన్నెలలో తేనే, నెయ్యీ, పేలాలు ఉంచవలెను. ఇవే కాకుండా చతురంగబలాలూ, సర్వశుభలక్షణయుతము అయిన శత్రుంజయము అనే ఏనుగుతోనూ, కొమ్ములకు బంగారు తొడుగులు వేసిన ఆబోతుతోనూ, శ్వేతచ్ఛత్రముతోనూ, ధ్వజముతోనూ,

సర్వాయుధాలతోనూ రావలెను. ఈ సందర్భానికి అవసరము అయిన పరిమళద్రవ్యాలను సిద్ధము చేయవలెను.

"అంతఃపురద్వారాలనూ, నగరబహిర్ద్వారాలనూ పూలదండలతోనూ, ఘుమఘుమలాడే మంచిగంధముతోనూ అలంకరించవలెను. నగరము అంతటా ఘుమఘుమలాడే ధూపాలు వేయవలెను. లక్షలకొద్దీ బ్రాహ్మణులకు రేపటిదినము అన్నదానము చేయవలెను. వివిధవ్యంజనాలతోనూ, క్షీరపక్వమూ, దధిపక్వమూ అయిన అన్నము సిద్ధము చేయించవలెను. సంతర్పణ చేయడమే కాకుండా రేపు ఉదయము ముందుగా బ్రాహ్మణులను సత్కరించవలెను. వారికి పేలాలూ, పెరుగూ, నెయ్యీ, పుష్కలముగా దక్షిణలూ ఇవ్వవలెను. తెల్లవారుతూనే స్వస్తి వాచకము చెప్పించవలెను. అందుకోసము బ్రాహ్మణులకు ఇప్పుడే చెప్పవలెను. ఆ బ్రాహ్మణులకు ఉచిత ఆసనాలున్నూ ఏర్పాటుచేయవలెను. అందరూ వచ్చేటట్టు ప్రోత్సహించవలెను.

"రాజవీధులలో దుమ్మూ ధూళీ రేగకుండా నీళ్ళుచల్లి అలంకరించవలెను. ప్రతిఇంటిమీదనూ జండాలు ఎత్తవలెను. నటులూ, భోగముపడుచులూ చక్కగా అలంకరించుకొని వచ్చి రాజభవనములో రెండవకక్ష్య దగ్గర ఉండవలెను. దేవాలయాలలోనూ, చతుష్పథాలలోనూ పూలదండలూ, దక్షిణలూ ఇచ్చేవారినీ, పిండివంటలతో అన్నముపెట్టేవారినీ వేరే వేరే నియమించవలెను. యోధులు అందరూ కవచాలు ధరించి పాడుగాటి కత్తులతో రాజభవనము ముందర నిలువవలెను అని చెప్పినాడు.

ఈ విధముగా చెప్పి వశిష్ఠ వామదేవులు ఆ యా పనులు చక్కపెట్టడానికి కార్యకర్తలను నియమించినారు. వారు చేయవలసిన పనులు వారు చేసి, దశరథమహారాజును చూచి సంతోషాతిశయముతో యువరాజ్యాభిషేకపు ఏర్పాట్లు అన్నీ అయిపోయినవి అని చెప్పినారు.

అప్పుడు ఆ ద్యుతిమంతుడు దశరథమహారాజు ఎంతో సంతోషించినాడు. రాముణ్ణి వెంటనే అక్కడికి తీసికొనిరమ్మని చెప్పి సుమంత్రుణ్ణి పంపించినాడు.

నాలుగు దిక్కులనుంచీ వచ్చిన రాజులూ, మ్లేచ్ఛరాజులూ, అడవిదొరలూ, కొండదొరలూ ఆ సభాభవనములో అప్పుడు దశరథమహారాజు చుట్టూ కూర్చొని మాట్లాడుతూ ఉంటే, దేవసభామధ్యములో కూర్చున్న దేవేంద్రుడివలె దశరథమహారాజు శోభించినాడు.

మరుత్తులమధ్య కూర్చున్న మహేంద్రుడివలె వెలుగొందుతున్న దశరథమహారాజు రాజవీధిలో రథముమీద వస్తూ ఉన్న రాముణ్ణి చూచినాడు.

రాముడు రూపవేషాదులనుబట్టి భోగపరాయణుడు అయిన గంధర్వరాజువలె కనిపిస్తాడు. కాని, అతడు అనుపమాన పరాక్రమవంతుడు. అందుకు అనురూపము అయిన ఆజానుబాహువు. మదపుటేనుగువలె మదాలసముగా నడిచే మహాబలుడు. పూర్ణచంద్రుడికన్నా దర్శనీయుడు. చూచినకొద్దీ చూడబుద్ధిపుట్టే సుందరాకారుడు. తన సౌందర్య ఔదార్య సౌశీల్యాదులతో పురుషుల చిత్తాన్ని సహితము అపహరించిన పురుషోత్తముడు. మండుటెండలో మలమలమాడే ప్రజలకు చల్లదనము ఇచ్చే నీలమేఘుడి వంటివాడు.

ఆ రామున్ని దశరథమహారాజు ఎడతెగకుండా చూడసాగినాడు. ఎంత చూచినా ఆయనకు తనివి తీరలేదు.

కైలాసపర్వతమువంటి ఆ రాజప్రాసాదము దగ్గర రాముడి రథము ఆగింది. ఆ రథము తోలుకొని వచ్చిన సుమంత్రుడు దిగి అతనికి చేయూత నిచ్చినాడు.రథము దిగిన రాముడు ఆ మేడ మెట్లు ఎక్కడము మొదలు పెట్టినాడు. చేతులు జోడించి సుమంత్రుడు అతడి వెనుక అడుగులు వేసినాడు.

రాముడు సభాభవనములోకి వచ్చి చేతులు జోడించి, పేరు చెప్పుకొని దశరథమహారాజుకు సాష్టాంగ నమస్కారము చేసినాడు. లేచి చేతులు జోడించి ఆయన ప్రక్కన నిలుచున్నాడు. ఆ జోడించిన చేతులు పట్టుకొని దశరథమహారాజు రామున్ని దగ్గరకు తీసికొన్నాడు. కౌగలించుకొన్నాడు. అతడు కూర్చుండడానికి బంగారముతో చేసిన నవరత్నాలు పొదిగిన ఉన్నత ఉత్తమాసనము చూపించినాడు.

మేరుపర్వతముమీద ఉదయించే సూర్యుడే మేరుపర్వతానికి అంతటికీ కాంతిని ఇచ్చేట్లు, ఆ దివ్యాసనముమీద కూర్చున్న రాముడే తన దివ్యకాంతులను ఆ సభాభవనమున అంతటా వెదచల్లినాడు.

ఆ సభాభవనములో వశిష్ఠాదిమహర్షులూ, రాజర్షులూ మొదలు అయిన వారి మధ్యను కూర్చున్న రాముడు, శరత్కాల స్వచ్ఛాకాశములో నక్షత్రాలమధ్య ఉదయించిన చంద్రబింబమువలె కనిపించినాడు.

అప్పుడు అక్కడ ఉన్న రాముడి రూపము, తన యౌవనములో అలంకరించుకొని అద్దములో చూచుకొన్నప్పుడు కనిపించిన ప్రతిబింబము వలె దశరథమహారాజుకు తోచింది. ఆయన సంతోషపరవశుడు అయినాడు. మందహాసముతో 'రామా' అని సంబోధించి, కశ్యపుడు తన కొడుకు దేవేంద్రుడితో చెప్పినట్లుగా, "రామా! నా జ్యేష్ఠపత్ని పరమయోగ్యురాలు. ఆమె తన యోగ్యతకు తగినట్టుగా నిన్ను కన్నది. నీవు నాకు ప్రియపుత్రుడవు అయినావు. ప్రజారంజకుడవున్నూ అయినావు. ఇప్పుడు ఈ ప్రజలు అందరూ నిన్ను యువరాజును

చేయమన్నారు. అందువల్ల, రేపు పుష్యమి నక్షత్రములో నేను నిన్ను యువరాజును చేయపోతున్నాను.

"నాయనా! నీవు జన్మతః వినయాన్వితుడవు. గుణవంతుడవు. పరాక్రమ వంతుడవు. నాకు తెలుసును. అయినప్పటికిన్నీ, పుత్రవాత్సల్యమునుంచి నీ మంచికోసము నేను చెప్పుతున్నాను, వినవలెను. నీవు ఇంకా ఆణకువతో ఉండవలెను. జితేంద్రియుడవు కావలెను. స్త్రీ ప్రసంగము, మద్యపానము, జూదము, వేట మొదలు అయిన వ్యసనాలు కామోద్రేకాలు కలగచేస్తవి. పరుష ప్రసంగమూ, క్రూర దండనమూ, ధన వ్యయమూ మొదలు అయిన వ్యసనాలు కోపోద్రేకము కలుగచేస్తవి. నీవు ఈ వ్యసనాలను దరిచేరనీయవద్దు. సామాన్య సేవకులకు నీవు పరోక్షముగా నుండవలెను. అధికారులను ఆజ్ఞాపించి వారిచేత నీ పనులు చేయించుకుంటూ ఉండవలెను. మంత్రులు మొదలు అయిన వారితో నీవు ప్రత్యక్షముగా కలసిమెలసి ఉంటూ ఉండవలెను. పరరాజ్య వృత్తాంతాలను పరోక్షముగా ఉండి ఎప్పటికి అప్పుడు తెలుసుకొంటూ ఉండవలెను. ప్రత్యక్షముగా ఉండి స్వరాజ్య వృత్తాంతాలను గమనిస్తూ ఉండవలెను. అమాత్యులనూ, సేనానాయకులనూ, పురరక్షకు లనూ, జనపద ముఖ్యులనూ నీవు ఎప్పుడూ సంతోషపెట్టుతూ ఉండవలెను. వారినే కాదు, సర్వప్రజలనూ నీవు సంతోషపెట్టుతూ ఉండవలెను. రాజ్యములో కోశాగారాలనూ, ధాన్యాగారాలనూ, ఆయుధాగారాలనూ ఎప్పుడూ సమృద్ధిగా ఉంచవలెను. అవి అన్నీ సమృద్ధిగా ఉంటేనే ప్రజలు అందరూ మహోల్లాసముతో ఉంటారు. నీ సచివులూ, నీ సామంతులూ అమృతపానముచేసిన దేవతలవలె ప్రవర్తిస్తారు.

"నాయనా రామా! నీవు మనస్థైర్యముతో రాజ్యపాలనము చేయవలెను" అన్నాడు దశరథమహారాజు.

ఈ విధముగా దశరథమహారాజు చెప్పుతూ ఉండగా, రాముడి ప్రియమిత్రులు గబగబా పరుగెత్తుకొని పోయి కౌసల్యాదేవికి ఈవిషయము అంతా తెలియచెప్పినారు. ఆ ప్రియవార్త వినిపించినవారికి ఆ భాగ్యశాలి అప్పుడు రత్నాలు, బంగారము, గోవులు బహుమానముగా ఇచ్చింది.

రాముడు దశరథమహారాజుకు నమస్కారము చేసి సెలవు చెప్పి, తన భవనానికి పోవడానికి రథము ఎక్కినాడు. జనులు గుంపులు గుంపులుగా ఆ రథముచుట్టూ మూగి జయజయధ్వానాలు చేసినారు. రాముణ్ణి సమ్మానించినారు.

పౌరులు అందరూ సంతోషముతో తమ తమ ఇండ్లకు పోయినారు. రామాభిషేకము జరగవలెను అని తమ దేవతలను పూజించినారు.

4

దశరథమహారాజు కొలువు చాలించిన తరువాత మంత్రులు అందరితోసూ మరునాటి రామరాజ్యాభిషేకాన్ని గురించి మళ్ళీ ఆలోచించినాడు. జరుగవలసిన ఏర్పాట్లను అన్నిటినీ నిశ్చయించినాడు. అంతఃపురములోకి పోతూ రామున్ని మళ్ళీ తనదగ్గరకు తీసికొనిరమ్మని సుమంత్రునితో చెప్పినాడు.

ద్వారపాలకులు సుమంత్రుడి రాక రాముడికి తెలియచేసినారు. ఆయన మళ్ళీ ఎందుకు వచ్చినాడా అని శంకిస్తూ వెంటనే ఆయనను లోపలికి రావించి, "మంత్రిసత్తమా! తాము మళ్ళీ ఎందుకు వచ్చినారో వివరముగా చెప్పవలెను" అన్నాడు రాముడు.

"మహారాజు మళ్ళీ మిమ్ములను చూడవలెను అనుకొన్నాడు. నన్ను పంపించినాడు. అంతకన్నా నాకు తెలియదు. రావడమూ, రాకపోవడమూ తమ చిత్తము" అన్నాడు సుమంత్రుడు.

రాముడు వెంటనే రాజభవనానికి బయలుదేరినాడు. అతని రాక తెలియగానే దశరథమహారాజు వెంటనే లోపలికి పంపించమని ద్వారపాలకులతో చెప్పినాడు. రాముడు లోపలికిపోయి చేతులెత్తి నమస్కారము చేస్తూ సాష్టాంగపడినాడు. ఆయన రామున్ని లేవనెత్తి కౌగలించుకొని మనోజ్ఞము అయిన ఆసనముమీద కూర్చుండ నియమించినాడు.

"రామా! నాకు బాగా వృద్ధాప్యము వచ్చింది. నేను బహుకాలము రాజ్యపాలనము చేసినాను. శాస్త్రనిషిద్ధముకాని సమస్తభోగాలూ, సమస్తసుఖాలూ యథేష్టముగా అనుభవించినాను. సకలశాస్త్రాలూ చదివినాను. వేదాధ్యయనము చేసినాను. అన్నదానముచేసి, భూరిదక్షిణలు ఇచ్చి, అనేక యజ్ఞాలు చేసి దేవతల ఋణము తీర్చివేసినాను. నానావిధ దానాలూ చేసి బ్రాహ్మణుల ఋణము తీర్చివేసినాను. సమస్త సుఖాలూ అనుభవించి ఈ దేహఋణము తీర్చివేసినాను. నిన్నూ, నీ తమ్ములనూ కని పితృఋణము తీర్చివేసినాను. నీవు నాకు పుత్రుడవుగా పుట్టడమే కాకుండ, నాకు ఇష్టుడవు అయినావు. నీ అంతటివాడు ఈ లోకములో లేడు అనిపించుకొన్నావు. ఇక నీకు రాజ్యాభిషేకము చేయడముకన్నా నాకు మరియొక పనిలేదు. కాబట్టి, నా కోసము నీవు నేను చెప్పినట్టు ఒప్పుకోవలెను.

"రామా! ఇప్పుడు ప్రజలు అందరూ నిన్ను యువరాజును చేయమంటున్నారు. అంతేకాదు, దారుణము అయిన అమంగళాలు నాకు కలలో కనబడుతూ ఉన్నవి. ఆకాశమునుంచి కొరువులు మంటలు లేకుండా పిడుగులవంటి

ధ్వనులతో నేలమీద పడడము కలలో చూచినాను. ఇప్పుడు నా జన్మనక్షత్రానికి శన్యంగారకరాహువులు వచ్చినట్టు జ్యోతిష్కులు చెప్పుతున్నారు. ఇటువంటి దుర్నిమిత్తాలు తోచినప్పుడు తరచు రాజుకు చావు మూడుతుంది; లేదా రాజుకు గొప్ప ఆపదలు అయినా వస్తవి. అందువల్ల, రేపే నీకు యువరాజ్యాభిషేకము చేయ నిశ్చయించినాను. మానవులబుద్ధి చంచలము. కాబట్టి, నా ఈ బుద్ధి మారక పూర్వమే నీవు యువరాజువు కావలెను.

"నాయనా! నా అంతఃకరణము నీ రాజ్యాభిషేకానికి తొందర పెట్టుతూ ఉంది. ఈనాడు పునర్వసు నక్షత్రము. రేపు పుష్యమి నక్షత్రము. రాజ్యాభిషేకానికి బాగున్నది అని జ్యోతిష్కులు చెప్పినారు. నీ అభిషేకము రేపే అయిపోవలెను. నీవు ఇప్పటినుంచి నియమబద్ధుడవుగా ఉండవలెను. నీవూ, నీ భార్యా ఈ రాత్రి ఉపవాసము చేయవలెను. దర్భశయ్యమీద పడుకొనవలెను. నీ స్నేహితులు నిన్ను ఈ రాత్రి ఏమరుపాటు లేకుండా కనిపెట్టుకొని ఉండవలెను. ఏమంటే, ఇటువంటి సమయాలలో అనేక విఘ్నాలు వస్తూ ఉంటవి.

"రామా! ఇప్పుడు భరతుడు దూరదేశములో ఉన్నాడు. వాడు ఇక్కడికి వచ్చే లోపలనే నీ రాజ్యాభిషేకము అయిపోవలెను. నీ తమ్ముడు భరతుడు పెద్దలు అందరూ పోయిన దారినే పోయేవాడే కావచ్చును. నీవు జ్యేష్ఠుడవని నిన్ను అనుసరించేవాడే అయి ఉండవచ్చును. ధార్మికుడూ, దయాహృదయుడూ అయికూడా ఉండవచ్చును. జితేంద్రియుడునూ అయి ఉండవచ్చును. కాని, మానవుల చిత్తము అనిత్యము. ఎప్పుడూ ఒక్కమాదిరిగా ఉండదు. ఇది నా అభిప్రాయము. ధర్మైకపరాయణులు సహితము ఇతరులు కల్పించే మిత్రభేదాదులకు లొంగిపోవడము కద్దు. అయితే, గతించినదానికి ధార్మికులు అయినవారు చింతించరు. అందువల్ల, రేపే నీ రాజ్యాభిషేకము జరుగవలెను. నాయనా! నీవు పోయిరా" అన్నాడు దశరథమహారాజు.

రాముడు తండ్రికి నమస్కారముచేసి తన భవనానికి పోయినాడు. అక్కడ అతడు నిలువలేదు. దశరథమహారాజు తలపెట్టిన తన యువరాజ్యాభిషేకాన్ని గురించి తన తల్లి కౌసల్యాదేవితో చెప్పవలెను అనుకొన్నాడు. తత్క్షణమే ఆమె అంతఃపురములోనికి పోయినాడు.

కౌసల్యాదేవి తెల్లని పట్టుచీర ధరించి, దేవతాగారములో మౌనముతో భగవద్ధ్యానము చేస్తూ ఉంది. ఆమె సరసను సుమిత్రాదేవీ, సీతాదేవీ, లక్ష్మణుడూ కూర్చొని ఉన్నారు. వారిని రాముడు చూచినాడు.

రామాభిషేక వర్తమానము విని సుమిత్రాదేవీ, లక్ష్మణుడూ కౌసల్యాదేవి దగ్గరకు వచ్చినారు. వారు సీతాదేవిని అక్కడికి పిలిపించినారు. కౌసల్యాదేవి వారిని ముగ్గురిని వెంటపెట్టుకొని దేవతాగారములోనికి పోయి, మరునాడు యువరాజు కాబోతున్న తన పుత్రుడి మంగళాభివృద్ధికోసము కన్నులుమూసుకొని పురుషసూక్తములో చెప్పినట్టుగా ప్రాణాయామముతో జనార్దనుణ్ణి ధ్యానము చేస్తూ ఉంది.

ఆ నిష్ఠాగరిష్ఠ దగ్గరకు రాముడు పోయి నమస్కారము చేసినాడు. ఆమెను సంతోషపెట్టడానికి, "అమ్మా! నాయనగారు ఇక నన్ను ప్రజాపాలనము చేయమని ఆజ్ఞాపించినారు. రేపు నా యువరాజ్యాభిషేకము అని శాసించినారు. నేనూ, సీతా ఈ రాత్రి ఉపవాసము చేయవలెను అని వారు నాతో చెప్పినారు. మేము చెయవలసిన మంగళకార్యాలను అన్నిటినీ నీవు ఇప్పుడే చేయించవలెను" అన్నాడు రాముడు.

ఆ మాటలకు ఆమె కన్నులవెంట ఆనందబాష్పాలు దొర్లినవి. ఎంతో కాలమునుంచీ రామయువరాజ్యాభిషేకము ఆమె కాంక్షిస్తూ ఉంది. ఆమె మాటలు తడబడుతూ మనోహరముగా, "నాయనా! నీవు కలకాలమూ జీవించవలెను. నీ పగవారు అందరూ హతము అయిపోవలెను. నన్ను నా వాండ్లను, ఈ సుమిత్రను దీని వాండ్లను నీవు సుఖపెట్టవలెను. నీవు మంచి నక్షత్రములో పుట్టినావు. అందువల్ల, నీ సద్గుణాలకు నీ తండ్రి నిన్ను మెచ్చుకొన్నాడు. నా వ్రతాలు, నా ఉపవాసాలు ఇప్పుడు ఆ పుండరీకాక్షుడు, ఆ శ్రీమన్నారాయణమూర్తి సఫలము చేసినాడు. నాయనా రామా! ఇక్ష్వాకురాజ్యలక్ష్మి ఇప్పుడు నిన్ను చేపట్టపోతున్నది" అని చెప్పింది.

ఈ విధంగా తల్లి చెప్పిన మాటలు రాముడు విన్నాడు. అణకువతో చేతులు మోడ్చి అక్కడ కూర్చున్న లక్ష్మణుణ్ణి చూచి మందహాసముతో, "తమ్ముడా!-నిన్ను ఈ రాజ్యలక్ష్మి వరిస్తూ ఉంది. నాతోపాటు నీవూ ఈ రాజ్యభారము వహించవలెను. నీవు నా రెండవ ప్రాణానివి. నీ ఇష్టార్థాలూ, అమూల్య వస్త్రాభరణాలూ, సమస్తభోగాలూ నీవూ అనుభవించవలెను. నా జీవితము, నారాజ్యము, నా భాగ్యభోగాలు నీ కోసమేను" అన్నాడు.

రాముడు అంతట తల్లులకు నమస్కారము చేసి, వారి అనుమతితో సీతను వెంటబెట్టుకొని తన మందిరానికి పోయినాడు.

5, 6

దశరథమహారాజు రామున్ణి ఉపవాస నియమముతో ఉండమని చెప్పి పంపించి వేసిన తరువాత వశిష్ఠమహర్షిని పిలిపించి, "తపోధనా! తాము సీతారాముల మందిరానికి ఇప్పుడే పోవలెను. వాండ్ల చేత యశస్సు కోసమూ, రాజ్యము కోసమూ ఉపవాసవ్రతము పట్టించవలెను" అని చెప్పినాడు. ఆ వ్రతనిష్ఠాపరుడు "అట్లాగేను" అన్నాడు.

ఆ మంత్రకోవిదుడు వశిష్ఠమహర్షి బ్రాహ్మణులు ఎక్కిపోయే రథముమీద స్వయముగా బయలుదేరి రామమందిరానికి పోయినాడు. తెల్లటి మేఘమువలె కనిపించే రామభవనములో మూడు కక్ష్యలు దాటినాడు. వశిష్ఠమహర్షి వస్తూ ఉన్నాడు అని ద్వారపాలకులు పోయి రాముడితో చెప్పినారు. అతడు తత్క్షణమే లేచినాడు. ఆ మహానుభావుడికి ఎదురుకోలు చెప్పి ఆయనను పూజించడానికి వేగిరపడ్డాడు. సంభ్రమముతో అడుగులువేస్తూ ఆయన రథానికి ఎదురుగుండా పోయినాడు. రథముమీదనుండి దిగడానికి ఆ మహనీయుడికి చేయూత నిచ్చినాడు. ఆ వినయానికి వశిష్ఠమహర్షి మెచ్చుకొని అత్యంతాదరముతో రాముణ్ణి ఆశీర్వదించినాడు. సంతోషముతో, "రామా! నీ తండ్రికి నీమీద అనుగ్రహము వచ్చినది. నీవు యువరాజువు అవుతున్నావు. అందుకోసము, ఇప్పుడు సీతతోకూడా నీవు ఉపవాసవ్రతము పట్టవలెను. నహుషచక్రవర్తి తన కొమారుడు యయాతికి ఒప్పగించినట్టుగా, రేపు ఉదయము నీ తండ్రి దశరథమహారాజు నీకు రాజ్యపాలనము ఒప్పజెప్పుతాడు" అన్నాడు వశిష్ఠమహర్షి.

అంతట సీతారాములచేత సమంత్రకముగా ఆ రాజగురువు ఉపవాసవ్రతము పట్టించినాడు. ఆ గురువరేణ్యుణ్ణి సీతారాములు యథాశాస్త్రముగా సమ్మానించినారు. "పోయి వస్తాను" అని చెప్పి వశిష్ఠమహర్షి రామభవనములోనుంచి బయలుదేరినాడు.

అంతట రాముణ్ణి అతని ప్రియమిత్రులు సమ్మానించి సంతోషపెట్టినారు. రాముడు కొంచెముసేపు వారితో ముచ్చటలాడినాడు. వారు అందరూ వెళ్ళిపోయిన తరువాత తన అంతఃపురములోకి పోయినాడు. మహోల్లాసముతో సింగారించుకొన్న స్త్రీ పురుషులతోను, మనోహర గీతవాద్యధ్వనులతోను ఆ అంతఃపురం చెవులకు ఇంపుగా పాటలు పాడే పక్షుల గుంపులూ, విరగబూసిన కమలాలూ ఉన్న కాసారము మాదిరిగా కనిపించింది.

రాజభవనమువంటి రామభవనములోనుంచి వశిష్ఠమహర్షి బయటకు వచ్చినాడు. రాజవీథి అంతా రామాభిషేక దర్శన కుతూహలముతో వచ్చిన జనసమూహముతో కిటకిటలాడుతూ ఉంది. సముద్రతరంగాల మాదిరిగా జనసమూహాలు అక్కడకు వస్తూ ఉన్నవి. ఆ మహాజనుల కలకలధ్వనులు క్షుబ్ధసముద్రఘోషములవలె వినిపిస్తూ ఉన్నవి.

అప్పుడే రాజవీథులు అన్నీ ఊడ్చి, నీళ్లు చల్లి సింగారించినారు. అరటిచెట్లూ, పోకచెట్లూ వరుసగా ఆ రాజవీధిలో రెండుప్రక్కలా నిలుచుండపెట్టినారు. ప్రతి ఇంటిమీదకు జెండాలు ఎత్తినారు.

అయోధ్యానగరములో ఉన్న స్త్రీలూ, పురుషులూ, బాలురూ, వృద్ధులూ ఇకను ఎప్పుడు చీకటిపడుతుంది, ఎప్పుడు తెల్లవారుతుంది అనుకొంటూ రామాభిషేక మహోత్సవము చూడడానికి ఉత్సాహపడుతున్నారు. ఆ జనసమ్మర్దములోనుంచి వశిష్ఠ మహర్షి రథము వ్యూహభేదనమువలె ఎట్లాగో దారిచేసుకొని తెల్లటి మేఘమువలెనూ, తెల్లటి కొండకొమ్మవలెనూ కనిపించే దశరథమహారాజు భవనము దగ్గరకు పోయింది.

దేవేంద్రుణ్ణి చూడపోయే దేవగురువువలె వశిష్ఠమహర్షి ఆ ప్రాసాదము మెట్లు ఎక్కి పయికి పోయినాడు. దశరథమహారాజు ఆ వేదవిదుణ్ణి చూచీచూడడముతో సింహాసనముమీదనుంచి లేచినాడు. ఆయనతోపాటు ఆ రాజపురోహితుణ్ణి గౌరవించడానికి అక్కడ కూర్చున్నవారు అందరూ లేచి నిలుచున్నారు.

"ఓ మహర్షీ! సీతారాములచేత ఉపవాసవ్రతము పట్టించినారా" అని దశరథమహారాజు ప్రశ్నించినాడు. ఆ మహానుభావుడు, "అవును" అన్నాడు.

అంతట దశరథమహారాజు వశిష్ఠమహర్షి అనుజ్ఞ తీసుకొని, సభ చాలించినాడు.

నభోమండలములో నక్షత్రాలమధ్య చంద్రుడివలె మహేంద్రభవనము వంటి తన రాజభవనములో దివ్యవస్త్రాభరణభూషితులు అయిన స్త్రీలమధ్య దశరథమహారాజు తన కాంతులను వెదజల్లినాడు.

వశిష్ఠమహర్షి వెళ్ళిపోయిన తరువాత సీతారాములు స్నానము చేసినారు. మనశ్శుద్ధితో శ్రీమన్నారాయణమూర్తిని పూజ చేసినారు. అంతట రాముడు హవిష్పాత్రను శిరసా గ్రహించి జ్వలిస్తున్న అగ్నిహోత్రములో శ్రీమన్నారాయణ ప్రీత్యర్థము ఆజ్యహోమము చేసినాడు. హోమము చేయగా మిగిలిన హవిస్సును భుజించినాడు. ఇష్టకార్యసిద్ధి కోసము శ్రీమన్నారాయణమూర్తిని ధ్యానము చేసినాడు.

ఆ రాత్రి రాముడు ఆ ఆవరణములో ఉన్న విష్ణ్వాలయములో దర్భశయ్య అమర్చుకొని మౌనవ్రతముతో, అచంచల మనస్సుతో వైదేహీ సమేతముగా పడుకొన్నాడు. తెల్లవారడానికి ఇంకా ఒక ఝాము ప్రొద్దు ఉంది అనగా నిద్ర లేచినాడు. తన భవనములో అలంకారము చేయించడము మొదలుపెట్టినాడు. శ్రవణపేయముగా పాడుతూ ఉన్న సూతవందిమాగధుల స్తోత్రపాఠాలూ, మేలుకొలుపులూ వింటూ కార్యాలు ముగించినాడు. ప్రాతఃకాల సంధ్యావందనము చేసినాడు. గాయత్రీ జపము అయిన తరువాత సూర్యమండల మధ్యవర్తి అయిన శ్రీమన్నారాయణమూర్తిని స్తోత్రము చేసినాడు. సాష్టాంగ పడినాడు.

రాముడు తెల్లటి పట్టుఉత్తరీయము కప్పుకొని బ్రాహ్మణోత్తములచేత పుణ్యాహము చెప్పించడము మొదలుపెట్టినాడు. మహాగంభీరముగానూ

మనోహరముగానూ బ్రాహ్మణోత్తములు చెప్పుతూ ఉన్న పుణ్యాహధ్వనులతో కలసి మంగళవాద్యధ్వనులు చెలరేగినవి. అయోధ్యానగరము అంతా ఆ శ్రావ్యమనోహర ధ్వనులతో మారుమ్రోగిపోయింది. పౌరులు అందరూ నిద్ర లేచినారు. సూర్యోదయము కాగానే రామాభిషేకము జరుగుతుందని అందరూ ఉప్పొంగిపోయినారు. పట్టణాన్ని మరింత శోభాయమానంగా అలంకరించడము మొదలు పెట్టినారు. తెల్లటి మేఘాలవలెనూ, పెద్దపెద్ద కొండలవలెనూ ఉన్న దేవాలయాలమీదనూ, కోట బురుజుల మీదనూ, ఇంకా చతుష్పథాలలోనూ, రాజవీథులలోనూ, మహోన్నతవృక్షాలమీదనూ రంగురంగుల పతాకలు ఎత్తినారు. ఆ యా ప్రదేశాలలో నటులూ, నర్తకులూ అభినయిస్తూ నేత్రపర్వముగా నాట్యము చేయసాగినారు. గాయకులు కర్ణపేయముగా పాడసాగినారు.

ఇంటా బయటా స్త్రీలూ, పురుషులూ, రామాభిషేకాన్ని గురించే ముచ్చటించసాగినారు. ఆటలు ఆడుకొనే పిల్లలు సహితము రామాభిషేకాన్ని గురించే చెప్పుకోవడము మొదలుపెట్టినారు. పౌరులు పూలదండలతో రాజవీథులు అన్నీ అలంకరించినారు. అంతటా సుగంధ ధూపాలు వేసినారు. రామాభిషేకము పూర్తి అయి ఊరేగింపు వచ్చేసమయానికి చీకటి పడిపోతుంది అనుకొని, వృక్షాకారముగా పెద్దఎత్తున దీపపు స్తంభాలు అమర్చినారు. ఎప్పుడు ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు ఎప్పుడు రామాభిషేకము జరుగుతుందా అనుకొంటూ పౌరులు అందరూ గుమికూడ సాగినారు.

"ఆహా, దశరథమహారాజు ఎంత బుద్ధిశాలి! తనకు వార్ధక్యము వచ్చిందని తోచగానే రాముడికి రాజ్యాభిషేకముచేయ నిశ్చయించినాడు. రాముడు ధర్మాత్ముడు. భ్రాతృవత్సలుడు. విద్వాంసుడు. మనలను అందరినీ తన తమ్ములవలె చూచుకొంటున్నాడు. ఆ నిగర్వి ఎప్పుడు రాజు అవుతాడా అనుకొంటూ వచ్చినాము. దైవానుగ్రహమువల్ల అదృష్టలోకపరావరుడు ఈనాడు తెల్లవారగనే రాజు కాబోతున్నాడు. ఇంక కాసేపటికి దశరథమహారాజు దయవల్ల రామరాజ్యాభిషేకము జరుగుతుంది. ఇంతవరకూ ఆ పరమధార్మికుడు దశరథమహారాజు బహుకాలము జీవించవలెను" అంటూ పౌరులు ముచ్చట లాడసాగినారు.

తెల్లవారవస్తూ ఉంది. రామాభిషేకము చూడవచ్చిన జనసమూహముతో అయోధ్య అప్పటికే ఇరకటము అయిపోయింది. జనులు నానాదిక్కులనుంచీ గుంపులు గుంపులుగా రాసాగినారు. హర్షధ్వానాలు మిన్ను అంటుతున్నవి. ఒకరి మాట ఒకరికి వినిపించకుండా పోయింది. జనసమూహాలు క్షణక్షణమూ

కోలాహలధ్వనులతో పొంగిపొర్లి వస్తూ ఉంటే, అమరావతీ పట్టణమువలె తీర్చి దిద్దినట్లు ఉండే అయోధ్యానగరము పున్నమినాటి సముద్రమువలె, మహాఘోషముతో తిమి తిమింగలాలు మొదలు, జలచరాలతో అల్లకల్లోలము అయినట్టు తోచింది.

7

మంథర కపటోపాయము

ఎవతో, ఎక్కడ పుట్టినదో ఎవరికీ తెలియదు. అది కైకేయీదేవికి దాసి. ఆమె పుట్టినింటినుంచి వచ్చింది. ఎప్పుడూ ఆమెదగ్గర ఉంటూ ఉంటుంది. దానిపేరు మంథర. అది ఆనాటి సాయంకాలము (తెల్లవారితే రామరాజ్యాభిషేకము అనగా) యాదృచ్ఛికముగా రాజప్రాసాదముమీదికి పోయింది. నాల్గుదిక్కులా చూడడము మొదలుపెట్టింది.

రాజవీధులు అన్నీ చక్కగా చిమ్మి, నీళ్ళు చల్లి, ముగ్గులు పెట్టి, పూలదండలతో అలంకరిస్తూ ఉన్నారు. అంతటా ధ్వజాలు ఎత్తుతూ ఉన్నారు.

అభ్యంగనస్నానము చేసిన బ్రాహ్మణోత్తములూ, పౌరముఖ్యులూ పూల దండలూ, కుడుములూ తీసికొని రామమందిరములోనికి వస్తున్నారు. దేవాలయాలకు వెల్లవేస్తున్నారు. పౌరులు అందరూ మహదానందముతో రాజవీధిలో మూగుతూ ఉన్నారు. సమస్త మంగళవాద్యాలూ మ్రోగుతూ ఉన్నవి. బ్రాహ్మణోత్తముల వేదఘోషము ఆకాశము అంటుతూ ఉంది. మానవులే కాకుండా జంతువులు సయితము సంతోష అతిశయాన్ని వెల్లడిస్తూ ఉన్నవి. సంతోషముతో గుర్రాలు చిందులు త్రొక్కుతున్నవి. ఉత్సాహాతిశయముతో ఏనుగులు పాదులు కాడుతూ గబగబా నడుస్తూ ఉన్నవి. ఆబోతులు రంకెలువేస్తూ ఉన్నవి. సవిలాసముగా ఆవులు మందలు మందలుగా తిరుగుతూ ఉన్నవి.

అది అంతా మంథర చూచింది. సంగతి ఏమిటో దానికి తెలియలేదు. ఆ మేడమీదనే, ఆ ప్రక్కనే తెల్లని పట్టుచీర కట్టుకున్న దాది హర్షోత్ఫుల్లనేత్రాలతో రాజవీధివంక చూస్తూ ఉంది. మంథర దాన్ని చూచి, "ఏమిటే, ఎవరికీ ఏమీ పుట్టనియ్యని ఆశపాతకపుమనిషి రాముడి తల్లి ఇప్పుడు ఎంతో సంతోషముతో అందరికీ బహుమానాలు ఇస్తూ ఉంది? క్రింద చూచి వచ్చినాను. ఇక్కడనుంచి ఇటు చూస్తే పౌరముఖ్యులు అందరూ మహాసంతోషముతో రామమందిరము దగ్గర మూగుతూ ఉన్నారు. రాజు ఏది అయినా శుభకార్యము తలపెట్టినాడా, కాస్త చెప్పు" అని అడిగింది.

పిల్లలకు పాలు ఇచ్చే ఆ దాది సంతోషము పట్టలేక పోయింది. ఆ వృత్తాంతము దాచలేక పోయింది. తెల్లవారితే రామాభిషేకము అని అది మంథరకు చెప్పివేసింది.

మంథర నిర్ఘాంత పోయింది. కోపము రేగింది. అక్కడ ఇక నిలువలేక పోయింది. కైలాసపర్వతశిఖరము అంత ఎత్తున ఉన్న ఆ మేడమీదనుంచి ఆ పాపదర్శిని గబగబా క్రిందికి దిగింది. కైకేయీదేవి దగ్గరకు హుటాహుటి పోయింది. అప్పుడు ఆమె పడుకొని ఉంది. మంథర తీక్షణస్వరముతో, "ఓ తెలివితక్కువరాణీ! నీవు లేవవలెను. ఇంకా ఎందుకు పడుకొంటావు? నీకు ఆపత్కాలము ఆసన్నము అయింది. నానాకష్టాలపాలూ కాబోతున్నావు. నీవు ఇంకా తెలిసికోలేదు ఏమిటి? ఓ రాణీ! ఇంత శోభనాకారవూ భర్తకు అయిష్టురాలవు అయినావు. ఓ రాణీ! నా అంత భాగ్యవంతురాలులేదు అని నీవు ఎప్పుడూ విర్రవీగుతావు. ఇప్పుడు నీ భాగ్యము అంతా ఎండాకాలములో ఏటినీళ్ళవలె అడుగంట పోతున్నది" అని చెప్పింది.

ఆ పాపదర్శిని ఈవిధముగా కోపపడుతూ ఉంటే, కైకేయీదేవి మనస్సు చిన్న పోయింది. "ఓ మంథరా! నాకు సుఖములేదా? నన్ను నీవు సుఖముగా ఉండనీవా? నీవు చిన్నపోయిన ముఖముతో కనబడుతున్నావు. చాలా దుఃఖపడుతున్నావు. కారణము ఏమిటి" అని కైకేయీదేవి మృదువుగా అడిగింది.

మంథర మాటకారి. కైకేయీదేవికి మేలుచేయడమే అది తనపనిగా పెట్టుకొన్నది. కోపము మనస్సులోనే ఉంచుకొని, ముఖము మరింత చిన్నపుచ్చుకొని ఏడుస్తూ, "ఓ రాణీ! నీకు అక్షయముగా అపకారము జరిగినది. నీ నాశనానికి పెద్ద ఎత్తున ప్రయత్నము జరుగుతూ ఉంది. దశరథమహారాజు రాముడికి యువరాజ్యాభిషేకము చేయపోతున్నాడు. ఈ సంగతి విన్నాను. నాకు అంతులేని భయము వేసింది. నా మనోవ్యథా, నా దుఃఖమూ నేను మాటలతో చెప్పలేను. నన్ను నిప్పులలో పొర్లించినట్లుగా బాధపడ్డాను. ఏమీ తోచలేదు. ఆలోచించినాను. నీకు మేలు చెయడమే నా పని అనుకొన్నాను. ఇక్కడికి వచ్చినాను. ఓ దేవీ! నీ అభ్యుదయమే నా అభ్యుదయము. నీ దుఃఖమే నా దుఃఖము. సందేహములేదు. ఓ కైకా! నీవు రాజవంశములో పుట్టినావు. దశరథమహారాజు అంతటివాడి ఉత్తమ కళత్రానివి అయినావు. కాని, రాజ్యతంత్ర క్రౌర్యము గుర్తించవు, గమనించవు. చిత్రమే. దేవీ! నీభర్త నీతో ధర్మపన్నాలు చెప్పుతూ ఉంటాడు, కాని మోసగాడు. నీతో మహామధురముగా మాట్లాడుతూ ఉంటాడు, కాని పరమక్రూరుడు. ప్రయోజనము మాలిన మంచి మాటలు అన్నీ నీతో చెప్పి నిన్ను ఉబ్బిస్తూ ఉంటాడు. తన పని గడుపుకుంటూ ఉంటాడు. నీవు కల్లా కపటమూ లేనిదానివి. అందువల్లనే, నిన్ను మోసము చేసినాడు. దుష్టాత్ముడు. కౌసల్యకు ఇప్పుడు అధికారమూ, ఐశ్వర్యమూ కట్టపెట్టపోతున్నాడు. నీ కొడుకు భరతుణ్ణి మేనమామ ఇంటికి తోలివేసినాడు. ఏ ఆటంకమూ లేకుండా చూచి, కౌసల్య కొడుకు రాముడికి

రాజ్యము ఒప్పగించపోతున్నాడు. ఓ రాజపుత్రీ! ఓ చిన్నదానా! దశరథమహారాజు నీ పెనిమిటే కాని, నీకు ఇప్పుడు పగవాడుగా ప్రవర్తిస్తున్నాడు. నీబోటిదే ఒక చిన్నది మాతృవాత్సల్యముతో ఒక పామును పెంచింది. అది విషజంతువు అని అనుకోకుండా, తన తొడలమీదకి ఎక్కించుకొన్నది. నీవు దశరథమహారాజును అట్లాగే చేసినావు. పామునూ, పగవాణ్ణీ ఉపేక్షిస్తే ఏమి అవుతుందో, అదే ఇప్పుడు అయింది. ఓ దేవీ! నీవు ఎప్పుడూ సుఖము అనుభవిస్తూ ఉండవలసిన దానవు. ఇప్పుడు నీవు నీ వాండ్లు అందరితోనూ నాశనము కాబోతున్నావు. సమయము ఆసన్నము అవుతున్నది. నీ మంచి ఏదో ఆలోచించుకో. నిన్నూ, నీ వాండ్లనూ వెంటనే కాపాడుకో. ఓ రాణీ! నీ దివ్యనేత్రాలతో నీవు ఏ పని అయినా చేయకలవు" అని చెప్పింది మంథర.

ఆ శుభానన మంథర చెప్పింది అంతా విన్నది. శయ్యమీదనుంచి శరత్కాల చంద్రరేఖవలె సంతోషముతో లేచింది. రామాభిషేకము జరుగపోతున్నందుకూ, అంతవరకూ ఆ విషయము తనకు తెలియనందుకూ ఆశ్చర్యపడ్డది. ఎంతో సంతోషపడ్డది. ఒక మంచి ఆభరణము తీసి మంథరకు బహుమానంగా ఇస్తూ, "మంథరా! ఎంతో సంతోష వార్త చెప్పినావు. ఇంత సంతోష వార్తకు ఈ బహుమానము చాలదు. అయినా, ఇది ఇస్తున్నాను. నాకు రాముడు, భరతుడు అనే భేదము లేదు. దశరథమహారాజు రాముడికి రాజ్యాభిషేకము చేయపోతున్నాడు అంటే, నాకు ఎంతో సంతోషముగా ఉంది. ఇంతకన్నా నన్ను సంతోషపెట్టే వర్తమానము ఇంకొకటి నీవు చెప్పలేవు. ఇంకా ఏది అయినా కోరుకో, ఇస్తాను. నీ కోరిక చెల్లిస్తాను" అన్నది కైక.

8, 9

ఈ విధముగా కైకేయీదేవి అన్నందుకు మంథరకు అసహ్యము వేసింది. ఆమె బహుమానముగా ఇచ్చిన ఆభరణము తీసి అవతల పారవేసింది. తాను మంచి చెప్పుతూ ఉంటే, ఆమె వినలేదు అని కోపము వచ్చింది. కైక కష్టాలపాలు అవుతుంది అని దుఃఖము వచ్చింది. దుఃఖమూ, కోపమూ మంథరలో పెనవేసుకొని పోయినవి.

"ఓ వెర్రిబాగులరాణీ! ఇదా నీవు సంతోషపడే సమయము? నీకు తెలియడము లేదు. ఓ రాణీ! నీవు శోకసాగర మధ్యప్రదేశములోనికి పోబోతున్నావు. అయ్యో! ఎంతో దుఃఖపడడానికి బదులు సంతోషపడుతున్నావు. నీ బుద్ధి బుగ్గి అయింది. నాకు ఏడుపు వస్తూ వుంది. నీ పిచ్చితనానికి నాకు నవ్వు వస్తూ ఉంది. ఓ దేవీ! నీ సవతి కొడుకు నీకు మృత్యువువంటివాడు. వాడి అభ్యుదయానికి బుద్ధిమంతురాలు ఎవతె అయినా సంతోషిస్తుందా? రాజ్యాధికారానికి రాముడితో సరిసమానము అయినవాడు భరతుడు ఒక్కడే. అందువల్ల, రాముడికి భరతుడు అంటే భయము.

భయపడ్డవాండ్లే ఎదుటివాండ్లకు ఎప్పుడూ అపకారము చేస్తారు. ఓ దేవీ! పెద్దపులి మనుష్యుణ్ణి చూచి భయపడుతుంది. పామూ అంతే. అందువల్లనే, మనుష్యులు వాటి జోలికి పోకపోయినా, అవి మనుష్యులమీదపడి చంపివేస్తవి. ఇది ఆలోచించినకొద్దీ నాకు దిగులు వేస్తూ ఉంది. భయము వేస్తూ ఉంది. ఓ కైకా! రాజ్యాధికారానికి లక్ష్మణ శత్రుఘ్నులున్నూ అర్హులే కాని, రాముడికి వాండ్లవల్ల భయము యేమీలేదు. లక్ష్మణుడు విలువిద్యలో ఆరితేరినవాడే. రాముడి అంతటి పరాక్రమవంతుడే. అయితే, సర్వాత్మనా వాడు రాముణ్ణి ఆశ్రయించుకొని ఉంటున్నాడు. వాడివలెనే శత్రుఘ్నుడున్నూ నీ కొడుకు భరతుణ్ణి అనుసరించుకొని ఉంటున్నాడు. లక్ష్మణ శత్రుఘ్నులు ఇద్దరూ పరతంత్రులుగా ఉన్నారు. స్వతంత్రులుగా లేరు. కాబట్టి, రాముడికి ఆ ఇద్దరు తమ్ముల భయము లేదు.

"దేవీ! జన్మక్రమాన్నిపట్టికూడా రాముడికి భరతుడు అంటేనే భయము. రాముడు లేకపోయినట్లయితే రాజ్యము భరతుడిదే అవుతుంది. లక్ష్మణ శత్రుఘ్నులు భరతుడి తరువాత పుట్టినారు. అందుచేత, రాజ్యప్రాప్త్యధికారము భరతుడికే ఉంది. రాముడు మతిమంతుడు. నీతిజ్ఞుడు. ఏ సమయములో, ఏది చేయవలెనో చక్కగా తెలిసినవాడు. నీ కొడుకు భరతుడు రాముడి అంతటి సమర్థుడు కాడు. అందువల్ల, నీ కొడుకును గురించి ఆలోచించినకొద్దీ నాకు వణుకు పుట్టుకొని వస్తూ ఉంది.

"ఓ శుభాంగీ! రేపు ఉదయము పుష్యమి నక్షత్రాన రాముడికి రాజ్యాభిషేకము అయిపోతుంది. కౌసల్య రాజమాత అవుతుంది. అయ్యో! ఇక ఆమె మహాభాగ్యవంతురాలు అయిపోతుంది. అంతట ఆమె సంతోషముతో చెలరేగుతుంది. తన సవతులను అందరినీ అణచివేస్తుంది. ఓ కేకయరాజపుత్రీ! నీవు ఇక కౌసల్యాదేవికి దండము పెట్టుతూ, దాసివలె ఊడిగము చేయవలసి వస్తుంది. నీతోపాటు మేమున్నూ ఆమె దాసీలము అవుతాము. నీ కుమారుడు భరతుడు రాముడికి సేవకుడు అవుతాడు. రాముడి అంతఃపురాంగనలు అందరూ చెలరేగుతారు. భరతుడు దరిద్రుడు అయిపోతాడు. అందువల్ల, అతడి అంతఃపురాంగనలు అందరూ రాముడి అంతఃపురాంగనలవెంట దాసీలవలె తిరగవలసి వస్తుంది. అయ్యో!" అంటూ మంథర దుఃఖపడిపోయింది.

కైకేయీదేవి ఈ మాటలు చెవిని పెట్టలేదు. మంథరను చూస్తూ, "ఓ గూనీ! రాముడు ధర్మజ్ఞుడు. గురుశిక్షితుడు. జితేంద్రియుడు. కృతజ్ఞుడు. నిర్మలుడు. కల్లలాడడు. దశరథమహారాజుకు జ్యేష్ఠపుత్రుడుగా పుట్టినాడు. అందువల్ల, యువరాజు అవుతున్నాడు. ఆ చిరంజీవి తమ్ములనూ, తక్కినవారినీ తండ్రి మాదిరిగా ఆదరిస్తాడు.

కాపాడతాడు. ఓసి గూనీ! రాముడి రాజ్యాభిషేకానికి సంతోషపడవలెను. నీవు ఎందుకు దిగులు పడతావు? భరతుడి సంగతి అంటావా, రాముడు ఒక నూరు సంవత్సరాలు ఏలిన తరువాత భరతుడు రాజ్యము ఏలుతాడు. నేను రాముడినే భరతుడికన్నా ఎక్కువగా గౌరవిస్తున్నాను, ప్రేమిస్తున్నాను. వాడున్నూ తన సొంతతల్లి కౌసల్యాదేవికన్నా నన్నే ఎక్కువగా చూస్తున్నాడు. నాకే ఎక్కువ సేవ చేస్తున్నాడు. రాముడికి తాను వేరు, తన తమ్ములు వేరు అనే భేదము లేదు. తనవలెనే తన తమ్ములనూ చూచుకొంటూ ఉంటాడు. రాముడికి రాజ్యము వస్తే భరతుడికిన్నీ రాజ్యము వచ్చినట్లేను" అన్నది కైకేయీదేవి.

ఈమాటలకు మంధరకు పట్టరాని కోపం వచ్చింది. వేడివేడి నిట్టూర్పులు విడుస్తూ, "ఓ అనర్థదర్శినీ! ఓ మూర్ఖురాలా! నీకు మంచి చెడ్డలు తెలియడములేదు. నీ సవతి కొడుకు రాజు అవుతాడు. నీ సవతికి సేవచేసే విపత్సముద్రములో నీవు మునుగుతూ తేలుతూ ఉంటావు. అప్పుడు నీవు, నీకొడుకుకు రాజ్యము లేకపోయిందే అని ఏడుస్తావు. నేను చెప్పుతూ ఉన్నాను, నీవు వినకుండా వున్నావు. ఏమి చేసేది? రాముడి తరువాత రాజు అయ్యేది రాముడి కొడుకు, నీ కొడుకు కాదు. నీ కొమారుడికి రాజ్యము ఎట్లా వస్తుంది? అయోధ్యను ఏలే రాజులలో నీ కొడుకు పేరు అయినా ఉండదు. రాజుకు పుట్టిన పుత్రులలో ప్రతివాడికీ రాజ్యము రాదు. పుట్టిన రాజపుత్రులు అందరూ రాజులు అయ్యేట్లయితే, రాజ్యము ఛిన్నాభిన్నము అయిపోతుంది. ఓ శుభాంగీ! అందువల్ల, గుణవంతులు అయిన పుత్రులు పుట్టినా, రాజు జ్యేష్ఠపుత్రుడికే రాజ్యపాలనము అప్పగిస్తాడు. ఓ దయామయీ! నీ కుమారుడు భరతుడికి రాబోతున్న అనర్థము ఆలోచించు. ఏ సుఖమూ అనుభవించకుండా నీ కుమారుడు అనాథుడు అయిపోతాడు. రాజవంశానుక్రమణికలో నీ కొడుకు పేరు అయినా ఉండదు. నేను ఇది అంతా ఆలోచించి తెలుసుకొన్నాను. నీకు మేలు చేయడమే నా పని. అందుకే, ఇప్పుడు నేను నీ దగ్గరకు వచ్చి అది అంతా చెప్పుతున్నాను. నా అభిప్రాయము నీవు గమనించకుండా ఉన్నావు. నీ సవతి కౌసల్య ఐశ్వర్యవంతురాలు అవుతుంది. ఆమె మహావైభవము అనుభవించబోతూ ఉంటే, నీవు ఆమెకు ఊడిగము చేయవలసిన సమయము ఆసన్నము అవుతూ ఉంటే, నీవు నాకు ఆభరణము బహుమానము చేసే బుద్ధిమంతురాలవు. నేను చెప్పుతున్నది ఇప్పుడు నీకు బోధపడదు.

"ఓ కైకా! రాముడు నిరాటంకముగా రాజు అవుతాడు. ఆతరువాత వాడు భరతుణ్ణి దేశాంతరమో, అవసరమయితే లోకాంతరమో పంపించివేస్తాడు, తప్పదు. నీవు భరతుణ్ణి చిన్నప్పటినుంచీ మేనమామ దగ్గర అట్టిపెట్టినావు. ఎవరికి అయినా

దగ్గర ఉన్నవాండ్లమీద కూరిమి ఉండదు. నీకు ఈమాత్రమ్ము ఇది తోచలేదు. చెట్లు సయితము దగ్గర ఉన్న లతలతో చెలిమిచేస్తూ ఉంటవి. భరతుడివెంట పోయిన శత్రుఘ్నుడు అయినా ఇప్పుడు ఇక్కడ ఉంటే ఎంతో బాగుండేది. కట్టెలుకొట్టే వాండ్లు అడవిలో ఒక చెట్టును నరకపోయినారు. అయితే, ఆ చెట్టును అంటిపెట్టుకొని ఉన్న ముండ్లపొదను చూచి భయపడి ఆ చెట్టును వదలిపెట్టి పోయినారట.

"ఓ దేవీ! రాముణ్ణి కనిపెట్టుకొని లక్ష్మణుడూ, లక్ష్మణుణ్ణి కాపాడుతూ రాముడూ అయోధ్యా నగరములో ఉండడము నుంచి, సౌభ్రాతృత్వానికి అశ్వినీదేవతలవలె రామలక్ష్మణులు ప్రసిద్ధికెక్కినారు. రాముడు లక్ష్మణుడికి అపకారము చేయడము అనేది ఉండదు. అయితే, భరతుడికి మాత్రము అపకారము చేసే తీరుతాడు. సందేహములేదు. కాబట్టి, నీ కుమారుణ్ణి కేకయమహారాజు ఇంటినుంచే అటు అడవులకు పొమ్మనడము మంచిది అని నాకు తోస్తున్నది. అట్లా చేసేట్లయితే, నీ కుమారుడు భరతుడి ప్రాణాలు అయినా దక్కుతవి. ఓ కైకా! నీమంచికోసము నేను ఇది అంతా చెప్పుతున్నాను. పితృత్వము అయినా, రాజ్యము ఏవిధముగానైనా భరతుడికి వస్తేనే నీవు సుఖపడతావు. నీ కుమారుడు సుఖపడతాడు. నీవాండ్లు అందరూ సుఖపడతారు. మేము అందరమూ సంతోషిస్తాము.

"ఓ దేవీ! రాముడికి రాజ్యాభిషేకము అవుతుంది. సకల ఐశ్వర్యాలూ, సమస్త అధికారాలూ వాడికి సంప్రాప్తము అవుతవి. భరతుడికి ఎవరిసహాయమూ ఉండదు. సవతితల్లి పుత్రుడు అయినందువల్ల, రాముడికి సహజశత్రువు అవుతాడు. రాముడి దగ్గర వాడు ఎట్లా బ్రతుకుతాడు? అడవిలో తరుముకొని వస్తూవున్న ఏనుగు సింహము నోటిలో పడకుండా కాపాడేటట్లుగా, భరతుణ్ణి రాముడి చేతిలో పడకుండా నీవు ఇప్పుడు కాపాడవలెను.

"ఓ రాజపుత్రీ! నీ పెనిమిటికి నీవు ఒక్కతెవే ప్రియురాలవు అనుకొన్నావు. విర్రవీగిపోయినావు. నీ గర్వములో నీ సవతి కౌసల్యను నీవు అన్నివిధాలా అవమానించావు. ఇప్పుడు ఆమె కొడుకు రాజు కాబోతున్నాడు. ఆమె ఇక నీమీద పగతీర్చుకోకుండా వుంటుందా? నిన్ను తన పనికత్తెగా చేసుకోకుండా ఉంటుందా?

"ఓ కైకేయీ! ఈ విశాల కోసల రాజ్యానికి రాముడు రాజు అవుతాడు. నీవు నీ కొడుకుతో కూడా దరిద్రురాలవు అయిపోతావు. అవమానాలపాలు అయిపోతావు. అన్ని అమంగళాలు అనుభవిస్తావు. రాముడు రాజు కాగానే నీ కుమారుడు భరతుడు నాశనము అయిపోతాడు, తప్పదు. ఓ దేవీ! నీ సుఖమూ, నీ సంతోషమూ, నీ ఐశ్వర్యమూ భరతుడి మీద ఆధారపడి ఉన్నవి. అందువల్ల, నీ కొడుకు రాజు

అయ్యేటట్లు చూడవలెను. రాముడు ఇక్కడనుంచి ఇప్పుడే, ఈ క్షణమే వెళ్ళిపోయేట్టు నీవు ఏది అయినా ఉపాయము ఆలోచించవలెను" అన్నది మంథర.

మంథర ఈవిధముగా చెప్పినందువల్ల కైకేయీదేవిలో కోపాగ్ని రగులుకొన్నది. ఆమె ముఖము ఎర్రపడిపోయింది. పెద్దపెద్ద నిట్టూర్పులు విడుస్తూ, "మంథరా! నే నిప్పుడే, ఈ క్షణమే రాముణ్ణి అయోధ్యా పట్టణమునుంచి వెళ్ళకొట్టిస్తాను. భరతుడికి యువరాజ్యాభిషేకము చేయిస్తాను. ఓ మంథరా! ఇందుకు ఉపాయము ఏది అయినా చెప్పు, జాగ్రత్తగా ఆలోచించు" అన్నది కైక.

ఆ పాపదర్శిని "ఓ రాణీ! సంతోషము. భరతుడు యువరాజు అయ్యే ఉపాయము చెప్పుతాను. దేవీ! నన్ను అడుగుతున్నావు, నీవు నిజముగా మరచిపోయినావా? మరచిపోకపోయి నట్టయితే నేను ఏమి చెప్పుతానో అని, నీకు తెలిసింది దాచిపెట్టుతున్నావా? ఓ విలాసినీ! నేను చెప్పితే వినవలెను అని అనుకొంటున్నావా? అయితే, చెప్పుతాను విను. విన్న తరువాత నీవు జాగ్రత్తగా ఆలోచించు" అంటూ కైకేయీదేవివంక ఉత్సాహముతో చూచింది.

పడుకొన్న శయ్యమీదనుంచిలేచి కైకేయీదేవి, "చెప్పు. భరతుడు రాజు అయ్యే టందుకూ, రాముడు రాజుకాకుండా పోయేటందుకూ ఉపాయము చెప్పు" అన్నది.

కైకేయికి దశరథుని వరాలు

"దేవీ! పూర్వము దేవాసుర యుద్ధములో దేవేంద్రుడికి సాయము చేయడానికి నీ పెనిమిటి నిన్ను కూడా వెంటబెట్టుకొని, రాజర్షులూ మొదలు అయిన వారితో బయలుదేరినాడు. మీరు అందరూ దక్షిణ దిక్కున దండకారణ్యములో 'తిమిధ్వజుడు' అనే శంబరాసురుడు ఉంటూ ఉన్న 'వైజయంతము' అనే పట్టణానికి పోయినారు. ఆ శంబరాసురుడు శతమాయావి. ఆ మహాసురుణ్ణి దేవసేనలు జయించలేక పోయినవి. అప్పుడు వాడు దేవేంద్రుడిమీద పడ్డాడు. ఆ మహాసంగ్రామములో యోధులు పగలు అంతా మహాఘోరముగా పోరాడినారు. బాణశూలాదుల పోటులకూ, పరశుగదాదుల పోటులకూ అందరి ఒండ్లూ గాయాలు అయినవి. చీకటి పడిపోయింది. ఆ రాత్రి అందరూ సొమ్మసిల్లి నిద్రపోతున్నారు. అర్ధరాత్ర మప్పుడు హఠాత్తుగా రాక్షసులు వచ్చి మీమీద పడ్డారు. అప్పుడు నీ పెనిమిటి ఆ రాక్షసులతో భయంకరముగా పోరాడినాడు. యోధులు అందరూ హతము అయిపోయినారు. ఆ తాకిడికి నీ పెనిమిటి తట్టుకోలేక పోయినాడు. దేహము అంతటా గాయాలు అయినవి. రథము మీదనే మూర్ఛపోయినాడు. అప్పుడు ఆ రథము నడుపుతూ ఉన్న నీవు నీ పెనిమిటి మూర్ఛపోవడము చూచి, ఆ రథాన్ని రహస్యప్రదేశానికి తోలుకొని పోయినావు.

వివిధాయుధాలతో రాక్షసులు అక్కడికిన్నీ వచ్చి నీ పెనిమిటిమీద పడ్డారు. అంతట నీవు చాకచక్యముతో మరి ఒక నిగూఢ ప్రదేశానికి రధాన్ని తోలుకొని పోయినావు. నీవు అట్లా రెండుసార్లు నీ పెనిమిటిని కాపాడి, శైత్యోపచారములు చేసి బ్రతికించినావు.

"ఓ శుభనేత్రీ! నిన్ను నీపెనిమిటి అందుకు ఎంతో మెచ్చుకొన్నాడు. రెండుసార్లు నీవు తనను కాపాడినావు కనుక, నీకు రెండు వరాలు ఇస్తాను అన్నాడు. కావలసినప్పుడు కోరుకొంటాను అని, నీవు ఆయన దగ్గర ఆ రెండు వరాలూ నిక్షేపముగా దాచిపెట్టమన్నావు. అందుకు ఆ మహాత్ముడు అంగీకరించినాడు. అప్పటినుంచీ ఇంతవరకూ ఆ రెండు వరాలూ నీవు అడగనూ లేదు, ఆయన చెల్లించనూ లేదు. ఓ రాజపుత్రీ! ఇది అంతా నేను చూడలేదు. ఈ కధ అంతా నీవే ఒకప్పుడు నాకు చెప్పినావు. నీమేలే నాకు కావలెను కనుక, ఈ కధను అంతా జ్ఞాపకము పెట్టుకొన్నాను. ఇప్పుడు నీవు ఆ రెండు వరాలూ ఇవ్వమని అడుగు. ఆ రెండు వరాలూ ముందుగా పుచ్చుకో. భరతుడికి రాజ్యాభిషేకము చేయడమూ, రాముణ్ణి పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి పంపించటమూ- ఆ రెండు వరాలకుగానూ కోరుకో. ముందుగా రామ రాజ్యాభిషేకము ఆపివేయించు.

"దేవీ! రాముడు పధ్నాలుగుఏండ్లు అయోధ్యానగరములో లేకుండా పోయేట్లయితే, భరతుడే రాజుగా స్థిరపడిపోతాడు. ఓ రాజపుత్రీ! ఇకను నీవు ఇప్పుడు చేయవలసింది చెప్పుతాను, విను. నీవు కోపగృహములోనికి పోయి, మాసిన చీర కట్టుకొని, కోపము వచ్చినదానివలె కటికనేలమీద పడుకోవలెను. నీ పెనిమిటి వస్తాడు. నీవు కన్నెత్తి అయినా ఆయనను చూడకూడదు. ఆయన పలుకరించినా నీవు పలుక కూడదు. అదేపనిగా ఏడుస్తూ నేలమీద పొర్లాడుతూ ఉండవలెను. ఓ శుభాంగీ! నీ పెనిమిటికి నీ మీద ఎంతమక్కువో నీకు తెలియదు. నాకు తెలుసును. నీవు ఒక్కతెవే ఆయన హృదయప్రియవు. ఈవిషయంలో ఈషణ్మాత్రమూ సందేహమువద్దు. నిన్ను ఆయన కోపపడడు. నీకు కోపము వస్తే నీవంక చూడడానికికూడా ఆయన వెరుస్తాడు. నీకోసము నిప్పులలోకి దూకమంటే ఆయన దూకుతాడు. నిన్ను సంతోషపెట్టడానికి ఆయన తన ప్రాణము అయినా వదులుతాడు. ఓ మందమతీ! నీ సౌందర్యబలము ఎటువంటిదో నీకు తెలియదు. నేను చెప్పుతున్నాను, నమ్ము. నా మాట విను. నీ పెనిమిటి నీ మాటకు అడ్డు చెప్పడు.

"కేకయరాజపుత్రీ! నీకు ఎన్నో ముత్యాలహారాలూ, రత్నాలహారాలూ ఆయన ఇస్తాను అంటాడు. కోరుకొన్నంత బంగారము ఇస్తాను అంటాడు. నీకు కావలసిన ఆభరణాలూ ఇస్తాను అంటాడు. నీ మనస్సును వాటిమీదకి పోనీయవద్దు. కొంచెము అయినా మెత్తపడవద్దు. ఓ భాగ్యశాలినీ! దేవాసుర యుద్ధములో నీకు వాగ్దానముచేసిన

రెండు వరాలను గురించే నీవు ముందుగా జ్ఞాపకము చేయవలెను. ఆ వరాలను గురించిన వాగ్దానము గట్టి చేసుకోవలెను. ఆ రెండు వరాలూ చెల్లిస్తాను అంటూ ఆయన నిన్ను లేవదీయ పోతాడు. అంతమాత్రానికే నీవు నేలమీదనుంచి లేవ కూడదు. ఆ రెండు వరాలూ చెల్లిస్తాను అని ఆయన చేత ప్రమాణము చేయించుకొని మరీ లేవవలెను. ఆ రెండు వరాలూ ఇస్తాను అని ఆయన ప్రమాణము చేసిన తరువాత, ఆ వరాలకుగాను భరతుడికి పట్టము కట్టవలెను అనీ, రాముణ్ణి పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి పంపవలెను అనీ చెప్పు.

"ఓ కైకా! రాముడు పధ్నాలుగు సంవత్సరాలు అడవిలో ఉండేట్లయితే, నీ కొడుకు ఇక్కడ పాదుకొనిపోతాడు. మూలబలము అంతా నీ కుమారుడికి అధీనము అవుతుంది. చివరవరకూ భరతుడే రాజ్యము ఏలుతాడు. దేవీ! రామప్రవాసము ముఖ్యముసుమా! నేను ఇప్పుడు చెప్పినట్టు చేస్తే నీకూ, నీ పుత్రునికీ సర్వార్థాలూ సమకూడుతవి. ఓ భామినీ! పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసముచేస్తే, రాముడు అరాముడు అయిపోతాడు. తిరిగివచ్చినా ఏమీ చేయలేడు, ఏకాకిగా ఉండిపోతాడు.

"ఓ రాణీ! నీవు ఏమాత్రమూ భయపడ నక్కరలేదు. నీవు తలచుకొంటే తలచుకొన్నంతా అయితీరుతుంది. ఇదే సమయము. ఈరాత్రే దశరథమహారాజు చేత నీవు నీపనిని నెరవేర్చుకోవలెను. రామాభిషేకము జరుగకుండా చేయవలెను సుమా!" అన్నది మంథర.

కైక ఇది అంతా సావధానముగా విన్నది. అంతవరకూ అంతా ప్రతికూలమేమో ననుకొంటూ ఉన్నది. అంతా అనుకూలముగా తోచింది. సంతోషించింది. ఆలోచించింది. గూనిది చెప్పిన ఉపాయానికి విస్మయపడిపోయింది. ఆమె మనస్సు దొడుతీయడము మొదలుపెట్టింది. అంతట ఆ పరమదర్శిని పెంటిగుర్రముపిల్ల మాదిరిగా దారి తప్పింది.

కైకేయీదేవి మంథరను చూచి నవ్వుతూ, "ఓ గూనీ! నీవు ఇంత తెలివి అయినదానవు అనీ, ఇంత చక్కగా చెప్పగలవు అనీ నాకు ఇదివరకు తెలియదు. గూనివాండ్లకు తెలివితేటలు ఎక్కువ అని విన్నాను. కానీ, నీ అంత తెలివి అయింది ఈ పృథ్విలో ఎక్కడనూ ఉండదు. నీవు ఒక్కతెవే నా లాభము ఆలోచిస్తూ, నా మేలు కోరుతున్నావు. నీవు ఇప్పుడు లేకపోయినట్లయితే రాజు తలపెట్టింది నాకు ఏమీ తెలిసేదికాదుసుమా!

"మంథరా! నీవు ఎంతో మంచిదానవు. మంచిదానవేకాదు, నీవు నిజముగా ఎంతో అందము అయినదానవు. నీవు అందరు గూనివాండ్లవంటిదానవు కావు.

గాలికి వంగిన తామరపువ్వవలె, నీవు ఎంతో చక్కగా ఉన్నావు. నీ మూపుల నిక్కుకు అసూయపడి, నీ రొమ్ము పక్కలతో కూడ కంరము వరకూ ఉబ్బింది. నీ రొమ్ముల ఉబ్బుకు సిగ్గుపడి, చక్కని బొడ్డుతో ఉన్న నీ కడుపు సన్నగిల్లి పోయింది. నీ పెద్ద పెద్ద మొత్తలతో పోటీపడి, నీ స్తనాలు బలిసిపోయినవి. నీ ముఖము ఏ కళంకమూలేని చంద్రబింబము మాదిరిగా ఉంది. మంధరా! నీవు ఎంత అందకత్తెవే? నీవు తెల్లని పట్టుచీర కట్టుకొని నీ మొలనూలుగజ్జల చప్పుళ్ళతో, నీ లావుపాటి తొడలతో, నీ చక్కని పిక్కలతో, నీ పొడుగాటి పాదాలతో నాముందు నడుస్తూ, ఉంటే, నీవు రాజహంస మాదిరిగా కనపడుతావు.

"ఓ మంధరా! శంబరాసురుడికి నూరు మాయలే తెలుసును. నీకు వేలకు వేలు తెలుసు. రధఘోణమువంటి నీ గూనిలో ఎన్నో మాయలూ, ఎన్నో రాజనీతులూ కాపురము చేస్తూ ఉన్నవి. కుబ్జా! రాముడు అడవికి పోగానే, భరతుడికి పట్టాభిషేకము కాగానే నీకు బంగారపు పూలదండలు వేయిస్తాను. నీచేత బంగారు రవిక తొడిగిస్తాను. రకరకాల రత్నాలతో శోభాయమానము అయిన బంగారు బొట్టు చేయించి పెట్టుతాను. నీ ఒంటినిండా సొమ్ములు దిగవేయిస్తాను. మంచిమంచి చీరెలు కట్టపెట్టుతాను. నా సవతులను అందరినీ తృణీకరించి నీవు గర్వముతో తిరిగేటట్టు చేస్తాను. దాసీలు అందరిచేతనూ నీకు పాదసేవ చేయిస్తాను" అంటూ మంథరను ఉబ్బిస్తూ ఆ తెల్లటి పాన్పుమీద వాలింది.

కైకేయీదేవి శయ్యమీద నయితే వాలిందేకాని ఆమె ఆలోచనలు, వేదికలో అగ్నిజ్వాలలవలె రగులుకోవడము మొదలుపెట్టినవి. ఆమె స్థితి మంథర గమనించింది. "ఓ కళ్యాణీ! నీళ్ళు అన్నీ పార్లిపోయిన తరువాత ఆనకట్ట వేయడము ఎందుకు? రామాభిషేకము అయిపోయిన తరువాత నీవు వరాలు అడిగితే ప్రయోజనము ఏమిటి? దేవీ! కాల యాపనము వద్దు. నీవు ఇప్పుడే లేవవలెను. నేను చెప్పినట్లు చేయవలెను. రాజుకై నీవు ఇక ప్రతిక్షణమూ ఎదురుచూస్తూ ఉండవలెను" అంటూ మంథర ఆ సౌందర్యమదగర్వితను పురికొల్పింది.

అంతట ఆ వాలుకన్నుల సొగసుకత్తె ఆ గూనిదానిని వెంటబెట్టుకొని చీకటిగదిలోకి పోయింది. అనేకలక్షలు కిమ్మత్తుచేసే ముత్యాలహారాలనూ, రత్నాల హారాలనూ తీసివేసింది. బంగారముబొమ్మవలె నేలమీద కూర్చుని, "కుబ్జా! నేను కోరే వరము ఒకవేళ నా పెనిమిటి ఇవ్వకపోయేట్లయితే, నేను ఇక్కడనే చచ్చిపోతాను. అప్పుడు నీవు దశరధమహారాజుకో, కేకయమహారాజుకో నా చావు తెలియచేయవలసి వస్తుంది. మంథరా! రాముడు అడవికి పోవలెను. భరతుడు రాజు కావలెను. అంతే.

నాకు బంగారము అక్కరలేదు. రత్నాలు అక్కరలేదు. ఆభరణాలు అంతకన్నా అక్కరలేదు. రామాభిషేకమే జరిగేట్లయితే నేను బ్రతుకను" అన్నది కైకేయీదేవి.

కైకేయీదేవికి మేలుచేయడానికి, రాముడికి కీడుచేయడానికి మంథర అతిక్రూరముగా, "ఓ కళ్యాణీ! రాముడే దొరతనానికివస్తే నీవూ, నీ కొడుకూ దుఃఖాలపాలుకాక తప్పదు. అందువల్ల, నీవు భరతుడికి రాజ్యాభిషేకము చేయించి తీరవలెను" అన్నది.

మంథర పదేపదే చెప్పిన మాటలు కైకేయీదేవి హృదయములో నాటుకొని పోయినవి. ఆమెకు దుఃఖము వచ్చింది. ఆశ్చర్యము వేసింది. ఉత్తరక్షణాన కోపము రేగింది. చేతులతో రొమ్ములు బాదుకొంటూ, "ఓ మంథరా! భరతాభిషేకము జరిగి తీరవలెను. రాముడు వనవాసానికి పోయి తీరవలెను. రాముడు అడవికి పోకపోయినట్లయితే ఈ చీకటి గదిలో, ఈ కటిక నేలమీదనుంచి నేను లేవనే లేవను. స్నానము చేయను. చందనచర్చ చేసికోను. అన్నము తినను. నీళ్ళు అయినా త్రాగను. ప్రాణము వదలి వేస్తాను" అంటూ, కైకేయీదేవి మహాదారుణము అయిన శపథము చేసింది. ఇంకా ఒంటిన మిగిలి ఉన్న సొమ్ములు అన్నీ తీసివేసి నేలమీద పారవేసింది.

పుణ్యాంతాన దేవలోకమునుండి భూమిమీదపడ్డ కిన్నరాంగనవలె ఆ నేలమీద పడుకున్నది. కోపముతో ఆమె ముఖము మాసిపోయింది. తళతళలాడే ముత్యాలహారాలు, రత్నాలహారాలు తీసివేసినందువల్ల, ఆమె నక్షత్రాలు అస్తమించి చీకట్లు క్రమ్ముకొన్న ఆకాశము మాదిరిగా అయిపోయింది.

10

ఆ పాపాత్ములారాలు మంథర విపరీతబోధ చేసినందువల్ల, కైకేయీదేవి తన భవిష్యత్తును గురించి భయపడిపోయింది. దిగులుపడ్డది. అందుకోసము విషము పూసిన బాణము దెబ్బతిన్న కిన్నరాంగనవలె నేలకు ఒరిగింది. కోపముతో ఆడుత్రాచుపామువలె బుసలు కొట్టింది. కర్తవ్యము మనసా నిశ్చయించుకొన్నది. తాను సంకల్పించుకొన్న కార్యము నెరవేరుతుందా, నెరవేరదా అని కొంచెముసేపు ఆలోచించింది. కృతకృత్యను అవుతాను అనుకొన్నది. మంథరను చూస్తూ మెల్లగా, 'అంతా బాగుంది' అని చెప్పింది.

ఆమె సంకల్పము సిద్ధించినట్లే మంథర భావించింది. ఎంతో సంతోషించింది. కైకేయీదేవి తీసివేసిన రంగురంగుల పూలదండలనూ, రత్నాలహారాలనూ, ముత్యాలహారాలనూ, దివ్యాభరణాలనూ ఆ నేలమీద వెదచల్లి వెళ్ళిపోయింది.

కైకేయీదేవి మాసినచీర కట్టుకొని, చక్కగా అల్లిఉన్న తన జడను విప్పుకొని, తన వెంట్రుకలు అన్నీ గడ్డివెంటివలె ఒక్కపాయగా మెలిపెట్టుకొని, కనుబొమ్మలు ముడివేసి పుణ్యాంతము అయిన కిన్నెరాంగనవలె కటికనేలమీద పడుకొన్నది. ఆ చీకటిలో ఇంట్లో మంధర వెదజల్లి పోయిన ఆభరణాలన్నీ, నీలాకాశములో నక్షత్రాల వలె మెరుస్తూ ఉన్నవి.

కైకేయీ మందిరం

దశరథమహారాజు పట్టాభిషేకము ప్రకటించి, కొలువు చాలించి అంతఃపురము లోనికి బయలుదేరినాడు. కైకేయీదేవికి రామపట్టాభిషేక విషయము తెలిసి ఉండదు అనుకొన్నాడు. ఆ సంతోషవార్త ఆ ప్రియురాలికి స్వయముగా చెప్పవలెను అనుకొని, రాహువు ఉన్నాడు అని తెలియక, తెల్లని మేఘాలు ఉన్న ఆకాశములోనికి చంద్రుడు పోయినట్టుగా దశరథమహారాజు కైకేయీదేవి అంతఃపురములోనికి పోయినాడు.

కైకేయీదేవి అంతఃపురంలో చిలుకలూ, కోకిలలూ, కొంచపిట్టలూ, హంసలూ, నెమళ్ళూ ఎప్పుడూ మనోహరముగా పాటలు పాడుతూ నేత్రపర్వముగా, నాట్యము ఆడుతూ ఉంటవి. ఎటుచూచినా సంపెంగచెట్లూ, అశోకవృక్షాలూ, లతాగృహాలూ, చిత్రగృహాలూ కనబడుతవి. వాటిలో ఏనుగు దంతాలూ, వెండి బంగారాలు పొదిగిన తిన్నెలూ ఎంతో అందముగా ఉంటవి. దోహదక్రియవల్ల ఆ అంతఃపురోద్యాన వనములో అన్నిఋతువులలోనూ వృక్ష లతా గుల్మాదులు పూలు పూస్తూనూ, కాయలు కాస్తూనూ, పండ్లు పండుతూనూ ఉంటవి. సమయోచితముగా వీణలు మ్రోగిస్తూ, పిల్లనగ్రోవులు ఊదుతూ, మద్దెళ్ళు వాయిస్తూ, కంచుతాళాలు వేస్తూ జంత్రగానము సాగుతూ ఉంటుంది. మాటకారులు అయిన గూని దాసీలు, పొట్టి పొట్టి దాసీలూ సిద్ధముగా ఉంటారు. ఏనుగు దంతాలతోనూ బంగారముతోనూ వెండితోనూ చేసిన పీటలూ, మనోహరము అయిన వాద్యాలూ, రుచ్యము అయిన రకరకాల భక్ష్యాలూ, రకరకాల అన్నాలూ ఎప్పుడూ సిద్ధముగా ఉంటవి. మనోహరముగా అలంకరించుకొన్న స్త్రీలు అక్కడ ఎప్పుడూ కనిపెట్టుకొని ఉంటారు. ఇన్నిమాటలు ఎందుకు, అది కేవలము స్వర్గధామము.

దశరథమహారాజు హుటాహుటీ ఆ అంతఃపుర శయ్యాగృహములోకి పోయినాడు. అక్కడ ఆయనకు కైకేయీదేవి కనిపించలేదు. ఆమె బుద్ధి బుగ్గి అయిపోయింది అనీ, ఆమె స్వార్థపరురాలు అయిపోయింది అనీ ఆయనకు తెలియదు. కామోద్రేకముతో "కైకా" అని పిలిచాడు. జవాబు లేదు. తన కాలి చప్పుడు కాగానే ఎప్పుడూ ఎదురుగుండా పరుగెత్తుకొనివచ్చే కైకేయీదేవి రాకుండా ఉండడమూ, ఆ శయ్యా గృహము అట్లా శూన్యముగా ఉండడమూ ఆయన అదివరకు ఎన్నడూ

ఎరుగడు. దశరథమహారాజు కైకను గురించి ద్వారపాలికను అడిగాడు. ఆ ద్వారపాలిక భయముతో వణికిపోతూ, "దేవా! దేవిగారికి, చాలా కోపము వచ్చింది. క్రోధాగారములోకి పరుగెత్తింది" అని చెప్పింది. దశరథమహారాజు మనస్సు చివుక్కు మన్నది. ఆయన దేహము అంతా కంపించింది.

ఆ చీకటిగదిలో కటికనేలమీద పడిఉన్న కైకేయీదేవిని దశరథమహారాజు చూచినాడు. ఆ సుకుమారి అట్లా నేలమీద పడుకొన్నందుకు ఆయనకు కష్టము వేసింది. దుఃఖము వచ్చింది. ఆయన వృద్ధుడు. ఆమె తరుణి. ఆయన తన ప్రాణముకన్నా ఆమెను ఎక్కువగా చూచుకొనేవాడు. ఆయన ఏ పాపమూ ఎరుగడు. ఆమె పాపసంకల్ప.

కత్తితో తెగవేసిన పూలతీగవలెనూ, పుణ్యక్షయము అయి నేలకూలిన దేవకన్యవలెనూ, క్రిందపడత్రోసిన కిన్నెరాంగనవలెనూ, దేవలోకములోనుంచి జారిపడ్డ అప్సరాంగనవలెనూ, పసచెడి నేలకూలిన మోహినీదేవతవలెనూ, కట్టిపడవేసిన లేడిపిల్లవలెనూ, అలసి సొలసి పడిపోయిన ఆడగుర్రమువలెనూ, అడవిలో వేటగాడు వేసిన విషలిప్తబాణానికి నేలకూలిన ఆడ ఏనుగువలెనూ ఉన్న కైకేయీదేవిని దశరథమహారాజు చూచినాడు. ప్రేమాతిశయముతో పెంటి ఏనుగును పోతు ఏనుగు తొండముతో తడివినట్లు, తన చేతితో తడివినాడు.

దశరథమహారాజు అట్లా కైకేయీదేవిని తన చేతితో నిమురుతూ, తామర రేకులవంటి ఆమె నేత్రద్వయాన్ని చూచినాడు. తొట్రుపాటుతో, "దేవీ! నామీద నీకు కోపము రావడానికి కారణము ఏమిటి? నిన్ను ఎవరు అయినా తిట్టినారా? ఎవరు అయినా నిన్ను అవమానించినారా? వివరముగా చెప్పు.

"ఓ కళ్యాణీ! నీవు ఇట్లా దుమ్ములో పడుకొని ఉండడము నేను చూడలేను. నీకు ఏమి తక్కువ అయింది? నీకు ఏమి లోపము వచ్చింది? దయ్యముపట్టినదాని వలె ఈ కటికనేలమీద ఎందుకు పడుకొన్నావు? చెప్పు. దేవీ! నీకు ఏమి అయినా సుస్తీగా ఉందా? చెప్పు. సమర్థులు అయిన వైద్యులు ఎంతోమంది ఉన్నారు. వారిని పిలుస్తాను. నిన్ను ఎవరు అయినా కష్టపెట్టినారేమో, చెప్పు. పోనీ, నీకోసము నేను ఎవరిని అయినా సంతోషపెట్టవలెనేమో, చెప్పు. నీవు అనుకొనేదానికన్నా వెయ్యిరెట్లు ఎక్కువగా వారిని సంతోషపెట్టుతాను. రాణీ! నీవు దిగులు పడవద్దు. నీ దేహాన్ని ఇట్లా కష్టపెట్టవద్దు. ఎవణ్ణి అయినా చంపివేయమంటావా? ఎవణ్ణి అయినా వెళ్ళగొట్టమంటావా? ఏ దరిద్రుణ్ణి అయినా ధనవంతుణ్ణి చేయమంటావా? ఏ ధనవంతుణ్ణి అయినా దరిద్రుణ్ణి చేయమంటావా? నీవు చెప్పినట్లు నేను చేస్తాను, నావాండ్ల చేత చేయిస్తాను. కైకా! నాకు ప్రాణాపాయము అయ్యే పనిని అయినా నీ

కోసము చేస్తాను, చెప్పు. నీమీద నాకు ఎంత అనురాగము ఉందో నీకు తెలుసును. నేను నిన్ను సంతోషపెట్టుతాను. నన్ను నీవు సంశయించవద్దు, చెప్పు. నా పుణ్యకర్మసాక్షిగా ఒట్టుపెట్టుకొంటున్నాను. దేవీ! ప్రాచ్య సింధు సౌవీర్య సౌరాష్ట్రాలు, వంగాంగ మగధ మధ్య దేశాలూ, కాశీ కోసల రాజ్యాలూ, దక్షిణాపథమూ ధనధాన్యాలతో, సమస్త ద్రవ్యాలతో సకల సమృద్ధముగా ఉంటూ ఉన్నవి. ఆ దేశాలలో దొరికే ఏ అమూల్య వస్తువులు నీవు కోరుకొన్నా, నీకు తెప్పించి ఇస్తాను. ఓ శుభాంగీ! ఎందుకు నీవు ఇట్లా బాధపడుతావు? ఓ మంగళస్వరూపిణీ! నీవు లేవవలెను. నీవు దేనికి భయపడుతున్నావో చెప్పవలెను. సూర్యుడు మంచును విడకొట్టినట్లు, నీ భయాన్ని పోగొట్టుతాను" అంటూ దశరథమహారాజు కైకేయీదేవిని బుజ్జగించినాడు.

ముందుగా తన భర్తచేత శపథము చేయించనిదే, అప్రియము చెప్పకూడదు అని కైకేయీదేవి నిశ్చయించుకొన్నది.

11

కైకేయి కోరిక

కామోద్రేకములో ఉన్న దశరథమహారాజును చూస్తూ కైకేయీదేవి, "దేవా! నాకు జబ్బు ఏమీలేదు. నన్ను ఎవరూ అవమానించనూలేదు, నిందించనూ లేదు. నాకు ఒక కోరిక ఉంది. ఆ కోరిక మీరు చెల్లించవలెను. మీరు నా కోరిక చెల్లిస్తాము అని ఒట్టు పెట్టుకొంటేనే, నా కోరిక ఏమిటో చెప్పుతాను" అంటూ చిరునవ్వు నవ్వింది.

దశరథమహారాజున్నూ మందహాసముచేస్తూ ఆమె తలవెంట్రుకలు నిమురుతూ, "ఓసి వెర్రిదానా! నీ కంటే స్త్రీలలో నాకు ప్రియురాలు ఎవరు? పురుషులలో రాముడికంటే నాకు ఎక్కువ అయిన వాడు ఎవడు? ఇది నీకు తెలియదా? తెలుసును. కైకా! చెప్పుతాను విను. నా బిడ్డలు అందరిలోను నాకు ప్రియము అయినవాడు రాముడు. వాడు అజయ్యుడు. పరమపూజ్యుడు. నా ప్రాణముకన్నా వాడు నాకు ఎక్కువ అయినవాడు. కాస్సేపు వాణ్ణి చూడకపోయేట్లయితే నేను బ్రతుకలేను. నీ కోరిక నేను చెల్లిస్తాను అని ఆ రాముడిమీద ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను.

"ఓ శుభనేత్రీ! ఇప్పుడు అయినా నా మనస్సు తెలుసుకో. నీ కోరిక ఏమిటో చెప్పు, నేను చెల్లిస్తాను. నన్ను అనుమానించవద్దు. నిన్ను సంతోషపెట్టుతాను. నా పుణ్యముతోడు, నీ కోరిక చెల్లిస్తాను" అంటూ ఒట్టుపెట్టుకొన్నాడు.

ఆయన అనుకూలుడు అయినందుకు కైకేయీదేవి సంతోషపడ్డది. తన కోరిక శత్రువులతో నయినా చెప్పకూడనిది అని ఆమెకు తెలుసును. అది ఆయనకు ప్రాణాంతకము అవుతుంది అని కూడా ఆమెకు తెలుసును. కాని స్వాభిమానమూ,

స్వపుత్రపక్షపాతము ఆమెను మింగివేసినవి. "రాజా! నాకోరిక తాము చెల్లిస్తాము అని తమ కొమారుడు సాక్షిగా, తమ పుణ్యము సాక్షిగా ఒట్టుపెట్టుకొన్నారు. తమ శపథము ఇప్పుడు అగ్నిహోత్రుడు మొదలు అయిన ముప్పయిమూడుకోట్ల దేవతలూ విన్నారు. భూమ్యాకాశాలూ, సూర్యచంద్రులూ, తక్కిన గ్రహాలూ విన్నవి. ఈరాత్రి సంచారము చేస్తూ ఉన్న సర్వభూతాలూ విన్నవి. ఈ రాజనగరులో ఇలవేల్పులు అందరూ విన్నారు.

"రాజా! మీరు సత్యసంధులు. పరమధార్మికులు. మహాపరాక్రమవంతులు. నా కోరిక చెల్లిస్తాము అని నాకు మాట ఇచ్చినారు. ఇందుకు దేవతలు అందరూ సాక్షులు సుమా!" అంటూ, కైకేయీదేవి దశరథమహారాజు చెయ్యి పట్టుకొన్నది. ఆ కాముకుడు ఉబ్బితబ్బిబ్బులు అయిపోయినాడు.

"ఓ రాజా! దేవాసుర యుద్ధము జ్ఞాపకము తెచ్చుకోండి. ఆ రాత్రి శంబరాసురుడు అందరినీ సంహారము చేసివేసినాడు. మీరు అప్పుడు కొనఊపిరితో ఉన్నారు. నేను ఎంతో మెలకువతో అప్పుడు మిమ్ములను కాపాడినాను. మీ ప్రాణము దక్కించినాను. మీరు అప్పుడు నన్ను మెచ్చుకొని ఏవి అయినా రెండు వరాలు నేను కోరుకున్నవి నాకు ఇస్తాను అని అన్నారు. కావలసివచ్చినప్పుడు కోరుకొంటాను అని నేను ఆ రెండు వరాలూ నిక్షేపమువలె తమదగ్గరనే దాచిపెట్టుకొన్నాను.

"నాధా! తాము ఈభూమిని అంతా ఏలుతూ ఉన్న ప్రభువులు. ఆడితప్పరు అని ప్రసిద్ధి కెక్కినారు. మీరు నాకు భర్తలు. నేను అప్పుడు తమదగ్గర దాచిపెట్టుకొన్న రెండు వరాలూ తాము నాకు ఇప్పుడు చెల్లించవలెను. ఇదే నాకోరిక. ఇదివరకు మీరు కోరుకోమన్న వరాలనే నేను ఇప్పుడు కోరుకొంటాను. మీరు ఆ వరాలు తాము ఇవ్వము అనేట్లయితే నాకు అవమానము అవుతుంది. అవమానపడ్డ తరువాత నేను బ్రతికి ఉండడము ఉత్తది. మీ ఎట్టఎదుటనే నేను ప్రాణము విడువవలసి వస్తుంది" అంటూ, ఆమె దశరథమహారాజును ధర్మపాశముతో బంధించి వేసింది.

వలపన్ని బోయవాడు కూతపెట్టగానే జింక పరుగెత్తుకొనివచ్చి వలలో పడ్డట్టు, కైక పన్నిన వలలో దశరథమహారాజు ఏమీ తెలియకుండా పడిపోయినాడు. ఆ కామమోహితుడు ఆమె కోరే రెండు వరాలూ చెల్లిస్తాను అన్నాడు.

ఉత్పుల్లనేత్రాలతో కైకేయీదేవి దశరథమహారాజును చూచింది. దగ్గరకు చేరింది. ప్రశాంతముగా, "నాధా! ఆ రాత్రి మీరు కోరుకోమన్న రెండు వరాలూ ఇప్పుడు రెండుగా కోరుతున్నాను. రాముడి కోసము ఇప్పుడు మీరు ఏర్పాటుచేసిన అభిషేక సంబారాలు అన్నిటితోనూ నా కొమారుడికి భరతుడికి రాజ్యాభిషేకము చేయించవలెను. ఇది తాము నాకు చెల్లించవలసిన మొదటి వరము. ఇక రెండవ

వరము, రాముడు జటాజినాలు ధరించి దండకారణ్యము పోయి పధ్నాలుగుఏండ్లు ఋషి మాదిరిగా వనవాసముచేసి రావలెను. భరతుడు నిరాటంకముగా యువరాజు కావలెను. ఇదే నా ముఖ్యము అయిన కోరిక. రాజా! ఇప్పుడే, నా కళ్ళ ఎదుటనే రాముడు అడవులకు ప్రయాణము అయిపోవలెను. ప్రభూ! తాము రాజరాజులు. సత్యవ్రతులు. తాము శపథము చేసినారు. తాము దబ్బరలు ఆడకూడదు. నా కోరిక చెల్లించి తాము తమ వంశగౌరవాన్ని నిలబెట్టుకోవలెను. తమ సదాచారాన్ని కాపాడుకోవలెను. తమ జన్మ సార్థకము చేసుకోవలెను.

"దేవా! ఆడితప్పని వారికే ఇహము, పరమూ అని తపోధనులు చెప్పుతూ ఉంటారు" అని అన్నది కైకేయీదేవి.

12

దశరథుని దురవస్థ

ఈ దారుణము అయిన మాటలకు దశరధమహారాజు దద్దరిల్లి పోయినాడు. మూర్ఛపోయినాడు. కొంచెముసేపటికి తెప్పరిల్లి, 'ఇది కలా! నిజముగానే కైకేయి ఇట్లా అన్నదా? చిత్తభ్రమణమా? పూర్వజన్మవృత్తాంత స్మరణమా? మనోజాడ్యమా' అని ఆలోచించసాగినాడు. ఏమీ అంతుపట్టలేదు. దుఃఖము అత్యుత్కటము అయిపోయింది. మళ్ళీ మూర్ఛపోయినాడు. చాలాసేపటికి తెలివి వచ్చింది. ఎటో పరుగెత్తపోయి ఆడు పెద్దపులి ఎదుటపడ్డ జింకవలె నివ్వెరపోయినాడు. ఆయన అవయవాలు పట్టు తప్పిపోయినవి. ఆ కటికనేలమీద చతికిలి పడిపోయినాడు. మంత్రానికి యంత్రమండలములో కట్టుబడిపోయి బుసలుకొట్టే పాములవలె పెద్దపెద్ద నిట్టూర్పులు విడుస్తూ, "ఛీ ఛీ" అన్నాడు. కోపోద్రేకముతో, దుఃఖముతో కొట్టుకులాడుతూ మళ్ళీ మూర్ఛపోయినాడు.

ఎంతోసేపటికి తెలివి వచ్చింది. పరమక్రుద్ధుడు అయిపోయినాడు. కన్నులలోనుంచి నిప్పుకణాలు రాలుస్తూ కాల్చివేసేటట్టు చూస్తూ, "ఓ దుష్టచారిణీ! నీవు మా వంశాన్ని నిర్మూలనముచేయ తలచుకున్నావా? నీకు నేను ఏమి అపకారము చేసినాను? రాముడు ఏమి అపరాధము చేసినాడు? సొంతతల్లికి సేవచేసేటట్టు నీకు సేవ చేస్తున్నాడే! ఇప్పుడు నీవు వాడికి ఈ అన్యాయము ఎందుకు తలపెట్టినావు? నీవు రాకుమారివి అనుకొన్నాను. తీక్షణవిషసర్పాన్ని అజ్ఞానమువల్ల ఇంట్లోకి తెచ్చుకొన్నట్టు నిన్ను తెచ్చుకొన్నాను.

"ఓ కైకా! నా ప్రియపుత్రుణ్ణి సకలప్రాణికోటీ కొనియాడుతూ ఉంది. వాడు ఏమి తప్పుచేసినాడు అని నేను అడవులకు వెళ్ళకొట్టవలెను? అవసరము అయితే

నేను కౌసల్యను అయినా, సుమిత్రను అయినా, నా ఐశ్వర్యాన్ని అయినా, నా రాజ్యాధికారాన్ని అయినా, చివరకు నా ప్రాణాన్ని అయినా వదలిపెట్టుతాను. కాని నా జ్యేష్ఠపుత్రుణ్ణి, అందులోను పితృవత్సలుణ్ణి నేను వదలిపెట్టలేను. వాడు ఉంటూ ఉన్నందువల్లనే నేను బ్రతుకున్నాను. వాణ్ణి చూడకపోయేట్లయితే నా ప్రాణమే నిలువదు. కైకా! పాపిష్ఠి కోరికలు కోరవద్దు. నీవు ఈ కోరిక ఇంతటితో మానుకో. రాముడిమీద కోపము వద్దు. నేను నీ పాదాలు పట్టుకొంటాను.

"కైకా! ఈ పరమదారుణము అయిన కోరిక నీవు ఎందుకు కోరినావు? భరతుడిమీద నాకు ప్రేమ ఉందో లేదో తెలుసుకోవలెను అని అడిగినావా? అయితే అయివుండ వచ్చును. అట్లా అయినట్లయితే, భరతుడికి రాజ్యాభిషేకము చేయమని అడుగవలెను కాని, రాముణ్ణి అడవులకు పంపించమని అడగడము ఎందుకు?

"ఓ కైకా! రాముడు జ్యేష్ఠుడు అనీ, అందరికన్నా హెచ్చు అయినవాడు అనీ నీవే ఇదివరకు నాతో చెప్పుతూ వచ్చినావే! ఆ చెప్పినమాటలు అన్నీ ఇచ్చకాలేనా? నన్ను సంతోషపెట్టటానికో, రాముడిచేత సేవచేయించుకోవటానికో చెప్పిన కల్లబొల్లి కబుర్లేనా? అట్లాకాకపోయినట్లయితే, రామాభిషేకము అని నీకు తెలియగానే దుఃఖతాపముతో ఈ క్రోధాగారములోనికి ఎందుకు వచ్చినావు? నీవు ఎందుకు దుఃఖపడుతున్నావు? నన్ను ఎందుకు దుఃఖపెట్టుతున్నావు? ఎవరు అయినా నీకు దుర్బోధ చేసి ఉండవలెను లేదా కంటికి అగుపించని పిశాచాలు నిన్ను ఆవహించి అయినా ఉండవలెను.

"ఓ కైకా! నీవు ఇంతవరకూ బుద్ధిమంతురాలవుగా ప్రవర్తించినావు. ఇప్పుడు నీకు విపరీతబుద్ధి పుట్టింది. నీనుంచి ఈ ఇక్ష్వాకువంశానికి అనర్థము రాపోతున్నది. ఓ విశాలాక్షీ! నీవు ఇదివరకు ఒక్క అనుచితము అయిన పనీ చేసి ఎరుగవు. ఒక్క అప్రియమూ ఆడి ఎరుగవు. నీవు ఇప్పుడు ఇట్లా కోరుతూ ఉంటే, నేను నమ్మలేకుండా ఉన్నాను. ఓ చిన్నదానా! నీవు అనేకమార్లు నాతో రాముడూ, భరతుడూ నీకు సరిసమానులేనని చెప్పినావు. ఓ రాణీ! నీవు ధర్మభీతికలదానవే, ఇప్పుడు ఆ ధర్మభీతి ఏమి అయిపోయింది? పరమధార్మికుడు అయిన రాముణ్ణి పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేయమంటున్నావే, ఆ యశస్వి ఏమి తప్పుచేసినాడు? వాడు, ఆ కుసుమకోమలశరీరుడు, ఆ సుందరాకారుడు రాముడు నీకు ఎప్పుడూ భరతుడికన్నా ఎక్కువగా సేవచేస్తూ వచ్చినాడే, వాణ్ణి ఎందుకు అడవులకు వెళ్లకొట్టమంటున్నావు? ఇప్పుడు కొత్తగా భరతుడిలో నీకు అతిశయము ఏమి కనిపించింది, వాడికి యువరాజ్యాభిషేకము చేయమంటున్నావు? ఓ శుభాంగీ!

రాముడు నీకు సేవచేయడము ఒక్కటే కాదు, నిన్ను గౌరవిస్తున్నాడు. పూజిస్తున్నాడు. నీవు చెప్పినట్టు చేసేవాడు వాడు తప్ప, మరి ఎవడూ లేడు. వాణ్ణి ఎందుకు అడవులకు పంపించమంటున్నావు?

"ఓ కేకయరాజపుత్రీ! ఈ రాజనగరులో ఎన్నోవేలమంది స్త్రీలు ఉన్నారు. ఇంకా ఎన్నోవేలమంది సేవకులు ఉన్నారు. వారిలో ఎవరు అయినా రాముడిలో ఒక్క తప్పు అయినా పట్టినారా? ఒక్క అపవాదు అయినా వేసినారా? రాముడు పరిశుద్ధుడు. సమస్త ప్రాణికోటినీ సంతోషపెట్టుతూ ఉన్నాడు. సర్వజనులనూ వశపరచుకొన్నాడు. ధనము ఇచ్చి, దీనజనుల దారిద్ర్యమును పోగొట్టినాడు. శుశ్రూషచేసి, గురుజనులను మెప్పించి సర్వవిద్యలూ అభ్యసించినాడు. ధనుర్ధరుడు అయి, శత్రువులను సంహారము చేసివేసినాడు. సత్యవ్రతముతో స్వర్గాదిలోకాలను స్వాధీనము చేసికొన్నాడు. సత్యమూ, దానమూ, త్యాగమూ, తపమూ, మిత్రత్వమూ, శుచిత్వమూ రాముడిలో మూర్తీభవించినవి. వాడు దేవతుల్యుడు. మహర్షులవంటి తేజోవంతుడు. ఎందుకు వాణ్ణి అడవులకు వెళ్ళగొట్టమంటున్నావు? నేను నా మనస్సులో అయినా వాడికి అప్రియము చేయలేను. వాడు సర్వలోకప్రియుడు. ఈ కోసల రాజ్యములో జనపదముఖ్యులూ, పౌరముఖ్యులూ వాడికి రాజ్యాభిషేకము చేయవలసింది అని చెప్పినారు. వాణ్ణి నీవు ఒక్కతెవూ కోరినావని అడవులకు పొమ్మని చెప్పడము ఎట్లాగు? ఆ జితేంద్రియుడు, ఆ త్యాగమూర్తి, ఆ సత్యవ్రతుడు, ఆ శమదమాదిగుణసంపన్నుడు రాముడు తప్ప, నాకు దిక్కు ఎవరు? కైకా! నేను ముసలివాణ్ణి అయిపోయినాను. నాకు అవసానకాలం ఆసన్నము అయింది. రేపో మాపో నేను దాటిపోతాను. నీవు భయంకరమైన కోరిక కోరినావు. కైకా! నన్ను అనుగ్రహించు. సముద్రపు పొలిమేరగా నా పరిపాలనములో ఉన్న ఈ పృథ్విని అంతా నీకు ఇచ్చి వేస్తాను. ఇదిగో కైకా! నేను నీకు నమస్కారము చేస్తున్నాను. నీ కాళ్ళు పట్టుకుంటాను. రాముణ్ణి మన్నించు. రామాభిషేక విషయములో నాకు ధర్మహాని రాకుండా నీవు నన్ను కాపాడు" అంటూ ఏడుస్తూ, దశరథమహారాజు నేలమీద పడిపోయినాడు. దుఃఖసముద్రములో మునుగుతూ, తేలుతూ తదేకముగా కైకవంక చూడసాగినాడు.

కైకేయీదేవి రౌద్రరూపిణి అయింది. రౌద్రముతో, "ఓ ధర్మాత్మా! నా రెండు వరాలూ చెల్లిస్తాను అని తాము ఒట్టుపెట్టుకొన్నారు. అందుకు మీరు ఇప్పుడు దుఃఖపడుతున్నారు. ఇకను ఈ పృథ్విలో తాము పరమధార్మికులు అని ఎట్లా చెప్పుకొంటారు? రాజర్షులు సమావేశము అయినప్పుడు, తమను ఎవరు అయినా ఈ విషయము అడిగితే ఏమి చెప్పుతారు? నా భార్య కైక కష్టపడి నన్ను కాపాడింది,

నా ప్రాణము దక్కించింది, అందుకు ఆమెకు రెండు వరాలు ఇస్తాను అన్నాను, చివరకు ఎగగొట్టినాను అని చెప్పుతారా? రాజా! వరాలు చెల్లిస్తాము అని ఇప్పుడేకదా తాము ప్రమాణము చేసినారు? ఇంతలోనే మాట తప్పుతారా? అందువల్ల, అపకీర్తి మీకు ఒక్కరికే కాదు, మీబోటి రాజులు అందరికి అబద్ధాలు ఆడుతారు అనే అపకీర్తి వస్తుంది. ప్రభూ! పూర్వరాజుల వృత్తాంతాలు జ్ఞాపకము చేసుకోండి. ఆలోచించండి. మీ ప్రమాణాన్ని దబ్బర చేయకండి. రాజా! మీరు దుర్మార్గానికి ఒడిగట్టుతున్నారు. ధర్మము తప్పుతున్నారు. మీరు రాముడికి రాజ్యాభిషేకముచేసి కౌసల్యతో ఎప్పుడూ సుఖము అనుభవించ తలచినారు. ధర్మమో అధర్మమో, మీకు ఇష్టమో అయిష్టమో, మీరు చెల్లిస్తాము అని శపథము చేసినారు. అందుకు తిరుగులేదు. అట్లా కాదు అని రాముడికి రాజ్యాభిషేకము చేసినట్లయితే, మీ ఎట్టఎదుటనే, మీరు చూస్తూ ఉండగనే నేను విషము త్రాగి చచ్చిపోతాను. కౌసల్య రాజమాత అయితే, అందరూ వచ్చి ఆమెకు నమస్కారాలు చేస్తూ ఉంటే, నేను చూస్తూ ఒక్కరోజు అయినా జీవముతో ఉండలేను. అట్లా ఒక్కరోజు అయినా బ్రతకడముకన్నా విషము త్రాగి చచ్చిపోవడము మేలు. రాజా! నేను భరతుడి మీదనూ, నా ప్రాణము మీదనూ ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను. రాముణ్ణి అరణ్యవాసానికి పంపించడము కన్నా, మీరు ఏమిచేసినా నేను తృప్తిపడను" అని చెప్పి, కైకేయీదేవి దశరథమహారాజువంక చూస్తూ ఊరక ఉంది.

దశరథమహారాజు బ్రతిమలాడినా ఆమె మాట్లాడలేదు. అప్పుడు ఆయన ద్దేహము అంతా కంపించిపోయింది. ఒక్క ముహూర్తముసేపు అట్లా నిలుచుండిపోయినాడు. కనురెప్పలు వాల్చకుండా కైకేయీదేవివంక చూస్తూ, ఆమె ముందుగా తనచేత ప్రమాణము చేయించుకోవడమూ, ఆతరువాత ఆమె రాముణ్ణి అరణ్యవాసానికి పంపించమని కోరడమూ, భరతుడికి పట్టముకట్టమని చెప్పడమూ మొదలు అయినవి ఆలోచించినాడు. మొదలు నరికిన చెట్టువలె నేలకూలినాడు. ఉన్నట్టు ఉండి పిచ్చెత్తినవాడివలె చూడసాగినాడు. సన్నిపాతవ్యాధి పీడితుడివలె కనిపించినాడు. దీనస్వరముతో, "ఓ కైకా! ఈ అనర్థము నీకు మేలు అని ఎవరు అయినా బోధచేసినారా లేక ఏది అయినా పిశాచము నిన్ను పట్టిందా? నీవు సిగ్గు విడిచి నాతో మాట్లాడుతున్నావు. ఇదివరకు ఈ దుస్స్వభావము నీలో నాకు కనిపించలేదు. నీవు ఇప్పుడు విపరీతముగా మారిపోయినావు. భరతుడికి పట్టము కట్టమనీ, రాముణ్ణి అడవులకు పంపించమనీ ఎందుకు కోరుతున్నావు? ఇప్పుడు నీకు కొత్తగా వచ్చిన భయము ఏమిటి? నీ భర్తను అయిన నాకూ, నీ పుత్రుడు అయిన భరతుడికీ నీవు మేలు చేయతలచుకొన్నట్లయితే, రాముణ్ణి అరణ్యవాసానికి పంపించవలెను అనే ఆలోచన నీవు మానుకోవలెను.

"ఓ నీచురాలా! ఓ పాపీ! నిన్ను నేను ఏమి కష్టపెట్టుతాను? రాముడు ఏమి కష్టపెట్టుతాడు? ఓ కటికదానా! మేము నీకు ఏమి అపరాధము చేసినాము?

"ఓ వెర్రిదానా! నీకు తెలియదు. భరతుడు రాముడికన్నా ధార్మికుడు. మతిమంతుడు. రామున్ని అడవులకు వెళ్ళకొట్టితే, ఈ రాజ్యము ఏలడానికి భరతుడు ఒప్పుకోడు. ఓ కైకా! రామున్ని నేను అడవికి పొమ్మంటే వాడి ముఖము రాహుగ్రస్త చంద్రబింబమువలె వివర్ణము అయిపోయేట్లయితే, నేను చూడగలనా? చూచి బ్రతుకగలనా? ఓ దేవీ! మంత్రులూ, పురోహితులూ, మిత్రులూ, మహాజనులూ ఏకము అయి ఆలోచించి రామాభిషేకము నిర్ణయించినారు. నేను అందుకు అంగీకరించినాను. రామాభిషేకము చేస్తాను అని మహాజన సభామధ్యములో ప్రకటించినాను. ఇప్పుడు ఆ మాట తప్పడము ఎట్లాగు? సేనలను అన్నిటినీ యుద్ధానికి తీసికొనిపోయి, శత్రుసేనలను చూచి వెనుకకు తిరిగివచ్చునట్టు కాదా? రామాభిషేకానికి నానాదిక్కులనుంచీ రాజులు అందరూ వచ్చినారు. వారు అందరూ నన్ను చూచి, ఏమి అంటారో నీకు తెలుసునా? రాముడి రాజ్యాభిషేకము కావడమూ, రాజ్యము ఏలడమూ, వానప్రస్థుడుగా వనవాసానికి పోవడమూ తెల్లవారే లోపలనే అయిపోయిందా అని నన్ను వెక్కిరిస్తారు. ఈ దశరథమహారాజు దైవవశాన బహుకాలము రాజ్యము ఏలినాడే కాని, బుద్ధిలేనివాడు అని నన్ను నిందిస్తారు. రామాభిషేకము ఎందుకు ఆగిపోయింది అని వృద్ధులూ, బహుశ్రుతులూ, గుణవంతులూ అడిగితే, వారికి నేను ఏమి అని చెప్పవలెను? కైకేయి బాధపడల్లేక రామున్ని అరణ్యవాసానికి పొమ్మన్నాను అని యథార్థమే చెప్పేట్లయితే, వశిష్ఠ వామదేవాది మహర్షుల సమక్షములో, మహాజనసభామధ్యములో రామాభిషేకము అని ప్రకటనము చేసినావే, అది అబద్ధము అయిపోలేదా అని నన్ను ప్రశ్నిస్తారు.

"ఓ కైకా! నా కొడుకు ఏమి అపరాధము చేసినాడని అడవులకు వెళ్ళకొట్టినారు అని కౌసల్య నన్ను అడిగితే, నేను ఆమెకు ఏమి చెప్పవలెను? ఇంతకాలమూ ఆమె నన్ను సంతోషపెట్టడమే తన పనిగా పెట్టుకొన్నది. దాసివలె ఉపచారము చేస్తూంది. స్నేహితురాలివలె ద్యూతక్రీడాది వినోదాలతో నాతో పొద్దుపుచ్చుతూ ఉంది. సోదరివలె నా సుఖమే కోరుతూ ఉంది. తల్లివలె నా శరీరపోషణాదులలో శ్రద్ధవహిస్తూ ఉంది. భార్యవలె ధర్మకార్యాలలో నాకు తోడుపడుతూ ఉంది. ఓ కైకా! నేను ఇంతవరకూ నీ నుంచి ఆమెను సంతోషపెట్టలేదు.

"ఓ కైకా! నేను ఇంతవరకూ నిన్ను సుఖపెట్టింది అంతా వికటించింది. ఇంతకాలమూ నిన్ను సంతోషపెట్టినందుకూ, సుఖపెట్టినందుకూ అపథ్యవ్యంజనో పేతము అయిన అన్నము తిన్న రోగివలె తాపము ఎత్తి బాధపడుతున్నాను.

ఇప్పుడు యువరాజ్యాభిషేకము మానివేసి నేను రాముణ్ణి అడవులకు పంపించి వేసేట్లయితే, సుమిత్ర తన కొడుకు గతి ఏమిటి అని భయపడుతుంది. ఇకను ఆమె దేనికి అయినా నన్ను ఎట్లా నమ్ముతుంది?

"ఓ రాణీ! రాముడు అరణ్యవాసానికి పోయేట్లయితే, నేను బ్రతుకను. అప్పుడు సీత గతి ఏమిటి? ఆమె రెండు అప్రియాలకు తల్లడిల్లి పోతుంది. హిమవత్పర్వతపార్శ్వములో కిన్నరుడు వదలిపెట్టి పోయిన కిన్నరవలె ఏడుస్తుంది. ప్రాణము వదులుతుంది. ఓ కేకయరాజపుత్రీ! రాముడు అడవికిపోతే, సీత ఏడుస్తూ ఉంటే, నేను చూస్తూ ఎంతకాలము బ్రతుకుతాను? వెంటనే చచ్చిపోతాను. ఓ కైకా! అప్పుడు నీవు ముండమోసి నీ కొడుకును పెట్టుకొని ఈ రాజ్యము ఏలుతూ ఉంటావు.

"ఓ రాణీ! నీ చక్కదనము చూచి, నీవు పరమయోగ్యురాలవు అనుకొన్నాను. ఇప్పుడు నా పని, విషము కలిపిన మద్యాన్ని తెలియక త్రాగినవాడివలె అయిపోయింది. నాకు తెలియలేదు. ఇంతవరకూ నీవు ఇచ్చకాలు ఆడి నన్ను మోసము చేసినావు. నేను ప్రియపుత్రుణ్ణి అమ్ముకొని స్త్రీ సుఖము కొనుక్కొనేవాణ్ణి అవుతున్నాను. సురాపానము చేసిన బ్రాహ్మణుణ్ణివలె ఇక నన్ను రాజవీథిలో అందరూ దూషిస్తారు. ఆశ్చర్యము! కైకా! నీవు నాకు ఎంత దుఃఖము తెచ్చిపెట్టినావు? ఎంత కష్టము తెచ్చి పెట్టినావు? నీ దారుణ వాక్యాలను నేను సహించవలసి వచ్చింది. ఇది అంతా నా పురాకృత దుష్కృతము అయి ఉండవలెను. మెడకు వేసుకొన్నది ఉరిత్రాడు అని తెలియక భద్రపరచినట్లు అయింది. నీవు నా మృత్యుదేవతవు అని తెలియక ఇంతకాలమూ నేను నీతో రమించాను. ఎవరికీ తెలియకుండా పసిపిల్లవాడు కృష్ణసర్పాన్ని పట్టుకొన్నట్లు, నేను నిన్ను పట్టుకొన్నాను. అయ్యో! నేను ఉండిన్నీ, నా పిల్లవాడికి లేనివాణ్ణి అయినాను. దుర్మార్గుణ్ణి అని నన్ను అందరూ తప్పకుండా తిట్టుతారు. దశరథమహారాజు స్త్రీ సుఖము కోసము ప్రియపుత్రుణ్ణి అడవులకు వెళ్ళకొట్టినాడు. వాడు కాముకుడూ, బుద్ధితక్కువ వాడూ అంటారు.

"కైకా! రాముడు గురుశిక్షవల్లనూ, కాండవ్రతాదులవల్లనూ, బ్రహ్మచర్య వ్రతానుష్ఠానమువల్లనూ ఇంతవరకూ గృహస్థాశ్రమ సుఖము అనుభవించలేదు. ఇప్పుడే వాడికి భోగానుభవకాలము వచ్చింది. నీవు వాడికి ఇప్పుడు ఈ కష్టము తెచ్చి పెట్టుతున్నావు. రాముడు నా మాటకు మారు ఆడడు. అడవికి పొమ్మని నేను అంటే, వాడు సరేను అంటూ ప్రయాణము అవుతాడు కాని, నేను ఎందుకు అడవికి పోవలెను అని వాడు ఎదురు తిరగడు. వాడు అట్లా ఎదురు తిరిగితే ఎంతో బాగుంటుంది కాని, వాడు అట్లా చేయడు. వాడు నిర్మలాత్ముడు. నేనూ వాడివలె నిర్మలాత్ముణ్ణి అనే భావిస్తాడు. నేను మనస్సులో ఒకటి ఉంచుకొని పైకి ఇంకొకటి

చెప్పుతున్నాను అని వాడు వూహించ నయినా ఊహించడు. అందువల్ల నేను అడవికి పొమ్మనగానే వాడు, "మంచిది" అంటూ ప్రయాణము అయిపోతాడు. నన్ను అందరూ తిట్టుతారు. నేను పాపిష్టివాణ్ణి. నన్ను మృత్యువు యమసదనానికి ఈడ్చుకొని పోతుంది. రాముడు అడవికి పోతాడు. అంతట నేను చచ్చిపోతాను. అప్పుడు నీవు మిగతావాండ్లను ఎన్ని కష్టాలు పెట్టుతావో? కొడుకు అడవులపాలు అయిపోవడమూ, నేను చచ్చిపోవడమూ చూచి భరించలేక కౌసల్య చచ్చిపోతుంది. రాముడితో పాటు లక్ష్మణుడు అడవులకు వెళ్ళిపోతాడు. శత్రుఘ్నుడు అయినా ఎట్టయెదుట ఉండడు కనుక, దుఃఖము పట్టలేక సుమిత్ర కూడా చచ్చిపోతుంది. రామ లక్ష్మణ శత్రుఘ్నులనూ, నన్నూ, కౌసల్యనూ, సుమిత్రనూ ఘోరదుఃఖాలపాలు చేసి నీవు మాత్రము ఉండ తలచినావు. ఈ కోసల రాజ్యము ఇంతవరకూ చెక్కుచెదరకుండా సుఖముగా ఉంది. రాముడు అడవులకు వెళ్ళిపోయిన తరువాత, నేను దాటిపోయిన తరువాత నీవు ఏలికసానివి అవుతావు. ఈ రాజ్యము చిందరవందర అయిపోతుంది.

"కైకా! ఇది అంతా భరతుడికి కూడా ఇష్టము అయ్యేట్లయితే, వాడు నా ప్రేతకర్మ చేయకూడదు. ఓ దుర్మార్గురాలా! ఓ శత్రువా! నీ కోరిక చెల్లించుకో. వెధవముండవు అయిపో. నీ కొడుకును పెట్టుకొని రాజ్యము ఏలు. నీవు రాజపుత్రివిగా నాకు భార్యారూపాన దాపురించిన శత్రువవు. నీనుంచి నన్ను అన్నిపాపాలూ ఆవరించినవి. నీనుంచి నాకు అంతులేని అపకీర్తి వస్తుంది. నీనుంచి నాకు అమోఘము అయిన పరాభవం అవుతుంది. నీనుంచి సమస్తభూతకోటిలోనూ అల్పుణ్ణి అయిపోతాను.

"ఓ పాంసనీ! నా పిల్లవాడు– మాట్లాడితే రధాలూ, గుర్రాలూ, ఏనుగులూ ఎక్కిపోయే నా పిల్లవాడు కారడవులలో కాలినడకను తిరుగవలెనా? భోజన సమయము రాగానే కుండలధారులు అయిన పాచకులు నేను అంటే నేను అంటూ పరుగెత్తుకొని వచ్చి ప్రశస్తము అయిన అన్నపానాదులు అందిస్తే ఆరగించే నా పిల్లవాడు, ఘోరారణ్యములో వగరుకాయలూ, చేదుదుంపలూ, కారపుగింజలూ తినవలెనా? మహార్హము అయిన వస్త్రాలు ధరించి ఎప్పుడూ సుఖాసనాలమీద కూర్చుండే నా పిల్లవాడు, కాషాయ గుడ్డలు కట్టుకొని కటికినేలమీద కూర్చుండవలెనా? ఓ కైకా! ముందు వెనుకలు ఆలోచించకుండా భరతుడికి పట్టముకట్టి, రాముణ్ణి అరణ్యవాసానికి పంపించమని దారుణమయిన ఉపదేశము ఎవడు చేసినాడు? ఆహా! స్త్రీలు ఎటువంటి పనులు అయినా చేస్తారు, ఆలోచించకుండా అపకారము చేస్తారు. వారు స్వార్థపరులు. స్త్రీజాతి నాశనము అయిపోవలెను. అందరు స్త్రీలు కారు, భరతుడి తల్లే నాశనము అయిపోవలెను అంటున్నాను.

"ఓ స్వార్థపరా! నీవు అనర్థము తలపెట్టినావు. నన్ను బాధపెట్టడమే పనిగా పెట్టుకొన్నావు. నీకు నేను ఏమి కీడు చేసినాను? జగద్ధితానుకారి అయిన రాముడిలో నీవు ఏమి దోషం కనిపెట్టినావు? రాముడు ఆపదలపాలు అయిపోయే ట్లయితే, ఈ జగత్తు అంతా కుపితము అయిపోతుంది. ఎంతో ప్రేమతో చూస్తూ ఉన్న తమ పుత్రులను తండ్రులు వదలిపెట్టిపోతారు. అన్యోన్యానురాగముతో మెలగుతూ ఉన్న భార్యలను భర్తలూ, భర్తలను భార్యలూ వదలిపెట్టి పోతారు. దేశము క్షోభించి పోతుంది. ఓ కటికదానా! దేవకుమారుడివంటి రాముడు ఉండబట్టే, నేను బ్రతికి ఉన్నాను. వాణ్ణి చూస్తూ ఉండబట్టే, నా మనస్సు ఉల్లాసముగా ఉంటూ వుంది. వాడు నాతో మాట్లాడుతూ ఉండబట్టే, నేను ఇంత వృద్ధాప్యంలోనూ యౌవనోత్సాహముతో తిరుగుతున్నాను. ఓ కైకా! రాముడు ఈ అయోధ్యా నగరములో లేకపోయినట్లయితే, ఒక్క పురుగయినా ఇక్కడ ఉండదు. రాముడూ, లక్ష్మణుడూ అడవులకు వెళ్ళిపోతారు. నేను చచ్చిపోతాను. అంతట నీవూ, నీ కొడుకు భరతుడూ ఈ అయోధ్యానగరములోనూ, ఈ కోసలరాజ్యములోనూ నావాండ్లను, నా బంధువులను చంపివేసి రాజ్యము ఏలుతూ ఉంటారు. ఓ దుష్టచారిణీ! నీవు నన్ను ఆపదలలో పడత్రోసి దెబ్బతీస్తున్నావు. నీవు ఇప్పుడు పతిపత్నీ భావము వదలిపెట్టి స్వతంత్రించి మాట్లాడుతున్నావు. నీ ఈ మాటలకు నీ నోటిపండ్లు వెయ్యిముక్కలుగా రాలిపోవలెను. రాముడు ఎప్పుడు అయినా, ఎవరికి అయినా ఒక్క అహితము చేసినాడా? ఒక్క అప్రియము ఆడినాడా? ఒక్క పరుషవాక్కు అయినా వాడి నోటివెంట వచ్చిందా? వాణ్ణి, సర్వజనమనోహరుణ్ణి, ఆ సకలసద్గుణసంపన్నుణ్ణి ఏమి దోషము చేసినాడు అని నీవు అడవులకు వెళ్ళకొట్టమంటున్నావు? నీ కోరిక మహాఘోరము అయింది. నీ కోరికనుండి సర్వమూ నాశనము అయిపోతుంది. నీ కోరికను నేను చెల్లించను. ఓ పాంసనీ! నీవు ఏడువు. నిప్పులలో దూకు. ఈ సౌధాగ్రభాగమునుంచి క్రిందపడి ముక్కలు ముక్కలుగా అయిపో. చావు. నేను నీవు కోరినట్లు చేయను. ఓ కైకా! నీవు మంగలికత్తి వంటి దానవు. నీ మెచ్చుకోళ్ళు అన్నీ ఇచ్చకాలు. నీ మాటలు అన్నీ కల్లబొల్లి కబుర్లు. నీవు దుర్మార్గురాలవు, నీవు నా వంశనాశనివి. నీవు నా హృదయాన్ని సమూలముగా దహించి వేస్తున్నావు. ఇక నీవు బ్రతికి ఉండడము నేను సహించలేను.

"ఓ కైకా! నా కొడుకు రాముడు లేకుండ నేను బ్రతకడము ఉత్తది. ఒకవేళ బ్రతికినా, నేను సుఖపడేది ఏమిటి? సంతోషపడేది ఏమిటి? కైకా! నీవు నా భార్యవు. నాకు అపకారము చేయవద్దు. నన్ను అనుగ్రహించు, నీ పాదాలు పట్టుకొంటున్నాను"

అంటూ, పారచాచుకొన్న ఆమె కాళ్ళు దశరథమహారాజు అనాథుడివలె పట్టుకో పోయినాడు. జబ్బువంటివాడివలె తూలుతూ కింద పడిపోయినాడు.

13

దశరథమహారాజు ఆడదాని కాళ్ళు- అందులో తన భార్య కాళ్ళు పట్టుకోవలసినంత పాపము చేసినవాడు కాడు. అయితే, అటువంటి దురవస్థలో పడిపోయినాడు. కైకేయి కోరిక అయన్ను అంత భయపెట్టింది. ఆమె మాత్రము నిర్భయముగా కూర్చున్నది. ఆమెకు కావలసింది, ఆమె కోరిక నెరవేరడమే. ఆమె అతిరూక్షముగా దశరథమహారాజువంక చూస్తూ, "రాజా! సత్యమే తమ వ్రతము అనీ, ఆ సత్యవ్రతాన్ని తాము ఎన్నడూ వదలిపెట్టము అనీ అందరితోనూ చెప్పుతూ ఉంటారే, నాకు చెల్లిస్తాము అన్న వరాలు చెల్లించడానికి మీరు ఇప్పుడు ఎందుకు ఇంత గట్టిపట్టు పట్టుతున్నారు" అని అడిగింది.

ఈమాటలకు దశరథమహారాజు కోపోద్రేకముతో వణికిపోతూ, "ఆశ్చర్యము, ఓ దుష్టచారిణీ! నామీద నీకు ఎంత శత్రుత్వము ఉంది? ఎంత క్రౌర్యము ఉంది? నేను చచ్చిపోయిన తరువాత, రాముడు అడవులపాలు అయిపోయిన తరువాత నీవు నీ కోరికలు కొనసాగించుకో, అప్పుడు సుఖపడు.

"అయ్యో! నేను స్వర్గానికి పోయినా, నాకు అక్కడనూ దుఃఖము తప్పదు కాబోలు! దేవతలు రాముణ్ణి గురించే నన్ను అడుగుతారు. కైకకు వాగ్దానముచేసిన వరాలనుంచి రాముణ్ణి అడవులకు పంపించి వేయవలసి వచ్చింది అని నేను యథార్థమే చెప్పేట్లయితే, మరునాడు రాజ్యాభిషేకము చేస్తాను అని అంతకుపూర్వము రాముడితో నీవు చెప్పినావే, అది అబద్ధము అయిపోలేదా అని, నన్ను దేవతలు దుయ్యపట్టుతారు. కైకా! పుత్రులు పుట్టకపోతే ఎంతో తాపత్రయపడి మహాయజ్ఞముచేస్తే రాముడు పుట్టినాడు. వాడు శూరుడు. సమస్తవిద్యలూ అభ్యసించినాడు. శమదమాది గుణసంపన్నుడు. జితేంద్రియుడు. వాణ్ణి, ఆ ఇందీవరశ్యాముణ్ణి ఆ కమలపత్రాయతాక్షుణ్ణి, ఆజానుబాహువును నేను విడిచిపెట్టి ఉండడము ఎట్లా? వాణ్ణి దండకారణ్యము పంపించడమా? అయ్యో! వాడు సమస్తసుఖాలూ అనుభవించవలసినవాడు, వాడు కష్టాలు పడటమా? నేను ఆ మాట వినలేను. వాడికి కష్టకాలము రాకపూర్వమే నేను దేహము చాలించడము ఉత్తమము.

"ఓ కటికదానా! నీకు ఎందుకు ఈ పాపిష్టిబుద్ధి పుట్టింది? రాముణ్ణి అరణ్యవాసానికి పంపించేట్లయితే, ఈ లోకములో నాకు అంతులేని అపకీర్తి వస్తుంది. అసమానము అయిన అవమానము భరించవలసివస్తుంది" అంటూ, చిత్తము భ్రమించి ఏడవసాగినాడు.

చంద్రోదయము అయింది. ఆ రాత్రి మూడు ఝాములపొద్దూ మహావ్యాధిగ్రస్తుడివలె నిట్టూర్పులు విడుస్తూ, కుమిలిపోతూ, కన్నులు మిటకరించి ఆకాశమువంక చూస్తూ, "ఓ రాత్రీ! నీవు తెల్లవారవద్దు. నీవు శుభకరివి. నామీద దయఉంచు. నేను చేతులెత్తి నీకు నమస్కారము చేస్తూ ఉన్నాను. ఓ రాత్రీ! అట్లాకాదు అంటున్నావా? అయితే, వెంటనే తెల్లవారిపో, నా పీడ విరగడ అయిపోతుంది. ఈ క్రూరురాలిని, ఈ దుర్మార్గురాలిని, ఈ కటికదానిని నేను చూస్తూ ఉండలేను" అంటూ, దశరథమహారాజు నమస్కారము చేసినాడు.

అంత దశరథమహారాజు కైకేయీదేవిని ఎట్లాగు అయినా మంచి చేసుకోవలెను అనుకొని, "ఓ దేవీ! నీవు మంగళస్వరూపిణివి. నీవు నా ఇల్లాలివి. నేను ఇంతవరకూ సత్యవ్రతముతో జీవించినాను. నా ఆయుష్యము అంతా అయిపోయింది. నేను ఇకను అట్టేకాలము బ్రతుకను. ఇప్పుడు నేను శరణాగతుణ్ణి. ఓ సుశ్రోణీ! నేను రామాభిషేకము చేస్తాను అని చాటుగా ఏ ఒకరు ఇద్దరితోనో కాదు, రాజసభామధ్యములో బహిరంగముగా ప్రకటనము చేసినాను. ఓ చిన్నదానా! నీవూ ఆలోచించు. నన్ను అనుగ్రహించు. ఓ చల్లని చూపులదానా! ఈ రాజ్యము అంతా నీకు వరదానముగా ఇస్తాను. నీవు ఈ రాజ్యము అంతా వరముగా నా దగ్గర పుచ్చుకొని, నీ రాజ్యముగా నీవే రాముడికి ఒప్పగించు. ఇందుకు నీ కుమారుడు భరతుడు కాదనడు. సంతోషిస్తాడు. గురువులూ, మంత్రులూ, మహాజనులూ, ప్రజలూ నిన్ను మెచ్చుకొంటారు. నీ యశస్సు ఈ లోకములో శాశ్వతముగా ఉండిపోతుంది. నేనూ కృతార్థుణ్ణి అవుతాను" అంటూ, జాలి పుట్టేట్టు కన్నీళ్ళు కారుస్తూ చెప్పినాడు.

ఇందుకు కైకేయీదేవి చలించలేదు. అంగీకరించలేదు.

రాముడికి వనవాసాన్ని గురించిన ఆలోచనే దశరథమహారాజు మనసులో సుళ్ళు తిరగడము మొదలు పెట్టింది.

ఆ రాత్రి గతిస్తున్నది. వైతాళికులు మేలుకొలుపులు పాడ నారంభించినారు. ఆ మేలుకొలుపులు పాడడము ఆపివేయమని దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు.

14

దశరథమహారాజు దుఃఖముతో నేలమీదపడి పొర్లిగింతలు పెట్టసాగినాడు. కైకేయీదేవి ఆయనవంక చూస్తూ, "రాజా! నేను కోరిన వరాలు చెల్లిస్తానని ఒట్టు పెట్టుకొని, ఏదో పాపకార్యము చేసినట్టు ఇప్పుడు నేలమీదపడి దొర్లుతున్నారు. మీరు మీ మర్యాద చెడగొట్టుకోవద్దు. మీరు దుఃఖపడటము దేనికి? సత్యమే పరమధర్మము

అని ధర్మవేత్తలు చెప్పుతూ ఉంటారు. నేను ఆ ధర్మాన్నిపట్టే మీరు వాగ్దానము చేసిన వరాలు చెల్లించమని మిమ్ములను అడిగినాను. మీరు సరేను అన్నారు. రాజా! తమకు తెలియనిది యేమీలేదు. పూర్వము శైబ్యుడు' అనే రాజు పావురాన్ని కాపాడుతాను అని మాట ఇచ్చి, ఆ మాట కోసము తన దేహములో మాంసం కోసి ఒక డేగకు ఇచ్చినాడు. అదేవిధముగా, మహాతేజోవంతుడు అయిన అలర్కమహారాజు అడిగింది ఇస్తాను అని చెప్పినందువల్ల, వేదపారంగతుడు అయిన ఒకానొక బ్రాహ్మణుడికి తన రెండు కన్నులూ ఊడపెరికి దానము ఇచ్చినాడు. సమస్తనదులకూ అధిపతి అయిన సముద్రుడు సత్యవ్రతమువల్లనే, తన పాలిమేరను దాటి ఈ భూమిని ముంచివేయడము లేదు.

"ప్రభూ! అందరికీ సత్యమే పరమప్రాప్యము. సత్యమే ఓంకారము. సత్యమే బ్రహ్మము. సత్యమే ధర్మము. అక్షయముగా ఉండేది సత్యము ఒక్కటే. సత్యమే సమస్తానికి మూలము. సత్యమే పరమపురుషార్థము అని వేదాలు చెప్పుతూ ఉన్నవి. రాజా! తమది సుస్థిరము అయిన ధర్మచింతే అయినట్లయితే, తాము సత్యము తప్పరు, తప్పకూడదు కూడాను. నాకు ఇచ్చిన వరాలు తాము సఫలము చేసి తీరవలెను. తాము వర ప్రదాతలు. నేను ఇప్పుడు మిమ్ములను కోరుతున్నాను. ప్రోత్సహిస్తున్నాను. కనుక, ధర్మసిద్ధి కోసము మీరు వెంటనే రాముణ్ణి అరణ్యవాసానికి పంపించి వేయవలెను. నేను చెప్పుతున్నాను, ముమ్మాటికీ చెప్పుతున్నాను. మీరు మీ శపథము చెల్లింపక పోయేట్లయితే, మీరు నన్ను త్యజించివేసినట్లే. ఇక మీ ఎదుటనే నేను ప్రాణము వదలి వేస్తాను" అంటూ నిర్విశంకముగా చెప్పింది.

వామనమూర్తికి మాట ఇచ్చి తప్పుకోలేకపోయిన బలిచక్రవర్తివలె దశరథ మహారాజు ధర్మపాశబద్ధుడు అయిపోయినాడు. కొడికీ, బండిచక్రానికీ మధ్యను ఉండే ఎద్దువలె నిలబడిపోయినాడు. ఆయన హృదయము దడదడ కొట్టుకోవడము మొదలుపెట్టింది. ముఖము వెలావెలా పోయింది. కన్నులు కలకబారి పోయినవి. ఏమీ కనిపించకుండా పోయింది. ఎట్లాగో ధైర్యము చిక్కబట్టి, "ఓ పాపీ! నిన్ను నేను సమంత్రకముగా అగ్నిసాక్షిగా పెండ్లి ఆడినాను. ఇప్పుడు నేను నిన్ను నీ పుత్రుడితో కూడా వదలివేస్తున్నాను. ఇక నీవు నా భార్యవు కావు, నేను నీ భర్తను కాను. నీకు పుట్టిన పుత్రుడు నా పుత్రుడూ కాడు, నేను వాడికి తండ్రినీ కాదు.

"ఓ రాణీ! రాత్రి అయిపోయింది. సూర్యోదయము అవుతూ ఉంది. గురుజనులు నాకోసము ఎదురుచూస్తూ ఉంటారు. ఇక నేను రామాభిషేకము అయినా చేయవలెను లేదా చచ్చి అయినా పోవలెను. ఓ అశుభాచారా! నీనుంచే రామాభిషేకము ఆగిపోయేట్లయితే, నీ కుమారుడు నాకు ఉత్తరక్రియలు చేయకూడదు.

నీవూ, నీ కుమారుడూ నన్ను ముట్టకూడదు. నాకు నీళ్ళు వదలకూడదు" అన్నాడు దశరథమహారాజు.

ఈ మాటలకు కైకేయీదేవికి పట్టశక్యముకాని కోపము వచ్చింది. అయితే, ఆమె మాట నేర్పరి. "రాజా! తాము ఎందుకు విషము మాటలు మాట్లాడుతారు? తాము దుఃఖపడడము ఎందుకు? రాముణ్ణి ఇక్కడికి పిలిపించండి, తాము కృతకృత్యులు అవుతారు" అన్నది ఆమె.

దశరథమహారాజు కొరడాదెబ్బతిన్న గుర్రమువలె రేగి, "కైకా! నా తెలివి తెల్లవారింది. ఇప్పుడే ఆ పరమధార్మికుణ్ణి, నా జ్యేష్ఠపుత్రుణ్ణి రాముణ్ణి పిలిపించు. నేను వాణ్ణి చూడవలెను. వాడితో మాట్లాడవలెను" అన్నాడు.

అప్పుడు తెల్లగా తెల్లవారుతూ ఉంది. సూర్యోదయము అయిన తరువాత పుష్యమి నక్షత్రములో యువరాజ్యాభిషేక సుముహూర్తము వస్తుంది.

తెల్లవారుతూ ఉండగా రాజవీధులు అన్నీ నీళ్ళు చల్లినారు. రంగురంగుల పూలతో అలంకరించినారు. పతాక లెత్తినారు. పూలదండలతో తోరణాలు కట్టినారు. అంగళ్ళు అన్నీ తెరచినారు. అవి అన్నీ శోభాయమానముగానూ, సర్వసమృద్ధముగానూ ఉన్నవి. నగరము అంతటా చందనాగరుధూపవాసనలు గుబాళిస్తూ ఉన్నవి. రామాభిషేకమహోత్సవము చూడడానికి వివిధప్రాంతాలనుంచి జనులు తండోప తండాలుగా వస్తున్నారు.

రాజవీథులు అన్నీ జనాకీర్ణము అయిపోయినవి.

వశిష్ఠమహర్షి, ఆయన శిష్యులూ సరయూనదిలో స్నానముచేసి, అభిషేక ద్రవ్యాలతో రాజవీధిలో మహాజనము మధ్య మెల్లగా దారి చేసుకొని రాజప్రాసాదములోకి వచ్చినారు. అప్పటికే రాజులూ, నగరముఖ్యులూ, జనపదముఖ్యులూ అక్కడే చేరినారు. ఆ ఆవరణలో వృక్షాలమీద ఉన్న రకరకాల పక్షులు కుహూనాదాలు చేస్తూ ఉన్నవి. బ్రాహ్మణోత్తములు వేదపారాయణము ఆరంభించినారు. యజ్ఞవేత్తలు అయిన బ్రాహ్మణ శ్రేష్ఠులు అభిషేక సంబంధ కర్మకలాపాలలో నిమగ్నులు అయినారు. సర్వమూ సన్నద్ధము అవుతూ ఉంది.

అప్పుడు అక్కడికి వచ్చిన సుమంత్రుణ్ణి చూచి వశిష్ఠమహర్షి, "ఓ మంత్రిసత్తమా! మీరు వెంటనే పోయి మహారాజుతో సర్వమూ సన్నద్ధము అయింది అనీ, సుముహూర్తము ఆసన్నము అవుతూ ఉంది అనీ చెప్పవలెను. నేను చెప్పినాను అని, మీరు ఆయనను తొందరచేసి ఇప్పుడే ఇక్కడికి వెంటపెట్టుకొని రావలెను" అన్నాడు.

కైకేయీ మందిరానికి సుమంత్రుని రాక

ఏ అంతఃపురములోకి అయినా యథేచ్ఛగా పోయే అధికారము సుమంత్రుడికి ఉంది. ఆయన సంతోషముగా కైకేయీదేవి అంతఃపురములోకి పోయినాడు. దశరథమహారాజు అప్పుడు ఏ అవస్థలో ఉన్నది అతడు ఎరుగడు. శయ్యాగృహము దగ్గర నిలుచుని, "రాజా! చంద్రోదయ సమయాన సముద్రుడివలె సంతోషాతిశయముతో తాము ఇప్పుడు లేవవలెను. మహాశుభ సమయము ఆసన్నము అవుతూ ఉంది. ఇటువంటి సమయ మప్పుడే, మాతలి దేవేంద్రుణ్ణి మేలుకొలిపినాడు. అంతట దేవేంద్రుడు రాక్షస సంహారానికి బయలుదేరినాడు. అదేవిధముగా నేను మిమ్ములను మేలుకొలుపుతున్నాను.

"ఓ రాజా! వేదవేదాంగాలు అన్నీ బ్రహ్మదేవుడివల్ల పుట్టినవి. అయితే, అవి అన్నీ ఆయననే ప్రబోధిస్తూ ఉన్నవి. అదేవిధముగా, నేను తమను ప్రబోధిస్తున్నాను. శుభప్రదము అయిన ఈ పృథ్విని ఉదయాస్తమయకాలాలలో సూర్యచంద్రులు మేలుకొలుపుతున్నారు. అదేవిధముగా నేను మిమ్ములను మేలుకొలుపుతున్నాను. ఓ రాజా! తాము ఇక నిద్రలేవవలెను. మంగళాలంకారాలు చేసుకొని మేరుపర్వతము మీద ఉదయించే సూర్యుడివలె, తాము తమ దేహకాంతులతో తేజరిల్లుతూ సభాభవనానికి రావలెను.

"ప్రభూ! మిమ్ములను సూర్యచంద్రులూ, శుక్రవైశ్రవణులూ, వరుణాగ్ని హోత్రులూ, పార్వతీపరమేశ్వరులు కాపాడుతారు. పరమపవిత్రము అయిన రాత్రి గడచిపోయింది. రాత్రి జరుగవలసిన పనులు అన్నీ జరిగిపోయినవి. తాము ఇక నిద్రలేవవలెను. జరుగవలసిన పనులు తాము జరిపించవలెను.

"దేవా! రామాభిషేకపు ఏర్పాట్లు అన్నీ అయిపోయినవి. వశిష్ఠమహర్షీ, బ్రాహ్మణోత్తములూ, రాజులూ, వర్తకులూ, నాగరులూ, గ్రామీణులూ తమ రాకకు ఎదురుచూస్తూ ఉన్నారు.

"ప్రభూ! ఇప్పుడు తమ సభాభవనము చంద్రుడులేని ఆకాశమువలె ఉంది.

"దళవాయిలేని దండువలెనూ, ఆబోతులేని ఆలమందవలెనూ, కాపరిలేని గొర్రెలమందవలెనూ సదస్యులు ఉన్నారు.

"రాజా! రాజు కనిపించని రాజ్యము అరాజకము అవుతుంది.

"ప్రభూ! మహాజనులూ అందరూ తమ దర్శనము కోసము తహతహలాడుతూ ఉన్నారు. దేవా! తాము వెంటనే బయలుదేరి రావలెను. రామాభిషేకానికి అనుజ్ఞ ఇవ్వవలెను" అంటూ సార్థకముగానూ, సానుపూర్వకముగానూ సుమంత్రుడు దశరథమహారాజును ప్రబోధించినాడు.

పడుకొని ఉన్న దశరథమహారాజు సుమంత్రుడి ప్రబోధము అంతా విన్నాడు. ఆయనకు మరింత దుఃఖము వచ్చింది. ఆయన కన్నులు జ్యోతులు అయిపోయినవి. పడుకొనే, "ఓ సుమంత్రుడా! నీ స్తోత్రపారము నా హృదయాన్ని చీల్చివేస్తూంది" అని జాలిపుట్టేట్లు ఆయన అన్నాడు.

ఆ మాటలు సుమంత్రుడు విన్నాడు. దశరథమహారాజును చూడవలెను అనుకొన్నాడు. చేతులు, జోడించి లోపలికి పోబోయినాడు. ముందుకు అడుగు పడలేదు. వెనుకకు తగ్గి, ఆలోచిస్తూ నిలుచుండిపోయినాడు.

కైకేయీదేవి వచ్చి సుమంత్రుణ్ణి చూచి సమయోచితముగా, "ఓ మంత్రి పుంగవా! రాజు రాత్రి అంతా రాముణ్ణి గురించి జాగరణ చేసినారు. మీరు వెంటనే పోయి రాముణ్ణి ఇక్కడకు తీసుకొని రావలెను. ఇది నేను చెప్పుతున్నాను అని వేరే విధముగా అనుకోనక్కరలేదు" అన్నది.

కైకేయీదేవి ఈవిధముగా చెప్పినందువల్ల, సుమంత్రుడు అమంగళము ఏమీలేదు అనుకొన్నాడు. సంతోషపడినాడు. ఆమె మాట రాజాజ్ఞగా శిరసావహించి అక్కడనుంచి బయలుదేరినాడు. సముద్రమధ్యములో ఉన్న సుడిగుండములో నుంచి బయటపడ్డట్టు, ఆ కైకేయీదేవి అంతఃపురములోనుంచి అతడు బయటకు వచ్చినాడు. ద్వారము ఎదుట కానుకలతో వచ్చి నిలుచొని ఉన్న మహాధనవంతులనూ, పౌరముఖ్యులనూ, జనపదముఖ్యులనూ, రాజవీథిలో కిటకిటలాడుతూ ఉన్న జనసమూహాన్ని చూచినాడు.

15

సూర్యోదయము అయిన తరువాత, పుష్యమీ నక్షత్రాన రాముడి జన్మలగ్నము అయిన కటకలగ్నములో రామయువరాజ్యాభిషేకము జరుగవలెను.

వేదపారంగతులు అయిన బ్రాహ్మణులు అందరూ ఆ రాత్రి అక్కడనే ఉండి అభిషేకానికి అవసరము అయిన ఏర్పాట్లు అన్నీ చేసినారు. తెల్లవారుతూ ఉండగా వారు అందరూ వశిష్ఠమహర్షితో రాజసభాభవనములోనికి వచ్చినారు. అప్పుడు అక్కడ అమాత్యులూ, సేనానాయకులూ, వర్తకులూ, పౌరముఖ్యులూ మొదలు అయిన వారు అందరూ సమావేశము అయినారు.

అభిషేకము కోసము మేడిమానుతో చేసిన భద్రపీఠాన్ని సిద్ధముగా ఉంచినారు. సింహాసనము అలంకరించినారు. ధగధగలాడే పులితోలు పరచిన నాల్గు గుర్రాల రథమూ, బోయీలతో పల్లకీ సిద్ధంగా ఉన్నవి. గంగాపావనోదకాలూ;

గంగా, యమునా సంగమప్రదేశమునుంచి తెప్పించిన పుణ్యజలాలూ; ఇంకా ఇతర పుణ్యనదులలో నుంచీ, తూర్పు దిక్కుగా ప్రవహించే నదులలోనుంచీ, ఊర్ధ్వముఖముగా ప్రవహించే నదులలోనుంచీ, దక్షిణోత్తరముఖాలలో ప్రవహించే నదులలోనుంచీ, ఎటూ ప్రవహించకుండా నిలిచి ఉండే పుణ్యప్రదాలలోనుంచీ, సరస్సులలోనుంచీ, ప్రసిద్ధము అయిన బావులలోనుంచీ, సమస్తసముద్రాలలోనుంచీ, రామాభిషేకానికి తెప్పించిన పుణ్యోదకాలను వెండి, బంగారు బిందెలలో నింపినారు. ఆ బిందెలమీద రావి ఆకులూ, తామర పువ్వులూ, కలువలూ మూతలు పెట్టినారు.

తేనే, నెయ్యీ, పేలాలూ, పెరుగూ, పాలూ, పూలూ, దర్భలూ, నవధాన్యాలూ, నవరత్నాలూ, ఖడ్గము, కార్ముకమూ, మణులు పొదిగి బంగారుపిడితో చంద్రకిరణాల వలె తేజరిల్లుతూ ఉన్న రెండు చామరాలూ, చంద్రమండలమువలె గుండ్రముగానూ మనోజ్ఞముగానూ ఉన్న శ్వేతచ్ఛత్రమూ, బంగారుపగ్గాలతో అలంకరించిన తెల్లటి ఆబోతూ, నాలుగుపళ్లు చేసి మెడనిండా జూలు వేళ్లాడుతూ ఉన్న తెల్లగుర్రమూ, మదజలము కారుస్తూ పెద్ద కొండ అంత ఎత్తున ఉన్న ఏనుగూ, ఆవులూ, మృగాలూ, పక్షులూ సిద్ధముగా ఉన్నవి. వేదిలో అగ్నిహోత్రము ఉంచినారు. ఇంపుగా, సొంపుగా నడిచే వేశ్యాంగనలు చక్కని అలంకారాలతో వచ్చినారు. మంగళార్హులు అయిన ఎనిమిదిమంది కన్నెపడుచులు సమస్తాభరణాలతోనూ అలంకరించుకొని రామాభిషేకము చేయడానికి సిద్ధముగా ఉన్నారు. వీణా వేణు మృదంగ తాళాది వాద్యాలూ, వివిధవాద్యగాండ్లూ, సూత వందిమాగధులూ సిద్ధముగా ఉన్నారు.

ఇక్ష్వాకువంశరాజుల పట్టాభిషేక సమయ మప్పుడు తమ తమ ఆచారాలనుబట్టి తేవలసిన కానుకలతో సామంతరాజులు అందరూ వచ్చి దశరథమహారాజు అంతఃపుర ద్వారము దగ్గర కనిపెట్టుకొని ఉన్నారు. వారికి దశరథమహారాజు దర్శనము కాలేదు. పొద్దెక్కుతున్నది. తమ రాక రాజుకు తెలియచెప్పేవారు ఎవరా అని వారు తహతహ లాడుతున్నారు. అప్పుడు లోపలనుంచి సుమంత్రుడు బయటికి వచ్చినాడు. అతడు ఆ సామంతరాజులను అందరినీ చూచినాడు. రాజుల పురాతన వృత్తాంతాలూ, వారి ఆచారాలూ అతనికి తెలుసును. అతడు అంతట ఆ సామంతరాజులతో "రాజోత్తములారా! రామున్ని ఇప్పుడు ఇక్కడికి తీసుకొని రమ్మని నన్ను దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు. అయితే ఇప్పుడు మిమ్ములను అందరినీ దశరథమహారాజు గౌరవించవలెను. ఆయనకన్నా ఎక్కువగా రాముడు మిమ్ములను గౌరవించవలెను అని మీరు కోరుతున్నారు కనుక, దశరథమహారాజును నిద్రలేపి మీకు దర్శనము ఇమ్మని చెప్పుతాను" అంటూ సుమంత్రుడు మళ్ళీ లోపలికి పోయినాడు.

సుమంత్రుడు దశరథమహారాజు పడకగది దగ్గరకు పోయి తెర ఇవతల నిలుచొని ఆయన్ను మళ్ళీ స్తోత్రము చేస్తూ, 'ఓ రాజా! బాగా తెల్లవారిపోయింది, తాము ఇక నిద్రలేవవలెను. సామంతరాజు లందరూ కానుకలు తీసుకొనివచ్చి కనిపెట్టుకొని ఉన్నారు. బ్రాహ్మణులూ, అమాత్యులూ, సేనానాయకులూ మీరాక ఎదురుచూస్తూ ఉన్నారు. మీరు ఇకను లేవవలెను" అన్నాడు.

"ఓ సుమంత్రుడా! నేను నిద్ర పోనేలేదు. రాత్రి అంతా మేలుకొనే ఉన్నాను. రాముణ్ణి ఇక్కడికి తీసుకొని రమ్మని కైక నీతో చెప్పింది. అది నా ఆజ్ఞ. నీవు ఎందుకు ఆ ఆజ్ఞను పాటించలేదు? నీవు వెంటనే పోయి రాముణ్ణి ఇక్కడికి తీసుకొని రావలెను" అన్నాడు దశరథమహారాజు.

ఈ మాటలకు సుమంత్రుడు రామయువరాజ్యాభిషేకము తప్పకుండ అవుతుంది అనుకొంటూ వెలుపలికి వచ్చినాడు. వరూధినీ (పైన కప్పుఉన్న) రథము ఎక్కినాడు. శరత్కాలమేఘము మాదిరిగా కనిపించే రామభవనానికి అభిముఖముగా అమితసంతోషముతో తన రథాన్ని పోనిచ్చినాడు. రామాభిషేకాన్ని గురించి జనసమూహాలు చెప్పుకుంటూ ఉన్న ముచ్చట్లు వింటూ, శోభాయమానముగా ఉన్న పతాకలనూ, ధ్వజాలనూ చూస్తూ, రాజవీథిలో సుమంత్రుడు పోయినాడు. అతడు రాముణ్ణి తీసికొని రావడానికి పోతున్నాడు అని ప్రజలు అందరూ సంతోషముతో ఉప్పొంగిపోయినారు.

అనేకగ్రామాలనుంచి కోట్లకొద్దీ గ్రామీణులు వాహనాలమీద వచ్చి వారి వారి వాహనాలు దిగి రాజభవన ద్వారము దగ్గర చేతులు జోడించి కానుకలతో రాముణ్ణి చూడటానికి కనిపెట్టుకొని ఉన్నారు. పౌరులున్నూ మహోత్సాహముతో కానుకలు తీసికొనివచ్చి చేతులు కట్టుకొని రామదర్శన కుతూహలముతో నిలుచుని ఉన్నారు. వారు అందరూ రామాభిషేకపు ఏర్పాట్లు గురించీ, రామాభిషేకమువల్ల సంప్రాప్తము అయ్యే లోకాభ్యుదయాన్ని గురించీ చెప్పుకుంటూ ఉన్నారు. వారిని అందరినీ చూస్తూ, వారి ముచ్చట్లు వింటూ సుమంత్రుడు రథముతో మేరుపర్వత గుహవంటి రాజభవనములోకి పోయినాడు.

రామభవనము తెల్లగా కైలాసపర్వతమువలెనూ, ఎంతో ఎత్తున మేరుపర్వతము వలెనూ, చందనాగరు ఘుమఘుమలతో దర్దుర పర్వతమువలెనూ, సర్వసంపన్నము అయిన కుబేర భవనమువలెనూ, వైభవోపేతము అయిన దేవేంద్ర సదనమువలెనూ ఉంది. ఆ భవన బహిర్ద్వారము ఎంతో ఎత్తు అయింది. ద్వారబంధాలకు రత్నాలూ, పగడాలూ పొదిగి ఉన్నవి. బంగారు పూలదండలు

తోరణాలుగా వ్రేళ్లాడగట్టి ఉన్నవి. ఆ తోరణాలలో మధ్య మధ్య ఉన్న ముత్యాల సరులు శరత్కాలచంద్రకాంతులవలె మనోజ్ఞముగానూ, రత్నాలసరులు మధ్యాహ్న సూర్యకిరణాలవలె కన్నులుమిరుమిట్లు కొలుపుతూనూ ఉన్నవి. ఆ భవన శిఖరాలమీద బంగారు విగ్రహాలు తళతళలాడుతూ ఉన్నవి. గోడలమీదనూ, స్తంభాలమీదనూ చిత్రకారులు అతినిపుణముగా చిత్రించిన తోడేళ్ళూ మొదలు అయిన జంతువుల బొమ్మలు చిత్రవిచిత్రముగా కనిపిస్తున్నవి. ద్వారబంధాలమీదనూ, తలుపులమీదనూ వజ్రంగులు అతిరమణీయముగా చెక్కిన పూలూ, లతలూ కన్నులకు ఇంపుకొలుపుతూ ఉన్నవి. సారసపక్షులు కర్ణపేయముగా పాటలు పాడుతూ ఉన్నవి. నెమళ్ళు నేత్ర పర్వముగా నాట్యము ఆడుతూ ఉన్నవి. లోపలికివచ్చేవారికి రకరకాల పక్షులు కుహూనాదాలతో మనోహరముగా స్వాగతము చెప్పుతూ ఉన్నవి. జింకలూ మొదలు అయిన పెంపుడు జంతువులు అంతటా నిర్భయముగా పరుగులెత్తుతూ ఉన్నవి. పాట్టి పాట్టి దాసీలూ, బక్కపలచని పొడుగాటి దాసీలూ వారి వారి పనులు చక్కపెట్టుతూ ఉన్నారు. ఆ యా కక్ష్యలు దేవతాగృహాలవలె కనిపించినవి.

సుమంత్రుడు రథములో మూడు కక్ష్యలు దాటిపోయినాడు. రామాజ్ఞలను శిరసావహించే యువజనులు బారులుతీరి అక్కడ నిలుచుని ఉన్నారు. చక్కగా అలంకరించుకొని గుర్రాలమీదనూ, ఏనుగులమీదనూ, రథాలమీదనూ వందలకొద్దీ వచ్చిన రాజవల్లభులనూ, అమాత్యులనూ అక్కడ చూచినాడు. సుమంత్రుడు రథము దిగి వారిని అందరినీ అభినందించినాడు. సంతోషముతో ఉప్పొంగిపోయినాడు. అక్కడ ఆ అంతఃపురద్వారము ఎదుట నల్లటి మేఘమువలెనూ, పెద్ద కొండవలెనూ మహోన్నత కాయముతో అంకుశానికి లొంగకుండా అప్రసహ్యపరాక్రమముతో పరుగులు తీసే 'శత్రుంజయము' అనే అందము అయిన మదపుటేనుగు రాముణ్ణి ఎక్కించుకొని పోవటానికి సిద్ధముగా ఉంది. సుమంత్రుడు ఆ ఏనుగును చూచినాడు. అతనికి రోమాంచము అయింది.

కదలకుండా ఉన్న శరత్కాల మేఘమువలెనూ, ధగధగలాడే మేరుపర్వత శిఖరమువలెనూ ఉన్న రాముడి ఏడుఅంతస్తుల అంతఃపురములోకి ఏ అడ్డూలేకుండా, మహానదీగర్భములోకి పోయే మొసలి మాదిరిగా సుమంత్రుడు పోయినాడు.

16

ఆ అంతఃపుర ద్వారములోనుంచి సుమంత్రుడు లోపలికి పోయినాడు. ఆ కక్ష్యలో జనసమ్మర్దము ఏమీలేదు. రామానురక్తులు అయిన యువకులు ఉజ్జ్వలకుండల కాంతులతో తేజరిల్లుతూ ఈటెలూ, బల్లెములూ పట్టుకొని ఏమరుపాటు లేకుండా

ఏకాగ్రచిత్తముతో అక్కడ కావలి కాస్తున్నారు. వారిని చూచినాడు. చేతులతో బెత్తాలు పట్టుకొని దాసదాసీజనాన్ని అజమాయిషి చేసే ద్వారాధ్యక్షవృద్ధులను, కాషాయ వస్త్రధారులను చూచినాడు. వారు, ఆ ద్వారపాలకులు అందరూ సుమంత్రుణ్ణి చూచీ చూడడముతోనే లేచి నిలుచొని ఆయనకు నమస్కారము చేసినారు.

సుమంత్రుడు సరసుడు. ఏ అంతఃపురములోనికి అయినా యథేష్టముగా పోయే అధికారము ఆయనకు ఉన్నప్పటికిన్నీ, తాను వచ్చి కనిపెట్టుకొని ఉన్నట్లు రాముడికి తెలియజేయమని ఆయన ద్వారపాలకులతో చెప్పినాడు. వారు వెంటనే లోపలికి పోయి భార్యాసహితముగా ఉన్న రాముడితో సుమంత్రుడు వచ్చి, దర్శనము కోసము వాకిట కనిపెట్టుకొని ఉన్నాడు అని చెప్పినారు.

సుమంత్రుడు తన తండ్రికి ఆంతరంగికుడు అయినందువల్లనూ, తనకు ఆయనతో ఎంతోచనువు ఉన్నందువల్లనూ తాను భార్యాసమేతముగా ఉన్నప్పటికిన్నీ, ఆ ఏకాంతగృహములోకి ఆయనను వెంటనే పంపించవలసింది అని రాముడు ఆ ద్వారపాలకులతో చెప్పినాడు.

రాముడు కుబేరుడివలె చక్కని అలంకారములతో తెల్లటిదుప్పటి కప్పిన బంగారుపాన్పుమీద కూర్చొని ఉన్నాడు. అతని దేహానికి పూసిన రక్తచందనము వరాహ రక్తమువలె కన్నులు చెదిరిపోయేట్టు కనిపిస్తూ, ఘుమఘుమ వాసనలు విరజిమ్ముతూ ఉంది. సరసను సీతాదేవి అతనికి వింజామర వీస్తూ ఉంది. అతడు అప్పుడు చిత్తానక్షత్రములో చంద్రుడివలె కనిపించినాడు.

ఆ శత్రుసంహారకుణ్ణి సుమంత్రుడు చూచినాడు. నిజదేహకాంతులతో బాలభాస్కరుడివలె తేజరిల్లుతూ ఉన్న ఆ తేజోవంతుడికి నమస్కారము చేసినాడు. చనువుతో విహారశయనాదుల కుశలము అడిగి, "ప్రభూ! తమ అంతటి పుత్రుణ్ణి కన్న కౌసల్యాదేవి మహాధన్యురాలు, ఇప్పుడు కైకేయీదేవీ, మీ నాయనగారూ మిమ్ములను వెంటనే తీసుకొని రమ్మని నన్ను ఇక్కడికి పంపించినారు. మీరు వెంటనే బయలుదేరి రావలెను" అన్నాడు సుమంత్రుడు.

ఆ ద్యుతిమంతుడు సుమంత్రుణ్ణి సంభావించి సీతాదేవిని చూస్తూ, "దేవీ! మా నాయనగారూ, కైకేయీదేవీ నా రాజ్యాభిషేకాన్ని గురించే తప్పకుండా ఆలోచించి ఉంటారు. కైకేయీదేవి సమర్థురాలు. మా తండ్రిగారి అభిప్రాయము తెలుసుకొని, ఏ ఆలస్యమూ లేకుండా వెంటనే నాకు రాజ్యాభిషేకము చేయవలసింది అని, ఆయనను ఆమె ప్రోత్సహించి ఉంటుంది. ఆమె కేకయ రాజపుత్రి. భర్తృవర్తిని. మా తండ్రిగారిని ఆమె ఎప్పుడూ సంతోషపెట్టుతూ ఉంటుంది. నా హితమే కోరుతూ ఉంటుంది. నా అభ్యుదయాన్నే కాంక్షిస్తూ ఉంటుంది. ఆమె సంతోషముతో నా ప్రయోజనాన్నే మా

తండ్రిగారికి తెలియచెప్పి ఉంటుంది. అందువల్లనే, వారు ఉభయులున్నూ నా మేలుకోరే ఈ సుమంత్రుణ్ణి ఇక్కడికి దూతగా పంపించినారు. ఇది నా భాగ్యము. పరిషత్తుకు తగిన దూతనే ఎప్పుడూ పంపిస్తూ ఉంటారు. సంతోషము. దశరథమహారాజు ఈనాడే నాకు రాజ్యాభిషేకము చేస్తాడు. దేవీ! నేను పోయి కైకేయీదేవినీ, మా నాయనగారినీ చూచి, మాట్లాడి వెంటనే వస్తాను. నేను వచ్చేవరకూ నీవు ఇక్కడనే, నీ పరిజనముతో సంతోషముగా కాలక్షేపము చేస్తూ ఉండు" అంటూ, సంతోషాతిశయముతో ఆమె మెడలో పూలదండ వేసినాడు. ఆమెను సంతోషపెట్టినాడు.

సీతాదేవి భర్తకు శుభము చేకూరవలెను అని భగవంతుణ్ణి ధ్యానముచేసి, అతని వెంట వాకిలి వరకూ పోయి, "ప్రభూ! బ్రాహ్మణులు చెప్పినట్టుగా ఇప్పుడు మీకు మీ తండ్రిగారు యువరాజ్యాభిషేకము, దేవేంద్రుడికి బ్రహ్మదేవుడు చేసినట్టుగా కాలాంతరములో మహారాజ్యాభిషేకము చేయవలెను. అప్పుడు మీరు పరిశుద్ధులు అయి, నియమబద్ధులు అయి, రాజసూయ యాగదీక్షతో కృష్ణాజినధారులు అయి, కురంగశృంగము చేతిలో పట్టుకొన్నప్పుడు మిమ్ములను చూచి పూజించవలెను అని అనుకొంటున్నాను. ప్రభూ! ఇప్పుడు మిమ్ములను తూర్పు దిక్కున దేవేంద్రుడూ, దక్షిణ దిక్కున యముడూ, పడమటి దిక్కున వరుణుడూ, ఉత్తర దిక్కున కుబేరుడూ కాపాడవలెను అని ప్రార్థిస్తున్నాను" అన్నది.

రాముడు దశరథ కైకేయీలను దర్శించబోవుట

రాముడు ఆమెను అక్కడ ఆగిపొమ్మని చెప్పి ఉత్సవార్థము అవసరము అయిన మంగళాలంకారాలు అన్నీ చేసుకొని, గిరిగుహలో నివసించే సింహము దిగివచ్చినట్టుగా తన ఏకాంతగృహములోనుండి వెలుపలికి నడచినాడు. అతడి వెనుక సుమంత్రుడు నడిచినాడు. వాకిటిలో చేతులు జోడించి కనిపెట్టుకొని ఉన్న లక్ష్మణుడు వానిని వెంబడించినాడు. వారు ముగ్గురూ మధ్యకక్ష్యలోకి పోయినారు. స్నేహితులనూ, అభిషేకము చూడవచ్చిన అశేషజనాన్నీ రాముడు చూచినాడు. వారిని అందరినీ అభినందించినాడు.

బంగారు మలామాచేసి మణులు తాపటము చేసిన వెండిరథము మిట్టమధ్యాహ్న సూర్యుని కిరణాలవలె కన్నులు మిరుమిట్లు కొలుపుతూ రాముడి కోసము అక్కడ సిద్ధముగా ఉంది. ఆ విశాలము అయిన రథానికి ఏనుగుపిల్లల వంటి గుర్రాలు కట్టినారు. అందులో అగ్నిహోత్రమువలె ధగధగలాడే పులితోలు పరచినారు. దివ్యరథము ఎక్కి పోయే దేవేంద్రుడివలె రాముడు ఆ రథము ఎక్కినాడు. లక్ష్మణుడు అతనికి ఎండ తగులకుండా ఒక చేతితో ఛత్రము

పట్టుకొన్నాడు. రెండవ చేతితో వింజామరవీస్తూ వెనుక కూర్చున్నాడు. ఆ రథము తోలడానికి సుమంత్రుడు ముందు కూర్చున్నాడు. పగ్గాలను వదలినాడు. ఆకాశములో పర్జన్యుడివలె మహా గంభీరధ్వనులు చేస్తూనూ, మహేంద్రపర్వతము మీదినుంచి బయలుదేరే నిండు చంద్రుడి రూపముతోనూ ఆ రథము రామమందిరములోనుంచి బయటికి వచ్చింది.

శూరులు సింహనాదము చేసినారు. వందిమాగధులు మంగళగానము ఆరంభించినారు. వివిధవాద్యధ్వనులు మిన్నంటినవి. జనసమూహములోనుంచి జయజయ ధ్వనులు చెలరేగినవి. కవచాలు తొడుగుకొని ఖడ్గాలూ కార్ముకాలూ పట్టుకొన్న యోధులూ, చందన అగరు గంధ చర్చలతో దేహాలు తళతళలాడుతూ ఉన్న శూరులూ కోలాహల ధ్వనులతో ఆ రథము ముందు నడచినారు. పెద్ద పెద్ద గుర్రాల మీదనూ, కొండలంత ఏనుగులమీదనూ, చక్కని రథాలమీదనూ రాజవల్లభులూ, పౌరముఖ్యులూ ఆ రథము వెనుక సాగినారు.

చక్కగా సింగారించుకొన్న ఉత్తమాంగనలు మేడల కిటికీలలోనుంచి ఆ వెండి రథములో పోతూ ఉన్న రాముడిమీద పూలవాన కురిపించినారు. మరికొందరు పుణ్యాంగనలు ఆ రథానికి ఎదురుగుండా పోయి, "ఓ కౌసల్యానందనా! నీవు ధన్యుడవు. మీ అమ్మ ఇప్పుడు ఎంత సంతోషిస్తూ ఉందో! ఈ నీ యాత్ర సఫలము అవుతుంది. నీవు యువరాజ్యాభిషేకము చేసుకొని ఊరేగుతూ రావలెను. మేము అందరమూ చూచి సంతోషిస్తాము. ఓ రామా! నీ హృదయప్రియ అయిన సీతాదేవి సర్వసీమంతినులకున్నూ మేలుబంతి. ఆమె ఎంత తపస్సు చేసిందో, రోహిణికి చంద్రుడివలె ఆమెకు నీవు దొరికినావు. నీకు జయము అవుతుంది" అని ఆశీర్వదించినారు.

ఈ మాటను రాముడు విన్నాడు. ఆ వెండి రథము రాజవీధిలోకి పోయింది.

17

ఆ రాజవీథి పతాకధ్వజాలతో శోభిస్తూ, చందన అగరు ధూప వాసనలతో ఘుమఘుమ లాడుతూ, నానాదేశాలనుంచీ వచ్చిన జనసమూహాలతో కిటకిటలాడుతూ ఉంది. రాముడి రథము అక్కడికి వచ్చింది. రాజవీథిలో ఇరువైపులా తెల్లటి మేఘాలవలె శోభాయమానముగా ఉన్న ప్రాసాదాలను, వివిధవస్తువులూ అమ్మే అంగళ్ళనూ ఆ యా అంగళ్ళలో రాసులు రాసులుగా ఉన్న పట్టుబట్టలనూ, రంగు రంగుల నూలుబట్టలనూ, బెజ్జమువేయని నూత్నముత్యాలనూ, కన్నులు మిరుమిట్లు కొలిపే స్ఫటికాలనూ, రత్నాలనూ, శ్రేష్ఠము అయిన

పరిమళద్రవ్యాలనూ, రుచ్యము అయిన భక్ష్యాలనూ, ఇంకా వివిధవస్తువులనూ చూస్తూనూ, చత్వరాలలో నిత్య పూజార్థము ఉంచిన పెరుగూ, పేలాలూ, అక్షతలూ, హవిస్సులూ, చందన అగరు పరిమళద్రవ్యాలూ, ఘుమఘుమ వాసనను గుబాళించే పూలదండలూ మొదలు అయిన వాటిని చూస్తూనూ, బ్రాహ్మణోత్తముల మహదాశీర్వాదాలు వింటూనూ రాముడు రథములో సాగిపోయినాడు.

దేవరాజవీథివంటి ఆ రాజవీథిలో అప్పుడు జానపదులు, "రాజానుగ్రహమువల్ల రాముడు రాజు కాపోతున్నాడు. మనకోరికలు అన్నీ ఈడేరుతవి. ఇక మనరాజ్యములో ఎవరికీ ఏ కొంచెము కష్టమూ, ఏ కొంచెము దిగులూ ఉండదు. మనము అందరమూ ఎంతో అదృష్టవంతులము" అంటూ చెప్పుకోవడము మొదలు పెట్టినారు.

పౌరముఖ్యులూ, రాముడి సుహృజ్జనులూ ఆ రథానికి ఎదురుగుండా పోయి, "రామా! నీకు ఇప్పుడు రాజ్యాభిషేకము అవుతుంది. నీవు నీ తాత ముత్తాతలకన్నా మిన్నగా రాజ్యము ఏలవలెను. నీ తండ్రికన్నా, నీ తాతలకన్నా నీవు మమ్ములను ఎక్కువగా సుఖపెట్టవలెను. సంతోషపెట్టవలెను. మాకు ఇప్పుడు ఏవిషయమూ పట్టలేదు. అన్నముతో అయినా నిమిత్తము లేదు. నీవు రాజ్యాభిషేకము చేసుకొని ఊరేగుతూ వస్తూ ఉంటే మేము చూడవలెను. మాకు ఇప్పుడు కావలసింది ఇదే. నీ రాజ్యాభిషేకముకన్నా మమ్ములను సంతోషపెట్టే మహోత్సవము మరి ఒకటి లేదు" అని చెప్పినారు.

ఈ మాటలూ, ఈ పొగడ్తలూ రాముడు విన్నాడు. అతడు ఉబ్బితబ్బిబ్బులు అయిపోలేదు. ఉదాసీనుడుగా ఊరకుండలేదు. వారి వారి యోగ్యతలనుబట్టి అంజలి ఘటిస్తూనూ, రక్షణోక్తులు పలుకుతూనూ, భ్రూవిక్షేపాదులతో ఆదరిస్తూనూ అందరినీ సంతోషపెట్టుతూ ఆ రథములో సాగిపోయినాడు.

రాముడి రథము కనుచూపుమేర దాటిపోయినప్పటికిన్నీ అందరి మనో నేత్రాలలోనూ రాముడి విగ్రహమే మెలగుతూ ఉంది. ఆ కోసల రాజ్యములో రాముణ్ణి ఎరుగనివాడుకానీ, రాముడు ఎరుగనివాడుకానీ ఒక్కడూ లేడు. రాముడు అందరినీ పలకరించి మాట్లాడేవాడు. వారి వారి యోగ్యతలనుబట్టి అందరినీ ఆదరించేవాడు. గౌరవించేవాడు. సంతోషపెట్టేవాడు. అందువల్ల వర్ణభేదమూ, వయో భేదమూ లేకుండా అందరూ ఆతనికి ఒక్కమాదిరిగా భక్తులు అయినారు.

ఆ రాజవీథిలో చతుష్పథాలకూ, దేవపథాలకూ, చైత్యాలకూ, సభాభవనాలకూ రాముడి రథము ప్రదక్షిణముగా పోయి రత్నాల రాసులతో అలంకరించిన రాజగృహాలవలెనూ, ఆకాశాన్ని అడ్డగించే దేవతల విమానగృహాలవలెనూ, మహోన్నత

ప్రాసాద శృంగాలతో కైలాసపర్వత శిఖరాలవలెనూ ఉన్న 'వర్ధమానము' అనే దశరథ మహారాజు దివ్యభవనములోకి పోయింది. ధనుర్ధరులు కావలికాస్తూ ఉన్న మూడు కక్ష్యలూ రథము దాటిపోయింది. రాముడు అక్కడ ఆ రథము దిగినాడు. మరి రెండు కక్ష్యలు పాదచారుడు అయిపోతూ తన వెంట వస్తూ ఉన్న సుహృజ్జనాన్నీ, జనసమూహాన్నీ అక్కడ ఆగిపొమ్మని చెప్పినాడు.

అంతట రాముడు ఒంటరిగా ఆ అంతఃపురములోకి పోయినాడు.

చంద్రోదయాన్ని ఎదురుచూచే మహాసముద్రమువలె మహాజన సమూహము రాముడి పునరాగమనాన్ని ఎదురుచూస్తూ అక్కడ నిలిచిపోయింది.

18

అక్కడ కైకేయీదేవి నిలుచొని ఉంది. దశరథమహారాజు పాన్పుమీద పడుకొని ఉన్నాడు. ఆయన ముఖము కళాకాంతులు లేకుండా వాడిపోయి ఉంది. దీనుడుగా కనిపించినాడు. రాముడు వినయ విధేయతలతో ఆయనకు సాష్టాంగ నమస్కారము చేసినాడు. ఆతరువాత జాగరూకతతో కైకేయీదేవి పాదాలకు నమస్కారము చేసినాడు.

దశరథమహారాజు, "రామా" అని సంబోధించినాడు. ఆయన కన్నులలో నీళ్ళు కమ్ముకొన్నవి. బొటబొట నీళ్ళు కారినవి. కన్నులు తెరువలేక పోయినాడు. మాట్లాడలేక పోయినాడు. ఎంత ప్రయత్నముచేసినా ఆయన నోట మాట పెగలలేదు. అటువంటి భయావహ రూపముతో దశరథమహారాజు ఉండడము రాముడు అదివరకు ఎన్నడూ చూడలేదు. ఎన్నడూ దేనికీ భయపడి ఎరుగని రాముడు, అప్పుడు పామును తొక్కినవాడివలె భయపడి పోయినాడు.

దశరథమహారాజు నిట్టూర్పులు విడుస్తూనూ, దుఃఖముతో కంపించిపోతూనూ, రాహుగ్రస్తము అవుతున్న సూర్యబింబమువలె దేహము అంతా కుంచించుకొని పోతూనూ, కాంతులు మాసిపోతూనూ, ఎన్నడూ ఇంకిపోని మహాసముద్రము ఇంకిపోతున్నట్లూనూ, అబద్ధాలు ఆడిన మహర్షివలె వెలా వెలా పోతూనూ కనిపించినాడు. ఊహించడానికి అయినా అలవికాని ఆ ఘోర రూపము, ఆ భయావహ రూపము రాముడు చూచినాడు. పర్వకాలములో సముద్రమువలె అతని హృదయము అల్లకల్లోలము అయిపోయింది. చిత్తాన్ని చిక్కపట్టి ఆలోచిస్తూ, "ఇది ఏమిటి, నాయనగారు నన్ను అభినందించడానికి బదులు ఎంతో ఘోరముగా దుఃఖపడుతున్నారు! భయపడుతున్నారు! ఇదివరకు ఎంత కోపముతో ఉన్నా నన్ను చూడగానే ప్రసన్నులు అయ్యేవారు. అటువంటివారు, ఇప్పుడు నన్ను చూడగానే

దుఃఖపడుతున్నారు. కారణము ఏమి అయి ఉంటుంది'' అని అతడు ప్రశ్నించుకొన్నాడు. కారణము ఊహించలేక పోయినాడు. ధైర్యము కోల్పోయినాడు. విషణ్ణుడు అయినాడు. శోకార్తుడు అయిపోయినాడు. కైకేయీదేవిని చూచి చేతులు జోడించి, "అమ్మా! అజ్ఞానమువల్ల నేను ఏమి అయినా అపరాధము చేసినానా? నాయనగారికి ఇప్పుడు ఇంతకోపము ఎందుకు వచ్చింది? కారణము ఏమిటి? అమ్మా! నీవు వారి కోపము పోగొట్టవలెను.

"అమ్మా! నాయనగారికి నేను అంటే ఎంతో వాత్సల్యము. ఇప్పుడు నన్ను చూచి వారు విపన్నులు అయినారు. వారి ముఖము ఇప్పుడు వివర్ణము అయిపోయింది. దుఃఖపడుతున్నారు. నన్ను పలుకరించినైనా పలుకరించలేకుండా ఉన్నారు. ఎందువల్ల? అమ్మా! నాయనగారికి ఒంట్లో బాగాలేదా? మనస్సులో బాగాలేదా? ఎప్పుడూ ఎవరూ ఆధివ్యాధులు లేకుండా ఒక్కమాదిరిగా ఉండరు కదా! భరతశత్రుఘ్నులు సుఖముగా ఉన్నారుకదా! కౌసల్యా సుమిత్రలు ఏ అమంగళమూ లేకుండా హాయిగానే ఉన్నారు. అమ్మా! నాయనగారు ఎందుకు ఇట్లా ఉన్నారు?

"ఓ తల్లీ! నాయనగారిని సంతోషపెట్టకుండానూ, వారు చెప్పిన ఏపని అయినా చేయకుండానూ నేను ఉండలేను. వారికి కోపమేవస్తే ఒక్కక్షణము అయినా నేను బ్రతికి ఉండలేను. ఈలోకములో ఎవరి జన్మకు అయినా తండ్రే మూలకారణము. అందువల్ల, ఎవరికి అయినా తండ్రే ప్రత్యక్షదైవము.''

"అమ్మా! నీవు స్వాభిమానమువల్ల వారిని ఏమి అయినా పరుషముగా అన్నావా? అందువల్ల, వారి మనస్సుకు ఏది అయినా కష్టము వేసిందా? తల్లీ! నాకు చెప్పు. యథార్థము చెప్పు. ఇదివరకు వారు ఎన్నడూ ఇంత వికృతముగా ఉండడము నేను ఎరుగను. ఎందుకు వారు ఇప్పుడు ఇట్లా ఉన్నారో చెప్పవలెను'' అన్నాడు రాముడు.

భర్తకు మరింత కష్టము వేస్తుంది అనే జంకూ గొంకూ అయినా లేకుండా కైకేయీదేవి, "రామా! మీ నాయనగారికి కోపమూ లేదు, దిగులూ లేదు. నీవు ఏమి అంటావో అని, వారి మనోగతాన్ని వారు నీతో స్వయముగా చెప్పలేక బాధపడుతున్నారు. నీవు వారి ప్రియపుత్రుడవు. నీతో అప్రియము చెప్పడానికి వారికి నోరు అడటము లేదు.

కైకేయి రాముతో తన వరములను గూర్చి చెప్పుట

"రామా! మీ నాయనగారు పూర్వము ఒకప్పుడు నన్ను మెచ్చుకొని, నాకు రెండు వరాలు ఇచ్చినారు. ఆ వరాలు చెల్లిస్తాము అని ప్రమాణము కూడా చేసినారు. అట్టి వరాలు ఇచ్చినందుకూ, అవి చెల్లిస్తాము అన్నందుకూ ఇప్పుడు పామరుడివలె

విచారపడుతున్నారు. గతజల సేతుబంధనము చేయడము ఎట్లాగా అని ఆలోచిస్తున్నారు. రామా, నాయనా! 'సత్యమే ధర్మానికి మూలము' అని పెద్దలు చెప్పుతూ ఉంటారు. ఈ సంగతి నీకూ తెలుసు. నీనుంచి మీ నాయనగారికి ఇప్పుడు నామీద కోపము వచ్చింది. ధర్మహాని చేయడానికి సిద్ధము అయినారు. వారు ధర్మహాని చేయకుండా నీవు వారిని కాపాడవలెను. వారు ఒప్పుకొన్నది, వారు ప్రమాణము చేసినది నీకు కీడు అయినా మేలు అయినా నీవు 'శిరసావహిస్తాను' అనేట్లయితే, ఆ విషయము అంతా నేనే చెప్పుతాను. తాము చెప్పితే విఫలము అయిపోతుందేమో అనుకొని వారు నీతో ముఖాముఖీ చెప్పలేకుండా ఉన్నారు. వారి శపథము సఫలము చేస్తాను అని నీవు శపథము చేసేట్టయితే, నేనే చెప్పుతాను" అన్నది.

రాముడు మనోవ్యథతో, "అయ్యో, ఎంత అన్యాయము? అమ్మా! నన్ను శంకిస్తున్నావా? నేను బ్రతికి ఉండి ప్రయోజనము ఏమిటి? నాయనగారి కోసము నన్ను నిప్పులలో దూకమన్నా దూకుతాను. విషము త్రాగమన్నా త్రాగివేస్తాను. సముద్రములో పడమన్నా పడిపోతాను. దశరథమహారాజు నాకు తండ్రి, ఆచార్యుడు, రాజు. ఆయన ఏమి చెప్పినా నేను చేయవలెను, చేస్తాను. అమ్మా! ఈరాముడు రెండు మాటలవాడు కాదు. ఆడి తప్పడు. అమ్మా! మా నాయనగారి అభిమతము ఏమిటో చెప్పు, నేను తప్పక చేస్తాను" అన్నాడు.

అందుకు కైకేయి, "రామా! పూర్వము దేవాసుర యుద్ధములో మీ తండ్రి బాణోపహతుడు అయి బాధపడుతూ ఉంటే నేను రెండుమార్లు ఆయనను కాపాడినాను. అప్పుడు మీ తండ్రిగారు నన్ను మెచ్చుకొని రెండు వరాలు నన్ను కోరుకోమన్నారు. ఆ రెండు వరాలకు గాను ఇప్పుడు నేను భరతుడికి పట్టము కట్టమనీ, నిన్ను దండకారణ్యము పంపించి పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేయించమనీ కోరినాను. నీ అభిషేక సంబారాలతోనే భరతుడికి రాజ్యాభిషేకము చేయవలెను అని కూడా చెప్పినాను. నీ తండ్రి సత్యవ్రతుడు అనీ, నీవు సత్యవ్రతుడవు అనీ బుజువుచేయ తలచుకొన్నట్లయితే, నీవు ఇప్పుడే జటాజినాలు ధరించి దండకారణ్యానికి పోవలెను. అక్కడ పధ్నాలుగు సంవత్సరాలు నీవు నివసించవలెను. నీ తండ్రి దయాహృదయుడు అయినందువల్ల నిన్ను చూచి, నీవు ఏమి అంటావో అని దుఃఖపడుతున్నాడు.

"రామా ! మీ నాయనగారు నాకు చేసిన వాగ్దానాన్ని నీవు చెల్లించేట్లయితేనే ఆయన తరిస్తారు. ఆయనకు ధర్మహాని ఉండదు" అని చెప్పింది.

ఈ మాటలు విన్న రాముడు చలించలేదు. దుఃఖపడలేదు.

దశరథమహారాజు మాత్రము శోకాగ్నితో తాపము ఎత్తి తల్లడిల్లి పోయినాడు.

19

కైకేయి కోరికను రాముడు శిరసావహించుట

కైకేయీదేవి రాముడితో చెప్పింది చావుతో సరిసమానము అయిన మాటే. అయితే, ఆతడు కొంచెము అయినా దిగులు పడలేదు. అచలముగా, "అమ్మా! నీవు అనుకున్నట్లే కానివ్వు. నేను మా నాయనగారి శపథము శిరసావహించి వనవాసము చేస్తాను. మా నాయనగారు దుర్దర్షులు, అరిందములు. అయితే ఎందువల్లనో మరి వారు ఇప్పుడు ఎప్పటిమాదిరిగా నన్ను ఆదరించి, నాతో మాట్లాడడము లేదు. కారణము ఏమిటో నీవు చెప్పవలెను. అమ్మా! నీకు కోపము వద్దు. నీవు దిగులు పడనక్కరలేదు. నీ ఎదుటనే ఇప్పుడే నేను జటాజినాలు ధరించి వనవాసము చేయడానికి ఇటునుంచే ప్రయాణము అయిపోతాను. నీవు సంతోషముగా ఉండు.

"అమ్మా! దశరథమహారాజు ఎప్పుడూ నా మేలుకోరే మహానుభావులు. ఎవరు ఏ కొంచెము మేలు చేసినా ఆయన మరచిపోరు. వారు నాకు ఆచార్యులు. అంతేకాదు, వారు నా జనకులు. వారిని సంతోషపెట్టడమే నా ముఖ్యధర్మము. వారు ఏమి ఆజ్ఞాపించినా నేను నిర్విశంకముగా శిరసావహిస్తాను. నిర్వహిస్తాను. నా స్వభావము వారు ఎరుగుదురు. అయితే వారు భరతుడికి రాజ్యాభిషేకము చేయతలచినట్టు నాతో స్వయముగా ఎందుకు చెప్పలేదు అనే విషయము ఒక్కటే నా హృదయాన్ని దహించివేస్తూ ఉంది. అమ్మా! నేను ఒకరిచేత చెప్పించుకోకుండానే, భరతుడు కావలెను అంటే ఏది అయినా ఇస్తాను. ధనము ఇస్తాను. రాజ్యము ఇస్తాను. నా ప్రాణము అయినా ఇస్తాను. వాడు నా తమ్ముడు. వాడూ, నేనూ అనే భేదము నాకు లేదు. ఇటువంటి స్థితిగతులలో, మా నాయనగారి ఆజ్ఞ అని నీవు చెప్పుతున్నావు. నీవు సంతోషముగా కోరుకున్న కోరిక అని అంటున్నావు. నీవు చెప్పినట్టు చేస్తాను అని నేను ప్రమాణము చేసినాను. ఇక నేను రాజ్యము భరతుడికి వదలిపెట్టిపోయి వనవాసము చేయడము ఒక అబ్బురమా! ఇంకా ఏమి అని చెప్పేది? అమ్మా! నాయనగారు ఎందుకో నేలవంక చూస్తూ, కన్నీళ్లు కారుస్తున్నారు. వారు ఎందుకు ఇంత దుఃఖపడుతున్నారో తెలియకుండా ఉంది. అమ్మా! వారిని ఇక నీవే ఊరడించవలెను.

"అమ్మా! భరతుణ్ణి తాతగారి ఇంటినుంచి రావించడానికి ఇప్పుడే రాజాజ్ఞతో దూతలను పంపించవలెను. వేగముగాపోయే గుర్రాలమీద వారు వెంటనే వెళ్ళిపోవలెను. ఆలస్యము ఎందుకు? నాయనగారు నాతో భరతాభిషేకాన్ని గురించి స్వయముగా చెప్పలేదు అనే విచారము ఇక ఇప్పుడు నాకు లేదు. ఇటునుంచే నేను దండకారణ్యము

వెళ్ళిపోతాను. నీవు చెప్పినట్టుగా పధ్నాలుగు సంవత్సరాలూ అక్కడ నివసిస్తాను" అన్నాడు రాముడు.

రాముడు ఈవిధముగా చెప్పినందువల్ల కైకేయీదేవికి సంతోషము వేసింది. అప్పటికి అప్పుడే అతనిని వనవాసానికి ప్రయాణము చేయించవలెను అనుకొన్నది. "రామా! నీవు చెప్పినట్టు భరతుణ్ణి తీసుకొని రావడానికి దూతలు ఇప్పుడే బయలుదేరి పోతారు. అయితే భరతుడు ఇక్కడికి వచ్చేటంతటివరకున్నూ నీవు ఉండడము అనవసరము. నీవు ఎట్లాగూ వనవాసానికి పో నిశ్చయించుకొన్నావు కనుక, కాల విలంబనము చేయవద్దు.

"నాయనా! ఇది అంతా నీతో స్వయముగా చెప్పడానికి మీ నాయనగారికి మనస్కరించలేదు. అందువల్ల, వారు సిగ్గుపడిపోయి నీతో మాట్లాడలేకుండా ఉన్నారు. మీ నాయనగారికి ఇంతకన్నా మరి ఏ దుఃఖమూ లేదు. నీవు ప్రయాణము అయిపోగానే వారి దిగులు అంతా వదలిపోతుంది. నాయనా, రామా! నీవు అయోధ్యానగరము వదలిపెట్టిపోయేవరకూ, మీ నాయనగారు స్నానము చేయరు. భోజనము చేయరు. అందువల్ల, నీవు ఇప్పుడే ప్రయాణము అయిపోవడము మంచిది" అని కైకేయీదేవి చెప్పింది.

దశరధమహారాజు దుఃఖము పట్టలేక, "ఛీ, ఛీ" అంటూ ఆ బంగారు పాన్పుమీద పడిపోయినాడు. తక్షణమే రాముడు ఆయనకు ఉపచారాలు చేసి లేవనెత్తి కూర్చుండబెట్టినాడు. కాని కైకేయీదేవి చెప్పిన మాటలకు, కొరడాదెబ్బలు తిన్న గుర్రము మాదిరిగా అతని మనస్సు అడవులకు పరుగెత్తసాగింది. ఆమె చెప్పినట్టు చేయడమే యోగ్యము అయిన పని అనుకున్నాడు. అంతట అతనికి దశరధమహారాజును గురించిన విచారము అంతా వదలిపోయింది. కైకేయీదేవితో, "అమ్మా! నేను అర్థవరుణ్ణి కాను. లోకులను అందరినీ లోబరచుకొని రాజ్యము ఏలవలెను అనే కాంక్ష నాకు లేదు. ఋషివలె ఉండడమే నా కోరిక. నాకు కావలసింది కేవలము ధర్మము. పూజ్యపాదులు అయిన మా తండ్రిగారిని సంతోషపెట్టడానికి నేను ఏపని అయినా చేస్తాను. వారు చెప్పితే నాకు ప్రాణాంతకము అయిన పని అయినా చేస్తాను. పుత్రుడు అయినవాడికి పితృసేవ చేయడముకన్నా, పితృవాక్యపరిపాలనముకన్నా మహత్తరము అయిన ధర్మము మరి ఒకటి లేదు. అమ్మా! నాయనగారు నాతో వాచా చెప్పలేకపోయినా వారు ఆజ్ఞాపించినారు అని నీవు చెప్పినావు, చాలు. నేను పధ్నాలుగు సంవత్సరాలూ వనవాసము చేస్తాను.

"అమ్మా! నీవు నాకు దేవతవంటి దానవు. నీవూ నన్ను ఆజ్ఞాపించవచ్చును. నీ ఆజ్ఞలనూ నేను నెరవేర్చవలెను. భరతుడికి పట్టముకట్టవలెను అనీ, నేను

వనవాసము చేయవలెను అనీ నీవు ఆజ్ఞాపించినా, నేను అవశ్యము శిరసావహించి ఉండేవాడనే. తల్లీ! ఈ చిన్నవిషయము దశరథమహారాజును వరాలుగా యాచించినావా? ఇందువల్ల తల్లీ! నీవు నా స్వభావము, నా గుణగణాలు ఏ కొంచెమూ గుర్తించలేదు అనుకోవలసి వస్తున్నది. ఓ దేవీ! నేను ఇప్పుడు మా అమ్మ కౌసల్యాదేవికి వీడ్కోలు చెప్పి, నా భార్య సీత దుఃఖపడేట్లయితే దానిని సమాధానపరచి ఈనాడే దండకారణ్యము ప్రయాణము అయిపోతాను. ఇంతకన్నా ఆలస్యము చేయను.

"అమ్మా! ఇక భరతుడు రాజ్యపాలనముచేస్తూ, నాయనగారికి సేవచేస్తూ ఉండేటట్లు చూడవలసిన భారము నీమీద ఉంది. పితృసేవచేయడము పుత్రునికి సనాతన ధర్మము. అందువల్ల, చెప్పుతున్నాను" అన్నాడు రాముడు.

కన్నీళ్ళు కారుస్తూ ఈ మాటలు అన్నీ వింటూ ఉన్న దశరథమహారాజు, అంతవరకూ కంఠగతము అయి ఉన్న దుఃఖాన్ని అణచుకోలేకపోయినాడు. బావురుమన్నాడు.

రాముడు దశరథమహారాజు పాదాలకూ, కైకేయీదేవి పాదాలకూ నమస్కారము చేసినాడు. వారికి ప్రదక్షిణము చేసినాడు. ఆ అంతఃపురములోనుంచి వెలుపలికి వచ్చినాడు. వాకిట నిలుచొని లోపల జరిగింది అంతా వింటూ, కన్నీళ్లు కారుస్తూ పరమక్రుద్ధుడు అయిపోయిన లక్ష్మణుణ్ణి చూచినాడు. అక్కడ ఉన్న అభిషేక సంబారాల వంక కన్నెత్తి అయినా చూడకుండా వాటికి ప్రదక్షిణముగా నడువసాగినాడు.

రాముడికి రాజ్యము పోయింది. అడవులకు పోతున్నాడు. కాని, చిమ్మచీకట్లు కమ్ముకొన్నా చంద్రుడు కాంతి మాసిపోనట్లు, అతని ముఖవికాసము ఏమాత్రమూ మాసిపోలేదు. మానావమానాలను లెక్కచేయని పరమ యోగీంద్రుడివలె, చిత్తవికారము ఏమీలేకుండా అతడు అడుగులు వేయడము మొదలు పెట్టినాడు. శ్వేతచ్ఛత్రము వేయవద్దు అన్నాడు. వింజామరలు వీచవద్దు అన్నాడు. వెండిరథము అక్కరలేదు అన్నాడు. స్వజనులతోనూ, పురజనులతోనూ మాట్లాడకుండా తన విపత్తికి తాను దుఃఖపడకపోయినా, ఇతరులు దుఃఖపడతారు అనే దుఃఖాన్ని మనసా నిగ్రహించి ఆ అప్రియవార్త తన తల్లికి స్వయముగా చెప్పడానికి కౌసల్యాదేవి అంతఃపురమువైపు నడువసాగినాడు.

అలంకారాలు చేసుకొని అతని యువరాజ్యాభిషేకము చూడ వచ్చిన స్నేహితులు ఎవరూ ఆ శ్రీమంతుడి ముఖములో, ఆ.షత్యసంధుడి ఆకారములో ఏ వికారమూ కనిపెట్టలేకపోయినారు. శరత్కాలచంద్రుడి సహజకాంతులవలె రాముడి

స్వభావిక సంతోషకాంతులు ఏమాత్రమూ తరగిపోలేదు. ఆ ధీరుడు, ఆ మహాయశుడు మనోహరము అయిన మాటలతో సమస్తము అయిన వారినీ సంభావిస్తూ నడిచినాడు.

సౌజన్యాదిగుణాలలోకానీ, పరాక్రమములోకానీ రాముడికి తీసిపోని లక్ష్మణుడున్నూ దుఃఖాన్ని అణచుకొని అతని వెనుకనే నడవ సాగినాడు.

ఎంతో సంతోషముతో ఓలలాడుతూ ఉన్న కౌసల్యాదేవి మందిరములోకి ఆ అన్నదమ్ములు అప్పుడు పోయినారు.

20

రాముడు కౌసల్య అంతఃపురమునకు పోవుట

కైకేయీదేవి అంతఃపురములోనుంచి రాముడు బయలుదేరగానే అంతఃపురాంగనలు అందరూ పెద్దపెట్టున ఏడువసాగినారు.

"అయ్యో! రాముడు అడవులకు వెళ్ళిపోతాడు. తండ్రి చెప్పినా, చెప్పకపోయినా వాడు అందరికీ అన్ని పనులూ చేసిపెట్టుతూ ఉండేవాడు. చిన్నప్పటినుంచీ కౌసల్యాదేవికి మళ్లే మనకు అందరికీ సేవచేస్తూ ఉండేవాడు. వాడిమీద మనకు కోపము వచ్చేది కాదు. మంచిమంచి మాటలు చెప్పి మన కోపము పోకొట్టేవాడు. వాణ్ణి, అటువంటి వాణ్ణి రాముణ్ణి, రాజు ఇప్పుడు తెలివితక్కువగా అడవులకు పొమ్మన్నాడు. వాడు లేకుండా మనము ఇక బ్రతకడము ఎట్లాగు" అంటూ దూడలు పోయిన ఆవుల మాదిరిగా, అంతఃపురాంగనలు ఎలుగెత్తి ఏడవసాగినారు. రాజును నిందించడము మొదలుపెట్టినారు.

అసలే దుఃఖముతో కుమిలిపోతూ ఉన్న దశరథమహారాజు ఆ రోదనధ్వనులూ, ఆ నిందలూ విన్నాడు. ఆ పాన్పుమీదనే ఆయన మూర్ఛపోయినాడు.

కౌసల్యాదేవి అంతఃపురములోకి పోతున్న రాముడున్నూ ఆ ఆర్తనాదాలు విన్నాడు. మదపుటేనుగువలె నిట్టూర్పులు విడుస్తూ, మనోనిగ్రహముతో ముందుకు నడిచినాడు.

కౌసల్యాదేవి అంతఃపురద్వారము దగ్గర పరమపూజ్యుడూ వృద్ధుడూ అయిన ద్వారపాలకుణ్ణీ, అతని అనుచరులనూ చూచినాడు. రాముణ్ణి చూచీచూడడముతో ఆ ద్వారపాలకులు అందరూ లేచి నిల్చుని "జయాభవ! విజయాభవ" అంటూ ఆశీర్వదించినారు.

రాముడు ఆ మందిరములో రెండవ కక్ష్యవరకూ పోయినాడు. ఎప్పుడూ దశరథమహారాజు సత్కరించే బ్రాహ్మణ వృద్ధులను అక్కడ చూచినాడు. వారికి అందరికీ నమస్కారము చేసి, మూడవకక్ష్యలోకి పోయినాడు. అక్కడ ద్వారపాలికలుగా

ఉన్న వృద్ధాంగనలనూ, యువతులనూ చూచినాడు. వారు ఆ అన్నదమ్ములను ఆశీర్వదించి, రాముడి రాక కౌసల్యాదేవికి తెలియపరచడానికి లోపలికి పరుగెత్తినారు.

కౌసల్యాదేవి ఆ రాత్రి అంతా జాగారము చేసింది. తెల్లవారుతుండగా మహావిష్ణువును పుత్రాభ్యుదయము కోసము పూజ చేసింది. సంతోషముగా బ్రాహ్మణులచేత హోమము చేయించడము మొదలు పెట్టింది. తెల్లని పట్టుచీరెలో మంగళాలంకారాలతో ఉన్న ఆ వ్రతపరాయణను రాముడు చూచినాడు. దేవ పూజార్థము అక్కడ ఉంచిన తెల్లటిపూలదండలూ, పూర్ణకుంభాలూ, అక్షతలూ, నెయ్యీ, పాలూ, పెరుగూ, పేలాలూ, హవిస్సులూ, భక్ష్యాలూ, పాయసమూ, నువ్వులూ, బెల్లమూ, సమిధలూ మొదలు అయినవాటిని చూస్తూ, ఆమెను సమీపించినాడు.

వ్రత నియమాలతో కృశించిపోయినప్పటికిన్నీ, దివ్యకాంతులతో తేజరిల్లుతూ జలతర్పణము వదులుతున్న ఆ కౌసల్యాదేవి రాముణ్ణి చూచింది. వెంటనే లేచింది. ఎంతో సంతోషపడ్డది. తన పిల్లను చేరతీసుకొనపోయే పెంటిగుర్రమువలె, ఆమె రాముడి దగ్గరకు గబగబా అడుగులు వేసింది. అతడు ఆమెకు సాష్టాంగ నమస్కారము చేసినాడు. ఆమె అతణ్ణి లేవనెత్తింది. రెండుచేతులా గట్టిగా కౌగలించుకొన్నది. శిరము ఆఘ్రాణించింది. సంతోషముతో, "రామా! నీ పూర్వీకులు అందరూ రాజర్షులు, పరమధార్మికులు, మహాత్ములు. వారి అందరివలె నీవూ దీర్ఘాయుష్మంతుడవు కావలెను. వారివలె నీవూ కీర్తిమంతుడవు కావలెను. నీ కీర్తి దిగ్దిగంతాలలోనూ వ్యాపించవలెను. నాయనా! నీ వంశోచిత ధర్మాన్ని నీవు ఎప్పుడూ తప్పకూడదు" అంటూ ఆశీర్వదించింది. "నాయనా! నీ యువరాజ్యాభిషేక సమయము ఆసన్నము అవుతూ ఉంది. నీవు ఇప్పుడే పోయి మీ నాయనగారిని చూడవలెను. ఆ సత్యసంధుడు నీకు యువరాజ్యాభిషేకము చేయిస్తాడు. రామా! రాత్రి నీవు ఉపవాసము చేసినావు. ఇప్పుడే తెల్లవారింది. ఏమి అయినా కొంచెము తిను" అంటూ ఆమె పీట వేసింది.

రాముడు సిగ్గుపడిపోయినాడు. ఇక తాను దండకారణ్యము పోవలసిన విషయము ఆమెకు చెప్ప తలచి చేతులు జోడించి, "అమ్మా! నీకు ఏమీ తెలియదు. నేను ఏమని చెప్పేది? ఇక నీవూ, సీతా, లక్ష్మణుడూ నా కోసము ఘోరదుఃఖము అనుభవించవలసి ఉంది. ఈ పీట నాకు ఎందుకు? నేను ఇప్పుడు దండకారణ్యానికి ప్రయాణము అయిపోవలెను. ఇక నాకు ఇటువంటి పీటలు ఉండవు. ఇరవై అయిదు దర్భలతో అల్లిన విష్టరాసనముమీద నేను కూర్చుండవలెను. రసవద్ద్రవ్యాలతో వండిన మాంసము తినడము ఉండదు. తేనే, పండ్లూ, దుంపలూ తింటూ విజనారణ్యములో నేను పద్నాలుగు సంవత్సరాలు కాపురము చేయవలెను. అమ్మా! దశరథమహారాజు

ఇప్పుడు భరతుడికి రాజ్యాభిషేకముచేయ నిశ్చయించినాడు. నన్ను దండకారణ్యము పొమ్మని ఆజ్ఞాపించినాడు" అన్నాడు రాముడు.

కౌసల్యాదేవి ఈ మాట విన్నది. గొడ్డలితో తెగవేసిన మద్దికొమ్మవలెనూ, ఓరుగాలికి నిలువలేని అరటిచెట్టువలెనూ నేలకూలింది. బరువులు మోసి మోసి, అలసి సొలసి నేలమీద పడిపోయిన గుర్రమువలె, ఆమె పొరలాడడము మొదలు పెట్టింది. రాముడు ఆమెను లేవనెత్తినాడు. ఉపచారములు చేసినాడు. ఆమె ఒంటికి కొట్టుకొన్న దుమ్మూ ధూళి తన చేతులతో దులిపినాడు.

ఎప్పుడూ ఎంతో సుఖము అనుభవిస్తూ ఉండతగ్గ ఆ కౌసల్యాదేవి దుఃఖముతో కంపించిపోతూ లక్ష్మణుడు వినేట్టుగా, "నాయనా! దుఖము అనుభవించడానికా నేను నిన్ను కన్నది? అసలు నీవు నాకు పుట్టకపోయినట్లయితే ఇటువంటి దుఃఖము వచ్చేదికాదు. గొడ్డురాలికి సంతానము లేదు అనేది ఒక్కటే దుఃఖము. ఇట్లా పుత్రవియోగదుఃఖముతో కొట్టుకులాడవలసిన అవసరమే ఉండదు. రామా! మీ నాయనగారు నన్ను ఎన్నడూ సుఖపెట్టలేదు. సంతోషపెట్టలేదు. నేను ఏ ఐశ్వర్యమూ అనుభవించలేదు. నాకు ఒక కొడుకు పుట్టినాడు. ఇకను అన్నిసౌఖ్యాలూ, అన్ని ఐశ్వర్యాలూ అనుభవిస్తాను అనుకొన్నాను. ఇప్పుడు ఇట్లా అయిపోయింది.

"నాయనా! నేను ఇంతవరకూ పట్టమహిషిని. ఇక నన్ను సవతులు ఎద్దేవా చేస్తారు. వాండ్ల సూటి పోటీ మాటలు నేను వినవలెను. పడవలెను. ఆడుదానికి సవతుల ఎత్తిపొడుపులకన్నా భరించరాని దుఃఖము మరి ఒకటి ఉండదు. ఇక నా దుఃఖానికి అంతము ఉండదు. రామా! నీవు ఇక్కడ ఉండగానే, నా సవతి ఇట్లా చేసింది. నన్ను ఇట్లా అవమానించింది. ఇక నీవు దూరము అయిపోతే, నా గతి ఏమిటి? నేను చచ్చిపోవలసిందే. నాకు ఎన్నడూ స్వాతంత్ర్యము లేదు. నీ తండ్రి ఇప్పుడు నన్ను మరీ పనికిమాలినదానినిగా చేసివేసినాడు. ఇక నేను కైకేయి దాసీలతో సమానము అయిపోతాను. కాదు కాదు, వాండ్లకన్నా తక్కువదానిని అయిపోతాను. కైకేయీ పుత్రుడు ఏమి అనుకొంటాడో అనే భయముతో, ఏ ఒక్కడూ ఇక నా ముఖమువంక అయినా చూడడు. నాకు సేవచేసేవాడే ఉండడు. నేను దిక్కుమాలినదానను అవుతాను. కైక నన్ను చూచి మటమటలాడుతూ మాట్లాడుతుంది. నాయనా! నేను ఎట్లా ఓర్చుకొనేది?

"రామా! నీవు యువరాజువు అవుతావు అని నీకు ఉపనయనము అయింది మొదలు క్రిందటి పదిహేడు సంవత్సరాలనుంచీ ఆశపడుతూ వచ్చినాను. నా ఆశలు అన్నీ ఇప్పుడు అడియాసలు అయిపోయినవి. నేను పెద్దదానను. సవతుల ఈసడింపులు

నేను భరించలేను. రామా! చంద్రబింబమువంటి నీ ముఖము కనపడకపోయేట్లయితే, నేను బ్రతకడము ఎట్లాగు? దిగులుతో ఎన్నాళ్ళు బ్రతుకుతాను?

"నాయనా, రామా! నీ కోసము నేను దేవతారాధనలు చేసినాను. ఉపవాసాలు ఉన్నాను. ఎన్నో వ్రతాలు పట్టినాను. అనేకదానాలు చేసినాను. నా శ్రమ అంతా వ్యర్థము అయిపోయింది. నేను చేసిన తపస్సు అంతా చవిటినేలను నాటిన విత్తనము అయిపోయింది. నేను దరిద్రురాలను కాబోలు. రామా! నిన్ను కష్టపడి పెంచినాను. రామా! వరదదెబ్బకు గట్టిగట్టి ఏటిగట్లు సయితము గంట్లు పడిపోతవి. కాని, ఈ దుఃఖానికి నా గుండెలు పగిలిపోకుండా ఉన్నవి. రాయితో చేసినారో ఏమో! భయపడి ఏడుస్తున్న లేడిని సింహము కనికరములేకుండా ఎత్తుకొని పోతుంది. కాని, నన్ను యముడు ఎత్తుకొనిపోకుండా ఉన్నాడు. యమలోకంలో నాకు చోటు లేదో ఏమో! నాకు చావు లేదు కాబోలు! ఇంత దుఃఖము వచ్చినా, నా గుండెలు ఆడుతూనే ఉన్నవి. ఆగిపోలేదు. నా దేహమూ తిన్నగానే ఉంది. ఈ రెండూ ఇనపవి ఏమో! నాయనా, రామా! ఇంతకూ కాలము వస్తేనేకాని చావు రాదు. అంతవరకూ దుఃఖముతో కృశించి పోవలసిందే. ఎవరికి అయినా కోరుకున్నంత మాత్రాన చావు రాదు. రామా! దూడవెంట పోయే బక్క ఆవు మాదిరిగా నేనూ నీ వెంట వస్తాను. చంద్రబింబమువంటి నీ ముఖబింబము చూస్తూ బ్రతుకుతాను" అన్నది.

కౌసల్యాదేవి ఇట్లా చెప్పిందేకాని, రాముడు పిత్రాజ్ఞను జవదాటడు అని ఆమెకు తెలుసును.

శత్రువులు తన పిల్లవాణ్ణి పట్టుకొని కట్టివేస్తే చూచి ఏమీ చేయలేక ఏడ్చే కిన్నరాంగనవలె కౌసల్యాదేవి ఎలుగెత్తి ఏడ్చింది.

21

కౌసల్యాదేవి అట్లా ఏడుస్తూ ఉంటే లక్ష్మణుడు సమయోచితముగా ఇట్లా చెప్పినాడు:

"ఓ పూజ్యురాలా! ఒక ఆడదాని మాటకు లోబడి రాముడు రాజ్యము వదులుకొని అడవులపాలు అయిపోవడము నాకూ సమ్మతముగా లేదు. దశరథమహారాజు వృద్ధాప్యములో ఉన్నాడు. ఆయనకు మనస్సు స్థిమితముగా లేదు. పైగా విషయలోలుడున్నూ అయిపోయినాడు. కైకేయీదేవి ప్రేరేపిస్తే మన్మథ పారవశ్యములో ఉన్న ఆయన ఏమి అయినా ఆజ్ఞాపిస్తాడు.

"అమ్మా! రాజ్యములో అయినా ఉండనీయకుండా అడవులకు వెళ్ళకొట్టవలసినంత మహాపరాధము రాముడు ఏమి చేసినాడు? రాజద్రోహము ఏమి

చేసినాడు? రాముడి శత్రువులుకానీ, అపరాధముచేసి రాముడివల్ల శిక్ష అనుభవిస్తున్న వాండ్లుకానీ చాటున అయినా రాముడిమీద దోషారోపణము చేసి ఎరుగరే! ఏ ఒక్కరూ, ఏ ఒక్క దోషమూ, ఎన్నడూ రాముడికి ఆపాదించి ఎరుగరే! అటువంటివాణ్ణి అడవులకు ఎందుకు వెళ్లకొట్టవలెను?

"అమ్మా! రాముడు దేవుడివంటివాడు. ఋజువర్తనుడు. జితేంద్రియుడు. కైకేయీదేవి మొదలు అయిన శత్రువర్గమువారిని సయితము అతడు ఆదరిస్తూ ఉన్నాడే! అటువంటి పుత్రుణ్ణి ఏ తండ్రి అయినా అడవులకు వెళ్ళకొట్టుతాడా? అందులో, ధార్మికుడు అయిన తండ్రి అట్లా ఆజ్ఞాపిస్తాడా? దశరథమహారాజు మన్మధపరవశుడు అయిపోయి కుర్రవాడివలె ప్రవర్తించినాడు. రాజనీతి తెలిసిన పుత్రుడు ఎవడున్నూ ఆయన మాటలను మన్నించడు, మన్నించ నవసరములేదు" అంటూ, రాముడివంక చూచి, 'రామా! ఈ విషయము ఇతరులకు తెలిసేలోపలనే నీవు రాజ్యాన్ని స్వాధీనము చేసుకోవలెను. నేను నీ వెంట ఉంటాను. నేను ధనుర్ధరుణ్ణి అయి నిలుచుంటే, నీవు నా పక్కను దండధరుడివలె కనపడుతూ ఉంటే ఈ అయోధ్యానగరములో నిన్ను ఎదిరించేవాడు ఎవడు? నిన్ను ఎదిరించే సామర్థ్యము ఎవడికి ఉంది? ఎవండ్లు అయినా ఎదిరించడమే జరిగేట్లయితే నా తీక్షణబాణాలకు ఈ మహానగరము నిర్మానుష్యము అయిపోతుంది. భరతుడి పక్షమువాండ్లుకానీ, వాడి హితముకోరే ఇంకా ఎవండ్లు అయినాకానీ నీ మీదకు వచ్చేట్లయితే, వాండ్లను అందరినీ నేను నాశనము చేసి వేస్తాను. కైకేయీదేవి ప్రోత్సాహమువల్ల దశరథమహారాజే శత్రుత్వము వహించి మనమీదకు వచ్చేట్లయితే ఆయనను చంపివేద్దాము లేదా బందిఖానాలో ఉంచుదాము.

"రామా! కామాతురుడు అయి, కార్యాకార్యవిచక్షణజ్ఞానము పోయి అపమార్గము అవలంబించినప్పుడు తండ్రిని అయినా దండించవలెను. ఇది ధర్మము. నీకు రావలసిన రాజ్యాన్ని ఏ హేతువువల్ల దశరథమహారాజు కైకేయీదేవికి కట్టబెట్ట తలచినాడు? ఏమి బలము చూచుకొని అట్లా చేయవలెను అనుకొన్నాడు? ఓ అరిశాసనా! నీతోనూ నాతోనూ ప్రబలము అయిన విరోధము పెట్టుకొని, ఈ రాజ్యాన్ని భరతుడికి ఒప్పగించే శక్తి దశరథమహారాజుకు ఉందా' అంటూ కౌసల్యాదేవి వంక చూచి, 'ఓ దేవీ! నేను త్రికరణశుద్ధిగా రామానురక్తుణ్ణి. సత్యప్రమాణముగా చెప్పుతున్నాను. నా ధనుస్సుమీదనూ, నేను చేసిన యజ్ఞాలమీదనూ, నేను చేసిన దానాలమీదనూ ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను. రాముడు అడవికి పోతే నేనూ వాని వెంట అడవికి పోతాను. అడవికి పోవడమేకాదు, మండుతూ ఉన్న మంటలోకి దూకతలచుకొంటే వారికన్నా ముందుగా ఆ మండే మంటలో నేనూ దూకుతాను.

అమ్మా! ఇంతకూ నీవు దుఃఖపడుతూ ఉంటే నేను చూడలేకుండా ఉన్నాను. సూర్యుడు ఉదయించి చీకట్లు పోగొట్టేట్టు, నా పరాక్రమముతో నేను నీ దుఃఖాన్ని పోగొట్టుతాను. నా పరాక్రమము నీకూ, రాముడికీ ఇప్పుడే చూపిస్తాను" అన్నాడు లక్ష్మణుడు.

దుఃఖముతో చలించిపోతూ ఉన్న కౌసల్యాదేవి ఈ మాటలకు, "రామా! నీ తమ్ముడు లక్ష్మణుడు చెప్పుతున్నది అంతా వింటూ వున్నావు కదా? ఇకను ఈ విషయములో చేయవలసింది అంతా నీవు ఆలోచించవలెను. నా సవతి చెప్పింది అధర్మము. ఆమె చెప్పింది ధర్మము అనుకొని, నీవు నన్ను విడచిపెట్టి అడవులకు పోవద్దు. నన్ను నీవు దుఃఖపెట్టవద్దు. నాయనా, రామా! నీవు సమస్తధర్మాలూ తెలిసినవాడవు. నీవు ధర్మాన్నే అనుసరించ తలచుకుంటే ఇక్కడనే ఉండి నీవు నాకు శుశ్రూష చేయవలెను. మాతృసేవకన్నా అధికము అయిన ధర్మము పుత్రుడికి మరి ఒకటి లేదు. కాశ్యపుడు నియమబద్దుడు అయిన తన తల్లికి సేవ చేస్తూ స్వగృహములోనే ఉండిపోయినాడు. మహాతపస్సంపన్నులవలె స్వర్గతుడు అయినాడు. కశ్యపప్రజాపతిన్నీ అయినాడు.

"రామా! దశరథమహారాజు నీ తండ్రి అయినందువల్ల, నీవు ఆయనను పూజిస్తున్నాను అంటున్నావు. మంచిదే. నేను నీ తల్లిని. నీవు నీ తండ్రిని పూజించేట్టుగా నీ తల్లిని అయిన నన్నూ పూజించవలెను. నీవు అడవులకు పోవడము నేను ఒప్పుకోవడము లేదు. కనుక నీవు పోకూడదు. నీవు లేకపోయేట్లయితే నేను బ్రతకడము ఎందుకు? సుఖపడడము ఎందుకు? నీతో ఉంటూ నేను తృణభక్షణము చేసినా నాకు హాయిగా ఉంటుంది. నీ వియోగదుఃఖము నేను భరించలేను. నీవు పోతాను అంటేనే, నేను తల్లడిల్లి పోతున్నాను. నీవు నన్ను ఇక్కడ వదిలిపెట్టి అడవులకు పోయేట్లయితే, నేను ప్రాయోపవేశము చేస్తాను, బ్రతకను. చచ్చిపోతాను. రామా! పిప్పలాదమహర్షి విషయంలో అధర్మముగా ప్రవర్తించినందువల్ల పుణ్యనదులు అన్నిటికీ ప్రభువు అయినప్పటికిన్నీ, సముద్రుడికి బ్రహ్మహత్యా పాతకము పట్టుకొన్నది. అదేవిధముగా, నేను చచ్చిపోయేట్లయితే నీకు ఘోర దుర్గతి పట్టుతుంది" అంటూ ఏడవసాగింది.

రాముడు ధర్మసహితముగా "అమ్మా! నాయనగారి ఆజ్ఞను నేను అతిక్రమించను. వారిని అతిక్రమించడము నాచేత కాదు. నేను నిన్ను శిరసా ప్రార్థిస్తున్నాను. నన్ను అరణ్యవాసానికి పోనివ్వవలెను. అమ్మా! కండువుమహర్షి సమస్త ధర్మాలు తెలిసినవాడు. వ్రతానుష్ఠానపరాయణుడు. తండ్రి ఆజ్ఞాపించినాడు అని గోవధము చేసినాడు. పరశురాముడుకూడ తండ్రి ఆజ్ఞాపించినాడు అని, తనను కన్న తల్లి అనే కనికరము అయినా లేకుండా రేణుకాదేవిని గొడ్డలితో నరికివేసినాడు.

ఎవరి విషయమో ఎందుకు? మా పూర్వీకులు సాగరులు పిత్రాజ్ఞాపరిపాలనము కోసము ఈ భూమిని అంతా మహాభయంకరముగా త్రవ్వి హతము అయిపోయినారు. వారే కాదు, ఇంకా ఎంతోమంది దేవతలతో సరిసమానము అయినవారు పిత్రాజ్ఞను శిరసావహించి ఎన్నోపనులు చేసినారు. పిత్రాజ్ఞాపరిపాలనానికి ఈనాడు నేను ఒక్కణ్ణే బయలుదేరలేదు. పూర్వాచారవిరుద్ధమూ, అభినవమూ అయిన ధర్మాన్ని నేను ఇప్పుడు అనుసరించపోవడములేదు. పరమధార్మికులు అయినవారు అందరూ పోయినదారినే నేనూ పోతలచినాను, పోతున్నాను. ఈ భూలోకములో పుత్రుడికి పిత్రాజ్ఞాపరిపాలనము ముఖ్యధర్మము. అందువల్ల నేను మరి ఒక ధర్మాన్ని పాటించను.

"అమ్మా! నీకు దుఃఖహేతువు అయితే కావచ్చును కాని, పిత్రాజ్ఞా పరిపాలనమువల్ల నన్ను ఏ దోషమూ బాధించదు అంటూ, ఆ వాక్యవిదుడు లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! నీకు నామీద ఎంత అనురాగము ఉన్నదీ నేను ఎరుగుదును. నీ పరాక్రమమూ, నీ ప్రభావమూ, నీ బలమూ నాకు తెలుసును. సత్యస్వరూపమూ, శమ స్వరూపమూ తెలుసుకోలేక మా అమ్మ మహాదుఃఖపడుతూ ఉంది. లక్ష్మణా! సకలపురుషార్థాలకున్నూ ధర్మమే మూలము. ధర్మము సత్యముమీద నిలిచి ఉంది. సత్యము లేకుండా ధర్మము లేదు. సత్యానికీ, ధర్మానికీ అవినాభావసంబంధము. పితృవాక్యపరిపాలనమువల్ల నాకు ఇప్పుడు ధర్మమూ, సత్యమూ సమకూరుతున్నవి. తండ్రికికానీ, తల్లికికానీ, ఒక బ్రాహ్మణుడికికానీ మాట ఇచ్చిన తరువాత, ధార్మికుడు అయినవాడు ఎవడున్నూ ఆ మాట తప్పడు, తప్పకూడదు. అందువల్ల నేను పిత్రాజ్ఞను అతిక్రమించను. నన్ను ఆజ్ఞాపించింది కైకేయీదేవి కాదు. పిత్రాజ్ఞను ఆమె నాకు తెలియచెప్పింది, అంతే. తమ్ముడా! నీవు ఇప్పుడు భయంకరము అయిన క్షత్రియధర్మముమీదికి నీ బుద్ధిని పోనీయవద్దు. క్రౌర్యము వద్దు. నా పద్ధతినే నీవూ అవలంబించు అంటూ కౌసల్యాదేవిని చూచి, 'అమ్మా! నేను అరణ్యవాసానికి పోక తప్పదు. నా ప్రాణముమీద ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను. నా వనవాసానికి నీవు అడ్డు చెప్పవద్దు. నన్ను అనుమతించు. ఆశీర్వదించు. స్వర్గముమీదినుంచి భూమిమీదపడి మళ్ళీ స్వర్గానికి పోయిన యయాతిరాజువలె, నేను నా ప్రతిజ్ఞ చెల్లించడానికి వనవాసము చేసి అయోధ్యానగరానికి మళ్ళీ వస్తాను. అమ్మా! నీవు దుఃఖపడవద్దు. నీ దుఃఖాన్ని మనస్సులోనే అణచి ఉంచుకో. వనవాసము అయిపోగానే నేను తిరిగి వస్తాను. అమ్మా! దశరథమహారాజు ఆజ్ఞలను నేను ఒక్కణ్ణేకాదు, నీవూ, సుమిత్రాదేవీ, సీతా, ఈ లక్ష్మణుడూ అందరూ శిరసావహించవలెను. ఇది సనాతన ధర్మము.

"అమ్మా! నా రాజ్యాభిషేకానికి నీవు సమకూర్చిన సంబరాలను నీవు సంతోషముగా భరతాభిషేకానికి ఇచ్చి వేయవలెను. నేను వనవాసము చేయడానికి

పోవడము ధర్మసమ్మతము అయిన పని కనుక, నీవూ సమ్మతించవలెను. నీవు దుఃఖపడవద్దు" అన్నాడు.

ఈ విధముగా ఎంతో ధైర్యముతోనూ, స్థైర్యముతోనూ రాముడు చెప్పింది అంతా కౌసల్యాదేవి ఆలకించింది. భరించలేని దుఃఖముతో ఆమె మూర్ఛపోయింది. చచ్చిపోయినదానివలె నేలమీద పడిపోయింది. రామలక్ష్మణులు ఆమెకు ఉపచారములు చేసినారు. కొంతసేపటికి ఆమె తెప్పరిల్లింది. రాముణ్ణి ఎగాదిగా చూస్తూ, "ఓ కొడుకా! శరీరసంబంధములోనూ, పెంచి పెద్దవాణ్ణిచేసి పోషించడములోనూ నీకు నీ తండ్రి ఎంతపూజ్యుడో, నేనూ అంత పూజ్యురాలను. ఇప్పుడు నీవు నా ఎదుట లేకపోయేట్లయితే, నేను బ్రతికి ఉండడము దేనికి? నాకు పరలోకసౌఖ్యాలు ఎందుకు? స్వర్గలోకములో అమృతపానము చేయడమూ, పితృలోకములో స్వధలు తినడమూ, మహర్లోకములో మహదానందము అనుభవించడమూ నాకు ఎందుకు? అవి ఏవీ నాకు అక్కరలేదు. నీవు నా ఎదుట ఉంటే చాలును. అదే నాకు స్వర్గము. నాకు కావలసింది నీవు నా ఎదుట ఉండడమేను" అంటూ ఏడుస్తూ పడిపోయింది.

ఈ విధముగా ఒక చెంప తల్లి తెలివితప్పి పడిపోయింది, ఇంకొక చెంప తమ్ముడు లక్ష్మణుడు దుఃఖముతో తపించి పోతున్నాడు. అయితే, రాముడి ధర్మచింత ఈషణ్మాత్రమూ చలింపలేదు. రాత్రిపూట వేటకాండ్లు పెద్ద పెద్ద కొరవులతో దారి అడ్డగించినా లెక్కచేయకుండా తన దారినపోయే మదపుటేనుగువలె, రాముడి బుద్ధి ధర్మమార్గాన్నే నడువసాగింది. అటువంటి ధర్మసంకట సమయములో రాముడు, "లక్ష్మణా! నీకు నామీద ఉన్న భక్తి నేను ఎరుగుదును. కాని నీవున్నూ నా అభిప్రాయము తెలుసుకోకుండా మా అమ్మతోపాటు నన్ను ఎంతో దుఃఖపెట్టుతూ ఉన్నావు. తమ్ముడా! ఒక్క ధర్మమువల్లనే 'ధర్మార్థకామాలు' అనే మూడు పురుషార్థాలున్నూ సమకూడుతవి. సందేహము అక్కరలేదు. భార్య అనుకూలవతి అయి ధర్మాన్నీ, అభిమత అయి అర్థాన్నీ, సుపుత్ర అయి కామాన్నీ సమకూరుస్తుంది. అదేవిధముగా ధర్మానుష్ఠానమువల్ల ధర్మమూ, అర్థమూ, కామమూ సంప్రాప్తము అవుతవి. ధర్మార్థకామాలు మూడూ ఏ పనివల్ల సమకూడవో, ఆ పని చేయకూడదు. కేవలము అర్థపరుడు అయిన వాణ్ణి లోకము ద్వేషిస్తుంది. కేవల కామపరత్వము అప్రశస్తము. అందువల్ల, ధర్మము సమకూడేపని చేయవలెను.

"నాయనా! దశరథమహారాజు మనకు తండ్రి, గురువు, రాజు. ఆయన కోపమువల్లకానీ, సంతోషమువల్లకానీ, కామాతురతవల్లకానీ ఏమి ఆజ్ఞాపించినా చేసి తీరవలెను. పాపకర్ముడు అయిన కొడుకు తండ్రి చెప్పింది చేయకపోవచ్చును. నేను మాత్రము నాయనగారు చెప్పింది చేయకుండా ఉండను. ధర్మము ఎరిగినవాడు

ఎవడు అయినా పిత్రాజ్ఞను శిరసావహించే తీరుతాడు. అందువల్ల, ఆయన చేసిన ప్రతిజ్ఞ భరతాభిషేకము, మద్వనవాసరూపకము అయిన ప్రతిజ్ఞ, నేను నెరవేర్చకుండా ఉండటానికి వీలులేదు. ఆయన ప్రభువు. నన్నూ, భరతుణ్ణీ ఆజ్ఞాపించే అధికారము ఆయనకు ఉంది.

"తమ్ముడా! ఈ కౌసల్యాదేవి ఆయన ఇల్లాలు. ఈమెకున్నూ ఆయనే దిక్కు. ఈమె ఆయన ఆజ్ఞలను పాటించవలెను. ఇది పరమధర్మము. దశరథమహారాజు తన పూర్వీకులకన్నా ధర్మాత్ముడు అని ముల్లోకాలలోనూ ప్రసిద్ధి కెక్కినాడు. ఆ ధర్మప్రవర్తకుడు జీవించి ఉండగా, ఆయన పట్టపురాణి ఒక విధవరాలుమల్లే కొడుకు వెంట అడవులకు పోవడము ఎంతమాత్రమూ పనికిరాదు అంటూ కౌసల్యాదేవిని చూచి, 'ఓ పట్టపురాణీ! నేను వనవాసము చేయడానికి పోతున్నాను. దౌహిత్రుడి సత్యవచన ప్రభావమువల్ల యయాతిరాజు మళ్ళీ స్వర్గానికి పోయినాడు. అదే విధముగా దీవించు. అరణ్యవాసము ఇట్టే ముగించుకొని వస్తాను. అమ్మా! ఇప్పుడు రాజ్యము కోసము ఉత్తరక్షణా నాకు సంప్రాప్తము అయ్యే మహద్యశస్సు పాడుచేసుకోవడము నాకు ఇష్టము లేదు. ఇంతకూ బ్రతికి ఉండేది బహుకొద్దికాలము. అందువల్ల, అధర్మము అవలంబించను. నాకు ఈ తుచ్ఛ రాజ్యము అక్కరలేదు" అన్నాడు.

రాముడు ఈ విధముగా తల్లితో చెప్పినాడు. తన అభిప్రాయము తమ్ముడికి వివరించినాడు. ఒంటరిగా దండకారణ్యము పో నిశ్చయించుకొన్నాడు. కౌసల్యాదేవికి మనసా ప్రదక్షిణము చేసినాడు.

22

లక్ష్మణుడు కోపవహ్నితో కుమిలిపోయినాడు. దేహము తాపము ఎత్తింది. కోపము రేగింది. నాగుపాములె బుసలు కొట్టుతూ ముఖము అంతా కన్నులు చేసికొని చూడడము మొదలుపెట్టినాడు. అట్లా చూస్తూ ఉన్న ఆ కూరిమి తమ్ముణ్ణి వదలిపెట్టి పోకూడదు అనుకొన్నాడు ఆ ధైర్యవంతుడు, ఆ జితేంద్రియుడు రాముడు. ఆయన లక్ష్మణుడితో, "తమ్ముడా! కోపము నిగ్రహించు. నాకు ఇట్లా అయిపోయిందే అని దుఃఖపడవద్దు. మానముపోయి అవమానము అయింది అని బాధపడవద్దు. ధైర్యము వహించు. నా రాజ్యాభిషేకము కోసము నీవు చేసుకొన్న అలంకారాలను విసర్జించు. నిరపాయము అయిన నా వనవాసానికి సాయపడు.

"లక్ష్మణా! అభిషేకసంభారాలను సమకూర్చడములో నీవు చూపించిన చాకచక్యము ఇప్పుడు నా వనవాసానికి అవసరము అయిన వల్కలాదులు

సమకూర్చడములో చూపించవలెను. నా రాజ్యాభిషేకము ఆగిపోయింది అని మా అమ్మ కౌసల్యాదేవి దుఃఖపడుతూ ఉంది. పధ్నాలుగు సంవత్సరాలు వనవాసముచేసి నేను సురక్షితముగా వస్తానో రానో అని ఆమె శంకిస్తూ ఉంది. అందుకు బాధపడుతూ ఉంది. తమ్ముడా! పిత్రాజ్ఞను నేను త్రోసివేయకూడదు అనీ, పధ్నాలుగు సంవత్సరాల వనవాసము నేను ఇట్టే ముగించుకొని వస్తాను అనీ నీవు మా అమ్మకు నచ్చచెప్పవలెను. ఆమె నా పునరాగమనము ఆశించకుండానూ, నాకోసము దుఃఖపడకుండానూ ఉండేట్టు నీవు చూడవలెను.

"నాయనా! మనము ఇక్కడ మాట్లాడుకొంటూ ఉంటే, రాముణ్ణి లక్ష్మణుడు ప్రేరేపిస్తే రాముడు అడవికి పోను అంటాడేమో అని కైకేయీదేవి సందేహించి బాధపడుతూ ఉంటుంది. నేను ఇంకా బయలుదేరలేదు అని దుఃఖపడుతూ ఉంటుంది. ఆమె సందేహాన్నీ, దుఃఖాన్నీ పొకొట్టవలెను. లక్ష్మణా! మన తల్లులు కౌసల్యా, కైకేయీదేవులు ఆశంకిస్తూ దుఃఖపడుతూ ఉంటే, నేను ఒక్క క్షణము అయినా ఉపేక్షించి ఊరకుండలేను.

"లక్ష్మణా! నేను ఇంతవరకూ తెలిసి అయినా తెలియక అయినా మన నాయనగారినికానీ, మన తల్లులనుకానీ ఎన్నడూ కష్టపెట్టినట్లు గుర్తులేదు. నాయనగారు ఎన్నడూ అబద్దాలు ఆడరు, ఆడితప్పరు. వారి పరాక్రమము అమోఘము. ఈ భూలోకములో వారు దేనికీ భయపడి ఎరుగరు. వారు కైకేయీదేవికి చేసిన ప్రతిజ్ఞ దబ్బర అయి పోతుందేమో అనీ, అందువల్ల పరలోకములో బాధలు పడవలసివస్తుందేమో అనీ భయపడుతున్నారు. పరలోకభయముతో వారు కంపించి పోతున్నారు. వారు నిర్భయముగా ఉండడమే నాకు కావలెను. నా పట్టాభిషేకము ఆపివేసి ఇప్పుడే భరతుడికి పట్టాభిషేకము చేయకపోయేట్లయితే, కైకేయీదేవికి చేసిన వాగ్దానము అబద్ధము అయిపోతుంది అని నాయనగారు మనస్సులో బాధపడుతూ ఉంటారు. వారు మనోవ్యధ పడడము నేను సహించలేను. అందువల్ల, ఈ పట్టాభిషేక సంరంభము అంతా కట్టిపెట్టి నేను ఇప్పుడే, ఇటునుంచి ఇటే అరణ్యవాసానికి పోవలెను అనుకొంటున్నాను.

"లక్ష్మణా! నేను వనవాసానికి పోవడముతో, అంటే వల్కలాలు కట్టుకొని, కృష్ణాజినము కప్పుకొని, జటాకమండలాలు ధరించి వనవాసానికి ప్రయాణము అయిపోవడముతో కేకయరాజపుత్రి మనస్సు కుదుట పడుతుంది. అంతట ఆమె తన కొడుకు భరతుడికి నిరాటంకముగా రాజ్యాభిషేకము చేయిస్తుంది. కృతకృత్యురాలు అవుతుంది. తమ్ముడా! నాయనగారు తమ సత్యవాక్యపరిపాలనము

కోసము నేను వనవాసము చేయవలెను అని నిర్ణయించినారు. ఇంకా నేను ఇక్కడ ఉండి వారి మనస్సు నొప్పించడము ఎందుకు? వెంటనే వెళ్ళి పోవలెను. ఆలస్యము చేయకూడదు.

"తమ్ముడా! పితృవాక్యపరిపాలనము పుత్రుడు అవశ్యమూ అనుష్ఠించవలసిన ధర్మము అని చెప్పినాను. ఆలోచిస్తూ ఉంటే మరి ఒకటిన్నీ తోచింది. నాయనగారు నాకు రాజ్యాభిషేకము తలపెట్టడమూ, ఇది ఇప్పుడు విఫలము అయిపోవడమూ దైవికము. దైవికమే కాకపోయినట్లయితే, నన్ను ఇట్లా బాధపెట్టవలెను అని కైకేయీదేవికి ఎందుకు బుద్ధిపుట్టుతుంది? కైకేయీదేవి ఇదివరకు ఎన్నడయినా నన్ను పరాయి అమ్మ కన్న బిడ్డవలె చూడడము నీవు ఎరుగుదువా? నేను ఎన్నడయినా సవతితల్లి, కన్నతల్లి అనే భేదభావముతో ప్రవర్తించడము నీవు ఎరుగుదువా? కైకేయీదేవి నన్నూ, భరతుణ్ణీ ఏ తారతమ్యమూ లేకుండా ఒక్కమాదిరిగా చూస్తూ వచ్చింది. అంత వాత్సల్యముతో నన్ను చూస్తూ వచ్చిన కైకేయీదేవి, యువరాజ్యాభిషేకము కట్టిపెట్టి అరణ్యవాసానికి పొమ్మని నాతో చెప్పరానిమాట చెప్పింది. ఆమె నోటివెంట అటువంటి ఉగ్రవాక్కు వెలువడడము దైవికము. అందుకు మరి ఒక కారణము కనపడడములేదు.

"లక్ష్మణా! కైకేయీదేవి ఉత్తమ రాజవంశంలో జన్మించింది. ఆమె ఇంతవరకూ తన వంశోచిత సుగుణాలకు అనుగుణముగా ప్రవర్తిస్తూ వచ్చింది. ఆమె ఇప్పుడు దుష్కులాంగనవలె భర్తసాన్నిధ్యములో సిగ్గూ బిడియమూ లేకుండా ఆయననూ, ఆయన ప్రియపుత్రుణ్ణీ బాధించే కోరిక కోరింది. ఆ కోరిక చెల్లించవలెను అని ఆమె ఆయనను నిర్బంధించింది. ఇది దైవికము. అందుకు మరి ఒక కారణము లేదు.

"నాయనా! దైవికానికి తిరుగులేదు. సమస్తప్రాణికోటి దానికి తల ఒగ్గవలసిందే. ఇప్పుడు అది నా స్థితికీ, కైకేయీదేవి స్థితికీ విపర్యయము తెచ్చిపెట్టింది. పెద్దలు అందరూ ఆలోచించి నిశ్చయించిన నా రాజ్యాభిషేకము ఆగిపోయింది. నన్ను ఎంతో వాత్సల్యముతో చూచే కైకేయీదేవి సత్స్వభావము తలక్రిందులు అయిపోయింది. తమ్ముడా! దైవికానికి ఏ అడ్డూ లేదు. జరిగినదానినిపట్టే, దైవికము అని అనుకోవలసివస్తూ ఉంటుంది. అది దైవికము అని ముందుగా తెలియదు, తెలుసుకోలేముకూడానూ! ఎంతో శ్రద్ధతో శ్రమపడి చేసిన పనులు ఒకప్పుడు విఫలము అయిపోతూ ఉంటవి. అందుకు ఏ కారణమూ కనపడదు. ఏమాత్రము శ్రద్ధ లేకుండానూ, శ్రమపడకుండానూ చేసిన పనులు ఒకప్పుడు సఫలము అవుతూ ఉంటవి. అందుకు కారణము కనపడదు. కాబట్టి, ఆ యా పనులను ఫలపరిపాకాన్నిబట్టి దైవికము అనుకొని శిరసావహించవలెను. అనుభవించవలెను. ముందుగా తెలియదు కనుక, దైవికాన్ని ఎదుర్కొనడము అనేదే లేదు. సుఖదుఃఖాలూ,

భయక్రోధాలూ, లాభాలాభాలూ, ఉత్పత్తి వినాశాలూ- ఈ మొదలయినవి అన్నీ దైవికముగా సంభవిస్తూ ఉంటవి. మహోగ్రనియమాలతో తపస్సుచేసే మహర్షులు సహితము కామక్రోధపరవశులు అయిపోవడమున్నూ దైవికమే. ఎంతోకాలము ఆలోచించి ఆలోచించి ఆరంభించిన పని ఇట్టే ఆగిపోతుంది. ఎన్నడూ అనుకోని పని హఠాత్తుగా అయి ఊరుకుంటుంది. దైవికము కాకపోతే ఇటువంటి సంఘటనకు కారణము ఏమిటి? ఈ యధార్థము నేను గమనించినాను. అందువల్లనే, నేను మనోనిగ్రహముతో ఉన్నాను. నా అభిషేకము ఆగిపోయింది అనే విచారము నాకు లేదు. నీవున్నూ ఆలోచించి చూడు, దుఃఖపడవద్దు.

"తమ్ముడా! నా రాజ్యాభిషేకము కోసము తెచ్చిన ఈ కలశాలలోని జలాలతో ఇప్పుడు నేను తపోవ్రతస్నానము చేస్తాను. కాదు కాదు, పొరపాటు. ఈ కలశాలలో జలాలు రాజ్యాభిషేకము కోసము తెచ్చినారు. నేను ఉపయోగించకూడదు. నేను స్వయముగా నీళ్లు తోడుకొని తపోవ్రతస్నానము చేస్తాను. నాయనా! నాకు రాజ్యలక్ష్మి విపర్యయము అయిపోయింది అని నీవు దుఃఖపడవద్దు. రాజ్యపాలనముకన్నా వనవాసమే సుఖముగా ఉంటుంది, శుభఫలమూ ఇస్తుంది.

"తమ్ముడా! నా రాజ్యాభిషేకము విఘ్నము అయిపోవడానికి పిన్నమ్మ కారణము కాదు. ఆమె దైవోపహత. అందువల్ల, ఆమె అప్రియము చెప్పింది. దైవప్రభావము అటువంటిది" అన్నాడు రాముడు.

23

రాముడు ఇట్లా పదే పదే చెప్పుతూ ఉన్న మాటలు నచ్చక పోయినప్పటికిన్నీ, లక్ష్మణుడు తలవంచుకొని వినయ విధేయతలతో విన్నాడు. రాముడి ధర్మనిష్ఠకు అతడికి సంతోషము వేసింది. అయితే, రాజ్యము వదలిపెట్టి అరణ్యావాసము చేయబోతున్నందుకు దుఃఖము వచ్చింది. ఆలోచించినాడు. అతనికి మరింత కోపము వచ్చింది. తరిమితే కనబడ్డ కలుగులోదూరి కోపముతో బుసలుకొట్టే పాములవలె, నిట్టూర్పులు విడవడము మొదలు పెట్టినాడు. కన్నులు కెంపులవలె ఎర్రపడిపోయినవి. కోపోద్రేకముతో చెలరేగిన సింహమువలె, అతని ముఖము దుర్నిరీక్ష్యము అయిపోయింది. కోపము వచ్చిన మదపుటేనుగు తొండము విదిలించేట్టు తన చెయ్యి విదిలిస్తూ, చేతి వేళ్లు ముడుస్తూ తెరుస్తూ, తల ఆడిస్తూ, చిట్లించిన కనుబొమలలోనుంచి అతిరూక్షముగా రాముడివంక చూస్తూ, "అన్నా! పితృవాక్యపరిపాలనము చేయకపోయేట్లయితే ధర్మహాని చేసినవాణ్ణి అయిపోతానేమో అని నీవు భయపడుతున్నావు. లోకులు నిన్ను ధర్మాత్ముడు అని గౌరవించరేమో

అని అనుకొంటున్నావు. అంతేకాకుండా, వారున్నూ ధర్మహానికి తలపడుతారేమో అని శంకిస్తున్నావు. ఇది అంతా నీ భ్రాంతి. ఇందుకోసము అడవులకు పోవలెను అని తొందరపడుతున్నావు. ఇది ఏమీ బాగాలేదు. పైగా, నీవు ఈ జరిగింది అంతా దైవికము అనీ, అది ప్రబలము అనీ అంటున్నావు. నీవంటి అసంభ్రాంతచిత్తుడు ఎప్పుడూ దైవాన్ని అట్లా పొగడడు. దైవము దాని అంతట అది ఏమీ చేయలేదు. దాని పని నెరవేర్చుకోవడానికి అది మరి ఒకరిని ఆశ్రయిస్తుంది. అశక్తులూ, దీనులూ దైవానికి తలఒగ్గుతారు. శూరులూ, వీరులూ దానిని తిరస్కరిస్తారు. రామా! నీవు శూరులలోనూ, క్షత్రియులలోనూ శ్రేష్ఠుడవు. దైవాన్ని నిరాకరించగల సమర్థుడవు. నీవు దైవాన్ని ప్రశంసించడము అసమంజసము.

"అన్నా! కైకేయీ దశరథులు అధర్మపరాయణులు అయినారు అని నీకు ఎందుకు తోచడము లేదు? ఓ ధర్మాత్మా! ఈలోకములో ధర్మవేషధారులు కొందరు ఉన్నారు. వారు వారి కార్యసిద్ధి కోసము ఎప్పుడూ ధర్మపన్నాలు చక్కగా చెప్పుతూ ఉంటారు. అదే విధముగా, కైకేయీ దశరథులు పైకి నీమీద ఎంతోవాత్సల్యము నటిస్తూ, నీకు కీడు తలపెట్టినారు. నీవు ఎందువల్లనో తెలుసుకోలేక పోయినావు. కైకేయీ దశరథులు ఇట్లా చేయవలెను అని ముందుగానే ఆలోచించి ఇప్పుడు ఇట్లా చేసినారు. వారు ముందుగా ఆలోచించకపోయినట్లయితే ఎన్నడో వాగ్దానము చేసిన వరాలను దశరధమహారాజువంటి నీతిజ్ఞుడు ఇంతవరకూ చెల్లించకుండా ఉండడు. ఒకవేళ ఆయన ఉపేక్షించినా కైకేయీదేవి ఇంతకాలమూ ఆ వరాలను చెల్లించమని అడగకుండా ఉండదు. ఒకవేళ ఇది అంతా వాస్తవమే అనుకున్నా, ఏనాటి వరాలో చెల్లించమని అడగడానికి కైకేయీదేవికి ఇదా సమయము? ఇది అంతా అబద్ధము. ఇది వారు ఉభయులూ ఆలోచించి చేసిన కుట్ర. ఇటువంటివారి మాటలు నీవు విననందువల్ల, నిన్ను ఏ పాపమూ బాధించదు.

"ఓ వీరా! నీవు జ్యేష్ఠుడవు. నీవు ఉండగా నీకంటే చిన్నవాడికి రాజ్యాభిషేకము చేయడము అధర్మము. లోకవిరుద్ధము. అది నేను సహించలేను.

"రామా! నీవు మహామతిమంతుడవు. పితృవాక్యపరిపాలనము పరమ ధర్మము అనుకొన్నావు. అందుకోసము నీవు నిన్నటిదినము రాజ్యాభిషేకము అంగీకరించినావు. ఈనాడు ఆ పరమధర్మము కోసమే అడవులకు పోవలెను అంటున్నావు. ఇట్లా రోజుకు ఒక మాదిరి బుద్ధి పుట్టించే ధర్మము ఒక ధర్మమా? ఇదే ధర్మము అయినట్టయితే తిరస్కరించవలెను. పితృవాక్యపరిపాలనము ముఖ్యధర్మము అనే వ్యామోహములో పడిపోయి, ఇది ధర్మము అని నీవు అంటున్నావు. ఒకవేళ ఇదే

ధర్మము అనుకొన్నప్పటికిన్నీ, దశరథమహారాజు కాముకుడు అయి కైకేయీదేవి వశవర్తి అయిపోయి, నిన్ను ఇట్లా ఆజ్ఞాపించడము అధర్మము, నింద్యము. రామా! నీవు ఈ ఆజ్ఞను శిరసావహించ నవసరములేదు. ప్రతీకారముచేసే సామర్థ్యము నీకు ఉంది. ఈ మార్పు, నీకు తలపెట్టిన రాజ్యాభిషేకము ఆపివేసి, నిన్ను అరణ్యవాసానికి పంపించి భరతుడికి రాజ్యాభిషేకము చేయవలెను అనే మార్పు కైకేయీ దశరథుల కుతంత్రము తప్ప మరి ఒకటికాదు. ఇది నీవు తెలుసుకోలేకుండా ఉన్నావే అని నేను దుఃఖపడుతున్నాను. కాముకుడు అయిన తండ్రిమాట విని నీవు వనవాసము చేయడము లోకవిరుద్ధము అయిన ధర్మము. తల్లిదండ్రులు అయినప్పటికిన్నీ, కైకేయీ దశరథులు కామపరవశులు అయి నీకు కీడు తలపెట్టినారు. నీకు శత్రువులు అయిపోయినారు. వారి కోరికను నీవు మనస్సులో అయినా మన్నించకూడదు.

"రామా! కైకేయీ దశరథులకు దైవికముగా ఇట్లా బుద్ధి పుట్టింది అని నీవు అంటున్నావు. అట్లా అయినట్లయితే, ఆ దైవికాన్ని నీవు ఉపేక్షించవలెనుకాని శిరసావహించ కూడదు. నేను దైవికాన్ని గౌరవించను. వీర్యహీనులూ, మనోదార్ఢ్యము లేనివాండ్లూ దైవాన్ని శిరసావహిస్తారు. వీరులూ, సంభావితాత్ములూ దైవానికి లొంగిపోరు. పురుషకారముతో అణగత్రొక్కుతారు. దైవానికి భయపడి స్వార్థాన్ని చెడకొట్టుకోరు. కష్టాలపాలుకారు. దుఃఖపడరు. దైవశక్తి ఎటువంటిదో, పురుషశక్తి ఎటువంటిదో నేను ఇప్పుడే, ఈ లోకానికి వెల్లడించపోతున్నాను. దైవ మానుష బలాలలో ఏది ప్రబలమో స్పష్టము చేస్తాను. నీ రాజ్యాభిషేకాన్ని చెడగొట్టచూచిన దైవాన్ని ఇప్పుడే ప్రజాసమక్షంలో సంహరించి వేస్తాను. మదము ఎక్కి కట్టుగొలుసులు తెంచుకొని విచ్చలవిడిగా వీధినపడి పరుగులెత్తే మదపుటేనుగును, మావటివాడు ఒక చిన్నఅంకుశము తీసుకొని చాకచక్యముతో మళ్ళించుకొనివచ్చేట్టు, నీవు దుర్నివారము అని చెప్పుతున్న దైవాన్ని నేను ఇప్పుడు మళ్ళించివేయ పోతున్నాను. దిక్పాలకులు అందరూ ఎదిరించినా, ముల్లోకాలూ ఏకము అయి ఎత్తివచ్చినా నీ రాజ్యాభిషేకాన్ని ఆపివేయలేరు. ఇక దశరథమహారాజు ఒక లెక్కా?

"రామా! కాదు కాదు, ప్రభూ! నిన్ను వనవాసము చేయించవలెను అని రహస్యముగా ఆలోచించి నిశ్చయించినవారిని, నేను పద్నాలుగు సంవత్సరాలు అరణ్య వాసము చేయిస్తాను. నీ రాజ్యాభిషేకము చెడగొట్టి, తన కుమారుడికి రాజ్యాభిషేకము చేయవలెనని అనుకుంటున్న కైకేయీదేవి దురాశను త్రుంచివేస్తాను. దశరథమహారాజు ఆజ్ఞను హతమార్చి వేస్తాను. కైకేయీ దశరథులకు దైవము అనుకూలముగా ఉంది అనీ, మనకు దైవము ప్రతికూలముగా ఉంది అనీ నీవు అనుకుంటున్నావేమో! నాతో విరోధముపెట్టుకొన్నవారికి ఎవరికి అయినా, దైవము

ఎంత అనుకూలముగా ఉన్నా ఏమీ ఉపయోగపడదు. నా మహోగ్రపౌరుషానికి అది నిలవలేదు.

"ఓ రామా! నీవు బహుకాలము రాజ్యము ఏలి, వార్ధక్యము వచ్చిన తరువాత వానప్రస్థాశ్రమధర్మము అవలంబించడానికి వనవాసము చేయవలెను కాని, ఇప్పుడు వనవాసము చేయకూడదు. అప్పుడు అయినా నీ పుత్రులు రాజ్యము ఏలుతారుకాని భరతుడు రాజ్యము ఏలడు. వాడికి రాజ్యపాలనాధికారమే లేదు. పూర్వరాజర్షులు అందరూ తమ శక్తి ఉడిగిపోయిన తరువాత రాజ్యాధికారము తమ జ్యేష్ఠపుత్రులకు ఒప్పగించి, ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడవలెను అని చెప్పి వనవాసము చేయపోయినారు. అట్లా చేయవలెను అనే శాస్త్రము చెప్పుతూ ఉంది. నీవున్నూ పూర్వరాజర్షుల మాదిరిగా చేయవలెను కాని, కైకేయీ దశరథులు చెప్పినారు అని నీవు ఇప్పుడు వనవాసము చేయకూడదు.

"ఓ ధర్మాత్మా! ఇప్పుడు దశరథమహారాజు చపలచిత్తుడుగా ఉన్నాడు అనీ, రాజ్యము స్వాధీనము చేసుకొంటే ఏమి భేదాలు పుట్టికొని వస్తవో అనీ నీవు మనస్సులో అనుకొని రాజ్యము వద్దు అనుకుంటున్నావేమో! నీవు మహావీరుడవు. నీకు ఆటువంటి భయమువద్దు. నీకు నేను తోడుగా ఉంటాను. సముద్రము పొంగి పొర్లి ఈభూమిమీద పడకుండా ఒక చిన్న చెలియలికట్ట కాపాడుతూ ఉన్నట్టు, నేను నీ రాజ్యములో ఏ కల్లోలాలూ పుట్టకుండా కాపాడుతాను. అట్లా కాపాడకపోయేట్టయితే, నాకు వీరస్వర్గము లేకుండా పోవలెను అని ఒట్టుపెట్టుకొంటున్నాను. అన్నా! ఇకను ఇప్పుడు నీవు వశిష్ఠాదిమహర్షులను పిలిపించి, నీ కోసము సమకూర్చిన మంగళ జలాలతో రాజ్యాభిషేకము చేసుకొనే పని చూచుకో! నీ రాజ్యాభిషేకాన్ని అడ్డగించే రాజులు ఎవరు అయినా ఉంటే, వారిని నేను చూచుకొంటాను. ఈ పనికి నేను ఒక్కణ్ణి చాలు. రామా! నా ఈ బాహువులు దేహానికి అలంకారము కోసము కాదు. ఈ విల్లు నాకు ఒక ఆభరణము కాదు. నా ఈ ఖడ్గము వీరభూషణముగా ఊరకే మొలలో దోపుకోవడానికి కాదు. నా అంబులపొదిలో ఉన్న బాణాలు అన్నీ మోతబరువు కోసము కాదు. ఈ నాల్గు ఆయుధాలూ శత్రుసంహారానికి తప్ప, మరి ఒకందుకు కాదు. పగవాడు బ్రతికి ఉండడము నాకు ఎంతమాత్రమూ గిట్టదు. దేవేంద్రుడు అంతటివాడు వజ్రాయుధముతో నన్ను ఎదిరించినా, విద్యుత్కాంతులతో జ్వలించే నా ఈ ఖడ్గముతో ఖండించివేయకుండా ఉండను. నా ఖడ్గప్రహరణాలకు శత్రువుల తలలూ, కాళ్లూ తెగి పడిపోవడమే కాదు; వారి గుర్రాలూ, ఏనుగులూ కుప్పలుకుప్పలుగా నేలకూలి నడవడానికి చోటులేకుండా పోవలసిందే! నా ఖడ్గధారాహతికి ఏనుగులు మండుతున్న కొండలవలెనూ, మెరుపులతో మెరిసే కారుమబ్బులవలెనూ

నేలకూలుతవి. ఉడుముతోలు కవచము చేతివేళ్ళకు తొడుగుకొని, శరాసనము చేతపట్టుకొని నేను నిలుచుంటే, ఈ లోకములో తాను మగవాడను అని ఎవడు నన్ను ఎదిరించగలడు? నేను అనేకమంది సామాన్యయోధులను ఒక్క బాణముతోనూ, ఒక్కొక్కబలవంతుణ్ణి అనేకబాణాలతోనూ పడకొట్టుతాను. నా బాణాలు మానవుల మర్మస్థానాలలోనే పడతవి. అంతేకాదు, అవి వారి గుర్రాలనూ, ఏనుగులనూ హతమార్చివేస్తవి. అన్నా! నా అస్త్రప్రభావానికి ఈ నాటితో దశరథమహారాజు ప్రభుత్వము అంతరించిపోతుంది. ఇకను ఈ రాజ్యానికి నీవు ప్రభువువు. రామా! ఇంతవరకూ నా బాహువులు చందనచర్చలు చేసుకోవడానికీ, బాహుపురులు పెట్టుకోవడానికీ, ధనము దానముచేయడానికీ, స్నేహితులకు చెరుపు జరగకుండా కాపాడడానికీ ఉపయోగపడుతూ వచ్చినవి. ఇకను ఇప్పుడు అవి, నీ పట్టాభిషేకాన్ని ఆటంకపెట్టేవారిని అందరినీ హతమార్చడానికి ఉపయోగిస్తవి.

"రామా! కాదు కాదు, రామప్రభూ! నేను నీ కింకరుణ్ణి. ఆజ్ఞాపించు. ఈ రాజ్యము అంతా నీ స్వాధీనము కావడానికి ఇప్పుడు నేను ఏమి చేయవలెనో చెప్పు. నేను ఎవరిని సంహారము చేయవలెనో సెలవు ఇవ్వు. ఎవడి కీర్తి నేలపాలుచేయవలెనో చెప్పు. వాడిని వాడి బంధుమిత్రసహితముగా ఇప్పుడే నాశనము చేసివేస్తాను. ప్రభూ! ఆజ్ఞాపించు" అన్నాడు లక్ష్మణుడు.

కన్నీళ్లు కారుస్తూ లక్ష్మణుడు ఇంత మహోగ్రముగా మాట్లాడుతూ ఉంటే, ఆ రఘువంశవర్ధనుడు రాముడు అత్యంతాదరముతో అతని కన్నీళ్లు తుడుస్తూ, "సౌమ్యుడా! నీకు ఎందుకు ఇంత కోపము? నేను పిత్రాజ్ఞను జవదాటను. అదే సత్పథము" అన్నాడు.

24

పితృవాక్యపరిపాలనము కోసము రాముడు నమ్మకముగా అరణ్యవాసము చేసి తీరుతాడు అని కౌసల్యాదేవికి తోచింది. ఆమె కన్నులవెంట గిర్రున నీళ్ళు తిరిగినవి. మాటలు తడబడుతూ "దశరథమహారాజుకు జ్యేష్ఠపుత్రుడూ, నా కన్న కడుపూ, ఎన్నడూ ఏ కష్టాలూ ఏ దుఃఖాలూ ఎరుగని రాముడు, సమస్తప్రాణికోటినీ సంతోషపెట్టే ధర్మాత్ముడు ఇక అడవులలో పరిగలు ఏరుకొని తిని బ్రతకవలెనా?

"రాముడి భృత్యులూ, దాసులూ మృష్టాన్నభోజనముచేస్తూ ఉంటే, వాడు మాత్రము మహారణ్యాలలో కందమూలాలు తింటూ కాలము గడుపవలెనా? అయ్యో! రాముడి అంతటి గుణవంతుణ్ణి, అంతటి ప్రేమపాత్రుణ్ణి దశరథమహారాజు అడవులకు పంపించివేసినాడు అంటే, ఎవరు అయినా నమ్ముతారా? ఒకవేళ

నమ్మేట్లయితే, అందరూ తమ తమ గతి ఏమిటి అని భయపడి పోకుండా ఉండగలుగుతారా?

"రామా! నీవు లోకాభిరాముడవు. దైవవశమువల్ల నీవు అడవులకు పోవలసి వచ్చింది. ఈలోకములో సమస్త సుఖదుఃఖాలకున్నూ దైవమే మూల కారణము. దాని బలము అపారము. నాయనా! నీవు వెళ్ళిపోగానే, నా ఈ దేహము కట్టెబారిపోతుంది. అందులో శోకాగ్ని రగులుకొంటుంది. నీ ఎడబాటు దానికి గాలి అవుతుంది. నా ఏడుపులూ, పెడబొబ్బలూ దానికి సమిధలు అవుతవి. నా కన్నీళ్లు దానికి ఆజ్యాహుతులు అవుతవి. నా వ్యసనము దానికి ధూమము అవుతుంది. నా నిట్టూర్పులతో అది విజృంభిస్తుంది. అంతట అది మండువేసంగిలో ఎండిన పాద అంటుకొన్నట్టు అంటుకొంటుంది. అది కార్చిచ్చు అంత అవుతుంది. నన్ను దహించి వేస్తుంది. నేను బ్రతుకను. నాయనా! దూడవెంట పోయే ఆవుమాదిరిగా, నేనూ నీ వెంట వస్తాను. నీవు ఎక్కడికిపోతే నేనూ అక్కడికి వస్తాను" అంటూ కౌసల్యాదేవి ఏడవసాగింది.

"అమ్మా! కైకేయీదేవి నాయనగారిని మోసము చేసింది. అందువల్ల, నేను వనవాసానికి పోవలసి వచ్చింది. నీవు కూడా నాయనగారిని వదలిపెట్టి నాతో వచ్చేట్లయితే, వారు జీవించడం ఉత్తది. అమ్మా! ఆడది తన పెనిమిటిని వదలిపెట్టిపోవడముకన్నా క్రూరకృత్యము మరి ఒకటి లేదు. నీవు అట్లా ఎంతమాత్రమూ చేయవద్దు. మనస్సులో అయినా నీవు అట్లా తలపెట్టవద్దు. నాయనగారు జీవించి ఉండేటంత వరకూ నీవు వారికి సేవచేస్తూ ఉండవలెను. ఇది సనాతన ధర్మము" అన్నాడు రాముడు.

ఈ మాటలకు ఆ శుభదర్శిని, నిజమేను అన్నది. కాని, ఆమె ముఖములో మార్పు ఏమీ కనిపించలేదు. ఆ పరమధార్మికుడు ఆమె దుఃఖాన్ని పోగొట్టడానికి, "దశరథమహారాజు మనకు అందరికీ అధిపతి. మన గురువు. మన పోషకుడు. మన ప్రభువు. ఉత్తమోత్తముడు. నేనూ, నీవూ వారి ఆజ్ఞలను శిరసావహించి తీరవలెను. నేను ఒక పది సంవత్సరాలూ, ఆ తరువాత ఒక నాల్గు సంవత్సరాలూ ఇట్టే మహారణ్యములో గడిపివేస్తాను. సుఖముగా తిరిగి వస్తాను. ఆ తరువాత పరమ సంతోషముతో నీమాట జవదాటకుండా నీకు సేవచేస్తాను" అన్నాడు.

ఆ పుత్రవత్సలకు పట్టరాని దుఃఖము వచ్చింది. ఆమె ముఖము నిండా కన్నీళ్ళు కమ్ముకొన్నవి. "నాయనా! నీవు లేకపోయేట్లయితే, నేను నా సవతుల మధ్య ఉండలేను. పితృవాక్యపరిపాలనము కోసము నీవు అడవికి పోక తప్పదు అంటున్నావు. కనుక, నన్నూ నీతో తీసుకొనిపో. అడవిలో లేడిమాదిరిగా నేను నీతో అడవిలో

తిరుగుతూ ఉంటాను. నేను నిన్ను శ్రమపెట్టను. నన్ను తీసుకొనిపో. కాదు అనవద్దు" అంటూ కౌసల్యాదేవి ఏడ్చింది.

రాముడున్నూ దుఃఖపడుతూ, "అమ్మా! ఆడుదానికి బ్రతికి ఉండేటంతవరకూ పెనిమిటే ప్రభువు. ఆయనే దేవుడు. పెనిమిటినితప్ప మరి ఎవరినీ ఆశ్రయించ కూడదు. దశరథమహారాజు పరమధార్మికుడు. నాకూ, నీకూ నియామకుడు. ఆయన నీకు నాథుడు. ఆయన ఉండేటంతకాలమూ నీవు అనాథవు కావు. అమ్మా! నీకు ఏమి తక్కువ? నీకు భయము ఎందుకు? దిగులు ఎందుకు? భరతుడున్నూ పరమధార్మికుడు. సర్వప్రాణికోటినీ సంతోషపెట్టే స్వభావము వాడిది. వాడు నీకు అప్రియము చేయడు. నీకు సేవ చేస్తాడు.

"అమ్మా! నేను వెళ్ళిపోయిన తరువాత, నీవు నాయనగారిని ఏమరు పాటులేకుండా కనిపెట్టుకొని ఉండవలెను. వారు పుత్రశోకముతో బాధపడకుండా ఉండే మాటలే నీవు చెప్పుతూ ఉండవలెను. నీవు అట్లా చేయకపోయినట్లయితే, పుత్రశోకము భరించలేక ఆయన చనిపోతారు. అమ్మా! నీవు ఆయనకు సమస్తోపచారాలూ చేస్తూ ఉండవలెను.

"అమ్మా! ఏ స్త్రీ అయినా ఎన్ని వ్రతాలు పట్టి, ఎన్ని ఉపవాసాలు చేసి, ఉత్తమోత్తములాలు అని ఎంత పేరు సంపాదించినా భర్తను అనుసరించుకొని ఉండకపోయేట్లయితే ఆమెకు దుర్గతే! పెద్దలకు ఎవరికీ నమస్కారము చేయకపోయినా, దేవతలకు పూజచేయకపోయినా భర్తసేవచేస్తూ ఉండే స్త్రీ, ఇహపర సౌఖ్యాలు రెండూ అనుభవిస్తుంది. భార్య ఎప్పుడూ భర్తను సంతోషపెట్టుతూ ఉండవలెను. అతనికి మంచి చేస్తూ ఉండవలెను. సేవజేస్తూ ఉండవలెను. ఇదే అనూచానముగా వస్తూ ఉన్న స్త్రీ ధర్మము. ఇదే వేదాలలో చెప్పి ఉంది. ఇదే శ్రుతులలో వినపడుతూ ఉంటుంది. ఇదే స్మృతులలో కనపడుతూ ఉంటుంది.

"అమ్మా! నేను సుఖముగా తిరిగిరావడానికి నీవు ఇక్కడ హోమాదులు చేయిస్తూ ఉండు. దేవతలను పూలతో పూజ చేస్తూ ఉండు. సువ్రతులు అయిన బ్రాహ్మణులను సత్కరిస్తూ ఉండు. నియమముతో, నియతాహారముతో నీవు నాయనగారికి సేవచేస్తూ ఉండవలెను. పద్నాలుగేండ్లు అయిపోగానే, నేను తిరిగి వస్తాను. అప్పటికి దశరథమహారాజు జీవించి ఉండేట్లయితే, నీవు ఇప్పుడు కోరుతున్న కోర్కెలు అన్నీ సఫలము అవుతవి" అన్నాడు.

కౌసల్యాదేవి కన్నీరు కారుస్తూ, "నాయనా! నీవు పరమపరాక్రమశాలివి. నీకు ఏ భయమూ లేదు. వనవాసము చేయవలెను అని నిశ్చయించుకొన్నావు. నిన్ను

నివారించడము నాకు చేతకాకుండా ఉంది. కాలమహిమ. రామా! నీవు ఏకాగ్రచిత్తముతో అడవులకు ప్రయాణము అయిపో. శుభము అవుతుంది. పితృవాక్యపరిపాలనముచేసి, పితృఋణముతీర్చి, చరితార్థుడవు అయి నీవు తిరిగివస్తే నా కష్టాలు అన్నీ గట్టు ఎక్కుతవి. నేను సంతోషిస్తాను. సుఖపడతాను.

"నాయనా, రామా! నేను ఎంత చెప్పినా వినకుండా నీవు అడవులకు పోతున్నావు. అబ్బా! దైవానికి ఎంత శక్తి ఉంది? ఎంత బలము ఉంది? ఇంతకూ దైవము దుర్నివార్యము. తండ్రీ! నీవు ఈనాడే అడవులకు ప్రయాణం అయిపో. సుఖముగా తిరిగి రా. తిరిగి వచ్చి నీ మనోహర వాక్కులతో నన్ను సంతోషపెట్టు.

"రామా! పధ్నాలుగు ఏండ్లూ అయిపోయి, జటావల్కలధారివి అయి నీవు ఇప్పుడే నాకు కనపడితే ఎంత బాగుంటుంది! నేను ఎంత సంతోషిస్తాను!" అంటూ వనవాసముచేయ తలచుకొన్న ఆ శుభలక్షణలక్షితాంగుణ్ణి తేరిపార చూచింది.

ఆమె మంగళాశీర్వాదాలు చెప్పించ తలచింది.

25

ఆ తల్లి, ఆ మనస్విని కౌసల్యాదేవి దుఃఖాన్ని అణచుకొన్నది. ఆచమించింది. శుచి అయింది. రాముడితో, "నాయనా! నీ ప్రయాణము మాన్పించడము నాచేత కాలేదు, ఏమి చేసేది? నీవు ఈనాడే ప్రయాణము అయిపో. త్వరగా తిరిగి రా. వచ్చి పూర్వరాజర్షులవలె రాజ్యాభిషేకము చేసుకో.

"ఓ రఘువంశ శార్దూలా! నీవు నియమముతో, ధైర్యముతో, స్థైర్యముతో శిరసా వహిస్తున్న ధర్మమే నిన్ను ఎప్పుడూ కాపాడుతుంది. దేవాలయాలలోనూ, చైత్యాలలోనూ ప్రతిదినమూ నీవు ప్రార్థిస్తున్న దేవతలే నిన్ను రక్షిస్తారు. మహారణ్యాలలో మహర్షులమధ్య నీవు నివసించేట్టు చేస్తారు. రామా! ఆ ధీమంతుడు, ఆ మహాత్ముడు విశ్వామిత్రమహర్షి నీకు ఉపదేశించిన శస్త్రాస్త్రాలు అన్నీ నిన్ను ఎప్పుడూ కనిపెట్టుకొని ఉంటవి. ఓ మహాబాహూ! నీ పితృసేవ, నీ మాతృసేవ, నీ సత్యవ్రతము నీకు దీర్ఘాయుష్యము ఇస్తవి. నిన్ను ఎప్పుడూ కాపాడుతూ ఉంటవి. నాయనా! మున్యాశ్రమాలలో సమిత్తులూ, దర్భలూ, దర్భముడులూ, అగ్నివేదికలూ, దేవస్థానాలూ, దేవపూజార్థము వేసే చిత్రవిచిత్రము అయిన తిన్నెలూ నీకు ఉపయోగిస్తవి. పర్వతాలూ, హ్రదాలూ, నదులూ, చిన్నచిన్న పొదలూ నిన్ను ఎప్పుడూ సంతోష పెట్టుతవి. విశ్వదేవులూ, మరుత్తులూ, సిద్ధులూ, సాధ్యులూ, బ్రహ్మదేవుడూ, విరాట్పురుషుడూ, పూషాభగ అర్యములూ, దేవేంద్రాది లోకపాలకులూ నిన్ను ఎప్పుడూ సుఖపెట్టుతారు.

"నాయనా! కలలూ, కాష్ఠలూ, ముహూర్తాలూ, దివారాత్రులూ, పక్షాలూ, మాసాలూ, ఋతువులూ, సంవత్సరాలూ నీకు హాయిగా గడచిపోతవి. నీ జ్ఞాపకశక్తీ, నీ ధైర్యమూ, నీ ధర్మప్రవర్తనమూ నిన్ను ఎప్పుడూ రక్షిస్తవి. సూర్యచంద్రులూ, భూమ్యాకాశాలూ, నక్షత్రాలూ వాటి అభిమానదేవతలు, గ్రహాలూ, సప్తర్షులూ, నారదాది దేవర్షులూ నీకు ఏ కష్టమూ రానీకుండా కనిపెట్టుతారు. నీవు మహారణ్యములో మునివిగా పెరుగుతావు. కనుక నిన్ను ఆదిత్యులూ, దైత్యులూ సుఖపెట్టుతారు. క్రూరకృత్యాలకు ఒడికట్టే రాక్షసులు నీజోలికి రారు. పిశాచాలు నీ వైపు చూడవు. నాయనా! పక్షులూ, పాములూ, తేళ్ళూ, అడవి ఈగలూ, దోమలూ, ఇంకా ఇతర పురుగులూ నిన్ను బాధించవు. సింహాలూ, పెద్దపులులూ, ఎలుగుబంట్లూ, అడవి ఏనుగులూ, మహాభయంకరము అయిన కొమ్ములతో తిరిగే అడవిదున్నలూ, ఇంకా ఇతర క్రూరమృగాలూ నిన్ను చూచి తప్పుకొంటవి. కోతులూ, కొండముచ్చులూ నిన్ను చూచి వెక్కిరించవు. నరమాంస భక్షణము చేసే క్రూరసత్వాలు ఏవీ నీవంక అయినా చూడవు.

"నాయనా! నేను నీకోసము ఇక్కడ దేవతలను పూజచేస్తూ ఉంటాను. నిరంతరమూ స్తోత్రముచేస్తూ ఉంటాను. అందువల్ల, అరణ్యవాసములో నీకు ఏ ఇబ్బందీ రాదు. నీకు దారిలో ఏ ప్రమాదమూ ఉండదు. నీ ప్రయాణము హాయిగా సాగిపోతుంది. నీ పరాక్రమానికి ఏ అడ్డూ ఉండదు. నీవు ఎక్కడికి పోయినా మంగళప్రదముగా ఉంటుంది. నాయనా! నీవు నదులలో స్నానము చేసేటప్పుడు విశ్వామిత్రమహర్షి నీకు ఉపదేశించిన మంత్రాలు నిన్ను కాపాడుతవి. ఆవేకాదు, అగ్నిహోత్రుడూ, వాయుదేవుడూ నిన్ను ఎప్పుడూ కనిపెట్టి ఉంటారు.

"రామా! నీ శిరస్సును ఆకాశమూ, నీ శ్రోత్రేంద్రియాన్ని దిక్కులూ, నీ ముఖాన్ని ఇంద్రాగ్నులూ, నీ నేత్రాలను సూర్యుడూ, నీ మనస్సును చంద్రుడూ, నీ ప్రాణాన్ని వాయువూ, నీ నాభిని అంతరిక్షమూ, నీ పాదాలను భూమీ రక్షిస్తవి.

"నాయనా! సర్వలోకకర్త అయిన బ్రహ్మదేవుడూ, సర్వభూతభర్త అయిన శ్రీమన్నారాయణుడూ, దేవతలూ, మహర్షులూ నిన్ను కాపాడుతారు" అంటూ ఆ యశస్విని, ఆ విశాలాక్షి ఆ యా దేవతలను గంధపుష్పాదులతో పూజ చేసింది. స్తోత్రము చేసింది.

వనవాసము రాముడికి మంగళప్రదముగా ఉండడానికోసము హోమము చేయించ తలచుకొని ఆమె నెయ్యీ, సమిధలూ, తెల్లటిపూలదండలూ, తెల్లటి ఆవాలూ, అగ్నిహోత్రమూ తెప్పించి మహాత్ముడు అయిన బ్రాహ్మణుణ్ణి పిలిపించింది.

రాముడికి వనవాసములో ఏ జబ్బూ చేయకుండా ఉండటానికి ఆ బ్రాహ్మణుడు యథావిధిగా హోమకర్మలు అన్నీ పూర్తిచేసినాడు. హవ్యావశేషాన్ని బాహ్యబలిగా ఉంచినాడు. అంతట కౌసల్యాదేవి తేనె, పెరుగూ, నెయ్యీ, అక్షతలూ, దక్షిణలూ ఇచ్చి బ్రాహ్మణులచేత పుణ్యాహము చెప్పించింది. మహారణ్యములో రాముడికి మంగళప్రదముగా ఉండడానికి ఆ బ్రాహ్మణోత్తముల చేత స్వస్త్యయన మంత్రాలు చదివించింది. ఆ బ్రాహ్మణులు కోరుకున్నంత ధనము దక్షిణగా ఇచ్చింది. ఆ యశస్వినీ రాముణ్ణి చూస్తూ, "నాయనా, రామా! వృత్రాసుర సంహారానికి పోయే దేవేంద్రుడికి దేవతలు చెప్పిన మంగళాశీర్వాదమూ, అమృతము తేవడానికి ప్రయాణము అయిన గరుత్మంతుడికి వినతాసతి చెప్పిన మంగళాశీర్వాదమూ, పాలసముద్రము చిలికించి దైత్యసంహారము చేసి అమృతము సంపాదించడానికి బయలుదేరిన దేవేంద్రుడికి అదితి చెప్పిన మంగళాశీర్వాదమూ, బలిచక్రవర్తిని అణగద్రొక్కి ముల్లోకాలలో విక్రమించడానికి పోయే త్రివిక్రముడికి దేవేంద్రుడి తల్లి చెప్పిన మంగళాశీర్వాదమూ నేను ఇప్పుడు చెప్పుతున్నాను" అంటూ ఆశీర్వాదమంత్రము పఠించి, రాముడి శిరముమీద మంత్రాక్షతలు వేసింది. అతని ఒంటినిండా గంధము పూసి, మంత్రజపము చేస్తూ విశల్యకరణి ఓషధిని రక్షాబంధముగా ముంజేతికి కట్టింది.

ఆ పరమసాధ్వి మనస్సులో మహాదుఃఖపడుతున్నా, పైకి సంతోషము అభినయిస్తూ రాముడి తలవంచి ఆఘ్రాణించింది. అతనిని గట్టిగా కౌగలించుకొన్నది. మాటలు తడబడుతూ, "రామా! సుఖముగా అడవికిపో. సిద్ధార్థుడవు అయి తిరిగి రా. అయోధ్యకు వచ్చి సర్వసిద్ధార్థుడవు కావలెను. అప్పుడు నేను నిన్ను ఉదయించే పూర్ణ చంద్రుణ్ణివలె కన్నుల పండుగగా చూస్తాను. అంతట నా దుఃఖము అంతా తీరిపోతుంది. అప్పుడు నా ముఖములో సంతోషచ్ఛాయలు బయలుపడుతవి. తండ్రీ! నీవు వనవాసము ముగించుకొనివచ్చేవరకూ నేను రోజులు లెక్కపెట్టుకొంటూ ఉంటాను. ఎట్లాగో బ్రతుకుతాను. నాయనా, రామా! నీవు సింహాసనము ఎక్కడము నేను చూడవలెను, చూస్తాను. నేనూ, నా కోడలు సీతా కోరే కోర్కెలు నీవు తీర్చవలెను. నీవు మమ్ములను సంతోషపెట్టవలెను.

"రామా! పోయిరా. నేను ఇక్కడ శివుడు మొదలు అయిన దేవగణాలను పూజచేస్తూ ఉంటాను. ఆ దేవతలు నీకు ఎప్పుడూ మేలుచేస్తూ ఉంటారు" అని ఆశీర్వదించింది. ఆమె కన్నులనిండా నీళ్ళు కమ్ముకొన్నవి. రక్షగా ఆమె రాముడి చుట్టూ తిరిగింది. రాముణ్ణి రెండుచేతులూ పట్టుకొని దగ్గరకు తీసుకొన్నది. గట్టిగా కౌగలించుకొని వదలిపెట్టింది. మళ్లీ కౌగలించుకొన్నది. ఆమెకు తనివి తీరలేదు. మళ్ళీ కౌగలించుకొన్నది.

రాముడున్నూ పదేపదే ఆమె పాదాలు పట్టుకొని నమస్కారము చేసినాడు.

అంతట ఆ ధర్మాత్ముడు స్వీయకాంతులతో తేజరిల్లుతూ సీతా నిలయానికి పోయినాడు.

26

సీత అరణ్యవాస నిర్ణయము

జనావృతము అయిన రాజవీథిలో రాముడు పాదచారుడు అయి నడువ సాగినాడు. ఆ గుణవంతుణ్ణి చూచి జనసమూహము కంపించి పోయింది.

రామాభిషేకము కోసము ఉపవాసవ్రత నియమముతో తన అంతఃపురములో కనిపెట్టుకొని ఉన్న సీతాదేవికి కైకేయీదేవి అంతఃపురములో ఏమి జరిగినదీ తెలియదు. రాముడికి యువరాజ్యాభిషేకము అవుతుంది అనే ఆమె అనుకొన్నది. అందువల్ల, ఆమె రాముడి అభ్యుదయము కోసము దేవపూజ చేసింది. పట్టాభిషేకముచేసుకొని వచ్చే భర్తకు పట్టమహిషి చేయవలసిన పాదార్చనాదులూ మొదలు అయిన రాజధర్మాలు అన్నీ ఆమెకు తెలుసును. అందువల్ల, ఆమె గంధపుష్పాక్షతాదులు సమకూర్చుకొని రాముడు ఎప్పుడెప్పుడు వస్తాడా అని మహదానందముతో ఎదురుచూస్తూ ఉంది. ఆమెతోపాటు ఆ అంతఃపురములో ఉన్నవారు అందరూ సంతోషసముద్రములో ఓలలాడుతూ ఉన్నారు.

అపూర్వముగా అలంకరించిన ఆ మందిరములోకి రాముడు తలవంచుకొని నడచి వచ్చినాడు. అతని అవయవాలు అన్నీ కంపించినవి, ముఖము దుఃఖావృతము అయింది. అట్లా నడచి వస్తూ ఉన్న రాముణ్ణి సీతాదేవి చూచింది. చివాలున లేచింది. ఆమె గజగజ వణికిపోయింది.

రాముడున్నూ సీతాదేవిని చూచినాడు. అంతవరకూ మనోగతము అయి ఉన్న అతని దుఃఖము అప్పుడు అణగి ఉండలేకపోయింది. పైకి ఉబికింది. ఉత్తర క్షణములో అతని ముఖము వివర్ణము అయిపోయింది. దేహము అంతటా చెమటలు పోసినవి.

సీతాదేవి దుఃఖముతో తపించిపోతూ, "ప్రభూ! ఇప్పుడు ఇది ఏమిటి? ఇట్లా ఉన్నారు ఏమిటి? ఈనాడు బృహస్పతి దేవతాకము అయిన దినము అని చెప్పినారే! శుభకరము అయిన దినము అని బ్రాహ్మణోత్తములు చెప్పినారే! ఆ నిర్ణయము అంతా ఏమి అయిపోయింది? మీ మనస్సు అంతా వికలము అయిపోయినట్టున్నదే, ఎందువల్ల? ఇప్పుడు మీ దివ్యసుందరవిగ్రహానికి జలఫేననిభమూ, శతశలాకాయుతమూ అయిన శ్వేతచ్ఛత్రము పట్టరేమిటి? చంద్రమండలమువలె తళతళలాడుతూ

హంసలవలె తోచే వింజామరలు మీకు వీచరేమిటి? వందిజనులు స్తోత్రపాఠాలు పలుకరేమిటి? సూతులు పురాతన వృత్తాంతాలు ప్రశంసించరేమిటి? మాగధులు మీ వంశావళి కీర్తించరేమిటి? ఎందువల్ల?

"నాథా! వేదపారంగతులు అయిన బ్రాహ్మణులు మూర్ధాభిషిక్తులు అయిన మీ శిరముమీద తేనే, పెరుగూ పెట్టి అభిషేకము చేయరా ఏమిటి? మంత్రులూ, శ్రేణిముఖ్యులూ మీవెంట నడవటానికి చక్కగా అలంకరించుకొని రాలేదు ఏమిటి? మీ ముందు నడవడానికి నాల్గు గుర్రాల బంగారు పుష్యరథము రాలేదు ఏమిటి? మీ ముందు నడవడానికి నీలమేఘము నేలమీద నడుస్తున్నదో, కాక నల్లటికొండ కదలి పోతున్నదో అన్నట్లు కనిపించే 'శత్రుంజయము' అనే మదపుటేనుగు రాలేదు ఏమిటి? మీ ముందు నడవడానికి బంగారుభద్రాసనముతో వీరపురుషులు రాలేదు ఏమిటి?

"ప్రభూ! ఇప్పుడు మీ ముఖములో సంతోషచ్ఛాయలే కనిపించడములేదు. మీ ముఖవర్ణము అపూర్వముగా మారిపోయింది. మీరు ఇప్పుడు ఇట్లా ఎందుకు వచ్చినారు" అంటూ ఏడ్చింది.

"సీతా! పూజ్యపాదులు మా నాయనగారు నన్ను వనవాసము చేయమని ఆజ్ఞాపించినారు. నేను వెంటనే వెళ్ళిపోవలెను. వారు ఎందుకు ఇట్లా ఆజ్ఞాపించినారో చెప్పుతాను, విను. పూర్వము ఒకప్పుడు నా తల్లి కైకేయీదేవికి మా నాయనగారు రెండు వరాలు ఇచ్చినారు. అవి ఆయన ఇంతవరకూ ఆమెకు చెల్లించలేదు. ఇప్పుడు నా పట్టాభిషేకము తలపెట్టి సర్వమూ సంసిద్ధముచేస్తూ ఉంటే కైకేయీదేవి ఇదే సరి అయిన సమయము అనుకొని తనకు అదివరకు వాగ్దానము చేసిన ఆ రెండు వరాలూ చెల్లించమని మా నాయనగారిని అడిగింది. ఆ రెండు వరాలకుగాను భరతుడికి రాజ్యాభిషేకము చేయమనీ, నన్ను పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేయించమనీ చెప్పింది. మా తండ్రి పరమధార్మికుడు. ఆడి తప్పనివాడు. తల ఒగ్గినాడు. నన్ను అడవులకు పొమ్మన్నాడు. నేను ప్రయాణము అయిపోతూ, నిన్ను చూడటానికి ఇక్కడికి వచ్చినాను.

"సీతా! నీవు మహాపూజ్యము అయిన వంశములో పుట్టినావు. సమస్త ధర్మాలూ తెలిసినదానవు. పరమధర్మవేత్త అయిన జనకమహారాజు కూతురువు. ధర్మచారిణివి. నేను ఈనాడే, ఇప్పుడే అడవులకు వెళ్ళిపోవలెను.

"ఓ సీతా! పరంపరాగతము అయిన ఈ రాజ్యాన్ని దశరథమహారాజు భరతుడికి ఇచ్చివేసినాడు. ఇకను ఈ దేశానికీ, రారాజగృహానికీ భరతుడు ప్రభువు. వాడు నమస్కారము చేయడానికి నీదగ్గరకు వస్తాడు. నీవు వాడి ఎదుట నన్ను శ్లాఘించ కూడదు. నా గుణగణాలను గురించి ప్రశంసించ కూడదు. శ్రీమంతులు

తమ సమక్షంలో పరపురుషులను పొగడడము సహించరు. అందులో, రాజులు తమను ఆరాధించి సేవించేవారినే ఎప్పుడూ మెచ్చుకుంటారు. అహితము మాట్లాడితే ఔరసపుత్రులను అయినా వెళ్ళకొట్టుతారు. సామర్థ్యముతో మెలిగేట్లయితే సామాన్య జనులను అయినా దగ్గరకు చేరతీస్తారు. అందువల్ల, నీవు భరతుడికి అప్రియము చేయ కూడదు. వాడి మనస్సు నొప్పించ కూడదు. నీవు వాడికి అనుకూలముగా మెలగవలెను. ఇంతకూ భరతుడు బంధుత్వమునుంచి నిన్ను పోషిస్తాడు కాని, నిన్ను ప్రత్యేకముగా పోషించవలసిన బాధ్యత వాడికి ఏమీ లేదు.

"ఓ జానకీ! నీవు ఇక భరతుణ్ణీ, వాడికన్నా ఎక్కువగా దశరథమహారాజునూ సంతోషపెట్టుతూ ఉండవలెను. ఓ కల్యాణీ! నీవు వ్రతోపవాసాదులతో కాలము గడుపుతూ ఉండవలెను. ఉషఃకాలాననే నిద్రలేచి యథావిధిగా దేవపూజ చేసి, నా తండ్రి దశరథమహారాజుకు నమస్కారము చేస్తూ ఉండవలెను. మా అమ్మ కౌసల్యాదేవి వృద్ధు. ఆమె దుఃఖముతో కృశించిపోకుండా నీవు ఆమెను సంతోషపెట్టుతూ ఉండవలెను సుమా! ఆమే కాదు, తక్కిన తల్లులున్నూ నన్ను ఒక్కమాదిరిగా ఆదరించినారు. ప్రేమించినారు. కాపాడినారు. వారిని కూడా నీవు సంతోషపెట్టుతూ ఉండవలెను.

"ఓ మైథిలీ! నేను భరత శత్రుఘ్నులను నా ప్రాణముకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నీవు భరతుణ్ణి నీ తోబుట్టువుగానూ, శత్రుఘ్నుణ్ణి నీ పుత్రుణ్ణిగానూ చూచుకుంటూ ఉండవలెను.

"ఓ వైదేహీ! నీవు ధర్మము తప్పవద్దు. సత్యవ్రతపరాయణవుగా ఉండు. నీకు ఏ ఆపదా రాదు. ఓ ప్రియురాలా! నేను వెళ్ళిపోతున్నాను. ఓ భామినీ! నీవు ఇక్కడనే ఉండవలెను. నీవు ఎవరి మనస్సూ నొప్పించ కూడదు. ఇంతకన్నా ఏమి చెప్పేది" అన్నాడు రాముడు.

27

సీతాదేవీ ఎవరితో అయినా ఎప్పుడూ ఎంతో మంచిగా మాట్లాడుతుంది. కోపము వచ్చినా అప్రియము ఆడదు. ఎవరి మనస్సూ నొప్పించదు. ఎవరూ ఆమెకు అప్రియము చెప్పరు. ఆమె మనస్సు నొప్పించరు.

రాముడు ఇట్లా చెప్పాడు. ఆమెకు ప్రణయకోపమువంటి కోపము వచ్చింది. "ప్రభూ! తాము దశరథమహారాజుకు జ్యేష్ఠపుత్రులు. తాము ఇంత చొకగా మాట్లాడడము నేను ఇదివరకు ఎన్నడూ వినలేదు. మీరు చెప్పింది వింటే, ఆడదానికి నాకే నవ్వు వస్తూ ఉంది. తల్లీ, తండ్రీ, తోబుట్టువూ, కొడుకూ, కోడలు మొదలు అయినవారు అందరూ వారు వారు చేసుకొన్న పుణ్యపాపాలమబట్టి శుభాశుభఫలాలు

అనుభవిస్తూ ఉంటారు. భార్య ఒక్కతే భర్త అనుభవించే శుభాశుభాలను అన్నిటినీ అనుభవిస్తుంది. దశరథమహారాజు మిమ్ములను అడవికి పొమ్మంటే నన్నూ పొమ్మన్నట్టే! ఆడుదానికి తండ్రీ, తల్లీ, కొడుకూ, చెలికత్తే దిక్కుకారు. ఆడది స్వతంత్రురాలు కాదు. ఆడుదానికి ఈ లోకములో అయినా, పరలోకములో అయినా భర్త ఒక్కడే గతి.

"దేవా! మీరు దుర్గమారణ్యానికి ప్రయాణము అయిపోతున్నాము అంటున్నారు. కాబట్టి, నేను మీకన్నా ముందుగా నడచి దారిలో అడ్డము అయ్యే దర్భలూ మొదలు అయిన వాటిని అణగత్రొక్కుతాను. అప్పుడు దారి మీపాదాలకు మెత్తగా ఉంటుంది. మీతో వనవాసము చేస్తాను. మీ పుణ్యములో నేను పాలుపంచుకొంటాను అనే ఈర్ష్య మీకు వద్దు. రావద్దు అంటే వస్తాను అని ఎదురు ఆడుతున్నది అనే కోపము మీకు వద్దు. ఇతరులు త్రాగిన నీళ్ళను అవతల పారపోసేటట్టు నన్ను విడిచిపెట్టి పోవద్దు. మీతో రావద్దు అనడానికి నేను మీకు ఏ అపకారమూ చేయలేదు. ఏ పాపమూ చేయలేదు. నామాట మీరు నమ్మండి. నన్ను మీ వెంట తీసుకొనిపొండి.

"స్వామీ! భార్య అయింది ఎప్పుడూ భర్తను అనుసరించుకొని ఉండవలెను. భర్త అడుగుజాడలలో మెలగుతూ ఉండవలెను. ప్రాసాదాగ్రభాగాలలో తిరిగినా, విమానగృహాలలో నివసించినా, వ్యోమమార్గాన అణిమాదిసిద్ధులతో సంచరించినా భార్య అయింది భర్తతోనే ఉండవలెను. సర్వకాలసర్వావస్థలలోనూ భర్తతో ఉండడమే భార్యకు ధర్మము. ఈ విషయము మా అమ్మా, మా నాయనగారూ నాకు ఎంతో బోధించినారు. ఇప్పుడు ఈవిషయము నేను కొత్తగా తెలుసుకోవలసింది ఏమీకాదు.

"నాథా! మీరు పోయే అడవి చొరరానిది అయినా సరే, నిర్జనము అయింది అయినా సరే, పెద్దపులులూ సింహాలూ ఏనుగులూ తోడేళ్లూ మొదలు అయిన క్రూరజంతువులు తిరిగేది అయినా సరే నేను మీతో రాకతప్పదు. నేను మీవెంట ఉండక తప్పదు. మీ వెంట ఉంటూ మీకు సేవచేస్తూ ఉంటే నాకు సుఖముగా ఉంటుంది. సంతోషముగా ఉంటుంది. ఉత్త సుఖమూ సంతోషమే కాదు, నా పుట్టినింట్లో ఉన్నట్టుగా ఉంటుంది. మీరు లేకుండా నాకు త్రైలోక్యాధిపత్యము ఇచ్చినా నేను సుఖపడను. సంతోషించను.

"ఓ వీరాగ్రణీ! మహారణ్యములో నేను మీకు ఎప్పుడూ ఉపచారముచేస్తూ ఉంటాను. నియమముతో బ్రహ్మచారిణిగా ప్రవర్తిస్తాను. మీతోపాటు వనమధు గంధవాసనలు ఆఘ్రాణిస్తూ క్రీడిస్తాను. ఎంతమందిని అయినా, ఎక్కడను అయినా కాపాడే శక్తి మీకు ఉంది. నన్ను కాపాడడము తమకు ఒక లెక్కా? నేను మీతో అడవికి వస్తాను. సందేహించవద్దు. మీతో వనవాసము చేయవలెను అని నేను

నిశ్చయించుకొన్నాను. ఇక నన్ను ఆపడము మీకు అశక్యము. నేనూ ఫలమూలాలే తింటాను. అది కావలెను, ఇది కావలెను అనను. సంశయించవద్దు. మీకు ఏవిధము అయిన కష్టమూ కలుగచేయను.

"నాథా! మీరు బుద్ధిమంతులు. పరమ పరాక్రమవంతులు. మీరు తోడుగా ఉంటారు కనుక, నేను మహానదులూ, పర్వతాలూ, పల్వలాలూ నిర్భయముగా చూస్తాను. విరగపూసిన తామరకొలనుల దగ్గర హంసలనూ, నీటికోళ్ళనూ చూస్తూ మీతో హాయిగా విహరిస్తాను. మీతోపాటు ఆ తామరకొలనులలో స్నానముచేస్తూ దృఢనియమాలతో ఉంటాను. ఎంతో సంతోషముతో మీతో సంచరిస్తాను. మహారణ్యములలో అట్లా మీతో లక్ష సంవత్సరాలు ఉన్నా నాకు అంతకాలము గతించినట్టే ఉండదు. మీరు లేకుండా స్వర్గలోకములో నన్ను ఉండమన్నా, నేను ఉండను.

"ప్రభూ! నేను మీతో వస్తాను. ఎంత చొరరాని అడవి అయినా మీరు వెంట ఉంటారు కనుక, నేను నిర్భయముగా నడుస్తాను. ఎన్ని క్రూరమృగాలు ఉన్నా భయపడను. మీ పాదాలు ఆశ్రయించుకొని నా పుట్టినింట్లో ఉన్నట్లు సుఖముగా ఉంటాను. నాథా! మిమ్ములనుతప్ప నేను మరి ఒకరిని ఎరుగను. నా హృదయములో మీరు తప్ప మరి ఒకరు లేరు. మీరు నన్ను వదలిపెట్టి పోయేట్టయితే, నేను తప్పకుండా చచ్చిపోతాను. నన్ను మీవెంట తీసుకొని పోవలెను. నా ప్రార్థన మీరు అంగీకరించవలెను. నేను మీకు ఏమాత్రమూ బరువుకాను" అంటూ సీతాదేవి చెప్పింది.

ఆమె ఇట్లా చెప్పినా, ఆమెను అరణ్యానికి తీసుకొనిపోవడానికి ఆ ధర్మవత్సలుడికి మనస్కరించలేదు. వనవాస కష్టాలను గురించే ఎక్కువగా చెప్పినాడు.

28

రాముడు ధర్మజ్ఞుడు. ఉత్త ధర్మజ్ఞుడేకాదు, ధర్మవత్సలుడు. వనవాస కష్టసుఖాలను గురించి ఆలోచించినాడు. ఆమెను తీసుకొని పోవడానికి అతనికి బుద్ధి పుట్టలేదు.

రాముడు సీతను వారించుట

సీతాదేవి కన్నులు కన్నీళ్ళతో కలకపారి పోయినవి. రాముడు ఆమెను సముదాయిస్తూ, "ఓ సీతా! మహాకులీనవు. ధర్మిష్ఠవు. నీవు నీ ధర్మము ఆచరిస్తూ ఇక్కడనే ఉండవలెను. నీవు నీ మనస్సుకు తోచినట్టు చేయకూడదు. నీకు స్వాతంత్ర్యము లేదు. నేను చెప్పినట్టు నీవు వినవలెను. చేయవలెను. వనవాసము చేయడము చాలాకష్టము. నీవు ఇకను ఆ ఆలోచన పెట్టుకోవద్దు. నీ మంచికోసమే నేను చెప్పుతున్నాను. నిన్ను భరించడము నాకు ఒక కష్టము కాదు.

"సీతా! వనవాసము ఏమాత్రమూ సుఖముగా ఉండదు. పెద్దపెద్ద కొండలమీదనుంచి జారిపడే సెలఏళ్ళ హోరూ, కొండగుహలలో నివసించే క్రూరజంతువుల గర్జనలూ మహాభయంకరముగా వినిపిస్తూ ఉంటవి. నిర్జనము అయినందువల్ల, సింహ శార్దూలాది ఘాతుకమృగాలు విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటవి. మనము వాటి కంటపడితే మహాసంభ్రమముతో అవి మనలను ఎదుర్కొంటవి. నదులలో పెద్దపెద్ద మొసళ్లు ఉంటవి. ఆ నదుల ప్రాంతము అంతా బురదగా ఉంటుంది. మదపుటేనుగులు సయితము ఆ బురదలో ఆ నదులు దాటి అవతలికి పోలేవు. ఇకను ఏ దారిన, ఎటు పోవలెను అనుకున్నా దట్టముగా అల్లుకొన్న ముళ్ళతీగలు అడ్డము అవుతవి. అడవికోళ్లు భయంకరముగా కూస్తూ ఉంటవి. మెట్టను ఇన్ని మంచినీళ్లు అయినా దొరకవు. ఎటు పోవడానికి దారి దొరకదు. పగలు అంతా నానాకష్టాలుపడుతూ, వాటి అంతట అవి రాలిన పండ్లను ఏరుకొని తినవలెను. నేలరాలిన ఆకులతో రాత్రిపూట మెత్తలు చేసుకొని పడుకోవలెను. కందమూలాలూ, పండి రాలిన పండ్లూ తప్ప తినడానికి మరి ఏవీ దొరకవు. అప్పుడప్పుడు ఉపవాసాలు ఉండవలసివస్తూ ఉంటుంది.

"ఓ మైథిలీ! జటలు ధరించి, వల్కలాలు కట్టుకోవలెను. దేవతలనూ, పితృదేవతలనూ, అప్పటికి అప్పుడు వచ్చిన అతిథులనూ యథావిధిగా పూజచేస్తూ ఉండవలెను. ప్రతిదినమూ ముమ్మారు స్నానముచేయవలెను. స్వయముగా పూలు కోసి తెచ్చుకొని అగ్నివేదిక దగ్గర పెట్టి, పూజ చేస్తూ ఉండవలెను. ఋషులమాదిరిగా జీవింపవలెను. ఎప్పుడూ ఆకలివేస్తూ ఉంటుంది. దొరికినవి మాత్రమే తిని తృప్తిపడ వలసి ఉంటుంది. గాలి విపరీతముగా వీస్తూ ఉంటుంది. పొద్దుకూకగానే చిమ్మచీకట్లు కమ్ముకొంటవి. నిరంతరమూ భయము భయముగా ఉంటుంది. అనేకరకాల పాములు వంకరటింకరగా అమితదర్పముతో నేలమీద తిరుగుతూ ఉంటవి. అవి దారులకు అడ్డముగా పడుకొంటవి. అవి వేటినీ కదలనీయవు, మెదలనీయవు. ఆ పాములకు తోడు తేళ్లూ, అడవిఈగలూ, దోమలూ, పెద్దపెద్ద మిడతలూ ఎప్పుడూ బాధపెట్టుతూ ఉంటవి.

"ఓ సీతా! అడవిలో చెట్లు దట్టముగా పెరిగి, కొమ్మలు ఒకదానితో ఒకటి పెనవేసుకొనిపోయి ఉంటవి. దర్భలూ, రెల్లూ మొదలు అయినవి ముండ్లుతేలి ఉంటవి. నడవటానికి వీలుకాదు. వనవాసముచేసేవారి కాయక్లేశము చెప్పతరము కాదు. దేనికీ ఆశపడ కూడదు. ముందుగా కోపాన్ని వదలిపెట్టవలెను. భయము వేసినా భయపడకుండా ఉండవలెను. ఓ జానకీ! నేను చాలదూరము యోచించినాను. నీవు ఇక్కడనే ఉండవలెను" అన్నాడు.

ఈ మాటలకు సీతాదేవికి మరింత దిగులు వేసింది.

29

సీత రాముని ఒప్పించుట

సీతాదేవి కన్నీళ్లు కారుస్తూ, "నాథా! మీరు చెప్పుతూ ఉన్న వనవాస కష్టాలన్నీ మీ సహవాసమువల్ల నాకు సౌఖ్యాలుగానే పరిణమిస్తవి. సింహ శార్దూలాలూ, పెద్ద పెద్ద చమరీమృగాలూ, భయంకరము అయిన పక్షులూ, ఇంకా ఇతర క్రూరమృగాలూ మీవంటి అతిమానుష రూపాన్ని అదివరకు అడవిలో ఎన్నడూ చూచి ఉండవు. అందువల్ల, అవి మిమ్ములను చూడగానే భయపడి ఆవలకు పారిపోతవి. నేను మీవెంట ఉంటాను కనుక, నాకు వాటి భయము ఏమీ ఉండదు.

"ప్రభూ! మీ నాయనగారు మిమ్ములను వనవాసము చేయమని ఆజ్ఞాపించినారు కనుక, అవశ్యము నేనూ మీవెంట బయలుదేరవలెను. మీ భార్యను కనుక, నేను ఎప్పుడూ మీతోనే ఉండవలెను. మీరు లేకుండా నేను ఇక్కడ ఉండను. ఒకవేళ మీరు నన్ను వదలిపెట్టి పోయేట్లయితే, నేను జీవించ కూడదు. అది ధర్మము. మీరు దగ్గర ఉంటే సురేశ్వరుడు సయితము నావంక కన్నెత్తి అయినా చూడలేడు. చూచినాడో అవమానపడిపోతాడు. 'మొగుడు వదలిపెట్టిన స్త్రీ బ్రతక కూడదు' అనే విషయము మీరు ఇదివరకు నాతో అనేకసార్లు చెప్పినారు.

"ఓ మహాప్రాజ్ఞా! నేను కొంతకాలము వనవాసము చేయవలసి వస్తుంది అని సాముద్రికలక్షణజ్ఞులు అయిన బ్రాహ్మణులు మా నాయనగారితో చెప్పుతూ ఉండగా విన్నాను. ఆ బ్రాహ్మణుల మాట విన్నప్పటినుంచి ఎప్పుడెప్పుడు వనవాసముచేద్దామా అని ఉవ్విళ్లూరుతూ ఉన్నాను. ఇప్పుడు దైవికముగా మీరు వనవాసము చేయవలసి వచ్చింది. అందువల్ల, నేనూ మీతో వనవాసము చేస్తాను. ఇట్లా కాకపోయేట్లయితే, మరి ఒక విధముగా నాకు వనవాసము సంభవించదు. వనవాసము కష్టము అని నాకూ తెలుసును. అయితే, నియతాత్ములను ఏ కష్టాలూ ఏమీ చేయలేవు. అందులో మీరు పరమపరాక్రమవంతులు. మీవెంట ఉంటాను కనుక, నన్ను ఏ కష్టాలూ ఏమీ చేయలేవు.

"నాథా! బ్రాహ్మణులు చెప్పడమేకాదు, నాకు పెండ్లికాక పూర్వము మా అమ్మదగ్గర నేను కూర్చొని ఉండగా, ఒకానొక తాపసాంగన వచ్చి నన్ను చూచి, "ఈ అమ్మాయి భర్తతో కొంతకాలము వనవాసము చేస్తుంది" అని చెప్పింది. అందువల్లనే, నేను మీదగ్గరకు వచ్చినప్పటినుంచీ 'మనము గంగాతీరాన తపోవనాలలో కొంత కాలము ఉందాము' అని చెప్పుతూ వచ్చినాను. మీరున్నూ అందుకు అంగీకరించినారు.

కాబట్టి, ఇప్పుడు మీతో వనవాసానికి బయలుదేరడము అంటే, నాకు పండుగగా ఉంది. వనవాసములో మీకు నేను సేవచేయవలెను అనుకొంటున్నాను. మీరు పరిశుద్ధులు. నిర్మలాంతఃకరణులు. మీవెంట ఉంటూ మీకు సేవచేస్తూ ఉంటే, నా పాపాలు అన్నీ పటాపంచలు అయిపోతవి. మీరు నా భర్తలు. మీరు తప్ప నాకు వేరే దేవుడు లేడు. ఈలోకములోనే కాదు, ఏ పరలోకములోనూ మిమ్ములను ఎడబాసి నేను ఉండను.

"ప్రభూ! 'తండ్రి ధర్మవిహితముగా, ఉదకపూర్వకముగా తన కన్నెను ఎవడికి ఇచ్చి పెండ్లిచేస్తాడో, వాడే ఆ కన్యకు ఇహపరలోకాలలో పెనిమిటి' అని వేదవాక్యాలు బ్రాహ్మణులు చదువుతూ ఉండగా మీరున్నూ విన్నారు. నేను మీ ఇల్లాలిని. మీ భక్తురాలను. మీకు సేవచేయడమే నా వ్రతము. మీరు నన్ను దిగవిడిచి పోతారేమో అని దుఃఖపడుతున్నాను. ఇప్పుడు ఏ హేతువువల్ల మీరు నన్ను మీవెంట తీసికొని పోవడానికి ఒప్పుకోవడము లేదు? మీ సుఖదుఃఖాలను నేనూ అనుభవించవలెను. మీరు సుఖము అనుభవించేటట్లయితే, నేనూ సుఖము అనుభవిస్తాను. మీరు దుఃఖము అనుభవించవలసివచ్చేట్లయితే, మీ దుఃఖాన్ని నేనూ పాలుపంచుకొంటాను. ప్రభూ! నన్ను మీవెంట తీసుకొని పోవలెను.

"స్వామీ! మీరు ఒప్పుకోకపోయేట్లయితే, నేను బ్రతకడము ఉత్తది. విషము అయినా త్రాగుతాను. నిప్పు అయినా పెట్టుకొంటాను. అదీ కాకపోయేట్టయితే, నీళ్లలో అయినా దూకుతాను కాని, నేను బ్రతుకను" అన్నది.

సీతాదేవి ఇంత చెప్పినా, అడవిలో జనులు ఎవరూ ఉండరు అనే ఆలోచనతో ఆమెను వెంటతీసుకొని పోవడానికి రాముడు ఇష్టపడలేదు.

ఆమె వేడికన్నీళ్ళతో అక్కడి నేల అంతా తడిసిపోయింది. ఏడుపుతో ఆమె ఎర్రటి పెదవులు వణికిపోయినవి.

30

ఏది ఏమి అయిపోయినప్పటికిన్నీ, సీతాదేవి రాముడితో వనవాసము చేయడానికే నిశ్చయించుకొన్నది. అతని విశాలవక్షస్థలమువంక చూచింది. ఆమె ప్రేమ అతిశయించింది. అతని శౌర్యాన్ని గురించి ఆలోచించింది. ఆమెకు కోపము రేగింది. కంపించిపోతూ, "ఆర్యపుత్రా! తమకు సౌందర్యము మాత్రము ఉంది. పౌరుషము లేదు. తమ సౌందర్యానికి అందరూ భ్రమసిపోయినారు, అంతే. నన్ను ఒక్కతెనూ వెంటబెట్టుకొనిపోయి పోషించలేక, తాము నన్ను ఇక్కడ వదలిపెట్టి పోయినారు అని మా తండ్రి జనకమహారాజుకు తెలుస్తుంది. పురుషవేషములో ఉన్న స్త్రీ అని తెలియక పిల్లను ఇచ్చి పెండ్లి చేసినానే అని ఆ కర్మకుడు, ఆ శూరుడు దుఃఖపడతాడు.

"నాథా! తాము ఈ జగత్తునంతా తాపము ఎత్తించే సూర్యుడి అంతటి తేజోవంతులు అని, అందరూ చెప్పుకొంటూ ఉన్నారు. ఇప్పుడు తాము నన్ను ఇక్కడ ఉంచి ఒంటరిగా పోయేట్లయితే, రాముడు తేజోవంతుడు అనుకొన్నది అంతా అబద్ధము అనీ, అజ్ఞానమువల్ల అట్లా అనుకొన్నాము అనీ ఇకముందు అందరూ చెప్పుకొంటారు.

"స్వామీ! నన్ను తమవెంట తీసుకొనిపోవడము ఏమి అకార్యము అని ఇప్పుడు తాము దుఃఖపడుతున్నారు? ఎన్నడూ, దేనికీ భయపడని మీరు, ఇప్పుడు ఎందుకు భయపడవలసివచ్చింది? ప్రభూ! నేను అనన్యపరాయణను. నన్ను ఎందుకు, ఇక్కడ వదలిపెట్టి మీరు ఒక్కరే పోవలెను అనుకుంటున్నారు? ద్యుమత్సేనుడి కొమారుడు సత్యవంతుణ్ణి సావిత్రీదేవి పెండ్లి ఆడింది. ఆ సావిత్రీదేవి భర్తను అనుసరించుకొని ఉండడమే వ్రతముగా పెట్టుకొన్నది. నేనూ అదే వ్రతము అవలంబించినాను. మీకు తెలుసును. మీరు ఎక్కడికిపోతే నేనూ మీవెంట అక్కడికి వస్తాను. నేను కులపాంసనినికాను. కనుక, నేను ఎప్పుడూ మీవెంటనే ఉండవలెను. మిమ్ములను వదలిపెట్టి ఇక్కడనే కాదు, ఎక్కడనూ ఉండను.

"నాథా! నేను మీ సతిని. మీరు నన్ను వివాహము చేసుకొన్నది మొదలు నేను మీ సహచర్యము చేస్తూ ఉన్నాను. మనము ఇప్పుడు నవయౌవనములో ఉన్నాము. మీరు ఇప్పుడు జాయాజీవులవలె నన్ను మరి ఒకరికి ఎందుకు ఒప్పగించ దలచినారు? భరతుడికి హితము చేయమని తాము నాతో చెప్పినారు. కౌసల్యాదేవికీ, దశరథమహారాజుకూ సేవ చేయమని కూడా చెప్పినారు. అందుకోసము, తాము నన్ను అడవికి తమవెంట రావద్దు అన్నారు. వారికి హితము చేయడమూ, సేవ చేయడమూ, నాకు సంబంధించిన పనికాదు. అది తమ పని. నాకు వారితో నిమిత్తములేదు. ఎప్పుడూ తమతో ఉంటూ, తమకు సేవచేస్తూ ఉండడమే నా ధర్మము. ప్రభూ! తాము సమస్తధర్మాలూ తెలిసినవారు. నన్ను మాత్రము ఇప్పుడు, ఇక్కడ వదలిపెట్టి తాము ఒక్కరే వనవాసము చేయపోవడము అధర్మము.

"నాథా! తాము తపస్సు చేయతలచుకొన్నా, అరణ్యములో నివాసము పెట్టుకోతలచుకొన్నా, స్వర్గానికి ప్రయాణము అయిపోతలచుకొన్నా నేను మీవెంట ఉండవలెను. తాము తప్ప నాకు మరి ఒక లోకము లేదు. నేను మీ సరసను ఉంటే మహారణ్యములో అయినా ఉద్యానవనములో ఉన్నట్టుగా ఉంటుంది. నాకు దారిలో ఏ అలసటా ఉండదు. దర్భలూ, రెల్లూ, ఇంకా ఇతర ముండ్లదుబ్బలూ నా కాళ్ళకు గుచ్చుకోవు. అవి దూదివలెనూ, జింకతోలువలెనూ నా కాళ్ళకు మెత్తగా తగులుతవి.

ముండ్లచెట్లు అన్నీ నాకు పూలచెట్లుగా కనపడతవి. గాలికి రేగి నా దేహానికి అంటుకొనిపోయే దుమ్ము, ధూళి చందనచర్చ చేసికొన్నట్టుగా ఉంటుంది. పచ్చికబయళ్ళలో మీతో శయనిస్తే, ఇక్కడ చిత్రకంబళాలు పరచిన పాన్పులమీద పడుకోవడముకన్నా ఎక్కువ సుఖముగా ఉంటుంది. మీ చేతిమీదుగా మీరు అడవిలో ఏ కాసిని ఆకులో, పండ్లో, కందమూలాలో, కాయలో అందిస్తే అవి నాకు అమృతతుల్యముగా ఉంటవి. ఆ యా ఋతువులలో పూసే పూలు పెట్టుకొంటూ, ఆ యా కాలాలలో కాసే కాయలు తింటూ మీతో విహరిస్తూ ఉంటే మీ ఇల్లుకానీ, మా ఇల్లుకానీ జ్ఞాపకము రావు. మా నాయనకానీ; మా అమ్మకానీ స్మరణకు రారు.

"నాథా! అడవిలో నానుంచి మీకు ఏ కొంచెము కష్టమూ కలుగనీయను. మిమ్ములను ఏమాత్రమూ దిగులు పడనీయను. నేను మీకు ఏమీ బరువుగా ఉండను. మీతో నేను ఎక్కడ ఉంటే, అదే నాకు స్వర్గము. మీరు లేకుండా నేను ఎక్కడ ఉన్నా, అది నాకు నరకము. మన అనురాగము అటువంటిది. నన్ను ఇక్కడ దిగవిడిచి మీరు ఒక్కరే అడవులకు వెళ్ళిపోవద్దు. మీతో నేను కూడా వస్తాను.

"ప్రభూ! నేను మీశత్రువుల దగ్గర ఉండను. మీరు మీవెంట తీసుకొని పోకపోయేట్లయితే, నేను తప్పకుండా చచ్చిపోతాను. ఎప్పుడో మీరు లేనప్పుడు ఎందుకు, ఇప్పుడే, మీ ఎదుటనే చచ్చిపోవడము మేలు అనిపిస్తుంది. మీ వియోగదుఃఖము నేను ఒక్క ముహూర్తము అయినా భరించలేను. పది సంవత్సరాలూ, ఆ తరువాత మూడు సంవత్సరాలూ, ఆపైన ఒక సంవత్సరము మీరు లేకుండా నేను ఒంటరిగా ఉండవలెనా" అంటూ రాముణ్ణి గట్టిగా కౌగలించుకొని జాలిపుట్టేట్టు ఎలుగెత్తి ఏడవసాగింది. అరణి కట్టెలలో అణగి ఉండే అగ్నిహోత్రము రాపిడివల్ల బయలుపడ్డట్టు, అంతవరకూ కంఠగతము అయి ఉన్న ఆమె దుఃఖము రాముడి మాటలకు పెద్ద పెట్టున బయటపడ్డది. విషము పూసిన బాణము దెబ్బకు నేలకూలిన పెంటి ఏనుగువలె, రాముడు రావద్దు అన్నందుకు ఆమె నేలమీద పడిపోయింది.

కన్నీటిధారలకు ఆమె కన్నుల కాటుక అంతా కరిగిపోయింది. తామరపువ్వులో నుంచి రాలే నీటిబిందువువలె, స్ఫటికకాంతులతో ఆమె కన్నీటి బిందువులు కారడము మొదలు పెట్టినవి. నీళ్ళలో నుంచి వెలుపల వేసిన కమలము ఎండకు వాడిపోయినట్టుగా చంద్రబింబమువంటి ఆమె ముఖము దుఃఖాగ్నికి కమిలిపోయింది.

స్మృతి తప్పిపోయినదానివలె నేలమీదపడి ఉన్న సీతాదేవిని రాముడు తన రెండు చేతులా లేవనెత్తి కౌగలించుకొని, "సీతా! నీవు ఇట్లా దుఃఖపడుతూ ఉంటే, నాకు స్వర్గము సంప్రాప్తము అయినా వదలుకొంటాను. దేనివల్లనూ భయములేని

స్వయంభువు వంటివాణ్ణి నేను. ఓ శుభాననా! నిన్ను మహారణ్యములోనే కాదు, ఎక్కడను అయినా కాపాడే సామర్థ్యము నాకు ఉంది. అయితే, నీ అభిప్రాయము తెలుసుకోవలెను అని నాతో అరణ్యానికి రావద్దు అన్నాను. నీవు నాతో వనవాసము చేయవలెను అని అంత దృఢముగా సంకల్పించుకొన్నావు కనుక, నిన్ను నేను ఇక్కడ విడిచిపెట్టి వెళ్ళను. ఓ మైథిలీ! పూర్వరాజర్షులు అందరూ తమ పత్నులతోనే అరణ్యవాసము చేసినారు. సువర్చల సూర్యుణ్ణి అంటిపెట్టుకొని తిరుగుతూ ఉంది. ధైర్యవంతుడు ఎన్నడూ తన ధైర్యాన్ని వదలిపెట్టడు. అదేవిధముగా, నిన్ను నేను వదలిపెట్టి పోను. నీవున్నూ నన్ను వదలిపెట్టి ఉండనక్కరలేదు. ఇక నీవు గజగమనముతో నాతో రావలెను.

"ఓ జనకనందినీ! నేను పితాజ్ఞాపరిపాలనము చేస్తాను అని అనడమే కాకుండా ఈనాడే, ఇప్పుడే వనవాసానికి ప్రయాణము అయిపోతాను అని కైకేయీదేవికి మాట ఇచ్చినాను. అందువల్ల వెంటనే బయలుదేరవలసి ఉంది. తల్లిదండ్రుల ఆజ్ఞలను శిరసావహించడముకన్నా పుత్రుడికి అధికము అయిన ధర్మము మరి ఒకటి లేదు. తండ్రీ, తల్లీ, గురువు ప్రత్యక్ష దేవతలు. ఓ శుభనేత్రీ! ఈ ముగ్గురే ముల్లోకాలూన్నూ. వీరిని ఆరాధిస్తే ముల్లోకాలూ స్వాధీనము అవుతవి. అందువల్ల, నేను వీరిని ఆరాధిస్తున్నాను. జపతపస్స్వాధ్యాయవ్రత క్రతువుల కన్నా, పితృసేవ ఎక్కువ ఫలాన్ని ఇస్తుంది. పితృసేవవల్ల సాధ్యముకానిది ఏమీలేదు. పితృసేవా పరాయణులు అయిన మహాత్ములు దేవలోకమూ, గంధర్వలోకమూ, గోలోకమూ, ఇంకా ఇతర లోకాలూ క్రమముగా బ్రహ్మలోకమూ పొందుతున్నారు. మా తండ్రి సత్యధర్మపథము తప్పనివాడు. ఆయన ఆజ్ఞలను నేను శిరసావహించవలెను. శిరసావహిస్తున్నాను. పుత్రుడు అయిన ప్రతివాడికీ ఇది సనాతన ధర్మము.

"సీతా! నిన్ను దండకారణ్యము తీసుకొని పోవలెను అని నేను ఇదివరకు అనుకోలేదు. అయితే, నీవు నాతో వనవాసము చేసి తీరవలెను అని నిశ్చయించుకొన్నావు కాబట్టి, తప్పకుండా నిన్ను నాతో తీసుకొని పోతాను. ఓ మదిరేక్షణా! నీవు నాతో వనవాసము చేయడానికే ఏనుగుతొండమువంటి తొడలతోనూ, చక్కని అవయవసౌష్ఠవముతోనూ పుట్టినావు. నీవు సహజభీరువవు అయినప్పటికిన్నీ, నా సహధర్మచారిణివిగా సంచరిస్తావు. కాబట్టి, నీకు ఏ భయమూ ఉండదు. నీవు నాతో వనవాసము చేయతలచుకొన్నందువల్ల నీ వంశగౌరవాన్నీ, నా వంశగౌరవాన్నీ నిలపెట్టుతున్నావు.

"ఓ శుభశ్రోణీ! నీవు నావెంట ఉండకపోయేట్లయితే, స్వర్గములో నన్ను ఉండమన్నా నేను ఉండను. ఓ సీతా! ఇక మన వనవాసప్రయాణానికి అవసరము

అయిన ఏర్పాట్లు అన్నిటినీ నీవు చేయవలెను. బ్రాహ్మణోత్తములకు నానావిధమణులూ దానము చేయవలెను. భిక్షకులకు అన్నదానము చేయవలెను. ఆలస్యము చేయవద్దు. ఈ పనులన్నీ నీవు త్వరగా నెరవేర్చవలెను.

"సీతా! బ్రాహ్మణులకు ఇచ్చేవి అన్నీ ఇచ్చివేసిన తరువాత నావీ నీవీ సొమ్ములూ, మంచి మంచి వస్త్రాలూ, పాన్పులూ, వాహనాలూ, అందము అయిన వేడుక వస్తువులూ మన సేవకులకు ఇచ్చి వేయవలెను" అని చెప్పినాడు.

అందుకు ఆమె ఎంతో సంతోషించింది. ఆ యశస్విని, ఆ మనస్విని పెనిమిటి చెప్పినట్టుగా దానధర్మాలు చేయడానికి నిండుమనస్సుతో ఏర్పాట్లు చేయడము మొదలుపెట్టింది.

31

లక్ష్మణుని వనవాస నిశ్చయము

సీతారాముల సంభాషణ లక్ష్మణుడు విన్నాడు. అతనికి పట్టరాని దుఃఖము వచ్చింది. కన్నీళ్ళు కారుస్తూ, సీతాదేవి వంక చూచి రాముడి పాదాలు పట్టుకొని, "అన్నా! నీవు అడవికి పోవడము నాకు ఇష్టము లేదు. నీవు, 'కాదు పోవలసిందేను' అంటున్నావు కాబట్టి, నేను ముందుగా బయలుదేరుతున్నాను. ధనుర్ధరుణ్ణి అయి మీకు దోవతీస్తాను. నేను మీతో ఉంటాను కనుక, మహారణ్యములో క్రూరమృగాలు భయంకరముగా గర్జించినా, పెద్దపెద్ద పక్షులు ఘోరముగా కూసినా సీతాదేవి నీతో నిర్భయముగా ఉండవచ్చును. మీరూ హాయిగా విహరించవచ్చును.

"రామా! నీవు లేకుండా నన్ను దేవలోకములో ఉండమన్నా ఉండను. నీవు లేకుండా నాకు అమరత్వము ప్రసాదించినా, నేను అంగీకరించను. నీవు లేకుండా నన్ను ముల్లోకాలూ ఏలమన్నా, నేను ఒల్లను. నేను ఎప్పుడూ నీతో ఉండవలసిన వాణ్ణేను" అన్నాడు లక్ష్మణుడు.

మహారణ్యానికి తనవెంట రావద్దు అని రాముడు ఎన్నో సామవాక్యాలతో లక్ష్మణుడికి చెప్పినాడు. అంతట లక్ష్మణుడు, "రామా! ఇది ఏమిటి? నేను ఎప్పుడూ నీతో ఉండడానికి నీవు ఇదివరకే అనుమతించినావు. ఇప్పుడు నేను ప్రయాణము అవుతూ ఉంటే వద్దు అంటున్నావు. కారణము ఏమిటి" అని అడిగినాడు.

"తమ్ముడా! నీ మనస్సు ఎంతో మంచిది. నీవు పరమధార్మికుడవు. సత్పధగామినివి. వీరుడవు. సఖుడవు. నా అధీనుడవు. నాకు ప్రాణసముడవు. నా తమ్ముడవు. నన్ను ఎప్పుడూ సంతోషపెట్టడమే పనిగా పెట్టుకొన్నావు. నీవు నాతో అరణ్యవాసానికి వస్తే, నాకు అక్కడ తప్పకుండా హాయిగా ఉంటుంది. నాకు

తెలుసును. కాని, ఇక్కడ నా తల్లి కౌసల్యాదేవినీ, పరమయశస్వినీ అయిన సుమిత్రాదేవినీ కనిపెట్టుకొని ఉండేవారు ఎవరు? మహాతేజోవంతుడు మన తండ్రి దశరథమహారాజు ఇంతవరకూ దేవేంద్రుడివలె తనవారికి అందరికీ కోరిన కోరికలు చెల్లిస్తూ వచ్చినాడు. ఇప్పుడు ఆయన కామపాశబద్ధుడు అయిపోయినాడు. ఇకను ఈ రాజ్యాన్ని అంతా కేకయరాజపుత్రి స్వాధీనము చేసుకొంటుంది. ఆమె తన సవతులను తిన్నగా చూడదు. భరతుడు రాజు అయినప్పటికిన్నీ, కైకేయీదేవి చెప్పుచేతలలోనే ఉంటాడు. అందువల్ల, వాడున్నూ దుఃఖాలపాలు అయిన మనతల్లుల గురించి ఆలోచించను అయినా ఆలోచించడు. కాబట్టి, నీవు ఇక్కడనే ఉండిపోయి రాజానుగ్రహమువల్లకానీ, నీ అంతట నీవేకానీ ఆ పూజ్యురాండ్రను కాపాడవలెను. నేను చెప్పుతున్నాను. నీవు ఈపని చేయవలెను. లక్ష్మణా! నీకు నామీద ఉన్న భక్తిని నీవు ఈవిధముగా చూపించవలెను. నీవు సమస్త ధర్మాలూ తెలిసిన వాడవు. గురుజనపూజనముకన్నా అధికము అయిన ధర్మము లేదు. ఇక నేను వెళ్లిపోతాను. నాకు గాను నీవు మా అమ్మనూ, మీ అమ్మనూ కనిపెట్టుకొని ఉండవలెను. వారిని సుఖపెట్టవలెను. సంతోషపెట్టవలెను" అని రాముడు చెప్పినాడు.

"రామా! నీ పరాక్రమము భరతుడు బాగా ఎరుగును. వాడు కౌసల్యా సుమిత్రలను శ్రద్ధతో చూస్తాడు. వారిని పూజిస్తాడు. వారికి సేవ చేస్తాడు. సందేహము లేదు. ఇంతకూ కౌసల్యాదేవిని ఒకరు కనిపెట్టుకొని ఉండవలసిన అవసరమే లేదు. ఆమె తన ఆశ్రితులకు ఒక వెయ్యి గ్రామాలు దానము ఇచ్చింది. ఆమె నాబోటివాండ్లను ఎంత మందిని అయినా కనిపెట్టి కాపాడగలదు. ఆ యశస్వినీ తనతోపాటు మా అమ్మనూ, ఇంకా ఎంతమందిని అయినా కాపాడుతుంది. నీవు మీ అమ్మను గురించీ, మా అమ్మను గురించీ విచారపడనక్కరలేదు.

"రామా! నేను నీ కింకరుణ్ణిగా ఉంటాను. నేను ఇట్లా చేయడములో అధర్మము ఏమీ లేదు. నేను కృతార్థుణ్ణి అవుతాను. నీపని నెరవేరుతుంది. ప్రభూ! నేను ధనుస్సూ, బాణాలూ, గడ్డపలుగులూ, గంపా తీసుకొని ఇప్పుడే ప్రయాణము అయిపోతున్నాను. కందమూలాలూ, పండ్లూ, ఇంకా తాపసులు ఆరగించే ఆహారపదార్థాలూ నీకోసము సంపాదించి ఉంచుతాను. అడవిలో మీకు ఎప్పుడూ కావలి ఉంటాను. నీవు సీతాదేవితో పర్వతసానువులలో హాయిగా విహరిస్తూ ఉండవచ్చును. మీరు రాత్రిపూట నిర్భయముగా నిద్రపోవచ్చు.

"ప్రభూ! నేను నీ కింకరుణ్ణి. దివారాత్ర భేదము లేకుండా నీకు సేవ చేయడమే నా ధర్మము" అన్నాడు లక్ష్మణుడు.

రాముడు సంతోషముతో, "లక్ష్మణా! నీవు ఇప్పుడే పోయి నీ స్నేహితులు అందరికీ వీడ్కోలు చెప్పు. జనకమహారాజు యజ్ఞానికి మనము పోయినప్పుడు, అక్కడ వరుణదేవుడు మనకు అభేద్యము అయిన కవచాలు రెండూ, అక్షయ తూణీరాలతో ధనుస్సులు రెండూ, సూర్యసమానతేజముతో తళతళలాడే బంగారు పిడులు వేసిన ఖడ్గాలు రెండూ ఇచ్చినాడు. మనము వాటిని పూజార్థము వశిష్ఠులవారి ఇంట్లో ఉంచినాము. మనకు ఇప్పుడు అవి కావలెను. నీవు పోయి వాటిని వెంటనే పట్టుకొని రావలెను"అని ఆజ్ఞాపించినాడు.

రాముడితోపాటు తానూ వనవాసానికి పోతున్నట్లు లక్ష్మణుడు తన మిత్రులు అందరికీ వీడ్కోలు చెప్పినాడు. వశిష్ఠులవారి ఇంటికిపోయి అక్కడ ఉంచిన ఆయుధాలను తీసుకొన్నాడు. తిరిగి రామమందిరానికి వచ్చినాడు. రాముడు సంతోషముతో, "సౌమ్యుడా! నీకోసమే చూస్తూ ఉన్నాను. సమయానికి వచ్చినావు. నా స్వంత సొమ్మును అంతా నా ఆశ్రితులకూ, బ్రాహ్మణోత్తములకూ దానము ఇవ్వతలచినాను. నీవు స్వయముగా పోయి వశిష్ఠులవారి పుత్రుడూ, బ్రాహ్మణోత్తములలో పరమపూజ్యుడూ అయిన సుయజ్ఞుణ్ణి ఇక్కడికి వెంటబెట్టుకొని రావలెను. ఆ సుయజ్ఞుణ్ణీ, తక్కిన బ్రాహ్మణోత్తములనూ సత్కరించి వారి ఆశీర్వాదాలతో మనము ఈనాడే అరణ్యవాసానికి ప్రయాణము అయిపోదాము" అన్నాడు.

32

రాముడు బ్రాహ్మణోత్తములకు దానములిచ్చుట

రామాజ్ఞను శిరసావహించి లక్ష్మణుడు సుయజ్ఞుడి ఇంటికి పోయినాడు. అగ్నిహోత్ర గృహములో ఉన్న సుయజ్ఞుణ్ణి సందర్శించి నమస్కారము చేసి, "మిత్రమా! మా అన్న రాముడు దుష్కర కర్మకారి వనవాసానికి ప్రయాణము అవుతున్నాడు. తాము వచ్చి చూడవలెను" అన్నాడు.

సుయజ్ఞుడు మధ్యాహ్న సంధ్యావందనము చప్పున పూర్తిచేసి లక్ష్మణునితో బయలుదేరినాడు. లక్ష్మీసంపన్నము అయిన రాముడి రమ్యమందిరానికి వచ్చినాడు. హుతాగ్నిహోత్రుడువలె జ్వలిస్తూ ఉన్న ఆ వేదవేత్తకు సీతారాములు ప్రదక్షిణము చేసినారు. నమస్కారము చేసినారు. ఆయనను కూర్చుండబెట్టినారు. అంతట రాముడు మణులు తాపటము చేసిన తన బాహుపురులనూ, బంగారు బాహుపురులనూ, చక్కని కుండలాలనూ, బంగారుచుట్టిన మణిసరాలనూ, రత్నాభరణాలనూ, కంకణాలనూ ఆ సుయజ్ఞుడికి దానము ఇచ్చినాడు. సీతాదేవి రాముడికి సంజ్ఞ చేసింది. అంతట రాముడు సుయజ్ఞుడితో, "మిత్రుడా! నా ఇల్లాలు

సీతాదేవికూడా నాతో అరణ్యవాసానికి వస్తూ ఉంది. ఆమె తన ఆభరణాలను మీ భార్యకు ఇవ్వతలచింది. వాటిని మీరు తీసుకొనిపోయి మీ భార్యకు ఇవ్వవలెను" అన్నాడు. సీతాదేవి తన కంఠహారాన్నీ, మణులు పొదిగిన కంఠాభరణాన్నీ, మొలనూలునూ, రంగురంగుల బాహుపురులనూ, బంగారు బాహుపురులనూ సుయజ్ఞుడి చేతికి ఇచ్చింది.

రాముడు తిరిగి, "స్వామీ! నా భార్య రత్నఖచితము అయిన ఈ పర్యంకాన్ని దీనిమీద పరిచే ఆస్తరణతో కూడా మీకు ఇవ్వమన్నది. మీరు దీనిని తీసుకోవలెను. నాకు మా మేనమామ 'శత్రుంజయము' అనే ఏనుగును ఇచ్చినాడు. దానికి తోడుగా మరి ఒక వెయ్యి ఏనుగులున్నూ ఉన్నవి. వాటిని అన్నిటినీ మీకు ఇస్తాను, తీసుకోవలసింది" అంటూ వాటిని అన్నింటిన్నీ సుయజ్ఞుడికి ఇప్పించాడు.

ఆ బ్రాహ్మణోత్తముడు సీతారామలక్ష్మణులను ఆశీర్వదించినాడు.

ఏమరుపాటు లేకుండా నిల్చుని ఉన్న లక్ష్మణుణ్ణి చూచి రాముడు బ్రహ్మదేవుడు దేవేంద్రుణ్ణి ఆజ్ఞాపించేటట్టు, "లక్ష్మణా! నీవు ఇప్పుడే పోయి అగస్త్యపుత్రుణ్ణి, కౌశికపుత్రుణ్ణి ఆహ్వానించి తీసుకొని రావలెను. పయిర్లకు వానవలె, వారికి నీవు మణులు కురిపించి వారిని సంతోషపెట్టవలెను. వారిని అర్చించవలెను. వారికి వేలకొద్దీ బంగారమూ, వెండీ, ఇంకా ఎన్నో గోవులూ ఇచ్చి వారిని సంతృప్తి పరచవలెను. మా అమ్మ కౌసల్యాదేవిని ప్రతిదినమూ శ్రద్ధతో ఆశీర్వదిస్తూ ఉన్న బ్రాహ్మణ ముఖ్యుడు ఒకాయన ఉన్నాడు. ఆయన తైత్తిరీయశాఖాధ్యాయులకు అందరికీ గురువు. పండితుడు. ఆ వేదవేత్తను రావించి ఆయన తృప్తిపడేట్టుగా పట్టుబట్టలనూ, వాహనాలనూ, దాసదాసీజనాన్నీ ఇవ్వవలెను. 'చత్రరధుడు' అనే సూతుడు ఉన్నాడు. ఆయన దశరధమహారాజుకు సచివుడు. నాకు సారథి. ఆయన చాలాకాలమునుంచి మన ఇంట్లో ఉంటున్నాడు. మహార్హాలు అయిన వస్త్రాలనూ, ధనాన్నీ, ఒక వెయ్యి ఆవులనూ, సన్నజీవాలనూ ఇచ్చి ఆయనను సంతోషపెట్టవలెను.

"కఠకాలాపశాఖాధ్యాయులు అయిన బ్రహ్మచారులూ, పలాశదండధారులు అయిన బ్రహ్మచారులూ నా పోషణలో ఉన్నారు. వారు ఎప్పుడూ వేదాధ్యయనము చేస్తూ ఉంటారు. నాకు అంతకుమించి ఏపనీ చేయరు. అయితే అతిరుచ్యము అయిన ఆహారము కోసము ఎప్పుడూ ఆశపడుతూ ఉంటారు. పెద్దలు అందరూ వారిని సమ్మానిస్తూ ఉంటారు. ఎనభైబండ్ల మణులనూ, ధాన్యము వేసిన ఎద్దులను ఒక వెయ్యింటినీ, దుక్కిటెద్దులను ఒక ఇన్నూటినీ వారికి ఇచ్చి వారిని సంభావించవలెను. ఒక వెయ్యి పాడి ఆవులను కూడా వారికి ఇవ్వవలెను.

"లక్ష్మణా! వీరే కాకుండా, ఇంకా ఎంతోమంది బ్రహ్మచారులు మా అమ్మ కౌసల్యాదేవిని ఆశ్రయించుకొని ఉన్నారు. వారికి ఒక్కొక్కరికీ ఒక్కొక్క వెయ్యి గోవులు ఇవ్వవలెను.

"తమ్ముడా! మా అమ్మ కౌసల్యాదేవి సంతోషించేటట్టుగా బ్రాహ్మణులను అందరినీ నీవు సన్మానించవలెను" అని చెప్పినాడు.

రాముడు చెప్పినట్లుగా లక్ష్మణుడు బ్రాహ్మణులకు అందరికీ కుబేరుడివలె దానధర్మాలు చేసినాడు.

అప్పుడు సేవకులు అందరూ కన్నీళ్ళు కారుస్తూ, రాముడి ఎదుట నిలుచున్నారు. రాముడు వారిని అందరినీ చూచి, "ఓ సేవకులారా! మేము తిరిగి వచ్చేటంతవరకున్నూ మీరు నా ఇంటినీ, లక్ష్మణుడి ఇంటినీ ఎప్పటివలె కనిపెట్టుకొని ఉండవలెను. మా ఇండ్లను శూన్యగృహాలుగా ఉంచవద్దు" అంటూ ఆ సేవకులు అందరి జీవనోపాధికి ప్రత్యేకముగా ధనము ఇచ్చే ఏర్పాటు చేసినాడు. అంతట మిగిలి ఉన్న ధనాన్ని అక్కడికి తెప్పించమని ధనాధ్యక్షుడికి ఆజ్ఞాపించినాడు. అందరూ ఆశ్చర్యపోయేటంత ధనరాశిని అక్కడికి తీసుకొని వచ్చినారు. రామలక్ష్మణులు ఆ ధనాన్ని అంతా వేదబ్రాహ్మణబాలురకున్నూ, వృద్ధులకున్నూ దానము చేసివేసినారు.

అప్పుడు 'త్రిజటుడు' అనే బ్రాహ్మణోత్తముడు రాముణ్ణి చూడడానికి వచ్చినాడు. ఆయన గర్గమహర్షి వంశీయుడు. అయోధ్యా ప్రాంతములో ఉన్నాడు. నిరుపేద. ప్రతిరోజూ ఒక చిన్నగొడ్డలీ, గుద్దలీ ఒకచిన్న బుట్టా తీసుకొని అడవికిపోయి కందమూలాలు తవ్వి, పరిగలు ఏరుకొని తెచ్చి భార్యాబిడ్డలను పోషిస్తున్నాడు. ఆ దేహశ్రమకు ఆయన దేహము అంతా కమిలిపోయి గోరోచనపు రంగుగా తేలింది. ఆయన వృద్ధుడు. ఆయన భార్య తరుణి. వారికి ఎంతోమంది బిడ్డలు పుట్టినారు.

ఆనాడు ఆమె త్రిజటుడితో, "స్వామీ! ఆ గొడ్డలీ, ఆ గుద్దలీ అట్లా పెట్టండి. నేను చెప్పినట్లు చేయండి. రాముడు ఈవేళ వనవాసానికి వెళ్ళిపోతున్నాడు. అడిగినవాడికి లేదు అనకుండా దానధర్మాలు చేస్తున్నాడు. నన్నూ, ఈ మీ బిడ్డలనూ వెంటపెట్టుకొని అతని దగ్గరకు పదండి, అతడు మనకు ఏమి అయినా ఇస్తాడు. మన దారిద్ర్యము వదలి పోతుంది" అని చెప్పింది.

త్రిజటుడు ప్రయాణము అయినాడు. చిరిగిపోయిన ఉత్తరీయము కప్పుకొన్నాడు. భృగ్వంగీరసమహర్షులవలె తేజరిల్లుతూ నడచినాడు. ఆయన వెనుక నవయౌవనములో ఉన్న ఆయన భార్యా, ఆమెవెంట కోడిపిల్లలవలె వారి బిడ్డలూ నడచినారు. వారిని చూచి జనసమూహము అంతా తప్పుకొని దారి యిచ్చింది.

వారిని రామమందిరములో ద్వారపాలకులు ఎవరూ అడ్డగించలేదు. వారు హుటాహుటీ అయిదవ కక్ష్యవరకూ పోయినారు.

త్రిజటుడు రాముడి ఎట్టఎదుటికి పోయి, "ఓ రాజపుత్రా! నీ కీర్తి విన్నాను. నేను నిరుపేదను. బహుపుత్రకుణ్ణి. అడవిలో కందమూలాలూ, పండ్లూ, పరిగలూ తెచ్చి కుటుంబ పోషణము చేస్తూ ఉన్నాను. తాము మమ్ములను కటాక్షించవలెను" అన్నాడు.

రాముడు ఆ త్రిజటుణ్ణీ, నవయౌవనములో ఉన్న ఆయన భార్యనూ, వారి బిడ్డలనూ చూచినాడు. మందహాసము చేస్తూ, "ఓ బ్రాహ్మణుడా! ఇవిగో, దూరముగా కనపడుతూ ఉన్న ఆవులమందలు నావే. వాటిలో ఇంకా ఒక్క వెయ్యింటిని అయినా నేను దానము చేయలేదు. మీకు ఎన్ని కావలెనో, నేను ఎన్ని ఇవ్వవలెనో తోచడము లేదు. అందువల్ల, మీచేతిలో ఉన్న కర్రను విసరివేయండి. అది ఎంత దూరముపోతే అంతదూరము వరకూ ఉన్న ఆవులను అన్నిటినీ మీకు ఇస్తాను" అన్నాడు రాముడు.

అంతట త్రిజటుడు పైన కప్పుకొన్న చిరుగుల గుడ్డను తీసి గబగబా నడుముకు చుట్టుకొన్నాడు. చేతిలో ఉన్న కర్రను గిరగిరా త్రిప్పి శక్తి కొద్దీ విసరివేసినాడు. ఆ కర్ర ఆ ఐదు కక్ష్యలూ దాటింది. సరయూనదిని దాటింది. అవతల గట్టున ఉన్న వేలకొద్దీ ఆవుల మందలను దాటిపోయి అక్కడ యధేష్టముగా మేస్తూ ఉన్న ఆబోతు దగ్గర పడ్డది.

ఆ కర్ర అంతదూరము పోయినందుకు, అందరూ ఆశ్చర్యచకితులు అయినారు.

రాముడు మహదానందముతో ఆ పరమవృద్ధుణ్ణి కౌగిలించుకొన్నాడు. ఆయన కర్ర పడ్డంతవరకూ ఉన్న ఆవులను అన్నింటినీ ఆయన ఆశ్రమపదానికి గొల్లవాండ్రచేత తోలించమని ఆజ్ఞాపించినాడు. త్రిజటుణ్ణి చూస్తూ, "బ్రాహ్మణోత్తమా! దానము అడిగితే తమ బలము పరీక్షించినాను అనే కోపము వద్దు. మీతేజము ఎటువంటిదో అందరికీ తెలియవలెను అనుకొన్నాను. నవ్వులాటగా మిమ్ములను కర్ర విసరమన్నాను. అంతే! మీకు ఇంకా ఏమి అయినా కావలసిఉంటే అడగండి, ఇస్తాను. ఏ సంకోచమూ వద్దు. యథార్థము చెప్పుతున్నాను. నేను ధనము బ్రాహ్మణుల కోసమే కూడపెట్టి యున్నాను. అది మీబోటివారికి ఇస్తేనే సద్వినియోగము అవుతుంది. ఇట్లా ఇవ్వడము నాకు సంతోషము" అన్నాడు రాముడు.

అన్ని వేల ఆవులను ఇచ్చినందుకు త్రిజటుడూ, ఆయన భార్యా సంతుష్టులు అయినారు. వారు రామున్ణి మరి ఏమీ అడగలేదు. అంతట వారు సీతారామలక్ష్మణులు

సుఖవంతులుగానూ, బలవంతులుగానూ, కీర్తివంతులుగానూ బహుకాలము జీవించవలెను అని దీవించినారు.

రాముడు తన స్నేహితులు అందరితోనూ వారి వారి యోగ్యతలకు తగినట్టుగా సమ్మానవాక్యాలు చెప్పినాడు. తన పరాక్రమముతో సంపాదించిన ధనాన్ని అంతా వారికి ఇవ్వమని ఆజ్ఞాపించినాడు.

ఆనాడు అయోధ్యానగరములో ఉన్న ప్రతిబ్రాహ్మణుడూ, ప్రతిసేవకుడూ, ప్రతిభృత్యుడూ, ప్రతిభిక్షుకుడూ రాముడి దానధర్మాలకు సంతుష్టుడు అయినాడు.

అందరూ సీతారామలక్ష్మణులను మెచ్చుకొన్నారు. వారు చిరాయువులుగా ఉండవలెను అని ఆశీర్వదించినారు.

33

సీతారామలక్ష్మణులు దశరథుని చూడబోవుట

రామలక్ష్మణులు సీతాదేవిని వెంటపెట్టుకొని దశరథమహారాజుకు వీడ్కోలు చెప్పిపోవడానికి బయలుదేరినారు.

సీతాదేవి ఆ అన్నదమ్ముల ధనుస్సులనూ, ఇంకా వారి ఖడ్గాద్యాయుధాలనూ పూలదండలతోనూ, చందనముతోనూ అలంకరించింది. వారు ఆ ఆయుధాలు ధరించి ఆమెకు ఇరువైపులా నడుస్తూ ఉంటే, అవి కన్నులు మిరుమిట్లు కొలుపుతూ మరింత ధగధగలాడినవి.

జనసమూహముతో రాజవీథులు అన్నీ కిక్కిరిసిపోయినవి. పౌరులు సీతారామలక్ష్మణులను చూడవలెను అనుకొని ప్రాసాదాలనూ, హర్మ్యాలనూ, విమాన శిఖరాలనూ ఎక్కినారు. గొడుగు అయినా లేకుండా రామభవనములోనుంచి కాలినడకను బయటికి వస్తూ ఉన్న సీతారామలక్ష్మణులను అందరూ చూచినారు. శోకోపహతులు అయిపోయినారు. అదివరకు రాముడు ఎప్పుడు ఎక్కడకు బయలుదేరినా వెంట చతురంగబలాలు నడిచేవి. అటువంటివారివెంట ఇప్పుడు సీతాదేవీ, లక్ష్మణుడూ పాదచారులు అయి వెళ్ళుతూ ఉంటే అందరికీ ఏడుపు వచ్చింది. ఆ క్రిందటి క్షణమువరకు సమస్త ఐశ్వర్యాలూ అనుభవించిన మహారాజపుత్రుడు (అడిగినవారికి లేదు అనకుండా ఇచ్చినవాడు) ఇప్పుడు ధర్మగౌరవమువల్ల సమస్తమూ త్యజించి వేసినాడు. తండ్రికి అసత్యదోషము రాకుండా ఉండటాని కోసము వనవాసము చేయపోతున్నాడు.

ఆకాశమార్గాన సంచారముచేసే భూతకోటికి అయినా కనిపించని సీతాదేవి ఇప్పుడు పాదచారిణి అయి జనాకీర్ణము అయిన రాజవీథిలో నడుస్తూ ఉంటే,

ప్రతివాడూ చూచినాడు. రక్తచందనపు మైపూతతో ధగధగలాడుతూ ఉన్న సీతాదేవి కుసుమకోమల దేహము ఇక ఎండకూ, వానకూ, చలికీ మారురూపు పడిపోతుంది అని అందరూ ఖిన్నులు అయిపోయినారు.

"ఇప్పుడు నిజముగా దశరథమహారాజుకు పిశాచము పట్టింది. లేకపోతే కొడుకునూ, కోడలినీ అడవులకు పొమ్మంటాడా" అన్నారు కొందరు.

"దశరథమహారాజు రాముణ్ణి అడవికి ఎంతమాత్రమూ పోనీయడు" అని మరికొందరు అన్నారు.

• అయోధ్యాపౌరులు అందరూ ఇంకా ఈవిధముగా చెప్పుకోవడము మొదలు పెట్టినారు :

"గుణవంతుడు కాకపోయినా, కడుపున పుట్టిన కొడుకును ఏ తండ్రీ అడవులకు వెళ్ళకొట్టడు. అందులో తన సత్ప్రవర్తనతో ఈలోకాన్ని అంతా జయించిన పుత్రుణ్ణి ఏ తండ్రి అయినా వెళ్ళకొట్టుతాడా? 'అహింసా, దయా, విద్యా, సత్స్వభావము, ఇంద్రియ నిగ్రహమూ, శాంతమూ' అనే ఆరు సద్గుణాలూ రాముడిలో మూర్తీభవించినవి. ఆ మహాత్ముడికి కష్టము వచ్చింది అంటే, నీళ్ళు ఇంకిపోయిన తరువాత ఎండాకాలములో జలజంతువుల మాదిరిగా జనులు అందరూ మలమల మాడిపోవలసిందే. ఆ మహాద్యుతిమంతుడు ఈ జగత్తు అనే వృక్షానికి మూలమువంటివాడు. సమస్త జనులూ ఆ చెట్టుకు కొమ్మలూ, ఆకులూ, పూలూ, పిందెలూ, కాయలూ, పండ్లూ వంటివారు. ఇప్పుడు ఆ జగత్పతికి ఆపద వచ్చింది. చెట్టుకు వేరు తెగకొట్టినట్టు అయింది. వేరు నరికిన చెట్టుకు పూసిన పూలూ, కాసిన కాయలూ వలె అందరూ ఇక నాశనము అయిపోతారు.

"లక్ష్మణునివలె మనమూ మన తోటలనూ, దొడ్లనూ, ఇండ్లనూ, వాకిండ్లనూ వదలిపెట్టి రాముడివెంట అడవికి పోదాము. రాముడు సుఖము అనుభవిస్తే మనమూ సుఖము అనుభవిద్దాము. అతడు దుఃఖపడితే మనమూ దుఃఖపడుదాము. మనమూ మన ఇండ్లలో ఉన్న ధనధాన్యాలనూ, నిధినిక్షేపాలనూ, శయనాసనాదులనూ మనతో తీసుకొని పోదాము. మన ఇలవేల్పులున్నూ మనతోనే ఉంటారు. ఇక మన ఇండ్లముందు కసవు ఊడ్చడమూ, కలాపి చల్లడమూ, ఇండ్లలోపల కడగడమూ ఉండదు. మన ఇండ్లు అన్నీ దుమ్ముకొట్టుకొని పోతవి. లోపల బూజుపట్టి బూజులు వేళ్ళాడుతూ ఉంటవి. ఎలుకలూ, పందికొక్కులూ మన ఇండ్లలో కలుగులు పెట్టుకొని కాపురముచేస్తూ చిత్తమువచ్చినట్టు పరుగులుతీస్తూ ఉంటవి. మన ఇండ్లలో నీళ్ళూ, నిప్పులూ, జపహోమాలూ, బలికర్మలూ, మంత్రధ్వనులూ ఇక వుండవు. వంటకుండలూ

మొదలు అయినవి పగిలిపోయి పెంకులు మిగులుతవి. క్షామకాలములో వలె మన ఇండ్లు అన్నీ పాడుపడిపోతవి. పాడుపడ్డ ఇండ్లను అన్నిటినీ కైకేయీదేవి స్వాధీనము చేసుకొని సంతోషిస్తుంది.

"రాముడు ఉంటాడు కనుక, మహారణ్యమే మహానగరము అవుతుంది. ఈ అయోధ్యానగరమే మహారణ్యముగా మారిపోతుంది. అరణ్యములో వన్యసత్వాలు అన్నీ మనలను చూచి భయపడిపోతవి. కలుగులోనుంచి పాములూ, కొండనెత్తాలలోనుంచి పెద్దపెద్ద పక్షులూ, జింకలూ, సాంద్రారణ్యాలలోనుంచి ఏనుగులూ, కొండగుహలలో నుంచి సింహాలు, పెద్దపెద్ద పొదలలోనుంచి శార్దూలాది జంతువులూ పారిపోయి మనము వదలిపెట్టి వచ్చిన అయోధ్యానగరము చేరుతవి. అవి హాయిగా మన ఇండ్లలోనూ, తోటలలోనూ, దొడ్లలోనూ కాపురము పెట్టుకొంటవి. యథేష్టముగా తిరుగుతూ ఉంటవి. అప్పుడు కైకేయీదేవి తన కొడుకుతోనూ, బంధువులతోనూ ఈ అయోధ్యానగరంలో రాజ్యము ఏలుతూ ఉంటుంది. మనము అందరమూ మహారణ్యములో రాముడితో సుఖముగా ఉంటాము."

ఈవిధముగా పౌరులు అందరూ చెప్పుకొంటూవున్న మాటలు అన్నీ రాముడు విన్నాడు. అతనికి ఏమాత్రమూ మనోవికారము కలుగలేదు. ఎంతమంది దుఃఖించినా అతడు చలించలేదు. ఎప్పటివలె మందహాసము చేస్తూ మదపుటేనుగు తీవితో నడచినాడు. కైలాసపర్వతమువలె కనిపించే దశరథ మహారాజు భవనములోకి పోయినాడు. అక్కడ ఉన్న వినీతవీరపురుషులను అందరినీ చూస్తూ నడచినాడు.

ఆ సమీపంలోనే ఆర్తరూపముతో సుమంత్రుడు కనిపించినాడు. రామున్ని అడవికి పొమ్మన్నప్పటినుంచీ ఆ మంత్రిపుంగవుడు దుఃఖాక్రాంతుడు అయిపోయినాడు. రాముడు ఆ సుమంత్రున్ని చూచి తన రాక తండ్రికి తెలియచేయవలెను అని చెప్పినాడు.

ఆ కమలపత్రాక్షుడు, ఆ ఇందీవరశ్యాముడు, ఆ సింహమధ్యముడు, ఆ మహాత్ముడు రాముడు తన రాక తండ్రికి తెలియచేయమని సుమంత్రుడితో చెప్పినాడు. సుమంత్రుడికి దుఃఖము వచ్చింది. అతని దేహము అంతా కంపించి పోవడము మొదలు పెట్టింది. అయినప్పటికిన్నీ వెంటనే లోపలికి పోయినాడు. రామున్ని గురించిన దుఃఖముతో నిట్టూర్పులు విడుస్తూ ఉన్న దశరథమహారాజును చూచినాడు.

ఆయన రాహుగ్రస్తము అయిన సూర్యబింబమువలెనూ, భస్మచ్ఛన్నము అయిన అగ్నిహోత్రమువలెనూ, నిస్తేయము అయిన తటాకమువలెనూ అగుపించినాడు. మనోవ్యాకులముతో, "రామా! రామా!" అంటూ దుఃఖపడుతున్నాడు. ఆయనతో

ఏమి అని చెప్పడమా అని సుమంత్రుడు దిగులుపడిపోయినాడు. ఆ స్థితిలో ఏమి చెప్పితే ఏమి ఆజ్ఞాపిస్తాడో అని భయపడిపోయినాడు ఆ ప్రాజ్ఞుడు. చేతులు జోడించి ఆయన దగ్గరకు పోయి జయము ఆశీర్వదించి, మందముగా మధురముగా, "మహారాజా! పురుషశార్దూలము తమపుత్రుడు రాముడు తమదర్శనము కోసము వచ్చి వాకిటిలో కనిపెట్టుకొని ఉన్నాడు. అతడు తన ధనాన్ని అంతా బ్రాహ్మణులకూ, భృత్యులకూ దానము ఇచ్చినాడు. మిత్రులు అందరికీ వీడ్కోలు చెప్పినాడు. వనవాసానికి ప్రయాణము అయిపోతూ తమ అనుజ్ఞకోసము సీతా లక్ష్మణ సహితముగా ఇక్కడికి వచ్చినాడు. అనంతకిరణాలతో తేజరిల్లే సూర్యుడువలె సమస్తరాజగుణాలతో విరాజిల్లుతూ మీ దర్శనము ఆపేక్షిస్తూ ఉన్నాడు. తాము అతనికి దర్శనము ఇవ్వవలెను" అని చెప్పినాడు.

ఆ ధర్మాత్ముడు, ఆ సత్యవ్రతుడు దశరథమహారాజు సముద్రమువలె గంభీరుడు. ఆకాశమువలె నిర్మలుడు. ఆయన సుమంత్రుణ్ణి చూచి, "మంత్రిసత్తమా! నా భార్యలను అందరినీ ఇక్కడికి రప్పించవలెను. వాండ్ల సమక్షములో ఆ ధార్మికుణ్ణి చూస్తాను" అన్నాడు. మహారాజాజ్ఞను సుమంత్రుడు ఆయన భార్యలు మున్నూటఏభై మందికిన్నీ తెలియచేసినాడు. వారు అందరూ రాముడు అడవికి పోతున్నాడు అని కన్నులు ఎర్రపడిపోయేటట్లు ఏడుస్తూ, కౌసల్యాదేవి వెనుక దశరథమహారాజు దగ్గరకు నడచినారు.

అంతట ఆయన రాముణ్ణి లోపలికి తీసుకొనిరమ్మని సుమంత్రుడితో చెప్పినాడు.

భార్యల మధ్యను కూర్చొని ఉన్న దశరథమహారాజు సుమంత్రుడి వెనుక చేతులు జోడించి నడచి వస్తూ ఉన్న రాముణ్ణి, సీతాదేవిని, లక్ష్మణుణ్ణి చూచినాడు. తటాలున లేచినాడు. వారికి ఎదురుగుండా పరుగెత్తినాడు. దుఃఖార్తుడు అయి వారిని సమీపించకుండానే నేలకూలినాడు. మూర్ఛపోయినాడు. ఆయనను లేవనెత్తడానికి రామలక్ష్మణులు పరుగెత్తుకొని వచ్చినారు. ఆయన భార్యలు అందరూ గొల్లుమన్నారు. "హా రామా!" అంటూ వారు అందరూ నెత్తి బాదుకొంటూనూ, గుండెలు కొట్టుకొంటూనూ ఏడువసాగినారు. వారి ఏడ్పులకు, వారి పెడబొబ్బలకు, వారి ఆభరణాల చప్పుళ్ళకు ఆ భవనము అంతా కంపించిపోయింది.

రామలక్ష్మణులు, సీతాదేవి దశరథమహారాజును పర్యంకముమీద పరుండబెట్టి ఉపచారాలు చేసినారు. కొంతసేపటికి ఆయనకు తెలివి వచ్చింది. దుఃఖసముద్రములో మునుగుతూ తేలుతూ ఉన్న దశరథమహారాజును చూచి రాముడు, "మహారాజా!

తాము మాకు అందరికీ నాథులు. తమ అనుజ్ఞపొంది వీడ్కోలు చెప్పి పోవడానికి వచ్చినాను. నేను దండకారణ్యానికి ప్రయాణము అయి పోతున్నాను. నన్ను తాము సంతోషముతో ఆశీర్వదించవలెను. ప్రభూ! ఈ సీత నాతో వస్తూ ఉంది. ఈ లక్ష్మణుడున్నూ నావెంట బయలుదేరినాడు. రావద్దు అని వీళ్ళకు నేను అనేక విధాల చెప్పినాను. వీండ్లు వినలేదు. వీండ్లు నేను లేకుండా ఇక్కడ ఉండము అన్నారు. వీండ్లు నాతో రావడానికి తాము అనుమతించవలెను. ప్రభూ! ప్రజలు అందరూ ఈ భూమిమీద సంచరించడానికి బ్రహ్మదేవుడు అనుజ్ఞ యిచ్చినట్టు, మేము వనవాసము చేయడానికి తాము అనుజ్ఞ ఇవ్వవలెను" అన్నాడు.

రాముడు ఏమాత్రమూ ఆలస్యం చేయకుండా వనవాస ప్రయాణ సన్నద్ధుడు అయి వచ్చి తనను అనుజ్ఞ అడుగుతూ ఉన్నందుకు కించపడిపోయి, "రామా! నేను ఎప్పుడో కైకేయికి వరాలు ఇచ్చి ఇప్పుడు మోసపోయినాను. నీవు ఇప్పుడు నన్ను నిగ్రహించి ఈ అయోధ్యకు రాజువు అయి రాజ్యము ఏలు" అన్నాడు దశరథమహారాజు.

రాముడు పరమధార్మికుడు. పరమధార్మికుడు మాత్రమే కాదు, మాటనేర్పరి. అతడు చేతులు ఎత్తి నమస్కారము చేస్తూ, "ప్రభూ! తాము ఎంతకాలము అయినా ఈ రాజ్యము ఏలవలెను. తాము పుణ్యమూర్తులు. నానుంచి మీకు అసత్య దోషము రాకూడదు. మీనుంచి నాకున్నూ అసత్యదోషము రాకూడదు. ఇప్పుడు నేను వనవాసము చేయడమే ధర్మము. రాజా! ఒక తొమ్మిది సంవత్సరాలు, ఆ తరువాత ఒక అయిదు సంవత్సరాలు - ఏమి అంత పెద్దకాలము! సుఖముగా వనవాసము చేస్తాను. గడువు కాలము అయిపోగానే వచ్చి మీ పాదాలమీద వాలుతాను" అన్నాడు.

ఈ మాటలకు దశరథమహారాజు సత్యపాశబద్ధుడు అయిపోయినాడు. ఆయనకు దుఃఖము వచ్చింది. దీనుడు అయిపోయినాడు. కైకేయీదేవి చెంపను చేరి వెంటనే రాముణ్ణి పంపించివేయమని చెవిలో ఊదడము మొదలు పెట్టింది. ఆయనకు ఏమీ తోచకుండా పోయింది. రాముణ్ణి చూస్తూ, "నాయనా! పో, నీవు ప్రయాణము అయిపో. నీవు ఇహ పరలోక సౌఖ్యాలు అన్నీ అనుభవించవలెను. తిరిగి ఇక్కడికి రావలెను. ఈ రాజ్యము ఏలవలెను. నాయనా! నీవు నిర్భయమూ, మంగళకరమూ అయిన సత్పథము అవలంబించు, పో!

"రామా! నీవు రఘుకులదీపకుడవు. సత్యవ్రతుడవు. పరమధార్మికుడవు. అడవికి పోవలెను అని నీకు బుద్ధి పుట్టింది. నీ బుద్ధి మార్చడము ఎవరి తరము? అయితే, నాయనా! నీవు ఇప్పుడే ప్రయాణము అయిపోవద్దు. ఈరాత్రి అంతా ఇక్కడనే ఉండు. ఈ ఒక్కపూట అయినా నిన్ను కళ్ళారా చూచి సంతోషిస్తాను. నీవు

మీ అమ్మనూ, నన్నూ చూస్తూ ఈరాత్రి అంతా ఇక్కడనే ఉండు. మేము మా చిత్తము వచ్చినట్టుగా నిన్ను సంతోష పెట్టుతాము. నీవు రేపు ఉదయము ప్రయాణము అయిపోవచ్చును.

"నాయనా! నా పరలోక సౌఖ్యము కోసము నీవు సమస్త సౌఖ్యాలూ వదలుకొని కారడవులకు పోతున్నావా? ఇటువంటి దుష్కర కార్యము నీవు తప్ప ఎవరూ చేయరు, చేయలేరు. రామా! నిన్ను అడవికి పంపించడము నాకు ఎంతమాత్రమూ ఇష్టములేదు. సత్యప్రమాణముగా చెప్పుతున్నాను. ఈ కైక నివురుకప్పిన నిప్పు. తన క్రౌర్యాన్ని తెలియనీకుండ దాచి ఉంచుకొన్నది. దీని దగ్గర నా ప్రజ్ఞ చలించింది. ఇది నన్ను మోసపుచ్చింది. ఎన్నడో సంతోషముతో నేను ఇస్తాను అన్న వరాలు నన్ను ఏమరచి విపరీతముగా అడిగి పుచ్చుకొన్నది. నాయనా! ఈ కైక మన వంశాచారాన్ని నేలపాలు చేసింది. అయ్యో! ఈ కైక కోరికను నీవు కూడా సఫలము చేయవలసి వచ్చింది. రామా! నీ ధార్మికతకు నాకు ఆశ్చర్యము వేస్తూ ఉంది. అయితే, నీవు నా జ్యేష్ఠపుత్రుడవు. నాకు అసత్య దోషము రానీయకూడదు అనుకొన్నావు, ఆశ్చర్యము లేదు" అంటూ దశరథమహారాజు కన్నీళ్ళు కార్చినాడు.

ఈ ఆర్తాలాపాలకు రాముడు లక్ష్మణుడివంక చూచి దశరథ మహారాజుతో, "రాజా! ఈనాడు మీరు నన్ను సంతోష పెట్టుతారు. రేపు ఎవరు సంతోష పెట్టుతారు? అందువల్ల, నేను కోరికలు అన్నీ వదలుకొన్నాను. వనవాసము చేయడానికి సంకల్పించుకొన్నాను. ఈ నా బుద్ధి మారదు. ప్రభూ! కైకేయీదేవికి తాము సంతోషముగా వరాలు ఇచ్చినారు. ఆ వరాలను మీరు సంపూర్ణముగా చెల్లించవలెను. మీ ఆజ్ఞను నేను శిరసావహించి పద్నాలుగు సంవత్సరాలూ మహారణ్యములో మహర్షులమధ్య నివసిస్తాను. మిమ్ములను నిగ్రహించమని చెప్పినారు. మీకు ఆ ఆలోచన వద్దు. ఈ రాజ్యము ఏలవలెను అనే కోరిక నాకు లేదు. ఇంకా ఏవో సుఖాలు అనుభవించవలెను అనే కోరిక అంతకన్నా లేదు. మీ ఆజ్ఞలను నెరవేర్చడము ఒక్కటే నాకు ఉన్న కోరిక. మీరు దిగులు పడవద్దు. కన్నీళ్ళు కార్చవద్దు. గంభీరుడు అయిన సముద్రుడు ఎప్పుడు అయినా కలత చెందుతాడా? మీ ఆజ్ఞలను శిరసావహించడముతప్ప నాకు ఈ రాజ్యముతో పని ఏమిటి? స్వామీ! నాకు కావలసింది తాము, తమ సత్యవ్రతము. నేను అనృతము అంగీకరించను. నా సుకృతము మీదనూ, నా సత్యము మీదనూ ఒట్టు పెట్టుకొని చెప్పుతున్నాను. నేను ఇకను ఇక్కడ ఒక్క క్షణము అయినా ఉండను. నన్ను కైకేయీదేవి వనవాసానికి పొమ్మన్నది. నేను పోతాను అన్నాను. అందువల్ల, మీ ఆజ్ఞను శిరసావహించడమే కాకుండా, ఆమెకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నవాణ్ణి అవుతాను.

"దేవా! దేవతలకు సయితము తండ్రే ప్రత్యక్ష దైవము అని చెప్పగా విన్నాను. అందువల్ల, నా తండ్రే నాకు దేవుడు అనుకొంటున్నాను. ఆయన ఆజ్ఞలను తలదాల్చడమే నా పని. నేను నా వనవాసము అయిపోయిన తరువాత వచ్చి తమ దర్శనము చేస్తాను. తాము ఇక దిగులు పడవద్దు. ప్రభూ! నా ఈ తల్లులు అందరూ నేను వనవాసానికి పోతున్నాను అని గద్గదకంరలు అయి కన్నీళ్ళు కారుస్తున్నారు. వారిని ఓదార్చవలసిన వారు మీరు. మీరే దుఃఖపడితే మిమ్ములను ఓదార్చే వారు ఎవరు? మీరు దుఃఖపడవద్దు.

"దేవా! నేను ఈ పట్టణమూ, ఈ రాజ్యమూ వదులుకొని పోతున్నాను. కనుక పట్టణాలతోనూ, పర్వతాలతోనూ, వనాలతోనూ, సుస్థిరము అయిన హద్దులతోనూ, ధనధాన్యసమృద్ధిగానూ, సర్వశుభావహముగానూ ఉన్న ఈ రాజ్యాన్ని భరతుడికే ఇవ్వండి. వాడే ఈ రాజ్యాన్ని అంతా పాలిస్తాడు. మీరు ఆజ్ఞాపించినట్టు జరిగి తీరవలెను. మీ ఆజ్ఞలను నేను శిరసావహించడము శిష్టజన సమ్మతము అయిన విషయము. అందువల్ల, మీ ఆజ్ఞలను నెరవేర్చడములో ఉన్న ఉత్సాహము నాకు మరి దేనిమీదనూ లేదు. నేను ఏదో కష్టపడుతున్నాను అని మీరు దుఃఖపడవద్దు. తమకు అసత్య దోషము రాకుండా ఉండడమే నా మహదాశయము. తమ సత్యవ్రతము కోసము నేను దేనిని అయినా వదలుకొంటాను. ఏ సుఖాన్ని అయినా వదలుకొంటాను. అందువల్ల, నేను ఇప్పుడు ఈ రాజ్యము వదలుకొని పోవడము ఒక గొప్పవిషయము కాదు. తమ సత్యవ్రతానికి నావల్ల భంగపాటు రాకూడదు.

"రాజా! నేను ఈ సీతతోనూ, లక్ష్మణుడితోనూ మహారణ్యాలలో ప్రశాంత హరిణాలతో నానావిధశకుంతల కూజితాలు వింటూ విహరిస్తాను. చిత్రవిచిత్రము అయిన వృక్షాలు చూస్తూ, వివిధఫలాలూ కందమూలాలూ తింటూ, గిరిగుహలలో నివసిస్తూ, ఆ యా నదులలోనూ, సరస్సులలోనూ స్నానము చేస్తూ హాయిగా కాలము గడుపుతాను. రాజా! తామున్నూ ఇక్కడ సుఖముగా ఉండండి" అని చెప్పినాడు రాముడు.

దశరథమహారాజు దుఃఖాగ్ని లో పడిపోయినాడు. ఆయనకు తాపము ఎత్తింది. ఏడుపు వచ్చింది. పెద్దపెట్టున ఏడుస్తూ, రాముణ్ణి గట్టిగా కౌగలించుకొన్నాడు. స్మృతి తప్పి పడిపోయినాడు.

కైకేయీదేవి తప్ప తక్కిన రాజపత్నులు అందరూ గొల్లుమన్నారు.

ఇది అంతా వింటున్న సుమంత్రుడు ఆవురుమని ఏడుస్తూ మూర్ఛ పోయినాడు.

అక్కడి వారందరూ "అయ్యో! అయ్యో!" అంటూ పెద్దపెట్టున వాపోయినారు.

34, 35

కైకేయికి సుమంత్రుని హితోపదేశము

సుమంత్రుడు తెప్పరిల్లి నిట్టూర్పులు విడుస్తూ, తల ఆడిస్తూ, చేతులు నులుపుకొంటూ పళ్ళు పటపట కొరికినాడు. కోపోద్రేకముతో అతని కన్నులు కెంపులవలె ఎర్రపడిపోయినవి. ముఖము అంతా నెత్తురుముద్ద అయిపోయింది. ముఖమేకాదు, అతని దేహము అంతా ఎర్రపడి పోయింది. సంతాపపడుతూ ఉన్న దశరథమహారాజు వంక చూచినాడు. ఆయన మనస్సు తెలుసుకొన్నాడు. తీక్షణబాణాలతో మర్మస్థానాలను భేదించేటట్టు, వాగ్బాణాలతో కైకేయీదేవి హృదయాన్ని చిందరవందర చేయవలెను అనుకొన్నాడు.

అంతట సుమంత్రుడు ఆమె గుట్టు అంతా బట్టబయలుచేయ తలచుకొని "ఓ దేవీ! చరాచరాత్మకము అయిన ఈ జగత్తుకు అంతటికీ దశరథమహారాజు ప్రభువు. ఆయన మీకు పెనిమిటి. ఆయన తలపెట్టిన పని మీరు కాదు అన్నారు. మీరు ఆయనను తిరస్కరించినారు. ఇక మీరు ఈ లోకములో చేయలేని అకార్యము ఏదీ లేదు.

"దశరథమహారాజు దేవేంద్రుడివలె అజయ్యుడు. హిమాచలమువలె అచలుడు. మహోదధివలె అక్షోభ్యుడు. అటువంటివాణ్ణి మీరు ఇట్టే దుఃఖాలపాలు చేసినారు. ఆయనను ఇక మీరు చంపివేస్తారేమో అనిపిస్తూ ఉంది. కాదు, కాదు. ఆయన వంశాన్ని నాశనము చేసి వేస్తారేమో అనిపిస్తూ ఉంది.

"అమ్మా! ఆయన మనలను అందరినీ పోషిస్తున్నాడు. మనము కోరిన కోరికలు ఇస్తున్నాడు. మనము అందరమూ ఆయనను అనుసరించి పోవలెను. అందులో మీరు ఆయనను చేపట్టి ఆయనను ఎప్పుడూ అనుసరిస్తూ, సంతోషపెట్టుతూ ఉండవలెను. ఒక కోటిమంది కొడుకులను కని పెంచడముకన్నా, పెనిమిటిని ఒక్కణ్ణి అనుసరించి మెప్పించడమే ఆడుదాని ధర్మము. అంతకన్నా అధికము అయిన ధర్మము ఆడుదానికి మరి ఒకటి లేదు.

"ఓ రాణీ! రాజు చనిపోయినప్పుడు కొడుకులలో వయస్సునుపట్టి పెద్దవాడు రాజు అవుతూ ఉంటాడు. తక్కిన కొడుకులు ఆ పెద్దవాణ్ణి అనుసరించుకొని ఉంటారు. ఇది లోకధర్మము. ఈ ధర్మాన్నే ఇక్ష్వాకువంశీయులు అనూచానముగా అనుసరిస్తున్నారు. కులక్రమాగతము అయిన ఈ ధర్మాన్ని మీరు దశరథమహారాజు జీవించి ఉండగనే, ఆయన చేతనే చెడగొట్టించ తలచినారు. మీరు కృతార్థులు అయితే కావచ్చును. మీ పుత్రుడు భరతుడే రాజు అయితే కావచ్చును. ఈ

భూమిని అంతా అతడే ఏలవచ్చును. మేము మాత్రము రాముడు పోయే చోటికి పోయి ఉంటాము. మేమే కాదు, ఏ ఒక్క బ్రాహ్మణుడున్నూ ఈ అయోధ్యా నగరములో కాపురము ఉండడు. యోగ్యులు అయినవారు ఎవరూ ఈ అయోధ్యలో ఉండకుండా పోయేటంత అమర్యాదపనికి మీరు తలపడినారు.

"అమ్మా! మీరు ఎంతటి అపచారానికి పూనుకొన్నారు? మీరు ఇప్పుడు రాముణ్ణి అరణ్యవాసము చేయించమని పట్టుపట్టుతూ ఉన్నందుకు, బ్రహ్మర్షులు యమదండముకన్నా భయంకరమయిన తమ వాగ్దండాలతో మిమ్ములను ఎందుకు ప్రహరించకుండా ఉన్నారో తెలియడములేదు. మీరు పూనుకొన్న ఈ పాపకర్మకు ఈ భూమి ఇంకా ఎందుకు బ్రద్దలు అయిపోకుండాఉన్నదో అని ఆశ్చర్యము వేస్తూఉంది.

"ఓ రాజపుత్రీ! ఎవడు అయినా గొడ్డలి తీసుకొని పనికట్టుకొని తియ్యని పండ్లు పండే మామిడిచెట్టును నరికివేసి వేపమొక్కకు పాదులు కట్టి పాలుపోసి పెంచితే, అది తియ్యని కాయలు కాస్తుందా? అదేవిధముగా దశరథమహారాజు తన పట్టమహిషిని వదిలిపెట్టి మిమ్ములను ఆదరించినాడు. ఇప్పుడు మీరు ఇట్లా చేసినారు. ఇప్పుడు మిమ్ములను అని ప్రయోజనము ఏమిటి? మీరు గొప్పవంశములోనుంచే వచ్చినారు. అయితే, వేపచెట్టుకు ఎప్పుడు అయినా తేనె కారుతుందా? మీరు మీతల్లి గుణాన పుట్టినారు. మీతల్లి కథ ఇదివరకే నేను విన్నాను.

"పూర్వము ఒక మహాత్ముడు మీ నాయనగారికి సమస్తప్రాణికోటుల భాషలూ బోధపడే వరము ఇచ్చినాడు. ఆ వర ప్రభావమువల్ల పిపీలికాది సమస్త జీవరాసుల మాటలూ మీ నాయనగారికి తెలుస్తూ ఉండేవి. ఒకనాడు మీ నాయనగారు పాన్పుమీద పడుకొని, ఆ ప్రక్కనే చీమలు చెప్పుకొంటూ ఉన్న మాటలు విన్నారు. ఆ చీమల మాటలకు ఆయనకు నవ్వు వచ్చింది. పెద్దపెట్టున చాలాసేపు నవ్వినారు. మీ నాయనగారు తనను అపహసిస్తున్నారు అని మీ అమ్మకు కోపము వచ్చింది. ఎందుకు నవ్విందీ చెప్పమని మీ అమ్మ అడిగింది. నవ్విన కారణము చెప్పేట్లయితే, తనకు వెంటనే చావు మూడుతుంది అని మీ నాయనగారు ఎంతోదూరము చెప్పినారు. మీ అమ్మ వినలేదు. 'చావండి, బ్రతకండి, ఏమి అయినా కండి, చెప్పవలసిందేను' అని పట్టుపట్టింది. అంత మీ నాయనగారు వరము ఇచ్చిన ఆయనను అడిగినారు. ఆ వర ప్రదాత, 'ఏది ఏమి అయినా చెప్పకూడదు' అన్నాడు. మీ అమ్మ అప్పటికిన్నీ ఊరక ఉండకుండా మీ నాయనగారిని నిర్బంధించి బాధపెట్టసాగింది. తన చావుకుకూడా మీ అమ్మ లెక్కచేయడము లేదు అని మీ నాయనగారికి పట్టరాని కోపము వచ్చింది. అంతట మీ అమ్మను వెళ్ళకొట్టినారు. అప్పటినుంచీ మీ నాయనగారు కుబేరుడివలె సుఖముగా ఉంటున్నారు.

"ఓ దేవీ! మీరున్నూ ఇప్పుడు మీ తల్లివలె దుష్టచారిణుల దారి పట్టినారు. పాపానికి ఒడిగట్టుకొన్నారు. 'తల్లి గుణము కూతుళ్ళకూ, తండ్రి గుణము కొడుకులకూ వస్తుంది' అనే లోకోక్తిని యథార్థము చేస్తున్నారు. మీ అజ్ఞానమువల్ల మీరు మీ పెనిమిటి దశరథమహారాజుచేత చేయించకూడని పని చేయించడానికి పూనుకొన్నారు. అందువల్ల, ఆయనకు భరించరాని అపయశస్సు వస్తుంది. ఆయన చనిపోతాడేమో! మీరు అట్లా చేయవద్దు. మీరు మీ పెనిమిటికి విధేయులుగా ఉండవలెను. రాముడికి యువరాజ్యాభిషేకము చేస్తాను అని వారు మహాజనసభామధ్యములో ప్రకటించినారు. వారిమాట మీరు అబద్ధము చేయించవద్దు. రాముడు అరణ్యవాసానికి వెళ్ళిపోతున్నాడు అని పౌర జానపదులు అందరూ దుఃఖపడుతున్నారు. వారి అందరి దుఃఖాన్నీ మీరు పోకొట్టవలెను. వారిని అందరినీ మీరు సంతోషపెట్టవలెను. పిన్నవాడికి పట్టము కట్టించి పెద్దవాణ్ణి అడవులకు వెళ్ళకొట్టించమని పాపిష్ఠులు ఎవరో మిమ్ములను పురికొల్పినారు. ఆ అధర్మానికి మీ పెనిమిటిని పాల్పడమని మీరు నిర్బంధిస్తున్నారు.

"తల్లీ! ఈ దశరథమహారాజు దేవేంద్రుడితో సరిసమానము అయిన లోకనాథుడు. లోకనాథుడే కాడు, మీకు నాథుడు. మీరు ఆయనను అధర్మముపాలు చేస్తున్నారు. అమ్మా! ఆయన మీకు వాగ్దానముచేసిన వరాలు పొల్లుపోతవేమో అనుకోవద్దు. ఈ రాజీవాక్షుడు, ఈ శ్రీమంతుడు, ఈ పుణ్యాత్ముడు మీకు ఈ రాజ్యముకన్నా ఎక్కువ ఐశ్వర్యము ఇచ్చి మీ వరాలు చెల్లిస్తాడు. కాని, మీరుగా మోసముచేసి ప్రమాణము చేయించుకొన్న మీ వరాలు చెల్లించడు. మీరు అనుకొన్నట్టు మీ వరాలు చెల్లిస్తాడు అనే ఆశ పెట్టుకోవద్దు.

"అమ్మా! రాముడు జ్యేష్ఠుడు. వదాన్యుడు. సదాచార సంపన్నుడు. ధర్మరక్షకుడు. లోకరక్షకుడు. మహాబలవంతుడు. అతనికే పట్టాభిషేకము జరుగవలెను. ఓ తల్లీ! రాముడు ఇప్పుడు తండ్రిని వదలిపెట్టి వనవాసానికి పోయేట్లయితే, మీకు గొప్ప అపవాదు వస్తుంది. మీకన్నా ఎక్కువగా దశరథమహారాజుకు అపయశస్సు వస్తుంది. ఈ రాజ్యములో ధర్మము నాశనము అయిపోతుంది. అమ్మా! అందువల్ల రాముడే రాజ్యము ఏలవలెను. రాముడే లేకపోయేట్లయితే ఈ అయోధ్యలో యోగ్యులు ఎవరూ నివసించరు. ఓ తల్లీ! రాముడి యువరాజ్యాభిషేకము అయిపోగానే దశరథమహారాజు పూర్వరాజర్షుల మాదిరిగా తపస్సు చేసుకోవడానికి అడవులకు వెళ్ళిపోతారు. అందుకు మీరు వారికి తోడ్పడవలెను" అన్నాడు.

సుమంత్రుడు రాజసమక్షములో ఇంత నిష్ఠూరముగా మాట్లాడి, ఇన్ని మంచిమాటలు చెప్పినా కైకేయీదేవి క్షోభపడలేదు. ఆమె హృదయము చలించలేదు.

ఆమె ముఖములో క్రౌర్యపుచిన్నెలు అయినా మారలేదు. ఆమె నిర్భయముగా ఊరక ఉన్నది.

36
కైకేయి

కోరినట్టు వరాలు చెల్లిస్తాను అని కైకేయీదేవికి చేసిన శపథము తప్పించుకోవడానికి దారి కనపడక దశరథమహారాజు కన్నీళ్లు కారుస్తూ, "ఓ సుమంత్రుడా! రత్నరాసులతోనూ, సమస్త శస్త్రాస్త్రాలతోనూ, చతురంగసేనలూ రాముడి వెంట పోవడానికి వెంటనే ఏర్పాటు చేయవలసింది. రాముడి ముఖ్యాశ్రితులనూ, వీర్యపరీక్షార్థము రాముడు తనదగ్గర ఉంచుకొన్న వీరులనూ, ఆయుధాలు చేసి జీవించేవారినీ, సేనలు విడిదిచేసేచోట దుకాణాలు పరుచుకొని ఆ యా వస్తువులు అమ్మే వర్తకులనూ, పాటలు పాడుతూ ఆటలు ఆడే అందకత్తెలు అయిన వేశ్యాంగనలనూ, పౌరముఖ్యులనూ, అడవిదార్లు చూపించే బోయవాండ్లనూ, ఇంకా రాముడివెంట పోతాము అనేవారిని అందరినీ రాముడివెంట పోయే సేనాసమూహముతో పంపించివేయవలసింది. వారి వారికి కావలసిన ధనమూ, వస్త్రాలూ మొదలు అయినవి అన్నీ ఇవ్వవలసింది. ఇంకా నూనె, నెయ్యి మొదలయిన అపురూప వస్తువులను బండ్లమీదవేసి పంపించవలసింది. నా ధనకోశాన్ని, ధాన్యకోశాన్ని కూడా రాముడితో పంపించివేయవలసింది. ఇట్లా చేసేట్లయితే అడవులలో క్రూరమృగాలనూ అడవి ఏనుగులనూ వేటాడుతూనూ, ఆ యా పుణ్యనదులలోనూ పవిత్ర హ్రదాలలోనూ స్నానము చేస్తూనూ, అడవితేనె త్రాగుతూనూ నా పిల్లవాడు రాముడు కోసల రాజ్యాన్ని మరచిపోగలుగుతాడు. పుణ్యక్షేత్రాలలో యజ్ఞాలుచేస్తూనూ, పుణ్యపురుషులకు యథోక్తదక్షిణలు ఇస్తూనూ పోయి, నా పిల్లవాడు మహారణ్యములో మహర్షులమధ్య సుఖముగా ఉంటాడు.

"రాముడు శ్రీమంతుడుగా వనవాసము చేయవలెను. భరతుడు తన భుజబలముతో ఈ అయోధ్యలో రాజ్యపాలనము చేయవలెను" అని ఆజ్ఞాపించినాడు.

ఈ ఆజ్ఞను కైకేయీదేవి విన్నది. ఆమెకు భయము వేసింది. ఆమె ముఖము ఎండిపోయింది. గొంతు ఆరిపోయింది. ఏడుపు ముఖముతో దశరథమహారాజుకు ఎదురుగుండా పోయి, "రాజా! రాముడివెంట సమస్తమూ పంపించివేస్తే, పౌరులు అందరూ వెళ్ళిపోతే అయోధ్యానగరము సురాసారాన్ని త్రాగివేసిన సురాభాండమువలె అయిపోతుంది. అటువంటి రాజ్యము భరతుడు ఒల్లడు" అంటూ అంతమందిలోనూ సిగ్గూ, బిడియమూ లేకుండా అన్నది.

ఆ పెద్ద పెద్ద కళ్ళ కైకేయీదేవిని చూస్తూ దశరథమహారాజు, "ఓ ఎగ్గులమారీ! మోయరాని బరువు నా నెత్తిన ఎత్తినావు. ఇంకా ఎందుకు నన్ను హింస పెట్టుతావు? రాముడివెంట చతురంగబలాలూ పోకూడదు అని నీవు ఇదివరకు నన్ను వరము అడిగినావా" అంటూ ప్రశ్నించినాడు. ఈ ప్రశ్నకు కైకేయీదేవికి కోపము ఇబ్బడి అయింది. ఆమె, "రాజా! తమ పూర్వీకుడు సగరచక్రవర్తి తన జ్యేష్ఠపుత్రుడు అశ్వమంజుణ్ణి అయోధ్యానగరమునుంచి అడవులకు వెళ్ళకొట్టినట్టు, తాము రాముణ్ణి పంపించి వేయవలెను" అన్నది.

"ఛీ! ఛీ" అన్నాడు దశరథమహారాజు.

ఆమె మాటలకు అక్కడ ఉన్నవారు అందరూ ఏవగించుకొన్నారు. ఆమె ఎవరినీ ఏమాత్రము లక్ష్యము చేయలేదు. ఆమె దశరథమహారాజుతో ఇంకా ఏమో మాట్లాడపోయింది.

అప్పుడు వృద్ధుడూ, పరిశుద్ధుడూ, మహాత్ముడూ అయిన సిద్ధార్థుడు, "ఓ దేవీ! అశ్వమంజుడు దుష్టుడు. అయోధ్యానగర వీధులలో ఆడుకొనే పిల్లలను మరిపించి తీసుకొనిపోయి సరయూనదిలో పడతోసి సంతోషిస్తూ ఉండేవాడు. అందుకు అయోధ్యానగర వాస్తవ్యులు అందరూ క్రుద్ధులు అయిపోయి సగరచక్రవర్తి దగ్గరకు పోయి, 'రాజా! మేము అందరమూ అయోధ్యానగరములో ఉండవలెను అనేట్లయితే, తాము అశ్వమంజుణ్ణి తమ పుత్రుడు అని మన్నించకుండా అడవులకు వెళ్ళకొట్టించవలెను. తాము అతణ్ణి వెళ్ళకొట్టము అనేట్లయితే, మేము అందరమూ ఈ అయోధ్యానగరము వదిలిపెట్టి పోతాము' అని చెప్పినారు. వారిని సగరచక్రవర్తి, ఎందుకు అంత భయపడుతున్నదీ చెప్పమన్నాడు.

"ప్రభూ! అశ్వమంజుడి బుద్ధి భ్రంశము అయిపోయింది. అతడు వీధులలో అమాయికముగా ఆడుకోనే పిల్లలను మాయచేసి తీసుకొని పోయి, సరయూనదిలో పడతోసి చంపివేస్తున్నాడు. అతనికి అది ఒక వేడుక అయిపోయింది అని పౌరముఖ్యులు చెప్పినారు. సగరచక్రవర్తి ఆ విషయము విచారించినాడు. అశ్వమంజుణ్ణీ, అతని భార్యనూ కట్టుగుడ్డలతో అప్పటికప్పుడు రథము ఎక్కించి అడవులకు పంపించి వేసినాడు. అశ్వమంజుడు జీవముతో తిరిగి అయోధ్యానగరానికి రాకూడదు అని కూడా శాసనము చేసినాడు.

"ఆ అశ్వమంజుడు పాపిష్ఠివాడు అయి అడవులలో ఒక గుద్దలితోనూ, చిన్న గంపతోనూ అన్నిదిక్కులా తిరుగుతూ, కందమూలాలు తవ్వుకొని తింటూ కాలము గడపినాడు. మహాపరాధము చేసినందువల్ల మహాధార్మికుడు అయిన సగరచక్రవర్తి తన జ్యేష్ఠపుత్రుడు అని మన్నించకుండా అశ్వమంజుణ్ణి అడవులకు వెళ్ళకొట్టినాడు.

"అమ్మా! ఈ రాముడు ఏమి అపరాధము చేసినాడు అని దశరథమహారాజు ఇప్పుడు ఇతనిని అడవులకు వెళ్ళకొట్టవలెను? మాకు రాముడిలో ఏ ఒక్క దోషమూ కనిపించటములేదు. రాముడు చంద్రుడివలె నిర్మలుడు. ఓ రాణీ! నిజముగా ఈ రాముడిలో ఏ ఒక్క దోషము అయినా మీకు కనపడ్డట్టయితే చెప్పండి, దశరథమహారాజు ఈతణ్ణి ఇప్పుడే అడవులకు వెళ్ళకొట్టుతాడు. ఏ దోషమూ లేనివాణ్ణి, అందులో పరమధార్మికుడు అయినవాణ్ణి అకారణముగా అడవులకు వెళ్ళకొట్టడము అధర్మము, అపరాధము. అటువంటి అధర్మము దేవేంద్రుడు అంతటి తేజోవంతుణ్ణి అయినా దహించి వేస్తుంది" అని చెప్పినాడు.

సిద్ధార్థుడి మాటలకు దశరథమహారాజు శోకోపహతుడు అయిపోయినాడు. అతిహీన స్వరముతో, "ఓ పాపిష్మరాలా! ఈ సిద్ధార్థమంత్రి చెప్పింది నీకు నచ్చదు. నాకు తెలుసును. నీది కుత్సితబుద్ధి. నీవి కుచేష్టలు. నాకు మేలు ఏదో, నీకు మేలు ఏదో నీకు తెలియదు. నీవు తెలుసుకోలేవు. నీవు సన్మార్గము వదలి పెట్టినావు.

"ఓ కైకా! నేను ఇప్పుడు ఈ రాజ్యాన్ని త్యజించి వేస్తున్నాను. రాముడివెంట వెళ్ళిపోతున్నాను. నీవు భరతమహారాజుతో యథేష్టముగా బహుకాలము ఈ రాజ్యము ఏలుతూ ఉండు" అన్నాడు దశరథమహారాజు.

37

రాముని నిస్సంగత్వము

ప్రధానామాత్యుడు సిద్ధార్థుడు చెప్పింది రాముడు విన్నాడు. అత్యంత వినయముతో దశరథమహారాజును చూచి, "రాజా! నేను భరతుడి కోసము సమస్త భోగభాగ్యాలు వదులుకొని, సర్వసంగపరిత్యాగము చేసి వనవాసము చేయడానికి పోతున్నాను. నేను అక్కడ కందమూలాలు తింటూ కాలము గడపవలెను. నాకు అనుచరులు ఎందుకు? సేనలు ఎందుకు? మదపుటేనుగును దానము ఇచ్చిన తరువాత దాని నడుముకు కట్టే తాడు అట్టిపెట్టుకోవడము ఎందుకు? ఆ తాడుమీద మోజు ఎందుకు? అందువల్ల ప్రయోజనము ఏమిటి? సేనలూ మొదలైనవి అన్నీ భరతుడికే ఉండవలెను. వాడికే తాము ఇవ్వవలెను. మీరు ఇప్పుడు నేను కట్టుకోవడానికి వల్కలాలు తెప్పించవలెను. నేను పద్నాలుగు సంవత్సరాలు వనవాసము చేయవలెను. కనుక, నాకు ఒక గుద్దలీ, ఒక చిన్న గంపా ఇప్పించవలెను" అన్నాడు రాముడు.

అక్కడివారు అందరూ ఏమి అనుకుంటారో అనే సిగ్గు అయినా లేకుండా, కైకేయీదేవి స్వయముగా వారికి ముగ్గురికీ వల్కలాలు తెచ్చింది. రాముణ్ణి ఆ వల్కలాలు కట్టుకోమన్నది. రాముడు తన సన్ననివస్త్రాలు విడిచివేసి ఆ వల్కలాలు

రెండూ కట్టుకొన్నాడు. లక్ష్మణుడున్నూ అక్కడనే, తండ్రి సమక్షములోనే తన అందము అయిన దుస్తులను వదలివేసి ఆ నారబట్టలు కట్టుకొన్నాడు.

సీతాదేవి తాను కట్టుకోవలసిన రెండు వల్కలాలనూ చూచింది. వలను చూచిన లేడివలె భయపడిపోయింది. అంత ముతకవి కట్టుకోవడము ఎట్లాగా అని దిగులు పడ్డది. సిగ్గు పడ్డది. ఆ జనకరాజపుత్రి, ఆ శుభాంగి, ఆ పతివ్రతాధర్మదర్శిని ఆ వల్కలాలు కట్టుకోవడానికి పదేపదే ప్రయత్నము చేసింది. అవి కట్టుకోవడము ఆమెకు చేతకాలేదు. నివ్వెరపోయి నిలుచున్నది. ఒక వల్కాలాన్ని భుజముమీద వేసుకొన్నది. రెండవదాన్ని చేతితో పట్టుకొన్నది. కట్టుకోవడము చేతకానందుకు సిగ్గుపడిపోయి గంధర్వరాజువంటి రాముణ్ణి చూచి కన్నీళ్ళు కారుస్తూ, "నాధా! తాపసాంగనలు ఈ నారచీరలు ఎట్లా కట్టుకొంటారు" అని అడిగింది. అంతట రాముడు ఆమె కట్టుకొన్న తెల్ల పట్టుచీరమీదనే వాటిని కట్టి చూపించబోయినాడు.

అప్పుడు అంతఃపురాంగనలు అందరూ ఘొల్లుమన్నారు. వారు అందరూ కన్నీళ్ళు కారుస్తూ రాముడితో, "ఓ తేజస్వీ! ఈ సీతాదేవిని వనవాసము చేయమని మీ నాయనగారు ఆజ్ఞాపించలేదు. నీవు మీ నాయనగారి ఆజ్ఞను శిరసావహించి ప్రయాణము అయిపోతున్నావు. మంచిదే. అయితే, నీవు ఈ సీతను తీసుకొని వెళ్ళవద్దు. నీవు తిరిగి వచ్చేటంతవరకూ నీకు బదులు ఈ సీతను చూస్తూ మేము బ్రతుకుతాము. నీకు లక్ష్మణుడు తోడుగా వస్తూ ఉన్నాడు. అందువల్ల, సీతను ఇక్కడే ఉంచవలెను. ఈ సీత మంగళస్వరూపిణి. ఆమె తాపసాంగనవలె అరణ్యములో ఉండవలసినదికాదు. నాయనా! నీవు ధర్మనిత్యుడవు. మేము ఎంత చెప్పినా నీవు ఇక్కడ ఉండవు. కనుక, ఈ సీతను ఇక్కడనే మా దగ్గరనే ఉంచిపో, మేము నిన్ను యాచిస్తున్నాము" అన్నారు.

ఈ మాటలకు కైకేయీదేవి చూస్తూ ఊరకున్నది. రాముడు అంతఃపురాంగనల మాటలు వింటూనే తనతోపాటు వనవాసానికి వస్తూ ఉన్న సీతాదేవికి ఆ నారచీరలు కట్టుకోవడము చూపించినాడు.

అంతట సీతాదేవి ఆ నారచీరలు కట్టుకోపోతూ ఉంటే రాజగురువు వశిష్ఠ మహర్షి ఆమెతో అవి కట్టుకోవద్దు అని చెప్పి కైకేయీదేవిని చూచి, "ఓ కైకా! నీకు దుర్బుద్ధి పుట్టినది. నీవు సదాచారాన్ని వర్జించినావు. నీవు నీ మర్యాదలను అతిక్రమించినావు. వంశనాశనానికి పూనుకున్నావు. ఈ దశరథమహారాజును మోసము చేసినావు. ఇంకా నీకు తనివి తీరలేదు. ఇప్పుడు ఈ సీతను వంచన చేస్తున్నావు. ఈమె రాణి. ఈమె అడవికి పో నవసరములేదు. ఇప్పుడు రాముడి కోసము సిద్ధము చేసిన సింహాసనము ఈమె అధిష్ఠించవలెను. గృహస్థులకు అందరికీ భార్య

ఆత్మస్వరూపము. ఇది వేదవాక్యము. ఈ సీతాదేవి రాముడి ఆత్మస్వరూపము. రాముడు లేనప్పుడు రాముడి రాజ్యము ఈమె ఏలవలెను.

"ఓ కైకా! ఈమె నీ కోడలు. ఈమె నారచీరలు కట్టుకోవలసిన ఆమె కాదు. నీవు ఈమెకు మంచిమంచి చీరలూ, శ్రేష్ఠములు అయిన ఆభరణాలూ ఇవ్వవలెను. నీవు ఈమెను నారచీరలు కట్టుకోనీయ కూడదు.

"ఓ దేవీ! భరతుడు దశరథమహారాజు పుత్రుడే అయినట్లయితే, ఈయన మనఃపూర్వకముగా ఈయని రాజ్యము ఒల్లడు. రాజ్యము ఏలడు. అంతేకాదు, నిన్ను తన తల్లిగా మన్నించడు. నీవు ఆకాశానికి ఎగిరినా భరతుడు తన వంశ క్రమానుగతము అయిన సద్ధర్మాన్ని చెడకొట్టడు. నీ పుత్రవాత్సల్యము నీ కొమారుడికి కీడే అవుతుంది. నీకు తెలియదు. రాముడు అరణ్యవాసము చేస్తున్నాడు అంటే, నీ కుమారుడు భరతుడున్ను వల్కలాజినధారి అయి శత్రుఘ్నుణ్ణి వెంటతీసుకొని రాముడి దగ్గరకే పోయి వనవాసము చేస్తాడు. రాముణ్ణే అనుసరించుకొని ఉంటాడు.

"కైకా! నీవు రాముణ్ణి ఒక్కడినే వనవాసము చేయించమని కోరినావు. కాని ఈ సీతాదేవిని కూడా వనవాసము చేయించమని దశరథమహారాజును కోరలేదు. ఈమె - సీతాదేవి భర్తతో వనవాసము చేయడానికే సంకల్పించుకున్నట్లయితే రాముడివలె ఈమె వల్కలాలు ధరించ నవసరములేదు. ఈమె ప్రతిదినమూ ఆభరణాలు అన్నీ పెట్టుకొని, అలంకారాలు అన్నీ చేసుకొని రాముడితో ఉండవచ్చును. ఈ జనక రాజపుత్రివెంట ఈమె వాహనాలూ, పరిచారికలూ కూడా పోయి ఉండవచ్చును. ఈమె తన సమస్త వస్తువులూ వెంట తీసుకొని పోవచ్చును" అన్నాడు.

ఆ బ్రాహ్మణోత్తముడు, ఆ అప్రతిమానప్రభావుడు, దశరథమహారాజు కులగురువు వశిష్ఠమహర్షి ఇంత చెప్పినా కైకేయీదేవి చలించలేదు. సీతాదేవి మనస్సున్నూ మారలేదు. ఆమె భర్తకు అనురూపము అయిన వేషముతోనే వనవాసానికి పోవలెను అనుకొన్నది.

38

సీతాదేవి నారచీరలు కట్టుకొన్నది. అక్కడ ఉన్నవారు అందరూ దశరథమహారాజును చూస్తూ, "ఛీ! ఛీ" అన్నారు. ఆయన దుఃఖాక్రాంతుడు అయిపోయినాడు. బ్రతుకుమీదనూ, ధర్మముమీదనూ, కీర్తిమీదనూ ఆయనకు అసహ్యము వేసింది. వేడివేడి నిట్టూర్పులు విడుస్తూ, "ఓ కైకా! ఈ సీత నారచీరలు కట్టుకోవలసిన అవసరములేదు. ఈమె సుకుమారి. బాల. ఈమె ఎప్పుడూ సుఖమే అనుభవించవలె. వనవాసము చేయవలసిందికాదు అంటూ కులగురువులు వశిస్టులవారు చెప్పినారు. అది యథార్థము. ఈ జనకరాజసుత, ఈ పాతివ్రత్య

తపోయుక్త వల్కలాలు ధరించి ఇంతమంది సమక్షములోనూ మైమరచిన శ్రమణికి మల్లే నిలుచున్నది. ఈమె ఎవరికి ఏమి అపకారము చేసింది? ఓ కైకా! ఈ సీత నారచీరలు కట్టుకొని రాముడితో అడవికి పోవలెను అని నేను ఇదివరకు నీకు వరము ఇవ్వలేదు. ఈమె కట్టుకొన్న వల్కలాలు ఇప్పుడే విడిచివేయవలెను. ఈమె తన పెనిమిటితో వనవాసము చేయడానికే నిశ్చయించుకున్నట్లయితే, సమస్త రత్నాభరణాలూ పెట్టుకొని సుఖముగా పోవలెను.

"ఓ కైకా! నాకు చావు దగ్గరకు వచ్చింది. అందువల్లనే, నీవు అడుగగానే నీ కోర్కెలు చెల్లిస్తాను అంటూ ఘోరముగా శపథము చేసినాను. నీవు నీ బాలిశత్వమువల్ల రాముణ్ణి అడవులకు వెళ్ళకొట్టమనీ, భరతుడికి పట్టము కట్టమ్మనీ కోరినావు. వెదురుకు వేసే పువ్వే వెదురును దహించి వేస్తుంది. అదేవిధముగా, నేను చేసిన శపథమే నన్ను దహించి వేస్తుంది.

"ఓ పాపీ! ఒక వేళ రాముడు నిన్ను ఏ కొంచెము అయినా కష్టపెట్టినాడేమో, ఈ వైదేహి నిన్ను ఏమి కష్టపెట్టింది? ఏమి అపచారము చేసింది? ఈ హరిణాక్షి, ఈ ముద్దరాలు, ఈ మృదుశీల, ఈ పాతివ్రత్యతపోయుక్త, ఈ జనకరాజపుత్రి ఇకముందు నీకు ఏమి అపకారము చేస్తుంది? ఓ పాపీ! రాముణ్ణి అరణ్యవాసానికి పంపించే పాపము చాలదా? ఇంకా ఎందుకు పాతకాలకు ఒడికట్టుతావు? నీకు ఏమి లాభము? ఓ కైకా! తనకు యువరాజ్యాభిషేకము అవుతుంది అనుకొంటూ వచ్చిన రాముడికి నీవు చెప్పింది అంతా విన్నాను. నేను తల ఒగ్గినాను. నీవు ఇప్పుడు ఆ కోరికను అతిక్రమించి పోయినావు. ఈ సీతకూడా నారచీరలు కట్టుకొని వనవాసానికి పోతూ ఉంటే చూడవలెను అని ఇప్పుడు నీకు బుద్ధి పుట్టింది. సీతచేత నారచీరలు కట్టించినావు. నీవు ఘోరనరకాన పడుతావు" అన్నాడు ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు.

ఆయనకు ఏడ్పు వచ్చింది. కన్నీళ్ళు కార్చినాడు. కైకేయీదేవి మనస్సు కరగలేదు. ఆయన దుఃఖానికి అంతము కనపడలేదు. నేలవంక చూస్తూ తలవంచుకొని కూర్చున్నాడు.

రాముడు ప్రయాణసన్నద్ధుడు అయి, "దేవా! తాము పరమధార్మికులు. ఈ యశస్విని మా అమ్మ కౌసల్యాదేవి ఉత్తమశీల, వృద్ధు. తాము నన్ను అడవులకు పొమ్మన్నా, తమను ఈమె నిందించడము లేదు. నేను వెళ్ళిపోగానే ఈమె శోకసాగరములో పడుతుంది. ఇటువంటి దుఃఖము ఈమె ఇదివరకు ఎన్నడూ ఎరుగదు. ఈమెను మీరు కనిపెట్టవలెను. కనికరించవలెను. ఈమె పుత్రశోకముతో కుంగిపోకుండా మీరు ఈమెను ఆదరించవలెను. నన్ను తలచుకొంటూ ఈమె మీ ప్రాపున బ్రతుకుతుంది. నేను కనపడకపోతే ఈమె దుఃఖముతో కృశించి పోతుంది.

ఈమె పుత్రప్రేమ అటువంటిది. నాకోసము ఈమె ప్రాణము విడువకుండా మీరు కాపాడవలెను. ఓ వరదా! తాము దేవేంద్రుడు అంతటివారు. కోరిన కోరికలు ఇస్తారు. నాకు ఇంతకన్నా ఏ కోరికా లేదు" అన్నాడు.

39

రాముడు చెప్పింది దశరథమహారాజూ, ఆయన భార్యలూ విన్నారు. ఆ మాటలకు ఆయన భార్యలు మూర్ఛపోయినారు. మునివేషములో ఉన్న రాముణ్ణి దశరథమహారాజు చూచినాడు. కళ్ళు అన్నీ నీళ్లు కమ్ముకొనిపోయినవి. తేరిపార చూడలేక పోయినాడు. తల వంచుకొన్నాడు. మాట్లాడలేక పోయినాడు. ఒక కొంచెము నేపు మైమరచి పోయినవాడి వలెను కూర్చున్నాడు. రాముణ్ణి గురించే ఆలోచిస్తూ "నేను పూర్వజన్మలో ఆవుల దగ్గరనుంచి దూడలను ఎడపాటుచేసి ఉంటాను. లేదా తల్లిదండ్రులనుంచి బిడ్డలను అయినా ఎడబాటుచేసి ఉంటాను. కాకపోతే, చిన్నవాండ్లను హింసపెట్టి అయినా ఉంటాను. అందువల్ల, నాకు ఇప్పుడు ఇట్లా సంభవించింది. నన్ను కైకేయి ఇంత క్లేశపెట్టుతూ ఉన్నా నేను చావకుండా ఉన్నాను. ఇంతకూ అవసాన కాలము ఆసన్నము కానిదే ఈ బొందిలోనుంచి ప్రాణము పోదు. నా జ్యేష్ఠపుత్రుడు అగ్నిహోత్రుడివంటి తేజోవంతుడు కట్టుకొన్న సన్నబట్టలు వదలిపెట్టి వల్కలాలు కట్టుకొని నా ఎట్టఎదుట నిలుచుంటే, నేను చావకుండా చూస్తూ ఊరుకోవలసి వచ్చింది. తన స్వార్థము కోసము నన్ను ఒక్కణ్ణి వంచన చేసిన ఒక్క కైకేయినుంచి ఇంతమంది జనము, ఇంత దుఃఖము అనుభవించవలసి వచ్చింది" అంటూ, దశరథమహారాజు విలపించినాడు. ఆయన దేహము కంపించిపోయింది. 'రామా' అన్నాడు. ఆ పయిన ఆయననోట మాట పెగలలేదు. నిశ్చేష్టుడు అయినాడు. కొంతసేపటికి సుమంత్రుణ్ణి చూచి కన్నీళ్ళు కారుస్తూ, "ఓ మంత్రిపుంగవా! విలాసార్థము ఎక్కిపోయే రథాన్ని ఒక దానిని సిద్ధము చేయించి తీసుకొని రావలెను. నీవే ఈ మహాభాగుణ్ణి ఆ రథముమీద ఎక్కించుకొని పోయి జనపదాలకు అవతల వదలిపెట్టి రావలెను. ఓ సుమంత్రుడా! ఇప్పుడు తల్లిదండ్రులు తమ పుత్రుణ్ణి, సత్పురుషుడు అని పేరెన్నికగన్నవాణ్ణి, అందులో శౌర్యవంతుణ్ణి అడవులకు వెళ్లకొట్టుతున్నారు. గుణవంతుల సద్గుణాలకు ఇది ఫలము కాబోలు" అన్నాడు.

సుమంత్రుడు రాజాజ్ఞను శిరసావహించి వెంటనే వెళ్ళిపోయి సువర్ణ రత్నభూషితము అయిన రథాన్ని అలంకరించి, ఉత్తమాశ్వాలను కట్టించి అక్కడికి తీసుకొని వచ్చినాడు.

అంతట దశరథమహారాజు తన ధనాధ్యక్షుణ్ణి అక్కడికి రావించినాడు. అతడు పరిశుద్ధుడు, దేశకాలజ్ఞుడు, ఆ యా కాలోచిత వస్తువిషయనిశ్చయజ్ఞుడు. "సీతాదేవి

వనవాసముచేసే పధ్నాలుగు సంవత్సరాలకూ సరిపోయేట్టుగా లెక్కవేసి మంచి మంచి చీరలూ, శ్రేష్ఠములు అయిన రత్నాభరణాలూ ఇవ్వలసింది" అని అతడికి దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు. ఆ ధనాధ్యక్షుడు వెంటనే కోశగృహమునుంచి ఆ యా వస్త్రాభరణాలు అన్నీ తెప్పించి సీతాదేవికి ఇచ్చినాడు. సీత సుజాత. ఆమె అవయవాలు అన్నీ అంతకన్నా సుజాతాలు. ఆ అవయవాలకు తగినట్టుగా ఆమె ఆ చిత్రవిచిత్రములు అయిన సువర్ణమణిభూషణాలను పెట్టుకొన్నది. అప్పుడు ఆ భవనములో ఆమె ఆభరణద్యుతులు ఆకాశములో బాలభాస్కరప్రభవలె విరాజిల్లినవి.

కౌసల్యాదేవి అప్పుడు మైథిలిని రెండు చేతులా కౌగలించుకొని శిరము ఆఘ్రాణించి, "సీతా! ఈ లోకములో ఆడవాండ్లు సామాన్యముగా తాము కోరేవాటిని అన్నిటినీ సమకూర్చి సంతోషపెట్టేంతవరకే, తమ భర్తలను గౌరవిస్తారు. ఆ భర్తలకు కష్టకాలము వస్తే, ఆ ఆడవాండ్లు వాండ్లను ఏ మాత్రమూ లెక్కచేయరు. సుఖము అనుభవించేటంతకాలమూ వాండ్లు మంచివాండ్లుగా ఉంటారు. కాని వాండ్ల భర్తలకు ఏ కొంచెము ఆపద వచ్చినా, ఏ కొంచెము దారిద్ర్యము వచ్చినా వాండ్లకు దుష్టబుద్ధులు పుట్టుతవి. భర్తలను వదలివేయవలెను అనుకొంటారు. సామాన్యస్త్రీలు వాండ్ల మగవాండ్లతో ఎప్పుడూ అబద్ధాలు ఆడుతారు. లేశమాత్రానికి కలహిస్తారు. వాండ్లు పాపసంకల్పులు. దుర్గ్రాహ్యహృదయులు. వాండ్లకు కులగౌరవముతో పని ఉండదు. చేసిన మేలు మరచిపోతారు. లోకమర్యాదలను పాటించరు. విద్య వాండ్లను మార్చదు. అగ్నిసాక్షిగా పెండ్లిచేసుకొన్న పెనిమిటి అనే గౌరవము వాండ్ల మగవాండ్ల మీద వాండ్లకు ఉండదు. వాండ్ల చిత్తాలు క్షణక్షణానికీ చలిస్తూ ఉంటవి. వాండ్లు వికృతముగా ప్రవర్తిస్తారు. వాండ్లను ఎవరూ నమ్మడానికి వీలుపడదు.

ఇటువంటి సామాన్యస్త్రీలే కాకుండా, పతివ్రతలు అయినవాండ్లు కొందరు ఈ లోకములో ఉన్నారు. ఆ పతివ్రతలు ఇట్లా ప్రవర్తించరు. వాండ్లు సత్యము తప్పరు. సదాచారము మానివేయరు. గురుజనులను ధిక్కరించరు. వాండ్లకు పెనిమిటి ఒక్కడే పరమపవిత్రుడు. వాడే అందరికన్నా అధికుడు. వాడే వాండ్లకు గతి. వాడే వాండ్లకు దేవుడు. తల్లీ సీతా! నా కొడుకు దరిద్రుడు అయినా, ధనవంతుడు అయినా నీకు పెనిమిటి. అడవులకు వెళ్లకొట్టినారు అని నీవు వాణ్ణి అలక్ష్యము చేయవద్దు. వాడు నీ పెనిమిటికాబట్టి నీకు వాడే దేవుడు. నీవు ఎప్పుడూ వాణ్ణి అనుసరించుకొని ఉండవలెను" అని చెప్పింది.

ఇట్లా ధర్మిష్ఠముగా చెప్పిన కౌసల్యాదేవి ఎట్టఎదుట నిలుచొని ఉన్న సీతాదేవి చేతులు జోడించి, "ఓ పూజ్యురాలా! మీరు ఆజ్ఞాపించినట్లే నేను నడుచుకొంటున్నాను.

నన్ను మీరు సామాన్యస్త్రీలకింద లెక్కవేయవద్దు. పెనిమిటి విషయములో నేను ఎట్లా ప్రవర్తించవలసిందీ మా అమ్మా, మా నాయనగారూ నాకు ఎంతో బోధ చేసినారు. చంద్రుణ్ణి వెన్నెల ఎన్నడూ వదలిపెట్టదు. అట్లాగే, నేను ధర్మాన్ని వదలిపెట్టను. నా భర్త ఎక్కడ ఉంటే నేనూ అక్కడనే ఉంటాను. తీగెలులేని వీణ మోగదు. చక్రాలులేని రథము నడవదు. అట్లాగే, నూరుమంది కొడుకులు ఉన్నా పెనిమిటివెంట ఉండని స్త్రీ సుఖపడదు. ఏ స్త్రీకి అయినా తల్లితండ్రులు ఏది అయినా మితముగానే ఇస్తారు. కొడుకు అయినా మితముగానే ఇస్తాడు. ఒక్క పెనిమిటి మాత్రమే ఆడుదానికి అన్నీ అమితముగా ఇస్తాడు. అందువల్ల, పెనిమిటిని పూజించకుండా ఉండడము ఎట్లాగు? నేను పతివ్రతను. మహాపతివ్రతలు అయినవారివల్ల ఆ యా ధర్మాలు అన్నీ విన్నాను, నేను నా పెనిమిటిని ఎప్పుడూ అలక్ష్యము చేయను. నాకు ఆయనే దేవుడు" అన్నది.

సీతాదేవి ఇంత మనోహరముగా చెప్పినందుకు కౌసల్యాదేవికి సంతోషము వేసింది. దుఃఖము వచ్చింది. ఆమె కన్నీళ్ళు కార్చింది.

తల్లుల అందరిలోనూ పూజ్యురాలు అయిన తన తల్లి కౌసల్యాదేవికి రాముడు నమస్కార పురస్సరముగా ప్రదక్షిణము చేసినాడు. అంతట ఆ పరమధార్మికుడు, "అమ్మా! నీవు దుఃఖపడవద్దు. నాయనగారిని కనిపెట్టుకొని ఉండు. నా వనవాసము ఇట్టే గడచిపోతుంది. నీవు కళ్ళుమూసుకొని నిద్రపో. పధ్నాలుగు ఏండ్లూ నీకు తెలియకుండా ఇట్టే గడచిపోతవి. నీవు కన్నులు తెరచిచూడగానే, నేను నా స్నేహితులు అందరితోను నీకు కనపడతాను" అని చెప్పి, తక్కిన మున్నూటయాభైమంది తల్లుల కున్నూ నమస్కారము చేసి, "ఓ తల్లులారా! చిరవరిచయమువల్లకానీ, అజ్ఞానమువల్లకానీ నేను మీకు ఏ కొంచెము అపచారమయినా చేసి ఉంటే, నన్ను మీరు అందరూ క్షమించవలెను. ఇప్పుడు నేను మిమ్ములను అందరినీ వదలిపెట్టి పోతున్నాను" అన్నాడు.

వారు అందరూ శోకోపహతచిత్తులు అయి క్రొంచపిట్టలవలె ఎలుగెత్తి ఏడువసాగినారు. మృదంగాలూ, ఉడుకలూ మేఘాలూ మొదలు అయిన జంత్రవాద్యాలు ఎప్పుడూ మ్రోగే దశరథమహారాజు భవనములోనుంచి అప్పుడు ఆపదలపాలు అయిపోయిన స్త్రీల పరిదేవనాలూ, విలాపాలూ ఘోరముగా వినిపించినవి.

40

దశరథమహారాజుకు సీతారాములూ, లక్ష్మణుడూ చేతులు జోడించి పాదాభివందనము చేసినారు. ముగ్గురూ దీనవదనాలతో ఆయనకు ప్రదక్షిణము చేసినారు. తనతోపాటు వనవాసము చేయడానికి రాముడు సీతాదేవికీ, లక్ష్మణునికీ

ఆయనచేత అనుజ్ఞ ఇప్పించినాడు. దుఃఖపడుతూ ఉన్న తన తల్లిని చూచినాడు. శోకసమ్మూఢుడు అయిపోయినాడు. ఆమెకు భార్యాసహితముగా శిరసా నమస్కారము చేసినాడు.

లక్ష్మణుడు కౌసల్యాదేవికి నమస్కారము చేసి, తన తల్లి సుమిత్రాదేవివంక చూచినాడు. ఆమె దుఃఖము అణచుకోలేక పోయింది. ఆవురు మన్నది. తన పాదాలు అంటి నమస్కారము చేస్తూ ఉన్న తన పుత్రుడు లక్ష్మణుణ్ణి రెండు చేతులా లేవనెత్తింది. అతని శిరము ఆఘ్రాణించి, "నాయనా! లోకసంరక్షణార్థము కౌసల్యాదేవి రాముణ్ణి కన్నది. ఆ రాముణ్ణి నిరంతరమూ కనిపెట్టుకొని ఉండి వాడికి సేవచేయడానికి, నేను నిన్ను కన్నాను. కనుక నీవు ఎప్పుడూ ఏమరుపాటు లేకుండా వాణ్ణి కనిపెట్టుకొని ఉండు. వాణ్ణి ఒక్కణ్ణే కాదు, సీతారాములను కనిపెట్టుకొని ఉండు. ఈనాడు రాజ్యభారమువల్ల వ్యసవి అయినా, రేపు రాజ్యప్రాప్తివల్ల సమృద్ధుడు అయినా రాముడే నీకు దిక్కు. కనిష్ఠునికి జ్యేష్ఠానువర్తనము లోకధర్మము. అందులో, మీ ఇక్ష్వాకు వంశములో జ్యేష్ఠుడి కోసము కనిష్ఠుడు దానధర్మాలు చేయడమూ, యజ్ఞదీక్ష వహించడమూ, రణరంగములో తనుత్యాగము చేయడమూ అనూచానముగా వస్తూ ఉన్న ఆచారము. నాయనా! నీవు రాముడితో హాయిగా అడవికి పో. రాముడే నీకు తండ్రి అనుకో. ఈ సీతాదేవే నీ తల్లి అనుకో. అడవే అయోధ్యా పట్టణము అనుకో. సీతారాములతో సుఖముగా ఉండు. సంతోషముగా వాండ్లతో ప్రయాణము అయిపో" అని చెప్పింది.

వనవాస ప్రయాణము

అప్పుడు సుమంత్రుడు రాముణ్ణి చూచి చేతులు జోడించి, మాతలి దేవేంద్రుడికి చెప్పేటట్టు, "మహాయశా! రథము సిద్ధముగా ఉంది. తమకు శుభము అవుతుంది. తాము రథము ఎక్కవలెను. తాము కోరే చోటుకు రథము తోలుకొని పోవడానికి సిద్ధముగా ఉన్నాను. తాము ఈనాడే ప్రయాణము అయిపోవలెను అని కైకేయీదేవి చెప్పింది. తాము ఇప్పుడే బయలుదేరేటట్లయితే తమ పద్నాలుగు సంవత్సరాల వనవాసానికి ఇదే మొదటి దినము అవుతుంది" అని చెప్పినాడు. సర్వాలంకారాలతో శోభిస్తూ ఉన్న వరారోహ సీతాదేవి అప్పుడు అరుణోదయ సూర్యుడివలెనూ, జ్వలితాగ్ని హోత్రమువలెనూ ధగధగలాడుతూ ఉన్న ఆ బంగారు రథము ఎక్కింది. ఆమె తరువాత రామలక్ష్మణులు ఆ రథము ఎక్కినారు. సీతాదేవికి వనవాసానికి సరిపోయేటట్టుగా వస్త్రాభరణాలు ఇప్పించినట్టే, దశరథ మహారాజు రామలక్ష్మణులకు వివిధాయుధాలూ, కవచాలూ, చర్మమువేసి కుట్టిన గంపలూ, గుద్దళ్ళూ ఇప్పించినాడు. సుమంత్రుడు వాటిని అన్నిటినీ ఆ

రథమధ్యభాగములో పెట్టించినాడు. సీతారామలక్ష్మణులు సర్దుకొని కూర్చుండగానే, సుమంత్రుడు గుర్రాల పగ్గాలు సళ్ళించి అదలించినాడు. రథము కదిలింది.

అప్పుడు అయోధ్యానగరము అంతా సంచలించి పోయింది. అభిషేకము చూడవచ్చిన వివిధజనపదప్రేక్షకులు నిర్ఘాంతపోయినారు. పౌరులకు ఏమి చేయడానికీ తోచక నిశ్చేష్టులు అయిపోయినారు. సైనికులు కలవరపడిపోయినారు. ఏనుగులు కోపముతో ఘీంకారము చేసినవి. గుర్రాలు కాలికట్టుత్రాళ్ళు తెంపుకొని కాళ్ళగజ్జెళ్ళ చప్పుళ్ళతోనూ, గిట్టల మోతలతోనూ పట్టణము అంతటా పరుగులు ఎత్తినవి. పెద్దలు, పిన్నలు, వృద్ధులు ఎండాకాలములో దప్పిక అయినవాండ్లు మంచినీటికోసము జలాశయమువైపు పరుగులు ఎత్తేట్లుగా, రాముడి రథమువెంటపడ్డారు. ఆ రథము ఇరుప్రక్కలకు కొంతమందీ, ఆ రథము ముందు ప్రక్కకు మరికొంతమందీ పోయినారు. ఇంకా కొంతమంది ఆ రథము వెనుకకు మూగినారు. అందరూ తలలు పైకి ఎత్తి చూచినారు. వారికి అందరికీ రాముడు చక్కగా కనిపించలేదు. అప్పుడు అందరూ నిట్టూర్పులు విడుస్తూ, కన్నీళ్ళుకారుస్తూ, "ఓ సుమంత్రుడా! గుర్రాల పగ్గాలు లాగిపట్టుకో. రథాన్ని మెల్లగా పోనివ్వు. మేము రాముణ్ణి కండ్లారా చూడవలెను. ఇప్పుడు తప్పితే మళ్ళీ ఇంకా ఎన్నాళ్ళకు ఆ మహానుభావుడి ముఖారవిందము చూస్తామో" అంటూ కేకలు వేసినారు.

అప్పుడు అక్కడ మూగిన జనులు కొందరు, "అయ్యో! దేవకుమారుడి వంటి కుమారుడు రాముడు అడవులపాలు అయిపోతూ ఉంటే, కౌసల్యాదేవి గుండె బ్రద్దలు అయిపోలేదు. ఆమెది ఇనుపగుండె అయి ఉండవలెను. సందేహము లేదు" అని అన్నారు.

"సీతాదేవి ఎంత దొడ్డది! ఆమె ధర్మపరాయణ. మేరుపర్వతాన్ని సూర్యకాంతులు ఎన్నడూ ఎడబాయనట్లు, రాముణ్ణి ఆమె వదలిపెట్టకుండా ఉంది. రాముడితో రాముడి నీడవలె వనవాసానికి పోతున్నది" అని కొందరు అన్నారు.

"ఓ లక్ష్మణా! నీవు దేవసమానుడు అయిన నీ జ్యేష్ఠ భ్రాతకు నిరంతరమూ సేవచేయవలెను అనుకొన్నావు. కృతకృత్యుడవు అయినావు. ఇదే నీకు స్వర్గద్వారము" అని అంటూ, అందరూ దుఃఖము పట్టలేక కన్నీళ్ళు కార్చినారు.

రాజమందిరంలో అంతఃపురాంగనలు అందరూ దశరథమహారాజు చుట్టూ మూగి బిగ్గరగా ఏడువసాగినారు. అంతట ఆయన దుఃఖము పట్టలేక, "నేను రాముణ్ణి చూడవలెను" అంటూ, బయటకు వచ్చినాడు. వేటకాండ్లు కట్టివేసిన పోతుటేనుగును చూచి పెంటిఏనుగులు గీపెట్టి ఏడ్చేటట్టు, ధర్మపాశబద్ధుడు అయిన

రాముణ్ణి చూచి పురస్త్రీలు అందరూ బొబ్బలుపెట్టి ఏడవడము చూచినాడు. ఆ శ్రీమంతుడు అప్పుడు రాహువు పట్టిన చంద్రుడివలె తేజోహీనుడు అయిపోయినాడు.

ఇంతింత అని చెప్ప నలవికాని ధైర్యవంతుడు రాముడు అప్పుడు తన రథము చుట్టూ జనసమూహాలు మూగుతూ పరుగెత్తుకొని వస్తూ ఉంటే, గుర్రాలను వేగముగా పోయేటట్టు తోలమని సుమంత్రునితో చెప్పినాడు. ఆ జనులు అందరూ రథాన్ని ఆపమంటూ కేకలువేయ సాగినారు. అందువల్ల, సుమంత్రుడు ఆ రథాన్ని వేగముగా తోలలేక పోయినాడు. ఆపలేక పోయినాడు. ఆ రథాన్ని మందముగా పోనిచ్చాడు.

రథచక్రాలకు రేగిన దుమ్ము అంతా ఆ మహాజనసమూహము కార్చిన కన్నీళ్ళకు పైకి లేవకుండా అణగిపోయింది. నీళ్ళలో చేపలు కదిలితే కమలాలలో నుంచి నీళ్ళు కారినట్టు, అక్కడ చేరిన స్త్రీల నేత్రకమలాలలోనుంచి కన్నీళ్ళు కారసాగినవి. ఆ విధముగా జనసమూహము హాహాకారాలతో రోదనము చేస్తూ రాముడి రథము వెంట పడడము దశరథమహారాజు చూచినాడు. మొదలు అంటనరికిన చెట్టువలె నేలకూలినాడు. అట్లా నేలకూలిన మహారాజును జనసమూహం చూచింది. 'హా రామా!' అంటూ కొందరూ, 'అయ్యో కౌసల్యా' అంటూ కొందరూ కేకలు వేసినారు. అందరూ ఘొల్లుమన్నారు. అంతఃపురాంగనలు అందరూ ఘోరముగా రోదనము చేయడము మొదలు పెట్టినారు. ఆ రోదన ధ్వనులు మిన్ను అంటినవి.

అప్పుడు రాముడు వెనుకకు చూచినాడు. దశరథమహారాజూ, కౌసల్యాదేవీ తన రథమువెంట పరుగెత్తుకొని రావడము చూచినాడు. అతని మనస్సు కదలిపోయింది. ధర్మపాశబద్ధుడు అయి ఉన్నాడు. కట్టివేసిన గుర్రపుపిల్ల తల్లిని చూచినట్టు, ఓరచూపులతో తల్లినీ, తండ్రినీ చూచినాడు. ఎప్పుడూ ఎంతో సంతోషమూ సుఖమూ అనుభవిస్తూ ఎక్కడికి అయినా వాహనాలలో పోయే తన తల్లీ, తండ్రీ అట్లా రథమువెంట పరుగెత్తడము సహించలేక పోయినాడు. బరిగోలతో పొడిచిన ఏనుగువలె బాధపడ్డాడు. రథాన్ని బాగా వేగముగా తోలమని సుమంత్రుణ్ణి ఆజ్ఞాపించినాడు. వెంటనున్న దూడ కనపడకపోతే ఆవు కొట్టమువైపు పరుగెత్తుకొని వచ్చేటట్టు, కౌసల్యాదేవి రాముడి రథమువైపు పరుగు తీసింది. "ఓ రామా! ఓ సీతా! ఓ లక్ష్మణా!" అంటూ కేకలు పెట్టింది. పరుగెత్తుతూ శివము ఎత్తినట్టు చిందులు తొక్కడము మొదలు పెట్టింది. అప్పుడు దశరథమహారాజు రథము ఆపమని గొంతెత్తి పెద్దపెట్టున కేకవేసినాడు.

"సుమంత్రుడా! గుర్రాలు వాయువేగముతో పోయేటట్టు తోలవలెను" అని రాముడు గట్టిగా చెప్పినాడు. సుమంత్రుడికి ఏమీ తోచలేదు. దశరథమహారాజు ఆజ్ఞను శిరసావహించడమా, రామాజ్ఞను నెరవేర్చడమా అనే జిజ్ఞాసలో పడ్డాడు. అతని పని రథచక్రాలమధ్య పడ్డట్టు అయిపోయింది. రాముడు అది కనిపెట్టి, "ఓ

మంత్రిపుంగవా! నా తల్లిదండ్రుల దీనావస్థను చూచి నేను సహించ లేకుండా ఉన్నాను. రాజు నిన్ను నిందించేటట్లయితే ఆయన కేక వినిపించలేదు అని చెప్పవచ్చును. ఓ అమాత్యశేఖరా! రథాన్ని వేగముగా పోనివ్వు" అన్నాడు. సుమంత్రుడు అప్పుడు రామాజ్ఞను శిరసావహించడమే కర్తవ్యము అనుకొన్నాడు. రథము వేగముగా పోతుంది అని అతడు అందరికీ తెలియచేసినాడు. అప్పుడు అంతఃపురస్త్రీలు ఆ రథానికి ప్రదక్షిణముచేసి నిలుచుండి పోయినారు. పురజనులు వెనుకకు మళ్ళలేదు. వెనుకకు పోవలెను అనే బుద్ధి వారికి మనస్సులోనైనా పుట్టలేదు. అందరూ ఏడువసాగినారు. సుమంత్రుడు గుర్రాలను అదలించినాడు. అవి వాయువేగముతో దౌడు తీసినవి.

అంతట అమాత్యులు దశరథమహారాజుతో, "ప్రభూ! ప్రయాణము అయిపోతున్నవారు తొందరగా తిరిగి రావలెను అనుకొనేటట్లయితే వారిని పంపించడానికి దూరము పోకూడదు" అన్నారు. ఆ సుగుణసంపన్నులు చెప్పిన మాటలు దశరథమహారాజు విన్నాడు. విషణ్ణవదనుడు అయి, ఒండ్లు అంతటా చెమటలు కారుతూ భార్యలు అందరితోనూ ఆ పోతున్న రథమువంక చూస్తూ నిలుచున్నాడు.

41

రాముడు దశరథమహారాజుకూ, కౌసల్యాదేవికీ పాదాభివందనము చేసి, తక్కిన తల్లులకు వీడ్కోలు చెప్పి రథము ఎక్కగానే అంతఃపురాంగనలు అందరూ బావురుమన్నారు.

"అయ్యో! రాముడు ఎక్కడికి పోతున్నాడు? దిక్కులేనివాండ్లకు ఇకను దిక్కు ఎవడు? అశక్తులకు ఇకను అండ ఎవడు? తాపసులను కాపాడేవాడు ఇకను ఎవడు? అందరినీ రక్షించేవాడు ఇకను ఎవడు? అయ్యో! ఎవరు ఏమి అన్నా కోపము రానివాడే, ఎవరి మనస్సూ నొప్పించనివాడే, కోపము వచ్చినవారిని సమాధానపరచేవాడే, ఇతరుల సుఖమే తన సుఖముగా, ఇతరుల దుఃఖమే తన దుఃఖముగా భావించేవాడే, కన్నతల్లి సవతితల్లి అనే భేదము లేకుండా తల్లులు అందరినీ ఒక్కమాదిరిగా పూజించేవాడే ఆ రాముడు, ఆ జగద్రక్షకుడు ఇప్పుడు ఎక్కడికి పోతున్నాడు? కైకేయీదేవి బాధపడలేక రాజు అడవులకు పొమ్మంటే ఎక్కడికి పోతున్నాడు? ఆ మహారాజు ఎంత మతిమాలినవాడు. ప్రాణికోటిని అంతా సంతోషపెట్టేవాణ్ణి, ధర్మము తప్పనివాణ్ణి, సత్యము తప్పనివాణ్ణి రాముణ్ణి అడవులకు వెళ్ళకొట్టుతున్నాడా అంటూ అంతఃపురాంగనలు, దూడలు పోయిన ఆవులవలె బిగ్గరగా కేకలు పెట్టుతూ ఏడువ సాగినారు. పుత్రశోకముతో అసలే కుమిలిపోతూ ఉన్న దశరథమహారాజు అప్పుడు

ఆ ఆర్తాలాపాలు ఆలకిస్తూ అక్కడ ఉండలేక పోయినాడు. రాముణ్ణి చూడవలెను అంటూ బయటికి పోయినాడు.

రామాభిషేకము ఆగిపోయింది అని తెలియగానే, ఆహితాగ్నులు అగ్నిహోత్రాలలో హోమాలు చేయలేదు. గృహస్థులు వంట వండుకోలేదు. పౌరులు ఎవరూ తమ తమ పనులలోనికి పోలేదు. మానవులే కాదు, పశువులు సహితము ఏమీ తోచక నిలుచుండి పోయినవి. ఏనుగులు గ్రాసకబళాలు నోటిలో పెట్టుకోలేదు. ఆవులు దూడలకు పాలు ఇవ్వలేదు. తల్లులు తమ తొలిచూలు బిడ్డలను అయినా దగ్గరకు తీయలేదు. రాముడువంటి కొడుకును కౌసల్యాదేవివంటి తల్లి అడవులకు పోనీయకుండా ఆపలేదే అని, కొడుకులకు తల్లులమీద అపేక్ష అంతరించింది. రాముడి వంటి కొడుకు తల్లి ఎంత చెప్పినా వినకుండా, చివరకు తనతోపాటు వెంటను అయినా తీసుకొని పోకుండా పెళ్ళాన్ని తీసుకొని పోతున్నాడే అని, తల్లులకు కొడుకులమీద మమకారము మాయమయింది. దశరథమహారాజు అంతటి పెద్దవాణ్ణి కైకేయీదేవి అంత చిన్నది ఇట్టే మోసము చేసిందే అని, భర్తలకు భార్యలమీద అనురాగము అడుగంటింది. పట్టమహిషిని - అందులో జ్యేష్ఠపుత్రుడిని కన్న ఇల్లాలిని దశరథమహారాజువంటి ధర్మాత్ముడు కాస్త అయినా కనికరము లేకుండా కష్టాలుపాలు చేసినాడే అని, భార్యలకు భర్తలమీద గౌరవము అంతర్ధానమయింది. అన్నదమ్ముల అన్యోన్యానురాగము అనుమానాస్పదము అయినది.

ఆనాడు సూర్యుడు ఎండకాయడము మానివేసినాడు. రాముడి రథము కదిలింది. సముద్రము పొంగి భయంకరముగా గాలివీస్తూ, ఆకాశము అంతటా దట్టముగా మబ్బులు కమ్ముకొనినట్లు అయిపోయింది. అయోధ్యానగరవాస్తవ్యులు అందరూ శోకసాగరములో పడిపోయినారు. దిక్కులు తెలియకుండా పోయినవి. అందరికీ దుఃఖము తరంగాలు తరంగాలుగా వచ్చింది. అందరూ దశరథమహారాజును గురించి చెప్పుకొంటూ, ఏడుస్తూ రాజవీధిలోకి వచ్చి నిలుచుండి నిశ్చేష్టులు అయినారు. రాముడి మిత్రులు అందరూ మూర్ఛపోయినారు. ఎక్కడివారు అక్కడనే తెప్పరిల్లకుండా పడిపోయినారు. చల్లగాలి వీచడము మానివేసినది.

సూర్యాస్తమయము ఎప్పుడు అయిందో ఎవరికీ తెలియదు. చంద్రుడు గుడ్డిగా వెన్నెల కాయడము మొదలు పెట్టినాడు. ఇక్ష్వాకుల పూర్వీకుడు, నక్షత్రరూపమున ఆకాశములో అగుపించే త్రిశంకువు చంద్రుణ్ణి కలసికొన్నాడు. ఆ చంద్రుడికి అప్పుడు గురు బుధుల సంబంధమూ, కుజాదిక్రూరగ్రహ సంబంధమూ పట్టింది. అశ్విన్యాది తారల తళతళలు ఆగిపోయినవి. సప్తర్షులు కాంతులు మాసిపోయి కనిపించినారు. ఇక్ష్వాకుకులతార అయిన విశాఖాతారకు పొగకమ్ముకొనిపోయింది.

ఇన్నిమాటలు ఎందుకు? దేవేంద్రుడు త్రిలోకాధిపత్యము మానుకోగానే భయంకర ధ్వనులతో ఈ పృథివి అంతా పర్వతాలతో కూడా గజగజలాడి పోయేటట్టు, రాముడు యువరాజ్యాభిషేకము మానుకొని అరణ్యవాసము చేయడానికి రథము ఎక్కగానే ఏనుగుల ఘీంకారముతోనూ, గుర్రాల పరుగులతోనూ, జనసమూహాల ఆర్తనాదాలతోనూ, యోధగణాల భయవిహ్వలధ్వనులతోనూ అయోధ్యానగరము కంపించి పోయినది.

42

దశరథుడు కౌసల్య మందిరమునకు పోవుట

రాముడు ఎక్కిపోతున్న రథచక్రాల ఉరవడికి ఆకాశము అంత ఎత్తున దుమ్ము రేగింది. ఆ రేగిన దుమ్ములంక దశరథమహారాజు కన్నులార్పకుండా చూస్తూ నిలుచున్నాడు. ఆయన చూచినకొద్దీ ఆ దుమ్ము రేగడము ఎక్కువ అయింది. అంతట కొంతసేపటికి ఆ రథ పరాగము ఆగిపోయింది. రథము పోయిన జాడ అయినా తెలియలేదు. అప్పుడు దశరథమహారాజు ఆర్తుడు అయినాడు. చివరకు స్మృతి తప్పి నేలమీద పడిపోయినాడు. ఆయనకు కుడిప్రక్కన ఉన్న కౌసల్యాదేవి వెంటనే ఆయనను లేవనెత్తింది. ఆయన ఎట్లాగో తెప్పరిల్లినాడు. భరతుణ్ణి గురించి ఆలోచిస్తూ ఆయన ఎడమప్రక్కన ఉన్న కైకేయీదేవి అప్పుడు ఆయనను పట్టుకోపోయింది.

ఆ నీతిమంతుడు, ఆ వినయసంపన్నుడు, ఆ ధర్మాత్ముడు దశరథ మహారాజు కైకేయీదేవిని చూచినాడు. ఆమె చిత్తవృత్తిని కనిపెట్టినాడు. ఆయన దేహము కంపరము ఎత్తింది. ఆమెను చూస్తూ, "ఓ దుష్టచారిణీ! నీవు నన్ను తాకవద్దు. నీ ముఖము నేను చూడను. నీవు నా భార్యవు కావు. నీవు చుట్టానివి అయినా కావు. నీ ఆశ్రితులకూ, నాకూ సంబంధము లేదు. వాండ్లు నా భృత్యులు కారు. ఓ కైకా! నీవు కేవల అర్థపరవు. నీవు ధర్మాన్ని త్యజించినావు. నిన్ను నేను త్యజించి వేస్తున్నాను. అగ్నిసాక్షిగా నీ చెయ్యి నేను పట్టుకున్నాను. ఆ అగ్నిహోత్రానికి నీతో నేను ప్రదక్షిణము చేసినాను. అట్లా నీతో నాకు ఏర్పడ్డ ఇహపరసంబంధాలు రెండూ నేను త్యజించి వేస్తున్నాను. ఇకమీద నీతో నాకు ఇహలోకసౌఖ్యాన్ని ఇచ్చే క్రీడాది వ్యవహారాలు ఉండవు. పరలోక సాధనాలు అయిన అగ్నిహోత్రాది కర్మలున్నూ నీతో నేను చేయను.

"ఓ కైకా! నేను ఇక బ్రతుకను. భరతుడు పట్టము కట్టుకొని సంతుష్టుడు అయ్యేటట్లయితే, వాడు నాకు వదిలే జలతర్పణాదులను నేను ముట్టను" అన్నాడు దశరథమహారాజు. దుఃఖముతో కొట్టుకులాడుతున్న కౌసల్యాదేవి ఆయన దేహానికి

అంటుకున్న దుమ్మును అంతా దులిపింది. ఆయనను మెల్లిగా రాజమందిరముపైపు నడిపించింది. ఆయన అడుగులు ముందుకు వేస్తున్నాడేకాని, మాటిమాటికి వెనుకకు తిరిగి రథము పోయిన దారివంకే చూడడము మొదలు పెట్టినాడు. ఆ ధర్మాత్ముడి మనస్సులో తాపసవేషముతో రథము ఎక్కిపోయిన రాముడే కనపడ సాగినాడు. అగ్నిహోత్రము చేతులతో పట్టుకొన్నవాడివలెనూ, కావలెను అని బ్రాహ్మణుణ్ణి చంపినవాడివలెనూ ఆయన బాధపడి పోయినాడు. ఆ తాపము ఆయన భరించలేక పోయినాడు. ఏడవడము మొదలు పెట్టినాడు. రాముడు అయోధ్య పాలిమేర దాటిపోయినాడు అని అప్పుడు వర్తమానము వచ్చింది. రాహువు మింగుతున్న సూర్యుడివలె అయిపోయినాడు. అప్పుడు కౌసల్యాదేవి శోకావేశముతో మూర్ఛపోయింది. పరిచారికలు ఆమెను అక్కడనుంచి తీసుకొని పోయినారు.

దశరథమహారాజు ఏడుస్తూ, "అయ్యో! నాకు ఇప్పుడు కనిపిస్తున్నది అరణ్యమార్గమూ, ఆ మార్గాన రాముణ్ణి తీసికొనిపోయిన గుర్రాల అడుగులూనూ! ఉత్తమాంగనలు చందనచర్చచేసి వింజామరలు వీస్తూ ఉంటే మెత్తని పరుపులమీద అంతకన్నా మెత్తని దిండు పెట్టుకొని పవ్వళించే నా జ్యేష్ఠపుత్రుడు రాముడు, ఈనాడు ఏ చెట్టుకిందనో ఏ కొయ్యో ఏ రాయో తలగడగా పెట్టుకొని పడుకొంటాడు, తప్పదు. ఒండ్లు అంతా దుమ్ము కొట్టుకొని నిట్టూర్పులు విడుస్తూ సెలయేటి దగ్గర బురదలో పడుకొని లేచిపోయే పోతుటేనుగువలె నిద్రలేస్తాడు. నా పుత్రుడు మహాబాహువు, లోకనాథుడు, అనాథుడివలె అడవిలో పోతూ ఉంటే, ఆటవికులు అందరూ చూస్తారు. అయ్యో! జనకమహారాజు అల్లారుముద్దుకూతురు, సుఖముతప్ప ఎన్నడూ ఏ కష్టమూ ఎరుగని నా కోడలు సీత, ఈనాడు దారిలో కాళ్ళకు ముళ్ళు గుచ్చుకొని బాధ పడుతుంది. ఆమె అడవులు ఎన్నడూ ఎరుగదు. క్రూరమృగాల భయంకర గర్జనలకు ఆమె తప్పకుండా భయపడిపోతుంది.

"ఓ కైకా! నీ కోరిక ఈడేరింది. రాముడు లేకుండా నేను బ్రతుకను. ఓ రాజపుత్రీ! ఇక నీవు విధవవు అయి ఈ రాజ్యము ఏలు" అంటూ కంపించి పోయినాడు. కైకేయీదేవి అక్కడనుంచి మెల్లగా తప్పుకొన్నది. పరిజనము అంతా ఆయన చుట్టూ మూగినారు. రాజవీధిలో ఆయన నడువ సాగినాడు. అప్పుడు ఆ రాజవీథి పాడుపడిబోయినట్టుగా ఉంది. చతుష్పథాలలోనూ, గృహద్వారాలలోనూ మనుష్యులే కనిపించలేదు. దేవాలయ ద్వారాలు తెరిచిలేవు. అంగళ్ళు అన్నీ మూసివేసి ఉన్నవి. ఆ రాజవీథిలో దుఃఖార్తులూ, దుర్బలులూ, వృద్ధులూ మాత్రము అక్కడక్కడ కనిపించినారు. శక్తి ఉన్నవారు అందరూ రాముడి రథమువెంటపడి పోయినారు అని తెలుసుకొన్నాడు. రాముణ్ణి గురించి ఆలోచిస్తూ,

రోదిస్తూ సూర్యుడు మబ్బులమాటుకు పోయేటట్టు ఆయన అంతఃపురములోకి పోయినాడు.

దశరథమహారాజు మందముగా అడుగులువేస్తూ మెల్లగా అస్పష్టముగా గద్గదస్వరముతో, "రాముణ్ణి కన్న కౌసల్యాదేవి మందిరానికి నన్ను తీసికొని పోవలసినది. మరి ఒకచోట నా హృదయానికి ఊరట ఉండదు" అన్నాడు. అప్పుడు ద్వారదర్శినులు ఆయనను కౌసల్యాదేవి మందిరానికి తీసుకొని పోయినారు. అక్కడ పక్కమీద పడుకొన్నాడు. అక్కడనూ ఆయనకు మనస్స్వాస్థ్యము లేకపోయింది. సీతారామ లక్ష్మణులు లేని అంతఃపురము చంద్రుడూ, నక్షత్రాలూలేని ఆకాశమువలె ఆయనకు అగుపించింది. ఆ భవనము అట్లా శూన్యముగా తోచేసరికి, అంతటి పరాక్రమవంతుడూ రెండుచేతులతోనూ ముఖము కప్పుకొని, 'అయ్యో రామా! నన్ను వదలిపెట్టి పోయినావా' అంటూ పెద్దపెట్టున అరుస్తూ, "రాముడు తిరిగి వచ్చేవరకూ బ్రతికి ఉండే భాగ్యము నాకు లేదు. వాడు తిరిగివచ్చిన తరువాత వాణ్ణి కౌగలించుకొని సంతోషించే పుణ్యాత్ములు ఎవరో" అంటూ, ఆ పక్కమీద పడిపోయినాడు. సొమ్మసిల్లి నిద్రపోయినాడు.

అర్ధరాత్రము అయింది. దశరథమహారాజుకు మెలకువ వచ్చింది. కాళరాత్రివలె అది భయంకరముగా తోచింది. "ఓ కౌసల్యా! నాకు ఇప్పుడు కళ్ళు కనిపించడము లేదు. నా చూపు రాముడితోనే పోయింది. కన్నులు తెరచినా నాకు ఏమీ కనిపించడము లేదు. నా దేహము తాపము ఎత్తుతూ ఉంది. రాముణ్ణి లాలించిన నీ చేతులతో నన్ను తాకు. నా తాపము ఏమి అయినా తగ్గుతుందేమో" అన్నాడు.

కౌసల్యాదేవి ఆయన దగ్గర కూర్చొని చేతితో నిమురుతూ, నిట్టూర్పులు విడుస్తూ ఘోరముగా ఏడ్చింది.

43

కౌసల్య పుత్రవియోగముతో దుఃఖించుట

పక్కమీద పడుకొని పుత్రశోకముతో కుమిలిపోతూ ఉన్న దశరథ మహారాజుతో కౌసల్యాదేవి, "ఓ రాజా! క్రూరసర్పము విషము వెళ్లకక్కేటట్టు, కైక తన కుటిలత్వము రాముడిమీద వెళ్ళకక్కింది. వాడు అడవిపాలు అయిపోయినాడు. ఇకను కైక కుబుసము విడిచిన పాములవలె హాయిగా ఇష్టము వచ్చినట్టు తిరుగుతుంది. నాకు భయము వేస్తూ ఉంది. ఇంటచేరిన దుష్టసర్పానికి ఇంట్లోవారూ, బయటివారూ కూడా భయపడక తప్పదు.

"నాథా! కైక భరతుడికి రాజ్యము అవశ్యము ఇప్పించవలెను అనుకొన్నది. బాగానే ఉంది. అయితే అది నా కొడుకును అడవిపాలు చేయమని ఎందుకు

కోరింది? పోనీ, అన్నము అయినా పెట్టకుండా రాముణ్ణి భరతుడికి దాస్యము చేయవలెను అని కోరకపోయిందే? అట్లాకోరినా ఎంతో బాగుండేది. వాడు బిచ్చము ఎత్తుకొని తింటూ భరతుడికి దాస్యముచేస్తూ అయినా మన కళ్ళఎదుట ఉండేవాడు. రాజా! పర్వకాలాన దేవతలకు ఇవ్వవలసిన హవిర్భాగాన్ని ఆహితాగ్ని అయినవాడు రాక్షసులకు ఇచ్చినట్టు, మీరు మీ ఇష్టము వచ్చినట్టు రాముణ్ణి వాడి పదవినుంచి పడత్రోసి, రాజ్యభారము కైకకు ఇచ్చివేసినారు. ప్రభూ! వాడు, ఆ పరాక్రమవంతుడు, ఆ ధనుర్ధరుడు సీతనూ, లక్ష్మణుణ్ణీ వెంటపెట్టుకొని గజరాజువలె నడచి ఈపాటికి అడవికి పోయి ఉంటాడు."

"రాజా! తాము కైకమాట పాటించి, వనవాస కష్టాలు ఎన్నడూ ఎరుగని సీతారామలక్ష్మణులను వనవాసము చేయవలసింది అని ఆజ్ఞాపించినారే! అక్కడ వాండ్ల గతి ఏమిటి? సీతారాములు నవయౌవనములో ఉన్నారు. వాండ్లు సమస్త భోగాలూ అనుభవించవలసిన కాలము ఇది. ఇటువంటి సమయములో వాండ్లను మీరు అడవులకు వెళ్ళకొట్టినారు. వాండ్లు అక్కడ దరిద్రులవలె కందమూలాలు తింటూ ఎట్లా బ్రతుకుతారు? పధ్నాలుగు సంవత్సరాల వనవాసమూ అయిపోయి రాముడు సీతనూ, లక్ష్మణుణ్ణీ వెంటబెట్టుకొని ఇప్పుడే ఇక్కడికి వస్తే ఎంత బాగుంటుంది? నా దుఃఖము అంతా అంతరించి పోతుంది. అయ్యో! నాకా అంత భాగ్యము? అటువంటి శుభసమయము ఎంతకాలానికి వస్తుందో! నిద్రపోయినవాండ్లు సుఖముగా లేచి వచ్చినట్టు సీతారామలక్ష్మణులు ఇక్కడికి రావడమూ, ఆ పురుషసింహులను పౌరులు అందరూ చూచి పున్నమనాటి సముద్రమువలె పొంగిపోయి, ఈ అయోధ్యానగరము అంతా అలంకరించి జెండాలు ఎత్తడమూ ఎప్పుడు జరుగుతుందో? గోవువెంట కోడెవలె సీతవెంట రాముడు ఎప్పుడు వస్తాడో? ఆ అరిందములు రాజవీధిలో వస్తూఉంటే వారి మీద ప్రజలు పేలాలు చల్లేది ఎప్పుడో? మొలలో పెద్ద పొడుగాటి కత్తులు వేళ్ళాడుతూ ధనుర్ధరులు అయి, ధగధగ మెరిసే కుండలాలతో పర్వతశిఖరాలవలె ఆ అన్నదమ్ములు ఎప్పుడు వస్తారో? ఆ సీతారామ లక్ష్మణులు బ్రాహ్మణ కన్యలకు పూలూ పండ్లూ పంచిపెట్టుతూ అయోధ్యానగర ప్రదక్షిణము ఎప్పుడు చేస్తారో?

"ఓ రాజా! నేను పూర్వజన్మలో బహుక్రూరముగా ప్రవర్తించి ఉంటాను. పాలు కుడుస్తూ ఉన్న బిడ్డను కండకావరముతో తల్లి దగ్గరనుంచి ఎడబాపి ఉంటాను. నాధా! ఆవు ఎంతో మురిపెంగా చూసుకొంటున్న లేగదూడను సింహము వచ్చి ఎత్తుకొని పోయినట్టు, నా పిల్లవాణ్ణి నా దగ్గర ఉండనీయకుండా కైక బలవంతముగా ఎడబాపింది. ఓ రాజా! నాకు పుట్టిందే ఒక్క పిల్లవాడు. వాడు ఒక్కడూ సకలసద్గుణ

సంపన్నుడూ, సర్వశాస్త్రవిశారదుడూ అయినాడు. దేవతలవలె పాతికేళ్ల వయస్సులో ఉన్నాడు. వాడు జ్ఞానవృద్ధు. వాణ్ణి, అటువంటి నా పిల్లవాణ్ణి వదలిపెట్టి నేను ఎట్లా బ్రతికేది? నా పిల్లవాణ్ణి నేను ఇప్పుడు చూడవలెను. వాణ్ణి చూడకుండా నేను బ్రతుకలేను.

"ఓ రాజా! మీకు తెలియడములేదు. వేసంగిలో ఈ భూమి మండుటెండలకు తాపము ఎత్తిపోయేటట్టు, పుత్రశోకాగ్నికి నా దేహము తాపము ఎత్తిపోతూ ఉంది. ఈ తాపము నేను భరించలేను" అంటూ ఏడ్చింది.

44

సుమిత్ర కౌసల్యను ఓదార్చుట

ఆ భాగ్యశాలిని కౌసల్యాదేవి ఈవిధముగా ఏడుస్తూ ఉంటే, పరమ ధార్మికురాలు అయిన సుమిత్రాదేవి, "ఓ పూజ్యురాలా! ఎందుకు దుఃఖపడతావు? ఎందుకు ఏడుస్తావు? నీ కొమారుడు సమస్తసద్గుణవంతుడు. పురుషోత్తముడు. మహాబలవంతుడు. ఐహిక సుఖము కోసము ఆశ పడలేదు. ఆముష్మిక సౌఖ్యాన్ని ఆపేక్షించినాడు. శిష్టులు అందరూ అనుసరించే ధర్మాన్ని శిరసావహించినాడు. తన తండ్రి సత్యసంధుడు అని ఈ లోకానికి బుజువు చేయవలెను అనుకొన్నాడు. అందుకోసము రాజ్యాన్ని త్యజించినాడు. అడవులకు పోయినాడు. అటువంటి సత్పురుషుడి కోసము నీవు ఎంతమాత్రమూ దుఃఖపడకూడదు.

"ఓ దేవీ! రాముడి కోసమే కాదు, లక్ష్మణుడి కోసమున్నూ నీవూ, నేనూ దుఃఖపడకూడదు. వాడు పాపరహితుడు. సర్వభూతహితుడు. తన జ్యేష్ఠభ్రాతకు సేవ చేయవలెను అనుకొన్నాడు. రాముడితో కూడా అడవికి పోయినాడు. వాడి మంచికోసమే వాడు అట్లా చేసినాడు. కనుక, ఆ అన్నదమ్ముల కోసము మనము దుఃఖపడకూడదు. సీత ఎప్పుడూ సుఖము అనుభవించవలసిందే. అయితే, అది అరణ్యవాసకష్టాలు తెలియక బయలుదేరి పోయింది అనుకోవద్దు. అది పతివ్రత. తన ధర్మాన్ని గుర్తించింది. ధర్మాత్ముడు అయిన నీ కొడుకు దాని పెనిమిటి. అందువల్ల, అది రాముణ్ణి వెంబడించింది. కనుక, దాని కోసమున్నూ నీవు దిగులు పడకూడదు.

"అక్కా! నీ కొడుకు ధర్మమూ, సత్యవ్రతమూ తనకు ధనము అనుకొన్నాడు. అందువల్ల, వాడి కీర్తిపతాకము ఈ ప్రపంచము అంతటా పాదుకొంటుంది. అంతే, వాడు తిరిగి వస్తాడు. ప్రభువు అవుతాడు. రాముడు పరిశుద్ధుడు. మహాత్ముడు. సూర్యుడు వాణ్ణి గుర్తిస్తాడు. తన తీక్ష్ణకిరణాలతో వాడి దేహానికి తాపము ఎత్తకుండా కనిపెట్టి ఉంటాడు. వాయువు వన్యసుగంధముతో ఆ యా కాలాలకు తగినట్టు

సమశీతోష్ణముతో వాడిమీద వీస్తాడు. రాత్రిపూట చంద్రుడు తన చల్లని కిరణాలతో ఆ పుణ్యాత్ముణ్ణి తండ్రివలె కౌగలించుకొని సంతోషపెట్టుతాడు. ఓ దేవీ! రాముడు ఇదివరకు తిమిధ్వజుడి పుత్రుణ్ణి యుద్ధములో సంహారము చేసినప్పుడు, బ్రహ్మదేవుడు మెచ్చుకొని దివ్యాస్త్రాలు ఇచ్చి రాముణ్ణి బహుకరించినాడు. అటువంటి అస్త్రబల సంపన్నుడికి, అటువంటి శూరుడికి అడవిలో భయము ఏమిటి? వాడు వీరవిహారము చేస్తాడు. అడవిలో ఉన్నా స్వగృహములో ఉన్నట్లు సుఖముగా ఉంటాడు. రామ బాణాలకు ఎటువంటివారు అయినా నాశనము అయిపోతారు. వాడి ఆజ్ఞలకు ఈ భూమి అంతా తల ఒగ్గుతుంది. వాడి శౌర్యము అవార్యము. వాడి బలము అమోఘము. వాడి తేజము దుర్నిరీక్ష్యము. వాడు వనవాసము చేసి వస్తాడు. ఆ తరువాత రాజ్యము ఏలుతాడు.

"ఓ దేవీ! రాముడు సూర్యుడికి సూర్యుడు, అగ్నిహోత్రుడికి అగ్నిహోత్రుడు, ప్రభువుకు ప్రభువు, సంపదకు శ్రేష్ఠము అయిన సంపద, కీర్తికి కీర్తి, క్షమకు క్షమ, దేవతలకు దేవత, భూతాలకు పెనుభూతము. వాడితో సరిసమానము అయినవాడు ఈ పట్టణములోనే కాదు, ఈ లోకములో లేడు. అటువంటివాడు, వనవాసానికి పోతున్నాడు అని అయోధ్యా పౌరులు ఈనాడు దుఃఖానికి తాళలేక తల్లడిల్లి పోతున్నారు. వాడు వనవాసము అయిపోగానే అయోధ్యకు వస్తాడు. సీతవలెనే భూదేవి వాణ్ణి ఆశ్రయించుకొని ఉంది. రాజ్యలక్ష్మిన్నీ వాడితోనే ఉంది. వాడు రాజ్యాభిషిక్తుడు అవుతాడు. ఈ దుఃఖపడుతూ ఉన్న పౌరులు అందరూ ఆనాడు సంతోషపడుతారు. వాడు అపరాజితుడు. వల్కలాలు కట్టుకొని దర్భాసనముతో వాడు అడవికి ప్రయాణము అయిపోతూ ఉంటే వాడి పెండ్లాము సీతవలెనే రాజ్యలక్ష్మిన్నీ వాణ్ణి వెంబడించి పోయింది. వాడికి దుర్లభము అనేది ఏమీలేదు. మేటి విలుకాడు లక్ష్మణుడు బాణఖడ్గాద్యాయుధాలతో వాడిముందు నడుస్తూ ఉంటే వాడికి, ఆ పురుషోత్తముడికి ఏమిటి దుర్లభము? ఓ దేవీ! రాముడు యథావిధిగా వనవాసము ముగించుకొని వస్తాడు. నీవు చూస్తావు. నీవు అజ్ఞానములో పడవద్దు. నేను చెప్పుతున్నది నిజం. నీవు ఏడవవద్దు.

"ఓ మంగళస్వరూపిణీ! రాముడికి ఏ అమంగళమూ సంభవించదు. నీవు మనోవ్యధ పడవద్దు. దుఃఖపడవద్దు. అందరినీ ఓదార్చవలసిన నీవే ఇట్లా దుఃఖపడుతూ ఉంటే, నిన్ను ఓదార్చేవారు ఎవరు? రాముణ్ణి కన్నతల్లివి, నీవు దుఃఖపడడము ఏమిటి? రాముడికన్నా సత్పథగామి మరి ఒకడు ఈ లోకములో లేడు. అటువంటివాడి కోసము నీవు దుఃఖపడడము తప్పు. అక్కా! నీవు అనిందితవు (ఒక్క తప్పు చేసి ఎరుగవు). నీవు చేసినవి అన్నీ పుణ్యకర్మలు. రాముడు వస్తాడు. త్వరలో వస్తాడు. ఉదయిస్తున్న పూర్ణచంద్రుడివలె వచ్చి నీకు కనపడతాడు. నీ కోడలు సీతనూ, నా

కొడుకు లక్ష్మణుణ్ణీ వెంటబెట్టుకొని వస్తాడు. వాడివెంట వాడి స్నేహితులు అందరినీ చూస్తావు. రాముడు వాని మృదుపీనహస్తాలతో నీ పాదాలు పట్టుకొని నీకు శిరసా నమస్కారము చేస్తాడు. అప్పుడు నీవు మేఘసమూహము పర్వతశిఖరాన్ని తడిపేటట్టు, ఆనందబాష్పాలతో వాణ్ణి తడుపుతావు" అంటూ ఓదార్చింది.

ఈ విధముగా లక్ష్మణుడి తల్లి సుమిత్రాదేవి చెప్పిన మాటలు అన్నీ కౌసల్యాదేవి విన్నది. శరత్కాల మేఘములో జలమువలె ఆమె దుఃఖము అంతరించింది.

45

అయోధ్యాపౌరులు రాముని వెంబడించుట

దశరథమహారాజూ, ఆయన అంతఃపురాంగనలూ, రాముడి మిత్రులూ బలవంతంమీద వెనుకకు మళ్ళినారు. కాని, పౌరులు మాత్రము రాముడి రథము వెంట పరుగెత్తడము మానలేదు. రథము ఎంతదూరము పోయినప్పటికిన్నీ, ఆ జనప్రియుణ్ణి వదలిపెట్టి వెనుకకు రాలేకపోయినారు. ఈ జగత్తుకు పూర్ణచంద్రుడు ఎటుంటివాడో, అయోధ్యావాసులకు రాముడు అంతటివాడు. అందువల్ల, ఆ పౌరులు "పోవద్దు, పోవద్దు" అంటూ కేకలు పెట్టుతూ, రథము కంటికి కనబడకుండా పోతున్నా రథము పోయిన దారినే పరుగెత్త సాగినారు.

దశరథమహారాజు సత్యవ్రతుడు అని రాముడు ఈ లోకానికి రుజువు చేయతలచుకొన్నాడు. అందువల్ల, అతని బుద్ధి వనవాసముమీదనే లగ్నము అయింది. రథము వేగముగా పోతూఉన్న కొద్దీ, "పోవద్దు" అంటూ పౌరులు కేకలు పెట్టుతూ పరుగెత్తుకొని రావడము రాముడు గమనించినాడు. తన అభిప్రాయము వారికి చెప్పవలెను అనుకొన్నాడు.

రథము మెల్లగా నడిచింది.

పౌరులు అందరూ వచ్చి రథాన్ని కలుసుకొన్నారు. రాముడు వారిని అందరినీ తన కన్నబిడ్డలవలె దయార్ద్రదృష్టితో చూస్తూ, "ఓ అయోధ్యాపౌరులారా! నామీద మీకు ఉన్న వాత్సల్యమూ, గౌరవమూ మీరు భరతునిమీద చూపించవలెను. నేను సంతోషిస్తాను. భరతుడు కైకేయీదేవి ప్రియపుత్రుడు అని మీరు అన్యథా ఆలోచించవద్దు. వాడు సకలకల్యాణగుణసంపన్నుడు. మీకు మేలు చేస్తాడు. వాడు వయస్సులో చిన్నవాడు. కాని జ్ఞానవృద్ధుడు. పైకి మెత్తగా కనిపిస్తాడు. కాని పెద్దపులివంటివాడు. పరమపరాక్రమవంతుడు. రాజగుణాలు అన్నీ ఉన్నవాడు. మా పూర్వీకులకు అనురూపము అయిన ప్రభువు అవుతాడు. వాడి రాజ్యపాలనలో మీకు ఏ భయమూ ఉండదు. మిమ్ములను అందరినీ వాడు చక్కగా కాపాడుతాడు.

"ఓ మహాజనులారా! భరతుణ్ణి యువరాజుగా దశరథమహారాజు నియమించినాడు. రాజశాసనాన్ని నేనే కాదు, మీరు అందరూ శిరసావహించవలెను. అందువల్ల, నేను వనవాసానికి పోతున్నాను. మీరు అందరూ అయోధ్యకు వెళ్లిపొండి. దశరథమహారాజు నా కోసము పరితపించకుండా చూడండి. మీరు అట్లా చేస్తే నేను సంతోషిస్తాను. ఇక మీరు వెనుకకు మళ్ళండి" అన్నాడు.

రథము వాయువేగముతో పోసాగింది.

రాముడు ఎంత స్థిరచిత్తముతో పితృవాక్య పరిపాలనరూపధర్మము నిర్వహించ తలచినాడో, పౌరులున్నూ అంత స్థిరచిత్తముతో అతనిని అడవికి పోనీకుండా అయోధ్యకు మళ్లించుకొని పోతలచినారు. అందువల్ల, ఎంతచెప్పినా వినకుండా వారు అందరూ కన్నీళ్ళు కారుస్తూ ఆ రథమువెంట పరుగెత్త సాగినారు. వాండ్లు అట్లా పరుగెత్తుతూ ఉంటే, ఏదో తాడుతో కట్టివేసి వాండ్లను అందరినీ లాగుకొని లాగుకొని పోతూ ఉన్నట్టుగా కనిపించింది. ఆ మహానుభావుడి సద్గుణాలు వారిని అందరినీ అట్లా ఆకర్షించినవి.

ఆ రథమువెంట పరుగు లెత్తింది పౌరులు మాత్రమే కాదు వయోవృద్ధులూ, ఓజోవృద్ధులూ, జ్ఞానవృద్ధులూ అయిన బ్రాహ్మణులున్నూ పరుగులెత్తినారు. వారు ఆ రథానికి మరింత వెనుకపడి పోయినారు. వార్ధక్యమువల్ల తలలు వణకిపోతూ, రాముడి రథాన్ని లాగుకొనిపోతూ ఉన్న గుర్రాలను ఉద్దేశించి, "ఓ హయరాజములారా! పరుగెత్తవద్దు. ప్రాణికోటిలో మీకు ఉన్న చెవులు వేటికీ లేవు. అందువల్ల, మీకు మేము చెప్పుతున్నాము, మా మాట వినవలెను. రాముడు పరమధార్మికుడు, పరిశుద్ధుడు, దృఢవ్రతుడు, వీరుడు, మీకూ మాకూ ప్రభువు. మీరు అతనికి మేలు చేయవలెను. కనుక, వెంటనే మీరు వెనుకకు మళ్ళవలెను. ఆ ప్రభువును మీరు పురోపవనవిహారానికి తీసుకొని పోవలెను కాని, కారడవిలో వదలిపెట్టడానికి తీసుకొని పోకూడదు. ఓ గుర్రములారా! మీరు వెంటనే వెనుకకు మళ్ళవలెను" అంటూ, ఆ బ్రాహ్మణోత్తములు పెద్దపెట్టున కేకలు పెట్టినారు.

ఆ బ్రాహ్మణోత్తముల కేకలు రాముడు విన్నాడు. అతని హృదయము ద్రవించింది. తన రథము వెనుక పాదచారులు అయి వస్తూ ఉన్న బ్రాహ్మణోత్తములను తాను రథములో కూర్చొని ఆశ్వాసించడము అసంగతముగా తోచింది. అది సదాచార విరుద్ధము అనిపించింది. వెంటనే అతడు రథము దిగినాడు. అతనితోపాటు సీతాలక్ష్మణులున్నూ దిగినారు. బ్రాహ్మణులను కలుసుకోవడానికి వెనుకకు పోయేటట్లయితే వనవాస ప్రయాణ వ్రతభంగము

అవుతుంది అనుకొన్నాడు. అందుకోసము ఆ బ్రాహ్మణులే వచ్చి తనను కలుసుకోవడానికి రాముడు అడుగులలో అడుగుపెట్టుకొంటూ నడవసాగినాడు.

ఆ బ్రాహ్మణోత్తములు రాముణ్ణి సమీపించి, "రామా! నీవు బ్రాహ్మణ్యుడవు. అందువల్ల బ్రాహ్మణ్యము అంతా నీ వెనుక వస్తూ ఉంది. చూడు నాయనా! మేము నిరతాగ్నిహోత్రులము. ఆరణి కట్టెలు భుజాలమీదవేసి తెచ్చుకొంటున్నాము. మేమే కాదు, అదుగో చూడు. వాజపేయ యాగాలలో ప్రాప్తించిన శ్వేతచ్ఛత్రాలతో బ్రాహ్మణులు వస్తూ ఉన్నారు. నాయనా! నీవు ఎందుకు ఎండలో నడుస్తావు? నీకు తాపము ఎత్తుతుంది. నీ దేహము కందిపోతుంది. కొంచెము ఆగు. ఆ వాజపేయయాజులు వచ్చి శరత్కాల మేఘాలవంటి తెల్లటి గొడుగులు నీకు పట్టుతారు.

"రాజా! ఎప్పుడూ వేదమంత్రాలమీదికి పోయే మా బుద్ధి ఇప్పుడు నీమీద లగ్నము అయింది. నిన్ను పట్టి మేమూ వనవాసము చేయ తలిచినాము. మాకు ఉన్న ధనము అల్లా వేదాలు. అవి మా హృదయాలలోనే ఉన్నవి. మా ఇండ్లలో ఉన్న ఇల్లాండ్లను వాండ్ల పాతివ్రత్యమే కాపాడుతుంది. వాండ్లను మేము కాపాడవలసిన పనిలేదు. అందువల్ల, మేమూ నీ వెంట ఉంటాము. నీవు అట్లా వద్దు అనేట్లయితే, నీవు మాతో అయోధ్యకు రావలెను. అసలు నిన్ను అయోధ్యకు మళ్లించుకొని పోవడానికే మేము ఇంతదూరము వచ్చినాము.

"రామా! నీవు ధర్మపరాయణుడవు కాబట్టి నీవు మా మాట వినవలెను. మేము బ్రాహ్మణులము. వయోవృద్ధులము. మా తలలు హంసలవలె తెల్లగా నెరసిపోయినవి. మేము ఈ దుమ్ములో సాగిలపడి నిన్ను ప్రార్థిస్తున్నాము. నీవు అడవికి పోవద్దు. అయోధ్యకు మళ్ళు. బ్రాహ్మణ ప్రార్థనలను మన్నించడము అధర్మము కాదు. నాయనా రామా! అయోధ్యలో ఎంతోమంది బ్రాహ్మణులు యజ్ఞాలు చేయవలెను అనుకొని సంభారాలు సమకూర్చుకొన్నారు. నీవు అయోధ్యకు వస్తేనే ఆ యజ్ఞాలు అన్నీ యథావిధిగా జరుగుతవి. నీవు రాకపోయేటట్లయితే ఆ యజ్ఞాలు అన్నీ ఆగిపోతవి. ఆ దోషము నిన్ను పట్టుకొంటుంది.

"ఓ రామా! చరాచరము అయిన ప్రాణికోటి అంతా నీ కోసము దుఃఖపడుతూ ఉంది. నిన్ను అయోధ్యకు మళ్ళమని ప్రార్థిస్తున్నది. నిన్ను వదలిపెట్టి ఉండలేక అయోధ్యాపౌరులు అందరూ నీ వెంట పడ్డారు. వారిని చూచి చెట్లు సయితము నీ వెంట పరుగెత్తడానికి ప్రయత్నము చేస్తూ ఉన్నవి. అయితే, వేళ్ళు పెళ్ళగిలక కొట్టుకులాడుతున్నవి. గాలి వేగానికి హోరని ఏడుస్తూ, నిన్ను చూస్తూ నీ వంకకు తిరుగుతూ ఉన్నవి. నాయనా! చూడు, పక్షులు ఆహారము వర్జించి కదలకుండా

మెదలకుండా చెట్లమీద కూర్చొని ఎంతో దీనముగా నీ వంక చూస్తూ ఉన్నవి. అవన్నీ నిన్ను అయోధ్యకు మళ్ళమని ప్రార్థిస్తున్నవి" అని బ్రాహ్మణులు చెప్పినారు.

ఆ బ్రాహ్మణోత్తముల దీనాలాపాలు ఆలకించి రాముణ్ణి పోనీకుండా అడ్డము అయిందో అన్నట్టుగా, తమసా నది వారి ఎట్టెదుట కనిపించింది.

అంతట సుమంత్రుడు రథానికి కట్టిన గుర్రాలను విప్పి వేసినాడు. అలసట తీరడానికి వాటిచేత నేలమీద పొర్లగింతలు పెట్టించి, తమసా నది స్వచ్ఛజలాలు త్రాగించి, ఆ జలాలలోనే వాటి ఒండ్లు కడిగి, ఆ తీరాన పచ్చిక మేయడానికి వాటిని వదలినాడు.

46

తమసా నది

రమ్యము అయిన ఆ తమసా నదీ తీరము చేరిన తరువాత రాముడు సీతాదేవివంక చూస్తూ లక్ష్మణుడితో, "తమ్ముడా! మన వనవాసము ఈనాటితో ఆరంభము అయింది. ఇది మొదటి రాత్రి. ఇక నీవు మన ఇల్లు మొదలు అయిన వాటిని గురించి తలచుకోకూడదు. ఈ సీత సుకుమారి, ఎట్లా నడవ కలుగుతుంది అని దిగులు పడవద్దు. చూడు, ఇప్పుడు ఈ సాయం సమయాన తమ తమ నెలవులకి చేరుతూ ఉన్న పక్షిసంఘాల కూతలనుంచిన్నీ, వన్యమృగాల ధ్వనులనుంచిన్నీ ఈ అరణ్యము ఏడుస్తూ ఉందా అనిపిస్తున్నది. ఇక చీకటి పడిన తరువాత ఈ మహారణ్యము బావురుమంటూ ఉంటుంది.

"లక్ష్మణా! మనము అడవులపాలు అయిపోయినాము అని మన రాజధాని నగరములో స్త్రీ పురుషులు అందరూ దుఃఖపడుతూ ఉంటారు. నాయనగారిమీదనూ, మనమీదనూ, భరత శత్రుఘ్నులమీదనూ ప్రజలకు ఉన్న అనురాగము అపారము. అందువల్ల, మన కోసము అందరూ ఎంతో దుఃఖపడుతూ ఉంటారు. నాయనగారిని గురించి ఆలోచిస్తూ ఉంటే నాకు ఏడుపు వస్తున్నది. పరమయశస్వి మా అమ్మను తలచుకొంటే నా గుండె ఝల్లుమంటున్నది. వాండ్లు ఉభయులూ మన కోసము ఏడ్చి ఏడ్చి కళ్ళు పోకొట్టుకుంటారో ఏమో! వాండ్ల కన్నులు కాయలు కాసిపోతవి ఏమో! కాదు, అట్లా జరుగదు. భరతుడు వస్తాడు. వాడు ధర్మాత్ముడు. ధర్మార్థ కామసహితము అయిన వాక్యాలతో వాడు నాయనగారిని, మా అమ్మనూ ఊరడిస్తాడు. లక్ష్మణా! భరతుడి గుణగణాలను గురించి ఆలోచించినకొద్దీ మన తల్లిదండ్రుల కోసము మనము దిగులుపడ నవసరములేదు అనిపిస్తూ ఉంది. నీవు ఇప్పుడు నా వెంట రావడమున్నూ మంచిదే అయింది. నీవు లేకపోయినట్లయితే ఈ సీతను కనిపెట్టుకొని ఉండడానికి నేను మరి ఒకరిని వెదకుకొనవలసి వచ్చేది.

"లక్ష్మణా! సంధ్యాసమయము అవుతూ ఉంది. ఈ తమసా తీరము పుణ్యక్షేత్రము. తినడానికి ఇక్కడ నానావిధ వన్యపదార్థాలు దొరుకుతవి. అయితే, ఇది మన వనవాసానికి ఆరంభ దినము. అందువల్ల, ఈరాత్రి నేను ఉపవాసము చేయ తలచినాను. ఈ తమసా పావనోదకాలను మాత్రము పానము చేస్తాను అంటూ సుమంత్రుణ్ణి చూచి, "మంత్రిపుంగవా! తాము ఈ గుర్రాలను ఈ రాత్రి ఏమరకుండా కనిపెట్టుకొని ఉండవలెను. ఈ శ్రమ తమకు తప్పదు" అని చెప్పి సాయంకాలాహ్నికాలను నిర్వర్తించడానికి లేచినాడు.

అంతట వారు శుభకరము అయిన ఆ సాయం సంధ్యను ఉపాసించినారు.

చీకటిపడుతూ ఉండగా సుమంత్రుడు గుర్రాలను కట్టివేసి, ఆ రాత్రి వాటికి సరిపోయే మేత వేసినాడు. లక్ష్మణుడి సాయముతో సీతారాములకు పండి రాలిన ఆకులతో ఆ తమసానదీతీరాన శయ్యలను అమర్చినాడు. సీతారాములు ఆ శయ్యలు చూచి సంతోషించినారు. పవ్వళించినారు.

సీతారాములకు హాయిగా నిద్ర పట్టింది. అప్పుడు లక్ష్మణుడు సుమంత్రుడితో రాముణ్ణి గురించి అనేకవిషయాలు చెప్పడము మొదలు పెట్టినాడు. వారు ఇద్దరూ అట్లా రాముణ్ణి గురించి మాట్లాడుకొంటూ ఉండగా రాత్రి తెల్లవార వచ్చింది. వారికి ఆ సంగతి తెలియనే తెలియదు. ఇంతలో ఆ తమసాతీరాన ఉన్న ఆలమందలలో ఆవులు అన్నీ నిద్రమేల్కొన్నవి. అవి నీళ్ళు త్రాగడానికి బయలుదేరినందువల్ల వాటి గిట్టల చప్పుళ్ళు సుమంత్రుడూ, లక్ష్మణుడూ విన్నారు. అటు చూచినారు. తెల్లవారవస్తూ ఉంది అని తెలుసుకున్నారు. ఇటు రాముడున్నూ నిద్ర లేచినాడు.

రాముడి రథమువెంటపడి పరుగెత్తుకొని వచ్చిన అయోధ్యా పౌరులు అందరూ, అక్కడ చెట్లకిందపడి ఒండ్లు ఎరగకుండా నిద్ర పోతున్నారు. రాముడు వారిని చూచినాడు. విచారపడ్డాడు. అంతట ఆ మహాతేజోవంతుడు, ఆ ధర్మమూర్తి లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! మన మీద ఉన్న ఆపేక్షనుంచి వీండ్లు అందరూ ఇండ్లూ, వాకిండ్లూ వదలిపెట్టి మన వెంటపడి పరుగెత్తుకొని వచ్చినారు. అలసి సొలసి ఎంతో గాఢముగా నిద్రపోతున్నారు. వీండ్లు ఈనాడు నిద్రపోయినట్టు ఇకను ఎన్నడూ నిద్రపోరు. నేను ఎంత చెప్పినా వీండ్లు వినరు. మనలను ఎట్లాగ అయినా అయోధ్యకు మళ్ళించుకొని పోవలెను అని సంకల్పించుకొన్నారు. అందుకు వీండ్లు ప్రాణాలను అయినా విడుస్తారుకాని, మనలను విడిచిపెట్టి పోరు. వీండ్లు అందరూ నిద్ర లేచేలోపలనే మనము రథముఎక్కి పోవలెను. మన జాడ తెలియకపోతే మార్గాంతరము లేక వీండ్లు ఇండ్లకు మళ్ళుతారు. పౌరులు వారి అంతట వారు

తెచ్చుకొన్న కష్టాలను పౌరులు అనుభవించేటట్టు చేయకూడదు" అని చెప్పినాడు. లక్ష్మణుడు అందుకు అంగీకరించినాడు. సుమంత్రుడు రామాజ్ఞను శిరసావహించి ఆ ఉత్తమాశ్వాలను అప్పటికి అప్పుడు ఆ రథానికి పూన్చినాడు. ధనుఃఖడ్గకవచాది పరికరాలతో సీతారామలక్ష్మణులు ఆ తెల్లవారుఝామున రథము ఎక్కినారు.

సుండ్లు తిరుగుతూ, గబగబా పరుగులెత్తుతూ ఉన్న ఆ తమసానదిని రాముడి రథము ఇట్టే దాటింది. వారు అవతలిగట్టు చేరినారు. ముండ్లూ గిండ్లూ లేకుండా హాయిగా, నిర్భయముగా నడిచిపోవడానికి అనువు అయిన రహదారి వారికి కనిపించింది. సీతారామలక్ష్మణులు ఆ రథము దిగినారు. అంతట రాముడు సుమంత్రుణ్ణి చూచి, "ఓ మంత్రిసత్తమా! తాము ఇప్పుడు ఈ రథాన్ని అయోధ్యానగరాభిముఖముగా కొంతదూరము వెనుకకు తోలుకొనిపోయి ఒక గడియసేపు అయిన తరువాత, మనము ఇప్పుడు వచ్చిన దారిన కాకుండా మరి ఒక దారిన తిరిగి రథాన్ని తోలుకొని వచ్చి, మరి ఒక రేవులో ఈ తమసానదిని దాటి మమ్ములను కలుసుకోవలెను. మన జాడ పౌరులు కనిపెట్టకుండా ఉండే దారిని తాము రథాన్ని తిరిగి తోలుకొని రావలెను. తాము ఈ ఉపకారము చేయవలెను" అని చెప్పినాడు.

సుమంత్రుడు రథాన్ని అటు ఉత్తరాభిముఖముగా తోలుకొని పోయినాడు. సీతారామలక్ష్మణులు ఇటు కాలినడకను ఆ బాటను పట్టుకొని పోయినారు.

అంతట కొంతసేపటికి సుమంత్రుడు రథాన్ని పెడదారిని తోలుకొని వచ్చి సీతారామలక్ష్మణులను కలుసుకొన్నాడు. వారు అప్పుడు ఆ రథము ఎక్కినారు. వారి ప్రయాణము శుభావహముగా ఉండడాని కోసము సుమంత్రుడు ఆ రథాన్ని ముందు కొంచెముదూరము ఉత్తరాభిముఖముగా తోలి, ఆ తరువాత తపోవనాలకు పోయే దారి పట్టించి గుర్రాల పగ్గాలు వదిలినాడు.

ఆ మహారథుణ్ణి, తననూ తన సారథినీ తన గుర్రాలనూ కాపాడుకొంటూ పదకొండువేలమంది విలుకాండ్లతో పోరాడే ఆ మహారథుణ్ణి, ఆ మహాతేజోవంతుణ్ణి రాముణ్ణి, భార్యా సోదర సహితముగా అడవిలో వదలిపెట్టి రావడానికి సుమంత్రుడు రథము ఎక్కించి తోలుకొని పోతూ ఉంటే, రాముడు హాయిగా కూర్చున్నాడు.

47

తెల్లగా తెల్లవారింది. చెట్లకిందపడి నిద్రపోతూ ఉన్న అయోధ్యావాసులు అందరూ మేల్కొన్నారు. నిద్రలేచినారు. వారికి రాముడుకానీ, రథముకానీ కనిపించలేదు. వారు అందరూ శోకోపహతులు అయినారు. నిశ్చేష్టులు అయినారు.

కన్నీళ్ళు కారుస్తూ దశదిశలా చూచినారు. రథపరాగము అయినా వారికి కనిపించలేదు. ఆ బుద్ధిమంతులు అందరూ తమ ఏమరుపాటుకు కించపడిపోయినారు. అట్లా ఒండ్లు ఎరగకుండా నిద్రపోయినందుకు వారిని వారే నిందించుకొన్నారు.

"రాముడు తన భక్తులను ఎన్నడూ మోసము చేయడు. అతడు మనలను ఇప్పుడు వదలి పరదేశ వాసమునకు ఎట్లా వెళ్ళినాడు? తమ కన్నబిడ్డలవలె మనలను ఎప్పుడూ కాపాడే ఆ రఘువంశలలాముడు మనలను ఇట్లా వదలిపెట్టి అడవికి ఎట్లా పోయినాడు? మనము ఇకను ఇక్కడ చచ్చిపోవడమే మంచిది. కాదా, మరణదీక్షతో మనము అందరమూ ఉత్తరాభిముఖముగా అయినా పోవడము ఉత్తమము. రాముడు లేకుండా మనము బ్రతకడము ఎందుకు? ఇక్కడ ఎండుకట్టెలు పెద్ద పెద్దవి కావలసినన్ని కనపడుతున్నవి. వీటితో చితి పేరుద్దాము. ఆ చితి ముట్టించి భగభగమండే మంటలలో పడి చచ్చిపోదాము.

"మనము అయోధ్యకు పోతే, అక్కడ రాముణ్ణి గురించి అడిగే వారికి ఏమి అని చెప్పడము? ఆ ప్రియంవదుణ్ణి, ఆ అనసూయకుణ్ణి అనుసరించి పోయి అడవిలో వదలిపెట్టి వచ్చినాము అని చెప్పడము ఎట్లాగు? రాముడు లేకుండా మనము ఒక్కళ్ళమే పోతే, మన ఇండ్లలో ఆడవాండ్లు ఏమి అంటారో, మన పిల్లలు ఏమి అడుగుతారో! మన పెద్దవాండ్లు మనలను గురించి ఏమి భావిస్తారో! ఎంత దుఃఖపడి పోతారో! పట్టణము పట్టణము అంతా దుఃఖసముద్రములో మునిగి పోతుంది. ఆ జితాత్ముడివెంట మనము తగుదుము అంటూ పరుగెత్తుకుని వచ్చినాము. ఇప్పుడు ఆ పరమపరాక్రమవంతుడు లేకుండా, ఏ ముఖము పెట్టుకొని అయోధ్యకు పోవడము" అని చెప్పుకొంటూ, పౌరులు అందరూ దుఃఖాక్రాంతులు అయినారు. ఏమీ తోచక ఏడ్చినారు.

వారిలో కొంతమంది రాముడు రథము పోయినదారి అంటూ ఒక దారి కనిపెట్టినారు. అందరూ ఆ దారిని కొంచెముదూరము పోయినారు. అక్కడనుంచి ఆ రథము ఎటుపోయిందీ వారు కనిపెట్టలేక పోయినారు. అందరూ ఖిన్నులు అయిపోయి, "అయ్యో! రథము పోయిన దారే కనపడలేదు. ఇకను ఏమి చేయడము? మనము దైవోపహతులము" అనుకొన్నారు. మార్గాంతరము తోచలేదు. ఏడుస్తూ వచ్చిన దారినే అయోధ్యకు పోయినారు. అక్కడ వారి వారి ఇండ్లలోకి పోవడానికి వారికి మనస్కరించలేదు. కన్నీళ్ళు కారుస్తూ, ఎక్కడివాండ్లు అక్కడ నిలుచుండి పోయినారు.

రాముడు లేని అయోధ్య చంద్రుడులేని ఆకాశమువలెనూ, నీళ్ళు ఎండిపోయిన చెరువువలెనూ వారికి అగుపించింది. ఎట్లాగో వారు అందరూ వారి వారి ఇండ్లకు

పోయినారు. ఎట్టఎదుట కనిపించిన వాండ్లు స్వజనులో, పరజనులో ఆ దుఃఖములో వాండ్లు గుర్తుపట్టలేకపోయినారు.

48

అయోధ్యావాసుల మనోభావాలు

అట్లా రాముడి రథమువెంటపడి పరుగెత్తి, అతడు ఎటుపోయిందీ తెలియక దుఃఖపడి, కన్నులు కాయలు కాచేటట్టు ఏడ్చి ఏడ్చి చచ్చిపోవలెను అనుకొని, మనోవ్యధతో తిరిగి వచ్చిన అయోధ్యా పౌరులు అందరూ, ప్రాణము పోయినవారివలె అయిపోయినారు. వారు తమ ఎట్టఎదుట స్నేహితులు కనిపించినా, పలుకరించలేక పోయినారు. అపూర్వ వస్తువులు అగుపించినా, ఆనందించలేకపోయినారు. ఎన్నడో కనిపించకుండా పోయిన రత్నాది అమూల్య వస్తువులు కనిపించినవి అని చెప్పినా, సంతోషించలేక పోయినారు. వాండ్లు ఎట్లాగో వాండ్ల వాండ్ల ఇండ్లలో అడుగు పెట్టినారు. వాండ్లను చూస్తూనే వాండ్ల పిల్లలూ, పెద్దలూ, పెండ్లాలూ వాండ్లను చుట్టివేసుకొన్నారు. రాముణ్ణి గురించి ప్రశ్నించడము మొదలు పెట్టినారు. వాండ్లు శోకముతోనూ, సిగ్గుతోనూ వెల వెలా పోతూ, ఏమీ సమాధానము చెప్పలేక గుడ్లు మిటకరించి ఊరక ఉన్నారు.

ఏ ఇంట్లోనూ పొయ్యి రాజవేయలేదు. బ్రాహ్మణులు వారి వారి కర్మకలాపాలు మానివేసినారు. వర్తకులు అంగళ్ళు తెరువలేదు. తల్లులు తమ తమ తొలిచూలు మగశిశువులు దగ్గరకు వచ్చినా ముద్దులాడలేక పోయినారు. ఇంటింటా స్త్రీలు దుఃఖార్తులు అయి ఏడువ సాగినారు. ఏనుగును అంకుశముతో పొడిచేటట్టు ప్రతి ఇల్లాలు తన పెనిమిటిని ఎత్తి పొడుపు మాటలతో పొడిచి వేయడము మొదలుపెట్టింది.

"మీరు రాముణ్ణి తీసుకొనిరాకుండా ఇక్కడ ఇండ్లలో ఏమి చేయడానికి వచ్చినారు? ఆ పుణ్యాత్ముణ్ణి ప్రతిదినమూ చూడకుండా ఉండేవాండ్లకు ఇండ్లు ఎందుకు, పెండ్లాము ఎందుకు, బిడ్డలు ఎందుకు, డబ్బు ఎందుకు? ఇంత చేతకానివాండ్లు మీరు, తగుదుము అంటూ రాముడివెంట ఎందుకు పరుగెత్తినారు? మమ్ములను పొమ్మన్నా మేము పోయి, ఆ మహానుభావుడి పాదాలమీద ప్రాణాచారము పడేవాండ్లము. ఆ మహాత్ముణ్ణి తప్పకుండా తిప్పి తీసుకొని వచ్చేవాండ్లము.

"అయోధ్యలో ఉన్న మగవాండ్లు అందరిలోనూ లక్ష్మణుడు ఒక్కడే సజ్జనుడు. అందువల్లనే, సీతారాములకు సేవచేయడానికి వారితో పోయినాడు. సీతారాములకు సేవచేయడానికి సజ్జనులే అర్హులు. మీకు ఆ అర్హత లేదు. అందువల్ల, మీరు వారితో పోలేక తిరిగివచ్చినారు. సీతారాములు అడవులలో ఏ ఏ మనోహర నదులలో,

ఏ ఏ తామరకొలనులలో, ఏ ఏ చెరువులలో స్నానము చేస్తారో, అవి అన్నీ వారి గాత్ర సంస్పర్శవల్ల పవిత్రము అవుతవి. అవి అన్నీ మీకన్నా ఎక్కువ పుణ్యము చేసుకొన్నవి. ఆ మహానుభావుణ్ణి ప్రతిదినమూ కన్నులారా చూచే భాగ్యము అయినా మీకు లేదు.

"మహారణ్యములో మహారమ్యము అయిన మహోన్నత వృక్షాలు రాముడికి గొడుగువలె నీడను ఇస్తవి. నదులలో ఉండే గొప్ప గొప్ప నీటి ఊటలు అతనికి స్వచ్ఛజలాలను ఇస్తవి. పర్వత సానువులు అతని విహారశయ్యాసనాలకు అనుకూలముగా ఉంటవి. అతడు ఆ అరణ్యాలలో ఎక్కడికి పోయినా చేతనాచేతనాలు అన్నీ, ప్రియాతిథి తమవద్దకు వచ్చినట్లు అతనిని సమ్మానిస్తవి. తలనిండా పూలు ముడుచుకొని, చేతులనిండా పూలగుత్తులు తీసుకొని, మధుర మంగళగానము చేస్తూ దేవుణ్ణి పూజచేసే స్త్రీలవలె అడవిలో విరగపూసిన చెట్లు, భ్రమరాలు ఝుంకారము చేస్తూ ఉంటే, తమ కొమ్మలతో సీతారాములమీద పూలు వెదజల్లుతవి. మాకు (మీ ఇల్లాండ్లకు) ఆ మాత్రము భాగ్యము అయినా లేకుండా చేసివేసినారు.

"రాముడు అడవిలో తిరుగుతూ ఉంటే, ఆ యా చెట్లు అకాలము అయినప్పటికీ పూలు పూస్తవి. ఆ పూలు పిందెలుకట్టి, కాయలుకాసి పండ్లు అవుతవి. ఆ పండ్లను ఆ చెట్లు రాముడికి కానుకలుగా అందిస్తవి. అతనిని చూడగానే పర్వతాలు సెలఏళ్ళలో స్వచ్ఛజలాలు వరదలు అయి ప్రవహించేటట్టు చేస్తవి. ఆ పర్వతాలమీద ఉండే చెట్లు అన్నీ ఎండతాపము ఎత్తకుండా చల్లగాలి వీస్తవి. ఆ చెట్లు చేసిన పుణ్యము అయినా మనము చేయలేదు కాబోలు!

"రాముడు ఉండే చోట ఎవరికీ, ఏ భయమూ ఉండదు. ఎవరూ, ఎవరివల్లనూ అవమాన పడరు. ఆ మహాబాహువు, ఆ శూరుడు దూరముపోక పూర్వమే మనము అందరమూ బయలుదేరిపోయి కలుసుకోవలెను. ఆలస్యము చేయవద్దు. మనము అందరమూ ఇక్కడ చేసే కాపరాలు అక్కడనే, అతని సమక్షంలోనే చేద్దాము. ఆ మహాత్ముడి అడుగుజాడలలో నడువడముకన్నా మనకు మరి ఒక సుఖము ఏమి ఉంది? అతడు మన ప్రభువు. మనకు అందరికీ మూలాధారము అయినవాడు. మన పరమప్రాప్యము. మేము సీతాదేవికి సేవచేస్తూ ఉంటాము. మీరు రాముడికి సేవచేస్తూ ఉండండి. మా యోగక్షేమాలను సీతాదేవి చూస్తుంది. మీ యోగక్షేమాలను రాముడు కనిపెట్టుతూ ఉంటాడు. ఇక ఆలస్యము ఎందుకు? పదండి పోదాము.

"రాముడులేని అయోధ్య నివాసయోగ్యముగా ఉండదు. అంతా అమనోజ్ఞముగా ఉంటుంది. అందరూ రాముణ్ణి గురించే ఆలోచిస్తూ, దుఃఖపడుతూ ఉంటారు. ఒక్కరు అయినా సంతోషముగా నివసించడము ఉండదు. రాజ్యము కైకేయిది అయిపోతుంది. అంటే, నాథుడులేని రాజ్యము అవుతుంది. ధర్మశూన్యము

అయిన రాజ్యము అవుతుంది. అటువంటి రాజ్యములో బ్రతికి ఉండి ఏమి ప్రయోజనము? డబ్బు ఉండి ఏమి ప్రయోజనము? కొడుకులు ఉండి ఏమి ప్రయోజనము?

"ఐశ్వర్యకాంక్షవల్ల కైకేయీదేవి భర్తను, అందులో ఈ దేశానికి అంతటికీ రాజు అయినవాణ్ణి వదలుకొన్నది. ఆయన జ్యేష్ఠపుత్రుణ్ణి కులదీపకుడు అయినవాణ్ణి నిర్దాక్షిణ్యముగా అడవులకు వెళ్ళకొట్టింది. ఆమె కులపాంసని. దుష్టచారిణి. అధర్మపరాయణ. ఆమె ఎవరిని అయినా వదలుకొంటుంది. ఎవరిని అయినా ఎక్కడికి అయినా వెళ్ళకొట్టిస్తుంది. ఆమె రాజ్యములో సుఖము అనుభవించడము ఏమిటి? ఆమె జీవించి ఉండేటంతవరకూ, అందరూ ఆమె రాజ్యములో కింకరులవలె జీవించవలసి వస్తుంది. ఆమె రాజ్యపాలనము మొదలుపెట్టితే అయోధ్యలో మీరు ఉండకలరేమోకాని మేము ఉండలేము. మేము ఉండము. మేము ఈ మాటలు ఉద్రేకమువల్ల చెప్పడములేదు. మా బిడ్డలమీద ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాము. రాముడు ఉండని అయోధ్యలో మేము ఉండము. ఏమంటే, ఈ రాజ్యము అనాయకము అవుతుంది. అంతా ఉపద్రవముగా ఉంటుంది. ఎవరికీ, ఏ ఆధారమూ ఉండదు.

"ఒక్క కైకేయినుంచి ఇంత రాజ్యమూ నాశనము అయిపోతుంది, తప్పదు.

"రాముడు అడవికి చేరినట్లు తెలియగానే దశరథమహారాజు చచ్చిపోతాడు. బ్రతుకడు. అంతటితో ఈ రాజ్యము అంతటా ఏడుపులే. మీరు రాముడివెంట పోయి తిరిగి వచ్చినారు. మీరు బుద్ధిహీనులు. వట్టి దరిద్రులు. ఇప్పుడు అయినా ఆలోచించండి. మనము అందరమూ వెంటనే రాముడి దగ్గరకు అయినా పోవలెను లేదా విషము అయినా త్రాగవలెను. అదీకాకపోయేటట్లయితే, ఈ అయోధ్య వర్తమానాలు తెలియకుండా ఉండే ఏ దూరదేశానికి అయినా లేచిపోవలెను. ఇకను ఇక్కడ ఉండడము అనేది అప్రశస్తము.

"దశరథమహారాజు జీవించి ఉండేటంత వరకూ మనము ఇక్కడనే ఉండవచ్చు అంటారేమో, అది పొరపాటు. దశరథమహారాజు కపటోపాయముతో సీతారామ లక్ష్మణులను అడవులకు వెళ్ళకొట్టినాడు. పశువులను కసాయివాడికి ఒప్పగించేటట్టు, ఇక మనలను అందరినీ ఆయన భరతుడికి ఒప్పగించడము మిగిలి ఉంది.

"ఆ నీలమేఘశ్యాముడు, ఆ పద్మపత్రాయతాక్షుడు, ఆ మనోహరుడు, ఆ ఆజానుబాహుడు, ఆ మహాబలుడు, ఆ అరిందముడు, ఆ శాంతుడు, ఆ సత్యవ్రతుడు, రాముడు ఈ లోకానికి అంతటికీ పూర్ణచంద్రుడివంటి ప్రియదర్శనుడు. ఆ మధుర భాషణుడు ఎవరిని అయినా ముందుగా తానే పలుకరించి మాట్లాడుతాడు. అతడు

మత్తమాతంగ విక్రమముతో మహారణ్యములో సంచరిస్తూ ఉంటే, ఆ ప్రదేశము అంతా శోభిస్తుంది' అంటూ, స్త్రీలు అందరూ శోకసంతప్తలు అయి మరణ సమయములోవలె ఏడువసాగినారు.

ఆ నగరాంగనల ఏడుపులు వినలేక సూర్యుడు అస్తమించినాడు. చీకటి పడిపోయింది.

ఆనాడు అయోధ్యలో ఆహితాగ్నులు అగ్నిహోత్రాలలో హోమాలు చేయలేదు. వేదాధ్యయనము ఎక్కడా జరుగలేదు. సత్కథాకాలక్షేపాలు సాగలేదు. మూసివేసిన అంగళ్ళు అన్నీ మూసినట్టే ఉండిపోయినవి. నగరము అంతా నిరాశ్రయము అయిపోయింది. అంతటా గాఢాంధకారము అలముకొన్నది.

అయోధ్యానగరము అప్పుడు నక్షత్రాలులేని ఆకాశమువలె అయిపోయింది.

స్త్రీలు అందరూ కన్నకొడుకునో, తమ తోబుట్టువునో అడవులకు వెళ్ళకొట్టినట్టు ఏడువసాగినారు. ఏమంటే, రాముణ్ణి వారు అందరూ తమ కన్నకొడుకుకన్నా ఎక్కువగా భావిస్తూ ఉండేవారు. ఆ పౌరస్త్రీల ఏడుపులుతప్ప, సర్వసాధారణము అయిన గీతోత్సవనృత్యవాద్య ధ్వనులు ఏవీ ఆ సమయములో అయోధ్యలో వినిపించలేదు.

ఆ మహానగరము అప్పుడు నీళ్ళు ఇంకిపోతున్న సముద్రమువలె తోచింది.

49

కోసల దేశము

పిత్రాజ్ఞ పరిపాలనము కోసము రాముడు సీతాలక్ష్మణ సమేతముగా ఆ తెల్లవారుఝామున అయోధ్యా పౌరులను అందరినీ వదలిపెట్టి, రథము ఎక్కి ప్రయాణము అయిపోయినాడు.

తెల్లవారుతూ ఉండగా వారు ఉదయ సంధ్యను ఉపాసించినారు.

అంతట పెద్దపెద్ద గ్రామాలూ చిన్నచిన్న పల్లెలూ చూస్తూనూ, విత్తనాలు చల్లడానికి చక్కగా తీర్చిదిద్దినట్లు దుక్కులు దున్నిన పొలాలు చూస్తూనూ, విరగపూసిన తోటలూ దొడ్లూ చూస్తూనూ పోతూ ఉంటే, రథము ఎంతవేగముగా పోతూ ఉన్నదీ సీతారాములకు తెలియనేలేదు. ఆ యా గ్రామాలలో గ్రామీణులు సీతారాములను చూచి, "అయ్యో! దశరథమహారాజు కామపరవశుడు అయి ఏమి పని చేసినాడు? అబ్బా! కైకేయీదేవి ఎంత క్రూరురాలు! ఎంత పాపాత్మురాలు! ఆమె పాపకృత్యాలు చేయడమే పనిగా పెట్టుకొన్నట్టు ఉంది. రాముడు మహాప్రాజ్ఞుడు, దయామయుడు,

జితేంద్రియుడు, పరమధార్మికుడు. అటువంటి వాణ్ణి అడవులకు వెళ్ళకొట్టింది. ఆహా! కైకేయి కులాంగనల మర్యాదను పాటించకుండా ఎంతటి క్రూరకృత్యానికి ఒడికట్టింది!

"అయ్యో! ఈ సీతాదేవి, జనకమహారాజు కూతురు ఎంతో సుఖముగా, సంతోషముగా పెరిగింది. ఈ భాగ్యశాలిని ఇక వనవాస కష్టాలు ఎట్లా అనుభవిస్తుందో! అయ్యో దశరథమహారాజు ఎంత దయమాలినవాడు? ఏ పాపమూ ఎరుగనివాణ్ణి, ప్రజారంజకుణ్ణి, అందులో తన జ్యేష్ఠపుత్రుణ్ణి పుత్రవాత్సల్యము అయినా లేకుండా అడవులకు వెళ్ళకొట్టినాడా?" అని చెప్పుకొంటూ ఉన్న మాటలు రాముడు విన్నాడు.

రథము కోసలదేశపు పొలిమేరమీదికి పోతూ ఉంది. నిర్మలోదకాలతో ప్రవహించే 'వేదశ్రుతి' అనే నది అడ్డము అయింది. రథము ఆ నదిని దాటి దక్షిణ దిక్కుగా సాగిపోయింది. అశేషముగా గోవులు సంచరిస్తూ ఉన్న ప్రదేశము కనిపించింది. పుణ్యోదకాలతో గంగాద్వారాన గబగబా సముద్రానికి పోతున్న గోమతీనది ఎదురు అయింది. రథము ఆ నదిని దాటింది. గుర్రాలు మరింత వేగముగా పరుగులు ఎత్తసాగినవి. హంసధ్వనులు మనోహరముగా వినిపించినవి. నేత్ర పర్వముగా నాట్యము ఆడుతున్న నెమళ్ళ గుంపులు కనిపించినవి. రథము స్యందికా నదిని దాటింది.

ఇక్ష్వాకువు వైవస్వత మనువుకు ఇచ్చిన భూభాగము అక్కడితో అంతము అయింది.

అంతవరకూ సీతాదేవికి ఆ కోసలరాజ్యాన్ని గురించి చెప్పుతూ, గ్రామోపగ్రామాలు చూపిస్తూ ఉన్న రాముడు సుమంత్రుణ్ణి ఉద్దేశించి, "ఓ మంత్రిపుంగవా! ఇంక ఎంతకాలానికి ఈ కోసలరాజ్యానికి తిరిగి వస్తానో, ఎంతకాలానికి నా తల్లిదండ్రులను కలుసుకుంటానో, సరయూ తీరాన పుష్పితాటవులలో ఎంతకాలానికి వేటాడుతానో" అంటూ, సుమంత్రుడు ఏదో అడుగుతూ ఉన్నట్టు తోచి, "మంత్రిసత్తమా! వేటాడడము దూష్యము అంటున్నావా? నిజమే. అయితే, సదాచారసంపన్నులు శ్రాద్ధాదికాలాలలో మాంసము కోసము వేటాడుతారు. రాజర్షులు క్రీడార్థమున్నూ, విలుకాండ్లు లక్ష్యవేధనాభ్యాసము కోసమున్నూ వేటాడుతూ ఉంటారు. రాజులను సంతోషపెట్టే వేడుక వేటకన్నా మరింకొకటి లేదు. అందువల్ల, రాజర్షులు అందరూ కాలానుగుణము అయిన మృగయావినోదాన్ని సమ్మతించినారు. నాకు అయితే వేటాడడము అట్టే ఇష్టము లేదు" అంటూ ఆ యా విషయాలు మనోహరముగా మాట్లాడుతూ ఉండగా, రథము కోసలదేశపు పొలిమేరను సమీపించింది.

50

ఆ కోసలదేశము విశాలము అయింది. ఎంతో రమ్యము అయింది. అటువంటి దేశాన్ని, అటువంటి రాజ్యాన్ని వదలిపెట్టి ఆ ధీమంతుడు రాముడు భార్యతోనూ, తమ్ముడితోనూ వెళ్ళిపోతున్నాడు.

నగరము వదలిపెట్టి పోయేటప్పుడు కార్యసిద్ధి కోసము నగరానికీ, నగరాధి దేవతలకూ నమస్కారము చేసి వీడ్కోలు చెప్పడము శిష్టాచారము. రాముడు అయోధ్యలో బయలుదేరినప్పుడు జనసమ్మర్దమువల్ల అట్లా చేయలేకపోయినాడు. అందువల్ల పాలిమేర దాటిపోతూ ఉండగా సుమంత్రుణ్ణి రథము ఆపమన్నాడు. అయోధ్యాభిముఖుడు అయి చేతులు జోడించి, "ఓ నగరరాజమా! నిన్ను మా వంశీయులు కాకుత్స్థులు అందరూ పరిపాలించినారు. నేను ఇప్పుడు నిన్ను వదలిపెట్టి పోవలసి వచ్చింది. నీకు ఇప్పుడు ఇక్కడనుంచి వీడ్కోలు చెప్పుచున్నాను. నిన్ను కాపాడుతున్న దేవతలు అందరికీ మ్రొక్కుతున్నాను. మా తండ్రి ఋణము తీర్చడానికి నేను వనవాసము చేస్తాను. తిరిగి వచ్చి మా తల్లిదండ్రులను కలుసుకొంటాను. అప్పుడు ముందుగా నీ దర్శనము చేస్తాను. నన్ను అనుగ్రహించవలసింది" అంటూ నమస్కారము చేసినాడు.

రాముడు ఆ జేవురించిన కళ్ళవెంట నీళ్లు కారుస్తూ, తనను సాగనంప వచ్చిన గ్రామీణులను అందరినీ దగ్గరకు రమ్మని చేతులతో సంజ్ఞ చేసి, "ఓ గ్రామీణులారా! మీరు నన్ను యధార్థముగా ఆదరించి నా వెంట ఇంత దూరము వచ్చినారు. నామీద మీకు ఎంత దయ ఉన్నదీ నాకు తెలుసును. నన్ను చూచినకొద్దీ మీకు దుఃఖము వస్తుంది. మిమ్ములను చూస్తూఉంటే నాకు దుఃఖము వస్తుంది. దేనికి అయినా ఎక్కువ సేపు దుఃఖపడడము తప్పు. మీరు మీ మీ ఇండ్లకు పోయి, మీ మీ పనులు చూచుకోండి. నాదారిన నేను పోతాను" అని చెప్పినాడు.

అంతట ఆ గ్రామీణులు ఆ పూజ్యుడికి ప్రదక్షిణ నమస్కారాలు చేసినారు. ఘోరముగా దుఃఖపడుతూ, వెనుకకు మళ్ళిపోతూ, తిరిగి తిరిగి రాముడివంక చూస్తూ, మధ్య మధ్య నిలబడిపోతూ నడువసాగినారు. అప్పుడు రాముడి రథము సంధ్యాసమయ సూర్యుడివలె వారికి కనపడకుండా పోయింది.

ఆ కోసలరాజ్యము ధనధాన్యోపేతము అయింది. జనులు అందరూ దానశీలురు. ఆ గ్రామాలు అన్నీ మహారమ్యము అయినవి. ఆ గ్రామాలలో జనులు నిర్భయముగా జీవిస్తూ ఉన్నారు. మామిడితోపులూ, ఉద్యానవనాలూ ప్రతిగ్రామము లోనూ ఉన్నవి. ప్రతిగ్రామములోనూ దేవాలయాలూ, యజ్ఞశాలలూ, యూపస్తంభాలూ

ఉన్నవి. జలాశయాలు అన్నీ జలసమృద్ధముగా ఉన్నవి. అన్ని గ్రామాలలోనూ ఆవుల మందలు అశేషముగా ఉన్నవి. జనులు అందరూ దేహపుష్టితోనూ, మనఃసంతుష్టితోనూ ఉన్నారు. ప్రపంచములో ఉన్న రాజులు అందరూ వచ్చి, చూడవలసిన గ్రామాలు అవి. ప్రతిగ్రామములోనూ బ్రహ్మఘోషము వినిపిస్తుంది. అది ప్రతి రాజూ కాంక్షించే రాజ్యము. అటువంటి రాజ్యాన్ని వదలిపెట్టి రాముడు అరణ్యవాసానికి పోతున్నాడు. ఆ ధైర్యవంతుడి మనస్సు ఈషణ్మాత్రమూ చలింపలేదు.

రథము కోసలదేశము దాటి దక్షిణాభిముఖముగా పోయింది. అంతట రాముడు పుణ్యోదకాలతో ప్రవహిస్తూ ఉన్న గంగానదిని చూచినాడు.

స్వర్గమర్త్యపాతాళలోకాలలో ప్రవహించిన ఆ నదిని చూచినమాత్రాననే సమస్తశుభాలూ సమకూరుతవి. దానిలో స్నానముచేస్తే సమస్తకల్మషాలూ నశించిపోతవి. అందువల్లనే, ఋషులు అందరూ ఆ నదిని సేవించినారు. ధర్మసమృద్ధము అయిన మున్యాశ్రమాలు అన్నీ ఆ నదీతీరాన వెలిసినవి. అవి అన్నీ ఆ నదికి అలంకారాలు అయినవి.

ఆ నది మడుగులలో అప్సరాంగనలు అత్యంత సంతోషముతో క్రీడిస్తూ ఉంటారు. ఆ నదీతీరాన దేవ దానవ గంధర్వ కిన్నరులు విహరిస్తూ ఉంటారు. ఆ నది మంగళజలాలలో వివిధగంధర్వాంగనలు ఎప్పుడూ జలకమాడుతూ ఉంటారు. ఇందరు ఇన్నివిధాల సేవించినా ఆ పుణ్యోదకాలు ఎన్నడూ పంకిలము అయిపోవు. ఆ నదీతీరాననే దేవతల క్రీడాపర్వతాలూ, ఉద్యానవనాలూ వందలకొద్దీ ఉన్నవి. దేవతలను ఉద్ధరించడానికి ఆ గంగ ఆకాశమార్గాన దేవలోకములోకి పోయింది. అక్కడివారిని అందరినీ పునీతులను చేసింది. దేవతలకు అందరికీ అది తామరకొలను అయింది. ముల్లోకాలలోనూ ప్రసిద్ధికి ఎక్కింది.

ఆ గంగాజలాలు రాళ్ళమీద పడుతూ ఉంటే, ప్రౌఢాంగన చేతులు చరచి చప్పట్లు కొట్టుతున్నట్లుగా తోస్తుంది. అది తెల్లని నురుగులు విరచిమ్ముతూ ఉంటే, చల్లని చిరునవ్వులు వెదజల్లుతున్నట్లు కనిపిస్తుంది. అది నిమ్నోన్నత శిలలమీదనుంచి పడుతూ ఉంటే, పాడుగాటి నల్లనిజడ వేలాడుతున్నట్లు అగుపిస్తుంది. అది సుళ్ళు తిరుగుతూంటే, నాభివలె గోచరిస్తుంది. అది అగాధప్రదేశాలలో స్థిమితగంభీరముగా నడుస్తుంది. ఒకచోట విపరీతము అయిన వేగముతో పరుగులు ఎత్తుతుంది. ఒకచోట మృదంగధ్వనులుచేస్తూ దూకుతుంది. ఒకచోట మహాభైరవస్వనాలుచేస్తూ నడుస్తుంది.

ఆ గంగ అట్లా ప్రవహిస్తూ ఉంటే వికసించిన నల్లకలువలు దాని కన్నులవలెనూ, కమలాలు దాని చేతులవలెనూ, తీరాన చెట్లవరుసలు దాని మెడలోని హారాలవలెనూ,

విశాలము అయిన ఇసుక తిన్నెలు దాని ఘనజఘనాలవలెనూ, విరగబూసిన తెల్లకలువలు దాని నితంబాల వంపులవలెనూ, గాలికి రాలిన రకరకాల పుప్పొడులు దాని రక్త చందనపు పూతలవలెనూ, నిర్మలజలాలు తళతళలాడే దాని మణిభూషణాల వలెనూ, పూలూ పండ్లూ గుల్మాలూ నీరుకోతులూ మామూలు పక్షులూ మొసళ్ళూ దాని వివిధా భరణాలవలెనూ భ్రమపెట్టుతవి.

హంసలూ, సారసపక్షులూ, చక్రవాకపక్షులూ మనోహరముగా పాటలు పాడుతూ ఉంటే, అడవి ఏనుగులూ, దేవతల ఏనుగులూ, దిశాగజాలూ ఘీంకారాలు చేస్తూ ఉంటే, సముద్రుణ్ణి కలియడానికి పరుగులు ఎత్తుతూ ఉన్న మదవతివలె ఆ గంగ కనిపిస్తుంది.

ఆ పుణ్యనది విష్ణుపాదాలలోనుంచి జారింది. ఈ భూలోకంలోవారి పాపాలను పోగొట్టడానికి భగీరథుడి ప్రభావమువల్ల శివజటాజూటాలలో నుంచి కిందికి దిగింది. అలలతో సుళ్ళుతిరుగుతూ, పరుగులు ఎత్తుతున్న ఆ గంగానదిని రాముడు శృంగిబేరపురము పోతూ చూచినాడు. అంతట అతడు సుమంత్రుడితో, "ఓ మంత్రిపుంగవా! మనము ఇక్కడనే ఆగిపోదాము. అదిగో, ఆ పెద్దగారచెట్టు చిగురుటాకులతో పూలు పూసి మనోహరముగా కనబడుతున్నది. ఆ చెట్టుకింద మనము ఉండిపోదాము. దేవతలూ, దానవులూ, మానవులూ, మృగాలూ, పక్షులూ సేవించే ఈ గంగానదిని మనమూ సేవింతాము" అన్నాడు. బాగుంది అన్నాడు లక్ష్మణుడు. సుమంత్రుడు రథాన్ని ఆ చెట్టుకిందికి తోలుకొనిపోయినాడు. సీతారామ లక్ష్మణులు రథము దిగినారు. సుమంత్రుడు గుర్రాలను విప్పి, వాటికి మేత వేసినాడు.

ఆ ఇంగుదివృక్షము క్రింద కూర్చున్న రాముడి దగ్గరకు పోయి సుమంత్రుడు చేతులు జోడించి నిలుచున్నాడు.

గుహుడు

అక్కడికి దగ్గరలో శృంగిబేరపురము ఉంది. అక్కడ 'గుహుడు' అనే రాజు ఉన్నాడు. వాడు నిషాదజాతిలో పుట్టి, 'స్థపతి' అనే బిరుదుతో రాజ్యము ఏలుతూ ఉన్నాడు. వాడు మహా బలవంతుడు. రాముడికి ప్రాణసఖుడు. రాముడు గంగాతీరానికి వచ్చినట్టు గుహుడికి తెలిసింది.

అంత అతడు నిషాదవృద్ధులనూ, అమాత్యులనూ వెంటపెట్టుకొని రాముణ్ణి సందర్శించడానికి బయలుదేరినాడు.

దూరాన ఉండగానే రాముడు గుహుణ్ణి చూచినాడు. అతడికి ఎదురుకోలు చెప్పడానికి లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని ఎదురుగుండా పోయినాడు. మునివేషములో

ఉన్న రాముణ్ణి గుహుడు కౌగలించుకొన్నాడు. "రామప్రభూ! నీకు అయోధ్య ఎటువంటిదో, నా ఈ పట్టణమున్నూ అటువంటిది. ఇప్పుడు నేను ఏమి చేయవలెను? ఓ మహాబాహూ! ఓ మిత్రుడా! నీవు ఇప్పుడు నా అతిధివి" అంటూ ఉండగా, అతడి అనుచరులు అర్ఘ్యజలాలూ, అన్నాదులూ పట్టుకొని వచ్చినారు.

అంతట గుహుడు, "ప్రభూ! మీకు స్వాగతము. ఇదిగో అర్ఘ్యజలము. ఇవిగో భక్ష్యము - భోజ్యము - లేహ్యము - పేయము, వీటిని పుచ్చుకోవలసింది. మీకు శయనాదులు ఏర్పాటు చేస్తాను. మీ గుర్రాలకు మేత వేయిస్తాను. రామప్రభూ! నా ఈ భూమి అంతా నీది. మేము అందరమూ నీ కింకరులము. నీవే మా ప్రభువు. మా రాజ్యము నీవే ఏలు" అన్నాడు.

"ఓ గుహుడా! నీవు స్నేహాతిశయముతో పాదచారుడు అయి నన్ను చూడడానికి వచ్చినావు. నన్ను సత్కరించినావు. నాకు అంతే చాలును. నేను సంతుష్టుణ్ణి అయినాను" అంటూ, రాముడు కండలు తిరిగిన తన రెండు బాహువులతో గుహుణ్ణి గాఢాలింగనము చేసికొని, "మిత్రుడా! నిన్నూ, నీ బంధువులనూ ఇప్పుడు నా భాగ్యవశమువల్ల చూడకలిగినాను. మీరు అందరూ క్షేమముగా ఉంటూ ఉన్నందుకు నాకు సంతోషము. ఏ ఉపద్రవాలూ లేకుండా నీ రాజ్యము సుఖప్రదముగా ఉందా? నీ మిత్రులు అందరూ క్షేమముగా ఉన్నారా? నీ బొక్కసము తరుగు లేకుండా ఉందా? నామీద ప్రేమాతిశయముతో నీవు తీసుకొనివచ్చిన భోజనద్రవ్యాలను నేను నీకే ఇచ్చివేస్తున్నాను. కానుకలు అందుకొనే అర్హత ఇప్పుడు నాకు లేదు. నేను పిత్రాజ్ఞను శిరసావహించి వల్కలాలు ధరించినాను. దర్భమొలతాడు కట్టుకొన్నాను. అరణ్యవాసానికి పోతున్నాను. అక్కడ నేను తపస్సు చేయవలెను. ఫలమూలాలనే తింటూ ఉండవలెను. అందువల్ల, నాకు నీవు ఏమీ ఇవ్వ నవసరములేదు. ఈ గుర్రాలకు మేత ఇస్తే చాలును. ఇవి మా నాయనగారివి. వారికి ఈ గుర్రాలు అంటే ముద్దు. వీటిని చక్కగా పంపించివేస్తే నన్ను నీవు ఎంతో సత్కరించినవాడవు అవుతావు" అని చెప్పినాడు.

అంతట గుహుడు ఆ గుర్రాలకు నీళ్ళుపెట్టి, పచ్చిమేత వేయవలసింది అని తనవాండ్లను ఆజ్ఞాపించినాడు.

ఆ తరువాత రాముడు వల్కలాన్ని ఉత్తరీయముగా వేసుకొని పశ్చిమసంధ్యను ఉపాసించినాడు. లక్ష్మణుడు పోయి స్వయముగా తెచ్చిన గంగాజలాలను ఆహారముగా పుచ్చుకొన్నాడు.

చీకటిపడ్డతరువాత పాదప్రక్షాళనము చేసుకొని, ఆచమించి నేలమీద పడుకొన్నాడు. సీతాదేవి అట్లాగే నేలమీద పండుకొన్నది.

లక్ష్మణుడితోపాటు గుహుడున్నూ ధనుర్ధరుడు అయి సుమంత్రుడితో మాట్లాడుతూ, ఏమరుపాటు లేకుండా ఆ రాత్రి అంతా కావలి కాయడానికి నిలుచున్నాడు.

ఆ మహాత్ముడు, ఆ ధీమంతుడు, ఆ యశస్వి, దశరథమహారాజు పుత్రుడు ఆ రాముడు అంతవరకూ సుఖాలు అనుభవించినాడు. ఎన్నడూ, ఏ కష్టాలూ ఎరుగని వాడు అట్లా నేలమీద పడుకొంటే ఆ రాత్రి అతడికి ఎంతసేపటికీ తెల్లవారలేదు.

51

రాత్రి చాలా పొద్దుపోయింది. లక్ష్మణుడు ధనుర్ధరుడు అయి ఏకాగ్రతతో కాపలా కాస్తున్నాడు. అతణ్ణి చూచి గుహుడు సంతాప సంతప్తుడు అయిపోయినాడు. "నాయనా లక్ష్మణా! నీకోసము శయ్య అమర్చి ఉంది. నీవు పడుకోవలసింది. నీవు ఎంతో అలసిపోయి ఉన్నావు. సుఖముగా నిద్రపో. మేము అందరమూ కష్టానికి అలవాటుపడ్డ వాండ్లము. నీవు అట్లా కాదు. సుఖపడ్డవాడివి. ఈ రాత్రి అంతా మేము సీతారాములకు కావలి కాస్తాము."

"ఓ లక్ష్మణా! ఈ భూభాగములో రాముడికన్నా ప్రియమిత్రుడు నాకు ఎవడూ లేడు. నేను యథార్థము చెప్పుతున్నాను. రాముడు నా ప్రాణమిత్రుడు. అతని అనుగ్రహమువల్ల నేను యశస్విని అయినాను. ధనవంతుణ్ణి అయినాను. ధర్మాధర్మాలు తెలుసుకొన్నాను.

"నాయనా! నిద్రపోతూ ఉన్న ఈ సీతారాములకు నేనూ, నా జ్ఞాతులూ విల్లంబులు పట్టుకొని అన్నిదిక్కులూ కాపలా కాస్తాము.

నేను ఎప్పుడూ అడవిలో తిరిగేవాణ్ణి. ఇక్కడ నాకు తెలియంది ఏమీ లేదు. చతురంగబలాలు వచ్చినా నన్ను ఒక్కణ్ణి ఇక్కడ ఎదుర్కోలేవు" అన్నాడు గుహుడు.

అంతట లక్ష్మణుడు, "ఓ గుహుడా! నీవు పరమధార్మికుడవు. నీ శక్తి సామర్థ్యాలు నేను ఎరుగుదును. నీవు ఇక్కడ కాపు ఉంటే మాకు ఏ భయమూ లేదు. అయితే, దశరథమహారాజు అంతటివాడి జ్యేష్ఠపుత్రుడు రాముడు సీతాదేవితో కూడా అట్లా నేలమీద పడుకొని ఉంటే, నాకు నిద్ర ఎట్లా పట్టుతుంది? నాకు సుఖము ఎందుకు? నేను బ్రతికి ఉండడము ఎందుకు? ఈ రామున్ణి యుద్ధములో దేవాసురులు అయినా ఎదుర్కొనలేరు. అటువంటి రాముడు, ఇటువంటి కటికనేలమీద సీతాదేవితో పడుకొని నిద్రపోతున్నాడు. ఓ స్థపతీ! దశరథమహారాజు ఎన్నో పూజలు చేసి, ఎన్నో మంత్రాలు జపములు చేసి, ఎన్నో యజ్ఞాలు చేసి ఈ రామున్ణి కన్నాడు. గుణగణాలలో ఆయనకూ, ఈ రాముడికీ ఏ భేదమూ లేదు. దశరథమహారాజుకు ఈ రాముడు

అంటే ఎంతో ప్రేమ. ఇతడు అరణ్యానికి చేరినాడు అని తెలియగానే ఆయన బ్రతుకడు. అంతట దశరథమహారాజు, అంతఃపురాంగనలు అందరూ ఏడ్చి ఏడ్చి మూలపడిపోతారు. అంతట రాజభవనమూ ఏ చడీ చప్పుడూ లేకుండా పాడు పడిపోతుంది. అంతటి కోసల రాజ్యమూ అనాధము అయిపోతుంది.

"ఓ గుహుడా! కౌసల్యాదేవీ, దశరథమహారాజూ, మా అమ్మ సుమిత్రాదేవీ ఇక బ్రతుకుతారు అని నేను అనుకోను. ఒకవేళ బ్రతికేటట్లయితే, ఈ రాత్రి మాత్రము బ్రతుకుతారు. ఆ తరువాత బ్రతకరు. మా అమ్మ నా తమ్ముడు శత్రుఘ్నుణ్ణి చూచుకొని బ్రతికితే బ్రతకవచ్చును. కాని, పరమపరాక్రమవంతుణ్ణి రాముణ్ణి కన్న కౌసల్యాదేవి మాత్రము బ్రతుకదు.

"అయోధ్యా నగరవాసులు అందరూ దశరథమహారాజు మీద ఎంతో అనురాగముతో ఉంటున్నారు. ఆయన వల్లనే వారు అందరూ సుఖపడుతున్నారు. సంతోషపడుతున్నారు. ఆయన పోయిన తరువాత వాండ్లు అందరూ దిక్కులేని వాండ్లు అయిపోతారు.

"గుహుడా! రాముడు దశరథ మహారాజుకు జ్యేష్ఠపుత్రుడు. మహాత్ముడు. అందులో ప్రియపుత్రుడు. అటువంటి రాముణ్ణి చూడకుండా దశరథమహారాజు జీవించడము ఉత్తది. ఆ మహారాజు చనిపోయిన తరువాత, కౌసల్యాదేవి ఎంతమాత్రమూ బ్రతుకదు. అయిపోయింది. ఏదో అయిపోయింది. అంతా అయిపోయింది. అది అంతా తలచుకొని ప్రయోజనములేదు. మా తండ్రి దశరథమహారాజు రాముడికి పట్టము కట్టవలెను అనుకొన్నాడు. ఆ కోరిక ఈడేరకుండానే ఆయన చనిపోతాడు, తప్పదు.

"గుహుడా! తండ్రికి మరణ సమయము ఆసన్నము అయినప్పుడు దగ్గర ఉండి ప్రేతకర్మలను అన్నిటినీ చేసే పుత్రులే పుత్రులు. వారే సిద్ధార్థులు. మాకు ఆ భాగ్యము లేదు కాబోలు.

"అయోధ్యానగరము ఎంతో మనోహరము అయిన పట్టణము. రమ్యము అయిన చత్వారాలూ, తీర్చిదిద్దిన రాజవీధులూ, విశాలము అయిన హర్మ్యప్రాసాదాలూ, ఉన్నతము అయిన రాజప్రాసాదాలూ ఇప్పుడు నా కళ్ళెదుట కనబడుతున్నవి. మా అయోధ్యానగరము ఎటుచూచినా ఎప్పుడూ రథాలతోనూ, గుర్రాలతోనూ, ఏనుగులతోనూ కిటకిటలాడుతూ ఆరామ ఉద్యానవనాలతోనూ, సమాజోత్సవాలతోనూ, హృష్టపుష్టజనులతోనూ సర్వకళ్యాణసంపన్నముగా ఉంటుంది. అక్కడ ఇక భరతశత్రుఘ్నులు విహరిస్తారు.

"ఓ స్థపతీ! దశరథమహారాజు బ్రతికి ఉంటాడా? ఆ సువ్రతుణ్ణి, ఆ మహాత్ముణ్ణి నేను మళ్ళీ పోయి చూడగలనా? మా వనవాసము అంతా అయిపోవడమూ, రాముడు అయోధ్యానగరానికి తిరిగిపోవడమూ, దశరథమహారాజు క్షేమముగా ఉండ డమూ సంభవిస్తుందా" అంటూ, ఆ నిలుచుని ఉన్న లక్ష్మణుడు ఆవురుమని ఏడ్చినాడు.

గుహుడున్నూ వ్యసనాభిపీడితుడు అయిపోయినాడు. జ్వరమువచ్చి బాధపడుతున్న ఏనుగుమాదిరిగా కన్నీరు కార్చసాగినాడు.

ఇంతలో తెల్లవార వచ్చింది.

52

రామునిపై సుమంత్రుని ప్రేమ

రాముడు నిద్రలేచి, "లక్ష్మణా! సూర్యోదయము కాబోతున్నది. రాత్రి సుఖముగా గడచిపోయింది. ఇదుగో, నల్లటికోకిల మహామధురముగా కూస్తూ ఉంది. అడవిలో నుంచి నెమళ్ళు కేకలుపెట్టుతూ ఉన్నవి. గంగానది మహావేగముగా సముద్రానికి పరుగులు ఎత్తుతూ ఉంది. మనము ఈ గంగను త్వరగా దాటిపోవలెను" అన్నాడు.

లక్ష్మణుడు గుహుణ్ణి, సుమంత్రుణ్ణి పిలిచి, రాముని అభిప్రాయము తెలియ చెప్పినాడు.

గుహుడు తన మంత్రులను పిలిచి, "రామప్రభువు ఇప్పుడే ఈ గంగానదిని దాటిపోవలెను అంటున్నాడు. చుక్కాని అమర్చిన బందోబస్తు అయిన చక్కని నావను రేవులోనికి తీసుకొనివచ్చి తెడ్డువేసి రామప్రభువును సుఖముగా దాటించ వలెను" అని ఆజ్ఞాపించినాడు.

వాండ్లు అప్పటికి అప్పుడే అందము అయిన ఒక నావను రేవులోకి తీసికొనివచ్చి గుహునికి చెప్పినారు. అంతట గుహుడు రాముడి దగ్గరకు పోయి నమస్కారము చేసి, "దేవా! నావ సిద్ధముగా ఉంది. మీకు ఏమి కావలెనో, నేను ఇంకా ఏమి చేయవలెనో చెప్పవలెను" అన్నాడు.

"గుహుడా! నేను కోరింది చేసిపెట్టినావు. నావలో ముందుగా సీతాదేవి వస్త్రాభరణాదులను ఎక్కించవలెను" అన్నాడు రాముడు. అంతట ఆ అన్నదమ్ములు కవచాలు తొడుగుకున్నారు. తూణీరాలు బిగించి, కృపాణాలు ధరించి, కోదండపాణులు అయి సీతాదేవిని వెంటపెట్టుకొని రేవులోనికి పోయినారు.

సుమంత్రుడు రాముడికి నమస్కారముచేసి, "ప్రభూ! ఇక నేను ఏమి చేసేది" అని అడిగినాడు. రాముడు తన కుడిచేతితో సుమంత్రుడి వీపు తట్టుతూ,

"ఓ మంత్రిసత్తమా! ఇకను మీరు అయోధ్యకు వెళ్ళండి. దశరథమహారాజు చెప్పినంత దూరమూ రథము ఎక్కించి మమ్ములను తీసుకొని వచ్చినారు. ఇకను మేము ఈ గంగను దాటి కాలినడకను అడవికి పోతాము. మీరు ఇంటికిపోయి ఏమరుపాటు లేకుండా మా తండ్రిని కనిపెట్టుకొని ఉండండి" అని చెప్పినాడు.

సుమంత్రుడికి దుఃఖము వచ్చింది. ఆ పురుషోత్తముణ్ణి చూచి, "రామప్రభూ! మీ వనవాసప్రయాణము తప్పించడానికి ఎవరికీ అలవికాక పోయింది. మీరు ఆటవికుడివలె భార్యనూ, తమ్ముణ్ణీ వెంటపెట్టుకొని పోతున్నారు. మీ బ్రహ్మచర్య వ్రతానుష్ఠానమూ, మీ వేదాధ్యయనమూ, మీ దయాగుణమూ, మీ ఆర్జవమూ నిష్ఫలాలు కాబోలు. మీరు అడవిలో ఉన్నా, ముల్లోకాలూ జయించిన మహావిష్ణువువలె మీరు కీర్తివంతులు అవుతారు. మీకు సద్గతే. ఇంతకూ మోసపోయినవాణ్ణి నేను. మీ వెంటవచ్చిన పౌరులను వంచించడానికి నన్ను ఉపయోగించినారు. ఇప్పుడు నన్నూ వారివలెనే చేస్తున్నారు. ఇక మేము కైకేయీదేవి అధీనులము అయి దుఃఖభాగులము అవుతాము. మేము చచ్చిపోయినవారిలో లెక్కే" అన్నాడు.

రాముడు అప్పుడే దూరగతుడు అయిపోయినట్టు సుమంత్రుడికి తోచింది. పట్టశక్యముకాని దుఃఖము వచ్చింది. చాలాసేపు ఏడ్చినాడు. ఆ అశుచి పోవడానికి గంగాజలముతో ముఖము కడుగుకొన్నాడు. ఆచమించినాడు.

అంతట రాముడు, "ఓ సుమంత్రుడా! ఇక్ష్వాకువంశీయులకు మీవంటి స్నేహితుడు మరి ఒకడు లేడు. దశరథమహారాజు నన్ను తలచుకొని దుఃఖపడకుండా మీరు చూడవలెను. దుఃఖముతో ఆయన హృదయము తల్లడిల్లిపోతూ ఉంటుంది. ఆయన వృద్ధుడు. పయిగా కామభారముతో కుంగిపోయి ఉన్నాడు. అందువల్ల, నేను మీకు ఇంతగా చెప్పుతున్నాను. కైకేయీదేవిని సంతోషపెట్టడానికి ఆయన ఏమి ఆజ్ఞాపించినా మీరు సందేహించకుండా చక్కపెట్టవలెను. ఏమంటే, తాము అనుకొన్న పనులు నిర్విఘ్నముగా కొనసాగించుకోవడానికే రాజులు రాజ్యపాలనము చేస్తూ ఉంటారు. ఏ పని ఎట్లా చేస్తే దశరథమహారాజు సంతోషిస్తాడో, ఆ పనిని ఆయనకు మీరు అట్లా చేసిపెట్టుతూ ఉండవలెను.

"ఎన్నడూ ఏ దుఃఖమూ ఎరుగని ఆ పూజనీయుడికి, ఆ జితేంద్రియుడికి, మా తండ్రి దశరథమహారాజుకు నేను నమస్కారముచేసి ఈ విధముగా మనవి చేసినాను అని చెప్పవలెను :

"అయోధ్యా నగరము వదలి అడవిలో ఉండవలసి వచ్చినందుకు నేనుకానీ, సీత కానీ, లక్ష్మణుడుకానీ ఏమాత్రమూ కించపడడములేదు. పధ్నాలుగు సంవత్సరాలూ

అయిపోగానే మేము మళ్ళీ వస్తాము. వచ్చి మిమ్ములను కనిపెట్టుకొని ఉంటాము అని మా నాయనగారితో చెప్పి మా తల్లి కౌసల్యాదేవికీ, తక్కిన రాజపత్నులకూ, కైకేయీదేవికీ పదేపదే నమస్కారము చేసినాము" అని చెప్పవలసింది.

"సుమంత్రుడా! భరతుణ్ణి వెంటనే పిలిపించవలెను అనీ, రాజుల సమ్మతితో వానికి పట్టము కట్టవలెను అనీ మీరు దశరథమహారాజుకు చెప్పి, ఆ పని చేయించవలెను. భరతుణ్ణి యువరాజునుచేసి కొగిలించుకోగానే, దశరథమహారాజుకు మా ఎడబాటువల్ల వచ్చిన దుఃఖము అంతా తొలగిపోతుంది.

"ఓ సుమంత్రుడా! భరతుడితో ఈవిధముగా చెప్పవలెను, "నీవు దశరథమహారాజు విషయములోఎట్లా ప్రవర్తిస్తావో, తల్లులు అందరి విషయములోనూ అదేవిధముగా ప్రవర్తింపవలెను. కైకేయీదేవి నీ తల్లి. సుమిత్రాదేవి శత్రుఘ్నుడి తల్లి. వారిని ఇద్దరినీ నీవు ఎట్లాగూ గౌరవిస్తావు. అడవికి పోయినవాడి తల్లి కౌసల్యాదేవి. ఆమెను నీ తల్లివలె గౌరవించడమే నీ గొప్పదనము. నీవు నీ తండ్రినీ, తల్లులనూ సంతోషపెట్టడానికే యువరాజువు అవుతున్నావు.

"ఓ సుమంత్రుడా! ఈ విధముగా వారి వారికి చెప్పవలెను. ఇక బాగు ఎందుకు? మీరు అయోధ్యానగరానికి సుఖముగా వెళ్ళిపోవలసింది" అన్నాడు.

సుమంత్రుడు దుఃఖముతో కుంగిపోయి రాముణ్ణిచూస్తూ, "రామా! నాకు మీతోఉన్న స్నేహమునుంచి నేను ఇప్పుడు నిర్భయముగా చెప్పుతున్నాను. మిమ్ములను సంతోషపెట్టవలెను అని చెప్పడములేదు. నేను మీ భక్తుణ్ణి. మీరు లేకుండా నేను ఒక్కణ్ణీ అయోధ్యపట్టణము పోలేను. పయిగా అయోధ్యానగరము ఇప్పుడు మీ వియోగశోకముతో పరితపించిపోతూ ఉంటుంది. నేను మిమ్ములను ఈ రథము ఎక్కించుకొని రావడము అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు మీరు లేకుండా నేను ఒక్కణ్ణీ ఈ రథము తోలుకొనిపోతే అందరూ నన్ను నిందిస్తారు. యుద్ధరంగములో రథము ఎక్కివచ్చిన వీరుడు హతుడు కాగా, తిరిగి వెళ్లిన శూన్యరథాన్ని చూచి అతని సైన్యము ధైన్యము పాలు అయ్యేటట్టుగా, ఉత్త రథముతో నేను తిరిగిపోతే అయోధ్య అంతగానూ అలమటించి పోతుంది.

"రామా! మీరు ఇప్పుడు అయోధ్యానగరానికి ఇంతదూరాన ఉన్నప్పటికీ, అయోధ్యాపౌరులు అందరూ మిమ్ములను గురించే ఆలోచిస్తూ అన్నము అయినా తినకుండా ఉంటారు. మీరు వనవాసానికి బయలుదేరినప్పుడు ప్రజలు అందరూ ఎంత తల్లడిల్లిపోయినారో, ఎంత క్షోభపడిపోయినారో మీరే స్వయముగా చూచినారు. మీరు లేకుండా నేను ఇప్పుడు ఈ రథములో పోతే పౌరులు అందరూ అప్పటికన్నా నూరింతలు దుఃఖపడి పోతారు.

"రామా! మీ అమ్మగారితో నేను ఏమి అని చెప్పేది? మీ కుమారుణ్ణి మేనమామ ఇంట్లో దిగబెట్టి వచ్చినాను అని చెప్పేదా? ఈ అబద్ధము చెప్పడము ఎట్లాగు? అట్లాగే, మీ కుమారుణ్ణి అడవులలో వదలిపెట్టి వచ్చినాను అని చెప్పలేను.

"రామా! మీరూ, సీతాదేవీ, లక్ష్మణుడూ రథము ఎక్కితే లాగుకొనివచ్చిన గుర్రాలు మీరు ముగ్గురూ ఇప్పుడు ఎక్కకపోతే ఈ రథాన్ని లాగుతవా? నేను అయోధ్యకు పోను. మీతోనే వస్తాను. అడవిలోనే ఉంటాను. మీరు ఇందుకు అంగీకరించవలెను. మీరు కాదు అనేటట్లయితే నేను ఈ రథముతో కూడా అగ్నిప్రవేశము చేస్తాను.

"రామా! అవనిలో క్రూరమృగాలు ఏవీ మీ తపస్సుకు విఘ్నము చేయకుండా నేను ఈ రథము ఎక్కిపోయి వాటిని వేటాడి చంపివేస్తాను. మీ వనవాస ప్రయాణము వల్ల మీకు రథముతోలే భాగ్యము నాకు అబ్బినది. మీరు అనుగ్రహిస్తే వనవాస సౌఖ్యమున్నూ అనుభవిస్తాను. మీరు అనుమతించవలెను. ఓ ప్రభూ! అడవిలో ఈ గుర్రాలు మీకు సేవచేస్తవి. వీటి జన్మ ధన్యము అవుతుంది. నేనూ మీ సేవచేస్తూ ఉంటాను. మీరు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే ఉంటాను. మీరు లేకుండా నేను అయోధ్యలోనే కాదు, దేవలోకములో అయినా ఉండను. దేవేంద్రుడి రాజధానీ నగరానికి అయినా పోను. మీ పద్నాలుగు ఏండ్ల వనవాసము అయిపోగానే, ఈ రథము మీదనే మిమ్ములనూ, సీతాదేవినీ, లక్ష్మణుణ్ణీ ఎక్కించుకొని అయోధ్యకు పోతాను. ఇది నా కోరిక. మీ సాన్నిధ్యములో ఉండేటట్టయితే పద్నాలుగు సంవత్సరాలు నాకు పద్నాలుగు ఘడియలుగా గడిచిపోతవి. అట్లాకాకపోయేటట్లయితే, పద్నాలుగు వందల సంవత్సరాలుగా గడుస్తవి.

"రామా! నీవు భృత్యవత్సలుడవు. నేను మీ భృత్యుణ్ణి. అంతేకాదు, మీ భక్తుణ్ణి. నేను మీవెంట వస్తాను అంటూ ఉంటే, మీరు నన్ను వదలిపెట్టి వెళ్ళ కూడదు" అంటూ, సుమంత్రుడు దీనముగా యాచించినాడు. రాముడికి తన సేవకులు అంటే ఎంతో ప్రేమ. సుమంత్రుణ్ణి చూచి, "ఓ మంత్రిపుంగవా! మీ ప్రభుభక్తిపరాయణత్వము నాకు తెలుసును. అందువల్లనే, మిమ్ములను అయోధ్యానగరము పొమ్మంటున్నాను. మీరు అయోధ్యకు పోగానే, మా సవతితల్లి కైకేయీదేవి రాముడు అడవులపాలు అయినాడు అని నమ్ముతుంది. మీరున్నూ చెప్పుతారు. ఆమె సంతోషిస్తుంది. పరమధార్మికుడు అయిన నా తండ్రి దశరథమహారాజు మిథ్యావాదికాదు అని ఆమెకు అప్పుడు తెలుస్తుంది. ఆయన సత్యసంధుడు అని ఆమె విశ్వసిస్తుంది. ఆమె పుత్రుడు భరతుడు అంతట యువరాజు అవుతాడు. నా ముఖ్యము అయిన కోరిక ఆమె సంతోషించడమే కాబట్టి,

నన్ను సంతోషపెట్టడానికైనా మీరు వెంటనే అయోధ్యకు పోవలెను. నేను ఎవరెవరికి ఏమేమి చెప్పినానో, అవి అన్నీ ఎక్కువ తక్కువలు లేకుండా వారి వారికి చెప్పవలెను" అన్నాడు రాముడు.

ఈ విధముగా చెప్పి రాముడు సుమంత్రుణ్ణి అయోధ్యకు పోవడానికి ఒప్పించినాడు.

అంతట ఆ మహాత్ముడు రాముడు గుహుణ్ణిచూచి, "ఓ సఖుడా! నేను జనసంచారములేని అరణ్యంలోనే ఉండవలెను. అది పిత్రాజ్ఞ. అందువల్ల, నేను ఇక్కడ ఉండకూడదు. కందమూలాలు తింటూ నేలమీద పడుకోవలెను. మునిజనుల జటలు ధరింపవలెను. కాబట్టి, ఇప్పుడు నాకు మర్రిపాలు కొట్టించి తెప్పించి పెట్టవలెను" అన్నాడు.

అప్పటికి అప్పుడు గుహుడు మర్రిపాలు తెప్పించినాడు. ఆ మర్రిపాలను రామలక్ష్మణులు తమ తలలకు పట్టించినారు. అంతట ఆ అన్నదమ్ముల వెంట్రుకలు జడలు కట్టుకొని పోయినవి. జటాకమండలాలతోనూ, వల్కలాలతోనూ వారు అప్పుడు మహామునులవలె శోభించినారు. వారు వైఖానసమహర్షి పద్ధతిని వానప్రస్థవ్రతము అవలంబించినారు.

రాముడు గుహుణ్ణి చూచి, "మిత్రుడా! రాజ్యాన్ని కాపాడుకొంటూ ఉండడము కష్టసాధ్యము అయిన పని. నీ బొక్కసాన్నీ, నీ దుర్గాన్నీ, నీ గ్రామాలనూ ఏమరుపాటు లేకుండా ధర్మమార్గాన కాపాడుకొంటూ ఉండవలెను సుమా!" అన్నాడు. గుహుణ్ణి అక్కడ నిలిచిపొమ్మని చెప్పి భార్యనూ, లక్ష్మణుణ్ణి వెంట పెట్టుకొని నీటిఒడ్డుకు పోయినాడు. ఆ ఒడ్డున ఉన్న నావను చూచినాడు. లక్ష్మణుడితో, "తమ్ముడా! నీవు ముందు నావ ఎక్కు. ఈ మనస్విని నీ చేతులు పట్టుకొని మెల్లగా నావ ఎక్కుతుంది" అన్నాడు.

అన్నగారి అభిప్రాయము తెలుసుకొని ఆ బుద్ధిమంతుడు లక్ష్మణుడు ముందుగా సీతాదేవిని ఆ నావ ఎక్కించి తానూ ఎక్కినాడు. ఆ తరువాత ఆ మహా తేజస్వి రాముడు నావ ఎక్కి కూర్చున్నాడు. అప్పుడు నిషాదప్రభువు గుహుడు, ఆ నావను ప్రవాహములోకి తోయవలసింది అని నావికులకు ఆజ్ఞాపించినాడు.

ఆత్మహితము కోసము రాముడు నావారోహణమంత్రాన్ని జపము చేసినాడు. యథాశాస్త్రముగా ఆచమించినాడు.

నావ ప్రవాహానికి అడ్డముగా పోతూ ఉంది. రాముడి దేహము ఉప్పొంగి పోయింది. సీతాలక్ష్మణులు ఆ గంగాభవానికి నమస్కారము చేసినారు. రాముడు

సుమంత్రుణ్ణి, గుహుణ్ణి నిలిచిపొమ్మని చేతులతో వీడ్కోలు చెప్పినాడు. వేగముగా నదిని దాటించమని నావికులను హెచ్చరించినాడు. చుక్కాని కాసేవాడు జాగ్రత్తగా కూర్చున్నాడు. నావికులు గబగబా తెడ్డువేయసాగినారు. నావ ఇట్టే నదిమధ్యములోకి పోయింది.

అప్పుడు సీతాదేవి లేచి నిలుచుని ఆ గంగాభవానికి నమస్కారము చేస్తూ, "ఓ గంగా! నీవు భక్తుల కోరికలు ఈడేర్చేదానివి. ఈ రాముడు దశరథపుత్రుడు. ఈయనను నీవు కాపాడవలెను. ఈ మహానుభావుడు పధ్నాలుగు సంవత్సరాలూ వనవాసము చేసి నన్నూ, నా మరిదినీ వెంట పెట్టుకొని తిరిగివచ్చి, నీ దర్శనము చేస్తాడు. అప్పుడు నిన్ను సంతోషముగా పూజచేస్తాను.

"ఓ గంగమ్మతల్లీ! నీవు త్రిపధవు. స్వర్గమర్త్యపాతాళలోకాలలోవారిని అందరినీ నీవు పునీతులను చేస్తున్నావు. నీవు బ్రహ్మలోకములో వెలసినావు. సముద్రుణ్ణి భర్తగా చేపట్టినావు. అందువల్ల, నిన్ను ఈ లోకములో మేము చూస్తున్నాము. నిన్ను స్తోత్రము చేస్తున్నాను. నీకు నమస్కారము చేస్తున్నాను. నా భర్తా, నేనూ సుఖముగా తిరిగి వచ్చిన తరువాత నా భర్తకు పట్టము కట్టుతారు. అప్పుడు నేను నిన్ను సంతోషపెట్టుతాను. లక్షగోవులను బ్రాహ్మణులకు దానము ఇస్తాను. వారికి మృష్టాన్నము పెట్టుతాను. వారికి అందరికీ వస్త్రాలున్నూ ఇస్తాను.

"ఓ గంగాదేవీ! నేను తిరిగి అయోధ్య చేరగానే వెయ్యి బానల మద్యముతోనూ, మాంసాన్నములతోనూ నిన్ను పూజ చేస్తాను. నీ తీరాన ఉన్న దేవాలయములనూ, దేవతలనూ, తీర్థాలనూ సేవిస్తాను. ఓ తల్లీ! నా పెనిమిటి ఏ కళంకమూ లేనివాడు. వీరుడు. ఈయన నన్నూ, నా మరిదినీ వెంటపెట్టుకొని సుఖముగా తిరిగి అయోధ్యానగరము చేరేటట్టు నీవు అనుగ్రహించవలెను" అంటూ ఉండగా, ఆ నావ ఆ గంగానది దక్షిణ తీరము చేరింది.

నావ దిగి సీతారామలక్ష్మణులు అరణ్యమార్గాన నడవ సాగినారు. రాముడు లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! ఇక మమ్ములను కాపాడవలసినవాడవు నీవే. ఇదివరకు ఎన్నడూ ఎరుగని అరణ్యములోకి ఇప్పుడు మనము పోతున్నాము. అందువల్ల, ముందు నీవు నడువవలెను. నీ వెనుక సీత నడుస్తుంది. నేను మీ ఇద్దరినీ చూచుకుంటూ మీ ఉభయుల వెనుకా నడుస్తాను.

"లక్ష్మణా! ఈ అడవిలో మనము ఒకండ్లకు ఒకండ్లము అండగా ఉండవలెను. కడచిపోయిన తరువాత ఏమీ చేయలేము. కాబట్టి, ఎప్పుడూ జాగ్రత్తతో నడువవలెను. వనవాస కష్టాలు అంటే ఏమిటో సీతకు ఇకను తెలుస్తవి అంటూ సీతాదేవివంక

చూచి, 'ఓ సీతా! ఇక జనసంచారము ఎక్కడా ఉండదు. పంటపొలాలుకానీ, ఉద్యానవనాలుకానీ ఇక నీకు కనిపించవు. మిట్టపల్లాలుగా ఉండే అడవిలోకి మనము పోతున్నాము'' అన్నాడు.

ముందు లక్ష్మణుడూ, అతని వెనుక సీతాదేవీ, వారి ఇద్దరి వెనుకా రాముడూ ఆ అడవిలో నడువ సాగినారు.

రాముడు గంగానదినిదాటి అవతల గట్టున సీతా లక్ష్మణులతో నడుస్తూ కంటికి కనపడకుండా పోయేటంతవరకున్నూ, సుమంత్రుడు గంగానది ఉత్తరపు గట్టున నిలుచుకొని చూచినాడు. వారు కంటికి కనపడకుండా పోగానే, అతడు జలజల కన్నీళ్ళు కార్చినాడు.

సీతారామలక్ష్మణులు ఆ అడవి దాటి పోయినారు. చక్కని పంటపొలాలతో సర్వ సమృద్ధముగా ఉన్న వత్సదేశము చేరినారు. అప్పుడు వారికి ఆకలివేసింది. అంతట రామలక్ష్మణులు ఆ సమీపములో ఉన్న అడవికి వేటకు పోయి ఒక అడవిపందినీ, ఒక మనుపోతునూ, ఒక నల్లచారల దుప్పినీ చంపి తెచ్చినారు. వాటి మాంసము పక్వముచేసి ముగ్గురూ తిన్నారు. సాయంకాలము కాగానే పడుకొనేటందుకు చెట్టు కోసము చూడసాగినారు.

53

ఆ రాత్రి గడపడానికి వారు ఒక పెద్ద మర్రిచెట్టును చూచుకొన్నారు. అంతట రామలక్ష్మణులు సాయంసంధ్య నుపాసించినారు. అప్పుడు రాముడు లక్ష్మణుడితో, "తమ్ముడా! మనదేశము దాటి ఆ యా జనపదాలను వదలిపెట్టి మనము ఇప్పుడు చాలాదూరము వచ్చినాము. ఇప్పుడు మన వెంట సుమంత్రుడున్నూ లేడు. ఇక మనము ముగ్గురమూ గడుపవలసిన రాత్రులలో ఇది మొదటిది. అయితే, నీవు దిగులు పడవద్దు. ఈ రోజు మొదలుకొని రాత్రిపూట మనము ఏమరుపాటు లేకుండా మేలుకొని ఉందాము. లక్ష్మణా! ఈ సీతాదేవి యోగక్షేమములను కూడా మనమే కనిపెట్టి ఉండవలెను.

"లక్ష్మణా! చీకటిపడి పోయింది. కావలసిన ఆకులూ అవీ తెచ్చుకొని చక్కని శయ్యలు అమర్చుకొనే అవకాశము లేకుండా పోయింది. గాలికి రాలిన పండుటాకుల మీదనే ఈ రాత్రికి అట్లాగే నిద్రపోదాము" అన్నాడు.

మార్గాయాసమువల్ల సీతాదేవి నిద్రపోయింది. మెత్తని పరుపులమీద పడుకొనే రాముడు నేలమీద పడుకొని, ఈ విధముగా విచారపడటం మొదలు పెట్టినాడు:

"లక్ష్మణా! దశరథమహారాజుకు ఇప్పుడు నిద్రపట్టి ఉండదు. దుఃఖపడుతూ ఉంటాడు. కైకేయీదేవి మాత్రము కృతకృత్యురాలను అయినాను అని ఉప్పొంగిపోతూ ఉంటుంది. భరతుడు రాగానే వాడికి రాజ్యాధికారము స్థిరము చేయడము కోసము కైకేయీదేవి నాయనగారి ప్రాణాలు తీయదుకదా! నీవూ, నేనూ ఇద్దరమూ ఇట్లా వచ్చివేసినాము. ఇప్పుడు దశరథమహారాజుకు దిక్కులేకుండా పోయింది. పైగా వృద్ధాప్యము. కామాతురుడు అయి కైకేయీదేవికి లోబడి పోయినాడు. పాపము, ఏమి చేస్తాడు?

"తమ్ముడా! ఇప్పుడు మనకు వచ్చిన ఈ కష్టానికి దశరథమహారాజుకు మతిపోయి ఉంటుంది. ఆలోచించి చూస్తే ధర్మముకన్నా, అర్థముకన్నా కామమే బలీయము అని తోస్తుంది సుమా! ఎటువంటి మూర్ఖుడు అయినా ఆడుదాని మాట విని, తన మాట జవదాటని కొడుకును మన తండ్రివలె అడవులకు వెళ్ళకొట్టడు.

"సర్వసమృద్ధము అయిన కోసలరాజ్యానికి కైకేయీ పుత్రుడా మహారాజు? వాడూ, వాడి భార్యా మాత్రము సుఖపడవలెనా? నేనూ, నా భార్యా అడవులపాలు అయిపోవలెనా? దశరథమహారాజు చనిపోవడమా? భరతుడు ఏకాధిపతిగా రాజ్యము ఏలడమా?

"లక్ష్మణా! ధర్మార్థాలను తోసివేసి కామాతురుడు అయ్యే ప్రతివాడూ, దశరథమహారాజువలె ఆపదలపాలు అయిపోక తప్పదు. ఆలోచిస్తూ ఉంటే నేను అడవులపాలు కావడానికీ, దశరథమహారాజు చావడానికీ, భరతుడు కోసలరాజ్యము ఏలడానికీ కైకేయీదేవి మన ఇంట దాపురించింది అనిపిస్తూ ఉంది.

"కైకేయీదేవి ఇక సౌభాగ్యమదముతో మయిమరచి పోతుంది. నానుంచి మా అమ్మ కౌసల్యాదేవినీ, మీ అమ్మ సుమిత్రాదేవినీ నానాబాధలూ పెట్టుతుంది. వాండ్లు అట్లా కష్టాలపాలు కావడము నాకు ఇష్టములేదు. తమ్ముడా! నీవు ఈ తెల్లవారుఝామునే లేచి అయోధ్యానగరానికి ప్రయాణము అయిపో. నేను ఒక్కణ్ణీ సీతను వెంటపెట్టుకొని దండకారణ్యానికి పోతాను. మా అమ్మ కౌసల్యాదేవి దిక్కుమాలి ఉంటుంది. నీవు ఆమెకు దిక్కు అవుతావు. కైకేయి దుష్టురాలు. ద్వేషముతో కౌసల్యాదేవికి ఆమె ఏ అపకారము అయినా చేయవచ్చును. అయితే, భరతుడు మాత్రము ధార్మికుడు. వాడికి నీవు మా అమ్మను ఒప్పగించవలెను.

"తమ్ముడా! జన్మాంతరములో మా అమ్మ ఏ తల్లికో కొడుకుతో ఎడబాటు తెచ్చిపెట్టి ఉంటుంది. అందువల్లనే, ఆమెకు ఇప్పుడు ఈ విధముగా అయింది. నీకు తెలుసును. మా అమ్మ ఎంతో కష్టపడి నన్ను పెంచింది. పోషించింది. ఫలము అనుభవించే సమయానికి నాకూ, ఆమెకూ ఎడబాటు అయిపోయింది. అయ్యో!

నేను ఏమి చేసేది? నానుంచి మా అమ్మకు అంతులేని దుఃఖము వచ్చిపడ్డది. ఏ సీమంతినికీ నావంటి పుత్రుడు పుట్టకూడదు.

"లక్ష్మణా! మా అమ్మ గోరువంకపిట్టనూ, రామచిలుకనూ పెంచుతూ ఉంది. మనము అడవికి పోతున్నాము అని నేను చెప్పేసరికి గోరువంక రామచిలుకతో, 'చిలుకా! మన విరోధి కైకేయీదేవి కాలు కటిక్కిన కొరికి వెయ్యి' అన్నది. ఆ పిట్ట అట్లా అని నాకంటే ఎక్కువగా మా అమ్మను ఆదరించింది. లక్ష్మణా! నేను మా అమ్మను ఏవిధముగానూ సంతోషపెట్టలేక పోయినాను. ఆమెకు ఏమాత్రమూ ఉపకరించలేక పోయినాను. నా జన్మ నిరర్థకము. నేను ఇట్లా వచ్చినందువల్ల మా అమ్మ శోకసాగరములో ముణిగిపోయి ఉంటుంది. తమ్ముడా! నేను ఒకణ్ణీ నా బాణముతో అయోధ్యనే కాదు, ఈ పృథివి అంతా సంహారముచేసి వేయగలను. అయితే అధర్మభయమూ, పరలోకభయమూ నన్ను అందుకు అడ్డగించినవి. అందువల్లనే, పట్టముకోసము నేను ప్రాకులాడలేదు' అంటూ, ఆ నిర్జనారణ్యములో విలపించినాడు. మంటలు ఆరిపోయిన అగ్నిహోత్రమువలెనూ, అలలు ఆగిపోయిన సముద్రమువలెనూ రాముడు అప్పుడు లక్ష్మణుడికి అగుపించినాడు.

"అన్నా! అయోధ్య ఇప్పుడు చంద్రుడు లేని చీకటి రాత్రిగా ఉంటుంది. నిజమే. కాని, నీవు అట్లా పరితాపపడటమువల్ల ప్రయోజనము ఏమీ లేదు. నీవు నన్నూ, సీతాదేవినీ దుఃఖపెట్టడముకన్నా ఫలము ఏమీ ఉండదు. సీతాదేవీ, నేనూ నిన్ను విడిచిపెట్టి ఒక్కక్షణము అయినా ఉండలేము. నీవు సమక్షములో ఉండకపోయేటట్టయితే, నీళ్ళలోనుంచి బయటవేసిన చేపలవలె మేము చచ్చిపోతాము. అన్నా! నీవు లేకుండా నేను మన నాయనగారి దగ్గరకు పోను. మా తమ్ముడి దగ్గరకు కానీ, మా అమ్మ దగ్గరకుకానీ నీవు పొమ్మన్నా నేను పోను. స్వర్గముతో అయినా నాకు నిమిత్తములేదు. అన్నా! నీవు ధైర్యము కోలుపోవద్దు" అని చెప్పినాడు లక్ష్మణుడు.

రాముడు ఆ మర్రిచెట్టుక్రింద పడుకొని ఆలోచించ సాగినాడు. పధ్నాలుగు ఏండ్లూ వనవాసముచేయ నిశ్చయించినాడు.

పర్వతసానువులలో సంచారముచేసే సింహాలవలె ఆ నిర్జనారణ్యములో ఏ భయమూ, ఏ తొట్రుపాటూ లేకుండా ఆ రామలక్ష్మణులు ఆ రాత్రి ఆ మర్రిచెట్టుక్రింద గడపినారు.

54

భరద్వాజుని ఆశ్రమ సందర్శనము

తెల్లగా తెల్లవారింది. కొంచెము ప్రొద్దెక్కిన తరువాత సీతారామలక్ష్మణులు అక్కడనుంచి గంగా యమునా సంగమ ప్రదేశాభిముఖులై పోయినారు. అదివరకు

ఎన్నడూ చూడని గ్రామాలూ, మనోహరము అయిన జనాంతర ప్రదేశాలూ, రకరకాల చెట్లూ చేమలూ చూచుకొంటూ పొద్దు ఏటవాలేవరకూ ఖులాసాగా నడిచినారు. అప్పుడు రాముడు లక్ష్మణుడితో, "సౌమిత్రీ! చూడు, పొగ ఎంత ఎత్తున లేచిందో చూడు. ఈ పొగ అగ్నిహోత్రుడి ధ్వజము. మనము భరద్వాజాశ్రమ ప్రాంతానికి వచ్చినట్టు ఉన్నాము. గంగా యమునా జలాల పరస్పర సంఘట్టన ధ్వని వినపడుతున్నది. ఇదే ప్రయాగ క్షేత్రము. ఇవిగో, ఇటు చూడు. అడవులమీద బ్రతికేవాండ్లు కొట్టి పడవేసిన చెట్లమానులు కనిపిస్తున్నవి. అటు వివిధ ఫలవృక్షాలూ కనిపిస్తున్నవి. ఆ కనపడుతున్నదే భరద్వాజాశ్రమము అయి ఉంటుంది" అన్నాడు. ధనుర్ధరులు అయిన ఆ అన్నతమ్ములు సీతను వెంటపెట్టుకొని గంగా యమునా సంగమ ప్రదేశములో భరద్వాజాశ్రమానికి సూర్యాస్తమయ సమయాన పోయినారు. వారిని చూచి, ఆ ఆశ్రమములో ఉన్న వివిధమృగాలూ బెదిరిపోయి భరద్వాజుడి దగ్గరకు పరుగెత్తినవి.

సీతారామలక్ష్మణులు భరద్వాజుడు ఉన్న పర్ణశాలలోకి పోయినారు. అప్పుడు ఆ సంశ్రితవ్రతుడు, ఆ ఏకాగ్రచిత్తుడు, ఆ తపోలబ్ధదివ్యనేత్రుడు హోమము చేస్తున్నాడు. అందువల్ల, సీతారామలక్ష్మణులు ఆయన దర్శనము చేయడానికి కనిపెట్టుకొని నిలుచున్నారు. ఆ మహాత్ముడు అగ్నికార్యము ముగించి వారిని చూచినాడు. వారు ఆయనకు నమస్కారము చేసినారు.

అంతట రాముడు, "ఓ మహాత్మా! మేము దశరథమహారాజు పుత్రులము. నా పేరు రాముడు. వీడు నా తమ్ముడు లక్ష్మణుడు. ఈ కళ్యాణి జనకమహారాజు కూతురు, నా భార్య సీత. ఈమె పతివ్రత. అందువల్ల నన్ను వదలిపెట్టి ఉండలేక నాతో బయలుదేరింది. ఈ నా తమ్ముడు దృఢవ్రతుడు. నన్ను సంతోషపెట్టడమే వీడు తన పనిగా పెట్టుకున్నాడు. మా తండ్రిగారు నన్ను వనవాసము చేయమని ఆజ్ఞాపించినారు. మేము ఏదయినా తపోవనములో కందమూలాలు, ఫలాలు ఆహారముగా చేసుకొని ధర్మప్రవర్తనముతో నివసించవలెను అని వచ్చినాము" అన్నాడు.

"రామా! నీకు స్వాగతము" అంటూ ఆ మహాత్ముడు మధుపర్కము బదులు గోవునూ, అర్ఘ్యజలాన్నీ తెప్పించి ఇచ్చినాడు. ఆ యా కందమూలాలనూ, ఎన్నోరకాల ఫలాలనూ, నానావిధ అన్నరసాలనూ వారికి ఇప్పించినాడు. ఆ రాత్రి వారు పడుకోవడానికి విడిది ఏర్పాటు చేసినాడు.

భరద్వాజుడు సీతారామలక్ష్మణులను సత్కరించి, వారిదగ్గర కూర్చున్నాడు. అప్పుడు ఆయన చుట్టూ మహామునులే కాకుండా రకరకాల పక్షులూ, వివిధమృగాలూ

వచ్చి కూర్చున్నవి. ఆయన రాముడితో, "నాయనా! నీవు ఇట్లా వచ్చినందువల్ల బహుకాలానికి నిన్ను చూడగలిగాను. సంతోషము. నీ తండ్రి నిన్ను నిష్కారణముగా అడవులకు పొమ్మన్నాడు అని విన్నాను. ఇది గంగా యమునా నదులు సంగమించే పవిత్ర క్షేత్రము. నిర్జన ప్రదేశము. నీవు ఇక్కడ సుఖముగా ఉండవచ్చును" అన్నాడు.

"ఓ మహాత్మా! ఈ ప్రదేశము ఎన్నో గ్రామాలకున్నూ, ఎన్నో పట్టణాలకున్నూ సమీపముగా ఉంది. మేము ఇక్కడ ఉన్నాము అని తెలిసి నన్నూ, ఈ సీతనూ చూడటానికి జనులు అందరూ వస్తారు. అందువల్ల, ఇక్కడ ఉండడము నాకు ఇష్టము లేదు. ఈ సీత సుఖముగా ఉండడానికి ఏది అయినా ఏకాంతముగా ఉండే యోగ్యము అయిన ఆశ్రమ ప్రదేశము తాము సెలవు ఇవ్వవలెను" అని రాముడు అన్నాడు.

భరద్వాజుడు రాముడి అభిప్రాయాన్ని తెలిసికొని, "నాయనా! ఇక్కడికి పది క్రోసుల దూరములో చిత్రకూటము అనే పర్వతము ఉంది. అది చాలా పవిత్రము అయింది. గంధమాదన పర్వతము వంటిది. అనేకమంది మహర్షులు అక్కడ నివసిస్తున్నారు. అది చాలా రమణీయము అయిన ప్రదేశము.

"చిత్రకూట పర్వతశిఖరాలు చూస్తూ ఉంటే, పాపచింతలు అన్నీ పోయి పుణ్యకార్యాలు చేయ బుద్ధి పుట్టుతుంది. అనేకమంది మహర్షులు వందలకొద్దీ సంవత్సరాలు అక్కడ తపస్సు చేసి కపాల శిరస్సులతో స్వర్గతులు అయినారు. అది విజన ప్రదేశము. అక్కడ మీకు సుఖముగా ఉంటుంది. లేదా ఇక్కడ నాతో అయినా ఉండవలసింది" అన్నాడు.

అంతట ఆ ధర్మవేత్త ఆ సీతారామలక్ష్మణులకు తనివితీర అతిధి సత్కారములు చేసినాడు. రాత్రి పొద్దుపోయేవరకూ వారికి ఎన్నో పుణ్యకథలు చెప్పినాడు. సీతారామలక్ష్మణులు ఆ రాత్రి మనోహరము అయిన ఆ భరద్వాజాశ్రమములో పడుకొన్నారు. మార్గపరిశ్రాంతులు అయినందువల్ల సుఖముగ నిద్రపోయినారు.

తెల్లవారుఝామున రాముడు తపోదీప్తులతో తేజరిల్లుతూ ఉన్న భరద్వాజ మహర్షికి నమస్కారము చేసి, "ఓ మహాత్మా! రాత్రి అంతా సుఖముగా నిద్రపోయినాము. ఇక మేము మీరు చెప్పిన చిత్రకూట పర్వతానికి వెళ్ళుతాము. తాము సెలవు ఇవ్వవలెను" అన్నాడు.

"నాయనా! చిత్రకూట పర్వత ప్రదేశములో, తేనే, కందమూలాలూ, ఇంకా అనేకరకాల పండ్లూ సమృద్ధముగా దొరుకుతవి. నానావిధ వృక్షాలతో ఆ ప్రదేశము మనోహరముగా ఉంటుంది. కిన్నరులూ, ఉరగులూ ఆ ప్రదేశాన్ని సేవిస్తూ ఉంటారు.

అక్కడ నెమళ్ళు ఎప్పుడూ ఆడుతూ పాడుతూ ఉంటవి. వనమధ్యములో ఏనుగులు యథేష్టముగా తిరుగుతూ ఉంటవి. జింకల గుంపులు అంతటా విచ్చలవిడిగా పరుగులు ఎత్తుతూ ఉంటవి. అక్కడ ప్రవహించే నదులూ, సెలయేళ్ళూ, చిన్న చిన్న కొండగుహలూ, పెద్ద పెద్ద కొండగుహలూ చూస్తూ, నీవు నీ భార్యతో విహరించ వచ్చును. అక్కడ చిలుకలూ, కోకిలలూ మధురముగా గానముచేస్తూ ఉంటవి. నీవు చిత్రకూట పర్వత ప్రదేశానికి పోయి, ఆశ్రమము నిర్మించుకొని నివసించ వలసింది" అని భరద్వాజుడు చెప్పినాడు.

55

తెల్లగా తెల్లవారింది.

భరద్వాజమహర్షి సీతారామలక్ష్మణులకు మంగళాశీర్వాదము చెప్పినాడు. అంతట వారు చిత్రకూట పర్వతానికి ప్రయాణము అయినారు. ఊరికి వెళ్ళుతున్న కొడుకులను సాగనంపడానికి పోయే తండ్రివలె, భరద్వాజుడు వారితో కొంతదూరము పోయి, "రామలక్ష్మణులారా! గంగానదిలో యమునానది సంగమించే చోటికి మీరు ముందుగా పొండి. అక్కడనుంచి మీరు పడమటి దిక్కుగా యమునానదిని అనుసరించి నడువవలెను. యమునానది అమితవేగంతో ప్రవహిస్తూ ఉంటుంది. అందువల్ల, అందరూ దాటిపోయే రేవువచ్చే వరకూ మీరు పోవలెను. అక్కడ మీరు తెప్పకట్టుకొని ఆ నదిని దాటవలెను. ఆ నది దాటిన తరువాత అక్కడికి సమీపములో మీకు ఒక పెద్ద మర్రిచెట్టు కనబడుతుంది. దానిచుట్టూ అనేకచెట్లు ఉంటవి. ఆ మర్రిచెట్టు ఊడలకు ఊడలు దిగి, చాలా చోటు ఆక్రమించుకొని ఉంటుంది. దానినే శ్యామము అని అంటారు. ఆ మర్రిచెట్టుకింద అనేకమంది సిద్ధులు నివసించేవారు. ఈ సీతాదేవి తన కోరికలు ఈడేరడానికి శ్యామానికి మొక్కుకోవలెను.

"అక్కడికి పోయేసరికి సీతాదేవి అలసిపోయేటట్టయితే మీరు ఆ మర్రిచెట్టు కిందనే ఉండిపోవచ్చును, లేదా మీరు అక్కడనుంచి సరాసరి ఒక క్రోసెడు దూరము పోయేటట్లయితే యమునానదీ తీరాన్నే మోదుగుచెట్లతోనూ, రేగుచెట్లతోనూ, పెద్ద వెదుళ్ళతోనూ రమ్యము అయిన కారడవి కనిపిస్తుంది. ఆ అడవిలోఉన్న దారినపోతే చిత్రకూటము వస్తుంది. నేను అనేకసార్లు ఆ దారినే చిత్రకూటము పోయి వచ్చినాను. రాళ్ళూ, రప్పలూ లేకుండా ఆ దారి మెత్తగా ఉంటుంది. ఆ దారిన కార్చిచ్చు భయము లేదు. మీరు హాయిగా పోవచ్చును" అని చెప్పినాడు.

సీతారామలక్ష్మణులు భరద్వాజుడికి నమస్కారము చేసి వీడ్కోలు చెప్పినారు. భరద్వాజుడు అంతట వెనుకకు మళ్ళినాడు.

చిత్రకూట ప్రవేశము

భరద్వాజుడు వెళ్ళిన తరువాత రాముడు, "లక్ష్మణా! భరద్వాజమహర్షి మనలను ఎంతో ఆదరించినాడు. మనము పుణ్యము చేసుకొని ఉంటాము" అని చెప్పినాడు. సీతాదేవిని ముందు నడవమని ఆమె వెనుక ఆ అన్నదమ్ములు ఇద్దరూ నడవసాగినారు. యమునానది రేవు దగ్గరకు పోయినారు. అక్కడ కూడా ఆ నదీజలాలు అమితవేగముతో ప్రవహించడము చూచినారు. ఆ నదిని దాటడము ఎట్లాగా అని ఆలోచించినారు.

లక్ష్మణుడు ఎండిన కొయ్యలూ, వెదుళ్లూ తీసుకొనివచ్చి వట్టి వేళ్లతో తెప్ప గట్టినాడు. నేరేడు కొమ్మలూ, ప్రబ్బలి తీగెలూ నరికి తెచ్చి సీతాదేవి కూర్చుండడానికి ఆ తెప్పమీద ఒక సుఖాసనము అమర్చినాడు. ఆ తెప్పను నీళ్ళమీదికి పోనిచ్చినాడు. రాముడు తన చేయూతను ఇచ్చి సీతాదేవిని ఆ తెప్ప మీదికి ఎక్కించినాడు. అచింత్య సౌందర్యముతో ఆమె మహాలక్ష్మీదేవివలె ఆ సుఖాసనము అధిష్ఠించింది. అప్పుడు ఆమె కొంచెము సిగ్గు పడ్డది. తల వంచుకొని మందహాసము చేసింది. లక్ష్మణుడు ఆమె చీరలూ, సొమ్ములూ, మేకతోలూ, బుట్టలూ, గుద్దళ్ళూ, వివిధాయుధాలూ ఆమె పక్కను పెట్టినాడు. అంతట ఆ దశరథమహారాజు పుత్రులు ఇద్దరూ చెరి ఒక ప్రక్కను ఆ తెప్పను నెట్టుతూ ఆ ప్రవాహములో నడిచినారు.

ఆ తెప్ప ఆ కాళిందీనది మధ్యభాగములోనికి పోయింది. అప్పుడు సీతాదేవి ఆ నదికి నమస్కారము చేస్తూ "ఓ యమునా, నా పెనిమిటి వనవాసవ్రతము ముగించి నన్నూ నా మరిదినీ వెంట పెట్టుకొని సుఖముగా అయోధ్య చేరేటట్టు నీవు అనుగ్రహించవలెను. నా పెనిమిటి పట్టము కట్టుకోగానే నీపేర మద్యదానమూ గోదానమూ చేయిస్తాను" అని మొక్కింది.

ఆ తెప్ప యమునానది దక్షిణ తీరము చేరింది.

సీతారామలక్ష్మణులు అక్కడనుంచి బయలుదేరి పచ్చటి ఆకులతో చల్లటి నీడను ఇచ్చే మర్రి చెట్టు దగ్గరకు పోయినారు. సీతాదేవి ఆ శ్యామానికి నమస్కారము చేస్తూ "ఓ మహావృక్షమా, నీకు మొక్కుతున్నాను. నా పెనిమిటి వనవాస వ్రతము సుఖముగా సమాప్తము అయిపోవలెను. మా అత్తగారిని కౌసల్యాదేవినీ, మా పిన్నత్తగారిని సుమిత్రాదేవినీ తిరిగి చూచే భాగ్యము నాకు అనుగ్రహించవలెను. నా ఈ కోరికలు నెరవేరేటట్టు కటాక్షించవలెను" అని ప్రార్థిస్తూ ప్రదక్షిణము చేసింది.

రాముడు ఆమె వంక చూచినాడు. ఆమె అలసిపోలేదు. అంతట, "లక్ష్మణా! నీవు సీతను వెంటబెట్టుకొని ముందు నడువు. మీ ఉభయుల వెనకా నేను నడుస్తాను. తమ్ముడా! ఈ సీత దారిలో ఏ పండును అయినా, ఏ పువ్వును అయినా

చూచి ముచ్చటపడితే నీవు వాటిని తెచ్చి పెట్టవలెను" అన్నాడు రాముడు. అట్లా ఆ ముగ్గురూ మాటలు చెప్పుకొంటూ నడుస్తూ ఉంటే రెండు మదపుటేనుగుల మధ్య చక్కని పెంటి ఏనుగు నడుస్తున్నట్లు సీతాదేవి కనిపించింది.

అదివరకు చూడని ఏ చెట్టు అయినా, ఏ గుల్మము అయినా, ఏ లత అయినా కనబడితే సీతాదేవి వాటిని గురించి రాముణ్ణి అడిగి తెలుసుకొంటూ, వారితోపాటు నడిచింది. ఆమె అడిగీ అడగడముతోనే లక్ష్మణుడు ఆ పూలమొక్కలనూ పండ్ల గుత్తులనూ విరిచి తీసుకొని వచ్చి ఆమెకు ఇస్తూ నడిచినాడు.

హంసలూ, సారసపక్షులూ మనోహరముగా పాటలు పాడుతూ ఉంటే రంగు రంగుల ఇసుకలో చిత్ర విచిత్రముగా ప్రవహిస్తూ ఉన్న యమునానదీ తీరాన సీతారామలక్ష్మణులు ఒక క్రోసెడు దూరము పోయినారు. ఒక అడవి చేరినారు. ఆ అడవిలో నెమళ్ళ గుంపులు ఆడుతూ పాడుతూ కోతులు కిచ కిచ చప్పుళ్ళు చేస్తూ, ఏనుగులు ఘీంకారాలు చేస్తూ ఉంటే వారు అవి అన్నీ చూస్తూనూ, వింటూనూ ఆ ప్రాంతములో మిట్టపల్లాలు లేని సమప్రదేశము వెదకసాగినారు.

రామలక్ష్మణులు అంతట ఆ అడవిలో తిన యోగ్యము అయిన మృగాలను వేటాడినారు. వాటి మాంసాన్ని తెచ్చుకొని తిన్నారు.

56

తెల్లవార వస్తున్నది. రాముడు నిద్ర లేచినాడు. లక్ష్మణుడు ఇంకా కునుకుతూనే ఉన్నాడు. రాముడు తమ్ముణ్ణి మెల్లగా లేపుతూ, "ఓ పరంతపా! పక్షులు ఎంతో మనోహరముగా మేలుకొలుపులు పాడుతూ ఉన్నవి. మనము ఇకను ఇక్కడనుంచి ప్రయాణము అయి పోవలెను. పొద్దు ఎక్కుతున్నది" అన్నాడు. లక్ష్మణుడు లేచి మార్గాయాసాన్నీ, నిద్ర మబ్బునూ విదిలించి వేసినాడు.

అంతట సీతారామలక్ష్మణులు యమునా నిర్మలోదకాలలో స్నానము చేసినారు. ప్రాతరాహ్నికాలను ముగించుకొని, భరద్వాజుడు చెప్పిన దారిన చిత్రకూట పర్వతానికి ప్రయాణము అయినారు. దారిన నడుస్తూ రాముడు సీతాదేవితో, "సీతా! చూడు, ఇది వసంతకాలము. పూలు విరగపూసినవి. ఏ చెట్టుకు ఆ చెట్టు పూలదండలు వేసుకొని నిలుచున్నట్టు కనపడుతున్నది. మోదుగుచెట్లు ఎర్రటి పూలతో మండిపోతున్నవా అన్నట్లు కనపడుతున్నవి. అవిగో భల్లాతకి (నల్లజీడి) చెట్లు విరగపూసి, ఎట్లా ఎన్ని కాయలు కాసినవో చూడు. ఆ కాయల బరువుకు కొమ్మలు అన్నీ వంగిపోయినవి. చుట్టూ కంచెలు ఉండడముచేత వాటిని అందుకోవడానికి వీలు కాదు. అటు చూడు, ఆ చెట్టుచెట్టుకూ ఎంతెంత తేనెతుట్టెలు

వ్రేలాడుచున్నవో చూడు. ఒక్కొక్క తేనెతుట్టెలో ద్రోణము (కడివెడు) తేనె వుంటుంది. సీతా! మనము ఇక్కడ హాయిగా కాపురము చేయవచ్చును.

"సీతా! చూడు. ఈ వనప్రదేశము అంతటా పూలపాన్పులు పరచినట్టుగా ఉంది. రమణీయము అయిన ఆ పూలపాన్పులమీద కూర్చుని వానకోకిలలు కూస్తూ ఉంటే, నెమళ్ళు వాటికి జవాబుగా కేకలుపెట్టుతూ ఉన్నవి.

"లక్ష్మణా! చూడు, అదిగో చిత్రకూట పర్వత శిఖరము. ఇవిగో ఏనుగుల మందలు. ఆ వంక చూడు, పక్షుల గుంపులు బార్లుకట్టి పాటలు పాడుతూ ఉన్నవి. నాయనా! ఈ పవిత్ర పర్వతముమీద చెట్లు దట్టముగా పెరిగి మిట్టపల్లాలు లేని సమప్రదేశములో మనము నివాసము పెట్టుకొందాము" అన్నాడు.

అంతట వారు కాలినడకను సునాయాసముగా ఆ పర్వతముమీదికి పోయినారు.

అక్కడ నానావిధ పక్షి సమూహాలూ రకరకాల ఫలవృక్షాలూ ఉన్న ప్రదేశము చూచినారు. వారికి ఆ చోట మంచినీళ్ళున్నూ, కందమూలాలున్నూ సమృద్ధిగా కనిపించినవి. రాముడు లక్ష్మణుడితో, "సౌమ్యుడా! ఈ ప్రదేశము మనోహరముగా ఉంది. పూలతీగెలు చెట్లకు అల్లుకొని మహామనోజ్ఞముగా కనిపిస్తున్నవి. మనము ఇక్కడ హాయిగా ఉండవచ్చును అనుకొంటాను. ఈ ప్రాంతములో మహర్షులు నివసిస్తూ ఉన్నట్టు తోస్తున్నది. అంతా తిరిగి చూద్దాము పద" అంటూ సీతా లక్ష్మణులను వెంటబెట్టుకొని ఒక మున్యాశ్రమములోకి పోయినాడు.

అది వాల్మీకిమహర్షి ఆశ్రమము. సీతారామలక్ష్మణులు ఆయనకు నమస్కారము చేసినారు. వారు తన ఆశ్రమానికి వచ్చినందుకు ఆ ధర్మాత్ముడు ఎంతో సంతోషించినాడు. స్వాగతము చెప్పి కూర్చుండమన్నాడు. వారిని ఆదరించినాడు. రాముడు యథాక్రమముగా తన సంగతిని అంతా ఆయనకు చెప్పినాడు.

అంతట రాముడు ఆ ప్రాంతంలో నివసించడానికి నిశ్చయించుకొనినాడు. "లక్ష్మణా! మనము ఇక్కడ ఇల్లు వేసుకొందాము. మంచివి, గట్టిగా ఉండేవి దూలాలు పట్టుకొని రావలెను" అన్నాడు. లక్ష్మణుడు అందుకు అవసరమైన దూలాలూ, గుంజలూ మొదలు అయిన వాటిని అడవిలో నుంచి తీసుకొనివచ్చి గాలికీ, వానకూ దెబ్బతినకుండా ఉండే పర్ణశాలను వేసినాడు.

రాముడు ఆ పర్ణశాలను చూచి, "తమ్ముడా! బహుకాలము సుఖముగా జీవించవలెను అనుకొనేవారు వాస్తుశాంతి చేయవలెను. పర్ణశాలాధిష్ఠాన దేవతలను పూజించవలెను. అందుకు నల్లఇట్టి మాంసము తేవలెను. శాస్త్రములో చెప్పినట్లు

చేయడమే మన కర్తవ్యము. అదే ధర్మము. నీవు ఇప్పుడే పోయి వేటాడి, ఓ నల్లఇట్టిని తీసుకొని రావలెను" అన్నాడు.

లక్ష్మణుడు అప్పటికప్పుడు ఆ అడవికి వెళ్ళి ఒక నల్లఇట్టిని చంపి తీసుకొని వచ్చినాడు. "తమ్ముడా! నీవు మాంసాన్ని పక్వము చేయవలసింది. ఇప్పుడు శుభముహూర్తముగా ఉంది. ఈ నాటి తిథి యజమానికి స్థైర్యము ఇస్తుంది" అన్నాడు రాముడు.

అంతట లక్ష్మణుడు ఆ నల్లఇట్టిని మండుతున్న నిప్పులలో పడవేసినాడు. దాని నెత్తురు అంతా ఇగిరిపోయేటంత వరకూ కాల్చి, "ఓ దేవా! నల్లఇట్టిని సమస్త అవయవాలతోనూ పక్వము చేసినాను. ఇకను నీవు వాస్తు దేవతల పూజ చేయవలెను. అందుకు నీవే సమర్థుడవు" అన్నాడు.

రాముడు మంత్రకోవిదుడు. స్నానము చేసి నియమబద్ధుడు అయి, వాస్తు యజ్ఞ మంత్రాలను అన్నిటినీ జపము చేసినాడు. వాస్తు దేవతలను అందరినీ పూజచేసి ఆ పర్ణశాలలో ప్రవేశించినాడు. ఆ తేజోవంతుడు ఎంతో సంతోషపడ్డాడు. వైశ్వదేవబలినీ, రుద్రబలినీ, విష్ణుబలినీ ఇచ్చినాడు. వాస్తు సంశమనము కోసము పుణ్యాహవచనాది మంగళకార్యాలను అన్నిటినీ ముగించినాడు. ఆ తరువాత తిరిగి స్నానము చేసి సమస్త పాపశమనము కోసము యథావిధిగా ఉత్తమ బలిని ఇచ్చినాడు.

రాముడు ఆ పర్ణశాలకు తగినట్టుగా బలిహరణాదులకు యోగ్యము అయిన వేదికలనూ, దేవతాగృహాన్నీ, అగ్ని హోత్ర గృహాన్నీ అమర్చినాడు. ఆ పర్ణశాలలోనే వంట ఇల్లు మొదలు అయిన గదులను కూడా ఏర్పరచినాడు. ఆ అడవిలో దొరికిన రకరకాల పూలతోనూ, ఫలమూలాలతోనూ పక్వము చేసిన మాంసముతోనూ, జలతర్పణాలతోనూ, వేదోక్తమంత్రాలతోనూ, దర్భలతోనూ, సమిధలతోనూ యథాశాస్త్రముగా భూత శాంతి చేసినాడు.

ఆ పర్ణశాల ఎంతో రమణీయము అయింది. ఎటు చూచినా చిత్ర విచిత్రము అయిన రంగురంగుల పూల చెట్లు కనిపిస్తవి. రకరకాల పక్షులు కర్ణపేయముగా పాటలు పాడుతూ ఉంటవి. దూరాన ఏనుగులూ మొదలు అయిన వన్యమృగాల అరుపులు వినిపిస్తూ ఉంటవి. స్వచ్ఛజలాలతో ప్రవహించే మాల్యవతీనది ఎదురుగుండా కనబడుతూ ఉంటుంది. ఆ పర్ణశాలలో గాలి ఉరవడి లేకుండా హాయిగా వీస్తూ ఉంటుంది.

దేవేంద్రుడు దేవగణాలతో సుధర్మ అనే సభాభవనములోకి పోయినట్టు రాముడు సీతాలక్ష్మణులతో ఆ పర్ణశాలలోకి పోయినాడు.

ఎదుట వున్న మాల్యవతీనదిలో స్నానము చేస్తూ, ఆ మనోహర వనాలలో విహరిస్తూ సీతారాములు కాలము గడపసాగినారు.

అయోధ్య వదలిపెట్టి వచ్చినాము అనే విచారము లేకుండా, వారు అక్కడ ఉన్నారు.

57

సుమంత్రుడు అయోధ్యకు తిరిగివచ్చుట

సీతారామలక్ష్మణులు గంగానదిని దాటి దక్షిణ దిక్కున కంటికి కనపడకుండా పోయేటంతవరకూ గుహుడూ, సుమంత్రుడూ అక్కడనే చూస్తూ నిలుచున్నారు. గుహుడు దుఃఖార్తుడు అయి రాముణ్ణి గురించి మాట్లాడుతూ సుమంత్రుణ్ణి వెంటపెట్టుకొని శృంగిబేర పురము పోయినాడు.

సుమంత్రుడు శృంగిబేర పురములో గుహుడితో నాలుగు రోజులు గడపినాడు. అయిదవనాడు ఉదయము గుహుడి గూఢచారులు వచ్చి, సీతారామలక్ష్మణులు ఆనాడు గంగానదిని దాటిన తర్వాత ప్రయాగక్షేత్రము పోవటమూ, ఆ రాత్రి భరద్వాజాశ్రమములో ఉండడమూ, మరునాడు చిత్రకూట పర్వతానికి ప్రయాణము అయి పోవడమూ, అక్కడ వారు నివాసము పెట్టుకొనడమూ చెప్పినారు.

అంతట సుమంత్రుడు గుహుడి అనుమతితో రథముమీద బయలుదేరినాడు. దారిలో ఎక్కడనూ ఆగకుండా ఆ యా అడవులూ, గ్రామాలూ, నదులూ దాటి మూడవనాడు సాయంత్రము అయోధ్య చేరినాడు. అప్పుడు అక్కడ అంతా నిశ్శబ్దముగా ఉంది. ఏనుగులూ, గుర్రాలూ, రథాలూ, వచ్చే పోయే జనసమూహాలూ ఏవీ కనిపించలేదు. పట్టణము అంతా పాడుపడి పోయినట్లు తోచింది. రాముడు అడవుల పాలు అయిపోయినాడు అనే శోకవహ్నిలో అయోధ్యా నగరము దగ్ధము అయిపోయిందేమో అనుకొన్నాడు. గుర్రాలను వేగముగా తోలుకొని, నగరద్వారములో నుంచి పట్టణములోకి పోయినాడు.

సుమంత్రుడు రావడము అయోధ్యానగర వాస్తవ్యులు చూచినారు. జనులు గుంపులు గుంపులుగా రథానికి ఎదురుగుండా పోయి, 'రాముడు ఏడీ' అని ప్రశ్నించినారు. "రాముణ్ణి గంగానదీతీరాన వదలి పెట్టినాను. ఆయన నన్ను వెళ్ళిపొమ్మన్నందువల్ల నేను తిరిగి వచ్చినాను" అని చెప్పినాడు సుమంత్రుడు.

రాముడు గంగానదిని దాటి అడవికి పోయినాడు అని తెలియగానే జనసమూహము నిట్టూర్పులు విడుస్తూ, "అయ్యో! అయ్యో! ఎంత అన్యాయము, ఎంత ఘోరము" అంటూ దుఃఖించినారు. వారిలో కొందరు, "అయ్యో! రాముడు

లేకపోయినట్లయితే మనము బ్రతికి ఉన్నా చచ్చిపోయినట్లే అని కొందరూ, దానాలు చేసే సమయాలలో పాత్రోచిత దానాలు చేయించడానికి ఇక రాముడు రాడు అని కొందరూ, వివాహాది ఉత్సవాలలో ఇక రాముడు కనపడడు అని కొందరూ, ఇక మహాసభలలో రాముణ్ణి చూడము" అని కొందరూ వాపోయినారు.

"జనులు అందరికీ ఏది మంచో, ఏది సంతోషమో, ఏది సుఖమో ఆలోచించి, రాముడు తండ్రివలె మనలను కాపాడుతూ ఉండేవాడు. ఆ రాముడు ఇప్పుడు లేడు. ఇంకను ఏమి చేయవలెను" అని అందరూ చెప్పుకోసాగినారు.

సుమంత్రుడు ఒక్కడే రథము తోలుకొని రావడము, అంగళ్ళ వీధి సౌధాలలో స్త్రీలు అందరూ కిటికీలోనుంచి చూచినారు. రాముడు అడవికి పోయినాడు అని ఏడవసాగినారు. వారి దీనాలాపాలను సుమంత్రుడు విన్నాడు. దుఃఖపడిపోయినాడు. తల వంచుకొని రాజవీధిన రథము వేగముగా తోలుకుంటూ దశరథమహారాజు భవనము దగ్గరకు పోయినాడు. వెంటనే రథము దిగినాడు. ఆ యా కక్ష్యలలో ఉన్నవారి వంక కన్నెత్తి అయినా చూడకుండా గబగబా నడిచినాడు. ఏడు కక్ష్యలు దాటినాడు. ఆ రాజప్రాసాదోపరి భాగాలలో ఉన్న అంతఃపురాంగనలు అందరూ ఒంటరిగా వస్తూ ఉన్న సుమంత్రుణ్ణి చూచినారు. అప్పుడు ఏమి చేయవలెనో వారికి తోచలేదు. తెల్లటి విశాలనేత్రాల నిండా నీళ్ళు కారుస్తూ, ఒకరిని ఒకరు చూచుకొంటూ గుసగుసలు ఆడసాగినారు. "సుమంత్రుడు ఇప్పుడు ఒంటరిగా వస్తున్నాడు. దుఃఖముతో కుమిలిపోతున్న కౌసల్యాదేవికి ఏమి అని చెప్పుతాడోను అని కొందరూ, కొడుకు అడవికి పోయినా ఎట్లాగో బ్రతికి ఉన్న కౌసల్యాదేవి ఇప్పుడు సుమంత్రుణ్ణి ఒక్కణ్ణి చూచిన తరువాత బ్రతకడము కష్టమేను" అని మరికొందరూ అంతఃపురాంగనలు అనుకోవడము సుమంత్రుడు విన్నాడు.

సుమంత్రుడు ఈ మాటలు అన్నీ వింటూ శోకాగ్నితో రగులుకొంటూ వున్న రాజగృహములోనికి దబదబా అడుగులు వేసినాడు. ఎనిమిదవ కక్ష్యలోకి పోయినాడు. దశరథమహారాజు ధవళగృహములో అడుగుపెట్టినాడు. పుత్రశోకముతో కుమిలిపోతూ ఉన్న దశరథమహారాజును చూచినాడు. నమస్కారము చేసినాడు. దగ్గరకు పోయి రాముడు చెప్పమన్న మాటలు అన్నీ చెప్పినాడు.

ఆ మాటలు అన్నీ దశరథమహారాజు విన్నాడో లేదో, ఏమీ జవాబు చెప్పకుండా విభ్రాంతుడు అయినాడు. ఆయనకు అప్పుడు స్మృతి తప్పిపోయింది. నేలకు ఒరిగినాడు. అంతఃపురాంగనలు అందరూ గుండెలు బాదుకొంటూ ఘొల్లు మన్నారు. నేలమీద పడిపోయిన పెనిమిటిని కౌసల్యా సుమిత్రలు లేవనెత్తినారు. అంతట ఆయనకు తెలివివచ్చింది.

అప్పుడు కౌసల్యాదేవి, "ఓ మహాభాగా! ఏ రాజుకొడుకూ చేయలేని దుర్ఘట కార్యము మీ పిల్లవాడు చేసినాడు. వాడి దగ్గర నుంచి, అడవికి పోయిన ఆ మీ పిల్లవాడి దగ్గర నుంచి వచ్చిన దూతతో తమరు ఎందుకు మాట్లాడరు? అప్పుడు వాణ్ణి అట్లా వెళ్ళకొట్టడము ఎందుకు, ఇప్పుడు సిగ్గుపడడము ఎందుకు? లేవండి, మీకు పుణ్యము ఉంటుంది. ఇప్పుడు ఇక్కడ కైక లేదు. మీరు ఎవరికీ భయపడనవసరము లేదు. మీరు ఈ సుమంత్రుడితో ఇప్పుడు నిర్భయముగా మాట్లాడవచ్చును" అంటూ ఘోరముగా ఏడుస్తూ నేలమీద కూలింది.

నేల కూలిన కౌసల్యాదేవినీ, నిర్ఘాంతపోయిన దశరథమహారాజునూ చూచి అంతఃపురాంగనలు అందరూ ఘొల్లుమన్నారు.

ఆ రాజాంతఃపురములో చెలరేగిన ధ్వనులు అయోధ్యానగరము అంతటా మారుమ్రోగినవి. వృద్ధులూ, తరుణులూ, స్త్రీలూ, పురుషులూ అందరూ ఘోరముగా రోదనము చేయసాగినారు.

58

రాముని విశేషములు తెలుపుట

దశరథమహారాజు తెప్పరిల్లినాడు. కొత్తగా పట్టుబడి జబ్బు చేసిన ఏనుగువలె దిగ్భ్రమ చెంది "రామా! రామా!" అంటూ కేకలు వేసినాడు. నిట్టూర్పులు విడుస్తూ వ్యాధిగ్రస్తుడివలె అయిపోయినాడు. రాముణ్ణి గురించి అడగటానికి సుమంత్రుణ్ణి దగ్గరకు రమ్మని పిలిచినాడు. దుమ్మూ ధూళీ కొట్టుకొని ఉన్న సుమంత్రుడు కన్నీళ్ళు కారుస్తూ ఆయన దగ్గరకు పోయి చేతులు జోడించి నిలుచున్నాడు.

"ఓ సుమంత్రుడా! రాముడు ఏ చెట్టుక్రింద పడుకొన్నాడు? ఏమి తిన్నాడు? రాజాధిరాజుకు పుట్టి సమస్త సుఖాలూ అనుభవించిన రాముడు, కమ్మని భోజనము చేసి మెత్తని పాన్పులమీద పడుకొనే రాముడు, కందమూలాలు తిని కటిక నేలమీద పడుకొన్నాడా? ఎక్కడికి బయలుదేరినా రథ గజ తురగ పదాతులు వెంబడించే రాముడు విజనారణ్యములో ఎట్లా తిరుగుచున్నాడు? క్రూరమృగాలూ, కృష్ణసర్పాలూ యథేష్టముగా తిరిగే ఘోరారణ్యములో నా కుమార్తె సీతాదేవిని పెట్టుకొని ఎట్లా ఉన్నారు?

"సుమంత్రుడా! సీత సుకుమారి. ఎన్నడూ ఏ కష్టమూ ఎరగదు. రథము దిగిన తరువాత రామలక్ష్మణుల వెంట ఎట్లా నడిచింది?

"ఓ సుమంత్రుడా! అశ్వినీ దేవతలు మందర పర్వతానికి పోయినట్లు, నా కుమార్తె రామలక్ష్మణులు అడవులకు పోతూ ఉండడము నీవు కళ్ళారా చూచినావు. నీవు కృతార్థుడవు.

"ఓ సుమంత్రుడా ! అడవికి పోగానే రాముడు ఏమి అన్నాడు? లక్ష్మణుడు ఏమి అన్నాడు? సీత ఏమి అన్నది? రాముడు ఎక్కడ కూర్చున్నాడు? ఎక్కడ పడుకొన్నాడు? ఏమి తిన్నాడు? చెప్పు, వింటాను. నీ మాటలు విని, స్వర్గములో నుంచి సత్పురుషులమధ్య పడ్డ యయాతివలె కొంతకాలము బ్రతుకుతాను" అన్నాడు దశరథమహారాజు.

సుమంత్రుడు మాటలు తడబడుతూ, "మహారాజా! రాముడు ధర్మము తప్పలేదు. చేతులు ఎత్తి నమస్కారము చేసి తమరు పరమాత్మవేత్తలు అనీ, మహాత్ములు అనీ, సమస్త రాజులకూ వందనీయులు అనీ, తమకు సాష్టాంగ నమస్కారము చేసినట్టు తమతో చెప్పమని నాతో అన్నాడు.

"అంతఃపురాంగనలకు వారి వారి యోగ్యతలకు తగినట్టు నమస్కారము చేసినట్టూ, తాను సుఖముగా అడవికి పోతున్నట్టూ చెప్పమన్నాడు.

"రాజా! కౌసల్యాదేవితో తాను కుశలముగా ఉన్నట్టూ, నమస్కారము చేసినట్టూ చెప్పమన్నాడు. ఇంకా ఆమెతో ధర్మము తప్పక అగ్నిహోత్రపరాయణగా ఉండవలెను అనీ, దేవుడివలె తన తండ్రికి పాదసేవ చేస్తూ ఉండవలెను అనీ, జ్యేష్ఠపత్నిని అనే అభిమానము వదిలిపెట్టి సవతులు అందరితోనూ సరిసమానముగా మెలగవలెను అనీ చెప్పమన్నాడు. చివరకు కౌసల్యాదేవితో ఈ విధముగా కూడా చెప్పమన్నాడు. దశరథమహారాజుకు ప్రియురాలు అయిన కైకేయీదేవితో అనుకూలముగా ప్రవర్తించవలెను అనీ, భరతుణ్ణి రాజుగా గౌరవించవలెను అనీ, రాజులు అధికారము వల్ల గొప్పవారు కానీ, వయసువల్ల కాదు అనీ, ఈ రాజధర్మాన్ని మరచిపోకుండా జ్ఞాపకము ఉంచుకోవలెను అనీ చెప్పినాడు.

"భరతుడితో తాను క్షేమముగా ఉన్నట్టు చెప్పి, ఇంకా ఈ విధముగా చెప్పమన్నాడు:

"ఓ భరతుడా! నీవు మన తల్లుల విషయములో భేదభావము లేకుండా అందరినీ యథాన్యాయముగా చూస్తూ ఉండవలెను. నాయనగారు చెప్పినట్టు నీవు నడుచుకోవలెను. ఆయన వృద్ధుడు. ఆయన ఏమి చెప్పినా నీవు వ్యతిరేకించ కూడదు. ఆయన ఆజ్ఞలను అన్నిటినీ నీవు శిరసావహించవలెను. యువరాజ్యము అనుభవించవలెను అంటూ, రాముడు నన్ను చూచి కన్నీళ్ళు కారుస్తూ, 'ఓ భరతుడా! మీ అమ్మకు నీవు అంటే ఎంత ప్రాణమో, మా అమ్మకు నేను అంటే అంత ప్రాణము. పుత్రశోకముతో బాధపడే మా అమ్మ కౌసల్యాదేవిని మీఅమ్మను చూచేటట్టే చూడవలెను' అని చెప్పమని నాతో చెప్పుతూ, ఓ మహారాజా! ఆ మహాశయుడు, ఆ రాజీవతామ్రాక్షుడు కన్నీళ్ళు కార్చినాడు.

"రాజా! లక్ష్మణుడు క్రుద్ధుడు అయిపోయి బుసలుకొట్టుతూ, 'రాముడు ఏమి అపరాధము చేసినాడు అని రాజు వెళ్ళ కొట్టినాడు? కైకేయీదేవి తుచ్ఛము అయిన కోరిక కోరితే, మమ్ములను ఇట్లా చేసినాడు. చేయరాని అకార్యము చేసినాడు. కైకేయీదేవి రాజ్యలోభమువల్ల అడిగింది. వరదానమువల్ల ఇట్లా చేసినాను అని దశరథమహారాజు అన్నప్పటికీ ఆయన చేసింది దుష్కృతము. దశరథమహారాజు ప్రభువు అయినందువల్ల యధేష్టముగా చేయగలిగినాడు. రాముణ్ణి వెళ్ళకొట్టడానికి అంతకన్నా హేతువు ఏమీ లేదు. మతి చెడి లోకవిరుద్ధము అయిన పని చేసినాడు. అందుకు ఆయనే అనుభవిస్తాడు. నేను ఇప్పుడు దశరథమహారాజుకు విన్నవించేది ఏమీ లేదు. నాకు ప్రభువు అయినా, తండ్రి అయినా, అన్న అయినా, బంధువు అయినా రాముడు ఒక్కడే' అన్నాడు.

"మహారాజా! ఎప్పుడూ మందహాసము చేస్తూ మాట్లాడే సీతాదేవి వెర్రిదానికి మల్లే నివ్వెరపోయి చూస్తూ, నిట్టూర్పులు విడుస్తూ నాతో ఏమీ చెప్పలేకపోయింది. ఆమె ముఖము వాడిపోయింది. నేను బయలుదేరుతూ ఉంటే పెనిమిటివంక చూస్తూ కన్నీళ్ళు కార్చింది.

"రామలక్ష్మణులు ఓదారుస్తూ ఉన్నా సీతాదేవి నా వంకనూ, రథము వంకనూ చూస్తూ చేతులు జోడించి ఏడ్చింది" అన్నాడు.

59

ఇట్లా చెప్పుతూ ఉన్న సుమంత్రుణ్ణి దశరథమహారాజు, ఆ తరువాత ఏమి జరిగిందీ చెప్పమన్నాడు.

సుమంత్రుడు కన్నీళ్లు కారుస్తూ, "మహారాజా! రామలక్ష్మణులు గంగాతీరాన వల్కలాలకు తోడుగా జటలు ధరించినారు. వారు గంగానది దాటి ప్రయాగ క్షేత్రాభిముఖులు అయిపోయినారు. సీతారాములకు కాపుదలగా లక్ష్మణుడు ముందు నడచినాడు. అతని వెనుక సీత నడచింది. వారి ఇద్దరి వెనక రాముడు నడచినాడు. వారు అట్లా పోతూ ఉంటే నేను చూచినాను. చేతులు ఎత్తి నమస్కారము చేస్తూ గంగ ఇవతలి ఒడ్డున నిలుచున్నాను. నేను అస్వతంత్రుణ్ణి కనుక వెనుకకు మళ్ళినాను. గుర్రాలు కూడా కన్నీళ్ళు కార్చినవి. నేను నా దుఃఖాన్ని ఎట్లాగో అణచుకొన్నాను. రథము ఎక్కి గుహుడితో శృంగిబేరపురము పోయినాను. ఒకవేళ రాముడు నన్ను పిలుస్తాడేమో అనే ఆశతో నేను అక్కడ నాలుగునాళ్ళు ఉన్నాను.

"రాజా! రాముడు ఆడవులపాలు అయిపోయినాడు అనే దుఃఖముతో ఆ యా చెట్ల పూలూ, మొగ్గలూ వాడిపోయినవి. నదులలోనూ. చెరువులలోనూ,

గుంటలలోనూ, కోనేళ్ళలోనూ నీళ్ళు ఎండిపోయినవి. చెట్ల ఆకులు ఎండిపోయి గలగల రాలినవి. పక్షులు పాటలు పాడడము మానివేసినవి. క్రూరమృగాలు సయితము ఆహారానికి బయలుదేరలేదు. అడవి అంతా నిశ్శబ్దము అయిపోయింది.

"ఓ రాజా! ఆ ఒక్క అడవిలోనే కాదు, దారిలో ఎక్కడ చూచినా తామరకొలనులో తామరాకులు కనిపించలేదు. నీళ్ళు మురుకులు అయిపోయినవి. కమలాలు వాడిపోయినవి. చెట్లు సయితము పూలు పూయడమూ, కాయలు కాయడమూ మానివేసినవి. పక్షులు కూడా కనపడకుండా పోయినవి.

"రాజా! మన అయోధ్యానగర ఉద్యానవనాలలో కూడా పక్షులు కుహూనాదాలు చేయడము లేదు. ఉద్యానవనాలు ఉద్యానవనాలుగా కనిపించడము లేదు. జనులు అందరూ నిట్టూర్పులు విడుస్తున్నారు. నేను రథముమీద వస్తూ ఉంటే, రాముడు ఏడీ అని నన్ను అడిగినారు. రథమువంక చూచినారు. రాముడు కనిపించలేదు. అంతట అందరూ కన్నీళ్ళు కార్చసాగినారు. హర్మ్యాలలోనుంచీ, ప్రాసాదాగ్రభాగాలలో నుంచీ స్త్రీలు అందరూ హాహాకారాలు చేసినారు. కళ్ళకు పెట్టుకొన్న కాటుక కారిపోయేటట్లు వారు ఏడువసాగినారు. వారి విశాల నేత్రాలు కలకపారినవి. ఆ స్త్రీలు ఒకరినొకరు వెర్రిగా చూడడము మొదలుపెట్టినారు. అందరూ దుఃఖములో మునిగిపోయినారు. రాముడి కోసము దుఃఖపడడములో మిత్రులూ, అమిత్రులూ, ఉదాసీనులూ అనే భేదము ప్రజలలో నాకు కనబడలేదు. కళకళలాడుతున్న ముఖము ఒకటి అయినా నాకు కనబడలేదు. గుర్రాలూ, ఏనుగులూ ఆర్తధ్వనులు చేస్తూ ఉన్నవి. రాజా! అయోధ్యానగరము ఇప్పుడు తన పిల్లవాడు అడవులపాలు అయినాడు అని శోక సాగరములో మునిగి ఉన్న కౌసల్యాదేవివలె ఉంది" అన్నాడు.

దశరథమహారాజు ఖిన్నుడు అయిపోయినాడు. కన్నీళ్ళు కారుస్తూ గద్గదస్వరముతో, "సుమంత్రుడా! నేను అకార్యము చేసినాను. పాపిష్ఠి వంశములో పుట్టిన పాపిష్ఠి కైక నన్ను అట్లా చేయమన్నది. నేను మంత్రులతో అయినా, స్నేహితులతో అయినా, వృద్ధులతో అయినా, వేదశాస్త్రవిదులతో అయినా ఆలోచన చేయలేదు. స్త్రీ వ్యామోహములో పడిపోయినాను. అంతా ఇట్లే జరిగిపోయింది. అట్లా జరగవలెను కాబోలు, లేకపోతే నాకు ఇంత దుర్దశ ఎందుకు వస్తుంది? ఈ వంశము ఇట్లా నాశనము అయిపోవలెను కాబోలు!

"ఓ సుమంత్రుడా! నేను నీకు ఎప్పుడు అయినా, ఏ కొంచెము అయినా ఉపకారము చేసినాను అనే విశ్వాసము నీకు ఉంటే, నీవు ఇప్పుడు నన్ను రాముడి దగ్గరకు తీసుకొనిపో, లేదా నా ఆజ్ఞలు ఇంకా చెల్లుతూ ఉన్నట్లయితే, నీవు ఇప్పుడే

వెళ్ళి రాముణ్ణి ఇక్కడికి తీసుకొనిరా. నా ప్రాణము ఇక నిలిచేటట్లు లేదు. రాముడు లేకుండా ఇకను నేను బ్రతకను. సుమంత్రుడా! రాముడు ఈపాటికి చాలా దూరము పోయి ఉంటాడు. నన్నే రథము ఎక్కించి వాడి దగ్గరకు తీసుకొనిపో. ఆ ధనుర్ధరుడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో?

"సుమంత్రుడా! ఆ లోహితాక్షుణ్ణి, ఆ ఆముక్తమణికుండలధరుణ్ణి, ఆ మహాబాహువును నేను ఇప్పుడు చూడవలెను. సీతారామలక్ష్మణులను చూస్తేనే నేను ఇక బ్రతుకుతాను, లేకపోతే బ్రతకడము ఉత్తది.

"ఓ రామా! ఓ సీతా! ఓ లక్ష్మణా! మీ దిగులుతోనే నేను ఇక్కడ దిక్కులేకుండా చచ్చిపోతున్నాను. మీకు ఈ సంగతి తెలియదు.

"ఓ కౌసల్యా! నేను శోకసముద్రములో మునిగిపోతున్నాను. రాముడి ఎడబాటే ఆ మహాసముద్రము. సీతావియోగమే దూరము అయిపోతూ ఉన్న దాని ఒడ్డు. నా నిట్టూర్పులే దాని సుడిగుండాలు. నా కన్నీళ్ళే దాని కెరటాల నురుగు. కొట్టుకొంటున్న నా చేతులే దానిలో చేపలు. నా రోదనమే దాని మహాఘోషము. విరపోసుకొన్న నా తల వెండ్రుకలే దానిలో నాచు. కైకయే దానిలో బడబాగ్ని. నా కన్నీటి ధారలే దాని నిర్ఝర ప్రవాహము. మంథర దుర్బోధలే దానిలో మహాగ్రాహాలు. కైకేయి కోరిన వరమే దాని పోటు. కన్న కొడుకును వెళ్ళగొట్టడమే దాని అంతులేని లోతు. ఈ మహాసముద్రాన్ని ఇప్పుడు రాముడు లేకుండా దాటడము ఎట్లా? ఓ కౌసల్యా! ఈ దురవస్థలో సీతారామలక్ష్మణులను చూద్దాము అనుకొన్నా, ఇప్పుడు సాధ్యము కాకుండా ఉంది. ఇంతకన్నా అమంగళము ఏమి ఉంటుంది? నేను ఇట్లా ఏడుస్తూ చావవలెను కాబోలు?' అంటూ శయ్యమీద వాలినాడు. మూర్ఛపోయినాడు.

అటు రాముడు అడవికి పోయినందువల్లనూ, ఇటు దశరథమహారాజు మూర్ఛపోయినందువల్లనూ కౌసల్యాదేవి దుఃఖము ఇబ్బడి అయిపోయింది. పెనిమిటి ఏమి అయిపోతాడో అని వణకడము మొదలుపెట్టింది.

60

సుమంత్రుడు కౌసల్యను ఓదార్చుట

కౌసల్యాదేవి దుఃఖముతోనూ, భయముతోనూ కూలబడ్డది. పిశాచము పట్టిన దానికిమల్లే నేలమీద పొర్లింతలు పెట్టింది. ప్రాణము పోయినదానివలె కన్నులు తేలవేసింది. అంతట సుమంత్రుణ్ణి చూచి, "ఓ మంత్రిసత్తమా! నన్ను ఇప్పుడు నా కొడుకు దగ్గరకూ, కోడలు దగ్గరకూ తీసుకొనిపో. సీతారామలక్ష్మణులు లేకుండా ఇక్కడ నేను ఒక్క క్షణము అయినా బ్రతికి ఉండలేను. నీవు ఎక్కి వచ్చిన రథము

మీదనే నన్ను దండకారణ్యానికి తీసుకొనిపో. నీవు అట్లా చేయకపోయేట్లయితే నేను చచ్చిపోతాను" అంటూ చెప్పింది.

సుమంత్రుడు కన్నీళ్ళు కారుస్తూ, చేతులు జోడించపోయి మాటలు తడబడుతూ, "దేవీ! దుఃఖపడవద్దు. వ్యాకులపడవద్దు. భ్రాంతి పడవద్దు. సీతారామలక్ష్మణులు ఏ దిగులూ లేకుండా అడవిలో హాయిగా ఉన్నారు. పరలోకచింతతో ఆ ధర్మజ్ఞుడు, ఆ జితేంద్రియుడు లక్ష్మణుడు అన్నగారికి పాదసేవ చేస్తున్నాడు. సీతాదేవి మనస్సు అంతా రాముడి మీద లగ్నము చేసింది. నిర్జనారణ్యములో ఉన్నప్పటికిన్నీ ఏ దిగులూ విచారము లేకుండా ఇక్కడ తన ఇంట్లో ఉన్నట్లే రాముడితో సుఖముగా ఉంది. వనవాసానికి అలవాటు పడిపోయింది. ఇక్కడ ఉద్యానవనాలలోవలెనే అడవిలో రాముడితో విహరిస్తూ, క్రీడిస్తూ ఉంది. ఆమె పతివ్రత. ఆమె కళాకాంతులు ఏ మాత్రమూ మాసిపోలేదు. చిన్నపిల్లవలె రాముడితో ఆడుకొంటుంది. రాముడే ఆమె ప్రాణము. రాముడే ఆమె లోకము. రాముడు లేకుండా అయోధ్యలో ఆమె ఉండమన్నా ఉండదు. రాముడు లేని అయోధ్య ఆమెకు అరణ్యముగా ఉంటుంది.

"ఓ దేవీ! మేము రథముమీద అయోధ్య దాటి ఒక కోసెడు దూరము పోయినామో లేదో సీతాదేవి దారిలో కనుపించిన ఆ యా గ్రామాలను గురించీ, పట్టణాలను గురించీ, నదులను గురించీ సంతోషముగా రామున్ని, లక్ష్మణున్ని అడిగి తెలుసుకోవడము మొదలుపెట్టింది. ఏ కొత్త చెట్టు కనిపించినా, ఏ లత కనిపించినా తెలుసుకోకుండా ఉండేది కాదు.

"ఓ దేవీ! ఒక సందర్భములో కైకేయీ దేవి గురించి సీతాదేవి హఠాత్తుగా ఏదో అన్నది. మరచిపోయినాను. జ్ఞాపకము రావడము లేదు" అంటూ, ఆ మాటను మింగి కౌసల్యాదేవిని సంతోషపెట్టడానికి, ఎంత ఉరవడిగా గాలికొట్టినా, ఎంత తీవ్రముగా ఎండకాసినా చంద్రబింబము వంటి ఆమె ముఖములో ఏ వికారమూ కనిపించలేదు. ఆమె దేహకాంతులు ఏ మాత్రమూ తరగిపోలేదు. పాదాలకు పారాణి పెట్టుకోకపోయినా ఆమె అడవిలో నడుస్తూ ఉంటే ఆమె పాదాలు తామరమొగ్గలవలె కనిపించినవి. ఆభరణాలేవీ లేకుండా నడిచినా, అందెల చప్పుళ్ళతో సవిలాసముగా నడిచినట్టే నాకు తోచింది. రాముడి అండను నడుస్తూ ఉన్నందువల్ల సింహము అన్నా, పెద్దపులి అన్నా అడవిఏనుగు అన్నా ఆమె భయపడలేదు.

"ఓ దేవీ! సీతారామలక్ష్మణులను గురించి మనము ఎవండ్లమూ శోకించ నవసరము లేదు. దశరథమహారాజున్నూ దుఃఖపడ నవసరము లేదు. వాండ్లు మహారణ్య

ములో కందమూలాలు తింటూ మహర్షులవలె సుఖముగా ఉన్నారు. వారికి ఏ దిగులూ, విచారమూ లేదు. వారి చరిత్ర ఈ లోకములో శాశ్వతముగా ఉంటుంది' అన్నాడు.

సుమంత్రుడు ఇంత ఓదార్చినా కౌసల్యాదేవి, "ఓ నాయనా! ఎక్కడ ఉన్నావురా రామా" అంటూ పెద్దపెట్టున ఏడ్చింది.

61

కౌసల్యాదేవి ఏడుస్తూ దశరథమహారాజును చూచి, "మహారాజా! తాము దయామయులు అనీ, వదాన్యులు అనీ, ప్రియవాదులు అనీ ముల్లోకాలలోనూ ప్రసిద్ధికి ఎక్కినారు. అటువంటి మీరు ధర్మాత్ములకు అందరికీ ధర్మాత్ముడు అనీ, జనరంజకులలో శ్రేష్ఠుడు అనీ పేరుమోసిన రామున్ని వనవాసానికి పంపించినారు. పుట్టినప్పటినుంచీ రామలక్ష్మణులు సమస్త సుఖాలూ అనుభవించినారు. ఇప్పుడు వాండ్లు సీతాదేవితో అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. సీత సుకుమారి. ననయౌవనములో ఉంది. మహారణ్యములో ఎండనూ, చలినీ ఎట్లా ఓర్చుకొంటుంది ? మంచి రుచ్యము అయిన వ్యంజనాలతో భోజనము చేసే మైథిలి, ఇప్పుడు అడవిలో నీవారాన్నము ఎట్లా తింటుంది? మంగళగీత వాద్యధ్వనులమధ్య పుట్టి పెరిగిన వైదేహి, ఇప్పుడు మహారణ్యములో సింహశార్దూలాల బొబ్బరింతలు ఎట్లా వింటుంది? వాండ్లు ముగ్గురూ ఆ అడవిలో నేలమీద పడుకొంటారు కాబోలు! చెయ్యే తలగడగా పెట్టుకొని నిద్రపోతారు కాబోలు! అయ్యో! నా కొడుకును నేను ఎప్పుడు చూస్తాను? నా పిల్లవాడు అడవులపాలు అయినా నేను మాత్రము బ్రతికి ఉన్నాను. నా హృదయము వజ్రముతో చేసింది అయి ఉండవలెను. నిజము. లేకపోతే నాగుండె వెయ్యి చెక్కలు అయిపోయి ఉండేది.

"రాజా! ఎన్నో సుఖాలు అనుభవించవలసిన సీతారామలక్ష్మణులను, మీరు నిర్నిమిత్తముగా అయోధ్యనుంచి వెళ్ళకొట్టినారు. వాండ్లు దీనులు అయి అడవులలో తిరగవలెనా? ఎంత దయమాలిన పని చేసినారు?

"రాజా! రామలక్ష్మణులు పధ్నాలుగు ఏండ్లూ వనవాసము చేసి వస్తే భరతుడు రాజ్యాన్నీ, బొక్కసాన్నీ రాముడికి ఒప్పగిస్తాడా? ఒకవేళ ఒప్పగించినా రాముడు స్వీకరిస్తాడా? ఈ రెండూ అసంభవమే. అభిమానముతో తమ బంధువులను శ్రాద్ధ కర్మకు నిమంత్రణము చేసి తక్కిన బ్రాహ్మణోత్తములను ఇష్టపంక్తికి ఆహ్వానిస్తే, ఆ శ్రాద్ధకర్త ఇంటికి ఆ బ్రాహ్మణోత్తములు పోతారా? భోజనమే కాదు, అమృతము ఇస్తాము అన్నా ఆ శ్రాద్ధకర్త ఇంటికి సదాచార సంపన్నులు అయిన బ్రాహ్మణులు ఎవరూ పోరు. ఒక ఎద్దు కొరికిన గడ్డిపరకను, ఆబోతు ముట్టుకొంటుందా?

అదేవిధముగా కనిష్ఠుడు అనుభవించిన దానిని జ్యేష్ఠుడు-- అందులో మహాబలవంతుడూ, బుద్ధిమంతుడూ అయిన రాముడు అంగీకరిస్తాడా? అది వాడికి అవమానము కాదా? ఏది అయినా జంతువు తిన్న మాంసాన్ని పెద్దపులి ముట్టదు. రాముడు మానవులలో పెద్దపులి. మరి ఒకరు అనుభవించిన రాజ్యాన్ని ఒల్లడు. ఒక యజ్ఞములోని హవిస్సునూ, ఆజ్యాన్నీ, పురోడాశాలనూ, యూపస్తంభాలనూ మరి ఒక యజ్ఞానికి వాడరు. మద్యసారాన్ని ఒకరు పుచ్చుకొన్న తరువాత మిగిలిన మడ్డిని మరి ఒకరు వాసన అయినా చూడరు. సోమము నశించిన యజ్ఞాన్ని గురించి ఎవరు అయినా ఆలోచిస్తారా? అదేవిధంగా భరతుడు ఏలే రాజ్యాన్ని రాముడు ఒల్లడు. వాడు పౌరుషము కలవాడు. ఇటువంటి అవమానపు పనులు చేయడు. కోపమువస్తే తీక్ష్ణబాణాలతో మందర పర్వతాన్ని అయినా పగలకొట్టి వేస్తాడు. సూర్యచంద్రులనూ, గ్రహనక్షత్రాలనూ, ఆకాశాన్నీ, స్వర్గాన్నీ కూలత్రోస్తాడు. ఈ భూమిని పర్వతాలతో కూడా రూపుమాపి వేస్తాడు. పధ్నాలుగు భువనాల వారూ ఏకము అయి ఎత్తివచ్చినా రాముణ్ణి ఏమీ చేయలేరు. పంచభూతాలనూ, సప్తసాగరాలనూ వాడి బంగారు బాణాలతో దహించి వేయకలడు. పితృగౌరవమువల్ల మిమ్ములను వాడు అతిక్రమించలేదు. మీ ఆజ్ఞలను శిరసావహించినాడు. అట్లాకాకపోయినట్లయితే తోకను పట్టి ఈడ్చిన పెద్దపులివలె మీ మీద పడేవాడు. ఆ సింహబలుణ్ణి నాశనము చేసినారు. గండుచేప తన పిల్లలను కనికరము లేకుండా మింగివేస్తుంది. అట్లాగే మీ పిల్లవాణ్ణి మీ పొట్టను పెట్టుకొన్నారు.

"మహారాజా! మీరు పరమధార్మికుడు అయిన జ్యేష్ఠపుత్రుణ్ణి అడవులకు వెళ్ళకొట్టినారే! ద్విజులు అంగీకరించిన ధర్మశాస్త్రములో ఇట్లా చేయవచ్చును అని ఎక్కడ అయినా చెప్పి ఉందా?

"రాజా! మీకేమి, మీరు మహారాజులు. మిమ్ములను ఆదరించడానికి మీకు కైకవంటి భార్య ఉంది. భరతుడివంటి కొడుకు ఉన్నాడు. కాని నా గతి ఏమిటి? ఆడుదానికి కట్టుకొన్న మొగుడు మొదటి గతి. ఆ తరువాత కడుపున పుట్టిన కొడుకు రెండో గతి. ఆ ఉభయులూ లేనప్పుడు అయినవాండ్లు మూడవ గతి. తాము నాకు మూడు గతులూ లేకుండా చేసివేసినారు. తాము నా సవతికి లోబడి నాకు కాకుండా పోయినారు. నా కన్న కొడుకును అడవులకు వెళ్ళకొట్టి వాడికీ, నాకూ కాకుండా చేసినారు. ఇక అయినవాండ్లు ఉన్నా లేనివాండ్లే అయినారు. ప్రభూ! తాము నన్ను అన్నివిధాలా నాశనము చేసివేసినారు.

"ఓ దశరథమహారాజా! తాము నన్నూ, నా కొడుకునూ అధోగతిపాలు చేసినారు. ఈ దేశాన్నీ, ఈ రాజ్యాన్నీ నాశనము చేసినారు. పౌరులు అందరికీ

అన్యాయము చేసినారు. మంత్రులు అందరికీ చేటు తెచ్చిపెట్టినారు. రాజా! ఇంతకూ మీ భార్య కైకనూ, మీ కొడుకు భరతుణ్ణీ సంతోషపెట్టడానికోసము మీరు ఇంత పని చేసినారు" అంటూ దిక్కులు పిక్కటిల్లేటట్లు ఏడ్చింది.

ఈ దారుణము అయిన మాటలు దశరథమహారాజు విన్నాడు. ఏమి అధర్మము చేయడమునుంచి తనకు అటువంటి దురవస్థ వచ్చిందా అని ఆలోచించసాగాడు.

62

దుఃఖమువల్ల క్రుద్ధురాలు అయి కౌసల్యాదేవి అన్న కఠినోక్తులు దశరథమహారాజును క్షోభ పెట్టినవి. ఆయన వ్యాకులచిత్తుడు అయినాడు. ఆలోచించసాగినాడు. తన యౌవనము జ్ఞాపకము వచ్చింది. శబ్దవేధి కౌశలముతో అజ్ఞానమువల్ల తాను చేసిన అపచారము స్మరణకు వచ్చింది. అంతవరకూ పుత్రవియోగానికే దుఃఖపడుతున్నాడు. తాను చేసిన దుష్కృతము ఇప్పుడు స్మరణకు రాగానే ఒకటికి రెండు దుఃఖాలు అయినవి. ఆ రెండు దుఃఖాలూ ఆయనను దహించి వేయసాగినవి. వణుకు పుట్టింది. చేతులు జోడించి తల వంచుకొని, "ఓ కౌసల్యా! నీవు నన్ను అనుగ్రహించవలెను. నిన్ను యాచిస్తున్నాను. నీవు ఎంతో మంచిదానవు. శత్రువులను అయినా దయతో చూడకలవు. ఈ లోకములో మంచి సెబ్బరలు నీకు తెలుసును. ధార్మికులు అయిన స్త్రీలకు గుణవంతుడు అయినా, గుణహీనుడు అయినా పెనిమిటే ప్రత్యక్ష దైవము. నీవు ఎంతో దుఃఖములో ఉన్నావు. నాకు తెలుసును. ఇప్పుడు ఎత్తిపొడుపు మాటలతో నన్ను నొప్పించవద్దు" అన్నాడు దశరథమహారాజు.

దశరథమహారాజు ఇంత జాలిగా బ్రతిమాలుతూ ఉంటే కౌసల్యాదేవి హృదయము ద్రవించింది. భయం వేసింది. మేడ గొట్టాలలోనుంచి వాన నీళ్ళు కారినట్టుగా, ఆమె కన్నులలోనుంచి జలజల నీళ్లు రాలినవి. ఆయన కరకమలాలు పట్టుకొని తన శిరముమీద పెట్టుకొని సంభ్రమముతో, "దేవా! క్షమించవలెను. నేను సాష్టాంగపడుతున్నాను. మీరు నన్ను యాచించినందువల్ల నేను హతము అయిపోయినాను. నిజముగా నేను హంతవ్యను. ఏ ఆడుది తనను యాచించేటట్టు భర్తను బాధపెట్టుతుందో, ఆ ఆడుదానికి ఇహపర సౌఖ్యాలు రెండూ ఉండవు. నేను తెలియనిదానను కాను. తాము సత్యసంధులు అని నాకు తెలుసును. పుత్ర శోకముతో నా బుద్ధి బుగ్గి అయిపోయింది. ఏవేవో మాటలు అన్నాను.

"శోకము ధైర్యాన్ని నాశనము చేస్తుంది. వివేకాన్ని నాశనము చేస్తుంది. సర్వాన్నీ నాశనము చేస్తుంది. శోకముతో సరిసమానము అయిన శత్రువు మరి ఏదీ

లేదు. శత్రువు హఠాత్తుగా దెబ్బ వేస్తే ఓర్చుకోవచ్చును కాని, హఠాత్తుగా ఏ కొంచెము దుఃఖము వచ్చినా ఓర్చుకోవడము అశక్యము.

"రాముడు అడవికి పోయి అయిదు రోజులు అయింది. అయిదు రోజులూ అయిదు యుగాలుగా గడచినవి. నదులు అన్నీ వచ్చిపడుతూ ఉంటే సముద్రము పొంగి పొర్లేటట్లు, రాముణ్ణి తలచుకొంటూ ఉంటే నా దుఃఖము తరంగాలు తరంగాలుగా లేస్తున్నది" అంటూ కౌసల్యాదేవి చెప్పుతూ ఉండగా సూర్యాస్తమయము అయింది. చీకటి పడ్డది. కౌసల్యాదేవి ఓదార్పు మాటలకు దశరథమహారాజుకు మరింత దుఃఖము వచ్చింది. మయిమరచి పోయినాడు. ఎప్పుడో, తెలియకుండా నిద్ర పట్టింది.

63

దశరథుని శాపవృత్తాంతము

దశరథమహారాజుకు హఠాత్తుగా నిద్ర మెలకువ వచ్చింది. అది సీతారామ లక్ష్మణులు వెళ్ళిపోయిన ఆరవనాటి అర్ధరాత్రము. తాను అదివరకు చేసిన దుష్కృతము మళ్ళీ తలపుకు వచ్చింది. తనతోపాటు పుత్రశోకముతో బాధపడుతూ ఉన్న కౌసల్యా దేవికి ఆ విషయము చెప్పతలచుకొన్నాడు. ఆమె ఏడ్చి ఏడ్చి నిద్రపోతూ ఉంది.

దశరథమహారాజు ఆమెను నిద్రలేపి, "ఓ కళ్యాణీ! ఎవడి శుభాశుభ కర్మ ఫలము వాడు అనుభవించక తప్పదు. ఏ పనిచేయ తలపెట్టినా ముందుగా దాని కష్టసుఖాలనూ, గుణదోషాలనూ ఆలోచించనివాడు మూర్ఖుడు. చిన్న చిన్న పూలు పూసే మామిడిచెట్లు చిన్న చిన్న కాయలు కాస్తవి అనుకొని వాటిని నరికివేసి, పెద్ద పెద్ద అందము అయిన పూలు పూసే మోదుగుచెట్ల మొక్కలు నాటి, పాదులు కట్టి నీళ్ళు పోసి పెంచితే అవి కాయలు కాసేటప్పుడు ఏడవక తప్పదు. అజ్ఞానమువల్ల చేసినా చేసినదాని ఫలము అనుభవించక తప్పదు. పిల్లవాడు తెలియక విషము తింటే ఏమి అవుతుంది? నా పని అట్లా అయింది. నా చిన్నతనములో నేను అజ్ఞానమువల్ల చేసిన దుష్కృతానికి ఫలము ఇప్పుడు అనుభవిస్తున్నాను.

"ఓ దేవీ! అప్పటికి నేను నిన్ను పెండ్లి చేసుకొనలేదు. మా తండ్రిగారు ఉన్నారు. నేను గొప్ప ధానుష్కుణ్ణి అనీ, శబ్దవేధిని అనీ పేరు సంపాదించినాను. అప్పుడు నేను యువరాజును. వర్షాకాలము వచ్చింది. మదము ఎక్కి తిరిగే ఋతువు అది. ఈ భూమిమీద ఉండే సమస్త రసాలనూ తన అనంత కిరణాలతో పీల్చివేసి తాపము ఎత్తించే సూర్యుడు, గ్రీతాలు సంచారము చేసే దక్షిణ దిక్కుకు పోయినాడు. భూమి అంతా చల్లబడ్డది. ఆకాశము అంతటా మేఘాలు ఆవరించినవి. కప్పల బెకబెకలు ఆరంభము అయినవి. నెమళ్ళు పెద్దపెట్టున కేకలు వేయసాగినవి.

చాతక పక్షులు బారులు కట్టి మనోహరముగా విహరించసాగినవి. వాన పడ్డది. రెక్కలు తడిసి పక్షులు స్నానము చేసినట్టు కనిపించినవి. గాలికి ఊగుతూ ఉన్న చెట్ల కొమ్మలమీదికి వానలో ఎట్లాగో పోయి వాలినవి. ఎడతెగకుండా వాన పడ్డందువల్ల భూమి జలార్ణవముగా తోచింది. అప్పుడు అచలముగా నిలుచున్న ఏనుగులు, అలలు లేని సముద్రములో కొండలవలె కనిపించినవి. కొండలలో రంగు రంగుల మన్ను కరిగి స్వచ్ఛ జలాలలో కలిసి సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటే, అడవిలో కార్చిచ్చు బూడిదలో వంకర టింకరగా పరుగులు ఎత్తుతున్న పాములవలె అవి కనిపించినవి. ఆ ప్రవాహాలు కొన్నిచోట్ల మెట్టలు ఎక్కుతూనూ, కొన్నిచోట్ల కొత్తదార్లు తొక్కుతూనూ పోయినవి. అప్పుడు ఎంతో హుషారుగా ఉంది. నేను వేటాడవలెను అనుకొన్నాను. ధనుర్బాణములతో రథముమీద బయలుదేరినాను. సరయూ తీరానికి పోయినాను. చీకటి పడిపోయింది. అటూ ఇటూ తిరిగినాను. రాత్రి పొద్దు పోయింది. నీళ్ళు త్రాగడానికి వచ్చే అడవి దున్నలను కానీ, అడవి ఏనుగులను కానీ వేటాడి చంపవలెను అనుకొన్నాను. ఆ చిమ్మ చీకటిలో ఏమీ కనపడలేదు. శబ్దవేధి విద్యాకౌశలము వినియోగించవలెను అనుకొన్నాను. ధనువు ఎక్కుపెట్టి ఏకాంత ప్రదేశములో ఏమరుపాటు లేకుండా మాటు పెట్టుకొని ఉన్నాను. చప్పుడును బట్టి బాణము వదిలినాను. ఒక వన్యమృగము పడిపోయింది. మళ్ళీ కొంతసేపటికి మరి ఒక క్రూరమృగాన్ని అదేవిధముగా చంపివేసినాను.

"ఓ దేవీ! అప్పుడు నీళ్ళలో బుడబుడ చప్పుడు అయింది. అడవి ఏనుగు ఏదో నీళ్ళు త్రాగుతూ ఉంది అనుకొన్నాను. ధ్వనిని పట్టి గురి పెట్టినాను. విషసర్పము వంటి బాణము ఎక్కుపెట్టి ఉంది. తళతళ లాడుతూ ఉన్న ఆ బాణము వదలినాను.

"ఓ కౌసల్యా! నేను ఆ తీక్షణ బాణము వదలిన వైపునుంచి, 'అయ్యో! అబ్బో' అనే మనుష్యవాక్కు స్పష్టముగా వినిపించింది.

"నేను తపస్వినే, ఈ బాణము నా మీద పడ్డది ఏమిటి? రాత్రి పూట మనుష్యులు ఎవరూ ఉండరు అని ఈ ఏటికి నీళ్ళకు వస్తే, నామీద ఎవరో బాణము వేసినారు. నేను ఎవరికి, ఏమి అపకారము చేసినాను? నేను ఏ జోలికీ పోకుండా వన్యఫలాలు తింటూ కాలము గడుపుతున్న ముని బాలుణ్ణే! నన్ను బాణము వేసి చంపవలసిన అవసరము ఎవరికి వచ్చింది? జటావల్కలాలతో ఉన్న నన్ను చంపినవాడికి ప్రయోజనము ఏమిటి? నన్ను ఇట్లా బాణము వేసి కొట్టినవాణ్ణి లోకులు గురుతల్పగతుణ్ణి వలె నిందిస్తారే! నన్ను కొట్టినందుకు నేను దుఃఖపడడములేదు. నా తల్లినీ, తండ్రినీ తలచుకొంటే నా గుండె తరుగుకొనిపోతూ

ఉంది. ఎంత కాలమునుంచో వాండ్లను నేను కాపాడుతున్నాను. నేను పోయిన తరువాత ఆ గుడ్డి వాండ్లు ఎట్లా బ్రతుకుతారు? ఎవడో జ్ఞానహీనుడు, మూర్ఖుడు నన్నే కాదు, నా తండ్రినీ, నా తల్లినీ ఒక్క బాణము వేసి, ఒక్కసారిగా చంపివేసినాడే' అంటూ ఏడవసాగినాడు.

"దేవీ! ఆ మాటలకు నేను భయభ్రాంతుణ్ణి అయిపోయినాను. నిశ్చేష్టుణ్ణి అయినాను. నా చేతులలోనుంచి ధనుస్సూ, బాణాలూ వాటి అంతట అవి జారి నేల మీద పడిపోయినవి. పరమ దుఃఖముతో నేను ఆ చోటికి పోయినాను. బాణము దేహములోంచి దూసుకొని పోయినందువల్ల నెత్తురు వెల్లువలు అయి కారుతూ, జడలు విరపోసుకొని నేలమీద పొర్లాడుతూ ఉన్న ముని బాలుణ్ణి సరయూ తీరాన చూచినాను. ఆ పిల్లవాడి దాపున నీళ్ళు అన్నీ నేలమీద చిందిపోయిన ఒక కుండ కనిపించింది. అంత దురవస్థలో ఉన్నప్పటికీ ఆ మునిబాలుడు నా వంక చూచి కన్నులలోనుంచి నిప్పుకణాలు రాలుస్తూ "రాజా, నా తల్లి తండ్రులకు దాహము అయితే నీళ్ళ కోసము నేను ఇక్కడికి వచ్చినాను. నా మీద నీవు బాణము వేసినావు. నేను నీకు ఏమి అపకారము చేసినాను? నేను తపస్సు చేసుకొనే సాధువునే! నీవు వేసింది ఒక్క బాణమే. రాజా, చచ్చిపోయేది ముగ్గురము. నా తల్లిదండ్రులు ఇద్దరూ అంధులు. నేను పోగానే వాండ్లున్నూ చచ్చిపోక తప్పదు. దాహము ఎత్తి నా తల్లితండ్రులు నా కోసము ఎదురు చూస్తూ ఉంటారు. ఇంకా ఎంతో సేపు వాండ్లు దప్పిక ఓర్చుకోలేరు. నా గతి ఇట్లా అయిందని పాపము వాండ్లకు తెలియదు. తెలిసినా ఏమిలాభము? వాళ్ళంతట వాండ్లు నడచిరాలేరు. వచ్చినా నన్ను చూడడానికి వాండ్లకు కళ్ళు లేవు. ఇంతకూ ఒక చెట్టును నరుకుతూ ఉంటే పక్కను ఉండే చెట్లు చూస్తూ ఊరుకోవడము తప్ప ఏమి చేస్తవి? ఏమి చేయకలుగుతవి? మా తపస్సుకూ మా విద్యకూ ఈ లోకములో ఇది ఫలము కాబోలు.

"రాజా, నీవే మా తండ్రి దగ్గరకు పోయి జరిగింది అంతా చెప్పు. లేకపోయినట్లయితే మహారణ్యాలకు కార్చిచ్చు మాదిరిగా ఆయన తన కోపాగ్నితో నిన్ను దహించివేస్తాడు. ఇదిగో, ఈ కనపడుతున్న కాలిదారినే పో. మా ఆశ్రమము కనిపిస్తుంది. నీవు చప్పున పోయి ఆయన్ను ప్రసన్నుణ్ణి చేసుకో. లేకపోతే నీకు శాపము పెట్టుతాడు.

'రాజా! ముందు ఈ బాణము ఊడబెరుకు. ప్రవాహ జలము ఒడ్డును కోసేటట్టు, ఈ బాణము నా ఆయువుపట్టును కోసివేస్తున్నది. ఈ బాధ నేను భరించలేకుండా ఉన్నాను.' అన్నాడు ఆ మునిబాలుడు.

"ఆ మునిబాలుడు మహాఘోరముగా బాధపడుతున్నాడు. ఆ బాణాన్ని నేను లాగివేసేటట్లయితే, ఆ పిల్లవాడు తక్షణమే చచ్చిపోతాడు. లేకపోయేటట్లయితే, ఆ పిల్లవాడు అట్లా బాధపడుతూ ఇంకా కొంతసేపు ప్రాణముతో కొట్టుకులాడుతూ ఉంటాడు. ఆ సమయములో ఏమి చేయడానికీ నాకు తోచలేదు. ఆ మునిబాలుడు విపరీతముగా బాధపడుతున్నాడు. ఆ పిల్లవాడి దేహము అంతా కుంచించుకొనిపోతూ ఉంది.

"అంత దుర్దశలో ఉన్నా, ఆ మునిబాలుడు నా మనస్సు కనిపెట్టినాడు. అతిదీనముగా నా వంక చూస్తూ, 'రాజా! నేను ధైర్యముతో నా దుఃఖాన్ని అణచివేస్తున్నాను. మనస్సు స్థిరము చేసుకొన్నాను. నీవున్నూ అధైర్యపడవద్దు. దుఃఖపడ వద్దు. చిత్తాన్ని చిక్కపట్టు. నీకు బ్రహ్మహత్యాపాతకము పట్టుకోదు. నేను బ్రాహ్మణ్ణి కాను. వైశ్యునికీ, శూద్రస్త్రీకీ పుట్టినాను. ఓ రాజా! నీవు ముందు ఈ బాణము లాగివేయవలెను. నేను ఈ బాధ భరించలేను' అని ఎంతో కష్టముగా అన్నాడు.

"ఆ పిల్లవాడి బాధ నేను చూడలేకపోయినాను. వెంటనే ఆ బాణము లాగివేసినాను. ఆ మునిబాలుడు నన్ను చూస్తూ ప్రాణము వదలినాడు.

"ఓ కౌసల్యా! నేను ఎంతో బాధపడుతూ, ఏడుస్తూ, నిట్టూర్పులు విడుస్తూ సరయూనది తీరాన పడి చచ్చిపోయిన ఆ మునిబాలుణ్ణి చూచి చూచి ఏడ్చినాను.

64

అట్లా, అప్రతిమానముగా ఆ మునిబాలుణ్ణి చంపడము జ్ఞాపకము వచ్చి, ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు ఏడుస్తూ కౌసల్యాదేవిని చూచి, "ఓ దేవీ! నేను అజ్ఞానమువల్ల మహాపాపము చేసినాను. ఆ మునిబాలుడు చచ్చిపోగానే నా దేహము అంతా కంపించిపోయింది. అప్పుడు ఏమి చేయడము మంచిదా అని ఆలోచించినాను. ఆ మునిబాలుడు చెప్పినట్లు చేయడమే యోగ్యము అని నిశ్చయించుకొన్నాను. అంతట కుండనిండా నీళ్ళు ముంచుకొని, ఆ పిల్లవాడు చెప్పిన దారిన ఆ పిల్లవాడి తల్లిదండ్రులు ఉన్న మునివాటికకు పోయినాను.

"ఆ తల్లిదండ్రులు ఉభయులూ వృద్ధులు, అంధులు, దుర్బలులు. వాండ్లు అంతట వాండ్లు ఎక్కడకీ పోలేరు. రెక్కలు ఊడకొట్టిన పక్షులవలె బిక్కు బిక్కుమంటూ కూర్చుని ఉన్నారు. నీళ్ళకు పోయిన పిల్లవాణ్ణి గురించి దిగులు పడుతున్నారు. వాండ్లు చెప్పుకొంటున్న మాటలు నేను విన్నాను. వాండ్లు ఏమీ చేయలేని దీనావస్థలో ఉన్నారు. పాపము, వాండ్లు నానుంచి దిక్కులేనివాండ్లు అయినారు. వాండ్లకు ఆ సంగతి తెలియదు. తమ పిల్లవాడు ఇంకా వస్తాడు అనే అనుకొంటున్నారు. వాండ్ల

మాటలు చెవులపడ్డకొద్దీ నాకు భయము వేసింది. అట్లాగే ముందుకు అడుగులు వేసినాను. ఆశ్రమములోనికి పోయినాను.

ఆ మునిదంపతులు నా అడుగుల చప్పుడు ఆలకించినారు. 'నాయనా! నీవు నీళ్ళు తేవడానికి పోయి ఎంతసేపు అయింది? ఇంతసేపూ ఏమి చేస్తున్నావు? నీళ్ళలో ఈత కొట్టుతున్నావా? నీవు ఏమి అయిపోయినావో అని మీ అమ్మ దిగులు పడుతూ ఉంది. త్వరగా రా నాయనా! ముందు మీ అమ్మకు కాసిని నీళ్ళు ఇవ్వు.

'నాయనా! మాట్లాడవేమిటి? పలుక వేమిటి? నేను కానీ, మీ అమ్మ కానీ ఏది అయినా మాట అని ఉంటే, అది మనస్సులో పెట్టుకొని ఇట్లా ఆలస్యము చేస్తావా? మేము గుడ్డివాండ్లమే! మాకు కళ్ళు అయినా, కాళ్ళు అయినా నీవే కదా! మా ప్రాణాలే నీమీద ఆధారపడి ఉన్నవే! నీవు అట్లా ఆలస్యము చేయవచ్చునా? నాయనా! మాట్లాడవేమిటి' అన్నాడు ఆ వృద్ధమహర్షి.

"ఆ వృద్ధుడి మాటలకు నా గుండె బద్దలు అయిపోయింది. నా నోట మాట వెలువడలేదు. వణుకు పుట్టింది. కాసేపటికి ఎట్లాగో నిబ్బరించుకొని, "ఓ మహాత్మా! నేను మీ పిల్లవాణ్ణి కాను. క్షత్రియుణ్ణి, నా పేరు దశరథుడు అంటారు. నా పూర్వ కర్మవల్ల సజ్జనులు నిందించే పని చేసినాను. రాత్రిపూట సరయూనదిలో నీళ్ళు త్రాగడానికి వచ్చే క్రూరమృగాలను వేటాడవలెను అనుకొన్నాను. ఆ నదీతీరానికి పోయినాను. ధనుర్ధరుణ్ణి అయినాను. అనుకొన్నట్టు రెండు క్రూరమృగాలను ధ్వనిని గురిపెట్టి కొట్టినాను. అంతలో ఏదో నీళ్ళు త్రాగుతున్నట్టు బుడబుడ చప్పుడు అయింది. అది అడవి ఏనుగే అయి ఉంటుంది అనుకొన్నాను. బాణము వదలినాను. మనుష్యుని ఆర్తారావము విన్నాను. తక్షణము పరుగెత్తుకొని పోయి చూచినాను. నా బాణము గుచ్చుకొని మీ పిల్లవాడుభరించలేని బాధతో నేలమీదపడి పొర్లాడుతున్నాడు. నన్ను చూడగానే ఆ బాణము పెరికివేయమని చెప్పినాడు. ఆ బాధపడటము నేను చూడలేకపోయినాను. బాణాన్ని పెరికివేసినాను. మీరు ఉభయులూ అంధులు అనీ, ఇక మీ గతి ఏమి అవుతుందో అనీ మీ పిల్లవాడు దుఃఖపడుతూ, నన్ను నీళ్ళు తీసుకొని మీకు ఇమ్మని చెప్పి స్వర్గస్థుడు అయినాడు. నేను తెలియక బాణము వేసినాను. మీ పిల్లవాడు చనిపోయినాడు. ఓ మహర్షీ! నా ఖేదము నేను మాటలతో చెప్పలేను. ఇక నేను ఏమి చేయవలెనో తామే సెలవు ఈయవలెను' అని వేడుకొన్నాను.

"ఆ మహర్షి నేను చెప్పిన భయంకర వృత్తాంతము అంతా సావధానముగా విన్నాడు. దుఃఖపడిపోయినాడు. కోపము ఆణచుకోలేక పోయినాడు. 'ఓ రాజా! ఈ అశుభము నీ అంతట నీవే వచ్చి చెప్పినావు. బ్రతికిపోయినావు. లేకపోయినట్లయితే,

నీ తల ముక్కలుగా పగిలిపోయేది. దేవేంద్రుడు అయినప్పటికిన్నీ తెలిసి వానప్రస్తుణ్ణి చంపేటట్టయితే పదభ్రష్టుడు అయిపోవలసిందే! తెలిసే బ్రహ్మవేత్తమీద శస్త్రము వేసినవాడి శిరము ఏడు చెక్కలు అయిపోతుంది. తెలిసే నీవు నాపిల్లవాడిమీద బాణము వేసి ఉంటే నీవేకాదు, నీ ఇక్ష్వాకు వంశము అంతా ఈపాటికి నాశనము అయిపోయేది.

'ఓ రాజా! మాపిల్లవాడు పడి ఉన్న చోటికి మమ్ములను నీవే తీసుకొనిపో. రక్త సిక్తాంగుడు అయి, చేష్టలు ఉడిగిపోయిన మా పిల్లవాణ్ణి చివరిసారి మేము తాకి చూస్తాము' అన్నాడు. నేను ఆ అంధ దంపతులను సరయూ తీరానికి తీసుకొని పోయినాను. వారు ఆ పిల్లవాడి దేహము అంతా చేతులారా తడివి చూచినారు. ఆ పిల్లవాడి తల్లి ఏడ్చి ఏడ్చి మూర్ఛపోయింది. ఆ తండ్రి ఆ పిల్లవాడిమీద పడి "నాయనా! నన్ను చూడవా? నాతో మాట్లాడవా? నా మీద కోపమా? నా మీద కోపము వస్తే నన్ను చూడవద్దు. ఇదిగో, మీ అమ్మ వచ్చింది. చూడు, మాట్లాడు. నాయనా! మాతో మాట్లాడవా? మమ్ములను కొగలించుకోవా?

'నాయనా! ఇకను నీవలె మృదుమధురముగా మాతో మాట్లాడేవారు ఎవరు? నీవలె హృదయంగమముగా తెల్లవారు ఝామున నాకు వేదశాస్త్రాలు చదివి వినిపించేవారు ఎవరు? ఉదయమే సంధ్యను ఉపాసించి అగ్నిహోత్రములో హోమము చేసేవారు ఎవరు? మాకు సేవ చేసేవారు ఇక ఎవరు? మమ్ములను ఎక్కడికి అయినా నడిపించుకొని పోయేవారు ఎవరు? కందమూల ఫలాలు తెచ్చి ప్రియాతిథులకు పెట్టేటట్టు, మాకు పెట్టేవారు ఇక ఎవరు? నాయనా! మీ అమ్మను నేను ఓదార్చడము ఎట్లా? పోషించడము ఎట్లా? నీవు లేకుండా మేము ఈ అడవిలో బ్రతకడము ఎట్లా? నాయనా! తెల్లవారిన తరువాత మేమూ నీతో వస్తాము. నీవు ఇప్పుడు పోవద్దు. మేము వచ్చేదాకా ఉండు. ఎందుకు ఆలస్యము చేసినావు అని యమధర్మరాజు నిన్ను కోపపడేటట్లయితే, మమ్ములను వెంటపెట్టుకొని రావడములో ఆలస్యము అయింది అనీ, నిన్ను క్షమించవలెను అనీ మేము వేడుకొంటాము. ఆ ధర్మాత్ముడు మా వంటి దీనులను తప్పకుండా దయతో చూస్తాడు. నిన్ను అనుగ్రహిస్తాడు.

"ఓ కొడుకా! ఈ పాపకర్ముడు నిన్ను చంపివేసినాడు. నీవు ఏ పాపమూ ఎరుగవు. పుణ్యాత్ముడవు. అందువల్ల, నీవు సగరుడూ, శైబ్యుడూ, దిలీపుడూ, ధుంధుమారుడూ, నహుషుడూ, జనమేజయుడూ పోయిన పుణ్యలోకానికే పోతావు. వెన్ను చూపించకుండా పోరాడే శూరులూ, శస్త్రయోధులూ, సాధువులూ, స్వాధ్యాయ సంపన్నులూ, తపోనిష్ఠులూ, భూదానపరులూ, ఆహితాగ్నులూ, ఏకపత్నీవ్రతులూ, గో సహస్రప్రదాతలూ, గురుసేవారతులూ, దేహన్యాసకృతులూ మొదలు అయిన

పుణ్యాత్ములు పోయే లోకానికే నీవూ పోతావు. నాయనా! మన వంశీయులు అందరూ తపోనిష్ఠులు. మన వంశములో పుట్టినవారు ఎవరున్నూ అధోగతులు కారు. నీకున్నూ అధోగతి ఉండదు. నిన్ను చంపివేసిన ఈ దశరథమహారాజుకు అధోగతి తప్పదు' అని ఏడుస్తూ, ఆ వృద్ధుడు భార్యతో కూడా ఉదకక్రియలు చేయను ఆరంభించినాడు.

"అప్పుడు ఆ మునిబాలుడు దివ్యరూపము ధరించి దేవేంద్రుడితో దివ్యవిమానములో పోతూ, ఆ ముని దంపతులను చూచి, 'ఓ మునిదంపతులారా! నేను మీకు సేవ చేయడమునుంచి ఇప్పుడు మహోచ్ఛస్థానానికి పోతున్నాను. మీరునూ త్వరలో నా దగ్గరకు వస్తారు' అని వారిని ఊరడిస్తూ అంతర్ధానము అయినాడు.

"ఓ కౌసల్యా! నేను అప్పుడు అక్కడ చేతులు జోడించి నిలుచుకొని ఉన్నాను. ఆ వృద్ధమహర్షి నన్ను ఉద్దేశించి, "ఓ రాజా! నాకు ఉన్నదే ఒక్క పిల్లవాడు. ఆ ఒక్కపిల్లవాణ్ణి నీవు చంపివేసినావు. నేను అపుత్రకుణ్ణి అయిపోయినాను. అందువల్ల, నాకు ఇప్పుడు చావు భయము లేదు. అంతేకాదు, మేము చనిపోతేనే మాకు ఈ పుత్రశోకము పోతుంది. కాబట్టి, మమ్ములను కూడా నీవే చంపివేయవలసింది'అన్నాడు.

"నేను కిక్కురుమనకుండా నిలుచున్నాను. అంతట ఆ వృద్ధుడు, 'ఓ రాజా! నీవు తెలియక నా పిల్లవాణ్ణి చంపివేసినావు. ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నావు. కనుక, నిన్ను ఏ మహాపాతకమూ బాధించదు. అయితే, నాకు వృద్ధాప్యములో నీవు నిష్కారణముగా పుత్రశోకము అనే దక్షిణ ఇచ్చినావు. నీవు ఇచ్చిన దక్షిణ వృథాగా పోదు. నీవున్నూ నీ వృద్ధాప్యములో నావలె పుత్రశోకముతో కాలము చేయవలెను' అని శాపము పెట్టినాడు.

"అంతట ఆ అంధ దంపతులు మండుతూ ఉన్న కుమారుడి చితిలో పడిపోయినారు.

"ఓ కౌసల్యా! ఇప్పుడు ఆలోచిస్తూ ఉంటే నా చిన్నప్పుడు నేను శబ్దవేధివిద్య అభ్యసించడమూ, తెలియక చేసిన ఈ పాప కృత్యమూ జ్ఞాపకము వచ్చినవి. అపథ్యాహారము తిన్నవాడికి రోగము రాక తప్పదు. అదేవిధముగా, ఆనాటి నా పాపకృత్యము ఈనాడు విపాకము అవుతూ ఉంది. ఓ దేవీ! ఆనాడు ఆ మహర్షి అన్న మాటలు ఇప్పుడు నాకు అనుభవములోకి వస్తూ ఉన్నవి. ఇకను ఈ పుత్రశోకముతో నేను బ్రతకడము ఉత్తది.

"ఓ కౌసల్యా! నాకు ఇప్పుడు కన్నులు కనిపించడము లేదు. నీవు నాకు కనపడడము లేదు. ఎక్కడ ఉన్నావు? మాట్లాడవు ఏమిటి? ఓ కౌసల్యా! నన్ను తాకి

చూడు, అని ఏడుస్తూ, "ఓ దేవీ! ఈ లోకములో వివేకి అయిన తండ్రి ఎవరున్నా కొడుకు ఎటువంటి దుశ్చరితుడు అయినా అడవులకు వెళ్ళకొట్టడు. తండ్రి ఎంతటి పరాక్రమవంతుడు అయినా అకారణముగా అడవులకు పొమ్మంటే, కొడుకు ఎంత మంచివాడు అయినా ఎదురు తిరగకుండా ఉండడు. నిర్దాక్షిణ్యముగా రాముణ్ణి అడవులకు పొమ్మనడం నాకే చెల్లింది. నేను పొమ్మన్నాను అని కిక్కురుమనకుండా అడవులకు ప్రయాణము అయిపోవడము రాముడికే చెల్లింది.

"ఓ దేవీ! రాముడు ఇప్పుడు ఈపాళముగా ఇక్కడికి వచ్చి నన్ను కౌగలించుకొంటే నేను బ్రతుకుతానో ఏమో! లేకపోతే నేను వాణ్ణి చూడడమూ, వాడు వచ్చి నన్ను చూడడమూ ఉండదు. ఓ కౌసల్యా! మాట్లాడవు ఏమిటి? అయ్యో! నా కన్నులు మూసుకొని పోతున్నవి. నా స్మృతి తప్పిపోతున్నది. అరుగో, యమకింకరులు నన్ను తొందర చేస్తున్నారు.

"అయ్యో! ఈ ప్రాణప్రయాణ సమయాన ఆ ధర్మజుడు, ఆ సత్యవ్రతుడు, ఆ జితేంద్రియుడు రాముడు ఎట్టఎదుట లేడే! చెరువులో ఉన్న కాసిని నీళ్ళనూ మండుటెండ పీల్చి వేసేటట్టు, ఈ బొందిలో ఉన్న కాస్త కొనఊపిరిని పుత్రశోకము పీల్చివేస్తున్నది.

"ఓ కౌసల్యా! పద్నాలుగు సంవత్సరాలూ అయిపోయిన తరువాత రాముణ్ణి చూచేవారు అందరూ దేవతలు. చంద్రబింబమువంటి ఆ ముఖము, పద్మపత్రాలవంటి ఆ కన్నులు, పొడుగాటి ఆ ముక్కు, అందమైన ఆ కనుబొమ్మలు, తళతళలాడే ఆ కుండలాలూ, నిగనిగలాడే ఆ చెక్కిళ్లు, ముత్యాలవంటి ఆ పలువరుస, ఆ రామ ముఖారవిందము ఎవరో పుణ్యపురుషులకు కనపడుతుంది. నాకు కాదు. అయోధ్యా పురవాసులు పద్నాలుగు సంవత్సరాలు అయిపోయిన తరువాత, మౌఢ్యము వదలి ఉచ్చకు పోయే శుక్రుణ్ణివలె రాముణ్ణి చూస్తారు.

"కౌసల్యా! నాకు ఇప్పుడు ఏమీ కనపడకపోవడమే కాదు, ఏమీ వినపడడమూ లేదు. ఊపిరి ఆడుతూ ఉందో లేదో తెలియడము లేదు. ఏమి పట్టుకొంటున్నానో తెలియడము లేదు. గుండె ఆగిపోయిందేమో తెలియడము లేదు. నా ప్రాణము, నూనె అయిపోయిన దీపమువలె కొట్టుకొంటున్నది. వరద ఏటి ఒడ్డును కూలతోసేటట్టు, పుత్రశోకము దిక్కుమాలిన నన్ను యమలోకానికి తోసుకొని పోతున్నది.

'రామా, నాయనా, పితృప్రియా ఎక్కడ ఉన్నావు? ఓ కౌసల్యా! రాముడు ఏడీ' అంటూ దశరథమహారాజు కన్నులు మూసినాడు.

అర్ధరాత్రము అయింది.

65

దశరథుని మరణము

తెల్లవారుఝాము అయింది. స్తోత్రపాఠాలు, వందిజనులూ, రాజవంశావళిని కీర్తనముచేసే సూతులూ, మంగళగానముచేసే మాగధులూ యథాప్రకారము స్నానము చేసి అలంకరించుకొని రాజభవనములోకి వచ్చినారు. వారు అందరూ చక్కగా చదువుకొన్నవారు. గాంధర్వ విద్యలో ఆరితేరినవారు. యథాప్రకారము దశరథ మహారాజును ఆశీర్వదిస్తూ స్తోత్రము చేస్తూనూ మేలుకొలుపులు గొంతెత్తి పాడను ఆరంభించినారు.

సూతులు ఉచ్చైఃస్వరముతో దశరథమహారాజును స్తోత్రము చేస్తూ ఉంటే పాణివాదకులు మధ్య మధ్య పూర్వరాజుల అద్భుత కృత్యాలనూ, దశరథమహారాజు అద్భుత కృత్యాలనూ పేర్కొంటూ తాళాలు మోగించినారు. ఆ సంగీత ధ్వనులకు రాజభవనము ఆవరణలో చెట్ల మీద కాపురము ఉంటున్న రకరకాల పక్షులూ, భవనములో పంజరాలలో ఉంటున్న పక్షులూ కలకల ధ్వనులు చేస్తూ నిద్ర లేచినవి. అంతట అవి కుహూనాదాలతో పాటలు పాడను ఆరంభించినవి.

జంత్రగాయకులు వీణలు మ్రోగించడము మొదలుపెట్టినారు. బ్రాహ్మణోత్తములు పుణ్యమంత్ర పఠనము చేయసాగినారు. ఆ మనోహర ధ్వనులతో అప్పుడు ఆ రాజభవనము అంతా మారుమోగి పోయింది.

ఆ అంతఃపురములో ఉన్న శుచిసమాచారులు అయిన పరిచారికలూ, కాలోచిత పరిచర్యావిచక్షణులు అయిన నపుంసక భృత్యులూ ఎప్పటివలె వారి వారి పనులు చక్కబెట్టడానికి వచ్చినారు. స్నాన విధులు తెలిసిన భృత్యులు యథావిధిగా హరిచందనము కలిపిన జలాలు బంగారు కలశాలలో తెచ్చినారు. దంతధావనము అయిన తరువాత పుక్కిలించి ఉమ్మివేయడానికి అవసరము అయిన ఓషధులూ, స్నానానికి అవసరము అయిన నూనెలూ, నలుగుపిండ్లూ మొదలు అయిన మంగళానులేపనాలూ, ప్రాతఃకాలాన తినే పదార్థాలూ వస్త్రాభరణపుష్పాదులూ మొదలు అయిన వాటిని వయసుకత్తెలు అయిన పరిచారికలు తెచ్చినారు. పరిజనులు అందరూ యథా శాస్త్రముగా అలంకరించుకొని వారి వారి విధులు నెరవేర్చడానికి సిద్ధముగా ఉన్నారు.

సూర్యోదయము అయినా దశరథమహారాజు వెలుపలికి రాలేదు. ఎప్పుడూ వేకువనే మేల్కొనే ఆ మహానుభావుడు ఎంత పొద్దు ఎక్కినా నిద్రలేవనందువల్ల అందరికీ సందేహము వేసింది. అంతట అంతఃపుర సంచారయోగ్యులు అయిన

స్త్రీలు లోపలికి పోయినారు. మెల్లగా మేలు కొలిపినారు. ఆయన నిద్రలేవలేదు. మృదువుగా చేతులతో కదిలించినారు. ప్రయోజనము లేకపోయింది. ఆయనను పరిశీలించి చూచినారు. ఆయన నిద్రపోతున్నట్టు వారికి తోచలేదు. ముక్కు దగ్గర చేతులుపెట్టి చూచినారు. గుండెలు ఆడడము లేదు. ఏటి వరదకు ఎదురు అయిన గడ్డి పోచవలె గజగజలాడిపోయినారు. అందరూ పరిశీలించినారు. దశరథమహారాజు చనిపోయినాడు అని నిశ్చయించినారు.

ఆ సమీపములోనే చచ్చిపోయినవాండ్ల వలె ఒండ్లు తెలియకుండా నిద్రపోతున్న కౌసల్యా, సుమిత్రలను చూచినారు. ఎండిపోయిన కన్నీటి చారలతో వాండ్ల ముఖాలు వివర్ణము అయిపోయి, పొగమంచు కమ్ముకొన్న నక్షత్రాలవలె కళాకాంతులు లేకుండా వాండ్లు పడి ఉన్నారు.

అట్లా చచ్చి పడిఉన్న దశరథమహారాజునూ, ఒండ్లు ఎరగకుండా పడి నిద్రపోతున్న కౌసల్యా, సుమిత్రలనూ చూచి ఆ అంతఃపురాంగనలు, అడవిలో చచ్చిపోయిన పోతుటేనుగును చూచిన పెంటిపేనుగులవలె ఎలుగెత్తి అందరి చెవులూ గింగిర్లు ఎత్తేటట్టు ఘొల్లుమన్నారు.

ఆ రోదనధ్వనులకు కౌసల్యా, సుమిత్రలు ఉలిక్కిపడి లేచినారు. పెనిమిటిని పట్టుకొని చూచినారు. "అయ్యో! అయ్యో!" అంటూ కౌసల్యాదేవి, వేటకాడి బాణము దెబ్బతిన్న పెంటిపేనుగువలె నేలకూలి, ఆవురుమని ఏడుస్తూ పొర్లిగింతలు పెట్టడము మొదలు పెట్టింది. ఆ ఏడ్పులకూ, ఆ పెడబొబ్బలకూ కైకేయీదేవి మొదలు అయిన రాజపత్నులు అందరూ అక్కడికి వచ్చి ఘోరముగా ఏడుస్తూ ఒండ్లు తెలియకుండా ఉండగా, ఆ రాజాంగనల రోదన ధ్వనులతో ఆ రాజ భవనము అంతా ప్రతిధ్వనించింది.

ఎప్పుడూ ఎంతో ఉత్సాహముతో ఆ రాజభవనములో తిరిగే పరిజనులు అందరూ సంత్రస్తులూ, సంభ్రాంతచిత్తులూ అయిపోయినారు. రాజబంధువులు అందరూ ఒకరి ముఖమువంక ఒకరు దీనముగా చూడసాగినారు.

రాజాంగనలు ఒకరి చేతులు ఒకరు పట్టుకొని ఒండ్లు ఎరగకుండా ఏడవ సాగినారు. ఆ అంతఃపురము వారి రోదన ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లి పోయినది.

66

ఆరిపోయిన అగ్నిహోత్రమువలెనూ, కాంతులు మాసిపోయిన సూర్యబింబము వలెనూ చచ్చిపడి ఉన్న దశరథమహారాజును చూచి కౌసల్యాదేవి సంతతధారగా కన్నీళ్లు కారుస్తూ, దుఃఖావేశముతో వణికిపోతూ, ఆయన శిరము తన తొడమీద పెట్టుకొని ఏడుస్తూ, "ఓ కైకా! నీ కోరిక సఫలము అయింది. పెనిమిటి స్వర్గతుడు

అయినాడు. రాముడు లేడు. ఓ క్రూరురాలా! నీకు ఇకను ఏ అడ్డూ లేదు. ఓ దుష్టచారిణీ! నీవు ఇకను ఏకాధికారిణివిగా ఈ రాజ్యము ఏలు.

"అయ్యో! మహాభయంకరారణ్యములో వెంటపెట్టుకొని పోతూ ఉన్న ఆత్మబంధువులు, ఒంటరిగా వదలిపెట్టి పోయినట్లుగా ఉంది ఇప్పుడు నా స్థితి. స్త్రీకి భర్తే దైవము. ఆ భర్తే పోయినప్పుడు ఆడది బ్రతకడము ఎందుకు? నా పెనిమిటి లేకుండా బ్రతకడము నావల్ల కాదు. ఓ కైకా! నీకు ఈ ధర్మముతో నిమిత్తము లేదు. ఆశపాతకుడు ఆశకొద్దీ విషమిశ్రపాకము అయినా తింటాడు. అయితే, తిన్న తరువాత కాని దాని చెరుపు ఏమిటో వాడికి తెలియదు. అదేవిధముగా కుబ్జ చెప్పింది బాగుంది అనుకొన్నావు. అట్లా వరాలు అడిగినావు. నీవు కోరినట్టు ఆయన చెల్లించినాడు. అయితే ఇప్పుడు ఆయనే, మన పెనిమిటే లేకుండా పోయినాడు. మన పెనిమిటి ఒక్కడే కాదు, ఇక్ష్వాకువంశము అంతా నాశనము అయిపోయింది.

"ఓ కైకా! ఈ సంగతి జనకమహారాజుకున్నూ తెలుస్తుంది. నీకు వాగ్దానము చేసిన వరాలు దశరథమహారాజు ఇట్లా చెల్లించవలెను అనే నిర్ణయము లేకపోయినప్పటికిన్నీ, నిన్ను సంతోషపెట్టడానికి జ్యేష్ఠపుత్రుణ్ణి కోడలితో కూడా అడవులకు వెళ్ళకొట్టినాడు అనుకొంటాడు. విచారపడతాడు. దశరథమహారాజువలెనే పుత్రికా శోకముతో తపించిపోతాడు.

"ఓ కైకా! ఆ కమలపత్రాక్షుడు, నా పిల్లవాడు రాముడు ఇప్పుడు ఏ అడవిలో తిరుగుతున్నాడో? దశరథమహారాజు పోయినాడు అనీ, నేను విధవనూ అనాథనూ అయిపోయినాను అనీ వాడికి ఇప్పుడు ఎట్లా తెలుస్తుంది? తెలియదు. అయ్యో! నా కోడలు, జనకరాజసుత ఎన్నడూ ఏ కష్టమూ ఎరుగదు. కారడవులలో ఎట్లా తిరుగుతున్నదో? ఎంత కష్టపడుతున్నదో? ఎంత భయపడుతున్నదో? పాపము, రాత్రిపూట క్రూరమృగాలు భయంకరముగా గర్జిస్తూ ఉంటే, రాత్రి సంచారము చేసే పెద్ద పెద్ద పక్షులు ఘోరముగా కూస్తూ ఉంటే నా కోడలు ఉలిక్కిపడి, గజగజ లాడుతూ రాముణ్ణి కౌగిలించుకొంటుంది. వాణ్ణి గట్టిగా పట్టుకొని వదలిపెట్టదు. అంతకన్నా ఏమి చేస్తుంది? ఆ వృద్ధుడు జనకమహారాజు తన కూతురిని గురించే తలచుకొని దుఃఖార్తుడు అయిపోతాడు. ఆయనకు పుత్రులు అయినా లేరు. పుత్రికా దుఃఖముతో ప్రాణము వదులుతాడు.

"ఓ కైకా! నేను పతివ్రతను. ఇకను నేను బ్రతకకూడదు. బ్రతుకను. పెనిమిటిని కౌగిలించుకొని చితిలో పడుకొంటాను" అంటూ దశరథమహారాజు శవము మీద పడి పెద్దపెట్టున ఏడవ సాగింది. అట్లా పడి ఘోరముగా ఏడుస్తున్న

కౌసల్యాదేవిని అప్పుడు అంతఃపురాధ్యక్షులు ఓదారుస్తూ, ఆ కళేబరము దగ్గరనుంచి అవతలకు తీసుకొనిపోయినారు.

కర్తవ్యాన్ని నిర్ణయించడానికి అమాత్యులు అందరూ సమావేశము అయినారు. కొందరు రాజబంధువులు దశరథమహారాజుకు వెంటనే దహన సంస్కారాదులు చేయించవలెను అన్నారు. అట్లా చేయడానికి వీలు లేదు అని మరికొందరు అన్నారు. అమాత్యులు అన్నివిషయాలూ తెలిసినవారు, ఒక్క పుత్రుడు అయినా దగ్గరలో లేనందువల్ల చచ్చిపోయిన మహారాజు అంత్యక్రియలు వెంటనే జరిపించకూడదు అని నిశ్చయించినారు. ఆ కళేబరాన్ని తైలద్రోణములో పెట్టి కాపాడవలెను అని ఆజ్ఞాపించినారు.

అంతట దశరథమహారాజు కళేబరాన్ని నూనెకుండలో పడుకోపెట్టినారు. అప్పుడు అంతఃపురాంగనలు అందరూ, "అయ్యో ! అయ్యో!" అంటూ నెత్తి నెత్తి బాదుకొంటూ ఏడుస్తూ, "ఓ రాజా! ఆడి తప్పని రాముడు, మమ్ములను ఎప్పుడూ కనిపెట్టే రాముడు, మమ్ములను వదిలిపెట్టి పోయినాడు అని మేము ఏడుస్తూ ఉంటే, నీవు ఎందుకు మమ్ములను వదలిపెట్టి పోయినావు? మేము ఏమి చేసినాము? ప్రభూ! నీవు మమ్ములను ఇట్లా వదలిపెట్టి పోయినందువల్ల, మేము ఇప్పుడు విధవలము అయినాము. రాముడు వదిలిపెట్టి పోయినందువల్ల దిక్కులేని వాండ్లము అయినాము. ఇక మాగతి ఏమిటి? ప్రభూ! మేము కైకేయీదేవి దగ్గర ఉండగలమా? ఒకవేళ మేము ఉండవలెను అనుకొన్నా, ఆమె మమ్ములను తన దగ్గర ఉండ నిస్తుందా? రాజ్యలక్ష్మి మీకూ మాకూ ప్రభువు అయిన రామున్ని వరించకుండా మీ చేతనే అడవులకు వెళ్ళ కొట్టించిన దుష్టురాలు, భరించనలవికాని పుత్రశోకము మీకు తెచ్చి పెట్టి మిమ్ములను చంపిన పతిఘ్ని మమ్ము మన్నిస్తుందా? రాముడివంటి పరమధార్మికున్ని, లక్ష్మణుడువంటి మహాబలవంతున్ని, సీతవంటి కోడలిని మీవంటి పెనిమిటినీ వదులుకొన్న కైకేయీదేవి మమ్ములను ఉండనిస్తుందా" అని ఏడుస్తూ నేలమీదపడి దొర్లడము మొదలు పెట్టినారు.

దశరథమహారాజు చనిపోయినాడు అని తెలియగానే అయోధ్యాపురలక్ష్మి పెనిమిటి పోయిన ఆడుదానివలె అయిపోయింది.

ఎక్కడివారు అక్కడ కదలలేక పోయినారు. మెదలలేక పోయినారు. స్త్రీలు, అయ్యో! అయ్యో! అంటూ రోదనము చేయసాగినారు. అందరూ దుఃఖాక్రాంతులు అయిపోయినారు. వీధులలో కసవు అయినా ఊడ్చలేక పోయినారు. తమ తమ ఇండ్ల ముందు ముగ్గులు అయినా పెట్టలేక పోయినారు. ఇండ్ల లోపల అయినా

బాగుచేసుకోలేక పోయినారు. స్త్రీలూ, పురుషులూ ఇండ్లలో గుంపులు గుంపులుగా మూగి కైకేయీదేవిని నిందించసాగినారు.

రాజవీధులలోనూ, చత్వరాలలోనూ జనసంచారమే లేదు. పట్టణము అంతా పాడుపడ్డట్టు అయిపోయింది. ఊరడించేవారు ఎవరూ లేక రాజాంగనలు ఎంతసేపటికీ ఏడ్పులు చాలించలేదు. చూచి చూచి విసుగెత్తి సూర్యుడు సంచారము మాని వేసినాడు. చీకట్లు అలముకొన్నవి.

67

కన్నీళ్ళు కార్చి కార్చి అందరి కన్నులు కలకపారి పోయినవి. అయోధ్యా నగరములో ఆ రాత్రి ఎవరికీ ఎంతసేపటికీ తెల్లవారలేదు.

ఎట్లాగో సూర్యోదయము అయింది. దశరథమహారాజు మంత్రులూ, పౌరముఖ్యులూ, రాజకర్తలూ, బ్రాహ్మణోత్తములూ సభ చేసినారు. మార్కండేయుడూ, మౌద్గల్యుడూ, వామదేవుడూ, కాశ్యపుడూ, కాత్యాయనుడూ, మహాయశస్సు సంపాదించిన జాబాలీ, ఇంకా ఎందరో బ్రాహ్మణోత్తములూ ఆ సభకు వచ్చినారు. ఇక్ష్వాకు కులగురువు వశిష్ఠమహర్షి ఆ సభకు పెద్దరికము వహించినాడు.

సమావేశము అయిన అమాత్యులూ, బ్రాహ్మణోత్తములూ మొదలు అయినవారు అందరూ కర్తవ్యాన్ని గురించి యోచించినారు. సభా ముఖ్యులు ఒక్కొక్కరే వశిష్ఠమహర్షితో ఈ విధముగా చెప్పినారు :

"ఓ మహర్షిసత్తమా! దశరథమహారాజు చనిపోయినందువల్ల, గత రాత్రి తెల్లవారడానికి నూరు సంవత్సరాలు పట్టినట్టుగా అందరికీ తోచింది. రామలక్ష్మణులు అడవులపాలు అయిపోయినారు. భరత శత్రుఘ్నులు కేకయ దేశములో మనోహరము అయిన రాజగృహ పట్టణములో కేకయమహారాజు దగ్గర ఉన్నారు. తాము ఇప్పుడు ఇక్ష్వాకువంశీయుణ్ణి ఒకణ్ణి రాజుగా నియమించవలెను. లేకపోయేటట్లయితే, ఈ రాజ్యము అరాజకము అవుతుంది. అరాజకము అయిపోకుండా ఈ రాజ్యాన్ని తాము కాపాడవలెను.

"అరాజకము అయిన దేశములో పర్జన్యుడు ఉరుములతోనూ, మెరుపుల తోనూ దివ్యోదకాన్ని వర్షించడు. పండే పంట అరాజకము అయినప్పుడు తమకు దక్కదేమో అనే భయముతో, కర్షకులు చేలలో విత్తనాలు వెదపెట్టరు. శిక్షించేవాడు ఉండడు కనుక, తండ్రిమాట కొడుకులు వినరు. పెనిమిటిని పెండ్లాము గౌరవించదు. ఎవరు ఎప్పుడు కొల్లకొట్టుకొని పోతారో అనే భయమువల్ల అందరూ ఏకము అయి ధనము కనిపించకుండా చేసివేస్తారు. దుష్టులు చెలరేగి స్త్రీలను లేవతీసుకొని

పోతారు. మొత్తము రాజ్యములో నిజాయితీ అనేది అంతర్ధానము అయిపోతుంది. ఎవరికీ మనస్స్వాస్థ్యము ఉండదు. పెద్దలు సభలు చేసి ఆ యా విషయాలు చర్చించరు. పుణ్య ప్రదేశాలు జార చోరులకు ఆటపట్టులు అవుతవి. ఉద్యానవనాలు పాడుపడిపోతవి.

"ఓ మహర్షీ! అరాజకము అయినప్పుడు దేశంలో జితేంద్రియులూ, వేదవేత్తలూ, సంశ్రితవ్రతులూ, యజ్ఞశీలురూ అయిన బ్రాహ్మణోత్తములు యజ్ఞాది క్రతువులు తలపెట్టరు. ఆ యజ్ఞాది క్రతువులలో బ్రాహ్మణోత్తములకు దక్షిణ ఇస్తే, తమ దగ్గర ధనము ఉన్నట్లు అందరికీ తెలిసిపోతుంది అనే భయము నుంచి, ధనవంతులు అయిన బ్రాహ్మణులు యజ్ఞాది క్రతువులు చేయడము మానివేస్తారు. ప్రజలను ఉత్సాహపరచే ఉత్సవాలు ఉండవు. నటనర్తకుల ప్రదర్శనాలు ఉండవు. వినవలెను అనుకొన్నా పుణ్యకథా పఠనము ఉండదు. ప్రజలు తీర్థయాత్రాదులకు ప్రయాణము అయిపోరు. వ్యవహారవిదులు న్యాయాన్యాయాలు చెప్పరు.

"అరాజకము అయినప్పుడు దేశములో కన్నెపడుచులు బంగారు సొమ్ములు పెట్టుకొని సాయంకాల మప్పుడు సావాసకత్తెలతో ఉద్యానవన విహారానికి పోరు. పురుషులు ఎప్పటివలె తమ ప్రియురాండ్రను వెంటపెట్టుకొని వేగముగా పోయే వాహనాల మీద వనవిహారము చేయరు. ధనవంతులు అయిన కర్షకులూ, గోరక్షకులూ రాత్రిపూట నిర్భయముగా తమ ఇండ్ల తలుపులు తెరచిపెట్టుకొని నిద్రపోరు. మెడలో బంగారు గంటలు మ్రోగుతూ, పెద్ద పొడుగాటి దంతాలతో అరవై ఏండ్ల పెద్ద పెద్ద ఏనుగులు రాజవీధులలో యథేష్టముగా తిరగవు.

"ఓ మహర్షిపుంగవా! అరాజకము అయిన రాజ్యములో అమంత్రకాలు అయిన ఇషువులనూ, సమంత్రకాలు అయిన బాణాలనూ, యోధులు సాధన చేసే జ్యానాదాలు వినిపించవు. దారిదోపిడి భయమునుంచి వర్తకులు దూరదేశాలలో అమూల్యవస్తువులు విక్రయించడానికి పోరు. ఆ అమూల్యవస్తువులను ఎవరు అయినా ఎత్తుకొనిపోతారేమో అనే భయముతో దాచి పెట్టుతారు. జితేంద్రియులు అయి ఒంటరిగా తిరుగుతూ ఎక్కడ పొద్దుకూకితే అక్కడ విశ్రమించే యతులు ఎక్కడనూ కనపబడరు. మంచి మంచి రథాలూ, గుర్రాలూ ఎక్కి ఎవరూ ఎక్కడికీ విహారార్థము పోరు. శాస్త్రవిదులు వనాలలో కానీ, ఉద్యానవనాలలో కానీ సభలు చేసి శాస్త్రార్థాలు చెప్పరు. ప్రజలు నియమముతో పూలదండలూ, కుడుములూ, దక్షిణలూ తీసుకొని దేవతలను అర్చించడానికి దేవాలయాలకు పోరు. రాజకుమారులు చందనాగరు ఘుమఘుమలతో వసంతకాలపు పూలచెట్లవలె కనిపించరు.

"అరాజకము అయిన రాజ్యము వట్టిపోయిన నదివలెనూ, పచ్చిక మాడిపోయిన వనమువలెనూ, గోరక్షకులు లేని గోవులవలెనూ ఉంటుంది. రథానికి శోభను ఇచ్చేది టెక్కెము. అదేవిధముగా ప్రజలకు శోభ ఇచ్చేవాడు రాజు. అగ్నిహోత్రానికి ధూమము గుర్తు. రాజు అగ్నిహోత్రుడివంటివాడు. ఇప్పుడు రాజు స్వర్గతుడు అయినాడు. వెంటనే రాజును నిర్ణయించవలెను. అట్లా చేయకపోయే టట్లయితే అరాజకము అయిపోతుంది. ప్రజలు చేపలవలె ఒకరిని ఒకరు మింగివేస్తారు. శిక్షించేవాడు ఉండడు కనుక, ప్రజలు పరువు మర్యాదలను పాటించరు. జనులు నాస్తికులు అయిపోతారు.

"ఓ మహర్షీ! ఈ దేహానికి దారి చూపించేది కంటిచూపు. అదేవిధముగా దేశానికి మంచి ఏదో, చెడు ఏదో ఆలోచించి చూచేవాడు రాజు. సత్యధర్మాలు ప్రతిష్ఠించేవాడు రాజు. ప్రజలకు అందరికీ తల్లీ తండ్రివంటివాడు రాజు. అందరికీ అన్నివిధాలా మేలు చేస్తూ కాపాడేవాడు రాజు. అందువల్లనే దండించే యముడికన్నా, ధనము ఇచ్చే కుబేరుడికన్నా, సమస్తలోకాలనూ పరిపాలించే దేవేంద్రుడికన్నా, సదాచారాన్ని నిలిపే వరుణుడికన్నా ప్రత్యక్షముగా కనిపించే రాజునే ప్రజలు అందరూ ఎక్కువగా గౌరవిస్తారు, పూజిస్తారు. ఇది గుణము, ఇది దోషము అని నిర్ణయించేవాడు రాజు. రాజు లేకపోయేటట్లయితే దేశము అంతా చీకట్లు కమ్ముకొన్నట్లే అయిపోతుంది.

"ఓ బ్రహ్మర్షీ! సముద్రము ఎన్నడూ చెలియలికట్ట దాటి ఇవతలకు రారాదు. అదేవిధముగా మేము మీ మాటను ఎన్నడూ జవదాటరాదు. దశరథమహారాజు జీవించి ఉన్నప్పుడే కాదు, ఇప్పుడునూ మేము మీ ఆజ్ఞలను శిరసావహిస్తాము. ఇక వెంటనే రాజును ఏర్పరచకపోయేట్లయితే ఈ రాజ్యము అరణ్యప్రాయము అయిపోతుంది. అందువల్ల, తాము ఇప్పుడు వదాన్యుడు అయిన చిన్నవాణ్ణి, ఇక్ష్వాకు వంశీయుణ్ణి రాజుగా అభిషేకము చేయించవలెను.

68

ఈ విధముగా చెప్పిన బ్రాహ్మణులనూ, అమాత్యులనూ, మిత్రులనూ చూస్తూ వశిష్ఠమహర్షి, "మిత్రులారా! మనము ఈ విషయములో ఆలోచించవలసింది ఏమీ లేదు. దశరథమహారాజే ఈ రాజ్యానికి భరతుణ్ణి రాజుగా అంగీకరించినాడు. భరతుడు ఇప్పుడు అతడి మేనమామ ఇంట్లో శత్రుఘ్నుడితో కూడా సుఖముగా ఉన్నాడు. ఇప్పుడు ఇక్కడ నుంచి దూతలు గుర్రాలమీద వేగముగా రాజగృహపట్టణానికి పోయి ఆ వీరులను ఇద్దరినీ ఇక్కడికి తీసుకొనిరావలెను" అన్నాడు.

అందుకు అందరూ అంగీకరించినారు.

అంతట వశిష్ఠమహర్షి సిద్ధార్థుడూ, విజయుడూ, జయంతుడూ, అశోకుడూ, నందుడూ అనే రాజదూతలను రావించి వారితో, "ఓ దూతలారా! మీరు చేయవలసిన పని చెప్పుతాను, సావధానముగా వినవలెను. మీరు అమితవేగముతో పోయే గుర్రాలమీద ఇప్పుడే ప్రయాణము అయి రాజగృహపట్టణము పోవలెను. మీ ముఖాలలో ఏ కొంచెము దుఃఖమూ కనబడనీయకుండా అక్కడ మీరు భరతప్రభు దర్శనము చేయవలెను. మీరు ఇక్కడనుంచి అమూల్యాభరణాలనూ, పట్టుబట్టలనూ, కానుకలనూ తీసుకొనివెళ్ళి భరతుడిచేతి మీదుగా కేకయమహారాజుకూ, ఆయన కుమారుడికీ ఇప్పించవలెను. 'మీరు వెంటనే ఒక ముఖ్యమయిన పని చేయవలసి ఉన్నందువల్ల కులగురువు వశిష్ఠుడున్నూ, మంత్రులున్నూ మిమ్ములను వెంటనే వెంటపెట్టుకొని రమ్మన్నారు' అని భరతుడితో చెప్పవలెను. ఏ మాత్రమూ ఆలస్యము చేయనీయకుండా భరతుణ్ణి మీరు వెంటపెట్టుకొని రావలెను. ఇప్పుడు రఘువంశము వారికి వచ్చిన ఉపద్రవాన్ని మీరు ఎవరికీ, ఏ మాత్రమూ తెలియచేయకూడదు. రాముడు అరణ్యవాసము చేయడానికి పోయినాడు అని కానీ, దశరథమహారాజు స్వర్గతుడు అయినాడు అని కానీ ఎక్కడనూ, ఎవరితోనూ మీరు అనకూడదు. భరతుడు అడిగితే, 'అందరూ కుశలమేను' అని చెప్పవలెను. వశిష్ఠమహర్షి ఆజ్ఞాపించి నాడు అని చెప్పి, ఏమాత్రమూ జాగుచేయనీకుండా మీరు భరత శత్రుఘ్నులను శీఘ్రముగా తీసుకొని రావలెను" అని చెప్పి వారికి దారిబత్తెమూ, కేకయరాజుకు ఇవ్వవలసిన కానుకలూ, వాయువేగముతో పోయే గుర్రాలనూ ఇప్పించినాడు.

అప్పుడు ఆ దూతలు వారి వారి ఇండ్లకు పోయి ప్రయాణానికి అవసరము అయిన వస్తువులను అన్నిటినీ తీసుకొని అయోధ్యా నగరమునుంచి పడమటి దిక్కుగా ప్రయాణము చేసి అపరతాల పర్వత ప్రాంతానికి పోయినారు. ఆ అపరతాల పర్వతము దక్షిణోత్తరముగా ఉంది. దానికి పడమటవైపున దక్షిణోత్తరముగా ప్రలంబ పర్వత పంక్తులు ఉన్నవి. ఆ రెండు పర్వతాల మధ్యనూ మాలినీనది ప్రవహిస్తూ ఉంది. దూతలు ముందు అపరతాల పర్వతాల దక్షిణపు కొనకు పోయినారు. అక్కడ ఆ కొండను దాటి అవతల మాలినీనది తీరానపడి కొంతదూరము ఉత్తర దిక్కున పోయినారు. అక్కడనుంచి పడమటి దిక్కుగా పోయి హస్తినాపురము దగ్గర గంగను దాటినారు. అక్కడనుంచి బయలుదేరి కురుజాంగల దేశాల మధ్యగుండా ప్రయాణము చేసి పాంచాల దేశము పోయినారు. అక్కడనుంచి పడమటి దిక్కుగా పోతూ మార్గ మధ్యములో పెద్ద పెద్ద సరస్సులనూ, నిర్మలోదకాలతో ప్రవహిస్తూ ఉన్న నదులనూ చూస్తూ కార్యావసరమునుంచి ఎక్కడనూ ఆగకుండా పోయి రకరకాల

పక్షులు కుహూనాదాలు చేస్తూనూ, జనసమూహాలు స్నానాలు చేస్తూనూ ఉన్న శరదండానదిని దాటి, కోరిన కోర్కెలు ఇస్తుంది అని ప్రసిద్ధికి ఎక్కిన సత్యోపయాచనము అనే పుణ్యవృక్షము దగ్గరకు పోయినారు. ఆ పుణ్యవృక్షానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, అక్కడనుంచి బయలుదేరి కుళింగాపురము పోయినారు.

కుళింగాపురమునుంచి ఆ దూతలు అభికాలము అనే గ్రామానికి పోయి, బోధిభవనము అనే పర్వతములో పుట్టి ప్రవహించే ఇక్షుమతీ నదీతీరము చేరినారు. ఆ నదీతీరాన దశరథమహారాజు పూర్వీకులు అనుభవించిన గ్రామాలవైపుకు పోకుండా ఇక్షుమతీ నదిని దాటినారు. ఆ నదీతీరాన దోసెడు నీళ్లు మాత్రము త్రాగి జీవించే తాపసులనూ, వేదపారంగతులు అయిన బ్రాహ్మణోత్తములనూ చూచినారు. వారు అక్కడ ఆగకుండా ప్రయాణము అయి బాహ్లిక దేశానికిన్నీ, సుదామ పర్వతానికిన్నీ మధ్యను ఉన్న దారినపడి విష్ణుపాదాంకితము అనే పుణ్యభూమిని చూచి, అక్కడనుంచి పోయి విపాశానదిని దాటి ఆ తీరాన ఉన్న పెద్ద బూరుగుచెట్టును చూచినారు. అక్కడనుంచి ప్రయాణము అయి పోతూ దారిలో పెద్ద పెద్ద చెరువులనూ, సరస్సులనూ, నడబావులనూ చూస్తూ సింహశార్దూలాలూ, అడవి ఏనుగులూ మొదలు అయిన వన్య మృగాలు యధేష్టముగా సంచారము చేసే మహారణ్యములోనుంచి ప్రయాణము అయినారు. దూరభారము అనీ వారు లెక్కచేయలేదు. రాజకార్యధురంధరులు అయి ప్రయాణము సాగించినారు.

గుర్రాలు అలసిపోయినప్పటికిన్నీ, చీకటి పడిపోయినప్పటికిన్నీ భరతుణ్ణి వెంటనే తీసుకొనిపోయి అయోధ్యానగరములో దశరథమహారాజు ఔర్ధ్వ దైహిక క్రియలు చేయించవలెను అనీ, కీర్తికాయుడు అయిన మహారాజు ప్రతిష్ఠ కాపాడవలెను అనీ, ఆయన ఇంట్లోవారిని అందరినీ సంతోషపెట్టవలెను అనీ ఆ దూతలు ప్రయాణము చేసి రాత్రిపూట గిరివ్రజపురము చేరినారు.

69

భరతుని స్వప్నము

అయోధ్యానగర రాజదూతలు గిరివ్రజపురము చేరిననాడు రాత్రి తెల్లవారుతూ ఉండగా భరతుడికి పీడకల వచ్చింది. ఆ స్వప్నము వెంటనే ఫలితానికి వస్తుంది అని తోచి అతడు భయపడి పోయినాడు. తపించి పోయినాడు. తెల్లవారినప్పటికీ అతని దిగులు వదలలేదు.

సూర్యోదయము అయిన తరువాత ఎప్పటి మిత్రులు అందరూ అతని చుట్టూ చేరినారు. అతడు ఏదో విపరీతము అయిన దిగులుతో ఉన్నాడు అని వారు

అందరూ కనిపెట్టినారు. అతని దిగులు పోగొట్టి సంతోషపెట్టవలెను అని ఆ మిత్రులు అందరూ నిశ్చయించుకొన్నారు. అంతట అతనికి ఏవేవో కథలు చెప్పడము మొదలు పెట్టినారు. కాని, ప్రయోజనము లేకపోయింది. వారిలో కొందరు వీణాగానము చేసినారు. మరికొందరు నాటకాదులు చదివి వినిపించినారు. ఇంకా కొందరు వేశ్యలను ఆడించినారు. ఎవడు ఏమి చేసినా ప్రయోజనము లేకపోయింది. అందరూ కలిసి హాస్య ప్రసంగము చేసినారు. లాభము లేకపోయింది. ఆతడు నవ్వలేకపోయినాడు. అతడి ముఖవైఖరి అయినా మారలేదు.

అంతట భరతుడి అంతరంగిక మిత్రుడు ఒకడు, "ప్రభూ! నిన్ను సంతోష పెట్టవలెను అని ఇంతమంది మిత్రులూ ఎంతో ప్రయత్నము చేసినారు. లాభము లేకపోయింది. మీరు ఎందుకు ఇంత దిగులుతో ఉన్నారు?" అని అడిగినాడు.

"మిత్రుడా! నేను ఎందుకు ఇట్లా ఉన్నదీ చెప్పుతాను. నాకు రాత్రి ఒక పీడకల వచ్చింది. మా నాయనగారు మలినదేహముతో తల విరపోసుకొని, కొండలమీద నుంచి కంపుకొట్టుతూ ఉన్న ఒక పేడగుంటలో పడిపోయినారు. ఆ పేడగుంటలోనే తేలుతూ, దోసిటతో నూనె త్రాగుతూ పదే పదే నవ్వుతూ ఉన్నారు. కొంచెముసేపటికి నువ్వుల అన్నము తింటూ, ఒంటినిండా నూనె పూసుకొని నూనెలో మాటిమాటికీ మునుగుతూ ఉన్నారు.

"ఆ కలలోనే సముద్రము ఎండిపోతున్నట్టు కనిపించింది. చంద్రుడు హఠాత్తుగా నేలకూలినాడు. జగత్తు అంతా చిమ్మచీకట్ల మరుగున పడిపోయింది. పట్టపుటేనుగు దంతాలు ముక్కలు ముక్కలుగా అయిపోయినవి. భగభగ మండుతూ ఉన్న అగ్ని హోత్రము అకస్మాత్తుగా ఆరిపోయింది. రకరకాల చెట్లూ ఎండిపోయినవి. భూమి బ్రద్దలు అయిపోయింది. కొండలు పగిలి పొగలు రాజుకొంటూ ఉన్నవి.

"మా తండ్రి దశరథమహారాజు నల్లగుడ్డ కట్టుకొని ఒక ఇనుపపీటమీద కూర్చున్నారు. నల్లటి స్త్రీలూ, తెనెరంగు స్త్రీలూ ఆయనను చూచి నవ్వుతున్నారు. ఒంటి నిండా నల్లటిరంగు పూసుకొని, మెడలో ఎర్రటి పూలదండలు వేసుకొని, గాడిదలు కట్టిన రథము ఎక్కి దక్షిణ దిక్కుగా పోతున్నారు. ఎర్రటి చీర కట్టుకొన్న ఒక రాక్షసాంగన వికృతాననముతో వికవిక నవ్వుతూ ఆయనను రథముమీదనుంచి కిందికి పడలాగింది.

"మిత్రుడా! ఇంత భయంకరము అయిన కల వచ్చింది. ఇక నాకో, రాముడికో, లక్ష్మణుడికో, కాకపోతే మా నాయనగారికో చావు రాక తప్పదు. గాడిదలు కట్టిన రథము ఎక్కిపోయినట్టు కల కాంచినవాడు అచిరకాలములో చచ్చిపోతాడు, తప్పదు. అందువల్ల, ఇంత దిగులు పడుతున్నాను. ఇప్పుడు నా మనస్సు

స్వస్థముగా లేదు. నా గొంతు ఆరిపోతున్నది. అందువల్ల, మీ అందరితో ఖులాసాగా మాట్లాడలేకుండా ఉన్నాను. నేను ఎన్నడూ, దేనికీ భయపడి ఎరుగను. ఇప్పుడు నిష్కారణముగా నాకు భయము వేస్తూ ఉంది. ఎందుకో నన్ను నేనే నిందించుకొంటున్నాను. కారణము ఏమిటో తెలియడము లేదు.

"ఓ మిత్రుడా! ఇదివరకు నాకు ఎన్నడూ ఒక్క కల రాలేదు. రాత్రి రకరకాలుగా పీడకల వచ్చింది. ఎంతో దూరాన ఉన్న మా తండ్రి దశరథమహారాజును తలచుకొన్న కొద్దీ నాకు భయము వేస్తూ ఉంది" అంటూ గద్గదస్వరముతో భరతుడు చెప్పినాడు.

70

అయోధ్యకు భరతుని ప్రయాణము

భరతుడు తనకు వచ్చిన దుస్స్వప్నాన్ని గురించి ఈవిధముగా స్నేహితులతో చెప్పుతూ వుండగా, అయోధ్యానగరము నుంచి వచ్చిన రాజదూతలు రాజభవనములోకి పోయినారు. యుధాజిత్తును సందర్శించి, కేకయమహారాజుకు సాష్టాంగ నమస్కారము చేసి తాము భరతుణ్ణి తీసుకొని పోవడానికి వచ్చినట్టు చెప్పినారు. యుధాజిత్తూ కేకయ మహారాజూ వారిని చక్కగా సమ్మానించి భరతుడి దగ్గరకు పంపించినారు.

అంతట ఆ దూతలు భరతుడి దర్శనము చేసి, "రాజకుమారా! తమ కులగురువులు వశిష్ఠమహర్షీ మంత్రులూ తమ క్షేమము తెలుసుకోవలసింది అని మమ్ములను ఇక్కడికి పంపించినారు. తాము వెంటనే అయోధ్యానగరములో ఒక ముఖ్యము అయిన వ్యవహారము నెరవేర్చవలసిఉంది అనీ, ఏ మాత్రమూ ఆలస్యము లేకుండా తమను వెంటపెట్టుకొని రావలసింది అనీ వశిష్ఠమహర్షీ మంత్రులూ మమ్ములను ఆజ్ఞాపించినారు. అందుకే మేము ఇక్కడికి వచ్చినాము. మీరు వెంటనే ప్రయాణము కావలెను.

"ఓ భరతప్రభూ! మీ తాతగారికిన్నీ, మీ మేనమామగారికిన్నీ కానుకలుగా ఇవిగో, మహాశ్రేష్ఠము అయిన పట్టుబట్టలూ, ఆభరణాలూ పంపించినారు. వీటిలో ఇరవైకోట్ల విలువచేసే వస్త్రాభరణాలను మీ తాతగారికిన్నీ, మీ మేనమామగారికిన్నీ మీ చేతిమీదుగా ఇప్పించమని కూడా మాతో చెప్పినారు" అని అన్నారు.

భరతుడు కానుకలను మాతామహుడికి, మాతలుడికీ పంపించినాడు. దూతలను సమ్మానించి, "దూతలారా! మా నాయనగారు కుశలముగా ఉన్నారా? మా అన్న రాముడు, మా తమ్ముడు మహాబలవంతుడు లక్ష్మణుడూ సుఖముగా ఉన్నారా? ధర్మజ్ఞ, ధర్మనిరత, ధర్మదర్శిని మా పెత్తల్లి కౌసల్యాదేవి క్షేమముగా

ఉందా? ధర్మశీల, లక్ష్మణ శత్రుఘ్నులను కన్న మా రెండో అమ్మ సుమిత్రాదేవి సుఖముగా ఉందా? మహాభయంకరురాలు, స్వప్రయోజనపర, కోపదారి, అంతా తనకే తెలుసును అనుకొనే మా అమ్మ హాయిగా ఉందా? ఆమె నాతో ఏమి అయినా చెప్పమన్నదా" అని ప్రశ్నించినాడు.

ఆ దూతలు సవినయముగా, "ప్రభూ! తాము అడిగినవారు అందరూ కుశలమే. తమను లక్ష్మి వరిస్తుంది. తమ రథము సిద్ధము చేయించవలెను. తాము వెంటనే బయలుదేరవలెను. ఈనాడే ప్రయాణము అయిపోదాము" అంటూ ప్రయాణానికి తొందర చేసినారు.

"ఓ దూతలారా! మీరు నన్ను అయోధ్యానగరానికి తీసుకొని పోవడానికి వచ్చినారు అని నేను మా తాతగారికి చెప్పి, వారి సెలవు తీసుకొని ఈనాడే ప్రయాణము అవుతాను" అని చెప్పి భరతుడు కేకయ మహారాజు దగ్గరకుపోయి, "రాజా! నా కోసము ప్రత్యేకముగా అయోధ్యనుంచి దూతలు వచ్చినారు. మా నాయనగారిని పోయి చూడవలెను. మా అమ్మ ఎట్లా ఉందో చూడవలెను. మీరు ఎప్పుడు తలచుకొంటే అప్పుడు నేను మీ దగ్గరకు వస్తాను" అన్నాడు,

కేకయమహారాజు భరతుణ్ణి గట్టిగా కౌగిలించుకొని శిరము ఆఘ్రాణించి ఆశీర్వదించి, "ఓ పరంతపా! నీవు పోయి మీ నాయనగారిని చూచి రా. మా కైక నీ అంతటి సుపుత్రుణ్ణి కన్నది. నాకు అదే సంతోషము. నీవు సంతోషముగా పోయి రా. మీ నాయనగారితోనూ, మీ అమ్మతోనూ, తక్కిన పెత్తల్లులతోనూ మేము ఇక్కడ క్షేమముగా ఉన్నాము అని చెప్పు. రామలక్ష్మణులను అడిగినాము అని చెప్పు. రాజ పురోహితులు వశిష్ఠులవారికి మా నమస్కారములు చెప్పు. తక్కిన బ్రాహ్మణోత్తము లను మేము చాలా అడిగినాము అని చెప్పు" అంటూ అత్యంతాదరముతో రెండువేల బంగారు కంరహారాలనూ, పదహారువందల ఉత్తమజాతి గుర్రాలనూ, మదపు టేనుగులనూ, రంగు రంగుల కంబళ్ళనూ, మంచి మంచి పులితోళ్ళనూ, ఎంతో ధనాన్నీ బహుమానముగా ఇప్పించినాడు.

ధైర్యవంతులూ, సద్గుణవంతులూ, ప్రాణాలు లెక్కచేయని స్వామి భక్తిపరాయణులూ అయిన వీరులను రావించి, భరతుడితో అయోధ్యానగరము వరకూ తోడు పొమ్మని కేకయమహారాజు ఆజ్ఞాపించినాడు.

యుధాజిత్తు మేనల్లుడికి చూడ చక్కని ఐరావతజాతి ఏనుగులనూ, ఐంద్రశిర జాతి ఏనుగులనూ, పెద్ద పెద్ద బరువులు ఎంతో వేగముతో మోసుకొనిపోయే కంచర గాడిదలనూ, ఆ అంతఃపురములోనే పుట్టి పెరిగి పెద్దవి అయి, బలములోనూ,

పరాక్రమములోనూ, ఆకారములోనూ పెద్ద పెద్ద పులులవంటివి అయిన కుక్కలనూ బహుమానముగా ఇచ్చినాడు. మాతామహుడూ, మాతలుడూ ఎంతో సంతోషముగా ఇన్నిటిని ఇచ్చి బహూకరించినా, భరతుడి ముఖములో సంతోషచ్ఛాయలు అయినా వెలువడలేదు. పీడకల వచ్చి దిగులు పడుతున్న సమయములో రాజదూతలు వచ్చి ప్రయాణము కమ్మని తొందర చేసినందువల్ల, ఆతని మనస్సు అంతా అయోధ్యమీదనే లగ్నము అయింది.

భరతుడు తన భవనములోనుంచి గుర్రాలతోనూ, ఏనుగులతోనూ, భృత్యులతోనూ బయలుదేరి రాజవీధిగుండా వెళ్ళి కేకయమహారాజు అంతఃపురములోకి పోయినాడు. అక్కడ భరత శత్రుఘ్నులు కేకయమహారాజుకూ, యుధాజిత్తుకూ వీడ్కోలు చెప్పినారు. అంతట ఆ అన్నదమ్ములు ఇద్దరూ రథముమీద అయోధ్యా నగరానికి ప్రయాణము అయినారు.

ఆ రథము వెంట గుర్రాలు కట్టిన రథాలూ, ఒంటెలు కట్టిన రథాలూ, ఎద్దులు కట్టిన బండ్లూ, కంచరగాడిదలు కట్టిన బండ్లూ, ఏనుగులూ మొదలు అయినవి వందలకొద్దీ నడిచినవి. ఆ విధముగా వందలకొద్దీ రథాలతోనూ, బండ్లతోనూ, ఏనుగులతోనూ, కుక్కలతోనూ, దారి కాపుదలకు కేకయమహారాజు పంపించిన సైన్యముతోనూ భరతుడు ప్రయాణము అయిపోతూ ఉంటే దేవసేనలను వెంట పెట్టుకొని దేవలోకమునుంచి ప్రయాణము అయిపోయే సిద్ధుడివలె కనిపించినాడు.

71

ఆ శ్రీమంతుడు, ఆ ద్యుతిమంతుడు, ఆ ఇక్ష్వాకు కులదీపకుడు భరతుడు పరివారముతో రాజగృహ పట్టణమునుంచి తూర్పు దిక్కుగా పోయి సుదామా నదిని దాటినాడు. అక్కడనుంచి అదే దిక్కున ముందుకు సాగిపోయి విశాలము అయిన హ్లాదినీ నదిని దాటి ఏలాదాన గ్రామము చేరినాడు. అక్కడ పశ్చిమాభిముఖంగా అలలతో ప్రవహిస్తూ ఉన్న శతద్రూ నదిని దాటి అపరపర్వట దేశము పోయి శిలలను ఆకర్షించే శిలావహా నదిని దాటి అక్కడనుంచి ఆగ్నేయ దిక్కుగా పోయి శల్యకర్తన గ్రామము చేరి అక్కడనుంచి చైత్రరథము అనే వనముగుండా పోతూ పెద్దపెద్ద కొండలను చూస్తూ, సింధు సరస్వతీ నదులు సంగమించే ప్రదేశానికి పోయి ఆ నదిని దాటి వీరమత్స్య దేశాలకు ఉత్తరాన ఉన్న భారుండవనములోకి పోయినాడు.

"ఆ భారుండ వనములో పర్వతాల మధ్య నేత్రపర్వముగా అమితవేగముగా పరుగులు ఎత్తి ఎటు పోవడానికీ దారి దొరకక యమునా నదిలో పడ్డ కుళింగా నదిని చూచుకొంటూ యమునా కుళింగా సంగమ ప్రదేశానికి పోయినాడు.

ప్రయాణపు బడలిక తీర్చుకోవడానికి భరతుడు పరివారముతో అక్కడ కొంతసేపు ఆగిపోయినాడు. అలసిపోయిన గుర్రాలు, ఏనుగులు మొదలు అయిన జంతువులను ఆ యమునా నదీజలాలలో కడిగి, నీళ్ళు పెట్టి మేత వేసినారు. భరతుడు పరివారముతో కూడా ఆ పుణ్యనదిలో స్నానము చేసినాడు. అందరూ ఆ పావనోదకాలను పానము చేసినారు. ఆ నదీతీరాన కొంచెముసేపు విశ్రమించినారు. ఇకను ఆ ముందు దారిలో నీళ్ళు దొరకవు కనుక, ఆ యమున పవిత్రోదకాలను పట్టుకొని ఆ నది దాటి అవతలి గట్టుకు పోయినారు.

అంతట ఆ మంగళాకారుడు భరతుడు రథము వదిలిపెట్టి వాయు వేగముతో నడచే భద్రజాతి ఏనుగును ఎక్కినాడు. జనసంచారములేని మహారణ్యములో ఆకాశములో వాయువువలె సాగిపోయి అంశుధానము అనే గ్రామము చేరినాడు. అక్కడ గంగానదిని దాట అశక్యము అయినందువల్ల ప్రాగ్వట్ట పట్టణము పోయి అక్కడ గంగానదిని దాటినాడు. అక్కడనుంచి కుటికోష్ఠికా నదిని దాటి ధర్మవర్ధనము అనే గ్రామము పోయి అక్కడనుంచి దక్షిణ దిక్కుగా ప్రయాణము చేసి జంబూప్రస్థము అనే గ్రామము మీదుగా వరూథము అనే గ్రామానికి పోయినాడు.

వరూధ గ్రామములో ఉన్న మనోహరము అయిన ఉద్యానవనములో కొంచెము సేపు విశ్రమించినాడు. అక్కడనుంచి బయలుదేరి ఉజ్జిహాన గ్రామము చేరి ఆ గ్రామ సమీపములో మద్దిచెట్లూ, కడిమి చెట్లూ ఉన్న తోపులో దిగినాడు. అక్కడనుంచి స్వదేశము అయినందువల్లనూ, అక్కడనుంచి దారి భయము లేనందువల్లనూ, పరివారము వారు అందరూ బాగా అలసిపోయి ఉన్నందువల్లనూ సేనలను వెంటపెట్టుకొని మెల్లగా రావలసింది అని శత్రుఘ్నుడితో చెప్పి, భరతుడు ఒక్కడూ పర్వత ప్రదేశాలలో వాయు వేగముతో పోయే గుర్రాలు పూంచిన రథము ఎక్కి ముందుగా సాగిపోయినాడు.

అంతట భరతుడు సర్వతీర్థ గ్రామము దగ్గర ఉత్తానికా నదినీ, ఆ తరువాత చిన్న చిన్న ఏళ్ళను ఇట్టే దాటి, హస్తిపృష్ఠకము అనే గ్రామము దగ్గర కుటికా నదినీ, లౌహిత్య గ్రామము దగ్గర సికతావతీ నదినీ, ఏకపాల గ్రామము దగ్గర స్థాణుమతీ నదినీ, వినతా గ్రామము దగ్గర గోమతీ నదినీ దాటి కళింగనగరము చేరి అక్కడ మద్ది తోపులో కొంచెముసేపు విశ్రమించి ఆ రాత్రే అయోధ్యానగరానికి ప్రయాణము అయినాడు.

అరుణోదయము అవుతూ ఉంది. దూరముగా అయోధ్యానగరము ఆగుపించింది. పెద్దపులి వంటి ఆ భరతుడు రాజగృహ పట్టణమునుంచి బయలుదేరి అప్పటికి ఏడు అహోరాత్రములు అయిపోయినవి. అది ఎనిమిదవనాడు ఉదయము.

భరతుని అయోధ్యానగర ప్రవేశము

"ఓ సారధీ! చూడు. అదిగో దూరముగా కనపడుతున్నదే మా అయోధ్యా నగరము. అవిగో పుణ్యోద్యానవనాలు. అవిగో వెలిపాలాలు. మా అయోధ్యానగరము ఈ జగత్తుకు అంతటికీ గొప్ప పట్టణము అని ప్రసిద్ధికి ఎక్కింది. మా పూర్వీకుడు వైవస్వత మనువు ఈ పట్టణాన్ని కట్టించినాడు. వేదపారంగతులూ, సకల సద్గుణ సంపన్నులూ, సర్వ సమృద్ధులూ, యజ్ఞకర్తలూ అయిన బ్రాహ్మణోత్తములు మా పట్టణములో నివసిస్తున్నారు. మా తండ్రి దశరధమహారాజు రాజర్షి. ఆయనేకాదు, మా పూర్వీకులు అందరూ రాజర్షులే. వారు అందరూ అయోధ్యనే రాజధానిగా చేసుకొని రాజ్యము ఏలినారు.

"ఓ సారధీ! ఇప్పుడు మా పట్టణాన్ని చూస్తూ ఉంటే ఎందుకో సంతోషము వేయడము లేదు. పట్టణము సమీపిస్తూ ఉన్నా ఇప్పుడు ఎందువల్లనో స్త్రీ పురుషుల కలకల ధ్వనులు వినిపించడము లేదు. ఇది ఏమిటి, ఉద్యానవనాలు బావురు మంటున్నవి? కాముకులు రాత్రిపూట నగరము వెలుపలి ఈ ఉద్యావనానాలకు వచ్చి యధేష్టము క్రీడించి, తెల్లవారుతూ ఉండగా లేచి త్వరత్వరగా తమ తమ ఇండ్లకు పోతూ ఉండేవారు. ఇప్పుడు అట్లా కనిపించడము లేదు. అటువంటి కాముకులు రానందువల్లనో ఏమో, ఈ ఉద్యానవనాలు అన్నీ ఏడుస్తున్నట్లు ఉన్నవి. ఇదివరకటివలె ఈ ప్రాతఃకాలాన రథాలమీదనూ, గుర్రాలమీదనూ, ఏనుగులమీదనూ, ఇంకా ఇతర వాహనాలమీదనూ వాహ్యాళికి పోయే పురప్రముఖులు కానీ, పట్టణములోకి పోయే ఇతరులు కానీ కనిపించడము లేదు. ఓ సారధీ! ఈ ఉద్యానవనాలలో చెట్లు అన్నీ చిగిర్చి, పూలు విరగపూసి, సురత క్రీడలకు వచ్చేవారిని అందరినీ చూచి సంతోషిస్తున్నట్టుగా కనిపించేవి. ఇప్పుడు ఈ ఉద్యానవనాలలోనూ, బాటలకు ఇరు ప్రక్కలనూ ఉన్న చెట్లు అన్నీ ఆకులు రాలి ఎండిపోయి ఏడుస్తున్నట్టు కనిపిస్తున్నవి.

"సారధీ! సూర్యోదయము అవుతూ ఉంది. మంచి మంచి పండ్లు తింటూ పూతేనెలు గ్రోలుతూ మత్తెక్కి కోకిలలు కుహూనాదాలు చేయడము కానీ, చిలుకలు కలకల ధ్వనులు చేయడము కానీ, తుమ్మెదలు ఝుంకారము చేయడము కానీ లేదు. ఆ యా జంతువుల అరుపులు అయినా వినిపించడము లేదు. ఓ సూతుడా! మనము అయోధ్య సమీపించినాము. పట్టణములోనుంచి చందనాగరుధూపవాసనలు వీచడము లేదు. ఇదివరకు ఈ సమయాన ప్రతినిత్యము భేరి మృదంగ వీణాది వాద్యాల గంభీరధ్వనులు వినిపించేవి. ఆ ధ్వనులు ఏవీ ఇప్పుడు వినిపించడము లేదు. అనిష్ట సూచకాలూ, చూచీ చూడడముతో దుఃఖము వచ్చే దుర్నిమిత్తాలూ

అంతటా కనిపిస్తున్నవి. సారధీ! నా మనస్సు తిన్నగా లేదు. మా వాండ్లు అందరూ కుశలముగా ఉన్నారు అని తోచడము లేదు. అందువల్లనో మరి ఎందువల్లనో కాని, కారణము తెలియకుండానే నా మనస్సులో దిగులు దిగులుగా ఉంది" అంటూ భరతుడు విషణ్ణుడు అయిపోయినాడు. అతని హృదయము కదిలిపోయింది. భయము వేసింది. దేహము అంతా కంపించిపోయింది.

అలసిపోయిన గుర్రాలు ఈ రథాన్ని ఎట్లాగో వైజయంతము అనే ద్వారములో నుంచి అయోధ్యానగరములోకి లాగుకొని పోయినవి. ఆ రథాన్ని చూచి ద్వారపాలకులు ఉలిక్కిపడి లేచి, "జయీభవ-విజయీభవ" అని ఆశీర్వదించినారు. ఎంతో మనోవ్యాకులములో ఉన్నా, భరతుడు ఆ ద్వారపాలకులను పరామర్శ చేసి ముందుకు సాగిపోతూ రథము తోలుతూ అలసిపోయి ఉన్న సారథితో, "ఓ సూతుడా! రాజదూతలు నాకు కారణము ఏమీ చెప్పకుండానే ప్రయాణము అయి వచ్చినాను. ఇప్పుడు ఇక్కడ ఏదో అమంగళము అయినట్టుగా ఉంది. నా ధైర్యము చెడుతున్నది. రాజవినాశకాల చిహ్నాలు అని చెప్పేవి అన్నీ, ఇప్పుడు ఇక్కడ కనబడుతున్నవి. ఇండ్ల ముందు చిమ్మి ముగ్గులు పెట్టలేదు. ఏ ఇంటి తలుపులూ తెరచిలేవు. గృహస్థులు పూజాదులు చేస్తున్నట్టే లేదు. ఏ ఇంటిలోనుంచీ సుగంధధూపవాసనలు గుబాళించడము లేదు. ఈ ఇండ్లలో వంట అయినా చేసుకున్నట్టు కనిపించడము లేదు. జనుల ముఖాలలో కళాకాంతులు ఎక్కడనూ కనిపించడము లేదు. ముంగిళ్ళు అలుకుకోలేదు. దేవతార్చనలు చేస్తున్నట్టేలేదు. దేవాలయ ద్వారాలకు పూలదండలు వేళ్ళాడడము లేదు. యజ్ఞ గోష్ఠులు జరుగుతున్నట్టే లేదు. పూల అంగళ్ళలో పూలుకానీ, పూలదండలు కానీ కనిపించడములేదు. వర్తకులు అందరూ చింతా వ్యాకులిత హృదయులుగా కనపడుతున్నారు. ఇదివరకటివలె ఈ వర్తకులు క్రయవిక్రయాలు చేస్తూన్నట్టు కనిపించడములేదు. దేవాలయాలమీదనూ, చైత్యాలమీదనూ రకరకాల పక్షులు బిక్కు బిక్కుమంటూ కూర్చుని ఉన్నవి. స్త్రీ పురుషులు అందరూ ఎందుకో కన్నీళ్ళు కారుస్తూ దుఃఖపడుతున్నారు. అందరూ ఎందుకో తహతహలాడుతూ ఉన్నారు. అందరూ అశుచిగా కనపడుతున్నారు" అంటూ ఉండగా, భరతుడి రథము దశరథమహారాజు భవనము సమీపించినది.

భరతుడు మెల్లగా రథము దిగినాడు. ఎప్పుడూ దేవేంద్రుడి అమరావతి పట్టణమువలె కళకళలాడుతూ ఉండే అయోధ్యా నగరములో శూన్యముగా ఉన్న శృంగాటకాలూ, పాడుపడ్డట్టు ఉన్న గృహాలూ, రాజవీథులూ, దుమ్ముకొట్టుకొని ఎర్రపడిపోయిన కవాటద్వారబంధాలు, నడుస్తూ ఉంటే తలపుకు వచ్చి, పరమ దుఃఖముతో తలవంచుకొని అతడు పితృగృహము వైపు నడచినాడు.

72

భరతుడికి పితృ మందిరములో దశరథమహారాజు కనిపించలేదు. అంతట అతడు తన తల్లి ఇంటివైపు నడచినాడు. ఆ ఇల్లు కళాకాంతులు లేకుండావుంది. చూస్తూ లోపలికి పోయినాడు. బహుదూరము ప్రయాణముచేసి డస్సి పోయి లోపలికి వస్తూ ఉన్న కుమారుణ్ణి కైకేయీదేవి చూచింది. పరమసంతోషముతో కనకాసనముమీదనుంచి లేచింది. భరతుడు ఆమె పాదాలకు నమస్కారము చేసినాడు. ఆమె అతనిని లేవనెత్తి గట్టిగా కౌగలించుకొని, శిరము ఆఘ్రాణించి ఒడిలో కూర్చుండపెట్టుకొని, "నాయనా! నీవు తాతగారిఇంటినుంచి బయలుదేరి ఎన్ని నాళ్ళు అయింది? అమితవేగముతో రథముమీద ప్రయాణము చేసినావు కాబోలు, చాలా అలసిపోయినట్టు ఉన్నావు. పూజ్యులు మా నాయనగారు కుశలముగా ఉన్నారా? మా అన్న యుధాజిత్తు క్షేమముగా ఉన్నాడా? ఇన్నాళ్ళూ నీవు ఆ దేశములో హాయిగా ఉన్నావా" అని అడిగింది.

అందరూ కుశలము అని చెప్పి ఆ రాజీవాక్షుడు, "అమ్మా! నేను తాతగారి ఇంటినుంచి బయలుదేరి నేటికి ఏడు అహోరాత్రములు అయిపోయినవి. ఆ పరంతపుడు మీ నాయనగారు కేకయమహారాజూ, మీ అన్న యుధాజిత్తూ నాకు బహుమానంగా ఇచ్చిన ధనాన్ని, రత్నాలను మోసుకొని వస్తున్న గుర్రాలూ, ఏనుగులూ దారిలో అలసిపోయినవి. నాకు తోడుగా పంపించిన సైనికులున్నూ డస్సిపోయినారు. అందువల్ల, వారిని వెంటబెట్టుకొని మార్గాయాసము లేకుండా మెల్లగా రమ్మని శత్రుఘ్నుడికి ఒప్పచెప్పినాను. ఇక్కడనుంచి వచ్చిన దూతలు నన్ను నిలవనీయకుండా తొందర చేసినందువల్ల, నేను రథముమీద ముందుగా వచ్చినాను. ఇప్పుడు ముందు నేను అడిగేది చెప్పవలెను. నీవు పడుకొనే ఈ బంగారము మంచము ఎందుకు ఇట్లా శూన్యముగా ఉంది? నాయనగారి సంబంధీకులు ఎవరూ రాజభవనములో సంతోషముగా కనిపించలేదు. నాయనగారు ఇక్కడ ఉంటారు అనుకొని నేను ఇక్కడికి వచ్చినాను. ఇప్పుడు వారు ఎక్కడ ఉన్నారు? పెత్తల్లి కౌసల్యాదేవి ఇంట్లో ఉన్నారా? నేను రాగానే ముందు వారి పాదాలకు నమస్కారము చేయవలెను కదా, వారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు" అని అడిగినాడు.

రాజ్యలోభమువల్ల కైకేయీదేవి ఎన్నడో మైమరచిపోయింది. ఘోరము అయిన అప్రియము ప్రియము అనుకొని ఏమీ ఎరుగని కుమారుడితో, "ఎన్నో యజ్ఞాలు చేసిన మహాత్ముడు అయినప్పటికిన్నీ, ఎంతోమంది సత్పురుషులను పోషించిన మహానుభావుడు అయినప్పటికిన్నీ, మహాతేజస్వి అయినప్పటికిన్నీ, మీ

నాయనగారికి సమస్త ప్రాణికోటికివలె కాలము తీరిపోయింది. స్వర్గతులు అయినారు'' అన్నది.

"అయ్యో! అయ్యో!'' అంటూ చేతులు విదిలిస్తూ భరతుడు నేలకూలినాడు. దుఃఖము పొంగి పొర్లింది. ఎలుగెత్తి ఏడుస్తూ, "శరత్కాల స్వచ్ఛాకాశములో పూర్ణచంద్రుడివలె ఈ శయ్యమీద తేజరిల్లే మా నాయనగారు పోయినారా? ఈ శయ్య మేఘావృత అమావాస్య నిశివలె ఉంది'' అంటూ, ఏడుపు ఎక్కువ అయి ముఖముమీద గుడ్డ కప్పుకొని, వెక్కి వెక్కి ఏడుస్తూ మత్తమాతంగమువంటి ఆ బలవంతుడు, దేవతలవంటి ఆ ధీమంతుడు, సూర్యచంద్రులవంటి ఆ తేజోవంతుడు గొడ్డళ్ళతో నరికిన మద్దిమానువలె నేలకూలి, పితృమరణ చింతాకులితచేతనుడు అయి ఆ నేలమీద దొర్లుతే ఉంటే కైకేయీదేవి లేవనెత్తుతూ, 'నాయనా! లే. నేలమీదపడి దొర్లవద్దు. ఏడవవద్దు. నీవు మహాయశస్వివి. సభాపూజ్యుడవు. సమస్తమూ తెలిసినవాడవు. వేదవాక్యాలను అనుసరించి దాన యజ్ఞాదులు చేసే బుద్ధిసంపన్నుడవు. మందర పర్వతముమీద సూర్యుడివలె సత్త్వభావముతో తేజరిల్లే నీవు ఇట్లా ఏడవడము ఏమీ బాగాలేదు. ఏడ్చినందువల్ల పోయినవారు తిరిగి రారు. నాయనా. లే'' అని చెప్పినా అతడు లేవకుండా నేలమీద పొర్లాడుతూ ఏడుస్తూ, "అమ్మా! నాయనగారు రాముడికి రాజ్యాభిషేకము అయినా తలపెట్టి ఉంటారు లేదా ఏది అయినా యజ్ఞము అయినా ఆరంభించి ఉంటారు అనుకొని, నేను ఎంతో సంతోషముతో ఇట్లా పరుగెత్తుకొని వచ్చినాను. ఇక్కడ ఇంకొక విధముగా అయిపోయింది.

"అమ్మా! నేను వచ్చే లోపలనే నాయనగారు పోయినారే! వారికి ఏమి జబ్బు చేసింది? ఇంతకూ వారికి చేతులారా దహనసంస్కారాదులు చేసిన రామలక్ష్మణులు పుణ్యాత్ములు. నాకు ఆ పుణ్యము అయినా దక్కలేదు. అమ్మా! ఆ కీర్తిమంతుడు ఉండగా నేను వచ్చి ఉన్నట్లయితే, నన్ను వారు దగ్గరకు తీసుకొని గట్టిగా కౌగలించుకొని నా శిరము ఆఘ్రాణించి, వారి మృదుహస్తాలతో నా ఒంటినిండా కొట్టుకొని ఉన్న దుమ్మును అంతా దులిపేవారు. ఇక నాకు ఈ జన్మకు ఆ మహానుభావుడి సుఖస్పర్శ లేదు.

"అమ్మా! ఇకను అన్న అయినా, తండ్రి అయినా, బంధువు అయినా రాముడే. ఇకను అందరి దుఃఖాలను పోగొట్టేవాడు అతడు ఒక్కడే. నేను ఆ రాముడికి కింకరుణ్ణి. ఇప్పుడు నేను వచ్చినట్టు అతడికి తెలిసి ఉండదు. నేను అతనికి పాదాభివందనము చేయవలెను. ధార్మికుడు అయినవాడికి తండ్రి తరువాత జ్యేష్ఠభ్రాతే తండ్రి. అతడే ఇక నాకు దిక్కు.

"అమ్మా! ఆ ధర్మవేత్త, ఆ ధర్మనిత్యుడు, ఆ దృఢవ్రతుడు, ఆ సత్యసంధుడు, ఆ మహారాజు మా నాయనగారు ఆశ్వాసాంత సమయాన నాకు ఏమి అయినా చెప్పినారా? వారి కడపటి సందేశము ఏమిటి? వివరముగా చెప్పవలెను " అన్నాడు.

కైకేయీదేవి జరిగింది జరిగినట్లుగా చెప్ప తలచి, "నాయనా! ఆ మతిమంతుడు, ఆ మహాత్ముడు మీ నాయనగారు 'అయ్యో రామా' అంటూ, 'అయ్యో సీతా' అంటూ, 'అయ్యో లక్ష్మణా' అంటూ ఏడుస్తూ, 'సీతారామలక్ష్మణులు తిరిగి వచ్చిన తరువాత వాండ్లను ఏ పుణ్యాత్ములో చూస్తారు. నాకు ఆ పుణ్యము లేదు' అంటూ పాశబద్ధము అయిన ఏనుగువలె, కాలపాశవశంగతులు అయినారు. ఇంతకన్నా చివరకు ఏమీ చెప్పలేదు" అన్నది.

ఈ రెండవ అప్రియానికి భరతుడు మరింత ఖిన్నుడు అయిపోయినాడు. విషణ్ణవదనముతో తల్లిని చూచి, 'అమ్మా! సీతారామలక్ష్మణులు ఎక్కడికి పోయినారు' అని ప్రశ్నించినాడు.

భరతుడు సంతోషిస్తాడు అనే భ్రాంతితో కైకేయీదేవి, "నాయనా! రాముడు రాజ్యము వదులుకొని, వల్కలాలు ధరించి దండకారణ్యము ప్రయాణము అయి పోయినాడు. సీతాలక్ష్మణులు వాణ్ణి సంతోషముగా వెంబడించినారు" అన్నది.

ఈ మాటలు చెవిని పడగానే భరతుడు తన వంశస్థుల మహాత్మ్యాన్ని గురించీ, రాముడి సదాచారాన్ని గురించీ యోచించినాడు. ఆ త్రిలోక విఖ్యాతుడు సదాచారలోపము చేసి ఉంటాడు అని నమ్మలేకపోయినాడు. అయినప్పటికిన్నీ భయపడిపోయి, "అమ్మా! రాముడు పరమధార్మికుడు. బ్రాహ్మణ ధనము అపహరించేవాడుకాడే! ఏ ధనవంతుణ్ణీ బాధపెట్టడే! ఏ దరిద్రుణ్ణీ హింసించడే! నిష్కారణముగా ఏ సజ్జనుణ్ణీ దండించడే! పరదార పరాఙ్ముఖుడే! భ్రూణహత్య చేసిన వాణ్ణివలె రాముణ్ణి దండకారణ్యానికి ఎందుకు వెళ్ళకొట్టవలసి వచ్చింది" అని అడిగినాడు.

ఆ మూఢురాలు, సమస్తమూ తనకు ఒక్కతెకే తెలుసును అనుకొనే ఆ గర్వి కైకేయీదేవి, తాను చేసింది అంతా చెప్పితే తన కొమారుడు మెచ్చుకొంటాడు అనే స్త్రీ సహజము అయిన చాపల్యముతో ఉబ్బిపోతూ, "పుత్రుడా! రాముడు ధర్మము తప్పలేదు. ఏ బ్రాహ్మణుడి ధనమూ అపహరించలేదు. ఏ ధనవంతుణ్ణి, ఏ సజ్జనుణ్ణి, ఏ దరిద్రుణ్ణి హింసించలేదు. పరదారలను కన్ను ఎత్తి అయినా చూచి ఎరుగడు. మీ నాయనగారు రాముడికి రాజ్యాభిషేకము తలపెట్టినారు. నాకు చెప్పలేదు. నేను విన్నాను. విచారించినాను. ఆలోచించినాను. అంతట నేను రాజ్యము నీకు ఇవ్వవలెను అనీ, రాముణ్ణి అడవులకు పంపించి వేయవలెను అనీ మీ

నాయనగారిని కోరినాను. మీ నాయనగారు నాకు పూర్వము వాగ్దానము చేసిన వరాలు ఈ విధముగా చెల్లించవలెను అని నేను యాచించినాను. మీ నాయనగారు సత్యవ్రతులు, సరేను అన్నారు. రాముడు అడవులకు ప్రయాణము అయినాడు. సీతా, లక్ష్మణుడూ సంతోషముగా వాడి వెంట వెళ్ళిపోయినారు. మీ నాయనగారు తన ప్రియపుత్రుడు అడవులకు పోయినాడు అని పరితాపపడ్డారు. మరణించినారు.

"ఓ కొడుకా! ఇది అంతా నేను నీ కోసము చేసినాను. ఈ దేశానికి ఇప్పుడు నీవే రాజువు. నీవు ఈ రాజ్యము ఏలవలెను. చిన్నవాడా! నీవు దుఃఖపడవద్దు. ధైర్యము అవలంబించు. ఇప్పుడు ఈ అయోధ్య నీది. ఏ చిక్కులూ లేని ఈ కోసల రాజ్యము నీది. నీచేత వశిష్ఠాది బ్రాహ్మణోత్తములు ఈనాడే మీ నాయనగారి దహన సంస్కారాదులు చేయిస్తారు. నీకు రాజ్యాభిషేకము చేస్తారు" అని చెప్పింది.

73

కైకేయిని భరతుడు దూషించుట

సీతారామలక్ష్మణులను అడవులకు పంపించడమూ, తండ్రి చనిపోవడమూ విని భరతుడు దుఃఖసంతప్తుడు అయి కైకేయీదేవిని చూస్తూ, "తండ్రి చనిపోయినాడు. ఆ తండ్రితో సరిసమానము అయిన మా అన్న రాముడు భార్యా సోదర సహితముగా అడవులపాలు అయిపోయినాడు. వారు ఎవరూ లేరే అని ఏడ్చే దరిద్రుడికి నాకు ఎందుకు ఈ రాజ్యము? మా అన్నను తాపసిగా చేసినావు. మా తండ్రిని చంపివేసినావు. పుండు చేసి ఆ పుండు బాధ చాలదు అనుకొని అందులో కారము కూరినట్టు, నాకు నీవు దుఃఖము మీద దుఃఖము తెచ్చి పెట్టినావు. మా వంశ నాశనానికి నీవు కాళరాత్రి వలె దాపరించినావు. అయ్యో! నీవు అగ్నిహోత్రానివి అని తెలియక మా తండ్రి దశరథమహారాజు నిన్ను కొగలించుకొన్నాడు. ఓ పాపదర్శినీ! నీనుంచి మా తండ్రి చనిపోయినాడు. ఓ కులపాంసనీ! నీవు రాజ్యమోహముతో మా వంశములో ఎవరూ సుఖపడకుండా చేసివేసినావు. ఆ మహాయశస్వి, ఆ సత్యసంధుడు మా తండ్రి దశరథమహారాజు నిన్ను చేపట్టడమునుంచి తీవ్రదుఃఖాభిసంతప్తుడు అయి దిక్కులేని చావు చావవలసి వచ్చింది. ఆ ధర్మవత్సలుణ్ణి మా తండ్రి దశరథమహారాజును ఎందుకు చంపివేసినావు నీవు? ఎందుకు రాముణ్ణి అడవులకు వెళ్ళకొట్టించినావు? కౌసల్యా సుమిత్రలకు నీవు తీరని పుత్రశోకము కలగచేసినావు. ఇకను ఆ ఇద్దరూ జీవించడము దుర్లభము.

"ఆ పూజ్యుడు, ఆ ధర్మాత్ముడు, ఆ గురువృత్తిజ్ఞుడు రాముడు, తన తల్లి కన్నా ఎక్కువ శ్రద్ధాసక్తులతో ఎప్పుడూ నీకు సేవచేస్తూ ఉండేవాడే! ఆ దీర్ఘదర్శిని, ఆ

రాముడి తల్లి మా పెత్తల్లి కౌసల్యాదేవి నిన్ను ఎప్పుడూ తన సొంత చెల్లెలివలె సంభావించేదే! అటువంటి ఆమె కొడుకుచేత, అందులో అంతటి బుద్ధిమంతుడిచేత నీవు వల్కలాలు కట్టించినావా? ఆ మహానుభావుణ్ణి వనవాసానికి పంపించి, నీవు ఏ దిగులూ లేకుండా హాయిగా ఉన్నావా? ఆ పుణ్యాత్ముణ్ణి, ఆ శూరుణ్ణి, ఆ మహాత్ముణ్ణి ఆ యశస్విని అడవులకు వెళ్ళకొట్టించవలసినంత అగత్యము ఏమి వచ్చింది? రాముడి మీద నాకు ఉన్న భక్తి నీకు తెలియదు అనుకొంటాను. నీవు లుబ్ధవు. రాజ్యమోహముతో ఈ మహానర్థము లేసుకొని వచ్చినావు. ఆ పురుషపుంగవులు రామలక్ష్మణులు కన్నులకే కనబడకుండా పోతే, నేను ఏ శక్తి ప్రభావముతో ఈ రాజ్యము ఏలకలుగుతాను అనుకొన్నావు? మేరుపర్వతాన్ని మేరుపర్వతములోంచి పుట్టిన మహావనము కాపాడేటట్టు ఆ మహాబలవంతుడు, ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు తన కడుపున పుట్టిన రాముడు అండగా ఉండే, వార్ధక్యములో ఈ రాజ్యము ఏలకలిగినాడు. మహా బలవంతుడు మోయవలసిన రాజ్యభారాన్ని నేను ఎట్లా మోస్తాను? పెద్ద ఎద్దు మోసే బరువును చిన్న లేగదూడ మోయకలుగుతుందా?

ఓ తల్లీ! ఒకవేళ నేనే ఈ రాజ్యము ఏలవలసి వచ్చేటట్లయితే, దశరథమహారాజు పుత్రుణ్ణి అయినందువల్ల నేను నా బుద్ధిబలముతోనూ, సామదానభేద దండోపాయాలతోనూ ఈ రాజ్యము ఏలుతానుకాని నీ కోరిక చెల్లించడానికి, నీ అత్యాశను తృప్తిపరచడానికి నేను ఈ రాజ్యము ఏలను. నీవు ఒడిగట్టిన ఈ పాపకృత్యానికి నిన్ను వెంటనే వెళ్లకొట్టవలెను. అయితే, రాముడు ఎప్పుడూ నిన్ను తన తల్లి వలె గౌరవించేవాడు. ఆ మహానుభావుడికి రాముడికి నామీద ఏమి కోపము వస్తుందో అని నిన్ను వెళ్ళకొట్టకుండా ఊరక ఉన్నాను.

"ఈ ప్రపంచములో రాజులు అందరూ తమ జ్యేష్ఠపుత్రులకే రాజ్యపాలన ఒప్పగించినారు. ఇది రాజులు అందరికీ సామాన్య ధర్మము. ఇది మా ఇక్ష్వాకు వంశీయులకు అందరికీ విశేషధర్మము. ఈ రాజ్యములో మా పూర్వీకులు అందరూ జ్యేష్ఠపుత్రుడికే రాజ్యాభిషేకము చేసినారు. కనిష్ఠులు అందరూ ఆ జ్యేష్ఠుణ్ణి తండ్రివలె పూజించినారు. జ్యేష్ఠుడు ఉండగా కనిష్ఠుడిచేత రాజ్యము చేయించవలెను అని నీకు ఎట్లా బుద్ధి పుట్టింది? ఇంతకూ నీవు పాపదర్శినివి. సదాచార భ్రష్ఠవు. నీకు రాజ ధర్మముతో నిమిత్తము లేదు. కులక్రమాగతము అయిన సదాచారము అతిక్రమించడము దోషము అని నీకు తోచలేదు. ఓ క్రూరురాలా! ధర్మైకరక్షకులము అనీ, సద్వంశ సదాచార సంపన్నులము అనీ మా ఇక్ష్వాకువంశీయులు అందరూ ఇంతవరకూ గర్వపడుతూ ఉన్నారు. నీవు వారి ఇంట చేరి వారి గర్వాన్ని నేలపాలు చేసినావు.

"ఓ కైకా! నీ పుట్టింటివారుకూడా జ్యేష్ఠుడికే రాజ్యాభిషేకముచేస్తూ వచ్చినారు. పెద్దలు ఎవరూ మెచ్చని ఈ పాడుబుద్ధి నీకు ఎట్లా పుట్టింది? నీవు పాపనిశ్చయవు. నాకు ప్రాణాంతకము అయిన వ్యసనము తెచ్చిపెట్టినావు. ఓ కులపాంసనీ! నేను నీకోరిక చెల్లించను. అంతేకాదు, నీకు అప్రియము చేయతలచుకొన్నాను. నిన్ను కష్టపెట్ట నిశ్చయించుకొన్నాను. ఇదిగో, నేను ఇప్పుడే పోయి ఆ సర్వజనప్రియుణ్ణి, ఆ స్వజనప్రియుణ్ణి ఆ తేజస్వంతుణ్ణి మా అన్న రాముణ్ణి అడవులలోనుంచి తీసుకొని వస్తాను. అతనిని సింహాసనము ఎక్కిస్తాను. సుస్థిర చిత్తముతో నేను అతనికి దాసుణ్ణిగా ఉంటాను" అంటూ శోకమూ, కోపమూ పెనవేసుకొనిపోయి భరతుడు కొండగుహలో సింహమువలె గర్జించినాడు.

74

కైకేయీదేవిని చూచినకొద్దీ భరతుడికి కోపము రేగింది. ఆమెను చూస్తూ, "దుష్టచారిణీ! నీవు ధర్మము తప్పినావు. ఓ క్రూరురాలా! నీవు ఈ రాజ్యములో నుంచి లేచిపో. నేను చచ్చిపోయినాను అనుకొని ఏడువు. మా తండ్రి దశరథమహారాజు కానీ, ఆ పరమధార్మికుడు రాముడు కానీ నిన్ను ఎందుకు అయినా, ఎన్నడు అయినా దూషించినారా? ఏకకాలాన ఒకరిని వనవాసానికి పంపించినావు. రెండవవారిని స్వర్గవాసానికి పంపించినావు. నీవు ఈ వంశ నాశనానికి పూనుకొన్నావు. అందువల్ల, భ్రూణహత్య చేసినంత పాపము నిన్ను చుట్టుకొన్నది. నీకు నరకము తప్పదు. నీ భర్త పోయిన లోకానికి నీవు పోవు.

"ఓ కైకా! నీవు సర్వలోకప్రియుడు అయిన రాముణ్ణి అడవులకు వెళ్ళకొట్టించినావు. ఎంత ఘోరకృత్యము చేసినావు? నిన్ను చూస్తున్నకొద్దీ నాకు భయము వేస్తూ ఉంది. నీనుంచే మా తండ్రి చనిపోయినాడు. మా అన్నను అడవులపాలు చేసి, నాకు ఈ లోకములో అపారము అయిన అపయశస్సు సంపాదించి పెట్టినావు. నీవు మాతృరూపములో ఉన్న నా విరోధివి. రాజ్యకాముకవు. దుర్వృత్తవు. క్రూరురాలవు. పతిఘాతినివి. నీవు నాతో మాట్లాడవద్దు.

"ఓ కులదూషణీ! నీనుంచి కౌసల్యా సుమిత్రలూ, తక్కిన నా తల్లులూ ఎంత దుస్సహదుఃఖము అనుభవించవలసి వచ్చింది! నీవు ఆ ధర్మాత్ముడు అశ్వపతి వంశనాశనము చేయడానికి పుట్టిన రాక్షసివి. నీవు ఆ ధీమంతుడి కూతురివికావు. నీ పాపకృత్యమువల్ల నాకు తండ్రి లేకుండా పోయినాడు. జ్యేష్ఠుడూ, కనిష్ఠుడూ నన్ను వదిలిపెట్టి పోయేటట్టు చేసినావు. సర్వలోకాలవారికీ నన్ను అప్రియుణ్ణిగా చేసివేసినావు. ఓ పాపిష్ఠురాలా! ఆ ధర్మిష్ఠను కౌసల్యాదేవిని పుత్రహీనను చేసినావు. ఓ దుర్మార్గురాలా!

నీవు ఏ లోకము పోవలెను అనుకొన్నావు? నీకు తగిన నరకము లేదు. ఓ క్రూరురాలా! కౌసల్యాదేవి కడుపున పుట్టిన ఆ రాముడు పరమపవిత్రుడు అని నీకు తెలియదా? అతడు బంధువులకు అందరికీ ఆశ్రయమిచ్చేవాడు అని నీవు ఎరగవా? మా తండ్రికి జ్యేష్ఠపుత్రుడు అనీ, తమ్ములకు మాకు తండ్రితో సరిసమానము అయినవాడు అనీ నీకు తోచలేదా?

"ఓ కైకా ! పుత్రుడు అంగ ప్రత్యంగాలలో నుంచే కాకుండా ప్రత్యగాత్మస్థానమూ అనురాగస్థానమూ అయిన హృదయములోనుంచి పుట్టుతాడు. అందువల్ల, ఆడుదానికి ఆత్మబంధువులు అందరికన్నా పుత్రుడు ప్రియతముడు అవుతున్నాడు. దేవతలు అందరూ పూజించే కామధేనువు, సమస్తధర్మాలూ తెలిసిన కామధేనువు పూర్వము ఒకప్పుడు ఈ భూలోకములో నాగలి వేసుకొని రెండు ఝాముల వరకు దున్ని దున్ని డస్సిపోయి, మండు టెండకు తాపము ఎత్తి అడుగులు తడబడుతూ, తహ తహలాడుతూ ఉన్న రెండు ఎడ్లను చూచి కన్నీళ్ళు కారుస్తూ ఏడవసాగింది. దాని కన్నీటి బిందువులు అప్పుడు ఈ క్రిందుగా పోతున్న దేవేంద్రుడిమీద పడ్డవి. ఆ కన్నీటి బిందువుల ఘుమఘుమ వాసనలకు సురేశ్వరుడు ఆశ్చర్యపడిపోయి పైకి చూచినాడు. ఏడుస్తూ కన్నీళ్ళు కారుస్తూ ఉన్న కామధేనువు ఆకాశములో కనిపించింది. చేతులు జోడించి, 'ఓ సురభీ! నీవు అందరి మేలూ కోరేదానవు. ఎందుకు ఇంత దుఃఖపడుతున్నావు? మా దేవతలు నిన్ను ఏమి అయినా భయపెట్టినారా' అని ప్రశ్న చేసినాడు. అందుకు ఆ కామధేనువు, 'ఓ సురేంద్రా! దేవతలు నన్ను భయపెట్టలేదు. అటువంటి అమంగళము ఎన్నడూ జరుగదు. భూమిమీద జోడు ఎద్దులను చూచినాను. కర్షకుడు వాటిని నలగకొట్టినాడు. మేత సరిగా పెట్టనందువల్ల అవి చిక్కిపోయినవి. దున్నుతున్న నాగలి భారము భరించలేకనూ, తీక్షణ తాపానికి తహతహ లాడుతూనూ కనిపించినవి. వాటి దీనావస్థ, వాటి విషమావస్థ చూచి నేను సహించలేక పోయినాను. తల్లి అయిన దానికి పుత్రులకన్నా ప్రియతములు ఎవరూ ఉండరు. అవి రెండూ నా కడుపున పుట్టినవి. అందువల్ల ఆ జోడుఎడ్ల కోసము ఏడుస్తున్నాను' అని చెప్పింది.

ఈ ప్రపంచము అంతటా ఆ కామధేనువు సంతతి వ్యాపించి ఉన్నప్పటికిన్నీ అది తన కడుపున పుట్టిన ఇద్దరు మగబిడ్డలు అనుభవిస్తున్న బాధలు భరించలేక ఏడుస్తూ ఉండడము చూచి, తల్లికి పుత్రుల కన్నా ప్రియతములు ఎవరూ ఉండరు అని దేవేంద్రుడు తెలుసుకొన్నాడు. ఆ కామధేనువు చరిత్రము అప్రతిమానము. ఇచ్ఛామాత్రాన సమస్తమూ సృష్టించే సామర్థ్యము దానికి ఉంది. లోకసంరక్షణార్థము అది దాని సంతతిని ఈ భూమిమీద అనంతముగా చేసి వేసింది. అటువంటి

కామధేనువు కడుపున పుట్టిన జోడు ఎద్దుల కష్టాన్ని చూచి ఓర్చుకోలేక పోయింది. ఏడవడము మొదలు పెట్టింది. కామధేనువు వంటిదే అట్లా ఏడిస్తే, ఇక ఏక పుత్ర అయిన కౌసల్యాదేవి గతి ఏమిటి? ఆమె ఇక జీవించడము దుర్లభము. ఆ మహాసాధ్వికి పుట్టక పుట్టక ఒక్క పుత్రుడు పుట్టి అల్లారుముద్దుగా పెరిగితే నీవు ఆ పుత్రుడికీ, ఆమెకూ కాకుండా చేసివేసినావు. ఇకను నీకు ఇహమూ, పరమూ రెండూ లేవు. నీవు జన్మ జన్మలకూ దుఃఖమే అనుభవిస్తావు.

"ఓ కైకా! ఆ పుణ్యసాధ్వి పుత్రుణ్ణి రాముణ్ణి నేనే పోయి ఇక్కడకు తీసుకొని వస్తాను. ఈ కోసల రాజ్యానికి రాజుగా అభిషేకము చేస్తాను. మునులు నివసించే అడవులకు పోయి నేనే వనవాసము చేస్తాను. ఈ విధముగా దశరథమహారాజునూ, రాముణ్ణి గౌరవిస్తాను. నీవు నాకు సంపాదించి పెట్టిన అపయశస్సు పోగొట్టుకుంటాను.

"ఓ పాపీ! నీనుంచి అయోధ్యపౌరులు అందరూ కన్నీళ్ళు కారుస్తూ నా వంక చూస్తున్నారు. ఇంతమంది దుఃఖము నేను సహించలేను. ఓ క్రూరురాలా! నీవు ధర్మాత్ముడు అయిన రామునికీ, పుణ్యసాధ్వి అయిన కౌసల్యాదేవికీ బుద్ధిపూర్వకముగా మహాపకారము చేసినావు. నీవు చేసింది పరమ పాతకము. ఇందుకు నీవు చచ్చిపోవడముకన్నా నీకు మరి ఒక ప్రాయశ్చిత్తము లేదు. నీవు చిచ్చుపెట్టుకొని కాలిపో లేదా విషము త్రాగి ప్రాణాలు వదులు. అదీకాకపోతే ఉరిపోసుకుని చావు. ఇవి ఏవీ చేయకపోయేటట్లయితే, దండకారణ్యములో వనవాసము చేయడానికి నీవే పో. నీకు ఇక మార్గాంతరము లేదు. నీ పాపము పోకొట్టుకో. నేను రాముణ్ణి తీసుకుని వచ్చి రాజ్యాభిషేకము చేయడముతో, నీనుంచి నన్ను ఆపాదించిన పాపము పరిహారము అయిపోతుంది. అప్పుడు నేను కృతార్థుణ్ణి అవుతాను" అంటూ, భరతుడు పరమక్రుద్ధుడు అయిపోయి కోపముతో రేగిన పాము మాదిరిగా బుసలుకొట్ట సాగినాడు.మహారణ్యములో వేటకాండ్లు తోమరాలతోనూ, అంకుశాలతోనూ పొడుస్తూ తరిమితే, గుంటలో పడే ఏనుగువలె అతడు నేలమీద పడిపోయినాడు. అతడి ఆభరణాలు అన్నీ ఎగిరి నేలమీద పడిపోయినవి. అతని వంటిమీద వస్త్రాలు అన్నీ విడివడి పోయినవి. ఉత్సవాంతాన కిందకు దింపి నేలమీద పడవేసిన ఇంద్ర ధ్వజమువలె కనిపించినాడు. ఆ పరంతపుడి నేత్రాలు ఎర్రటి జ్యోతులు అయినవి.

75

భరతుడు వచ్చినట్టు తెలిసి మంత్రులు అందరూ కైకేయీదేవి ఇంటికి పోయినారు.

భరతుడు కన్నీళ్ళు కారుస్తూ తల్లిని చూచి, మంత్రులతో "ఓ మంత్రిసత్తములారా! ఈ రాజ్యము నేను ఎప్పుడూ కాంక్షించలేదు. అందుకోసము మా అమ్మను ప్రేరేపించలేదు. ఆమెతో నేను కుట్ర పన్నలేదు. మా తండ్రి దశరథమహారాజును మా అమ్మ నాకు పట్టము కట్టమని కోరడమూ, అందుకు ఆయన సమ్మతించడమూ నాకు తెలియనే తెలియదు. నేను శత్రుఘ్నుడితో ఎంతో దూరములో ఉన్నాను. రాముడు వనవాసానికి ప్రయాణము కావడమూ, అతని వెంట సీతా లక్ష్మణులు పోవడమూ నేను ఏమీ ఎరుగను. నాకు ఏమీ తెలియదు" అంటూ అరచి చెప్పినాడు.

భరతుడు అరచి చెప్పుతున్న మాటలు కౌసల్యాదేవి చెవుల పడ్డవి. ఆమె సుమిత్రాదేవితో, "అంతటి క్రూరకార్యానికి ఒడికట్టిన కైక కొడుకు భరతుడు వచ్చినాడు. అయితే వీడు దూరదృష్టి కలవాడు. నేను పోయి వీణ్ణి చూడవలెను అనుకొంటున్నాను" అంటూ లేచింది.

ఆ దేవి పుత్ర వియోగమువల్లనూ, భర్తృ వియోగమువల్లనూ దుఃఖము అనుభవిస్తూ, కళాకాంతులు మాసి మలినము అయిపోవడమే కాకుండా కృశించి పోయింది. లేచి అడుగు వేయపోయింది. తూలి కింద పడ్డది.

భరతుడు కౌసల్య మందిరమున కేగుట

భరత శత్రుఘ్నులు తమ తల్లులను అందరినీ చూడవలెను అనుకొని, మంత్రులను వెంటపెట్టుకొని ఆ సమయాన్నే కౌసల్యాదేవి దగ్గరకు పోయినారు. దుఃఖార్త అయి నేలమీద పడి ఎలుగెత్తి ఏడుస్తూ ఉన్న ఆ పూజ్యురాలిని, ఆ మనస్విని కౌసల్యాదేవిని ఆ అన్నతమ్ములు చూచినారు. వారికిన్నీ పట్టశక్యముకాని దుఃఖము వచ్చింది. పెద్దపెట్టున ఏడుస్తూ వారు ఆమెను కౌగలించుకొన్నారు. అప్పుడు ఆమెకు మరింత దుఃఖము వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ, "నాయనా భరతుడా! నీవు కోరుకొన్న అకంటకము అయిన ఈ రాజ్యము నీకు ఇట్టే సంపాదించి పెట్టింది. కానీ నా కొడుకు రాముడికి వల్కలాలు కట్టపెట్టి అడవులకు వెళ్ళకొట్టించింది. నీకు రాజ్యము సంపాదించడము బాగానే ఉంది. కాని, నా కొడుకును అట్లా అడవులకు ఎందుకు వెళ్ళకొట్టిందో, ఏమి లాభమో నాకు తెలియదు. క్రూరకృత్యాలు చేయడమే దాని పని. ఇక నన్ను మాత్రము ఇక్కడ ఉండనిస్తుందా? ఎప్పుడో నన్ను ఇక్కడనుంచి తరిమివేస్తుంది. అంతవరకూ నేను ఇక్కడ ఉండడము ఎందుకు? మీ నాయనగారు నిత్యమూ వేల్చిన అగ్నిహోత్రాన్ని, మీ నాయనగారి కళేబరాన్ని తీసుకొని, ఈ సుమిత్రను తోడుచేసుకొని నేను నా బంగారుకొండ, నా కొడుకు రాముడు ఎక్కడ తపస్సు చేసుకొంటున్నాడో అక్కడికి సుఖముగా పోతాను. నేను నా కొడుకును

వదిలిపెట్టి ఉండలేను. నీకు నా మీద దయే ఉంటే, నీవే స్వయముగా మమ్ములను రాముడి దగ్గరకు తీసుకొని పోయి వదలిపెట్టు. సకల ధనధాన్య సమృద్ధమూ, చతురంగ బలయుతమూ అయిన ఈ రాజ్యాన్ని మీ అమ్మ నీకు ఇప్పించింది. కనుక నీవు అయోధ్యలో రాజ్యము ఏలుకొంటూ ఉండు" అంటూ కౌసల్యాదేవి కఠినోక్తులు ఆడింది.

కౌసల్యాదేవి మాటలకు భరతుడు పుండుమీద సూదులు పెట్టి పొడిచినట్టుగా బాధపడ్డాడు. అతనికి ఏమీ తోచలేదు. ఒండ్లు ఎరగకుండా ఏడువసాగినాడు. కౌసల్యాదేవిన్నీ ఏడవడము మొదలు పెట్టింది. అంతట కొంతసేపటికి భరతుడు తెప్పరిల్లి ఆమెకు చేతులు ఎత్తి నమస్కారము చేసి, "ఓ పూజ్యురాలా! నేను ఏ పాపమూ ఎరుగను. నన్ను నిందించవద్దు. రాముడిమీద నాకు ఉన్న అపారమూ, అచంచలమూ అయిన భక్తి నీవు ఎరుగుదువు.

"అమ్మా! రాముడు సత్యసంధుడు. సత్పురుషుడు. పరమపూజ్యుడు. ఇన్ని మాటలు ఎందుకు? రాముడు పురుషోత్తముడు. ఆ పురుషోత్తముణ్ణి రాముణ్ణి అడవులకు పంపించమని చెప్పినవాడు, శాస్త్రసులబ్ధము అయిన ప్రజ్ఞామహిమ కోలుపోయిన ఖలుడు అయి ఉంటాడు. పాపాత్ములకు సేవచేసేవాడు అయి ఉంటాడు. సూర్యుడికి ఎదురుగుండా కూర్చుని మలమూత్రవిసర్జన చేసే మూర్ఖుడు అయి ఉంటాడు. నిద్రపోతున్న ఆవును కాలితో తన్నిన బుద్ధిహీనుడు అయి ఉంటాడు. భృత్యులచేత మహత్కార్యాలు చేయించుకొని, ఆ భృత్యులకు ప్రతిఫలముగా ధనము ఇవ్వని పాపాత్ముడు అయి ఉంటాడు. ప్రజలను అందరినీ తమ కన్న బిడ్డలవలె ప్రజాపాలనము చేసే పరమధార్మికుడు అయిన ప్రభువుకు ద్రోహము చేసినవాడు అయి ఉంటాడు. పండిన పంటలో ఆరవపాలు పన్నుగా పుచ్చుకొంటూ ధర్మమార్గాన ప్రజలను కాపాడని రాజు అయి ఉంటాడు. వ్రతోపవాసశీలురు అయిన ఋత్విజులకు భూరి దక్షిణలు ఇస్తాను అని ఆశపెట్టి, యజ్ఞము అయిపోయిన తరువాత దక్షిణలు ఎగవేసిన దుర్మార్గుడు అయి ఉంటాడు.

"అమ్మా! చతురంగ బలాలతో ఘోరసంగ్రామము సాగుతూ ఉంటే, సంగ్రామ రంగములోనుంచి పారిపోయి వచ్చిన పిరికిపంద రాముణ్ణి అడవులకు పంపించమని చెప్పి ఉంటాడు. గురూపదిష్ట పరలోక సాధక సూక్ష్మార్థాలను అన్నిటినీ మరచిపోయిన బుద్ధిహీనుడు అట్లా చెప్పి ఉంటాడు. ఆ ఆజానుబాహువును, ఆ విపులాంసుణ్ణి, ఆ సూర్యచంద్రసమతేజోవంతుణ్ణి రాముణ్ణి నిండు కొలువులో సింహాసనముమీద కూర్చుని ఉండగా చూడని దుష్టాత్ముడు అట్లా చెప్పి ఉంటాడు. గురుజనులను అవమానించిన దుర్మార్గుడు అట్లా చెప్పి ఉంటాడు. తనకు స్నేహితుడు అని నమ్మి చెప్పిన రహస్యాలను అన్నిటినీ బట్టబయలు చేసిన మిత్రద్రోహి అట్లా చెప్పి ఉంటాడు. ఎవరికీ ఏ

కొంచెము మేలూ చేయకపోవడమే కాకుండా చేసిన మేలు మరచిపోయిన కృతఘ్నుడు అట్లా చెప్పి ఉంటాడు. పాపకృత్యాలు చేసి సిగ్గు లేకుండా తిరిగి, లోకద్వేష్యుడు అయి ఆత్మహత్య చేసుకొనేవాడు అట్లా చెప్పి ఉంటాడు. కట్టుకొన్న పెండ్లానికీ, కడుపున పుట్టిన బిడ్డలకూ, సేవచేసే భృత్యులకూ అన్నము పెట్టకుండా తాను ఒక్కడే మృష్టాన్న భోజనము చేసే క్రూరాత్ముడు అట్లా చెప్పి ఉంటాడు.

"అమ్మా! రాముణ్ణి అడవులకు పంపించమని చెప్పినవాడు, తన కులగోత్రాలకు తుల్యము అయిన భార్య దొరకక పాపకార్యాలు చేస్తూ, బిడ్డలు పాపలు లేకుండా ఉభయ లోకాలకూ భ్రష్టుడు అయిపోతాడు. అట్లా చెప్పినవాడి భార్యకు బిడ్డలు పుట్టకుండా, వాడు అర్ధాయుస్సున పోతాడు. పిచ్చెత్తి గుడ్డపీలికలు కట్టుకొని, చేతిలో పుర్రె పుచ్చుకొని బిచ్చము ఎత్తుకొంటూ దేశాటనము చేస్తాడు. ధర్మబుద్ధి లేకుండా అధర్మ ప్రవృత్తి కలవాడు అవుతాడు. అపాత్రులకు దానము చేసేవాడు అవుతాడు. బహుపుత్రులు పుట్టి, దారిద్ర్యము వచ్చి, జ్వరాది రోగపీడితుడు అయి బ్రతికి ఉన్నంత కాలమూ దుఃఖాలపాలు అవుతాడు. రాముణ్ణి అడవులకు పంపించమని చెప్పినవాడు సంపాదించి దాచి పెట్టుకొన్న ధనమును అంతా దొంగలు దోచుకొని పోతారు. వాడు ఉభయ సంధ్యలలో నిద్రపోయే బుద్ధిహీనుడు అవుతాడు. పతివ్రత అయిన భార్య ఋతుస్నాత అయినప్పుడు, ఋతు నియమాలను పాటించని భ్రష్టుడు అవుతాడు. అశుచి అయి మోసము చేసి బ్రతుకుతూ, రాజభయముతో తిరుగుతూ ఉంటాడు. మాతా పితరులకు సేవచేసే మహాభాగ్యము వాడికి ఉండదు. వాణ్ణి సత్పురుషులు ఎవరూ దరిచేర నీయరు.

"అమ్మా! రాముణ్ణి అడవులకు పంపించమని చెప్పినవాడు పాయసమూ, కృసరమూ, ఛాగమాంసమూ దేవతలకూ పితృదేవతలకూ నైవేద్యము పెట్టకుండానూ, అతిథులకు అయినా పెట్టించకుండానూ, తానే తినేవాడు పోయే పాపానపోతాడు. రాజును కానీ, స్త్రీని కానీ వృద్ధులను కానీ, బాలురను కానీ హత్యచేసినవాడు పోయే పాపాన పోతాడు. స్వామిభక్తిపరాయణులు అయిన భృత్యులను పోషించనివాడు పోయే పాపాన పోతాడు. శత్రుపక్ష భయంకరము అయిన యుద్ధరంగమునుంచి పారిపోతున్న వాణ్ణి చంపినవాడు పోయే పాపాన పోతాడు. కామక్రోధాదులకు వశుడు అయి, స్త్రీలంపటుడు అయి తప్పతాగి జూదము ఆడేవాడు పోయే పాపాన పోతాడు. ఇండ్లకు నిప్పుపెట్టేవాడు పోయే పాపాన, గురుతల్పగతుడి పాపాన, మిత్రద్రోహము చేసినవాడి పాపాన పోతాడు. ఉన్నతాసనముమీద కూర్చున్న తనను చేతులు జోడించి, తలలు పైకి ఎత్తి, అతిదీనముగా యాచించే యాచకుల ఆశలను అడియాసలు చేసే రాజు పోయే పాపాన పోతాడు. లాక్షా మధు మాంస విషాది నిషిద్ధ వస్తువులు

విక్రయించేవాడు పోయే పాపాన పోతాడు. పవిత్ర జలాలను పాడుచేసేవాడు పోయే పాపాన పోతాడు. విషము పెట్టి జనులను చంపేవాడు పోయే పాపాన పోతాడు. బ్రాహ్మణ సత్కారానికి విఘాతము కలిగించేవాడు పోయే పాపాన పోతాడు. పది రోజుల లేగదూడలకు పాలు వదలకుండా ఆవుపాలు పిండుకొనేవాడు పోయే పాపాన పోతాడు. తన దగ్గర మంచినీళ్ళు ఉన్నప్పటికిన్నీ, దప్పిక అయినవాడు అడిగితే దాహము ఇవ్వనివాడు పోయే పాపాన పోతాడు. ఇద్దరు పోట్లాడుకొంటూ ఉంటే, స్నేహాన్ని పురస్కరించుకొని ఒకడికి జయోపాయము చెప్పేవాడు పోయే పాపాన పోతాడు' అంటూ ఘోరశపథాలుచేస్తూ, దుఃఖపడుతూ ఉన్న కౌసల్యాదేవిని ఊరడిస్తూ పితృ వియోగానికీ, జ్యేష్ఠభ్రాతృ వియోగానికీ దుఃఖముతో తాపము ఎత్తి నేలమీద పడిపోయినాడు.

అట్లా పడిపోయిన భరతుణ్ణి కౌసల్యాదేవి లేవనెత్తి, "నాయనా! నీవు ఇట్లా ఒట్టుపెట్టుకొంటూ ఉంటే నా కడుపు తరుగుకొనిపోతూ ఉంది. నా ప్రాణము పోయేటట్టు ఉంది. ఓ భరతుడా! నా భాగ్యవశమువల్ల నీవు లక్ష్మణుడివలె ధర్మానికి కట్టుబడ్డావు. నీవు సత్యప్రజ్ఞుడవు అయి సత్పురుషులు పోయే లోకానికి పోతావు" అంటూ తన ఒడిలో కూర్చుండ పెట్టుకొని కౌగలించుకొని ఘోరముగా ఏడువసాగింది.

దుఃఖాతిశయముతో భరతుడి మనస్సు చెదిరిపోయింది. చేష్టలు తప్పి కౌసల్యాదేవి ఒడిలోనుంచి జారి నేలమీద పడిపోయినాడు. తెలివి వచ్చి మాటిమాటికి నిట్టూర్పులు విడువసాగినాడు.

అప్పుడు ఆ రాత్రి తెల్లవారింది.

76

దశరథుని ఉత్తర క్రియలు

సూర్యోదయము అయింది. వశిష్ఠమహర్షి శోకముతో తపించిపోతూ ఉన్న భరతుణ్ణి చూచి, "ఓ మహాశయా! దుఃఖపడవద్దు. నీకు శుభము అవుతుంది. కాలయాపన చేయవద్దు. నీ తండ్రి దశరథమహారాజుకు ఉత్తరక్రియలు ఆరంభింపవలెను" అని చెప్పినాడు.

ఆ ధర్మవేత్త మాటలకు భరతుడు ధైర్యము తెచ్చుకొని ప్రేతకార్యాలు చేయడానికి సంసిద్ధుడు అయినాడు. దశరథమహారాజు కళేబరాన్ని తైలద్రోణమునుంచి పైకి తీసినారు. నూనెలో ఉంచడము నుంచి పసుపువన్నె వచ్చి దశరథమహారాజు నిద్రపోతున్నవాడివలె కనిపించినాడు. ఆ కళేబరాన్ని రత్నాలు పొదిగిన శయ్యమీద పరుండపెట్టినారు. భరతుడికి పరమదుఃఖము వచ్చింది. అతడు ఏడుస్తూ, "ఓ రాజా! ఎంతో దూరదేశములో ఉన్న నేను వచ్చేలోపలే ఆ ధర్మజ్ఞుణ్ణి రాముణ్ణి, ఆ

మహాబలవంతుడు లక్ష్మణుణ్ణి అరణ్యవాసానికి ఎందుకు పంపించినావు? ఓ తండ్రీ! అట్లా ఎందుకు చేయవలసి వచ్చింది? అందరికీ మేలుచేసే రాముడు అడవులు పట్టిపోయినాడు అని జనులు అందరూ దుఃఖపడుతూ ఉంటే నీవు ఎక్కడికి పోయినావు? ఇకను ఈ రాజ్యములో అందరి యోగక్షేమాలనూ విచారించేవారు ఎవరు?

"ఓ తండ్రీ! నీవు చనిపోయినందువల్లనూ, రాముడు రాజ్యము వదిలిపెట్టి పోయినందువల్లనూ ఈ పృథివి విధవ అయింది. ఈ అయోధ్య, చంద్రుడులేని రాత్రివలె కళాకాంతులు మాసిపోయి పాడుపడ్డట్టుగా ఉన్నది" అంటూ దీనమానసుడు అయి విలపిస్తూ ఉన్న భరతుణ్ణి చూచి వశిష్ఠమహర్షి మళ్ళీ, "ఓ మహాబాహూ! ఇకను ఈ విచారము మాను. ప్రేతకార్యాలు వెంటనే జరిపించవలెను. ఆలస్యము వద్దు" అన్నాడు.

అట్లాగేను అంటూ భరతుడు ఆ మహర్షి మాటలను శిరసావహించి ఋత్విక్పురోహితులను ప్రేత కార్యాలకు నియోగించినాడు. దశరథమహారాజు చనిపోగానే ఆయన అగ్న్యగారములోనుంచి తెచ్చి బయట ఉంచిన అగ్నిహోత్రాన్ని తీసుకొని వారు ముందు నడచినారు. పరిచారకులు దశరథమహారాజు కళేబరాన్ని ఒక శిబికకు ఎత్తి, కన్నీళ్ళు కారుస్తూ దానిని మోస్తూ నడిచినారు. ఆ పల్లకి ముందు రాజసంబంధితజనులు వెండి బంగారు నాణ్యాలనూ, రకరకాల వస్త్రాలనూ వెదజల్లుతూ బయలుదేరినారు. కొందరు గుగ్గిలమూ, చందనమూ, అగరూ మొదలు అయిన ధూపాలు వేస్తూ నడిచినారు. అక్కడ శ్మశానములో సరళమూ, పద్మకమూ, దేవదారూ మొదలు అయిన సుగంధ వాసనలతో మండే కట్టెలతో అమర్చిన చితిమీద ఆ శవాన్ని పెట్టించినారు. ఆ చితికి భరతుడు అగ్నిహోత్రము పెట్టినాడు. ఋత్విజులు పైతృమేధిక మంత్రములు జపించను ఆరంభించినారు. యథాశాస్త్రముగా సామగులు సామగానము సాగించినారు.

దశరథమహారాజు భార్యలు అందరూ వృద్ధపరిచారకులను వెంటపెట్టుకొని వారి వారి యోగ్యతలకు తగిన వాహనాలమీద అప్పుడు అక్కడికి వచ్చినారు. కౌసల్యాదేవి మొదలు అయినవారు అందరూ శోకముతో తపించిపోతూ భరతుడి వెంట ఆ చితికి సవ్యాపసవ్యముగా ప్రదక్షిణము చేసినారు. ఏదో కీడు మూడినప్పుడు జాలి పుట్టేటట్టు ఏడ్చే ఒక వెయ్యి పెంటి కొంచపిట్టలవలె ఏడువసాగినారు. ఏడ్చి ఏడ్చి వివశలు అయినారు. ఆ తరువాత వారు అందరూ సరయూతీరానికి పోయి, భరతుడితో కూడా దశరథమహారాజుకు ఉదక క్రియలు నిర్వర్తించినారు. మంత్రి పురోహితులతో కూడా అయోధ్యానగరానికి వచ్చినారు. అందరూ అశ్రుపరీత నేత్రలు అయినారు. దుఃఖముతో పదిరోజులు నేలమీద పడుకొంటూ కాలము గడిపినారు.

77

పదిదినాలు గడచిపోయినవి. అశౌచము వదలిపోయింది. భరతుడు పదకొండవనాడూ, పన్నెండవనాడూ చేయవలసిన శ్రాద్ధకర్మలను అన్నిటినీ పూర్తి చేసినాడు. బ్రాహ్మణులకు అన్నదానము చేసి, వారికి మహార్హాలు అయిన వస్త్రాలూ నానావిధ మణులూ, శ్రేష్ఠము అయిన అనేకవస్తువులూ, విరివిగా ధనమూ ఇచ్చినాడు. దశరథమహారాజు ఔర్ధ్వదైహిక కర్మలను ఉద్దేశించి ఆ బ్రాహ్మణులకు ఇంకా వందలకొద్దీ మేకల మందలనూ, ఆవుల మందలనూ, దాసదాసీజనాన్నీ, ఉండడానికి పెద్ద పెద్ద ఇండ్లనూ, వాహనాలనూ దానము ఇచ్చినాడు. పదమూడవనాడు భరతుడు అసి సంచయనము కోసము దశరథమహారాజును దహనము చేసిన చోటకు పోయినాడు. పెద్ద పట్టున ఏడుస్తూ తండ్రి చితి చూచి, "ఓ తండ్రీ! నన్ను అప్పచెప్పి పోవలసిన రాముణ్ణి అడవులకు పంపించి, నన్ను దిక్కులేనివాణ్ణిగా చేసినావు. నీ పట్టపురాణి కౌసల్యాదేవికి పుట్టక పుట్టక పుట్టిన ఒక్క కొడుకునూ అడవులపాలు చేసి అది చాలదనట్టు నీవు ఆమెను వదలిపెట్టి పోయినావు. ఆమెను అన్నివిధాలా అనాథను చేసినావు. మమ్ములను ఎందుకు ఇట్లా అన్యాయము చేసినావు? మేము ఏమి చేసినాము?' అంటూ, బూడిద అడుగున ఎర్రగా కణకణలాడుతూ మండలాకారముగా ఉన్న దశరథమహారాజు అస్థులను చూచినాడు. తన తండ్రిని దగ్ధము చేసివేసిన ఆ చితిని చూస్తూ, "అయ్యో! అయ్యో! ఇదేనా మిగిలింది" అంటూ పెద్దపెట్టున అరుస్తూ, పగ్గాలతో పైకి లేవనెత్తుతూ ఉంటే పట్టు తప్పి పడిపోయిన ఇంద్రధ్వజమువలె భరతుడు నేలకూలినాడు. పుణ్యము క్షయము అయిపోయి నేలమీదపడుతున్న యయాతిని ఋషుల వలె, ఆ పరిశుద్ధుణ్ణి పట్టుకొని లేవనెత్తపోయిన మంత్రులున్నూ నేలమీద పడిపోయినారు.

అంతవరకూ నిబ్బరముగా ఉన్న శత్రుఘ్నుడి మనస్సు చెదరిపోయింది. తన తండ్రి స్వరూప స్వభావాదులనూ, గుణగణాలనూ తలచుకొంటూ అతడు దుఃఖాతిశయముతో తెలివితప్పి నేలమీద పడి పిచ్చివాడివలె ఏడుస్తూ, "ఓ తండ్రీ! మంథర కల్పించింది. కైకేయీదేవి మహాగ్రాహముగా అందులో విజృంభించింది. తమ వరదానముతో అది తీవ్రమూ, అక్షోభ్యమూ అయింది. ఆ శోకసాగరములో మమ్ములను పడవేసి నీవు పోయినావు.

"ఓ తండ్రీ! నీవు భరతుణ్ణి ఎప్పుడూ బుజ్జగిస్తూ ఉండేవాడివి. వాడు బాలుడే! సుకుమారుడే! ఇప్పుడు ఇట్లా ఏడుస్తూ ఉంటే వాణ్ణి వదిలి ఎక్కడికి పోయినావు? మేము ఏమి తినవలెనో, ఏది త్రాగవలెనో, ఏ ఏ వస్త్రాలు కట్టుకోవలెనో, ఏ ఏ ఆభరణాలు పెట్టుకోవలెనో అన్నీ చెప్పుతూ, తండ్రీ! నీవు మా కోరిక చెల్లించేవాడివే? ఇక మాకు అవి అన్నీ చెప్పేవారు ఎవరు? అవి అన్నీ ఇచ్చేవారు ఎవరు?

"ఓ తండ్రీ! నీవు ధర్మాత్ముడవు. మహాత్ముడవు. ఈ జగత్తులోవారికి అందరికీ సమస్త సౌఖ్యాలూ సమకూర్చేవాడవు. అటువంటి నీవు, దుఃఖముతో దేహత్యాగము చేస్తూ ఉంటే, ఈ భూమి మెదలకుండా ఊరక ఉంది. ప్రళయకాలము వచ్చినా భూమి బ్రద్దలు అయిపోదు. తండ్రీ! నీవు సద్గతుడవు అయిపోయినావు. రాముడు అడవులపాలు అయిపోయినాడు. భరతుడికి ఇప్పుడు మతి చెడ్డది. ఇక నేను ఎట్లా బ్రతికి ఉండగలను? నాకు అంత సామర్థ్యము లేదు. ఇక నాకు అగ్నిహోత్రమే శరణ్యము.

"మహా మహితాత్ములు ఇక్ష్వాకులు పరిపాలించిన అయోధ్యానగరము, ఓ రాజా! నీవు పోయినందువల్లనూ, రాముడు వనవాసానికి పోయినందువల్లనూ పాడుపడిపోయింది. ఇట్లా పాడుపడిపోయిన ఈ అయోధ్యాపట్టణములోకి నేను పోలేను, పోను. నేను తపోవనానికే పోతాను" అంటూ లేవపోయినాడు. కాని, వివశుడు అయి నేల మీద పడిపోయినాడు. ఆ అన్నతమ్ములు కొమ్ములు విరిగిన కోడెలవలె నేలమీద పడి పొర్లాడుతూ ఏడవసాగినారు.

అప్పుడు సర్వజ్ఞుడూ ప్రశస్తస్వభావుడూ, ఇక్ష్వాకుల పురోహితుడూ అయిన వశిష్ఠమహర్షి నేలమీదపడి పొర్లాడుతూ ఉన్న భరతుణ్ణి లేవనెత్తి, "ఓ రాజపుత్రా! ఇది మీ తండ్రి చనిపోయిన పదమూడవ దినము. అస్థిసంచయనము ఒక్కటే మిగిలి ఉంది. ఎందుకు ఆలస్యము చేస్తావు? క్షుత్పిపాసలూ, శోకమోహాలూ, జరామరణాలూ సమస్తప్రాణికోటికీ తప్పవు. ఇవి లేని ప్రాణి ఏదీ లేదు. ఇవి అనివార్యాలు. వీటిని తప్పించకలవాడు ఎవడూ లేడు. ఇందుకోసము నీవంటి బుద్ధిమంతుడు దుఃఖపడడము బాగాలేదు" అని చెప్పినాడు.

తత్త్వజ్ఞుడు అయిన సుమంత్రుడు శత్రుఘ్నుణ్ణి లేవతీసి, సమస్తప్రాణికోటికీ జననమరణాలు తప్పవు అనీ, దుఃఖపడవద్దు అనీ ఊరడించినాడు.

ఆ కీర్తిమంతులు భరతశత్రుఘ్నులు ఎండకు ఎండి, వానకు తడిసిన ఇంద్రధ్వజమువలె కనిపించినారు. వారు కన్నీళ్ళు తుడుచుకొంటూ ఎర్రపడిపోయిన కన్నులతో, దీనస్వరముతో మాట్లాడుతూ ఉంటే, అమాత్యులు వారిని తక్కిన అస్థిసంచయనాదికాలు పూర్తి చేయవలసింది అని తొందర చేసినారు.

78

దశరథమహారాజు అపరక్రియలు అన్నీ అయిపోయినవి. భరతుడు శోకముతో తపించిపోతూ, రాముడు దగ్గరకు పోవడానికి ఉద్యుక్తుడు అవుతున్నాడు. అప్పుడు శత్రుఘ్నుడు అతనిని చూచి, "అన్నా! సమస్తప్రాణికోటికీ కష్టకాలములో దిక్కు అయి

కాపాడే రాముడు, తనకు కష్టకాలము వచ్చినపుడు తనకు తాను దిక్కు అయి కాపాడుకోలేక పోయినాడు. అందులో, అంత బలవంతుడు ఒక ఆడుదాని మాటకు తల ఒగ్గి అడవులకు పోయినాడు, చిత్రమే! పిత్రాజ్ఞను శిరసావహించలేదు అనే అపకీర్తి భయమునుంచి రాముడు వనవాసము చేయడానికి పోయినాడు అని అనుకొనేటట్లయితే మహాబలవంతుడూ, పరమపరాక్రమవంతుడూ అయిన లక్ష్మణుడు ఒకడు ఉన్నాడే, వాడు అయినా తండ్రిని నిగ్రహించి రాముణ్ణి వనవాసానికి పోనీయకుండా చేయవలసింది. వాడు ఎందుకు అట్లా చేయలేదు? ఇంతకూ దుష్టురాలు అయిన కైకేయీదేవి వలలో చిక్కి, రాజు తగని మార్గము త్రొక్కక పూర్వమే ఇది నీతి, ఇది అవినీతి అని నిర్ణయించి, ఇటువంటి అనర్థము రాకుండా నిగ్రహించి ఉండవలసింది" అని చెప్పుతూ ఉండగా ఆ భవనము తూర్పు వాకిట ఏదో పెద్ద గడబిడ వినిపించింది. శత్రుఘ్నుడు అక్కడికి పోయినాడు.

గూని మంథరను లోపలికి పోనీకుండా ద్వారపాలకులు పట్టుకొని ఉన్నారు.

ఆ గూనిది వంటినిండా చందనచర్చ చేసుకొని, రాజయోగ్యము అయిన దుస్తులు ధరించి, రకరకాల రత్నాభరణాలు పెట్టుకొని రంగు రంగుల మొలనూళ్ళతో తాళ్ళు నడుముకు కట్టిన కోతివలె కనిపించింది. ద్వారపాలకులు ఆ పాపిష్ఠురాలిని శత్రుఘ్నుడికి చూపించి, "ప్రభూ! ఈ క్రూరురాలినుంచి, రామప్రభువు అడవులపాలు అయిపోయినాడు. తమ తండ్రి దశరథమహారాజు అంతటి ధర్మాత్ముడు స్వర్గతుడు అయినాడు. ఈ దుర్మార్గురాలిని మీకు ఒప్పగిస్తున్నాము. ఇక మీ చిత్తము" అన్నారు.

శత్రుఘ్నుడు ఆ గూని మంథరనూ, దాని వెంట ఉన్న దాసీ జనాన్నీ చూచినాడు. ఆ దృఢవ్రతుడికి దుఃఖము వచ్చింది. కోపము రేగింది. అందరికీ వినపడేటట్టుగా "ఈ క్రూరురాలు మా అన్నదమ్ములకు తీవ్రము అయిన దుఃఖము తెచ్చిపెట్టింది. ఇది తాను చేసిన కర్మఫలము ఇప్పుడే, ఇక్కడే అనుభవించవలెను" అంటూ, సఖీజనము మధ్యలో ఉన్న మంథరను బలాత్కారముగా పట్టుకొని పడతోసినాడు. అప్పుడు ఆ మంథర ఆ భవనము అంతా దద్దరిల్లిపోయేటట్టు కేకలు పెట్టింది. దాని చుట్టూ ఉన్న చెలికత్తెలు అందరూ తమను ఇక శత్రుఘ్నుడు నిశ్శేషము చేసివేస్తాడు అని భయపడి అటూ ఇటూ పరుగులు ఎత్తినారు. కౌసల్యాదేవి శరణముకన్నా వారికి మార్గాంతరము తోచలేదు. వాండ్లు అందరూ ఆ దయామయి ఇంటి వంక పరుగు తీసినారు.

ఆ శత్రుతాపనుడు శత్రుఘ్నుడు రోషముతో తామ్రాక్షుడు అయి, కేకలు పెట్టుతూ ఉన్న మంథరను నేలమీద జరజర లాగుకొని పోతూ ఉంటే, అది పెట్టుకొన్న రకరకాల రత్నాభరణాలు చిందరవందర అయి నేలమీద పడి, శరత్కాల

నిర్మలాకాశములో స్వచ్ఛ నక్షత్రాలవలె ఆ భవనములో శోభించినవి. మంధర అరుపులకూ, ఏడ్పులకూ కైకేయీదేవి పరుగెత్తుకొని వచ్చింది. మంథరను నేలమీద పడలాగుతున్న శత్రుఘ్నుణ్ణి చూచింది. అతనికి అడ్డుపోబోయింది. శత్రుఘ్నుడు మరింత క్రుద్ధుడు అయినాడు. కైకేయీదేవిని అతిపరుషముగా దూషించినాడు. ఆమె భయపడిపోయింది. గజగజ వణకుతూ భరతుడి దగ్గరకు పోయింది.

భరతుడు ఆమెనూ, పరమ క్రుద్ధుడు అయిఉన్న తమ్ముణ్ణీ చూచి "తమ్ముడా! సమస్తప్రాణకోటిలోనూ స్త్రీలు అవధ్యలు. మాతృహంతకుడు అని రాముడు నన్ను నిందిస్తాడు అనే భయముతో నేను ఊరక ఉన్నాను. లేకపోతే ఈ పాపిష్ఠురాలిని, ఈ క్రూరురాలిని, ఈ కైకను నేను చంపివేసి ఉండేవాణ్ణి. నీవు మంధరను చంపివేసేటట్లయితే ఆ ధర్మాత్ముడు రాముడు నిన్నూ, నన్నూ మన్నించడు. మనతో మాట్లాడను అయినా మాట్లాడడు. నిజము" అన్నాడు.

భరతుడు అన్న ఈ మాటలకు శత్రుఘ్నుడి కోపము చల్లారింది. మంథరను వదిలిపెట్టినాడు.

అంతట ఆ మంధర కైకేయీదేవి పాదాలమీద పడి పరమదుఃఖముతో నిట్టూర్పులు విడుస్తూ, వలలో తగులుకొనిపోయిన పెంటి క్రౌంచమువలె చూస్తూ రోదనము చేయసాగింది. కైకేయీదేవి దానిని ఊరడించింది.

79

భరతుడు రాముని దర్శింప నిర్ణయించుకొనుట

పధ్నాలుగవనాడు ప్రాతఃకాలమున రాజ్యకర్తలు భరతుడి దగ్గరకు పోయి, "ఓ రాజపుత్రా! అందరికీ పరమగురువు అయిన మీ తండ్రి దశరథమహారాజు తన జ్యేష్ఠపుత్రుణ్ణీ, మహాబలవంతుడు అయిన లక్ష్మణుణ్ణీ అడవులకు పంపించి తాను స్వర్గతుడు అయినాడు. నీ రాజ్యము ఇప్పుడు అనాయకము అయినప్పటికిన్నీ దైవయోగమువల్ల చెక్కుచెదరకుండా ఉంది. నీవు ఇప్పుడు ఈ రాజ్యభారము వహించవలెను. నీ రాజ్యాభిషేకాన్ని ప్రజలు అందరూ ఎదురుచూస్తూ ఉన్నారు. రాజ్యాభిషేక సంభారాలను అన్నిటినీ స్వజనులు సిద్ధము చేసినారు. ఇది నీకు పితృపైతామహము అయిన రాజ్యము. ఇప్పుడు నీవు రాజ్యాభిషేకము చేసుకొని ఈ కోసల రాజ్యాన్ని కాపాడవలెను" అని చెప్పినారు.

ఆ ధృఢవ్రతుడు భరతుడు అక్కడికి తెచ్చిన అభిషేక సంభారాలకు అన్నిటికీ ప్రదక్షిణముచేసి అక్కడ సమావేశము అయిన జనులు అందరినీ చూచి, "ఓ మహాజనులారా! మా వంశములో ఎప్పుడూ జ్యేష్ఠపుత్రుడే రాజ్యపాలనము చేస్తూ

వచ్చినాడు. అదే సముచితాచారము. మీరు అందరూ పెద్దలు. సమస్తమూ తెలిసినవారు. మీరు ఇప్పుడు నన్ను రాజు కమ్మనడము ఏమీ సమంజసముగా లేదు. నాకన్నా ముందు పుట్టిన రాముడే ఈ రాజ్యము ఏలవలెను. పద్నాలుగు సంవత్సరాల అరణ్యవాసమూ అతనికి బదులు నేను చేస్తాను. నేను అడవికి పోయి రాముణ్ణి ఇక్కడకు తీసుకొని వస్తాను. చతురంగబలాలతోనూ ప్రయాణము అయిపోవలెను అనుకొంటున్నాను. మీరు అందరూ నాకు తోడ్పడవలెను. రాజ్యాభిషేకానికి మీరు సమకూర్చిన సమస్త సంభారాలనూ నావెంట తీసుకొనిపోయి ఆ పూజ్యుడికి, ఆ నరశార్దూలానికి రాజ్యాభిషేకము చేసి, యజ్ఞశాలలోనుంచి త్రేతాగ్నిని తెచ్చేటట్టు ఆ మహానుభావుణ్ణి అడవిలోనుంచి ఇక్కడికి తీసుకొని వస్తాను. రాముడే ఈ రాజ్యము ఏలవలెను. నాకు రూపమాత్ర మాత అయిన కైకేయీదేవి కోరికను నేను చెల్లించను. ఆమె కోరికకు విరుద్ధముగా నేనే వనవాసము చేస్తాను. కర్మకారులు వెంటనే బయలుదేరిపోయి, అడవిలో మిట్టపల్లాలు సరిచేసి సేనలు పోవడానికి గంగానదివరకూ దండుబాటను వేయవలెను. దుర్గమప్రదేశాలు ఎరిగిన రక్షకులను వారి వెంట పంపించవలెను. ఇప్పుడే, ఈ క్షణమే ఈ పనిని ఆరంభించవలెను. ఇది నా ఆజ్ఞ" అన్నాడు.

ఈ విధముగా భరతుడు చేసిన ఉత్తమోత్తమము అయిన ఆజ్ఞకు అక్కడ సమావేశము అయినవారు అందరూ ఆనందభరితులు అయినారు.

"ఓ రాజపుత్రా! మహాయశా! ఈ రాజ్యాన్ని నీవు జ్యేష్ఠుడికి ఇస్తాను అంటున్నావు కాబట్టి, పద్మాలయ అయిన లక్ష్మి నిన్ను ఎప్పుడూ ఆశ్రయించుకొని ఉంటుంది" అని పరమార్థముగా అక్కడి పెద్దలు అన్నారు.

రాజ్యకర్తలు అందరూ ఆనందబాష్పాలు వదిలినారు. పౌరులూ, అమాత్యులూ ప్రహృష్టులు అయినారు.

"ఓ ప్రభూ! నీ ఆజ్ఞ ప్రకారము దండుబాటను వేయడానికి కర్మకారులను ఇప్పుడే పంపిస్తాను" అని అమాత్యులు అన్నారు.

80

ఆ యా మార్గాలు అన్నీ ఇదివరకు అనేకమార్లు స్వయముగా తొక్కి చూచిన మార్గదర్శకులు మార్గము నిర్ణయిస్తూ ముందు బయలు దేరినారు. వారి వెంట అధ్యక్ష రాజపురుషులూ, మార్గరక్షకులూ, తమ తమ పనులు చేయడములో ఎంతో నిపుణులు అయిన తవ్వకము పనివాండ్లూ, శిబిరాలకూ అగాధము అయిన వాపీకూపజలాలు చేదుకోవడానికీ ఇంకా ఇతర పనులకూ ఉపయోగపడే తాళ్ళు

పేనేవాండ్లూ, ఆ యా భూ ప్రదేశ స్వభావాదులు తెలిసినవాండ్లూ, గ్రామాలూ పట్టణాలూ నిర్మించే శిల్పులూ, వడ్రంగులూ, చెట్లు కొట్టేవాండ్లూ, బావులు తవ్వేవాండ్లూ, సున్నపుపని చేసేవాండ్లూ, వెదుళ్ళతో పుటికలూ, చేటలూ మొదలు అయినవి చేసేవాండ్లూ, మృగాలూ పక్షులూ మొదలు అయిన వాటిని పట్టుకోవడానికి ఉరులు (వలలు) ఒడ్డేవాండ్లూ, తెప్పలూ, ఆ తెప్పలు నడపడానికి తెడ్లు తయారుచేసి వాటిని నడిపేవాండ్లు, మార్గనిర్మాతలూ, కూలిపని వాండ్లూ రాముణ్ణి చూడగలము అనే సంతోషముతో పున్నమినాటి సముద్రము ఉరవడితో దండుబాటను వేయడానికి అసంఖ్యాకముగా సాగిపోయినారు.

మార్గనిర్మాణ నిపుణులు ముందుగా మార్గ నిర్ణయము చేస్తూ నడచినారు. వారి వెంట ఒక్కొక్క గుంపుగా చేరి తమ తమ పనిముట్లతో పనిచేయడము మొదలు పెట్టినారు. కొందరు బాటకు అడ్డము అయ్యే లతలనూ, గుల్మాలనూ, ఎండిపోయిన మోడు చెట్లనూ, ఇంకా రకరకాల పెద్దచెట్లనూ, చిన్న చిన్న తుప్పలనూ, రాళ్ళనూ గడ్డపలుగులతో తవ్వినీ, గొడ్డళ్ళతో నరికివేసినీ, రంపాలతో కోసినీ దారి చేసినారు. కొందరు ఆ బాటకు ఇరువైపులా చెట్టు లేనిచోట చక్కని నీడను ఇచ్చే చెట్లను నాటినారు. ఛేదించడానికి అలవి కాకుండా దట్టముగా ఆ బాటకు అడ్డముగా పెరిగి ఉన్న ఆవురుగడ్డి పొదలను కొందరు నిప్పుపెట్టి దహించి వేసినారు. కొందరు ఆ బాటకు అడ్డము అయిన పాడుపడ్డ బావులనూ, లోతు అయిన గుంటలనూ మంటితో పూడ్చి వేసి బాట మిట్టపల్లాలను సమమట్టము చేసినారు. అడ్డము అయిన ఆ యా నదులకూ, ఏళ్ళకూ కొందరు సేతువులు (వంతెనలు) కట్టినారు. పగలకొట్టవలసిన రాళ్ళను కొందరు పగలకొట్టి వేసినారు. చూర్ణము చేయవలసిన రాళ్ళను కొందరు చూర్ణము చేసినారు. కొందరు ఆ బాట పక్కను పారుతూ ఉన్న చిన్న చిన్న సెలఏళ్ళకు కట్టలుపోసి, పెద్ద సముద్రముల అంతటి జలాశయాలుగా మార్చి వేసినారు. నిర్జల ప్రదేశాలలో ఏనుగులూ, గుర్రాలూ, మనుష్యులూ పోయి నీళ్ళు త్రాగడానికి వీలుగా పెద్ద పెద్ద మెట్లతో నడబావులు నిర్మించినారు. ఆ నడబావులలోనుంచి నీళ్ళు తెచ్చుకొనేటప్పుడు సేద తీర్చుకోవడానికి అక్కడక్కడ అనువు అయిన అరుగులు వేసినారు. ఆ బాటకు సున్నమూ, రాళ్ళూ కలిపి చక్కని చపటా చేసినారు. ఆ బాట పక్కను అక్కడక్కడ విడిది పట్టులు ఏర్పరచినారు. ఆ విడిది పట్టులలో పతాకాలు ఎత్తినారు. చందనోదకముతో కలాపి చల్లినారు. రంగురంగుల పూలతో అలంకరించినారు. ఆ బాట పక్కను ఉన్న చెట్లు అన్నీ విరగపూసినవి. మత్తెక్కిన పక్షులు ఆ చెట్ల కొమ్మలమీద కూర్చుని కుహూనాదాలు చేయసాగినవి. అప్పుడు ఆ మార్గము దేవమార్గమువలె శోభించింది.

అంతట రాజాధికారులు వచ్చి ఆ బాటను చూచి, ఆలోచించి భరతుడికి అభిమతముగా ఉండేటటువంటిన్నీ, రమణీయము అయినటువంటిన్నీ, బహు స్వాదుఫలాలు దొరికేటటువంటిన్నీ, ఆ మార్గానికి అలంకారభూతముగా ఉండేటటు వంటిన్నీ ప్రదేశాలలో శిబిరాలు వేయవలెను అని చెప్పినారు. అంతట ఆ విడిది పట్టులను బంగారు కలశాలతో అలంకరించినారు. జ్యోతిశ్శాస్త్రవిదులు శుభ నక్షత్ర శుభముహూర్తాలు నిశ్చయించినారు. భరతుడు విడిదిచేయడానికి ఆ యా స్థలాలలో శిబిరాలు నిర్మించినారు.

ఆ విడిది పట్టులలో మెత్తని ఇసుక పోసినారు. చుట్టూ అగడ్తలు ఏర్పరచినారు. అవి ఇంద్రకీలపర్వతములవలె తోచినవి. అక్కడ చక్కని వీధులు వేసినారు. సున్నము పూసిన ప్రాకారాలతో దేవాలయాలు నిర్మించినారు. చక్కని రాజవీధులు ఏర్పరచి జెండాలు ఎత్తినారు. ఆకాశాన్ని అంటే విటంకాగ్ర విమానగృహాలు నిర్మించినారు. అప్పుడు ఆ నివేశాలు అన్నీ దేవేంద్రుడి పట్టణమువలె తేజరిల్లినవి.

భరతుడు విడిది చేయడానికి చల్లని స్వచ్ఛజలాలతోనూ, మహామీన సమూహాలతోనూ వివిధ సాంద్రారణ్యాలలోగుండా ప్రవహించే గంగానదీ తీరము వరకున్నూ శిబిరాలు వేసినారు.

మహాశిల్పులు అందరూ ఏకము అయి ఆ మహాత్ముడు భరతుడి కోసము వేసిన దండుబాటా, ఆ యా విడిదిపట్టులూ, ఆ యా శిబిరాలూ రాత్రి నక్షత్రాలతోనూ చంద్రుడితోనూ విరాజిల్లే ఆకాశమువలె కనిపించినవి.

81

ఆనాడు ఆ యా కర్మకారులు భరతుడి ఆజ్ఞలను శిరసావహించి దండుబాట వేయడానికి అడవులకు పోయినారు. వశిష్ఠమహర్షి ఆ మరునాడు భరతుడికి రాజ్యాభిషేకము తలపెట్టి ఆనాడు రాత్రి నాందీముఖాది కార్యకలాపాలు ఆరంభించినాడు. అభ్యుదయ యుక్తము అయిన అపరరాత్రి అయింది.

అప్పుడు సూతవందిమాగధులు భరతుణ్ణి వాగ్విశేషాలతో స్తోత్రముచేస్తూ మంగళగానము ఆరంభించినారు. కనకదండాలతో మ్రోగించినందువల్ల యామ దుందుభులు గంభీరముగా ధ్వనించినవి. వేలకొద్దీ శంఖాలు పూరించినారు. కాహళాది వాద్యాలు వాయించినారు. ఆ శ్రావ్యతూర్యనాదాలు మిన్ను అంటినవి.

భరతుడు మేల్కొన్నాడు. అసలే దుఃఖపడుతూ ఉన్న ఆ మహానుభావుడు ఆ వాద్య ధ్వనులకూ, ఆ మంగళ గానాలకూ మరింత దుఃఖపడ్డాడు. 'నేను రాజును కాను' అంటూ ఆ మంగళ వాద్యాలను ఆన్నింటినీ ఆపి వేయించినాడు. శత్రుఘ్నుణ్ణి

చూచి "తమ్ముడా! మా అమ్మ కైకేయీదేవి ఈ లోకానికి ఎంత అపకారము చేసిందో చూడు. దశరథమహారాజు సమస్త దుఃఖాలూ నాకు వదలిపెట్టి పోయేటట్టు చేసింది. ఆ మహాత్ముడు ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు ఏలిన ధర్మమూలము అయిన రాజ్యలక్ష్మి ఈనాడు చుక్కాని కాసేవాడులేని నౌకవలె సుడులు తిరుగుతున్నది. ఆ పరమపూజ్యుడు మనకు పరమనాథుడు రాముడు, కైక ధర్మము తప్పింది అని తనకు తానే అడవులపాలు అయిపోయినాడు" అంటూ ఒండ్లు తెలియకుండా ఏడువసాగినాడు.

ఆ మహానుభావుణ్ణి చూచి అక్కడి స్త్రీలు అందరూ పెద్దపెట్టున ఏడవడము మొదలు పెట్టినారు.

అదే సమయాన రాజధర్మవేత్త అయిన వశిష్ఠమహర్షి శిష్యగణాలతో సుధర్మ అనే దేవసభవంటి సువర్ణమయమూ, వివిధమణి ఖచితమూ, రమ్యమూ, మనోజ్ఞమూ అయిన ఇక్ష్వాకుల రాజసభా భవనానికి వచ్చినాడు. ఆ మహాశయుడు, ఆ సర్వవేదవిదుడు సుఖాస్తరణాలు పరచిన కనకాసనముమీద కూర్చొని దూతలను రావించి, "ఓ దూతలారా! మీరు వెంటనే పోయి భరతశత్రుఘ్నులను, మేము ఇప్పుడు ఒక ముఖ్యము అయిన కార్యము తలపెట్టినాము అని చెప్పి బ్రాహ్మణులనూ, క్షత్రియులనూ, వైశ్యులనూ, గణాధ్యక్షులనూ, సుమంత్రుడు, విజయుడు మొదలు అయిన మంత్రిపుంగవులనూ, రాజాంతరంగ భృత్యులనూ, ఇంకా ఈ రాజ్యము మేలుకోరేవారిని అందరినీ పిలుచుకొని రావలెను ఆలస్యము చేయవద్దు" అంటూ ఆజ్ఞాపించినాడు.

వశిష్ఠమహర్షి పిలవనంపినవారు అందరూ అప్పటికి అప్పుడు వారి వారి యోగ్యతలకు తగినట్టుగా గుర్రాలమీదనూ, ఏనుగులమీదనూ, రథాలమీదనూ ఎక్కి హలహలధ్వనులతో ఆ సభాభవనానికి వచ్చినారు.

దేవేంద్రుడికి ఎదురుగుండా పోయే దేవతలవలె, ఆ సభకు వచ్చినవారు భరతుడికి ఎదురుగుండా పోయి ఆ సభాభవనములోకి తీసుకొనివచ్చి, పూర్వము దశరథమహారాజును అభినందించినట్టుగా అభినందించినారు.

పెద్ద పెద్ద చేపలతోనూ, నీటిఏనుగులతోనూ, స్తిమితజలాలతోనూ, మహామణులతోనూ, శంఖాలతోనూ, గండ్ర ఇసుకతోనూ సముద్రము దాపలి హ్రదమువలె దశరథమహారాజు పుత్రులు అయిన భరతశత్రుఘ్నులతోనూ, వశిష్ఠమహర్షితోనూ, మంత్రిసత్తములు మొదలు అయిన వారితోనూ రాజసభ దశరథమహారాజు ఉన్నప్పటివలె కళకళ లాడింది.

82

బృహస్పత్యాది శుభగ్రహాలను పూర్ణచంద్రుడు చీకటిలో చూచినట్టు, ఆ సభలో వశిష్ఠాది పూజనీయులను అందరినీ ఆ బుద్ధిమంతుడు భరతుడు చూచినాడు. వారి వారి యోగ్యతలకు తగిన సుఖాసనాలమీద కూర్చున్న ఆ సభాసదుల అంగరాగ కాంతులతోనూ, వస్త్రాభరణ కాంతులతోనూ ఆ సభ, శరత్కాల పౌర్ణమినాటి రాత్రివలె శోభించింది.

ఆ సభకు రావలసిన ముఖ్యులూ, రాజులూ వచ్చి కూర్చుండడము చూచి వశిష్ఠమహర్షి భరతుడితో మృదువుగా, "నాయనా, భరతుడా! నీ తండ్రి ధర్మము తప్పకుండా రాజ్యపాలన చేసినాడు. ధనధాన్యసమృద్ధము అయిన ఈ రాజ్యము నీకు ఇచ్చి దివంగతుడు అయినాడు. నీ అన్న రాముడు సత్యవ్రతుడు. ధర్మమార్గము ఆలోచించినాడు. చంద్రుడు వెన్నెలను వదలిపెట్టనట్టు, తన ధర్మము వదలిపెట్టకుండా పిత్రాజ్ఞను శిరసావహించినాడు. వనవాసము చేయడానికి అడవులకు వెళ్ళిపోయినాడు. అకంటకము అయిన ఈ రాజ్యాన్ని నీ తండ్రీ, నీ అన్నా నీకు ఇచ్చివేసినారు. నీవు ఈ ప్రజారాజ్యాన్ని నిరాటంకముగా, సుఖముగా అనుభవించు. వెంటనే రాజ్యాభిషేకము చేసుకో. మంత్రులు అందరూ సంతోషిస్తారు. మంత్రులేకాదు, నాల్గుదిక్కుల రాజులూ, సముద్రములో ద్వీపాలలో ఉన్న రాజులూ కోట్లకొలది రత్నాలు నీకు కానుకలుగా తీసుకొని వస్తారు. నిన్ను రాజుగా అంగీకరిస్తారు" అని చెప్పినాడు.

ఈ విధముగా వశిష్ఠమహర్షి చెప్పిన మాటలకు భరతుడు దుఃఖములో మునిగిపోయినాడు. అతడు ధర్మజ్ఞుడు. ధర్మము కాంక్షించే అతని మనస్సు అప్పుడు రాముడి మీదికి పోయినది. కన్నీళ్ళు కారుస్తూ ఆ సభామధ్యములో నిలుచున్నాడు. రాముడు తలపుకు వచ్చినకొద్దీ శోకగద్గదకంఠుడు అయినాడు. కలహంస స్వరముతో ఏడుస్తూ, "ఓ మహర్షీ! ఇదేనా మీరు చెప్పే ధర్మము" అంటూ, "ఓ సభాసదులారా! మా అన్న రాముడు విద్యాస్నాతుడు అయినాడు. బ్రహ్మచర్య వ్రతము ఆచరించినాడు. ధర్మానుష్ఠానపరుడు. దశరథమహారాజు తరువాత ఈ రాజ్యము రాముడిది, నాది కాదు. నాబోటివాడు ఎవడూ అపహరించడు. దశరథమహారాజుకు పుట్టినవాడు రాజ్యాపహారకుడు ఎట్లా అవుతాడు? ఈ రాజ్యము రాముడిది, నేను రాముడి మనిషిని, ఓ మహర్షీ! తాము ఈ విషయములో ధర్మమే చెప్పవలెను.

"మహాజనులారా! రాముడు జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు, ధర్మాత్ముడు. దిలీప నహుషాదులవంటివాడు. దశరథమహారాజువలె రాముడే రాజ్యార్హుడు. వాడే ఈ రాజ్యము ఏలవలెను. నేను కాదు. దుష్టులు చేసే పని నేను చేయను. నరకానికి పోయే పని నేను చేయను. నేను ఇక్ష్వాకుల కులపాంసకుణ్ణి కాను. నా తల్లి కైకేయీదేవి ఒడికట్టిన పాపాన్ని నేను సమ్మతించలేదు, సమ్మతించను.

"ఓ మహర్షీ! నేను ఇక్కడనుంచే దుర్గమారణ్యములో ఉన్న రాముడికి చేతులు ఎత్తి నమస్కారము చేస్తున్నాను. ఈ జగత్తులో ఉన్న మానవులు అందరిలోనూ రాముడు శ్రేష్ఠుడు. వాడే రాజు. ఈ రాజ్యమే కాదు, ముల్లోకాలూ ఏలవలసినవాడు రాముడు. నేను ఆ రాముడికి వెనక ఉండవలసినవాణ్ణి. అందువల్ల, వాణ్ణి అనుసరించుకొనే ఉంటాను" అన్నాడు భరతుడు.

భరతుడు ఇంత ధర్మయుక్తముగా మాట్లాడినందుకు సభాసదులు అందరూ సంతుష్టాంతరంగులు అయినారు. అందరి మనస్సులూ రామాసక్తములు అయినవి. అందరూ ఒక్కసారిగా అశ్రువులు వదిలినారు.

"ఓ మహర్షీ! ఓ సభాసదులారా, నేను రాముణ్ణి అడవినుంచి తీసుకొని రావడానికి సంకల్పించుకొన్నాను. నేను ఎంత ప్రార్థించినా ఆ పూజ్యుడు ఇక్కడికి రాకపోయేటట్లయితే, లక్ష్మణుడితో పాటు నేనూ అక్కడనే ఉండిపోతాను. మీరు అందరూ సద్గుణవంతులు, సాధుపుంగవులు. మీరు అందరూ నా వెంట రావలెను. మీ సమక్షములోనే రాముణ్ణి తిరిగి రమ్మని ప్రార్థిస్తాను. బలవంతము చేస్తాను. నా చేత అయినంతపనీ చేస్తాను. సమస్తోపాయాలు వినియోగిస్తాను.

"ఓ మహాజనులారా! రాముడు ఇప్పుడు ఉంటున్న అరణ్యానికి ఒక దండుబాట వేయడానికి నేను మార్గశోధకులను, కర్మకారులను, మార్గరక్షకులను పంపించినాను. వాండ్లు దండుబాటను వేస్తున్నారు. ఇక నేను ప్రయాణము అయిపోవడమే తరువాయి" అంటూ ఆ ధర్మాత్ముడు, భ్రాతృవత్సలుడు భరతుడు తన పక్కను ఉన్న మంత్రికోవిదుణ్ణి చూచి, "ఓ సుమంత్రుడా! నేను రామయాత్రకు పోతున్నాను అనీ, నా వెంట అయోధ్య పౌరులు అందరూ రావలసింది అని చాటించు. చతురంగబలాలు వెంటనే ప్రయాణము కావలెను అని నేను ఆజ్ఞాపించినాను అని చెప్పు. లే, వెంటనే ఇప్పుడే బయలుదేరవలెను" అన్నాడు.

భరతుడి శాసనాన్ని సుమంత్రుడు సేనాధ్యక్షులకూ, పౌరముఖ్యులకూ తెలియచేసినాడు. వారు అందరూ సంతోషముతో ఉప్పొంగిపోయినారు. యోధాంగనలు తమ భర్తలను ప్రయాణ సన్నద్ధులను చేసినారు. గుర్రాలతోనూ, రథాలతోనూ, ఏనుగులతోనూ, వడిగా పోయే ఎద్దుబండ్లతోనూ చతురంగబలాలు ప్రయాణానికి సంసిద్ధము అవుతూ ఉన్నవి అని సేనాధ్యక్షులు పోయి భరతుడికి విన్నవించినారు.

గురుసన్నిధిలో ఉన్న భరతుడు సుమంత్రుణ్ణి చూచి, "నాయనా! రథము వెంటనే తీసుకొని రావలసింది" అన్నాడు. సుమంత్రుడు పోయి ఉత్తమాశ్వాలు పూంచిన రథాన్ని అప్పటికప్పుడు అక్కడికి తోలుకొని వచ్చినాడు.

అప్పుడు ఆ మహాప్రతాపుడు, ఆ దృఢవిక్రముడు, ఆ మహాధైర్యవంతుడు, ఆ సత్యవంతుడు భరతుడు సుమంత్రుణ్ణి చూచి, "ఓ మంత్రి సత్తమా! వనవాసము చేస్తూ ఉన్న రాముణ్ణి ప్రసన్నుడిని చేసుకొంటాను. లోకహితము కోసము ఇక్కడికి తీసికొని వస్తాను. తెల్లవారుతూనే ప్రయాణము అయిపోవలెను. మీరు చతురంగ బలాలనూ, సేనాధ్యక్షులనూ వెంటపెట్టుకొని ప్రయాణము అయి పోవటానికి సిద్ధముగా ఉండవలెను" అన్నాడు.

సుమంత్రుడు సంపూర్ణ కాముడు అయినాడు. సేనాధ్యక్షులూ, పౌరముఖ్యులూ, ఇంకా ఇతర మిత్రులూ ప్రయాణము అయి పోవడానికి ఏర్పాట్లు చేయసాగినాడు.

భరతుడి వెంట ప్రయాణము అయిపోవడానికి ఇంటింటినుంచీ బ్రాహ్మణులూ, క్షత్రియులూ, వైశ్యులూ, శూద్రులూ గుర్రాలనూ, ఏనుగులనూ, ఎద్దులనూ, ఒంటెలనూ, కంచరగాడిదలనూ సిద్ధము చేసుకోవడము మొదలుపెట్టినారు.

83

భరతుడు అరణ్యమున కేగుట

భరతుడు ఉషఃకాలాననే నిద్రలేచినాడు. రాముణ్ణి అడవిలో నుంచి తీసికొనిరావడానికి, ఉత్తమోత్తమము అయిన రథముమీద ప్రయాణము అయినాడు. అతని రథానికి ముందు సూర్యుడి రథమువంటి రథాలమీద మంత్రులూ, పురోహితులూ బయలుదేరినారు.

భరతుడు ఆజ్ఞాపించినట్టుగా ఏరికోరిన ఏనుగులు, ఒక తొమ్మిదివేలతో గజసాదులూ, అరవై వేల రథాలతో రథికులూ, ఒక లక్ష గుర్రాలతో అశ్వికులూ, ఇంకా వివిధాయుధధారులూ, ధానుష్కులూ భరతుణ్ణి వెంబడించినారు.

రాముణ్ణి తీసుకొని రాగలము అనే సంతోషముతో కైకేయీదేవీ, సుమిత్రాదేవీ, కౌసల్యాదేవీ మేనాలతో భరతుడి వెనక పోయినారు.

రాముణ్ణి గురించి కథలు చెప్పుకొంటూ ఆ మేఘశ్యాముడిని, ఆ స్థిరసత్వుణ్ణి, ఆ మహానుభావుణ్ణి, ఆ దృఢవ్రతుణ్ణి, ఆ లోకసంగ్రహకర్తను ఉదయిస్తున్నంత మాత్రాననే సమస్తలోకాల చీకట్లూ పోకొట్టే సూర్యుడివలె, దర్శించినంతమాత్రాననే సమస్త దుఃఖాలూ పోగొట్టే ఆ రాముణ్ణి, ఎప్పుడు ఎప్పుడు చూస్తామా అనే కుతూహలముతో ఆయోధ్యా పౌరులు అందరూ గుంపులు గుంపులుగా భరతుడి వెనకనూ, ముందూ తొందర తొందరగా నడచినారు.

ఆ యా వస్తువులు అమ్మే వర్తకులూ, రత్నాలకు సానపెట్టే వాండ్లూ, ఆయుధాలు చేసి బ్రతికేవాండ్లూ, కుండలు చేసే కుమ్మరివాండ్లూ, నెమలి పింఛాలతో

విసనకర్రలు కట్టేవాండ్లూ, రంపకారూ, తిన్నెలూ, గోడలూ మొదలు అయిన వాటికి వన్నెలు తీర్చిదిద్దేవాండ్లూ, రత్నాలకు, కొయ్యలు మొదలు అయిన వాటికి బెజ్జాలు వేసేవాండ్లూ, దంతపుపని చేసేవాండ్లూ, సున్నపుపని చేసేవాండ్లూ, బంగారపుపని చేసేవాండ్లూ, మద్యాలు చేసేవాండ్లూ, చాకలివాండ్లూ, కుట్టుపని చేసేవాండ్లూ, వైద్యులూ, సుగంధద్రవ్యాలు చేసేవాండ్లూ, ధూపాలు వేసేవాండ్లూ, ఒండ్లు పట్టేవాండ్లూ, తలంట్లు పోసేవాండ్లూ, నావలు నడిపేవాండ్లూ, నట్టువరాండ్లతో నాటకాలు ఆడేవాండ్లూ, ఇంకా ఆ యా గ్రామముఖ్యులూ, ఆ యా జనపదముఖ్యులూ రామసందర్శన కుతూహలముతో భరతుడివెంట సాగిపోయినారు.

యోగనిష్ఠులూ, వేదవిదులూ, సదాచారసంపన్నులూ అయిన బ్రాహ్మణోత్తములు వేలకువేలుగా ఎద్దులబండ్లమీద భరతుడివెంట పోయినారు. ఆ యాత్రికులు అందరూ చక్కగా అలంకరించుకొని, రక్తచందనము పూసుకొని, తెల్లటి గుడ్డలు కట్టుకొని ఘుమ ఘుమ వాసనలు వెదజల్లుతూ భరతుడి సైన్యాలతో నడచినారు.

పొద్దు ఏటవాలుతూ ఉంది. హంసలూ, బెగ్గురుపక్షులూ, చక్రవాకపక్షులూ కుహూనాదాలు చేస్తూ ఉన్న గంగాతీరము చూచినారు. రాముడి మిత్రుడు హెచ్చరికతో రాజ్యము ఏలుతూ ఉన్న ప్రాంతము అది. అక్కడికి సమీపములోనే శృంగిబేరపురము ఉంది. అక్కడ భరతుడి సేనలు ఆగిపోయినవి.

మంగళజలాలతో ప్రవహిస్తూ ఉన్న గంగానదిని భరతుడు చూచినాడు. అమాత్యులతో "మన సేనలు ఈ రాత్రి ఇక్కడ విడిదిచేసి అలసట తీర్చుకోవచ్చును. రేపు ఉదయము మనము గంగానదిని దాటి పోవచ్చును. మా తండ్రి దశరథమహారాజుకు ఈ గంగాజలాలతో తర్పణము వదులుతాను" అన్నాడు భరతుడు. అంతట అమాత్యులు సేనకున్నూ తక్కిన పరివారానికిన్నీ వేరే వేరే విడుదులు ఏర్పాటు చేసినారు. అందరూ ఆ విడుదులలో దిగి, వారి వారి పనులలో నిమగ్నులు అయినారు.

అప్పుడు భరతుడు రామున్ని తీసుకొని వచ్చే విషయాన్ని గురించే ఆలోచించ సాగినాడు.

84

గుహుడు భరతునితో సంభాషించుట

గంగానది గట్టున దిగిన సేనలను గుహుడు చూచినాడు. ఆ నిషాదరాజు వెంటనే జ్ఞాతిజనాన్ని సమావేశపరచి, "అదిగో, గంగానదీ తీరాన సముద్రము అంత సేన కనపడుతున్నది. ఎంత పారచూచినా దాని అంతు తెలియడములేదు. కంటికే

కాదు, దాని అంతు ఊహకు అయినా అందడము లేదు. అదిగో, రథముమీద కోవిదారధ్వజము కనపడుతూ ఉంది. తప్పకుండా భరతుడి సైన్యము అయి ఉంటుంది. అతడు సద్బుద్ధితో బయలు దేరినట్లయితే ముందుగా మనకు వర్తమానము చేసి ఉండేవాడు. అతడు దుర్బుద్ధితో రాముడి కోసము పోతున్నట్టు నాకు తోస్తున్నది. మనము వెంటనే ఎదుర్కొనకూడదు. అట్లా చేసేటట్లయితే అతడు మనవాండ్లను అందరినీ బంధించివేయ వచ్చును లేదా మనలను అందరినీ చంపివేయ వచ్చును.

దశరధమహారాజు రాముడిని అడవులకు పొమ్మన్నాడు. అందువల్ల దుర్లభము అయిన రాజ్యము భరతుడిపాలు అయింది. ఈ కైకేయీ పుత్రుడు ఇప్పుడు రాముడిని చంపివేయడానికి పోతున్నట్లుగా నాకు తోస్తూ ఉంది. రాముడు మనకు ప్రభువు. నాకు పరమాప్తుడు. అతని ప్రయోజనాన్ని మనము చక్కబెట్టవలెను. మీరు అందరూ వెంటనే యుద్ధసన్నద్ధులు కావలెను. మాంసాన్నీ, ఫలమూలాలనూ, ఇంకా ఇతర ఆహార పదార్థాలనూ తీసుకొని మనసేనలతో గంగాతీరాన కాపు ఉండండి. అయిదువందల నావలెను గరగానెదలో సిద్ధముగా ఉంచండి. ఒక్కొక్క నావలో ఒక్కొక్క వందమంది యోధులను యుద్ధ సన్నద్ధులుగా ఉంచండి. భరతుడికి దుర్బుద్ధి లేకపోయేటట్లయితే అతని సేనలను సుఖముగా గంగానదిని దాటింతాము. అట్లా కాని పక్షములో ఏమి చేయవలసిందీ నేను నిర్ణయిస్తాను" అన్ని చెప్పి, వారిని పంపించి వేసినాడు.

అంతట గుహుడు మత్స్య మాంస మధువులను కానుకలుగా తీసుకొని భరతుడిని చూడపోయినాడు. అట్లా వస్తూ ఉన్న గుహుడిని సుమంత్రుడు చూచినాడు. ఆ మంత్రిపుంగవుడు వినయజ్ఞుడు మాత్రమే కాదు, నయజ్ఞుడు. వెంటనే భరతుడి దగ్గరకు పోయి, "రాజపుత్రా! గుహుడు అమాత్యులతో ఇక్కడికి వస్తూ ఉన్నాడు. అతడు ఈ ప్రాంతానికి ప్రభువు. మీ అన్న రాముడికి పరమాప్తుడు. అతనికి ఒక వెయ్యిమంది జ్ఞాతులు ఉన్నారు. వారే కాకుండా అతని కొలువులో అనేకమంది ఆరితేరిన ధానుష్కులు ఉన్నారు. వారి అందరి సాయముతో ఆతడు ఈ అరణ్య ప్రాంతాన్ని పరిపాలిస్తున్నాడు. అతడు వృద్ధుడు. దండకారణ్యము అంతా చక్కగా ఎరిగినవాడు. సీతారామలక్ష్మణులు ఇప్పుడు ఎక్కడ ఉంటూ ఉన్నదీ చెప్పకలవాడు ఆతడు ఒక్కడే. అతడు ఇప్పుడు మిమ్ములను చూడడానికి వస్తూ ఉన్నాడు. మీరు అతనికి వెంటనే దర్శనము ఈయవలెను" అని చెప్పినాడు.

గుహుణ్ణి వెంటనే తన దగ్గరకు తీసుకొని రమ్మని భరతుడు సుమంత్రుడితో చెప్పినాడు. తనను చూడడానికి భరతుడు వెంటనే అనుజ్ఞ ఇచ్చినందుకు గుహుడు సంతోషించినాడు. అతడు తన అమాత్యులతో భరతుడి దర్శనము చేసినాడు.

వినయము ఉట్టిపడుతూ, "ప్రభూ! ఈ ప్రాంతము మీ గృహారామము వంటిది. మీరు వస్తున్నారు అని మాకు ముందుగా తెలియలేదు. అందువల్ల, ఎవరో అని మేము మోసపోయినాము. మీ సేనలూ, మీరూ విడిది చేసిన తరువాత మీరు అని మాకు తెలిసింది.

"ప్రభూ! తాము ఈ దాసుడి ఇంటికి రావలెను. మేము అందరమూ మనవి చేసుకొంటున్నాము. మేము బోయవాండ్లము. మేము సంపాదించుకొన్న పండ్లూ, కందమూలాలూ, ఎండపెట్టి నిలువచేసుకొన్న మాంసమూ, తడిమాంసమూ, ఇంకా ఈ అడవిలో పండుతూ ఉన్న రకరకాల ధాన్యాలూ మా ఇంట సమృద్ధముగా ఉన్నవి. తమకు ఇష్టము అయిన పదార్థాలతోనే తమను మేము సత్కరిస్తాము. మీ సేనకు మేము భోజనము పెట్టుతాము. ఈ రాత్రి మీరూ, మీ సేనాసమూహమూ మా ఇంట ఉండిపోవలెను. రేపటిదినము తాము తమ సైన్యముతో కూడా సుఖముగా పోవచ్చును" అని చెప్పినాడు గుహుడు.

85

ఆ మహాప్రాజ్ఞుడు భరతుడు గుహుడు చెప్పింది విన్నాడు. అంతట సహేతుకముగానూ, సప్రయోజనముగానూ, "రామసఖా! నీవు నాకూ, నా ఇంత సైన్యానికీ విందు చేస్తాను అంటున్నావు. ఆ మాటే చాలు. నీ కోరిక నెరవేరినట్టే. మమ్ములను అందరినీ నీవు ఎంతో చక్కగా సత్కరించినట్టే సంతోషిస్తున్నాను" అంటూ గుహుణ్ణి మెచ్చుకొని, "ఓ గుహుడా! మాకు కావలసింది నీ అన్నము కాదు, నీ ఆదరణ. నీవు మమ్ములను ఆదరిస్తే చాలు. మేము ఇక్కడినుంచి భరద్వాజాశ్రమము పోవలెను. ఈ ప్రదేశము అంతా దుర్గమారణ్యముగా ఉంది. ఈ మహాగంగాప్రవాహాన్ని ఇంతసైన్యముతో, ఇంత జనసమూహముతో దాటి పోవడము ఎట్లాగో తెలియక తికమకపడుతున్నాను" అన్నాడు భరతుడు.

ఆ గహన గోచరుడు గుహుడు చేతులు జోడించి, "మహాశయా! మా దాశవాండ్లు విల్లంబులతో మీవెంట నడుస్తారు. నేను మీవెంట ఉంటాను. మార్గాన్ని గురించి మీరు ఏమాత్రమూ చింతించ నక్కర లేదు.

"రామప్రభువు ఎన్నడూ ఎవరినీ కష్టపెట్టడు. దుఃఖపెట్టడు. బాధపెట్టడు. అటువంటి మహానుభావుణ్ణి చూడడానికి, ప్రభూ! తాము ఇప్పుడు ఇంత సైన్యముతో ఎందుకు పోతున్నారు? నా ఈ సందేహము తామే తీర్చవలెను" అని ప్రశ్న వేసినాడు.

గుహుడు తనను సందేహిస్తున్నందుకు భరతుడికి కోపము రాలేదు. అతడు ఆకాశమువలె నిర్మలుడు. మృదువుగా, "ఓ నిషాదుడా! నన్ను శంకించవద్దు. రాముడు

నా జ్యేష్ఠభ్రాత. నా తండ్రి తరువాత నాకు అతడే తండ్రి. అతనిని తిరిగి అయోధ్యకు తీసుకొని రావలెను అని నేను ఇట్లా బయలుదేరినాను. యధార్థము. నేను అబద్ధము చెప్పను. నీవు ఇంకొకవిధముగా ఆలోచించవద్దు. ఆ మహానుభావుని తిరిగి తీసుకొనిపోవడానికే నేను ఇంతసైన్యముతో పోతున్నాను. ఆ ధర్మాత్ముడు నా ఒక్కడి మాట వినకపోయినా, వీరి అందరి మాట వినకపోతాడా అని నేను ఇంతమందితో పోతున్నాను"అన్నాడు.

ఈ మాటలకు గుహుడు సంతుష్టుడు అయినాడు. ప్రసన్నవదనముతో "ఓ భరతప్రభూ! నీవు నిజముగా పుణ్యపురుషుడవు. అప్రయత్నముగా ప్రాప్తించిన రాజ్యాన్ని త్యజించి వేస్తాను అంటున్నావు. ఈ జగత్తులో నీవంటి ధర్మాత్ముణ్ణి నేను ఇదివరకు ఎక్కడనూ చూడలేదు. అడవులపాలు అయి కష్టపడుతున్న రామప్రభువును తీసుకొనివచ్చి, రాజ్యము ఇచ్చి సుఖపెట్టవలెను అనుకొంటున్నావు. సంతోషము. నీ కీర్తి సమస్త లోకాలలోనూ శాశ్వతముగా ఉంటుంది" అన్నాడు.

గుహుడు ఇట్లా మాట్లాడుతూ ఉండగా సూర్యాస్తమయము అయింది.

రాత్రి పడిపోయింది. భరతుడు తన సేనలు ఎక్కడ ఎక్కడ ఉండవలసిందీ నియమించినాడు. గుహుడు వారికి అందరికీ కావలసిన ఏర్పాట్లు అన్నీ చేసి భరతుణ్ణి సంతోషపెట్టినాడు. భరతుడూ, శత్రుఘ్నుడూ పడుకొన్నారు.

ఆ మహాధైర్యవంతుడు, ఆ ధర్మపరాయణుడు, ఆ ఆగర్భశ్రీమంతుడు భరతుడు ఏ పాపమూ ఎరగడు. ఏ దుఃఖమూ అనుభవించవలసినవాడు కాడు.

అడవిలో మహావృక్షాన్ని కార్చిచ్చు మంటలు అలుముకొని బయటనూ, తొర్రలో పడ్డ నిప్పుకణము రగులుకొని లోపలనూ దహించి వేసేటట్టు, రామ చింతామయము అయిన శోకవహ్ని భరతుణ్ణి దైహికముగానూ, మానసికముగానూ దహించివేయ సాగింది.

సూర్యకిరణాల వేడికి హిమవత్పర్వతమునుంచి నీళ్ళు కారినట్టు, దుఃఖాగ్నికి భరతుడి దేహమునుంచి చెమటలు కారడము మొదలు పెట్టినవి.

రామచింతామయము అయిన శోకము పర్వతాకారాన భరతుణ్ణి ఆవరించింది.

రామవిషయక ధ్యానపరంపరలు పగలకొట్టను అలవికాని పెద్ద పెద్ద రాతిబండలు అయి, నిట్టూర్పులు నానావిధ ధాతువులూ అయి, దైన్యము వృక్షసమూహము అయి, శోకాయాసమూ మనోవ్యధా శిఖరాలు అయి, మధ్య మధ్య వచ్చే మూర్ఛలు క్రూరమృగ సమూహాలు అయి, సంతాపము చొరను అలవికాని

వెదురు పొదలూ ఓషధులూ అయి, ఆ దుఃఖము మహాపర్వతము అయి భరతుణ్ణి అణచివేసింది.

భరతుడు ఈవిధముగా మనోజ్వరముతో బాధపడుతూ, మనోవ్యథతో నిట్టూర్పులు విడుస్తూ ఆలమందనుంచి తప్పిపోయి అడవినపడ్డ ఆబోతువలె కంపించిపోతూ ఉంటే గుహుడున్నూ దుఃఖపడుతూ, సీతారామలక్ష్మణులను గురించి చెప్పుతూ అతనిని ఓదార్చ సాగినాడు.

86

ఆ గహనగోచరుడు గుహుడు ముందుగా లక్ష్మణుడి సద్భావాన్ని గురించి చెప్పతలచి, "ఓ భరత ప్రభూ! ఆనాటి రాత్రి సీతారాములు నిద్రపోతున్నారు. లక్ష్మణుడు శరచాపాసిధారుడు అయి కనురెప్పలు ఆర్పకుండా కావలి కాస్తూ ఉన్నాడు. రాత్రి చాలా పొద్దుపోయింది. నేను అప్పుడు లక్ష్మణుడితో, 'నాయనా! ఈ శయ్య నీకోసము అమర్చినాను. నీవు చాలా అలసిపోయి ఉన్నావు. పడుకొని హాయిగా నిద్రపో. నీ బడలిక అంతా వదలిపోతుంది. నీవు సుకుమారుడవు. సుఖము అనుభవించవలసిన వాడవు. మేము ఎటువంటి కష్టము నయినా ఓర్చుకోగలవాండ్లము. మేము కావలి ఉంటాము. నాకు ఈ లోకములో రాముడికన్నా ప్రియమిత్రుడు మరి ఒకడు లేడు. నేను నిజము చెప్పుతున్నాను, ఈ రాముడి అనుగ్రహమువల్ల నేను ధర్మమూ, అర్థమూ, యశస్సూ సంపాదించినాను. ఇటువంటి ప్రియసఖుడు భార్యాసహితముగా నిద్రపోతూ ఉంటే నేను కావలి కాయకుండా ఉండను. నేనూ, నా అనుచరులూ విల్లంబులతో తెల్లవార్లూ కావలి ఉంటాము. నేను ఎప్పుడూ ఈ అడవిలో ఉండేవాణ్ణి. ఇక్కడ నేను ఎరుగంది ఏమీ లేదు. చతురంగబలాలు వచ్చినా ఇక్కడ, ఈ అరణ్యములో మమ్ములను ఏమీ చేయలేవు. నీవు భయపడ నక్కరలేదు. ఓ లక్ష్మణా! నా మాట విను. నీవు హాయిగా నిద్రపో' అని చెప్పినాను.

"లక్ష్మణుడు నన్ను చూచి, 'దశరధమహారాజు పుత్రుడు రాముడు భార్యాసహితముగా నేలమీద ఇట్లా పడుకొని ఉంటే, బ్రతికి ఉండడమే నాకు కష్టముగా ఉంది. ఇక నేను నిద్రపోవడము ఎట్లాగు? సుఖపడడము ఎట్లాగు? దేవాసురులు అందరూ ఏకము అయి ఎత్తి వచ్చినా మా అన్నను జయించలేరు. అటువంటి మహా పరాక్రమవంతుడు భార్యతో కూడ పచ్చికనేలమీద పడుకొని ఉన్నాడు, చూడు. దశరథమహారాజు మహాతపస్సు చేస్తే, ఎన్నో వ్రతాలు పట్టితే, ఇంకా ఎన్నో యజ్ఞాలు చేస్తే ఆయనకు ఈ రాముడు పుత్రుడుగా పుట్టినాడు. ఆ మహానుభావుడి సమస్త సద్గుణాలూ ఈయనలో మూర్తీభవించినవి. ఇప్పుడు ఇతడు

వనవాసానికి వచ్చినాడు. ఇక దశరథమహారాజు బహుకాలము జీవించడు. ఇక కోసల రాజ్యము వైధవ్యము అనుభవిస్తుంది, తప్పదు. అంతఃపురాంగనలు అందరూ ఏడ్చి ఏడ్చి ఊరుకుంటారు. రాజభవనము పాడుపడిపోతుంది.

"ఓ గుహుడా! మా పెత్తల్లి కౌసల్యాదేవి ఇక బ్రతకదు. ఆమె పోయిన తరువాత, దశరథమహారాజు ఒక్క క్షణము అయినా జీవించి ఉండలేడు. వాండ్లు ఇద్దరూ పోయిన తరువాత, మా అమ్మ సుమిత్రాదేవి బ్రతికి ఉండడము ఉత్తది. ఒకవేళ బ్రతికి ఉండేటట్లయితే, ఈ ముగ్గురూ ఈ రాత్రి మాత్రము బ్రతికి ఉంటారు. ఆతరువాత బ్రతకరు. మా అమ్మ శత్రుఘ్నుణ్ణి చూచుకొని బ్రతికితే బ్రతకవచ్చును. కౌసల్యాదేవి మాత్రము చచ్చిపోక తప్పదు. ఆమె జీవించదు.

"ఓ గుహుడా! అంతా అయిపోయింది. అంతా వ్యర్థము అయిపోయింది. మా తండ్రి దశరథమహారాజు రాముడి రాజ్యాభిషేకము చేయవలెను అనుకొన్నాడు. ఆ కోరిక ఈడేరకుండానే ఆయన చనిపోతాడు. ఆయన అవసాన కాలములో ఆయన దగ్గర భరత శత్రుఘ్నులే ఉంటారు. వాండ్లే ప్రేతకార్యాలు అన్నీ చేస్తారు. వాండ్లే ధన్యులు.

"రమ్యచతుష్పథాలతోనూ, సువిభక్త రాజమార్గాలతోనూ, హర్మ్యప్రాసాదాల తోనూ, సర్వరత్నభూషణాలతోనూ, గజాశ్వ రథసమూహాలతోనూ, తూర్యనినాదాల తోనూ, హృష్టపుష్టజనసమూహాలతోనూ, సర్వకళ్యాణాలతోనూ, ఆరామోద్యానవనాల తోనూ ఉంటూ ఉన్న మా తండ్రిగారి రాజధానీ నగరములో వాండ్లు ఆ భరత శత్రుఘ్నులు సంతోషముగా సంచరిస్తారు, విహరిస్తారు. వాండ్లు భాగ్యవంతులు.

"ఓ గుహుడా! రాముడు చేసిన ప్రతిజ్ఞ ప్రకారము మేము పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేసి క్షేమముగా ఉంటే, అప్పుడు మేము రాముడితో సుఖముగా అయోధ్యకు పోగలుగుతాము. అట్లా జరుగుతుందా?" అని లక్ష్మణుడు పరిదేవనము చేస్తూ ఉండగా ఆ రాత్రి తెల్లవారింది.

"సూర్యోదయము అయిన తరువాత రామలక్ష్మణులు ఈ గంగాతీరాన జటలు ధరించినారు. నేను ఏర్పాటు చేసిన నావలో వారు ఈ గంగానదిని దాటినారు. అంతట అవతలి గట్టున ఆ మహాబలవంతులు, జటావల్కలధారులు శరచాపాసిధారులు అయి సీతను వెంటపెట్టుకొని హెచ్చరికతో నడచిపోయినారు.

87

"రామలక్ష్మణులు గంగాతీరాన వల్కలాలకు తోడు తలవెంట్రుకలు జటలుగా ధరించి ప్రయాణము అయిపోయినారు" అని గుహుడు చెప్పగానే, భరతుడు తాను

చేస్తున్న ప్రయత్నము సఫలము అవుతుందో, విఫలము అవుతుందో అనే ఆలోచనలో పడ్డాడు. అతని మనస్సు పరిపరివిధాల పోయింది. అతనికి దుఃఖము వచ్చింది. ఆ సుకుమారుడు, ఆ మహాబలవంతుడు, ఆ సింహస్కంధుడు, ఆ మహాభుజుడు, ఆ పుండరీకవిశాలాక్షుడు, ఆ ప్రియదర్శనుడు, ఆ తరుణుడు భరతుడు దుఃఖాన్ని బిగపట్టలేక పోయినాడు. బరిసెల పోట్లకు ఏనుగువలె నేలమీద పడిపోయినాడు. పక్కను ఉన్న శత్రుఘ్నుడు భరతుణ్ణి కౌగిలించుకొని లేవతీయ పోయినాడు. భరతుడు తెప్పరిల్లలేదు. భరతుడి దురవస్థకు శత్రుఘ్నుడు శోకపీడితుడు అయి ఎలుగెత్తి ఏడవసాగినాడు. పెనిమిటి పోయి, శోకపీడితులు అయి ఉపవాసాదులతో కృశించిపోయి ఉన్న రాజపత్నులు అందరూ భరతుడి చుట్టూ మూగి ఏడవడము మొదలుపెట్టినారు.

అందరికన్నా ఎక్కువగా దుఃఖపడుతూ ఉన్న కౌసల్యాదేవి అప్పుడు భరతుణ్ణి ఆవు తన దూడనువలె కౌగిలించుకొని, "నాయనా! భరతుడా, నీ ఒంట్లో బాగాలేదా, నేలమీద పడిపోయినావు? మా అందరి ప్రాణాలూ నీమీద ఆధారపడి ఉన్నవి. రామలక్ష్మణులు అడవులకు పోయినప్పటికిన్నీ, నీ తండ్రి స్వర్గతుడు అయిపోయినప్పటికిన్నీ, నీవు ఉన్నందువల్ల నిన్ను చూచి మేము బ్రతికి ఉన్నాము. మాకు అందరికీ ఇప్పుడు నీవే దిక్కు. నాయనా! లక్ష్మణుణ్ణి గురించి కానీ, ఏకపుత్రుడు అయిన నా పిల్లవాడు రాముణ్ణి గురించికానీ, నా కోడలిని గురించి కానీ ఏది అయినా అప్రియము విన్నావా" అని అడిగింది.

అంతట ఆ మహాయశుడు తెప్పరిల్లి, "అటువంటిది ఏమీ లేదు" అంటూ కౌసల్యాదేవిని ఓదార్చి గుహుణ్ణి చూచి, "ఓ స్థపతీ! ఆనాడు రాత్రి మా అన్న రాముడు ఎక్కడ ఉన్నాడు? లక్ష్మణుడు ఎక్కడ ఉన్నాడు? సీతాదేవి ఏమి చేసింది? ఆ రాత్రి వాండ్లు ఏమి తిన్నారు? ఎక్కడ పడుకొని నిద్రపోయినారు? నాకు వివరముగా చెప్పవలెను" అని అడిగినాడు.

"ప్రభూ! రాముడు, ఈ నా ప్రాంతము వచ్చినాడు అని తెలియగానే, నేను ఆ మహానుభావుడి కోసము రకరకాల అన్నాలూ, భక్ష్యాలూ, ఇంకా ఎన్నోరకాల పండ్లూ పట్టుకొని వచ్చినాను. ఆ సత్యపరాక్రముడు రాముడు వాటిని అన్నిటినీ మళ్ళీ నన్నే తీసుకొని పొమ్మన్నాడు. ప్రతిజ్ఞాపరిపాలన కోసము తాను అవలంబించిన ధర్మాన్ని పట్టి, తాను కానుకలు స్వీకరించడానికి వీలు లేదు అని చెప్పినాడు. లక్ష్మణుడు తెచ్చిన గంగా పవిత్రోదకాలను మాత్రము సీతారాములు పుచ్చుకొన్నారు.

"సీతారామలక్ష్మణులు ముగ్గురూ ఏకాగ్రచిత్తముతో సాయంసంధ్యను ఉపాసించినారు. ఆతరువాత లక్ష్మణుడు కుశలు తెచ్చి శయ్య అమర్చినాడు. సీతారాములు ఆ దర్భ శయ్యమీద పవ్వళించినారు.

"ఆ రాత్రి వారు ముగ్గురూ ఉపవాసము ఉన్నారు.

"సీతారాములు ఆ రాత్రి పడుకొన్నది అదిగో, ఆ గారచెట్టు కిందనే. ఆ కనపడుతున్నదే వారు పడుకొన్న దర్భశయ్య.

"సీతారాములు పడుకొన్న తరువాత లక్ష్మణుడు అంగుళీత్రాణమూ, హస్తకవచమూ తొడుగుకొని, వీపున రెండు అమ్ములపొదులు కట్టుకొని, ఎక్కుపెట్టిన ధనుస్సు పట్టుకొని రెప్ప వాల్చకుండా సీతారాముల చుట్టూ తిరుగుతూ కావలి కాయడము మొదలు పెట్టినాడు. నేనూ, నా అనుచరులూ విల్లంబులు పట్టుకొని ఆ లక్ష్మణుడి వెనుక తిరుగుతూ దేవేంద్రుడివంటి మీ అన్న రాముణ్ణి కావలి కాసినాము' అన్నాడు గుహుడు.

88

భరతుడూ, మంత్రులూ గుహుడు చెప్పింది అంతా విన్నారు. అంతట భరతుడు మంత్రులు అందరినీ వెంటపెట్టుకొని ఆ గారచెట్టు దగ్గరకు పోయినాడు. రాముడు పడుకొన్న తృణశయ్యను చూచినాడు. తల్లులను అందరినీ పిలిచి, "ఓ తల్లులారా! ఆ పరమపూజ్యుడు రాముడు ఆనాడు రాత్రి పడుకొన్నది ఈ శయ్యమీదనే. శయ్య అంతా నలిగి పోయింది. గడ్డి అంతా చెల్లాచెదరు అయిపోయింది. మహాభాగ్యవంతుల వంశములో ఇక్ష్వాకువు పుట్టినాడు. ఆ ఇక్ష్వాకు వంశములో మహాభాగ్యవంతుడూ, ధీమంతుడూ అయిన దశరథమహారాజుకు జ్యేష్ఠపుత్రుడుగా పుట్టిన రాముడు ఇక్కడ, ఈ నేలమీద పడుకొన్నాడు. ఇట్లా ఎంతమాత్రమూ జరిగి ఉండవలసింది కాదు.

"మేరుపర్వతమువలె కనిపించే విమానాకార ప్రాసాదాగ్ర భాగాలలో, తెల్లటి మబ్బువలె కనిపించే కూటాగారాలలో, బంగారు, వెండి తాపటము చేసిన చోట, రంగురంగుల పూలతో అలంకరించినచోట, చందనాగరు సుగంధ ధూపవాసనలు గుబాళించేచోట, పెంపుడు చిలుకలు పాటలు పాడేచోట, బయటనుంచి సుగంధముతో చల్లగాలి వీచేచోట, బంగారు గోడల మధ్య శ్రేష్ఠము అయిన ఆస్తరణాలు పరచిన శయ్యమీద పడుకొని సుఖముగా నిద్రపోయి శ్రావ్యము అయిన గీతాలు పాడుతూ ఉంటే, వీణాది జంత్ర వాద్యాలు అంతకన్నా మనోహరముగా మోగుతూ ఉంటే పరిచారికల మేఖలనూపురాద్యాభరణాల చప్పుళ్ళు అవుతూ ఉంటే, మృదంగ ధ్వనులు గంభీరముగా చెలరేగుతూ ఉంటే నిద్ర మెలకువ వచ్చి వందిజనుల స్తోత్రపాఠాలు వింటూనూ, సూతమాగధుల వంశావళి కీర్తనము వింటూనూ, మధుర మంగళగానము వింటూనూ, సంతోషముతో నిద్రలేచే ఆ పరంతపుడు రాముడు ఇక్కడ ఈ

గారచెట్టుకింద పడుకొని నిద్రపోయినాడా? ఇది అంతా నిజమేనా? నేను కలకంటున్నానా లేక నా బుద్ధి భ్రమిస్తున్నదా?

"ఇంతకూ దైవముకన్నా కాలమే బలవత్తరము. దశరథమహారాజు కొమారుడు రాముడు నేలమీద పడుకొన్నాడు. కాలమహిమ! అంతటివాడికి అంత దురవస్థ పట్టింది.

"జనకమహారాజు కూతురు, దశరథమహారాజు కోడలు, రాముడి ఇల్లాలు, లోకానికి అంతటికీ కన్నులపండువుగా కనిపించే సీతాదేవి ఇక్కడ, ఈ నేలమీద పడుకొన్నదా? ఇది మా అన్నగారు పడుకొన్న పాన్పా? నేల గట్టిగా ఉన్నందువల్ల ఆ మహాత్ముడికి పడక కుదరక, నిద్ర పట్టక అటూ ఇటూ పొర్లాడినాడు కాబోలు! ఈ పాన్పుకు వేసిన గడ్డి అంతా నలిగిపోయి ఉంది. చెదిరిపోయి ఉంది. సీతాదేవి మార్గాయాసము నుంచి ఆభరణాలు తీయకుండానే ఈ గొప్ప పాన్పుమీద పడుకొన్నది కాబోలు! అక్కడక్కడ ఆమె ఆభరణాల బంగారు రేణువులు ఈ గడ్డిని అంటుకొన్నవి. ఆమె పయటగా వేసుకొన్న పట్టుఉత్తరీయములో పట్టునూలుపోగులు ఈ గడ్డిలో చిక్కుకొనిపోయినవి. ఆ సాధ్వి, ఆ కోమలాంగి, ఆ మైథిలి, పతివ్రత. అందువల్ల ఆమె భర్త పడుకొన్న శయ్యమీద ఏ విచారమూ లేకుండా సుఖముగా పడుకొని ఉంటుంది.

"అయ్యో, నానుంచి ఆ మహానుభావుడు రాముడు అనాథుడివలె భార్యతో కూడా ఇటువంటి శయ్యమీద పడుకొన్నాడు. నేను పాపాత్ముణ్ణి. ఆ ఇందీవరశ్యాముడు, ఆ తామ్రాక్షుడు, ఆ ప్రియదర్శనుడు, ఆ సర్వలోక సమ్మతుడు, ఆ సర్వలోక ప్రియుడు, సుఖభాక్కు, ఎన్నడూ ఏ కించిత్తు దుఃఖమూ అనుభవించవలసిన అవసరమే లేని ఆ సార్వభౌముడు రాముడు నా కోసము తులలేని ప్రాజ్యరాజ్యము త్యజించి, ఈ కటిక రాతి నేలమీద పడుకొన్నాడు. శుభలక్షణలక్షితాంగుడు, మహాభాగుడు లక్ష్మణుడు అతనిని ఆపత్కాలములో అనుసరించినాడు. వాడు పుణ్యాత్ముడు. పెనిమిటి వెంటపడి పోయిన సీతాదేవి పుణ్యాత్మురాలు. ఆ మహాత్ముడు మనలను అందరినీ వదిలిపెట్టిపోయినాడు. అతడు ఇప్పుడు మన కోరికను అంగీకరిస్తాడో, అంగీకరించడో సందేహముగానే ఉంది.

"రాముడు అడవులపాలు అయి దశరథమహారాజు స్వర్గతుడు అయిపోయినందువల్ల, ఇప్పుడు ఈ రాజ్యము చుక్కానికాసేవాడు లేని నావలె అయిపోయిందని అందరికీ తెలుసును. అయితే, రాముడి బాహుపరాక్రమము అందరూ ఎరుగుదురు. అందువల్లనే ఏ ఒక్కడి మనస్సులోనూ ఈ రాజ్యాన్ని సంపాదించవలెను అనే కాంక్ష కలగలేదు. ఇప్పుడు అయోధ్యానగర ప్రాకారాలు రక్షించే రక్షకులు ఎవరూ లేరు. నగరద్వారాలు అన్నీ తెరచి ఉన్నవి. గుర్రాలూ,

ఏనుగులూ సన్నద్ధముగా లేవు. సేనలు సంతోషముతో లేవు. నగరము వెలుపలను అయినా రక్షకులు లేరు. ఏ వైపునా, ఏ రక్షణమూ లేదు. అయోధ్యానగరము ఇప్పుడు ఇటువంటి విషమావస్థలో ఉన్నప్పటికిన్నీ రాముణ్ణి గురించిన భయమునుంచే, విషము పెట్టిన భక్ష్యాన్నివలె అయోధ్యవంక శత్రువులు ఎవరూ కన్నెత్తి చూడడము లేదు.

"ఇప్పటినుంచీ నేను జటలు ధరించి, వల్కలాలు కట్టుకొని, కందమూల ఫలాదులే తింటూ, నేలమీద గడ్డి పరుపుమీదనే పడుకొంటాను. రామునికి బదులు నేనే అరణ్యవాసము చేస్తాను. శత్రుఘ్నుడు నావెంట ఉంటాడు. రాముడి ప్రతిజ్ఞ దబ్బర కాకూడదు. రాముడు లక్ష్మణుడితో అయోధ్యలో రాజ్యము ఏలుతూ ఉండవలెను. బ్రాహ్మణోత్తములు అతనికి రాజ్యాభిషేకము చేయవలెను.

"ఓ దేవతలారా! మీరు నా మనోరథాన్ని నెరవేర్చవలెను అని ప్రార్థిస్తున్నాను.

"నేను ఆ మహాత్ముడికి శిరసా నమస్కారముచేసి ఎన్ని విధాల ప్రార్థించవలెనో అన్ని విధాలా ప్రార్థిస్తాను. అతడు నాకు ప్రసన్నుడు కాకపోయేటట్లయితే ఆతడు అడవిలో ఉండేటంత కాలమూ నేను అతనితో అడవిలోనే ఉండిపోతాను.

"ఇంతకూ అతడు నన్ను ఉపేక్ష చేయడు అనుకొంటున్నాను" అని భరతుడు చెప్పినాడు.

89

భరతాదులు గంగానదిని దాటుట

భరతుడు ఆ గంగాతీరాన మిగతా రాత్రి గడిపినాడు. తెల్లవారుజామునే నిద్రలేచి, కాల్యకరణీయాలు అన్నీ ముగించుకొని శత్రుఘ్నుణ్ణి చూచి, "తమ్ముడా! లే! ఇంకా పడుకొని ఉన్నావా, లే, లేవవలెను. గుహుణ్ణి పిలుచుకొని రా! ఆలస్యము చేయవద్దు. మనకు శుభము అవుతుంది" అన్నాడు.

"అన్నా! రాముణ్ణి గురించే ఆలోచిస్తూ ఉన్నాను. నేను నిద్రే పోలేదు. మేలుకొనే ఉన్నాను" అంటూ శత్రుఘ్నుడు లేచినాడు.

ఆ పురుషసింహులు ఇద్దరూ ఆ యా విషయాలు మాట్లాడుకొంటూ ఉండగా భరతుడి దర్శనము చేయడానికి అది అదను అనుకొని గుహుడు అప్పుడు అక్కడికి వచ్చినాడు.

భరతశత్రుఘ్నులకు నమస్కారము చేసి, "భరతప్రభూ! ఈ గంగాతీరాన తమకు గతరాత్రి హాయిగా ఉందా? తమ సైన్యము అంతా స్వస్థముగా ఉంది, నేను చూచినాను" అని చెప్పినాడు.

ఆ రామభక్తుడు గుహుడు స్నేహాతిశయముతో తెల్లవారుతూనే వచ్చి తనను కుశలప్రశ్న వేసినందుకు భరతుడు ఎంతో సంతోషించి, "ఓ నిషాదరాజా! రాత్రి సుఖముగా గడిచిపోయింది. నీ సపర్యలకు మేము కృతజ్ఞులము. నీవు మమ్ములను అందరినీ వెంటనే ఇప్పుడే ఈ గంగానదిని దాటించవలెను" అంటూ తొందర చేసినాడు.

అంతట గుహుడు శృంగిబేరము పోయి జ్ఞాతిజనాన్ని నిద్రలేపి, వెంటనే భరతాదులను ఏరు దాటించవలెను అనీ, నావలను అన్నిటినీ వెంటనే రేవులోకి తోసుకొనివచ్చి సిద్ధముగా ఉంచవలెను అనీ అజ్ఞాపించినాడు. దాశలు తమ రాజాజ్ఞను శిరసావహించి, వెంటనే పోయి నదీగర్భములో నుంచి అయిదువందల నావలను రేవులోకి తీసుకొని వచ్చినారు.

స్వస్తికము అనే గొప్పనావను గుహుడు రేవులోనికి తీసుకొని వచ్చినాడు. పెద్ద ఘంటలతోనూ, పైన పెద్ద జండాలతోనూ, చుట్టూ చెక్కల గోడలతోనూ, కిటికీలతోనూ, లోపల కూర్చుండడానికి ఆసనాలమీద పరచిన తెల్లటి కంబళ్ళతోనూ శోభాయమానముగా ఉన్న ఆ స్వస్తిక నావను భరతశత్రుఘ్నులు ఎక్కినారు. వారి వెనుక కౌసల్యాది రాజమాతలూ, రాజాంగనలూ ఎక్కినారు. భరతుడి స్వజనముతోనూ, మంత్రి పురోహితులతోనూ ఆ స్వస్తిక నావ నిండిపోయింది.

వారి రథాలూ, వాహనాలూ, బండ్లూ, ఇంకా అంగడి పదార్థాలూ మొదలు అయినవి మరి ఒక నావలో ఎక్కించినారు.

అప్పుడు గంగాతీరాన సైనికులు విడిది చేసిన చోట వేసిన ఆవాసాలను తగులపెట్టుతూ ఉన్నందువల్ల వెదుళ్ళు మొదలు అయినవి కాలిన పెటపెట చప్పుళ్ళూ రేవులో అయిదువందల నావలలోకి ఎక్కే జనుల కలకల ధ్వనులూ, ఆ యా ఉపకరణాలు నావలలోకి ఎక్కించేవారి కేకలూ మిన్ను అంటినవి.

ఆ నావలలో కొన్నిటిలో స్త్రీలనే ఎక్కించినారు. కొన్నిటిలో సైనికులనూ, కొన్నిటిలో గుర్రాలనూ, కొన్నిటిలో ఎద్దులనూ, కొన్నిటిలో కంచరగాడిదలనూ, కొన్నిటిలో రథాలనూ వాహనాలనూ, కొన్నిటిలో ఎద్దుల బండ్లనూ ఎక్కించినారు. అందరూ ఎక్కిన తరువాత, దాశలు ఆ నావల తెరచాపలు ఎత్తినారు. అప్పుడు వాటి అంతట అవి అమితవేగముతో గంగానదిలో పరుగులు ఎత్తసాగినవి.

జండాలు ఎత్తి మావటివాండ్లు కూర్చున్న ఏనుగులు గంగానదిలో ఈదుకొని పోతూ ఉంటే, జండాలు ఎత్తిన కొండలు నీళ్ళలో సాగిపోతూ ఉన్నట్టు కనిపించినవి.

జనసమూహము ఆ నావలలోనే కాకుండా కర్రలతో కట్టిన తెప్పలమీద కొందరూ, కుండలను అండగా చేసుకొని కొందరూ, చేతులు చాచి ఈదుకొంటూ కొందరూ ఆ గంగానదిని దాటి అవతలి గట్టుకు పోయినారు.

నావలు అన్నీ అవలీలగా అవతలి గట్టుకు చేరిపోయినవి. అందరూ ఆ నావలలో నుంచి సుఖముగా దిగినారు. అప్పుడు దాశలు ఆ ఖాళీ నావలను చిత్ర విచిత్ర గతులతో నేత్రపర్వముగా తిప్పుకొంటూ తరలిపోయినారు.

అప్పుడు అందరూ ఆ గంగానదీ జలాలలో స్నానముచేసి పరిశుద్ధులు అయినారు. భరతుడి వెంట వారు అందరూ మైత్రా ముహూర్తమ్ములో ప్రయాగ వనము చేరినారు. భరతుడు సైన్యాన్నీ, మహాజనసమూహాన్నీ పరామర్శచేసి అక్కడ విడిది చేయవలసింది అని చెప్పినాడు.

వేదవేత్త, దేవపురోహితుడి పుత్రుడు, వృద్ధమహర్షి భరద్వాజుడు నివసిస్తున్న తపోవనము నానావిధవృక్షాలతోనూ, రమ్యము అయిన పర్ణశాలలతోనూ వారికి కనిపించింది. ఆ తపోవనము అక్కడికి కనుచూపు మేరలో ఉంది. ఆ మహామహుణ్ణి అప్పుడే సందర్శించవలెను అని వశిష్ఠాది ఋత్విజులు భరతుడితో చెప్పినారు.

భరతుడు భరద్వాజ దర్శనానికి సన్నద్ధుడు అయినాడు.

90

భరతుడు భరద్వాజుని దర్శించుట

భరతుడు ఆయుధాలనూ, ఆభరణాలనూ తీసివేసి, తెల్లటి పట్టుబట్టలు కట్టుకొని, వశిష్ఠమహర్షి వెంట మంత్రులతో కూడా పాదచారుడు అయి భరద్వాజుణ్ణి సందర్శించడానికి బయలుదేరినాడు.

భరద్వాజాశ్రమము అక్కడికి ఒక క్రోసెడు దూరములో ఉంది.

భరద్వాజాశ్రమము చేరగానే మంత్రులను అందరినీ అక్కడనే ఉండిపొమ్మని చెప్పి, వశిష్ఠమహర్షి వెనకే భరతుడు భరద్వాజాశ్రమములోకి పోయినాడు.

వశిష్ఠమహర్షిని చూచీచూడడముతో భరద్వాజుడు శిష్యులతో, "అర్ఘ్యము, అర్ఘ్యము" అంటూ చెప్పి దర్భాసనముమీద నుంచి లేచి ఎదురుగుండా పోయినాడు. వశిష్ఠమహర్షిని కలుసుకొన్నాడు. ఆ మహర్షులు ఉభయులూ సమవయస్కులు అయినందువల్ల అన్యోన్యమూ నమస్కరించుకోలేదు. ఒకరిని ఒకరు సంతోషాతిశయముతో చూచుకొన్నారు. భరతుడు భరద్వాజమహర్షికి సాష్టాంగ నమస్కారము చేసినాడు. ఆ నమస్కారము చేసినవాడు దశరథమహారాజు పుత్రుడు అని ఆ మహానుభావుడు గుర్తించినాడు.

ఆ మహానుభావుడు వశిష్ఠమహర్షికీ, ఆతరువాత భరతుడికీ అర్ఘ్యమూ, పాద్యమూ, ఫలాలూ ఇచ్చి కుశలములు అడిగినాడు.

భరతుణ్ణి చూచి అయోధ్యానగరములో మంత్రులూ, రాజమిత్రులూ, సేనలూ మొదలు అయినవారి కుశలము అడిగినాడు. జరిగింది అంతా తెలుసును కనుక, దశరథమహారాజును గురించి మాట్లాడలేదు.

సర్వులూ కుశలము అని చెప్పి, వశిష్ఠమహర్షీ, భరతుడూ, "ఓ మహాత్మా! తాము హాయిగా ఉంటున్నారా? తమ అగ్నిహోత్రాలు యథావిధిగా జరుగుతున్నవా? తమ శిష్యులు అందరూ క్షేమముగా ఉంటూ ఉన్నారా? తమ ఆశ్రమ వృక్షాలు చక్కగా కాస్తున్నవా? తమ ఆశ్రమములో తిరిగే మృగాలూ, పక్షులూ సుఖముగా ఉంటూ ఉన్నవా" అని అడిగినారు.

భరద్వాజుడు అన్నీ కుశలము అని చెప్పినాడు.

అంతట ఆ మహర్షి భరతుణ్ణి చూచి, "నాయనా భరతుడా! నీవు రాజ్యము ఏలుతూ ఉన్నవాడవు ఇట్లా ఎందుకు వచ్చినావు? రాజ్యము వదలిపెట్టి రావలసినంత అగత్యము ఏమిటి వచ్చింది? నా మనస్సులో సందేహముగా ఉంది, చెప్పు. మీ నాయన దశరథమహారాజు మీ అమ్మకు వశుడు అయిపోయి, కౌసల్యానందవర్ధనుణ్ణి రాముణ్ణి వనవాసము చేయమన్నాడు. వాడు అందుకు కిక్కురుమనకుండా పధ్నాలుగు ఏండ్లూ వనవాసము చేయడానికి భార్యతోనూ, తమ్ముడితోనూ అడవులపాలు అయిపోయినాడు. ఎప్పటికీ నీవే నిష్కంటకముగా రాజ్యము అనుభవించవలెను అనుకొని, ఆ అన్నతమ్ములకు ఏమి అయినా అపకారము చేయడానికి నీవు ఇప్పుడు ఇట్లా పోతున్నావా?" అని అడిగినాడు.

భరతుడు ఖిన్నుడు అయిపోయినాడు. కన్నీళ్ళు కారుస్తూ, "ఓ మహర్షీ! తాము త్రికాలజ్ఞులు. తామున్నూ నన్ను దోషిగా భావిస్తున్నారా? ఇక నేను జీవించడము వ్యర్థము. నేను ఏదోషమూ చేయలేదు. నేను దోషిని కాను అని నిస్సందేహముగా చెప్పుతున్నాను. నేను కైకకు పుత్రుణ్ణిగా పుట్టడము ఒక్కటే నా దోషము. తాము ఇటువంటి కఠోర వాక్కులు అనవద్దు. నేను లేనప్పుడు మా అమ్మ అడిగింది. నేను ఆమెను అట్లా అడగమనలేదు. ఆమె చేసిన పని నేను హర్షించలేదు. సమ్మతించలేదు. నేను ఆ మహానుభావుడు రాముడి కాళ్ళమీద పడి అతణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకొని అయోధ్యకు తీసుకొని పోవడానికి ఇట్లా బయలుదేరినాను. ఓ మహర్షీ! తాము నన్ను అనుగ్రహించవలెను. ఆ భూనాయకుడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో తాము చెప్పవలెను" అన్నాడు.

భరతుడి విషయము వశిష్ఠ వామదేవాది మహర్షులు భరద్వాజుడికి విన్నవించినారు. భరద్వాజుడు ప్రసన్న ముఖముతో, "నాయనా! జ్యేష్ఠానువర్తనమూ, ఇంద్రియ నిగ్రహమూ, సత్పురుషులను అనుసరించడమూ మొదలు అయిన సద్గుణాలకు మీ రఘువంశీయులు ప్రసిద్ధికి ఎక్కినారు. ఇవి అన్నీ నీలో మూర్తీభవించినవి. నీ పూనికకు నేను సంతోషిస్తున్నాను. నిన్ను నేను మెచ్చుకుంటున్నాను. నీ మనస్సులో ఉన్న సంగతి నాకు తెలునును. దృఢపరచుకోవడానికి నిన్ను ఇట్లా అడిగినాను. నీ కీర్తి ఈ లోకములో శాశ్వతముగా ఉంటుంది. సీతారామలక్ష్మణులు ఇప్పుడు చిత్రకూటపర్వతముమీద నివసిస్తూ ఉన్నారు.

"నాయనా భరతుడా! సీతారామలక్ష్మణులను చూడడానికి నీవు రేపు బయలుదేరి పోవచ్చును. ఈనాడు నీవూ, నీ మంత్రులూ, నీ పరివారమూ ఇక్కడ ఉండిపోవలెను. ఇది నా కోరిక. నీవు ప్రాజ్ఞుడవు. కోరిన కోరికలు ఇచ్చేవాడవు. నేను కోరినట్లు చేయవలసింది" అన్నాడు.

"అట్లాగేను" అని భరతుడు పరమసంతోషముతో అన్నాడు. ఆ బుద్ధిమంతుడు ఆ రాత్రి భరద్వాజాశ్రమములో ఉండిపోవలెను అని నిశ్చయించు కొన్నాడు.

91

భరతుడు ఆనాటి రాత్రి ఆ ఆశ్రమములో ఉండిపోవడానికి నిశ్చయించు కోగానే భరద్వాజమహర్షి అతనికీ, అతని పరివారానికీ, ఇంకా అతని వెంట వచ్చినవారికి అందరికీ అతిథిసత్కారము చేయ సంకల్పించుకొన్నాడు. అందుకు భరతుడు, "ఓ మహర్షీ! తాము నాకు అర్ఘ్యము ఇచ్చినారు. పాద్యము ఇచ్చినారు. ఈ ఆశ్రమములో పండిన పండ్లు ఇచ్చినారు. ఇంకా అతిథి సత్కారము ఏమిటి" అని అడిగినాడు.

భరద్వాజుడు మందహాసము చేసి, "నాయనా భరతుడా! నీకు నా మీద ఉన్న గౌరవమూ, భక్తీ నేను ఎరుగుదును. నేను ఏమి ఇచ్చినా నీవు సంతోషిస్తావు. తృప్తిపడతావు. నాకు తెలుసును. నేను నీకూ, నీ సైన్యానికీ, నీ వెంట వచ్చిన వారికి అందరికీ ఈ రాత్రి విందుచేసి సత్కరించవలెను అనుకొన్నాను. అయితే, నీవు ఇక్కడికి వచ్చేటప్పుడు నీ సైన్యాన్ని దూరముగా అట్టిపెట్టి వచ్చినావు, ఎందువల్ల?" అని ప్రశ్నించినాడు.

భరతుడు చేతులు జోడించి, "మహాత్మా! తమమీద నాకు ఉన్న శ్రద్ధాసక్తుల నుంచే నా సైన్యాన్నీ, జనసమూహాన్నీ ఇక్కడికి వెంటపెట్టుకొని రాలేదు. రాజులు అయినా, రాజపుత్రులు అయినా సైన్యాలతో ప్రయాణము అయిపోయేటప్పుడు

తపోధనులు ఉండే ప్రదేశాలు తప్పించిపోవలెను అని పెద్దలు చెప్పగా విన్నాను. ఎంతో సైన్యమూ, ఎన్నో గుర్రాలూ, ఎన్నో ఏనుగులూ ఇంకా ఎన్నోరకాల జంతువులూ, మహా జనసమూహమూ నేల ఈనినట్టు నావెంట కదిలివస్తూ ఉంది. అన్ని జంతువులూ అంత జనసమూహమూ ఇక్కడికి వచ్చేటట్లయితే, అవి ఈ ఆశ్రమవృక్షాలనూ, ఇక్కడి పర్ణశాలలనూ, జలాశయాలనూ, ఇక్కడి ఈ నేలనూ పాడుచేయకుండా ఉండవు అనుకొన్నాను. అందువల్ల, నేను ఒక్కణ్ణే గురువుల వెంట తమ దర్శము చేయడానికి వచ్చినాను" అన్నాడు.

"భరతుడా! భయము లేదు. నీ జంతువులూ, నీ సైన్యాలూ, మహా జనసమూహమూ నా ఆశ్రమాన్ని పాడుచేయవు. నీ చతురంగబలాలనూ, నీవెంట వస్తూ ఉన్న మహాజనులనూ, ఇంకా తక్కిన అందరినీ వెంటనే ఇక్కడికి రప్పించు" అన్నాడు భరద్వాజుడు.

భరద్వాజమహర్షి ఆజ్ఞలను శిరసావహించి భరతుడి చతురంగసేనలూ మహాజనసమూహమూ అక్కడికి వచ్చి వేసినవి.

అంతట భరద్వాజుడు తన అగ్నిహోత్ర గృహములోకి పోయినాడు. ముమ్మారు ఆచమించినాడు. రెండుమార్లు పెదవులు తుడుచుకొన్నాడు. భరతుడికి అతిథి సత్కారము చేయడానికి మంత్రాలతో దేవతలను ఆహ్వానించడము మొదలు పెట్టినాడు.

భరద్వాజుని సృష్టి

"ఓ విశ్వకర్మా! ఓ మయుడా! (త్వష్ట) నేను భరతుడికి అతిథి సత్కారము చేయవలెను అనుకొన్నాను. అందువల్ల మీరు వెంటనే వచ్చి, ఇక్కడ వారి వారికి అవసరము అయిన గృహాదులను నిర్మించవలెను. ఓ ముగ్గురు లోకపాలకులారా! (యమ వరుణ కుబేరులారా) ఓ దేవేంద్రుడా! మీరూ, మీ దేవతలూ నాకు సాయపడవలెను. నేను భరతుడికి అతిథి సత్కారము చేయపోతున్నాను. ఓ అగ్నిహోత్రుడా! నీవు వచ్చి సర్వమూ నిర్వహించవలెను.

"ఈ భూమిమీదనూ, అంతరిక్షములోనూ తూర్పు పడమరల వైపులకు పారే నదులు అన్నీ, ఇప్పుడే ఇక్కడికి రావలెను. కొన్ని నదులలో మైరేయము (అనే మద్యము) ప్రవహించవలెను. కొన్నిటిలో సుర (అనే మద్యము) ప్రవహించవలెను. కొన్నిటిలో చెరకు పానకము వంటి చల్లనినీరు ప్రవహించవలెను.

"ఓ హాహా! హూహూలారా! మీరు దేవజాతి అప్సరసలనూ, మీ గంధర్వజాతి అప్సరసలనూ వెంటపెట్టుకొని వెంటనే రావలెను.

"ఓ ఘృతాచీ! ఓ విశ్వాచీ! ఓ మిశ్రకేశీ! ఓ అలంబుసా! ఓ నాగదంతా! ఓ హేమా! పర్వతముమీద ఉంటూ ఉన్న ఓ హిమా! మీరు అందరూ, మీరు మాత్రమే కాదు మీవెంట ఉండే అప్సరసాంగనలను అందరినీ వెంటపెట్టుకొని ఇక్కడికి రావలెను.

"ఓ బ్రహ్మదేవుడా! ఓ దేవేంద్రుడా! ఓ కుబేరుడా! మిమ్ములను సేవిస్తూ ఉన్న స్త్రీలను అందరినీ వారి వారి నృత్యగీతాద్యుపకరణాలతోనూ, వారి వారి విద్యాగురువు అయిన తుంబురుడితోనూ వెంటనే ఇక్కడికి పంపించవలెను.

"ఓ చంద్రుడా! నేను భరతుడికి అతిథి సత్కారము చేయవలెను అనుకొన్నాను. కాబట్టి నా కోసము నీవు భక్ష్య భోజ్య చోష్య లేహ్యాలనూ, నానావిధ ఉత్తమాన్నాలనూ వివిధ మాంసాహారాలనూ, సురాది మద్య పానీయాలనూ వెంటనే సిద్ధము చేసి పెట్టవలెను.

"ఓ చంద్రుడా! నీవు సమస్త ఓషధులకూ అధిపతివి కాబట్టి, చిత్ర విచిత్రము అయిన పూలతో దండలు కట్టి పెట్టవలెను" అంటూ, ఆ అప్రతిమానతేజోవంతుడు ఆ మహర్షి తన తపోబలముతోనూ, యోగబలముతోనూ శిక్షాస్వరాలతో ఆహ్వానిస్తూ, తూర్పు ముఖముగా కూర్చొని చేతులు ఎత్తి నమస్కారము చేస్తూ ధ్యానము చేయసాగినాడు.

అప్పుడు దేవతలు ఒక్కొక్కరే అక్కడికి వచ్చినారు. వారి వారి పనులు చక్కబెట్టడానికి పూనుకొన్నారు.

వాయువు మలయ దర్దుర పర్వతాలమీదనుంచి పరుగెత్తుకొని రావడమువల్ల ఘుమఘుమ వాసనలు గుబాళించడమే కాకుండా చల్లగా, హాయిగా వీచి అందరి శ్రమా పోకొట్టి హుషారు పుట్టేటట్టు చేసింది.

అప్పుడు అక్కడ దేవతలు పైనుంచి దివ్య పుష్పాలు కురిపించడము మొదలు పెట్టినారు. అన్నిదిక్కులా దివ్యదుందుభులు వినిపించినవి. వాయువు మరింతగా ఘుమఘుమ వాసనలు గుబాళించ సాగింది. దేవ గంధర్వులు గానము ఆలపించినారు. అప్సరసలు నేత్రపర్వముగా నాట్యము ఆడసాగినారు. వీణానాదము కర్ణపేయముగా మ్రోగడము మొదలు పెట్టింది. శ్రుతిలయసమన్వితము అయిన నృత్త గీతవాద్యనాదము భూనభోంత రాళము అంతటా వ్యాపించినది. అందరూ తన్మయులు అయిపోయినారు.

హఠాత్తుగా ఆ దివ్యధ్వనులు ఆగిపోయినవి.

ఎట్టఎదుట విశ్వకర్మ నిర్మాణము అంతా గోచరించింది. భరతుడి సైనికులు అందరూ ఆశ్చర్యచకితులు అయినారు. ఎటుచూచినా అయిదు యోజనాల వరకున్నూ

నేల మిట్టపల్లాలు లేకుండా సమమట్టముగా తోచింది. నీలాలూ, వైడూర్యాలూ నేల మీద పరిచినట్లుగా పచ్చిక బయళ్ళు కనిపించినవి. మధ్య మధ్య మారేడుచెట్లూ, ఉసిరి చెట్లూ, వెలగచెట్లూ, పనసచెట్లూ, మాతులుంగచెట్లూ, మామిడిచెట్లూ విరగకాసి ఉన్నవి.

ఉత్తర కురుదేశము నుంచి దివ్యభోగద్రవ్యాలతో చైత్రరథము అనే కుబేరుడి ఉద్యానవనము వచ్చి అక్కడ ఒక వైపున వెలసింది. దివ్యనదులు అన్నీ ఆ ఒడ్డునా, ఈ ఒడ్డునా ఉన్న చెట్లతో కూడా వచ్చి అక్కడ ప్రవహిస్తూ ఉన్నవి. చక్కని తోరణాలతో తెల్లటి చతుశ్శాలా గృహాలూ, రమ్య హర్మ్యాలూ, రాజప్రాసాదాలూ, ఏనుగుల శాలలూ, గుర్రాల లాయాలూ, వాహనాల కొట్లూ కనిపించినవి.

శరత్కాల మేఘమువలె తెల్లగా చతురస్రాకారముతో, ఉన్నతము అయిన ద్వారాలతో, తెల్లటి పూలదండల తోరణాలతో రాజగృహము అక్కడ వెలసింది. ఆ భవనము అంతా దివ్యసుగంధముతో ఘుమ ఘుమ లాడుతూ ఉంది. ఆ యా గదులు అన్నీ చచ్చౌకముగా ఎక్కడనూ ఇరుకు అనేది లేకుండా విశాలముగా ఉన్నవి. రాజాసనాలూ, రకరకాల శయ్యలూ ఆ యా ప్రదేశాలలో అమర్చి ఉన్నవి. వాహనాలూ, శిబికలూ ఉన్నవి. స్నాన భోజనాదులకు ప్రత్యేకము అయిన ప్రదేశాలూ, ప్రత్యేకము అయిన ఆసనాలూ ఏర్పరచి ఉన్నవి. స్నానానంతరము ధరించడానికి దివ్యము అయిన వస్త్రాలతోనూ, తళతళ లాడుతూ ఉన్న పానపాత్రలతోనూ, ధగధగ లాడుతూ ఉన్న భోజనపాత్రలతోనూ, దివ్యరసాయనాలతోనూ, పానీయములతోనూ, సూక్ష్మశాల్యన్నాల తోనూ, నానావిధము అయిన అపూపాలతోనూ భోజనానంతరము నిద్రపోవడానికి ఉత్తమాస్తరణాలు పరచిన శయ్యలతోనూ ఆ రాజభవనము అక్కడ ఎంతో శ్రీమంతముగా తోచింది.

భరద్వాజుడు చెప్పినందువల్ల ఆ మహాబాహువు భరతుడు తమ్ముడినీ మంత్రులనూ, పురోహితులనూ వెంటపెట్టుకొని ఆ రాజభవనములోకి పోయినాడు. ఆ భవన సంవిధానానికి వారు అందరూ అబ్బురపడిపోయినారు. పరమానందభరితులు అయినారు.

ఆ రాజభవనములో ఉన్న దివ్యసింహాసనాన్నీ శ్వేతచ్ఛత్రాన్నీ, వింజామరలనూ భరతుడు చూచినాడు. రామున్ని తలచుకొంటూ మంత్రులు మొదలు అయినవారిని వెంటపెట్టుకొని ఆ సింహాసనానికి ప్రదక్షిణము చేసినాడు. సాష్టాంగ నమస్కారము చేసినాడు. ఒక వింజామర తీసుకొని మంత్రులు మొదలు అయినవారు కూర్చుండేచోట కూర్చున్నాడు. పురోహితులూ, మంత్రులూ వారి వారి స్థానాలలో కూర్చున్నారు. వారి తరువాత సేనానాయకుడూ, శిబిరనియంతా కూర్చున్నారు.

అప్పుడు ఆ ముహూర్తాన భరద్వాజుడు ఆజ్ఞాపించినందువల్ల భరతుడు మొదలు అయినవారు కూర్చుని ఉన్న రాజగృహ సభాభవనానికి ఎట్టఎదట పాయసపు రొంపితో ఒక మహానది ప్రవహించసాగింది. ఆ నది రెండు గట్లనూ పాలగచ్చుతో గిలాబా చేసిన దివ్యము అయిన గృహాలు అప్పటికి అప్పుడు వెలసినవి. ఆ రమ్యదివ్య గృహాలలోనుంచి అరవైవేలమంది అప్సరాంగనలు పరిగెత్తుకొని వచ్చి భరతుడి ఎట్ట ఎదట సభామందిరములో నిలుచున్నారు.

ఆ అరవైవేలమందిలో దివ్యాభరణభూషితలు అయిన ఇరవైవేలమంది అప్సరాంగనలను బ్రహ్మదేవుడు పంపించినాడు. మణిముక్తాప్రవాళసువర్ణాభరణ భూషితలు అయిన ఇరవైవేలమంది అప్సరాంగనలను కుబేరుడు పంపించినాడు. నందనోద్యానవనములో విహరిస్తూ తమ గాలి సోకినంత మాత్రాననే ఎటువంటి మగవాండ్లను అయినా పిచ్చి ఎత్తించే ఇరవైవేలమంది అప్సరాంగనలను దేవేంద్రుడు పంపించినాడు.

ఇంతమంది అప్సరాంగనలూ భరతుడి సన్నిధానానికి రాగానే నారదుడు, తుంబురుడు, గోపుడు అనే ముగ్గురు గంధర్వరాజులూ సంగీతము ఆలాపించినారు. అప్పుడు అక్కడ అలంబుస, మిశ్రకేశి, పుండరీక, వామన అనే అప్సరసలు నృత్యము చేయడము మొదలు పెట్టినారు.

దేవేంద్రుడి నందనోద్యానవనములోనూ, కుబేరుడి చైత్ర రథవనములోనూ తప్ప మరిఎక్కడనూ దొరకని పూలదండలు అన్నీ ఆ ప్రయాగ క్షేత్రములో భరతుడి రాజసభామందిరములో అప్పుడు వారికి అందరికీ యథేష్టముగా దొరికినవి.

భరతుడి సభామందిరములోపల ఈవిధముగా అప్సరసలు ఆడుతూనూ, గంధర్వరాజులు పాడుతూనూ ఉంటే, వెలుపల సైనికుల కోసము భరద్వాజుడి ప్రభావము వల్ల మారేడుచెట్లు మద్దెళ్ళు వాయించడమూ, తాటిచెట్లు తాళాలు వేయడమూ, రావిచెట్లు నృత్యము చేయడమూ మొదలుపెట్టినవి. సైనికులు ఆ విచిత్రము చూస్తూ ఉండగానే దేవదారుచెట్లూ, బొట్టుగుచెట్లూ, కానుగ చెట్లూ కుబ్జ వామన రూప స్త్రీలుగా మారిపోయినవి. ఇంకా శింశుపావృక్షాలూ, ఉసిరిగచెట్లూ, నేరేడుచెట్లూ, రకరకాల చెట్లూ జాజులు సన్నజాజులూ మల్లెలూ మొదలు అయిన రకరకాల లతలూ చక్కని స్త్రీ రూపాలు ధరించి సైనికుల చుట్టూ మూగినవి.

ఆ చక్కని చుక్కలు సైనికులతో, "ఓ వీరులారా! మేము మిమ్ములను సంతోషపెట్టడానికీ, సుఖపెట్టడానికీ వచ్చినాము. మీకు సుర కావలెనా? ఇదిగో, మీరు త్రాగినంత ఇవ్వగలము. మీకు ఆకలిగాఉందా? అదిగో, పాయసము ఉంది.

పక్వము చేసిన మంచి మాంసము ఉంది. మీరు తినకలిగినంత పెట్టుతాము" అంటూ వెంటపడ్డారు.

ఒక్కొక్క సైనికుణ్ణి ఏడు ఎనిమిదిమంది స్త్రీలు పట్టుకొని సువాసనల నూనెతో తలలు అంటి, ఒండ్లు పట్టి, నలుగు పెట్టి రమణీయము అయిన నదీతీరాలకు తీసికొనిపోయి స్నానము చేయించినారు. అంతట వలపు చూపుల వన్నెలాండ్లు మరికొందరు వచ్చి, ఒక్కొక్క సైనికుణ్ణి ఒక్కొక్క వన్నెలాడి ఒంటితడి ఆరిపోయేటట్లు తుడిచి, అలంకరించి, ఏకాంత ప్రదేశానికి తీసుకొనిపోయి పరస్పరమూ సురాపానము చేసి మైమరచిపోయి తిరగసాగినారు.

ఈవిధముగా స్త్రీలే కాకుండా, భరద్వాజుడి ప్రభావమువల్ల వాహన పాలకులున్నూ వచ్చినారు. వారు భరతుడి సైన్యముతో వచ్చిన ఏనుగులకూ, ఎద్దులకూ, గుర్రాలకూ, గాడిదలకూ, ఒంటెలకూ ఆప్యాయముగా మేత వేసి మేపినారు. అలిగిన ఏనుగులను బుజ్జగించి చెరుకుగడలు, తేనె కలిపిన పేలాలు పెట్టినారు. అదే విధముగా ఆ యా జంతువులను అన్నిటినీ ఆదరించి కడుపునిండా మేత పెట్టినారు.

సైనికులు మొదలయినవారే కాకుండా వారి వెంట వచ్చిన గుర్రపువాండ్లు, మావటివాండ్లు, తక్కిన బండ్లవాండ్లు మొదలు అయినవాండ్లు అందరూ మద్యపానముతో మత్తుఎక్కి మైమరచి పోయినారు. గుర్రపువాడికి వాడి గుర్రము ఏదో తెలియలేదు. మావటివాడికి తన ఏనుగు ఏదో తెలియలేదు. అందరూ స్రక్చందన వనితాది సమస్త భోగాలతోనూ సంతుష్టులు అయిపోయినారు.

అప్పుడు ఒక్కొక్క సైనికుడు అనేకమంది అప్సరసలతోనూ, అనేకమంది సైనికులు ఒక్కొక్క అప్సరసతోనూ తిరుగుతూ, "మేము అయోధ్యకూ పోము, దండకారణ్యానికీ రాము. భరతుడు ఇట్లా సుఖముగా ఉండవలెను. రాముడు అట్లా దండకారణ్యములో సుఖముగా ఉండవలెను" అంటూ కేకలు వేయసాగినారు.

పదాతులూ, గజసాదులూ, గుర్రపురౌతులూ వారి వారి నౌకర్లూ ఈవిధముగా భరద్వాజుడి సత్కారాలు అనుభవించి స్వతంత్రులు అయిపోయినారు. ఇక భరతుడి వెంట వచ్చిన వేలాదిజనులూ సంతుష్టులు అయి, "ఇదే స్వర్గము-ఇంతకన్నా స్వర్గము ఏమి ఉంటుంది" అంటూ కేకలుపెట్ట సాగినారు.

ఆ సైనికులు అప్సరసలచేత చందనచర్చ చేయించుకొని, పూలదండలు వేయించుకొని పాటలు పాడుతూ పకపక నవ్వుతూ, ఎగిరి గంతులు వేస్తూ అన్నివైపులా పరుగులు ఎత్తసాగినారు. అమృతోపమము అయిన అన్నము కడుపునిండా తిన్నప్పటికీ, దివ్యము అయిన భక్ష్యాలు కంటపడగానే ఆ సైనికులకు మళ్ళీ తినబుద్ధి పుట్టింది.

ఆ సైన్యముతో వచ్చిన వేలకొద్దీ యోధాంగనలూ, పరిచారికలూ, దాసీలూ కొత్త కొత్త చీరలు కట్టుకొని పనిపాట్లు లేకుండా యథేష్టముగా తిరుగుతూ విర్రవీగి పోయినారు. సైన్యసంబంధము అయిన ఏనుగులు మొదలు అయిన జంతువులకే కాకుండా, సైనికులు మొదలు అయినవాండ్లు విలాసార్థము వెంట తెచ్చుకొన్న చిల్లర మల్లర జంతువులకూ, పక్షులకూ కూడా భరద్వాజమహర్షి ప్రభావమువల్ల సమృద్ధముగా తిండి దొరికింది. భరతుడి వెంట వచ్చినవాండ్లు ఎవండ్లూ ఏమీ వండుకోలేదు.

ఆ మహానుభావుడి మహాత్మ్యమువల్ల అప్పుడు అక్కడ తెల్లటి బట్టలు కట్టుకొననివాడుకానీ, మురికిగాఉన్నవాడు కానీ దుమ్ముకొట్టుకొని తల మాసి పోయినవాడుకానీ, ఆకలికొన్నవాడుకానీ ఒక్కడు అయినా కనిపించలేదు.

ఆనాటి రాత్రి విందుకు పెద్ద పెద్ద బానలతో వండిన మృగ మాంసమూ, నెమలి మాంసమూ, కోడి మాంసమూ, మేక మాంసమూ, పంది మాంసమూ, అతిరుచ్యము అయిన వ్యంజనాలూ, షడ్రసాలతో ఘుమఘుమ వాసనలతో సిద్ధము చేసిన పప్పులూ, చక్కెరతో పక్వము చేసిన ఫల రసాలూ, తేనెలో మాగవేసిన పండ్లూ, తెల్లటి శాల్యన్నపు రాసులూ, వేలకొలది అన్నపు గుండిగలూ, లక్షలకొలది దివ్యవ్యంజన పాత్రలూ, కోట్ల కొలది బంగారపు భోజన పాత్రలూ, పెద్ద పెద్ద బానలనిండా పెరుగూ, చిన్న చిన్న దుత్తలనిండా శొంఠి మొదలు అయిన వాటితో సంస్కరించిన పెరుగూ, ముదర పండనటువంటి, దోరపండు కానటువంటి వెలగపండువాసన వేసేటట్టు సిద్ధము చేసిన మజ్జిగ, శొంఠి, పిప్పలి, మిరియాలు, ఏలకులు, లవంగాలు, తక్కోలము, జీలకర్ర, అల్లము, పంచదార వేసి తిరగపోతపెట్టిన పెరుగూ, తెల్లటి తియ్యటి పెరుగూ, రకరకాల పాయసాలూ, యవలు, చక్కెరవేసి చేసిన పిండివంటల రాసులూ భరతుడి సైనికులు అందరూ చూచినారు. విస్మితులు అయినారు. ఇవేకాదు, అక్కడి ఆవులు ఎన్నిసార్లు పితికినా పాలు ఇవ్వసాగినవి. అక్కడి చెట్లు తేనెలు కార్చ సాగినవి. అక్కడి నడబావులు అన్నీ మైరేయమద్యముతో నిండిపోయినవి. అందుకు అందరూ ఆశ్చర్యచకితులు అయిపోయినారు.

ఆ నదీతీరాలలో స్నానము చేయడాని కోసము ఉంచిన ఉసిరిగకాయ కల్కాలూ, మినుములు మొదలు అయిన కాయధాన్యాలలో చందన చూర్ణము కలిపిన నలుగుపిండ్లూ, ఇంకా అనేక స్నానద్రవ్యాలూ చూచి, ఆ సైనికులు సంతోషపడ్డారు. పండ్లు తోముకోవడానికి కుంచెలు మొదలు అయిన దంతధావన పరికరాలూ, ఒంటికి పూసుకోవడానికి దొప్పలనిండా చందనపు ముద్దలూ, ముఖము చూచుకోవడానికి అద్దాలూ, తలవెంట్రుకలు దువ్వుకొనే దువ్వెనలూ, మీసాలూ గడ్డాలూ

దువ్వుకొనే దువ్వెనలూ, కాటుక్కాయలూ, నూత్నవస్త్రాలూ, పావకోళ్ళజతలూ, వేలకొద్దీ చెప్పుల జతలూ, ఒంటికి తొడుక్కొనే చిత్రవిచిత్రములయిన కవచాలూ, అలంకారముగా ధరించే శరచాపాదులూ రకరకాల శయ్యలూ, ఇంకా ఎన్నో రకరకాల ఆసనాలూ చూచి ఉప్పొంగిపోయినారు.

ఈ విధముగా తమ కోసము చేసిన ఏర్పాట్లే కాకుండా, ఏనుగులూ ఎద్దులూ గుర్రాలూ గాడిదలూ ఒంటెలూ మొదలు అయిన జంతువులు అన్నీ కడుపునిండా మేత మేసిన తరువాత నీళ్ళు త్రాగడానికి అనువు అయిన చెరువులూ, నల్లకలువల తోనూ తామరలతోనూ నిర్మలాకాశమువంటి స్వచ్ఛజలాలతోనూ కూడి సులభముగా దిగి నీళ్ళలో మునగడానికి వీలు అయిన రేవులు ఉన్న సరస్సులూ అక్కడ చూచి భరతుడి సైనికులు ముగ్ధులు అయినారు.

ఈ విధముగా భరద్వాజుడు స్వప్నతుల్యముగానూ, అద్భుతముగానూ చేసిన అతిథిసత్కారానికి అందరూ అబ్బురపడి పోయినారు. భరద్వాజుడి ప్రభావమువల్ల భరతుడి సైనికులు ఆ రమ్యవన్యాశ్రమములో నందనోద్యానవనములో దేవతలవలె క్రీడిస్తూ ఉండగా ఆ రాత్రి గడిచిపోయింది.

ఆ యా గంధర్వులూ, ఆ యా అప్సరసలూ, ఆ యా నదుల దేవతలూ, భరద్వాజుడికి వీడ్కోలు చెప్పి తమతమ తావులకు వెళ్ళిపోయినారు.

తెల్లగా తెల్లవారిపోయినప్పటికిన్నీ భరతుడి సైనికులు దివ్యాగరుచందన చర్చలు చెక్కుచెదరకుండా మద్యపాన మదముతో మత్తు ఎక్కి నిద్రపోతున్నారు. అయితే, ఆ రాత్రి అక్కడ వెదచల్లిన పూలదండలు మాత్రము నలిగి వాడిపోయి కనిపించినవి.

92

భరద్వాజుని ఆశీస్సులు

రాముణ్ణి ఎప్పుడు ఎప్పుడు చూడడమా అనే తహతహతో భరతుడు తెల్లవారుతూనే ప్రయాణ సన్నద్ధుడు అయినాడు. భరద్వాజమహర్షి దర్శనముచేసి వీడ్కోలు చెప్పి పోవడానికి బయలు దేరినాడు.

భరద్వాజుడున్నూ అగ్నిహోత్రము వేల్చి భరతుణ్ణి చూడవలెను అనుకొంటూ ఉండగానే ఎట్ట ఎదుట నమస్కారము చేస్తూ అతడు కనిపించినాడు. అంతట ఆ మహర్షి "నాయనా భరతుడా! రాత్రి నీవు సుఖముగా నిద్రపోయినావా? నీ పరివారమూ నీ చతురంగబలాలూ నా ఆతిథ్యానికి సంతుష్టులు అయినారా?" అని ప్రశ్నిస్తూ, ఆ అగ్నిహోత్ర గృహములోనుంచి భరతుణ్ణి వెంటపెట్టుకొని బయటికి వచ్చినాడు.

"ఓ మహర్షీ! తమ ఆతిథ్యానికి నా చతురంగ సేనలూ, నా మంత్రులూ, నేనూ సమస్తవిధాలా సంతుష్టులము అయినాము. మాకు మార్గాయాసము అనేది లేకుండా పోయింది. ఏ దిగులూ, విచారమూ లేకుండా అందరమూ కడుపారా తిని, చక్కని ఇండ్లలో సుఖముగా నిద్రపోయినాము. మహాత్మా! తాము ఇప్పుడు నాకు సెలవు ఇవ్వవలెను. నేనిక రాముణ్ణి చూడకుండా ఉండలేను. అందుకోసము ప్రయాణము అయిపోతున్నాను. ఓ మహర్షీ! తాము నామీద అనుగ్రహము ఉంచి మా అన్న రాముడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో, ఆ ప్రదేశము ఇక్కడికి ఎంత దూరమో, నేను నా సైన్యాలతో ఇక్కడినుంచి అక్కడికి ఏదారిన పోవలెనో చెప్పవలెను" అని అడిగినాడు.

రాముణ్ణి చూడవలెను అని తహతహలాడుతూ ఉన్న భరతుడితో ఆ మహాతేజోవంతుడు, "భరతుడా! ఇక్కడనుంచి ఈ కనపడుతూ ఉన్న నిర్జనారణ్యము గుండా రెండున్నర యోజనాల దూరము పోతే అందము అయిన అడవి వస్తుంది. ఆ అడవికి అవతల రమ్యము అయిన పర్వతశిఖరాలు కనిపిస్తవి. అదే చిత్రకూట పర్వతము. దానికి ఉత్తరపు దిక్కున చెట్లు అన్నీ విరగబూసి, ఎంతో రమణీయముగా కనిపిస్తూ ఉంటవి. ఆ చెట్ల పక్కనుంచే మందాకినీ నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ చిత్రకూట పర్వత శృంగానికిన్నీ, మందాకినీ నదికిన్నీ మధ్యను ఉన్న పర్వత సానువుల్లో ఒక పర్ణశాల ఉంది. అదే సీతారామలక్ష్మణులు నివసిస్తూ ఉన్న పర్ణశాల. ఇక్కడ నుంచి దక్షిణ దిక్కుగానూ, నైరుతి దిక్కుగానూ అక్కడికి రెండు బాటలు ఉన్నవి. ఏ బాటను అయినా అక్కడికి పోవచ్చును. నీవు నీ రథ గజ తురగ పదాతి సమూహాలతో ఆ రెండు బాటలలో ఏ బాటను పోవడానికి వీలు అవుతుందో, నీవు వాహినీపతివి కాబట్టి, నీవే నిర్ణయించుకోవలెను. ఆ రెండు బాటలలో ఏ బాటను పోయినా నీకు రాముడి పర్ణశాల కనబడుతుంది" అని చెప్పినాడు.

అంతట భరతుడు ఆజ్ఞాపించినందువల్ల సైన్యాలు ప్రయాణ సన్నద్ధము కాసాగినవి.

అప్పుడు దశరథమహారాజు ముగ్గురు కులకాంతలూ భరద్వాజమహర్షికి సాష్టాంగ నమస్కారము చేసి, వీడ్కోలు చెప్పడానికి బయలు దేరినారు. వారు ఎన్నడూ ఏకాస్త దూరమూ నడిచి ఎరగరు. అయితే, ఆ మహర్షి ఆశీర్వాదము కోసము శ్రద్ధాసక్తులతో వారు పాదచారిణులు అయి వచ్చినారు. భర్తృవియోగానికి ఉపవాసాలు చేస్తూనూ, కొడుకు అడవులపాలు అయిపోయినందుకు దుఃఖపడుతూనూ కౌసల్యాదేవి వణుకుతూ సుమిత్రాదేవిని ఊతగా చేసుకొని వచ్చి, భరద్వాజుడి రెండు పాదాలూ పట్టుకొని నమస్కారము చేసింది. ఆమెతోపాటు సుమిత్రాదేవిన్నీ ఆ

మహానుభావుడికి నమస్కారము చేసింది. తన కోరిక సఫలము కాకుండానే లోకనిందలపాలు అయిన కైకేయీదేవి ఆ మహర్షి పాదాలకు నమస్కారము చేసి లేచి, తనను ఎవరు ఏమి అనుకొంటారో అనే సిగ్గుతోనూ, దైన్యముతోనూ తన సవతులవలె అక్కడ నిలుచుండలేక, ఆ మహర్షికి నమస్కారము చేసిన తరువాత ప్రదక్షిణము చేస్తూ ఉన్నట్టుగా నడచి వెళ్ళి, భరతుణ్ణి చాటుచేసుకొని నిలుచున్నది.

అప్పుడు ఆ మహానుభావుడు భరద్వాజుడు, "భరతుడా! ఈ నీ తల్లులు ఎవరు ఎవరో నీవే నాకు చెప్పవలెను" అని అడిగినాడు.

భరతుడు చేతులు జోడించి, "ఓ మహాత్మా! ధర్మదేవతవలె కనపడుతున్న ఈ మహాసాధ్వి అత్యుత్కట దుఃఖమువల్లనూ, ఉపవాసాలవల్లనూ కృశించిపోయింది. అదితి కడుపున విష్ణుమూర్తివలె, ఈ నుహోఇల్లాలు కడుపుననే ఆ సింహవిక్రాంతగామి ఆ పురుషోత్తముడు రాముడు పుట్టినాడు. ఈమె మా నాయనగారి పట్టమహిషి కౌసల్యాదేవి. వణకిపోతూ ఉన్న ఈమెను కింద పడిపోకుండా ఎడమ భుజము గట్టిగా పట్టుకొని ఉన్న ఈమె, మనస్సు అంతా పాడు అయిపోయి, పూలు రాలిపోయిన కొండగోగుకొమ్మవలె ఉన్న ఈమె సుమిత్రాదేవి. మా నాయనగారి రెండవ భార్య. అశ్వినీదేవతలవంటి లక్ష్మణ శత్రుఘ్నులను కన్నతల్లి.

"ఓ మహర్షీ! ఎవరినుంచి రామలక్ష్మణులు అడవులపాలు అయి పోయినారో, ఎవతె నుంచి దశరథమహారాజు పుత్రవియోగ దుఃఖముతో స్వర్గతుడు అయిపోయినాడో, ఎవతెనుంచి నేను యిప్పుడు ఇంత దుఃఖము అనుభవించవలసివచ్చిందో, ఆ ఐశ్వర్యకామ, ఆ సౌందర్యవతి, ఆ గర్వి, ఆ కోపధారి, ఆర్యరూపిణిగా కనపడే అనార్య, నా తల్లి కైకేయీదేవి ఈమేను" అని కన్నీళ్ళు కారుస్తూ గద్గదస్వరముతో అన్నాడు. అంతట అతనికి కోపము రేగింది. కన్నులు జ్యోతులు అయిపోయినవి. తాచుపాము బుసలవలె ఉచ్ఛ్వాస నిశ్వాసలు వదలసాగినాడు.

అప్పుడు ఆ మహానుభావుడు, ఆ మహర్షి భరద్వాజుడు, "నాయనా భరతుడా! మీ అమ్మను నీవు తప్పు పట్టవద్దు. అది దైవప్రేరితము. ఆమె అట్లా మీ నాయనగారిని అడిగింది. నీకు తెలియదు. రాముడి అరణ్యావాసమువల్ల ఈ జగత్తు అంతా సుఖపడుతుంది. దేవదానవమానవులు అందరికీ మేలు అవుతుంది. నీవు మీ అమ్మను ఏమీ అనవద్దు" అంటూ వారిని అందరినీ ఆశీర్వదించినాడు. అంతట భరతాదులు ఆ మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసినారు. ఆయనకు వీడ్కోలు చెప్పినారు.

ఆ మహానుభావుడి అనుమతితో భరతుడు సైన్యాన్ని ప్రయాణము కమ్మని ఆజ్ఞాపించినాడు.

భరతుడి చిత్రకూట ప్రయాణము

భరతుడి చతురంగబలాలూ కదిలినవి. మహాజన సమూహమూ ప్రయాణము అయింది. అన్ని ఆడు ఏనుగులూ, అన్ని పోతు టేనుగులూ బంగారు నడికట్టు తాళ్ళతో, మెడలలో పెద్ద పెద్ద గంటలతో, పైన శోభాయమానము అయిన జండాలతో కదిలిపోతూ ఉంటే వానాకాలములో ఉరుములు ఉరుముతూ, మెరుపులు మెరుస్తూ పరుగులు ఎత్తే నీలమేఘాలు నేలమీద పరుగులు ఎత్తుతూ ఉన్నవా అన్నట్టు తోచింది. వాటివెనుక పెద్ద పెద్ద వాహనాలు, చిన్న చిన్న వాహనాలు నడచినవి. ఆ వెనుక అశ్వికులు, వారి వెనక పదాతులు నడచినారు. రాముణ్ణి చూడపోతున్న సంతోషముతో కౌసల్యాది రాజాంగనలు ఉత్తమోత్తమము అయిన వాహనాలమీద బయలుదేరినారు. బాలభాస్కరకాంతులతోనూ, అప్పుడే ఉదయిస్తున్న చంద్రుడివంటి కాంతులతోనూ వెలుగొందుతున్న శిబికను భరతుడు ఎక్కినాడు. పరివారముతో సాగిపోయినాడు.

మహాజన సమూహముతోనూ, ఏనుగులతోనూ, గుర్రాలతోనూ, రథాలతోనూ, ఇంకా ఇతర వాహనాలతోనూ భరతుడి సైన్యము ఉత్తరపు దిక్కునుంచి దక్షిణపు దిక్కుకు పోయే మహా మేఘ సమూహాలవలె గంగానది దక్షిణ దిక్కున భూమిని అంతా ఆవరించి మహారణ్యాలు, పర్వతాలు, సెలయేళ్ళూ దాటుతూ చిత్రకూట పర్వతము వైపు సాగింది. ఆ సేనల కోలాహల ధ్వనులకు అక్కడి మృగ పక్షి సంఘాలు అన్నీ బెదరి చెల్లాచెదరు అయిపోయినవి.

93

భరతుడి మహాసైన్యము చిత్రకూట పర్వతప్రాంతారణ్యములోకి పోయింది. ఆ రథఘోష హేషితధ్వనులకు అక్కడ విహరిస్తూ ఉన్న పోతుటేనుగులు భయపడి అటూ ఇటూ పరుగులెత్తసాగినవి. పెంటి ఏనుగులు ఆ పోతుటేనుగుల వెనక గుంపులు గుంపులుగా పరుగులెత్తసాగినవి. ఆ అపూర్వ ధ్వనులకు ఆదిరిపోయి ఆ అడవిలోనుంచీ, ఆ కొండ నెత్తాలలోనుంచీ, అక్కడి సెలయేళ్ళ పక్కనుంచీ ఎలుగుబంట్లూ, తెల్లచుక్కల జింకల గుంపులు, నల్లచారల పెద్ద పెద్ద దుప్పులు అటూ ఇటూ పరుగులెత్తసాగినవి.

భరతుడి సైన్యము ఏనుగులతోనూ, గుర్రాలతోనూ, రథాలతోనూ, వివిధ వాహనాలతోనూ, మహాజన సమూహముతోనూ సాగిపోతూ ఉంటే, సముద్రము పొంగి పొర్లి భూమిమీదపడ్డట్టూ, వానాకాలములో ఆకాశాన్ని మేఘాలు ఆవరిస్తే ఆకాశము కనపడనట్టూ ఎంతసేపటికీ నేల కనిపించకుండా పోయింది.

ఆ సైన్యము ఆ మహారణ్యములో చాలాదూరము పోయింది. గుర్రాలు ఏనుగులు అలసిపోయినవి. గమనవేగము దాని అంతట అదే తగ్గిపోయింది. అప్పుడు భరతుడు వశిష్ఠమహర్షితో, "ఓ మహర్షీ! ఎట్లా ఉంటుంది అని మనము ఊహించినామో, ఎట్లా ఉంటుంది అని విన్నామో, అటువంటి ప్రదేశానికి ఇప్పుడు మనము వచ్చినట్టు ఉన్నాము. భరద్వాజమహర్షి చెప్పిన ప్రదేశానికే ఇప్పుడు మనము నిజముగా వచ్చినాము. అదే చిత్రకూట పర్వతము. ఆ కనపడుతున్నదే మందాకినీ నది. అదిగో, దూరముగా నల్లటి మేఘమువలె ఒక వనము కనపడుతున్నది. అక్కడనే రామలక్ష్మణులు ఉండి ఉంటారు' అని చెప్పి శత్రుఘ్నుణ్ణి చూచి, "కొండలు అంతటి మన ఏనుగులు చిత్రకూట పర్వత రమ్యసానువులను నలగ త్రొక్కి వేస్తున్నవి. వాటి పాదఘట్టనలకు రాళ్ళు సయితము పిండి పిండి అవుతున్నవి. మంచి బాట ఏర్పడుతున్నది. వానాకాలపు మేఘాలు చినుకులు రాల్చేటట్టు, ఈ పర్వత సానువులలో పొగడచెట్లు ఘుమ ఘుమలాడే పూలను రాలుస్తున్నవి. ఈ మహారణ్యములో ఎటుచూచినా మహాసముద్రములో జలచరాలవలె రకరకాల మృగ సమూహాలు కనిపిస్తున్నవి. శరత్కాల వాయువేగానికి ఆకాశములో అన్నిదిక్కులా మేఘాలు పరుగులు ఎత్తేటట్టు మన సేనల రాకకు ఈ మహారణ్యములో మృగగణాలు అన్నీ భయపడి చెల్లాచెదరు అయి పరుగులు ఎత్తుతున్నవి.

"తమ్ముడా! దాక్షిణాత్యులు కారుమబ్బులవంటి తమ తల వెంట్రుకలను పైకి ఎగతీసి, ముడివేసి, ఆ ముడిలో పలకలు పలకలుగా పూలు పెట్టుకుంటారు. ఇక్కడి నల్లటి చెట్ల చిటారు కొమ్మలలో పూలగుత్తులు అదేవిధముగా కనపడుతున్నవి. ఈ ఘోరారణ్యము ఇంతవరకూ నిర్జనము అయినప్పటికిన్నీ, మన చతురంగ బలాలతో ఇప్పుడు ఇది జనాకీర్ణము అయిన మన అయోధ్యానగరమువలెనే నాకు తోస్తూ ఉంది. మన రథాల వల్లనూ, గుర్రాలవల్లనూ, ఏనుగులవల్లనూ దుమ్మూ ధూళీ ఆకాశమువరకూ రేగుతూ ఉన్నా, వాయుదేవుడు మనలను సంతోషపెట్టడానికి ఏ క్షణానికి ఆ క్షణము ఆ దుమ్మునూ, ధూళినీ అవతలకు పారతోలుతున్నాడు.

"తమ్ముడా! రాముణ్ణి త్వరగా చూడవలెను అనే కుతూహలమునుంచి రథాలు నడుపుతూ ఉన్న సూతముఖ్యులు గుర్రాలను అమితవేగముతో తోలుతున్నారు. మన రథధ్వానాలకు అవిగో, నెమళ్ళు హడలిపోయి పించాలు ఎత్తుకొని తమ తమ నెలవులకు పరుగులు ఎత్తుతున్నవి. శత్రుఘ్నా! ఈ ప్రదేశము మహామనోజ్ఞముగా ఉంది. ఈ బాట నాకు స్వర్గపథముగా కనపడుతున్నది. ఈ ప్రదేశములోనే తాపసులు ఉంటారు. యథార్థము. చూడు, అటు మొగజింకలవెంట ఆడుజింకలు గుంపులు

గుంపులుగా పరుగెత్తుతూ ఉంటే, వాటి ఒంటిమీది తెల్లటి చుక్కలు వాటిమీద ఎవరో వెదచల్లిన పూలవలె మనోహరముగా కనపడుతున్నవి.

"తమ్ముడా! మన సేనలు ఇప్పుడు ఇక్కడ ఎక్కడను అయినా విడిది చేయవలెను. ఇవి విడిది చేసేలోపల మంచి యోధులు కొంతమంది ముందుగా ఈ అడవిలోకి పోయి సీతారామలక్ష్మణులు ఎక్కడ ఉన్నదీ వెదికి తెలుసుకొని రావలెను" అన్నాడు.

భరతుడు ఈ విధముగా చెప్పగానే కొంతమంది యోధులు ఆయుధాలు ధరించి ఆ అడివిలోకి పోయి వెదక సాగినారు. ఆక్కడ ఒక చోట వారు పొగలు పైకి లేవడము చూచినారు. వెంటనే వారు భరతుడి దగ్గరకు తిరిగిపోయి, "రాజా! మేము అదుగో, ఆ ప్రదేశములో ధూమశిఖలు పైకి లేవడము చూచినాము. నిప్పు ఉండనిదే పొగ రాజదు. నిర్జనారణ్యములో ఎక్కడ పడితే అక్కడ అగ్నిహోత్రము ఉండడము అనుభవము కాదు. అందువల్ల సీతారామలక్ష్మణులు అక్కడ ఉన్నారు అని మా ఊహ. ఒకవేళ వారు అక్కడ లేకపోయేటట్లయితే, వారితో సరిసమానము అయిన తాపసులు అయినా అక్కడ ఉంటారు. వారిని అడిగి సీతారామలక్ష్మణులు ఎక్కడ ఉన్నదీ మనము తెలుసుకోవచ్చును" అని చెప్పినారు.

ఆ యోధులు చెప్పింది భరతుడికి సమంజసముగా తోచింది. సేనా నాయకులను చూచి, "నేను సుమంత్రుణ్ణి తోడు చేసుకొని వశిష్ఠమహర్షి వెంట ఆ పొగ లేస్తున్న చోటికి పోయి వస్తాను. మేము తిరిగి వచ్చేవరకూ మీరు అందరూ చడీ చప్పుడూ లేకుండా ఇక్కడనే ఉండలెను" అని ఆజ్ఞాపించినాడు.

భరతుడి ఆజ్ఞప్రకారము చతురంగబలాలు అప్పుడు అక్కడ ఆగిపోయినాయి.

ధూమశిఖలు లేస్తూ ఉన్న ప్రదేశమువంక భరతుడు దృష్టి సారించి చూడసాగినాడు.

భరతుడితో పాటు సేనానాయకులు మొదలు అయినవారు అందరున్నూ ధూమశిఖలు పైకి వ్యాపిస్తున్న వైపే చూడసాగినారు.

94

చిత్రకూట పర్వత విశేషాలు

సీతారామలక్ష్మణులు చిత్రకూట పర్వతముమీద నివాసము పెట్టుకొని ఒక నెలరోజులు అయింది. ఆ దేవసమానుడు రాముడు గిరివనప్రియుడు. అందువల్ల అతనికి ఆ చిత్రకూట పర్వత రామణీయకము ఎప్పటికి అప్పుడు కొత్తగా

కనిపించసాగింది. సీతాదేవికి ఆ మాసము రోజులకే వారు అక్కడికి చేరి ఎంతో కాలము అయినట్టు తోచడము మొదలు పెట్టింది. రాముడు ఆ సంగతి కనిపెట్టినాడు.

రాముడు సీతాదేవిని సంతోషపెట్టడానికీ, తన మానసికోల్లాసానికీ ఆనాడు (భరతుడు చిత్రకూట పర్వతము చేరిననాడు) ప్రాతరనుష్ఠానము అయిపోగానే సీతాదేవిని వెంటపెట్టుకొని దేవలోకములో దేవేంద్రుడు శచీదేవికి వలె, ఆ చిత్రకూట పర్వత చిత్ర విచిత్రాలను అన్నిటినీ చూపిస్తూ నడువసాగినాడు.

"ఓ కల్యాణీ! ఈ చిత్రకూట పర్వత రామణీయకము చూస్తూ ఉంటే నాకు రాజ్యము పోవడముకానీ, స్నేహితుల ఎడబాటుకానీ గుర్తుకే రావడము లేదు. ఓ సీతా! ఎన్నిరకాల పక్షులు ఎంత మనోహరముగా ఈ పర్వతముమీద పాటలు పాడుతున్నవో చూడు. విను. ఈ పర్వత శిఖరాలు ఆ యా ధాతువులతో ధగధగ లాడుతూ ఆకాశాన్ని ఎట్లా ఒరుసుకొని పోతున్నవో చూడు.

"జానకీ! ఈ పర్వత శిఖర ప్రదేశాలు కొన్ని వెండివలె తళతళ లాడుతున్నవి. కొన్ని ఎర్రగా నెత్తురువలె కన్నులను చెదరకొట్టుతున్నవి. కొన్ని పచ్చని పసుపువలెనూ, కొన్ని ఇంద్రనీలమణుల వలెనూ, కొన్ని పుష్యరాగాలవలెనూ, కొన్ని స్ఫటికాలవలెనూ కొన్ని మొగలిపూలవలెనూ, కొన్ని పాదరస ప్రవాహాలవలెనూ, కొన్ని నక్షత్రాల కాంతుల వలెనూ కనబడుతున్నవి.

"ఓ వైదేహీ! ఈ క్షేత్రమాహాత్మ్యము గమనించినావో లేదో, ఇక్కడ పెద్దపులులు, చిరుతపులులు, ఎలుగుబంట్లు మొదలు అయిన ఘాతుకమృగాలూ, జింకలు, దుప్పులు మొదలు అయిన సౌమ్యజంతువులూ, భయంకరము అయిన పెద్ద పెద్ద పక్షులూ, రంగు రంగుల చిన్న చిన్న పిట్టలూ అన్యోన్య వైరము లేకుండా యథేష్టముగా నివసిస్తున్నవి. తిరుగుతున్నవి.

"ఓ దేవీ! ఈ కొండ చరియలలో ఎన్నిరకాల చెట్లు ఎంత మనోహరముగా పెరుగుతూ ఉన్నవో చూడు. మామిడి చెట్లు, నేరేడు చెట్లు, వేగిస చెట్లు, లొద్దుగ చెట్లు, మోరటి చెట్లు, పనస చెట్లు, చంద్ర చెట్లు, ఊడుగు చెట్లు, మంచి తినాసపు చెట్లు, మారేడు చెట్లు, తుమ్మికి చెట్లు, గుమ్ముడు చెట్లు, వేప చెట్లు, ఉలిమిరి చెట్లు, ఇప్ప చెట్లు, బొట్టుగు చెట్లు, రేగు చెట్లు, ఉసిరిగ చెట్లు, మంకెన చెట్లు, ఏరుమద్ది చెట్లు, దానిమ్మ చెట్లు, పేము పొదలు, వెదురు పొదలు ఎట్లా పెరుగుతున్నవో చూడు. పూలు పూసే చెట్లు పూలు పూస్తున్నవి, కాయలు కాసేవి కాయలు కాస్తున్నవి. ఏవి ఏవి ఎందుకు ఉపయోగపడవలెనో అందుకు అనుకూలముగా అవి పెరుగుతున్నవి. అన్ని చెట్లూ చల్లటి నీడను ఇస్తున్నవి. నిజముగా ఈ మహారణ్యము శ్రీమంతము అయింది.

"ఓ కళ్యాణీ! అటు చూడు. ఒండ్లు గగుర్పొడిచేటట్టుగా ఆ కొండ నెత్తాలలో కిన్నెర దంపతులు బద్ధానురాగులు అయి జంటలు జంటలుగా తిరుగుతూ ఉన్నారు. ఓ సీతా! ఇటు చూడు. విద్యాధర స్త్రీ పురుషులు వారి వారి ఆయుధాలనూ, ఆభరణాలనూ చెట్లకొమ్మలమీద పెట్టి పూల చెండ్లతో ఎట్లా ఆడుకొంటున్నారో చూడు. వారి క్రీడా ప్రదేశాలు చూడముచ్చటగా ఉన్నవి.

"సీతా! ఆ కొండ చెమరుస్తున్నట్టుగా పైనుంచి నీళ్ళు ఊరుతున్నవి. ఇది చూస్తూ ఉంటే మదజలము కారుస్తున్న పెద్ద ఏనుగువలె ఆ కొండ కనపడుతున్నది. ఇదిగో, ఆ ఈ గుహలలో నుంచి వస్తూ ఉన్న గాలి నానావిధ పూలతావులతో ఘ్రాణేంద్రియ తర్పణము చేస్తూ ఉంది. ఇందుకు ఎవడు అయినా మురిసిపోకుండా వుండకలడా?

"ఓ సుందరీ! లక్ష్మణుడు నాకు సేవచేస్తూనూ, నీవూ నా సరసను ఉండేటట్లయితే ఎన్ని సంవత్సరాలు అయినా ఏ దిగులూ, విచారమూ లేకుండా ఇక్కడనే ఉంటాను. ఓ భామినీ! ఇక్కడ పూసే రకరకాలపూలూ, ఇక్కడ కాసే రకరకాల స్వాదుఫలాలూ, ఇక్కడ మనోహరముగా పాటలు పాడే రంగు రంగుల పిట్టలూ, రమణీయము అయిన ఈ పర్వత శిఖరాలూ నన్ను ఎంతో సంతోషపెట్టుతూ ఉన్నవి. ఈ ప్రదేశము నా పంచేంద్రియాలనూ సుఖపెట్టుతూ ఉంది.

"ఓ సీతా! ఈ వనవాసమువల్ల సంతోషమూ, సుఖమే కాదు మా తండ్రి ఋణము తీర్చడమున్నూ, మా తమ్ముణ్ణి భరతుణ్ణి సంతోషపెట్టడమున్నూ అవుతూ ఉంది. ఈ విధముగా నాకు మరి రెండు లాభాలు సంప్రాప్తము అవుతున్నవి.

"ఓ వైదేహీ! నీవు మనోవాక్కాయములను వశము చేసుకొని ఇక్కడ పూసే పూలు పెట్టుకొంటూ, ఇక్కడ దొరికే ఫలాలు తింటూ, కోకిలాలాపాలు వింటూ, మందమలయానిలము అనుభవిస్తూ, ఇక్కడి వివిధ జంతువుల విలాసచేష్టలు చూస్తూ నాతో ఈ చిత్రకూట పర్వతముమీద ఈ ఆడవులలో సుఖముగా కాలము గడపవలెను. ఓ రాణీ! వనవాసమువల్ల దేహాంతాన స్వర్గసౌఖ్యము అనుభవిస్తాము అనీ, వనవాసము మోక్ష సాధనము అనీ మా తాత ముత్తాతలూ, ఇంకా ఇతర రాజర్షులూ చెప్పినారు.

"ఓ శుభాంగీ! ఈ పర్వతశిలలు ఇప్పుడు తెల్లగా ఎర్రగా కనపడడమే కాదు, రాత్రిపూట ఈ పర్వతముమీది వివిధ మహౌషధులూ నిజకాంతులతో తేజరిల్లుతూ ఉంటే, ఈ శిలలు అన్నీ అగ్నిశిఖలవలే నేత్రపర్వముగా కనపడుతూ ఉంటవి. ఓ జానకీ! చూడు, ఈ పర్వత ప్రదేశాలు కొన్ని పాదరిండ్లవలెనూ కనపడుతూ ఉన్నవి. ఈ చిత్రకూట పర్వతము భూమిని ఛేదించుకొని పైకి వచ్చి ఉంటుంది. అందువల్లనే ఈ పర్వత శిఖరము ఇంత రమణీయముగా ఉంది.

"ఓ కల్యాణీ! అవిగో, అక్కడ నల్లకలువలతోనూ, కమలదళాలతోనూ పున్నాగ పూలతోనూ, పుత్రజీవి పూలతోనూ, భూర్జ పత్రాలతోనూ కాముకులు పరచుకొన్న పరుపులు. వారి ఒంటి రాపిడికి నలిగిపోయిన కమలమాలికలను వారు అవతల పారవేసినారు. వారు రకరకాల పండ్లు తిన్న గుర్తులు కనబడుతున్నవి.

"సీతా! ఈ చిత్రకూట పర్వతము ఇన్నిరకాల కందమూలాలతో, ఇన్నిరకాల ఫలాలతో, ఇన్ని స్వచ్ఛజలాలతో అమరావతీ పట్టణాన్నీ, అలకా పట్టణాన్నీ మానస సరోవరాన్నీ, సౌగంధిక సరోవరాన్నీ, ఉత్తర కురుదేశాలనూ అతిశయించింది.

"ఓ దేవీ! నేను ఇక్కడ ఉత్తమ నియమాలతో పెద్దలు పోయిన దారి తప్పకుండా నీతో పద్నాలుగు ఏండ్లూ వనవాసము చేసిన తరువాత మన కులధర్మము అయిన ప్రజాపాలనానికి పూనుకొంటాను" అని రాముడు సీతాదేవితో చెప్పినాడు.

95

ఈ విధముగా చిత్రకూట పర్వతాన్ని గురించి చెప్పుతూ, రాముడు సీతాదేవిని వెంటబెట్టుకొని ఆ కొండ దిగి పవిత్రోదకాలతో ప్రవహిస్తూ ఉన్న మందాకినీ నది దగ్గరకు పోయినాడు.

అప్పుడు అక్కడ ఆ రాజీవాక్షుడు రాముడు ఆ చారుచంద్రవదనను, ఆ ఘననితంబను సీతాదేవిని చూచి, "ఓ కల్యాణీ! ఈ మందాకినీ నదిని చూడు. ఈ నదిలో ఇసుక తిన్నెలు (నీ నితంబాలవలె) చిత్రముగా కనబడుతున్నవి. ఇక్కడ హంస సారస కూజితాలు (నీ నూపురధ్వనులవలె) శ్రవణానందము కలిగిస్తూ ఉన్నవి. కమలాలు (నీ కరచరణవదనాలవలె) ముచ్చటలు కొలుపుతున్నవి.

"సీతా! ఈ తీరాన పెరుగుతూ ఉన్న నానావిధపుష్ప ఫలవృక్షాలనుంచి ఈ మందాకినీ నది కుబేరుడి సౌగంధిక సరస్సు ఏమో అనిపిస్తూ ఉంది చూడు.

"ఇదిగో చూడు, ఆ రేవులో మృగసమూహాలు నీళ్లు త్రాగినందువల్ల స్వచ్ఛజలాలు ఎర్రగా బురదలు అయిపోయినవి. అయితే, తక్కిన రేవులు చూస్తూ ఉంటే నాకు సంతోషము వేస్తూ ఉంది. ఈ నదిలో స్నానము చేయవలెను అని బుద్ధిపుట్టుతూ ఉంది. ఓ ప్రియురాలా! ఇది స్నాన సమయము. చూడు, జటావల్కలాజినధారులు అయిన ఋషులు ఇప్పుడు ఈ నదిలో అవగాహన స్నానము చేస్తున్నారు. ఓ విశాలాక్షీ! అటు చూడు, తీవ్రనిష్ఠాపరులు అయిన మరికొంతమంది మునులు చేతులు ఎత్తి సూర్యోపస్థానము చేస్తున్నారు.

"ఓ సీతా! అటు చూడు! ఈ పర్వతాగ్రభాగాన శిఖరాలవలె ఉన్న వృక్షాలు వాయువేగానికి అటూ ఇటూ ఊగులాడుతూ, ఈ నది అంతటా పూలూ ఆకులూ వెదజల్లుతూ ఉంటే, నృత్యము చేయపోయేవారు చేతులు ఎత్తి చుట్టూ పూలు చల్లుతున్నట్లుగా కనబడుతున్నది. ఈ మందాకినీ శోభకు ఆ చెట్లు నృత్యము చేయబోతున్నవి కాబోలు!

"ఓ దేవీ! ఈ మందాకినీ నదిలో ఒకచోట జలాలు ముత్యాల కాంతులతో తళతళలాడుతూ ప్రవహిస్తున్నవి. ఒకచోట ఇసుకతిన్నెలు మనోహరముగా కనబడుతున్నవి. ఒకచోట సిద్ధ జనులు స్నానము చేయడానికి మూగుతున్నారు. (ఇది చూస్తూ ఉంటే మందాకినీ నది శ్వేతవసనము ధరించి పృథుజఘనాలతో కాముకులను ఆకర్షిస్తూ నడచిపోతున్న సుందరాంగనవలె కనబడుతున్నది.)

"ఓ భామినీ, చూడు. గాలికి రాలిన పూవులు రాసులు రాసులుగా తెప్పలు తెప్పలుగా తేలియాడుతూ ఉంటే స్వచ్ఛజలాలు కనపడుతూ వున్నవి. (ఇట్లా కొంతమేర దట్టము అయిన పూలరాసులతోనూ, కొంతమేర పూలరాసులు అన్నీ కదలిపోయి స్వచ్ఛజలాలతో కనపడుతూనూ ఉంటే ఈ మందాకినీనది ప్రియుడు లాగివేసినందువల్ల చీర సగము జారిపోయిన సుందరాంగనవలె కనబడుతున్నది.)

"ఓ కళ్యాణీ! అవిగో చూడు. ఎప్పుడూ మనోహరముగా పాటలు పాడే చక్రవాకపక్షులు జంటలుగా జంటలుగా ఇప్పుడు రతికాలికస్వనాలతో ఆ పూలరాసుల మీదకి ఎక్కుతూ ఉన్నవి.

"ఓ శోభనా! నాకు అయోధ్యాపురముకన్నా ఈ చిత్రకూట పర్వత నివాసమే మనోహరముగా ఉంది. నీకన్నా మన్మథోద్దీపకము అయిన ఈ మందాకినీ నదిని చూస్తూ ఉంటే నాకు ఎక్కువ సంతోషము వేస్తూ ఉంది.

"ఓ భామినీ! నిష్కల్మషులు అయి, బాహ్యేంద్రియాలనూ, అంతరింద్రియాలనూ తపోబలముతో నిగ్రహించిన సిద్ధులు ఎప్పుడూ ఈ నదిలో స్నానము చేయడము నుంచి ఈ నదీజలాలు పవిత్రము అయినవి. అందువల్లనే, ఈ మందాకిని పుణ్యనది అయినది.

"ఓ సీతా! నీవు ఈ పుణ్యనదిలో నీ చెలికత్తెతోవలె నాతో ఏవిధము అయిన అరమరా లేకుండా చనువుతో జలకమాడవలెను. ఓ ధవళాక్షీ! (నీ కన్నులను చూచి తెల్ల తామరలు), ఓ కమలపాణీ! (నీ అర చేతులను చూచి ఎర్రతామరలు సిగ్గుపడి తలలు వంచుకొనవలెను) నీవు నాతో ఈదేటప్పుడు, నీ స్తన జఘనాల తాకిడికి లేచే తరంగాలలో ఈ తెల్లతామరలూ, ఎర్రతామరలూ మునిగిపోవలెను.

"ఓ సీతా! ఇక నీవు ఈ చిత్రకూట పర్వతాన్నే అయోధ్యగానూ, ఈ మందాకినినే సరయూనదిగానూ భావించు. ఈ అడవిలో జంతువులే పౌరులు అనుకో! ఓ భామినీ! నా తమ్ముడు ధర్మాత్ముడు లక్ష్మణుడు నా మాట మీరి ఎరగడు. నీవు ఇంతవరకూ నన్ను ఏ క్షణమూ ఎడబాయకుండా ఎప్పటికి అప్పుడు నా మనస్సు తెలుసుకొని నన్ను సంతోషపెట్టుతూ ఉన్న ఇల్లాలివి. ఏ మానవుడికి అయినా తన ఆజ్ఞలను శిరసావహించే తమ్ముడూ, తనను నిరంతరమూ ప్రేమించే ఇల్లాలు ఉంటే ఈ లోకములో కొదవ ఏమిటి ఉంటుంది?

"ఓ సీతా! నేను ప్రొద్దునా, మధ్యాహ్నమూ, సాయంత్రమూ ఈ మందాకినీ పుణ్యోదకాలలో స్నానముచేస్తూ, కందమూలాలూ ఫలాలూ తింటూ, తేనె తాగుతూ ఉంటే, నీవు నన్ను ఎడబాయకుండా ఈ చిత్రకూట పర్వత సానువులలో నాతో సంచరిస్తూ ఉంటే, నాకు అయోధ్యా నగరము ఎందుకు? నేను రాజ్యపాలనము చేయడము ఎందుకు? నాకు రెండూ అక్కరలేదు.

"ఓ సీతా! ఈ మందాకినీ తీరాన మందలు మందలుగా వన్యమృగాలు సంచరిస్తూ ఉంటవి. సింహాలూ, పెద్దపులులూ, ఏనుగులూ, కోతులూ, జింకలూ తమ అన్యోన్య వైరాన్ని అవతలపెట్టి, ఈ నదిలో ఒక్క రేవులో ఒక్క మారుగా నీళ్ళు త్రాగి దాహము తీర్చుకొంటూ ఉంటవి. ఇది ఈ మందాకినీ నది మహిమ. ఈ నదిలో స్నానము చేస్తే సమస్తాయాసాలూ సమసిపోతవి. ఈ మందాకినీ నదిలో స్నానము చేసిన తరువాత సుఖము అనుభవించనివాడు ఒక్కడూ లేడు" అంటూ, రాముడు మందాకినిని గురించి మనోహరము అయిన మాటలు చెప్పుతూ సీతాదేవిని వెంట బెట్టుకొని కన్నులకు పెట్టుకొనే కాటుకవలె వివిధవృక్షాలతో నల్లగా కనిపించే చిత్రకూట పర్వత సానువులలోనికి పోయినాడు.

96

భరతునిపై లక్ష్మణుని కోపము

రాముడు మందాకినీ నదీ సౌందర్యాన్ని సీతాదేవికి చూపించి తెలియ చెప్పిన తరువాత, ఉభయులూ తమ నివాసానికి వచ్చినారు. రాముడు ఆమెచేత నానావిధ మాంసాలూ తినిపించడానికి ఆమె నోరు ఊరిస్తూ, "ఓ సీతా! ఇది పరిశుభ్రము అయిన మాంసము. చాల రుచిగా ఉంది. ఇది చక్కగా నిప్పులలో పేల్చింది" అని చెప్పుతూ ఉండగా, ఎట్టఎదుట ఆకాశము వరకూ దుమ్ము రేగింది. మహాభయంకరము అయిన ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లిపోయినవి. మదము ఎక్కి వీరవిహారము చేస్తూ ఉన్న పోతు టేనుగులు భయపడి పరుగులు ఎత్తుతూ ఉంటే, పెంటి ఏనుగులు మందలు మందలుగా దారి తెలియకుండా పరుగులు ఎత్తసాగినవి. రాముడు ఆ

మహాధ్వనిని ఆలకించినాడు. జరుగుతున్నది అంతా చూచినాడు. తమ్ముణ్ణి పిలిచి, "లక్ష్మణా! అదిగో, ఆ వైపు చూడు, మేఘగర్జనలవలె మహాభయంకర ధ్వనులు వినబడుతున్నవి. ఏనుగులూ, ఎనుపోతులూ, జింకలూ భయపడి వాయువేగముతో పరుగులు ఎత్తుతున్నవి. ఎవడు అయినా రాజుకానీ, రాజమాత్రుడుకానీ వేటాడడానికి ఈ అడవికి వచ్చినాడా? లేకపోతే సింహము ఏది అయినా చెలరేగిందా? కాకపోతే ఏ క్రూరజంతువు అయినా కొత్తగా ఈ అడవిలోకి వచ్చిందా? చూడు నాయనా! పక్షులు సయితము సంచారము మానివేసినవి. కంటికి కనపడకుండా దాక్కొన్నవి. ఇది ఏమిటో నీవు తెలుసుకోవలెను" అని రాముడు చెప్పినాడు.

అంతట లక్ష్మణుడు ఆకులు అన్నీ రాలిపోయి ఎటుపడితే అటు చూడటానికి వీలుగా ఉన్న ఒక చెట్టు ఎక్కినాడు. ఉత్తరపుదిక్కునుండి రథాలమీద రథికులూ, గుర్రాలమీద రౌతులూ, ఏనుగులమీద గజపాదులూ, భూమిమీద పదాతులూ సన్నద్ధులు అయి వస్తూ ఉన్నవారిని చూచినాడు. దృష్టి సారించి ఆ చతురంగబలాలు ఎవరివో తెలుసుకొన్నాడు. ఆ చెట్టుమీద నుంచే, "అన్నా రామా!" అంటూ పిలిచి, "ఓ రామా! సీతాదేవిని వెంటనే గుహాలోనికి పంపించు. అగ్నిహోత్రము ఆర్పు. కవచాదులు తొడుగుకో, బాణాలు తీసుకో. ధనుస్సు ఎక్కుపెట్టు" అంటూ తొందర చేయసాగినాడు.

"లక్ష్మణా! ఆ వస్తూ ఉన్న సైన్యము ఎవరిది అని నీవు అనుకొంటున్నావు" అని రాముడు ప్రశ్నించినాడు. లక్ష్మణుడికి కోపము వచ్చింది. అగ్నిహోత్రమువలె మండిపోతూ, ఆ వస్తూ ఉన్న సైన్యాన్ని అంతా దహించివేయ పోతున్నట్టుగా చురచుర చూస్తూ, "రామా! కైకేయీదేవి వరముతో పట్టము కట్టుకొన్న భరతుడు చతురంగ బలాలతో వస్తూ ఉన్నాడు. రాజ్యము అకంటకముగా వీలవలెను అనుకొని ఉంటాడు. అందుకు, మనలను చంపివేయడానికి వస్తున్నాడు. అదిగో, రథముమీద కోవిదార ధ్వజము. శ్రీమంతము అయిన విటపీ ధ్వజాన్ని సైనికులు పట్టుకొని వస్తూ ఉన్నారు.

"అరుగో! ఆశ్వికులు వాయువేగముతో పరుగులుఎత్తే గుర్రాల మీద సన్నద్ధులు అయి వస్తూ ఉన్నారు. గజసాదులు మహోత్సాహముతో మత్తగజాలమీద సన్నద్ధులు అవుతున్నారు. రామా! మనము ఇప్పుడు ధనుస్సులు తీసికొని ఈ కొండలమీదికి అయినా పోవలెను లేదా ఇక్కడనే ఆయుధాలతో సన్నద్ధులము అయి నిలువవలెను.

"అడుగో, భరతుడు కోవిదార ధ్వజముతో వస్తూ ఉన్నాడు. రామా! ఎవడినుంచి నీవూ, నేనూ, సీతాదేవీ ఇన్ని కష్టాలు పడవలసి వచ్చిందో వాడు, ఆ భరతుడు వస్తున్నాడు. రామా! ఓ వీరా! ఎవడినుంచి శాశ్వతము అయిన రాజ్యము నీ చెయ్యి జారిపోయిందో ఆ భరతుడు వస్తూ ఉన్నాడు. వాడు మన శత్రువు. వాడు వధ్యుడు.

సందేహము లేదు. వాణ్ణి వధించడము దోషము కాదు. వాడు నీకు అపకారము చేసినాడు. అపకారము చేసినవాణ్ణి సంహారము చేయడము అధర్మము కాదు. వాడు నీకు అపకారము చేయడమే కాదు, ధర్మహాని చేసినాడు. వాణ్ణి చంపివేయవలెను. నేను వాణ్ణి చంపివేస్తాను. వాడు చనిపోయిన తరువాత నీవు ఈ భూమిని అంతా పరిపాలించవలెను.

"రామా! మహావృక్షాన్ని ఏనుగు విరిచివేసేటట్టు భరతుణ్ణి నేను చీల్చి వేస్తాను. వాడి చావు చూచి రాజ్యకాముకి అయిన వాడి తల్లి దుఃఖించవలెను. అప్పుడు కైకేయీదేవిని సభాంధవముగా, సానుబంధముగా వధించివేస్తాను. ఈ భూమిమీద కైకేయీరూప మహాపాపాన్ని నిర్మూలనము చేసివేస్తాను.

"రామా! ఇంతకాలమూ నా కోపాన్నీ, అవమానాన్నీ అణచుకొన్నాను. ఇప్పుడు ఎండుగడ్డివామిమీద నిప్పుపెట్టేటట్టు, ఈ శత్రుసైన్యముమీద చిచ్చులు కురిపిస్తాను. నా తీక్షణ బాణాలతో శత్రువులను నుగ్గు నుగ్గు చేస్తాను. ఈ చిత్రకూట పర్వతము అంతా నెత్తురు వరదలు అయి పారేటట్టు చేస్తాను. నా బాణాలకు చిన్నాభిన్నము అయిపోయే ఏనుగులనూ, గుర్రాలనూ, మనుష్యులనూ ఈ మహారణ్యములో సంచారము చేసే సింహాలూ, పెద్దపులులూ, చిరుతపులులూ ఈడ్చుకొని పోయి తినవలెను.

"అన్నా, రామా! జరగబోయే మహాసంగ్రామములో భరతుణ్ణి ససైన్యముగా సంహారము చేసివేస్తాను. శరబుణవిముక్తుణ్ణి బాణబుణ విముక్తుణ్ణి అవుతాను" అన్నాడు.

97

రాముడు భరతుని ప్రశంసించుట

ఇట్లా ఒండ్లు ఎరగని కోపము వచ్చి ఏవేవో మాటలు అంటూ, యుద్ధానికి సన్నద్ధుడు అవుతూ ఉన్న లక్ష్మణుడితో, "తమ్ముడా! భరతుడు మహాధనుర్ధరుడు. అంతేకాదు, వాడు మహాప్రాజ్ఞుడు. వాడు స్వయముగా వస్తూ ఉంటే మనకు ధనుస్సుతో పని ఏమిటి? ఖడ్గముతో పని ఏమిటి?

"పిత్రాజ్ఞను శిరసావహించి రాజ్యపాలనము చేస్తూ నన్ను చూడడానికి వచ్చిన తమ్ముణ్ణి చంపివేసి రాజ్యము సంపాదించినందువల్ల లాభము ఏమిటి? లోక నిందపాలు కావడముతప్ప మరి ఏ ప్రయోజనమూ ఉండదు. నీవు నిజముగా యుద్ధము చేసి భరతుణ్ణి చంపివేసేటట్టయితే, నాయనగారు వాడికి ఇచ్చిన రాజ్యము నేను ఏలుతాను అని నీవు అనుకొంటున్నావేమో! బంధువులూ, మిత్రులూ మొదలు అయినవారి మృతనష్టస్వము నేను విషభక్ష్యముగా భావిస్తాను. నేను అటువంటి దానిని ముట్టను.

"లక్ష్మణా! ధర్మముకానీ, అర్థముకానీ, కామముకానీ ఈ రాజ్యముకానీ మీ అందరి సౌఖ్యము కోసము నాకు కావలెను. కాని, నా ఒక్కడి కోసము కాదు. తమ్ముడా! నీవు నా మాట నమ్ముతున్నట్టు లేదు" అంటూ, రాముడు చేతిలో ఖడ్గము తీసుకొని, "లక్ష్మణా! ఇదిగో శపథము చేసి చెప్పుతున్నాను. నేను నా తమ్ములను సంతోషపెట్టడానికీ, సుఖపెడ్డటానికీ రాజ్యపాలనము చేయవలెను అనుకొన్నాను కాని నా ఒక్కడి సుఖము కోసము కాదు. ఓ లక్ష్మణా! సముద్రవలయితము అయిన ఈ భూమిని అంతా సంపాదించే సామర్థ్యము నాకు లేకపోలేదు. అయితే, ధర్మమార్గాన నాకు సంప్రాప్తము అయ్యేదానినే నేను అనుభవిస్తాను. అధర్మమార్గాన నాకు ఇంద్రత్వము లభించినా నేను అంగీకరించను.

"తమ్ముడా! భరతుడికీ, నీకూ, శత్రుఘ్నుడికీ లేని ఏ సుఖమూ నాకు అక్కరలేదు. మీకులేని నా సుఖము అగ్నిహోత్రములో భస్మము అయిపోవలెను. లక్ష్మణా! భరతుడు నాకు ప్రాణము కన్నా ప్రియుడు. వాడు భ్రాతృవత్సలుడు. వాడు కులధర్మాన్ని ఆలోచించి వాడి అంతటవాడే గిరివ్రజపురమునుంచి అయోధ్యకు వచ్చి ఉంటాడు. నన్ను అరణ్యవాసము చేయమనడమూ, నేను జటావల్కలాలు ధరించి జానకితోనూ, నీతోనూ అడవికి పోవడమూ విని, వాడి హృదయము వికలము అయిపోయి ఉంటుంది. ఎంతో దుఃఖించి ఉంటాడు. వాడికి కోపమువచ్చి వాడి తల్లి కైకేయీదేవిని తిట్టి ఉంటాడు. నాయనగారిని ప్రసన్నుణ్ణి చేసికొని, వారిని సమాధానపరచి నాకు రాజ్యపాలనము ఒప్పగించడానికి సైన్యాలను వెంటపెట్టుకొని ఈ విధముగా ఇక్కడకు వస్తున్నాడు అని నాకు తోస్తున్నది. వాడు తాతగారి ఇంటినుంచి అయోధ్యకు చేరిన తరువాత మనలను చూడరావడము ఒప్పు, చూడ రాకపోవడము తప్పు. అందుకోసము వాడు వస్తున్నాడు. వాడు మనస్సులో అయినా అప్రియము తలపెట్టి ఉండడు. వాడు మనకు ఎన్నడూ, ఏ అపకారము చేయడు.

"లక్ష్మణా! భరతుడు ఇదివరకు ఎప్పుడు అయినా నీకు ఏమి అయినా అపకారము చేసినాడా? వాడు ఎప్పుడు అయినా నీవలె భయజనకముగా మాట్లాడినాడా? నీవు ఇప్పుడు వాణ్ణి ఎందుకు శంకిస్తున్నావు? నీవు వాణ్ణి గురించి ఏమి అన్నా నన్ను అన్నట్టే. లక్ష్మణా! ఏదో ఆపదకు కారణము అయినాడు అని తండ్రిని కొడుకు చంపి వేయవలెను అని చెప్పడమూ, తోబుట్టువును చంపివేయ తలపెట్టడమూ నావల్ల కాదు. నేను అటువంటి పని చేయను, చేయనీయను.

"లక్ష్మణా! రాజ్యహేతువునుంచే నీవు అట్లా ఆలోచిస్తూ ఉన్నట్లయితే, భరతుడు ఇక్కడికి రాగానే వాడితో రాజ్యపాలనము నీకు ఒప్పగించమని చెప్పుతాను.

నేను చెప్పే చెప్పడముతో వాడు మంచిది అంటూ, నీకు రాజ్యపాలనము ఒప్పగించి ఊరక ఉంటాడు. మరి ఒక మాట అనడు" అని రాముడు చెప్పినాడు.

ఈ విధముగా రాముడు చెప్పిన మాటలు విని, లక్ష్మణుడు సిగ్గుపడిపోయినాడు.

లక్ష్మణుడు స్వార్థపరుడు కాడు. ఎప్పుడూ రాముడి మంచిని గురించే యోచిస్తూ ఉంటాడు. అందువల్ల, భరతుణ్ణీ, సేనలనూ చూడగానే రాముడికి ఏమి కీడు మూడుతుందో అని భయపడి దిగులుపడి పోయినాడు. ముందువెనుకలు ఆలోచించకుండా అట్లా అన్నాడు. రాముడు తెలియచెప్పగానే సిగ్గుపడిపోయినాడు. తల వంచుకొన్నాడు.

అంతట లక్ష్మణుడు ఆ ప్రస్తావన మార్చివేయవలెను అనుకొని, "రామా! మన నాయనగారే మనలను చూడడానికి వస్తున్నారు ఏమోను" అన్నాడు.

"అవును, దశరథమహారాజే మనలను చూచిపోవలెను అనుకొని వస్తున్నాడు ఏమో! మన పాట్లు చూచి మనలను మళ్ళీ అయోధ్యకు తీసుకొనిపోవలెను అనుకొని వస్తున్నాడు ఏమోను! మనలను కాకపోయినా సీతాదేవిని తీసుకొనిపోవడానికి వస్తున్నాడు అనుకొంటాను" అంటూ సైన్యమువంక పారచూస్తూ, "లక్ష్మణా! వాయువేగముతో పరుగులు ఎత్తే నాయనగారి గుర్రాలజోడు కనపడుతున్నది. అదిగో, నాయనగారు ఎక్కే శత్రుంజయము. ఆ ముసలి ఏనుగు తల ఆడించుకొంటూ మహాకాయముతో సేనా ముఖాన నడుస్తూ ఉంది. అయితే, లోకపూజ్యము అయిన శ్వేతచ్ఛత్రము మాత్రము ఆ ఏనుగుమీద కనిపించడము లేదు. అందువల్ల, నాకు ఏదో సందేహము వేస్తూవుంది. లక్ష్మణా! నీవు చెట్టుమీదనుంచి దిగు. నామాట విను" అన్నాడు రాముడు.

లక్ష్మణుడు చెట్టు దిగి వచ్చినాడు. అంతట అన్నదమ్ములు ఇద్దరూ దృష్టులు సారించి సైన్యమువంక చూడసాగినారు.

చతురంగబలాలూ చిత్రకూట పర్వతపార్శ్వాన ఒకటిన్నర యోజనము మేర విడిది చేసి ఉండడము రామలక్ష్మణులు చూచినారు.

98

భరతుడు వశిష్టాదులతో రాముని చూడబోవుట

ఆ చతురంగబలాలనూ, ఆ మహాజనసమూహాన్నీ వెంటపెట్టుకొని పోయేటట్లయితే రాముడు ఎంత బాధపడిపోతాడో అనే భయముతో, భరతుడు వారిని అందరినీ అక్కడ ఆగిపొమ్మన్నాడు. అప్పుడు వారు అందరూ ఆ చిత్రకూట పర్వతపార్శ్వాన ఒకటిన్నర యోజనముమేర ఆ యా ప్రదేశాలలో విడుదులు ఏర్పరచుకొన్నారు.

భరతుడు ఆ మహారణ్యములో రామాశ్రమము వెతకడానికి సన్నద్ధుడు అయినాడు. వినీత వేషము ధరించినాడు.

శత్రుఘ్నుణ్ణి చూచి, "తమ్ముడా! ఈ మహారణ్యములో మనము అందరమూ కాలినడకన పోయి రామాశ్రమము వెదకవలెను. మన గురువులూ, బ్రాహ్మణ ముఖ్యులూ అమాత్యులూ, పౌరముఖ్యులూ మనవెంట వస్తారు. నీవున్నూ బోయవాండ్లను వెంటతీసుకొని రావలెను. గుహుడున్నూ శరచాపఖడ్గధారులు అయిన వెయ్యిమంది నిషాదులతోనూ బయలుదేరి రావలెను.

"తమ్ముడా! సీతారామలక్ష్మణులను సందర్శించేటంతవరకూ నా కన్నుల కరవు తీరదు. ఆ పద్మపత్రాక్షుడి సుందరాననము సందర్శించేటంతవరకూ నాకు సంతోషము అనేది లేదు. ఆ రాజలక్షణలక్షితాంగుణ్ణి, అరికాళ్ళలో ధ్వజమూ వజ్రమూ కమలమూ అంకుశమూ అమృత కలశమూ అనే రేఖలు ఉన్న ఆ రాముణ్ణి సందర్శించే టంతవరకూ నాకు ఏమీ తోచదు. పితృపైతామహము అయిన కోసల దేశానికి రాజార్షుడు అయిన రాముడికి రాజ్యాభిషేకము అయ్యేటంతవరకూ నా మనోవ్యథ శమించదు.

"తమ్ముడా! చంద్రబింబమువంటి ఆ రాజీవాక్షుడి ముఖబింబము ఎప్పుడూ చూచే లక్ష్మణుడు ధన్యుడు. సముద్రవలయితము అయిన పృథ్విని అంతా ఏలవలసిన ఆ మహాతేజోవంతుణ్ణి వెంబడించిన ఆయన ఇల్లాలు జనకరాజసుత ధన్యాత్మురాలు.

"కుబేరుడు తన చైత్రరథము అనే ఉద్యానవనము వదలిపెట్టి విహరించడానికి నందనోద్యానవనానికి పోయినట్టు, రాముడు అయోధ్య వదలిపెట్టి చిత్రకూట పర్వతము వచ్చి చేరినాడు. ఆ మహాతేజోవంతుడు, ఆ సకల శస్త్రాస్త్రకోవిదుడు రాముడు దురవగాహమూ, దుష్టమృగాకీర్ణమూ అయిన ఈ చిత్రకూట పర్వతానికి రావడము నుంచి ఇది (పార్వతీపరమేశ్వరులు నివసించే) హిమవత్పర్వతము అంతటిది అయింది. పుణ్యక్షేత్రము అయింది" అని చెప్పుతూ ఆ మహాభుజుడు, ఆ పురుషర్షభుడు పరివారముతో ఆ చిత్రకూట పర్వతారణ్యములో నడువసాగినాడు.

రాముణ్ణి ప్రార్థించవలసిన పద్ధతిని గురించీ, అందుకు ఆ మహానుభావుడు చెప్పే యుక్తులకు పయి యుక్తులను గురించీ ఆలోచించుకుంటూ భరతుడు ఆ కొండ నెత్తాలలో నడచి నడచి కొనలు విరగపూసిన పూలచెట్లు ఉన్న ఒకానొక ప్రదేశానికి పోయినాడు. అప్పుడు ఆ పూలచెట్ల మధ్యనుంచి ఎటుపోవలెనో అతనికి తెలియలేదు. అక్కడ విరగపూసి ఉన్న ఒక సాలవృక్షము ఎక్కి అన్నివైపులా చూచినాడు. ఎట్ట ఎదుట రామాశ్రమము అగుపించింది. ఆ ఆశ్రమములో అగ్నిహోత్రమూ, పయికి ఎంతో ఎత్తున లేస్తున్న పొగలూ చూచినాడు.

అంతట భరతుడు, అదే రామాశ్రమము అని వెంట ఉన్న వారికి అందరికీ చెప్పినాడు. అందరూ ఆనందపరవశులు అయినారు.

మహాసముద్రములో పడిపోయి ఎట్లాగో ఈదుకొనివచ్చి గట్టున పడ్డవానివలె భరతుడు మయిమరచి పోయినాడు.

99

అంతట భరతుడు తన వెంట వచ్చినవారిని అందరినీ వెనుకకు వెళ్ళి పొమ్మని చెప్పినాడు. తన తల్లులను అందరినీ వెంటబెట్టుకొని రమ్మని వశిష్ఠమహర్షిని ప్రార్థించినాడు. గుహుణ్ణి, శత్రుఘ్నుణ్ణి వెంటబెట్టుకొని రామాశ్రమముపైపు అమిత వేగముతో నడువసాగినాడు. రాముణ్ణి ఎప్పుడు ఎప్పుడు చూడడమా అని తహతహ లాడుతూఉన్న సుమంత్రుడున్నూ, తక్కిన అమాత్యులున్నూ వారి వెనుకనే నడచినారు. వారు అట్లా కొంత దూరము నడువగా ఎట్టఎదుట వారికి రామాశ్రమము కనిపించింది.

ఆ రామాశ్రమము తాపసుల ఆశ్రమాల మధ్యన ఉన్నది. అదిన్నీ తాపసుల గృహమువలెనే తీర్చిదిద్ది నిర్మించింది. ఒక పర్ణకుటి. అగ్నిహోత్రగృహము, దానికి ఇవతల చూడవచ్చిన వారు సుఖముగా కూర్చుండడానికి ఒక పర్ణ మండపము ఉంది. దేవపూజ కోసము తెచ్చిపెట్టుకొన్న పూలు ఆ పర్ణశాలలోనూ, రాత్రిపూట మంటలు వేసుకొనడానికి విరిచి తెచ్చుకొన్న ఎండుకట్టెపుల్లలు బయటనూ ఉన్నవి. చలి కాచుకోవడానికి మృగ మహిషాల పేడకడులు ఎండినవి ఆ పక్కను రాసులుగా ఉన్నవి. ఆ ఆశ్రమానికి వచ్చే పోయే వారికి దారి తెలియడానికి గుర్తుగా చెట్లకొమ్మలకు వల్కలాల పేలికలూ, దర్భలూ కట్టి ఉన్నవి.

వీటిని అన్నిటినీ చూచి ఆ ద్యుతిమంతుడు భరతుడు వెంటవస్తున్న వారితో, "భరద్వాజమహర్షి చెప్పిన ప్రదేశానికి మనము ఇప్పుడు వచ్చినట్టు ఉన్నాము. ఈ సమీపములోనే మందాకినీ నది ఉండవలెను. అకాల వికాల సాయంకాలాలలో అడవి లోనికి పోవడానికికానీ, రావడానికికానీ దారి తెలిసేటందుకోసం ఆ ఈ చెట్ల కొమ్మలకు వల్కలాల పేలికలు లక్ష్మణుడే కట్టి ఉంటాడు. ఈ దారినే మనమూ నడుద్దాము.

"అవిగో, మదము ఎక్కిన ఏనుగులు, పరస్పరమూ కలహించి చెవులు గింగుర్లు ఎత్తేటట్టు గీమని అరుస్తూ పెద్ద పెద్ద దంతాలతో ఒక దాన్ని ఒకటి పొడుచుకొంటూ, కుమ్ములాడుతూ కింద నేలను చిందరవందరగా తొక్కుతున్నవి. అందువల్ల, ఈ ప్రాంతంలో నేలను పట్టి దారిని తెలుసుకోవటము దుర్లభము.

"అదిగో, తాపసులు సాయంప్రాతర్హోమాల కోసము ఎప్పుడూ పదిలముగా ఉంచుకొనే అగ్నిహోత్రాలలోనుంచి నల్లటి పొగలు దట్టముగా లేస్తున్నవి, నాయనా,

శత్రుఘ్నా! ఆ ఎదుట కనిపిస్తున్న ఆశ్రమములోనే రాముడు మంత్రోపదేశాలు చేసే మహర్షివలె కూర్చుని ఉంటాడు. మనము పోయి సంతోషముగా సందర్శించుతాము' అని చెప్పుతూ నడిచినాడు.

వారు అట్లా మరికొంతదూరము నడచినారు. మందాకినీ నదీతీరము చేరినారు. అప్పుడు భరతుడు వెంటవస్తున్న వారిని చూచి, "ఆ పురుషోత్తముడు, ఆ జనేంద్రుడు ఈ నిర్జనారణ్యములో వీరాసనస్థితుడు అయి ఉన్నాడా? చీ ఛీ! నా జన్మ ఎందుకు? నేను బ్రతికి ఉండడము ఎందుకు? ఆ మహాద్యుతిమంతుడు, లోకనాథుడు రాముడు నావల్ల సమస్త సౌఖ్యాలూ కోలుపోయి అడవులపాలు అయినాడు అనే అపకీర్తి నాకు వచ్చింది. ఏమి చేయడము? ఆ మహానుభావుడు రాముడికి మొక్కుతాను. సీతాదేవి కాళ్ళమీద పడతాను. లక్ష్మణుడికిన్నీ సాష్టాంగ పడతాను. వారిని ప్రసన్నులను చేసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తాను" అని చెప్పుతూ, దుఃఖపడుతూ ముందుకు నడిచినాడు.

ఎట్టఎదుట వారికి రామాశ్రమము కనిపించింది. అది ఎంతో విశాలము అయింది. పర్ణశాల ఎత్తుగా ఉంది. తాటి ఆకులతోనూ, మద్ది ఇనుమద్ది ఆకులతోనూ పైనకప్పు వేసిఉంది. యజ్ఞశాలలో దర్భలు పరచి ఉన్నవి. ఎటువంటి శత్రువులను అయినా సంహారముచేసే రెండు ధనుస్సులు ఆ పర్ణశాలలో వేళ్ళాడుతూ ఉన్నవి. అవి ఎంతో బరువు అయినవి. సారవంతము అయినవి. అవి దేవేంద్రుడి వజ్రాయుధము వంటివి. అక్కడ అంబులపొదులలో బాణాల ధగధగ కాంతులు కన్నులు మిరుమిట్లు కొలుపుతూ సూర్యకిరణాలవలెనూ, భోగవతీపురములో సర్పాలవలెనూ కనిపించినవి. బంగారు ఒరలతో ఖడ్గాలు తళతళలాడుతూ కనిపించినవి. చిత్రవిచిత్రము అయిన రంగులతోనూ, బంగారు చుక్కలతోనూ, ఉడుముతోలు హస్తకవచాలూ, అంగుళీత్రాణాలూ అక్కడ కనిపించినవి. ఆ పర్ణశాల ఎవరూ ఎదిరింప నలవికాని సింహాల గుహవలెనూ, ఈశాన్య భాగాన పల్లముగా ఉన్న వేదిలో అగ్నిహోత్రము జ్వలిస్తూ పుణ్యాశ్రమమువలెనూ కనిపించింది. భరతాదులు లోపలికి పోయినారు.

భరతాదులు రాముని దర్శించుట

జటామండలధారి అయి కూర్చున్న ఆ తేజోవంతుణ్ణి భరతుడు ఒక్క ముహూర్తముసేపు చూచినాడు. ఆ మహానుభావుడు రాముడే అని నిశ్చయించినాడు. ఆ సింహస్కంధుడు, ఆ పుండరీక విశాలాక్షుడు, సముద్రవలయితము అయిన ఈ భూమిని అంతా ఏలవలసిన ఆ మహాబాహువు, ఆ ధర్మాచరణ పరాయణుడు రాముడు నల్లజింకతోలు ఉత్తరీయముగా కప్పుకొని, వల్కలాలు కట్టుబట్టలుగా కట్టుకొని, నేలమీద పరచిన దర్భలపైన వీరాసనము వేసుకొని సీతాలక్ష్మణులు సేవిస్తూ ఉంటే శాశ్వత బ్రహ్మదేవుడివలె కూర్చుని ఉన్నాడు.

ఆ ధర్మాత్ముణ్ణి ఆ మహాత్ముణ్ణి రాముణ్ణి భరతుడు చూచినాడు ఆయన దగ్గరకు పరుగెత్త పోయినాడు. పట్టశక్యముకాని దుఃఖము వచ్చింది. ఎట్లాగో ధైర్యము తెచ్చుకొన్నాడు. నిలుచుండి పోయినాడు. వెంటవచ్చిన వారిని చూచి, "మహాజన సభామధ్యములో మహాయోగ్యులు అయినవారు సేవించిన రాముణ్ణి, ఇప్పుడు ఇక్కడ వన్యమృగాలు సేవిస్తూ ఉన్నవి. మహార్హ వస్త్రాలు ధరించిన ఆ ధర్మాత్ముడికి ఇప్పుడు కృష్ణాజినము ఉత్తరీయము అయింది. వల్కలాలు కట్టుబట్టలు అయిపోయినవి. ఉత్తమోత్తమము అయిన పూలు ముడిచిన అతని శిరము ఇప్పుడు జడలు కట్టుకొని పోయింది. ఎప్పుడూ చందన చర్చలు చేసిన అతని దేహము ఇప్పుడు దుమ్ము కొట్టుకొని పోయింది. యథావిధిగా యజ్ఞాలు చేసి పుణ్యార్జనము చేయవలసిన ఆ రాజకుమారుడు ఇప్పుడు దేహాయాసధర్మము పాటించవలసి వచ్చినది. ఆ మహామహితాత్ముడికి ఈ కష్టాలు అన్నీ నావల్ల వచ్చినవి అని లోకము నిందిస్తూ ఉంది. ఇక నేను జీవించి ప్రయోజనము ఏమిటి" అని చెప్పుతూ, భరతుడు శోకపరీతుడు అయిపోయినాడు. అతని ముఖకమలములోనుంచి స్వేద బిందువులు రాలసాగినవి. రెండు కన్నులనిండా నీళ్ళు కమ్ముకొన్నవి. ముందుకు అడుగు పడలేదు. రాముడి సమీపానికి పోలేకపోయినాడు. చేతులు ఎత్తి, "ఓ పూజ్యుడా!" అన్నాడు. అతని గొంతు ఎండిపోయింది. మరి ఒక మాట పెగలలేదు. అక్కడనే నేలమీద సాష్టాంగపడిపోయినాడు.

శత్రుఘ్నుడు రోదనముచేస్తూ రాముడి పాదాలమీద పడి నమస్కారము చేసినాడు. రాముడు భరత శత్రుఘ్నులను ఇద్దరినీ లేవదీసి కౌగలించుకొన్నాడు.

భగచక్రములో సూర్యచంద్రులను శుక్రబృహస్పతులు కలుసుకొన్నట్లు ఆ మహారణ్యములో అప్పుడు రామలక్ష్మణులను గుహుడూ, సుమంత్రుడూ కలుసుకొన్నారు.

ఆ మహారణ్యములో గజరాజువలె కలుసుకొన్న ఆ చిన్నతమ్ములను, ఆ రాజపుత్రులను చూచి సర్వసంగపరిత్యాగము చేసిన ఋషులు సహితము కన్నీరు కార్చినారు.

100

వివర్ణము అయిపోయిన ముఖముతో, కృశించిపోయిన దేహముతో చేతులు ఎత్తి నమస్కారముచేసి యుగాంతకాలాన తేజోహీనుడు అయిన సూర్యుడివలె నేలమీద సాగిలపడ్డ జటావల్కలధారి భరతుడు అని రామునికి చప్పున స్ఫురించలేదు. అయితే గుర్తుపట్టి పట్టడముతో రాముడు భరతుణ్ణి తన రెండుచేతులా లేవనెత్తి

కౌగలించుకొన్నాడు. శిరము ఆఘ్రాణించినాడు. తన ఒడిలో కూర్చుండపెట్టుకొని "నాయనా! నీవు ఈ అడవికి వచ్చినావు ఏమిటి? మన నాయనగారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? వారిని వదలిపెట్టి నీవు ఇట్లా రావచ్చునా? తమ్ముడా! నిన్ను చూచి బహుకాలము అయినది. నీవు దూరదేశమునుంచి అయోధ్యకు రావడమే కాకుండా, నన్ను చూడడానికి వచ్చినావు సంతోషమే. నిన్ను నేను మొదట గుర్తుపట్టలేకపోయినాను. గుర్తుపట్టడానికి వీలులేనంతగా మారిపోయినావు. ఇప్పుడు నీవు ఎందుకు ఇట్లా వచ్చినావు ? రాజసూయాశ్వమేధాది మహాయజ్ఞాలు చేసిన పరమధార్మికుడు, ఆడితప్పనివాడు, మన తండ్రి దశరథమహారాజు కుశలముగా ఉన్నాడా? ఆ సత్యవిక్రముడికి నీవు శుశ్రూష చేస్తూ ఉన్నావా?

"తమ్ముడా! మన తండ్రి దుఃఖముతో హఠాత్తుగా పరలోకగతుడు అయిపోలేదుకదా? ఆయన జీవించి ఉండగా నీవు ఇట్లా రావచ్చునా?

"తమ్ముడా! మా అమ్మ కౌసల్యాదేవి కుశలముగా ఉందా? సత్పుత్రులను కన్న మన అమ్మ సుమిత్రాదేవి సుఖముగా ఉన్నదా? పూజ్యురాలు నిన్ను కన్న మన అమ్మ కైకేయీదేవి కుశలముగా నున్నదా?

"భరతుడా! నీవు పసివాడవు. తరతరాలనుంచి అనుభవిస్తూ ఉన్న రాజ్యము భ్రష్టము అయిపోలేదుకదా? నీవు ఇట్లా ఎందుకు వచ్చినావు" అని అడిగిన రాముడు భరతుణ్ణి తేరిపార చూడసాగినాడు.

101

"రామప్రభూ! నీకు సేవచేయడమే నాకు పరమధర్మము. ఆ ధర్మము వదిలిపెట్టి నేను రాజ్యపాలనము ఎట్లా చేస్తాను? జ్యేష్ఠపుత్రుడు జీవించి ఉండగా కనిష్ఠుడు రాజ్యపాలనము చేయకూడదు. ఇది రాజ ధర్మము. ఈ రాజ ధర్మాన్ని మన పూర్వీకులు వంశక్రమానుగతముగా పాటించినారు. ప్రభూ! నీవు ఇప్పుడు నాతో అయోధ్యకు రావలెను. ఇక్ష్వాకువంశాభ్యుదయము కోసము నీవు పట్టాభిషేకము చేసుకోవలెను.

"ప్రభూ! రాజూ ఒక మనుష్యుడేను అనేవారుకూడా నీ ధర్మప్రవర్తనము మానవాతీతము అంటున్నారు. నీవు నాకు దేవుడవు. (దేవత్వ సిద్ధికి తపశ్చరణము ఒక్కటే సాధనము కాదు. ధర్మార్థ లోపము లేకుండా రాజ్యపాలనము చేయడమువల్లనూ దేవత్వము సిద్ధిస్తుంది. తపశ్చరణము దేవత్వానికి క్లేశద్వారము. రాజ్యపాలనము దేవత్వానికి భోగద్వారము. అంతే భేదము.)

ప్రభూ! నేను అప్పటికి కేకయరాజు పట్టణములోనే ఉన్నాను. మన తండ్రి దశరథమహారాజు స్వర్గతుడు అయినాడు. నీవు సీతాదేవితోనూ, లక్ష్మణుడితోనూ అయోధ్య వదలిపెట్టి వెళ్ళగానే ఆ సజ్జనాగ్రగణ్యుడు, ఆ మహాయజ్ఞ దశరథమహారాజు దివంగతుడు అయినాడు.

"ఓ పురుషోత్తమా! నీవు ఇక లేచి వెంటనే నాయనగారికి జలతర్పణాలు వదలవలెను. ఆ పని నేనూ శత్రుఘ్నుడూ ఇదివరకే చేసినాము. అన్నా! ప్రియపుత్రుడి జలతర్పణాలే పితృలోకములో మహాఫలప్రదాలు అవుతవి అని పెద్దలు చెప్పుతున్నారు. నీవు దశరథమహారాజు ప్రియపుత్రుడవు. నిన్ను గురించి దుఃఖపడుతూ, నిన్ను చూడవలెను అనుకుంటూ, నీమీద లగ్నము అయిన మనస్సు మళ్ళించుకోలేక నిన్నే స్మరిస్తూ ఆయన అస్తమించినాడు. నీవు వెంటనే జలతర్పణాదులు వదలవలెను" అని భరతుడు చెప్పినాడు.

102

రామలక్ష్మణులు దశరథునికి పిండప్రదానము చేయుట

భరతుడు చెప్పిన దశరథమహారాజు మరణ వృత్తాంతము, యుద్ధములో దేవేంద్రుడు వదిలిన పిడుగువలె రాముని చెవుల పడ్డది. అతడు చేతులు నులుపుకొంటూ లేచి నిలుచున్నాడు. అడవిలో గండ్రగొడ్డళ్ళతో వేళ్ళు తెగవేసిన పెద్ద పూలచెట్టువలె దభాలున నేలమీద పడిపోయినాడు. ఏటి ఒడ్డున దంతాలతో కుమ్మికుమ్మి అలసిపోయి నేలమీదపడ్డ మదపుటేనుగువలె మూర్ఛపోయి కన్నులు మూసుకొన్నాడు. అట్లా నేలమీద పడిఉన్న అ శోకపీడితుడిమీద సీతాదేవీ, భరతలక్ష్మణశత్రుఘ్నులూ దుఃఖముతో తపించిపోతూ, చల్లటి నీళ్లు చల్లి శైత్యోపచారాలు చేసినారు. అంతట కొంతసేపటికి ఆ ధర్మాత్ముడికి తెలివి వచ్చింది. అపరిమితముగా కన్నీళ్ళు కారుస్తూ, "ఇప్పుడు నేను ఏమి చేసేది? నా దుఃఖముతో ఆయన పోయినాడా? అంత్యకాలాన ఆయన కళేబరానికి దహన సంస్కారము అయినా చేయలేక పోయినాను. ఆ మహాత్ముడి కడుపున పుట్టినాను. నేను బ్రతికి ఉండి ప్రయోజనము ఏమిటి? ఆహా! నేను ఎంతో దురదృష్టవంతుణ్ణి? ఓ భరతుడా! ఓ శత్రుఘ్నుడా! మీరు ఆయన ప్రేతకార్యాలు చేసినారు. మీరు చరితార్థులు.

"ఓ భరతుడా! ఈ వనవాస కాలము అంతా అయిపోయిన తరువాతను అయినా నేను అయోధ్యకు రాను. నా గడువు కాలము అయిపోయిన తరువాత నేను అక్కడికి వస్తే, నాకు అక్కడ మంచి చెడ్డలు చెప్పేవారు ఎవరు? నన్ను శాసించేవారు ఎవరు? తమ్ముడా! నా సువృత్తము మెచ్చుకొని నన్ను సంతోషపెట్టేవారు ఎవరు? నా చెవులకు ఇంపు అయిన మాటలు చెప్పేవారు ఎవరు?" అంటూ శోకముతో తపించి

పోతూ, చందమామవంటి సీతాదేవి ముఖము చూస్తూ, "సీతా! నీ మామగారు చనిపోయినారు. ఓ లక్ష్మణా! నీకు ఇక తండ్రి లేడు. భరతుడు ఈ దుఃఖవార్తను చెప్పుతున్నాడు" అంటూ రాముడు ఏడువసాగినాడు.

భరత లక్ష్మణ శత్రుఘ్నులున్నూ కన్నీళ్ళు కారుస్తూ రాముణ్ణి ఓదార్చి "అన్నా రామా! ఆ లోకనాథుడికి మన తండ్రికి ఉదక దానము చేయవలెను" అని చెప్పినారు.

సీతాదేవి కన్నులలో నీళ్ళు గిర్రున తిరిగినవి. ఆమె పెనిమిటివంక చూడలేక పోయింది. ఏడువసాగింది. ఆ జనకరాజసుతను రాముడు ఊరడించి లక్ష్మణుడితో "తమ్ముడా! ఇకను ఇంగుదీపిణ్యాకము (గారవిత్తుల పిండి) తీసుకో. స్నానము చేయడానికి నాకు అంగవస్త్రములు తెచ్చి పెట్టు. మహాపూజ్యులు అయిన నాయనగారికి ఉదక దానము చేద్దాము. ఓ సీతా! నీవు ముందు నడువవలెను. లక్ష్మణా, నీవు ఆమె వెనుక నడువవలెను. నేను మీ ఉభయుల వెనుక నడుస్తాను. ఈపనికి మనము ఈ విధముగా పోవలెను. ఇట్లా పోవడము దారుణము అయిన పద్ధతేను" అన్నాడు.

తరతరాలనుంచి వారిని అనుసరించుకొన్న మహామతిమంతుడూ, మృదుస్వభావుడూ, శాంతుడూ, దాంతుడూ, విదితాత్ముడూ అయిన రామభక్తుడు సుమంత్రుడు రాముణ్ణీ భరత లక్ష్మణ శత్రుఘ్నులనూ ఓదారుస్తూ మందాకినీ నదీతీరానికి తీసుకొని పోయినాడు. అక్కడ పగలు అంతా చల్లటి నీడ ఇచ్చే పూలచెట్లు ఉన్న రేవును, స్నానయోగ్యముగా నీరు వడిగా పారుతూ బురద లేకుండా ఉన్న రేవును చూచినాడు. ఆ రేవులో సీతారామలక్ష్మణులు నదిలో దిగి స్నానము చేసినారు. దోసిళ్ళనిండా నీళ్ళు తీసుకొన్నారు. అప్పుడు రాముడు దక్షిణముఖుడు అయి ఏడుస్తూ, " ఓ తండ్రీ! పితృలోకానికి పోయిన నీకు ఇప్పుడు నేను వదులుతూ ఉన్న ఈ నిర్మలోదకాలు అక్షయసుఖాన్ని ఇవ్వవలెను" అంటూ నీళ్ళు వదలినాడు.

అంతట ఆ తేజోవంతుడు రాముడు ఆ రేవులో నుంచి ఇవతలికి వచ్చి గారపిండిని రేగుపండ్ల గుజ్జుతో కలిపి ముద్దలు ముద్దలు చేసినాడు. దర్భలు పరచి వానిమీద ఆ పిండాలను ఉంచినాడు. ఆ పిండాలవంక చూచినాడు. రాముడికి అప్పుడు పట్టరాని దుఃఖము వచ్చింది. ఆయన ఏడుస్తూ, " ఓ దశరథమహారాజా! మాకు ఇప్పుడు ఈ ఇంగుదీపిణ్యాకమే ఆహారము. ఎవడికి ఏది ఆహారమో, దానినే వాడు వాడి దేవతలకు పెట్టకలడు" అన్నాడు.

అంతట ఆ పురుషోత్తముడు ఆ నదీతటము నుంచి బయలుదేరి ఆ కొండనెత్తములో ఉన్న తన పర్ణశాలకు పోయినాడు. ఆ పర్ణశాల ద్వారము దగ్గర భరత లక్ష్మణ శత్రుఘ్నులను కాగలించుకొని పెద్ద పెట్టున ఏడ్చినాడు.

సీతా రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల రోదన ధ్వనులు సింహగర్జనలవలె ఆ చిత్రకూట పర్వతము అంతటా ప్రతిధ్వనించినవి. ఆ తుములధ్వనికి భరతుడి సైనికులూ, మహాజనులూ భయపడిపోయినారు. సైనికులు ఆలోచించినారు. రాముణ్ణి భరతుడు కలుసుకొని ఉంటాడు అనీ, పితృమరణానికి వారు అంత భయంకరముగా రోదనము చేస్తూ ఉన్నారు అనీ నిశ్చయించినారు.

భరతుడి వెంట వచ్చిన పౌరముఖ్యులు మొదలు అయిన మహాజనులు అక్కడ ఉండలేకపోయినారు. ఆ మహాధ్వనికి అభిముఖముగా పరుగెత్తినారు. కొందరు గుర్రాలమీదనూ, మరికొందరు ఏనుగులమీదనూ, ఇంకా కొందరు రథాల మీదనూ, మిగతావారు అందరూ కాలినడకనూ ఆ కొండ చరియలలో బయలుదేరినారు. రాముడు వనవాసము చేయడము మొదలుపెట్టి ఒక మాసము మాత్రమే అయినప్పటికిన్నీ, ఆయనను చూచి ఎంతోకాలము అయినట్టుగా వారికి తోచింది. అందువల్ల, అందరూ అమితవేగముగా పోసాగినారు. వానాకాలములో మేఘాలు సంచారముచేస్తూ ఉంటే ఆకాశములో ఉరుములు ఉరుముతూ భయంకరము అయిన చప్పుళ్ళు అయ్యేటట్టు అప్పుడు ఆ మహారణ్యములో గుర్రాలూ, ఏనుగులూ, రథాలూ, మహాజన సమూహాలూ అంత సంరంభముతో పరుగులు ఎత్తుతూ ఉంటే భూమి మీద భయంకరము అయిన చప్పుళ్ళు అయినవి. చెవులు చిల్లులు పడిపోయే ఆ చప్పుళ్ళకు భయపడి పోతుటేనుగులు పెంటి ఏనుగులతో అక్కడనుంచి మరి ఒక వనములోకి పరుగులు ఎత్తుతూ ఉంటే, వాటి మదజల సుగంధము ఆ చరియలలో గుబాళించింది.

అడవిపందులూ, తోడేళ్ళూ, దున్నపోతులూ, గురుపోతులూ, పెద్దపులులూ కోతులూ, దుప్పులూ, జింకలూ భయపడి అన్నివైపులా పరుగులు ఎత్తి పారిపోయినవి.

చక్రవాకపక్షులూ, కారండవపక్షులూ, కొంచపిట్టలూ, హంసలూ, నీరుకోళ్ళూ కొంగలూ, కోకిలలూ భయపడి బారులుతీరి ఎగిరిపోతూ అటు ఆకాశము అగుపించకుండా చేసినవి. భరతుడివెంట వచ్చిన జనసమూహాలు ఇటు భూమి కనిపించకుండా చేసివేసినవి.

అట్లా ఆ మహాజనులు పోయి పోయి ఆ కొండ నెత్తముమీద, ఆ పర్ణశాలలో నేలమీద కూర్చొని ఉన్న ఆ పురుషోత్తముణ్ణి రాముణ్ణి చూచినారు. వారు అందరూ కైకేయీ మంధరలను ఏకముగా తిట్టుతూ, కన్నీళ్ళు కారుస్తూ రాముడి ఎదుటికి పోయినారు. రాముడు వారిని అందరినీ చూచి లేచి పోయి పెద్దలను తన తండ్రివలెనూ, ఆడవాండ్లను తన తల్లివలెనూ కౌగలించుకొన్నాడు. తక్కినవారు అందరూ ఆయనకు

పాదాభివందనము చేసినారు. రాముడు వారి వారి యోగ్యతలను అనుసరించి బంధువులనూ, ఇంకా తక్కినవారినీ ఆదరించి పలుకరించి కుశలము అడిగినాడు.

ఆ మహాత్ముణ్ణి చూస్తూ వారు అందరూ దుఃఖము అణచుకోలేక పెద్ద పెట్టున ఏడ్చినారు. ఆ రోదన ధ్వనులు అప్పుడు భూమ్యాకాశాలలోనూ, గిరిగుహలలోనూ అన్ని దిక్కులనూ మారు మ్రోగి మద్దెళ్ళ చప్పుళ్ళుగా వినిపించినవి.

103

కౌసల్యాదులు రాముని చూచుట

వశిష్ఠమహర్షి దశరథమహారాజు భార్యలను అందరినీ వెంటపెట్టుకొని రాముడి దగ్గరకు బయలుదేరినాడు.

ఆ రాజపత్నులు అందరూ మందగమనముతో మందాకినీ నదీతీరము చేరినారు. రామలక్ష్మణులు స్నానము చేసే రేవు చూచినారు. ఆ ప్రదేశము చూడగానే కౌసల్యాదేవికి దుఃఖము వచ్చింది. గొంతు ఎండిపోయింది. కన్నీళ్ళు కారుస్తూ సుమిత్రాదేవినీ, తక్కిన రాజపత్నులనూ చూచి, "వాండ్లు ఎవరినీ దుఃఖపెట్టలేదు. కష్టపెట్టలేదు. వాండ్లను దేశమునుంచి వెళ్ళకొట్టినారు. వాండ్లు అనాథలు అయిపోయినారు. వాండ్లు - రామలక్ష్మణులు స్నానము చేసే రేవా ఇది? సుమిత్రా! నీ కొడుకు ఎప్పుడూ ఏమరుపాటు లేకుండా నా కొడుకుకు నీళ్ళు తెచ్చి పెట్టేది ఈ రేవులో నుంచే. నీ కొడుకు ఇటువంటి నీచపు పనులు చేస్తూన్నా, వాడి గౌరవానికి ఏ లోపమూ లేదు. జ్యేష్ఠభ్రాత తండ్రివంటివాడు. అటువంటి వాడికి శుశ్రూష చేయడము గుణమేకాని దోషము కాదు. నీ కొడుకు ఇటువంటి కష్టాలు పడవలసినవాడు కాడు. ఇటువంటి తక్కువ పనులు చేయవలసినవాడు కాడు. ఇక త్వరలోనే వాడి కష్టాలు అన్నీ తొలగిపోతవి" అంటూ కొంచెము దూరము నడిచింది. నేలమీద దక్షిణాగ్రముగా పరచిన దర్భలనూ, వాటిమీద ఉన్న ఇంగుదీపిణ్యాకపు పిండాలనూ ఆ విశాలనేత్రి చూచింది. ఆ పిండాలను రాజపత్నులకు అందరికీ చూపించి, "ఆ మహాత్ముడికి ఇక్ష్వాకునాథుడికి జ్యేష్ఠపుత్రుడు రాముడు యథాశాస్త్రముగా పెట్టిన పిండాలు ఇవి. దేవేంద్రుడితో సరిసమానము అయిన ఆ మహానుభావుడికి, సమస్త భోగమూ అనుభవించిన ఆ మహారాజుకు ఇప్పుడు ఆహారము ఇదా? చతుస్సముద్ర మధ్యస్థలూ అయిన భూమండలాన్ని ఏలిన దశరథమహారాజు ఈ గారపిండి పిండాలు తినవలెనా? రాముడు అంతటి వాడికి తండ్రికి ఇంగుదీపిణ్యాకపు పిండాలు పెట్టవలసిన దురవస్థ వచ్చింది. ఇంతకన్నా ఈలోకములో దుఃఖపడవలసిన విషయము ఏమి ఉంటుంది? ఇది చూచి నా గుండెలు బ్రద్దలు అయిపోకుండా ఉన్నవే! అవును- ఎవడు ఏది తింటాడో వాడు అదే వాడి దేవతలకున్నూ పెట్టుతాడు అనేది లోకప్రసిద్ధము

అయిన శ్రుతివాక్యము. అది యథార్థము అయింది" అంటూ కౌసల్యాదేవి ఏడువ సాగింది. సవతులు ఆమెను ఓదారుస్తూ మెల్లగా రామాశ్రమానికి నడిపించినారు.

స్వర్గములోనుంచి దిగివచ్చిన దేవతవలె అక్కడ రాముడు కనిపించినాడు. సమస్తభోగాలూ త్యజించిన ఆ పురుషోత్తముణ్ణి చూచీ చూడడముతో రాజపత్నులు అందరూ ఘొల్లుమన్నారు.

రాముడు వెంటనే లేచి తల్లులకు అందరికీ సాష్టాంగ నమస్కారము చేసినాడు. కౌసల్యాదేవి కన్నీళ్ళు కారుస్తూ రాముణ్ణి లేవనెత్తింది. ఆమె, ఆమెతోపాటు తక్కిన రాజాంగనలూ తమ మృదు హస్తాలతో ఆ మహానుభావుడి వీపును అంటుకొన్న దుమ్మును అంతా దులిపినారు.

లక్ష్మణుడున్నూ తల్లులు అందరికీ నమస్కారము చేసినాడు. వారు అందరూ రాముణ్ణివలెనే లక్ష్మణుణ్ణీ ఆదరించినారు.

సీతాదేవి కన్నీళ్ళు కారుస్తూ అత్తలకు అందరికీ పాదాభివందనము చేసింది. వనవాసమువల్ల కృశించిపోయిన తన కోడలిని కౌసల్యాదేవి తల్లి కూతురినివలె కౌగలించుకొని, "సీతా! నీవు జనకమహారాజు కూతురివి. దశరథమహారాజు కోడలివి. రాముడి ఇల్లాలివి. నీవు ఈ నిర్జనారణ్యములో ఇట్లా కష్టాలు అనుభవించవలసి వచ్చింది. ఎండకు ఎండిపోయిన కమలమువలెనూ, నలిగిపోయిన కలువపూవువలెనూ, దుమ్ముకొట్టుకొన్న బంగారమువలెనూ, మబ్బులు కమ్ముకొన్న చంద్రబింబమువలెనూ అయిపోయినావు? నిన్ను చూస్తూ ఉంటే అరణి కట్టెలలోనుంచి అగ్నిహోత్రము పుట్టి ఆ కట్టెలనే దహించివేసేటట్టు, నాలో దుఃఖాగ్ని రగులుకొని నన్ను దహించివేస్తూ ఉంది" అంటూ కూతురితో మాట్లాడినట్లు మాట్లాడుతూ ఉంది.

అప్పుడు రాముడు బృహస్పతికి దేవేంద్రుడువలె, అగ్నిహోత్రునితో సరిసమానము అయిన తేజోవంతుడు వశిష్ఠమహర్షికి సాష్టాంగ నమస్కారము చేసినాడు.

వశిష్ఠమహర్షీ, రాముడూ కూర్చున్న తరువాత మంత్రులతోనూ, అయోధ్యాపుర ముఖ్యులతోనూ, సైనికాధికారులతోనూ, పరమధార్మికులు అయిన బ్రాహ్మణోత్తముల తోనూ భరతుడు అక్కడికి వచ్చినాడు. వచ్చి, దివ్య కాంతులతో తేజరిల్లుతూ ఉన్న రాముణ్ణిచూచి శిరసా నమస్కారము చేసి, బ్రహ్మదేవుడి ఎట్టెదుట దేవేంద్రుడివలె కూర్చున్నాడు.

ఇకను అప్పుడు భరతుడు రాముడితో ఏమి మాట్లాడుతాడో వినవలెను అనే కుతూహలముతో అందరూ చెవులు దోరగిల పెట్టుకొని కిక్కురుమనకుండా కూర్చున్నారు.

అప్పుడు రామ లక్ష్మణ భరతులు యజ్ఞశాలలో త్రేతాగ్నులవలె తేజరిల్లినారు.

104

రామ భరతుల సంభాషణ

భరతుడు కేవలమూ తనమీద భక్తివల్లనే జటావల్కలాలు ధరించి రాజ్యము వదిలిపెట్టి వచ్చినాడు అని రాముడు తెలుసుకొన్నాడు. లక్ష్మణుణ్ణి దగ్గరపెట్టుకొని "తమ్ముడా భరతుడా! నీవు జడలుదాల్చి, వల్కలాలు కట్టుకొని, కృష్ణాజినము ధరించి ఇక్కడికి ఎందుకు వచ్చినావు" అని ప్రశ్నించినాడు. భరతుడు సమాధానము చెప్పకుండా దుఃఖపడుతూ ఉంటే, రాముడు అతణ్ణి పట్టుకొని కౌగలించుకొని "నాయనా! రాజ్యము వదిలిపెట్టి ఈ మహారణ్యానికి వచ్చినావు, కారణము ఏమిటి" అని అడిగినాడు.

భరతుడు చేతులు జోడించి, "అన్నా! మన తండ్రి దశరథమహారాజు నిన్ను అడవికి పంపించడము అనే అకార్యము చేసినాడు. అందువల్లనే, పుత్రశోకముతో బాధపడుతూ స్వర్గతుడు అయిపోయినాడు. ఓ పరంతపా! ఆడుది నా తల్లి కైకేయీదేవి ప్రేరేపిస్తే ఆయన నిన్ను అడవులకు పంపించినాడు. అందువల్ల, తనకు అపకీర్తి వస్తుంది అని ఆయనకు తోచలేదు. సుపుత్రుణ్ణి అందులో జ్యేష్ఠుణ్ణి అకారణముగా అడవులకు వెళ్ళకొట్టడము మహాపాపము అని ఆయన అనుకోలేదు. నా తల్లి కైకేయీదేవి, కోరిక సఫలము కాకుండానే విధవ అయిపోయింది. ఇకను ఆమె దుఃఖముతో కృశించిపోయి మహాఘోరనరకము అనుభవించవలెను. నేను ఆమె కడుపున పుట్టినందుకు అపవాదము నాకు వచ్చింది. రామా! నేను నీ దాసుణ్ణి. నన్ను నీవు అనుగ్రహించవలెను.

"అన్నా! దేవేంద్రుడివలె నీవు ఇప్పుడే రాజ్యాభిషేకము చేసుకో. ఇంతమంది వచ్చి నిన్ను ప్రార్థిస్తున్నారు. వీరిని అనుగ్రహించు. మన తల్లులు అందరూ విధవలు అయిపోయి నీ దగ్గరకు వచ్చినారు. వారిని అనుగ్రహించు. నీవు మన కులగౌరవాన్ని కాపాడవలెను. జ్యేష్ఠక్రమాన్నిపట్టి, రక్షించే సామర్థ్యాన్నిపట్టి నీవే రాజ్యము ఏలవలెను. ఇది ధర్మము కాబట్టి నీవు రాజ్యపాలనము స్వీకరించి, నీ సుహృదులను అందరినీ సంతోషపెట్టవలసి ఉంది. ఇప్పుడు దశరథమహారాజు లేనందువల్ల ఈ భూమికి వైధవ్యము వచ్చింది. అందువల్ల, నీవు రాజ్యాభిషేకము చేసుకొని శరద్రాత్రిని చంద్రునివలె ఈ భూమిని శోభిల్లచేయవలెను.

"రామా! నేనూ, ఈ మంత్రులూ, ఈ ప్రజలూ నిన్ను శిరసా యాచిస్తున్నాము. నేను నీ తమ్ముణ్ణి. తమ్ముణ్ణే కాదు, నేను నీ శిష్యుణ్ణి.

శిష్యుణ్ణేకాదు, నీ దాసుణ్ణి. నీవు నన్ను అనుగ్రహించవలెను. ఓ పురుషశార్దూలమా! వీరు, ఈ మంత్రులు ఈనాటివారు కారు. మన తండ్రి తాతల కాలమునుంచీ మంత్రులుగా ఉన్నారు. వీరిని మన పూర్వీకులు గౌరవించినారు. వీరు అందరూ ఇప్పుడు ఏక కంఠులు అయి చెపుతున్న మాటలను నీవు తోసివేయకూడదు" అంటూ, కైకేయీ పుత్రుడు భరతుడు చేతులు చాచి రాముడి పాదాలు పట్టుకొని శిరసా నమస్కారము చేసినాడు. లేవకుండా కన్నీళ్ళతో రాముడి పాదాలు తడిపివేసినాడు.

నేలమీద పడ్డ మదపుటేనుగువలె మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ లేవకుండా ఉన్న భరతుణ్ణి లేవనెత్తి కౌగిలించుకొని, "తమ్ముడా! నీవంటి కులీనుడు, సత్యసంపన్నుడు, తేజస్వి, చరితవ్రతుడు రాజ్యాభిషేకము కోసము, జ్యేష్ఠుడికి రాజ్యము లేకుండా చేసే పాపానికి పాల్పడడు. నీలో లేశము అయినా దోషము ఉంది అని నేను అనుకోలేదు. నాకు అట్లా ఎన్నడూ తోచలేదు. నీవు పసితనమువల్ల నిన్ను కన్న తల్లిని దూషిస్తున్నావు. ఇది నీకు తగదు.

"తమ్ముడా! నీవు పాపరహితుడవు. మహాప్రాజ్ఞుడవు. నీకు తెలియనిది ఏమీ లేదు. గురుజనులు తమ భార్యలనూ, పుత్రులనూ, శిష్యులనూ, దాసులనూ తమ చిత్తము వచ్చినట్టు నియమించవచ్చును. ఈ లోకములో సజ్జనులకు వారి వారి భార్యాపుత్రాదులు ఎటువంటివారో, దశరథమహారాజుకు మనమూ అటువంటివాండ్లమే. అందువల్ల, దశరథమహారాజు తన ఇష్టము వచ్చినట్లు మనలను ఆ యా పనులు చేయడానికి నియమించవచ్చును. ఈ విషయము నీవు తెలుసుకోవలెను.

"సౌమ్యుడా! దశరథమహారాజు నన్ను వల్కలాలు కట్టుబట్టగా కట్టుకొని, కృష్ణాజినము ఉత్తరీయముగా వేసుకొని అడవిలో కాపురము ఉండమని ఆజ్ఞాపించ వచ్చును లేదా అయోధ్యలో రాజ్యము ఏలమని చెప్పవచ్చును. అట్లా ఆయన చిత్తము వచ్చినట్టు నియమించే అధికారము ఆయనకు ఉంది. తమ్ముడా! నీవు ధర్మజ్ఞులలో మేటివి. లోకులు అందరూ మెచ్చుకొనేటట్టు మనము మన తండ్రిని ఎంతగా గౌరవిస్తామో, అంతగా మన తల్లులను కూడా మనము గౌరవించవలెను. మన తల్లిదండ్రులు ధర్మశీలురు. వారు ఉభయులూ నన్ను అడవికి పొమ్మని ఆజ్ఞాపించినారు. అందువల్ల నేను మరి ఒక విధముగా ప్రవర్తించడానికి వీలు లేదు. నాయనా! భరతుడా! నీవు అయోధ్యలో ఉండి లోకపూజ్యము అయిన కోసల రాజ్యము ఏలవలెను. నేను వల్కలాలు కట్టుకొని దండకారణ్యములో నివసించవలెను. ఈ విధముగా జనసమక్షములో ఆ మహాతేజోవంతుడు మన తండ్రి దశరథమహారాజు మనకు భాగాలు పంచిపెట్టి, నన్ను అడవికి పొమ్మని ఆజ్ఞాపించినాడు. అట్లా

ఆజ్ఞాపించి ఆయన దివంగతుడు అయినాడు. ఆయన ధర్మాత్ముడు. నీకూ వాకే కాదు, లోకానికి అంతటికీ గురువు. ప్రజారంజకుడు అయిన రాజు. నీకూ నాకూ ఆయనే పరమప్రమాణము. తమ్ముడా! ఆయన నీకు ఇచ్చిపోయిన భాగాన్ని నీవు అనుభవించవలెను. నేను పధ్నాలుగు సంవత్సరాలూ దండకారణ్యములో కాపురము ఉండి, నాకు ఆయన ఇచ్చిపోయిన భాగాన్ని అనుభవిస్తాను" అన్నాడు.

ఈ విధముగా రాముడు చెప్పుతూ ఉండగా సూర్యాస్తమయము అయింది.

105

ఆ పురుష సింహులూ, వారి మిత్రులూ దశరథమహారాజు మృతికి దుఃఖపడుతూ ఉండగానే తెల్లగా తెల్లవారిపోయింది.

ప్రాతఃకాలాన అన్నతమ్ములూ, వారి సుహృదులూ మందాకినీ నదిలో స్నానము చేసినారు. జపహోమాదులు పూర్తిచేసుకొని అందరూ రాముడి చుట్టూ మెదలకుండా కూర్చున్నారు. ఒక్కరు అయినా నోరు ఎత్తలేదు. అప్పుడు ఆ సుహృన్మధ్యములో భరతుడు రాముణ్ణి చూచి, "రామప్రభూ! నీవు మా అమ్మను గౌరవించినావు. ఆమె కోసము నీవు నీ రాజ్యాన్ని నాకు ఇచ్చివేసినావు. అకంటకము అయిన ఆ రాజ్యాన్ని నేను మళ్ళీ నీకే ఇచ్చివేస్తున్నాను. ఆ రాజ్యము నీది కాని నాది కాదు. నీవు నీ రాజ్యాన్ని తీసుకొని యథేష్టముగా అనుభవించు. నేను నీ దాసుడను. నీవు ఉండగా నీ దాసుడు రాజ్యము ఏలడము తప్పు.

"అన్నా! వర్షాకాలములో నీళ్ళు వరదలు అయి పారితే, భూమి స్వరూపమే మారిపోతుంది. అదేవిధముగా ఎప్పుడు ఏమి అవుతుందో తెలియదు. నీవు తప్ప మరి ఒకడు కోసల రాజ్యము ఏలలేడు. రామా! గుర్రము మాదిరిగా గాడిద పరుగెత్తలేదు. గరుత్మంతుడివలె కాకి ఎగురలేదు. అదేవిధముగా, నీ మాదిరిగా ప్రవర్తించే సామర్థ్యము నాకు లేదు. అందరూ తమ జీవనానికి ఎవడిమీద ఆధారపడతారో, వాడి జన్మే జన్మ. అన్నిటికీ, అందరిమీదనూ ఆధారపడేవాడి జన్మ ఒక జన్మా? అందరూ నిన్ను ఆశ్రయిస్తారు. నేను అందరినీ ఆశ్రయించవలసి వస్తుంది. అందువల్ల నీవు వచ్చి రాజ్యము ఏలవలెను.

"ప్రభూ! ఒకడు విత్తనము వేసినాడు. అది మొక్క మొలిచింది. ఆ మొక్కకు నీళ్ళుపోసి కష్టపడి పెంచి పెద్దదానిని చేసినాడు. అది చెట్టు అయింది. ఎవరికీ అందుకోవడానికి అలవికాని పెద్ద పెద్ద కొమ్మలు వేసింది. మహావృక్షము అయింది. అది పూలు పూయడము మొదలుపెట్టింది. ఆ పూలు అన్నీ పిందెలు కట్టుతవి అనీ, అవి అన్నీ పండుతవి అనీ ఆ చెట్టు వేసినవాడు కొంత

ఆశపడుతూ ఉండగా, ఆ చెట్టు గొడ్డుపోయింది. ఆ చెట్టు వేసినవాడి గతి ఏమిటి? ఇది ఉపమానముగా చెప్పినాను. నేను దీనిని నీకు వివరించి చెప్ప నవసరము లేదు.

"ఓ మహాబాహూ! నీవు నరశ్రేష్ఠుడవు. మాకు రక్షకుడవు. మా ప్రభువు నీవే. నీవు వచ్చి నీ భృత్యులము అయిన మమ్ములను పరిపాలించవలెను. నీవు అట్లా చేయకపోయేటట్లయితే, ఆ చెట్టు వేసినవాడి గతే మాకూ పట్టుతుంది. ఓ రామా! నీవు అరిందముడవు. నీవు రాజ్యాభిషేకము చేసుకొని చీకట్లను పారత్రోలి సహస్రకిరణాలతో తేజరిల్లే ఉదయభాస్కరుడివలె సింహాసనముమీద కూర్చుంటే చూడవలెను అని పౌరముఖ్యులూ, అమాత్యులూ మొదలైనవారు అందరూ ఉవ్విళ్ళూరుతున్నారు. నీవు బయలుదేరితే అంతఃపురాంగనలు అందరూ ఏడుపులు మానివేసి సంతోషముతో ఉప్పొంగిపోతారు. నిన్ను వెంబడించే మదపుటేనుగులు మహోత్సాహముతో ఘీంకారాలు చేస్తవి. అన్నా! ఇక నీవు లేవవలెను" అన్నాడు.

భరతుడు ఈ విధముగా రాముణ్ణి ప్రార్థిస్తూ ఉంటే, అప్పుడు అక్కడ సమావేశము అయిన పౌరముఖ్యులు మొదలైనవారు అందరూ, "బాగుంది, బాగుంది" అని ప్రశంసించినారు.

రాముడు భరతుడి ప్రార్థనను అంగీకరించలేదు. అందుకు ఆ యశస్వి భరతుడు దుఃఖము పట్టలేకపోయినాడు. ఏడవసాగినాడు. తండ్రి మృతికీ, తన అరణ్యవాస నిశ్చయానికీ భరతుడు అట్లా విలపిస్తున్నాడు అని ఆ బుద్ధిమంతుడు రాముడు గుర్తించినాడు. అంతట ఆ ధర్మవేత్త, "తమ్ముడా! మీ అమ్మ కైకేయీదేవి నీ కోసము కోరింది కనుక, దశరథమహారాజు నన్ను అరణ్యవాసానికి పంపించినాడు అనీ, అందువల్ల ఆయన మరణించినాడు అనీ నీవు అనుకొంటున్నట్టుగా ఉంది. ఇందుకు నీవు కారణము కాదు. మీ అమ్మ కాదు. ఇది అంతా దైవఘటన.

"తమ్ముడా! ఈ లోకములో ఏ మానవుడూ స్వతంత్రుడు కాడు. ఐచ్ఛిక వ్యాపారము అనేది ఎవడికీ లేదు. ప్రతివాణ్ణీ దైవము అక్కడికీ ఇక్కడికీ ఈడ్చుకుని పోతూ ఉంటుంది. అందువల్లనే, ఎవడు ఎంత ధనము కూడబెట్టినా, ఏదోవిధముగా చివరకు క్షయము అయిపోతుంది. ఎంత ఉన్నత పదవికి పోయినా చివరకు పతనము తప్పదు. దగ్గర చేరినవారు అందరూ ఎప్పుడో ఒకప్పుడు చివరకు విడిపోకుండా ఉండరు. ఎంత గొప్ప జీవితము అయినా మరణముతో అంతము అయిపోతుంది. అందువల్ల, మన తండ్రి మరణించినాడు అని నీవు దుఃఖపడవద్దు. కైకేయీదేవి మూలంగా నేను ఇక్కడికి వచ్చినాను అని నీవు అనుకోవద్దు.

"భరతుడా! చక్కగా పండిన పండు, చెట్టునుంచి ఎప్పుడో నేల రాలిపోవడము కన్నా వేరే భయము లేదు. పుట్టిన ప్రతివాడూ, చచ్చిపోవడముకన్నా వేరే భయము

లేదు. గట్టిగట్టి స్తంభాలు పాతి కట్టిన ఇల్లూ కొంతకాలానికి జీర్ణము అయి కూలిపోక తప్పదు. అదే విధముగా మానవులు జరా మృత్యు వశంగతులు అయి నాశనము అయిపోక తప్పదు.

"నాయనా! కడచిన రాత్రి మళ్ళీ రాదు. సముద్రములోకి పోయిన (యమునాజలాలు) ఏటి నీళ్ళు తిరిగిరావు. గ్రీష్మర్తువులో సూర్యకిరణాలు ఎక్కడి ఎక్కడి నీళ్ళనూ పీల్చివేస్తవి. అదే విధముగా, అహోరాత్రాలు ఎక్కడి ఎక్కడి వారి ఆయువునూ హరించివేస్తూ జరిగిపోతూ ఉంటవి. నిలుచున్నా, నడుస్తున్నా ఆయువు హరించిపోతూ ఉంటుంది. అందువల్ల, ఎవరిని గురించి వారే దుఃఖపడవలెను. ఇతరుల గురించి దుఃఖపడి ప్రయోజనము లేదు. మృత్యువు ఎప్పుడూ వెంట ఉంటుంది. ఎవడు ఎక్కడికి పోయినా మృత్యువు వాడివెంట అక్కడికి పోతూ ఉంటుంది. ఎవడు ఎక్కడ కూర్చుంటే మృత్యువు వాడివెంట అక్కడనే కూర్చుంటుంది. ఎవడు ఎంత దూరముపోతే మృత్యువు వాడివెంట అంత దూరమూ పోతుంది. అందువల్ల, మృత్యువును ఎవడూ తప్పించుకోలేడు.

"తమ్ముడా! అవయవాలు అన్నీ సళ్లుతప్పి ముడతలు పడిపోతవి. తల నెరసిపోతుంది. ముసలితనము వస్తుంది. ఎవడు ఏమి చేయకలుగుతాడు? తెల్లవారగానే ధనార్జన చేయవచ్చును అని అందరూ సంతోష పడుతూ ఉంటారు. చీకటిపడగానే కామోపభోగాలు అన్నీ అనుభవించవచ్చును అని ఉత్సాహపడుతూ ఉంటారు. కాని జీవితము క్షయము అయిపోతూఉంది అని ఎవరూ తెలుసుకోరు. ఒక్కొక్క ఋతువే వస్తూ ఉంటే ఆ యా ఋతూచితభోగాలు అన్నీ అనుభవించవలెను అనుకొంటారు. కాని, ఆయువు అంతరించిపోతూ ఉంది అని అనుకోరు. ఏ అడవిలో నుంచో కొట్టుకొని వచ్చిన రెండు కట్టెలు ఒక తెప్పకొయ్యగా సముద్రములో తేలిపోతూ ఏ గాలికో ఏ కట్టెకు ఆ కట్టెగా విడిపడి దేని దారిని అది పోతుంది. అదే విధముగా, ఆలుబిడ్డలతో ధనధాన్యాలతో ఒక్క సంసారముగా ఉన్నవారు కొంతకాలానికి ఎందుకో ఒకందుకు ఒకరితో ఒకరు సంబంధము లేకుండా విడిపడిపోతూ ఉంటారు. ఇంతకూ ఈ లోకములో ఏ ఒక్క ప్రాణీ యధేష్టముగా నడిచే అవకాశము లేదు. అందువల్ల చనిపోయిన వాండ్లను గురించి మనము ఎంత దుఃఖపడ్డా, వాండ్లను మళ్ళీ బ్రతికించలేము. తోవ తెలియనివాడు దారినపోయే బాటసారులతో తనకు తోవ తెలియదు అని చెప్పి వారిని అనుసరించి పోయి గమ్యస్థానము చేరుకొన్నట్టుగా మనమూ మన పూర్వీకులు, మన పితృ పితామహులు పోయిన దారినే పోవలసి వుంది. ఆ దారి మనము వదలి పెట్టము. ఆ దారికి తిరుగు ఉండదు. ఆ దారి పట్టినవారి కోసము దుఃఖపడడము ఎందుకు?

"తమ్ముడా! ఆయువు ప్రవాహమువలె గబగబా జరిగిపోతూ ఉంది. అందువల్ల పరలోకసుఖ హేతువు అయిన ధర్మాన్నే మనము అనుసరించవలెను. ధర్మాన్ని అట్లా శిరసావహించినవారినే మానవులు అంటారు. తక్కినవారు జంతువులతో సరిసమానులు. ధర్మాత్ముడు అయిన మన తండ్రి దశరథమహారాజు సమస్తము అయిన యజ్ఞాలూ చేసినాడు. సరిఅయిన దక్షిణలు ఇచ్చినాడు. ప్రజారంజకముగా రాజ్యపాలనము చేసి భృత్యులను చక్కగా పోషించినాడు. ధర్మమార్గాన ధనార్జన చేసినాడు. సమస్త దానాలూ, సమస్త సత్కర్మలూ చేసినాడు. ఐహిక భోగాలను అన్నిటినీ అనుభవించినాడు. సత్పురుషులను అందరినీ సత్కరించి సంతోషపెట్టినాడు. దేవతలను సయితము మెప్పించినాడు. బహుకాలము జీవించినాడు. అందుకు మనము దుఃఖపడ నవసరములేదు. ఆయన మానవ దేహము శిథిలము అయిపోయింది. ఆ శిధిల దేహాన్ని ఇక్కడనే వదలిపెట్టి బ్రహ్మలోకములో విహరించడానికి దివ్యదేహము ధరించి పోయినాడు.

"తమ్ముడా! నీవు సమస్తశాస్త్రాలూ చదివినవాడవు. బుద్ధిమంతుడవు. ప్రాజ్ఞుడవు. తండ్రి పోయినాడు అని నీవు దుఃఖపడ కూడదు. బుద్ధిమంతులూ ధైర్యవంతులూ అయినవారు ఎటువంటి దుర్దశలో అయినా కన్నీళ్ళు కార్చకూడదు. ఏడవ కూడదు. నీవు స్వస్థచిత్తముతో ఉండు. దుఃఖపడవద్దు. నీవు పోయి అయోధ్యలో రాజ్యము ఏలు. మన తండ్రి దశరథమహారాజు నిన్ను అందుకు నిర్దేశించినాడు. ఆ పుణ్యాత్ముడు నన్ను ఆజ్ఞాపించినట్టుగా నేను చేస్తున్నాను. నేను ఆయన శాసనాన్ని అతిక్రమించను. అతిక్రమించడము అధర్మము. నీవున్నూ ఆయన ఆజ్ఞలను శిరసా వహించవలెను. ఆయన మన తండ్రి. ఆ పరమధార్మికుడు ఆజ్ఞాపించిన విధంగా పద్నాలుగు సంవత్సరాలూ నేను వనవాసము చేస్తాను. పరలోకము కోరేవాడు ధార్మికుడు గానూ, దయామయుడుగానూ ఉండవలెను. పితృాజ్ఞను శిరసావహించవలెను.

"తమ్ముడా! దశరథమహారాజు సాధువృత్తాన్ని మనస్సులో ఉంచుకో. రాజ్య భారము వహించు" అని చెప్పి ఊరక ఉన్నాడు.

106

రాముడు ఈవిధముగా అర్థవంతముగా (చనిపోయిన తండ్రి కోసము దుఃఖించడము ఎంత వ్యర్థమో తన వనవాసానికి దుఃఖించడమున్నూ అంత వ్యర్థము అనీ, అందువల్ల తాను అరణ్యవాసము చేయక తప్పదు అనీ, భరతుడు అయోధ్యలో రాజ్యపాలనము చేయక తప్పదు అనీ) చెప్పి ఊరక ఉన్నాడు.

అంతట ఆ మందాకినీ తీరాననే భరతుడు ఆ దయామయుడితో (తండ్రి మరణానికి దుఃఖపడ్డందువల్ల ప్రయోజనము లేదు అనే విషయము తనకు తెలుసు అనీ) చిత్రముగానూ, (రాముడు అయోధ్యకు వచ్చి రాజ్యపాలనము చేయవలసిన అవసరాన్ని గురించి) ధర్మయుక్తముగానూ చెప్పతలంచుకొని ఈవిధముగా ఆరంభించినాడు:

"రామప్రభూ! నీవు సమస్త శత్రువులనూ జయించినావు. నీవంటివాడు ఎవడూ ఈ లోకములో లేడు. ఆపదలు నిన్ను దుఃఖపెట్టవు. ఐశ్వర్యము నిన్ను సంతోషపెట్టలేదు. నీవు సర్వజ్ఞుడవు. అందువల్ల, నిన్ను పెద్దలు గౌరవిస్తున్నారు. నీవు వారిని గౌరవించడానికి నీ సంశయాలను వారిని అడిగి తెలుసుకొంటూ ఉంటావు.

"(ఇంతకూ) చచ్చిపోయినవాణ్ణి, బ్రతికిఉన్నవాణ్ణీ, లేనిదానినీ, ఉన్నదానినీ ఒక్కమాదిరిగా భావించే బుద్ధిమంతుడు ఎవడూ దేనికీ బాధపడడు. రామా! త్రికాలజ్ఞుడు కానీ, ఆత్మానాత్మరూపము ఎరిగినవాడుకానీ, పరమాత్మ జీవాత్మ జ్ఞానము కలవాడు కానీ ఎంత కష్టము వచ్చినప్పటికిన్నీ దుఃఖించడు. నీవున్నూ అంతే. అన్నా! నీవు దేవతుల్యుడవు. సర్వగుణసంపన్నుడవు. మహాధైర్యవంతుడవు. సత్య ప్రతిజ్ఞుడవు. సర్వజ్ఞుడవు. సర్వదర్శివి. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవు. ఉత్పత్తి వినాశాలు తెలిసినవాడవు. ఇటువంటి గుణవంతుడవు నీవు సహించరాని ఈ కష్టము అనుభవించకూడదు. (ఈ కష్టము అనుభవిస్తాను అని నీవు అనవచ్చును. కానీ, నీ రాజ్యభ్రంశమూ, నీ వనవాస నివాసమూ, నీ ఎడబాటూ నేను ఎట్లా సహించను? నేను ఎంతమాత్రమూ సహించలేను.)

"అన్నా! నేను దేశాంతరములో ఉన్నప్పుడు నీచురాలు మా అమ్మ నాకోసము పాపానికి ఒడికట్టింది. అది నాకు సమ్మతము కాదు. ఆ పాపకార్యము చేసినందుకు ఆమెను తీవ్రముగా దండించవలెను. కాని ధర్మపాశబద్ధుణ్ణి అయినందువల్ల నేను ఆమెను దండించలేదు. చంపివేయలేదు. దశరథమహారాజుకు పుట్టినవాడు అట్లా చేయలేడు.

"ప్రభూ! దశరథమహారాజు మన తండ్రి. మనకు ఆచార్యుడు. రాజు. ఎన్నో యజ్ఞాలు చేసినాడు. వృద్ధుడు. చనిపోయినాడు. అందువల్ల, ఆయనను సభామధ్యములో నిందించలేకుండా ఉన్నాను. కానీ, ఓ ధర్మజ్ఞా! ధర్మము తెలిసినవాడు ఎవడు అయినా ఒక స్త్రీని సంతోషపెట్టడానికి ధర్మహీనమూ, అర్థహీనమూ అయిన పాపిష్టి పని చేస్తాడా? 'వినాశకాలానికి విపరీతబుద్ధులు పుట్టుతవి' అనేది పాత సామెత. ఆ సామెత ఈ లోకములో యథార్థము అని దశరథమహారాజు ఋజువు చేసినాడు. ఆ

మహానుభావుడు కైకేయీదేవి మోహాన్నీ, కోపాన్నీ, సాహసాన్నీ నిగ్రహించలేకపోయినాడు. ఆమెకు తలఒగ్గినాడు. ధర్మాతిక్రమణము చేసినాడు. నీవు చక్కగా ఆలోచించు. ఆయన చేసిన అసత్కార్యాన్ని సరిచేసే కొడుకే కొడుకు, అట్లా చేయనివాడు కొడుకే కాదు.

"రామా! నీవు సత్పుత్రుడవు. మన తండ్రి చేసిన లోకనిందిత దుష్కృతాన్ని నీవు ఉపేక్షించ కూడదు. ప్రభూ! మన తండ్రి పాపములో పడిపోకుండా నీవు కాపాడవలెను. ఈ కైకేయీదేవినీ, నన్నూ, నీ స్నేహితులనూ, బంధువులనూ, పౌరులనూ, జానపదులనూ, కౌసల రాజ్యాన్నీ నీవు రక్షించవలెను. అన్నా! నీవంటి క్షత్రధర్మ పరాయణుడు వనవాసము చేయడము ఏమిటి? రాజ్యపాలనము చేయవలసిన నీవు, జటాధారణాది మునివృత్తిని అవలంబించడము ఏమిటి? ఇటువంటి లోకవిరుద్ధము అయిన పని, నీవు ఏంత మాత్రమూ చేయకూడదు.

"ఓ ప్రాజ్ఞుడా! రాజ్యపాలనానికి మూలము అయిన పట్టాభిషేకము చేసుకోవడము క్షత్రియుడి ప్రథమ ధర్మము. ఏ కొరమాలిన క్షత్రియుడు అయినా ప్రత్యక్షఫలమునే ఇచ్చే రాజ్యపాలన రూపము అయిన స్వధర్మము వదిలిపెట్టి సంశయాస్పదమూ, లక్షణహీనమూ, కాలాంతరఫలప్రదమూ అయిన తాపస ధర్మాన్ని అవలంబిస్తాడా? నీవు కష్టము కలగజేసే ధర్మము అవలంబించ తలంచుకొన్నట్లయితే నాలుగు వర్ణాలవారూ వారి వారి ధర్మాన్ని వ్యతిక్రమించకుండా ఉండేటట్లు రాజ్యపాలనము చేయవలెను. అంతకన్నా కష్టము అయిన ధర్మాచరణము మరి ఒకటి ఉండదు.

"ఓ ధర్మజ్ఞుడా! నాలుగు ఆశ్రమాలలోనూ గృహస్థాశ్రమమే శ్రేష్ఠము అయింది అని ధర్మవేత్తలు చెప్పుతూ ఉంటారు. నీవు ఆ గృహస్థాశ్రమాన్ని ఎట్లా వదలి పెట్టుతావు? అన్నా! జన్మక్రమములోనూ, విద్యలోనూ, స్థానములోనూ నీకంటె నేను చిన్నవాణ్ణి. నీవు అన్నిటా నాకన్నా పెద్దవాడవు. నీవు వుండగా నేను రాజ్యము చేయడము ఏమిటి? నేను చిన్నవాణ్ణి మాత్రమే కాదు, నీకు ఉన్న బుద్ధిబలము నాకు లేదు. నీకు ఉన్న శక్తి నాకు లేదు. నీకు ఉన్న స్థితి నాకు లేదు. అన్నా! నీవు లేకుండా నేను జీవించడమే ఉత్తది. ఇక నేను రాజ్యపాలనము చేయడము ఏమిటి?

"ఓ ధర్మజ్ఞా! నీవు నిజధర్మపరాయణుడవు అయి పితృపైతామహమూ, ఏకంటకమూ అయిన కోసలరాజ్యము ఏమరుపాటు లేకుండా నీ తమ్ములను తోడుచేసుకొని ఏలవలెను. ఇప్పుడు ఇక్కడ ఇంతమంది పౌరముఖ్యులూ, అమాత్యులూ మొదలైనవారు ఉన్నారు. వీరి ఎదుట వశిష్ఠమహర్షి, ఋత్విజులూ మొదలు అయిన మంత్రకోవిదులు సమంత్రకముగా నీకు రాజ్యాభిషేకము చేస్తారు.

లోకాలు అన్నీ జయించిన దేవేంద్రుణ్ణి దేవతలు అభిషేకము చేసినట్లు, మేము అందరమూ నీకు అభిషేకము చేస్తాము. నీవు అయోధ్యకు పోయి రాజ్యము ఏలుతూ, దేవ ఋషి పితృఋణాలు అనే మూడు ఋణాలు తీరుస్తూ, శత్రువు లందరినీ దహించివేస్తూ, నీ స్నేహితుల సమస్తాభీష్టాలూ సమకూరుస్తూ, నన్నూ, నీ తక్కిన తమ్ములనూ శాసిస్తూ ప్రజారంజకముగా రాజ్యపాలనము చేయవలెను.

"ఓ పూజ్యుడా! నీవు ఇప్పుడు రాజ్యాభిషేకము చేసుకొంటే నీ స్నేహితులు అందరూ హర్షిస్తారు. నీ శత్రువులు అందరూ భయభ్రాంతులు అయి దశదిశలా పారిపోతారు. ఓ రామా! నీవు నా తల్లి చేసిన దుష్కృతాన్ని ఇప్పుడే, ఇక్కడనే తుడిచివేసి మన తండ్రి దశరథమహారాజు పాపములో పడకుండా కాపాడవలెను.

"అన్నా! నేను శిరసా నిన్ను యాచిస్తున్నాను. మహేశ్వరుడు ప్రాణికోటినివలె నీవు నన్నూ, నీ బంధువులనూ కరుణించి కాపాడు.

"ప్రభూ! నా ఈ ప్రార్థనను నీవు తోసివేసేట్టయితే నేనూ నీతోపాటు వనవాసము చేస్తాను."

భరతుడు ఈ విధముగా ఎంతో ప్రార్థించినాడు. తహతహలాడుతూ రాముడి కాళ్ళమీద పడ్డాడు. కాని, ఆ మతిమంతుడి మనస్సు మారలేదు. పిత్రాజ్ఞా పరిపాలనానికి స్థిరసంకల్పుడు అయినాడు.

జనులు అందరూ ఏకకాలాన రాముడి అత్యద్భుత స్థిరత్వానికి హర్షించినారు. అయోధ్యకు రాడు అని దుఃఖించినారు.

అంత యుక్తియుక్తముగా మాట్లాడిన భరతుణ్ణి చూచి ఋత్విజులూ, అమాత్యులూ, పౌరులూ కంట తడిపెట్టినారు. భరతుణ్ణి మెచ్చుకొని తల్లులు అందరూ కన్నీళ్ళు కారుస్తూ, మాటలు తడబడుతూ రాముణ్ణి అయోధ్యకు రమ్మని యాచించ సాగినారు.

ప్రజలు అందరూ రాముడికి నమస్కారము చేసి అయోధ్యకు రమ్మని వేడుకోసాగినారు.

107

రాముడు అంతమంది బంధుజనుల సమక్షములో భరతుడితో ఈ విధముగా చెప్పినాడు :

"ఓ భరతుడా! నీవు దశరథమహారాజుకూ, కైకేయీదేవికీ పుట్టిన సుపుత్రుడవు. నీవు చెప్పింది విన్నాను. (మన తండ్రి దశరథమహారాజు కామహేతువునుంచి నీకు

రాజ్యము ఇచ్చినాడు అనుకొంటున్నావు. అది తప్పు) పూర్వము మన తండ్రి మీ అమ్మ కైకేయీదేవిని వివాహము చేసుకొనేటప్పుడు, మీ అమ్మ కడుపున పుట్టేవాడికి రాజ్యము ఇస్తాను అని మీ తాతకు మాట ఇచ్చినాడు. (అందువల్ల, కోసల రాజ్యము నీది. నాది కాదు. ఈ రహస్యము అమాత్యులు మొదలయిన అందరికీ తెలుసును. మన తండ్రి దశరథమహారాజు చెప్పడము వలన నాకు తెలుసును. ఈ విషయము మీ అమ్మ మరచిపోయిందో లేక మీ అమ్మకు తెలియనే తెలియదో!)

"నాయనా! పూర్వము దేవాసురయుద్ధములో మన నాయనగారికి మీ అమ్మ చేసిన ఉపచారానికి మెచ్చుకొని, మీ అమ్మకు రెండు వరాలు ఇస్తాను అని నాయనగారు వాగ్దానము చేసినారు. ఆ రెండు వరాలు చెల్లిస్తాను అని మన నాయనగారిచేత మీ అమ్మ శపథము చేయించుకొని నీకు రాజ్యము ఇమ్మనీ, నన్ను అడవులకు పంపించమనీ అడిగింది. మన తండ్రి దశరథమహారాజు ఆ వరదానమునుంచి నన్ను పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసము చేయమని ఆజ్ఞాపించినాడు. నేను ఆయన ఆజ్ఞను శిరసావహించినాను. ఆయన మాట నిలపెట్టడానికి ఎవరు ఏమి చెప్పినా వినకుండా నేను సీతనూ, లక్ష్మణుణ్ణీ వెంటపెట్టుకొని ఈ నిర్జనారణ్యానికి వచ్చినాను.

"నాయనా భరతుడా! నీవున్నూ వెంటనే రాజ్యాభిషేకము చేసుకొని మన తండ్రి దశరథమహారాజు సత్యనిష్ఠను కాపాడవలెను.

"తమ్ముడా! పూర్వము గయుడు అనే యశస్వి గయాక్షేత్రములో పిత్ర్యయజ్ఞము చేస్తూ చెప్పిన సూక్తిని నీవు వినవలెను. (కొడుకు తండ్రిని పున్నామ=పుత్ అనే పేరు కల నరకములో పడకుండా, త్రాయతే=రక్షిస్తాడు కనుక) కొడుకును (పుత్ర ఇతి) పుత్రుడు అని అన్నారు. అందువల్ల, రాజర్షులు అందరూ పుత్రుల కోసము తాపత్రయ పడ్డారు. పుత్రులను కన్నారు. కాబట్టి, మన తండ్రి దశరథమహారాజు నరకములో పడకుండా మనము పుత్రులము కాపాడవలెను.

"ఓ భరతుడా! నీవు అయోధ్యకు పోయి శత్రుఘ్నుడి సాయముతోనూ, వశిష్ఠమహర్షి మొదలు అయిన బ్రాహ్మణోత్తముల సహాయముతోనూ జనరంజకముగా రాజ్యము ఏలు.

"నేను ఆలస్యము చేయకుండా సీతాలక్ష్మణులను వెంటపెట్టుకొని దండకారణ్యానికి వెళ్ళిపోతాను.

"భరతుడా! నీవు మనుష్యులకు రాజుగా ఉండు. నేను మహారణ్యములో వన్యమృగాలకు రాజుగా ఉంటాను. నీ శిరస్సుకు ఎండ తగలకుండా హాయిగా శ్వేతచ్ఛత్రచ్ఛాయలలో కూర్చో. నేను అడవిలో పెద్ద పెద్ద చెట్ల చల్లటి నీడలో సుఖముగా కూర్చుంటాను. మహాబుద్ధిమంతుడు అయిన మన తమ్ముడు శత్రుఘ్నుడు

నీకు తోడుగా ఉంటాడు. నాకు ముఖ్యస్నేహితుడుగా ఉంటూ ఉన్న మన తమ్ముడు లక్ష్మణుడు నాకు తోడుగా ఉంటాడు. దశరథమహారాజు పుత్రులము, మనము నల్గురమూ పరస్పర సహాయముతో మన తండ్రి మాటను నిలపెట్టుదాము.

"భరతుడా! నీవు దుఃఖపడవద్దు."

108

జాబాలి నాస్తికవాదము

ఆ ధర్మజ్ఞుడు రాముడు ఈవిధముగా భరతుణ్ణి సమాధాన పరుస్తూ ఉంటే మంత్రిపుంగవుడు జాబాలి అనే బ్రాహ్మణోత్తముడు రాముణ్ణి చూచి వైదికధర్మ విరుద్ధముగా ఇట్లా చెప్పినాడు :

"ఓ రామా! నీవు మహాబుద్ధిమంతుడవు. ఎంతో ధైర్యవంతుడవు. మూఢుడివలె నీ బుద్ధిని నిరర్థక విషయాలలోకి పోనీయవద్దు. ప్రతివాడూ ఎవడికి వాడుగా పుట్టుతున్నాడు. ఎవడికి వాడుగా చచ్చిపోతున్నాడు. ఒకడికి ఒకడు తోడుగా పుట్టడము కానీ, చావడముకానీ లేదు. ఎవడికి ఎవడు బంధువు? ఎవడివల్ల ఎవడికి ఏమి ప్రయోజనము? అందువల్ల, తండ్రి అనీ, తల్లి అనీ తాపత్రయపడువానిని పిచ్చివాడు అనుకొనవలెను. ఒకడికి మరి ఒకడితో సంబంధము ఏమీ లేదు. గ్రామాంతరము పోతూ ఒకడు ఒక చోట బస చేస్తాడు. ఆ మరునాడు అక్కడనుంచి వెళ్ళిపోతాడు. అవతలికి పోయిన తరువాత వాడికి ఆ బసతో సంబంధము ఏమీ ఉండదు. అట్లాగే తల్లీ తండ్రీ కూడాను, ఒకడు ఈ లోకములో పుట్టడానికి మాత్రమే కారకులు. ఒక గృహము అయినా, ధనము అయినా అంతే. అవి ఉన్నంతవరకే వాటితో సంబంధము. అందువల్ల, బుద్ధిమంతులు వాటిని గురించి ఆలోచించవలసిన అగత్యము ఏమీ లేదు.

"ఓ నరోత్తమా! నీవు నీ తండ్రి రాజ్యము వదిలిపెట్టి ఎన్నో చిక్కులూ, ఉపద్రవాలూ ఉన్న పెడదారిన పోవద్దు. సర్వసమృద్ధము అయిన అయోధ్యానగరము ఏకవేణీధర (పతివ్రత) వలె నిన్ను ఎదురు చూస్తూ ఉంది. కనుక, నీవు అయోధ్యకు వచ్చి రాజ్యాభిషేకము చేసుకో. మహారాజువు అయి స్వర్గములో దేవేంద్రుడివలె అయోధ్యలో రాజభోగాలు అన్నీ అనుభవిస్తూ ఉండు. నీకు దశరథమహారాజుతో సంబంధము ఏమిటి? ఏ సంబంధమూ లేదు. దశరథమహారాజు అయోధ్యలో ఇదివరకు ఉన్న ఒక రాజు. నీవు ఇంకొక రాజువు. ఇప్పుడు ఆ దశరథమహారాజుకూ, నీకూ ఏ సంబంధమూ లేదు. కాబట్టి, నేను చెప్పినట్లు చేయవలసింది.

"ఓ రామా! ఎవరికి అయినా తండ్రితో సంబంధము బీజమాత్రమే. ఋతుకాలములో స్త్రీయోనిలో శుక్లశోణితాలు మిళితము అయినందువల్ల మానవులు

పుట్టుతున్నారు, అంతే. దశరథమహారాజు ఎక్కడికి పోవలెనో అక్కడికి పోయినాడు. అది మర్త్యుల స్వభావము. నీవు మాత్రము మిథ్యాసంబంధము ఒకటి పెట్టుకొని బాధపడుతున్నావు. ధర్మపరాయణులను చూచినా, అర్ధపరాయణులను చూచినా నాకు విచారము వేస్తూ ఉంటుంది. వారు బ్రతికి ఉండగా ఏ భోగమూ, ఏ సుఖమూ అనుభవించరు. చచ్చిపోయిన తరువాత వాండ్లు ఏమి సుఖపడతారో, ఏమి అనుభవిస్తారో నాకు కాదు, నీకు కూడా తెలియదు. అష్టకాశ్రాద్ధము అనీ, ప్రత్యాబ్దికము అనీ పితరులను ఉద్దేశించి అందరూ శ్రాద్ధాలు పెట్టుతూ ఉంటారు. అందువల్ల, వారు ఎంతెంత అన్నము పాడుచేస్తున్నారో వారికే తెలియదు. చచ్చినవాడు ఏమి అయినా తింటాడా? ఇక్కడ ఉన్నవాడు తింటే అక్కడ ఎక్కడనో ఉన్నవాడికి కడుపు నిండేటట్టయితే, దేశాంతరము పోయిన వాండ్లకు వాండ్ల వాండ్లు శ్రాద్ధము పెట్టుతూ ఉంటే చాలు. వాండ్లు అక్కడ వండుకొని తినవలసిన అవసరము లేకుండా పోతుంది.

"ఓ రామా! దేవతలను ఆరాధించవలసింది అనీ, యజ్ఞదీక్ష వహించవలసింది అనీ, తపస్సు చేయవలసింది అనీ, సర్వమూ త్యజించవలసింది అనీ, డబ్బులు గుంజడానికి మేధావులు కొంతమంది గ్రంథాలలో చెప్పినారు. ఓ మతిమంతుడా! పరలోకము అనేది లేనే లేదు అని తెలుసుకో. ప్రత్యక్షసిద్ధము అయిన రాజ్యభోగాదులు అనుభవించు. పరోక్షసుఖము ఇస్తవి అనే పితృవచన పరిపాలనము మొదలయిన వన్నింటిని వెనుకపెట్టు. ప్రత్యక్ష ఫలముకన్నా అధికము అయింది మరి ఏదీ లేదు. రామా! భరతుడు నిన్ను వేడుకొంటున్నాడు. నీవు రాజ్యము ఏలు."

109

ఈవిధముగా జాబాలి చెప్పిన మాటలకు రాముడి బుద్ధి ఏమాత్రమూ చలించలేదు. అతడు సత్యవ్రతుడు. వైదికధర్మపరాయణుడు. జాబాలికి ఈ విధముగా చెప్పినాడు.

"ఓ బ్రాహ్మణుడా! నీవు నాకు మేలు చేయవలెను అనుకొని చెప్పినది అంతా కార్యానుకూలముగా కనిపించే అకార్యము. హితముగా కనిపించే అహితము. నీవు చెప్పినట్టు చేసేట్లయితే కీడు అవుతుంది కాని మేలు కాదు. కట్టుబాట్లు అన్నీ వదిలి పాపాచారుడు అయి వైదికధర్మ విర్దుముగా ప్రవర్తించేవాణ్ణి సత్పురుషులు ఎవరూ మెచ్చరు. ఈ లోకములో కులీనుడు అయిందీ, అకులీనుడు అయిందీ, వీరుడు అయిందీ, పిరికిపంద అయిందీ, పరిశుద్ధుడు అయిందీ, అపరిశుద్ధుడు అయిందీ వాడి వాడి నడవడే తెలియచెప్పుతూ ఉంటుంది. కాబట్టి, నేను అయోగ్యుణ్ణి అయి యోగ్యుడివలెనూ, అపరిశుద్ధుణ్ణి అయి పరిశుద్ధుడివలెనూ, అశిష్టుణ్ణి అయి

శిష్టుడివలెనూ సంచరించలేను. అట్లా చేయడము నాకు చేతకాదు. ఇదేవిధముగా, నేను ధర్మవేషము వేసుకొని అధర్మము చేయను. మంగళకరములు అయిన వైదికకర్మలనూ, వైదిక విధులనూ వర్జించి లోకసంకరకారకము అయిన అధర్మాన్ని ధర్మము అని నేను అవలంబించను. లోకాన్ని చెడకొట్టే దురాచారానికి నేను ఒడికట్టేటట్లయితే జ్ఞానము కలవాడు ఎవడు అయినా నన్ను మన్నిస్తాడా? కార్యాకార్యవిచక్షణుడు ఎవడు అయినా నన్ను గౌరవిస్తాడా?

"ఓ బ్రాహ్మణుడా! నేను ఆడినమాట తప్పను. నేను ఆడినమాట నేనే తప్పిపోయేటట్టయితే, ఈ లోకములో నామాట ఎవడు అయినా వింటాడా? నేను నా చిత్తము వచ్చినట్లు ప్రవర్తించేటట్లయితే, ప్రజలు వారి చిత్తము వచ్చినట్లు ప్రవర్తిస్తారు. రాజుల నడవడినిపట్టే ప్రజల నడవడి ఏర్పడుతూ ఉంటుంది. రాజు తప్పుదారి తొక్కితే, ప్రజలున్నూ తప్పుదారి తొక్కుతారు. సనాతనము అయిన రాజధర్మము భూతదయమీదనూ, సత్యముమీదనూ ఆధారపడ్డది. కాబట్టి, రాజ్యపాలన సత్య స్వరూపము అయింది. సత్యముమీదనే ఈలోకము నిలిచి ఉంది. 'సత్యమే సర్వోత్తమము అయిన ధర్మము' అని ఋషులూ, దేవతలూ చెప్పినారు. సత్యవ్రతుడే పరమపదము పొందుతాడు. అసత్యాలు ఆడే వాణ్ణి ప్రజలు అందరూ క్రూరసర్పముగా భావించి భయపడుతారు. సత్యమే పరమధర్మము. సత్యమే ఈలోకములో ఈశ్వరుడు. సత్యమే స్వర్గానికి మూలము. సత్యాన్నే లక్ష్మి ఎప్పుడూ ఆశ్రయించుకొని ఉంటుంది. సత్యమే సమస్తానికీ ఆధారము. సత్యముకన్నా అధికము అయిన ధర్మము ఏదీ లేదు. మనము చేసే దానాలూ, హోమాలూ, తపస్సులూ సత్యము మీదనే ఆధారపడి ఉన్నవి. అందువల్ల, ప్రతివాడు సత్యవ్రతుడుగా ఉండవలెను. ఈ లోకములో ఒకడు రాజ్యము ఏలుతూ ఉంటాడు. ఒకడు కుటుంబాన్ని పోషిస్తూ ఉంటాడు. ఒకడు నరకబాధ పడుతూ ఉంటాడు. ఒకడు స్వర్గసౌఖ్యము అనుభవిస్తూ ఉంటాడు. ఈ విధముగా సత్యవంతులూ, అసత్యవంతులూ వారి వారి ఫలాలను అనుభవిస్తూ ఉంటారు.

"ఓ బ్రాహ్మణుడా! నా తండ్రి సత్యముగా నన్ను వనవాసము చేయమని ఆజ్ఞాపించినాడు. వనవాసము చేస్తాను అని నేను సత్య ప్రమాణము చేసినాను. నేను ఎప్పుడూ సత్యమే మాట్లాడుతాను. ఇప్పుడు వనవాసము చేయకుండా ఎందుకు తప్పుకోవలెను? రాజ్యలోభమువల్లకానీ, ఏది అయినా వ్యామోహమువల్లకానీ, తమోగుణమువల్లకానీ, మేము అందరమూ తరించడానికి మా తండ్రి నిర్మించిన సత్యసేతువును నేను తెగకొట్టను. అసత్యాలు ఆడేవాడూ, అస్థిరచిత్తుడూ, సత్పథ చలితుడూ ఇచ్చే హవ్యకవ్యాలను దేవతలుకానీ, పితృ దేవతలుకానీ అంగీకరించరు

అని పెద్దలు చెప్పగా విన్నాను. సత్యరూపము అయిన ధర్మమే పరమాత్మ స్వరూపముగా నాకు కనపడుతున్నది. అందువల్లనే, సజ్జనులవలె జటావల్కలాలు ధరించడానికి అంగీకరించినాను. సత్య వ్రతులు అయిన పూర్వ రాజర్షులవలె కాకుండా ఆశాపాతకులూ, అల్పులూ, పాపకర్ములూ, క్రూరకర్ములూ అవలంబించే క్షత్రధర్మాన్ని నేను త్యజించినాను. ఈ విధము అయిన క్షత్రధర్మములో అధర్మము అధికము. ధర్మము స్వల్పము. మనుష్యుడు పాపకార్యాన్ని మనసా సంకల్పించుకొంటాడు. దైహికముగా పాపము చేస్తాడు. వాచా అబద్దము ఆడుతాడు. కాబట్టి పాపము 'మానసికమూ, కాయికమూ, వాచికమూ' అని మూడు మూడు విధాలుగా ఉంటుంది. అస్థిరచిత్తుడు ఈ మూటినీ సంపాదిస్తాడు. సత్కార్యాచరణమువల్ల వచ్చే కీర్తీ, పౌరుష ప్రవర్తనము వల్లవచ్చే యశస్సూ, ఈ భూమీ ఎప్పుడూ సత్యవ్రతుణ్ణే వరిస్తవి. స్వర్గతుడు అయినా అవి ఆ సత్యవ్రతుణ్ణి వదలి పెట్టవు. కాబట్టి, సత్యాన్నే ఆశ్రయించుకొని ఉండవలెను. సత్యము తప్పకూడదు.

"బ్రాహ్మణుడా! నీవు యుక్తితో ఇది మంగళకరము అని నాకు చెప్పింది అంతా అయుక్తమూ, అయోగ్యమూ, అనుచితమూ అయిన పని. నేను వనవాసము చేసి తీరుతాను అని మా తండ్రికి మాట ఇచ్చినాను. ఆ మాట తప్పి ఇప్పుడు భరతుడు చెప్పినట్టు చేయడము ఎట్లాగు? నేను నా తండ్రి సాన్నిధ్యములో స్థిరము అయిన ప్రతిజ్ఞ చేసినాను. అప్పుడు అందుకు మా అమ్మ కైకేయీదేవి ఎంతో సంతోషించింది. కాబట్టి నేను వనవాసము చేస్తూ పూలతోనూ, కందమూలాలతోనూ దేవతలనూ, పితృదేవతలనూ పూజ చేస్తూ, కృత్రిమబుద్ధి లేకుండా వైదికకర్మలను అనుష్ఠిస్తూ కార్యాకార్యవిచక్షణతో సర్వేంద్రియాలనూ సంతోషపెట్టుతూ లోకయాత్ర సాగిస్తాను.

"ఓ బ్రాహ్మణుడా! ఈ భూమిమీద ఉండి శుభకర్మలు చేయడమువలన ఒకడు చంద్రుడు అయినాడు. ఒకడు అగ్ని అయినాడు. ఒకడు వాయువు అయినాడు. నూరు యజ్ఞాలు చేసి ఒకడు దేవేంద్రుడు అయినాడు."

ఈ విధముగా చెప్పి రాముడు మహోగ్రుడు అయిపోయి, "ఓ బ్రాహ్మణుడా! సత్యమూ, ధర్మమూ, పరాక్రమమూ, ప్రియభాషణమూ, భూతదయా, బ్రాహ్మణపూజా, అతిథిసత్కారమూ అనేవి స్వర్గద్వారాలు అని తెలిసినవారు చెప్పినారు. అందువల్ల, బ్రాహ్మణోత్తములు ఈ యధార్థము తెలుసుకొని, ఏమరుపాటు లేకుండా ఏకము అయి తమ తమ ధర్మాలను యధాశాస్త్రముగా అనుష్ఠిస్తూ స్వర్గసౌఖ్యాలను కాంక్షిస్తున్నారు.

"ఓ బ్రాహ్మణుడా! నీవు వైదికవేషము ధరించిన మహానాస్తికుడవు. నీ బుద్ధి వైదిక విరుద్ధము అయిన దారి పట్టింది. నీవు ధర్మమార్గము తప్పినావు. పరలోకము

లేదు అనే నాస్తికమతాన్ని బోధిస్తున్నావు. ఇటువంటి నిన్ను, తన దరిచేరనిచ్చిన మా నాయనగారిని అనవలెను. వేదబాహ్యుడు అయిన బుద్ధుడు దొంగవంటివాడు. అందువల్ల, దొంగనువలె నాస్తికుడు అయిన (తథాగతుణ్ణి) బుద్ధుణ్ణి దరిచేరనీయకూడదు. పరలోకము లేదు అనే నాస్తికుణ్ణి ప్రజలు అందరూ కనిపెట్టి ఉండలెను. బుద్ధిమంతుడు ఎవడూ నాస్తికుడి ఎదుట నిలబడడు.

"ఓ బ్రాహ్మణుడా! నీకన్నా పూర్వీకులు చాలా గొప్పవారు. అనేకమంది అనేక శుభకర్మలు చేసి ఇహపరలోకాలను జయించి గ్రహనక్షత్రాదిరూపాలతో తేజరిల్లుతూ ఉన్నారు. కర్మానుష్ఠానము ఇహపరసాధనము అని తెలుసుకొని బ్రాహ్మణులు మంగళకరము అయిన హోమాదులు చేస్తూ ఉన్నారు. ధర్మరతులూ, సత్పురుషులూ, అహింసకులూ, నిర్మలాత్ములూ అయిన మనలను ఈలోకము పూజించవలెను" అన్నాడు.

ఈ విధముగా చెప్పిన ఆ బలవంతుణ్ణి, ఆ ధైర్యవంతుణ్ణి, ఆ తేజోవంతుణ్ణి రాముణ్ణి చూచి జాబాలి వినయముతో, "రామప్రభూ! నేను నాస్తికుడను కాను. నాస్తిక మతము నేను బోధించడము లేదు. అయితే, మహాధర్మసంకటసమయాలలో సత్కార్యసిద్ధికోసము నాస్తిక మతము చెప్పుతాను. ప్రభూ! నీవు అయోధ్యకు రాను అంటూ ఉన్నందువల్ల, ఇప్పుడు మహాధర్మ సంకట సమయము సంప్రాప్తము అయింది. నిన్ను ఎట్లాగు అయినా ప్రసన్నుణ్ణి చేసుకొని అయోధ్యకు మళ్ళించుకొని పోవలెను అని చెప్పినాను" అన్నాడు.

110

వశిష్ఠుడు రఘువంశ క్రమమును చెప్పుట

రాముడు క్రుద్ధుడు అయిపోవడము వశిష్ఠమహర్షి గమనించినాడు. అంతట ఆ మహాత్ముడు రాముడితో ఈ విధముగా చెప్పసాగినాడు :

"రామా! జాబాలి నాస్తికుడు కాడు. జనులు పరలోకగతులు అవుతారు అనీ, పుణ్యాంతాన తిరిగి ఈ లోకము వస్తారు అనీ జాబాలి నమ్ముతాడు. నిన్ను ఎట్లాగు అయినా అయోధ్యకు మళ్ళించుకొని పోవలెను అనుకొని అట్లా చెప్పినాడు. ఓ లోకనాథుడా! నేను ఈ లోకోత్పత్తిని గురించి చెప్పుతాను, వినవలసినది.

"ఈ భూమిమీద మొట్టమొదట జలము ఉండేది. ఆ జలములో నుంచి బ్రహ్మదేవుడు, దేవతలతో కూడా పుట్టినాడు. అంతట విష్ణుదేవుడు వరాహరూపముతో వచ్చి ఈ భూమిని ఉద్ధరించినాడు. బ్రహ్మదేవుడూ, ఆయన పుత్రులూ ఈ జగత్తును అంతా సృష్టించినారు. బ్రహ్మ ఆకాశ ప్రభవుడు, శాశ్వతుడు, నిత్యుడు,

అవ్యయుడు. ఆ బ్రహ్మవల్ల మరీచి పుట్టినాడు. మరీచి కొడుకు కశ్యపుడు. కశ్యపుడివల్ల సూర్యుడు పుట్టినాడు. ఆ సూర్యుడి కొడుకు మనువు. అందునల్ల, అతడు వైవస్వత మనువు అయినాడు. అతడే మొట్టమొదటి ప్రజాపతి. అతని పుత్రుడు ఇక్ష్వాకువు.

"వైవస్వతమనువు ఈ భూమిని ఇక్ష్వాకువుకు ఇచ్చినాడు. ఆ ఇక్ష్వాకువే అయోధ్యలో మొట్టమొదటి రాజు అయినాడు. ఆయనకు శ్రీమంతుడు అయిన కుక్షి అనేవాడు జన్మించినాడు. కుక్షికి పరాక్రమవంతుడు అయిన వికుక్షి పుట్టినాడు. వికుక్షికి పరమతేజోవంతుడు అయిన బాణుడు పుట్టినాడు. బాణుడికి మహాయశస్వి అయిన అనరణ్యుడు పుట్టినాడు. అనరణ్యుడు సత్పురుషులలో శ్రేష్ఠుడు. ఆ మహానుభావుడు రాజ్యపాలనము చేస్తూ ఉండగా అనావృష్టి లేకుండా సుభిక్షముగానూ చోరభయము లేకుండానూ దేశము వర్ధిల్లింది.

"ఆ అనరణ్యుడికి పృధువు పుట్టినాడు. పృథువుకు త్రిశంకువు పుట్టినాడు. అతడు మహావీరుడు. విశ్వామిత్రుడి ప్రభావమువల్ల సశరీరముగా స్వర్గానికి పోయినాడు. త్రిశంకువు కొడుకు యువనాశ్వుడు. అతడు ధుంధువు అనే రాక్షసుణ్ణి సంహారము చేసినాడు. అందువల్ల, ధుంధుమారుడు అయినాడు. ఆ యువనాశ్వుడికి శ్రీమంతుడు అయిన మాంధాత పుట్టినాడు. ఆ మాంధాతకు మహాతేజోవంతుడు అయిన సుసంధి పుట్టినాడు. ఆ సుసంధికి ధ్రువసంధి, ప్రసేనజిత్ అనే ఇద్దరుపుత్రులు పుట్టినారు. ధ్రువసంధికి భరతుడు అనేవాడు పుట్టినాడు.

"ఆ భరతుడు శత్రువులను అందరినీ జయించినాడు. అతనికి అసితుడు పుట్టినాడు. హైహయులూ, తాలజంఘులూ, శూరాగ్రగణ్యులు అయిన శశిబిందువులూ ఆ అసితుడికి శత్రువులు అయినారు. వారిని అందరినీ అతడు యుద్ధములో ఎదుర్కొన్నాడు. కాని, అతడు ఓడిపోయి రమ్యము అయిన హిమాలయపర్వత ప్రాంతానికి పారిపోయి మునివృత్తిని అవలంబించినాడు. అక్కడ ఆయన ఇద్దరు భార్యలూ గర్భవతులు అయినారు. వారిలో చిన్న ఆమె పెద్ద భార్య గర్భము చెడగొట్ట తలచుకొన్నది. అందుకోసము ఆమె గరళము పెట్టిన భక్ష్యము పెద్ద ఆమెకు మోసము చేసి పెట్టింది. ఆ సంగతి ఆ పెద్ద ఆమె కాళిందికి ఆ తరువాత తెలిసింది. అంతట ఆమె చ్యవనమహర్షి దగ్గరకు పోయి తన పొరపాటు తెలియచెప్పుకొని, తన గర్భాన్ని కాపాడవలసింది అని ప్రార్థించింది. ఆ చ్యవనమహర్షి ప్రసన్నుడు అయి, కాళింది కడుపున పరమధార్మికుడూ, మహోత్ముడూ, సదాచారసంపన్నుడూ, వంశకర్తా అయ్యే కొడుకు పుట్టవలెను అని ఆశీర్వదించినాడు. కాళింది పరమసంతోషముతో ఆ మహర్షికి ప్రదక్షిణ నమస్కారములు చేసి ఆ మహానుభావుడి సెలవు తీసుకొని ఇంటికి చేరింది. కొన్నాళ్ళకు ఆమె పద్మపత్రాక్షుణ్ణి, బ్రహ్మదేవుడితో సరిమానము

అయిన తేజోవంతుణ్ణి కన్నది. గరళము జీర్ణించుకొని పుట్టినందువల్ల ఆ పిల్లవాడు సగరుడు అనే పేరుతో ప్రసిద్ధికి ఎక్కినాడు.

"ఆ సగరుడు లోకోత్తరముగా రాజ్యపాలనము చేసినాడు. అతడు అశ్వమేధము చేస్తూ ఉండగా యజ్ఞాశ్వము కనపడకుండా పోయింది. ఆ యజ్ఞాశ్వాన్ని వెదకడానికి అతడు తన కొడుకులను అందరినీ ఈ భూమిమీదకు పంపించినాడు. ఎక్కడనూ ఆ యజ్ఞాశ్వము దొరకనందువల్ల తన కొడుకులచేత సముద్రాన్ని అంతా మహాభయంకరముగా తవ్వించి వెదకించినాడు. ఆ సగరుడికి అసమంజుడు అనే పెద్దకొడుకు వుండేవాడు. వాడు పాపకృత్యాలు చేసినందువల్ల వాణ్ణి సగరుడు అడవులకు వెళ్ళకొట్టించినాడు. సగరుడి తరువాత అసమంజుడి పుత్రుడు అంశుమంతుడు రాజ్యము ఏలినాడు.

"అంశుమంతుడికి దిలీపుడు పుట్టినాడు. దిలీపుడికి భగీరథుడు పుట్టినాడు. భగీరథుడికి ककుత్థ్సుడు పుట్టినాడు. ककుత్థ్సుడికి రఘువు పుట్టినాడు. ఈ ఇద్దరూ జగత్ప్రసిద్ధముగా రాజ్యపాలనము చేసినారు. అందువల్లనే ఇక్ష్వాకులు ककుత్థ్సులూ, రాఘవులూ అయినారు. రఘుమహారాజుకు ప్రవృద్ధుడు అనేవాడు పుట్టినాడు. ఆ ప్రవృద్ధుడే పురుషాదుడు అనీ, కల్మాషపాదుడు అనీ, సౌదాసుడు అనీ ప్రసిద్ధికి ఎక్కినాడు. కల్మాషపాదుడికి శంఖణుడు అనేవాడు పుట్టినాడు. ఆ శంఖణుణ్ణి ససైన్యముగా కల్మాషపాదుడే చంపివేసినాడు. ఆ తరువాత శంఖణుడి పుత్రుడు సుదర్శనుడు రాజు అయినాడు. సుదర్శనుడు శూరుడు. శ్రీమంతుడు. చక్కగా రాజ్యపాలనము చేసినాడు. అతడికి అగ్నివర్ణుడు అనేవాడు పుట్టినాడు. అగ్నివర్ణుడికి శీఘ్రుగుడున్నూ, శీఘ్రుగుడికి మరువున్నూ, మరువుకు ప్రశుశ్రుకుడున్నూ, ప్రశుశ్రుకుడికి అంబరీషుడున్నూ, అబరీషుడికి నహుషుడున్నూ, నహుషుడికి నాభాగుడున్నూ, నాభాగుడికి అజుడు, సువ్రతుడు అనే ఇద్దరు పుత్రులున్నూ పుట్టినారు.

"ఆ అజ మహారాజుకు మీ నాయన దశరథమహారాజు పుట్టినాడు. నీవు ఆయనకు జ్యేష్ఠపుత్రుడవుగా పుట్టినావు. అందువల్ల, నీవు దాయభాగార్హుడవు. కాబట్టి, నీవే రాజ్యపాలనము చేయవలెను. మీ ఇక్ష్వాకువంశములో ఎప్పుడూ జ్యేష్ఠపుత్రుడే రాజ్యము ఏలుతూ వచ్చినాడు. ఇది మీ వంశ మర్యాద. జ్యేష్ఠుడు ఉండగా కనిష్ఠుడికి పట్టాభిషేకార్హత లేదు. నీవు ఇప్పుడు రఘువంశ మర్యాదను చెడగొట్టవద్దు."

111

రాజపురోహితుడు వశిష్ఠమహర్షి ఇంకా ఈ విధముగా చెప్పసాగినాడు :

"ఓ రామా! ఈ లోకములో తండ్రి, తల్లి, ఆచార్యుడు అనే ముగ్గురూ గురువులు. జన్మకారకుడు అయినందువల్ల తండ్రీ, కనిపెంచి నందువల్ల తల్లీ,

జ్ఞానము ప్రసాదించినందువల్ల ఆచార్యుడూ గురువులు అవుతున్నారు. నేను మీ తండ్రికీ, నీకూ గురువును. కాబట్టి, నీవు నామాట వినవలెను. నామాట విన్నందువల్ల నీ సన్మార్గవర్తనానికి భంగపాటు ఏమీ ఉండదు. ఇదుగో, ఈ బ్రాహ్మణోత్తములూ, ఈ క్షత్రియులూ, ఈ వైశ్యులూ, పౌరముఖ్యులూ, జనపద ముఖ్యులూ నిన్ను ప్రార్థిస్తున్నారు. వీరి కోరికను అనుసరించి వీరిని అందరినీ పరిపాలించడము సత్పధము తప్పడము కాదు.

"నీ తల్లి కౌసల్యాదేవి వృద్ధురాలు. ఆమె ధర్మశీల. ఆమెకు ఇప్పుడు నీవు సేవ చేయవలెను. ఆమె చెప్పినట్టు చేయడము సత్పధము తప్పడము కాదు.

"రామా! నీవు సత్యమూ, ధర్మమూ తప్పనివాడవు. పరమపరాక్రమవంతుడవు. అంతేకాదు యాచించినవారిని నీవు ఎన్నడూ కాదు అని ఎరుగవు. ఇప్పుడు నిన్ను ఈ భరతుడు యాచిస్తున్నాడు. నీవు ఈతని కోరిక నెరవేర్చడము సత్పధము తప్పడము కాదు.

"రామా! నీవు అయోధ్యకు బయలుదేరడములో తప్పు ఏమీ లేదు."

వశిష్ఠమహర్షి ఇంత యుక్తియుక్తముగానూ, ఇంత మనోహరముగానూ చెప్పినా రాముడు, "మహర్షీ! ఒక్క కొడుకును కనడానికి తల్లితండ్రులు ఎన్నో వ్రతాలు పట్టుతారు. ఎన్నో ఉపవాసాలు చేస్తారు. పిల్లవాడు పుట్టిన తరువాత తల్లి ఆ పిల్లవాడికి నలుగుపెట్టి, నీళ్ళు పోసి, పాలు యిచ్చి, అన్నము పెట్టి, పెంచి పెద్దవాణ్ణి చేస్తుంది. ఆ పిల్లవాడిని శైశవమునుంచీ తండ్రి ముద్దులాడుతాడు. గుడ్డలు ఇస్తాడు. చదువు చెప్పిస్తాడు. ప్రయోజకుణ్ణి చేస్తాడు. అట్లా చేసే తల్లితండ్రుల ఋణము తీర్చడము దుర్లభమే. నా తండ్రి దశరథమహారాజు నా జన్మకు కారకుడు. నేను ఆయన ఎదుట చేసిన శపథము దబ్బర అయిపోకూడదు. నేను నా తల్లి కౌసల్యాదేవికి అటువంటి వాగ్దానము ఏమీ చేయలేదు. అందువల్ల, నేను పధ్నాలుగు సంవత్సరాలూ వనవాసము చేయవలసిందేను" అన్నాడు.

భరతుడు ఈ మాటలు విన్నాడు. ఆ పరమోదారుడి మనస్సు వికలము అయిపోయింది. అంతట అతడు సుమంత్రుణ్ణి చూచి, "ఓ మంత్రిసత్తమా! నేను ఇప్పుడు ఇక్కడ ప్రాయోపవేశము చేయ సంకల్పించుకొన్నాను. నీవు ఈ నేలమీద దర్భలు పరచిపెట్టు. రాముడు ప్రసన్నుడు అయేటంతవరకూ నేను ఇక్కడ దర్భలమీద పడుకొంటాను. అన్నము తినను, నీళ్ళు త్రాగను. ఎవరినీ చూడకుండా ముఖాన గుడ్డ కప్పుకొంటాను. రాముడు ప్రసన్నుడు కాకపోయేటట్లయితే నా ఈ దేహము ఇక్కడ నశించి పోవలసిందేను" అన్నాడు.

సుమంత్రుడు రాముడివంక చూచినాడు. అంతట తలవంచుకొని ఊరక ఉన్నాడు. అప్పుడు భరతుడే స్వయముగా పోయి దర్భలు తెచ్చుకొని రాముడి పర్ణశాల వాకిటికి అడ్డముగా పరచుకొన్నాడు. ఆ దర్భశయ్యమీద పడుకొన్నాడు.

అప్పుడు మహాతేజోవంతుడు అయిన రాముడు భరతుడితో, "తమ్ముడా! నేను నీకు ఏమి అపకారము చేసినాను? ఎందుకు నా వాకిలికి అడ్డముగా పడుకొని ప్రాయోపవేశము చేస్తావు? బ్రాహ్మణుడు మాత్రమే ఈ లోకములో ఇట్లా ప్రాయోపవేశము చేయవచ్చును. నీవు మూర్ధాభిషిక్తుడవు కావలసిన క్షత్రియుడవు. నీవు ఇట్లా నా వాకిలికి అడ్డముగా పడుకో కూడదు. భరతుడా! నీవు లేవవలెను. ఈ దారుణవ్రతము నీవు పట్టకూడదు. నీవు ఇప్పుడే అయోధ్యానగరము వెళ్లిపోవలెను" అన్నాడు.

భరతుడు ఆ దర్భలమీద అట్లా పడుకొనే పౌరముఖ్యులనూ, జనపద ముఖ్యులనూ, ఇంకా అక్కడ ఉన్న వారిని అందరినీ ఉద్దేశించి, "ఓ మహానుభావులారా! ఈ పూజ్యుణ్ణి అయోధ్యకు రమ్మని మీరు ప్రార్థించరా?" అని అడిగినాడు.

"ఓ రాజా! రామప్రభువును మేము బాగా ఎరిగినాము. ఆయన ఆడినమాట తప్పడు. ఇప్పుడు ఆ మహానుభావుడు పిత్రాజ్ఞాపరిపాలనము తప్పను అంటున్నాడు. ఆయనను అయోధ్యకు మళ్ళించడము మా తరమా? పైగా ఆయన చెపుతున్నది అంతా మాకు బాగుంది" అన్నారు పౌరముఖ్యులు.

"ఓ భరతుడా! ఈ పౌరముఖ్యులూ, ఈ జనపదముఖ్యులూ ధర్మవిదులు. వీరు ఏమి చెప్పుతున్నారో నీవు విన్నావు. నేను చెప్పిందీ, వారు చెప్పిందీ చక్కగా ఆలోచించి చూడు. నీవు వెంటనే లే. నన్ను తాకి ఆచమించు. నీ దోషము పోతుంది" అన్నాడు రాముడు.

భరతుడు ఆలోచించినాడు. మార్గాంతరము తోచలేదు. లేచి రాముడి పాదాలు తాకి ఆచమించి, "ఓ మహాజనులారా! నేను చెప్పుతున్న విషయము అందరూ వినవలెను. నాకు రాజ్యము కావలెను అని నేను ఎన్నడూ నా తల్లితో చెప్పలేదు. నా తల్లి కైకేయీదేవిని నేను అందుకు ప్రేరేపించలేదు. రాముడు అడవికి బయలుదేరడము నేను ఎరుగనే ఎరుగను. ఇప్పుడు ఆ ధర్మజ్ఞుడు పితృవాక్య పరిపాలనము కోసము అవశ్యమూ అడవిలోనే ఉండవలెను అంటున్నాడు. అందువల్ల, ఆయనకు బదులు నేనే పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసము చేస్తాను. నా బదులు ఆ మహానుభావుడు అయోధ్యలో రాజ్యము ఏలవలెను. ఇట్లా చేసేటట్టయితే దశరథమహారాజు ఆజ్ఞ దబ్బరకాదు" అన్నాడు భరతుడు.

భరతుడి ఈ మాటలకు అందరూ ఆశ్చర్యచకితులు అయినారు.

రాముడు ఆ పౌరులనూ, జానపదులు మొదలు అయినవారిని అందరినీ చూస్తూ, "నా తండ్రి దశరథమహారాజు దేనిని అయినా అమ్మివేసినా, దేనిని అయినా కొన్నా, దేనిని అయినా కుదువపెట్టినా, దేనిని అయినా దానము ఇచ్చినా దానిని నేను కాదు అనడానికి వీలులేదు. అట్లా అనడము నా తరము కాదు. ఈ భరతుడి తరము కాదు. దశరథమహారాజు భరతుడికి రాజ్యపాలనమూ, నాకు వనవాసమూ నిర్ణయించినాడు. ఆ నిర్ణయాన్ని మార్చడము ఎవరి తరమూ కాదు. వనవాసానికి బదులు నేను రాజ్యపాలనము చేయకూడదు. మా అమ్మ కైకేయీదేవి చక్కగా వరము అడిగింది. మా తండ్రిన్నీ ఇదమిత్థముగానే నిర్ణయించినాడు.

"ఓ భరతుడా! నీ భ్రాతృభక్తి నేను ఎరుగుదును. నీ క్షమాగుణము నేను ఎరుగుదును. నీవు పూజ్యుడవు. సత్యసంధుడవు. నీకు అంతా శుభము అవుతుంది. నేను వనవాసముచేసి తిరిగి అయోధ్యకు వస్తాను. ఉత్తమోత్తముడవు అయిన నీ సాయముతో నేను అప్పుడు రాజ్యపాలనము చేస్తాను. నాయనా! దశరథమహారాజును కైకేయీదేవి యాచించింది. ఆయన అందుకు అంగీకరించినాడు. నేను అందుకు వనవాసముచేస్తూ ఉన్నాను. వారి కోరిక ప్రకారము నీవు రాజ్యపాలనము చేయవలెను. ఆ మహానుభావుడికి, మన తండ్రి దశరథమహారాజుకు అనృత దోషము లేకుండా ఉండడానికి మనము ఇద్దరమూ కష్టపడుదాము" అన్నాడు.

112

భరతుడు రాముని పాదుకలు స్వీకరించుట

ఆ అసమానతేజోవంతుల సమాగమము అక్కడి మహర్షులకు అందరికీ అత్యద్భుతముగా తోచింది. వారి సంభాషణలు గగురు పుట్టించినవి. అంతవరకూ అగపడకుండా వారిని గమనిస్తూ ఉన్న దేవర్షులు, సిద్ధులు మొదలగు వారు అందరూ ఆ అన్నతమ్ముల దగ్గరకు వచ్చి, "ఓ సోదరులారా! మీ ఉభయుల సంభాషణలూ మేము వింటున్నాము. మీ తండ్రి దశరథమహారాజు ధన్యుడు. మీ వంటి ధర్మవేత్తలు, ధర్మవిక్రములు ఆయనకు పుత్రులుగా పుట్టినారు. మీమీద మాకు మక్కువ ఎక్కువయి ఇప్పుడు మిమ్ములను చూడవచ్చినాము" అంటూ రాముణ్ణీ భరతుణ్ణీ ప్రశంసించినారు.

అక్కడికి వచ్చిన దేవర్షులు అందరూ రావణ్వధైషులు. భరతుడితో, "ఓ భరతుడా! నీవు మహాప్రాజ్ఞుడవు. మహాయశుడవు. సదాచారసంపన్నుడవు. సత్కులములో పుట్టినావు. నాయనా! నీవు నీ తండ్రి పరలోకసౌఖ్యము కోసము రాముడు చెప్పినట్లు వినవలెను. రాముడు తన తండ్రికి ఋణపడకుండా ఉండడమే

మాకు కావలెను. కైకేయీదేవి ఋణము తీర్చి దశరథమహారాజు స్వర్గతుడు అయినాడు. ఆ దశరథమహారాజు కైకేయీదేవికి ఇచ్చిన వరాలు మీరు అన్నతమ్ములు అబద్ధము చేసేటట్లయితే, ఆయన స్వర్గమునుంచి జారి కింద పడిపోతాడు" అని ఆ దేవర్షులూ, మహర్షులూ చెప్పినారు. రాముడు వారిని అందరినీ పూజించినాడు. అంతట వారు అంతర్ధానము అయిపోయినారు.

రాముడు అయోధ్యకు రాడు అని తెలియగానే భరతుడు భయవిహ్వలుడు అయిపోయినాడు. చేతులు జోడించి, "అన్నా రామా! రాజధర్మాన్నీ, మన వంశక్రమానుగతము అయిన ఆచారాన్నీ మళ్ళీ నీవు ఒకసారి ఆలోచించు. మా అమ్మ నిన్ను రమ్మని యాచిస్తున్నది. నేను ఒక్కడినీ ఇంత రాజ్యాన్ని ఏలలేను. ఎంతో అనురాగముతో ఉంటూ ఉన్న పౌర జానపదులను అందరినీ నేను సంతోషపెట్టలేను. జ్ఞాతులు, మిత్రులు, యోధులు మొదలయినవారు అందరూ మేఘాలకోసము కర్షకులవలె, నీ రాకకు ఎదురుచూస్తూ ఉన్నారు. అన్నా! నీవు కోసల రాజ్యమేకాదు, ఈ జగత్తు అంతా ఏలకలవు. నీకు ఆ సామర్థ్యము ఉంది. నాకు లేదు. ఏమి అయినప్పటికిన్నీ, నీవు అయోధ్యకు రావలెను" అంటూ భరతుడు రాముడి కాళ్ళు పట్టుకొన్నాడు.

ఆ పద్మపత్రాక్షుడు తన కాళ్ళమీదపడ్డ శ్యామాంగుణ్ణి భరతుణ్ణి లేవనెత్తి కౌగలించుకొని దగ్గరకు కూర్చుండ పెట్టుకొని, "తమ్ముడా! నీవు భయపడవద్దు. జన్మతః బుద్ధిమంతుడవు. గురుశిక్షవల్ల నీలో ఆ బుద్ధి వికసించింది. ఈ పృథ్విని అంతా పరిపాలించే సామర్థ్యము నీకు ఉంది. అంతేకాదు, అనుభవజ్ఞులు అయిన అమాత్యులతోనూ, బుద్ధిబలసంపన్నులు అయిన ఉపమంత్రులతోనూ, ధర్మజ్ఞులు అయిన బ్రాహ్మణోత్తములతోనూ కార్యాకార్యాలను నీవు చక్కగా విచారించి తెలుసుకొన వచ్చును. ఎటువంటి మహత్తర కార్యాలను అయినా సులభముగా నెరవేర్చవచ్చును. ఆ యా సదుపాయాలు అన్నీ దశరథమహారాజే చేసి ఉంచినాడు.

"ఇక నా సంగతి. ఈ లోకములో చంద్రుడికి కాంతి పోతే పోవచ్చును. హిమవత్పర్వతముమీద హిమము ఎండిపోతే ఎండిపోవచ్చును. సముద్రము మేర మీరి ఈ భూమిని అంతా ముంచి వేస్తే ముంచివేయవచ్చును. నేను మాత్రము గురుసన్నిధిలో చేసిన ప్రతిజ్ఞ తప్పను.

"నాయనా భరతుడా! నీవు రాజ్యము చేయవలెను అనే కాంక్షవల్లకానీ, ఐశ్వర్యకాంక్షవల్లకానీ, మరి ఏ కాంక్షవల్లకానీ మీ అమ్మ ఈ పని చేసింది. నీవు అది అంతా మనస్సులో ఉంచుకోవద్దు. నీవు మాతృగౌరవముతో ఆమెను చూడవలెను" అన్నాడు రాముడు.

మధ్యస్థుడుగానూ, రాముడికీ భరతుడికీ హితపరుడుగానూ ఉన్న వశిష్ఠమహర్షి ప్రేరేపించినందువల్ల భరతుడు అప్పుడు ఆ సూర్యసమానకాంతిమంతుణ్ణి, శుక్లపక్ష పాడ్యమినాటి చంద్రుడివంటి రాముణ్ణి చూచి, "ఓ పూజ్యుడా! నీవు ఈ బంగారు పావకోళ్ళమీద నిల్చుండవలెను. ఈ పాదుకలే నన్ను కాపాడుతవి. ఈ పాదుకలే అందరి యోగక్షేమాలనూ చూచుకొంటూ ఉంటవి" అన్నాడు. ఆ తేజోవంతుడు రాముడు ఆ బంగారు పావకోళ్ళమీద ఒక కొంచెముసేపు నిలుచుని దిగినాడు. అంతట భరతుడు ఆ పావకోళ్ళకు నమస్కారము చేసి "పరంతపా! ఓ వీరా! నేను రాజ్యతంత్రము అంతా నీ పాదుకలకు ఒప్పచెప్పుతున్నాను. నేను జటాజినాలు ధరించి, ఫలమూలాలు తింటూ, నీ పాదుకల కోసము రాజ్యపాలనము చేయిస్తూ పద్నాలుగు సంవత్సరాలూ అయిపోయి నీవు వచ్చేటంతవరకున్నూ నీకోసము ఎదురుచూస్తూ ఉంటాను. గడువుకాలము అయిపోయిన మరునాడు నీవు అయోధ్యలో నాకు ప్రత్యక్షము కాకపోయేటట్లయితే, నేను నా ఈ దేహాన్ని అగ్నిహోత్రానికి ఆహుతి చేసి వేస్తాను" అని చెప్పినాడు.

అట్లాగే అంటూ రాముడు భరతుణ్ణి అత్యంతాదరముతో కౌగలించుకొన్నాడు. భరతుణ్ణి చూస్తూ, "తమ్ముడా! నీవు కైకేయీదేవిని అత్యంతాదరముతో చూస్తూ ఉండవలెను. ఆమెను నీవు ఎప్పుడూ కోపపడ కూడదు. నేను నామీదనూ, ఈ సీతాలక్ష్మణులమీదనూ ఒట్టుపెట్టుతున్నాను" అంటూ, కన్నీళ్ళు కారుస్తూ భరతుణ్ణి అయోధ్యకు పొమ్మని చెప్పినాడు.

అంతట భరతుడు ఆ పాదుకలకు ప్రదక్షిణముచేసి, శత్రుంజయము అనే పట్టపుటేనుగు తెప్పించి, రాజలాంఛనముగా ఆ పాదుకలను దాని శిరముమీద పెట్టినాడు. అంతట అచలముగా హిమవంతుడివలె ఉన్న రాముడు గురువులనూ తమ్ములనూ, తక్కినవారినీ కొనియాడి సెలవు చెప్పినాడు.

అక్కడినుండి కదలిపోకుండా కన్నీళ్ళు కారుస్తూ, పెదవులు ఒణికిపోతూ దుఃఖముతో మాట్లాడలేకుండా నిలుచుని తల్లులు అందరికీ నమస్కారము చేసినాడు. రాముడికి అప్పుడు ఏడుపు వచ్చింది. వెంటనే అతడు పర్ణశాలలోకి పోయినాడు.

113

భరతుడు అయోధ్యకు బయలుదేరుట

రాముడి పాదుకలు తన శిరముమీద పెట్టుకొని భరతుడు శత్రుఘ్నుడితో రథము ఎక్కినాడు.

అప్పుడు అందరూ అయోధ్యకు ప్రయాణము అయినారు.

వశిష్ఠమహర్షి మొదలు అయిన బ్రాహ్మణోత్తములూ, మంత్రిసత్తములూ వారి వారి వాహనాలు ఎక్కి ముందుగా పోయినారు. భరతుడి రథము వారివెనుక నడిచింది. చిత్రకూట పర్వతానికి ప్రదక్షిణముగా తూర్పు దిక్కుకు ప్రయాణము అయి, మందాకినీనది పార్శ్వమునుంచి పోతూ, ఆ పర్వత సానువులలో ధగధగలాడుతూ ఉన్న గైరికాది ధాతువులను చూస్తూ పోయినారు.

భరద్వాజాశ్రమము చేరినారు. అక్కడ భరతుడు రథము దిగి, పాదచారుడు అయి పోయి భరద్వాజమహర్షికి పాదాభివందనము చేసినాడు. ఆ మహాత్ముడు మహదానందముతో భరతుణ్ణి చూచి, "నాయనా! నీవు వెళ్ళిన పని అయిందా? రాముడు కనిపించినాడా? నీవు మాట్లాడినావా" అని ప్రశ్నించినాడు.

"ఓ మహర్షీ! మేము అందరమూ రాముడి దర్శనము చేసినాము. అయోధ్యకు రమ్మని వశిష్ఠులవారు చెప్పినారు. నేను ఎంతో యాచించినాను. పిత్రాజ్ఞాపరిపాలనము కోసము పద్నాలుగు సంవత్సరాలూ వనవాసము చేయవలసిందేను అని చెప్పినాడు. అతని బంగారు పాదుకలను ఇవ్వవలసింది అనీ, అవే అయోధ్యలో ఆతనికి ప్రతినిధులుగా ఉండి ప్రజల యోగక్షేమాలను చూచుకొంటూ ఉంటవి అనీ వశిష్ఠులవారు ఉపదేశించినారు. వశిష్ఠమహర్షి చెప్పినట్టుగా రాముడు సంతోషముతో బంగారుపాదుకలమీద ప్రాజ్ముఖుడు అయి నిలుచుని, వాటిని నాకు రాజలాంఛనముగా ఇచ్చినాడు. మంగళకరము అయిన ఆ పాదుకలను తీసుకొని ఆ మహాత్ముడి అనుమతితో నేను ఇప్పుడు అయోధ్యకు పోతున్నాను" అన్నాడు భరతుడు.

"ఓ భరతుడా! నీవు పురుషశ్రేష్ఠుడవు. సదాచార సత్స్వభావసంపన్నులలో ఉత్తముడవు. నీళ్ళు పల్లములోనికి పోయి నిలిచేటట్టు, నీలో జ్యేష్ఠానువర్తనము అనే ధర్మము పాదుకొని పోయింది. ఇందులో ఆశ్చర్యము ఏమీలేదు. నీవంటి ధర్మవత్సలుడు పుట్టబట్టే దశరథమహారాజు మృతజీవుడు అయి ఉన్నాడు" అంటూ భరద్వాజమహర్షి భరతుణ్ణి మెచ్చుకొన్నాడు.

అంతట భరతుడు ఆ మహాత్ముడికి ప్రదక్షిణముచేసి సాష్టాంగ పడినాడు. ఆయన ఆశీర్వాదాలతో అయోధ్యకు ప్రయాణము అయినాడు. అతనివెంట ఆ యా వాహనాలూ, శకటాలూ, గుర్రాలూ, ఏనుగులూ, జనసమూహాలూ బయలుదేరినవి. వారు అందరూ అలలు లేస్తూ ఉన్న యమునానదిని అనాయాసముగా దాటినారు. గంగానది దగ్గరకు పోయినారు. రమ్యజలపూర్ణము అయిన ఆ గంగానదిని భరతుడు పరివారముతో కూడా దాటి శృంగిబేరపురము పోయినాడు.

అక్కడనుంచి బయలుదేరి అచిరకాలములో అయోధ్యా నగరము చేరినారు.

దశరథమహారాజూ, సీతారామలక్ష్మణులూ లేని అయోధ్యానగరాన్ని చూడగానే భరతుడికి దుఃఖము వచ్చింది. "ఓ సారథీ! అయోధ్యా నగరము పాడుపడిపోయినట్టుగా ఉంది. ఆకారమే మారిపోయింది. సంతోషము ఎక్కడా కనిపించడములేదు. దీనముగా ఉంది" అన్నాడు భరతుడు.

114

భరతుడి రథము శ్రావ్యగంభీర ధ్వనులతో అయోధ్యా నగరములోకి పోయింది. అప్పుడు రాజవీధులలో జనసంచారము లేదు. ఏనుగులు కనపడలేదు. పిల్లులు పరుగులు ఎత్తుతున్నవి. పైన గుడ్లగూబలు యథేష్టముగా తిరుగుతూ ఉన్నవి. అయోధ్యా నగరము అప్పుడు చీకట్లు కమ్ముకొన్న కృష్ణపక్ష రాత్రివలె భరతుడికి కనిపించింది.

అంగారక గ్రహము ఎట్ట ఎదుట నిలుచుని పీడిస్తూ ఉంటే, తళ తళ కాంతులు తరిగిపోయి ఒంటరిగా పరితపిస్తూ ఉన్న చంద్రుడి ప్రియసతి అయిన రోహిణి నక్షత్రమువలెనూ; ఉన్న కాసిని నీళ్ళు ఎండకు సలసల కాగుతూ ఉన్నందువల్ల, పక్షులు ఆ నీళ్ళు తాగలేక తల్లడిల్లిపోతూనూ, చేపలు మొదలు అయిన జలచరాలు అడుగున దాగుకొనలేక చచ్చిపోతూనూ ఉంటే సన్నగా జాలుగా పారే కొండవాగువలెనూ; పొగలు గిగలూ లేకుండా తప్తకాంచన వర్ణములో జ్వాలలు లేస్తూ ఉంటే, హవిస్సు ప్రోక్షించినందువల్ల మరుగుపడి పోయిన యజ్ఞాగ్ని జ్వాలవలెనూ, ఏనుగులూ, గుర్రాలూ, రథాలూ, టెక్కాలూ నేలకూలి యోధులు తొడుగుకొన్న కవచాలు అన్నీ తెగిపోయి మహాసంగ్రామ రంగములో చిక్కుపడిపోయిన సైన్యమువలెనూ; నురుగులు కట్టుతూ మహాఘోషముతో లేచి గాలి అణగిపోయినందువల్ల చడీ చప్పుడు లేకుండా అసలు రూపమే మాసిపోయిన సముద్ర తరంగాలవలెనూ; యజ్ఞము సమాప్తము అయిన తరువాత ఋత్విజోత్తములు తమ యజ్ఞోపకరణాలను అన్నిటినీ తీసికొని పోయి వేదఘోష ధ్వనులు లేకుండా నిశ్శబ్దముగా ఉన్న యజ్ఞవేదికవలెనూ;

ఆబోతులను తీసుకొనిపోతే, దానిని గురించే ఆలోచిస్తూ కొఠములో పచ్చగడ్డి అయినా మేయకుండా ఉన్న ఆవులమందవలెనూ,

పద్మరాగమణులతో తళతళలాడే పతకము తరిగి పోయినందువల్ల వెలా తెలా పోతున్న ముత్యాలహారమువలెనూ;

పుణ్యము క్షయము అయిపోయినందువల్ల ఆకాశము నుంచి హఠాత్తుగా నేల రాలి, కాంతులు మాసిపోయిన నక్షత్రమువలెనూ;

కొమ్మకొమ్మకూ పూలు విరగపూసి తుమ్మెదలు ఝుంకారము చేస్తూ ఉంటే వసంతకాలాంతాన కార్చిచ్చుకు కమిలిపోయిన వనలతవలెనూ;

కుండలతో మద్యము అంతా పాడయిపోయి, త్రాగే పిడతలు అన్నీ పగిలిపోయి, త్రాగిన జనము అంతా పడి ఉన్న అనాచ్ఛాదిత పానశాలవలెనూ;

నేల బీటలు పారి, జలభాండాలు అన్నీ పగిలిపోయి, జలము అంతా నేలపాలు అయిన చలివేంద్రమువలెనూ;

యుద్ధ సమయములో ప్రతివీరుల బాణాల తాకిడికి తెగిపోయిన వింటి అల్లెత్రాడువలెనూ;

యుద్ధములో సమర్థుడూ, హయరోహణకుశలుడూ ఎక్కితే మోయలేక అలసిపోయినందువల్ల, ఆభరణాలు అన్నీ తీసివేసి వదిలి పెట్టిన ఆడుగుర్రపుపిల్లవలెనూ;

నీళ్లు అన్నీ ఇగిరిపోయి చేపలూ, తాబేళ్ళూ మొదలు అయిన జలచరాలు అన్నీ బయటపడి, కమలాలు అన్నీ కమిలిపోయి, గట్లు అన్నీ విరిగి పడిపోయిన నడబావివలెనూ;

మైపూత మానివేసి, సొమ్ములు అన్నీ తీసివేసి, దుఃఖముతో తాపము ఎత్తి కొయ్యబారిన సుందరాంగుడి దేహమువలెనూ;

నడి వర్షాకాలములో మేఘాలలో చిక్కుపడిపోయిన సూర్యుడి కిరణాలవలెమా అయోధ్యా నగరము భరతుడికి తోచింది.

జనసంచారము లేని రాజవీథులతోనూ, క్రయవిక్రయాలు లేనందువల్ల మూసివేసిన అంగళ్ళతోనూ అయోధ్యా నగరము భరతుడికి కనిపించింది. రథము తోలుకొని పోతూ ఉన్న సారథితో అతడు "సూతుడా! చూడు, ఇప్పుడు ఈ మహానగరము ఇదివరకటివలె లేదు. గీతవాదిత్రధ్వనులు గంభీరముగా మ్రోగడము లేదు. మత్తు ఎక్కించే మద్యవాసనలూ, చందనాగరుధూపవాసనలూ, పూలదండల ఘుమఘుమ వాసనలూ ఎక్కడనూ గుబాళించడము లేదు. ఆ యా వాహనాల చప్పుళ్ళు వినిపించడము లేదు. గుర్రాల సకిలింపులుకానీ, ఏనుగుల ఘీంకారాలుకానీ వినపడడము లేదు. రామ వియోగానికి వయసుకాండ్లు అందరూ దిగులు పడిపోయినారు. అందువల్లనే, ఎవరున్నూ సుగంధచందనచర్చలు చేసుకొని, ఘమఘమలాడే కొత్త కొత్త పూలదండలు వేసుకొని నగర బహిఃప్రదేశాలకు విహరించడానికి పోవడము లేదు. సంపన్నులు అయిన యువకులు ఎవరూ సుందర వేషాలతో సగర్వముగా రాజవీధులలో సంచరించడము లేదు. మా అన్న రాముడితోనే

ఈ మహానగరము కళాకాంతులు అన్నీ పోయినవి. ఒక్క ఉత్సవము అయినా జరుగుతున్నట్లు లేదు. మా అన్న రాముడు మహోత్సవమువలె వచ్చి, గ్రీష్మర్తువులో మేఘమువలె ప్రజలను అందరినీ ఎంత కాలానికి సంతోషపెట్టుతాడో" అని చెప్పుతూ ఉండగా, సింహములేని గుహ మాదిరిగా ఉన్న దశరథమహారాజు అంతఃపురములోనికి రథము పోయింది.

దేవాసుర యుద్ధములో దేవతలు అందరూ పరాజితులు అయిపోయినప్పుడు, రాహువు మింగివేసినందున సూర్యుడు కనపడకుండ పోయినందువల్ల, దివారాత్రభేదము తెలియని దినమువలె కాంతి మాసిపోయి, వివిక్తముగా ఉన్న రాజాంతఃపురాన్ని చూచి భరతుడు కన్నీరు కార్చినాడు.

115

ఆ ధృడవ్రతుడు భరతుడు తల్లులను అందరినీ రాజాంతఃపురములో దిగవిడిచినాడు. శోకాగ్నికి తపించిపోతూ వశిష్ఠాదులను చూచి "నేను ఈ అంతఃపురములో ఉండలేను. ఈ అంతఃపురములోనే కాదు, ఈ అయోధ్యా నగరములోనే ఉండలేను. ఇక్కడ ఉండి రాముడు లేని దుఃఖమూ, పితృవియోగ దుఃఖము నేను ఓర్చుకోలేను. మిమ్ములను వదిలిపెట్టి నేను ఇప్పుడే నందిగ్రామము పోతున్నాను. మా తండ్రి దశరథమహారాజు స్వర్గతుడు అయినాడు. ఆయన ఇక తిరిగి రావడము అనేది లేదు. ఆ మహాయశుడు, వనవాసము చేస్తున్న రాముడు వచ్చి ఈ రాజ్యము ఏలవలెను. అతని రాకకు నిరీక్షిస్తూ నేను అక్కడనే నందిగ్రామములోనే ఉంటాను. అక్కడ అయితే దుఃఖము ఎట్లాగో ఓర్చుకొని ఉండగలుగుతాను" అని భరతుడు చెప్పినాడు.

మంత్రులూ, వశిష్ఠమహర్షీ "ఓ భరతుడా! నీ అభిప్రాయము బాగుంది. నీవు భ్రాతృవాత్సల్యముతో చెప్పిన మాట ఎంతో శ్లాఘనీయముగా ఉంది. ఇట్లా నీవు ఒక్కడవే చెప్పకలవు. నీ బంధుప్రేమను, నీ భ్రాతృవాత్సల్యాన్ని కాదు అన కలవాడు ఎవడు? నీవు సన్మార్గము అవలంబించినావు. నిన్ను ఎవడు సమ్మతించడు" అన్నారు.

అంతట భరతుడు తన సారథితో రథము సిద్ధముచేసి తీసుకొని రమ్మని చెప్పినాడు. ఆ శ్రీమంతుడు తల్లులు అందరికీ నమస్కారముచేసి వీడ్కోలు చెప్పినాడు. శత్రఘ్నుడితోకూడ రథము ఎక్కినాడు. అప్పుడు వశిష్ఠాది బ్రాహ్మణోత్తములూ, మంత్రులూ భరతుడి రథానికి ముందు ప్రాజ్ముఖులు అయి పోసాగినారు. ఆ విధముగా వశిష్ఠాది పురోహితుల వెంట భరతుడి రథము పోతూ ఉంటే ఒకరు ఎవరూ చెప్పకుండానే చతురంగబలాలూ అప్పటికి అప్పుడు ప్రయాణము

అయినవి. గజాశ్వసంకులము అయిన మహాసైన్యము అట్లా పోతూ ఉంటే, పౌరముఖ్యులున్నూ వారిని వెంబడించినారు.

ఆ భ్రాతృవత్సలుడు, ఆ ధర్మాత్ముడు భరతుడు రథముమీద కూర్చున్నా రామపాదుకలను శిరముమీదనుండి తీసి కింద పెట్టలేదు.

వారు అందరూ నందిగ్రామము చేరినారు. భరతుడు రథము దిగినాడు. అక్కడ సమావేశము అయిన మహాజనాన్ని చూచి, "ఓ మహాజనులారా! ఈ రాజ్యము మా అన్న రాముడు నాకు న్యాసముగా (ఇల్లడముగా) ఇచ్చినాడు. ఈ పాదుకలే ఈ రాజ్యము యోగక్షేమాలను చూచుకొంటూ ఉంటవి" అంటూ, రామప్రతినిధిభూతము అయిన ఆ పావకోళ్ళను తన శిరముమీదనే ఉంచుకొని, రాముడు అరణ్యవాసము చేస్తూ ఉన్నందున దుఃఖపడుతూ, "ఓ మహాజనులారా! ఈ పాదుకలకు ఇప్పుడు శ్వేతచ్ఛత్రము పట్టవలెను. ఇవే రాముడి పాదాలు. ఈ రెండూ ఆయన ప్రతినిధులు. ఈ పాదుకలనుంచే రాజ్యము సురక్షితముగా ఉంటుంది. నామీద స్నేహాతిశయమువల్ల మా అన్న రాముడు వీటిని నిక్షేపముగా నాకు ఇచ్చినాడు. అందువల్ల, ఆయన వచ్చేటంతవరకున్నూ ఈ పాదుకల కోసము నేను రాజ్యపాలనము నిర్వహిస్తాను. ఆయన వచ్చీ రావడముతో నేనే స్వయముగా వీటిని ఆయన పాదాలకు తొడిగి ఆయన పాదాలను పట్టుకొంటాను. రాజ్యభారము అంతా ఆయనకే ఒప్పగిస్తాను. అంతట ఆయనను మా తండ్రివలె చూచుకొంటూ, ఆయనకు సమస్తోపచారాలూ చేస్తూ ఉంటాను. నాకు వచ్చిన అపకీర్తిని ఈ విధముగా పోగొట్టుకొంటాను. రాముడు తిరిగివచ్చి, రాజ్యాభిషిక్తుడు అయి, జనులు అందరూ సంతోషిస్తే నేనూ సంతోషిస్తాను. అదే నాలుగు ఇంతలు కీర్తిగా భావిస్తాను" అని చెప్పినాడు.

అప్పుడు భరతుడు ఆ పాదుకలకు రాజ్యాభిషేకము చేయించినాడు. ఆ వీరుడు, ఆ ప్రభువు భరతుడు జటావల్కలాలతో మహామునివలె ఆ నందిగ్రామములో ఉంటూ, రాముడిని తలంచుకొంటూ రాజ్యపాలనము చేయడము మొదలుపెట్టినాడు.

ఆ భ్రాతృవత్సలుడు రామాజ్ఞలను అనుసరించి ప్రవర్తిస్తూ, రాముడు ఎంతకాలానికి వచ్చేది లెక్కపెట్టుకొంటూ తన ప్రతిజ్ఞను నిర్వహించసాగినాడు.

ఆ కాంతిమంతుడు రామపాదుకా పరతంత్రుడు అయి, సమస్త రాజకార్యాలూ ఆ పాదుకలకు విన్నవిస్తూ, సామంతుల కానుకలు అన్నీ ఆ పాదుకలకు సమర్పిస్తూ, ఆ నందిగ్రామములో ఉండి రాజ్యతంత్రాన్ని నడుపసాగినాడు.

116

భరతుడు వెళ్ళిపోగానే రాముడు చిత్రకూట పర్వతమునుంచి వెంటనే దండకారణ్యానికి ప్రయాణము అయిపోలేదు. కొంతకాలము అక్కడనే ఉండ దలచినాడు. అయితే అక్కడ ఉంటూ ఉన్న ఋషులు అందరూ భయపడ్డట్టూ, వారు అందరూ అక్కడనుంచి మరి ఒకచోటికి పోదలచినట్టూ వారి ఇంగితాదులనుపట్టే రాముడు తెలుసుకొన్నాడు. ఆ ఋషులు కళ్ళతోనూ కనుబొమ్మలతోనూ తనను ఒకరికి ఒకరు చూపించుకొంటూ, ఏవో గుసగుసలు ఆడడము చూచినాడు. వారికి తనవల్లను ఏది అయినా అపరాధము జరిగిందేమో అనే సందేహమువచ్చి వారి కులపతిని చూచి నమస్కారము చేసి, "ఓ మహానుభావా! నేను ఎన్నడూ మీ ఋషులకు వికారము కలిగించేటట్టు ప్రవర్తించలేదు. ఇప్పుడు ఎందుకో ఋషులు అందరూ నన్ను వికృతముగా చూస్తూ ఉన్నారు. నా తమ్ముడు లక్ష్మణుడు ఏమరుపాటున ఏమి అయినా చేయకూడని పని చేసినాడా? మీ ఋషులు అందరికీ సేవచేసే నా భార్య సీత ఏమి అయినా అయోగ్యముగా ప్రవర్తించిందా" అని రాముడు అడిగినాడు.

వయోవృద్ధుడూ, తపోవృద్ధుడూ అయిన ఆ కులపతి వార్ధక్యమువల్ల వణకుతూ "సీత జనకరాజ సుత. మంగళస్వరూపిణి. మంగళానుష్ఠానపర. ఆమె ధర్మలోపము ఏమీ చేయదు, చేయలేదు. రామా! నీనుంచి ఈ తాపసులకు ఉపద్రవము వచ్చేటట్టుగా ఉంది. అందుకోసము అందరూ భయపడుతున్నారు. రాక్షసుల బాధలు తట్టుకొనలేము అనుకొంటున్నారు. అందువల్ల, నిన్ను చూచి గుసగుసలు ఆడుతూ ఉన్నారు. రావణాసురుడి తమ్ముడు ఖరుడు అనే రాక్షసుడు ఒకడు ఉన్నాడు. వాడు యుద్ధములో దిట్ట. వాడు అపజయము అనేది ఇదివరకు ఎన్నడూ ఎరుగడు. వాడు పరమక్రూరుడు. పాపిష్ఠివాడు. వాడికి మదము ఎక్కింది. నరమాంస భక్షకుడు అయినాడు. వాడు ఇదివరకు జనస్థానము చేరి అక్కడి ఋషులను అందరినీ బాధించి వెళ్ళకొట్టినాడు. ఇక్కడ నీవు ఉండడము వాడు ఓర్వలేకుండా ఉన్నాడు అనీ, వాడు ఇక్కడకు రాపోతున్నాడు అనీ తెలిసింది. అప్పుడప్పుడు వాడు కొంతమంది రాక్షసులను ఇక్కడికి పంపిస్తున్నాడు. వాండ్లు నానావిధ భీభత్స భయంకర క్రూర వికారాలతోనూ, వికృత నేత్రాలతోనూ వచ్చి ఇక్కడి ఋషులను భయపెట్టి పోతున్నారు.

"నాయనా! ఖరుడు ఏక్షణమో వచ్చి ఈ మున్యాశ్రమాలమీద పడతాడు అని అనుకొంటున్నారు. రాక్షసులు మున్యాశ్రమాలలో ముందుగా అపరిశుద్ధ

పదార్థాలూ అమంగళ పదార్థాలూ పడవేస్తారు. తాపసులను ఎపనీ చేసుకోనీరు వాండ్లలో కొందరు క్షుద్రబుద్ధులు ఆశ్రమాలలో దాగుకొని తాపసులు లోపలికి పోగానే హఠాత్తుగా వారి పయిన పడి వారిని చంపివేస్తారు. హోమము చేసుకొనేటప్పుడు వచ్చి స్రుక్కువాలను లాగి పారవేసి హోమకుండాలలో నీళ్లుపోసి, అగ్నిహోత్రాన్ని చల్లార్చి వేస్తారు సమిధలను ఎందుకూ పనికిరాకుండా చేస్తారు ఆ దుష్టులు అన్ని ఆశ్రమాలలోనూ చొరపడతారు అందువల్ల ఇక్కడినుంచి లేచి మరి ఒక ప్రదేశము పోవడము మంచిది అని అందరూ నన్ను తొందర చేస్తున్నారు మేము అందరమూ ఈ ప్రదేశము వదిలిపెట్టి ఇక్కడికి దూరముగా ఉన్న మా మునుపటి ప్రదేశానికి పోవలెను అనుకొంటున్నాము.

రామా మేము పోయేది ఒక పెద్ద వనము అక్కడ కందమూలఫలాలు సమృద్ధముగా దొరుకుతవి. నీకు ఇష్టము అయితే నీవుకూడా మాతో రావలసింది. ఇక్కడ ఖరుడు నిన్ను వదిలిపెట్టడు బాధపెట్టుతాడు. నీవు ఎంత యుద్ధసమర్థుడవు అయినప్పటికిన్నీ ఇక్కడ భార్యతో ఉంటున్నావు అందువల్ల, ఎప్పుడూ ఎందుకో ఒకందుకు నీవు భయపడుతూ ఉండవలసి వస్తుంది నీవు ఇక ఇక్కడ ఉండడము మంచిదికాదు' అని చెప్పినాడు

అంతమాత్రానికే భయపడవద్దు అనీ అక్కడినుంచి పోవద్దు అనీ రాముడు ఎంతచెప్పినా ఆ వృద్ధు వినలేదు వారి ప్రయాణము రాముడు ఆపివేయలేకపోయాడు ఆ కులపతి రామున్ని అభినందించి, మంత్రోపదేశము చేసి ఋషి సమూహముతో ప్రయాణము అయినాడు రాముడున్నూ వారిని సాగనంపడానికి కొంతదూరము పోయి వారికి అందరికీ నమస్కారము చేసి పరమపవిత్రము అయిన పర్ణకుటికి వచ్చినాడు

రాముడున్నూ వారితో పాటు అక్కడనుంచి వెళ్ళిపోయి ఉండవలసింది అయితే ఆ చిత్రకూట పర్వతాన్నీ ఆ రమ్యమందాకినీ నదినీ అంతతొందరగా వదిలిపెట్టలేక పోయినాడు

117

సీతారామలక్ష్మణులు అత్రి అనసూయలను దర్శించుట

చిత్రకూట పర్వతముమీదినుంచి ఋషులు అందరూ వెళ్ళిపోయిన తరువాత రాముడికి అక్కడ ఉండడము అనేక కారణాలనుంచి ఇష్టము లేకపోయింది భరతుడూ, తల్లులూ, వశిష్ఠాదిమహర్షులూ, పౌరులూ మొదలయినవారు అందరూ వచ్చి అతనిని ఆ చిత్రకూట పర్వతము మీదనే చూచినారు అందువల్ల అతనికి వారు ఎప్పుడూ

జ్ఞాపకము రావడము మొదలు పెట్టినారు వారిని తలచుకొన్నకొద్దీ అతనికి దిగులు వేయడము ఎక్కువ అయింది అక్కడనే ఉండేటట్లయితే ఆ దిగులు మరింత అవుతుంది అని అతనికి తోచింది. పయిగా భరతుడి సైన్యము అంతా అక్కడనే దిగింది ఎనుగులూ గుర్రాలూ ఎద్దులూ మొదలు అయిన జంతువులు అన్నీ లద్దెలు వేసి పోయినందువల్ల ఆ ప్రదేశము అంతా పాడు అయిపోయింది ఆ యా కారణాలవల్ల అక్కడ ఉండడము మంచిదికాదు అని నిశ్చయించుకొన్నాడు సీతాలక్ష్మణులను వెంటబెట్టుకొని అక్కడనుంచి బయలుదేరి అత్రిమహాముని ఆశ్రమానికి పోయినాడు.

సీతారామలక్ష్మణులు ఆ మహనీయుడు అత్రిమహర్షికి నమస్కారము చేసినారు ఆ మహాత్ముడు రామున్ని కొడుకును మాదిరిగా ఆదరించినాడు సీతాలక్ష్మణులను సంతోషముగా పలుకరించి సమ్మానించినాడు వారికి స్వయముగా అతిధిసత్కారాలు చేసినాడు అంతట ఆ ధర్మాత్ముడు వృద్ధురాలూ పూజ్యురాలూ అయిన తన భార్య దగ్గరకు సీతారామలక్ష్మణులను వెంటబెట్టుకొని పోయి సీతతో ఓ సీతా! ఈమె నా ఇల్లాలు, అనసూయాదేవి మహాభాగ ధర్మచారిణి, తపస్విని" అని చెప్పి రామున్ని చూచి నాయనా రామా పూర్వము ఒకప్పుడు పది సంవత్సరాలు వానలు కురవకుండా పోయినవి. మహోక్షామము వచ్చింది. లోకాలు అన్నీ దగ్ధము అయిపోవడము మొదలు పెట్టినవి అప్పుడు ఈమె ఈ అనసూయాదేవి నా ఇల్లాలు ఋషులకు అందరికీ ఫలమూలాలు సృష్టించి పెట్టింది అంతేకాదు తన ప్రభావముతో గంగాజలాలు సమృద్ధముగా ప్రవహించేటట్టు చేసింది ఈమె మహాప్రభావము కలది ఎన్నో సంవత్సరాలు అత్యుగ్రము అయిన తపస్సు చేసింది వ్రతస్నాత అయింది మహర్షుల తపోవిఘ్నాలను వారించింది ఒకప్పుడు దేవకార్యము కోసము ఈమె పది రాత్రులను ఎకరాత్రముగా చేసివేసింది ఈమె చేసిన పనులవల్ల అనసూయాదేవి అనే పేరు వచ్చింది జగత్ప్రసిద్ధురాలు అయింది రామా ఈమె నీకు తల్లివంటిది సీతా ఈ మహాయశస్విని కోపము అనేది ఎరుగదు. నీవు ఈమెను పూజించు నీకు మంచి అవుతుంది అని చెప్పినాడు

అంతట రాముడు సీతను చూచి, ఓ రాజపుత్రీ అత్రిమహర్షి చెప్పింది అంతా విన్నావా? నీ శ్రేయస్సు కోసమే నీవు ఈమెకు సేవ చేయవలెను సుమా అన్నాడు

అనసూయాదేవి దేహము అంతా ముడతలు పడిపోయినవి అవయవాలు అన్నీ సడలిపోయినవి తలవెంట్రుకలు అన్నీ తెల్లగా నెరసిపోయినవి గాలికి అరటిచెట్టువలె వణుకుతూ ఉంది ఆ మహానుభావురాలికి ఆ మహాపతివ్రతకు

సీతారామలక్ష్మణులు ప్రదక్షిణముచేసి, పేరు చెప్పుకొని నమస్కారము చేసినారు సీతాదేవి చేతులు జోడించి ఆమె ఆరోగ్యాన్ని గురించి అడిగింది అనసూయాదేవి సంతోషించి ఓ సీతా నీవు ధర్మపథము పట్టినావు అది నీ భాగ్యము ఐశ్వర్యాన్నీ అహంకారాన్నీ బంధుజనాన్నీ వదులుకొని అడవులకు తరిమివేసిన భర్తవెంట పడి వచ్చినావు నాకు ఎంతో సంతోషముగా ఉంది. పెనిమిటి పట్టణములో ఉన్నా అడవిలో ఉన్నా పరమధార్మికుడు అయినా పాపిష్టివాడు అయినా ఎప్పుడూ వెంట ఉంటూ పెనిమిటిని సంతోషపెట్టే భార్యకే ఇహమూ, పరమూనూ! దుశ్శీలుడు అయినా విచ్చలవిడిగా తిరిగేవాడు అయినా పెనిమిటే పూజ్యురాండ్రు అయిన ఆడవాండ్లకు పరమదైవము ఈ విషయము నేను ఎంతో ఆలోచించి చూచినాను. మహాతపస్సువలె సర్వకాల సర్వావస్థలలోను స్త్రీని కాపాడే బంధువు పెనిమిటికన్నా మరి ఒకడు ఎవడూ నాకు ఎక్కడనూ కనిపించలేదు. మన్మధాధీనులు అయి, కమ్మని మగవాండ్లను యాచిస్తూ తిరిగే ఆడవాండ్లు ఈ ధర్మసూక్ష్మము తెలుసుకోలేరు. అటువంటి ఆడవాండ్లు అకార్యాధీనులు అయి ఈ లోకములో అపకీర్తిపాలు అవుతారు. ధర్మభ్రష్టులు అయి పరలోకములో నరక బాధలు అనుభవిస్తారు మంచీ చెడూ తెలిసిన నీవంటి గుణవంతులు ధర్మపరాయణులు అయి, ఇహపరసౌఖ్యాలు రెండూ అనుభవిస్తారు. అందువల్ల నీవు ఇప్పటిమాదిరిగానే ఎప్పుడూ నీ పెనిమిటి వెంట ఉంటూ, పతివ్రతల ఆచారాన్ని పాటిస్తూ, సహధర్మచారిణిగా సంచరిస్తూ ఉండు. నీకు యశస్సు వస్తుంది సమస్త ధర్మాలూ నీకు సమకూడుతవి అని చెప్పింది

118

అనసూయాదేవి చెప్పింది అంతా సీతాదేవి సావధానముగా విన్నది. ఆమెను గౌరవించి ఓ పూజ్యురాలా నీవు చెప్పింది అంతా యథార్థము. స్త్రీకి పెనిమిటే దైవము అని నా నమ్మకమూనూ. ఒకవేళ పెనిమిటి సదాచారహీనుడు అయినప్పటికిన్నీ భార్య అతనికి సేవచేయవలసిందే ఇక నా పెనిమిటో! గుణశ్లాఘ్యుడు దయామయుడు జితేంద్రియుడు పరమధార్మికుడు నామీద బద్ధానురాగముతో ఉంటున్నాడు తండ్రివలె నాకు ఎప్పుడూ మేలు చేస్తూ ఉంటాడు తల్లివలె ఎప్పుడూ నన్ను సంతోష పెట్టుతూ ఉంటాడు ఆయన నా ప్రియుడు ఆయనను గురించి ఇంకా ఏమి చెప్పేది? ఆయన మహాబలవంతుడు తన సొంత తల్లి కౌసల్యాదేవిని ఎట్లా చూస్తాడో, తన తండ్రి దశరథమహారాజు భార్యలను అందరినీ అట్లాగే చూస్తాడు అంతేకాదు ఆయన పితృవత్సలుడు ధర్మజ్ఞుడు దశరథమహారాజు సక్కత్తుగా చూచిన స్త్రీని అయినా తన తల్లివలె గౌరవిస్తాడు నేను నా పెనిమిటి వెంట

నిర్జనారణ్యానికి బయలుదేరినప్పుడు మా అత్తగారు కౌసల్యాదేవి నాకు పాతివ్రత్యాన్ని గురించి చెప్పింది. ఆమె చేసిన మహోపదేశము నా మనస్సులో నాటుకొనిపోయింది అగ్నిహోత్ర సన్నిధిలో నా పాణిప్రదానకాల మప్పుడు మా నాయనగారు జనకమహారాజు నాకు చేసిన ఉపదేశము నేను మరచిపోలేను ఆ ఉపదేశము నా హృదయములో దృఢముగా పాదుకొని పోయింది

ఓ ధర్మచారిణీ మీరు ఇప్పుడు చెప్పిన మాటలనుంచి నాకు పెద్దలు చేసిన ఉపదేశాలు నవనవముగా తోస్తూ ఉన్నవి స్త్రీకి పతిసేవకన్నా మరి ఒక తపస్సు లేదు అనుకొంటున్నాను మీరున్నూ పతిసేవనుంచే ఇహపరాలు రెండూ కరతలామలకము చేసుకొన్నారు సావిత్రీదేవి పతిసేవచేసి పూజ్యురాలు అయింది స్త్రీలు అందరిలో ఉత్తమోత్తములాలు అయిన రోహిణీదేవి ఆకాశములో చంద్రుణ్ణి ఒక ముహూర్తపుసేపు అయినా వదిలిపెట్టి ఉండడము లేదు అనేకమంది ఉత్తమాంగనలు భర్తృదృఢవ్రతలు అయి తమ పుణ్యబలాన దేవలోకములో పూజ్యురాండ్లు అయినారు అని సీతాదేవి చెప్పింది

ఈ మాటలకు అనసూయాదేవి సంతోషించింది సీతాదేవిని దగ్గరకు తీసుకొని గగుర్పాటు పుట్టేటట్టు శిరము ఆఘ్రాణించి 'ఓ శుచిస్మితా నేను నానావిధ నియమాలతో తపస్సు చేసినాను తపోబలము సంపాదించినాను నీకు ఎమి కావలెనో కోరుకో నేను ఇస్తాను ఓ మైథిలీ నీవు మనోహరముగా మాట్లాడినావు నాకు చాలా సంతోషముగా ఉంది. నీకు నేను ఎమి చేసిపెట్టవలెనో చెప్పు చేసి పెట్టుతాను ' అన్నది

సీతాదేవికి విస్మయము వేసింది చిరునవ్వు నవ్వుతూ ఓ పూజ్యురాలా నాకు ఎ కొరతా ఉన్నట్టు తోచడము లేదు నాకు ఎమి కావలెనో నాకు తెలియదు అన్నది సీతాదేవి.

ఈ మాటలకు అనసూయాదేవి ఇంకా సంతోషపడ్డది ఓ సీతా నా సంతోషాన్ని సఫలము చేస్తాను నీకు ఒక దివ్యపుష్పమాలికను ఇస్తాను ఒక చీరా కొన్ని ఆభరణాలూ, అంగరాగము అనులేపనమూ ఇస్తాను నేను ఇచ్చే పూలమాలిక నీ దేహానికి ఇంకా ఎక్కువ శోభను ఇస్తుంది దివ్యతేజస్సును ఇస్తుంది అది ఎప్పుడూ వాడిపోదు. సుగంధము పోదు నేను ఇచ్చే అంగరాగము అనులేపనము నీవు దేహానికి పూసుకొనవలెను అవ్యయుడు అయిన విష్ణుమూర్తిని లక్ష్మీదేవివలె నీ పెనిమిటిని నీవు సంతోషపెట్ట కలుగుతావు ' అంటూ, అనసూయాదేవి ఎంతో సంతోషముతో సీతాదేవికి సొమ్ములూ అంగరాగమూ అనులేపనమూ పూలమాలికా ఇచ్చింది.

సీతాదేవి అన్నీ తీసుకొని ఆ తపోధనకు నమస్కారము చేసి సేవాపరత్వముతో ఆమె ఎట్టఎదట కూర్చున్నది అప్పుడు ఆ దృఢవ్రత అనసూయాదేవి ఓసీతా! స్వయంవరములో రాముడికి నీవు సంప్రాప్తము అయినావు అని విన్నాను. అది అంతా సవిస్తరముగా నీవు చెప్పితే వినవలెను అనుకొంటున్నాను. జరిగింది జరిగినట్లు చెప్పు నీ కథను నీవే చెప్పవలెను' అని అడిగింది.

"ఓ ధర్మచారిణీ నేనే చెప్పుతాను మీరు వినవలెను మిథిలాధిపతి జనకమహారాజు క్షత్రధర్మముతో రాజ్యము ఏలుతూ ఉన్నాడు ఆయన యజ్ఞము తలపెట్టినాడు యాగోపయుక్తము అయిన మండలాకార క్షేత్రాన్ని నాగళ్ళతో దున్నిస్తూ ఆయన తన పిడికిళ్ళతో ఓషధులు చల్లుతూ ఉండగా నేను భూమిని చేదించుకొని పుట్టినాను. ఒండ్లు అంతా దుమ్ముకొట్టుకొని ఉన్న నన్ను చూచి ఆయన విస్మితుడు అయినాడు. అప్పటికి ఆయనకు సంతానము లేదు వాత్సల్యముతో నన్ను తన తొడమీద కూర్చుండబెట్టుకొని ఇది నా కూతురు' అన్నాడు ఆయన

'ఓ జనకమహారాజా ఈ శిశువు నీ కూతురు అనడము ధర్మయుక్తముగా ఉంది" అని అంతరిక్షమునుంచి అసదృశము అయిన వాక్కు వినిపించింది అంతట జనకమహారాజు సంతోషముతో నన్ను తన ఇంటికి తీసుకొనిపోయినాడు తన పెద్ద పెండ్లానికి నన్ను ఒప్పగించినాడు. ఆమె నన్ను కన్నతల్లి మాదిరిగా పెంచింది నాకు వివాహయోగ్యము అయిన వయస్సు వచ్చింది అప్పుడు నా తండ్రి జనకమహారాజు నన్ను చూచి దిగులు పడ్డాడు. ధననాశనము అయిపోయిన దరిద్రుడివలె చింతించడము మొదలుపెట్టినాడు. ఆడపిల్ల తండ్రి దేవేంద్రుడి అంతటివాడు అయినప్పటికీ (ఏ కొంచెము లోపము ఎవరిలో వచ్చినా) ఈ లోకములో సరివారిలోనూ తనవారిలోనూ తనకన్నా తక్కువవారిలోనూ అవమానపడక తప్పదు అందువల్ల, ఆయన చింతాసముద్రములో పడి గట్టు చేరడానికి తెప్పకొయ్య దొరకనివాడికిమల్లే మునుగుతూ ఉండిపోయాడు

"నేను అయోనిజను. ఎంత ఆలోచించినా నాకు తగిన పెనిమిటి ఆయనకు తోచలేదు ఆలోచించగా ఆలోచించగా ఒకవిధముగా వరుణ్ణి సంపాదించి నాకు పెండ్లి చేయవచ్చును అని ఆయనకు తట్టింది.

"పూర్వము మహాయజ్ఞములో దేవతలు అందరూ సంతుష్టులు అయి వరుణదేవుడిచేత మా తండ్రి జనకమహారాజుకు ఒక పెద్ద ధనుస్సునూ అక్షయసాయకాలనూ, అంబులపొదులనూ ఇప్పించినారు ఆ ధనుస్సు చాలా

పెద్దది ఎంతో బరువు అయింది మనుష్యమాత్రులు ఎవరూ ఎంతప్రయత్నము చేసినా దానిని కదిలించ నలవికాదు. కలలో అయినా దానిని ఎవరూ వంచలేరు నా తండ్రి రారాజులను అందరినీ ఆహ్వానించి ఆ ధనుస్సు చూపించి ఎవరు ఆ ధనుస్సును ఎత్తి అల్లెత్రాటిని ఎక్కించి బాణాన్ని ఎక్కుపెట్ట గలిగితే వారికి నన్ను యిచ్చి పెండ్లి చేస్తాను అని చెప్పినాడు అంతట రాజకుమారులు అందరూ వచ్చి కొండ అంతటి ఆ ధనుస్సును చూచినారు దానిని కదిలించడము అయినా వారి చేత కాకపోయింది వారు ఆ ధనుస్సుకు ఒక్క నమస్కారము పెట్టి వెళ్ళిపోయినారు

'ఆ తరువాత బహుకాలానికి విశ్వామిత్రమహర్షి మా నాయనగారు చేస్తున్న యజ్ఞము చూడడానికి వచ్చినాడు ఆయన వెంట రామలక్ష్మణులున్నూ వచ్చినారు మా నాయనగారు విశ్వామిత్రమహర్షిని పూజించినారు ఆ ధర్మాత్ముడు తన వెంట వచ్చిన రామలక్ష్మణులు దశరథమహారాజు పుత్రులు అనీ, మా ఇంటఉన్న ధనుస్సు చూడవచ్చినారు అనీ, దానిని వారికి చూపించవలసింది అనీ మా నాయనగారితో చెప్పినాడు అప్పుడు మా నాయనగారు ఆ ధనుస్సును తెప్పించి ఆ అన్నతమ్ములకు చూపించినారు

అంత ధనుస్సునూ నా ప్రభువు ఇట్టే ఎత్తి, రెప్పపాటుకాలములో బాణము యెక్కించి అల్లెత్రాటిని లాగినాడు ఆ వేగానికి ఆ ధనుస్సు నడుమకి రెండుగా విరిగిపోయింది పిడుగు పడ్డట్టుగా మహాభయంకరము అయిన ధ్వని అయింది

'నా తండ్రి జనకమహారాజు సత్యసంధుడు నన్ను రామప్రభువుకు ఇచ్చి వివాహముచేయ నిశ్చయించి జలకలశము ఎత్తినాడు అప్పుడు రామప్రభువు తన తండ్రి దశరథమహారాజు అభిప్రాయము తెలుసుకోకుండా నన్ను చేపట్టను అన్నాడు అంతట మా నాయనగారు మా మామగారిని పిలిపించినారు దశరథమహారాజు వచ్చి నన్ను చూచి తన కొమారుడికి నన్ను చేసుకోవడానికి అంగీకరించినారు. అప్పుడు మా తండ్రి జనకమహారాజు నన్ను రామప్రభువుకూ చూడచక్కని నా చెల్లెలు ఊర్మిళను లక్ష్మణుడికీ ఇచ్చి వివాహము చేసినాడు ఈ విధముగా నా ప్రభువు నన్ను చేపట్టినాడు నేను ధర్మము చొప్పున ఆయనమీద అనురాగముతో ఎప్పుడూ ఆయన వెంట ఉంటున్నాను' అని చెప్పింది సీతాదేవి.

119

ఆ ధర్మజ్ఞురాలు అనసూయాదేవి ఆ గొప్ప కథను అంతా విని, సంతోషముతో సీతాదేవిని రెండుచేతులా కౌగిలించుకొని శిరము ఆఘ్రాణించి, "స్పష్టముగా మనోహరముగా చెప్పినావు నీ స్వయంవరకథ చిత్రముగా ఉంది. ఓ మధురభాషిణీ

నీ కథ వింటూ వుంటే నాకు సంతోషము వేసింది మహాకాంతిమంతుడు అయిన సూర్యుడు ఇప్పుడు యామినీదేవిని కలుసుకోవడానికి అంతర్ధానము అవుతున్నాడు ఆహారము కోసము పగలంతా తిరిగి చీకటిపడగానే నిద్రపోవడానికి చెట్లమీదికి చేరుతూ వున్న పక్షుల కలకలధ్వనులు వినపడుతూ ఉన్నవి అరుగో మునులు. సాయంకాలిక స్నానముచేసి, జలకలశాలు పట్టుకొని తడిసిపోయిన వల్కలాలతో గుంపులు గుంపులుగా వస్తూ ఉన్నారు. మహర్షులు యథావిధిగా వ్రేల్చిన అగ్నిహోత్రాలలో నుంచి పొగ పావురాయి మెడవలె అరుణ కాంతులతో గాలికి పైకి లేచింది చీకట్లు కమ్ముకుంటూ ఉన్నందువల్ల కాసిని కాసిని ఆకులు ఉన్న చెట్లుకూడా దట్టముగా ఆకులు ఉన్న చెట్ల వలె కనిపిస్తున్నవి చెట్లు లేని ప్రదేశములో కూడా దిక్కులు తెలియకుండా పోతున్నవి. నక్తంచర సత్వాలు అంతటా తిరుగుతూ ఉన్నవి తపోవనాలలో మృగాలు అన్నీ వేదిస్థానాలలో పడుకొంటున్నవి.

సీతా నక్షత్రాలతో అలంకరించుకొని రాత్రి వస్తున్నది ఆకాశములో వెన్నెల ఆవరణముగా చంద్రుడు కన్నులపండుగగా కనపడుతున్నాడు - నీవు నీ కథ మనోహరముగా చెప్పుతూ ఉంటే నాకు సంతోషము వేసింది నీవు ఇక పోయి రాముడితో కూడా ఉండు. నేను అనుజ్ఞ ఇస్తున్నాను

ఓ మైథిలీ నీవు నా ఎదుటనే అలంకారము చేసుకో. నీ దివ్యాలంకార శోభను నేను కన్నులారా చూచి సంతోషిస్తాను' అన్నది అనసూయాదేవి

దేవకన్యవంటి సీతాదేవి చక్కగా అలంకరించుకొని అనసూయాదేవికి నమస్కారము చేసి రాముడి దగ్గరికి పోయింది

రాముడు సీతాదేవిని చూచినాడు. ఆ అలంకారాలు అన్నీ అనసూయాదేవి ఆమెను మెచ్చుకొని ఇచ్చినవి అనుకొన్నాడు. ఆమెను తేరిపార చూచినాడు ఆ వసనాభరణప్రజాలను అనసూయాదేవి తనకు దానము చేసింది అని ఆమె చెప్పింది అనసూయాదేవిని సంతోషపెట్టి సీతాదేవి మానవ దుర్లభము అయిన ఆ వస్తువులను తెచ్చుకొన్నందులకు రామలక్ష్మణులు ఉప్పొంగిపోయినారు.

అక్కడి తపస్సిద్ధులు అందరూ సీతారామలక్ష్మణులను పూజించినారు వారు పుణ్యరాత్రి అక్కడ గడిపినారు.

ప్రాతఃకాల స్నానము అయి ఋషులు అందరూ హోమాదులు నిర్వర్తించుకొన్న తరువాత, సీతారామలక్ష్మణులు ప్రయాణము అయినారు ఆ ధర్మానుష్ఠానపరులకు వీడ్కోలు చెప్పినారు. దండకారణ్యములో నరమాంస భక్షణము చేసే రాక్షసులు ఉన్నారనీ, ఘాతక మృగాలు అపారముగా ఉన్నవనీ, అక్కడి ఋషులు

ఎమాత్రము ఎమరుపాటుతో ఉన్నా ఉచ్ఛిష్టలు అయినా రాక్షసులకు ఆహుతి అయిపోతూ ఉంటారు అనీ ఆ రాక్షసులను అందరినీ సంహారము చేయవలసింది అనీ చెప్పి 'ఓ రామా ఇదిగో ఇదే, మహర్షులు దండకారణ్యము పోయి పండ్లు తెచ్చుకొనే దారి. ఈ దారినే మీరు పోవలెను అని దారి చూపించినారు

సీతారామలక్ష్మణులు ఆ మహర్షులకు అందరికీ నమస్కారము చేసినారు వారు సంతోషముతో వారిని ఆశీర్వదించినారు

అంతట రాముడు సీతాలక్ష్మణులను వెంటపెట్టుకొని మేఘమండలములోకి పోయే సూర్యుడివలె దండకారణ్యానికి నడిచినాడు

అయోధ్యకాండ సమాప్తము

94675

ఇతర ప్రచురణలు :

మహాభారతం
శ్రీ పిలకా గణపతి శాస్త్రి

శ్రీమద్భాగవతం
శ్రీ యామిజాల పద్మనాభస్వామి

జ్ఞానేశ్వరి భగవద్గీత
శ్రీ చిగురుపల్లి శేషగిరిరావు

శ్రీ త్యాగరాజ కీర్తనలు, ముత్తుస్వామి కీర్తనలు,
శ్యామశాస్త్రి కీర్తనలు, సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు

TRIVENI PUBLISHING HOUSE, Machilipatnam - 521 001